వేదాంత సంగ్రహం




VEDANTA SANGRAHAM

భారతీ నిరుక్తి

(వేద స్వరూప దర్శనము)





రచన

హరి సోదరులు


నిరుక్తభారతి గ్రంథమాల 1.
సాధన గ్రంథమండలి. 122

భారతీ నిరుక్తి

(వేదస్వరూప దర్శనము)

రచయితలు :

హరి సోదరులు.



ప్రకాశకులు :

సాధన గ్రంథమండలి, తెనాలి.

ప్రథమ ముద్రణము :
విరోధికృత్ శ్రావణ పూర్ణిమ,
శుక్రవారము, 6 ఆగష్టు 1971.

రచయితలు :

హరి సోదరులు

సంస్కృత వాఙ్మయ పరిశోధనాలయము

శోధన్ గృహము
బందరురోడ్డు
విజయవాడ-2

శోధన్ గృహము
కొత్తపేట
తెనాలి.

మూల్యము : రు 15-00

ఏ. ఎస్. ఆర్. పవర్ ప్రెస్, తెనాలి.

విషయ సూచిక :

ఆమ్నాయః శ్రుతిః

స్వాధ్యాయః

స్వాహా

స్వధా

వషట్

త్రయీ

కవిః - కావ్యమ్

భారతీ

ఛందః

— o —

శ్రీః

పీఠిక

వాచః చిదుద్గతాః ప్రాచః చిత్పరాః సుమహత్తరాః ।
తన్మాతరం చ ధీశుద్ధ్యై కలయేఽనన్యయా ధియా ॥

వేదము మానవాళికి మహోపకారక మగు అక్షయ్యనిధానము: సర్వార్థావభాసకము; సర్వార్థసాధకము; సర్వానర్థనివారకము; అనాదినిధనము; అపౌరుషేయము; స్వతః ప్రమాణము; విశిష్టానుపూర్వీవిలసితమై పరమపావనమైన శబ్దరాశి; చిత్స్వరూపు (జ్ఞప్తిమాత్రస్వరూపు) డగు పరమాత్మయొక్క ప్రథమావతారము; కాన తత్ప్రమానకక్షమై సర్వజ్ఞకల్పము, పరమాత్మనుండి యభివ్యక్తమై తత్తత్త్వమును ప్రతిపాదించెడి దివ్యశబ్దరాశి, సృష్టికార్య నిర్వహణమున జగత్స్రష్టకు సహకారిణి యా వేదభారతియే. అట్టి వేదభారతి యొక్క స్వరూప స్వభావాది వివరణమే యీ భారతీ నిరుక్తి.

శివ శక్తి విష్ణ్వాది - ఈశ్వరకోటిచే విరచితము లయిన బహుముఖాగమ గ్రంథజాతము, మను పరాశరాది మహర్షిప్రణీతములయిన స్మృతులు, వ్యాస వాల్మీకాది ముని విరచిత పురాణేతిహాసాదిగ్రంథములు, తుదకు కాళిదాస భవభూతి ప్రముఖ మహాకవికృత కావ్యనాటకాదులు - ఇట్లు భారతీయవాఙ్మయ మంతయు వేదప్రామాణ్య ప్రాశస్త్యముల నుద్ఘోషించుచు తదర్థోపబృంహణార్థ మయియే ప్రవర్తించినది.

వేదము నిత్యము

వేదమునకు కర్త లేదను విషయమును స్మృతికారులు ఘంటాపథముగ చెప్పినారు (పే. 2).

"న కశ్చి ద్వేదకర్తా చ వేదం శ్రుత్వా చతుర్ముఖః ।
తథైవ ధర్మాన్ స్మరతి మనుః కల్పాంతరేఽన్తరే॥ - (పరా. స్మృ.)

" .... వేదకర్తృత్వ మాశంక్య నిరాచష్టే - న కశ్చి దితి। న తావత్ 'వేదవ్యాసో వేదకర్తా, విభాగమాత్రకారిత్వాత్, నాపి చతుర్ముఖః, ఈశ్వరేణ చతుర్ము

ఖాయ వేదప్రదానాత్; నాపి జగదీశ్వరః, తస్య వేదాభివ్యంజకత్వాత్। తదుక్తం మత్స్యపురాణే —'అస్య ధర్మస్య సర్వజ్ఞః కల్పాదౌ పరమేశ్వరః। వ్యంజకః కేవలం విప్రా నైవ కర్తా న సంశయః॥ బ్రహ్మాణం మునయః పూర్వం సృష్ట్వా తస్మై మహేశ్వరః। దత్తవా నఖిలాన్ వేదాన్ విప్రా ఆత్మని సంస్థితాన్॥ బ్రహ్మణా చోదితో విష్ణుః వ్యాసరూపీ ద్విజోత్తమాః। హితాయ సర్వభూతానాం వేదభేదాన్ కరోతి సః॥' - ఇతి। ఇతరేషాం తత్కర్తృత్వం దూరాపాస్తమ్" — పరాశర మాధవీయమ్.

వేదమునకు గర్త లేడు. వేదవ్యాసుడు వేదవిభాగకర్తయే కాని వేదకర్త కాడు. ఈశ్వరునుండియే వేదముల గ్రహించువాడగుటచే చతుర్ముఖుడును వేదకర్త కాడు. ఈశ్వరుడును వేదాభివ్యంజకుడే కాని వేదకర్త కాడు. మత్స్యపురాణము నీ విషయమునే స్పష్టము చేయుచున్నది. ఈశ్వరాదులే వేదమునకు గర్తలు గాజాలనిచో నిక అల్పజ్ఞులగు మానవులు కర్తలు కాజాలరని వేఱుగ జెప్ప నక్కఱ లేదు - అని యర్థము.

వేదమునకు కర్త గలదా ? లేదా ? యను విషయమై పక్ష ప్రతిపక్షవాదముల విమర్శించి తుదకు లేదని పూర్వమీమాంసాశాస్త్రమునను నిర్ధారింపబడినది. కాఠకం, కాలాపం, కౌథుమం, తైత్తిరీయం-అనియెడి వేదశాఖలకు గల సమాఖ్యల బురస్కరించుకొని యా వేదశాఖ లా యా మునులచే రచింపబడి యుండు ననెడి వాదము ప్రత్యాఖ్యాతము గావింపబడినది. 'వ్యాసేన ప్రోక్తం వైయాసికం మహాభారతమ్' — అనునట్లుగా - 'కఠేన ప్రోక్తం కాఠకమ్' ఇత్యాది నిర్వచనముల జెప్పినను మహాభారతవిషయమున కర్తృప్రసిద్ధి యుండుటచే వ్యాసప్రోక్త మనగా వ్యాసరచిత మనియే యర్థము. వేదశాఖావిషయమై కర్తృప్రసిద్ధి యెచటను గానరానందున కఠప్రోక్త మనగా కఠమునిరచిత మని చెప్ప వలనుపడదు. కఠాదులు అధ్యయనాధ్యాపనాది సంప్రదాయముల ద్వారా తత్తచ్ఛాఖాప్రవర్తకు లగుటచే నాయా వేదశాఖలకు కాఠకాది సమాఖ్య లుపపన్నము లగును. మహాభారతాదుల వలె వేదముగూడ వాక్యరూపమే యగుటచేసి పౌరుషేయము ('వేదః పౌరుషేయః, వాక్యత్వాత్, మహాభారతాదివత్') — అనియెడి యనుమాన ప్రకారమును సరియైనది కాదు. అచటి హేతువు వ్యాప్యత్వాసిద్ధరూప మగు అసద్ధేతువు. అచట జన్యజ్ఞానమూలకత్వ

ముపాధి యగుటచే నాహేతువు సోపాధికము. కాన వాక్యత్వరూప హేతువుచే వేదవాక్యము పౌరుషేయమే యని నిరూపింప శక్యము కాదు. ఈ యంశము వేదాం శ్చైకే సన్నికర్షం పురుషాఖ్యాః .... కృతే చావినియోగః స్యాత్ కర్మణః సంబంధాత్ (జై. సూ. 1-1-27 నుండి 32) అను సూత్రములలో విచారించి నిర్ణయింపబడినది. ఈశ్వరస్యైవ గతకల్పీయ వేదప్రవచన కర్తృత్వోపపత్తేః వేదానాం నిత్యత్వ మితి భావః'—అని యనుచు భాట్టదీపికావ్యాఖ్య (భాట్టచింతామణి) యందు శ్రీ వాంఛేశ్వర యజ్వయు వేదనిత్యత్వమును సోపపత్తికముగ నిరూపించి నాడు. 'శివాద్యా ఋషిపర్యన్తాః స్మర్తారోఽస్య న కారకాః'—ఇత్యాది వచనములు నిందుకు ప్రమాణము.

ఉత్తర మీమాంసాశాస్త్రమునందు నీ విషయము విపులముగ చర్చించి వివరింప బడినది. 'అతః ప్రభవాత్; అత ఏవ చ నిత్యత్వమ్'—అనెడి వేదనిత్యత్వాపౌరుషేయత్వముల నిరూపించెడి దేవతాధికరణము నందలి బ్రహ్మసూత్రముల వ్యాఖ్యానించుచు శ్రీ శంకరభగవత్పాదు లిట్లు వివరించిరి—

"అతఏవ నియతాకృతే ర్దేవాదే ర్జగతః వేదశబ్దప్రభవత్వాత్ వేదశబ్దనిత్యత్వమపి ప్రత్యేతవ్యమ్। తథాచ మంత్రవర్ణః - 'యజ్ఞేన వాచః పదవీయ మాయన్ తా మన్వవిందన్ ఋషిషు ప్రవిష్టామ్'— ఇతి స్థితా మేవ వాచ మనువిన్నాం దర్శయతి" — శం. భా.

పరమేశ్వరుని వలెనే వేదము గూడ నియతాకృతితో నొప్పు అగ్ని వాయు సూర్య చంద్రేంద్రాది సర్వజగతునకు హేతు వని నిరూపింపబడినది గాన వేదము నిత్యము. యజ్ఞేన వాచః - అనెడి మంత్రవర్ణము నీ విషయమును స్పష్టము జేయుచున్నది. యజ్ఞాది సత్కర్మ నిర్వాహకు లగు మహర్షులు యజ్ఞాది తపోఽనుష్ఠాన జన్య పూర్వజన్మ సుకృత పరిపాకమున ప్రలయకాలముననను నశింపకయే నిలిచియున్న వేదవాక్కును బొందగలుగు యోగ్యతను సంపాదించుకొనినవారై యా వేదమును పొందగల్గిరి. ఋషుల ప్రవేశించిన యా వాక్కే లోకమున వ్యాప్తమై యజ్ఞాది కర్మ ప్రవర్తక మైనది — అని యర్థము (పే. 63). 'యుగాంతేఽన్తర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః। లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతాః స్వయంభువా'- ఇత్యాది స్మృతి వచనములును పై శ్రుత్యర్థమునే యనువదించుచున్న వనియు

శ్రీశంకర భగవత్పాదులు వివరించిరి. కాన వేదము నిత్యము, అపౌరుషేయము, పురుష గత దోషదూషితము కాదు, కాన ప్రమాణము — అని నిర్ధారింపబడినది.

వేదము సర్వార్థావభాసకము (సర్వజ్ఞానాకరము)

శాస్త్రయోనిత్వాత్ — అను బ్రహ్మసూత్రమును వ్యాఖ్యానించుచు శ్రీ శంకర భగవత్పాదులు ఋగాది వేద మాహాత్మ్యము నిట్లు వివరించిరి —

"మహతః ఋగ్వేదాదేః శాస్త్రస్య అనేక విద్యాస్థానోపబృంహితస్య ప్రదీపవత్ సర్వార్థావద్యోతినః సర్వజ్ఞకల్పస్య యోనిః కారణం బ్రహ్మ। న హీదృశస్య శాస్త్రస్య ఋగ్వేదాది లక్షణస్య సర్వజ్ఞగుణాన్వితస్య సర్వజ్ఞా దన్యతః సంభవోఽస్తి".

దీనికి పూర్వసూత్రమున సర్వజగ త్సృష్టి స్థితి లయ కారణ మగున దేదియో యదియే జిజ్ఞాస్య మగు బ్రహ్మ యని ప్రతిపాదింపబడినది. ఆ సర్వకారణవస్తువు చేతనమా? లేక జడమా? యను సందియమును దొలగించుటకై 'శాస్త్రయోనిత్వాత్' - అను నీ సూత్ర మారంభింపబడినది. మహామహిమోపేత మయిన ఋగాదివేదరాశికిగూడ కారణము బ్రహ్మ యని సూత్రార్థము. సర్వార్థావభాసక మగు వేదమునకుగూడ గారణ మగు వస్తువు చేతనము, సర్వజ్ఞము ననియే చెప్ప నగును గాని జడ మని యనుట పొసగదని సూత్రతాత్పర్యము. పై భాష్యమునందు 'మహతః, అనేక విద్యాస్థానోపబృంహితస్య; ప్రదీపవత్ సర్వార్థావద్యోతినః; సర్వజ్ఞకల్పస్య; శాస్త్రస్య' - ఇత్యాది విశేషణములతో ఋగాది వేదరాశి కీర్తింపబడినది. ఈ విశేషణము లన్నియు సార్థకములు, వేదముయొక్క మహత్త్వ సర్వోత్కృష్టత్వముల ప్రఖ్యాపన జేయు నట్టివి. శ్రీరామానంద పూర్ణానందులు నా విశేషణవాచక పదముల సార్థకత నిట్లు వివరించిరి.

> "మహతః గ్రంథతః (శబ్దతః) అర్థత శ్చ మహత్త్వ మితి। శబ్దతః వేదోచ్చారణమాత్రేణ సర్వపాపక్షయా చ్ఛబ్దతో వేదరూపశాస్త్రస్య మహత్త్వ మితి। పురాణాది దశవిధ విద్యాస్థానేషు వేదార్థ ఏవ ప్రతిపాద్యతే। తస్మా దర్థతోఽపి వేదస్య మహత్త్వ మితి।"

శబ్దస్వరూపముచేతను, అర్థస్వరూపముచేతను వేదము మహత్త్వసంపన్నము; పూజ్యము; వేదశబ్దము నుచ్చరించిన మాత్రమున సర్వపాపములు శమించును; కాన

వేదశబ్దము మహత్త్వపూర్ణము. పురాణ - న్యాయ - మీమాంసా - ధర్మశాస్త్ర-శిక్షా-వ్యాకరణ-ఛందో-నిరుక్త-జ్యోతిష-కల్పము లనెడి యీ దశవిధ విద్యాస్థానముల యందును వేదార్థమే ప్రతిపాదింపబడుచున్నది గాన అర్థమును బట్టియు వేదము యొక్క మహత్త్వము స్పష్టము. పై భాష్యము నందలి 'అనేక విద్యాస్థానోప బృంహితస్య' - యనెడి విశేషణముగూడ నీ యర్థమునే వివరించుచున్నది. ఇట్లు చెప్పుటచే పురాణ న్యాయ మీమాంసాది విద్యాస్థాన ప్రవర్తకులగు వ్యాస, గౌతమ, జైమిని, మను, పాణిని, యాస్కాది మహాపురుషు లందఱును వేదముయొక్క మహత్త్వమును దర్శింపజేయుట కయియే ఆ యా విద్యాస్థానముల వెలయింప జేయుచు తదర్థవ్యాఖ్యాన తత్పరు లగుట సూచింపబడినది.

ప్రదీపవత్ సర్వార్థావద్యోతినః — అను పై శాంకరభాష్యమునందలి విశేషణము 'వేదము సర్వవిద్యాస్థాన ప్రమేయావబోధకము గాన ప్రమాణ శ్రేష్ఠము'- అని పైన జెప్పబడిన యర్థమును వివరించుచున్నది. చక్షురాదీంద్రియములు రూప శబ్దాదివిషయముల భాసింపజేయుచు నా యా విషయములగూర్చి యవియే ప్రమాణ ములుగ గ్రహింపబడుచున్నవి. అట్లే అతీంద్రియములు, సర్వపురుషార్థహేతువులు నగు ధర్మబ్రహ్మరూప మహార్థముల భాసింపజేయుటచే నా ధర్మబ్రహ్మవిషయమున వేదమే ప్రమాణ మని తెలియవలెను.

శాస్త్రస్య :- హితార్థశాసకము (ప్రతిపాదకము) గాన ఋగాది వేదరాశి శాస్త్రము-అని యర్థము. అందుచే హితార్థులగు నెల్లరచే నాదరింపబడదగినది; తదుక్తార్థము లవశ్యానుష్ఠేయములు - అనియు సూచింపబడినది.

సర్వజ్ఞకల్పస్య — వేదము సర్వజ్ఞము. అనగా సర్వార్థావభాసక మని యర్థము. కావుననే 'అర్థతోఽపి మహతః' అనియు పూర్వము చెప్పబడినది. సర్వజ్ఞ మగు నిట్టి వస్తువు ప్రాదుర్భవింపవలయు ననిన తత్కారణవస్తువు గూడ సర్వజ్ఞము సర్వార్థావభాసకము నయి యుండవలెను. ఏలయన కారణమున లేని విశేషము తత్కార్యమున నెట్లు సంక్రమింపగలదు ? కాన కారణ మగు పరమేశ్వరుడు సర్వార్థావభాసకుడు గాన సర్వజ్ఞుడు. అట్లే సర్వవిద్యాస్థాన సర్వప్రమేయావభాసకముగాన వేదముకూడ సర్వజ్ఞ మని చెప్పవలెను.

ఇట్లు చెప్పుచో సర్వార్థావభాసక వస్తువులు రెండు. అవి వేదము; పరమేశ్వరుడును - అని సిద్ధించినది. ఇదెట్లు సంభవ మగును? సర్వార్థావభాసక వస్తువులు రెండు ఉండునా? - యనెడి యాశంక గలుగుట సహజము. ఈశ్వరుడు సర్వార్థావభాసకు డనగా సర్వార్థప్రకాశన మనెడి కార్యమునకు ఈశ్వరుడు కర్త. వేదము కరణము (సాధనము). కార్యసాధనమునకై, తత్కార్యనిర్వహణ సమర్థు డగు కర్త, అట్టి సాధనము-రెండును నపేక్షితములే గదా! కాన దోషము లేదు. కార్యసాధనమున కర్త స్వతంత్రుడు, సాధనము కర్తృపరతంత్రము. కావుననే ఈశ్వరుడు సర్వజ్ఞుడు, వేదము సర్వజ్ఞకల్పము నని చెప్పబడినది. అనగా వేదము సర్వజ్ఞు డగు పరమేశ్వరునికంటె కొంచెము తక్కువ, తత్సదృశము నని భావము. మఱియు పరమేశ్వరుడు స్వప్రకాశకుడు, చిత్స్వరూపుడు. వేదము సర్వార్థావభాసక మయ్యును శబ్దరూపము గాన జడము. అందుచేగూడ వేదము సర్వజ్ఞకల్పము. ఇంతే కాదు. వేదము సర్వార్థప్రత్యయసంపాదకము, సర్వజ్ఞ సర్వేశ్వర పరమాత్మ తత్త్వ ప్రతిపాదకము గాన సర్వార్థావభాసకము, సర్వజ్ఞము నని చెప్పవగి యున్నను ప్రతిపాదకముకంటె ప్రతిపాద్యము ప్రధానము; అందుచేతను వేదము సర్వజ్ఞకల్ప మని భాష్యకారులు వర్ణించిరి. వేదము సర్వజ్ఞ పరమాత్మసదృశము అని భావము. (పే. 47).

విచారించి చూడ పరమాత్మకు గల యీ సర్వార్థప్రకాశ కర్తృత్వము గూడ నౌపచారికమే గాని యథార్థము కాదనియు దెలియును. పరమాత్మ చిన్మాత్ర స్వభావకము. తత్సత్తామాత్రము చేతనే - తత్సంబద్ధమై - దానియందధ్యస్తమై - యున్న సర్వమును భాసించును. అది దేనిని భాసింప జేయదు. అది సర్వ విక్రియా విరహితము. కాన పరమాత్మ సర్వార్థప్రకాశనకర్త యని చెప్పుట యౌపచారికమే గాని ముఖ్యము గాదు. వేదము నిర్వికార సర్వసాక్షి సర్వజ్ఞ ప్రభవము, కాన నిర్దోషము, సర్వార్థావభాసన సాధనము; ప్రమాణతమము. కావుననే భాష్యకారులును 'సర్వజ్ఞ గుణాన్వితస్య' యను విశేషణముచే వేదము యొక్క మహత్త్వమును విశదీకరించిరి.

'న హీదృశస్య శాస్త్రస్య ఋగ్వేదాదిలక్షణస్య సర్వజ్ఞగుణాన్వితస్య సర్వజ్ఞాదన్యతః సంభవోఽస్తి' — అను పూర్వోదాహృత శాంకరభాష్య వచనము వలన —

'సర్వజ్ఞ సర్వసాక్షి సర్వప్రకాశక పరమేశ్వర వస్తువు నుండి వేదములకు సంభవము —పుట్టుక - గల్గిన దని తెలియును. అట్లు సంభవించుచో వేదము కార్యమై యనిత్యమే యగును. అది నిత్యము, అపౌరుషేయ మని యనుట యెట్లు పొసగును? — అను సందియమును దొలగించుచు శ్రుతియే యిట్లు చెప్పుచున్నది.

"అస్య మహతో భూతస్య నిఃశ్వసిత మేత ద్యదృగ్వేదః — —"

ఇందలి 'నిఃశ్వసిత' పదమును శ్రీ శంకరులును, తద్భాష్యవ్యాఖ్యాతలు నిట్లు వివరించిరి.

"అప్రయత్నే నైవ లీలాన్యాయేన పురుషనిఃశ్వాసవత్" —శం.భా.

"వేదస్య పౌరుషేయత్వ శంకా నిరాసార్థం శ్రుతిస్థ నిఃశ్వసిత పదార్థ మాహ-అప్రయత్నేనేతి" —రత్నప్రభా.

ఎట్టి ప్రయత్న లేశముగాని ఆయాసముగాని లేకయే ఉన్మేష నిమేషములను, ఉచ్ఛ్వాస నిఃశ్వాసములను పురుషు డెట్లు చేయుచున్నాడో యట్లే పరమేశ్వరుడు నెట్టి ప్రయత్నము లేకయే యనేక శాఖావిశేష విలసితమై మహత్తరమైన యా వేదరాశిని లీలగా ప్రవర్తింవజేసెను —అని యర్థము. 'అర్థం బుద్ధ్వా శబ్దరచనా'—యని లోక సంప్రదాయము. ప్రత్యక్షాది ప్రమాణాంతరములచే ముందుగ నొక యర్థమును దెలిసికొని, యా యర్థము నభివ్యక్తము జేయగల శబ్దముల గూర్చి యాలోచించి, నిశ్చయించి, తదనుగుణముగ వాక్యాది నిర్మాణ రూప రచనము చేయుట లోకసిద్ధము. ఇట్టి ప్రయత్నము గాని, ఆయాసముగాని లేకయే పరమేశ్వరుడు లీలగా వేదముల బ్రవర్తింప జేసెనని భావము. కాన నర్థజ్ఞానపూర్వక వాక్య నిర్మాణరూప యత్నము, అనగా వేదరచయితృత్వము పరమేశ్వరునకు లేదు. ఇట్లు వేదము పౌరుషేయము కానందున నిత్య మగును.

పరమేశ్వరునకు గల వేదరచయితృత్వము అర్థజ్ఞానపూర్వక వాక్యనిర్మాణాత్మకము కాదనినచో శాస్త్రయోనిత్వము - వేదకారణత్వము - పరమేశ్వరున కెట్లుపపన్నమగును? - అని యనరాదు. "యథా అధ్యేతారః (ఉపాధ్యాయినః) పూర్వ కమం జ్ఞాత్వా (పూర్వవేదానుపూర్వీం స్మృత్వా) వేదం కుర్వన్తి (వేదక్రమానుసారేణ శిష్యాన్ ప్రతిబోధయన్తి) తథా విచిత్రగుణ మాయాసహాయః అనావృతానంత

స్వప్రకాశ చిన్మాత్రః స్వీకృత పూర్వ కల్పీయక్రమ సజాతీయ క్రమవంతం వేదరాశిం తదర్థాంశ్చ యుగపత్ జానన్నేవ కరోతీతి న వేదస్య పౌరుషేయతా। యత్ర హి అర్థజ్ఞానపూర్వకం వాక్యజ్ఞానం వాక్యసృష్టౌ కారణం తత్ర పౌరుషేయతా; అత్ర చ యౌగపద్యా న్న సా"–అర్థజ్ఞానపూర్వక వాక్యరచన మెచట జరుగునో యావాక్యము లేక గ్రంథము పౌరుషేయము. అట్టి వాక్యరచన లేనియపు డది పౌరుషేయము కానేరదు. అధ్యేతలు తమ గురువుల నుండి తా మెట్టి క్రమము (అనుపూర్వి) తో వేదమును గ్రహించిరో యా క్రమముననే వేదమును స్మరించి, తిరిగి యా క్రమముననే విలసిల్లు వేదరాశిని తమ శిష్యుల కుపదేశింతురు. అంతియే కాని వారు ముందుగ వేదవాక్యముల యర్థము గ్రహించి తదర్థావబోధన క్షమములగు విలక్షణాను పూర్వీ విలసిత వేదవాక్యముల రచించి యుపదేశింపరు. అట్లే పరమేశ్వరుడును. ప్రలయకాలమున శబ్దార్థాత్మక మగు సర్వప్రపంచము సర్వకారణ మగు మాయయందు లీన మయియుండును. చిత్ర విచిత్ర గుణసంపన్న మగు మాయాశక్తి పరమేశ్వరున కుపాధి. పరమేశ్వరుడు అనావృతానంత స్వప్రకాశ చిన్మాత్ర స్వరూపుడు. కాన స్వోపాధి యగు మాయయందు లీనమై యుండెడి సర్వార్థములను తాను యుగపద్ అనగా నొక్కసారిగ ప్రకాశింప జేయుచు: తెలిసికొనును; మఱియు పూర్వకల్పమున దా నెట్టిక్రమమున వేదము నభివ్యక్తము గావించి యుండెనో ఆ యానుపూర్వితోడనే విలసిల్లెడి యా వేదరాశినే మరల మరల ప్రతికల్పాదియందు నభివ్యక్తము జేయుచుండును. వేదశబ్దార్థముల యొక్క స్ఫురణము (ప్రకాశము) ఏకకాలముననందే పరమేశ్వరునకు గల్గుటచే వేదవాక్యప్రకాశనమునకు పూర్వము తద్రచనాప్రయోజక మగు నర్థజ్ఞానమును సాధనాంతరముచే సంపాదించుకొనుట గాని, తదనుగుణముగ వాక్యముల, రచించుటగాని వేదవిషయమున లేదని స్పష్టమైనది. కనుక వేద మపౌరుషేయ మని సిద్ధించినది. సూతసంహితయు నీ విషయము నిట్లు వ్యక్తము జేయుచున్నది.

"వేదోఽనాదిః శివ స్తస్య వ్యంజకః పరమార్థతః।
అభివ్యక్తి మపేక్ష్యైవ ప్రణేతే త్యుచ్యతే శివః॥"

— యజ్ఞవైభవఖండ.

"పరమార్థత స్తు వేదః అనాదిః అవిరహితః నిత్యః శివ స్తు తస్యాభివ్యంజకః న తు వ్యాసాద్వా రచయితా। యథావస్థితాభివ్యంజకత్వ మపేక్ష్యైవ వేదస్య ప్రణేతేత్యపి

వ్యవహారః। అతఏవోక్తం - 'కర్తాపి బ్రహ్మా వేదస్య న పూర్వక్రమతోఽన్యతః । క్రమం కరోతి వాగ్వజ్రపాతో మాభూ న్నృణా మితి" - మాధవాచార్యః.

వేదము నిత్యము; ఆది లేనిది; పరమేశ్వరుడు దాని నభివ్యక్తము జేసెనే కాని స్వబుద్ధితో రచింపలేదు. అట్లభివ్యక్తముజేసిన కారణముననే పరమేశ్వరునకు వేదకర్త యని వ్యవహారము. పరబ్రహ్మ వేదమునకు కర్తయే యైనను పూర్వకల్పీయ క్రమభిన్న క్రమముతో వేదమును సృష్టింపడు. ఏలయన వేదము నందలి స్వర వర్ణ మాత్రాదులలో నే కొంచెము విపర్యాసము సంభవించినను తదధ్యేతలకు స్వరాదివైకల్యముతో గూడిన వేదవాక్యములు వజ్రాయుధప్రహార సమానములై యనర్థదాయకములు కాగలవు. అధ్యేతల కట్టి యనర్థము వాట్ల కుండుటకై పరమేశ్వరుడు క్రమభంగము నొనర్పడు. పూర్వ కల్పీయ క్రమవిలసిత మైన వేదమునే ప్రకాశింప జేయుచుండును. కనుక పరమేశ్వరుని యొక్క శాస్త్ర యోనిత్వ ముపపన్నమే యగును. దేవతాధికరణమున గూడ శంకరభగవత్పాదులు "అనాదినిధనా నిత్యా వా గుత్సృష్టా స్వయంభువా। ఆదౌ వేదమయీ నిత్యా యతః సర్వాః ప్రవృత్తయః'—అను వేదవ్యాస వచనమును వ్యాఖ్యానించుచు నీ విషయము నిట్లు వివరించిరి.

"ఉత్సృష్టా - ఉత్సర్గోఽప్యయం వాచః సంప్రదాయప్రవర్తనాత్మకో ద్రష్టవ్యః" —శం.భా.

వేదసంప్రదాయ ప్రవర్తకుడే గాని ఈశ్వరుడు వేదకర్త కాడని యర్థము. 'యో బ్రహ్మాణం విదధాతి'. యను శ్రుతి 'పరమేశ్వరుడు సృష్ట్యాది యందు బ్రహ్మను సృజించి యాతని హృదయమున వేదముల ప్రకాశింపజేసె' నని జెప్పుచున్నది. జగత్సృష్టికిని తత్స్రష్ట యగు ప్రజాపతికి గూడ బూర్వమే వేదములు గలవని శ్రుతియే స్వయముగ జెప్పికొనుట గమనార్హము. ఇట్లు జగత్సృష్టికిని, సృష్టికర్త కును బూర్వమే విలసిల్లెడి వేదము పౌరుషేయ మెట్లగును ? ఇట్లు వేదము సర్వ సృష్టిహేతువు, సర్వార్థావభాసకము, పరమాత్మ సమకక్షమై సర్వజ్ఞ కల్పము నని నిరూపింపబడుటచే వేదము సర్వార్థసాధకము, పురుషబుద్ధిగత దోషదూషితము గాక యపౌరుషేయము నని స్పష్టమైనది.

విజ్ఞాన వికాసక్రమము – సంప్రదాయదృష్టి; చారిత్రక దృష్టి

భారతీయ వాఙ్మయ మంతయు వేదరాశి నపౌరుషేయము, సర్వార్థప్రద్యోతకము, ప్రమాణతమము, దివ్యము, పరమపావనము నని కీర్తించుచుండ, అనాఘ్రాతార్షగ్రంథహృదయులు, యజ్ఞ దాన తపోఽనుష్ఠానాసంస్కృతాంతఃకరణులు నగు అధునాతనులు కొందఱు. స్వప్రతిభోన్నీత యుక్త్యాభాసమాత్రావష్టంభముతో ననన్యలభ్యములు వేదైకసమధిగమ్యములు నగు ధర్మబ్రహ్మ వస్తువుల విషయమున గాని, వేదస్వరూపస్వభావవిషయమున గాని సాక్షాత్కృతధర్ములైన మహర్షుల యొక్కయు, తపఃసమాసాదితాలౌకికాపూర్వ ఋతంభరాది ప్రజ్ఞాసంపన్నులైన మహాత్ముల యొక్కయు నిర్ణయముల పట్ల విశ్వాసము లేనివారై ఏమేమో దోషముల నారోపించి యాక్షేపించుచు చరిత్ర కల్పనల జేయుట కారంభించిరి. కలిపురుష మాహాత్మ్య మిట్టిది గదా! (యత్ర స్వప్రతిభా మానం తస్మై శ్రీ కలయే నమః).

ఐహికాముష్మిక ఫలప్రాప్తిమొదలు మోక్షము వరకు గల సమస్త పురుషార్థములను బోధించుట కయియే వేదము ప్రవృత్తమైనది; వేదోక్తార్థమును స్ఫుటముగ నభివ్యక్తము జేయుట కయియే వేదాంగములు ప్రవృత్తమైనట్లు నిరుక్తశాస్త్రము చెప్పుచున్నది. 'సర్వకామ ప్రాప్త్యాదిః మోక్షాంతః పురుషార్థో వక్తవ్య ఇతి వేదః ప్రవృత్తః । తత్పరిజ్ఞానాయ వేదాంగాని ప్రవృత్తాని' — ఇది మన యార్షదృష్టి. ఈ దృష్టితోనే మన పరిశీలన జరుగును. అట్లుగాక పాశ్చాత్యపండితులు, తదనుయాయులును ప్రకృతి ప్రాకృత పదార్థవర్ణనపరమే వేద మను దృష్టితో పరిశీలింప నారంభించిరి.

ఆర్షదృష్టి ననుసరించి ప్రతిపదార్థము భౌతికము (జడాంశము), దైవతము (చిదంశము) నను రెండంశములతో ననుబంధించి యుండును.

"అస్తి హి ఐశ్వరయోగా ద్దేవతానాం........మృదాదిష్వపి చేతనా అధిష్ఠాతారోఽభ్యుపగమ్యన్తే । మృ దబ్రవీ దాపోఽబ్రువన్ ఇత్యాది దర్శనాత్" — శం.భా. (దేవతాధికరణమ్).

"యదుక్త మాదిత్యాదయో మృదాదివ దచేతనా ఏ వేతి, తన్న। సర్వత్ర జడాఽజడాంశద్వయ సత్త్వాత్" —రత్నప్రభా.

ప్రకృతి పరమాత్మల సంబంధమువలననే సృష్టి ప్రవర్తిల్లు నని సంప్రదాయము. గాన జగత్తునందలి యన్నివస్తువులయందును పరమాత్మాంశము (చైతన్యాంశము), ప్రకృత్యంశము (జడాంశము) - ఈరెండు ననుగతము లయి యుండు ననుట యుపపన్నమే యగును. కారణధర్మములు కార్యములయందు ప్రకాశించుచుండుట యనునది ప్రసిద్ధమేగదా! ఈ తత్త్వమును గుర్తించి ప్రతి పదార్థమునందలి భౌతికాంశమును వదలి(ఉదాసీనభావముతో బరిత్యజించి) చిదంశమాత్రావబద్ధ బుద్ధులయి 'సర్వం విష్ణుమయం జగత్, సర్వం ఖల్విదం బ్రహ్మ' - అను సిద్ధాంతముల పారము నధిగమించుట శ్రుతిసంప్రదాయము.

చారిత్రికు లిట్టి యీ తత్త్వము నెఱుగరు. కేవలచరిత్ర కల్పనాలక్ష్యముతో వేదపరిశీలనము గావించిరి. వారు చెప్పెడి సృష్టిక్రమ పద్ధతి వేఱు. శ్రుతి సంప్రదాయము వేఱు. ఈ విషయమై శ్రుతిసంప్రదాయానుగతమైన యార్షదృష్టి యెట్లున్నదో చూతము.

చిన్మాత్రస్వభావ మగు పరతత్త్వమునుండి యా పరమాత్మకు తమోరూపము, అవిద్యాలక్షణము, ఆవరణస్వభావము నగు మాయ (ప్రకృతి) యొక్క యనుబంధ మేర్పడి సృష్టి ప్రారంభ మగును. 'మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్' - అనుచు గీతాశాస్త్రము నీ విషయము స్పష్టము జేయుచున్నది. పరతత్త్వము సంపూర్ణము, నిర్వికారము. ఆ పరతత్త్వముతో ప్రకృతి యెంతెంత సాంద్ర భావముతో ననుబంధించుచుండునో యంతంతగా సృష్టి విస్తరించుచుండును. అనగా విజ్ఞానము (పరతత్త్వము) అవిద్యచే నుత్తరోత్తర సాంద్రభావముతో ననుబంధించు చుండ (ఆవరింపబడుచుండ) తదనుగుణముగ నుత్తరోత్తరసృష్టి యేర్పడుచు విస్తరించుచుండు నని భావము. దీని ననుసరించి, అనగా నార్షదృష్టి ననుసరించి, సృష్టిక్రమవికాస మిట్లు గాంచనగును.

చిన్మాత్రస్వరూపు డగు పరమాత్మ మొదట బ్రహ్మను సృజించెను. అపుడు మాయ (ప్రకృతి) సామాన్యరూపమున విలసిల్లుచు స్వాశ్రయ పరతత్త్వమును విశేష ముగ నావరింప లేకపోవుటచే నపు డేర్పడిన సృష్టి (బ్రహ్మ) జ్ఞానఘన మైనది. కాననే పరతత్త్వప్రతిపాదకమై తదాత్మకమే యయిన వేదరాశి యా బ్రహ్మయొక్క

హృదయమున సంపూర్ణముగ నవభాసించెను. 'యో బ్రహ్మాణం విదధాతి' యను శ్రుతి యీ విషయమును దెలియజేయుచున్నది. ఇట సృజింపబడిన బ్రహ్మకు అవిద్యావృతి యల్పీయము గనుక పరమాత్మ యాతని హృదయమున వేదముల భాసింపజేసె నని తాత్పర్యము. పిమ్మట నా బ్రహ్మ మానససృష్టితో తన సృష్టి నారంభించెను. మానససృష్టిలోనివారే వసిష్ఠాది మహర్షులు. బ్రహ్మకు వలె వీరికి వేదములు హృదయమున స్వయముగ భాసింపలేదు. బ్రహ్మ యనుజ్ఞచే తప మాచరించి వీరు వేదముల బొందగల్గిరి. 'యుగాంతేఽన్తర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః। లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతాః స్వయంభువా ॥' అను వేదవ్యాసవచన మీ విషయమును స్పష్టము చేయుచున్నది. ఇట గమనింపవలసిన యంశము గలదు. సృష్టిసమయమున బ్రహ్మకు అవిద్య యల్పతమముగ నుండుటచే నాతని హృదయము స్వచ్ఛతమము. కాన ప్రయత్నము లేకయే పరమేశ్వ రానుగ్రహమున నాతనిహృదయమున వేదములు భాసించినవి. తదువాతి సృష్టిలోని వారు మహర్షులు. అవిద్య వారిలో కించిత్సాంద్రభావము నందినది. వారి యంతః కరణములు బ్రహ్మకువలె స్వచ్ఛతమములు కాకపోయెను, అందుచే వేదప్రాప్తికయి వారు శ్రమించి తపమొనరింప వలసివచ్చెను. నియమపూర్వక తపోఽనుష్ఠానాదులచే (సంయమాదులచే) వారిహృదయముల నావరించిన యవిద్య తొలగగా వారు వేదముల దర్శింపగల్గిరి. పిమ్మట అవిద్య క్రమముగ సాంద్రభావము నొందుకొలదియు నుత్తరోత్తర సృష్టి యుత్తరోత్తరము స్థూలభావము నొంది తమోబహుళమగుచు బ్రవర్తిల్లినది. మానస సృష్టి యనంతరము క్రమముగ దేవతలు, మానవులు మొదలగు సృష్టి ప్రవర్తిల్లినట్లు శ్రుతి స్మృతి పురాణములవలన దెలియును. ఋషులయందును, దేవతల యందును కంటె సాధారణ మానవాదులయందలి బుద్ధి సాంద్రతరాజ్ఞానావృతము. కావున వారికి విశేషతర ప్రయత్నమునగాని హృదయములు పరిశుద్ధములు గానేరవు. అంతఃకరణశుద్ధి లేక వేదములును, తత్త్వములును భాసింపవు. అంతఃకరణశుద్ధి కయియే బ్రహ్మచర్యాది వివిధనియమములు విధింపబడినవి. ఆ నియమములకు తపస్సనిపేరు ('నియమేషు తపఃశబ్దః' ఆప. ధర్మ. సూ.) 'యజ్ఞేన వాచః పదవీయ మాయన్' అను మంత్రవర్ణ మీ యర్థమునే ప్రతిపాదించుచున్నది. వేదముల దర్శింపజాలిన మహర్షు లర్వాచీన నరులలో జన్మింప రనుచు నాపస్తంబు డిట్లు చెప్పు చున్నాడు.

'తస్మా దృషయోఽవరేషు న జాయన్తే, నియమాతిక్రమాత్ ।'

అర్వాచీనులయందు (మంత్రదర్శనసామర్థ్యముగల) ఋషులు జన్మించుటలేదు. అనగా లేరని యర్థము. అవశ్యాచరణీయములైన ధర్మములను నియమములను వీరతిక్రమించుటయే యిందుకు గారణము — అని యర్థము. ఇట్లు జూచుచో క్రమక్రమముగ సృష్టిలో హృదయపారిశుద్ధ్యము తగ్గి, జ్ఞానప్రకాశము తఱుగుటయు, మానవులకంటె నుత్కృష్టులగు దేవతలయందును, వారికంటె నుత్కృష్టులగు మానసస్పృష్టిలోని మహర్షులయందును, ఆపైన బ్రహ్మయందును జ్ఞానప్రకాశాధిక్య ముండుటయు దెలియనగును.

మొదట నత్యన్తసూక్ష్మము సర్వవ్యాపకమునగు ఆకాశముయొక్క సృష్టియు క్రమముగ నుత్తరోత్తరము సూక్ష్మత్వము వ్యాపకత్వము తగ్గి స్థూలములు వ్యాప్యములు నగు వాయు తేజో జల పృథివ్యాది భూతముల సృష్టి విస్తరిల్లినట్లే మొదట జ్ఞానప్రకాశాధిక్యము గల్గిన సృష్టియు రానురాను జ్ఞానప్రకాశము సన్నగిలి సాంద్రతర - అజ్ఞానావరణాధిక్యము గల్గిన సృష్టియు విస్తరిల్లిన దనుట శ్రుతి స్మృతి సంప్రదాయము.

చారిత్రికు లట్లుగాక 'మొదట సాంద్రతమ మగు నజ్ఞానముతో (జడమగు పదార్థజాతముతో) సృష్టి యుపక్రాంతమై క్రమక్రమముగ విజ్ఞానము వికసించి వికసించి మానవసృష్టి యయ్యెను. అదియే విజ్ఞానవికాసమునకు పరాకాష్ఠ — అని చెప్పుదురు. ఇది శ్రుతి స్మృతి సంప్రదాయానుగుణము కాదనుట పై వివరణము వలన స్పష్ట మగును. కాన హృదయవికాసము కొఱకై మానవులు తపోధర్మానుష్ఠాన తత్పరులై చిత్తము నావరించియుండెడి మాలిన్యమును (అవిద్యను) క్రమముగ తొలగించుకొని వేదతత్త్వముల దర్శింపవలె నని మనవారి యాశయము.

మఱియు దేవతలను గూర్చి చారిత్రికులదృష్టి వేఱు. కన్నులకు గానవచ్చు సూర్య చంద్రాది జ్యోతిస్సులే దేవతలని వేదరచయితలు భ్రమించి రని వారందురు. అది యుక్తము కాదు. "అగ్నేర్ ఋగ్వేదః" ఇత్యాది శ్రుతివాక్యములు అగ్ని-వాయు-ఆదిత్యులనుండి ఋక్ యజుస్ సామావిర్భావమును జెప్పుచున్నవి.

అగ్న్యాదు లనగా జడము లగు జ్యోతిస్సులే యగుచో వానినుండి యర్థావభాసక వాక్యరూప వేదావిర్భావ మెట్లు పొసగును? "అగ్ని రస్మి జన్మనా జాతవేదాః" ఇత్యాది మంత్రములతో "నేను జన్మతః జాతవేదు డగు అగ్నిని" అని యజమానుడు చెప్పికొనును. (పే. 20) చేతనుడగు యజమానుడు జన్మతః జడాగ్నిస్వరూపు డగుట యెట్లు? "యా మృషయో మంత్రకృతః" ఇత్యాది మంత్రములు దేవతలు తపస్సు జేసి వేదములు దర్శించి నట్లు చెప్పుచున్నవి (పే. 60). జడములగు జ్యోతిస్సులే దేవత లగుచో నవి తపస్సు జేయుట గాని వేదముల దర్శించుట గాని యెట్లు? అట్లుగాక యా దేవత లుత్కృష్టజన్ములని యంగీకరించినను వారు తమ కంటె నికృష్టవీర్యు లగు మానవులయొక్క రచన లని చెప్పబడు వేదములకొఱకై శ్రమించి తపించు టేమి? అగ్న్యాదుల నధిష్ఠించి యున్న చైతన్యాంశములే దేవతలు, కేవల భౌతికజ్యోతిస్సులు కాదనుట శ్రుతిసంమతము.

భూలోకము కంటె నుత్తరోత్తరము దేవాది లోకము లనేకములు గలవు. అందు దేవాదిప్రాణివర్గము కలదు. ఈ లోకములలో నధోఽధోలోకముల కంటె నుత్తరోత్తరలోకము లుత్కృష్ట తేజస్సంపన్నములు. అటులే తత్రత్య మగు ప్రాణి వర్గము ఉత్కృష్టోత్కృష్ట ధర్మ తపో బల వీర్య విజ్ఞాన సంపన్నమై యుపాస్యము. అట్టి దేవాది వర్గమును సేవించుట మానవుని యుత్కృష్టతాప్రాప్తికి హేతువు. ఉపాస్యదేవతా స్వరూప - తత్త్వములను, దేవతలకు గూడ నుపాస్యులగు దేవతల స్వరూపాదికము, భూత, భౌతిక జడ పదార్థములకును, మానవులకును నే యే దేవత లతో నెట్టి యనుబంధము గలదో యెట్టి యుపాసనలచే మానవులు భూతజయమును గూడ సాధింపగలరో, మఱియు నుత్తరోత్తరము దేవాదిరూపముగు నుత్కృష్ట జన్మల నంది తుదకు జ్ఞానఘనులై బ్రహ్మాత్మభావమున నెట్లు విలసిల్ల గలరో యట్టి అతీంద్రియము, గహనము నగు మార్గముల నుపదేశించుట కయియే వేదరాశి యవతరించినది.

మానవుల యందలి యజ్ఞానానుబంధము వేదవాక్య గత త్రివిధార్థ పరిశీలనా దుల వలన గాని తొలగదు. ఈ విషయమును గూర్చి నిరుక్తశాస్త్ర మిట్లు వివరించు చున్నది.

"అతో హ్యధ్యాత్మాధిదైవాధియజ్ఞాభిధాయినాం మంత్రాణా మర్థాః పరిజ్ఞాయన్తే । తే చ పరిజ్ఞాతా స్సన్తః పురుష స్యోత్తమాయ శ్రేయసే భవన్తి".

మంత్రముల యందు ప్రతిపాదింపబడెడి అధ్యాత్మాధిదైవాధియజ్ఞార్థము లీ నిరుక్తశాస్త్రము వలన దెలియబడును. ఆ యర్థముల జక్కగ దెలియుచో బురుషుల కుత్తమ శ్రేయస్సు సిద్ధించును."యాజ్ఞం దైవత మాధ్యాత్మ మితి వాచః సమస్తోఽర్థః" వాక్కుయొక్క సంపూర్ణార్థము అధియజ్ఞ - అధిదైవ - అధ్యాత్మరూపము. ఈ త్రివిధార్థముల బరిశీలించిన గాని వేదవాక్యము యొక్క సంపూర్ణార్థము గ్రహింప బడ దని యర్థము. ఇట్లు యజ్ఞానుబంధముతో దేవానుబంధముతో ఆత్మానుబంధము తో మంత్రముల యర్థము బరిశీలింప వలెను. అట్టి యర్థముల మానవాళి కందించి యుత్తమశ్రేయస్సును సిద్ధింపజేయుట కయియే కృత్స్న వేదరాశి ప్రవృత్త మైనది. ఇట్లే అగ్న్యాధానమున పఠింపబడెడు మంత్రమును జూడుడు.

"మానుషా ద్దైవ్య ముపైమి"

మానుషత్వమునుండి దేవత్వము నందుచున్నాను—అని యర్థము. అగ్న్యాధానాది కర్మానుష్ఠానముద్వారా దేవతల నారాధించి తాద్భావ్యముచే దేవత్వము నందు నని తాత్పర్యము. నిరుక్తము నీ విషయము నిట్లు చెప్పుచున్నది.

"యాం యాం దేవతాం నిరాహ తస్యా స్తస్యా స్తాద్భావ్య మనుభవతి"

ఏ యే దేవతను గూర్చి నిశ్శేషముగ దెలిసికొనుచున్నాడో యత డా దేవతాభావము నొందుచున్నాడు—అని యర్థము. మానవులు దేవతాభావము నొందుటయే గాదు; ఆ దశనుండి వేదముల సాయముననే తమ యజ్ఞానముల దొలగించుకొని ప్రజాపతి భావము, హిరణ్యగర్భభావమును గూడ పొందవలెను. అపుడును వేదము విరత వ్యాపారము కాదు. తత్పరిజ్ఞానముననే తుదకు వారు బ్రహ్మభావము నొందగలరు. ఇట్లు మానవులు బ్రహ్మభావము నొందుటకు నుపకారక మగుచు దేశికుని వలెను, చెలికానివలెను, సఖివలెను వెంటనంటియుండి పరమశ్రేయస్సును సమకూర్చును (పే. 420). ఇట్టిదియే వేద మని భారతీయాశయము.

కాని పాశ్చాత్యచరిత్రకారులును తదనుయాయులును నీ తీరుగ వేదవాక్యార్థ విచారము చేయ లేదు. వేదములు ఆదిమనివాసుల రచనలు; వారు ప్రకృతి దృశ్యములను సూర్యాది జ్యోతిస్సులను జూచి భ్రమించి వర్ణించిరి. క్రమముగ ఆరణ్యకోపనిషద్భాగ రచనాకాలము నాటికి దేవతాది విజ్ఞానవిషయమున క్రమవికాసము కల్గినది-యని యందురు. వేదము లట్టివే యగుచో నట్టివేదముయొక్క జ్ఞానము దేవభావము నొందుటకు గాని, తుదకు బ్రహ్మభావము నందుటకుగాని యుపకరించునవి గాదు గదా! అట్టి వేదపరిజ్ఞానముచే గల్గెడి ప్రయోజన మేమి? లేదనుచో 'మానుషా ద్దైవ్య ముపైమి.' 'య ఇత్ తద్విదు స్త ఇమే సమాసతే"; "త మేవం విద్వా నమృత ఇహ భవతి। నాన్యః పన్థా అయనాయ విద్యతే'; యః పావమానీ రధ్యేతి ఋషిభిః సంభృతం రసమ్। తస్మై సరస్వతీ దుహే క్షీరం సర్పి ర్మధూదకమ్', 'బ్రహ్మవి దాప్నోతి పరమ్' — మున్నగు వేదాధ్యయన - తదుక్త కర్మానుష్ఠానాదులచే నుత్తమప్రయోజనములు సిద్ధించు నని యుపదేశించెడి శ్రుతివాక్యములకు సంగతి యెట్లు? అవి నిరర్థకములు నిష్ప్రయోజనము లనుటయు శ్రుతిసమ్మతము కాదు. 'ఇత్యధ్యాత్మమ్, ఇత్యధిదైవతమ్'-అనుచు శ్రుతులే ఆధ్యాత్మికాధిదైవికాద్యర్థముల శ్రుతివాక్యములందు దర్శింపవలె నని స్పష్టముగ జెప్పుచుండ నది కాదనుట ప్రత్యక్షాపలాపమే కాదా? ప్రకృతిదృశ్యాది వర్ణనపరములే యనుచో వేదములు అధిగతార్థబోధకములే యగును. అట్టిచో నవి యనువాదకములే యగును, ప్రమాణము లన దగవు. కాన 'వేదము అనధిగతార్థబోధకము, అజ్ఞాతార్థజ్ఞాపకము'-అనెడి ఆర్షసిద్ధాన్తమే గ్రాహ్యము. ఆహా! ప్రాచ్యాప్రాచ్య సిద్ధాంతముల కెంత యంతరము!

ఇట్టి యీ సిద్ధాంతములయందలి సామంజస్య తదభావముల వివరించుటకే భారతీనిరుక్తి యను నీ గ్రంథ మవతరించినది.

భారతీనిరుక్తి - నామౌచిత్యము - నిరుక్తస్వరూపము

ఇది యొక అపూర్వ గ్రంథము. దీని పేరు భారతీనిరుక్తి. ఇందు వేదముల గూర్చి యీ మధ్యకాలమున నచ్చటచ్చట చెలరేగిన ఋషిప్రవరాశయ, విరోధ్యాశయ విశేషముల సామంజస్యాభావము సరసముగ, సప్రమాణముగ, సోపపత్తికముగ

నిరూపింపబడినది. వేదము యొక్క స్వరూప స్వభావాదుల దెలిసికొనవలయు నన్న వేదమునకు గల పర్యాయపదముల నిర్వచనముల గుర్తించుట ముఖ్య మని యీ గ్రంథకర్తలు నిశ్చయించుకొని, యీ గ్రంథమున నా నిర్వచనప్రక్రియా విశేషముల ప్రధానముగ ప్రదర్శించి యుండిరి. ఇది చాల ప్రశంసనీయమైన పద్ధతి.

భారతి యనగా వేదవాక్కు. తత్స్వరూప తత్త్వావబోధముల కొఱకై వివిధ నిర్వచనాది విశేషము లిందు ప్రదర్శింపబడుటచే నీ గ్రంథమున కీ సమాఖ్య యుపపన్నమై యున్నది.

"ప్రస్తావ స్తు ప్రకరణం నిరుక్తం పదభంజనమ్" — హేమచూడః.

నిరుక్త మనగా పదభంజన మని పై వాక్యము వలన దెలియును. పదమును భంజించి ప్రకృతి ప్రత్యయ విభాగము చేసి — ప్రకృత్యర్థ మేదియో, ప్రత్యయార్థమేదియో నిరూపించి వ్యుత్పత్త్యాదులద్వారా నిష్కృష్టముగ - నిఃశేషముగ . నా పదార్థము యొక్క స్వరూపస్వభావాదులు స్ఫుటముగ దెలిసికొనుట కవకాశము గలుగును. ఇట్టి ప్రక్రియకు నిరుక్త మని పేరు. ఇట్టి ప్రక్రియ బహుళముగ బ్రాహ్మణ భాగము లందు ప్రదర్శింపబడి యున్నది. కాననే భాష్యకర్తలును బ్రాహ్మణమును 'నిరుక్త' మని వ్యవహరించిరి.

'నిఃశేషేణ వచనం నిర్వచనం బ్రాహ్మణమ్' — సా. భా. తై. ఆ. 1.6.3.

ప్రపంచము నామరూపాత్మకము. "అస్తి భాతి ప్రియం రూపం నామ చే త్యంశపంచకమ్ । ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతో ద్వయమ్॥" అను వచనము గూడ జగత్తు నామరూపాత్మక మగుట స్పష్టము జేయుచున్నది. నామ మనగా పదము. దీనినే అభిధాయకము లేక వాచక మనియు వ్యవహరింతురు. "శబ్దే నోచ్చారితే నేహ యేన ద్రవ్యం ప్రతీయతే। తదక్షరవిధౌ యుక్తం నామేత్యాహు ర్మనీషిణః' అను బృహద్దేవతావచనము 'అర్థమును గూర్చిన జ్ఞానమును గలుగ జేయునది నామము' — అని చెప్పుచున్నది.

రూప మనగా నర్థము. దీనిని అభిధేయము, వాచ్యము—ఇత్యాది పదములతో వ్యవహరింతురు. 'అర్థః అభిధేయః శబ్దప్రత్యాయ్యః'—అని 'అర్థ' శబ్దార్థమును

నామలింగానుశాసన వ్యాఖ్యాతలు వివరించిరి. 'శబ్దప్రత్యాయ్యః'—అనగా శబ్దముచే తెలిసికొనదగినది. కాన అర్థమును బోధించునదియే శబ్దము; శబ్దముచే దెలియబడు నదియే యర్థము: అభిధేయమగు నర్థముతో సంబంధములేక శబ్దముగాని అభిధాయక మగు శబ్దముతో సంబంధములేక యర్థముగాని యుండవు; కాన శబ్దార్థములు లేక వాచ్యవాచకములు నిత్యానుబద్ధములు—అని తెలియును. దర్శనకారులును పద పదార్థసంబంధము నిత్య మని చెప్పుదురు.

"సిద్ధే శబ్దార్థసంబంధే"—"సిద్ధే శబ్దే అర్థే సంబంధే చేతి........। అథ సిద్ధశబ్దస్య కః పదార్థః ? నిత్యపర్యాయవాచీ సిద్ధశబ్దః" —మహాభాష్యమ్.

నిరుక్తశాస్త్రముకూడ శబ్దార్థములు నిత్యసంబద్ధము అని చెప్పుచున్నది.

"తథాఽవశ్యం యత్రార్థ స్తత్ర తదభిధాయక శ్శబ్దో యత్ర శబ్ద స్తత్ర తద్వాచ్యోఽర్థ ఇతి .... సంబద్ధౌ హి శబ్దార్థౌ వాచ్యవాచకత్వేన నిత్య మితి"

మీమాంసాశాస్త్ర మందలి "ఔత్పత్తిక స్తు శబ్దస్యార్థేన సంబంధః........" అను సూత్రముకూడ నీ విషయమునే నిరూపించినది. వేదశబ్దములకు తదర్థములకు గల సంబంధము ఆగంతుకము కాదు: అనాదిసిద్ధము. ఇంతియే కాదు. అన్వర్థము కూడ. 'అస్తి తావ ద్బ్రహ్మ నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావం సర్వజ్ఞం సర్వశక్తి సమన్వితమ్। బ్రహ్మశబ్దస్య హి వ్యుత్పాద్యమానస్య నిత్యశుద్ధత్వాదయోఽర్థాః ప్రతీయన్తే, బృహతే ర్ధాతో రర్థానుగమాత్'—అని యనుచు శ్రీ శంకరభగవత్పాదులును నిరుక్తశాస్త్రసంప్రదాయము ననుసరించి ధాత్వాదివ్యుత్పాదనముద్వారా బ్రహ్మపదార్థ స్వరూప విశేషమును దర్శింపజేసి పద పదార్థ సంబంధ మన్వర్థ మగుట నిరూపించిరి. ఇట్టి ప్రక్రియ సర్వశాస్త్రసంమతము. అందుచే ప్రవృత్తినిమిత్తముల బరిశీలించుచు శబ్దార్థస్వరూప విశేష వివరణము జేయుట సంప్రదాయానుగతమై యున్నది.

పూర్వకల్పీయ వేదశబ్దములను తదనుగతములైన యర్థములను స్మరించుచు ప్రజాపతియు వేదశబ్దములతో సృష్టి గావించినటుల తైత్తిరీయబ్రాహ్మణము చెప్పు చున్నది. 'స భూ రితి వ్యాహరత్ స భూమి మసృజత' (పే. 68) శ్రుతిసిద్ధము

అయిన 'భూః' ఇత్యాది శబ్దముల స్మరించి వాని నుచ్చరించుచు ప్రజాపతి భూరాది లోకముల సృజించె నని యర్థము (చూ. బ్ర. సూ. దేవతాధికరణము. శం. భా.)

"వేదశబ్దేభ్య ఏవాదౌ నిర్మమే స మహేశ్వరః" - అను స్మృతివచనము ననుసరించియు పూర్వకల్పీయ వేదశబ్దార్థస్మరణ పూర్వకముగనే పరమేశ్వరుడు జగత్సృష్టి గావించినట్లు దెలియనగును. అందుచే వేదశబ్దములకు తదర్థమునకును గల సంబంధ మాగంతుకము కాదు, అనాదిసిద్ధము, కాన వేదశబ్దము లన్వర్థములు. తదర్థానుగుణముగనే తదర్థావగమ్యమాన తత్స్వరూప స్వభావాద్యనుగుణముగనే - 'భూ'రాది (అర్థ)రూపసృష్టి జరిగిన దని తెలియును. శ్రుతియే వేదగతపదము లన్వర్థము లని కొన్ని యెడల నా యా పదముల నిర్వచనముల స్వయముగ ప్రదర్శించుటయు నిందుకు తార్కాణము.

ఉదా: (1) "ధాన్య మసి ధినుహి దేవాన్" —తై.సం. 1-1-6.1

ఇట వ్రీహి రూప మగు హవిస్సు ధాన్యశబ్దముతో నిర్దేశింపబడినది. ఈ మంత్రము "ధినుహి' యనుచు (ధిను ప్రీణనే) నీ ధాన్యశబ్దము ప్రీణనార్థక 'ధిను' ధాతు నిష్పన్న మగుటను సూచించుచున్నది.

(2) "య న్నవ మైత్ త న్నవనీత మభవత్। య దసర్ప త్త త్సర్పి రభవత్। య ద్ధ్రియత త ద్ఘృత మభవత్" —తై.సం. 2-3-10-1.

ఈ మంత్రము నవనీత, సర్పిస్, ఘృత శబ్దముల నిర్వచనముల ప్రదర్శించుచున్నది. ఇట్లే మంత్రములు, శబ్దములు ధాతునిష్పన్నము లగుటయు, పద పదార్థసంబంధ మన్వర్థ మగుటయు నిరూపించుచున్నవి.

వివిధశాఖాగతములైన యిట్టి వివిధనిర్వచనముల నాధారము చేసికొని వేదశబ్దస్వరూపముల నిర్వచించి అధ్యాత్మాధిదైవాది వివిధార్థములను, తదర్థావగమ్యమాన తత్తత్స్వరూప స్వభావ తత్త్వాదుల దర్శించు విధానమును నిరూపించుటకై ప్రవృత్త మైనదే నిరుక్తశాస్త్రము.

శబ్దము నిత్యము కా దనెడి తార్కికులును 'పదపదార్థగత వాచ్యవాచకభావ రూప సంబంధము శక్తి; అది యీశ్వరసంకేతరూపము. (అస్మా త్పదా దయ మర్థో బోద్ధవ్య ఇతీశ్వరసంకేతః శక్తిః)' - అని యనిరి. ఈశ్వరసంకేత మన నీశ్వరేచ్ఛ. ఈశ్వరుడు నిత్యుడు. సర్వజ్ఞుడు. ఈశ్వరీయ జ్ఞానేచ్ఛలును నిత్యములు-అని వారి సిద్ధాంతము. ఈశ్వరుడు సర్వజ్ఞుడు, అనగా నతిరోహిత సర్వపదార్థాభిజ్ఞుడు. కావుననే సర్వజగత్సర్జనకర్త కాగల్గుచున్నాడు. ఎవ డే కార్యమునకు కర్తయో యతడా కార్యస్వరూప స్వభావ తద్ధేతు సామగ్రులను గూర్చిన యపరోక్షజ్ఞానము, తచ్చికీర్ష, తదర్థమైన యత్నము గల్గినవాడై యుండ వలెను. లేనిచో తత్కార్యమును గూర్చి యాతడు కర్త గాజాలడు. అందుచే, 'స్వోపాదానగోచర అపరోక్షజ్ఞాన చికీర్షా కృతిమత్త్వం కర్తృత్వమ్' - అని కర్తృలక్షణమును బరిష్కరించిరి. సర్వజగత్కర్త గాన నీశ్వరుడు సర్వపదార్థ విషయకమైన యపరోక్షజ్ఞానము గలవా డనుట యుపపన్న మగును. అట్టి కర్తయు సర్వజ్ఞుడు నగు ఈశ్వరుని సంకేతరూపము, వాచ్యవాచక భావరూప సంబంధము నగు శక్తి (శబ్దములకును తదర్థములకునుగల సంబంధము) అన్వర్థము. అది యాగంతుకము (యాదృచ్ఛికము-ఘుణాక్షర న్యాయసిద్ధము) కాదు. - అను విషయమును స్పష్టము జేయును. అట్లు కానిచో ఈశ్వరుని సంకేత మన్వర్థము కాకపోవును. అట్టిచో నీ ఈశ్వరుని సర్వజ్ఞత్వమునకే భంగము వాటిల్లును.

ఈ పదపదార్థసంబంధము, వానిని గూర్చిన సంప్రదాయ విశేషములు మన యీ భారతీనిరుక్తిగ్రంథ మందు నైతము బ్రహ్మ, కవి-కావ్య, భారతీ-ఛందః ప్రకరణములం దచటచట సప్రమాణముగ సోపపత్తికముగ వివరింపబడినది.

కాన దేవభాషయగు సంస్కృతభాషయందలి పదజాత మంతయు నన్వర్థము. అందుచే నిర్వచనపూర్వకి తత్తదర్థ తత్స్వరూప తత్స్వభావాది పరిశీలనముజేయుట యత్యంతావశ్యకము. ఇట్టి నిర్వచనప్రక్రియ శాకటాయనాది మహర్షిసంమతము. నిరుక్తశాస్త్ర సిద్ధాంతము, శ్రుతి స్మృతి పురాణేతిహాసాది సంప్రదాయానుగతము.

నిరుక్తశాస్త్రలక్ష్యము - భారతీనిరుక్తి

ఈ నిర్వచన ప్రక్రియకు ప్రయోజనము లేక లక్ష్యము ఏది ?

'నిరుక్తి—నిరుక్త' — నిర్వచన శబ్దములు సామాన్యముగ సమానార్థకములు. ఈ మూడును 'వచ పరిభాషణే' యను ధాతువు నుండియే నిష్పన్నము లగుచున్నవి. పదగత ప్రకృతిప్రత్యయాది విభజన పూర్వక తత్తదర్థ విశేషపరిశీలనము, యోగరూఢ్యాద్యర్థ వివేచనపూర్వక విశేషార్థపరిశీలనము గావించి తత్తత్పదగత యావత్సామర్థ్యానుబద్ధ కృత్స్నార్థ కథనానుకూల వ్యాపారము నిర్వచనము - అని చెప్పదగును. 'నిరుక్తం పదభంజనమ్' — అను నిఘంటు వచనము, అన్యార్థత్వ ప్రకల్పనమ్—అను ఆలంకారికుల వచనము (అవతారిక) 'నిఃశేషేణ వచనం నిర్వచనమ్'—అను వేదభాష్యకారవచనము-ఇట్టి వచనము లన్నియు పై యర్థమును ధ్రువపరచుచున్నవి. పదములకు యోగరూఢ్యాది వృత్తిభేదము ననుసరించి బహ్వర్థ బోధకత్వ ముపపన్న మగును. పదములు అనేకార్థబోధకత్వ సామర్థ్యసంపన్నములు కాననే కావ్యములు కొన్ని సరసతమ విశిష్టజీవిత వైభవోపేతములై వరలుటయు, మఱికొన్ని శ్లేషకావ్యము లని ప్రసిద్ధి నొప్పారుటయు సంభవించుచున్నది.

'ఐంద్ర్యా గార్హపత్య ముపతిష్ఠతే'—అను శ్రుతివాక్యము ఇంద్రపద ఘటితమై ఇంద్రరూపార్థ ప్రకాశన సమర్థ మగుచున్న యొక మంత్రమునకు వినియోగము చెప్పదలచి యీ మంత్రముతో 'ఇంద్రోపస్థానమును చేయవలదు; గార్హపత్యాగ్నిని స్తుతించుడు' - అని విధించుచున్నది. ఈ మంత్రముతో గార్హపత్యాగ్నిని స్తుతించుచో నిందలి 'ఇంద్ర' పదమున కర్థమేమి చెప్పవలెను ? - స్తోతవ్యదేవత యగు అగ్నియే ఇంద్రపదముచే వివక్షితు డని చెప్పుట శాస్త్రమర్యాద. యోగవృత్తి నాశ్రయింపక ఇంద్రపదము అగ్ని దేవతాపరము కానేరదు. ఈ శాస్త్రీయ మర్యాద కొన్నియెడల వాచ్యవృత్తిని, కొన్నియెడల యోగాది వృత్త్యన్తరము నాశ్రయించిననే కాని యన్యథా ఉపపన్నము కానేరదు.

ఇట్టి మర్యాదను శ్రుతియే యచ్చటచ్చట స్వయముగ ప్రదర్శించినది. సావిత్ర కాఠక చయనమున శ్రుతియే 'సంజ్ఞానమ్, విజ్ఞానమ్, ప్రజ్ఞానమ్' — ఇత్యాది మంత్రముల పఠించి యీ సంజ్ఞానాది పదములు "పూర్వాపర పక్షగత ప్రతిపదాది తిథ్యాదిపరములు (పూర్వపక్షస్యాహోరాత్రాణాం నామధేయాని........అపరపక్షస్యాహోరాత్రాణాం నామధేయాని)"—అని వివరించినది. మరల నంతిమానువాకమున తిథివాచకము లగు నీ పదములే "అగ్ని-వాయు-ఇంద్ర-బృహస్పతి-ప్రజాపతి-బ్రహ్మలకును నామధేయ

ముఖగా గ్రహింపనగును. (అగ్నే ర్వా ఏతాని నామధేయాని.......బ్రహ్మణో వా ఏతాని నామధేయాని)"—అని శ్రుతి యాదేశించుచున్నది. ఇట్లే శతరుద్రీయ పదము లన్నియు—అవి ప్రాపంచికతత్త్వపదార్థ విశేష బోధకము లయ్యును అమృతరూప బ్రహ్మకు నామధేయము లని జాబాలోపనిషత్తు చెప్పుచున్నది. (శతరుద్రీయేణేతి—ఏతాని హ వా అమృతస్య నామధేయాని భవన్తి—తైర్హ వా అమృతా భవన్తీతి). ఐతరేయశ్రుతి చేతోవృత్తివిశేషవాచకము లగు 'సంజ్ఞాన-అజ్ఞాన-విజ్ఞానాది పదములు ప్రజ్ఞానరూప బ్రహ్మవాచకము లని చెప్పినది. (సంజ్ఞాన మాజ్ఞానం విజ్ఞానం ప్రజ్ఞానం మేధా దృష్టి ర్ధృతి ర్మతి ర్మనీషా జూతిః స్మృతిః సంకల్పః క్రతు రసుః కామో వశ ఇతి సర్వాణ్యేవైతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవన్తి).

పై శ్రుతివాక్యముల బరిశీలించినచో పదము లా యా ప్రకరణాద్యనుసారము వృత్తిభేదముచే ననేకార్థబోధకము లగుటయు పరమాత్మవాచకము లగుటయు గమనార్హము. ఇట్టి శాస్త్రమర్యాదను దృష్టియం దుంచుకొనియే నీలకంఠపండితులును 'సర్వేఽపి శబ్దా యోగరూఢ్యా తత్తద్విశేషవాచకా అపి యోగార్థ మాదాయ సర్వే బ్రహ్మవాచకా అపి భవన్తి'—అని దేవీభాగవత వ్యాఖ్యానమున వివరించిరి (పే. 452). మఱియు నిర్వచనవ్యాపారమును బోధించు 'నిర్వచన'శబ్దమునుగూడ బ్రహ్మవాచకముగ శ్రుతియే యుదాహరించుటయు నిందుకు తార్కాణము. 'యత్రాద్వైతీభూతం విజ్ఞానం కార్యకారణకర్మ నిర్ముక్తం నిర్వచన మనౌపమ్యం నిరుపాఖ్యం, కిం తదవాచ్యమ్'—(మైత్రాయణీయోపనిషత్తు). అనిర్వాచ్య మగుటచే బ్రహ్మ 'నిర్వచనమ్' (విశేషసంజ్ఞాపరిహీనమ్, అవాచ్యమ్) అని యిట ప్రతిపాదింపబడినది. మోక్షరూప పురుషార్థమైన ధర్మాదులు పురుషార్థ పదవ్యవహార్యము లైనయట్లు నిర్వచనార్థమైన (బ్రహ్మవబోధార్థమైన) తత్తద్వృత్తి నిర్వచనవ్యాపారము గూడ నిర్వచనశబ్దాభిలప్య మగుచున్నది.

నిరుక్తశాస్త్రము నందలి యంతిమాధ్యాయము ఆత్మజిజ్ఞాసాపరము: బ్రహ్మప్రాప్తిరూప (బ్రహ్మభావ) ఫలకము; మఱియు నా యధ్యాయము. "సైషా ఆత్మజిజ్ఞాసా సైషా సర్వభూతజిజ్ఞాసా, బ్రహ్మణః సార్ష్టితాం సరూపతాం సలోకతాం గమయతి య ఏవం వేద"—అని యుపసంహారము గానవచ్చును. బ్రహ్మజిజ్ఞాసా భూతజిజ్ఞాసల

ద్వారా బ్రహ్మావబోధ బ్రహ్మభావసాధనము నిరుక్తగోష్ఠి యని పీనివలన స్పష్ట మగు చున్నది. ఉపాంతిమాధ్యాయమున గూడ నీ నిరుక్తవిద్య శ్రుతి మతి బుద్ధి లక్షణ మని చెప్పబడినది.

"సేయం విద్యా శ్రుతిమతిబుద్ధిః"—నిరుక్తమ్.

"తే విద్యావంతః యే శ్రుతిం జానంతి; తే మతిమంతః యే అర్థేన
తర్కాన్ విశ్చిన్వంతి; తే బుద్ధిమంతః యే బ్రహ్మ జానంతి....
సేయం విద్యా శ్రుతి మతి బుద్ధి రిత్యుచ్యతే" —టిప్పణీ.

"తేన అత్ర ఇయం విద్యా శ్రుతిరూపా మతిరూపా బుద్ధిరూపా ఇత్యర్థః స్యాత్।
శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్య ఇత్యుపనిషత్సు ఉచ్యతే" —టిప్పణీ.

పై నిరుక్త తద్వ్యాఖ్యావచనములబట్టి గూడ నిరుక్తిప్రక్రియ శ్రవణ మనన నిదిధ్యాసరూపమై బ్రహ్మావబోధార్థ మగుట స్పష్టమగుచున్నది. కాన నిరుక్తగోష్ఠి పరమపురుషార్థసాధన మనియు గుర్తింపనగును (పే 63లో). నిరుక్తగోష్ఠి యిట్టిది కనుకనే ఈ శాస్త్రమర్యాద ననుసరించి వేదస్వరూప తత్త్వాదులను గ్రహింప జేయుటకై యీ భారతీనిరుక్తి వెలయింపజేయబడినది.

ఇట్టి సంప్రదాయమును దృష్టియందుంచుకొనియే ఈ భారతీనిరుక్తియందు వేదపర్యాయవాచకములయిన వేదః, ఋషిః, బ్రహ్మ, ఆమ్నాయః, శ్రుతిః, స్వాధ్యాయః, త్రయీ, ఛందః - అను ప్రధానవేదపర్యాయ పదములయొక్కయు, వానితోపాటు గౌణవృత్తితో వేదమును బోధింపగల స్వాహా-స్వధాదిశబ్దములయొక్కయు వివిధనిర్వచనముల నుదాహరించి సంప్రదాయానుగత తదర్థపరిశీలనము గావింపబడినది. ప్రసంగవశమున ననేకములైన యితర శబ్దార్థనిర్వచనములను బరిశీలింపబడినవి.

వేదనామధేయములు - వేదము యొక్క వేదత్వము

సర్వచేతనవర్గముచే నిరంతర మభికాంక్షింపబడెడి వస్తువు సుఖ మొకటియే. 'పురుషైః సర్వైః అర్థ్యతే' - యను నిర్వచనము ననుసరించి పురుషార్థ మన నదియే

యని చెప్పబడుచున్నది. ఇట్టి యీ సుఖము నిత్యము, అనిత్యము నని రెండు విధములు; నిత్యము, విషయసంప్రయోగజన్యము కానిది; కేవల ఆత్మలక్షణము. అదియే మోక్షరూపము;—నిఃశ్రేయసరూపము, కాన నిదియే ముఖ్య (పరమ) పురుషార్థ మని యందురు. అది బ్రహ్మతత్త్వానుభూతిమాత్రలభ్యము. అనిత్యసుఖము ఐహికము, ఆముష్మికము నని చెప్పబడును. దీనినే అభ్యుదయ మని యందురు. విషయసంప్రయోగ జన్య మగు ఈ సుఖమే కామ పురుషార్థ మని చెప్పబడుచున్నది. 'కామ్యతే ఇష్యతే ఇతి కామః' — అని కామశబ్ద నిర్వచనము. దీని ననుసరించి యందఱిచే కోరబడునది గాన కామ మనగా సుఖ మని తెలియవచ్చు చున్నది. ధన ధాన్య గృహ క్షేత్రాదిరూపమగు నర్థము సుఖము నుద్దేశించియే కోరబడుచున్నది. గాని సుఖవాంఛలేక వానికొఱకే యని కోరబడుట లేదు. వానిని గూర్చిన ఇచ్ఛ సుఖేచ్ఛాధీనము; స్వతంత్రము కాదు. కావుననే యవి సుఖసాధనములు గావనెడి నిశ్చయము గల్గినపుడు వానిని గోరరు; స్వీకరింపరు. ఇది యనుభవసిద్ధ విషయము. అట్లే ధర్మవిషయమున గూడ. పురుషార్థములు నాల్గింటిలో మొదటిది ధర్మము. "చోదనా లక్షణోఽర్థో ధర్మః (జై. సూ.) — అని ధర్మలక్షణము. అవశ్య కర్తవ్యముగ వేదములలో నెయ్యది విధింపబడినదో యదియే ధర్మము—అని యర్థము. కాన ధర్మ మనునది వైదైకసమధిగమ్యము; కాని అన్యము కాదని తెలియును. ఆ ధర్మము యజ్ఞ దాన తపో హోమాది రూపము, అది జ్ఞాతమై యథాశాస్త్ర మనుష్ఠింపబడినయపుడే యపూర్వోత్పాదనము ద్వారా అభ్యుదయ పరంపరా సంధాయకము కాగలదు. అదియే నిష్కామముగ ననుష్ఠితమై యంతఃకరణ పారిశుద్ధ్య సంపాదనముద్వారా నిఃశ్రేయస సాధనమును కాగలదు. కాన ధర్మముగూడ నర్థము వలెనే సుఖసాధన మగుచు నర్థింపబడుట స్పష్టము. కాన సుఖరూప పురుషార్థార్థము లగుచు ధర్మార్థములు పురుషార్థములుగ బరిగణింప బడుచున్నవి. కామ (సుఖ) మట్టిది కాదు. సుఖేచ్ఛ ఇతరేచ్ఛానధీనము. కావుననే 'ఇతరేచ్ఛానధీనేచ్ఛా విషయత్వం సుఖత్వమ్'—అని శాస్త్రకారులు సుఖలక్షణమును జెప్పుదురు. ఇట నొక విషయము పరిశీలింప నగును. అర్థము సుఖసాధన మయ్యును నది ధర్మానుబద్ధము కానియపుడు అనర్థహేతువును కాగలదు. కాన నభ్యుదయసాధన మగు ధర్మరూప పురుషార్థము ప్రధానము, దాని కంటెను నిత్యసుఖరూప మగు మోక్ష రూప పరమ పురుషార్థము ప్రధానము.

ఇట్టి ధర్మబ్రహ్మతత్త్వములు వేదైకసమధిగమ్యములు. రూపము నేత్రగ్రాహ్యము, తదితర గ్రాహ్యము కాదు. శబ్దము శ్రోత్రమాత్రగ్రాహ్యము. అట్లే అతీంద్రియములగు ధర్మ బ్రహ్మతత్త్వములు వేదైక గ్రాహ్యములు కాని ప్రత్యక్ష తదుపజీవ్యేతర ప్రమాణగ్రాహ్యములు కానేరవు. ప్రత్యక్షాది ప్రమాణములచే దెలియజాలని ధర్మబ్రహ్మతత్త్వముల దెలియజేయుట (వేదయతి) చేతనే ఋగాది గ్రంథరాశికి 'వేద' మని యన్వర్థనామధేయము. "ప్రత్యక్షేణానుమిత్యా వా యస్తూపాయో న బుధ్యతే। 'ఏతం విదన్తి వేదేన తస్మా ద్వేదస్య వేదతా॥" అని సంప్రదాయాభిజ్ఞులు చెప్పెడి వేదలక్షణము. వేదపదనిర్వచనమును పై యభిప్రాయమునే యభివ్యక్తము చేయును. ఈ నిరుక్తినిబట్టి అతీంద్రియార్థముల బోధించెడి వేద మపౌరుషేయము గాని పౌరుషేయము కాదని స్పష్టమగును.

అట్టి యీ యపౌరుషేయగ్రంథరాశిని గూర్చిన మన ప్రాచీనార్ష సిద్ధాంతములపై చారిత్రికు లారోపించెడి యాక్షేపము లన్నిటిలో – 'వేదము మానవరచితము' – అనునది ప్రధానమల్లస్థానీయము; మన యార్షసంస్కృతికి గొడ్డలిపెట్టు. ఈ యాక్షేపము పరిహృత మగుచో మిగిలిన యాక్షేపములు సామాన్యముగ వాని యంతట నవియే సురిగిపోగలవు. ఈ గ్రంథమున జూపబడిన వేదపర్యాయపద నిర్వచనము లన్నియు తన్నిరసనక్షమములు. అందును పూర్వోదాహృతమైన వేదపద నిర్వచనము (ప్రత్యక్షేణానుమిత్యావా .... తస్మాద్వేదస్య వేదతా) ప్రధానమై ప్రధానమల్ల నిబర్హణస్థానీయము కాగలదు. అందుచేతనే యీ యపౌరుషేయ గ్రంథరాశిని బోధించు పదము లనేకము లున్నను వేదపదనిర్వచన పరిశీలనముతో నీ భారతీనిరుక్తి గ్రంథ ముపక్రాంతమైనది.

ఈగ్రంథము పండ్రెండు ప్రకరణములు గల్గి సుమారు ఏడువందల పుటలతో నొప్పుచున్నది. గ్రంథారంభప్రయోజనాదులగూర్చిన విపుల మగు నవతారికయు రచయితలచే గూర్పబడినది. వేదములనుగూర్చిన వివిధపాశ్చాత్యచరిత్రకారులు, తదనుయాయులగు భారతీయుల వాదములందలి యసామంజస్యమును సోపపత్తికముగ నిరూపించెడి కాంచీకామకోటిపీఠాధీశ్వరులు జగద్గురు శ్రీ చన్ద్రశేఖరేన్ద్రసరస్వతీ శ్రీ చరణుల యుపన్యాసము గ్రంథారంభమున పొందుపరచుట యీగ్రంథమున కొక యలంకారము. జగద్గురువులకు హృదయపూర్వక పరశ్శతనమోవాకములు.

ఈగ్రంథమున ప్రతి ప్రకరణమునను వేదబోధక పదనిర్వచనాదుల ద్వారా వేదస్వరూపస్వభావాదులు అర్వాచీనకల్పితాక్షేప పరిహారపూర్వకముగ విశదీకరింపబడినవి. ప్రసంగవశమున నతిగంభీరమగు దేవతాతత్త్వమును గూర్చియు, దేవపితృకర్మలు తద్రహస్యార్థముల గూర్చియు నెన్నియో విశేషాంశము లిందు సోపపత్తికముగ ప్రతిపాదింపబడినవి.

మఱియు నిందలి పండ్రెండు ప్రకరణములలో నిర్వచింపబడి వివరింపబడిన వేద-ఋషి- బ్రహ్మాది వేదనామధేయములలో నొక్కొక్కదానియం దొక్కొక్క విశిష్టతయు, వానిని గ్రహించి వివరించుటలో నొక క్రమగతియు గన్పట్టును-వానిని చూతము.

వేదపద ప్రకరణము

ఈ ప్రకరణము ప్రధానమల్ల నిబర్హణస్థానీయ మని చెప్పబడిన వేదశబ్ద నిర్వచనముతో నుపక్రాంత మైనది. ఇందు 'వేదయతీతి వేదః' అను నిర్వచనమును బ్రదర్శించి వివరించుచు వేదశబ్దము ప్రమాణాంతరాజ్ఞాత ధర్మ బ్రహ్మ ప్రతిపాదనపర గ్రంథవాచక మగుటయేగాక వేదవేద్యుడగు పరమాత్మకును వాచకము కాగలదనియు 'విదలాభే' అను ధాతువునుండి నిష్పన్నమైన దగుట జేసి నిఖిలపురుషార్థ లాభహేతు వనియు సప్రమాణముగ నిరూపింపబడినది. 'విద విచారణే, విద సత్తాయాం, విద జ్ఞానే, విద్లృ లాభే' అను నాలుగు ధాతువులనుండియు నీ వేదశబ్దము నిష్పన్న మగును. అందుచే నీశబ్దము నాలుగు నిర్వచనములద్వారా వేదములు (1) బ్రహ్మతత్త్వ విచారపరములు, గనుక (2) బ్రహ్మవస్తుసత్తా నిరూపకములు, (3) బ్రహ్మతత్త్వ విజ్ఞానసాధనములు, గనుక (4) బ్రహ్మకృతా ప్రాప్తిసాధనములు-అను నర్థముల దెలియజేయుచు 1) ఋగాది మంత్రబ్రాహ్మణాత్మక గ్రంథరాశియంతయు వేదశబ్ద వ్యవహార్యము 2) బ్రహ్మతత్త్వనిరూపకము-అను నంశములను నిరూపించుచున్నదని సోపపత్తికముగ నిట వివరింపబడినది. కాన, వేద మనునది కేవలసంజ్ఞావాచకము గాదు; అన్వర్థము.

'వేదోఽసి యేన త్వం దేవ వేద' అను వాజసనేయమంత్రము మున్నగు వచనముల నుదాహరించి 'వేద-దేవ' శబ్దములు పర్యాయపదములు, వేదవాచక శబ్దములు పరమేశ్వరవాచకములు నగునని చక్కగ వివరింపబడినది. ఈ

మంత్రము ననుసరించి 'దైవీసంపత్సమృద్ధిచేగాని, వేదాది (దర్శపూర్ణమాసాది) యజ్ఞాది కర్మోపయుక్త పదార్థములయందు వేదత్వము (దివ్యత్వము) తెలియబడదు. అట్టి సంపదలేకున్న వేదగతాపౌరుషేయత్వాది మాహాత్మ్యములు గోచరింపక పౌరుషేయత్వాది బుద్ధియే యుదయించు'నని యిట సూచింపబడుట గమనార్హము.

'వేదః' అనునది సమస్తజీవులకును సామాన్యనామము. నామకరణ సంస్కార సమయమున తండ్రి 'వేదోఽసి' (బృ. 8-26) యనుచు నవజాతశిశువు నీ రహస్యనామముతో పిలుచును; పిదప వ్యవహారార్థమై రామ-కృష్ణాదినామముల బెట్టును. ఇది పరంపరాగతమైన సంప్రదాయము. 'వేదః' అనగా సమస్త వేదముల కభివ్యక్తిస్థానము, పర్యవసానము — అనగా పరమతాత్పర్యము నగు వేదనము (చిన్మాత్రము పరబ్రహ్మ, వేదః-వేదనమ్-జ్ఞానమ్) అని యర్థము. ఇట్టి యీ నామకరణసంస్కారముచే నీ రహస్యనామముద్వారా జీవుని వాస్తవస్థితి యగు పరమాత్మత్వము శైశవ దశనుండి యుపదేశింపబూనుట యను విధానము. ప్రాచీనార్ష దృష్టి యందలి నైశిత్యమును, మధురాతిమధుర భావోద్దీపకమగు మహత్త్వమును చాటుచున్నది. మఱియు నామకరణ సంస్కారమునకు బూర్వమే జాతకర్మ సమయమున శిశువు కుడిచెవియందు 'వాక్-వాక్-వాక్' అని ముమ్మారు తండ్రి జపింపవలె నని శ్రుతి యాదేశము (బృ. ఉ. 8-25). 'త్రయీలక్షణ మగు వేదవాక్కు నిన్నావేశించుగాక' యని తాత్పర్యము. తండ్రి యిటు వేదవాక్కును శిశువునం దావేశింపజేసి పిదప నామకరణసమయమున నా శిశువునకే 'వేదోఽసి'యని రహస్యనామ ముంచుట యెంతయు సరసతరముగ నున్నది. ఇట్లు అత్యంతప్రతిభాన్విత గంభీరార్షదృష్టి నైశిత్య సూచకము లగు విశేషముల నెన్నిటినో యీ గ్రంథకర్తలు నిపుణముగ బ్రదర్శించినారు.

వేదపద మనగ దేవపదము. అనగా దేవతాతత్త్వ ప్రతిపాదకము కృత్స్న వేదము నధ్యయనము చేయజాలనివారు ఒక్క దేవపదము నైన నధ్యయనము చేయవలెను (అప్యేకం దేవపద మధీయీత — శ. బ్రా.) అని శ్రుతి యాదేశము. కాన వేద పదములు దేవతాతత్త్వ ప్రతిపాదన పరములే గాని, చారిత్రికులు చెప్పునట్లు ప్రకృతి రామణీయకాది దృశ్య వర్ణనపరములు గావని సోపపత్తికముగ నిట వివరింపబడినది. అట్లే 'వేదములు మానవ రచితము లగునా?' యని ప్రశ్నించుకొని 'అగ్నేర్ ఋగ్వేదః' 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వమ్' 'ఋచో నామాస్మి యజూగ్ంషి

నామాస్మి' 'అహే బుధ్నియ మంత్రం మే గోపాయ । య మృషయ స్త్రైవిదా విదుః' ఇత్యాది మంత్రార్థ పరిశీలనము ద్వారా 'వేదములు మానవ రచితములు గావు; ఇందు నియత పౌర్వాపర్యము లేదు. అపౌరుషేయము' లని నిరూపించిన విధానము ప్రశంసనీయము. ఇంతియే గాక, 'ఉపనిషత్తులయందు మాత్రమే అంతర్దర్శనము, సంహితాభాగముల యందు బాహ్య దర్శనమే గాని అంతర్దర్శనము లేదు' అని పార్శ్రితికుల యాక్షేపము. ఈ ప్రకరణమున ఋగ్వేద సంహిత యందలి 'న విజానామి యది వేద మస్మి' ఇత్యాది మంత్రార్థ పరిశీలనము ద్వారా ఉపనిషత్ప్రతిపాదిత తత్త్వార్థమే సంహితాదుల యందును ప్రతిపాదింపబడిన దని సోపపత్తికముగ వివరించి పై యాక్షేపము సయుక్తికముగ పరిహరింపబడినది. వేదము యొక్క వేదత్వము నిరూపింపబడినది.

ఋషిపద ప్రకరణము

పూర్వప్రకరణమున వేదశబ్ద నిర్వచనాదుల ద్వారా వేదము ప్రత్యక్షాది ప్రమాణాంతరాజ్ఞాత - అలౌకిక తత్త్వవేదకము, నిఖిల పురుషార్థ లాభహేతువు నగుటచే నపౌరుషేయ మని నిరూపింపబడినది. అది నిత్యసిద్ధ మయిన యపుడే దానికి అపౌరుషేయత్వ ముపపన్న మగును. అట్టివేదము నిత్యసిద్ధము, సర్వార్థావభాసకము అను నంశము ఋషిపదము సూచించును. అట్టి 'ఋషి' శబ్దార్థము ఈ ప్రకరణమున నిర్వచనాదుల ద్వారా చక్కగ నిరూపింపబడినది. "ఋషి ర్దర్శనాత్"— దీర్ఘ తపస్సమాధిలో వేదమును దర్శించుటచే వసిష్ఠాదులకు 'ఋషి' యని యన్వర్థ సంజ్ఞ. ఘటదర్శనము ఘటరూప విషయసత్తాధీనము. పూర్వసిద్ధమై యున్న ఘటమునే దర్శింతుము. అట్లు సిద్ధమై యుండనిచో తద్దర్శనము పొసగదు. అట్లే వేదదర్శనము పూర్వసిద్ధ వేదసత్తాధీనము. పూర్వసిద్ధమై లేనిచో "వేదమును దర్శించుటచే ఋషు లయిరి" — యనెడి శ్రుతి సంప్రదాయము, తదనుగుణమైన "ఋషి ర్దర్శనాత్" అనెడి పై నిర్వచనము సంగతములు కాకపోవలసి వచ్చును. వేదపదము వలె ఋషిపదము నన్వర్థమే కాని కేవల సంజ్ఞావాచకము కాదు. కాన ఋషిపదము, వేదము నిత్యసిద్ధమైన దను నంశము నభివ్యక్తము చేయుట స్పష్టము. నిత్యసిద్ధ మగుచో 'ఈశ్వరుడు వేదకర్త యని యనుట యెట్లు" అని యనరాదు.

నిత్యసిద్ధమై యున్న పూర్వకల్పీయ వేదము నభివ్యక్తము చేయుటచేతనే ఈశ్వరునకు వేదకర్త యని ప్రసిద్ధి.

"ఋషతి దర్శయతి-జ్ఞాపయతి-ధర్మాదిం పరమాత్మాన మితి ఋషి ర్వేదః" అను నిర్వచనము ననుసరించి ఋషిశబ్దము వేదవాచకము; "ఋషతి-పశ్యతి సర్వం" అను వ్యుత్పత్తి ననుసరించి పరమేశ్వరవాచకము నగు నని యిందు నిరూపింపబడినది. "య ఇమా విశ్వా భువనాని" (ఋ, 10.81.1) అను నీ ఋఙ్మంత్రము సర్వశాఖల యందును గలదు. ఈ మంత్రమున ఋషిశబ్దము పరమాత్మ విషయకము. "యతో వా ఇమాని భూతాని జాయన్తే"—మున్నగు నుపనిషద్వాక్యములలో వర్ణింపబడిన బ్రహ్మలక్షణము పై ఋఙ్మంత్రమునం దుల్లేఖింపబడినది. ఇట్టి మంత్రము లెన్నెని గలవు. వీనిని బరిశీలించి జూచిన "ఉపనిషత్తులందు మాత్రమే తత్త్వదర్శనము గలదు; మంత్రభాగములో లేదు" — అనెడి చారిత్రికుల వాద మపేశల మని యిట చక్కగా నిరూపింపబడినది. వేదముల యందు గన్పడెడి "ఋషికృత్ మంత్రకృత్" ఇత్యాది పదములకు మంత్రద్రష్ట యనియే యర్థముగాని మంత్రరచయిత యని కాదు. అట్లే ఋషి యను పదమునకు మంత్రరచయిత యని చెప్పు చారిత్రికుల యూహలు నిష్ప్రమాణములు, సంస్కృత భాషా స్వభావానభిజ్ఞతా సూచకము లనియు సప్రమాణముగ నిందు వివరింపబడినది. "ఋషీణాం పున రాద్యానాం వాచ మర్థోఽనుధావతి" యను భవభూతి మహాకవి శ్లోకము నందలి "ఆద్యఋషులు" మంత్రములే యగు ననుట యుక్తతర మని యిట నిరూపించుట గమనార్హము.

బ్రహ్మపద ప్రకరణము

అపౌరుషేయ మగు వేదము నిత్యసిద్ధ మని పై ప్రకరణమున చెప్పబడినది. అట్టి వేదము నిరతిశయ మహత్త్వ సంపన్నము; పరబ్రహ్మతత్త్వ ప్రతిపాదకము అని బ్రహ్మశబ్దము సూచించును. ఈ ప్రకరణమున బ్రహ్మశబ్ద నిర్వచనాదుల ద్వారా పై విషయములు నిరూపింపబడినవి. బ్రహ్మశబ్దము "బృహి-వృద్ధౌ" అను ధాతువునుండి నిష్పన్నమైనది. ఇట వృద్ధి శబ్దముచే నిరతిశయ మహత్త్వ మువలక్షితము. వేదశబ్దము స్వరూపతః మహత్త్వపూర్ణము కాన బ్రహ్మ యగును. నిరతిశయ మహత్త్వముగల బ్రహ్మను ప్రతిపాదించుట యందు పరమ తాత్పర్యము గలది యగుట

చేతను వేదము బ్రహ్మ. పురాణాది దశవిధ విద్యాస్థానములచే వ్యాఖ్యేయ మగు మహత్తరార్థము నవాంతర తాత్పర్యముచే ప్రతిపాదించునది యగుట వలన వేదము బ్రహ్మ. "బృంహయతి వర్ధయతీతి బ్రహ్మ". వేదవిహిత కర్మానుష్ఠానము చేతను వేదవాక్యార్థ విచారము చేతను జీవులకు క్రమముగ పరిచ్ఛిన్నభావమును పరిహరించి, బ్రహ్మ భావమును ప్రతిపాదించి వర్ధిల్లచేయునది గాన వేదము బ్రహ్మ. ఈ రీతిగ అపౌరుషేయము, నిత్యసిద్ధము నగు వేదము నిరతిశయ మహత్త్వపూర్ణము, నిరతిశయ మహత్త్వ సంపాదక మగును గాన బ్రహ్మ యన దగును.

మఱియు "యావద్బ్రహ్మ విష్ఠితం తావతీ వాక్" అను శ్రుతి వాక్-బ్రహ్మలు సమనియతము లని చెప్పుచున్నది. ఇట్లు బ్రహ్మసమనియత మగుట జేసియు వాక్కు బ్రహ్మ యగు నని యీ ప్రకరణమున చక్కగ నిరూపింపబడినది.

"బ్రహ్మశబ్దమునకు అర్థము క్రమముగ మాఱినది;" అనెడి చారిత్రికుల (హాగ్, రాథ్ మున్నగు) విభిన్నవాదములను, బ్రహ్మణస్పతి యర్వాచీన దేవత యనెడి వాదము, బ్రాహ్మణములు వేదములు గావు, అనగా నపౌరుషేయములు కావనెడి శ్రీ దయానందాదుల వాదములిట ప్రస్తావింపబడి, యవి శ్రుతి సంప్రదాయానుగతములు గావని సప్రమాణముగ నిరూపింపబడుట గమనార్హము. మరియు విశ్వామిత్రాది పరిశీలనముజేసి మంత్రద్రష్ట లగువారే బ్రాహ్మణు లగుదురను నంశము గూడ నిట సరసముగ ప్రతిపాదింపబడినది.

వేద మత్యంత పావనము; అది నానాశాఖావిలసిత బ్రహ్మవృక్షము; నిరంతరాధ్యయనాధ్యాపనాదులచే రక్షించు కొనదగిన కల్పవృక్షమట ! వేదము విషయమై భగవత్స్వరూపులగు వ్యాసాది మహర్షుల కెంత యాదరమో యీ క్రింది శ్లోకము వలన స్పష్ట మగును.

"బ్రహ్మవృక్షో రక్ష్యమాణో మధు హేమ చ వర్షతి ।
అరక్ష్యమాణ స్సతత మఘపాపం చ వర్షతి ॥"

ఆమ్నాయ-శ్రుతి ప్రకరణము

అపౌరుషేయమై నిత్యసిద్ధమయిన వేదము నిరతిశయ మహత్త్వ సంపన్నము, బ్రహ్మతత్త్వప్రతిపాదకమునై బ్రహ్మశబ్ద వాచ్యమగు నను విషయము పైప్రకరణమున జెప్పబడినది. అట్టి వేద విద్య (బ్రహ్మ) నిరంతర మభ్యసనీయము, గురు పరంపరా సమధిగమ్యము - అని ఆమ్నాయ-శ్రుతిశబ్దములు సూచించుచున్నవి. అట్టి ఆమ్నాయ శ్రుతి స్వరూపము, తన్నిర్వచనాముల ద్వారా యీ ప్రకరణమున వివరింపబడినది.

“మ్నా అభ్యాసే; శ్రు శ్రవణే” — గురుముఖమున శ్రవణము జేయుచు గురుముఖోచ్చారణానూచ్చారణ రూపమున గ్రహించి నిరంతర మభ్యసించి, బ్రహ్మయజ్ఞాదుల ద్వారా ఆమ్నాత మగుచుండు నది యని యర్థము. కాన వేదమునకు గల “శ్రుతి-ఆమ్నాయ” సంజ్ఞ లన్వర్థములు. శ్రవణైక సాధ్యము గాన వేదమునకు శ్రుతి యనియు, శ్రుతా యనియు, అనుశ్రవా యనియు వ్యవహారము.

“దివశ్చిదా పూర్వ్యా” — ఇత్యాది మంత్రములందు గల పూర్వ్యా, సనజా, ప్రత్నా మున్నగు విశేషణములు, వాక, అనువాక, అనూచానాది పదములును అవిచ్ఛిన్న గురుపరంపరాప్రాప్తవిద్యయే వేదవిద్య; ఆ వేదవిద్య లిఖిత పాఠాదులచే గ్రహింపదగినది కాదు” అని తెలియజేయుచు వేదమునకుగల ఆమ్నాయత్వమును శ్రుతిత్వమును వ్యక్తము జేయు నని యట సోపపత్తికముగ నిరూపింపబడినది.

కొన్ని మంత్రములలో గానవచ్చుచున్న “నవ-నవ్య” — ఇత్యాది పదముల జూచి యా పదములకు సంప్రదాయసిద్ధ నిర్వచన ప్రక్రియల (ణు స్తుతౌ, నూయతే స్తూయతే ఇతి నవః స్తుత్యః) గ్రహింపజాలక, ‘క్రొత్తది’ — యను నర్థమును మాత్రమే గ్రహించి చారిత్రికులు జేయు కల్పన లిట సప్రమాణముగ నిరసింపబడినవి. అట్లే “బ్రాహ్మణకాలమున మంత్రముల రచన సన్నగిలినను పురోహితుడు గాథారూపము లగు పద్యముల రచించి యజ్ఞమునందు వాని గానము చేయవలె ననెడి నియమ మేర్పడినది” - యనెడి చారిత్రిక కల్పన లత్యన్తాసమంజసము లనియు, “స్వయంకృత గాథలు వేఱు; మంత్రములు వేఱు” - అనుచు ఆశ్వమేధిక ప్రయోగాంతర్గత గాథాప్రసంగముల నుదాహరించి నిరూపించుట ప్రశంసనీయము.

ఆమ్నాయ మొక క్షీరాంబుధిః తన్మథనము (శ్రవణాద్యభ్యాసము) సాదరముగ జేయుచో దేవతలకును దుర్లభ మగు నమృతము (పరమపురుషార్థము) సిద్ధింపగల దని సప్రమాణముగ నిట వివరించుట సరసతరముగ నున్నది.

స్వాధ్యాయ పద ప్రకరణము

అపౌరుషేయము, నిత్యసిద్ధము, నిరతిశయ మహత్త్వ సంపన్నము నగు వేదము గురుముఖైక వేద్యము, నిత్యాభ్యసనీయ మనియు పై ప్రకరణమున నిరూపింపబడినది. దిగ్దేశ కాలా ద్యనవచ్ఛిన్న మగు బ్రహ్మ-స్వాత్మరూపము, ప్రత్యగభిన్నము అను నంశమును వేదము స్వాధ్యాయశబ్దముచే సూచించును. అట్టి స్వాధ్యాయ స్వరూప మీ ప్రకరణమున పరిశీలింపబడినది.

స్వం అధ్యయనం స్వాధ్యాయః - ఆత్మతత్త్వ ప్రతిపాదక మగుటచే వేదము స్వాధ్యాయ శబ్దవాచ్యము. బ్రహ్మతత్త్వ ప్రతిపాదక మగుటచే వేదము బ్రహ్మశబ వాచ్య మని పూర్వము చెప్పబడినది. స్వ (ఆత్మ) స్వరూపావబోధక మగుటజేసి వేదము స్వాధ్యాయ శబ్దవాచ్య మగునని యిట జెప్పబడినది. కాగా వేద ప్రతిపాద్య మగు బ్రహ్మ స్వాత్మరూపము, ప్రత్యగభిన్నము నగుట స్వాధ్యాయ శబ్దముచే స్ఫుట మగుచున్నది. బ్రహ్మ, స్వాధ్యాయాది పదములు పర్యాయవాచక ములుగ శ్రుతి, స్మృతి పురాణేతిహాసాదుల యందును, నిఘంటువుల యందును ప్రసిద్ధములు.కాన 'స్వాధ్యాయోఽధ్యేతవ్య' అను వాక్యము కృత్స్న వేదపరము గాని కొందఱనునట్లుగ కేవల స్వశాఖామాత్రాధ్యయనపరము గాదని రచయితలు సోపపత్తికముగ నీ ప్రకరణమున నిరూపించిరి. "స్వాధ్యాయోఽధ్యేతవ్య" అను శ్రుతివాక్యము కృత్స్నవేదాధ్యయన విధాయకము అయ్యును అశక్తుల విషయమున స్వశాఖాధ్యయన మాత్ర విధాయకము నగును — అను విషయము మితాక్షర - భాట్టచింతామణి - న్యాయసుధా - సాయణభాష్యాది గ్రంథోదాహరణ పూర్వకముగ నిట జక్కగ వ్యక్తము జేయబడినది. స్వాధ్యాయ పదమునకు స్వశాఖారూప వేద మనియే గాక వేదము, బ్రహ్మయజ్ఞము, ప్రణవాది మంత్రజపము, మోక్షశాస్త్రాధ్యయనము అను నట్టి యర్థములు సంప్రదాయానుగతములు గాని, కీత్, మాక్సుముల్లర్ మున్నగు పాశ్చాత్య పండితులు చెప్పునట్లు "తనకు దాను వల్లెవేసికొనుట" యని మాత్రమే అర్థము కాదని వారి వాదము సప్రమాణముగ నిరసింపబడినది.

స్వాధ్యాయము ఆత్మచికిత్సకము; తపోరూపము. 'తపో హి స్వాధ్యాయః'. పరమాత్మను దర్శించుటకు స్వాధ్యాయ యోగములు చక్షుః స్థానీయములు; నారద వ్యాస వాల్మీకాది మహర్షు లందఱు స్వాధ్యాయ తపో నిరతులే; కాన స్వాధ్యాయము పరమాత్మ తత్త్వావబోధన క్షమ మనియు నిట జక్కఁగ నిరూపింపబడినది.

స్వాహా స్వధా వషట్ పద ప్రకరణము

దిగ్దేశ కాలాద్యనవచ్ఛిన్న మగు బ్రహ్మ స్వాత్మరూపము; తాదృ గాత్మస్వరూప ప్రతిపత్తిహేతువు గాన వేదము స్వాధ్యాయ మని పైన జెప్పబడినది. స్వాధ్యాయ పదోద్దిష్టమగు బ్రహ్మాత్మైకత్వ ప్రతిపత్తి సిద్ధించుటకు ప్రతిబంధనివృత్తి యావశ్యకము. శ్రుతి విహిత దేవ పితృకర్మా ద్యనుష్ఠానాదుల వలన గాని ప్రతిబంధములు తొలగవు.

స్వాహా, స్వధా, వషట్ శబ్దములు వైదిక దైవ పిత్ర్య కర్మాద్యనుబద్ధములు. ఇంతియే కాదు. మాయా (హ్రీం) బీజాదుల వలె మహామహిమాన్వితములై యుపాసనాది రూప తంత్రానుబద్ధములు నగును. కాన నీ స్వాహాది పదములు శాస్త్రీయ కర్మోపాసనా యోగాదుల కుపలక్షకములు. ఏత దుపలక్షిత కర్మోపాసనా యోగాద్యనుష్ఠానములు ప్రతిబంధ నివృత్తిద్వారా బ్రహ్మాత్మైకత్వ ప్రతిపత్తి ప్రయోజకములు కాగలవు. అట్టి కర్మాద్యనుష్ఠానావశ్యకతను సూచించుట కయియే స్వాధ్యాయ పద ప్రకరణానంతరము స్వాహా-స్వధా-వషట్ శబ్దప్రకరణము ఉపక్రాంతము లయినవి.

స్వాహా, స్వధా, స్వాధ్యాయశబ్దములకు సాదృశ్యము కలదు. 'స్వం అధ్యయనం స్వాధ్యాయః; స్వం ఆహ స్వాహా; స్వం దధాతి స్వధా'. — ఆత్మవిషయకము—అను నర్థ మనుగతమై యీ పదములయందు గన్పట్టును. స్వాహా, స్వధా, వషట్ శబ్దములు హవిర్దానవాచకములై కర్మానుష్ఠానావశ్యకత బోధించు మంత్రములు. హవిస్సులయందును, యజమానునియందును దివ్యత్వము నాపాదించెడి మహిమాన్వితమంత్రములు. ఇంతే గాదు. ఇవి వాగ్వాచకములు — వేదవాచకములు, పరదేవతావాచకములును నగును—అను విషయముగూడ నీ ప్రకరణములందు నిరూపింపబడినది.

స్వాహా

స్వాహాకారపూర్వకముగ దేవతలకొఱకై చేయబడు హవిఃప్రక్షేపమునకును, ప్రక్షిప్యమాణ హవిర్ద్రవ్యమునకును ఆహుతి యని పేరు. ఇంతియే కాదు. ఆహుతి శబ్దమునకు దేవతాహ్వానరూప విశేషార్థమునుగలదు. ఆయాహుతి స్వర్గమునయజమానుని కొఱకై వెలయుచు నాతని నాహ్వానించునది; స్వాహాకారసంబంధముచేతనే అగ్ని— యజమాన— స్తుతివాక్— హవిస్సుల (ఆహుతుల) యందు దివ్యత్వము సిద్ధించును. అగ్నీంద్రాదిదేవతలకు దేవతాశరీరము, భౌతికశరీరము రెండును గలవు-వారు పరోక్షప్రియులు—ఇత్యాది విశేషాంశము లీ ప్రకరణమున సప్రమాణముగ వివరింపబడినవి.

'స్వకీయా వా గాహ; స్వయం సరస్వతీ ఆహ; స్వో మహిమా ఆహ; సుఆహ; స్వం ఆహ- అని యీ విధముగ స్వాహాపదమునకు పెక్కునిర్వచనములు, తద్గత విశేషములు నిందు చక్కగా ప్రదర్శింపబడినవి. స్వాహాశబ్దము నిపాతరూపము. ప్రకరణానుసారముగ ప్రోక్షణా ద్యనేకార్థముల బోధింపజాలినది—యని 'కృష్ణో స్యాఖరేష్ఠో౽గ్నయే త్వా స్వాహా' (తై. సం. 1-1-11-1). —అను మంత్రవ్యాఖ్యాన సందర్భమున భాష్యకారులు వివరించిరి. మంత్రాంతర సంబంధము లేకయే స్వాహా శబ్దము కల్యాణార్థ బోధకము కాగలదు. కాననే కొన్నియెడల కేవల స్వాహా శబ్దముతో హవిర్దానాదులు చేయుటయు సంప్రదాయానుగతమై కానవచ్చుచున్నది.

స్వధా

పరాదేవత యగు స్వాహాదేవియే పితృయజ్ఞములందు స్వధారూపిణి యగుచున్నది. స్వధయే పితరులకు వషట్కార స్థానీయము; స్వధాశబ్దము కేవలము హవిర్దానవాచకమే కాదు; క్రియావాచకము; అన్నవాచకము; అన్న మనగా భోగ్యము; దృశ్యమగు బ్రహ్మాండ మంతయు భోగ్యమే; కాన సర్వజగ దుపలక్షకము. ఇంతియే కాదు. స్వధ యన పారమేశ్వరశక్తి (మాయాశక్తి, అవిద్య); చిద్రూపుడగు పరబ్రహ్మ; అగ్ని వాయు సూర్యులు; భోగము; భోగాయతన మగు అన్నమయ దేహము; పరలోక యాత్రల యందు జీవు ననుగమించి వచ్చు దేహాంతరారంభక విద్యా కర్మ-పూర్వప్రజ్ఞలు; ఉదకము (స్వం నారాయణం దధాతీతి స్వధా ఉదకమ్); ప్రాణధారణ

శక్తి — ఇత్యాద్యర్థముల బోధించునది - యనుచు తదర్థావగమ్యమాన విశేషాంశము లిందు సప్రమాణముగ ప్రదర్శింపబడినవి.

స్వధాశబ్దవాచ్య లగు అగ్నివాయ్వాదిత్యులు శ్రాద్ధదేవు లట ! వారే పితృ, పితామహ, ప్రపితామహ స్వరూపులు. శ్రాద్ధకర్మలయందు వారు తృప్తు లయి శ్రాద్ధకర్తలకును, ఆ యా లోకములయం దే రూపములతో నున్నను తత్పితరులకును తృప్తిని గల్గింతురట ! పితృకర్మలయం దిట్టి రహస్యాంశము లిట జక్కగ నిరూపింపబడినవి. స్వాహా స్వధాశబ్దములు పుంలింగమున పరమేశ్వరవాచకములుగ ప్రసిద్ధములు.

వషట్

"పరిణమ్య ఋగ్యజుః సామ్నే స్వాహాయై చ స్వధాయ చ ।
వషట్కారాత్మనే చైవ తుభ్య మర్థాత్మనే నమః॥"

పరమేశ్వరుడు శబ్దార్థాత్మకుడు, వషట్కారాత్మకుడు—అని యిట వర్ణింపబడినాడు. కాన స్వాహా స్వధా శబ్దముల వలెనే వషట్కార మీశ్వర వాచకము నగును. ఆశ్రావయ, అస్తు శ్రౌషట్, యజ, యేయజామహే, వషట్-అను నైదును యాగశరీరము నిష్పన్న మగుటకు ప్రధానములయిన మంత్రములు. యాగము నందు వినియోగింపబడెడి యితర మంత్రజాల మంతయు వస్త్రాలంకారాది స్థానీయము. అట్టి యీ మంత్రముల యర్థవిశేషములు, మాహాత్మ్యములు నిట జక్కగ వివరింపబడినవి.

వౌ (ఆదిత్యః) షట్ (ఋతవః) = వౌషట్,—వాక్ (ఆదిత్యః) షట్ (ఋతవః) = వషట్, వాక్ (శ్రుతిరూపా) షట్ (అంగాని) = వషట్,—సర్వం వశం కరోతీతి వషట్ - ఇత్యాద్యనేక నిర్వచనముల ననుసరించి వషట్ అనగా హవిర్దానవాచకమగు మంత్రమే కాక షడంగోపేత వేదవాక్కు, పరదేవత, షడృతుప్రతిష్ఠితు డగు ఆదిత్యుడు, ఋతు (ఋత్విజ) ప్రతిష్ఠిత మగు వేదవాక్కు, హవిస్సుల వహించెడి దేవపాత్రము, ఓజ స్సహ శ్శక్తి సంపన్నము లగు వాక్ప్రాణములు, ఆశ్రావయేత్యాది మంత్రపంచకముచే హూయమాను డగు విష్ణువు, జగత్తును తనవశమున నుంచుకొను

పరమేశ్వరుడు, ఛందస్స్వ డగు ప్రజాపతి—అని యీ రీతిగ వివిధార్థములు, తదర్థావగమ్యమాన విశేషాంశములు నిం దెన్నియో సప్రమాణముగ వివరింపబడినవి. వషట్-శబ్దోచ్చారణపూర్వక హవిర్దానముచే నాదిత్యానుగ్రహమున సర్వర్తు సంపదలు గలుగగలవు—అని యిట వివరింపబడుట గమనార్హము.

ఇట్టి యీ స్వాహా, స్వధా, వషట్, హంతకారములు వేదరూప వాగ్ధేను స్తనము లనుచు వీని ప్రాశస్త్యము శ్రుత్యనుగుణముగ వర్ణింపబడినది. ఈ పదములకు పాశ్చాత్యులు చేసెడి వ్యాఖ్యలు పదనిర్వచన మర్యాదానుగతములును సంప్రదాయానుగతములును గావని యిట చక్కగ నిరూపింపబడినవి.

త్రయీపద ప్రకరణము

కర్మాద్యనుష్ఠానముల ద్వారా ప్రతిబంధములు తొలగించి తుదకు బ్రహ్మాత్మైక్య ప్రతిపత్తిని సిద్ధింపజేయునట్టిది వేద మని పై ప్రకరణము వలన దెలిసినది. ఇక త్రయీశబ్దము ఋగ్యజుస్సామ మంత్రావచ్ఛిన్నమై యనంతశాఖాసంమితమైన వేదరాశిని బోధించుచునే వేదగతశాఖలన్నియు నేకార్థసమవేతములు అనెడి యజ్ఞార్థమును దెలియచేయునది యని యీ ప్రకరణమువలన దెలియనగును. త్రయః అవయవాః యస్యాః సా త్రయీ, ఋగ్యజుస్సామరూప మగు నవయవ త్రయముతో నొప్పునది—యని యర్థము. ఇట్టి యవయవములతో భాసిల్లుట యన్ని వేదశాఖలయందును గలదు. కాన కృత్స్నవేదరాశియే గాక ప్రతి వేదశాఖయు త్రయీపే యగును. అవయవములగు శాఖలు అవయవి యగు శాఖికి ఉపకారకము లగుట స్వభావము. వృక్షగత వివిధశాఖలు విభిన్నధర్మములతో నొప్పక సమాన ధర్మములు గలి వృక్షమున కుపకారకము లగును. అట్లే విభిన్నవేదశాఖలును విభిన్నార్థప్రతిపాదన స్వభావము గలవి కావు. ఏకార్థ సమవేతము లని చెప్పుట యుక్త మని త్రయీశబ్ద పరిశీలనముచే దెలియనగును. బాదరాయణమహర్షియు 'గతి సామాన్యాత్'—అను బ్రహ్మసూత్రముచే నీ విషయమును నిరూపించినాడు. ఇట్లు శాఖలన్నియు నేకార్థసమవేతములే కాని విభిన్నతాత్పర్యకములు గావని యంగీకరింపవలసియుండుటచే నీశాఖలు భిన్నకర్తృకములై యుండియుండు ననెడి పాశ్చాత్యుల కల్పనలకు తావులేదు. ఇట్టి మహార్థ బోధనసమర్థము త్రయీశబ్దము.

త్రయీపదము వేదశాఖావాచకము, వేదత్రయవాచకము, వేదసామాన్యవాచకము నగుట గమనార్హము.

"అథర్వవేదము ఋగాది వేదత్రయ రచనానంతరకాలిక రచన; దానికి మొదట వేదత్వమే లేదు; తరువాత కల్పింపబడినది"- అని యిట్లు బ్లూమ్‌ఫీల్డు, రాధాకృష్ణన్ మున్నగు చారిత్రికులు చేయుకల్పనల నిరసించి త్రయీ స్వరూపమును శ్రుత్యనుగుణముగ నిరూపించుటకై యీ ప్రకరణము ప్రధానముగ నుపక్రాంతమైనది. "ఋచః సామాని జజ్ఞిరే" ఇత్యాది మంత్రముల వలనను, 'ఇతి వేదాస్త్రయ స్త్రయీ' యనెడి నిఘంటు వచనముల వలనను, యజ్ఞం వ్యాఖ్యాస్యామః 'స త్రిభి ర్వేదై ర్విధీయతే'- ఇత్యాది కల్పసూత్రముల వలనను వేదత్రయమునకే త్రయీవ్యవహారము-అని యాపాతముగ గలిగెడి శంక యిట సప్రమాణముగ నిర్మూలింపబడినది. శ్రుతి గత వివిధశాఖల యందును, అథర్వవేదమునందును కొన్ని యెడల వేదత్రయప్రశంసయు మఱికొన్ని యెడల వేదచతుష్టయప్రశంసయు నుండుటచే వేదత్రయ బోధకవాక్యములు వేదచతుష్ట్వ నిషేధపరములు కాజాలవు; స్మృతి పురాణేతిహాస కావ్యాదులయందెచటగూడ చతుర్థవేద నిషేధమును గూర్చిన ప్రసక్తియే లేకపోగా చతుర్వేద ప్రశంస బహుళముగ గలదు,- అను విషయములు సోదాహరణముగను సరసముగను నిరూపింపబడినవి.

సమస్తవేదములయందును మంత్రజాతమంతయు ఋక్-యజుః-సామ రూపమున త్రివిధముగనే గలదు. ఇట్టి మంత్రరూప-అవయవ త్రైవిధ్యమునుబట్టి కృత్స్నవేదరాశికిని, తద్గతప్రతిశాఖకును త్రయీ యని వ్యవహారము. యజ్ఞ ప్రయోగములందు ప్రధానులగు ఋత్విజులు నలుగురు. హోత; అధ్వర్యుడు; ఉద్గాత; బ్రహ్మ. ఏతత్కర్తవ్యార్థములను సాకల్యముగ బోధించుట కయి ప్రవృత్తము లయినవి నాల్గువేదములు. ఇట్లు మంత్రత్రైవిధ్యమును బురస్కరించుకొని, త్రయీత్వవ్యవహారములు, చతుర్విధ ఋత్విక్కర్తవ్యార్థరూప ప్రమేయ భేదమును బట్టి చతుష్ట్వవ్యవరహామును-ఇట్లు ద్వివిధ వ్యవహారము వేదమునకేర్పడినది. అందుచే త్రయీత్వవ్యవహారమును బురస్కరించుకొని నాల్గవదియగు నథర్వవేదము వేదము కాదనుట యత్యన్త మసమంజసము. ఈ విషయ మిట చక్కగా నిరూపింపబడినది.

అథర్వవేదమునకు బ్రహ్మవేద మని పేరు. యజ్ఞప్రయోగములలో బ్రహ్మ యను ఋత్విజునకు సంబంధించిన విషయజాత మంతయు సాకల్యముగ నిందు ప్రతిపాదింపబడినది. అథర్వవిదుడే రాజపురోహితుడు కాసర్హుడు. కాన యజ్ఞ ప్రయోగాదులయందు మూడువేదములకే వినియోగ మని యనుట పొసగదు. అథర్వవేదమునకు భైషజ్యవేద మనియు పేరు. యజ్ఞగత వైకల్యరూప రోగ విశేషములకు చికిత్సకు దగు బ్రహ్మకు సంబంధించిన వేదము గనుక భైషజ్యవేద మనియు, బ్రహ్మవేద మనియు వ్యవహారము. రక్షః పిశాచ శత్రు రోగాద్యుపద్రవములనుండి కాపాడునది (క్షతాత్ త్రాయతే), అనగా తన్నివర్తనక్షమ సిద్ధమంత్ర సంపన్నము గాన నిది క్షత్రవేదము. సంసారరోగ నివర్తక బ్రహ్మతత్త్వ ప్రతిపాదకము గావునను బ్రహ్మవేదము-అని యిట్టి వేదనామౌచిత్యాదివిచారమువలనను నథర్వవేదముయొక్క వేదత్వ మవగతము గాగలదని పలుతీరుల నిట వివరింపబడినది.

అథర్వుడన ప్రజాపతి. తత్పుత్రులైన వసిష్ఠాదు లందఱు నథర్వాభూతులు. వారిచే దృష్టమైనదియే యథర్వవేదము. అంగిరసులచేతను భృగువులచేతను దృష్టమగుటచే నథర్వాంగిరోవేదము, భృగ్వంగిరోవేద మనియు వ్యవహారము. అంతియే కాని చారిత్రికు లూహించినట్లిది కొన్ని తెగలవారి రచన యనుట యనుచిత మనియు నిట సప్రమాణముగ వివరింపబడినది. 'గద్య పద్య గీతాత్మక రచనాశాలిత్వాత్ త్రయీ; కర్మ ఉపాసనా జ్ఞానరూప కాండత్రయసంమితత్వాత్ త్రయీ; త్రాయతే అనర్థవ్రాతాత్ ఇతి త్రయీ'—అను నిట్టి నిర్వచనములు ఋగ్యజుః సామవేదముల యందు వలెనే నాల్గవదియగు నథర్వవేదమునందు ననుగతములుగాన అథర్వవేదముగూడ త్రయీపద వ్యవహార్యము కాగలదనుట యుపపన్నమే యగును.

కవి - కావ్య ప్రకరణము

ప్రతిబంధనివృత్తికై ధర్మానుష్ఠానావశ్యకతను బోధించెడి వేదము బహుశాఖా సంమితమైనను భిన్న భిన్నార్థప్రతిపాదన తత్పరము కాదు; ఏకార్థసమవేతము-అని పై ప్రకరణము వలన దెలియును. అట్టి వేదము సర్వార్థావభాసక మగుటచే సర్వజ్ఞము కావున నప్రామాణ్య శంకాకళంకితము కాదు; కాన నది కవిశబ్దవాచ్య మగును

మఱియు కర్మోపాసనాదులద్వారా చిత్తమునకు సరసత నాపాదించుచు చమత్కారముగ రమణీయతమ బ్రహ్మరస ప్రతిపాదకము నగుటజేసి కావ్యమును నగు ననెడి యర్థమును సూచించునవి కవి-కావ్య శబ్దములు. అట్టి కవి-కావ్య శబ్దార్థ నిర్వచనాదు లీ ప్రకరణమున వివరింపబడినవి.

శ్రుతియే 'ఏతే వై కవయః య దృషయః' — ఇత్యాది వాక్యములచే తనను కవి యనియు, 'త్రయీ వై విద్యా కావ్యం ఛందః'—ఇత్యాది వాక్యములచే కావ్యముగను నిర్దేశించుకొనినది. ఇంతేకాదు. తాను ప్రభుసంమితముగ వరలుచునే 'య స్తిత్యాజ' ఇత్యాది మంత్రములచే తనకుగల సుహృత్సంమితత్వమును, 'ఏవా హ్యస్య సూనృతా'— ఇత్యాది మంత్రములచే తనకుగల కాంతాసంమితత్వమును గూడ వెల్లడి చేసికొనినది. అందుచే వేదములు ప్రభుసంమితములు మాత్రమే యనెడి వాద మాపాత రమణీయము మాత్రమే. 'మాతా రుద్రాణాం', "కవిః కావ్యేన పరిపాహి రాజన్" — ఇత్యాది మంత్రార్థముల వివరించుచు వేదమే కొన్ని యెడల ప్రభు సంమితముగను, మఱికొన్ని యెడల సుహృత్ సంమితముగను, నింకొకయెడ కాంతా సంమితముగను నా యా యధికారి భేదమునుబట్టి సాక్షాత్కరించుచుండు నని సప్రమాణముగ నిట వివరింపబడుట గమనార్హము.

వేద మేకార్థసమవేతము, సచ్చిదానందలక్షణ పరతత్త్వ (రస) వర్ణనమునందు పరమతాత్పర్యము గలది. ఆ తత్త్వము సర్వజ్ఞము. ప్రధానముగ కవిపదవ్యపదేశ్యము. తత్ప్రతిపాదన తత్పర మగుటజేసి ప్రధానముగ వేదము కావ్యపదవ్యపదేశ్యము (కవేః పరమాత్మన ఇదం కావ్యమ్). కాన వేదమునకుగల కావ్యత్వ మౌపచారికము కాదు: ముఖ్యము—అని నిరూపించుటకై యిట నీ గ్రంథకర్తలు కావ్యలక్షణములను, కావ్య జీవితమును గూర్చిన వివిధవాదములను బరామర్శించిరి. నిష్కృష్ట కావ్యలక్షణ లక్షితము వేదమే; రసాత్మక రమణీయతమ (కమనీయ) హ్లాదైకమయ బ్రహ్మవస్తువు ఇందలి ప్రధానవస్తువు. కాన వేదమే పరమోత్తమ కావ్యము; చారిత్రికు లీ సంప్రదాయానుగత రమణీయతమ కావ్యాత్మ యగు పరమరసము నెఱుగరు — అని యీ ప్రకరణమువలన సప్రమాణముగ నిరూపింపబడుట ప్రశంసార్హము.

'కవృ వర్ణనే, పదయో రభేదః, కవతే చాతుర్యేణ వర్ణయతీతి కవిః'— అనియు కవిశబ్ద నిర్వచనము. అతీంద్రియమై సచ్చిదానందాత్మకమైన పరతత్త్వమును వర్ణించు చాతుర్యము వేదమునకే గలదు. అన్యుల కది యసాధ్యము. అనన్యసాధారణ కవిభావసంపన్నము వేదమే కాన వేదమే కవి యని చెప్పదగినది.

భారతీపద ప్రకరణము

వేదము సర్వజ్ఞము; కవి; అధికారిభేదము ననుసరించి ప్రభు, సుహృత్, కాంతాసంమితత్వ రూపములతో సాక్షాత్కరించు ఆదికావ్యము-అని పై ప్రకరణమున వివరింపబడినది. అట్టి యీ వేదకావ్యము సర్వలోకవ్యాపి మానవాది సర్వజీవో ద్ధరణకై ప్రవృత్తమగుట భారతీపదము సూచించుచున్నది. అట్టి భారతీస్వరూప మీ ప్రకరణమున వివరింపబడినది.

భారత మన లోకము. ప్రజలకును భారతు లని సామాన్యవ్యవహారము. లోకమును లేక ప్రజను ఉద్ధరించుటకై ప్రవృత్తమగుటంజేసి వేదమునకు 'భారతీ' యని యన్వర్థనామము. స్వప్రకాశ సంవిద్రూప మగు చిద్ఘనవస్తువునకు 'భా' యని పేరు. అట్టి పరతత్త్వమును ప్రతిపాదించుటయందు రతి (తాత్పర్యము) కలది యగుటజేసియే వేదవిద్యకు 'భారతీ' యని పేరు. అట్టి వేదవాణిని తద్ద్వారా పరతత్త్వమును ఆరాధించువారు భారతు లనబడుదురు. అంతియేగాని 'భరతు లనెడి యొక జాతివారిచే నారాధింపబడు అగ్ని భరతుడు; ఆ తెగవారిని రక్షించెడి యొక దివ్యశక్తి భారతి; భరతు లన ఒకపురోహితవర్గమువారు' అని యీ రీతిగ చెప్పబడెడి చారిత్రికకల్పనలు సంమంజసములు గావని యిట ప్రదర్శింపబడినది.

పృథివ్యంతరిక్ష ద్యురూప లోకత్రయదేవతలు అగ్ని (వసు)-వాయు (రుద్ర) ఆదిత్యులు—ఆ దేవతాత్రయమునం దనుగతయైయుండు వాగ్దేవతయే 'ఇడా-సరస్వతీ-భారతీ' యను నామములతో వ్యవహరింపబడుచుండును. ఈముగ్గురు దేవతలకు నియతసాహచర్యముగలయట్లు యాగాంగభూత మంత్రములయందు గానవచ్చుచున్నది. అందు ఇడాదేవత దేవతాహ్వానకారిణీ, కర్మమార్గోపదేశకర్త్రి, యజ్ఞనేత్రీ; సరస్వతి బుద్ధిసంస్కారకారిణీ, సంశయ విపర్యయాది మనోదోష నివారిణీ, మానస (ఉపాసన

తత్త్వప్రకాశిక: భారతి భరతరూప-ఆదిత్యానుగత ; జ్ఞానతత్త్వ ప్రకాశిక. ఆదిత్యుడు రసము నాదానించి సంస్కరించి యందించు దేవత. అట్లే సర్వతోవ్యాప్తమై యున్న బ్రహ్మామృతానంద రసము నాదానించి (ప్రతిపాద్యవస్తువుగా స్వీకరించి) తన్నారాధించు జనులచే నా రసము నాస్వాదింపజేసెడి వేదవాణి భారతి. ఇంతియే గాదు ; బిభర్తి సర్వ మితి భారతః' అను వ్యుత్పత్తి ననుసరించి అగ్నివాయ్వాదిత్యులును భారతులు. జగద్భరణక్షమము లగుటంజేసి తద్దీప్త్యాదులకును 'భారతీ' యను నామ మొప్పును. భరతు డనగా నటుడు. పరమేశ్వరుడును మహానటు డగుటచే భరతుడు. 'యథా హి భరతో వర్ణై వర్ణయత్యాత్మన స్తనుమ్। నానారూపాణి కుర్వాణ స్తథాఽత్మా కర్మజా స్తనూః॥' అను యాజ్ఞవల్క్యవచనమున నీ విషయము వ్యక్తము చేయ బడెను. సర్వజగద్భరణకర్త గావునను పరమాత్మ భరతుడు. తత్ప్రతిపాదకమగుట చేతను వేదవాణి భారతి—ఇత్యాది విశేషాంశము లెన్నియో యీ ప్రకరణమున వివరింపబడి చారిత్రికుల వాదములు చక్కగ నిరసింపబడినవి.

ఛందః పద ప్రకరణము

సర్వజ్ఞ మగు వేదకావ్యము మానవాది సర్వజీవోపకారార్థమై ప్రవృత్తమయి నటుల భారతీపద ప్రకరణము వలన దెలిసినది. ఆ కావ్యము ఆత్మానందరూప మగు రసమును నిగూఢముగ నాచ్ఛాదించుచు తత్స్వరూప విచారపరులై యాదరముతో తన నారాధించు ధీరులకు రసలక్షణ మగు నమృతము నభివ్యక్తము చేయు నని ఛందఃపదము సూచించును. కావ్యకన్య, రసజ్ఞులగు సహృదయుల హృదయముల యందే సరసత నాపాదించుట ప్రసిద్ధముగదా ! అట్టి త్రయీవిద్యారూప కావ్యము యొక్క ఛందస్త్వ మీ ప్రకరణమున వివరింపబడినది.

ఛందస్త్వ మొక మంత్రభాగముననే గాక మంత్రబ్రాహ్మణాత్మక కృత్స్న వేదరాశి యం దంతట వ్యాప్తమై యున్నది. అందుచే 'గాయత్ర్యాది ఛందః సంబంధముగాని ద్రష్టలగు ఋషుల సంబంధముగాని లేనందునను, మంత్రవ్యాఖ్యాన రూపము లగుటచేతను, కాత్యాయనుడు తప్ప తదితర ఋషిసంమతము కాకపోవుట చేతను బ్రాహ్మణములకు ఛందస్త్వము (వేదత్వము) లేదు-అనెడి శ్రీ దయానందాదుల వాదము లిట ప్రస్తావింపబడి కోశ, దర్శన, శ్రౌతగృహ్యాదిసూత్ర, పురాణాది

వాక్యోదాహరణ పూర్వకముగ ఖండింపబడినవి. వేదస్వరూప విజ్ఞాన విశేష సంపాదకములగు సమాధానప్రక్రియ అత్యంతమనోహరముగ, సువిపులముగ నిందు ప్రతిపాదింపబడినవి.

నిరుక్తశాస్త్రము నందలి కౌత్సుని పూర్వపక్షము నాధారముజేసికొని మాగ్డొనెల్ పండితుడు చేసిన యాక్షేపము లన్నియు సప్రమాణముగ నిట నిరసింప బడినవి.

'ఛాదనాత్ ఛందాంసి' - మృత్యువునుండి యాచ్ఛాదించి కాపాడునవి; 'ఛందయన్తి ఆహ్లాదయన్తీతి ఛందాంసి' - లోకోత్తరాహ్లాదకర రమణీయవస్తు (బ్రహ్మ) ప్రతిపాదకములు; 'స్వచ్ఛందయోగేన పరమాత్మని ప్రమాణం భవంతీతి ఛందాంసి' - స్వేచ్ఛగా (అన్యనిరపేక్షముగా) పరమాత్మతత్త్వ ప్రతిపాదనతాత్పర్యము గలవి గనుక వేదములు ఛందస్సులు. ఛాదనార్థమును బురస్కరించుకొనియే గాయత్ర్యాది ఛందస్సులకును ఛందస్సు లని వ్యవహారము. ఛాదన మన యావరణము. పారమేశ్వరతత్త్వము నావరించియుండు పారమేశ్వరశక్తియు ఛందఃపదవాచ్యమే. స్వప్రతిపాద్యమగు (పరమలక్ష్యమగు) పరతత్త్వమును తత్ప్రతిపాదక శబ్దరూపమున నంతరాంతరముల నుంచుకొని యాచ్ఛాదించి యుంతి విరాజిల్లునదిగాన శ్రుతియు ఛందఃపదవాచ్యము, యథాశాస్త్రము కర్మోపాసనాది మార్గములద్వారా తన నారాధించుచు శ్రవణాదులచే తనసన్నిధిని జేరగల్గిన పూతాత్ములగు ధీరులకు ఆ శ్రుతి తన యంతరాంతరముల నాచ్ఛాదింపబడియున్న రసనిధి నభివ్యక్తము జేసి తాను విశ్లథవ్యాపారయై 'యత్ర వేదా అవేదాభవన్తి'- యను స్థానమున పరమాద్వైతభావమున సాధకుల స్థాపింపగలదు. అట్టిది వేదము. అదియే ఛందస్సు. అదియే అమృతాశ్రీః. తద్విచారమే యిట సునిపుణముగ గావింపబడినది.

గ్రంథకర్తలు - రచన

ఈ గ్రంథకర్తలు హరివంశజులు. వీరి వంశము ఒక విశిష్ట సదాచార సంపన్నము, శిష్టజన విభూషితము నైన సద్వంశము. శ్రీకృష్ణవేణీ మహానదీ పశ్చిమతీరస్థమైన చిలుమూరు గ్రామము వీరి పూర్వులకు నివాసస్థానము. ఈ గ్రామము పురాణ

ప్రసిద్ధ ఉభయ రామేశ్వర క్షేత్రాంతర్గతము. వీరు శ్రీ సీతారామ ప్రతిష్ఠిత "రామేశ్వర" సేవాతత్పరులై జీవితములను సార్థక పఱచుకొనుచుండిరి. వేదోక్తసత్కర్మానుష్ఠానములయందు వీరు బద్ధహృదయులు. వీరి వంశములో నెందఱో శ్రౌతములగు జ్యోతిష్టోమాది సోమయాగములును, స్మార్తములగు వైశ్వదేవాదిపాకయజ్ఞములను గూడ నాచరించిన పుణ్యాత్ములు గలరు. "శైవా వయం న ఖలు తత్ర విచారణీయం, పంచాక్షరీ జపపరా నితరాం తథాఽపి, చేతో మదీయ మతసీకుసుమావభాసం స్మేరాననం స్మరతి గోపవధూకిశోరమ్" అన్నట్లీ వంశజులు శివారాధనాసక్త హృదయులయ్యును వీరి హృదయములు శ్రీహరి సంస్మరణానుషక్తములు. కాన వీరివంశము హరినామాంకితమైనది కాబోలు!

ఈ గ్రంథకర్తల ప్రపితామహులగు శ్రీహరి లక్ష్మీనారాయణ యజ్వ యొకపుడు తటాక నిర్మాణార్థము భూమిని త్రవ్వుచుండ సుందర శిలామయ వేణుగోపాల విగ్రహము లబ్ధమయ్యెనట! వారా విగ్రహమును చిలుమూరు ప్రక్కనేయున్న తమ ప్రకృత నివాసస్థానమగు ఈపూరు గ్రామమున బ్రతిష్ఠించి భక్తితో నారాధింపసాగిరి.

ఏతద్గ్రంథకర్తల మాతాపితరులు దుర్గాంబా సోమయాజులు. శ్రీ సోమయాజులు గారు శ్రీ వేణుగోపాల దేవునికి ఆలయప్రాంగణ నిర్మాణముచేసి తత్సేవాతత్పర హృదయులై కాలముగడుపుచుండెడివారు. స్వామి నిత్యార్చనాదులకై పలయు క్షేత్ర సంపత్తినిగూడ సమకూర్చి తమజీవితము ధన్య మొనరించుకొనిరి.

ఈ పుణ్యదంపతుల సంతానమే యీ గ్రంథకర్తలు. వీరి పెనతండ్రి రామశాస్త్రి గారు సారస్వతప్రియులు: ఈ పెద్దల యాశీస్సులచే నీ రచయితలకు బాల్య మాదిగా విద్యాసముపార్జనాసక్తి, గురుదేవతా ప్రాజ్ఞ సంసేవనా తత్పరతయు కలిగి వృద్ధి నొందినవి. వీరు బాల్య మాదిగా సంస్కృత భాషాభ్యసన పరులు. అందు కొందఱు ఉన్నత శాస్త్రవిద్య నార్జించి పట్టభద్రులగుటయే గాక స్వయంకృషితో హూణభాష యందును దేశీయ భాషలయందును బ్రావీణ్యము సంపాదింపగలిగిరి.

ఈ సోదరుల సౌభ్రాత్ర మెన్నదగినది. వీరు తమ తండ్రి తాతలవలెనే అనాది కాల ప్రవృత్త భారతీయ నాగరికతా మూలసూత్రమైన అన్యోన్య సహకార పూర్వక జీవనవిధానమును ప్రధానలక్ష్యముగ నెంచి ఆదర్శప్రాయమైన వర్తనముగలవారై

ఈ గ్రంథమును రచయితలు తమకులదైవ మగు శ్రీవేణుగోపాలుని పాదారవిందములం దర్పించిరి. గోవులన విద్యలు (వాక్కులు). గోపాలుడు వాని కధినేత. వేదవేద్యుడు గోపాలుడు. అట్టి శ్రీహరి రత్నరాశియగు నీ కృతిరత్నమును తన హృదయేశ్వరి (అమృతా శ్రీః)గా ప్రీతితో విస్ఫారితనేత్రుడై స్వీకరించెను.

'భారతీనిరుక్తి' హరిసోదరులను శ్రీశ్రీ జగద్గురు కాంచీ కామకోటిపీఠాధీశ్వర శ్రీచన్ద్రశేఖరేన్ద్రసరస్వతీస్వామిపాదుల దివ్యానుగ్రహమునకు పాత్రములుగ నొనర్చెను. శ్రీజగద్గురువులు శ్రీవేదమాతను (శ్రీగాయత్రీపరదేవతా) మూర్తిని వీరి కనుగ్రహించి, తమ యామోదమును వ్యక్తపరచిరి. శ్రీవేణుగోపాల, శ్రీజగద్గురుమహాస్వాముల యనుగ్రహముచే వీరి పరిశోధనాసంస్థ యగు 'నిరుక్త భారతి'నుండి భారతీయనాగరికతా వికాసమునకు దోహదకారులగు నిట్టి యమూల్య గ్రంథము లెన్నియో వెలువడుగాత మని శ్రీవేదమాతకు కైమోడ్పులు చేయుచున్నాను.

"సత్యాస్సన్తు యజమానస్య కామాః"

యచ్ఛ్రుతి స్సర్వవిద్యాప్త్యై సర్వార్థాప్త్యై చ యత్స్మృతిః।
బ్రహ్మాత్మతాప్త్యై యద్బుద్ధిః కలయే తాం త్రయీం శివామ్॥

మచిలీపట్టణము
14-10-1971

కుప్పా లక్ష్మావధాని
(సాంగ స్వాధ్యాయ భాస్కర)

కవిసమ్రాట్, కళాప్రపూర్ణ, పద్మభూషణ, ఆంధ్రాస్థానకవి

డా॥ విశ్వనాథ సత్యనారాయణగారు

పరిచయము

ఈ గ్రంథము వ్రాసినవారు, నేను చాల ఏండ్లుగా విజయవాడలోనే యున్నాము. సుమారు ముప్పదియేండ్లుగా వారొక మహాగ్రంథము వ్రాయుచున్నారని, వైదికశబ్దముల మీద చాలపరిశోధన చేయుచున్నారని వినుటయే కాని నేను వారి యొద్దకుపోయి వారి పరిశోధనను తెలిసికొనవలయునని ప్రయత్నించినది లేదు. తరువాత కొన్నాళ్ళకు ఈ గ్రంథము పేరు 'హరినిరుక్తి' అని విన్నాను. చివరకు ఇది భారతీనిరుక్తి యైనది. ఈ గ్రంథమునందు వేద, ఋషి, బ్రహ్మ, ఆమ్నాయ-శ్రుతి, స్వాధ్యాయ, స్వాహా, స్వధా, వషట్ త్రయీ, కవి - కావ్య - భారతీ, ఛందః శబ్దములు వానిస్వరూపములు వానిరహస్యములు బహుగ్రంథపర్యాలోచనచేసి నిరూపింపబడినవి. ఈ గ్రంథమునకు 'భారతీనిరుక్తి' యని పేరు పెట్టబడినది. వీరర్థనిర్ణయము చేయుటకు చేసిన మహాప్రయత్నములో భారతీశబ్దము కూడ నున్నది. వీరికి భారతీ శబ్దార్థ నిర్ణయమునందు ఎక్కువ యభిమాన మేమో! అయినను హరి శబ్దమును వారు వదలిపెట్టలేదు. వారి యింటిపేరు "హరి" వారు. అందఱును పండితులు. ఇన్నియేండ్లు అందఱును తలాకొంచెము శ్రమయు పడి యీ మహా కార్యమును చేసిరి. ఈ గ్రంథము పండ్రెండు భాగములని చెప్పవచ్చును. ప్రతి భాగము మొదట వారే రచియించిన వేదమాతృస్తవ శ్లోకములు కలవు. ప్రతివాని లోను హరిశబ్దము గుంభితమై యుండును. ఆ శ్లోకములు మిక్కిలి రమణీయములుగా నుండును. మఱియు తత్తద్భాగములకు సూచకములుగాఁగూడ నుండును. అందుచేత 'హరినిరుక్తి' యన్నట్లే?

ఇంత ప్రయాసపడి చేసినప్పుడు ఎన్నిగ్రంథములు చూచియుండవలయును. ఇందుదహరింపబడిన గ్రంథముల సంఖ్యయే రెండువందలకు దాటి యున్నది. అన్నియు వేదములు, ఉపనిషత్తులు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, సూత్రములు, పురాణములు, వృత్తులు, భాష్యములు, వార్తికములు, కోశములు.

ఇంక వారి పాండిత్యమును గూర్చి యేమి చెప్పవలయును? ఇందులో నింకొక్క రహస్య మున్నది. వేదమో ఋషియో స్వాధ్యాయమో ఛందస్సో త్రయీశబ్దమో యేదో యొక శబమును తీసికొని దానిని గూర్చి సర్వంకషముగా వ్రాయవలయు నన్న ప్రయత్నమును సంకల్పించినచో ఆ గ్రంథములను చదివెడి లక్షణము వేఱు. ఆ శబ్దమును గూర్చి యెక్కడ నేమి వ్రాయబడినది? ఎట్లు వ్రాయబడినది? ఈ పరామర్శబుద్ధికి సర్వంకషముగా భాసింపనిచో నీపనిచేయుట సాధ్యము కాదు. ఇన్ని గ్రంథములలో తాము వ్రాయుచున్న యొక శబ్దముయొక్క యర్థమును నిరూపించుటకు ఎచ్చట నేది యున్నది? అన్న మతిబాహుళ్యము జ్ఞాపకశక్తియొక్క పరమార్థము, రెండును జతికూడవలయును.

ఈ గ్రంథము పేరు 'నిరుక్తి'. నిరుక్తము వేదాంగములలో నొకటి. యాస్కాచార్యులవారు వ్రాసిరి. పండితులకు తెలిసిన విషయమే: దుర్గాచార్యుడు దానికి భాష్యమును వ్రాసెను. అది నిరుక్తము. ఇది నిరుక్తి. అది క్తాంతము. ఇది 'క్తిన్' ప్రత్యయాంతము. క్తాంతము సామాన్యముగా భూతకాలమును గూర్చి చెప్పినను దానికి మూడు కాలములయందు ప్రయోగింపబడదగిన శక్తి యున్నది. అందుచేత నిరుక్తము - అన్నది వేదముయొక్క త్రైకాలికాబాధ్యార్థబోధకత్వము సూచించును. ఈ గ్రంథము వేదాంగము కాదు. అందుచేత నిరుక్తి. ఈ గ్రంథకర్తలయొక్క యౌచిత్యము ఇంత విస్పష్టమైన వైదికముగా నున్నది. వేదమాతను కొలిచెడివారి బుద్ధి యింకొకరీతిగా నుండునా? మఱియైనచో ఆ నిరుక్తమునకు ఈ నిరుక్తికి భేద మేమి? "యథా శబ్దలక్షణ పరిజ్ఞానమ్ సర్వశాస్త్రేషు వ్యాకరణాత్ ఏవం శబ్దార్థ నిర్వచన పరిజ్ఞానమ్ నిరుక్తాత్" — ఇవి దుర్గాచార్యులవారి మాటలు. శబ్దమునకు ప్రధానమైనవి యివి రెండే. మొదటిది శబ్దముయొక్క సూక్ష్మస్వరూపము. రెండవది అర్థనిర్వచన పరిజ్ఞానము. దుర్గాచార్యులు నిరుక్తవిషయములను ముప్పదియాఱు చెప్పినారు. అందులో ప్రధానమైనది యిది.

"సర్వాణ్యాఖ్యాతజాని కానిచి దేవానేకధాతుజాన్యపీతి మంత్రాణా మర్థవత్త్వ మనర్థవత్త్వం విచార్య శాస్త్రారంభప్రయోజనద్వారేణ అర్థవత్త్వావధారణమ్".

ఈ లెక్కను జూచినచో ధాతుజములు కొంత ప్రాముఖ్యమును వహించును. మంత్రములయొక్క యర్థవత్త్వము అనర్థవత్త్వము ననగా సందర్భమును బట్టి యర్థము చెప్పవలె నని యర్థము. దాని పేరే శాస్త్రారంభప్రయోజనము. ఈ నిరుక్తి యందు తాదృగ్లక్షణము కొంతవరకైన నుండవలయును గదా! గ్రంథము సావకాశముగా చదివినచో కొంతవఱకే కాదు; తత్తచ్ఛబ్దార్థ నిర్ణయము చేయుపట్లు. ఈ గ్రంథములో ప్రధానము శబ్దార్థనిర్ణయము చేయుట కాదు - శబ్దార్థ నిరూపణ చేయుటగా చెప్పవలె నేమో! కనుక నీ గ్రంథమునకు భారతీనిరుక్తి యని పేరు పెట్టుట మిక్కిలి సమంజసముగా నున్నది.

శబ్దమునకు రెండే ప్రధానవిషయములు — ఒకటి శబ్దస్వరూప నిర్ణయము; రెండవది శబ్దార్థనిర్ణయము. రెండవపని చేయుటయందు నిరుక్తము సమర్థమైనది. ఈ నిరుక్తి యా మార్గము ననుసరించుచున్నది. దీనియందు ఋషులు సమర్థులు. యాస్కుడు ఋషి. ఋషులే యెందుకు సమర్థులనగా దుర్గాచార్యులవారు ఇట్లు వ్రాసిరి. 'సాక్షాత్కృతధర్మాణః ఋషయో బభూవుః' వారు సాక్షాత్కృతధర్ములు. అందుచేత యాస్కుని కర్థము సాక్షాత్కృత మయ్యెను.

ఈ హరి సోదరులు మేము ఋషితుల్యుల మని యనలేము. అనేక మహా గ్రంథములు చూచి ఋషులును ఋషితుల్యులును నిరూపించిన మహార్థముల నొక చోట సేకరించిరి. తరువాతి తరువాతి శాస్త్రప్రవక్తలు మందబుద్ధుల ననుగ్రహించుటకు కదా ప్రవచనముచేసిరి. వీ రాపని చేసిరి.

వేదమునందు చాలవఱకు ధాతుజములైన శబ్దములే కలవు. వానిని యాస్కుడు ప్రపంచించెను. ఆ మార్గమున నితరులును చేయవచ్చును. కాని చేయ రాదు. ఎందుచేతననగా వీరు ఋషులు కారు గనుక. వేదములందు శబ్దములు బహుధా ధాతుజము లనగా ఆ ధాతువు లెచ్చటనుండి పుట్టినవి? ధాతువన్న శబ్దమున కర్థమేమి? ఈ శబ్దము-'డుధాఞ్'-ధారణపోషణయోః' అన్న ధాతువునుండి పుట్టినది. ధత్తే మిథః వ్యావర్తకం ధర్మమ్ — ధాతుః - భేదమైన ధర్మమును పరస్పరము

భేదమైనదాని నిది ధరించును. ధాతువనగా నిట్టిది. అనగా అదృశ్యము. దృశ్యము. రూపరహితము. రూపసహితము. ఇట్టి ధర్మములు పరస్పరము భేదించును. వాని రెంటిని ఈ ధాతువు ధరించును. ధాతువులు ఓంకార లక్షణము కలవి. వాయువునుండి పుట్టినవి. వాయువునం దున్నవి.

"బహస్యామ్ ప్రజాయేయ" అని బ్రహ్మ సంకల్పించి నప్పుడు పరాశక్తి యుదయించినది; ఆమె యుదయింపక పోయినచో నిర్గుణమైన బ్రహ్మపదార్థమునకు సంకల్పముచేసెడి శక్తియే యుండదు. శక్తి సంకల్పములు రెండును సమానము లైనవి. తరువాత సృష్టి జరిగినది. "ఆత్మన ఆకాశః ఆకాశా ద్వాయుః" ఇంచు మించుగా పరాశక్తి ఆకాశమునకు అధినేత్రియై కూర్చున్నది. ఆమెయే వాయువును సృష్టించినది. ఆ సృష్టించినప్పుడు ఆ వాయువును సశబ్దమైన దానినిగా నిర్మించినది. కనుక వాయువునందు శబ్ద మున్నది, వేదము లందులోననే యున్నవి. ఈ యనంతమైన యాకాశమునం దభివ్యాప్తమై యున్న వాయువునందు సర్వసృష్టియు నిమిడి యున్నది. ఓంకారము తల్లితోకూడి జన్మించినది. తక్కిన శబ్దములు తత్కారణములైన ధాతువులు వేదగతశబ్దములకు మూలములైన ధాతువులు ఆ వాయువునందే యున్నవి. అందుకనియే ధాతువునకు "ధత్తే మిథో వ్యావర్తకం ధర్మం" అన్న వ్యుత్పత్తి చెప్పబడినది. అందుచేతనే వేదమునందు బహుధా ధాతుజములైన శబ్దము లున్న వనుట.

కొన్ని శబ్దముల వ్యుత్పత్తిని (వ్యుత్పత్తి కాదు ఉత్పత్తి) విచారించినచో నీ రహస్యము తెల్ల మగును. అన్నిటిని విచారించుట సాధ్యముకాదు. అది భగవంతునకే తెలియును. అన్నియు సాధ్యము కావు. ఈ యుత్పత్తిని విచారించుట యనగా నొక సామాన్యమైన మార్గ మున్నది. ఆ మార్గ మిది.

శబ్దగుణకమైన యాకాశము కలదు కదా! ఇది వాయువుద్వారా ప్రేరేపింప బడుచున్నది. "హృత్" అన్న శబ్ద మున్నది. ఇందు హకార ఋకారములు కలవు. ఎవనికి వాడు హకారము నుచ్చరించి చూచుకొన్నచో తెలియును. ముఖము పూర్తిగా వివృతమై గొంతుయొక్క లోపలినుండి యీ హకారము వచ్చును. ఒకటి యాకాశము; రెండు నాభినిర్గతమైన వాయువు—ఈ హకారోచ్చారణకు మూల మగుచున్నవి. తరువాత ఋకార ముచ్చరింపబడవలయును. నాల్కయు

వదన గుహోపరి భాగమును సూక్ష్మముగా కలిసినగాని యిది యుచ్చరింపబడదు. అనగా హకారము వినిర్గమన సర్వలక్షణము కలదియైనచో ఋకారము దానికి నిరోధక మగుచున్నది. ఎందుకు కావలయును? ఈ రెండును కలిసి ఈ సర్వ శబ్దోచ్చారణ మూలహేతువైన హృదయమును చెప్పవలయును. ఇది మఱియొకదానిని చెప్పలేదు. హృత్ ధాతువే సర్వధాతులక్షణమును చెప్పునట్టిది. ఈ 'హృ' అన్న యక్షరము-పండితులు శబ్దవేత్తలు వ్యాకరణరహస్యజ్ఞులు దానికి 'త'కారము కలిపిరి. ఈ 'త'కార మేమి చేయుచున్నది? దానిని తావన్మాత్రముగా నిలుపు చున్నది. అది వ్యాకరణశాస్త్ర రహస్యవిషయము. మనకు గావలసినది-సర్వశబ్ద మాకాశమున నిండి యున్నది. భగవంతునిచేత సృష్టింపబడిన సర్వము నొకటియే. అది ఒక మహాపురుషాకృతి. దానియందున్న పురుషలక్షణములే సూక్ష్మసూక్ష్మములై తన్మహాసృష్టిమాత మహాపురుష సర్వమూర్తి వ్యంజకముగా నుండి మానవుడుగా పరిణమించినది. ఈ మానవుడు సర్వమహాసృష్టిగత పురుషునకు చిహ్నము. అందుచేత సర్వమహాసృష్టిరూప భూతమహాపురుషలక్షణము లన్నియు వీనియందు కొంచెము కొంచెముగా నుండును. కొంతకొంత శక్తిమంతములుగా నుండును. కానిచో ఈ హృత్‌శబ్దముయొక్క యుత్పత్తి మనము నిర్ణయించుటకు సాధ్య మయ్యెడిది కాదు. ఇంతకు చెప్పదలచిన దేమి యనగా వేదగతబహూ శబ్దములు ధాతుజము లనుటచేత ధాతువున కీ శక్తియెక్కడనుండి వచ్చినది యన్న ప్రశ్న పుట్టును గనుక ధాతువులు ఓంకార సబ్రహ్మజాదు లనవలెను. అప్పుడు వేదములందలి బహుశబ్దములు ధాతుజన్యము లైనచో పరమేశ్వర సంకల్పము. సంకల్పములోని రహస్యము శక్తియొక్క యనుగ్రహము-అని యర్థ మగును. వేదములు ఆఖ్యాతజములు ధాతుజములైన శబ్దముల కూడిక యైనచో అవి పౌరుషేయము లెట్లగును?

అసలు అపౌరుషేయ మన్న శబ్ద మున్నది—వేదము లపౌరుషేయములు కావు. ఒక ప్రవాహముగా వెళ్ళుచున్నది గాని వేదములు పౌరుషేయము లనుటయే న్యాయము. పురుషు డనగా సాక్షాత్పరమేశ్వరుడు. సాంఖ్యమును గ్రహించినచో పర్యవసానము పురుషుడు, జడము ప్రకృతి. కనుక వేదములు పౌరుషేయములు. కాని పురుషశబ్దము లోకమునందు పుంలింగవిశిష్ట వ్యక్తిపరముగా నధికముగా వాడబడుచున్నది. దానిని పురస్కరించుకొని యపౌరుషేయము లన్న వాదన.

ఈ వాదన చాల దినములుగా నున్నది- ఏండ్లుగా నున్నది. పునఃపునః ఖండితమై తిరిగి మొలకెత్తుచున్నది. అరటి చెట్టువంటిది. నరుకుదుము మరల దానిలోనుండి పిలక బయలుదేరును. ఈ లక్షణము విస్పష్టముగా నరటిమొక్కయందు కనిపించు చున్నదితక్క నిగూఢముగా సర్వవృక్షములయందున్నది.

ఎట్లు శబ్ద మాకాశమునందు నిండియున్నదో యా రీతిగా ఆ యా వస్తువుల యంకురము లా యా వస్తువులయం దున్నవి. అన్ని వాదములకు నీ లక్షణ మున్నది. ఆ శత్రువుయొక్క స్వరూపమట్టిది, వాని వాదమును నీవు మూలచ్ఛేదము చేయుము. నీ పరోక్షమునందు వాడు వాని వాదనయొక్క మూలస్వరూపమునే మరల ప్రారంభించును. అనుగుణమైన స్థలమునందు ప్రారంభించును, అది మరల పెరుగును. ఇది సృష్టిలక్షణము. దీనికి కర్త యెవడు? పరమేశ్వరుడు. పరమేశ్వరి కర్త్రి. దీనిపేరే మాయ. మనమెంత వాదించినను ఆ మాయ యచ్చటనేయున్నది; ఆ మాయమీద మన మధికారులము కాము. దాని ప్రథమ లక్షణము సంకల్పము. పరమేశ్వరియు నీ మాయయు నేకకాలసంభూతలు ఆమె యే ఈమె. ఈమె యేఆమె-యన్నట్లుం డురు కాని సత్పురుషుడు ప్రయత్నము మానివేయరాదు. యాథార్థ్యముయొక్క నిత్యత్వ మును స్థాపించుటకు ప్రయత్నము చేయుచునే యుండవలయును. ఇది యవతల మరియొక తగాదా. ఇది వీని సాధనా స్వరూపము. ఈ సాధన లేనిచో ఆ పరమేశ్వర స్వరూపము గోచరముకాదు. అది గోచర మగుటకు నిది సాధన యగుట పరమేశ్వర సంకల్పము. ఇదియొక యాశ్చర్యము. ఆ రహస్యము అది యాశ్చర్యము.

"ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేనమ్"

ఇది యిట్లుండగా నేను ఒకసారి శ్రీ హరివారి యింటికి వెళ్ళి యిది కొంత భాగము విని-యిట్టి గ్రంథము వీరు వ్రాయుచున్నా రని విని కదా వెళ్ళితిని—విన్న దానికి తత్పూర్వము విననందుకు మనసులో కష్టపడి, నా వయసుచేత నా యారో గ్యముయొక్క లోపముచేత తక్కినది వినలేక పోయితి నని చింతిల్లుచుండగా 'వారే దయతో మేమే మీ యింటికి వారము దినములు వచ్చి వినిపింతు' మనిరి. నా కాశ్చర్యము వేసినది. ఆనందము కలిగినది. వా రన్నట్లు వరుసగా పదునాలుగు దిన ములు సాయంకాలములయందు మా యింటికి వచ్చి - (వారి యిల్లు బందరురోడుమీద;

మా యిల్లు ఏలూరురోడ్డుమీద. దారి మొగలిపూవాసనలు వేయవలసి యుండును. ఇప్పు డా వాసనలు లేవు. ముంగ్లే మిగిలినవి)—నాకు వినిపింప నారంభించిరి.

నేను రెండానందములలో మునిగి యుంటిని. మొదటిది యింతటి మహా గ్రంథము వారు వచ్చి నాకు వినిపించుచుండుట ; రెండవది యిది యింతటిది నేటి కాలమునకు మిక్కిలి యవసరమైన గ్రంథ మగుట. ఈ రెండుభావములయొక్క బరువుచేత నాకూహాశక్తి పోయినది. ఒకనాడు నే నంటిని కదా! 'నేను దీనికి పీఠిక వ్రాయవలయును'—అని. వారు దయతో నంగీకరించిరి. ఈ మాట యనకముందు నే నొక్కటి యూహ చేయవలసియుండెను. ఇన్నాళ్ళుగా వీ రీ గ్రంథము రచించుచుండగా నెంతమంది పండితులు దీనిని విని యుండవలయును ? వారు దీనికి పీఠిక వ్రాయుటకు నే మహాపురుషులను ఏ మహాపండితుల నెన్ను కొనిరో యన్న విషయ మూహ చేయలేకపోవుట. మందబుద్ధుల కూహ తక్కువ కదా! తీరా విచారింపగా శ్రీజగద్గురువులు శ్రీ శ్రీ కంచి కామకోటిపీఠాధిపతులును. అస్మద్గురువులైన వేదాంతభాస్కర శ్రీ కుప్పా లక్ష్మావధానులు గారును పూర్వమే దీనికి పీఠికాకర్తలుగా నిర్ణయింపబడి రని తెలిసినది. నా గుండె జారిపోయినది. తరువాత వారితో మనవి చేసితిని—"అయ్యా! వారు వ్రాయగా నేను వ్రాయుట యేమి? పొరపాటున నన్నాను. క్షమించవలయు" నని, శ్రీ హరివారు కాదని పట్టుబట్టిరి. ఏమి చేయవలయును? 'అయినచో వారు వ్రాసిన పీఠికలు చూచిన తరువాత ఏదో లౌకికముగా నేను వ్రాసెదను లెండి'—యని యంగీకరించితిని. గ్రంథకర్తలు పీఠికలను తీసికొని వచ్చి నాకు చూపించిరి. భయము విచిత్రమైన గుణము. దానియొక్క తొలుతటి చిక్కదనము క్రమముగా తగ్గిపోవును. ఈ కడచిన రెండు నెలలుగా నాకు తీరిక కాలేదు. ఇప్పుడైనను తీరిక చేసికొని వ్రాయు చున్నాను. ఏదో వ్రాయుటకుకూడ తీరికయే కావలయును.

మఱియొక విషయము. నేను ప్రధానముగా ననుకొన్నది యిది—యిట్టి గ్రంథము ఒకమహారాష్ట్రదేశమున గాని కలకత్తాలో గాని వ్రాయబడినచో దానికి రెండు విశిష్టములైన లక్షణము లుండెడివి. వ్రాసెడివారు యమ్. ఏ.,లు గాని డాక్టర్‌లు గాని ఒకవిశ్వవిద్యాలయములోననో గొప్పకళాశాలలోనో సంస్కృతో పాధ్యాయులుగా నుండి, వారి గురువులు మహామహోపాధ్యాయులై యుండి, ప్రేరకులు

ఆ విశ్వవిద్యాలయాధ్యక్షులైన యొక యూరోపుదేశీయుడైన సంస్కృతపండితుడో, సంస్కృతాభిమానియో యైనవాడై యుండెడివాడు. ఈ గ్రంథము ఇంగ్లీషుభాషలోనే వ్రాయబడి యుండెడిది. రెండవది యేమనగా సులభముగా ముద్రితమై యుండెడిది.

శ్రీ హరివారికి యీ రెండుబాధలును లేవు. వారు ఇంగ్లీషులో వ్రాయరు. ఈ గ్రంథము నచ్చొత్తించుటకు వారి కెవ్వరి సహాయము నక్కఱలేదు. అందుచేత నీ గ్రంథమునకు వారిగ్రంథమునకు వచ్చెడి ప్రచారము తొలగిపోయినది. కాని యట్టి వారెవ్వరో దీనికి గ్రంథకర్త యైనచో నీ గ్రంథమింత నిష్కల్మషముగా నుండెడిది కాదు. ఈ గ్రంథము పాశ్చాత్య చరిత్రకారులయొక్కయు, పాశ్చాత్య పండితులయొక్కయు, వారి యనుయాయులయొక్కయు సంప్రదాయేతరభావములను ఖండించుటకే నిర్దేశింపబడినది. అచ్చముగా సంప్రదాయమును పోషించుటకు వ్రాయబడినది. సంప్రదాయ మనగా చక్కగా అధికముగా నిచ్చునది — యని యర్థము. ఈ గ్రంథ మట్లు చేయుచున్నది.

ఈ గ్రంథస్థవిషయములను విపులముగా చర్చించుట సాధ్యము కాదు. అందందు కొన్నివిషయములను నాబుద్ధికి తోచినట్లు ప్రపంచించుటకు ప్రయత్నింతును.

గ్రంథకర్తలు ఈ గ్రంథము నెందుకు వ్రాసిరి? వారే యిట్లనుచున్నారు— "వేదము అపౌరుషేయము, సనాతనము, స్వతఃప్రమాణము, క్రాంతదర్శి, తపఃసమాధిగోచరము, అనాదినిధనము, స్వయంజాతము, బ్రహ్మాత్మతత్త్వావబోధకము, పురుషార్థ సాధనము; గురు శిష్య పరంపరా ప్రాప్తము, పరమపావనము, శ్రీరూపము "అనియు నందుచే చరిత్రకారులు చెప్పునట్లుగా - 'పురుషబుద్ధికల్పితము; ఒకనాటి సాంఘిక రాజకీయాది చరిత్రను బోధించుటకు ప్రవృత్తము' - కాదనియు మున్నగు నంశములు స్పష్టపడగలవు."

ఇందు ప్రధానముగా ఒకనాటి సాంఘిక రాజకీయాది చరిత్రను వేదమునందు చదువుట న్యాయ్యము కాదు. చదివినచో చదువవచ్చును. ఆలంకారికుల భాషలో చెప్పినచో నొక పరమసౌందర్యవతియొక్క శరీరావయవములను వర్ణించు నట్టిది. ఆమె లావణ్యము. ఆమె శృంగారరసమును పరిత్యజించి ఆమె యెన్ని పౌండ్ల బరువున్నది? ఆమె కరచరణముల దైర్ఘ్య మెంత? ఆమె యెంత యెత్తున్నది? ఈ విషయము

లను విచారించుటవంటిది. ఇచ్చట నొక సంగతి యున్నది. పాశ్చాత్యుల తత్త్వమే యిది. ఆ జాతులు పెరిగిన లక్షణమే యిది. వారి నాగరికత యిట్టిది. లేనిచో ఆధునిక మైన వారి యీ ప్రకృతిశాస్త్ర మిట్లు విజృంభింపదు. వారు తత్త్వమును మనస్సుచేత తపస్సుచేత భావనాశక్తిచేత కనుగొనుటకు ప్రయత్నింపరు. దానిని తూచి కొలిచి యేవో లెక్కలు కట్టి తత్త్వదర్శనము చేయుదు మందురు. మనపూర్వులు చెప్పిన మాయ యనునట్టిది మానవులలో ప్రతివానియందు నిండి యుండుటయే కాక ఉండుటతో తృప్తి పడక వేతే కొన్ని దేశాలను తన స్వేచ్ఛా విహారముకొఱకు నిర్మించుకొన్నది. మనము వానిని గురించి విచారణ చేసి యేమి లాభము ? ఈ వేదము సృష్టిక్రమమును పలుచోట్ల పలువిధముల చెప్పును. వారి కిది కష్టముగా నుండును. వారికి వేద మర్థము కాదు. అర్థము కాకపోవుట వారి రక్తములో నున్నది. వారి యాహారములో నున్నది, వారి దేశపు గాలులలో నున్నది. వా రొక శబ్దముయొక్క యర్థమును నిర్ణయించుటకు దుర్గాచార్యులుచెప్పిన తదారంభప్రయోజనమును వదలిపెట్టి యది యెన్నిచోట్ల వాడబడినది ? ఏ యర్థములో నే యే చోట్ల వాడబడినది ? అని విచారించి ఒకచోటి యర్థమును మరియొక చోట చెప్పి బుద్ధిని కలుషితము చేసికొందురు. 'యథా రాజా తథా ప్రజా'. వారి యనుయాయులు నదే మార్గము ననుసరించుచున్నారు. దీనికి ప్రతిక్రియ యెవఁడు చేయవలెను ? పరమేశ్వరుడు చేయవలెను. ఆ పరమేశ్వరుడు కాలస్వరూపుడు. ఆ కాలము వారి కనుకూలముగానున్నది.

ఈ గ్రంథమునందు వేదశబ్ద మెన్నియర్థములయందు వాడబడియున్నదో చక్కగా చూపింపబడినది.

మరియొక వివాద విషయ మేమనగా వేదముయొక్క భిన్నభాగములు భిన్న కాలములయందు రచింపబడియుండును. ఈ వాదన యొకటి. ఈ పీఠిక వేదావిర్భావ స్వరూప లక్షణములతో ప్రారంభింపబడినది. అవి నిత్యములు. ఎందుచేత ? ఆకాశమునందు నిండియున్నవి గనుక. ఆకాశమునందు లేని శబ్దము లేదు. ఆ యాకాశము సృష్టికొఱకు బ్రహ్మనుండి వినిర్గమించినది. సృష్టికొఱకు ననుట చేత సృష్టికొఱకు కావలసిన దంతయు దానియందున్నది. ఆ లక్షణములతో నిండి యున్న యాకాశముననే బ్రహ్మమయమైన ప్రజాపతియొక్క చిత్కళ భాసించి

యున్నది. వేదముల దాక యెందుకు ? సర్వకవుల, కావ్యములు, వేదజన్యము లైన పురాణాదికములు, నేడు నీవును నేను మాటాడుకొనుచున్న మాటలు కూడ నాకాశమునం దున్నవి. ఒక జాతినుండి ఒక వ్యక్తినుండి భిన్నకాలములయందు ఆ శబ్దమే వెలువడుచున్నది. శబ్దము నెవడు సృష్టించినాడు ? సృష్టించుట యెట్లు ? శబ్ద మెచ్చటి నుండి వచ్చుచున్నది? ఎందుకు వచ్చుచున్నది ? పరమాల్పిష్ఠమైన మానవశరీరనిర్మాణము, పరమ బృంహిష్ఠమైన మహా శరీరముయొక్క చిహ్నము కదా ? ఏ మహాజన్యజనక భావము పట్టి అక్కడ శబ్ద ముత్పన్నమైనదో ఆ లక్షణ మిచ్చటను గన్పించుచునేయున్నది. మనుజునిలో నాకాశ మున్నది. నాభినుండి వాయు వుత్పన్న మగుచున్నది. శబ్దమిట్లుత్పన్న మగుచున్నది. ముఖావయవములు దాని కాకారము నిచ్చుచున్నవి. ఆ యక్షరముల సంఖ్య యంతతో నాగుటయేమి ? అనంతాక్షరము లెందు కుత్పన్నము కాలేదు ? ఎందుకు కావు ? సర్వశబ్దము లా యక్షరముల నుండియే యుత్పన్నము లగుట యేమి ? ప్రతి పదమునందు నీ మహాశ్చర్య ముండగా నా మహాశ్చర్యమును గూర్చి విచారింపకుండ నీ శబ్దములనుగూర్చి పరిశోధనచేయుట యెందులకు ? పరమేశ్వరుడు జ్ఞానమును నిర్మించెను. దానిని మానవునియందు భాసింపజేసెను. ఇది రెండు విధములు. అంతరము, బాహిరము. ఈ బాహిరము మాయాసంబంధి. మాయాజనితులైన మానవులు దీనియందు కొట్టికొని మెలికలు తిరిగి మృత్యువు నందుచున్నారు.

ఆకాశమునందలి శబ్దమును మనము వినలేము. వస్తుసంఘర్షణ జనిత శబ్దమే వినగలము. మానవముఖమునుండి జనించిన శబ్దమును భాషగా సంగీతముగా విభజించికొని దానియందు రమించుచున్నాము. ప్రతివాడు గాయకు డగుటలేదు. ప్రతివాడు భాషావేత్త యగుట లేదు. ప్రతివాడు కవి యగుటలేదు. ఎందుచేత ? ఈ దేశము తత్తత్పూర్వజన్మ సంస్కార విశేష మని సమాధానము చెప్పుచున్నది. పరదేశములు దీనినిగూర్చి యాలోచింపవు. ఆలోచించుట బరువు. వానిగొంతు చీల్చి వాని కంఠనాళములు పరీక్షించి నిర్ణయించుటకు ప్రయత్నించును. లేదా వాని బుఱ్ఱలోని మెదడులను పరిశీలించును. దానిమార్గము వేఱు.మనమార్గము వేఱు.

మొదట నాకాశము సృష్టింపబడినప్పుడే తద్గతమై సర్వనాద ముండునట్లు సృష్టింపబడినది. సర్వభాషలు సర్వశబ్దములు నచ్చట నున్నవి. లోకము ప్రవర్తిత

మగుచున్నది. ఈరీతిగా 'బహుస్యామ్ ప్రజాయేయ' అని సంకల్పించిన పరమేశ్వరుడు తనకు బహుత్వ మెట్లు వచ్చును? అచ్ఛమై స్వచ్ఛమై యున్న తన మూర్తియందు బహుత్వము వచ్చుట దుర్ఘటము. దానియందు మాయను కల్పించుకొనవలయును. ఆ మాయను కల్పించుకొన్నాడు. బహురూపములను పొందినాడు.

ఒకవిద్య రెండు విధములు. మహాస్త్రములవలె అల్పుడు ప్రయోగింపను మాత్రమే కలడు. అధికు డుపసంహరింపను గలడు. పరమేశ్వరు డా యుపసంహారమును గూర్చి భావించెను—ఏ యొక్క విషయమునుగూర్చి విచారించినను తీగ కదిపినచో డొంక కదలును—పరమార్థ మెట్లు గోచరించును? ప్రయోగోపసంహారముల నడుమ కొంత యున్నది. దాని పేరు మాయ. ఈ మధ్యభాగమంతయు మాయచేత నిండియుండును. అస్త్రము ప్రయోగింప బడినది. కొంత సేపటి కుపసంహరింపబడినది. ఈ నడిమికాలమునందు తత్ప్రయోగ జనిత క్రియాఫల పరిణామము లెక్కగట్టిన వా డెవడు: లెక్కగట్టినచో స్వరూపావబోధము జరుగును. నేను ప్రజలకొఱకు బహుగా నగుదు నన్నాడు పరమేశ్వరుడు. అయినాడు, ఉపసంహరించుటకు కూడ మార్గము చెప్పినాడు. మరల నా యుపమాలంకారమునే తీసికొందము. సర్వప్రయోక్తకు నుపసంహర్తృత్వశక్తి లేదు. ఉపసంహరణశక్తి తపశ్శాలులయందు మాత్రమే యున్నది. బ్రహ్మశిరోనామకాస్త్రము అర్జునాశ్వత్థామ లిద్దఱును ప్రయోగింపగలరు. అర్జునుడు మాత్రమే ఉపసంహరింపగలడు. అట్లు పరమేశ్వరుడు మాయను గెలుచుటకు నిర్మించిన సాధనము తపశ్శాలులకు మాత్రమే: భగవంతుడు నిర్మించిన మార్గమును తపోబుద్ధిచేత నాచరించిన వానికి మాత్రమే: ఈ రహస్య మిట్లుండగా భగవంతుడు మాయ నుపసంహరించెడి మార్గమును తొలుత చెప్పెను. దాని పేరు వేదము.

ఈ వేదము మానవనిర్మిత మగుటకు వీలులేదు. ఎందుచేత: ఈ వేదము శబ్దము. ఆ యాకాశమునం దున్నది. ఆకాశము సర్వశబ్ద గుణకము. అయినను సర్వమునందు పరమేశ్వరు డున్నట్లే సర్వశబ్దమయమైన యాకాశమునందు వేదమున్నది. వేదము కూడ నున్నది. శబ్దమయమైన జగత్స్వరూపమునందు అంతర్భూతుడై పరమేశ్వరునివలె పరమేశ్వరుదేయైన యా వేద మున్నది. "మంత్రో హీనః స్వరత శ్శబ్దతో వా మిథ్యాప్రయుక్తః న తదర్థ మాహ" కనుక

స్వర వర్ణ హీనమైన మంత్రము మిథ్యాప్రయుక్తము. మంత్రార్థమును చెప్పదు. అనగా స్వరవర్ణములు మంత్రార్థమును చెప్పుచున్నవి. మానవనిర్మితమైన భాష కీ శక్తి లేదు. స్వరము లేదు. వేదము మానవనిర్మిత మగుటకు వీలు లేదు. ఎంత ఋషియైనను స్వరమును నిర్మించునా? దానియందు పరమేశ్వరు డున్నాడు, ఇది భగవన్నిర్మితమే! భగవంతుఁడు తన స్వరూపమును తాను చెప్పికొనుటయే లేదా తనస్వరూపమును తాను శబ్దాకృతిగా వెలయించుటయే! స్వర వర్ణ హీన మంత్రము నకు వేఱే యర్థ మున్నది. అది లౌకికార్థము; మంత్రార్థము కాదు. ఈ లౌకికార్థజ్ఞాతలకు వేదములోని యర్థము స్వర వర్ణముల యందున్నదని తెలియదు. లౌకికములైన శబ్దముల యర్థములయం దున్న దనుకొనుచున్నారు. తపస్సుచేత పూర్వజన్మ సంస్కారముచేత వైదికమైన శబ్దమునందు విశ్వాసము కలుగుచున్నది. అవి లేనివానికి కలుగుట లేదు.

కర్తయెవఁడు? పరమేశ్వరుఁడు. ఆ యవిశ్వస్తునిచేత విశ్వసింపచేయుటకు నీవు బ్రహ్మావా? వాని సంస్కారమును మార్చగలవా? మఱియెందుకీ ప్రయత్నము. ఇదికూడ పరమేశ్వరుని లీలలో నొక భాగము.

"మంత్రో హీనః స్వరతో వర్ణతో వా" అన్నమాటలో మఱియొక చమత్కార మున్నది. స్వరమున కెంత ప్రాధాన్యమో వర్ణమున కంత ప్రాధాన్య మున్నది. దేవపదము వేదపదము రెండు నొక్కటియే! 'అప్యేకం దేవపద మధీయాత' (పే 27) ఈ మంత్రము రెండు నొక్కటియే యని చెప్పుచున్నది కదా! ప్రకాశించునది దేవుడు. బుద్ధియందు వెలుగువాఁడు. వర్ణవ్యత్యయము మాత్రమే యిక్కడ జరిగినది. కనుక వేదము ప్రకాశించినది. మహర్షుల బుద్ధికి భాసించినది.

మఱియు నగ్ని యన్న శబ్ద మున్నది. "అగ్ని మీళే పురోహితమ్". వేదములో నున్న రహస్య మేమనగా మనము సమన్వయించుకొనవలయును. బహు ప్రదేశములయందు ప్రయోగింపబడిన వేదాగ్న్యాదిశబ్దములు నొక్క మహారహస్య మునే సర్వమును చెప్పును (పే. 20). ఇది మన మనస్సులలో ప్రకాశింపవలయును. అది వేదమునకు వేదత్వము. ఈ రీతిగా మాయావిహితమైన యీ జీవకోటి తిరిగి స్వస్వరూపానుసంధానము చేసికొనుట కొఱకు పరమేశ్వరోద్దిష్టమై యాకాశము

నందు వేదము శబ్దమయమై యున్నది. భిన్నకల్పములయందు ప్రథమర్షులకు నా వేదములు బుద్ధియందు ప్రకాశించి వాగ్రూపమున వచ్చును.

ఋషులు మానవు లను పొరపాటు పడకూడదు, వారు ద్రష్టలు, దర్శన మనగా ఆకాశము నందున్న శబ్దమును వినుట. దానిని చూచుట; వినుటయు చూచుటయు రెండును నేకార్థకములు. తాత్పర్యతః తెలిసికొనుట యని యర్థము ఈ ఋషులనుండి వేద ముత్పన్నమైన యట్లు కనిపించును. అది యెట్లుత్పన్న మయినది? వాని యర్థ మేమి? ఇది విచార్యము. "హృద్యాత్ సముద్రాత్ శతవ్రజా ఏతా అర్షన్తి" ఆ వేద మిట్లు వచ్చినది. హృద్యమై వచ్చినది (పే.49

ఈ గ్రంథకర్తలు హృద్య మన్న శబ్దమునకు నిగమ నిరుక్త నిఘంటు వ్యాకరణ శిక్షా ఛందస్సులచే దోషరహిత మగుట యర్థముగా వ్రాసిరి. ఎంతో బాగుగా నున్నది, స్వంతముగా వ్రాసినచో మఱియు ప్రశంసనీయముగా నున్నది.

"రిపుణా నావచక్షే" దీనికి శత్రువులవలన భయములేదు-అని వేదమే చెప్పి కొనుచున్నది. ఇది ఋగ్వేదము లోనిది. పరమేశ్వర సంకల్పితమైన 'బహుస్యామ్ ప్రజాయేయ' లో నుండి ఉత్పన్నమైన ఆకాశమునందు నిత్యమైయున్న ఈ వేదము నకు భయ మేమున్నది! వేదశబ్దమునకు బహ్వర్థములు చెప్పబడినట్లే యన్ని యర్థములకు నైక్యము నిరూపింపబడినట్లే వేదాభిముఖ్యము ప్రతిపాదింపబడినట్లే యీ నిరుక్తియందున్న సర్వశబ్దముల యర్థ వివరణ నిరూపణములు ప్రవర్తిల్ల జేయ బడినవి. ఋషిశబ్ద మట్లే చేయబడినది 'శతవ్రజా' అన్న శబ్దము విష్వగ్గతిగా నిరూపింపబడినది.

వీరు కొన్నిచోట్ల కొన్ని శబ్దములకు దురర్థమును నివారించుచు వచ్చిరి. అందులో నొకటి 'మంత్రకృత్' అన్న శబ్దము, ఈ శబ్దమునకు మంత్రకర్త యని యర్థము చెప్పరాదు. వేదము అనాది కదా! మఱియు నెప్పటనైన భాష్యములలో గాని వ్యాఖ్యానములలో గాని తాత్పర్యావబోధనము కొఱకు చెప్పిన పంక్తులు విరోధులు తమ దుష్టార్థమును నిరూపించు కొనుటకు సాయపరచుకొన్నచో వానిని నివారించుటయు వీరు చేసిరి. "హృదా యత్ తష్టా మంత్రాగ్ం అశంసన్" ఇచట

సాయణులవ్యాఖ్య కొంత పరుల కుపయోగించునట్లుండెను. ఇది "హృదా తష్టేషు మనసో జవేషు" అన్నచోటి సాయణభాష్యముతో నివారితమైనది (పే. 61; 635)

ఋషిశబ్దము వేదమున కన్వయించును. పూర్వఋషుల కన్వయించును. భిన్నస్థలములయందు దాని యన్వయమును వైదికుడు చూచికొనవలయును. దీనినే దుర్గాచార్యులు "శాస్త్రారంభ ప్రయోజన ద్వారేణార్థవత్తావధారణమ్" అని చెప్పినది. ఇచ్చట శాస్త్ర మనగా వేదపంక్తు లనియు నర్థము.

ఇట్లుండగా ఋషులు తా మొక తన్మయత్వస్థితిలో నుండి ఆకాశగత శబ్దమయమైన వేదమును దర్శించిరి. ఒక యావేశము పొంది రని చెప్పుదము. ఒక తన్మయత్వ స్థితిలో నుండి రని చెప్పుదము. చెప్పినచో నష్ట మేమి? తన్మయత యనగా ఆనందమయత వంటి శబ్దము. "ఆనందమయోఽభ్యాసాత్" వలె. అక్కడ ప్రాచుర్యార్థము కావచ్చును. ఈ ఋషుల విషయములో వికారార్థము చెప్పుదము. త్రాగి తందనము లాడు వాడు కూడ నొక తన్మయత్వములో లేడనుటకు వీలులేదు. కనుక నిక్కడ తచ్ఛబ్దార్థ నిరూపణము చేసికొనవలయును. చారిత్రికులు చేసికొన లేదు; బాధపడుచున్నారు. కవుల తన్మయత్వము వేఱు. ఋషుల తన్మయత్వము వేఱు. కవుల తన్మయత్వము కొన ఆకులు మేసెడి తన్మయత్వము; కొండకొమ్మున వెనుకకాళ్ళమీద నిలుచుండి తీగయొక్క చివళ్ళు మేసెడి మేకయొక్క తన్మయత్వము.

వేదమునందు శబ్దార్థనిర్ణయమునకు తీసికొనవలసిన విషయములు వేఱు. పాశ్చాత్యులు వారి సాహిత్యములోవలె పలుచోట్ల ప్రయోగింపబడిన పదములను జూచి వేదశబ్దార్థ నిర్ణయము చేయుటవలన వారికి వేదార్థము తెలియలేదు. వారికి తెలియదు. తెలియకపోవుటకూడ గుణ మనుకొన్నచో నెవ రేమి చేయగలరు? వేదార్థము తెలియుటకు గుర్వనుగ్రహమును దేవతానుగ్రహమును కావలెను. అవి రెండును కలిగి నప్పుడే యర్థము తెలియును. దానిని శక్తిపాత మందురు. ఈ శక్తిపాతము జరుగుటకు యోగ్యమైన లక్షణములు పాశ్చాత్యులయందు లేవు. ఉండుటకు వారిజాతిలో నా లక్షణము లేదు. వారి నాగరికత యట్లు పెంపొందలేదు. దాని కెవ రేమి చేయగలరు? దీనిని మనవారు సంప్రదాయ మందురు. వారు

సంప్రదాయమును నిరసింతురు. నిరసించుట ఒక గుణముగా భావింతురు ఇంగ్లీషుభాషలో చెప్పినట్లు ఒకటి యుత్తరధ్రువము; ఒకటి దక్షిణధ్రువము.

వేదమునకు ప్రతిష్ఠ యని పేరు. ఈ శబ్దమున కీ యర్థ మెట్లు వచ్చినది. ప్రతిష్ఠ యనగా నేమి? సంప్రదాయము, ప్రతిష్ఠ, శక్తిపాతము, ఆమ్నాయము, అనుశ్రవము-ఈ శబ్దము లన్నియు ఏకార్థకములవలె నున్నవి. వీనిని తెలిసికొన రాదు. "ద్యులోకా దుదీయమానా పురాతనీ"—ఇది రహస్యము (పే. 155).

వేదమునం దన్నిశబ్దములు సంప్రదాయము ప్రకారము చూడకపోయినచో నర్థము కావు. సాయణాదులకంటె పాశ్చాత్యులు ప్రముఖు లని, వారు ప్రమాణ మని యనుకొనుట మూలచ్ఛేదకమైన విషయము. దీనిని నా వేయిపడగలలో పూర్వము వ్రాసితిని. ఇట్లు పాశ్చాత్యుల మనోవ్యాధివలన వేదార్థములు తాఱుమాఱు చేయబడినవి. నవశబ్దము, స్తోత్రశబ్దము, ఆమ్నాయ, అనువాక-ఇత్యాద్యనేక శబ్దములు సంప్రదాయము ననుసరింపక పోయినచో నవి సరియైన యర్థము నీయవు.

మరియు వేదాధ్యయన మనగా కృత్స్నవేదాధ్యయనమా? ఎవనికి పడిన వానికి ఆత్మీయశాఖా వేదాధ్యయనము మాత్రమేనా? అన్నవిషయముమీద వీరు చాల ప్రపంచించి వ్రాసిరి. కృత్స్నవేదాధ్యయనమునకు ఛందోలోకము లక్ష్యము. ఛందోలోక మనగా బ్రహ్మలోకము. ఇందులో స్వశాఖాధ్యయన మందము. వేదమునందు 'స్వ'శబ్ద మొక యాశ్చర్యకరమైన శబ్దము. తచ్ఛబ్దార్థ నిరూపణము జరిగిన గాని పలువిషయములు తేటతెల్లములు కావు. ఈ శబ్దము 'స్వాహా' అన్న శబ్దములో కనిపించుచున్నది. "స్వావ్యయః" అన్న శబ్ద మున్నది (247.8). ఈ శబ్దము తనయందు అవ్యయము అన్న యర్థ మిచ్చును. ఈ అవ్యయ శబ్దమే వేదమునందు విలక్షణమైనది. ఉపనిషత్తులయందు భగవత్పాదులయొక్క భాష్యమునందు దీని రహస్యము వెల్లడి యగును. స్వావ్యయ మన్న శబ్దము ప్రత్యక్ష నామము. స్వప్న మన్నది పరోక్షనామము. ఎవరికి? ప్రాణశబ్దవాచ్యుడైన పరమేశ్వరునకు. ఈ స్వప్నశబ్ద రహస్యము తెలియవలయు నన్నచో మాండుక్యోపనిషత్తు చదువవలయును. స్వాహాశబ్ద మున్నది. ఇందులో స్వ - అహా అన్న రెండుశబ్దము లున్నవి. ఈ అహ, అహుతి - అహూతి - అహితి - మొదలైన

శబ్దములకు స్థావరమైనది. ఈ వేదవాక్యము చక్కగా పరిశీలించినచో సర్వము కరతలామలక మగును (పే. 255).

"ప్రజాపతి రగ్ని మసృజత। తం ప్రజా అన్వసృజ్యన్త।
త మభాగ ఉపాసత। సోఽస్య ప్రజాభి రపాక్రామత్।
తమవరురుత్సమానోఽన్వైత్। త మవసుధ న్నాశక్నోత్।
స తపోఽతప్యత। సోఽగ్ని రుపారమతాతాపివై స్య ప్రజాపతి రితి।
స రరాటా దుదమృష్ట।

తద్ఘృత మభవత్। ....త దగ్నౌ ప్రాగృహ్ణాత్। తద్వ్యచికిత్సత్।
జుహవానీ౩ మాహౌషా౩ మితి। తద్విచికిత్సాయై జన్మ. ఇతి।
య ఏవం విద్వాన్ విచికిత్సతి। వసీయ ఏవ చేతయతే ఇతి। తం
వా గభ్యవద జ్జుహుధీతి। సోఽబ్రవీత్। క స్త్వ మసీతి। స్వైవ
తే వాక్ ఇత్యబ్రవీత్। సోఽజుహోత్ స్వాహేతి।" —ఇది యొకటి.

మఱియొక చమత్కారము. ఇది నిఘంటువ్యాఖ్య లోనిది. ఆ వాక్కు సరస్వతి యని యర్థము. దేవరాజ యజ్వయొక్క వ్యాఖ్యాన మిట్లున్నది. స్వయం సరస్వతీ ఆహ బ్రూతే। స్వైవ తే వాక్ ఇత్యబ్రవీత్ ఇతి బ్రాహ్మణమ్" ఈ యర్థమునే శతపథ బ్రాహ్మణము కూడ ననుసరించుచున్నది; దీని విషయమును విచారింతము, ప్రజాపతి స్వాహా అన్న శబ్దముతో హోమము చేసెను. దీని పద విభాగము. స్వ + ఆహ. ప్రజాపతియొక్క వాక్కే అట్లు వినబడిన దని. "తే - నీ యొక్క" - అన్న శబ్దముచేత ఆ యర్థము వచ్చుచున్నది కదా! ఈ 'స్వ'కారమే సరస్వతిగా శతపథము చెప్పుచున్నది. ఈ సరస్వతి యనగా నెట్టిది? ఇది ప్రాణ శక్తి మూలకము. మూలాధార చక్రమునందలి ఆకాశమందు ప్రాణములయొక్క సంచలనాత్మక మైనది సరస్వతి. ప్రాణము అనగా పరమేశ్వరుడు. తాత్పర్య మే మగుచున్నది? నేను తొలుత చెప్పిన, సర్వథా వేదము ప్రతిపాదించుచున్న పరమే శ్వరీ మహిమవలన బ్రహ్మనుండి సముత్పన్నమైన యాకాశమునందు నిండియున్న ప్రాణము అనగా వాయువు అది 'బహుస్యామ్ ప్రజాయేయ' యన్న ప్రజాపతియొక్క సంకల్పముయొక్క పరమార్థము. ఈ మహా సర్వశక్త్యాత్మకమైన పరమేశ్వరు డన్న మహాపురుషునియొక్క అభివ్యక్తచిహ్నమైన మానవునియందు సర్వము లేశతః లేశతః

అనుస్యూతమై అంతయు నొకటియే యై యున్నది. ఇది వేదముయొక్క రహస్యము. ఈ రహస్యమును తెలియనివారు వేదమును పఠించి యెక్కువ లాభము లేదు, అధిగత తద్రహస్యులైన మహాపురుషులయొక్క యనుష్ఠానము తత్ప్రాప్తిహేతు వగును.

ఈ మహాగ్రంథ మంతయు సర్వత్ర యున్న బహుశబ్దములను క్రోడీకరించి వాని సంయోజనమును వివరించుచున్నది. స్థూలముగా జూచినచో భిన్న శబ్దములయొక్క యర్థమును నిర్ణయించినట్లు కన్పించును. 'ఏకేన విజ్ఞాతేన సర్వం విజ్ఞాతం భవతి' - అన్న ఉపనిషద్వాక్యముయొక్క యర్థ మిదియే.

ఇట్లుండగా రెండు మూడు పెద్ద పేచీలు గలవు. యజ్ఞయాగాది క్రతు కార్యములవలన మోక్షము రాదని వానికి స్వర్గాది ఫల మున్నదని యొకటి-అనుష్ఠాన విరహితమై బ్రహ్మలోకప్రాప్తి జరుగవచ్చునని. ఈరెండును కొంత మిథ్యా వాదములు. స్థూలముగా జూచినచో జగద్గురువులైన ఆదిశంకరుల వాక్యమునకే వ్యతిరేకముగా నున్నట్లు కనిపించును. కాని ఆదిశంకరులు చెప్పిన ఈ శ్లోకార్థమును శ్లోకమును సర్వ విద్వద్విదితములు—నరజన్మ దుర్లభము; అప్పుడు పుంస్త్వము, విప్రత్వము; అప్పుడు వేదవేదాంగ పరిజ్ఞానము. తరువాత వైరాగ్యోపరతి మొదలైనదిగా శంకరులే చెప్పిరి కదా! లోకమునందు పలుమంది కొక భ్రాంతి కలదు. "అహం బ్రహ్మాస్మి" భావన బహుసులభ మని. మఱియు లోకమునందు పలుమంది యోగులుగా సిద్ధులుగా కనిపించుచున్నారు. యోగములు సిద్ధులును బ్రహ్మప్రాపకములు కావు. వైయాసికియందు జైమిన్యాదులు చెప్పిన మోక్షమునకు వ్యాసోద్దిష్టమైన మోక్షమునకు భేద మున్నది. దాని నాదిశంకరులు సమన్వయపఱచినారు. మహా ప్రళయాంతమునం దా యా జీవులు తత్తల్లోకము లందుండి చివరకు బ్రహ్మైక్యము పొందుదు రని. ఇది మఱల విచారణీయమైన అంశము. ఆ విభేద మెందు కున్నది? విభేదము విభేదము కాదా?

పరమార్థముగా నొక్క మాట చెప్పవలయును. ఇంత తేలికగా బ్రహ్మ ప్రాప్తి కలిగినచో పరమేశ్వరుడు వేదములను చెప్పుట యెందులకు? యజ్ఞ యాగాది కర్మల నుపదేశించుట యెందులకు? ఒకానొకనికి పూర్వజన్మలయం దున్న మహాసుకృతవశమున బ్రహ్మభూయుడై జన్మించుట కలిగినచో నది వేదాను

ష్ఠానము యొక్క నిరసనము కాదు. త్రయీవిద్యా నిరపేక్షక మైనది బ్రహ్మవిద్య కానే కాకూడదు. అది పరమేశ్వరోద్దేశము, దీనిని గురించి పండితులు చాల విచారింపవచ్చును. వేదమును పరిత్యజించి మోక్షము లేదు. యజ్ఞ యాగాది క్రతువులను పరిహరించి యచ్చమైన బ్రహ్మప్రాప్తి కలుగనేరదు; ఉపాసనాదులు తత్తల్లోక ప్రాపకములు. అచ్చమైన బ్రహ్మప్రాపకము వేద మొక్కటియే.

బ్రహ్మ జయతి। వేదో జయతి।

ఈ గ్రంథము సంప్రదాయబుద్ధులకు, వేదమతులకు, శబ్ద యథార్థార్థ జిజ్ఞాసువులకు కరతలామలకము గా నున్న దని చెప్పవలయును. ఆ దృష్టితో గ్రంథము చిన్నది. విచారింపబడిన శబ్దముల సంఖ్య కొద్ది. కాని 'ఏకేనైవ విజ్ఞాతేన సర్వమ్ విజ్ఞాతం భవతి'.

ఈ గ్రంథకర్తలకు నమస్కారములు.

అస్మద్గురువులు వేదాంతభాస్కరులు శ్రీ కుప్పా లక్ష్మావధానులు గారికి నమస్కారములు.

శ్రీ జగద్గురువులు నేటి శ్రీకాంచీ కామకోటి పీఠాధిపతులకు నమస్కారములు చాలవు కదా. వారి యనుగ్రహమును నేను వాంఛించుచున్నాను. వారి యాశీస్సులు నా జీవలక్షణమునందు నిండి యుండు గాక ! అయోగ్యుడైన నాచేత నిది వ్రాయించిన నాలోని యొకానొక యుద్రేకమును నేన నిందించుకొనుచున్నాను.

విజయవాడ

విశ్వనాథ సత్యనారాయణ

8—12—71

పండితాభిప్రాయములు

అవధానిశిరోమణి శ్రీ కాశీ కృష్ణాచార్యులుగారు

శ్రీ లక్ష్మీ హయగ్రీవో విజయతేతరామ్. ఆశీరాద్యుపరి. అమూల్య మగు మీ 'భారతీనిరుక్తి'ని మీ ముఖముననే ప్రత్యక్షర పరిశీలనా పద్ధతితో వినుటచే నాకు శ్రమ యించుకేనియు గలుగకుండ సర్వవిషయములును నాకు బోధపడినవి. ఈ గ్రంథమున మీరు వ్రాసిన ప్రతివిషయమును అపౌరుషేయ శ్రుతిమూలక ప్రామాణ్యము గల దగుటచే నందఱకును శిరసా శ్లాఘనీయమై యొప్పుచున్నది. సర్వభాషామాతృ భాష యగు దేవభాష (సంస్కృతభాష) యొక్క ప్రాశస్త్యము దెలియవలయు నన్న మీ గ్రంథముకంటె నుత్కృష్టతర మగు మఱియొక గ్రంథము పూర్వకాలమందు గాని యుత్తరకాలమందు గాని యుండియుండదు. ఈ గ్రంథమును మీరు మృదు మధురమై నిర్దుష్ట మగు చక్కని సులభాంధ్రభాషలో వాక్యరూపమున వ్రాయుటచే భారతీయాంధ్రులకు కింతంత యని చెప్ప నలవి కాని మహోపకారము చేయుట కీ భారతీనిరుక్తి చాలి యున్నది.

శ్లో॥ హే ధారాపురనాథ భోజనృపతే హే విక్రమార్కప్రభో। హే వల్మీక తనూభవాదిమకవే హే కాళిదాసాదయః। కిం యూయం సురభారతీం క్షితితలే త్యక్త్వైవ యాతా దివం। నోచేత్ తత్సహితా గతా ! వదత నః స్వప్నేఽథవా క్వాస్తి సా॥ అను శ్లోకమున సురభారతియొక్క నేటి వైరళ్యమునకు నా మనంబున గల సంతాపము తమ కెల్లరకును గోచరించును. మన భారతీయులు పరదేశ భాషా ద్యనుకరణాతితృష్ణులై స్వభాషామహిమను గనలేక మాతృభాషావరమును జూపని వా రగుటచే గదా, సంస్కృతమున కీ నాడు ప్రచారము తగ్గిపోయిన దని నా విచారము. సంస్కృతభాషాజ్ఞానము లేని యెడ దాని యుత్కృష్టత దెలియ వీలులేదు. దాని యుత్కృష్టత దెలిసిన గాని భాషాజ్ఞానమును సంపాదింప గోరరు. కావున నిట్లన్యో న్యాశ్రయదోషము చేత గదా భాషాయోషయొక్క అంతర్ధానము గల్గినది ; ఇక నీ దోషము పోయి యందఱకును నీ భాషామహిమ యెట్లు బోధపడును స్వామీ ?—

యని నేను విచారపడుసమయమున నమూల్య మగు మీ గ్రంథము వెల్వడి నాకు గొంత యుత్సాహమును గల్పించి నా విచారమును దొలగించినది. ఈ గ్రంథ మచిరకాలమున ముద్రితమై ప్రతి భారతీయాంధ్రుని హస్తము నెపు డలంకరించునా ః యని యువ్విళ్ళూరుచుంటిని,

శ్లో॥ మాతా చ మాతృభాషా చ మాతృభూమి శ్చ సర్వదా। చతుర్వర్గ ఫలావాప్త్యై సంసేవ్యాః సర్వమానవైః॥ - అని నా హృదయాభిప్రాయము. జ్ఞాన విజ్ఞాన సర్వస్వము నొసగు భాష యేదియో యదియే అమృతభాష కాగలదు. అది యొక సంస్కృతమే. శ్లో॥ అంగాని వేదా శ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః। పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతా శ్చతుర్దశ॥ — ఈ చతుర్దశ విద్యలను గడుపున నిముడ్చుకొన్న భాష యొక సంస్కృతమే; శ్లో॥ మోక్షే ధీ ర్జ్ఞాన మన్యత్ర విజ్ఞానం శిల్పశాస్త్రయోః - అను శ్లోకము ప్రకారము మానవున కైహికాముష్మికానందము నీయ జాలిన దీ సంస్కృతభాషయే. మఱియొక భాష కిట్టి సామర్థ్యము లేదు,

కావున సంస్కృతమహిమను జక్కగ దెలుపగల మీ భారతీనిరుక్తిని శీఘ్రముగ ముద్రించి భారతదేశమున వ్యాపింప జేసి మఱల అర్యశబ్ద ముఖ్యార్థభూతులగు భారతీయుల నున్నతస్థితి లోనికి దెచ్చుటకు మీరే మొదట దారితీసినవారని నే దలచితిని. ఇట్టి గ్రంథములనే మఱికొన్నిటిని భగవంతుడు మీచే రచింప జేసి భారతదేశము నుద్ధరించును గాక యనియు, అందుకు వలయు శరీరారోగ్యాది సంపదను భగవంతుడు మీ కొసంగు గాత మనియు నే నాసింతును.

గుంటూరు
10—1—47

ఇత్యాశిషః
(సం) కాశీ కృష్ణాచా[illegible]

కళాప్రపూర్ణ, శతావధాని,

శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు

శ్రీమత్పరదేవతాయై నమః - భారతీనిరుక్తి - ఇయ్యది చతుర్వేదముల యందలి వాక్యములను, తత్తద్భాష్యములను క్వాచిత్కముగ స్మృతివాక్యాదులను తఱచి యాస్కాచార్య నిరుక్తమునకు ఛాయగా విరచించిన యమూల్యమైన వైదికగ్రంథము. దీని రచనకు గ్రంథకర్తలు చేసిన పరిశ్రమ చాల వర్ణనీయము. షడ్దర్శనములలో నేది గాని యిందు కొంచెము గొప్ప తగులక పోలేదు. ఇందు నూటికి తొంబది వంతులు యౌగికార్థములే నిర్వచింపబడి యుండుటచే లోకములోని సాహిత్యమున కిది విశేషించి తోడ్పడను. వ్రాయబడినది వేదమునకు సంబంధించిన విషయమైనప్పుడు లౌకికసాహిత్యమున కుపకరించు నెడల గ్రంథకర్త యుద్యమమున కన్యథాత్వమే సంభవించును. కావున నిది వైదిక సాహిత్య పోషక మగుటయే సమంజసము. ప్రధానముగా వైదికమున కుపకరించుచు నా సంస్కారము లౌకికమునకు గూడ (దేహళీ దత్త దీప న్యాయేన) నుపకరించు ననుటలో విప్రతిపత్తి యేకొంచెము నుండదు. అనేక నూతనవిషయములు దీనిలో గ్రంథకర్త లిమిడ్చి యుండుటచే గురుశుశ్రూష లేకయే జిజ్ఞాసువు లెన్నో రహస్యములను దెలిసికొని కృతార్థు లగుట నిర్వివాదాంశము. విద్యాభ్యాసమునకు నావశ్యకములైన సాధనద్వయములో నిది రెండవది యని నా నిశ్చితాభిప్రాయము.

యాస్కాచార్యులు భరతశబ్దమునకు సూర్యు డని నిర్వచనము (భరతః సూర్యః తస్య స్వభూతా దీప్తి ర్భారతీ) చూపెను. భారతీయదీప్తి యని కూడ పరినిష్ఠితార్థము చెప్పికోవచ్చును. అపుడు భారతీయ శబ్దము తద్ధితవృత్తిగా గాక కృద్వృత్తిగా (భారతీం యాన్తి జానన్తి. యే గత్యర్థా స్తే జ్ఞానార్థాః) వ్యాకరించినచో భారతీ సర్వస్వ విజ్ఞానము దీనివలన లభించు నని కూడ పరిణమించును. ముఖే ముఖే సరస్వతీ. కనుక సహృదయు లనేకార్థము లిందు వ్యాకరింతురు గాక.

విజయవాడ }
9-1-11947 }

చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి

వేదభాష్య విశారద

ఉప్పులూరి గణపతి శాస్త్రి గారు

భారతీనిరుక్తి యను నీ గ్రంథరాజమును స్థాలీపులాక న్యాయముగ కొంచెము రుచి చూచుటయే కాని సమగ్రముగ వినియెడి భాగ్యము లభింపలేదు. కాని యీ గ్రంథరత్నము అనాదినుండియు మన పూర్వులచే వ్యవహరింపబడెడి సంస్కృత వాఙ్మయమును అన్వర్థమని (ఆస్తిక నాస్తిక సాధారణముగ) అంగీకరించునటుల ననేకము లగు గ్రంథరాజముల నుండి ప్రమాణ వచనముల జూపుచు ననేక (రహస్య) గుప్త భావములను వ్యక్తీకరించుచు, ప్రాచీనుల సంప్రదాయమును లోక మంతటను చాటుచు, పండిత పామర సాధారణముగ మహోపకారక మనుటలో నతిశయోక్తి గానరాదు. వేయేల? అనేకులగు కవివర్యులు తమ వైదుష్యమును వర్ణనాచాతుర్యముచే లోకమున ప్రకటించి కృతప్రతిష్ఠులై విరాజమాను లగుచు గానవచ్చుచుండిరి కాని సర్వజనోపకారకము లగు ప్రాచీన సంప్రదాయ విశేషముల నీ విధముగ ప్రమాణవచనోల్లేఖ పురస్సరముగ వివరించి సహృదయ హృదయాహ్లాదకరంబై మహోపకారమును గావించు గ్రంథమతల్లికను ప్రకటించు విద్వద్వర్యులు విరళులైరి. ప్రకృతములో నీ గ్రంథరాజమును శీఘ్రకాలములో ముద్రింపించి ప్రాచీన సంప్రదాయ జ్యోత్స్నాంకురములచే నాస్తిక హృదయ తమిస్రమును పారదోలి లోకోపకారమును గావింపవలె నని యాశించుచున్నాను.

కాకినాడ
17—6—1947

(సం) ఉప్పులూరి గణపతిశాస్త్రి

శ్రీ కుప్పా శ్రీ ఆంజనేయశాస్త్రి గారు

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం। యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై"—అని శ్రుతివచనము. 'యో వేదేభ్యోఽఖిలం జగత్। నిర్మమే'—అని స్మృతివచనము, వేదార్థోపబృంహకము లగు పురాణములలో మార్కండేయ పురాణమున (16 అధ్యాయమున) శ్లో॥ సర్వస్యాధార భూతేయం వత్స! ధేను స్త్రయీమయీ। యస్యాం ప్రతిష్ఠితం విశ్వం విశ్వహేతు శ్చ యా మతా॥ ఋక్పృష్ఠాఽసౌ యజుర్మధ్యా సామవక్త్రి శిరోధరా। ఇష్టాపూర్త విషాణా చ సాధుసూక్త తనూరుహా। శాన్తి పుష్టి శకృ న్మూత్రా వర్ణ పాద ప్రతిష్ఠితా। ఆజీవ్యమానా జగతాం సాఽక్షయా నాఽపచీయతే। స్వాహాకార స్వధాకారౌ వషట్కార శ్చ పుత్రక। హన్తకార స్తథా చాఽన్యః తస్యా స్తనచతుష్టయం। స్వాహాకారం స్తనం దేవాః పితర శ్చ స్వధామయం। మునయ శ్చ వషట్కారం దేవభూత సురేతరాః। హన్తకారం మనుష్యా శ్చ పిబంతి సతతం స్తనం। ఏవ మాప్యాయయ త్యేషా వత్స! ధేను స్త్రయీమయీ। తేషా ముచ్ఛేదకర్తా చ యో నరోఽత్యన్తపాపకృత్। పాయయ త్యుచితే కాలే స స్వర్గాయోపపద్యతే। తస్మాత్ పుత్ర మనుష్యేణ దేవర్షి పితృ మానవాః। భూతాని చాఽనుదివసం పోష్యాణి స్వతను ర్యథా - యని చతుర్వేద రూపిణియు త్రయీమయియు నగు వాగ్ధేనువు వర్ణింపబడినది.

శ్రీమన్నారాయణుని నాభికమలమునుండి యావిర్భవించిన బ్రహ్మకు దానేమి చేయవలయునో స్ఫురింపకయుండ 'తప' (తపమొనరింపుము); 'సృజ' (సృష్టి చేయుము) - అను శబ్దములు వినంబడెను. ఆ సృష్టి యెట్లొనరింపవలయునో స్ఫురింపక మరల వ్యథ నందుచుండ పరమాత్మచే వేదము లుపదేశింపబడినవి. (శ్రీమద్భాగవతము - తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే) అంత నా వేదరాశి నాధారముగ గైకొని పరమేష్ఠి బ్రహ్మాండమును సృజించెను. కాగా - సమస్త బ్రహ్మాండ సృష్టిక్రమమును బోధించునది వేదరాశి యని ప్రస్ఫుట మగుచున్నది. సృష్టిక్రమమునందే సృష్టపదార్థ రక్షణోపాయ మిమిడీ యుంట విజ్ఞజనవిదితము. కాననే పైనుదహరింపబడిన మార్కండేయపురాణమందు వేదరాశి యొక ధేనువుగ

రూపింపబడి సృష్టము లైన ప్రాణికోటి నంతను ఆ త్రయీకామధేనువే యాప్యాయత నొందించుచున్నది యని స్పష్టముగ వివరింపబడినది.

ఈ విషయమున ననేకార్షగ్రంథ సాహాయ్యముతో సాకల్యముగ బరిశీలించి తత్త్వమును సంపూర్ణముగ గ్రహించి చిరంజీవులగు శ్రీ హరిసోదరులు 'భారతీనిరుక్తి' యను నీ యుద్గ్రంథమును లోకోపకారప్రవణులై రచియించి ప్రకటించినారు. నిరుక్తి యనగా 'ప్రకృతిప్రత్యయ విభాగాది పురఃసరముగ శబ్దముల తత్త్వార్థముల నిరూపించుట'—యని యర్థము. గైర్వాణవాణి యందలి పదజాల మంతయు వ్యుత్పన్నమును, స్వాభిధేయ-స్వరూప-స్వభావ-శక్తి-ప్రయోజనాదుల స్ఫుటముగ స్ఫురింప జేయు నదియే.

ఈ దైవవాణీ స్వాభావ్యమును గుర్తించి, వేదపర్యాయపదముల నిరుక్తిని సబహుప్రమాణముగా సనిదర్శయుక్తికముగ నిరూపించుచు జార్త్రికుల స్వోహా కల్పిత వేదపౌరుషేయతా ద్యపసిద్ధాంతముల సయుక్తికముగ సప్రమాణముగ ఖండించుచు, నద్దాన నిటీవల జార్త్రిక దురూహా కల్పిత యుక్త్యాభాసమూలాప సిద్ధాంతాభాసలచే జనించిన యాధునికాస్తికజన మనోవ్యాకులతాది కాలుష్యముల సమూలముగ నిర్మాలించుట యిందు నత్యావశ్యకవిశేషము. ఈ యుద్గ్రంథ రచయితలు చిరంజీవులు నగు హరిసోదరులను ఆ త్రయీకామధేనువు చిరాయు రారోగ్యా దితోధిక శ్రేయోఽభివృద్ధుల ననుగ్రహించి మనుచు గాత.

మచిలీపట్టణము, 20-9-1971. (సం.) కుప్పా శ్రీ ఆంజనేయశాస్త్రి.

స్వధర్మ స్వారాజ్య సంఘము, సికింద్రాబాదు.

ఉభయమీమాంసావిశారద

శ్రీ వీరేశ్వర కృష్ణ డోంగరే శాస్త్రిగారు.

సాంగ స్వాధ్యాయ భాస్కర

శ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి గారు

*

భారతీనిరుక్తి గ్రంథాభినందనము

భారతీనిరుక్తి యను గ్రంథమును శ్రీయుతులు హరిసోదరులు గ్రథనము జేసి యున్నారు. భారతీనిరుక్తి యనగా వేద - వేదప్రతిపాద్యార్థముల నిర్వచన మని 'అవతారిక'లో గ్రంథకర్తలే చెప్పియున్నారు.

వైదికధర్మమునకు మూలప్రమాణ మగు వేదము—అనాదిసిద్ధ మైనది. పురుషప్రణీతము కాదు—అని శాస్త్రములు నిర్ణయించినవి. శాస్త్రపురాణేతిహాసాది గ్రంథప్రవర్తకు లగు ఋషులుకూడ చాలమంది యీ సిద్ధాన్తమునే అవలంబించి యున్నారు.

ఈ సిద్ధాంతమునందు శ్రద్ధలేని కొందఱు ఆధునిక చరిత్రకారులు వైదిక వాఙ్మయము పురుషప్రణీత మనియు, అందలి వేఱ్వేఱు భాగములు వేఱ్వేఱు కాలములలో రచింపబడినవనియు. అందును ఋగ్వేద మతిప్రాచీన మనియు, పిదప క్రమముగ నితరవేదములు బ్రాహ్మణారణ్యకాది గ్రంథములు బయలుదేరిన వనియు, కొన్ని యూహలను జేసినారు. ఇట్టి యూహామూలకమైన చారిత్రికగ్రంథములు ప్రస్తుతకాలమున విశ్వవిద్యాలయాదులయందు ప్రధానపాఠ్యగ్రంథము లగుటచే, అనాదిసిద్ధముగ భారతీయులకు వేదమునం దుండెడి శ్రద్ధ తగ్గిపోయి దానిమూలమున వైదికధర్మముయొక్క మూలస్తంభమునకే ఆఘాత మేర్పడినది. ఇట్టి ఆధునికవాదములను సమంజసములగు ప్రమాణములతో ఖండించి ఋష్యాది సమ్మతమైన వేదవాఙ్మయముయొక్క విశిష్టతను అవసరమైనంత వేగముతో భారతీయవిద్వాంసులు స్థాపించుటకు పూను

కొనుట లేదు. ఇట్టిస్థితిని గమనించి మానసికక్లేశము ననుభవించుచున్న హరి సోదరులు గావించిన యీ గ్రంథరచనాప్రయత్నము భారతీయు లందఱికిని అభినంద నీయము, అత్యావశ్యకము నయి యున్నది.

యుగాంతేఽ న్తర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః।
లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతాః స్వయంభువా॥

అను సిద్ధాంతమును సమర్థించుట కనేక గ్రంథపరిశీలనము చేసి, ముఖ్యముగ వేదము, ఋషి, బ్రహ్మ మొదలగు కొన్ని శబ్దముల నుదాహరించి వ్యాకరణ నిరుక్తాది ప్రమాణగ్రంథముల యాధారముతో వాని యర్థమును విశదీకరించుచు, నిట్టి యర్థముల నిచ్చు పదములను వేదగ్రంథములందు వేదమే యుపయోగించుట - వేదము ఋషుల యభిమతానుసారముగ అనాదిసిద్ధమై నప్పుడే ఘటిల్లు ననియు, ఇట్టి శబ్దార్థ పరిజ్ఞాన రాహిత్యమే యాధునిక విమర్శలకు గారణ మనియు నభిప్రాయ పడి, గ్రంథకర్తలు బహుక్రమపూర్వకముగ దాము జెప్పు ప్రతివిషయమునకు ప్రమాణముల జూపించుచు వేదస్వరూపము నీ గ్రంథమునందు జక్కగ విశదీకరించి యున్నారు.

వీరి రచనలో వైదికసంప్రదాయమునకు గాని, శాస్త్రసిద్ధాన్తమునకు గాని విరుద్ధ మైన విమర్శ వెదకినను కన్పించదు. అనేక గ్రంథ పరిశీలనాపూర్వకమైన యిట్టి రచన అనేకవిద్యా పారంగతులకే సాధ్యము. ప్రాపంచిక వ్యవహారముల ననుస రించుచు, నిట్టి విద్యాకృషిని గావించి యీ విధముగ వేదపురుషు నారాధించుచున్న హరిసోదరులకు పరమేశ్వరు డితోఽధిక వేదసేవావకాశము ననుగ్రహించు గాత.

ఆర్యసంస్కృతీ పరిరక్షణము ముఖ్యోద్దేశముగా గల శ్రీ స్వధర్మస్వారాజ్య సంఘము శ్రీహరిసోదరుల విద్యాకృషిని అభినందించుచున్న విషయమును వారికి తెలుపుటకు మేము ఆనందించుచున్నాము.

కొత్తా స్వారాజ్యవిహార్
సికింద్రాబాదు. 25
13—10—1971

ఇట్లు
(సం) వీరేశ్వర కృష్ణ డోంగరే శాస్త్రి
(సం) సన్నిధానం లక్ష్మీనారాయణ మూర్తి

ఆర్షవిద్యాభూషణ

జటావల్లభుల పురుషోత్తము

ఆంధ్రప్రదేశ విశ్వహిందూ పరిషదధ్యక్షులు

వైదికశబ్దముల కర్థనిర్ణయము చేయుటలో సంప్రదాయము, రూఢ యోగ రూఢార్థము లెంతవఱ కుపకరించును? యౌగికార్థ మెంతవఱకు న్యాయ్యము? - ఇత్యాది ప్రశ్న లిటీవలి వారి నెంతో కలవరపెట్టినవి.

బోట్లింగ్, రాథ్ - అను జర్మనుపండితులు సంప్రదాయమును, రూఢ యోగరూఢార్థములను పూర్తిగా మఱచి పోయి ననే గాని వేదము మన కర్థము గాదనియు, అట్లు మఱచిపోవుట భారతీయుల కసాధ్య మగుటచే వేదార్థనిర్ణయమును జేయు నధికారము అభారతీయులకు మాత్రమే కలదనియు వాదించిరి. వారు తమపద్ధతిలో వేదార్థకోశమును రచించిరి.

మనదేశములో దయానందసరస్వతీస్వామివారు, 'సాయణుడు తన నాటికి నిలిచియున్న ఇటీవలి సంప్రదాయములకు లొంగిపోయి వేదార్థనిర్ణయమును జేయుటచే ఆయన భాష్యము వేదహృదయము నావిష్కరింప జాలదు' - అని యభిప్రాయపడి తాము స్వతంత్రముగా వేదములకు భాష్యము రచించిరి. అందు యాస్కుని ప్రమాణముగ స్వీకరించిరి.

మాక్సుమల్లర్, గోల్డుస్టుకర్, విల్సన్ మున్నగు పాశ్చాత్యులు సాయణుని పూర్తిగా విడచుకొనుచో మన కా వేదము దురవగాహ మనియు, ఆయనలో లోపము లున్న వనియు, వానిని మనము సవరించు కొనవలె ననియు భావించి .

మొత్తముమీద 200 సం॥ల నుండి బయలుదేరుచున్న వాదార్థ విమర్శకర్త లెల్లరు నిట్లు సాయణభాష్యప్రామాణ్యమును నిరాకరించుటయే కాక వేదములనుండి

యవిచ్ఛిన్న పారంపర్యముతో నొకసంప్రదాయ మీ భారతదేశమున వచ్చుచున్నదను భావమును గూడ త్రోసివైచిరి.

హరిసోదరు లీ భారతీనిరుక్తిలో నీ వాదముల నన్నింటిని పరాస్తము చేసి వేదార్థవిషయమున అవిచ్ఛిన్నపారంపర్య మున్నదని నిరూపించిరి. ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ - అను వచనములో గర్భితమైన పారంపర్య భావమును అనేకోదాహరణములతో నిలబెట్టిరి. యాస్కుడు, మహీధరుడు, సాయణుడు భిన్నమార్గముల త్రొక్కినవారు కారని గూడ నీ గ్రంథము వలన దెలియ గలదు. ఎన్నియో స్థలములలో యాస్కుని ఉదహరించిన సాయణులు క్రొత్త దారిని త్రొక్కిరనుట సాహసమే యగును.

వేదములకు స్మృత్యాదులతో వైరుద్ధ్యమే కాక యంతర్గత వైరుద్ధ్యము కూడ నున్నదని పాశ్చాత్యుల యభిప్రాయము; స్మృత్యాదులతోనే వైరుద్ధ్యము కాని యంతర్గత వైరుద్ధ్యము లేదని శ్రీదయానందమతము; అంతర్గత వైరుద్ధ్యము స్మృత్యాది వైరుద్ధ్యముకూడ లేదని సాంప్రదాయికుల మతము; ఇదియే సాయణుల మతము గూడ. హరిసోదరుల యీ గ్రంథములో సాంప్రదాయికపద్ధతియే నిలబెట్టబడినది.

సాంప్రదాయిక దృష్టిలో వేద మనగా మంత్రబ్రాహ్మణారణ్యకోపనిషద్వాఙ్మయము. దయానందుల మతములో మంత్రము మాత్రమే. 'భారతీనిరుక్తి' సాంప్రదాయిక మతమును బహుప్రమాణములచే నిలబెట్టినది. ఇది సామాన్య విషయము కాదు. మంత్రబ్రాహ్మణయో ర్వేదనామధేయమ్ - అనుపట్ల బ్రాహ్మణ శబ్దము ఆరణ్యకోపనిషత్తులనుకూడ దెలుపు నని ప్రాచీనులు వ్యాఖ్యానించి యున్నారు. వేదోపనిషదః - అనునది బ్రాహ్మణపరివ్రాజక న్యాయమున గావింపబడిన ప్రయోగ మనియు దెలుపబడినది. ఇది సాంప్రదాయిక దృక్పథము. దీనిని హరిసోదరులు బహువిధముల సమర్థించి యున్నారు.

ఇట్లెన్నో విషయము లీ గ్రంథమున సప్రమాణముగ పరిష్కరింప బడినవి. వైదికవాఙ్మయ గవేషణపరాయణుల కీ గ్రంథము కరదీపికగా నుండగలదు.

ఏతద్గ్రంథకర్తలు విద్యాసముద్రులు; సునిశిత ధిషణాభూషణులు; ఇట్టి యమూల్య గ్రంథరత్నముల నింకను రచించి విజ్ఞానవ్యాప్తికి వారు తోడ్పడగల రని నమ్ముచున్నాను.

కాకినాడ }
28-10-71 } (సం) జటావల్లభుల పురుషోత్తము

Sri Ch. Markandeya Sastry

Inspector of Oriental Schools, Andhra State, Vijayawada.
(At Present Deputy Director for Oriental studies,
Andhra State)

I visited the Nirukta Bharati, Vijayawada, to-day and am highly pleased with the diversified work that is being conducted here...... The more important work that is being conducted by the institution is research in Vedic interpretation. I had a good opportunity to go through the papers prepared so far and am highly delighted by the standard of performance contained there in. The work is a useful and detailed suppliment to Yaska's Nirukta and it is not an exaggeration to say that it even excels the latter. I wish every success to the complete and speedy termination of this work and hope that it will be of good help to oriental scholars. The effort of Hari Brothers and their elder Sri Challa Satyanarayana Sastry garu, is commendable for their enthusiasm in putting forth this diversified work in promotion of Sanskrit and its culture.

Vijayawada }
26—10—1956 } **(Sd) Ch. Markandeya Sastri**

Dr. Veluri Subba Rao

M. A., Ph. D., B. O. L., B. Ed.

Professor of Sanskrit, Andhra University,

WALTAIR (Andhra Pradesh.).

The theory that Veda, the Holy writ of the Hindus, was without a beginning in time and was intrinsically valid, has been assailed in some measure or other from time to time by the Buddhist, the Jain and other heretics. Even the Logician etc. of somewhat orthodox leanings, while admitting its validity in their own way, attacked its intrinsic validity and established the extrinsic nature of its validity. We have ample evidence of the controversies that raged over centuries on Pramanya Vada between the votaries of the two schools of thought. What the outcome of these arguments and counter arguments is, is a matter we had better leave to the individual scholar who can boldly and leisurely enter into the subtleties of Epistemology and Logic.

During the recent one or two centuries, it so happened that European scholars have begun to evince great interest in the recondite branch of the vedic Lore of the Hindus and attempted in course of time, not only translations of the vedic Texts but also a criticism of these texts. Broadly speaking these scholars appear to be of the opinion that the vedas are the works written by sages or seers (as they also called them) and belonged to one period of time or the other.

Some modern Indian Scholars, however, disputed the point and suggested a more remote date in the past. All

the evidences cited in respect of the date of the origin of the vedas were based on Linguistic studies etc. mostly internal. Not much credence was given to Purana and Itihasa literature which must really have handed down to us the traditional interpretation of the veda. The exegetist (Mimamsaka) since hoary times has tried to interpret Vedic Texts but this, too, did not weigh much with these scholars on important points. Great differences of opinion raised their heads in exegetical expositions between the traditional and the occidental scholars. Nevertheless as the Universities and higher institutes of learning were manned by scholars occidentally trained and paid by the Government (as they were mostly trained to study texts in English), the theories propouned by the western scholars gradually began to gain ground and the other traditional theories were relegated to the background-the only votaries of these being the orthodox scholars teaching a student or two in their own houses. It is thus that the traditional interpretation of Vedic Texts sank into oblivion. These Vedic scholars too, poor and unaided that they were, never came into open controversy with the moderns ; nor did they write books vindicating the traditional exposition. Even if some were written, they were few and far between and very often left in manuscripts for want of necessary funds.

At or about the period when a nationalist spirit took possession of India, however, some Indian scholars tried to enter more studiously into the intricacies of these questions on the age of Veda, its origin, content and interpretation with the help of commentaries aided by a study of Mimamsa and tradition. But no persistent efforts appear to have been made in this connection in spite of the innate Hindu Conviction to the effect.

The present work is one such and probably the one of its kind taking into consideration the number of questions raised, western opinions quoted and criticised basing its views on expert Indian traditional exposition of a host of commentators.

In the present work, the authors have tried to show, as I think. the futility of pure reason and the arrogance of Rationalism in expounding subjects of a transcendental nature.

The Hari brothers have boldly undertaken this gigantic task of vindicating the ancient vedic etymologies and expositions with a conviction and they richly deserve the honour and glory of being the authors of such a work as this. The work speaks volumes of the labour these scholars have put forth over decades of study of ancient texts and commentaries. I wish them well and appeal to modern scholars of veda to study and understand their arguments sympathetically.

Waltair,
13-11-71. (Sd.) **V. Subba Rao.**

ఆచార్య డా॥ దివాకర్ల వేంకటావధాని,

M. A., (Hons.) Ph. D.

అధ్యక్షులు, తెలుగుశాఖ - ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు.

వేదవాఙ్మయము ప్రపంచమున నతిప్రాచీనమైన వాఙ్మయము. ఇతర ఖండము లందలి జనులు విద్యావివేకములు కాని, నాగరికలక్షణములుకాని లేక తమోమయస్థితిలో నున్నపుడే భారతీయ మహర్షులు వేదమంత్రములను దర్శించిరి. అందుచేతనే వారికి మంత్రద్రష్టలను సార్థకనామ మేర్పడినది. తరువాత గురుశిష్య పరంపరా క్రమమున వేదములు లోకమున ప్రచారము పొందినవి. గురు వుపదేశింపగా విను శిష్యులచే నుచ్చరింపబడిన వగుటచేతనే వానికి శ్రుతులను ప్రసిద్ధి. అనంతా వై వేదాః - అను ప్రతీతి యెల్ల రెఱింగినదే. భగవంతుడైన వ్యాసమహర్షి వానిని ఋగ్యజుస్సామాథర్వము లను నాలుగు వేదములుగ విభజించి వేదవ్యాసు డని పేరు గాంచెను. భారతీయ సంస్కృతి వల్లరికి మూల కందము అని చెప్పదగినవి వేదములు. యన్నేహాస్తి న తత్ క్వచిత్ – అను మాట పంచమవేదమైన భారతము నెడనే సార్థక మైనప్పుడు వేదముల విషయము వేఱుగా చెప్పనేల ?

వేదనిక్షిప్తము లయిన ధర్మ నీతి తత్త్వములను కథోపాఖ్యానముల ద్వారా సామాన్యజనులకు గూడ నందుబాటులోనికి దెచ్చుటకై వాల్మీకి వ్యాసాది మహర్షులు రామాయణ మహాభారతములను పురాణముల రచించిరి. అవి యన్నియు వేదార్థోపబృంహణార్థము రచింపబడినవే యనుటలో సందేహము లేదు. అవే కాక వేదాఙ్గములు, శాస్త్రములు, స్మృతులు కూడ వేదార్థ వినిర్ణయ ప్రచారముల నిమిత్తము వెలువరింపబడినవే. అందుచే వేదతత్త్వము నెఱుంగుట కెవ్వరైన ప్రధానముగ వానిపైననే యాధారపడవలెను. యాస్కుఁడు నిరుక్తమును ప్రవర్తింప జేసియు, సాయణాదులు భాష్యములు రచించియు వేదార్థావబోధనమునకు గావించిన సేవ యింతింతనరానిది.

వేదములు కర్మప్రధానము లనియు, యజ్ఞయాగాదుల యాచరణమునందు మాత్రమే యుపయోగించు ననియు గొందఱి యభిప్రాయము, కాని యది సరికాదు. వేదములయందు బురుషార్థములలో శ్రేష్ఠమైన మోక్షమునకు సాధనమైన బ్రహ్మజ్ఞానముకూడ నిమిడియుండును. వేద మను పేరే యా విషయమును జెప్పక చెప్పుచున్నది. దురదృష్టవశమున నిప్పుడు వేదవిజ్ఞానము క్రమక్రమముగ సన్నగిలి పోవుచున్నది. వేదముల వల్లించువారియు, తదర్థముల నెఱుంగదలచు వారియు సంఖ్య వ్రేళ్ళపై లెక్కపెట్టదగినదిగా నున్నది. ఇది భారతీయ సంస్కృతివికాస విస్తరణమున కెంత యాటంకకరమో వేఱుగ జెప్పనక్కఱలేదు.

'వేదము లపౌరుషేయములు; తన్మంత్రములను సమాధినిష్ఠు లయిన మహర్షులు దర్శించిరి' యను విషయమును విశ్వసింపక పలువు రిప్పుడు వానిని చారిత్రిక దృష్టితో బరిశీలించి యవి యితర లౌకిక రచనల వలెనే యొకకాలమున మానవులచేతనే కల్పింపబడిన వని భావించి వానికి స్వబుద్ధికల్పితములైన యర్థములు వెలువరించుటకు యత్నించుచున్నారు. వాని నవగాహనము చేసికొనుటకు వేదమునందే కల మంత్రములును, వేదాంగములును, శాస్త్రములును, స్మృతులును, పురాణములును దోడ్పడ నట్లుగ నెంత యుజ్జ్వలమైన దైనను కేవలమానవబుద్ధి యుపకరింప జాలదు. వేదములు స్వతఃప్రమాణములు. అందొకచోట గల పదముల నర్థము జేసికొనుట కన్యత్ర ప్రయుక్తము లయిన పదములు దోడ్పడును. అందుచే వేదములను సమగ్రముగ బరిశీలింపక, బుద్ధిమాత్ర సాహాయ్యముచే వాని యర్థము నెఱుంగ యత్నించుట కేవల బాహుసాహాయ్యమున దుర్గమగభీరమైన మహాజలరాశి నీదదలచుట వలె బరిహాసాస్పద మగును. మఱియు లౌకికగ్రంథములకు వలె వేదమంత్రములకు గూడ పరిమితమైన బుద్ధితోడ్పాటుతో నర్థనిర్ణయము జేయుటవలన నొక యుపద్రవముకూడ నావహిల్లును. లౌకికరచనలకు దురర్థము జెప్పుటవలన జ్ఞానసంకోచమే కలుగును గాని ప్రత్యవాయ మేమియు కలుగదు. వేదమంత్రముల కపార్థము జెప్పుటవలన రెండును నేర్పడును. అందుచే వేదార్థనిర్ణయవిషయమున నెంతైన జాగరూకత వహింపవలసియున్నది. వేదభారతివలె పరమాత్మస్వరూప నిర్ణయము చేయజాలు వాఙ్మయము మఱొకటి లేదు.

ఈ విషయమును గ్రహించి, పాశ్చాత్యులే కాక భారతీయులు కూడ కొందఱు వేదమంత్రములకు బుద్ధిప్రధానముగ జెప్పుచుండు నర్థవివరణాదులను, వ్యాఖ్యానముల జూచి సంతాపము నొంది, సంప్రదాయ విజ్ఞానరక్షణ తత్పరులైన హరిసోదరులు భారతీ (వేద) నిరుక్తి యను నీ మహోదాత్తగ్రంథమును రచించి భారతీయుల కృతజ్ఞతకు బాత్రులైనారు. నిరుక్తి యనగా పదముల కుత్పత్తినిర్ణయపూర్వకమైన యర్థవివరణము. నిరుక్తి యను పేరుగల యలంకారముగూడ నొకటి గలదు. 'నిరుక్తి ర్యోగతో నామ్నా మన్యార్థత్వ ప్రకల్పనమ్' - అని చంద్రాలోకము చెప్పుచున్నది. ఇది శ్లేషవిశేషమే యని కొందఱి యభిప్రాయము. వేదములందలి శబ్దముల విషయమునగూడ నీ నిర్వచనము సరిపోవును. అందలి శబ్దములు ప్రసిద్ధములగు నర్థములతోపాటు యోగశక్తిచే రమణీయతరమైన యన్యార్థస్ఫూర్తినికూడ గలిగించుచునే యుండును. శ్రీ హరిసోదరు లిందు వేదము లందలి శబ్దములకు సాంప్రదాయికములు, సమగ్రములు, సర్వాంగీకార్యములు నగు నర్థము లొసంగుటకై యత్నించి కృతార్థులైరి. అందుచే 'భారతీనిరుక్తి యను' నామధేయ మీ గ్రంథమున కెంతైన దగియున్నది. వారు వేదమంత్ర శబ్దార్థనిర్ణయమునకు గావలసిన సమగ్రవ్యుత్పత్తి నార్జించిన విమ్మటనే యీ కార్యమునకు కడంగియుండుట ముదావహము. ఆ వ్యుత్పత్తితోపాటు భగవత్ప్రసాదితమైన ప్రతిభయు వారికి పుష్కలముగ నలవడియుండుటచే వారు కావించిన యీ ప్రయత్న మత్యంతప్రశంసాపాత్రమై యలరారుచున్నది.

వేదము, ఋషి, బ్రహ్మ, ఆమ్నాయము, శ్రుతి, త్రయీ, స్వాధ్యాయము స్వధా,స్వాహా,వషట్,త్రయీ'భారతీ'ఛందములు - మున్నగు శబ్దములకు వేదములనుండియే కాక ప్రామాణికములైన యితరగ్రంథములనుండి కూడ నుదాహరణము లొసంగుచు వారు కావించిన వివిధార్థవివరణ మాశ్చర్యకరమై వారి వ్యుత్పత్తివిశేషమునకును, బహుగ్రంథపరిచయమునకును దార్కాణమై యున్నది. కావ్యమ్ - కవి యను ప్రకరణమున వేదముయొక్క కావ్యతావైశిష్ట్యమును నిరూపించిన తెఱంగు మిక్కిలి మెచ్చదగియున్నది. చారిత్రికుల వాదముల నుటంకించి యందలి లోపములను వారు చక్కగ బ్రకటించియున్నారు. అచ్చటచ్చట వారు వేదమంత్రముల కొసంగిన యర్థతాత్పర్యములు విస్పష్టములై, సర్వజన సుబోధములుగా నున్నవి. వారు వృత్తిచేతనే కాక సంస్కారవిశేషముచే కూడ వర్ణపరిశ్రమ గావించుచు నొక

వంక నైహికమునకు వేఱొకవంక పారలౌకికమునకు ఘంటాపథము నేర్పఱచు కొన్నారు. వారు ప్రకరణారంభములం దొసంగిన వేదమాతృ స్తవ రూపము లైన శ్లోకములు భావగంభీరములును, ధారాశుద్ధి శోభితములునై వారికి సంస్కృతభాషపై గల ప్రాభవమును, వేదములయెడ గల యాదరమును సూచించుచున్నవి.

ఇందలి వచనశైలి శక్తిమంతమై నిర్దుష్టమై ధారాళమై చదివినకొలంది చదువవలె నను నుత్కంఠ రేకెత్తించుచున్నది. ప్రతిపుటయందు హరిసోదరులు కావించిన కృషి స్పష్టముగా కానవచ్చుచున్నది. వా రెడనెడ గావించిన యర్థ వివరణము సులభమును, విమర్శ నిష్పక్షపాతము నై యింపు నింపుచున్నవి. వేదములయెడ వారికిగల గౌరవాదరములు మేదురము లైనవి. ఎంతో శ్రమపడి ఎన్నో గ్రంథముల బరిశీలించి వ్రాసిన యీ గ్రంథము వారి భారతీయసంస్కృతి సంపదభిమానమును జాటుచున్నది. జగద్గురువులు శ్రీ కామకోటి శంకరాచార్య స్వామి వర్యుల వేదములను గూర్చిన వ్యాస మీ గ్రంథమునకు దిలకాయమానముగా నున్నది. పండితాఖండలులు, సంప్రదాయాభిమానులు, రమణీయ రచనాదక్షులు నైన యీ గ్రంథకర్తలు పవిత్రములైన యిట్టి గ్రంథముల నింకను రచించి యాంధ్ర సరస్వతికివలె భారతీయసంస్కృతికిని నూత్నశోభ గల్గింతు రని వేడుచున్నాము.

హైదరాబాదు,
1—2—19[illegible]

(సం) దివాకర్ల వేంకటావధాని

మహోపాధ్యాయ, బాలవ్యాస, తర్క వ్యాకరణ వేదాంతకేసరి

శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

శ్రీరామ. శ్రీ హరిసోదరులచే రచింపబడి యున్న 'భారతీనిరుక్తి (వేద స్వరూపదర్శనము)' - అను గ్రంథము విద్వ దాదరణీయమై యొప్పుచున్నది. వేదవాఙ్మయములో గల నిగూఢవిషయము లెన్నియో బహుప్రమాణములతో నిరూపింపబడి యున్న గ్రంథరత్న మిది. రత్నములయొక్క వివేకవిజ్ఞానములు ఆ రత్నములతో వ్యవహరించు వారికే తప్ప ఇతరుల కసంభవము అగునట్లు అధ్యయన - అధ్యాపన - అర్థజ్ఞాన - ఆచరణ పద్ధతులతో సతతము వ్యవహరించు వారికే వేదములయొక్క వివేకజ్ఞానములు కాని యితరుల కవి యసంభవ మనుటలో సందేహము లేదు. ఇట్టి స్థితిలో వేదసారస్వతముపై వేదసంప్రదాయ మెఱుగని యాధునికుల వాదము లెన్నియో తలయెత్తినవి.

1. 6000 సం॥ ల నాడు ఆర్యులచే రచింపబడినవి వేదములు.

2. ఆ వేదములు 'త్రయీ' అనుటచే మొట్ట మొదట మూడే - అథర్వ వేదము చిరకాలమునకు గాని 'వేదము' అను ప్రసిద్ధి నందలేదు.

3. ఆ వేదములలోని బ్రాహ్మణభాగము వేదము కాదు - ఇత్యాదులు.

ఈ వాదములు అప్రమాణము లని, అసంగతము లని బహుప్రమాణ ప్రదర్శనపూర్వకముగా నిరూపించుచున్నది యీ గ్రంథము. ఆధునిక వాదములను బట్టి సందిగ్ధస్థితిలో నుండువారికిని, వేదసారస్వతారాధకులకును ఈ గ్రంథము మహోపకారకము.

ఈ గ్రంథరచనలో మీరు చేసిన కృషి యసాధారణము. దీని నభినందించు చున్నాము.

పిఠాపురము
26-11-1971

(సం) వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి

సాంగవేదసమ్రాట్, మీమాంసావిద్యాప్రవీణ

రేమిల్ల సూర్యప్రకాశశాస్త్రి

ప్రిన్సిపాల్, శ్రీ గౌతమీ విద్యాపీఠమ్, ఓరియంటల్ కళాశాల, రాజమండ్రి

శ్రీ హరిసోదరులు రచించిన 'భారతీనిరుక్తి' యను గ్రంథ మామూలాగ్రముగ చదివి పరిశీలించితిని.

వీరు వ్యాకరణాదిశాస్త్రముల నధ్యయనము చేయుటయే గాక ఇతరశాస్త్రముల యందును దృఢపరిచయము గలవారు. లౌకికాలౌకికములను రెంటిని పరిశోధన చేయుటయందు చాల నిపుణులు. కనుకనే హరివారికి పర్యాయపదముగ 'శోధన్ వారు' - అని గూడ వ్యవహారము గలదు. వీ రీ గ్రంథమును రచించుటలో నత్యంతపరిశ్రమ నొనర్చి సాగించిన కృషి అనన్యసాధారణమైన దని యీ గ్రంథ ద్రష్టలగువారికి వేఱుగ చెప్పనవసరము లేదు. వీరిగ్రంథమునకు చరిత్రకారులైన అధునాతనులు వేదములకు గల్పించిన యథార్థకల్పనలను, వారు ప్రదర్శించిన నాస్తికత్వమును నిరసించుటయే పరమలక్ష్యమై యున్నది.

లోకములో వేదార్థనిర్ణయమునకు రెండుపద్ధతులు గలవు. 1. మీమాంసా పద్ధతి 2. ఐతిహాసిక (చారిత్రిక) పద్ధతి. వైదేశికులును, తదనుయాయులై యాంగ్ల భాషాభిజ్ఞ మండితుల నైన భారతీయులును చారిత్రికదృష్టితోనే వేదముల విమర్శించి వేదములందు వినబడుచున్న ఋషులు ప్రాకృతజనులే యనియు, అట్టి ఋషులచే చేయబడిన తత్తద్దేవతా ప్రశంసావచనములే తత్తద్దేవతాసూక్తములుగ వ్యవహరింప బడుచున్న వనియు, ఆ యా వేదభాగము లా యా కాలములందు రచింపబడి యావిర్భావకాలవిశేషము గల వనియు, పెక్కువిధములుగ వేదములకు పౌరుషేత్వమును కాలపరిమితిని మున్నగు వానిని నిరూపించిరి.

షడఙ్గో వేదోఽధ్యేతవ్యో జ్ఞేయ శ్చ - అను వచనానుసారముగ అంగము లైన శిక్షా వ్యాకరణాదులచే వేదములయొక్క పదపదార్థములను తెలిసికొని విశేషముగ మీమాంసాది శాస్త్రసహాయముచే వాక్యార్థనిర్ణయము చేయవలసియున్నది. కనుకనే పార్థసారథిమిశ్రులు మీమాంసా న్యాయరత్నమాల యందు—

'జిజ్ఞాసోపనీతస్య ద్వితీయా పఠితశ్రుతేః।
జ్ఞాతవేదాంగకస్యాన్యా యా మీమాంసా పురఃసరా॥'

అను శ్లోకముచే మూడురకముల జిజ్ఞాసలు మూడుకాలములం దుండు నని సూచించిరి. అందు 1. ఉపనీతునకు తన కర్తవ్యమును తెలిసికొనుటరూపమైన జిజ్ఞాస. 2. అధ్యయనముజేసిన పిమ్మట అధీతవేదభాగమున కర్థమును తెలిసికొనుట రూపమైన జిజ్ఞాస. 3. వ్యాకరణాది శాస్త్రసహాయముచే పదపదార్థము తెలిసినపిమ్మట పరస్పరవిరుద్ధము గాకుండునట్లు వాక్యార్థనిర్ణయమును తెలిసికొనుట - అను మూడురకములైన జిజ్ఞాస లిట జెప్పబడినవి. దీని ననుసరించి వేదాంగములైన శిక్షాది శాస్త్రములచేతను, మీమాంసాది శాస్త్రసహాయముతోను వేదార్థము నిర్ణయింప వలసియున్నది. మఱియు 'ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్'— అను వేదవ్యాసవచనానుసారము వేదముల కుపబృంహకములైన ఇతిహాసపురాణాదుల చేతను వేదార్థము నిర్ణయింపబడవలసియున్నది.

ఆ రీతిగ వీరు వేదః, ఋషిః, బ్రహ్మ, ఆమ్నాయః. శ్రుతిః, స్వాధ్యాయః, స్వాహా, స్వధా, వషట్, కవిః - కావ్యమ్- ఇత్యాది వైదికపదముల ప్రదర్శించి, యవి యపౌరుషేయములగు వేదములకు పర్యాయపదము లని నిరూపించుటకై యనేకవిధములగు వ్యుత్పత్తి వైచిత్ర్యముల బ్రదర్శించిరి. వ్యుత్పత్తివైచిత్ర్యములచే పై పదములు వేదవాచకము లగుటయేగాక యనేకార్థములకు బోధకము లగుచున్న వనియు, ఇట్టి యర్థవిశేషగాంభీర్యముగల యీ పదములచేతనే చరిత్రకారులు కల్పించిన యభూతకల్పనారూపము లగు అర్థములు పొసగ వనియు, వానిచే పరస్పరవిరోధము వాటిల్లుచున్న దనియు నిరూపించిరి.

లోకములో పండితులు స్వాభిప్రేతములైన యర్థముల జూపుటకై వారికి తోచిన విధముగ వ్యుత్పత్తిని ప్రదర్శింతు రనియు గల యపవాదమును పరిహరించుటకై

వీరు ప్రతివ్యుత్పత్తివిశేషమునకును అనేకములైన శ్రుతిస్మృత్యాదులను ప్రమాణములుగ ప్రదర్శించిరి. ప్రమాణవిశేషములచే వ్యుత్పత్తివిశేషము నాశ్రయించి శ్రుతి స్మృత్యాదులకు పరస్పరవిరోధము లేకుండునట్లు ఏకవాక్యతను సంపాదింపవలెనని మీమాంసా తంత్రవార్తికమున కుమారిలభట్టపాదులు—

'మనుష్యప్రతిషేధా ద్వా తేజో బల వశేన వా ।
యథా వా శ్రుత్యవిరుద్ధ స్తథా తద్గమయిష్యతి ॥

అని నుడివిరి. అనగా పురాణపురుషులైన యుధిష్ఠిర విశ్వామిత్రాదులు శాస్త్రీయ నిషేధముల నుల్లంఘించిరి ; అందువలన శిష్టాచారము ప్రమాణము కానేరదు—అను శంకకు సమాధానముగా— "శాస్త్రములందలి విధినిషేధములు మనుష్యాధికారకములు లేక యవి వారికిగూడ వర్తించినను వారు తమ తపోబలముచే నిషేధోల్లంఘనజన్య ప్రత్యవాయమును పరిహరింప సమర్థులు ; లేదా మన మనుకొను రీతిలో రూఢ్యర్థమును స్వీకరింపక వ్యుత్పత్తివిశేషముచే అర్థవిశేషమును గ్రహించి, శ్రుతిస్మృత్యాదులకు పరస్పరము విరోధము లేకుండునట్లు సమన్వయము చేసికొనవలెను."— అని యర్థము. ఏతదనుగుణముగనే ప్రమాణపురఃసరముగ వేదః మొదలైన పదములకు వ్యుత్పత్తివిశేషముల జూపి, వేదములయొక్క— అనాదిత్వ - అపౌరుషేయత్వ - నిత్యత్వ - స్వతఃప్రమాణత్వాదులను ప్రదర్శించి, నాస్తికులయొక్క నాస్తికత్వమును నిరసించుచు, ఆస్తికుల యాస్తికత్వమును బెంపొందించుట కీ గ్రంథము మహోపకారక మనుట నిర్వివాదము.

వీరి పరిశోధనయందలి సామంజస్యమును నిరూపించుటకై స్థాలీపులాక న్యాయముగ నొకటి రెండు స్థలములయందలి పరిశోధనలను జూపుచున్నాను.

'వేదః' అను పదమును నిర్వచించుచు, 'వేత్తీతి వేదః' అను నిర్వచనముచే నిది బ్రహ్మవాచకమై, 'వేదయతీతి వేదః' - అను నిర్వచనము ననుసరించి యట్టి బ్రహ్మను ప్రతిపాదించుటచే నీ గ్రంథము వేదము అను నామమున విలసిల్లిన దనియు, వేదపదము పలుచోట్ల పలువిధములుగ ప్రయోగింపబడి ముఖ్య లాక్షణికాది భేదములతో నొకే యర్థమునందు పర్యవసితమైన దనియు, 'ఋగ్యజుఃసామాత్మక వేదరాశి నా స్వరూపము' - అని భగవంతుడు కీర్తించినట్లుగల శ్రుతి స్మృత్యాది

వచనములు భిన్నదేశములందు భిన్నకాలములందు భిన్నకర్తలచే రచింపబడి యుండుచో 'ఇట్టి ఈ భిన్నకర్తృకములు భిన్నకాలికములు అగు వేదములు భగవత్స్వరూపము' అని ఏ కర్త చెప్పగలడు? - అని సూటిగ ప్రశ్నించుచు అర్థగాంభీర్యముగల వేదశబ్దముచేతనే వేదములయొక్క అనాదిత్వ - అపౌరుషేయత్వములను వీరు నిరూపించిరి.

ఇట్లే స్వాధ్యాయపద నిర్వచనసమయమున మహాభాష్యకారులు చూపిన వ్యుత్పత్తివిశేషముల బేర్కొని, మీమాంసాశాస్త్రమున సర్వశాఖాధికరణ మందు జెప్పబడినట్లుగ గూడ 'స్వశ్చాసౌ అధ్యాయః స్వాధ్యాయః' - అను వ్యుత్పత్తి నాశ్రయించి పితృ పితామహ పరంపరాగతమైన వేదశాఖాధ్యయనము జేయవలె ననియు, భాట్టచింతామణ్యుక్తప్రకార మొక్కొక్క వేదమం దొక్కొక్క శాఖాధ్యయనము నిత్య మనియు, 'స్మర్యతే చ వైశంపాయనః సర్వశాఖాధ్యాయీ' యను భాష్యకారవచనానుసారము కృత్స్న వేదశాఖాధ్యయనము జేయ నగు ననియు నిరూపించి, పై నిర్ణయముల కుపష్టంభకములుగ స్మృతి పురాణాది వచనముల నుదాహరించి కొందఱు కేవలము ఏకశాఖాధ్యయనము, కొందఱు ప్రతివేదశాఖాధ్యయనము, కొందఱు కృత్స్నవేదశాఖాధ్యయనము చేయవలె నని యుగభేద - అధికారిభేదముల ననుసరించి వ్యవస్థ చేసిరి.

వేదార్థనిర్ణేత లందఱు వేదవ్యాస వచనానుసారము వేదార్థోపబృంహకము లగు నితిహాస పురాణముల నన్నిటిని విమర్శింపవలసిన భారమును తగ్గించి యొకే చోట వీని నన్నిటిని పుంజీకృతము చేయుటచేత వీరికృషి గమనార్హము; వేదార్థ నిర్ణేతలకు నత్యుత్తమమహోపకారకము.

ఈ విధముగ నన్నితెగలవారికి - ఆస్తికులకు ఆస్తికత్వమును బెంపొందించుకొనుటకును, నాస్తికులకు నాస్తికత్వమును బరిహరించుకొనుటకును, వేదార్థనిర్ణేతల కర్థనిర్ణయము జేసికొనుటకును, సాహిత్యపిపాస గల వారలకు వ్యుత్పత్తివిశేషముల నాశ్రయించి సాహిత్యమును బెంపొందించుకొనుటకును - అధికారిభేదము ననుసరించి పెక్కువిధములుగ నుపయోగపడెడి యిట్టి యీ గ్రంథ మపూర్వమైనదనియు, అనన్యసాధారణమైన దనియు జెప్పుట యతిశయోక్తి గానేరదు.

ఈ యాధునికయుగములో ప్రాచీనసంప్రదాయము ననుసరించి యొక్కొక్క శాస్త్రమునందు నిష్ణాతులైనవారే అతిదుర్లభము. నవ్యవిజ్ఞానము (సైన్సు) ఝరీవేగముతో ప్రతిమానవుని ఆవరించుచున్నది. విద్యావిధానములోను, సాంఘిక వ్యవస్థలోను విపరీతమైన మార్పులు వచ్చిన కాలమిది. ప్రాచీన సంప్రదాయాను గుణముగ శాస్త్రీయవిజ్ఞాన పరిచయముగల భాగ్య మీ నాటి పౌరులలో చాలవఱకు మృగ్యము. నవ్యవిజ్ఞానము బాహ్యవిషయములను మాత్రమే సూచింపగలదు కాని యాధ్యాత్మిక విషయములను సూచింపలేదు. ఐహికాముష్మిక విషయ విజ్ఞాన సముపార్జనా పిపాసగల వారందఱీ గ్రంథమును బఠించి ధన్యు లగుదురు గాక.

మఱియు నిట్టి యపూర్వగ్రంథములను రచించుటకు రచయితలకు తగు సామర్థ్యమును, ఆయురారోగ్యాదులను పరమేశ్వరుడు ప్రసాదించు గాక – అని ప్రార్థించుచున్నాను.

రాజమహేంద్రవరమ్
18—12—1971

రేమిల్ల సూర్యప్రకాశశాస్త్రి

శ్రీ సూరి రామకోటి శాస్త్రి గారు

ప్రిన్సిపాల్. కె. యల్. యన్. సంస్కృతకళాశాల, తెనాలి.

భారతీ నిరుక్తి

వేద ధర్మ సంప్రదాయ రక్షణాయ ప్రవృత్తోఽయం గ్రన్థః అన్వర్థ నామపరిశీలన ముఖేన వేదస్వరూపం దర్శయన్ చకాస్తి। ఏషా పద్ధతిః మాయాస్వరూప వివరణే పంచపాదికాకారై రాదృతా। వేదః, ఋషిః, బ్రహ్మ, ఆమ్నాయః, శ్రుతిః, స్వాధ్యాయః, ఛందః - ఇత్యాదీనాం నామ్నాం గమ్భీర మర్థం వివేచయన్తః శ్రీ హరిసోదరాః ఋషీణాం భావనాపథం సప్రమాణం పురస్కుర్వతే। నిరస్యన్తి చ సయుక్తికం కువాదాన్ విమర్శకాగ్రేసరాణా మసామ్ప్రదాయికానామ్। ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞాన ఫలభూతోఽయం నిబన్ధః విద్యాస్థానేషు వేదస్య ప్రాముఖ్య మావిష్కుర్వన్ తత్త్వజిజ్ఞాసూనా ముపకారాయ కల్పతే। ప్రచయం గచ్ఛ న్నయం పరిశోధనోద్యమః భారతీయానాం సంస్కృతేః ధర్మస్య విజ్ఞానస్య చ ప్రకాశనేన జేగీయతామ్.

ఇతి నివేదయితా

తెనాలి
24—12—71

(సం) సూరి రామకోటి శాస్త్రి
సుధీవిధేయః

వ్యాకరణరత్న-వ్యాకరణాచార్య-ఉపనిషదర్థవాచస్పతి-దర్శనాచార్య

శ్రీ పేరి సూర్యనారాయణశాస్త్రి గారు

శ్రీ హరిసోదరులు వేదములను వేదభాష్యములను వేదాంగములను లౌకిక సంస్కృత వాఙ్మయమును బాగుగ పరిశీలించి "భారతీనిరుక్తి" యను చక్కని గ్రంథమును నిర్మించిరి. ఈ గ్రంథము ఈ నాటి ప్రజలలో కలిగెడి కలవరములకు చక్కని సమాధాన మీయగలదు. దీని మూలమున వేదవేదాంగములందు ఆస్తికులకు విశ్వాసాతిశయము కలుగును. తాను నమ్మిన పదార్థమందు ఇతరులు ఆక్షేపము చూపి నపుడా యాక్షేపములకు పరిహారము లేనియెడల నా పదార్థమందు విశ్వాసము తగ్గుట సహజము. వేదములు అపౌరుషేయములు. అవి ఐహిక పారలౌకిక సౌఖ్యములను బోధించుచు చివరకు నిర్గుణాద్వయ బ్రహ్మభావ మగు మోక్షమును జీవునకు బోధించును. దీనిని భారతీయులు విశ్వసించి యున్నారు. కాని ఖండాంతరీయుల వాసనాబలముచే ఏవియో కొన్ని యాక్షేపములు తట్టగ వానికి తగు విధమగు సమాధానము లేని యపుడా విశ్వాసము సన్నగిల్లును. ఇట్టి దురవస్థ ప్రస్తుతము భారతీయులకు తటస్థించినది. ఇట్టి సమయమున ఈ గ్రంథము ఇతరుల యాక్షేపములకు తగు రీతిని సమాధాన మిచ్చి ఆస్తికులకు వేద వేదాంగములందు విశ్వాసాతిశయములను కల్పించగలదు.

ఇందు వేదః, ఋషిః, బ్రహ్మ, ఆమ్నాయః-శ్రుతిః. స్వాధ్యాయః, స్వాహా, స్వధా, వషట్, త్రయీ, కవిః-కావ్యమ్, భారతీ, ఛందః — అను శీర్షికలతో అనేకవిషయములు చర్చింపబడినవి.

ఈ గ్రంథమును సమగ్రముగ పరిశీలించినచో భారతీయవిజ్ఞానమున హరిసోదరులకు గల శాస్త్రవైదుష్య మెంతయో విదితము కాగలదు. ఇంకను ఇట్టి ఉత్తమ గ్రంథములను రచించి లోకోపకారము చేయుటకై వారికి సకలశ్రేయస్సుల నొసంగ వలయునని పరాత్పరుడగు శ్రీహరిని ప్రార్థించుచున్నాడను.

గౌతమీ విద్యాపీఠము.
ఓరియంటల్ కాలేజి,
రాజమండ్రి
8-1-72.

ఇట్లు
పేరి సూర్యనారాయణశాస్త్రి

శ్రీ జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, తెనాలి

భారతీ సేవాయత్త చిత్తులగు సోదరులకు నమోవాకములు. మీ గ్రంథము చూచితిని, అమితానందముతో తలమునుక లైనవి. ఇది మీ ప్రతిభావ్యుత్పత్తుల కొక మచ్చుతునక. వేదమాతృ హృదయమును ప్రపంచించుట యన్న సామాన్య విషయము కాదు. ఆ తల్లి 'నాసంతానము నిర్వీర్యము కాదు; మాతృగౌరవము నిలబెట్టగల బిడ్డలు నేటికిని ఉన్నారు గదా!' - అని మురిపెపడును. ఆమె యాశీస్సు, అనుగ్రహము మీకు (నాకు గూడ) సదా కలుగుగాక.

'వేదోఽసి; అహో బుధ్నియ' - మున్నగు మంత్రముల ద్వారా వేదాపౌరుషేయత్వమును సాధించుటలో మీ వాదపటిమ శ్లాఘనీయము. వేదములకు పౌర్వాపర్యము గలదు - అను వాదము తుత్తునియలు గావింపబడినది. ఉపనిషత్తత్త్వము సంహితలందును ప్రతిపాదింపబడిన దనుటలో మీరు చూపిన ప్రతిభకు ముగ్ధుడనైతిని. ఋషిశబ్ద తాత్పర్యనిరూపణములో గూడ మీ ప్రతిభ అడుగడుగున ప్రస్ఫుటమగుచున్నది. ముఖ్యముగ 'ఋషీణాం పున రాద్యానాం'- అను స్థలమున మీరు జేసిన సమన్వయము నాన్యతో దర్శనీయము; శ్రుతిచోదితార్థ ప్రతిపాదన సమర్థము. బ్రహ్మశబ్ద విచారమున సంస్కృత శబ్దశక్తి స్వరూపము చక్కగ వివరింపబడినది. ఉపాదాన కారణసామ్యముచే 'వాక్కే బ్రహ్మయే' యని ప్రతిపాదింపగలుగుట శ్రుతికిని, తన్మననపరాయణులగు వారికిని (మీకును) జెల్లును. ప్రతిష్ఠాశబ్దము బ్రహ్మప్రతిపాదక మను విషయము సోపపత్తికముగ నిరూపితము. నవ - నవ్య శబ్దవిచారమునను, అశ్వమేధయాగమున స్వయంకృత గాథలగూర్చిన విచారమునను, వాక - అనువాక - అనూచానాది పదముల వివరణమునను మీ బుద్ధివైభవము కండ్లకు గట్టును.

స్వాహాశబ్దపరిశీలనమును తదేకలగ్న బుద్ధితో జూచితిని. మీరు జూపిన సమన్వయము, స్వాహా దేవతాతత్త్వమును వ్యక్తపఱచుటలో మీరు పడిన శ్రమ బుధజన ప్రశంసనీయము. దీనిని విని శ్రీశ్రీశ్రీ కామకోటి శ్రీచరణులు అమితానందపరవశులై రన్నచో - ఆ సమయమున వారు తప్పక పరాదేవతను

దర్శించియే యుందురు. ఈ షట్టమును చదివిన ప్రతి సహృదయు డట్టి యానంద మునే పొందును. దీని నంతయు జూడ ఆ స్వాహాదేవతయే - ఆ చల్లనితల్లి సరస్వతియే - మిమ్ము ఆవేశించినట్లు తోచును. ధన్యా యూయం; అహ మపి ధన్యః.

స్వధాశబ్దవిచారము స్వాహాశబ్దవిచారముకంటె మిన్నగ నుండునా? — యను తలంపుతో చదువ మొదలిడితిని. కాని, 'నా బుద్ధి భ్రమాత్మకమ'ని మీ యీ స్వధాశబ్దపరిశీలనము నిరూపించినది.

త్రియాశబ్దము మన్త్రత్రైవిద్యప్రతిపాదకము, యోగత్రైవిద్య ప్రతిపాదకము; అథర్వవేద విషయమై చారిత్రికకల్పనలు భ్రాంతిమూలకములు - ఇత్యాది విషయముల గూర్చిన మీ ప్రతిపాదన మసందిగ్ధముగ నప్రతిహతముగ సాగినది. వేదము ప్రభు సుహృత్ కాంతా సంమితమై తానే కవియు కావ్యము గూడ: ఈ విషయమై "నియతికృత నియమరహితామ్" "ఇదం కవిభ్యః పూర్వేభ్యః" మున్నగు శ్లోకములకును, అట్లే భరత, అగ్ని-వాయు-ఆదిత్య, ఇడా-సరస్వతీ-భారతీ స్వరూపముల వివరించుచు 'మాతా రుద్రాణామ్; మనో హి సరస్వాన్ వాక్ సరస్వతీ'—ఇత్యాది మంత్రములకును మీరు చూపిన సమన్వయము ముచ్చటగా నున్నది. 'భరతు లొక తెగవారు'—అను వాదము చక్కగ పరాస్తమైనది. బ్రహ్మశబ్ద విచారమునను, ఛందఃశబ్ద ప్రకరణమునను బ్రహ్మ-బ్రాహ్మణ శబ్దార్థవిచార మత్యన్త సమీచీనము. బ్రాహ్మణభాగములో మంత్రభాగము కాని, మంత్రభాగములో బ్రాహ్మణభాగము కాని యుండ దను భ్రాంతి నిర్మూలితమైనది. "మన్త్రబ్రాహ్మణయో ర్వేదనామధేయమ్" అను ఆర్షసంప్రదాయ మిట సిద్ధాంతీకరింపబడినది. తుదకు సర్వము ఛందోమయముగ దర్శింపజేయుటతో ఛందశ్శబ్ద ప్రాశస్త్య మినుమడించినది. మీ యీ గ్రంథము శ్రుతిహృదయము నెఱుగగోరు వారికి కరదీపిక కాగలదని విశ్వసించుచు సెలవుతీసికొందును.

"ఛందోమయాయ పురుషాయ నమః పరస్మై"

తెనాలి,
23-4-71,

జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రి

గ్రంథమండలి మాట

అనంతనామధేయాయ సర్వాకార విధాయినే
సమస్తమంత్రవాచ్యాయ విశ్వైకపతయే నమః

ఒక డొక విద్యయందు వింధ్యమువలెఁ బెరిగి, స్వీయప్రతిభా సమున్మేషమాత్ర మూఁతగాఁగొని, తన కవిదిత సంప్రదాయమైన వేఱొక మహావిద్యను వ్యాఖ్యానింపఁ బూనుచో- వానికి లౌకికముగా నొక మహాధికార పదవికూడ సంప్రాప్తించియున్నచో- నాతఁడు సేయు దుర్వ్యాఖ్యానమనెడు గర్తమునుండి యా మహావిద్యను సంప్రదాయ శుద్ధముగా సముద్ధరించుటకు బృహస్పతి యొకఁడు చాలఁడు. ఏలన; వాఁడువింధ్యమై పెరుఁగువేళ వాని ప్రతిభ వికసించినదికదా! అట్లు వికసితమైన ప్రతిభతో వాఁడు తర్కించును. వాని తర్కమున కెవఁడు సమాధానము చెప్పఁగలఁడు? వాఁడు ఇటు చూపి అటు, అటుచూపి ఇటు ప్రతారించును. ఓడి గెలిచితి ననును. వాఁడు అధికార వింధ్యముగాఁ బ్రసిద్ధుఁడు కదా! లోకము వానినే యనుసరించును. అప్పుడీ సంప్రదాయజ్ఞుఁడైన విద్వాంసుఁ డుస్సురని నిట్టూర్పుట దక్క యేమి చేయఁగలఁడు? అహో! కువ్యాఖ్యయొక్క జీవమెంత గట్టిది! అది రాహువు. దాని తల తఱిగినను తలకుఁదలగా మొండెమునకు మొండెముగా నది బ్రతుకుచుండును. అందులకే సంప్రదాయవేత్త విద్యా పరిరక్షణమునం దనంతకాలము పరిశ్రమించుట.

పాశ్చాత్యులు, అపౌరుషేయములు, అవిచ్ఛిన్న సంప్రదాయ సంప్రాప్తములు నగు వేదములను పౌరుషేయములుగా వ్యాఖ్యానించిరి. కాలకాలుని నిట్టూర్పులకు (అస్య మహతో భూతస్య నిశ్వసిత మేతద్ యద్........) కాలనిర్ణయము సేయఁ బూనిరి. అచ్చమైన జ్ఞానరాశికి కర్తలను వెదకిరి. 'చైతన్యమున కుత్పత్తిస్థానము జడము'-అనెడి విజ్ఞాన సంప్రదాయమునకుఁ జెందినవారి బుద్ధుల కట్లు తోచుటయం దాశ్చర్యములేదు. ఆ పాశ్చాత్యులు తదనుయాయులు కల్పించిన దుస్తర్కగర్తము నుండి వేదవాణిని వేదములయొక్క బలముతోడనే సముద్ధరించుటకు విద్వన్మూర్ధన్యులైన శ్రీహరి సోదరులు కొన్ని దశాబ్దములు సాగించిన సారస్వత తపముయొక్క పంట యీ భారతీనిరుక్తి. వారు తమ యీ గ్రంథమునందు-వేదరాశి తన నుద్దేశించి చేయఁబడు దుర్వ్యాఖ్యానములగూర్చి తానే యేమనుచున్నదన్న విషయమును నిరూ

పించుచు - వేదములను దుష్టతర్కాఘాతములనుండి పరిరక్షించుట కర్తవ్య కవచముగా వేదమునే వినియోగించినారు. ఇచ్చట వేదమునకుఁ గవచము వేదమే. వేదమే శత్రుశిరః కర్తనదక్షమైన ఖడ్గము. వేదమే స్వీయ సంరక్షణోద్యోగ శీలియైన ఖడ్గి. ఈ విధముగా ఈ భారతీనిరుక్తి, గాధేయబల సమాక్రాంతమై ఆత్మరక్షణకై స్వశరీరమునుండియే వివిధాయుధములతోడి వీరులను సృజించిన వశిష్ఠుని శబళ.

అందుచేతనే శ్రీ శ్రీ శ్రీ పరమహంస పరివ్రాజకాచార్య వర్యులు, శ్రీ కాంచీ కామకోటి పీఠాధీశ్వరులు నగు శ్రీ జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారు శ్రీ హరిసోదరుల యీ గ్రంథము నత్యంతాసక్తితో విని మెచ్చుకొని వీరి యీ గ్రంథమును సర్వాంగ సుందరముగా మీ మండలియం దచ్చొత్తింపు డనుచు ఆశీః పురస్సరముగా నన్నాదేశించిరి. గ్రంథము ముద్రితమైనది. శ్రీహరి సోదరులు నన్ను వెంటనిడుకొని గ్రంథమును కార్వేటి నగరమునందున్న శ్రీ జగద్గురువులకు సమర్పించిరి. అపుడు స్వామి ముఖమునందానందము, మా శీర్షములపై (శ్రీహరి సోదరులు, నేను) నాశీర్వాదాక్షతలు, మా అందఱి భుజములపై కాశ్మీరు శాలువలు యౌపపద్య విస్తృతిని భజించినవి. శ్రీ స్వామివారి యామోదానుసారము ఈ గ్రంథమునకు పీఠిక రచియించిన సాంగస్వాధ్యాయ భాస్కరులు, బ్ర. శ్రీ కుప్పా లక్ష్మావధానులుగారికిని, కోరినంతనే ఆనందముతో తమ యభిప్రాయముల నొసంగిన పండిత పకాండులకును నా హృదయపూర్వక నమస్కారములు.

ఇట్టి ఈ మహాగ్రంథమును సర్వవిధముల సామాన్యుడనైన నేను ఆర్థికముగా శక్తి ఆవంతయు జాలని మండలియం దచ్చొత్తించుటకు శ్రీ స్వామివారి దివ్యాశిష మెంత కారణమో, శ్రీహరి సోదరులకు నా యందును, మండలియందును గల సహజ సౌహార్ద మంత కారణము. ఒకటి దివ్యమై పాలింపఁగా వేఱొకటి లౌకికమై సాక్షాత్కరించినది. నాకీ భాగ్యము కలిగించిన శ్రీ స్వామివారికి నమస్కరించుచు, వేదమాతయైన యీ భారతీ నిరుక్తికిఁ బ్రణమిల్లుచు, శ్రీహరి సోదరులయెడ వినయ వినమితుఁడ నగుచు, నా జీవితము - మండలి కృషియు చరితార్థ మని భావించుచు, వేదవిద్యా సంప్రదాయజ్ఞమైన విద్వల్లోకమున కీ గ్రంథ మమందానంద సంధాయి కాఁగలదని విశ్వసించుచున్నాను.

ఇట్లు
విధేయుఁడు
బులుసు సూర్యప్రకాశశాస్త్రి
వ్యవస్థాపకుఁడు, సాధన గ్రంథమండలి

తెనాలి
విరోధికృత్
పుష్యము

వందన సమర్పణము

'నిరుక్తం నామ శబ్దస్య సర్వావయ వార్థానుగమేన ప్రసిద్ధాదర్థా దర్థాన్తరేవృత్తిః' అని పంచపాదికా వివరణమునందలి నిరుక్త లక్షణము. ఇట్టి నిరుక్తమే "నిరుక్తి ర్యోగతో నామ్నా మన్యార్థత్వ ప్రకల్పనమ్"—అనెడి నిరుక్త్యలంకారమై సాహితీ లోకమున విలసిల్లుచున్నది. వైదిక శబ్దార్థ తత్త్వమును దర్శించుటకై ముప్పది యేండ్లకు పైబడిన మా పరిశోధనలోని కొంత భాగ మిపుడు భారతీనిరుక్తి యను పేర ప్రకటితమైనది. మా యీ నిరుక్తి రూపమగు తొలి కుసుమము వేద వేద్య—శ్రీ వేణుగోపాల దేవపదముల కలంకారమై వెలయుట మా భాగ్యము. మా కుల దైవము శ్రీ వేణుగోపాలుడు తన దివ్యపదముల కిట్టి యలంకారముల గూర్చెడి భాగ్యమును మాకు నిరంతరము ప్రసాదించుగాక. "కస్మైచి దస్మై నమః"

ఏ ప్రాచీన భారతీయ వాఙ్మయము మా యీ రచన కాలంబనమై నిలిచి వెలుగుబాటల జూపినచో ఆ వాఙ్మయ ప్రవర్తకులగు యాస్క శౌనక వ్యాస వాల్మీకాది మహర్షులకును, శబర శంకరాది దర్శనకారులకును, సాయణ మహీధరాది భాష్య కర్తలకును, కాళిదాసాది మహాకవులకును మేమెంతయో ఋణపడియున్నాము. "తేభ్యో నమస్కుర్మహే"

ముద్రితమైన మా యీ గ్రంథమును మరల గూడ మూడు రోజులపాటు సావధానముగ విని, "మీ అభిమాన కోశము వర్ధిల్లుగాతి" – "వెంటనే హిందీ ఆంగ్లభాషలలోనికి అనువాదము జరుగవలెను"—అనుచు ఆశీర్వదించి యను గ్రహించిన జగద్గురువులు శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతులు మా హృదయసీమల నెల్లెడ నధివసించి తమ యాశీస్సులచే తనుపుచుందురు గాక - 'వందేమహి చ తాం దేవీం కామకోటి సంస్థితిమ్"


1947 వ వత్సరముననే మా యీ పరిశోధనను గాంచి తమ యభిప్రాయ ముల నొసగుటయే గాక గ్రంథ మెపుడు ముద్రితమై రూపుదాల్చునా యని ప్రతీ క్షించుచు నడుగడుగున వాత్సల్యము మీఱ ప్రోత్సహించిన శతావధానులు. కీ. శే. శ్రీ కాశీ కృష్ణాచార్యులు, శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారును, పండిత ప్రకాండులు, టి. ఎ. వేంకటేశ్వర దీక్షితార్ మహాశయులును మాకు చిర స్మరణీయులు. "నమో మహద్భ్యః కవి పండితేభ్యః"

జగద్గురువులు శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతుల యామోదమును బొంది, మా యభ్యర్థనమును మన్నించి, మా యీ గ్రంథమును ప్రత్యక్షర పరిశీలనము గావించి, యమూల్యము విపులమునగు పీఠికను గూర్చిన సాంగ స్వాధ్యాయ భాస్కరులు శ్రీ కుప్పా లక్ష్మావధానులు గారికిని, బహుకార్య వ్యాపృతులయ్యు నత్యాసక్తితో మా యీ గ్రంథము నామూలాగ్రముగ సాదరముగ సవిమర్శముగ విని యానందించుటయే గాక ద్విగుణీకృతోత్సాహులై పాఠక లోకమున కీ గ్రంథమును పరిచయము చేసిన కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథులకును, సాదరముగ మా యీ గ్రంథమును బరిశీలించి యమూల్యములగు తమ యభిప్రాయముల నొసగిన పండిత వర్యులు శ్రీ ఉప్పులూరి గణపతిశాస్త్రిగారికిని, శ్రీ రేమిల్ల సూర్యప్రకాశ శాస్త్రిగారికిని, శ్రీ కుప్పా శ్రీఆంజనేయ శాస్త్రిగారికిని, శ్రీ వీరేశ్వరకృష్ణ దోంగరే శాస్త్రిగారికిని, శ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి గారికిని, శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి గారికిని, శ్రీ జటావల్లభుల పురుషోత్తము గారికిని, శ్రీ వేటూరి సుబ్బారావుగారికిని, శ్రీ దివాకర్ల వేంకటావధానిగారికిని, శ్రీ పేరి సూర్యనారాయణ శాస్త్రిగారికిని మఱియు గ్రంథరచనా విషయమున తగు సూచన లిచ్చి యుత్తేజపఱచి, యమూల్య మగు తమ యభిప్రాయము నొసగిన విద్వద్వర్యులు శ్రీ సూరి రామకోటి శాస్త్రిగారికిని—మే మెంతయు కృతజ్ఞులము. "నమాంసి [illegible]ద్భ్యో వి భూషణేభ్యః"

మాలో నొకరుగ మెలగుచు, రచనను ప్రోత్సహించుచు, వ్రాతప్రతుల రాత్రిం దివలు పరిజూచుచు ముద్రణకు యోగ్యముగ గ్రంథమును సిద్ధపఱచుటలో నెంతయో తోడ్పడుటయే గాక శ్రీవారి యాశయానుగుణముగ నీ గ్రంథమును హిందీలోని కనువదించుటకు సత్సాహముతో బూనుకొనిన ప్రియమిత్రులు పండితులు శ్రీ జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రిగారును, ఈ గ్రంథ ప్రకాశకులును, ప్రాచీన సంప్రదాయ రహస్యముల నుద్యోతించు గ్రంథముల వెలువరించుచు వాఙ్మయసేవ నొనర్చుచున్న సాధనగ్రంథమండలి (తెనాలి) వ్యవస్థాపకులునైన శ్రీ బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారును, ఈ గ్రంథమును సర్వాంగసుందరముగ ముద్రించుటలో మిగుల సహకరించిన ఎ. యస్. ఆర్. పవర్ ప్రెస్ (తెనాలి) యజమానులు శ్రీ ఎ. రామకృష్ణారావుగారును మాకెంతయు నభినందనీయులు. 'నమః సఖిభ్యః నభివిద్భ్యః ఏభ్యః'

ఎంత శ్రద్ధగ జూచినను ప్రమాదవశమున నచటచట దొఱలి యుండెడి నెఱసులను సహృదయులు మన్నింతురు గాక. 'నమాంసి సద్భ్యః సంసద్వృత్తేభ్యః'

వేదవేదాంగ తత్త్వజ్ఞాన్ స్వధర్మ ప్రతిబోధకాన్ ।
సంప్రదాయక్రమసంపన్నాన్ వందంతే హంసోదరాః ॥



ఆంధ్రదేశమునందలి వేదశాస్త్రప్రముఖుల ప్రోత్సాహముచే విజయవాడలో

శ్రీ కాంచీ కామకోటి పీఠమునకు సమర్పింపబడిన

వజ్రహార శ్రీ కామాక్షీ గర్భిత రత్నఖచిత

స్వర్ణమకుటము

శ్రీః

గురు దేవతా స్తుతిః

ఇదంపురనివాసం శ్రీ వేణుగోపాలవిగ్రహమ్।
పితృపైతామహధనం నమామ జగతాం గురుమ్॥
చిద్ఘనాయ ప్రసన్నాయ శ్రుత్యాకాశవిహారిణే।
అద్వైతామృతవర్షాయ శంకరాయ నమో నమః॥

కామకోటిమహాపీఠవాసినీం కామితార్థదామ్।
వందేమహి చ తాం దేవీం చంద్రశేఖరసుందరీమ్॥
త్రయీవిద్యాత్మికాం దేవీం కాంచీపురమహాద్యుతిమ్।
నమామ కామకోటిం తాం జయేంద్రవినుతాం ప్రభామ్॥

సోమయాజిగురుం వందే దుర్గాంబాం మాతరం శుభామ్।
యౌ సర్వగుణసంపన్నౌ శివావివ శివాయ నః॥
వేణుగోపాలదేవస్య మందిరం గోపురాదికమ్।
నిర్మాయ సుకృతాత్మానౌ పితరౌ తావుపాస్మహే॥

పితృవ్యం రామశర్మాణం అగ్రజస్యానుగామినమ్।
పురాణోపనిషచ్ఛాస్త్ర మననైకరతం సదా॥
రామనామామృతాస్వాదనిరతం ధర్మతత్పరమ్।
మార్గదర్శిన మస్మాకం నమామ శిరసా గురుమ్॥

హనుమచ్ఛాస్త్రిణం వందే వైయాకరణభూషణమ్।
కరుణాళం కులపతిం సంస్కృతం యస్య జీవితమ్।
కవితార్కికసింహం శ్రీ గోవిందాచార్య మేవ చ।
రంగరామానుజాచార్యం వందే శాస్త్రైకజీవితమ్॥

పితౄన్ దేవాన్ ఋషీన్ దివ్యాన్ గురూన్ శాస్త్రార్థకోవిదాన్।
నమామ విదుషో యేషా మాశిషేయం కృతి స్తతా॥

అవతారిక

అజముఖాంబుజ నిఃసృత వాహినీ
హరి హృదబ్ధి తరంగ విహారిణీ ।
హరశరీర మహాచల వాసినీ
త్రిపథగా త్రిపదా నను భారతీ ॥

అంబ ! భారతి ! నిరుక్తిరంజితే
సూనృతే మధురసూక్తశోభితే ।
భావనాంబర విహార విశ్రుతే
పాహి పావని ! హరిప్రియే ! శివే ॥ — వేదమాతృస్తవః.

వేదప్రతిపాద్యయు, వేదమాతయు, వాగ్దేవతయు నగు భారతి యొక్క స్వరూపదర్శనమే భారతినిరుక్తి.

పరాదేవత యగు నా భారతి యొక్క స్వరూపము (లేక పరమాత్మ స్వరూపము) నుద్బోధించుటకై యవతరించిన వేదవాణి భారతి. పరాదేవత యగు భారతియొక్క స్వరూపమును దెలియవలెనన్నచో వేదవాణి యగు భారతియొక్క స్వరూపము దెలియవలసి యున్నది. అట్టి భారతి (వేదము) యొక్క స్వరూపనిర్వచనమే భారతీనిరుక్తి.

పరాదేవత యగు భారతిని, తత్ప్రతిపాదిక యగు వేదభారతిని పెక్కు తెఱగుల నారాధించెడి ప్రజకును 'భారతీ' యని పేరు. భారతీప్రజ యొక్కయు, భారతీసంస్కృతి యొక్కయు స్వరూపవివరణమే భారతీ నిరుక్తి.

భారతి యొక్క యీ త్రివిధస్వరూపమును శ్రుతి స్మృతి పురాణేతిహాసాది తాత్పర్యానుగుణముగ వివరించుట యీ భారతీనిరుక్తియొక్క లక్ష్యము.

ఈ భారతీస్వరూపమును శ్రుతులే నిర్వచించినవి; మహర్షులెందఱో దర్శించి ప్రబోధించిరి; భాష్యకర్తలు మున్నుగువా రెందఱో వివరించిరి; అట్టియెడ మరల నీ గ్రంథ మేల ? ఇందు క్రొత్తగ బ్రతిపాదింపబడెడి దేది ? యనవచ్చును. శ్రుతులు జక్కగ బ్రతిపాదించినను వేదముల నిరసించుచు కేవల బుద్ధిప్రమాణముతో బెక్కు దర్శనములు బయలు దేరినవి. వానిని ఖండించి సమన్వయపఱచుటకై పెక్కు శాస్త్రము లవతరించినవి. న్యాయవైశేషికాది శాస్త్రము లట్టివి. ఎంత వాఙ్మయ మున్నను, సిద్ధాంత మెంత స్ఫుటముగ నిరూపింపబడినను వేర్వేఱు కాలములలో వేర్వేఱు ప్రతిపక్షవాదములు చిగురించుచునే యుండును. ఆ వాదముల ఖండించుటకై యెప్పటికప్పుడు క్రొంగ్రొత్త గ్రంథము లవతరించుచునే యుండును. అనాదిసిద్ధమైన సిద్ధాంతమునే నూత్ననూత్న ప్రతిపక్షవాదముల ననుసరించి క్రొంగ్రొత్తరీతుల మఱల మఱల నిరూపించి ప్రబోధింపవలసి యుండును.

ఇటీవల నించుమించుగ నొకటి రెండు శతాబ్దుల నుండి పాశ్చాత్య చరిత్రకారులును, తదనుయాయులును గేవలము చరిత్ర కల్పనాలక్ష్యముతో వేదవాఙ్మయమును బరిశీలించిరి. తమ తమ భాషలలోని కనువదించు కొనిరి. ఆ భాషాంతరీకరణములను, ప్రపంచములోని వివిధభాషల యందు గల కొన్ని పదములతో సంస్కృతభాషా పదములకు గల సామ్యమును, విజ్ఞానక్రమవికాసము (Theory of evolution) అనెడి న్యాయమును, ఖగోళ భూగర్భాది శాస్త్రములను నాధారముగ జేసికొని పెక్కు చరిత్ర కల్పనల గావించిరి. యుగయుగములుగ భారతీయుల దృష్టిలో 'నపౌరు

షేయములు స్వతఃప్రమాణములు' నయి విలసిల్లుచు వచ్చిన వేదములు చరిత్రకారుల ననుసరించి 'ఆర్య లనెడి పెక్కు తెగల'యొక్క రచనలు ; అవి భాషాసామ్యాది నూత్నమార్గముల ద్వారా తెలియదగినవి'- యని చెప్పబడినవి. కర్మ-భక్తి-జ్ఞానయోగముల ద్వారా పరతత్త్వము నుద్బోధించుటకై కాండత్రయాత్మకముగ నవతరించినదని చెప్పబడు వేదమంత్రరాశి చారిత్రికుల ననుసరించి యాదిమ నివాసులలోని పలు తెగలయొక్క యంతర్యుద్ధవర్ణనలుగను, వారు ప్రకృతి దృశ్యముల జూచి దేవత లని భ్రమించి సంభ్రమాశ్చర్యపరవశులై చేసిన స్తోత్రములుగను చిత్రింపబడినవి[1]. పరమేశ్వరుని నుండి నిఃశ్వాసముల వలె నప్రయత్నముగ వెలువడి ఋషులచే మహాతపఃసమాధిలో దర్శింపబడినట్లు చెప్పబడెడి వేదమంత్రములు వేర్వేరు కాలములలో, వేర్వేరు విజ్ఞానములతో, వేర్వేరు తెగల రచనలుగా చరిత్రకారు లూహించిరి. సంగ్రహముగ వారి చరిత్రాంశము లివి :

“మానవజాతి యొక్క నాగరికత శైశవావస్థ యందున్న కాలములో నార్య లనెడివారి తొలి రచన ఋగ్వేదము ; ఇందు పది మండలములు గలవు : వీనిలో దశమ మండల మత్యన్త మర్వాచీనము ; ఏలయన, పూర్వమండలములలో గన్పట్టు భక్తిప్రవణము లయిన స్తోత్రములు క్రమముగ తఱిగి సృష్టిరహస్యాదుల గూర్చిన యూహాగానములు కొలదిగ నిట పొడసూపసాగినవి ; ఋగ్వేద రచన యయిన కొంతకాలమునకు సామవేదము, తర్వాత యజుర్వేదము రచింపబడినవి ; వేదకాలమున తొలుదొలుత యజ్ఞనిర్వహణమున కెట్టి నిబంధనలు లేవు ; ఎవరికి వారు తమతమ భక్తికొలది యా యా దేవతల నుద్దేశించి నిరాడంబరముగ స్తోత్రము జేయుచు నగ్నియందు హవిస్సుల నొసగెడివారు ; కాలక్రమమున నిబంధనలు పెరిగినవి ; ఆ నిబంధనలే యజుస్సులు ; తరువాత యజ్ఞ

1. Maxmuller – What India can teach us P. P. 108 to 113.

క్రియాకలాపమును బెంచుచు బ్రాహ్మణములు బయలుదేరినవి ; చాలకాలము వరకు అథర్వవేదమునకు వేదత్వమే లేకుండెను ; మఱియు సూర్య చంద్ర విద్యు దగ్ని నక్షత్రాది జ్యోతిస్సులే (Bright Bodies or Luminous Bodies) యార్యుల దృష్టిలో మొదట దేవతలు ; ఈ జ్యోతిస్సులే జగద్యాత్రానిర్వహణమునకు కారణభూతము లని వారు నమ్మిరి ; తరువాత భూమ్యాకాశములు, మేఘములు, వాయువులు, నదీ నద పర్వతాదులు, లతావృక్షాదులు తుదకు పశుపక్ష్యాదులు సైతము దేవతాగణములో జేర్ప బడినవి ; చనిపోయినవారు సైతము దేవత లగుదు రని భావించి వారికి శ్రాద్ధాదులు జేయబడినవి. క్రమముగ దేవతలకు కరచరణాద్యంగములు కల్పింపబడినవి ; దేవతాకల్పనము ఋగ్వేదమునందే యెక్కువగా గలదు. మనుజుని మనస్సు అనెడి 'ఫ్యాక్టరీ'యందు రకరకములైన దేవతల నుత్పత్తి జేయు ప్రణాళిక ఋగ్వేదమునందువలె మఱి యే యితరదేశ వాఙ్మయము నందును లేదు ; ఇట్లు దేవతల సంఖ్య మితిమీఱి పెరుగుచుండగా — ఈ భూమ్యాకాశాదుల నిజముగ సృజించిన దెవరు ? — అనెడి ప్రశ్న యార్యులలో గొందఱ కుదయించెను ; అట్టి శక్తిని గొంద ఱగ్నికి సమ కూర్చిరి ; మఱికొంద ఱింద్రునకు — నిట్లే సోమ వరుణాది దేవతలకును గల్పింపబడినవి. క్రమముగ దేవతలలో పోటీ యేర్పడెను ; కొంతకాలము నకు — 'దేవు డొకడే ; కవులు ఒకే దేవుని యనేకనామములతో బిలుచు చున్నారు.' — అను భావము బయలుదేరెను. తత్, సత్, ఆత్మా, బ్రహ్మ అదితి, అక్షరమ్ — ఇత్యాది పదములు కొన్ని ఋగ్వేదమున గూడ గన్పట్టుచున్నవి ; తరువాత బయలువెడలిన యుపనిషదాది గ్రంథములలో జెప్పబడెడి తత్త్వార్థములు తత్, సత్ మొదలగు నీ పదములకు లేకపోయి నను, తత్త్వజిజ్ఞాసకు అంకురములు ఋగ్వేదమున గలవని యంగీకరింపక తప్పదు ; మొత్తముమీద వేదములందు బాహ్యదర్శనమే గాని యంత ర్దర్శనము లేదు.

మొదట వేదములలో నిరాడంబరముగ సాగి, పిదప బ్రాహ్మణముల కాలములో బహుళముగ బెఱిగిన యజ్ఞక్రియాకలాపముపై విసుగు జనించినది: అంతర్దర్శనము సాగినది; ఉపనిషద్వాఙ్మయము బయలువెడలినది; అనాదిగ తమ పూర్వుల గౌరవించు స్వభావము భారతీయులకు గలదు: అందుచే నుపనిషత్తులు యజ్ఞములను బూర్తిగ నిషేధింపక వానిని బ్రోత్సహించుచునే యుపాసనలను తత్త్వజిజ్ఞాసను బెంచినవి; ఈ జిజ్ఞాస బౌద్ధ జైనాదుల కాలమునను, పిదప శంకరాదుల కాలమునను మఱింత పెఱిగినది: సోమపానము జేసెడి, దేవతలను గొల్చెడి వేదకాలమునాటికిని శంకరుని యద్వైతబ్రహ్మదర్శనమునాటి కాలమునకును విజ్ఞానవికాసవిషయమున నెంతేని వ్యత్యాసము గలదు; ఇట్లే దేవతాస్వరూప దర్శనవిషయమునను క్రమవికాసము గలదు."—అని చారిత్రికుల యూహ.1

వేదమును గూర్చిన యిట్టి చరిత్రాంశములు ప్రస్తుత మన్ని విశ్వవిద్యాలయములయందును, పాఠశాలలయందును బాఠ్యాంశములుగ నిర్ణీతములయి, బోధింపబడుచున్నవి. క్రమముగ వానిని బ్రధానముగ నభ్యసించెడి భారతీయ విద్యార్థులకును వేదములకును మధ్య నీ చారిత్రికకల్పన లడ్డుగా నిలిచి, 'వేదములు తమ విజ్ఞానసర్వస్వము'లను విశ్వాసమును సడలించుచున్నవి. దానితో మనకు కొణాచియైన యార్షసంస్కృతియు దూర మగుచున్నది. అందుచే చారిత్రికకల్పనలు వేదవాక్యార్థ నిర్ణయవిషయమై ప్రమాణము లగునా? కాదా? —యను నంశము ప్రధానముగ బరిశీలింపవలసియున్నది.

వేదరచయిత లనబడెడి యార్యుల నివాసస్థానము, వారి కాలము మున్నగు నంశములపై చారిత్రికుల మధ్య పెక్కు వివాదములు గలవు

1. 1. S. Radhakrishnan, Indian Philosophy, Vol. I.
2. A. A. Macdonell—History of Sanskrit Literature.
3. Maxmuller—History of Vedic Literature.

ఏ భాషాసామ్యవాదమును, భూగర్భ ఖగోళాది శాస్త్రములను పాశ్చాత్య చరిత్రకారులు పురస్కరించుకొనిరో వాని నాధారము జేసికొనియే'' — ఆర్యులనెడి వేదరచయితలు ఈ దేశస్థులే; ఇటనుండియే వారిలో గొన్ని శాఖలు బయలుదేరి ఆసియా, ఐరోపాలలోని వివిధప్రాంతములకు వలస పోయియుండురు; పాశ్చాత్యు లూహించెడి కాలముకంటె నింకను ప్రాచీన కాలములకు జెందినవారు'—అని చెప్పెడి చరిత్రకారులును గలరు, ఈ వాదము లన్నియు పరస్పరవిరుద్ధము లగుటచే నొకరి వాద మొకరికి ప్రమాణ మగుటలేదు. ఇవి కేవల మూహాకల్పితము (Speculations) లగు టచే నెవరి యూహ సరియైనది ? ఎవరిది కాదు ? —అను ప్రశ్న లట్లే నిలిచిపోవును, అందుచే చరిత్రకల్పన సువ్యవస్థితము కాదు; ప్రమాణ భూతమును గాజాలదు. చరిత్రకల్పనలు ప్రమాణములు కానందున—'వేద కాలమునాటి తత్త్వదర్శనమునకును ఈ నాటి తత్త్వదర్శనమునకును విజ్ఞాన వికాసవిషయమున నెంతేని వ్యత్యాసము, క్రమవికాసము గలదు; మొత్తము మీద వేదములలో బాహ్యదర్శనమే గాని యంతర్దర్శనము లేదు'—ఇత్యాది చారిత్రికవాదము గూడ దుర్బల మగుచున్నది.

సృష్ట్యాదినుండియు భౌతికశాస్త్ర పరిశోధనలు పెంపొందుచు, పెంపొందుకొలది భౌతిక విజ్ఞానము క్రమవికాసము నొందవచ్చును. ఆ విజ్ఞానము నాధారము జేసికొని బాహ్యవస్తుసంపద, సాధనసామగ్రి, తదను గుణముగ నాచారవ్యవహారములు – వీని స్వరూపము క్రమపరిణతి జెంద వచ్చును, ఇదియే నాగరికతగా గూడ ప్రసిద్ధి జెందవచ్చును. ఇట్టి క్రమ పరిణామము జగద్యాత్ర సాగినంతవరకు నుండునదే. నూత్న పరిశోధనలు సాగి యంతకు బూర్వపు పరిశోధనల యవాస్తవికతను వెల్లడిజేయుచు, మరల మరల నూత్న పరిశోధనలకు దారి తీయుచుండును. కాని వేద ములు ప్రబోధించెడి యాధ్యాత్మికౌన్నత్య మిందుకు భిన్నమైనది. ఆ యౌన్నత్యమును బొందుటకు నధికారభేదము ననుసరించిన క్రమమును

జూపెడివి కర్మోపాసనాజ్ఞానకాండలు. ఉపనిషత్ప్రతిపాద్య మగు బ్రహ్మను పరమలక్ష్యముగా నిర్దేశించుచునే కర్మోపాసనాకాండలును ప్రవర్తిల్లినవి. అంతియే గాని ఋషిదర్శనములగు వేదములలో కాలభేదము ననుసరించి విజ్ఞానక్రమవికాసము గల దనెడి వాదము శ్రుతితాత్పర్యానుగుణము కాదు. శ్రీ శంకరభగవత్పాదులు గాని, భగవద్రామానుజ — మధ్వాచార్యాదులు గాని ప్రతిపాదించిన సిద్ధాన్తములు తదుపజ్ఞములు గావు. తమ తమ దర్శనములు శ్రుతిప్రమాణానుగృహీతము లనియే వారు చెప్పికొనిరి గాని యవి స్వబుద్ధిప్రతిభోన్నీతములని భావింపలేదు; చాటుకొనలేదు. ఉపనిషద్దర్శనము కంటె తాను దర్శించిన యద్వైతదర్శనము భిన్నమే యగుచో శ్రీ శంకరుడు ఇతర బౌద్ధ జైనాది దర్శనములతోపాటు ఉపనిషద్దర్శనమును గూడ ఖండించి యుండెడివాడు. అట్లు ఖండింపకపోగా —

> "తస్మా ద్యథా త్తేనోక్తం తథైవ ప్రతిపత్తవ్య మాత్మనః
> శ్రేయ ఇచ్ఛద్భిః జ్ఞానం వా కర్మ వేతి" —శం.భా.బృ.ఉ. 2-4-10.

> "తస్మా ద్వేదప్రామాణ్యస్య అవ్యభిచారాత్ తాదర్థ్యే సతి
> వాక్యస్య తథాత్వం స్యాత్ న తు పురుషమతికౌశలమ్"
>
> —శం. భా. 3-3-1

అని యనినాడు. శ్రేయస్కాములగువారు వేదోపదిష్టమగు ధర్మము గాని జ్ఞానముగాని యథాశ్రుతముగనే గ్రహింపవలెను. వేదప్రామాణ్య మవ్యభిచరితము (సువ్యవస్థితము). పురుషమతికౌశలముచే నిర్ధారితమగు నర్థము వ్యభిచరితము (అవ్యవస్థితము) గావచ్చును గాని ఉపక్రమోపసంహారాది షడ్విధలింగములచే నిర్ధారితమైన వేదతాత్పర్యము వ్యభిచరితము గాదు. అందుచే తత్ప్రతిపాదక వేదవాక్యము యథార్థబోధకమే యగును. అట్టి వేదవాక్య తాత్పర్యమును పురుషమతికౌశలముచే నన్యథాకరింప శక్యము

గాదు–అనుచు నీ రీతిగ శ్రీశంకరుడు కర్మ – బ్రహ్మావబోధక కృత్స్న వేదరాశి యొక్క ప్రామాణ్యము నుద్ఘోషించెనేగాని వేదోపదిష్టము గానట్టి నూత్న దర్శనమును బ్రబోధించు చున్నట్లు చెప్పికొనలేదు. శ్రీ రామానుజాదులు నిట్లే యనిరి. అందుచే శ్రుతి దర్శనము వేఱు; శంకరాదుల దర్శనము వేఱు' – అనుట యుక్తము గాదు. కనుక ఆధ్యాత్మికౌన్నత్య విషయమున వేదకాలము కంటె నుపనిషత్కాలములోను, నంతకంటె శ్రీ శంకరాదుల కాలములోను నొక క్రమపరిణామము గలదనెడి వాదము శ్రుతితాత్పర్యానుగుణము గాదని నిరూపించుటయే యీ గ్రంథము యొక్క లక్ష్యము.

చరిత్రకల్పనలను ప్రబలములగు యుక్తుల జూపి చక్కగ విమర్శించి ఖండించిన మహనీయు లెందఱో గలరు. అందుచే నా యుక్తి వాదముల నిట బునరుక్తము చేయుట లేదు. తమ యవతరణమును గూర్చియు, తమ స్వరూపమును గూర్చియు వేదములే యేమి చెప్పికొనినవి యను నంశమే ప్రధానముగ నీ గ్రంథమున బరిశీలింపబడినది. ఈ యంశమును బరిశీలించుచో చరిత్రాంశముల యందలి సామంజస్యము తేటపడగలదు.

వేదమంత్రార్థవివరణకు ప్రమాణము లేవి యగును? ఈ ప్రశ్న యుదయించుట సహజము.

"సత్రిణాం సత్రఫలదః పవిత్రం పరమాత్మవాన్ ।
లోకతంత్రధరో హ్యేష మంత్రై ర్మంత్ర ఇవోచ్యతే ॥"

— హరివంశ. 49-24.

వేదమంత్రార్థవివరణకు వేదమంత్రములే ప్రమాణము లనెడి సంప్రదాయము పై శ్లోకము వలన దెలియును. వేదమంత్రముల తరువాత

తత్సంప్రదాయోద్దీపకము లగుటచే షడంగములు, స్మృతులు, పురాణేతిహాసాదులు ప్రమాణములు. వీనిని ప్రమాణముగ గొనిన భాష్యములును ప్రమాణములు. కాని చరిత్రకల్పనయే లక్ష్యముగా గల్గి స్వకపోలకల్పితములై వెడలెడి చరిత్రలు ప్రమాణములు కాజాలవు.

దర్శనకారులు వస్తుజ్ఞానసిద్ధికి ప్రత్యక్షము, అనుమానము, శబ్దము, ఉపమానము, అర్థాపత్తి, అనుపలబ్ధి యని యాఱు ప్రమాణములు గ్రహించిరి. వీనిలో గొన్నిటిని మిగిలిన ప్రమాణములలో నంతర్భావము గల్పించుకొనినవారును, లేక వీని నన్నిటిని గ్రహించినవారును గలరు. ఐతిహ్యమును ప్రమాణకోటిలో జేర్చినవా రెవ్వరును లేరు. కాని చరిత్రకల్పనయే లక్ష్యముగా గల చరిత్రకారు లట్లు గాక అన్యభాషాసామ్యము, నాగరికతా-విజ్ఞానక్రమవికాసము మొదలగువాని నాధారముగాగొని, చరిత్రను గల్పించి వేదవాక్యార్థ కల్పనల జేసి తదనుగుణముగ భాషాంతరీకరణములు, కోశములు (Lexicons), నామవిషయానుక్రమణికలు (Vedic Index of names and subjects) మున్నగు వానిని రూపొందించిరి. వీనివలన సంప్రదాయానుగతమైన (శ్రుతిసిద్ధమైన) యర్థము మఱుగుపడినది. సంప్రదాయ మనగా వేద మని యర్థము. (చూ. ఆమ్నాయ శబ్దము). శ్రుత్యనుగుణముగ ప్రవర్తిల్లి పరంపరాగతమై వచ్చిన యాచారమునకును సంప్రదాయ మని పేరు. అట్లే శ్రుతిసిద్ధమై పరంపరాగతమై వచ్చిన యర్థమే సంప్రదాయార్థము. అట్టి యర్థమును దర్శింపజేయుటకు చారిత్రికులు అన్యభాషాసామ్యాదులచే నూహించిన భాషాశాస్త్రము గాని చరిత్రగాని ప్రమాణములు కాజాలవు. ఏలయన—గ్రీసు పారశీకాది దేశములలో గూడ ప్రాచీన వాఙ్మయములు గలవు. వానికిని వైదిక సంస్కృతమునకును గొంత భాషాసామ్య మున్నట్లు చరిత్రకారు లిటీవల దర్శించిరి. ఈ ప్రాచీనభాష లన్నియు ప్రాచీనార్యుల యొక్క వివిధ శాఖలచే వ్యవహరింపబడియుండు ననియు, వారు వివిధశాఖలుగా చీలక

పూర్వమే భాషలన్నిటికిని పూర్వరూపమైన మఱియొక భాషను మాటలాడి యుండిరనియు నూహించి, యీ భాషకు 'ఇండో యూరోపియన్ లాంగ్వేజ్' అని పేరు బెట్టిరి. దానిని మాతృభాష యనిరి. యీ భాషాపదము లిట్లుండి యుండవచ్చు నని యూహ చేసి కొన్నిపదముల సృష్టించిరి. ఆ మాతృ భాష నుండియే భారతీయుల వేదములు, పారశీకుల జెందవెస్తా, గ్రీకు, లాటిన్ — ఇత్యాది ప్రాచీన వాఙ్మయము లన్నియు వేర్వేఱు దేశములలో వేర్వేఱుగ క్రమక్రమాభివృద్ధి నొందియుండు నని తలచిరి. ఈ యూహ యసమంజస మని త్రోసివేయు వీలు లేనట్లు గన్పట్టును. సమానలక్షణ ములు గల యిద్దరిని గాంచినపుడు వారిరువురు తండ్రికొడుకులో, సోదరులో, లేక దగ్గఱ బంధువులో యని యూహించుట సహజము. అట్లే పదసామ్యము, అర్థసామ్యము గన్పట్టుచున్న యీ ప్రాచీన వాఙ్మయము లకును నేదేని సంబంధ ముండవలెను గదా! కాని యీ సంబంధ మెట్టిది? యను ప్రశ్నయే వివిధసమస్యలతో గూడి, విభిన్నవాదములకు దారితీసినది.

ఏలయన భాషాసామ్యవిషయమున నొక చిక్కు గలదు. ఉదా: అగ్నిః అనునది సంస్కృతపదము. అగ్గి యనునది తెలుగుపదము. ఈ రెంటికి నాకృతిసామ్యము, అర్థసామ్యము గలవు. ఈ సామ్యమును మాత్రమే పురస్కరించుకొని యగ్ని యను పదమునుండి అగ్గి పద ముత్పన్నమైనదా లేక అగ్గి పదమునుండి అగ్ని పద ముత్పన్నమైనదా? అట్లుగాక యీ రెంటికిని మూలకారణమైన పద మింకొకటి యేదియైన నుండవలె నని యూహింపవలెనా? పద — అర్థసామ్యములను బట్టి వాఙ్మయచరిత్ర సాధింపవలెనన్న నిట్టి చిక్కులు సంభవించును. ఇట్టియెడ గమనింపవలసిన యంశ మొకటి గలదు. అగ్ని యను పదము ధాతూత్పన్నమై స్వతంత్రము గనే యనేకార్థబోధనసమర్థము. దాని యర్థనిర్ణయమునకై అగ్గి యను పదముపై నాధారపడవలసిన స్థితి లేదు. అగ్గి పదవిషయమున నట్లు గాదు. అర్థనిర్ణయవిషయమై దానికి బ్రకృతిరూపమైన యగ్నిపదముపై నాధార

పడక తప్పదు. సంస్కృతశబ్దసామర్థ్య మట్టిది. అది స్వచ్ఛందముగ వర్ధమును బోధింప జాలియున్నది. మఱియు 'ఇండో యూరోపియన్ లాంగ్వేజి' యనెడి మాతృభాష యొకటి యున్నట్లు చరిత్రాధారములుగాని, భూగర్భాది శాస్త్రప్రమాణములు గాని లేనందున నిది యొక యభూత కల్పనమే యగును. అట్లే సువ్యవస్థితము కానందున భాషాశాస్త్రము (ఫైలాలజీ) నొక శాస్త్రముగా బరిగణింప శక్యము గాదు. (చూ. A Critical Study of Rigveda—Dr. Dev Prakash Patanjal Sastry. PP. 28 to 30). కాన వేదశబ్దార్థనిర్ణయము చేయుపట్టున నన్య భాషాసామ్య దర్శనముతో గాని, మాతృభాష యనెడి 'ఇండో యూరోపియన్ లాంగ్వేజి' తో గాని, అన్యభాషాసామ్యాదుల నాధారముగా గొని యూహించి కల్పించిన చరిత్రతో గాని భాషాశాస్త్రముతో గాని పని లేదు. ఇక వేదమునకు జేయబడిన భాషాన్తరీకరణములు సమగ్రములు కాజాలవు — అని చరిత్రకారులే యంగీకరించుచున్నారు.

> "Let it not be supposed that, because there are several translations of the Rigveda in English, French and German, therefore all that the Veda can teach us has been learned. Far from it. Every one of these translations has been put forward as tentative only. I, myself, though during the last thirty years I have given translations of a number of the more important hymns, have only ventured to publish a specimen what I think a translation of the Veda ought to be; and that translation — — — of twelve hymns only, fills a whole volume. We are still on the mere surface of the Vedic Literature."

Maxmuller—What India can teach us. pp. 131.

ఇట్లు అవ్యవస్థితములు, అసమగ్రములునైన భాషాంతరీకరణములును వానివి బురస్కరించుకొని కల్పింపబడెడి చరిత్రాంశములుగాని వేదార్థ నిర్ణయ విషయమై ప్రస్తుతములు కావు.

ఇక ఐతిహ్యము ప్రమాణకోటిలో చేర్పబడనిచో పురాణేతిహాసాదులు గూడ నైతిహ్యమును బ్రతిపాదించును గదా! వేదస్వరూపనిరూపణమున నవియు నెట్లు ప్రమాణము లగును? అని యనవచ్చును. పురాణేతిహాసాదుల విషయమున నట్లు గాదు.

'ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్'
"వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షా ద్రామయణాత్మనా"
"వేదోపబృంహణార్థాయ తా వగ్రాహయత ప్రభుః'

— రామా. 1-4-6.

"విమృశంతి స్మ తం దేవా దివ్యాభి రుపపత్తిభిః ।
నచైనం శేకు రన్వేష్టుం కర్మతో జన్మతోఽపి వా ॥
గాథాభి స్తత్ప్రతిష్ఠాభి ర్యే తస్య చరితం విదుః ।
పురాణా స్తం పురాణేషు ఋషయః సంప్రచక్షతే ॥"

— హరివంశ. 50-18-19.

ఇతిహాసములు వేదమునందే గలవు. వేదగతములైన యితిహాసములు వేదార్థోపబృంహకములు. వానికి స్వార్థమున తాత్పర్యము లేదు. సంగ్రహముగా నున్నవా యితిహాసములను స్పష్టముగ బ్రతిపాదించుచు నందలి నిగూఢార్థముల నుద్బోధించుటకై యవతరించినట్లు పురాణేతిహాసాదులే చెప్పికొనుచున్నవి. కనుక వేదములందలి యితిహాసములకును, బీజరూపమున నున్న వీనిని విస్తరింపజేసిన గాథలకును లక్ష్యము శ్రుతిచోదిత ధర్మ-బ్రహ్మ స్వరూప నిరూపణమే. వేదస్వరూపమును పురాణాదుల

వలనను, పురాణగాథాతత్త్వము వేదవాక్యసాహాయ్యమునను దెలిసికొన దగునని సంప్రదాయము. శ్రుత్యర్థానుసరణ ముండుట వలననే పురాణేతిహాసములకును స్మృతు లనియు వ్యవహారము. అందువేతనే యవియు పవిత్రములై పారాయణగ్రంథములై విలసిల్లుచున్నవి. కావుననే పురుషార్థ సాధనములగు చతుర్దశ విద్యలలో పురాణములును బేర్కొనబడినవి.

"పురాణ న్యాయ మీమాంసా ధర్మశాస్త్రాంగమిశ్రితాః ।
వేదాః స్థానాని విద్యానాం ధర్మస్య చ చతుర్దశ ॥"

—యాజ్ఞ. స్మృ. 1-3.

పురాణములు, న్యాయము, మీమాంసా, ధర్మశాస్త్రము, షడంగములు, చతుర్వేదములు నను నీ పదునాలుగు పురుషార్థసాధనములగు విద్యాస్థానములు, శ్రుతులయందు సంగ్రహముగ నటనట నీ పురాణాది చతుర్దశ విద్యలు వివరింపబడినవి. ఋషులు శ్రుతుల యం దీ విద్యల దర్శించి లోకానుగ్రహబుద్ధితో వీనిని ప్రత్యేకముగ ప్రవచించిరి. శ్రుతు లిట్లు చతుర్దశ విద్యాత్మకము లగుటజేసి త్రయీశబ్దము చతుర్దశ విద్యోపలక్షకముగ గ్రహింపబడుచుండును. 'త్రయీ సాంఖ్యం యోగః'—అను శివమహిమ్న స్తోత్రమునందలి శ్లోకమును వ్యాఖ్యానించుచు శ్రీ మధుసూదన సరస్వతులు 'త్రయీ శబ్దము పురాణన్యాయాది చతుర్దశవిద్యోపలక్షక' మని వివరించిరి. ఈ చతుర్దశవిద్యల ననుసరించియే కావ్యనాటకాదులు, చతుఃషష్టికళలు మున్నగునవి ప్రవర్తిల్లినవి. అందుచే నవియు వేదస్వరూపదర్శనమున దోడ్పడునవి యగును. ఇట్లు పురాణాది భారతీయవాఙ్మయము, తదనుగుణముగ యనూచానములై వచ్చెడి యాచారవ్యవహారములును వేద సంప్రదాయ రహస్యముల దెలియుట కెంతయు నుపకరించును.

వేదస్వరూపమును దర్శించుటకై శ్రుతుల యందు గన్పట్టెడి వేద నామధేయములు కొన్ని యిట గ్రహింపబడి యథాశక్తి వివరింపబడినవి.

పరిశీలించి వివరింపదగిన వింకను గలవు. కాని 'వేదమునకు వేదః, ఆమ్నాయః, శ్రుతిః, త్రయీ — ఇత్యాది కొలదినామములే ప్రసిద్ధములు; మిగిలినవికావు; అప్రసిద్ధములైన వానిని వేదపర్యాయ వాచకములుగ గ్రహించు టెట్లు?' —అని యనవచ్చును. పరమేశ్వరునకు శివ విష్ణ్వాది నామములు కొన్నిమాత్రమే సుప్రసిద్ధములు గావచ్చును. అయినను పరమేశ్వరు డనంతనాముడు, సహస్రనామము లప్రసిద్ధము లని త్రోసివేయుట సంప్రదాయము కాదు గదా? వేదము తనను దాను పెక్కు నామములతో వ్యవహరించుకొనినది. పురాణేతిహాసాదులు, నిఘంటువులు మున్నగునవి యన్నియు వానినట్లే యథాతథముగ గ్రహించినవి. అందుచే వానిని వేద పర్యాయవాచకములుగ గ్రహించుట యుక్తమే యగును.

సామాన్యముగ నే గ్రంథమైనను నొకటి, రెండు లేక మూడు నామములతో బ్రసిద్ధము గావచ్చును. ఉదా : రామాయణము, సీతాచరితము పౌలస్త్యవధ — యని వాల్మీకివిరచితమైన యాదికావ్యమునకు మూడు పేర్లు కన్పట్టును. అయినను రామాయణ మనియే ప్రసిద్ధి. పరమేశ్వరుని తరువాత ననేక నామములతో వెలయుట వేదభారతి యొక్క వైలక్షణ్యము. తన స్వరూపస్వభావాదుల వివరించుకొనుటకై పెక్కు నామములతో వేదము దనను గీర్తించుకొనినది.

అగుచో — వేదస్వరూప మంతయు వేదనామముల చేతనే తెలియ నగునా? నామ నిర్వచనముల వలననే స్వరూప మంతయు తేటపడునా? — అను ప్రశ్నలు గలవు. గ్రంథప్రతిపాద్యమగు నంశమును గ్రంథ నామౌచిత్య విచారముచే దెలియుట సంప్రదాయము. రామాయణమ్, మహాభారతమ్, అభిజ్ఞానశాకుంతలమ్, వేణీసంహారమ్ — ఇత్యాది నామౌచిత్య విచారముచే తత్తద్గ్రంథ ప్రతిపాద్యాంశమును వివరించుట సంప్రదాయానుగతమై వచ్చుచున్నది. సర్వాత్మకుడగు పరమేశ్వరుని యందలి యొక్కొక్క

గుణమును వ్యాఖ్యానించుచు నభివ్యక్తము జేయుట కొక్కొక నామము ఋషులచే గీర్తింపబడినది. అవియే సహస్రనామములు.

"యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః ।
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే ॥"

— విష్ణుసహస్రనామము.

శ్రీ శంకరభగవత్పాదు లా నామముల నిర్వచించి తద్ద్వారా పరమేశ్వరుని గూర్చి తెలియదగు నంశముల బెక్కింటిని వివరించిరి. అంతేగాదు: ఒకే శబ్దము ప్రవృత్తినిమిత్తభేదముచే భిన్నార్థములను బోధింప సమర్థము. కనుక సహస్రనామములలో విష్ణ్వాది శబ్దములు పునరుక్తములైనను దోషము లేదు.

'విష్ణ్వాది శబ్దానాం పునరుక్తానా మపి వృత్తిభేదే నార్థభేదాత్
న పౌనరుక్త్యమ్' — శం. భా. (విష్ణుసహస్రనామము).

ఈ నామములు కేవలము సంజ్ఞావాచకములు గావు. అవి పరమేశ్వరుని స్వరూపమును దెల్పెడి సంగ్రహవాక్యరూపములు లేక వ్యాఖ్యానములు. అట్లే వేదనామములు గూడ. సామాన్యముగ ఇతరభాషలలో నొక వస్తువును బోధించుట కొకటి, రెండు లేక మూడుగాని నామము లుండవచ్చును. సంస్కృతమున నట్లు గాదు. వైదికనిఘంటువును జూచుచో — 'ఇతి ఏకవింశతిః పృథివీనామధేయాని; ఇతి సప్తపంచాశత్ వాఙ్నామాని' — అని యారీతిగ పృథివ్యాదులకు వేర్వేఱు నామానుక్రమణికలు గన్పట్టును. పృథివ్యాదినామము లన్నియు పృథివిని, వాఙ్నామము లన్నియు వాక్కును — ఇట్లు పర్యాయనామము లన్నియు నాపాతముగ నొకే యర్థమును బోధింపవచ్చును. కాని యా పదముల యందలి నిగూఢములైన రహస్యములు దెలియవలెనన్న వానికి గల వివిధ నిర్వచనముల దర్శింపవలెను.

వానిని దర్శించిననే గాని యా పదములయొక్క యర్థగాంభీర్యము, తద్ద్వారా తెలియదగిన వస్తుస్వరూప స్వభావములు తేటపడవు. అందుచే వివిధనామౌచిత్య విచారము చేసి వేదముయొక్క వివిధస్వరూపస్వభావముల దర్శింపుట యుక్తము. అదియే యీ భారతీనిరుక్తి లక్ష్యము.

పాండితీప్రతిభచే పదములకు నూత్ననూత్న వ్యుత్పత్తుల గల్పించి వాని ద్వారా నూత్నార్థముల జెప్పుచో నవి సంప్రదాయానుగతము లగునా? కాజాలవు. అందుచేతనే తామూహించిన చరిత్ర నాధారము జేసికొని వేద పదములకు, తద్ద్వారా వేదమంత్రములకు చారిత్రికులచే జెప్పబడెడి నూత్నార్థములు సంప్రదాయానుగతము లగుట లేదు; అప్రమాణము లగుచున్నవి. వేదపదముల యర్థనిర్వచనమునకై ప్రవర్తిల్లిన నిరుక్తశాస్త్ర మట్టిది గాదు, సంప్రదాయానుగతములు గానట్టి విశేషార్థముల గల్పించి చెప్పుటకై యది యారంభింపబడ లేదు. అట్లు ప్రవృత్త మగుచో నది వేదాంగముగ బరిగణింపబడెడిది కాదు. వ్యాకరణమునకు వేదచోదితార్థ దర్శనమునకై వలయు శబ్దగతప్రకృతి ప్రత్యయ విభాగరూప సంస్కారమును దర్శింపజేయుట యందే దృష్టి. ఆ శబ్దసంస్కారము ననుసరించుచు శ్రుతితాత్పర్యానుగుణముగ నా పదమునకు గల యావదర్థములు - ఆధ్యాత్మిక, ఆధిదైవిక ఆధిభౌతికాద్యర్థములను - సంఘటనము జేసి, వేదచోదితార్థమును దర్శింప జేయుటయందే నిరుక్తశాస్త్రమునకు దృష్టి. అట్లు అర్థసంఘటనము జేయు కొఱకై శాద్యంగయుక్త వివిధ మంత్రబ్రాహ్మణాది గ్రంథసాహాయ్యముతో నా యా పదములకు శ్రుతులయందు గల వివిధనిర్వచనముల బ్రదర్శించి వివరించుట నిరుక్తశాస్త్ర లక్ష్యము (చూ. ఛందః శబ్దము).

"ప్రధానం చేద మితరేభ్యోఽంగేభ్యః సర్వశాస్త్రేభ్యశ్చార్థ పరిజ్ఞానాభినివేశాత్। అర్థో హి ప్రధానమ్। తద్గుణః శబ్దః। స చేతరేషు వ్యాకరణాదిషు చింత్యతే.... యథా శబ్దలక్షణ

పరిజ్ఞానం సర్వశాస్త్రేషు వ్యాకరణా దేవం శబ్దార్థనిర్వచన పరిజ్ఞానం నిరుక్తాత్। .... మంత్రబ్రాహ్మణార్థ పరిజ్ఞానబద్ధ శ్చాధ్యాత్మాధిదైవాధిభూత పరిజ్ఞానద్వారేణ ధర్మార్థ కామ మోక్షాఖ్యాఖిలపురుషార్థః। నచానిరుక్తో మంత్రార్థో వ్యాఖ్యాతవ్య ఇతి" — దుర్గాచార్యభాష్యమ్.

ఈ నిరుక్తశాస్త్రసంప్రదాయముననే భరతనాట్యశాస్త్రాదులును ప్రవర్తిల్లినవి.

"అల్పాభిధానేనార్థో యః సమాసే నోచ్యతే బుధైః।
సూత్రతః సా తు విజ్ఞేయా కారికార్థ ప్రదర్శినీ॥

నానా నామాశ్రయోత్పన్నం నిఘంటునిగమాన్వితమ్।
ధాత్వర్థహేతుసంయుక్తం నానాసిద్ధాన్తసాధితమ్॥

స్థాపితోఽర్థో భవే ద్యత్ర సమాసే నార్థసూచకః।
ధాత్వర్థ వచనేనేహ నిరుక్తం తత్ప్రచక్షతే॥"

— భరతనాట్యశాస్త్రమ్.

ఆలంకారికు లీ సంప్రదాయము నాదరించుటయే గాదు; పదములందు యోగశక్తిచే నన్యార్థమును దర్శించుట యలంకార మనిరి.

'నిరుక్తి ర్యోగతో నామ్నా మన్యార్థత్వ ప్రకల్పనమ్'

— కువలయానందః.

ఇది నిరుక్త్యలంకారలక్షణము. ఇది శ్లేషప్రభేద మని కొంద అనిరి. ('నిరుక్త్యలంకారః శ్లేషవిశేష ఏవ' — వామనభట్టీయ-కావ్యప్రకాశికా వ్యాఖ్య). మొత్తముమీద యోగశక్తిచే జమత్కారజనక మగు అన్యార్థ

దర్శన మలంకార మగుట యందఱకును సంమతమే. కావున నలంకార శాస్త్రజ్ఞుల దృష్టిలో "నిరుక్తి" శబ్దముల యందలి యొక విశిష్టత; ఒక యలంకారము. వేదవాఙ్మయమున నీ నిరుక్త్యలంకార మడుగడుగున తద్రసాభిజ్ఞులకు పొడగట్టుచునే యుండును. వేదశబ్దములు ప్రకరణానుగుణముగ ప్రసిద్ధ గో-అశ్వ-అగ్ని-ఇంద్ర-వరుణాద్యర్థముల బోధించుచునే రసాభిజ్ఞులగు సహృదయులకు యోగశక్తిచే నన్యరమణీయార్థస్ఫూర్తిని గలిగించుచునే యుండును. ఉదాహరణమునకు ఋగ్వేదము యొక్క మొదటి మంత్రమునే చూతము. "అగ్ని మీళే పురోహితం యజ్ఞస్య దేవ మృత్విజమ్। హోతారం రత్నధాతమమ్". ఇచట అగ్నిపదము యజ్ఞమున బ్రత్యక్షముగ గన్పట్టు జ్వాలారూపుడగు నగ్నినే గాక 'యజ్ఞస్య దేవం, పురోహితం'— ఇత్యాది విశేషణముల సామర్థ్యము వలన యోగశక్తిచే నన్యార్థమును (సర్వవ్యాపకత్వ హోతృత్వాది ధర్మములు గల అప్రాకృత-అగ్ని దేవతారూపార్థమును, మహాగ్ని రూపార్థమును) బోధించుచుండును. (చూ. బ్రహ్మ, స్వాహా, కవి కావ్య, ఛందః శబ్దములు).

ఇట్లు వేదపదము లన్నియు సామాన్యముగ నిరుక్త్యలంకారభూషితములు. చారిత్రికు లిట్టి దృష్టితో వేదస్వరూపమును దర్శింప బూనినట్లు లేదు. కాని భారతీయశాస్త్రకారుల దృష్టిలో వేదస్వరూపదర్శనము నిరుక్తిమూలము. పురాణేతిహాసాదులును వివిధస్థలములందు బెక్కు నిర్వచనముల బ్రదర్శించుచు నిరుక్తశాస్త్రమార్గము ననే ప్రవర్తిల్లినవి. కావుననే యమరకోశాది లౌకిక నిఘంటువులకును నిర్వచనపూర్వక వ్యాఖ్యానము లుదయించినవి.

నిరుక్తశాస్త్రమును బ్రమాణముగ గొనియే శ్రీ సాయణాదులును వేదభాష్యముల బ్రవర్తింపజేసిరి. శ్రీ సాయణులు జేసిన మంత్రవ్యాఖ్యానము గొన్నియెడల బరిమితముగనే యున్నది. ఆ మంత్రముల కన్నిటికి ఆధ్యాత్మిక. అధిదైవిక-అధిభౌతికాద్యర్థము లన్నియు వివరింపబడ లేదు.

కొన్నియెడల నితిహాసపరమైన వ్యాఖ్యానము మాత్రమే గలదు. అట్టియెడ నీ మంత్రములకు శ్రీసాయణు లుద్దేశించిన యర్థ మంతియే యని తలప రాదు. ఏలయన— ఋగ్వేదము మొదటి మంత్రమున గల మొదటి పదము అగ్ని. శ్రీ సాయణులు శిక్షాదిషడంగములను, వివిధ మంత్ర బ్రాహ్మణ వచనములను ప్రమాణముగ నుదహరించి యగ్ని పదముచే దెలియుగల విశేషార్థముల నెక్కింటిని బెక్కు నిర్వచనముల ద్వారా నిరూపించినాడు. ఇట్లు మొదటిమంత్రము యొక్క యర్థమును అధియజ్ఞముగ విపులముగ వివరించి—

'వేదావతార ఆద్యాయా ఋచోఽర్థః ప్రపంచితః ।
విజ్ఞాతం వేదగాంభీర్య మథ సంక్షిప్య కథ్యతే ॥'

అని యనినాడు. 'ఇంతవరకు ఋగ్వేదము మొదటి ఋక్కు యొక్క యర్థము వివరింపబడినది. వేదగాంభీర్యమును దర్శించితిమి. ఇక తరువాతి మంత్రములకు సంగ్రహముగ నర్థవివరణము చేయబడును" — అని యర్థము. తరువాతి మంత్రములకు వ్యాఖ్యానము సంగ్రహముగా నున్నను మొదటి మంత్రమునకు వలెనే తదితర మంత్రములకు గూడ నట్లే వివిధ నిర్వచనముల యోజనముచేసి తాత్పర్యము గ్రహింపదగు నని శ్రీ సాయణుల యభిప్రాయము. కాన సంక్షిప్తవ్యాఖ్యానము గల మంత్రముల యొక్క యర్థ మంతియే యని యనుకొనరాదు. ఉదాహరణమునకు — ఋగ్వేదమున కొన్నిసూక్తములను (1-165 మొ॥) ఆధిదైవికముగ ఇంద్ర మరుత్సంవాదరూపమున శ్రీ సాయణుడు వ్యాఖ్యానించినాడు. అట్లు వ్యాఖ్యానించుచునే — 'అత్ర ఇంద్రమరుత్సంవాదరూపే సర్వత్ర ప్రాణ జీవాత్మ పరతయా ఽపి యోజనీయమ్' (ఋ. 1-165-1) అని యనినాడు. ఇంద్ర మరుత్సంవాదపరము లగు నీ సూక్తముల నంతట ప్రాణజీవాత్మపరములుగ గూడ యోజనము చేయ నగునని యర్థము. కాన మంత్రములకు అధి

యజ్ఞముగను, అధిదైవికముగను, ఆధ్యాత్మికముగను గూడ సంప్రదాయానుగుణముగ నర్థముల దర్శించుట భాష్యకారాభిమతము.

మఱియు ఋగ్వేదమున గన్పట్టెడి కొన్నిమంత్రములు భిన్నశాఖలలో భిన్నప్రకరణములందు పఠితములై గన్పట్టును సంహితాగత మంత్రములను గొన్నియెడల బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులును ఉదహరించి వ్యాఖ్యానించుండును. అందుచే నీ మంత్రములకు అధియజ్ఞముగను, ఆధ్యాత్మికముగను ప్రకరణము ననుసరించి యర్థమును దర్శింపవలసి యుండును. ఇట్లు బ్రాహ్మణారణ్యకములే గాదు. మహాభారతాది స్మృతులును సంవాదరూపముననో, ఆఖ్యాయికారూపముననో యామంత్రముల నిగూఢార్థముల నభివ్యక్తము జేయుచుండును. అట్లభివ్యక్తము జేయబడిన యా మంత్రార్థముల నన్నిటిని వివరించుట కిది సమయము కాదు. వాని నన్నిటిని వివరింపబూనుచో మఱల నదియొక పెద్ద గ్రంథమే యగును. అయిన నొక్క యుదాహరణము :—

"అగ్ని ర్మూర్ధా దివః కకుత్పతిః పృథివ్యా అయమ్।
అపాం రేతాంసి జిన్వతి॥ —ఋ. 8-44-16.

ఈ ఋక్కు దాదాపు అన్ని శాఖలయందును గలదు. ఈ మంత్రమునకు సాయణుని భాష్య మిది మాత్రమే.

"మూర్ధా దేవానాం శ్రేష్ఠః, దివః ద్యులోకస్య, కకుత్
ఉచ్ఛ్రితః పృథివ్యాః చ పతిః అయం అగ్నిః అపాం
రేతాంసి స్థావర జంగమాత్మకాని భూతాని జిన్వతి ప్రీణయతి"

"ఈ యగ్ని దేవతలలో శ్రేష్ఠుడు; ద్యులోకాధిపతి; పృథివీపాలకుడు; స్థావరజంగమాత్మక భూతముల తృప్తి నొందించువాడు" — అని

యర్థము. ద్యావాపృథివీవ్యాపక మగు నగ్నిదేవతాపరముగ నిట సాయణునిచే మంత్రవ్యాఖ్యానము జేయబడినది. ఈ మంత్రార్థమును బ్రాహ్మణవ్యాధ సంవాదరూపమున మహాభారత మిట్లు విపులముగ వివరించుచున్నది

బ్రాహ్మణ ఉవాచ :-

"పార్థివం ధాతు మాసాద్య శారీరోఽగ్నిః కథం భవేత్।
అవకాశవిశేషేణ కథం వర్తయతేఽనిలః॥ 1

మార్కండేయ ఉవాచ :-

"ప్రశ్న మేతం సముద్దిష్టం బ్రాహ్మణేన యుధిష్ఠిర।
వ్యాధ స్తు కథయామాస బ్రాహ్మణాయ మహాత్మనే॥ 2

వ్యాధ ఉవాచ :-

"మూర్ధాన మాశ్రితో వహ్నిః శరీరం పరిపాలయన్।
ప్రాణో మూర్ధని చాగ్నౌ చ వర్తమానో విచేష్టతే॥ 3
భూతం భవ్యం భవిష్యం చ సర్వం ప్రాణే ప్రతిష్ఠితమ్।
శ్రేష్ఠం తదేవ భూతానాం బ్రహ్మయోని ముపాస్మహే॥ 4
స జంతుః సర్వభూతాత్మా పురుషః స సనాతనః।
మహాన్ బుద్ధి రహంకారో భూతానాం విషయ శ్చ సః॥ 5
ఏవం త్విహ స సర్వత్ర ప్రాణేన పరిపాల్యతే।
పృష్ఠత స్తు సమానేన స్వాం స్వాం గతి ముపాశ్రితః॥ ఇత్యాది 6

—భార. 3-213-1 నుండి.

"జ్ఞాన క్రియా శక్తిమతోః ధీప్రాణయో రాత్మాన్యత్వమ్—
'అగ్ని ర్మూర్ధా దివః కకుత్పతిః' — ఇతి మంత్రప్రకాశితం
వక్తు మారభతే పార్థివ మితి.... మూర్ధని సహస్రారే స్థితత్వాత్,

శ్రేష్ఠత్వా ద్వా మూర్ధానం చిదాత్మాన మగ్ని ర్విజ్ఞా
నాత్మాశ్రిత స్తదుపాధితాం ప్రాప్తః సన్ శరీరం పరిపాల
యన్ చిత్ప్రతిబింబం ప్రాప్య ధీ ధాతుః శరీరం చేతయతీ
త్యర్థః । ఏతేనాగ్ని ర్మూర్ధేతి పదద్వయం వ్యాఖ్యాతమ్ ।
.... అస్య కకుత్త్వం వ్యాచష్టే భూతమితి। .... ఏతేన పతిః
పృథివ్యా అయ మితి ద్వితీయః పాదో వ్యాఖ్యాతః। ....
అపాం రేతాంసి జిన్వతీ త్యంతపాదం వ్యాచష్టే సృష్టత
ఇత్యాదినా ...."

—నీలకంఠః.

"జ్ఞాన క్రియాశక్తి సంపన్నములైన ధీ ప్రాణములు ఆత్మకంటె భిన్నము లనుచు 'అగ్ని ర్మూర్ధా'— అను మంత్రముచే ప్రకాశిత మయ్యెడి యర్థమిట్లు జెప్పబడుచున్నది. సర్వశ్రేష్ఠమై సహస్రారమున వెలయు మహాగ్ని లేక చిదాత్మయే యిట మూర్ధశబ్దవాచ్యము. తదుపాధిభూతమై, జ్ఞానశక్తి సంపన్నమై, చిత్ప్రతిబింబ విలసితమై, శరీరమును చైతన్యవంత మొనర్చెడి యగ్ని ధీ రూపమగు విజ్ఞానాత్మ" — అని యీరీతిగ నీ భారత శ్లోకములలో పై ముక్కున కాధ్యాత్మికముగ నర్థము విపులముగ వివరింపబడినది. (చూ. నీలకంఠ వ్యాఖ్య.) సంగ్రహముగ సూత్రప్రాయముగ నున్న వేద మంత్రముల యర్థము నిట్లు పురాణేతిహాసములు వివిధసంవాద—ఆఖ్యాయికాది రూపమున విస్తరించి వివరించుటకయి ప్రవృత్తము లయినవి. కాన నీ యితిహాసపురాణాది సాహాయ్యముతో గూడ వేదార్థమును దర్శింపవలసి యున్నది. శ్రీ సాయణుడును వివిధశ్రుతులతోపాటు నిట్టి స్మృతివచనముల గూడ దృష్టియం దుంచుకొనియే యాధ్యాత్మికాద్యర్థముల గూడ నట నట సంగ్రహముగ దర్శింపజేయుచు ప్రకరణానుసారముగ శ్రుతుల వ్యాఖ్యానించుకొనుచు బోయినాడు. కాన వ్యాస సాయణాదులు చూపిన వాగ్ద్వారమున నే పోయి వివిధ శ్రుతి స్మృతి సంవాద నిర్వచనాదులద్వారా వేదమంత్రముల యర్థగాంభీర్యమును దర్శింపవలసి యున్నది.

వేదశబ్దార్థనిర్ణయమునకై వేదమునందు గల నిర్వచనములే ప్రమాణములు. అట్టి నిర్వచనములు వేదైకదేశమగు బ్రాహ్మణభాగమున హెచ్చుగ గలవు. బ్రాహ్మణములు మంత్రవ్యాఖ్యానరూపము లని సంప్రదాయము. ఈ వ్యాఖ్యానముల బరిశీలించుచో బ్రాహ్మణములు మంత్రవినియోగాదుల తోపాటు మంత్రప్రకాశితార్థమును వివరించు లక్ష్యముతో నామరూపముల బెక్కుతీరుల వ్యాకరించుట గాంచగలము. ఒకే నామము బెక్కు నిర్వచనముల ద్వారా వివిధార్థముల బోధించుటయు, నట్లే యొకే వస్తువు వివిధ నామములచే బేర్కొనబడుటయు గాంచగలము. వేదశబ్ద స్వభావము నిట్లు దర్శింపనగునని వేదమే నిర్వచనాదుల ద్వారా మార్గము జూపినది. ఈనిర్వచనములనే స్మృతిపురాణేతిహాసాదులు నాదరించినవి. కానిచారిత్రికులు 'మంత్రరచనాకాలమునకును బ్రాహ్మణరచనాకాలమునకును మధ్య నెంతయో కాలము గడచినది: మంత్రముల యొక్క వాస్తవికమగు నర్థము మఱుగు పడినది; తరువాత బ్రాహ్మణ రచయితలు స్వకపోలకల్పితములు, పరస్పర విరుద్ధములు నైన నిర్వచనముల జేసినట్లు గన్పట్టుచున్నది; అందుచే మంత్రముల వాస్తవికార్థమును గ్రహించుట కీ బ్రాహ్మణనిర్వచనములు తోడ్పడవు, కొన్నియెడల నివి యున్మత్తప్రలాపముల వలె గూడ గన్పట్టును' – అని యిట్లు పరిహసించిరి.

"The investigation of the Brahmanas has shown that, being mainly concerned with speculation on the nature of sacrifice, they were already far removed from the spirit of the composers of the Vedic hymns, and contain very little capable of throwing light on the original sense of those hymns. They only give occasional explanations of the sense of the Mantras and these explanations are often very fanciful……"

—A. A. Macdonell, Bhandarkar Commemoration Volume – Poona 1917

"With the exception of the occasional legends and striking thoughts which occur in them, they cannot be said to be at all atrracive as literary productions. To support their explanations of the ceremonial, they interweave exegetical, linguistic, and etymological observations, and introduce myths and philosophical speculations in confirmation of their cosmogomic and theosophic theories. They form an aggregate of shallow and pedantic discussions, full of sacerdotal conceits, and fanciful, or even absurd identifications, such as is doubtless unparalleled anywhere else"

A. A. Macdonell, History of Sanskrit Literature, PP. 32.

"The Brahmanas represent no doubt a most interesting phase in the history of the Indian mind, but judged by themselves, as literary productions, they are most disappointing. No one would have supposed that at so early a period, and in so primitive a state of society, there could have risen up a literature which for pedantry and downright absurdity can hardly be matched anywhere. There is no lack of striking thoughts, of bold expressions, of sound reasoning, and curious traditions in these collections. But these are only like the fragments of a 'Torso' like precious gems set brass and lead. The general character of these works is marked by shallow and insipid grandiloquence, by priestly conceits and antiquarian pedantry. *It is most important to the historian* that he should know how soon the fresh and healthy growth of a nation can be blighted by preistcraft and superstition. It is most important that we should know that nations are liable to these epidemics in their youth as well as in their dotage. These works deserve to be studied as the physician studies the twaddle of idiots and the raving of madmen."

—Maxmuller, -History of Ancient Sanskrit Literature, PP. 389 (See Introduction to Vedic Kosha of Hamsaraja)

చరిత్రకల్పనాలక్ష్యముతోను, విజ్ఞానక్రమవికాసము మున్నగు దృష్టితోను చూచినపుడీ బ్రాహ్మణములందలి నిర్వచనములతో మంత్రసమన్వయము పొసగక చారిత్రికుల కిట్టి యూహలు తలయెత్తి యుండును. కర్మోపాసనాజ్ఞానయోగముల నుద్బోధించుటకై శ్రుతి యవతరించిన దనెడి సంప్రదాయానుగతమైన దృష్టితో జూచినపుడీ నిర్వచనము లన్నియు మంత్రార్థసమన్వయమునకు మిగుల దోహదకారులే యగును. వివిధశాఖాగత వాక్యముల సమన్వయపఱచి దర్శింపవలె నని శ్రుతియే (ఋగ్వేదమే) ప్రబోధించి యున్నది. (చూ. స్వాధ్యాయః). ఆ దృష్టితోనే స్మృతిపురాణేతిహాసాదులు ప్రవర్తిల్లి శ్రుతి సంప్రదాయమును విస్తరింపజేసినవి. మంత్రబ్రాహ్మణాత్మక వేదరాశిని మూర్ధన్యప్రమాణముగ గ్రహించినవి; అట్లు గ్రహింపవలెనని యుద్బోధించినవి.

శ్రుతిః ప్రమాణం స్మృతయః ప్రమాణం
ధర్మార్థయుక్తం వచనం ప్రమాణమ్ ।
యస్య ప్రమాణం న భవేత్ప్రమాణం
కస్తస్య కుర్యాద్వచనం ప్రమాణమ్ ॥ — వరా. మాధవీయ.

ప్రమాణములలో ఆప్తవాక్యరూప మగు వేదము స్వతః ప్రమాణము. కాన నిది ప్రమాణములలో మూర్ధన్యము. శ్రుత్యర్థము ననుసరించున వగుటచే స్మృతులును ప్రమాణము. శ్రుతి స్మృతి విహిత ధర్మార్థయుక్తమైన యాప్తవచనము గూడ ప్రమాణము. ఇట్లు ప్రమాణభూతములైన శ్రుతిస్మృతులు గాని, వానిని ప్రమాణముగ గ్రహించెడి యాప్తుల ధర్మార్థయుక్తవచనములు గాని యెవనికి ప్రమాణము గావో యట్టివాని వచనము నెవరు ప్రమాణముగ గ్రహింతురు ? — అని యర్థము. కాన వేదార్థ నిర్ణయ విషయమున శ్రుతి స్మృతులను, తదనుగుణముగ ప్రవర్తిల్లెడి దర్శనకారుల ధర్మార్థయుక్త వచనములను మాత్రమే ప్రమాణముగ గ్రహించుట సంప్రదాయము.

ఇట్టి యీ సంప్రదాయమును పాటింపక స్వబుద్ధి ప్రతిభోన్నీతములై పరస్పర విరుద్ధములై వెడలు చరిత్ర కల్పనలు వేదార్థనిర్ణయమున ప్రమాణము లెట్లగును ? 'వేదసంప్రదాయమును దర్శింపక, తదనుభూతి లేక, యాపాతముగ జెప్పెడి యర్థములును, జేయబడెడి వాదములును కుతార్కికవాదములగును; అవి శ్రుతి సంప్రదాయము నెఱుగగోరువారికి గ్రాహ్యములు కావు; హాస్యాస్పదములుగ గన్పట్టును. కాన నుపేక్షణీయములు' — అని ఋగ్వేదానుక్రమణికయం దిట్లు చెప్పబడినది.

'వేదముద్రా మజానంతః కుతర్కగతమానసాః ।
ఆపాతతో భాషమాణాః తే హాస్యా వైదికై రిహ॥'

పై కారణములచే వివిధశాఖాగత శ్రుతివాక్యములు, బ్రాహ్మణగత నిర్వచనములు, శ్రీ సాయణ-ఉవట-మహీధర-స్కందస్వామి-ముద్గల-ఉద్గీథ-హరిస్వామి-విష్ణుసూరి-భట్టభాస్కరాది ప్రాచీనభాష్యములు, శిక్షాది షడంగములు, తద్భాష్యములు, స్మృతిపురాణేతిహాసాదులు, తద్వ్యాఖ్యానములు, గృహ్యధర్మసూత్రములు, తద్భాష్యములు, న్యాయ పూర్వోత్తరమీమాంసాది దర్శనములు, తద్భాష్యములు మున్నగునవి యిట ప్రమాణములుగ గ్రహింపబడి వేదస్వరూప దర్శనమునకై యీ భారతీనిరుక్తి ప్రవర్తిల్లుచున్నది.

మా పరిశోధన :-

వేదస్వరూప దర్శన విషయమై మా యీ పరిశోధనోద్యమము సుమారు ముప్పదియైదేండ్లకు బూర్వమే, 1935 సం॥ నుండి, ప్రారంభమైనది. ఈ యుద్యమ మొకవిధముగ పితృపరంపరాప్రాప్త మనియు జెప్పవలసి యున్నది. మా మాతాపితరులగు శ్రీ దుర్గాంబా సోమయాజులు గారలు, మా యభిజన మగు కృష్ణాతీర మందలి యీపూరు గ్రామమున పితృపైతామహ ధనమై ప్రాప్తించిన శ్రీ వేణుగోపాలమూర్తికి (1927వ సంవ

త్సరమున) ఆలయ మంటపాదులు నిర్మించి, యుత్సవాదులు సల్పుచు తమ జీవితమును ధన్యము గావించుకొనిరి. మా పితృవ్యులగు రామశాస్త్రి గారు (పెదరామయ్యగారు) అగ్రజు నడుగుజాడల సంచరించుచు, నిరంతర ముపనిషత్పురాణేతిహాస గ్రంథ పరిశోధనముతో జీవితము గడపిరి. పిదప మా యేడుగురు సోదరులము (వెంకటసుబ్బయ్య, సత్యనారాయణశాస్త్రి, కీ.శే సీతారామయ్య, వేంకటకృష్ణమూర్తి, సాంబశివశాస్త్రి, చంద్రశేఖరశర్మ, లక్ష్మీనరసింహశర్మ) పితరులు జూపిన మార్గముననే యథాశక్తి బోవ బూని, యా దేవస్థానమును హరి – హర – అజ క్షేత్రముగ (త్రిమూర్తి క్షేత్రముగ) రూపొందింప గలిగితిమి. అందలి దేవసభామంటపమున నిటీవలనే జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతు లనుగ్రహించిన శ్రీ గాయత్రీదేవతామూర్తిని, ప్రతిష్ఠించెడి భాగ్యమును గలిగినది.

అనాదిసిద్ధముగ వచ్చిన వ్యవసాయవృత్తితో పాటు, వికేంద్రీకరణ సిద్ధాంతానుగుణముగ, అన్యోన్యసహకార సంపత్తి గల స్వతంత్ర పారిశ్రామిక కుటుంబ వ్యవస్థా (శోధన్ సెంట్రల్ – గృహపరిశ్రమల సంఘము) మర్యాద ననుసరించి మా నాల్గవ సోదరుడు వేంకటకృష్ణమూర్తి, తమ్ముడు చంద్రశేఖరశర్మ సహకారముతో, కుటుంబ పరిశ్రమగా వర్ణ పరిశ్రమను (Paint Industry) సుమారు ముప్పదియేండ్లకు పూర్వమే చేపట్టి తదభ్యున్నతికై కృషి సలుప నారంభించెను. ఇట్లొకవైపు యీ వర్ణ (రంగుల) పరిశ్రమ; మఱియొకవైపు మా పితృవ్యులు – పెదరామయ్యగారు – మా కొసగిన పెన్నిధానమగు సంస్కృత గ్రంథజాతముతో వేదస్వరూప పరిశోధనరూప వర్ణపరిశ్రమను మాలో ద్వితీయులగు సత్యనారాయణశాస్త్రి చేపట్టి, తమ్ములను సంస్కృతమున సుశిక్షితులగావించు ఉద్యమము సాగించెను. 'భారతీనిరుక్తి' యను పేరుతో గ్రంథరచన మారంభమైనది. పోను పోను విషయ మతిగంభీరము దురవగాహమునై, బహుగ్రంథ పరిశీలనావశ్యకత నానాటికి పెఱిగినది. మాలో సాంబశివశాస్త్రి, లక్ష్మీనరసింహ

శర్మయు నిరువురును యథాశక్తి వలసిన శాస్త్రాధ్యయనము గావించి, యితో ధికముగ పరిశోధన కార్యక్రమమునకు బూనుకొనిరి. శ్రీ వేణుగోపాల దేవుని యనుగ్రహముచే నిట్టి రెండు వర్ణపరిశ్రమలును గూడ మాకు కుటుంబపరిశ్రమలై యన్యోన్యసహకారముతో సాగినవి. మాలో జ్యేష్ఠులు దేవాలయనిర్మాణ నిర్వహణ — వ్యవసాయ కార్యక్రమముల జేపట్టి యీ పరిశ్రమలు నడచిపోవుటకు ప్రోత్సహించిరి. 1942 లో నిరుక్తభారతి — సంస్కృతవాఙ్మయ పరిశోధనాలయము' — అను సంస్థ నెలకొల్పబడినది. వివిధ వ్యయప్రయాసల కోర్చి క్రమముగ గ్రంథముల సేకరించి వాని సాయముతో పరిశోధన సాగినది.

పాశ్చాత్యుల వైదికకోశములు మున్నగు గ్రంథములు సంప్రదాయార్థముల మఱుగుపరచుటను జూచి, సంప్రదాయార్థముల ప్రతిబింబింప జేయుచు వేదస్వరూపమును దర్శింప జేయగల వైదికశబ్దకోశము అత్యన్తావశ్యకములని భావించి, వేదమున గల గవాశ్వాదినామములు, నదీ నద దేవతాది వివిధ నామములగూర్చి శ్రుతి తాత్పర్య విషయమై పరిశోధన గావింపబడినది. పరిశోధన ఫలితముగ భారతీనిరుక్తి యను గ్రంథమొక విధముగ 1945వ సంవత్సరముననే రూపొందింప గల్గితిమి. వెనువెంటనే గురువర్యులు, నెల్లూరు సంస్కృత కళాశాలాధ్యక్షులు బ్రహ్మశ్రీ గాజులపల్లి హనుమచ్ఛాస్త్రిగారికిని, ఆ కళాశాలా పండితులు శ్రీమాన్ కవితార్కికసింహ గోవిందాచార్యుల వారికిని, శ్రీమాన్ N. రంగరామానుజాచార్యులవారికిని మా పరిశోధన ఫలితము నివేదించితిమి. వారి యాశీర్వాదముతోపాటు మన్ననల నందుకొనుటతో మా కీ విషయమున ప్రోత్సాహ మినుమడించినది.

సర్వజిన్నామ సం॥ వైశాఖ పూర్ణిమ సోమవారము (5–5–1947) నాడీ గ్రంథము శ్రీ వేణుగోపాల దేవున కంకితము జేయబడినది,

పిదప పలువురు వేదశాస్త్ర ప్రముఖులు మా రచనలను, ఉద్యమమును జూచి, యానందించి, యాశీఃపురఃసరముగ దమ యభిప్రాయముల నొసగి యీ గ్రంథమును వెంటనే ముద్రింపుడని మిగుల బ్రోత్సహించిరి. కాని త్వరపడి గ్రంథమును ముద్రించుటకంటె వేదసంప్రదాయ రహస్యముల నింకను దెలిసికొనుటకై కృషి సాగించుటయే యుక్తమని తోచినది. అందుకై యధ్యయనాదులు సల్పుచు నితోధిక కృషి సాగినది.

ఇది యిట్లుండ నిటీవల జగద్గురువులు శ్రీశ్రీశ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతులు విజయవాడ విచ్చేయుటయు, శ్రీవారి యాధ్వర్యమున కృష్ణామండల వేదవిద్యా ప్రవర్ధక సభయును, అఖిలాంధ్రపండితసభయు జరిగి ప్రముఖులగు వేద-శాస్త్రపండితులకు నాతిథ్య మిచ్చెడి భాగ్యము లభించినది. మరల గడచిన కృష్ణాపుష్కర సందర్భమున నఖిలభారత వేదశాఖా సమ్మేళనము మహావైభవముగ శ్రీవారి యాధ్వర్యమున జరుగుటచే నా సమయమున వివిధ శాస్త్ర పారంగతులయిన పలువురు పండితుల కాతిథ్యమిచ్చి గ్రంథస్థము లగు పెక్కు విషయముల వారితో జర్చించెడి యవకాశమును గలిగినది. తరువాత మా భాగ్యవశమున సుమారు పది దినములు శ్రీకామకోటిపీఠము మా విజయవాడ శోధన్ గృహమున నుండు తరుణమున శ్రీచరణులు కూడ మాచే రచింపబడిన వేదమాతృస్తవము నందలి శ్లోకముల సావధానముగ వినుట జరిగినది. దానితో మా యీ గ్రంథస్థవిషయముల గొన్నిటి వివరించు భాగ్యమును జేకూరెను. అప్పుడే అఖిలభారత వేదశాఖాసంమేళన సంచిక (S uvenir) యందు వేదములను గూర్చి యాంగ్లమున బ్రకటితమైన తమ వ్యాసమునకు నాంధ్రానువాదము జేయవలసినదిగ శ్రీవారు ఆనతిచ్చిరి; అట్లే యనువదించితిమి. ఆ సందర్భమున-వేదమునకుగల వేద-ఋషి-బ్రహ్మ-స్వాధ్యాయాది వివిధ నామములే వివిధ రీతుల వేదమునకు గల యపౌరుషేయత్వాది విషయముల దెలియజేయ

సమర్థములు'-అని యా యా పదములగూర్చి సంగ్రహముగ వ్రాసి వివరించితిమి. శ్రీవారు సావధానముగ విని, మమ్ము ప్రోత్సహించుచు, కొన్ని సూచనల నిచ్చి యీ విషయమై విపులముగ వ్రాయుడని యాదేశించిరి. తదాదేశానుసారము వ్రాసి గ్రంథ మంతయును కంచిలో శ్రీవారికిని, తద న్తేవాసి వర్యులు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీస్వామివారికిని చదివి వినిపించితిమి. వారు సావధానముగ సుమారు 10 రోజులు వినిరి. మిగుల యానందించిరి. తమ వ్యాసమును, యీ గ్రంథమును కలిపి ముద్రించుడని యాదేశించిరి.

> "నమామ వేదమాతర మితి సూ క్తి రస్మాకం జీవనాడీ భవతు । వేదమాతా దేశే దేశే రాష్ట్రే రాష్ట్రే గ్రామే గ్రామే గృహే గృహే విరాజమానా క్షేమం తనోతు । వేద ఏవాస్మాకం సర్వస్వం భవతు । శోభనా స్తే పంథానః సన్తు".

అని యాశీర్వదించి పంపిరి. తదాదేశానుసార మిట శ్రీవారి వ్యాసమును మొదట ప్రకటించుచున్నాము. మా యీ రచనకు బుద్ధి నొసగి ప్రోత్సహించిన శ్రీ చరణులకును, తదంతేవాసివర్యులు శ్రీ జయేంద్రసరస్వతీ స్వామివారికిని హృదయపూర్వక సాష్టాంగ ప్రణామములు.

నమామ వేదమాతరమ్

ప్రదీపం భారత్యాః భరతశుభగీతం సుమనసాం
ప్రగీతం ఛందోభిః మృదుల నవనీతం రసజుషామ్ ।
ప్రపాతం భక్తానాం నిశితశరఘాతం కుమనసాం
ప్రభూతాం వేదాన్తైః హరిహృదయలక్ష్మీం తనుమహే ॥

అమూల్యం రత్నం తత్పరిమలపరీతం నవసుమం
తరుం శీతచ్ఛాయం నవజలధరం దివ్యపథగమ్ ।
సుధాపూర్ణం పాత్రం ఋషివదన తేజః సువిమలం
వ్రజం గోబృందానాం గురుకులకురంగీం తనుమహే ॥

పూర్వసూరికృత వాగ్విలాస స
త్సంప్రదాయ కలితాత్మ సంపదః ।
భారతీ వివృతి మాప్త సంమతా
మున్నయంతి హరిసోదరా ముదా ॥

ఓమ్

నమామి వేదమాతరమ్



శ్రీ శ్రీ శ్రీ జగద్గురు కాంచీ కామకోటి పీఠాధీశ్వరులచే ప్రసాదింపబడి

ఈపూరు హరిహరాజ క్షేత్రములో హరి సోదరులచే ప్రతిష్ఠితమైన

శ్రీ గాయత్రీ మూర్తి

వేదములు

జగద్గురువులు శ్రీశ్రీశ్రీ కాంచీ కామకోటి పీఠాధీశ్వరులు

శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు

'ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా—వేదోఽఖిలో ధర్మమూలమ్.'

వేదములు పరమేశ్వరుని నిఃశ్వాసరూపము లని యనాదిసిద్ధ భారతీయ సంప్రదాయము. మన ప్రాచీనులగు మహర్షులే గాక తరువాత క్రమముగ వెలసిన శ్రీ శంకరభగవత్పాదాది మహాపురుషులును, కాళిదాసాది మహాకవులు, తులసీదాసు, ఆళ్వారులు, నాయన్మారులు, త్యాగరాజు మున్నగు మహాభక్తులు, నెందఱో వేదములు పరమేశ్వరుని నిఃశ్వాసరూపము లని దృఢముగ నమ్మి సహేతుకముగ నిరూపించియున్నారు.

పరమేశ్వరు డీ జగత్తును సృష్టించి రక్షించి లయ మొందించుచున్నాడు. ప్రళయమునం దీ జగత్తు అదృశ్య మగుచుండును. సృషింపబడిన తరువాత నీ జగ త్తెంతకాల ముండునో ప్రలయకాలము గూడ నంతియే. సృష్టి లయములు రెండును నొకదాని వెనుక నొకటి నిరంతరము నియతగతిని చక్రము వోలె తిరుగుచుండును. సృజింపబడిన తరువాత నీ విశ్వమంతయు పదునాలుగు భువనములతో నొప్పుచు నొకానొక సార్వభౌముని యాజ్ఞచే బరిపాలింప బడుచున్నట్లు నియమబద్ధమై ప్రవర్తిల్లుచున్నది. ఆ సార్వభౌముడే పరమేశ్వరుడు. స్థావర జంగమాత్మకములగు ప్రాణులే యాయన పరిపాలనకు లోబడి ప్రవర్తిల్లుచుండెడి ప్రజలు. అందుచే నాయనకు ప్రజాపతి యని పేరు. ఆ చక్రవర్తియు, ఆయనచే బాలింపబడు

జీవులు నందఱు ననాది స్వరూపులు. కాని, సృష్టి జరిగినపు డెల్ల ప్రాణులు మాత్రము భిన్నభిన్న శరీరములతో దిరిగి యవతరించు చుందురు. ఈ ప్రాణులను (పరిపాలిత ప్రజలను) ఉద్ధరించి పోషించుట కొక చట్ట మవసరము. ఆ చట్టమే వేదము. ప్రజలును సార్వభౌముడును అనాది స్వరూపు లగుచో నీ చట్టము గూడ ననాదియే కావలయును. సృష్టి యుండు నంతదాక పరమేశ్వరుడును, ప్రజలును, వేదమును (చట్టమును) శాశ్వత ములు. ప్రళయకాలమున నీ వేదములు పరమేశ్వరుని యందు నిలీనములై యుండును.

వేదములు మంత్రాత్మకములు గాన నవి శబ్దరూపమున నాకాశమున నెపుడును వ్యాపించియుండును. ప్రలయానంతర మీ వేదములు ఋషులచే దర్శింపబడుచున్నవి. పిదప గురువుల నుండి శిష్యులకు సంక్రమించుచు 'శ్రుతులు' అను అన్వర్థనామమున బరగుచు సంరక్షింప బడుచున్నవి. అట్టి గురుశిష్య పరంపరయే నాటినుండి నేటివఱకు వేద సంరక్షణమును గావించుచున్నది. వేదసంరక్షణపరాయణు లగు నీ గురుశిష్యులు క్రమ శిక్షణముతో గూడిన నియమబద్ధ జీవితమును గడుపవలసి యుండును. అట్టి జీవితమును గడుపుచు వేద సంరక్షణమును జేయువారు దివ్యశక్తి సంపన్ను లగుదురు. అంతియే గాదు. నిరంతర మంత్రోచ్చారణ సేయుచు నా మంత్రాక్షరాది దేవతాస్వరూప ధ్యానముచే దాము తరించుచు లోకశాంతి కళ్యాణములకు గూడ దోహద మొనర్చుచున్నారు.

తమిళమున వేదములకు 'ఎఝుదాకిళవి' (Unwritten Words) అనియు, 'మఱై (గుహ్యమైన), ఓతు (గానము లేక ఉచ్చారణ)' అనియు వ్యవహారము. ఇవి పౌరుషేయములు (పురుష ప్రణీతములు) గావు. ఇతర గ్రంథముల వలె వేదములు స్వయముగ చదువుకొన దగినవి కావు. అధ్యయనము ద్వారా మాత్రమే గురువునుండి శిష్యునకు సంక్రమించునవి.

వేదాఙ్గములలో మొదటిది యగు శిక్ష వేదములను స్వయముగ చదువు కొనుట నిషేధించినది.

"గీతీ శీఘ్రీ శిరఃకంపీ తథా లిఖితపాఠకః ।
అనర్థజ్ఞో ఒల్పకంఠ శ్చ షడేతే పాఠకాధమాః ॥" —పా.శి. 32

పింగళము చూడామణి మున్నగు తమిళకోశములు గూడ పరమేశ్వరుడు వేదకర్త (వేద ముదల్వన్ - Veda Mudalvan) అని పేర్కొనుచున్నవి.

సృష్ట్యారంభములం దెపుడును చక్రవర్తి యగు పరమేశ్వరుడు దివ్య యోగశక్తులచే బాహ్యాభ్యన్తర ప్రపంచముల సామరస్యమును సాధింపజాలిన యాధికారిక పురుషులను నియోగించుచుండును. అట్టి మహ నీయులు తమ దివ్య యోగశక్తులచే నీ దివ్యస్తోత్రములను (వేదములను) సాక్షాత్కరింపజేసికొందురు. అనగా తమ దివ్యశ్రవణశక్తిచే విశ్వమునందు వ్యాపించియున్న యనాది వేదశబ్ద తరంగములను దర్శింతురు. బ్రహ్మకు గూడ పరమేశ్వరానుగ్రహముచేత వేదములు స్వయముగ భాసించును. అట్టి యాధికారిక పురుషులే లేక మంత్రద్రష్టలే మొట్టమొదట వేదములను వెలిపరచిన దివ్యమూర్తులు.

"అనాదినిధనా నిత్యా వా గుత్సృష్టా స్వయంభువా ।
ఆదౌ వేదమయీ దివ్యా యత స్సర్వాః ప్రవృత్తయః॥" —మను.

"యుగాంతే ఒంతర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః,
లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతాః స్వయంభువా ॥" —వ్యాసః

"తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే" — భాగవతమ్.

వేదాధ్యయన మన మంత్రయోగము. వేద మంత్రాక్షరము నుచ్చరించినపు డెల్ల తదను గుణముగ దేహము నందలి నాడియందు (నాడీకేంద్రమునందు)

ఒక విధమగు సంచలనము కలుగును. సామాన్యముగ నాడీసంచలనము యొక్క ప్రభావము మనస్సుపై బడి యది కామ క్రోధ శోకాది రూపమున ముఖభంగిమల ద్వారా యభివ్యక్త మగుచుండును. ముఖము మనోభావ దర్పణము (Face is the index of the mind) అను నానుడి యొక్క తాత్పర్య మిదియే. మంత్రాక్షరములను నియమబద్ధముగ నుచ్చరించి తగువిధముగ నాడీసంచలనము కలిగించినచో నుత్తమభావములే యుదయించునట్లు చేసికొనవచ్చును. ప్రాణాయామముచే నాడీనియమనము గావించుట హఠయోగము. సామాన్యముగ నే శబ్దము నుచ్చరించినను నా యుచ్చారణము జిహ్వా, పెదవులు, దౌడలు, వక్షఃస్థలము - వీనియందంతట వ్యాపించి యుండెడి నిఃశ్వాసరూపమగు ప్రాణవాయువుచే ననుగత మగుచుండును. మంత్రోచ్చారణ సమయమున ప్రాణవాయువును దేహమందలి యేదియేని నాడీకేంద్రమున నిలిపి యున్నపుడే యొకవిధమగు ప్రేరణ కలిగి యందుండి శబ్దతరంగములు వెలువడుచుండును. దేహమునుండి వెడలెడి యట్టి శబ్ద తరంగముల ప్రభావము ప్రపంచమున గలుగు సుఖ దుఃఖాదులకు గారణ మగుచుండును. ఇహలోకమునందేగాక పరలోకమునందు గూడ శాన్తిసౌభాగ్యముల గలిగింప జాలెడి శబ్ద తరంగముల నుదయింపజేయు శక్తి వేదమంత్రాక్షరములకు గలదు. అట్టి వేదముల సంరక్షించుకొనుచు లోకశాన్తికై వేదమంత్ర పురశ్చరణము గావించుచుండుట బ్రాహ్మణుని విధ్యుక్తధర్మము. "బ్రాహ్మణేన నిష్కారణః షడఙ్గో వేదోఽధ్యేతవ్యో జ్ఞేయ శ్చ".

తమిళదేశస్థుడు మహాభక్తుడు నగు తిరుమూలర్ మహాశయుడు "అకారాది క్షకారాన్త రూపములగు నేబది వర్ణములతో (మాతృకలతో) విలసిల్లెడి వేదము లనంతములు, అగాధములు" నని కీర్తించెను. యజుర్వేదము నందలి కాఠకము శివ ప్రశ్నయందు వేదముల యనంతత్వమును నిరూపించెడి భరద్వాజుని గూర్చిన గాథ యొకటి గలదు.

భరద్వాజమహర్షి బ్రహ్మచారియై వేదాధ్యయనము చేయుచు జీవితము నంతయు గడిపెను. జీవితాంతమున (నూఱు వత్సరముల తరువాత) మఱి యొక పూర్ణాయుర్దాయము (నూఱు సం॥)ను ఇంద్రుని యనుగ్రహముచే బొందెను. తరువాత వేదాధ్యయనమునకై మఱియొక పూర్ణాయుర్దాయమును గూడ నిమ్మని గోర నింద్రు డనుగ్రహించెను. అప్పటి కాతని భౌతికశరీరము మిక్కిలి జీర్ణ మయ్యెను. అయిన నింకను వేదాధ్యయనము జేయగోరి యింకొక పూర్ణాయుర్దాయ మిమ్మని యింద్రుని కోరెను. ఇచ్చినచో నీ వేమి సేతు వని యింద్రు డడిగెను. వేదాధ్యయనమును బూర్తి జేతు నని భరద్వాజు డనెను. ఇంద్రుడు వెంటనే భరద్వాజుని యెదుట మూడుపర్వతముల జూపించి యా మూడింటినుండి మూడు గుప్పిళ్ళ దుమ్ము తీసి యాతనికి జూపి "మూడువందల యేండ్ల జీవితకాలములో నీవు గ్రహించిన వేదభాగ మింతియే. ఇంకను గ్రహింపవలసిన దింత గల"దని యా పర్వతముల జూపెను.

వ్యాసభగవానుడు అయిదువేల వత్సరములకు బూర్వ మొక రాశిగా నున్న వేదమును ఋక్, యజుస్, సామ, అథర్వరూపమున నాల్గుభాగము లుగ విభజించెను. అపుడు మొత్తము 1131 వేదశాఖలు గలవు. అందు ఋగ్వేదమునకు 21, యజుర్వేదమునకు 101, సామవేదమునకు 1000, అథర్వవేదమునకు 9 — శాఖలు గలవు. అట్టి యీ శాఖలు ఋషి పరంపరగా నధ్యయనము జేయబడుచు వచ్చినవి. కాని కాలక్రమమున వేదాధ్యయనముకంటె నన్యవిద్యల నభ్యసించిననే ఐహిక జీవితము సుఖముగ గడచిపోవు నను భావములు ప్రబలి, గురుశిష్యపరంపరారూపమున క్రమప్రాప్తమైన వేదాధ్యయనము నం దనాదర మేర్పడుటచే వేదశాఖలన్నియు నిపు డుపలభ్యము లగుటలేదు. ప్రస్తుతము ఋగ్వేదమునకు శాకల — లేక ఐతరేయ లేక పౌఝియమ్ (Pouzhiom) అని వేర్వేఱు నామములతో బిలువబడెడి శాఖయొకటియే గలదని తెలియుచున్నది. అట్లే యజుర్వేదము

నకు తైత్తిరీయ, మైత్రాయణీయ, కాణ్వ, మాధ్యందిన శాఖలు నాలుగు లభ్యము లగుచున్నవి. సామవేదమునకు ఛందోగ లేక కౌథుమ శాఖయు, తలవకార లేక జైమినిశాఖయు, రాణాయనీయ శాఖయు మాత్రమే లభ్యము లగుచున్నవి. అథర్వవేదమునకు శౌనక, పిప్పలాద శాఖలు రెండుమాత్రమే గన్పట్టుచున్నవి.

అథర్వవేదాధ్యయనము జేసినవారు నేడు వ్రేళ్లమీద మాత్రమే లెక్కింపదగి యున్నారు. అథర్వవేదీయ శౌనకశాఖాధ్యయనము జేసినవారొకరు మాత్రమే నేడున్నట్లు తెలియుచున్నది. పిప్పలాద శాఖ నేటికిని తాళపత్రములందే నిలిచియున్నది. తమిళదేశమునకు జెందిన మహాభక్తులగు ఆళ్వారులయొక్కయు, నాయన్మారులయొక్కయు భక్తిరసపూర్ణ గేయములలో తలవకార సామశాఖను గూర్చిన ప్రశంసలు గలవు. ఆ మహాభక్తులలో నొకరగు సోమాసిమారనాయన్మారు తలవకార సామశాఖకు జెందినవాడు. ఆయన చోళరాజుల కాలమున నివసించినట్లు తెలియుచున్నది.

మన పవిత్ర భారతభూమియందలి ప్రజలయొక్క దైనందిన జీవితము నందు వేదములయొక్క ప్రభావ మెంతేని గలదను విషయము భారతీయ వివిధ భాషాగత వర్ణపదోచ్చారణను బరిశీలించిన దెలియగలదు. ఆ యా ప్రాంతీయభాషలు ఆ యా వేదశాఖలయొక్క ప్రాతిశాఖ్యలయందలి నిబంధనల ననుసరించి యుచ్చరింప బడుచున్నట్లు తెలియగలదు. ఋగ్వేదమున నుచ్చరింపబడు 'క' యను నక్షరము యజుర్వేదము నందును, కౌథుమ సామశాఖయందును 'ద' యనియు, జైమినీయసామశాఖయందు 'ఴ' (zh) యనియు నుచ్చరింప బడును. 'ఴ' యను నక్షరము తమిళభాషయందే గాననగును. ఆ యక్షరము వేదశాఖలలో నొకటియగు జైమినీయ సామశాఖ యందు గన్పట్టుచుండును. సంస్కృతవ్యాకరణము జిహ్వామూలీయము (ఃక) ఉపధ్మానీయము (ఃప) అను రెండక్షరముల స్వరూపమును నిర్దే

శించినది. జిహ్వయొక్క మూలమున నుద్భవించుటచే దానికి జిహ్వామూలీయ మని పేరు. తమిళభాషలో దీనిని ఐథమ్ (Aitham) అని వ్యవహరింతురు. వేదాంగములగు శిక్ష, వ్యాకరణ, శాస్త్ర సంప్రదాయముల ననుసరించి విసర్గపూర్వక కకారరూపమున (ఃక) నీ జిహ్వామూలీయము వ్యవహరింపబడుచున్నది. ఐరోపా అరబ్బీభాషల యందు గన్పట్టు 'F' (యఫ్) అను నక్షరము వ్యాకరణశాస్త్రమున ఉపధ్మానీయ మను నామముతో విసర్గపూర్వక పకారరూపమున (ఃప) తెలియ నగుచున్నది. తొల్‌కాప్పియమ్ అని పిలువబడు తమిళ భాషా వ్యాకరణమునకు గూఢ మూలము ఐంద్రవ్యాకరణము. శిక్షా వ్యాకరణము లన్నివేదశాఖలకును సమానములు. ఇవికాక యొక్కొక్క వేదశాఖకు సంబంధించి ప్రత్యేకముగ వ్యాకరణములు గలవు. వానికి ప్రాతిశాఖ్యము లని పేరు. ఉత్తరభారతము నందలి రాష్ట్రములలో విశేషించి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రములలో ప్రచారములో నున్న వ- జ- క్ష- యను నక్షరములు దాక్షిణాత్య రాష్ట్రములలో క్రమముగ బ- య- క- యని యుచ్చరింప బడుచుండును. ఉత్తర భారతమున తైత్తిరీయ కాణ్వశాఖలు ప్రచారములో లేక మాధ్యందినశాఖ విస్తరించుటయే యీ వర్ణోచ్చారణభేదమునకు గారణముగా నూహింపవచ్చును. ఏలయన మాధ్యందిన తైత్తిరీయశాఖలకు సంబంధించిన ప్రాతిశాఖ్యలందీ వర్ణోచ్చారణ భేదమును గూర్చిన నిబంధనలు గలవు. క్రైస్తవ మత వ్యాప్తి గాంచిన దేశములందును 'య' కారమునకు బదులు 'జ' కారము వ్యవహారములో గన్పట్టుచున్నది.

Jews జ్యూస్ – యూదర్ (తమిళము)—యూదులు (తెలుగు).
Joseph జోసెఫ్—యూసఫ్.

ఇట్టి వర్ణోచ్చారణ భేదము ననుసరించి యా దేశములలో మాధ్యందినశాఖ వ్యాప్తమై యుండి యుండు నని యూహింపనగును.

ఆంధ్రప్రదేశమున నూటికి తొంబదిమంది యజుర్వేదశాఖకు జెందిన వారు. సంభాషణలయందును ఆ యా ప్రదేశముల నామముల యందును 'డ' కారము నెక్కువగ నుపయోగించుట యాంధ్రదేశమున తైత్తిరీయ శాఖయొక్క విశాలవ్యాప్తిని సూచించును. తైత్తిరీయ శాఖయందలి 'డ' కారము సామశాఖయందలి ఴ (zh) కారమునకును ఋగ్వేదము నందలి 'ళ' కారమునకు సమానము. మహారాష్ట్రులలో నూటికి ఎనుబది మంది ఋగ్వేదీయశాఖలకు జెందినవారు. తమిళదేశమున ఴ (zh) కారమును, ఆంధ్రదేశమున డకారము నుపయోగించు పట్టులయందు మహారాష్ట్రులు తమ దైనందిన సంభాషణాది వ్యవహారములందు గూడ 'ళ' కారము నుపయోగింతురు. ఋగ్వేదీయ ప్రాతిశాఖ్యయం దట్టి తావులందు 'ళ' కార ముపయోగింపబడవలె ననెడి నిబంధన లుండుటయే యీ వ్యవహారమునకు గారణము గావచ్చును.

అందుచేతనే యజుర్వేదము నందలి 'డ' కారము ఋగ్వేదమున 'ళ' కారముగ నుచ్చరింపబడుచున్నది. యజుర్వేదశాఖలయందు గన్పట్టు 'డ' కారము ఋగ్వేదమున నరుదు. ఛందోగ సామశాఖ యందలి 'డ' కారము జైమినీయసామశాఖయందు 'ఴ' (zh) కారముగ నుచ్చరింపబడుచుండును. వేదశాఖల యందలి యిట్టి వర్ణోచ్చారణ భేదమే వ్యావహారిక భాషల యందును తలజూపిన దని చెప్పవచ్చును. మృగశీర్షా నక్షత్రయుక్త పూర్ణిమకు 'మార్గశీర్షి' యని శాస్త్రమున వ్యవహారము గలదు. మృగశీర్షా నక్షత్రము తమిళమున 'మార్గశీర్డ' యని వ్యవహరింపబడును. మార్గశీర మాసమును తమిళదేశమున మహాభక్తురాలగు ఆండాళ్ళు 'మార్గఴి తింగళ్' (Margazhi Thingal) అని పేర్కొనినది. నియమబద్ధముగ జేయబడు వేదమంత్రాక్షరోచ్చారణము లోకకళ్యాణప్రదము గాన మంత్రములు పుష్టి హేతువు లగుచు పౌష్టికములు' అని చెప్పబడుచున్నవి. సంస్కృతము నందలి 'పౌష్టిక' మను పదము తమిళమున 'పౌడికమ్' అనియు, మళయాళ

మున 'పౌజ్షియమ్' (Powzhiam) అనియు నుచ్చరింపబడును, తెలుగు లోని 'ద' కారము తమిళమునందు 'జ్ష' కారముగను కన్నడమున 'ళ' కార ముగ నుచ్చరింపబడు ననుటకు గొన్నియుదాహరణములు ;

తెలుగు	తమిళము	కన్నడము
పొగడుట	Puhazhlthal పుహజ్షుదల్	Hokaluvathu హొగళువదు
పగడాలు	Pavazhlam పవజ్షమ్	Havalu
పాడు	Pazh	Halu హాలు
కూడు	Koozh కూజ్షు	Koolu కూలు

ఆ యా భాషలలో నిట్టి వర్ణోచ్చారణ భేదమునకు నా యా ప్రాంతములందు ప్రచారములో నున్న ప్రాతిశాఖ్యములే కారణము. ప్రతి వేదశాఖ యందును కర్మకాండ యనియు జ్ఞానకాండ యనియు రెండు భాగములు గలవు. సదాచారానుష్ఠానములతో యజ్ఞయాగాదులను గూర్చి కర్మకాండ వివరించుచున్నది. కర్మఫలమును సర్వమును పరమేశ్వరార్పణ జేయుచు లోకశాన్తి కొఱకై పరమేశ్వరుని ప్రార్థించుట వలన చిత్తశుద్ధి కలుగును. ఇట్లు నిష్కామ కర్మానుష్ఠానము చేతను, భగవద్ధ్యానము చేతను గలిగిన చిత్త శుద్ధి పరమేశ్వర స్వరూపానుసంధానమునకు గారణము కాగలదని జ్ఞాన కాండ యుపదేశించుచున్నది.

ఈ ప్రపంచము సృష్టింపబడిన తరువాత నొకానొక సమయమున నీ ప్రపంచమంతయు వైదికమత వ్యాప్తమై యున్నట్లు శ్రీ మద్భాగవతాది గ్రంథములవలన దెలియుచున్నది. ప్రాచీనకాలమున ఉత్తరధ్రువమునుండి దక్షిణధ్రువము వరకు నీ భూగోళము సప్తద్వీపములతోను, ఆ ద్వీపముల మధ్య సప్తసముద్రములతోను వ్యాప్తమై యవి ఉత్తరమునుండి దక్షిణము వరకు నీ భూగోళమును ఉంగరముల వలె చుట్టుకొని యున్నట్లు దెలియు

చున్నది. అందు ప్రతి ద్వీపమునందును, వైదికకర్మానుష్ఠానము, వేదమార్గానుగతమైన యర్చనాదికము గలవు.

భూమి రోజున కొకసారి తన చుట్టును, సంవత్సరమున కొకసారి సూర్యునిచుట్టును తిరిగి వచ్చునపుడేర్పడు కక్ష్యలు లేక క్రాంతవృత్తములు (orbits) రెండును ఒకే సమతలమున (Ecliptic plane) నుండును. భూమ్యక్ష మీ సమతలమునకు $66\frac{1}{2}$ డిగ్రీలకోణమున వరిల్లుచు నిరంతరము ధ్రువతారవైపు జూచుచుండును. జ్యోతిశ్శాస్త్రము ననుసరించి యిట్లు భూమి సూర్యుని చుట్టి పరిభ్రమించునపుడు సంవత్సరమునకు రెండుసార్లు అనగా మేషమాసమునందును తులామాసమునందును విషువములు (Vernal and Atumnal Equinoxes) యేర్పడును. మేషమాసమున మొదటి దినము మేషవిషువము. తులామాసమున మొదటి దినము తులావిషువము. విషువ దినములయందు రాత్రిందివళ్ళు సమానదైర్ఘ్యము గలిగియుండును. అమరకోశమునందును వ్యాకరణమునందును 'విషు' పదమున కిట్టే యర్థము వివరింపబడి యున్నది.

"సమరాత్రిందివే కాలే విషువ ద్విషువం చ తత్"

కాలక్రమమున నీ భూభ్రమణ (Orbit) కక్ష్యయందు విషువము లేర్పడు స్థానములు (Equinoctial points) వెనుకకు జరుగుచుండును. అందుచే బైన దెలిపిన మేష, తులా, విషువత్పుణ్యకాలము లందలి రాత్రిం దివళ్లయొక్క కాలపరిమితి గూడ సమానముగ నుండక మాఱ జొచ్చినది. ప్రస్తుత మేష తులాసంక్రాంతి పుణ్యకాలములకు 22 దినములకు బూర్వమే సమ రాత్రిం దివకాలము వచ్చుచున్నది. ఖగోళ భూగోళ శాస్త్రములు భూభ్రమణ కక్ష్య [Orbits] లందు సంభవించెడి యిట్టి మార్పు (Precession) వలననే ద్వీపములయొక్కయు, సముద్రములయొక్కయు ఉనికియందు గూడ పెక్కు మార్పులు సంభవించుచుండు నని చెప్పుచున్నవి. యుగ

భేదము ననుసరించి ద్వీపముల యొక్కయు సముద్రములయొక్కయు స్థితి గతులు మాఱినవని చెప్పవచ్చును. కృతయుగమునందును, త్రేతాయుగము నందును ఉచ్చస్థితిలో నున్న వైదికకర్మానుష్ఠానము క్రమముగ ద్వాపర యుగములో గొలదిగ మార్పుజెంది కలియుగములో గొన్ని యెడల మాత్రమే బీజప్రాయముగ నిలిచియున్నది.

క్రీ. పూ, 3500 సం॥ నాటి ఈజిప్టు శాసనములలో రామెసెస్ II (Ramesses) అను తెగకు జెందిన ప్రభువు హిట్టైట్సు అను తెగయొక్క ప్రభువుతో సంధి జేసికొని యందుకు సాక్షులుగ నా సంధిపత్రమున మిత్రా వరుణ దేవతల నుదహరించినట్లు H.R. Hall వ్రాసిన Ancient History of the Near East అను గ్రంథమున (364 పుటలో) గలదు. క్రీ. పూ. 5000 సం॥ నాటి మఱియొక ఈజిప్టు శాసనమున గూడ నట్టే వైదిక 'మిత్ర' దేవత సాక్షిగా గ్రహింపబడినట్లును గలదు. ఇంతే కాక హిట్టైట్సు ప్రభువు ఉత్తర మెసపిటోమియాలోని మిటానీ దేశప్రభువుతో సంధి జేసికొని వ్రాసికొనిన సంధిపత్రములందు మిత్ర-వరుణ-ఇంద్ర-నాసత్య దేవతలు సాక్షులుగ గ్రహింపబడినట్లును (Vedic Chronology and Vedanga Jyotisha. B. G. Tilak పుట 129) గలదు. వేదములయందు మిత్ర దేవతను పర్షియా యందలి ఇరేనియనులు గూడ నదే నామముతో కొలుతురు. లిడియా, రోమ్ దేశీయులకు గూడ మిత్రదేవత సుపరిచితము. ఈజిప్టు శాసనములందు గన్పట్టు ఒక తెగకు నామమైన Ramesses అను పదమునకు విషుంటువునం దిట్లు అర్థము గలదు. 'Ramesses (3 Syl) The title of an ancient Egyptian Dynasty; it means offspring of the Sun'. Dictionary of Phrase and Fable By E. Coobham Brewer, L.L.D. కాన పై తెగవారు సూర్యవంశపు రాజులై యుందురు.

అవినాశ్ చంద్రదాస్ అను సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకుడు Rigvedic India అను గ్రంథమున 94 వ పుటలో నిట్లు చెప్పినాడు. "వేదకాలపు ఆర్యులు గొలిచెడి మిత్రదేవతయు, ఇరేనియనులు ఆరాధించెడి మిత్రదేవతయు, లిడియనులు పూజించెడి మిడ్యూస్ (Medeus) దేవతయు, సమానమే. రోమన్ సామ్రాజ్యమున నాల్గవ శతాబ్దపర్యన్తము మిత్రదేవతా రాధన కొనసాగినది. జొరాస్ట్రియానిజమ్ ప్రభావము వలననే పశ్చిమ ఐరోపా ఖండమున మిత్ర (సూర్య) దేవతారాధనము వర్ధిల్లెను. ఇది క్రీస్తుకు పూర్వము మొదటి శతాబ్దముననే రోమ్ నగరమున ప్రారంభమై క్రీ.శ. మొదటి శతాబ్ది పూర్తియగుసరికి సైనికులు, బానిసలు, వర్తకులు మున్నగు వారిద్వారా రోమ్ సామ్రాజ్యమునం దంతటను విరివిగ విస్తరించెను. క్రీ.శ. మూడవ శతాబ్ది నాటికి అంతర్జాతీయ మతముగ విలసిల్లెను. 4 వ శతాబ్ది ప్రారంభమున రోమన్ చక్రవర్తులు చాలమంది మిత్ర దేవతారాధకులే. కాని క్రీ.శ. 326 లో రోమన్ సామ్రాజ్యమును జయించి స్వాధీన మొనర్చుకొనిన కాన్‌స్టాంటిన్ అను ప్రభువు క్రైస్తవ మతమును అధికారమతముగ జేయుటవలన మిత్రదేవతారాధనము క్రీ. శ. 4 వ శతాబ్దాంతమున సన్నగిల్లి క్రమముగ రోమునగరమునం దదృశ్య మయ్యెను."

స్పెన్‌సర్, గిల్లియన్, మాక్మిలన్ అనువారు 1899లో ప్రకటించిన "The Nature of Tribes of Central Asia" అను గ్రంథమున 621 పుటలో CIF-128, 129 చిత్రములలో చూపబడిన ఆస్ట్రేలియా యందలి జానపద శివతాండవ దృశ్యభంగిమలలో శివునకు తృతీయనేత్రము గలదు. నేటికిని భారతదేశమునకు రెండువేల మైళ్ళ దూరమున బాలీ ద్వీపములో మన దేశము నందు వలెనే యచట నున్న శివాలయములందు వేదమంత్రములతోనే పూజాదికము నిర్వర్తింపబడుచున్నది. అన్య మతస్థులు గూడ తమ తమ మతములకు గొప్పతనము సమకూరుటకై తమ గ్రంథములను "వేదములు" — అని పేర్కొనుట వేదముల యొక్కయు, వైదిక

సంప్రదాయము యొక్కయు, ప్రాచీనతకు, పవిత్రతకు దార్కాణము వేదవేద్యుడైన పరమేశ్వరుడు శ్రీరాముడుగ నవతరించినపుడు వేదము రామాయణరూపమున నవతరించె నని చెప్పబడుచున్నది.

"వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షా ద్రామాయణాత్మనా ॥"

మహాభారతము పంచమవేదముగా గీర్తింపబడినది. విష్ణుభక్తు డగు నమ్మాళ్వారు వేదములను "ద్రావిడ ప్రబంధ" రూపమున ననువదించినట్లు చెప్పుదురు. "తిరువళ్ళువ మాల" యను గ్రంథమున బ్రహ్మయే వళ్ళువార్ రూపమున నవతరించి వేదతాత్పర్యమును "తిరుక్కురళ్" అను గ్రంథమున సంగ్రహించి చెప్పెనని వర్ణింపబడినది. మహమ్మదీయులును క్రైస్తవులును తమ తమ మత గ్రంథములను (ఖురాన్-బైబిలు) వేదములు అను పేరుతో కీర్తించుకొనుచుందురు. బైబిలులోని "జ్ఞానవృక్షము" (Tree of Knowledge), నిషిద్ధ ఫలము (Forbidden Fruit), స్త్రీ సృష్టి" —వీనిని గూర్చిన ప్రస్తావన ఐతరేయ బృహదారణ్యకోపనిషత్తుల యందలి శాస్త్రీయ దృక్పథమును బోలియున్నవి.

పాశ్చాత్యవిద్వాంసులు కొందఱు దేహవర్ణమునుబట్టి జాతివిభాగమును జేయవచ్చు నను సిద్ధాన్తమును నమ్మినవారై యా సిద్ధాన్తమును బురస్కరించుకొని ప్రపంచములోని ప్రజలను కాకేషియనులు లేక ఆర్యులు, సెమిటిక్కులు, మంగోలియనులు, నీగ్రోలు, రెడ్ ఇండియనులు, అని విభజించిరి. మఱియు "అందు వేదములు ఆర్యులకు సంబంధించినవి. వారు ఒక ప్రాంతమునుండి మరియొక ప్రాంతమునకు వలస పోవుచు తమ వేదములను గూడ వెంటగొనిపోయి వివిధప్రాంతములందు వానిని వ్యాపింపవజేసిరి." అనియు చెప్పుచున్నారు. స్వామి వివేకానందులు వారి వాదము నిట్లు ఖండించిరి. "ఆర్యు లనువారు ఎచటినుండియో విదేశముల నుండి

యకస్మాత్తుగ నిటకు వచ్చి మీదపడి యిచటి యాదిమ నివాసులను తరిమివేసి నిర్మూలించి వారిభూముల నాక్రమించుకొని భారతదేశమున స్థిరపడిరి— యని చెప్పెడి మీ ఐరోపావిద్వాంసుల వాదము నిరాధారము; కేవల మసత్యము; అవివేకి ప్రలాపము. మన భారతీయవిద్వాంసులుగూడ వారి వాదములకే జోహారు లర్పించుచు నిట్టి యభూతకల్పనలతో నిండిన ఈ పచ్చి యబద్ధములనే మన బాలురకు గూడ బోధించుట విచిత్రము.''

ప్రపంచమంతయు వైదికసంస్కృతి లేక వైదికనాగరికతచే వ్యాప్త మైనట్లు భారతీయుల విశ్వాసము. మఱియు చైనీయులు, ద్రావిడులు, తార్తారులు, పారశీకులు — అందఱును క్షత్రియులే యని ధర్మశాస్త్రము చెప్పుచున్నది.

''శనకైస్తు క్రియాలోపా దిమాః క్షత్రియజాతయః।
వృషలత్వం గతా లోకే బ్రాహ్మణాదర్శనేన చ॥
పౌండ్రకా శ్చౌడ్ర ద్రవిడాః కాంభోజా యవనా శ్శకాః।
పారదా పల్లవా శ్చీనాః కిరాతా దరదాః ఖశాః॥

—మను. 10-43, 44.

చరిత్రకారులగు పాశ్చాత్య భారతీయ విద్వాంసులు వేఱు వేఱు సిద్ధాంతముల నాధారముగ గొని వేదములకు కాలము నిర్ణయింప బూనుకొనిరి. ఎవరి సిద్ధాంతము వారిది. ఒకరి నిర్ణయముతో మఱియొకరి నిర్ణయము పొసగుట లేదు. కాని ''వేదములు అతిప్రాచీనములు; వాని కాలమును ఇదమిత్థ మని నిర్ణయించుట శక్యము కాదు''—అని మాత్ర మందఱు నంగీకరించిన విషయము.

హరప్పా, మహెంజోదారో నగరముల యందలి నాగరికత వైదిక సంస్కృతికి జెందినది గాదని కొందఱి యభిప్రాయము. కాని యది సరి గాదు. హరప్పా యందలి యొక శిల్పములో చేదింపబడిన అశ్వత్థవృక్ష

శాఖ యొకటి, మేకను పట్టుకొనియున్న పురుషుడు, శాఖప్రక్కన నొకస్త్రీ, వరుసగ నిలబడిన కొందఱు పురుషులు గలరు, "వేదకాలమును మొదట స్థూలముగ నిర్ణయించుకొని, దానికి ముందుగనే ఈ హరప్పాశిల్ప ముండి యుండవలె నని తలచుటచే చరిత్రకారుల కీ శిల్పమును గూర్చిన సమన్వయము కుదురలేదు. ఈ శిల్పచిహ్నమును యాగసంబంధిగా దెలిసికొనక గ్రామదేవతకు బలియిచ్చునట్లు భావించి యున్నందున అశ్వత్థవృక్షశాఖ గూర్చిన వివరము గూడ వారికి లభించుట లేదు—అని Director general of Arehaeology యొక్క యభిప్రాయము.

"యజ్ఞము కొఱకు మాత్రమే యశ్వత్థవృక్షమును ఛేదింప నగును; ఇతర సమయములందు ఛేదించుట పాపము" —అని యనాదిసిద్ధ భారతీయ సంప్రదాయము. ఈ శిల్పము యాగయజమానుడు, అతని ధర్మపత్ని, ఋత్విగ్గణము, యాగపశువు, అశ్వత్థశాఖలతో గూడిన నొక యాగశాల యని తెలియనగును. ఇట్లు శిల్పముల నన్నిటిని సూక్ష్మముగ బరిశీలించిన వేదములు — వైదికసంస్కృతి యొక్క యతి ప్రాచీనతయు, వైదిక సంస్కృతియొక్క వ్యాప్తియు స్పష్టముగ గాంచనగును.

జైనులుగూడ తమ గ్రంథములలో గొన్నిటియందు వేదములు నిత్యము లని చెప్పిరి. (చూ. త్రిషష్టి స్థలక పురుషచరిత్ర. I-IV–244,948, 256). బాలగంగాధర తిలక్, డాక్టరు జాకోబీ మహాశయు లిరువురు ఖగోళ–భూగర్భశాస్త్ర పరిశోధన ఫలితముల నాధారముగ గైకొని వేదముల కాలము క్రీ. పూ. 6000 సం॥ అని నిర్ణయింప బూనిరి. (చూ. The **Orion and Arctic Home in the Vedas**) అవినాశచంద్రదాస్ ధీరేంద్రనాథ్ మహాశయు లిరువురు భూగర్భ నైసర్గిక పరిణామ స్థితిగతుల ననుసరించి కాలనిర్ణయమునకు గడంగిరి. మాక్సుముల్లరు వింటర్ నిడ్జ (Winternitz) మొదలగు పాశ్చాత్య విద్వాంసులు ఐరోపాయందపాలి

భాషలు కాలగతి ననుసరించి పొందియున్న వివిధ వర్ణలోప వ్యత్యయాది పరిణామముల బరిశీలించి భాషాశాస్త్ర సిద్ధాన్తముల గొన్నిటిని రూపొందించి, తదనుగుణముగ వేదకాలమును స్థూలముగ నిర్ణయింప బాటుపడిరి. వేద కర్తలగు ఋషులు ఒకచో స్థిరనివాసము లేక యొక ప్రాంతము నుండి మఱియొక ప్రాంతమునకు వలస పోవుచు వేదముల వ్రాసి యుందురని యా విద్వాంసు లభిప్రాయ పడిరి. వారి వాదము ననుసరించి యార్యులకు స్థిరనివాసమే లేనిచో నా కాలమున స్థిరనివాస యోగ్యములగు గ్రామనగరాదులు గాని, సుస్థిరమగు ఆర్థిక సాంఘిక వ్యవస్థగాని యున్నవని చెప్పుటకు వలనుపడదు. కాని యా విద్వాంసులు సింధునదీలోయ ప్రాంతమును, హరప్పా మహెంజోదారోలలోని శిల్పములను, పురాతన శిల్పవస్తు శాస్త్ర సిద్ధాంతములరీత్యా పరిశీలించి వేదరచనాకాలమునకు 5000 సం॥ పూర్వమే మహానగరము లుండియున్నట్లును, దానికి తార్కాణము హరప్పా మహెంజోదారో నగరము లనియు జెప్పుచున్నారు. హరప్పా యందలి శిల్పములు వైదిక సంస్కృతి ప్రతిరూపములుగా గాంచనగునని పూర్వము జెప్పితిమి. కాన వేదకర్తలగు ఋషులు నిలువ నీడ లేక తెగలు తెగలుగా వలస పోవుచు జీవించు చుండెడి వారని చెప్పెడి వారి వాదము నిరాధారము. అట్లు గాక యొకవేళ వేదరచనాకాలమునకు బూర్వమే యా మహానగరము లుండియుండు ననెడి వారి వాదము నంగీకరించినను అట్లు మహానగరము లా కాలముననే విలసిల్లియుండ వేదకర్తలైన ఋషులు అట్టి నగరములను వీడి నిలువనీడలేక వలస పోవుటలో గారణము గన్పట్టదు. కాన 'ఆర్యులు వేదకర్తలు; వారు తెగలు తెగలుగ (Nomads) వలస బోవుచు వేదముల రచించి యుందురని చెప్పెడి వారి వాదములు నిరాధారములు.

ఇక భాషాశాస్త్ర (Phylology) సిద్ధాంతముల దృష్ట్యా వివిధ భాషా పరిణామముల బరిశీలించి చేయబడిన వేదకాల నిర్ణయమును యుక్తము

గాదు. ఎట్లన : ఇది దైనందిన మింటియం దుపయోగింపబడెడి పాత్రల యొక్కయు, అప్పుడప్పు డరుదుగ నేదేని యొక నిమిత్తమునకై యుపయోగింబడు పాత్రయొక్కయు మన్నికను దృష్టాంతముగ గైగొని పరిశీలింప దగినది. ఐరోపాభాషలు నిరంతరము దైనందినవ్యవహారములలో కోట్లకొలది ప్రజలచే భాషింపబడుచు, వ్రాయబడుచు, ప్రచారము గావింపబడుచు అనేకులచే ననేకవిధముల నుపయోగింపబడుచు వచ్చినవి. వేదమంత్రములట్లుగావు. ఇవి యే కొలదిమందిచేతనో కంఠస్థములు జేయబడుచు, గురువుచే శిష్యున కనుగ్రహింపబడుచు, యజ్ఞాది పవిత్ర కర్మాచరణమునందు మాత్రమే నియమపూర్వకముగ వినియోగింప బడుచుండును. విద్యార్థి ఉపనయనమైన తరువాత వేదముల గ్రహించుటకు క్రమశిక్షణతోపాటు తగిన యోగ్యత సంపాదించి పండ్రెండు వత్సరములు గురుశుశ్రూష జేయుచు నధ్యయనము జేయవలసి యున్నాడు. ఆ వేదమంత్రోచ్చారణము గూడ శిక్ష, వ్యాకరణము, ఛందస్సు — అనెడు మూడు శాస్త్రములచే నియమిత మైనది. ఆడుపులి తన శిశువును కోఱలతో బట్టుకొని యొక ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమునకు దుముకుచు బోవునపుడు తన శిశువున కెట్టి హానియు గలుగ కుండుటకై యెంతటి జాగరూకత వహించునో వేదమంత్రోచ్చారణమునందు గూడ నంతటి జాగరూకత యావశ్యకమని శిక్షాది గ్రంథములు హెచ్చరించుచున్నవి.

"యథా వ్యాఘ్రీ హరేత్పుత్రాన్ దంష్ట్రాభిః న చ పీడయేత్ ।
భీతా పతన భేదాభ్యాం తద్వ ద్వర్ణా న్ప్రయోజయేత్ ॥
ఏవం వర్ణాః ప్రయోక్తవ్యా నావ్యక్తా న చ పీడితాః ।"

— నారదీయశిక్ష - 2 ప్రపాఠక; 30-31.

సృష్టికాలమునుంటి ప్రళయకాలము వరకు నొకే విధముగ నెట్టి మార్పులు లేకుండ నుండవలె ననెడి యభిప్రాయముతోనే యిన్ని నియమ

ములతో వేదమంత్రములు రక్షింపబడుచు వచ్చుచున్నవి. ఇట్లు వేద మంత్రోచ్చారణ సంరక్షణమునకై యేర్పడినవే పద - క్రమ - జటా - ఘనాది వికృతులు.

వేదమంత్రముల వీర్యత్వము, శక్తిమత్త్వము గూడ లక్షణగ్రంథము లందు బ్రతిపాదింపబడిన వర్ణక్రమ మనెడి యొక విశిష్టసంప్రదాయముచే సురక్షితముగ జేయబడినది. ఆ సంప్రదాయము ననుసరించి వేదమునందలి ప్రతి యక్షరమును గూడ ధ్వని - స్థాన - కరణ - ప్రయత్న - మంత్ర - స్వర - దేవతా - జాతు లనెడి యెనిమిది లక్షణముల మనస్సునం దుంచు కొని యెంతయో మెలకువతో నుచ్చరింప వలసియున్నది.

"ధ్వని స్థానం చ కరణం ప్రయత్నః కాలతా స్వరః ।
దేవతా జాతి రేతై శ్చ వర్ణో జ్ఞేయో విచక్షణైః ॥"

వేదమందలి ప్రతి యక్షరముయొక్క మాత్రల సంఖ్యయు, వర్ణో త్పత్తి స్థానము, అందలి ముఖ్యాముఖ్య విభాగములు, వర్ణోత్పత్తికై చేయు వివిధయత్నములు, వివిధస్వరములు, ఆ స్వరముల నుచ్చరించునపుడు ఉచ్ఛ్వాస నిశ్వాసముల నియమించు విధానము, వేదముల యందలి సప్త స్వరములకును సంగీతశాస్త్రము నందలి సప్తస్వరములకును గల పరస్పర సంబంధము వేదముల యందలి స్వరములకును మయూర-వృషభ-గాంధార (కందహారుకు జెందిన గొఱ్ఱె) - క్రౌంచ - కోకిల - అశ్వ - గజాది పశుపక్ష్యాదుల సహజ ధ్వనులతో గల సామ్యము, ఏకత్వము—వీని నన్నిటిని ఈ లక్షణ గ్రంథములు చక్కగ వివరించియున్నవి. అంతియే కాదు. మంత్రము స్వరహీనమై చక్కగ నుచ్చరింపబడక పోయినను, వర్ణ వ్యత్యయము గలిగినను కలుగవలసిన ఫలము కలుగక పోగా తద్విపరీత (అనిష్ట) ఫలము సంప్రాప్తించును.

"మంత్రో హీనః స్వరతో వర్ణతో వా
మిథ్యాప్రయుక్తో న త మర్థ మాహ ।
స వాగ్వజ్రో యజమానం హినస్తి
యథేంద్రశత్రుః స్వరతో ఽపరాధాత్"॥

కనుక వేదమంత్రములుగూడ వ్యావహారిక భాషల వలెనే (సృష్ట్యాది నుండి ప్రళయము వరకును) కొన్ని పరిణామముల జెందియుండ నగునని నిశ్చయించి భాషాశాస్త్ర (Phylology) సిద్ధాంతముల ననుసరించి వేద కాలమును నిర్ణయింప బూనుట యుక్తిసహముగాదు. పైగా నీ వాదములు అనవస్థకును అవ్యవస్థకును గారణములై నిలువక పోవుచున్నవి.

బాలశాస్త్రి హరదాసపండితుడును తన "Glimpses of the Vedic Nation" అను గ్రంథమున అన్యభాషలవలె వేదమంత్రములు వ్యావహారిక భాషాకల్పితములు గావు. అనగా ఆర్యులనెడివారు నాడు తాము వ్యవహరించుకొనుచుండెడి భాషలోనే వేదమంత్రముల రచించిరి"-అని చెప్పుట యుక్తిసహము గాదని సప్రమాణముగ నిరూపించెను. మఱియు తన వాదమున కుపష్టంభముగ సంస్కృతవ్యాకరణకర్తలలో బ్రధానుడగు పాణిని తన సూత్రముల ద్వారా యీ యభిప్రాయమును సూచించినట్లు ఇట్లు నిరూపించినాడు.

"The Vedic Language was called by him 'Chhanda' and the Common Sanskrit Language as 'Bhasha" (p.p- 164)

పాణినిమహర్షి వేదములను "ఛందః" అనియు. సాధారణభాషను- "భాష" యనియు వ్యవహరించినాడు. (చూ. 'బహుళం ఛందసి'ఇత్యాది)

పై విషయములబట్టి "వేదములు వ్యావహారిక భాషలకంటె విలక్షణమైనవి; లౌకిక వ్యవహార భాషారూపములు గా"వని పాణిని స్పష్టముగ జేర్కొనుట తెలియనగును.

ఈజిప్టుయందు దొరకిన శాసనములలోని మిత్రావరుణుల గూర్చిన ప్రసక్తి మధ్యధరాసముద్ర ప్రాంతదేశమునందలి వైదిక విజ్ఞాన వ్యాప్తిని సూచించుచున్నది. మహేంజోదారోయందు లభించిన పురాతనశిల్పములలో నొక వృక్షముమీద రెండు పక్షులుండి యందొకటి పిప్పలఫలమును దినుచుండ రెండవది యుదాసీనముగ జూచుచున్నట్లు (చూ. 1950 సం॥లో ప్రకటింపబడిన కళ్యాణ్ పత్రిక సంవత్సరాదిసంచిక, 137వ. పుట) గలదు. కొందఱు పురావస్తు శిల్పశాస్త్రజ్ఞుల ననుసరించి ఈ పక్షుల జంట ఋగ్వేదము (1-164-20) నందు నిరూపింపబడిన జీవాత్మ పరమాత్మలు. బైబిలు పాతనిబంధన (Old Testament)లో సృష్ట్యారంభమునకు నిమిత్తమును వివరించుచు నిట్లు చెప్పబడినది. మొదట 'ఆదమ్' అను పురుషుడు, 'ఈవ్' అను స్త్రీయు సృజింపబడిరి. వారిరువురు నొక చెట్టు క్రింద నుండిరి. కాని యా చెట్టు యొక్క ఫలమును తినుట మాత్రము నిషేధింపబడెను. ఇట పేర్కొనబడిన చెట్టు జ్ఞానవృక్షము లేక బోధివృక్షముగా దెలియనగును. వారిలో ఈవ్ (స్త్రీ) నిషేధము నుల్లంఘించి యా ఫలమును దినుటకై మనసుపడెను. ఉపనిషత్తులు "వృక్షమున నున్న యా రెండు పక్షులలో నొకటి ఆత్మ ; రెండవది జీవుడు ; జీవుడు కర్మఫలభోక్త ; ఆత్మ స్వయంజ్యోతీరూపుడు, కర్తృత్వభోక్తృత్వాది రహితుడు, ఉదాసీనుడు "(సాక్షి) అని వివరించినది. బైబిలులో పేర్కొనబడిన ఆదమ్ శబ్దము యొక్కయు, ఉపనిషత్తులలో పేర్కొనబడిన ఆత్మ శబ్దము యొక్కయు రూపనిష్పత్తికి మూలమైన ధాతువుయొక్క అర్థము సమానము. కావున, ఉపనిషత్ప్రతిపాదితాంశములే పెక్కు వైకల్యముల నొంది Old Testament లో వర్ణింపబడినవని చెప్పవచ్చును. ధాత్వర్థము ననుసరించి 'ఈవ్' పదమునకు 'జీవించుట' యని యర్థము. పిప్పలమనగా బోధిద్రుమము.

"బోధిద్రుమ శ్చలదలః పిప్పలః కుంజరాశనః"— అమరకోశ.

అదియే "జ్ఞానవృక్షము. ఈ బోధిద్రుమము క్రిందనే శాక్యముని యగు సిద్ధార్థుడు జ్ఞానము నొంది బుద్ధు డయ్యెను. ధర్మశాస్త్రములు బోధి ద్రుమము యొక్క ఫలభక్షణమును నిషేధించినవి.

> "తథా వట ప్లక్షాశ్వత్థ దధిత్థ నీప మాతులుంగ ఫలాని
> వర్జయేత్" —వైద్యనాథదీక్షిత,-స్మృతిముక్తాఫలము-ఆహ్నికకాండ.

తిలక్ మహాశయుడు 'The Arctic Home in the Vedas' అను గ్రంథమున వేదకాలము క్రీస్తుపూర్వము 6000 సం॥ అని నిర్ణయించెను. ఆ విషయమున జూపబడిన కారణము లివి: "వసంతఋతు ప్రారంభముననుూ, శరదృతు ప్రారంభముననుూ సంవత్సరమునకు రెండు మారులు విషువములు (Vernal and Autumnal equinoxes) వచ్చుచుండును. ఆ సమయము లందు రాత్రింబవళ్ళ దైర్ఘ్యము సమముగ నుండుటచే విషువములు అని వానికి సార్థకనామము. కాని ఈ విషువములు సంభవించుటలో క్రాన్తివృత్తము (Ecliptic) నందు విషువస్థానములు కాలక్రమమున కొలదిగ వెనుకకు జరుగుచుండును. సూర్యుడొకపుడు కృత్తికల యందును, మరి యొకపుడు మృగశిరయందును, ఇంకొకపుడు పునర్వసు నక్షత్రమునందును ఉన్నపుడు విషువత్పుణ్యకాలములు (Vernal Ecquinoxes) ప్రాప్తించి నట్లు వేదములందు సూచనలు కలవు. విషువత్పుణ్యకాలము ఒక నక్షత్రము నుండి ఇంకొక నక్షత్రమునకు వెనుకకు జరుగుచు తిరిగి మొదటి నక్షత్రమునకు వచ్చుసరికి 25868 సంవత్సరములు పట్టును అనగా ఒక నక్షత్రము నుండి మరియొక నక్షత్రమునకు జరుగుటకు 958 సం॥ కాలము పట్టును. కావున విషువత్పుణ్యకాలము పునర్వసు నక్షత్రమునందు ప్రాప్తించినట్లుగా సూచించెడి యా వేదములు (6 × 958 = 5748 లేక సుమారు 6000 వత్సరములకు పూర్వము రచింపబడి యుండవలెను.

పై వాదమువలన వేదములు రచింపబడినట్లును, మఱియు నందాకాటి ఖగోళ సంఘటన విషయము వంటిది యొకటి వేద రచయితలు తమ రచనలలో బేర్కొనినట్లును దెలియుచున్నది. ఇది యుక్తము కాదు. కాలము అనంతము. దృశ్యమగు నీ జగత్తు మన శాస్త్రముల ననుసరించి 195,58,85000 వత్సరములకు పూర్వ ముత్పన్న మైనది. అంతటి దీర్ఘ కాలములో పైన పేర్కొన బడినట్టి విషయము లెన్నియో ప్రాప్తించియుండును. అందుచే వేదములందు సూచింపబడినట్లుగా జెప్ప బడుచున్న విషయములను బురస్కరించుకొనుచు వేదకాలనిర్ణయమునకు బూనుకొనుట యుక్తిసహము గాదు.

పాశ్చాత్యచరిత్రకారులు ప్రపంచము పుట్టి 6000 సం॥లు గడచినవని చెప్పుదురు. కాని, భూగర్భశాస్త్రజ్ఞులు, భౌతికశాస్త్రజ్ఞులు, భూగోళము చల్లాఱుట యను నంశముపై నాధారపడి కాలనిర్ణయము గావించిరి. ఈ శాస్త్రజ్ఞుల నిర్ణయము మన శాస్త్రములో జెప్పబడిన కాలమునకు స్థూలముగ సరిపోవుచున్నది. తిలక్ మహాశయుడు వేదములయందలి సూర్యోదయ సూర్యాస్తమయముల వర్ణనము, ఉషస్సు – అరుణోదయముల వర్ణనము. ఉత్తరధ్రువ ప్రాంతమందలి స్థితిగతులను సూచించుచున్నవనియు, ఆ యుత్తరధ్రువప్రాంతము భూగోళశాస్త్రజ్ఞుల అంచనాల ప్రకారము సుమారు 8000 సం॥ ప్రాంతమునుండి మానవనివాసయోగ్యము గాకపోయినదనియు, వేదకర్తలగు ఋషులు నా ప్రాంతములం దిపుడు వసించుచు నా వర్ణనముల జేసియుందు రనియు, అదియే వేదకాల మనియు నిర్ణయించెను.

వంగదేశీయులగు ధీరేంద్రనాథ ఉపాధ్యాయ, అవినాశచంద్రదాసు అను పండితు లిరువురు వేదములందలి హిమవత్పర్వతప్రాంత వర్ణనల నాధారముగ జేసికొని భూగోళశాస్త్ర సిద్ధాంతసాహాయ్యముతో వేదకాలము 25 వేల సం॥లకు బూర్వమని నిర్ణయించిరి. ఏలయన, "పూర్వము


సముద్రములుగ వర్ణింపబడిన ప్రాంతము లిపుడు పర్వతమయములుగను, నాటి యడవు లిపుడు సముద్రములుగను పరిణమించి యున్నవి. కాన, భూగోళశాస్త్ర సిద్ధాంతముల ననుసరించి వేదకాలము 25000 సం॥పూర్వమే యయి యుండవలెను."


పై వాదములు సరి కావు. భూమి సముద్రముగను, సముద్రము భూమిగను పరిణమించుటగాని శీతోష్ణస్థితిలో మార్పులు సంభవించుట గాని ప్రకృతియందలి నైసర్గికస్థితులపై నాధారపడి యుండును గాన, భూగోళ శాస్త్రము నాధారము జేసికొని కల్పితములైన యీ వాదము లందు బలము లేదు.

"వేదములు శబ్దతరంగ రూపములు, పరమేశ్వరుని ఉచ్ఛ్వాస నిశ్శ్వాసరూపములు, ధ్వని యెంత ప్రాచీనమో శబ్దతరంగరూపమగు నీ వేదరాశియు నంత ప్రాచీనము."—అనెడి సంప్రదాయానుగతమైన మన శాస్త్రీయ దృక్పథమే మిక్కిలి యుచితముగ గన్పట్టుచున్నది.

పూర్వసంప్రదాయాభిరతులైన పండితులు వేదములు శబ్దతరంగ రూపములై మనచుట్టు నెల్లపుడు నాకాశములో నుండియే యున్నవని చెప్పుదురు. "శబ్దతరంగము లొకపరి పుట్టుచో నవి యంతటితో నంత మొందక యితర శబ్దతరంగములలో లీనము గాక యట్లులే యుండు నను విషయము నేడు మన కనుభవసిద్ధమే. తీవ్ర తపశ్చర్యాదులచే నింద్రియములు వీర్యవత్తరములై దైవీసంపత్సముల్లసితము లగుచో నాకాశమునందు విలీనములై యుండెడి యా యతిసూక్ష్మములైన శబ్దములను గూడ స్ఫుటముగ వినుట శక్యమగును". (Vide P.E.N. Books, Indian Literature. No. 12. Sanskrit Literature by Sri K. Chandrasekharam, V.H. Subrahmanya Sastry. PP. 19.)

ప్రాచీనులును మంత్రద్రష్టలును నగు మహర్షులు కొందఱు నిరతిశయ తపశ్చర్యాదులచే నట్టి దైవీశక్తిని పెంపొందించుకొనినవారై తమ దివ్యతపస్సమాధిలో నీ వేదమంత్రరాశిని దర్శించిరి. అట్లు దర్శించి శబ్దస్వరూపవిషయకమైన తమ యనుభూతిని (The Theory of the Origin of Sound) లోకానుగ్రహబుద్ధితో తొలుదొలుత శాస్త్రీయముగ లోకమున వెలయింపజేసిరి. కనుక, "వేదములు నిత్యములు; సృష్టి యెంత ప్రాచీనమో వేదము లంత ప్రాచీనములు" అనెడి సంప్రదాయానుగతమైన యీ వాదమును కాదనుట కేమాత్రమును వీలులేదు.





హరిహరాజ క్షేత్రము - ఈపూరు

శ్రీః

భారతీనిరుక్తి

వేదః

నమామి వేదమాతరం మహీం సనాత్మనః కలాం
మహాతపఃసమాధిగోచరాం షడఙ్గభాసురామ్ ।
సఖిత్వ మీయుషే జనాయ చాత్మరూపదర్శికాం
త్రయీమయీం హరిప్రియాం స్వయంప్రభాం గిరం భజే ॥

—వేదమాతృస్తవః

మంత్రబ్రాహ్మణాత్మకమైన శబ్దరాశికి వేద మని పేరు. ఈ శబ్దరాశి యనాదిగ ఋగ్యజుఃసామాథర్వణరూపమున లోకమున బ్రసిద్ధము. ఇట్టి వేద మపౌరుషేయ మని సంప్రదాయము.

కాని, వేద మపౌరుషేయ మనిన నది యెట్లు సంభవ మగును? – అనెడి ప్రశ్న యుదయించుట సహజము. లోకమున నేదేని గ్రంథమును రచించుటకు గర్త యొక డుండవలెను. కర్త్రపేక్ష లేక, గ్రంథరచన సంభవము గాదు. ఇది లోకసహజము. అందుచే గ్రంథము లన్నియు పౌరుషేయములే యగును. భారతరామాయణాదు లట్టివే కదా! అట్టియెడ వాక్యాత్మకమగు నీ వేదమంత్రరాశికి గూడ కర్త, లేక కర్తలుండి యుండవలెను. అందుచే నితరగ్రంథముల వలె వేదములు గూడ పౌరుషేయములే

యగును గాని యపౌరుషేయము లగుట యెట్లు? ఈ విషయము బరిశీలింప వలసి యున్నది.

'భారతరామాయణాదులు వాక్యాత్మకములు; అట్లే వేదములును వాక్యాత్మకములు; కాన, పౌరుషేయములు (వేదః పౌరుషేయః వాక్యత్వాత్; భారతాదివత్) అను నీ దృష్టాంతము సరియైనది కాదు. భారతరామాయణాదులు ఋషికర్తృకము లని ప్రసిద్ధి. ఆ గ్రంథముల రచించినట్లు వ్యాసవాల్మీకాదులు స్వయముగ జెప్పికొనిరి. కాని ప్రాచీనులగు నా ఋషులే వేదము లపౌరుషేయము లనిరి. వారే గాదు. అతిప్రాచీనులగు మన్వాది స్మృతికర్తలును అపౌరుషేయము లనిరి. 'న కశ్చి ద్వేదకర్తా చ' (పరా. స్మృతి) యనుచు వేదమునకు గర్త లేదని యుద్ఘాటించిరి. అట్లుద్ఘాటింప నేల?

కాన, ఋషిసంప్రదాయము ననుసరించి భారతరామాయణాదులకును, స్మృతులకును వలె వేదములకు గర్త యున్నట్లు ప్రసిద్ధి గన్పట్టదు. అందుచే కర్తృప్రసిద్ధివిషయమై భారతాదిగ్రంథదృష్టాంతము పొసగదు.

అట్లగుచో కర్తృప్రసిద్ధి లేని గ్రంథములు లోకమున గొన్ని కలవు. ప్రసిద్ధి లేనంతమాత్రమున నవి యపౌరుషేయము లని చెప్పనగునా? పౌరుషేయము లనియే వానికి బ్రసిద్ధి. వేదముల విషయమున గూడ నట్లే యని యేల చెప్పరాదు? అట్లు చెప్పుట సరి కాదు. కర్తృప్రసిద్ధి లేక పోయినను ఇతరగ్రంథములు పౌరుషేయములే యని ప్రసిద్ధము లైనవి. వేదము లట్లుగాక యపౌరుషేయము లనియే ప్రసిద్ధము లైనవి. ఇందుకు గారణము గ్రంథప్రతిపాద్యాంశ స్వరూపపరిశీలనము వలన స్పష్ట మగును. వేదములు గాక తదితర పురాణేతిహాసములు గాని, కావ్యములు గాని, వేదములను ప్రమాణములుగ గొనియే ప్రవృత్తము లయినవి. కాన

తద్గ్రంథప్రతిపాద్యాంశము వేదమూలము. వేదముల ప్రమాణముగా గొనని దర్శనములు, తదనుసారిగ్రంథములు గూడ నుండవచ్చును. అవి యా యా ప్రవక్తల చేతను, తదనుయాయుల చేతను ప్రవర్తితము లైనట్లు చెప్పబడుచునే యున్నవి. కాన, వేదముల కంటె నితరములగు గ్రంథముల విషయమై కర్తృప్రసిద్ధి యున్నను లేకపోయినను తత్ప్రతిపాద్యాంశము పురుషబుద్ధికల్పిత మగుటజేసి యవి పౌరుషేయములే యగుచున్నవి. వేదముల విషయమున నట్లుగాదు. ఇట కర్తృప్రసిద్ధి లేకపోవుటయే గాదు; ఇందలి ప్రతిపాద్యాంశము ధర్మ-బ్రహ్మస్వరూప నిరూపణము. ఇది యతీంద్రియ మగుటచే పురుషబుద్ధికి గోచరము గాదు. తమకంటె ప్రాచీనములగు గ్రంథము లున్నట్లు గాని, తత్ప్రామాణ్యము ననుసరించి ధర్మబ్రహ్మస్వరూపనిరూపణము జేయబడినట్లుగాని వేదములు చెప్పికొనవు లేదు. ఇట్లు కర్తృప్రసిద్ధి లేనందునను గ్రంథప్రతిపాద్యాంశము పురుషబుద్ధి కతీతమగుట జేసియు వేదములు అపౌరుషేయములే యని చెప్పనగును. గ్రంథప్రతిపాద్యాంశ మిట్టిదని స్ఫురింపజేయుటకే వేదము తనను దాను, వేద మనియే గాక, పెక్కు నామములతో గీర్తించుకొనినది. తన్నామౌచిత్య విచారముచే వేదస్వరూపస్వభావాదులు తేటపడగలవు.

వేదః, విధానమ్, ఋషిః, తపోజాః, ప్రథమజా, ప్రతిష్ఠా, బ్రహ్మ, శ్రుతిః, శ్రుతా, అనుశ్రవః, ఆమ్నాయః, స్వాధ్యాయః, స్వాహా, స్వధా, త్రయీ, కవిః, కావ్యమ్, ఇడా, సరస్వతీ, భారతీ, ఛందః, ప్రవచనమ్, శాస్త్రమ్, పవిత్రమ్, వాక్, శ్రీః- ఇత్యాద్యనేకనామములతో వేదము తనను తాను వ్యవహరించుకొని యున్నది. ఇంతే కాదు. ఈ పదముల యొక్క యర్థముల ననేక విధముల స్వయముగ నిర్వచించి యున్నది. ఆ యర్థములను వేదాంగములు, పురాణేతిహాసాదులును పెక్కురీతుల వివరించినవి. కాన వేదమునకు గల యీ నామములు అర్వాచీన కల్పితము లనిగాని, కేవలసంజ్ఞా

వాచకము లనిగాని చెప్ప వలనుపడదు. అవి సార్థకములు. ఈ పదముల బరిశీలించినచో నొక్కొక్క పద మొక్కొక్క తీరుగ వేదముల యొక్క స్వరూపస్వభావాదుల నిరూపింపగలవు. వేదపురాణాదుల బరిశీలించిన గాని, వీనికి గల సంప్రదాయానుగతమైన యర్థ మవగతము గాదు. ఆ యర్థముల సూక్ష్మముగ బరిశీలించుకొలది – 'వేదము అపౌరుషేయము; సనాతనము; స్వతః ప్రమాణము; క్రాంతదర్శి; తపః సమాధిగోచరము; అనాదినిధనము; స్వయంజాతము; బ్రహ్మతత్త్వావబోధకము; పురుషార్థసాధనము; గురుశిష్యపరంపరాప్రాప్తము; పరమపావనము; శ్రీరూపము' – అనియు, నందుచే చరిత్రకారులు చెప్పునట్లుగా – 'పురుషబుద్ధికల్పితము; ఒకనాటి సాంఘిక రాజకీయాది చరిత్రను బోధించుటకు బ్రవృత్తము' – కాదనియు మున్నగు నంశములు స్పష్టపడగలవు.

శ్రుతికి గల నామములలో 'వేదః' అనునది యత్యంతప్రసిద్ధము. కనుక వేద శబ్దమును మొదట బరిశీలింతము.

వేద శబ్దము – నిర్వచనములు :-

వేదయతీతి వేదః —— తెలియ జేయునది యని వేద పదమున కర్థము. దేనిని దెలియజేయునది వేదము ? ఈ విషయమున సంప్రదాయవిదులిట్లు జెప్పుచున్నారు.

"ప్రత్యక్షే ణానుమిత్యా వా యస్తూపాయో న బుధ్యతే,
ఏతం విదన్తి వేదేన తస్మా ద్వేదస్య వేదతా ॥"

ప్రత్యక్షప్రమాణముచే గాని, యనుమానప్రమాణముచే గాని తెలియజాలని పురుషార్థోపాయములను బోధింపజాలినది యగుటచే దీనికి వేద మని సార్థక

నామము—అని యర్థము. వేద పదమున కింత దూర మర్థము జెప్పికొన వలసిన యావశ్యకత యేమి ? ఈ విషయమును జూతము.

ఆయుర్వేదః, ధనుర్వేదః, గాంధర్వవేదః, నాట్యవేదః—ఇత్యాది గ్రంథములును గలవు. వీనికి ఉపవేదము లని ప్రసిద్ధి. 'వేదయతీతి వేదః' అను పై నిర్వచనము ననుసరించి దేనిని తెలియజేయు ననెడి యాకాంక్షకు సమాధానస్ఫూర్తిని గలిగించెడి ఆయుస్–ధనుస్–గాంధర్వ–నాట్యా ద్యుప పదము లిచట గన్పట్టును; వీనిలో నొక్కొక్కటి ప్రత్యేకముగ నొక్కొక్క విద్యను బోధించుటకై ప్రవృత్త మగుట స్పష్టము జేయును. అందుచే దేనిని దెలియజేయు ననెడి సందియమున కిట తావు లేదు. ప్రకృతమున నట్టి యుపపదములతో గూడియుండని 'వేద' విషయమున దేనిని దెలియ జేయు ననెడి యాకాంక్ష యట్లే నిలిచిపోవుచున్నది. కనుక, దేనిని తెలియ జేయునో తెలియవలసి యున్నది.

లోకవ్యవహారోపయుక్తము లగుచుండు నేవేని వాక్యములుగాని, లేక రచనలు (గ్రంథములు) గాని ఆ యా వక్తలచే నుద్దిష్టములగు నా యా యభిప్రాయముల దెలియజేయుటకే ప్రవృత్తము లగుచుండును. ఏవేని యభిప్రాయముల దెలియజేయుటయే వేదశబ్దార్థమా ? కాదు. కావుననే లోకవ్యవహారోపయుక్త వాక్యసామాన్యమునకుగాని, గ్రంథసామాన్యము నకుగాని వేద మనెడి సంజ్ఞ ప్రసిద్ధము కాలేదు. ఋగాదిశబ్దరాశికి మాత్రమే పరిమితమై 'వేదః' అను నీ సంజ్ఞ అనాదిగ ప్రసిద్ధమై యున్నది. ఇట్టి యీ ప్రసిద్ధికి గారణ మేమి ? ఋగాదిశబ్దరాశి దేనిని దెలియజేయుటకై ప్రవృత్తమైనది ? కాన, ఋగాదిశబ్దరాశికి దేనిని బ్రతిపాదించుట యందు తాత్పర్యమో పరిశీలించి యీ విషయము దెలియవలసి యున్నది.

లోకవ్యవహార మంతయు సామాన్యముగ నర్థకామవిషయము. అర్థ కామముల యందెల్లరకు స్వయముగనే ప్రవృత్తి కలుగుచున్నది. దానిని

'ఇష్టప్రాప్త్యనిష్టపరిహారయో రలౌకిక ముపాయం యో
గ్రంథో వేదయతి స వేదః। అలౌకికపదేన ప్రత్యక్షానుమానే
వ్యావర్త్యేతే।' — సాయణః. తై. సం. భాష్యభూమికా.

స్వర్గమోక్షాదిరూపమగు నిష్టప్రాప్తికి గాని, దుఃఖనరకా ద్యనిష్టపరిహారమునకు గాని వలయు నుపాయములు ప్రత్యక్ష—అనుమానాది లౌకికోపాయములచే దెలియజాలినవి గావు. అందుచే ఇష్టప్రాప్త్యనిష్ట పరిహారములకై వలయు నలౌకికోపాయముల (కర్మ—ఉపాసనా—జ్ఞానయోగముల) బోధించెడి (వేదయతి) గ్రంథము వేదము—అని యర్థము. కనుక, నాట్యవేదాది శబ్దములవలె గాక, నిరుపపదమై యొప్పు 'వేదము'—అను నీ నామము ప్రత్యేకముగ నేదేని యొక విద్యను గాక, అతీంద్రియములగు ధర్మమోక్షస్వరూపములను, తత్ప్రాప్తికై వలయు సర్వవిద్యలను (ఉపాయములను) తెలియజేయునది—యను నర్థము సిద్ధమైనది. మన్వాది సంప్రదాయవిదు లందఱిచే నీ యర్థమే గ్రహింపబడినది. అట్లుపదేశించుట కన్యనిరపేక్షముగ ప్రవర్తించిన దగుటచే వేదము స్వతఃప్రమాణ మనియు గీర్తింపబడినది.

ఉపదేశించుటలో వేదము పెక్కు విధానముల నవలంబించినది. తన లక్ష్యము పరమపురుషార్థ (మోక్ష) ప్రతిపాదనమే యయ్యును, తదనుగుణముగ వేదరాశి కొన్నియెడల పురాణమై సృష్టిక్రమాదికము, ఇతిహాసమై దేవాసురాదుల యుద్ధాదివర్ణనలు, వాకోవాక్యమై బ్రహ్మవాదుల ప్రశ్నప్రతివచనాదులు, అర్థవాదమై తత్తద్దేవతాది ప్రశంసాదులు, శాస్త్రమై విధినిషేధాదులు, నిర్వచనాదులు, స్తోత్రములు, ఉపాసనలు, వర్ణనలు—ఇట్లెన్నో రూపముల దాల్చి పెక్కు విషయముల బ్రతిపాదించుచు, తుదకు ఉపనిషద్రూపమున పరమపురుషార్థమును దర్శింపజేయుచు, తరువాతి స్మృతిపురాణేతిహాసకావ్యనాటకాదులకు మార్గదర్శకమగుచు నాదికావ్యమై వెలసినది. కనుక, వేదమనగా అజ్ఞాతమగు ధర్మబ్రహ్మరూపార్థములను ప్రతిపాదించు

నది; జ్ఞాపకము చేయునది; ఉపదేశించునది; దర్శింపజేయునది యని 'వేదయతీతి వేదః' అను నిర్వచనము వలన గ్రహింప నగును.

ఇంతే కాదు. వేద శబ్దము మిగుల అర్థవంతము. వేదవేద్యుడగు పరమేశ్వరునకు 'వేదః' అనియు నామము గలదు.

"కో ను నామ స యో వేద త్వాం వినా సాంప్రతం వద।
నీతి స్త్వం సర్వకార్యాణా మితి మే నిశ్చితా మతిః॥"

—హరివంశ. 3.75-19

'హేవేద! మంత్రమూర్తే, నీతిః నీతిప్రదర్శకః'_ నీలకంఠః మంత్రమూర్తియగు పరమేశ్వరుడు హేవేద! అని యిటసంబోధింపబడినాడు. విష్ణుసహస్రనామము (మహాభారతము) గూడ పరమేశ్వరునిట్లు కీర్తించినది.

"వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవి త్కవిః।"
'వేదయతీతి వేదః','తేషామేవానుకంపార్థ మహ మజ్ఞానజం
తమః। నాశయా మ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥'
ఇతి భగవద్వచనాత్। యథావత్ వేదం వేదార్థం వేత్తీతి
వేదవిత్. 'వేదాంతకృ ద్వేదవిదేవ చాహం' ఇతి భగవ
ద్వచనాత్॥' — శం. భా.

భక్తులు జిజ్ఞాసువులు నగువారి హృదయమున నిలిచి జ్ఞానదీపముచే నజ్ఞానాంధకారమును తొలగించి సర్వాత్మకబ్రహ్మాత్మభావమును దర్శింప జేయువాడగుటచే (వేదయతి) పరమేశ్వరుడిట 'వేదః' అనియు, యథావ ద్వేదార్థజ్ఞానసంపన్ను డగుటచే 'వేదవిత్' అనియు, వేదమూర్తి యగుటచే 'వేదాంగః' అనియు, క్రాంతదర్శి యగుటచే 'కవిః' అనియు గీర్తింప బడినాడు. కనుక నిపుడు వేద శబ్దము పరమేశ్వరునకును, తత్ప్రతిపాదక

శ్రుతికిని వాచక మగుచున్నది. ఈ విషయమును సనత్సుజాతీయము నిట్లు వివరించుచున్నది.

"ఏకవేదస్య చాజ్ఞానాత్ వేదాస్తే బహవోఽభవన్" – 2.38

బుద్ధికి గోచరముగాని యొక వేదమును (పరమేశ్వరుని) దెలియజేయుటకై పెక్కు వేదములు ప్రవర్తిల్లినవి – అని యర్థము. ఈ వాక్యమును వివరించుచు శ్రీ శంకర భగవత్పాదులు వేదశబ్దము నిట్లు వ్యాఖ్యానించిరి.

'అత్ర ఋగాదయో వేదాః తత్ప్రతిపత్త్యర్థం విచారం కుర్వన్తీతి వేదాఖ్యాన మవాపుః। అథవా సద్భావం సాధయన్తీతి వేదాః। విదన్తి వేదన సాధనభూతా ఇతి వా వేదాః। అథవా బ్రహ్మాధీన మాత్మానం లభన్త ఇతి వా వేదాః। అథవా బ్రహ్మణ ఆత్మతయా లాభహేతవ ఇతి వా వేదాః। విద విచారణే, విద సత్తాయాం, విద జ్ఞానే, విద్ల లాభే, ఏతేషాం ధాతూనాం విషయే వర్తన్తే యస్మాత్ అతో వేదా ఇత్యుక్తాః .... తస్మాత్ సత్యస్య ఏక వేదస్వరూపస్య బ్రహ్మణోఽనవగమా ద్వేదా బహవో వ్యాఖ్యాతాః। సర్వే వేదా స్సద్దర్శనహేతవః॥'

నాల్గు విద్ ధాతువుల నుండి వేద శబ్దము నిష్పన్నమైనది. ఈ ధాతువులకు విచారణము, సత్త, జ్ఞానము, లాభము అని యర్థములు గలవు. వేద మనగా అద్వితీయము 'సత్య–జ్ఞాన–ఆనంద' రూపమగు బ్రహ్మ యని యర్థము. (1) అట్టి బ్రహ్మను గూర్చి తెలిసికొనుటకు విచారము సల్పునవి యగుటచేతను (2) బ్రహ్మ యొక్క సద్భావమును (అస్తిత్వమును) నిరూపించునవి యగుట చేతను (3) బ్రహ్మజ్ఞాన (వేదన) సాధనము లగుటచేతను (4) ఆత్మకు బ్రహ్మాధీనత్వ ప్రాప్తిసాధనములు, లేక బ్రహ్మాత్మత్వ ప్రాప్తి సాధనము లగుట చేతను – ఋగాదిగ్రంథ రాశికి వేదము అను పేరు సార్థకము, కనుక పరమేశ్వరరూప వేదార్థదర్శన

ఋక్-యజుః-సామ-అథర్వణ వేదములు నాల్గును నిత్యము, శుద్ధము నగు బ్రహ్మకు ఉపాధులై యావిర్భవించి తమతమ విశిష్టగుణములచే పురుషుని, క్రమముగ 'విశ్వ-తైజస-ప్రాజ్ఞ-తురీయ' రూపునిగ నొనరించును. ఇట్లు క్రమముగ పురుషుని విశ్వాదిరూపునిగ దర్శింపజేసి తుదకు తురీయాతీత వేద (జ్ఞాన) స్వరూపము ప్రాప్తింప జేయుట వేదము యొక్క వేదత్వము. (తేన విందంతి తత్పదమ్-విద్ల లాభే)-అని యర్థము. ఈ హారివంశవచన తాత్పర్యమే-'అథవా బ్రహ్మధీన మాత్మానం లభన్త ఇతి వా వేదాః, అథవా బ్రహ్మణ ఆత్మతయా లాభహేతవ ఇతి వా వేదాః' అను నిర్వచనముల ద్వారా శ్రీ శంకరభగవత్పాదులచే వివరింపబడుట గమనార్హము.

కాన 'వేదయతి ధర్మాదిం ఇతి వేదః; అథవా వింద్యతే లభ్యతేఽనేన ధర్మాదిః ఇతి వేదః'-అను నిర్వచనములు సర్వసమ్మతములగుచున్నవి. అతీంద్రియ ధర్మస్వరూపమును బ్రహ్మస్వరూపమును, (పరమేశ్వర తత్త్వమును) తెలియజేయుట వేదము యొక్క వేదత్వ మని తెలిసినది.

వేదవిహితమైన ధర్మము (కర్మాచరణము), తదవిరుద్ధము లయిన యర్థకామములు గూడ పురుషార్థములై వేదము (పరమేశ్వరు) నుపలక్షింప జేయునవి యగును. కాన, పై నిర్వచనముల ననుసరించి (వేదం పరమేశ్వరం వేదయన్తీతి) ధర్మార్థకామము లనెడి పురుషార్థములందును వేదత్వము లక్షిత మగుచుండును. వేద శబ్దము వలెనే ధర్మ - అర్థ - కామ శబ్దములు గూడ పరమేశ్వరునకు వాచకములై వరలుటయు, నిందుకు తార్కాణము. ఈ విషయము వేదస్ (అర్థ), కామ, ధర్మ శబ్దపరిశీలనము వలన స్పష్టమగును.

వేదః-(సకారాన్తపదము)-ధనము (శ్రుత్యం ధనమ్)

వేదములందు 'వేదః' అను సకారాన్త పదము గూడ గలదు. జ్ఞానము లేక ధనము (లేక పరమైశ్వర్యము) అని యీ పదమున కర్థములు

ఎట్టి యర్థ మర్థింపబడవలెనో, యెట్లది వేదరూప మగునో, వేద మిట తెలియజేయుచున్నది (వేదం పరమేశ్వరం వేదయతీతి వేదసః వేద స్స్వమ్). సుఖప్రాప్తిసాధనమై యర్థింపబడునది యగుటచేతనే ధనాదికము 'అర్థః' అని చెప్పబడుచున్నది. సుఖ (నిరతిశయానంద) రూపుడై యందఱిచే నర్థింపబడువా డగుటజేసి పరమేశ్వరునకును 'అర్థః (పరమార్థః)' – అని పేరు.

'సుఖరూపత్వాత్ సర్వై రర్థ్యత ఇతి అర్థః'

—శం. భా. విష్ణుసహస్రనామ

అట్టి పరమేశ్వరుని కొఱకు వినియోగింపబడి తత్ప్రాప్తి సాధనమగు ధనము లేక జ్ఞానము వేదము (వేదస్) అగునని పై మంత్రమున దెల్ప బడుచున్నది. అట్టి ధనమే ఆరాధకునకును ఆరాధ్యుడగు దేవునకును తృప్తిని కల్గించునని శ్రుతి తాత్పర్యము. వేదవాక్కుచే – వేదవిహిత ధర్మాద్యాచరణముచే సిద్ధించెడి ధనమే 'వేదః' అగు ననెడి యర్థము పర్యవసిత మగుచున్నది. కావుననే యిట్టి ధనమును 'శ్రుత్యమ్' అని ఋగ్వేదము కీర్తించినది.

"అస్మే రయిం నాసత్యా బృహంత మపత్యసాచం శ్రుత్యం రరాథామ్" ఋ. 1-117-23

'హే నాసత్యౌ! అశ్వినౌ, బృహన్తం మహాన్తం అపత్యసాచం అపత్యైః పుత్రాదిభిః సమవేతం, శ్రుత్యం ప్రశంసనీయం ఉత్కృష్టం రయిం ధనం రరాథామ్ ప్రయచ్ఛతమ్।.... శ్రుత్యం శ్రుతిః స్తుతిః తత్ర భవమ్' — సా. భా.

అశ్వినులారా : శ్రుతి సంస్కారక్రమసంభృతమై (శ్రుత్యం), పుత్ర పౌత్రాది రూపమున నిరతిశయముగ వర్ధిల్లెడి (బృహన్తం) యైశ్వర్యము ననుగ్రహింపుడు – అని యర్థము.

కామము లన్నియు ప్రాప్తము లగునో, యచట నన్ను అమృతస్వరూపునిగ విలసిల్లజేయుము—అని యర్థము (చూ. సా. భా.). పరమేశ్వరుని యొక్క యీ ఆప్తకామత్వమును, కామేశ్వరత్వమును, ఉపనిషత్తులు పెక్కు రీతుల వివరించియున్నవి (చూ-బృ. ఉ. 4-4-6; 3-2-11 ; ప్రశ్న. ఉ. 6-5; ము.ఉ. 3-27 ; తై.ఉ. 2-1 ; 8-5 మొ॥).

ఈ 'కామ' శబ్దము యొక్క నిర్వచనములు 'వేదోఽసి, వేదో మా ఆభర, తృప్తోఽహమ్, తృప్తస్త్వమ్' - అనెడి పై ప్రశస్త్యార్థమును తలపింప జేయుచు నిత్యతృప్తత్వమును లేక అవాప్త సర్వకామత్వమును (అమృతత్వమును) బోధించుచున్నవి. ఇంతే కాదు.

"యో జాగార తమృచః కామయన్తే యో జాగార తము సామాని యన్తి।
యో జాగార తమయం సోమ ఆహ తవాహ మస్మి సఖ్యేన్యోకాః ॥
అగ్ని ర్జాగార తమృచః కామయన్తేఽగ్నిర్జాగార తము సామాని యన్తి
అగ్ని ర్జాగార తమయం సోమ ఆహ తవాహ మస్మి సఖ్యేన్యోకాః ॥"

—ఋ. 5-45-14; 15; సా.సం. 2-1177.

వినిద్రుడై — సర్వదా జాగరూకుడై—ఎవడు వెల్గొందుచుండునో యా యగ్నిని ఋక్కులు కాంక్షించుచున్నవి; సామలును ఆ యగ్నినే బొందుచున్నవి. యజుస్సులచే త్యాగ మొనర్పబడిన సోమము—'నేను నీదానను, స్వీకరింపు' మని ఆ యగ్నితో జెప్పికొనుచున్నది. అట్టి నీ సఖ్యము (హితకరణము) నందే నియతుడనై యున్నాను.' అని మంత్రార్థము.

ఈ మంత్రమునందలి అగ్నిపదము అధియజ్ఞముగ గృహపతి యగు నగ్నిని (గార్హపత్యాగ్నిని), ఆధ్యాత్మికముగ జీవరూపుడగు అగ్నిని (ఆత్మను), అధిదైవికముగ పరంజ్యోతి యగు అగ్నిని ఉపలక్షింప జేయు

చున్నది. ఋగ్యజుఃసామాత్మకములైన మంత్రములచేతను, మంత్రపురః సరముగ త్యాగమొనర్పబడు హవిస్సులచేతను, హవిర్దాతయగు యజమానుని చేతను ఆ యగ్ని కాంక్షింపబడుట యీ మంత్రమున జెప్పబడినది. ఇట్లు కాంక్షింపబడుటజేసి అగ్ని (పరమేశ్వరుడు) 'కామ' పదవాచ్యు డగుట సూచిత మగుచునే యున్నది.

ఇచట ఋగ్యజుఃసామములకు అగ్నితో (పరమేశ్వరునితో) గల నిరంతర సఖ్యము వివరింపబడినది. అట్టి సఖ్యమునే యజమానుడును కాంక్షించుచున్నాడు. అట్టి సఖ్యమే (కామమే) అతడు కాంక్షించు ధనము. అయ్యది పరమేశ్వరు నుపలక్షింపజేయుచు తత్ప్రాప్తిసాధనమగుచు వేదః (వేదయతీతి) అగుచున్నది. కాన "ధర్మావిరుద్ధః కామోఽహమ్" అను పై గీతావాక్యము శ్రుతితాత్పర్యానుగుణ మగుట స్పష్టము.

ధర్మః :-

ఇట్లు ధర్మావిరుద్ధములగు అర్థకామములు వేదరూపము లగుచో ధర్మము వేదరూప మగుట స్పష్టము. ధర్మము వేదస్వరూప మగుట మహాభారత మిట్లు వివరించుచున్నది.

"యశ్చ దండః స దృష్టో నో వ్యవహారః సనాతనః ।
వ్యవహారశ్చ దృష్టో యః స వేద ఇతి నిశ్చితమ్ ॥
యశ్చ వేదః స వై ధర్మో యశ్చ ధర్మః స సత్పథః ।"

—భార. శాన్తి. 56-57.

కాన, ధర్మమునకు వేద మనియు ప్రసిద్ధి; పరమేశ్వరునకును ధర్మః అని ప్రసిద్ధి గలదు.

"రామో విగ్రహవాన్ ధర్మః" – రామాయణమ్.

"వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మవి దుత్తమః"
—భార. విష్ణు సహస్రనామ.

'సర్వభూతానాం ధారణాత్ ధర్మః, అణు రేష ధర్మ ఇతి శ్రుతేః । ధర్మై రారాధ్యత ఇతి వా ధర్మః' – శం.భా.

సర్వభూతములను ధరించుటచేతను, ధర్మములచే నారాధింపబడుటచేతను పరమేశ్వరునకు 'ధర్మః' అని సార్థకనామము. 'బిభర్తి సర్వభూతాని వేదశాస్త్రం సనాతనమ్' – అను మనుస్మృతి వాక్యమును ఈ యర్థమునే తలపింపజేయుచు వేదమునకు గల ధర్మత్వమును స్ఫురింపజేయుచున్నది. పురాణేతిహాసాదులందే గాక వేదమున గూడ పెక్కుచోట్ల (ఋ. 3-17-1; 10-92-2 ఇత్యాది) పరమేశ్వరుడు ధర్మః అని కీర్తింపబడినాడు. వేద–దేవ స్వరూప మగు ఈ ధర్మమే సర్వ జగత్తుకు (సర్వభూతములకు) ఆధార మని శ్రుతి చెప్పుచున్నది.

"ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా । లోకే ధర్మిష్ఠం ప్రజా ఉపసర్పన్తి । ధర్మేణ పాప మపనుదతి । ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్ । తస్మా ద్ధర్మం పరమం వదన్తి" —తై.ఆ. 10-63-7.

ఇట్లు ధర్మ–అర్థ–కామ శబ్దములు సంప్రదాయసిద్ధమైన అర్థగాంభీర్యముతో నొప్పుచు వేదత్వ (పరమేశ్వరతత్త్వ) – ఉపలక్షకము లగుచున్నవి. కాని, 'ధర్మ'అను పదము Duty, Conduct, Moral ఇత్యాది పదములచేతను, 'అర్థ'అను పదము Money, wealth, matter ఇత్యాది పదముల చేతను, 'కామ'అను పదము Desire, Will, Love ఇత్యాది పదముల చేతను ననువదింపబడుచున్నవి. ఈ భాషాంతరీకరణములు ఆ పదముల యర్థ

గాంభీర్యమును, వానిచే నుపలక్షిత మయ్యెడి వేదత్వమును నే మాత్రము దర్శింపజేయజాలి యుండలేదు.

శ్రుతులు : వేద-దేవశబ్దములు :-

'వేదః' అను నామముచే పరమేశ్వరుడు కీర్తింపబడుటయు, వేద-దేవ శబ్దములు రెండును పర్యాయపదములై వర్తిల్లుటయు శ్రుతులయందు స్పష్టముగ గాంచనగును.

"జాతవేదసే సునవామ సోమ మరాతీయతో ని దహాతి వేదః"

—ఋ. 1-99-1 : ఐ.బ్రా. 4-30-12; తై.ఆ 10-2-1 నిరు. 14-33.

'స్వయం సర్వం వేత్తీతి వేదః సర్వజ్ఞః అగ్నిః; వేదాంసి వేదనాని జ్ఞానాని. తాని జాతా న్యుత్పన్నాని యస్మా దగ్నేః సోఽయం జాతవేదాః' — సా.భా.తై.ఆ.

ఇట 'స్వయం సర్వం వేత్తీతి వేదః'—అని వేద శబ్దము నిర్వచింపబడినది. సర్వజ్ఞుడు—అని యర్థము. పూర్వము 'వేదయతీతి వేదః' అను నిర్వచనము జూపబడినది, దాని ననుసరించి 'జ్ఞానముచే నజ్ఞానాంధకారమును దొలగించి ఆత్మస్వరూపమును దర్శింపజేయువాడు'—అని యర్థము. ఈ యర్థమే, 'వేదాంసి జ్ఞానాని జాతాని యస్మాదగ్నేః స జాతవేదాః'—అను జాతవేద శ్శబ్ద నిర్వచనముచే దెలియజేయబడుచున్నది. జ్ఞానప్రదాత యని భావము. జాతవేదశ్శబ్దమును మహాభారత మిట్లు నిర్వచించుచున్నది.

"పావనా త్పావకశ్చాసి వహనా ద్ధవ్యవాహనః
వేదా స్త్వదర్థం జాతాపై జాతవేద స్తతో హ్యసి"

—భార. 231-42.

ఓ యగ్నీ! సర్వము పావనము చేయువాడ వగుటచే పావకుడవు; హవ్యముల వహించుటచే హవ్యవాహనుడవు; వేదములు నీ కొఱకయియే జాతములు- ఆవిర్భూతములు; కాన జాతవేదుడవు-అని యర్థము. ఇట వేదములు అగ్నికొఱకై – పరమేశ్వరునికొఱకై – అనగా పరమేశ్వరతత్త్వ ప్రతి పాదనమున కయియే యావిర్భవించినట్లు వేదముల పరమ తాత్పర్యము చెప్పబడినది.

కాగా, పై నిర్వచనముల ననుసరించి వేదము లెవనినుండి యావిర్భవించినవో, యెవనిని ప్రతిపాదించుట కావిర్భవించినవో యట్టి యగ్నికి (పరమేశ్వరునకు) 'జాతవేదాః' – అని యన్వర్థనామ మగుట దెలియును. ఇక వేద – దేవ శబ్దములు పర్యాయపదము లగుట జాతము.

"వేదోఽసి యేన త్వం దేవ వేద దేవేభ్యో వేదోఽభవః
తేన మహ్యం వేదో భూయాః॥"

—వా.సం. 2-21; కాణ్వ. సం. 1-35.

యజ్ఞమున కుశముష్టినిర్మిత పదార్థమునకు 'వేదః' అని పేరు. యజమాన పత్ని ఆ వేదమును సంబోధించుచు జెప్పెడి మంత్ర మిది. హే వేద ! నీవు ఋగ్యజుః సామాత్మక వేదస్వరూపుడవు: జ్ఞాతవు – సర్వజ్ఞుడవగు దేవుడవు: వేదరూపుడవగు నో దేవా ! నీవు దేవులకు (దైవీశక్తి సంపన్నులకు) వేదరూపుడ వయి పొడగట్టుదువు. అట్లే నాకును (దైవీ సంపద నొసగి) వేదరూపుడవుగా సాక్షాత్కరింపుము – అని యర్థము. ('త్వం వేదోఽసి ఋగాద్యాత్మకోఽసి యద్వా వేత్తీతి వేదః జ్ఞాఽతాసి'

—మహీధరః చూ; ఉవట భాష్య

ఇట హే వేద ! హేదేవ! యని వేదము (దర్భముష్టి) సంబోధింప బడుటచే వేద–దేవ శబ్దములు పర్యాయపదములుగ వర్తిల్లుటయు, దేవుడు వేదస్వరూపు డగుటయు గాంచనగును.

పూర్వ ముదహరింపబడిన 'అగ్నిర్జాగార' యను మంత్రమున ఋగ్యజుఃసామాత్మక వేదరాశికి లక్ష్యము నిరంతర జాగరణశీలుడగు దేవుడే యని జెప్పబడినది. ఇట 'వేదోఽసి' యను నీ మంత్రము దేవులకు (దైవీశక్తి సంపన్నులకు) నా దేవుడు వేదముగా గోచరించు నని చెప్పబడినది. అందుచే దివ్యశక్తి పెంపొందించుకొనినకొలది వేదమునందలి వేదత్వము లేక సర్వజ్ఞత్వము గాంచ శక్య మగునని తెలియుచున్నది. కావున, దైవీశక్తి పెంపొందించుకొని మంత్రములకు దేవునితో గల నిరంతర సఖ్యము దర్శింపనిచో—'నా వేదములు కేవల మొక శబ్దరాశిగనో లేక యాదిమ నివాసుల ఆర్థిక సాంఘిక రాజకీయాది సంఘటనలుగనో లేక కేవలము ప్రార్థనాదికమును సూచించెడి ప్రాచీనుల రచనలుగనో'—గోచరించుటయు సూచిత మగుచున్నది.

అగ్నిః, వేదః —— జీవునకు జన్మసిద్ధనామములు:-

"అగ్నిరస్మి జన్మనా జాతవేదా ఘృతం మే చక్షు
రమృతంమ ఆసన్। అర్కః త్రిధాతూ రజసో
విమానోఽజస్రో ఘర్మో హవి రస్మి నామ॥"

—ఋ. 3-26-7; వా.సం. 18-66; మై.సం. 4-12-132; నిరు. 14-2.

ఈ మంత్రము "అగ్నియే సర్వము'—అని అగ్న్యద్వైతమును బోధించునది. దీనికి యజ్ఞమున వినియోగము లేదు (అగ్న్యద్వైతవాదినీ త్రిష్టుప్ యజ్ఞేఽవినియుక్తా—మహీధరః). కాని యజమాను డీ మంత్రమును జెప్పుచు 'నేను జన్మతః జాతవేదునగు నగ్నిని'— అని యీ రీతిగ తనను సర్వాత్మకుడగు పరమేశ్వరునిగ భావన జేయవలెను.

శాస్త్రము (వేదము) అజ్ఞాతజ్ఞాపకము. అనగా మానవులు లౌకిక వ్యవహారనిమగ్నులై తెలియజాలని అతీంద్రియ విషయముల నుపదేశించు

నది (వేదయతి). 'నేను దేవదత్తుడను లేక యజ్ఞదత్తుడను'— అని లౌకిక వ్యవహారమున బరగుచు పరిచ్ఛిన్నుని వోలె భ్రమించు యజమానునకు నాతని ఆత్మస్వరూపము అపరిచ్ఛిన్నుడగు (unconditioned)అగ్నియే (పరమేశ్వరుడే), లేక వేదమే యని పై మంత్రము జ్ఞాపకము చేయుచున్నది.

బృహదారణ్యకాదిశ్రుతులు నీ విషయము నిట్లు వివరించినవి.

"అథాఽస్య నామ కరోతి వేదోఽసీతి ।
తదస్య గుహ్యమేవ నామ భవతి"

—బృ. ఉ. 8-26.

'లోకే వ్యవహారో నాస్తీత్యాశంక్యాహ - తదస్యేతి ।
య త్తద్వేద ఇతి నామ తదస్య గుహ్యం భవతి ।
వేదనం వేదః సర్వస్య నిజస్వరూప మిత్యర్థ ఇతి ।'

—ఆనందగిరి

"అంగాదంగాత్సంభవసి హృదయా దధిజాయసే ।
వేదో వై పుత్రనామాసి ఇతి"

—ఆప. గృ.సూ. 1-15-3.

ఇవి నామకరణసమయమున జెప్పెడి మన్త్రములు. తండ్రి, పుట్టిన శిశువునకు వ్యవహారయోగ్యములైన దేవదత్తాది నామముల బెట్టును. కాని శ్రుతి, పుట్టిన ప్రతివానికిని గల 'వేదః' అను గుహ్యనామమును జ్ఞాపకము చేయుచున్నది. అందుచేతనే నామకరణసమయమున తండ్రి శిశువును 'వేదోఽసి - నీవు వేదస్వరూపుడవు' - అని యథార్థము, గుహ్యము నగు వేదనామముతో బిలుచును. కాన 'అగ్నిరస్మి జన్మనా జాతవేదాః' ఇత్యాది ఋక్కుల యొక్క అర్థమునే బృహదారణ్యకాది శ్రుతులు వివరించుచున్న వనుట స్పష్టము.

'అగ్నిరస్మి జన్మనా' - అను మంత్రమున గల 'త్రిధాతుః' అను పదము 'పరమేశ్వరుడు ఋగ్యజుఃసామాత్మకుడ'ని బోధించుచున్నది. ఉవట, మహీధరు లిర్వురు నిట్లే వ్యాఖ్యానించిరి. సాయణుడును పరతత్త్వరూపమును సాక్షాత్కరించుకొనిన యగ్ని (ముక్తపురుషుడు) తన సర్వాత్మకత్వానుభవము నావిష్కరించుచున్నట్లు ఈ మంత్రమును వివరించినాడు. కనుక నీ మంత్రమున అగ్ని యన సర్వాత్మకుడగు పరమేశ్వరుడనుట నిర్వివాదము. కాని, 'త్రిధాతుః' అనగా అగ్నివాయ్వాదిత్యాత్మకుడు అని శ్రీ సాయణుడు వ్యాఖ్యానించెను. అగ్ని-వాయు-ఆదిత్యులు, ఋక్-యజుః-సామాత్మకు లగుట శ్రుతిప్రసిద్ధమే.

"స ఇమాని త్రీణి జ్యోతీంష్యభితతాప। తేభ్య స్తప్తేభ్య
త్రయో వేదా అజాయన్త। అగ్నేర్ ఋగ్వేదః
వాయో ర్యజుర్వేదః సూర్యా త్సామవేదః।"

—శ. బ్రా. 11-5-8-3.

"ఋగ్వేద ఏవాగ్నే రజాయత। యజుర్వేదో వాయోః।
సామవేద ఆదిత్యాత్।" — ఐ. బ్రా. 5-5-7.

అగ్ని-వాయు-ఆదిత్యులనెడి జ్యోతిత్రయము నుండి ఋగ్యజుఃసామవేదము లావిర్భవించినవని యర్థము. కనుక, త్రిధాతు పదము చే యజమానుడు తనను అగ్ని-వాయు-ఆదిత్యాత్మకునిగను, ఋగ్యజుః సామాత్మక వేదస్వరూపునిగను భావన జేయవలె నని శ్రుతి బోధించుచున్నది. ఈ మంత్రము తరువాతి మంత్రములో వాజసనేయసంహిత పరమేశ్వరాభిన్నుడ నని భావనజేయు యజమానుని యొక్క యీ త్రిధాతుత్వము నిట్లు స్పష్టము జేయుచున్నది.

"ఋచో నామాస్మి యజూగ్ంషి నామాస్మి సామాని నామాస్మి"

—వా. సం. 18-67.

నేను ఋగ్రూపుడను; యజూరూపుడను; సామరూపుడను—అని యర్థము. కాన, యజమానుడు తనను ఋగ్యజుఃసామాత్మక వేదరూపునిగను, లేక అగ్నివాయ్వాదిత్యాత్మక జాతవేదరూపునిగను నిరంతరము భావన జేయు చుండవలె నని శ్రుతి యుపదేశము.

బృహదారణ్యక శ్రుతియు పుట్టిన శిశువు విషయమై యిట్లు జెప్పుచున్నది.

"అథ జాతకర్మ..........
అథాఽస్య దక్షిణం కర్ణ మభినిధాయ వాగ్వాగితి త్రిః"

—బృ. ఉ. 6-4-25.

'అథాస్య దక్షిణం కర్ణ మభినిధాయ స్వం ముఖం
వాగ్వాగితి త్రిర్జపేత్'

—శం. భా.

'అస్య జాతస్య శిశో రిత్యర్థః । త్రయీలక్షణా వాక్ త్వయి
ప్రవిశత్వితి జపతోఽభిప్రాయః'

—ఆనందగిరి

జాతకర్మసమయమున తండ్రి తన ముఖమును పుట్టిన శిశువు యొక్క కుడిచెవి కభిముఖముగ నుంచి వాక్-వాక్-వాక్ అని ముమ్మారు జపింప వలెను. త్రయీలక్షణ మగు వేదవాక్కు శిశువు నావేశించుగాక—యని యర్థము.

పుట్టినతోడనే ఋగ్యజుఃసామాత్మకమగు వేదవాక్కు శిశువు నిట్లావేశించును—అతడు ఋగ్రూపుడు, యజూరూపుడు, సామరూపుడు నగునని దర్శింపజేయును, పిదప 'వేదోఽసి; వేదో వై పుత్రనామాసి'—యనుచు నామకరణసమయమున యథార్థము, గుహ్యము నగు జీవునియొక్క 'వేద' స్వరూపమును జ్ఞాపకము చేయ మొదలిడును. క్రమముగ వేదాధ్యయన సమయమునను, కర్మానుష్ఠానోపాసనాది సమయములందును పెక్కురీతుల యజమానునకు లేక ఉపాసకునకు గల యథార్థ 'వేద' స్వరూపమును 'అగ్నిరస్మి జన్మనా జాతవేదాః; ఋచో నామాస్మి ....' ఇత్యాద్యనేక మంత్రముల ద్వారా జ్ఞప్తికి దెచ్చుచుండును. సర్వకర్మసన్యాస మొనర్చిన యతిని వ్యావహారిక (దేవదత్త యజ్ఞదత్తాది) నామములతో గాక, భారతీ – సరస్వతీత్యాది వేదనామములతో వేదస్వరూపులుగ దర్శింపజేయును. తుదకు బ్రహ్మవిదులై బ్రహ్మ (వేద) స్వరూపులై జన్మరాహిత్యము నొందువఱకును అజ్ఞాతార్థజ్ఞాపక మగుచు, తోడ నుండి, యంతట నుపరతవ్యాపార మగును. ఇట్లు జన్మించినదాది జన్మరాహిత్యము నొందువఱకు తోడ నుండి యడుగడుగున నజ్ఞాతార్థజ్ఞాపనశీలమై వెలయుటయే (వేదయతి) వేదము యొక్క వేదత్వము.

కాన, పరమేశ్వరుడు వేదస్వరూపుడు, వేదగర్భుడు లేక వేదాత్మకుడనియు, వేదము అతీంద్రియ ధర్మబ్రహ్మస్వరూపబోధక మగుచు తన నారాధించువారి తోడ నుండి వారిని వేదాత్మకులను (త్రియీస్వరూపులను) వేద (బ్రహ్మ) స్వరూపుల నొనర్చు ననియు తెలిసినది.

ఇట్లు వేదములే గాదు. పురాణేతిహాసాదులు గూడ దేవుడు వేదస్వరూపుడు, వేదాత్మకుడు నని పెక్కు రీతుల గీర్తించి యున్నవి.

"సంస్కారా స్తేఽభవన్ వేదాః" — రామాయణమ్, 6-120-20

"ఋగ్వేద స్త్వం యజుర్వేదః సామవేద స్త్వథర్వణః"

—విష్ణు. పు. 5-1-36

"యం బృహ న్తం బృహత్యుక్థే యమగ్నౌ యం మహాధ్వరే।
యం విప్రసంఘా గాయ న్తి తస్మై వేదాత్మనే నమః॥
ఋగ్యజుః సామధామానం దశార్ధహవిరాత్మకం।
యం స ప్తతంతుం తన్వ న్తి తస్మై వేదాత్మనే నమః॥

—భార. 12-47-43,44

"వేదప్రణిహితో ధర్మో హ్యధర్మ స్తద్విపర్యయః।
వేదో నారాయణః సాక్షా త్స్వయంభూ రితి చ శ్రుతిః॥"

—భాగ. 61-40

పృశ్నిః- పృశ్నిగర్భః - వేదగర్భః - వేదగర్భాః:-

పై స్మృతి వచనములు దేవుడు వేదస్వరూపు డగుటయు, వేదము స్వయంజాత మగుటయు శ్రుతియభిప్రాయ మని తెల్పుచున్నవి. 'ఋగ్యజుః సామధామానం - వేదాత్మనే' అను పదములచే పరమేశ్వరుడు వేదమయుడు, వేదగర్భుడు నగుట దెలియును. అందుచేతనే దేవునకు 'పృశ్ని గర్భః' అనియు ప్రసిద్ధి.

"పృశ్ని రిత్యుచ్యతే చాన్నం వేద ఆపోఽమృతం తథా।
మమైతాని సదా గర్భః పృశ్నిగర్భ స్తతో హ్యహమ్॥"

—భార. శా న్తి. 341-45

'పృచ్ఛన్త్యేనం జిజ్ఞాసవో ధర్మజాత మితి, పృచ్ఛన్త్యేనం
క్షుధితాదయ ఇతి వా పృశ్ని ర్వేదోఽన్నాది వా గర్భో గర్భస్థాని:
అతఃపృశ్నిగర్భోఽహ మిత్యర్థః।' — నీలకంఠవ్యాఖ్య.

అన్నము, జలము, అమృతము, వేదము - ఇవి 'పృశ్ని' యని చెప్పబడు చున్నవి. ఇవి యెల్లపుడును నా గర్భమున నుండునవి. కాన, నేను పృశ్ని గర్భుడను - అని యర్థము.

పరాదేవతయు నిట్లే పురాణములయందు 'వేదమాతా, వేదగర్భా' యని కీర్తింపబడినది.

"వేదాధిష్ఠాతృదేవీం చ వేదశాస్త్రస్వరూపిణీమ్।
వేదబీజస్వరూపాం చ భజే తాం వేదమాతరమ్॥"_దేవీ. భా. 9-26-52

"వేదమాతర మేకాం చ విద్యాం భవతరోః స్థిరామ్।"
_దేవీ. భా. 3-1-34

"వేదగర్భా విశాలాక్షీ సర్వేషా మాది రీశ్వరీ।"_దేవీ. భా. 3-3-53

"ప్రకృతి స్త్వం పరా సూక్ష్మా బ్రహ్మగర్భాఽభవః పురా।
తతో వాణీ జగద్ధాతు ర్వేదగర్భాఽసి శోభనే॥"
సృజ్యస్వరూపగర్భాఽసి సృష్టిభూతా సనాతనే।
బీజభూతా తు సర్వస్య యజ్ఞభూతాఽభవ స్త్రయీ॥"_విష్ణు. 5-2-78.

"యే త్వా మార్యేతి దుర్గేతి వేదగర్భాంబికేతి చ।
భద్రేతి భద్రకాలీతి క్షేమదా భాగ్యదేతి చ॥
ప్రాతశ్చై వాపరాహ్ణే చ స్తోష్య న్త్యానమ్రమూర్తయః।
తేషాం హి ప్రార్థితం సర్వం మత్ప్రసాదా ద్భవిష్యతి॥
-విష్ణు. 5-1-83,84

ఇచట పరాదేవి వేదగర్భ, బ్రహ్మగర్భ, వేదమాత - ఇత్యాది పదములచే వేదస్వరూపిణిగ ప్రతిదినము ధ్యానింపబడవలె నని విధింప బడుచున్నది.

"ఛందసాం మాతా; వరదా వేదమాతా"
అని త్రిసంధ్యలయందు పరాదేవత ధ్యానింపబడుట ప్రసిద్ధమే.

వేదపదములు దేవపదములు-దైవీవాక్ :

"అప్యేకం దేవపద మధీయాత్యైవ"
అను శతపథబ్రాహ్మణవచనము (11_5_6_9) వేదమునందలి పదము లన్నియు దేవపదములు; అనగా దేవతత్త్వ బోధకములు; శక్తి లేని యపుడు అందు ఏ యొక పదమునైన నధ్యయనము చేయవలయును గాని యూరకుండరాదని విధించుచున్నది. అట్లధ్యయనము జేయుచో ప్రచ్యుతుడు కాడనియు దెలుపుచున్నది.

పై ప్రమాణములచే పరమేశ్వరుడు వేదస్వరూపు డయినందున వేద_దేవ శబ్దములు పర్యాయపదము లగుట యుక్తమే. అంతేగాక వేదములందలి పదము లన్నియు దేవపదము లని శ్రుతి స్పష్టముగ బేర్కొనినది. ఇందలి ప్రతి పదము దేవ_తత్త్వబోధనమే పరమలక్ష్యముగా గలవి యగుటచేతనే శ్రుతికి దైవీ వాక్, అమరభారతి, గైర్వాణీ ఇత్యాది నామములు ప్రసిద్ధము లయినవి. తచ్ఛాయారూప మగుటజేసి లౌకిక సంస్కృతమునకును నిట్టి ప్రసిద్ధి కలిగినది. కాన, శ్రుతిగతపదములు లోకసిద్ధములైన యర్థకామములను ప్రబోధించుటకు గాని, లౌకికార్థములనే వివరించుటకు గాని ప్రవర్తించినవని చెప్పుట శ్రుతిసమ్మతము కాదు. మనుస్మృతియు వేదస్వరూపము నిట్లు వివరించినది.

విధానమ్ - వేదః (శాశ్వతమగు చట్టము) :-

"త్వమేకో హ్యస్య సర్వస్య విధానస్య స్వయంభువః ।
అచింత్య స్యాప్రమేయస్య కార్యతత్త్వార్థవి త్ప్రభో"॥—మను. 1-3.

'యస్మాత్త్వమేకోఽద్వితీయః, అస్య సర్వస్య ప్రత్యక్షశ్రుతస్య స్మృత్యాద్యనుమేయస్య చ, విధానస్య విధీయంతేఽనేన కర్మాణ్యగ్నిహోత్రాదీనీతి విధానం వేదః, తస్య స్వయంభువః అపౌరుషేయస్య, అచింత్యస్య బహుశాఖావిభిన్నత్వా దియత్తయా పరిచ్ఛేత్తు మయోగ్యస్య, అప్రమేయస్య మీమాంసాది న్యాయనిరపేక్షతయాఽనవగమ్యమాన ప్రమేయస్య, కార్య మనుష్ఠేయ మగ్నిష్టోమాది, తత్త్వం బ్రహ్మ- 'సత్యంజ్ఞానమనంతంబ్రహ్మే' త్యాది వేదాంతవేద్యం, తదేవార్థః ప్రతిపాద్యభాగః, తం వేత్తీతి కార్యవిత్త్వార్థవిత్'

—కుల్లూకభట్టవ్యాఖ్య.

విధాన మనగా వేదము, అగ్నిహోత్రాది కర్మోపాసనాదికమును విధించునది యగుటచే వేదమునకు 'విధాన' మని పేరు.[1] అది స్వయంజాతము (స్వయంభూః) కాన, నపౌరుషేయము; అచింత్యము—అనంతశాఖావిలసిత మగుటచే నింత యని చెప్ప నలవిగానిది; మీమాంసాది న్యాయసాహాయ్యము లేక తెలియ శక్యము గానిది గాన అప్రమేయము; 'అనుష్ఠేయ మగు జ్యోతిష్టోమాదిరూపధర్మము (కార్యం), వేదాంతవేద్యమగు బ్రహ్మ (తత్త్వం)'—ఇవియే, అనగా నీ ధర్మ-బ్రహ్మరూపార్థములే, వేద ప్రతిపాద్యార్థములు; అద్వితీయుడగు పరమేశ్వరు డొకడే అచింత్య-అనంత-వేదరహస్యాభిజ్ఞుడు (కార్యవిత్త్వార్థవిత్)—అని యర్థము.

---

1. "అంతరాత్మక మాకాశం తన్మయం శ్రోత్ర మింద్రియమ్ ।
తస్య శబ్దం గుణం విద్యా న్మూర్తి శాస్త్రవిధానవిత్ ॥"-భార. 12-252-3

"విధానం వేదవాక్యమ్"—నీలకంఠవ్యాఖ్య.

"అపి వా సర్వధర్మః స్యాత్ తన్న్యాయత్వా ద్విధానస్య"-జై.సూ. 1-3-16
"విధీయతేఽనేనేతి విధానం శబ్దః। సోఽనుమీయతే స్మృత్యా" -శాబర.భా.

సామాన్యముగ 'స్వయంభూః, అచింత్యః, అప్రమేయః'—అను పదములచే పరమేశ్వరుడు కీర్తింపబడుచుండును. అతడు వేదస్వరూపుడు వని పూర్వము చెప్పబడినది. తత్ప్రతిపాదక వేదరాశియు నిట నా పదముల చేతనే కీర్తింపబడుట గమనార్హము. ఇవి దేవునకు వేదమునకు గల సాధర్మ్యమును దెలియజేయునవి. మఱియు నిట (1) వేదము అపౌరుషేయము, (2) తత్ప్రతిపాద్యార్థము అతీంద్రియ ధర్మ—బ్రహ్మస్వరూపము. (3) అచింత్య—అప్రమేయ వేదరహస్యాభిజ్ఞుడు వేదరూపుడగు పరమేశ్వరు డొకడే—అను విషయములు స్పష్టము చేయబడినవి.

ఇట్లు సంప్రదాయవిదులు వేద మపౌరుషేయ మని ముక్తకంఠముగ కీర్తించిరి. ఈ విషయము వేదమంత్రార్థపరిశీలనము వలనను స్పష్టము కాగలదు.

వేదము పౌరుషేయ మగునా ?

పై నుదహరించిన మంత్రములు సూక్ష్మముగ బరిశీలించినచో వేదములు పురుషబుద్ధికల్పితములు కావనుటయు స్పష్టమగును.

"వేదోఽసి యేన త్వం దేవ వేద దేవేభ్యో
వేదోఽభవః । తేన మహ్యం వేదో భూయాః ।"

ఈ మంత్రమును జూతము.

ఈ వేదశబ్దరాశి పౌరుషేయమే యగుచో 'వేదమా ! నీవు దేవతలకు వేదము అయితివి; నాకును వేదము కమ్ము' అని ప్రార్థించుటేమి ? మొదట మంత్రములు, తర్వాత బ్రాహ్మణములు, తదుపరి అరణ్యకములు రచింపబడి యుండునని గదా; పాశ్చాత్యకుల యూహ ! అగుచో వారి ననుసరించి, తరువాత రచింపబడిన బ్రాహ్మణములు సంహితాగతమంత్ర

మునకు యజ్ఞమున వినియోగము చెప్పి యుండవలెను. అట్టియెడ మంత్ర రచనాసమయమున నీ మంత్రమునకు యజ్ఞమునందు (దర్భముష్టి నుద్దేశించి చెప్పెడి) వినియోగము లేదుగదా! అగుచో "మహ్యాం వేదో భూయాః" అనునెడ 'మహ్యాం' అను పదమునకు 'నాకు' – అనగా 'వేదరచయిత యగు నాకు' – అనియే యర్థమును జెప్పవలసి యుండును. తనచే రచియింపబడెడి మంత్రభాగము నుద్దేశించి 'వేదోఽసి' (నీవు వేదము అయి యున్నావు) అని చెప్పుచు – నీవు దేవతలకు వేదమైతివి; అట్లే నాకును వేదము కమ్ము – అని కోరుచు రచయిత వేదమంత్రమును రచించుటలోని సామంజస్యమును గూర్చి గాని, సరస సమన్వయమును గూర్చి గాని విచారింపవలసి యుండును.

మఱియు వేదములు మానవరచనలే యగుచో ఈ ఋక్కులు యజుస్సులు, సామలు అన్నియు నేకకాలమునం దొకని చేతనే రచింపబడినవని చెప్ప వలనుపడదు. వేవ్వేఱు కాలములయందు వేవ్వేఱు రచయితలు వేవ్వేఱు ఋక్కులు, యజుస్సులు, సామలు రచించి యుండవలెగదా! అట్టిచో "ఋచో నామాస్మి, యజూగ్ంషి నామాస్మి, సామాని నామాస్మి" – అని వేదరచయిత తనను ఋగ్యజుఃసామస్వరూపునిగ భావించుటలోని యౌచిత్యమును గూడ పరిశీలింపవలసి యున్నది. తనచే రచింపబడక వేవ్వేఱు కాలములందు వేవ్వేఱు రచయితలచే రచింపబడిన, రచింపబడుచున్న, రచింపబడనున్న ఋగాది మంత్రము లన్నియు నేనే యని చెప్పికొనుట యెట్లు పొసగును? ఇతరులచే రచింపబడెడి కృతు లన్నియు నేనే యని చెప్పికొనుట లోకన్యాయవిరుద్ధము గదా!

ఇదియుగాక ఈ వేదములు మానవరచితములే యగుచో నగ్న్యాది దేవతలు గాని, పరమేశ్వరుడు గాని వేదాత్మకు లగుట యెట్లు పొసగును? ఆనాటి రచయితలు ప్రకాశవంతములై గన్పట్టు భౌతికములగు అగ్ని,

సూర్య, చంద్రాదుల జూచి దేవతలని భ్రమించినారనిగదా చారిత్రికుల కల్పన? భౌతికములగు నీ అగ్న్యాదులు వేదాత్మకము లగుట యెట్లు? 'అగ్నేర్ ఋగ్వేదః వాయో ర్యజుర్వేదః సూర్యా త్సామవేదః' – అని శ్రుతులు జెప్పుచున్నవి. భౌతికములగు నీ యగ్నివాయ్వాదిత్యుల నుండి వేదము లావిర్భవించుట యెట్లు? ఒకవేళ నెట్లో వీనినుండి యావిర్భవించిన వని యనినను నవి మానవరచనలని యెట్లు చెప్పనగును?

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై
వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" —శ్వేతా ఉ. 6-18; గో;పూ. 4-5

పరమేశ్వరుడు మొదట బ్రహ్మను సృజించి యా బ్రహ్మకు వేదముల ననుగ్రహించినట్లు పై శ్రుతివాక్యము చెప్పుచున్నది. అట్టియెడ మానవ రచితములని చెప్పబడెడి వేదములను పరమేశ్వరుడు బ్రహ్మ కిచ్చు టెట్లు పొసగును? ఇంతే కాదు.

"అహే బుధ్నియ మంత్రం మే గోపాయ।
య మృషయ స్త్రైవిదా విదుః।
ఋచః సామాని యజూగ్ంషి।
సా హి శ్రీ రమృతా సతామ్।"

—తై.బ్రా. 1-1-10-3; 5; 2-1-26

'అహే అహింసితవ్య! బుధ్నియ బుధ్నే మూలే జగదాదా వుత్పన్నా వసథ్య (అగ్నే)! త్రీన్ వేదాన్ విదంతీతి త్రివిదః, త్రివిదాం సంబంధినోఽధ్యేతార స్త్రైవిదా స్తే చ యం మంత్రభాగం ఋగాది రూపేణ త్రివిధ మాహుః తం గోపాయ'

—సా.భా.తై.సం. 1-1-1-1; ఋగ్వేద-సామవేద భాష్య భూమికలు.

ఇట అవసథ్యాగ్ని 'అహే, బుధ్నియ' యని సంబోధింపబడినాడు. అహింసితవృషు, జగదాదియం దుత్పన్నుడు నగు అగ్ని యని యర్థము. ఋగ్యజుస్సామరూప మగు త్రివిధ మంత్రజాతమును దర్శించినవారు త్రివిదులు. వీరే మంత్రద్రష్టలగు ఋషులు. వారినుండి యా త్రయీవిద్య నధ్యయనము జేసిన వేదవిదులు త్రైవిదులు. ఆ సంప్రదాయము నను సరించి గురుశిష్యపరంపరగా ప్రాప్తమైన యీ వేదమును నేడు నధ్యయన మొనర్చెడి వేదవిదులును త్రైవిదు లగుదురు. ఈ మంత్రజాతమును పరమేశ్వరుడు మొదట హిరణ్యగర్భప్రజాపతి కనుగ్రహించెను. ఆ మంత్ర రాశిని మంత్రద్రష్టలగు ఋషులు దర్శించిరి. 'తా మన్వవిందన్ ఋషిషు ప్రవిష్టామ్'—అనుచు ఋగ్వేదము (10-71-3) ని విషయమును స్పష్టము జేయుచున్నది. (చూ-ఋషి శబ్దము)

పరమేష్ఠి నుండి నేటివఱకును గురుశిష్యపరంపరా రూపమున ప్రాప్తమై యే ఋగాదిరూపమగు మంత్రము (వేదము) నాచే నధ్యయనము చేయబడినదో యదియే యమృతస్వరూప మగు (అమరణ ధర్మము గల) సిరి (శ్రీ). యగునట్టి సిరి లక్ష్మివి గావు. జగత్కారణ భూతుడవు. నిరంతర మారాధనీయుడవు నగు నో యగ్నీ! అట్టి నా యీ మంత్రమును రక్షింపుము — అని పై మంత్ర తాత్పర్యము.

ఇది మంత్రావిర్భావస్వరూపమును, మంత్రము యొక్క అమృత శ్రీత్వమును, మంత్రగోపనావశ్యకతయు వివరించెడి మంత్రము. ఈ మంత్రమునకు, యజ్ఞకర్మలందే గాక నిత్యము జేయబడు దేవతారాధనము నందును వినియోగము గలదు. అందుచే పరంపరాప్రాప్త మగు నీ త్రయీ రూపమంత్రరాశిని రక్షింపు మనెడి యుపస్థానము ప్రతిదినము జేయబడు చుండుట గమనార్హము.

మంత్రములు ఆర్యు లనెడివారి రచనలే యనుచో నీ మంత్రార్థమెట్లు పొసగును ? త్రివిదులగు ద్రష్టలచే దర్శింపబడి, త్రైవిదులచే నధ్యయనము జేయబడెడి యమృతశ్రీరూప మగు నా యీ ఋగ్యజుః సామరూప మగు మంత్రజాతమును రక్షింపు మని యీ మంత్రము యొక్క రచయిత అగ్నిని ప్రార్థించుటలోని సామంజస్య మేమి ? అభ్యర్థింపబడెడి యగ్ని భౌతికాగ్నియే యగుచో నది మంత్రజాతమును రక్షించు టెట్లు ? ఋగ్యజుఃసామరూప మంత్రజాత మంతయు ఆ రచయిత యొక్క రచనయే (మే మంత్రం) అగుట యెట్లు ? కాన నధ్యయన పరంపరాప్రాప్తమైన మంత్రజాతరూప మగు నా యీ సిరి (శ్రీ) ని రక్షింపు మనియెడి యీ యభ్యర్థన, మంత్రములు పురుషకర్తృకము లగుచో పొసగదు; అపౌరుషేయములని యంగీకరించినపుడే యిట్టి యీ మంత్రములకు సరస సమన్వయము లభించును. మంత్రములు పురుషకర్తృకములు గావు; అవి త్రివిదులగు మంత్రద్రష్టల దర్శనములు; వాని నధ్యయనము జేసి త్రైవిదులై తమ, యీ యమృతంపు సిరిని ఈశ్వరానుగ్రహము బడసి గోపనము చేయవలెను. అని మంత్రము స్పష్టముగ తన స్వరూపమును జెప్పికొనుచున్నది. అనాదికాలమునుండి అవిచ్ఛిన్నముగ అధ్యయన పరంపరాప్రాప్త మగుటచే 'అమృతా శ్రీః' యని శ్రుతియే తన యమృత స్వరూపమును తేటపఱచుకొనుచున్నది.

వేదములు వేఱు వేఱు తెగల (Tribes) వారిచే, భిన్న భిన్న కాలములందు, భిన్నభిన్నదేశములందు రచింపబడుచో నా రచనలకు అమృతత్వ మెట్లు? మఱియు నా రచనల కన్నిటికి గలిపి సామూహికముగ వేదః, శ్రుతిః, బ్రహ్మ—ఇత్యాది నామముల గూర్చిన దెవరు ? శ్రుతియే తనను దాను వేదాది నామములతో నన్ని శాఖలయందును వ్యవహరించుకొని యుండుటచే నవి యర్వాచీనకల్పిత సాంకేతిక నామము లని చెప్ప

వలను పడదుగదా! కనుక వేద మపౌరుషేయ మని యంగీకరించినపుడే యీ నామముల యౌచిత్యము సరసముగ గ్రహింప నగును. అపుడే సకల మంత్రార్థ సమన్వయము సరసముగ గుదురగలదు.

వేదములలో పౌర్వాపర్యము, విజ్ఞానక్రమవికాసము గలవా?

అగ్నినుండి ఋక్కులు, వాయువునుండి యజుస్సులు, సూర్యుని నుండి సామలు నుద్భవిల్లినట్లు శ్రుతులు చెప్పుచున్నవి. దీని ననుసరించి మొదట ఋగ్వేదము, తరువాత యజుర్వేదము, నా తర్వాత సామవేదము పుట్టియుండునని యూహ చేసినచో— మొదట అగ్నియు, తరువాత, క్రమముగ వాయు సూర్యులును బుట్టిరని యనవలసి వచ్చునే! అగ్ని-వాయు-సూర్యులు నిరంతర సాహచర్యము గల మూడు జ్యోతిస్సులు. (వీనిని గూర్చి 'భారతీ' శబ్దవిచారమున వివరింపబడినది.) పరమేశ్వరుడు అగ్ని వాయ్వాదిత్యాత్మకుడు, ఋగ్యజుస్సామాత్మకుడు నగుటచే 'త్రిధాతుః' అని శ్రుతి యందు గీర్తింపబడినట్లు పూర్వము వివరింపబడినది. అందుచే అగ్ని - వాయు - ఆదిత్యులకు గాని, ఋగ్యజుస్సామలకు గాని పౌర్వాపర్యము, దానినిబట్టి విజ్ఞానక్రమ వికాసము ఉన్నదని చెప్పుట శ్రుతి తాత్పర్యానుగుణము గాదు.

అంతర్దర్శనము :-

కాని భాషను బట్టియు భావమును బట్టియు, ఆ యా కాల స్థితిగతుల బట్టి వేదమున గల సంహితాభాగమునకును, బ్రాహ్మణ - ఆరణ్యక - ఉపనిషద్భాగమునకును పౌర్వాపర్య మున్నదనియు. సంహితయందు (మంత్రభాగమునందు) బాహ్యదర్శనమే కాని యంతర్దర్శనము లేదనియు,

ఉపనిషత్తులయందే యంతర్దర్శన మున్నదనియు చారిత్రికు లూహించిరి. ఇట్టి యీ యూహలు చరిత్రకల్పనాలక్ష్యముతో జేసిన యూహలు మాత్రమే యగును.

ఈ యూహల నంగీకరించినచో మంత్రములకు సరస సమన్వయము పొసగదు. అతి ప్రాచీనములని చెప్పబడెడి ఋగ్వేద మంత్రములే యీ చారిత్రికుల వాదమును నిరాకరించుట జూతము.

న వి జానామి యదివేద మస్మి నిణ్యః సన్నద్ధో మనసా చరామి।
యదా మాగన్ ప్రథమజా ఋతస్యాదిద్వాచో అశ్నువే భాగ మస్యాః॥[1]
——ఋ. 1_164_37; అ. వే. 9_10_15, నిరు. 7_3; 14_22.

---

1 అహం యదివేదం యదపీదం విశ్వం అస్మి కృత్స్నః ప్రపంచో వ్యహ మేవాస్మి। నామరూపాంశం అపరమార్థం త్యక్త్వా సర్వత్ర అనుగతోఽస్తి భాతి ప్రియ మితి యోఽయం సచ్చిదానందాకారోఽస్తి సోఽహ మస్మీతి న విజానామి। వివిచ్య నాజ్ఞాసిషమ్ । పరం శాస్త్రజనిత మిద మహ మస్మీతి జ్ఞానం జాతమ్। అవివేక్యహ మిత్యర్థః। కార్యకారణయో రభేదాత్ కృత్స్నప్రపంచస్యాపి బ్రహ్మానన్యత్వేన బ్రహ్మైకత్వావగమే ప్రపంచజాతమపి స్వస్వరూపమేవ భవతి । 'ఇదం సర్వం యదయ మాత్మా, బ్రహ్మైవేదం సర్వం, ఆత్మైవేదం సర్వం, స ఈక్షత బహు స్యాం ప్రజాయేయ'—— ఇత్యాది శ్రుతిభ్యః ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞానాత్ । 'తదనన్యత్వ మారంభణశబ్దాదిభ్యః (బ్ర.సూ. 2-1-14) ఇత్యాద్యుపపత్తిభిశ్చ ప్రపంచస్య బ్రహ్మానన్యత్వం సిద్ధమ్। యద్వా, ఇవ శబ్దః ఉపమార్థః। యదివ యదాపరోక్ష్యజ్ఞానం సర్వైకాత్మ్యరూప మానుభవిక మస్తి తదివ తద్వదేవాహ మస్మి । ఇదం సర్వ మహ మస్మీతి జ్ఞానం మే జాతమ్। అపితు ఏత ద్దార్ష్టాంతికభూతమ్ । అనుభవికం సార్వాత్మ్యం యదస్తి తన్న వి జానామి న ప్రాప్తోఽస్మి । శాస్త్రజనితం సార్వాత్మ్యం జాతం న తు అనుభవిక మిత్యర్థః । తత్ర కారణ మాహ । యతోఽహం నిణ్యః । అంతర్హితనామైతత్ । అంతర్హితో మూఢ చిత్తః । చిత్తప్రత్యక్ప్రవణతాభావేన పరిచ్ఛిన్న ఇత్యర్థః। తత్రోపపత్తి మాహ। సంనద్ధః అవిద్యాకామకర్మభిః సమ్యగ్బద్ధో వేష్టితః అత ఏవ, మనసా యుక్తో భావనా సహిష్ణునా బహిర్ముఖేన విక్షిప్తేన చేతసా యుక్తః సంచరామి సంసారే। అథవా

యత్ ఇవ ఇదమస్మి న వి జానామి :

దృశ్యమగుచు నిది యేది గలదో యా కృత్స్న ప్రపంచము నేనే. అనగా అస్తి (సత్), భాతి (చిత్), ప్రియం (ఆనందం), నామ, రూపం - అనెడి యంశపంచకముతో గన్పట్టుచునది యంతయు నేనే. అందు నామరూపములు పరమార్థములు గావు; వానిని విడిచి సర్వత్ర అనుగతమై యుండెడి సత్-చిత్-ఆనంద స్వరూపము నేను-అని వివేచన చేసి తెలియజాలనైతిని. అనగా 'ఇదం సర్వం యదయమాత్మా', 'బ్రహ్మైవేదం సర్వం', 'స ఈక్షత బహూస్యాం ప్రజాయేయ' — ఇత్యాది శాస్త్రజన్య పరోక్షజ్ఞానము కల్గినది గాని యపరోక్షానుభవము కలుగలేదు — అని యీ వాక్యార్థము.

మనసా సంనద్ధశ్చరామి। ఇంద్రియ పరవశ ఏవ సన్ సంసారే దుఃఖ మనుభవామి। న సార్వాత్మ్యం జానామీతి పరిదేవతే। యాస్కోఽపి ఇమం పరిదేవనార్థత్వే నోదజహార, 'అథాపి పరిదేవనా కస్మాచ్చి ద్భావాత్, న విజానామి య దివేద మస్మి' ఇతి। బహిర్ముఖచేతసః స్వరూపాపరిజ్ఞానజనితం దుఃఖ మన్యత్ర శ్రూయతే 'పరాఞ్చి ఖాని వ్యతృణ త్స్వయంభూ స్తస్మా త్పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్' (క. ఉ. 2-4-1) ఇతి। తర్హి కదైత ద్భవతీ త్యాహ। యదా. మాగన్ ఆగమిష్యతి తదా। కిం తదితి ఉచ్యతే। ఋతస్య పరమార్థస్య పరస్య బ్రహ్మణః, ప్రథమజాః ప్రథమోన్మేషః ప్రథమోత్పన్న శ్చిత్తప్రత్యక్ప్రవణజనితః అనుభవః। స యదా మా మాం ప్రాప్నోతి, ఆదిత్ అనంతరమేవ అవ్యవధానేన, అస్యాః, వాచః ఐకాత్మ్యప్రతి పాదికాయా ఉపనిషద్వాచో యదిదేవమస్మీ త్యుక్తాయా వా, భాగం భజనీయం శబ్దబ్రహ్మణా వ్యాప్తవ్యం పరం బ్రహ్మపదమ్, అశ్నువే ప్రాప్నోమి। చిత్తస్య బహిర్ముఖతాం పరిత్యజ్య అంతర్ముఖతైవ అదుఃసంపాద్యా। సా యదా స్యాత్ తదానీమేవ స్వరూపం ద్రష్టుం సుశకం భవతి పశ్చా ద్విలంబాభావాత్। యథా గిరిశిఖరాత్ పతన్ పాషాణో ఽవిలంబేన పతతి తద్వత్। చిత్తప్రత్యఙ్ముఖత్వస్య దుఃశకత్వ మపి తత్రైవ శ్రూయతే- 'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్ష దావృత్తచక్షు రమృతత్వ మిచ్ఛన్' (క. ఉ. 2-4-1) ఇతి। సా. భా.

నిణ్యః సంనద్ధో మనసా చరామి :

అట్టి యనుభవము కలుగకపోవుటకు గారణ మేమన — బహిర్ముఖమై విక్షిప్తమైన మనస్సుతో తాదాత్మ్యము చెంది మూఢచిత్తుడనై పరిచ్ఛిన్నుని వోలె సంసారమున చరించుచున్నాను – అని యీ వాక్యార్థము.

యదా ఋతస్య ప్రథమజాః మాగన్, ఆదిత్ అస్యాః వాచః భాగం అశ్నువే :

కాని, యెపుడు బ్రహ్మ విషయకమై చిత్త మేకాగ్రమగుచు నంతర్ముఖ మగునో, అనగా బ్రహ్మవిషయక ప్రథమోన్మేషము (అపరోక్షానుభవము) కలుగునో యపుడే ఐకాత్మ్యప్రతిపాదక మగు నీ 'య దివేద మస్మి'ఇత్యా ద్యుపనిషద్వాక్యములచే ప్రతిపాదింపబడిన బ్రహ్మపదము నొందుదును.

(సాయణ భాష్యము, వేంకట మాధవ భాష్యము చూచునది)

ఈ మంత్రము ఋగ్వేదము మొదటి మండలము లోనిది. ఇందు మనస్సు నిరంతరము విక్షిప్తమై మోహపరవశమై యుండునంతవఱకు సంసారమున బరిభ్రమించుచుండు నని, మనస్సు యొక్క స్వాభావికస్థితి చెప్పబడినది. అట్లు బహిర్ముఖముగ నుండునంతవఱకు శాస్త్రమున నెంత పరిశ్రమ జేసినను మనస్సుతో తాదాత్మ్యము విడువక యుండుటచే నేను పరిచ్ఛిన్నుడను (అల్పుడను) అను భావమే వెంటనంటియుండును గాని సచ్చిదానంద రూపమగు నీ కృత్స్నప్రపంచ మంతయు నేనే యను యథార్థానుభవము కలుగ దనుట స్పష్టము చేయబడినది. చిత్త మంతర్ముఖమైనపు డట్టి యనుభవము గలుగును; అపుడు గూడ నుపనిషత్ మహావాక్య ప్రమాణము చేతనే యా యపరోక్షానుభవము గల్గును గాని దానియంతట నది సిద్ధింపదు; అనగా నీ యనుభవము శాస్త్రైక సమధిగమ్యమే గాని

వనియు, ఉపనిషత్తత్త్వము నంతయు దృష్టియం దుంచుకొనియే మంత్ర బ్రాహ్మణములు ప్రవృత్తము లయినవనియు, అట్టి మంత్రబ్రాహ్మణ ప్రతిపాదిత కర్మస్వరూపమును దృష్టియం దుంచుకొనియే ఉపనిషద్భాగ మావిర్భవించిన దనియు దెలియుట సమంజసము. అట్లంగీకరింపనిచో నిట్టి యీ మంత్రములకు సరస సమన్వయము కుదురదు.

ఇంకొక విశేషము. 'మనస్సు విక్షిప్తమై సంసారమున జరించు నంతవరకు శాస్త్రజన్యజ్ఞాన మనుభవదూరమై యుండును; చిత్త మంతర్ముఖమైనను అపరోక్షానుభవము గల్గుటకు శాస్త్రజన్యజ్ఞాన మావశ్యకము; అనగా శాస్త్ర(వేద) ప్రతిపాదితమైన విషయము పురుషబుద్ధిచే నేమాత్ర మూహించుటకు శక్యము గాదు'—అని 'న విజానామి' యనెడి పై మంత్రమున స్పష్టముగ తెలియజేయబడినది. అట్టియెడ పురుషబుద్ధికి గోచరములు గాని యీ విషయములను ఆర్యు లనువా రెట్లు తమ రచనల ద్వారా తెలియజేయజాలి యుందురు ? కాన వేదములు పురుషబుద్ధికల్పితములని గాని, వానియందు పౌర్వాపర్యము విజ్ఞానక్రమవికాసము లున్నవని గాని చెప్పుట యుక్తిసహము కాదు; శ్రుతి తాత్పర్యానుగుణము ను కాదు.

ఋగ్వేదము, నానాదేవతలు-ఏకదేవత :-

"ఋచో అక్షరే పరమే వ్యోమన్ యస్మిన్ దేవా
అధి విశ్వే నిషేదుః। యస్తన్న వేద కి మృచా
కరిష్యతి య ఇత్తద్విదు స్త ఇమే సమాసతే॥

—ఋ. 1-164-39; అ.వే. 9-10-18; తై. బ్రా. 3-10-9-14; తై. ఆ. 2-11-1
నిరు.13-10

ఇదియు ఋగ్వేదమున మొదటి మండలములోనిదే. ఈ మంత్రమునకు పూర్వమున నున్న 'అపాఙ్ ప్రాఙేతి' యను ఋక్కున దేహాత్మ

వనియు, ఉపనిషత్తత్త్వము నంతయు దృష్టియం దుంచుకొనియే మంత్ర బ్రాహ్మణములు ప్రవృత్తము లయినవనియు, అట్లే మంత్రబ్రాహ్మణ ప్రతిపాదిత కర్మస్వరూపమును దృష్టియం దుంచుకొనియే ఉపనిషద్భాగ మావిర్భవించిన దనియు దెలియుట సమంజసము. అట్లంగీకరించనిచో నిట్టి యీ మంత్రములకు సరస సమన్వయము గుదురదు.

ఇంకొక విశేషము. 'మనస్సు విక్షిప్తమై సంసారమున జరించు నంతవరకు శాస్త్రజన్యజ్ఞాన మనుభవదూరమై యుండును; చిత్త మంతర్ముఖమైనను అపరోక్షానుభవము గల్గుటకు శాస్త్రజన్యజ్ఞాన మావశ్యకము; అనగా శాస్త్ర(వేద) ప్రతిపాదితమైన విషయము పురుషబుద్ధిచే నేమాత్ర మూహించుటకు శక్యము గాదు'—అని 'న విజానామి' యనెడి పై మంత్రమున స్పష్టముగ తెలియజేయబడినది. అట్టియెడ పురుషబుద్ధికి గోచరములు గాని యీ విషయములను ఆర్యు లనువా రెట్లు తమ రచనల ద్వారా తెలియజేయజాలియుందురు ? కాన వేదములు పురుషబుద్ధికల్పితములని గాని, వానియందు పౌర్వాపర్యము విజ్ఞానక్రమవికాసము లున్నవని గాని చెప్పుట యుక్తిసహము కాదు; శ్రుతి తాత్పర్యానుగుణమును కాదు.

ఋగ్వేదము, నానాదేవతలు-ఏకదేవత :-

"ఋచో అక్షరే పరమే వ్యోమన్ యస్మిన్ దేవా
అధి విశ్వే నిషేదుః। యస్తన్న వేద కి మృచా
కరిష్యతి య ఇ త్తద్విదు స్త ఇమే సమాసతే॥
—ఋ. 1-164-39; అ.వే. 9-10-18; తై. బ్రా. 3-10-9-14; తై. ఆ. 2-11-1
నిరు.13-10

ఇదియు ఋగ్వేదమున మొదటి మండలములోనిదే. ఈ మంత్రమునకు పూర్వమున నున్న 'అపాజ్ ప్రాజేతి' యను ఋక్కునందు దేహాత్మ

జీవాత్మల గూర్చి చెప్పబడినది. ఇందు జీవాత్మయొక్క పారమార్థిక రూపము జెప్పబడుచున్నది.

ఇచట 'ఋచః' అను పదము నాలుగు వేదములకు ఉపలక్షకము. (అత్ర ఋక్ శబ్దేన ఋక్ప్రధానభూతాః సాంగాపరవిద్యాత్మకా శ్చత్వారో వేదా ఉచ్యన్తే - సా.భా)

అక్షరమ్:-

ఏతద్వై తదక్షరస్య ప్రశాసనే గార్గి (బృ. ఉ. 3-8), యయా తదక్షర మధిగమ్యతే (ము. ఉ. 1-1-5), యేనాక్షరం పురుషం వేద సత్యం, (ము. ఉ. 1-2-13) — ఇత్యాది శ్రుతులయందు అక్షరముగ అనగా అనశ్వరముగ ప్రసిద్ధమైన బ్రహ్మమే ఇట అక్షరశబ్దము చేతను చెప్పబడు చున్నాడు. సర్వవేదములకును ప్రతిపాద్యుడు బ్రహ్మమే. కాన 'ఋక్కులకును అక్షరమునకును' — అనగా వేదములకును బ్రహ్మకును గల సంబంధము ప్రతిపాద్యప్రతిపాదకభావరూపము. కనుక, 'ఋచః అక్షరే'- అనగా ఋక్ప్రతిపాద్య మగు బ్రహ్మయందు అని యర్థము.

ఆ అక్షరము 'పరమం వ్యోమ' అనగా ఉత్కృష్టము, నిరతిశయము, సర్వాధిష్ఠానమునై సర్వరక్షకమైన తత్త్వము. దానియందే సర్వము అధ్యస్తము. ఆ పరమాత్మయందే సర్వదేవతలు అధివసించి యున్నారు.

లేక 'అక్షరే ఋచః' అనియు జెప్పవచ్చును. ఈ యర్థము ననుసరించి పరమాత్మయందు వేదము లన్నియు పర్యవసన్నములై యుండు ననియు దెలియనగును (ఉక్తలక్షణే వస్తుని ఋగుపలక్షితాః సర్వే సాంగా వేదాః పర్యవసితా ఇత్యర్థః-సా. భా).

యస్తన్న వేద కి మృచా కరిష్యతి :—

సర్వదేవతాధిష్ఠానరూపుడు, కృత్స్నవేదతాత్పర్య ప్రతిపాద్యుడు నగు బ్రహ్మను గూర్చి ఎవడు తెలిసికొనడో అతడు ఋగాది శబ్దజాలముచే నేమి చేయగలడు? అనగా వేదనసాధన మగు (వేదయతి) వేదముచే వేద్యుడగు బ్రహ్మను దెలియనిచో, వేదము ప్రయోజనరహితమై నిష్ఫల మగుచుండ నిక నా వేదముచే సాధించెడిదేమి? — అని ఋక్కు ప్రశ్నించుచున్నది. ఇట్లు తెలియజాలనివానిని గూర్చి వేదము నిష్ఫల మగునని చెప్పి, తెలిసినవానికి గలుగు ప్రయోజనము నిట్లు ఈ ఋక్కు చెప్పుచున్నది.

'య ఇత్తద్విదు స్త ఇమే సమాసతే' :—

ఎవ రీ తత్త్వము నెఱుగుదురో యా వేదవిదులు లేక బ్రహ్మవిదులు పునరావృత్తి రహితమగు స్వస్వరూపావస్థానము నొందుదురు (ఇమే జ్ఞాతారః సమాసతే సమ్యక్ తిష్ఠన్తి అపునరావృత్త్యా స్వరూపేఽవస్థానం సమాసనమ్ - సా. భా.) — అని మంత్రార్థము.

ఈ మంత్రమును తైత్తిరీయారణ్యకము ప్రణవపరముగ వ్యాఖ్యానించినది. అపుడు ఋక్ప్రతిపాద్యమగు అక్షరము ప్రణవరూపమగు ఓంకారము. ఇంతే కాదు. ఋగక్షర మనగా ఆదిత్యమండలాంతర్గత పురుషుడనియు చెప్పుట గలదు. లేక ఋక్ అనగా జీవు డనియు, ఋగక్షర మనగా జీవుని వాస్తవిక స్వరూపమగు పరమాత్మ అని చెప్పుటయు గలదు. సూక్ష్మముగ బరిశీలించినచో నన్నిటి తాత్పర్య మొకటియే యని తెలియనగును.

ఇచట 'ఋచః' అను పదముచే సర్వవేదరాశిని గ్రహింపక, ఆర్యులనువారి తొలి రచన యగు ఋగ్వేదములోని ఋక్కులే యని గ్రహించి

నను ఋక్ ప్రతిపాద్యము అక్షరము; లేక అక్షరమునందు ఋక్కులు – అను నర్థములే సిద్ధించుచున్నవి. ఎట్లు జెప్పినను ఋగధిష్ఠానభూతుడు, ఋక్ప్రతిపాద్యుడు అక్షరరూపబ్రహ్మ యనియే యర్థము జెప్పవలసి యుండును. ఆ బ్రహ్మ సర్వదేవతాధిష్ఠానరూపుడు గాన సర్వదేవతాత్మకుడు. కాన ఋక్కు లన్నిటికిని సర్వదేవతాధిష్ఠానభూత బ్రహ్మతత్త్వప్రతిపాదనము నందే తాత్పర్య మని యీ ఋక్కు స్పష్టీకరించుచున్నది. ఇట్లు ఋక్ స్వభావమును గూర్చి ఋక్కులే స్వయముగ జెప్పికొనుచుండ వాని స్వభావ మును చరిత్రకల్పనానుగుణముగ నింకొక తీరుగ వర్ణించుట ఋగభిమతము కాదు. ఇట్టి ఋక్ స్వభావమును దెలియనిచో (య స్తన్న వేద కి మృచా కరిష్యతి) ఈ ఋక్కులతో సాధించెడిదేమి ? – అని ఈ ఋక్కు ప్రశ్నించుచున్నది గూడ ! తెలిసికొనినచో గల్గెడి ప్రయోజనము గూడ వివరించినది.

అందుచే – 'ఆర్యు లనెడి వేదరచయితల దృష్టిలో సూర్యచంద్రాది జ్యోతిస్సులే మొదటి దేవతలు; అవియే జగద్యాత్రకు కారణభూతములుగ భావింపబడెను; తర్వాత పెక్కు దేవతలు గల్పింపబడిరి; కొంత కాలము నకు సృష్టికర్తను గూర్చిన జిజ్ఞాస పెరిగినది. అయినను తత్, సద్, బ్రహ్మ–ఇత్యాది పదములకు ఉపనిషత్తులందు జెప్పెడి తత్త్వార్థములు ఋగ్వేదకాలమున లేవు' — మున్నగు చారిత్రిక కల్పనలు నిరాధారములని యీ ఋక్కు స్పష్టము జేయుచున్నది.

“సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్ । సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి” — ఇత్యాద్యుపనిషద్వాక్యములు “ఋచో అక్షరే పరమే వ్యోమన్ .... య స్తన్న వేద........ య ఇత్ తద్విదుః........”

అను ఈ ఋక్కునకు ప్రతిబింబరూపములై వర్తిల్లి, ఋగర్థవివరణ రూపములే యగుచున్నవి. 'కాన సంహితలు ప్రతిపాదింపని తత్త్వము క్రొత్తగా ఉపనిషత్తులచే గాని, పురాణేతిహాసాదులచే గాని, శ్రీ శంకరాదులచే గాని ప్రతిపాదింపబడిన దనుట యుక్తిసహము, శ్రుతిసమ్మతము గాదు; శంకరాదులకును సంమతముగాదు (చూ. అవతారిక). అందుచే ఋగ్వేదకాలమున తత్త్వదర్శనము వేఱు; ఉపనిషత్కాలమున తత్త్వదర్శనము వేఱు; శంకరాదుల కాలమున తత్త్వదర్శనము వేఱు—అని వర్ణించుట తగదు.

పురుషబుద్ధికి గోచరము గానిదగుటచే 'పరమం వ్యోమ, పరమం పదమ్, అక్షరమ్, తత్, సత్'—అని యీ రీతిగ ఋగాది శ్రుతు లన్నిటి యందును ప్రసిద్ధమైన ఒక వేదమును (బ్రహ్మను) తెలియజేయుటకై పెక్కు వేదము లావిర్భవించినవి.

"ఏకవేదస్య చాజ్ఞానాత్ వేదా స్తే బహవోఽభవన్"—
అని సనత్సుజాతీయ వచన తాత్పర్యము.

ఈ సనత్సుజాతీయ వచనమునందలి వేద శబ్దములకు జెప్పబడిన నిర్వచనములను, ఇంతదనుక ఈ శీర్షిక యందు దుపహరించిన శ్రుతి స్మృతి వచనములను పరిశీలించి చూచినచో—

1. ఋగ్యజుః సామరూప మంత్రజాతము, హవిస్సులు, హవిర్దాతలగు యజమానులు నే దేవుని సఖ్యము కాంక్షించుచున్నట్లు (యో జాగార తమృచః కామయన్తే - ఇత్యాది) శ్రుతిచే చెప్పబడినదో, వినిద్రుడు, జాగరూకుడు నగు నా యగ్నియే 'దేవః - వేదః - జాతవేదాః' అని కీర్తింపబడినాడు (జాతవేదసే సునవామ: వేదోఽసి యేన త్వం దేవ వేద - ఇత్యాది).

2. దేవుడును వేదస్వరూపుడు నగు నా యగ్నియే "అగ్నిరస్మి జన్మనా జాతవేదాః; వేదోఽసి; వేదో వై పుత్రనామాసి; అగ్నిర్మూర్ధా దివః కకుత్పతిః" — ఇత్యాది మంత్రములచే జీవుని వాస్తవికస్వరూపుడుగ వివరింపబడినాడు.

3. ఆ యగ్ని పురుషబుద్ధికి గోచరుడు గాడు; శాస్త్రైకవేద్యుడు; సర్వవేదాత్మకుడు; సర్వదేవాత్మకుడు; సర్వాత్మకుడు—నని 'న వి జానామి యది వేద మస్మి; ఋచోఽక్షరే పరమే వ్యోమన్; అయ మస్మి సర్వః'— ఇత్యాది ఋక్కులచే దెల్పబడినాడు.

4. కాన, పవిత్రుడు, మంగళస్వరూపుడు, సర్వాత్మకుడు, యజ్ఞేశ్వరుడు (యజ్ఞస్య దేవః), ఋత్విజము నగు నా మహాగ్నినే 'అగ్ని మీళే పురోహితమ్'—అని కీర్తించుచు వేదప్రథమావతారము నగు ఋగ్వేద మావిర్భవించినది— అని తెలియ నగును. ఇట్టి యగ్ని యొక్క (వేదము యొక్క) తత్త్వము నధికారిభేదము ననుసరించి బోధించుటయే నిఖిల వేదరాశి యొక్క పరమ లక్ష్యము. ఇదియే వేదము యొక్క వేదత్వము. 'వేదం వేదయతీతి వేదస్య వేదత్వమ్.'

వేదము యొక్క వేదత్వము 'ఋషి' శబ్ద పరిశీలనము వలనను స్పష్టమగును. ఇక వేదము యొక్క ఋషిత్వమును దర్శింతము.

ఋ షిః

ఋషీణాం సర్వస్వం ఋషి మభయదాత్రీం సుకృతినాం
వచస్సారోదారాం భరతజనభాగ్యం ప్రథమజామ్ ।
అగాధాం తాం గాథాశతవిలసితాం న్యాయమహితాం
పరాం దేవీం వాచం హరిహృదయలక్ష్మీం హృది భజే ॥

—వేదమాతృస్తవః.

ఋషిః-శ్రుతి స్మృతి కోశ ప్రసిద్ధి:-

ఋషి పదము గూడ వేద నామముగ ప్రసిద్ధము.

"ఋషి ర్వేదే వసిష్ఠాదౌ" — మేదినీ.

"ఋషి స్తు వేదే భృగ్వాదౌ జ్ఞానవృద్ధే దిగంబరే" — వైజయన్తీ.

"ఋషి ర్వేదే వసిష్ఠాదౌ దీధితా వపి పఠ్యతే" — విశ్వః.

"ఏత ద్వోఽస్తు తపోయుక్తం దదామీ త్యృషిచోదితమ్"

భార. శాన్తి. 11-19.

'ఏత త్కర్మ దదామీతి ఋషిణా మంత్రేణ బోధితం, తథాచ ఇంద్రవాక్యం కర్మకాండే - శ్రు. "దేహి మే దదామి తే" ఇతి.

—నీలకంఠవ్యాఖ్యా.

పాణినిమహర్షియు ఋషిపదమును వేదపరముగ ప్రయోగించినాడు.

"అప్లుతవ దుపస్థితే" (6-1-129) - "ఉపస్థితోఽనార్ష ఇతిశబ్దః (అవైదికః ఇతిశబ్దః)"

"సంబుద్ధౌ శాకల్య స్యేతా వనార్షే"- 1-1-16.

"ఋషి ర్వేదః - తదుక్తం ఋషిణా ఇత్యాదౌ తథా దర్శనాత్"
—తత్త్వబోధినీ.

"కర్తరి చర్షిదేవతయోః —3-2-186.
"ఋషి ర్వేదమంత్రః, తదుక్తం ఋషిణేతి దర్శనాత్ —సిద్ధాన్తకౌముదీ.
"సన్మాత్రే చ ఋషి ర్దర్శనాత్" — 5-2-94. వార్త్తికమ్.
"ఋషిః పఠతి - శృణోత గ్రావాణః" — పాతంజల మహాభాష్యమ్. 3-1-7.
"ఋషియజ్ఞం దేవయజ్ఞం భూతయజ్ఞం చ సర్వదా ।
నృయజ్ఞం పితృయజ్ఞం చ యథాశక్తి న హాపయేత్ ॥" —వాచస్పత్యమ్.

ఇట్లు కోశములందును, భారతాదులందును, శబ్దానుశాసనమునందును ఋషి శబ్దము వేదపరముగ ప్రసిద్ధము. బ్రహ్మ యనియు వేదమునకు నామము. అందుచే బ్రహ్మయజ్ఞము ఋషియజ్ఞ మనియు కీర్తింపబడినది. మఱియు, 'తదుక్తం ఋషిణా'; 'ఏత దధివిదాయ ఋషి రవోచత్;' "తదేత దృషిః పశ్య న్నభ్యనూవాచ" — అని యీరీతిగ శ్రుతియే తనను ఋషి యని పెక్కుచోట్ల వ్యవహరించుకొనినది. ఈ యర్థమును వివరించెడి ఋషి ప్రశిష్టా[1], ఋషిచోదనః[2], ఋషిమనాః[3] - ఋషికృత్, ఋషిస్తుతా[4] - ఇత్యాది పదములు వేదవాఙ్మయమున పెక్కులు గలవు.

ఋషిశబ్దము - నిర్వచనము :

'ఋషి ర్దర్శనాత్' అని యాస్క నిర్వచనము. ఋషీగతౌ. ఈ నిర్వచనమును జూచినంతనే దర్శనము చేతనధర్మ మని స్ఫురింపక మానదు. సామాన్యముగ చేతనులై, ద్రష్టలయిన వశిష్ఠాదులను ఈ ఋషిపదము బోధించుట ప్రసిద్ధము. వేదము శబ్దరూపము. కాన, జడము. చేతనము కాదు. అట్టియెడ వేదము ఋషి యగుటెట్లు ?

1) అ. సం. 11-1-15; 2) ఋ. 8-51-3; 3) ఋ. 9-96-18; 4) ఋ. 7-75-5;

వేదశబ్దము మొదట సర్వజ్ఞుడగు పరమేశ్వరునకు (వేత్తీతి వేదః) వాచక మగుచు, తరువాత తత్స్వరూప నిరూపణపరమై, (వేదయతీతి వేదః) సర్వజ్ఞకల్పమగు ఋగాది శబ్దరాశికిని వాచకమైనది. పిదప తన్మూలములై, తదనుగుణముగ ప్రవృత్తము లయ్యెడి ధర్మ, అర్థ, కామములకు నుపలక్షక మగుచున్నది. అట్లే ఋషిశబ్దముగూడ మొదట సర్వద్రష్ట (దర్శనాత్) యగు పరమేశ్వరుని బోధించుచు పిదప నట్టి పరమేశ్వరుని దర్శింప జేసెడి (దర్శనాత్) ఈ వేదశబ్దరాశికిని వాచకమై వరలినది. తరువాత నీ యిరువురు ఋషులను (దేవ - వేదములను) ఆరాధించి తదనుగ్రహముచే ద్రష్టలయి వెలసిన దేవతలకును, వసిష్ఠాదులకును వాచకమై ప్రసిద్ధమైనది.

పరమేశ్వరుడు - ఋషిత్వము :

"య[1] ఇమా విశ్వా భువనాని జుహ్వ దృషి ర్హోతా న్యసీద త్పితా నః।
స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః ప్రథమచ్ఛ దవరాగ్ం ఆ వివేశ॥"

ఎవ డీ సకల భువనములను లయ మొందించి, అద్వితీయుడై యుండి, మరల సృష్టికాముడై, అద్వితీయము నుత్కృష్టమునైన తన రూపము నాచ్ఛాదింపజేయుచు, జగత్తును భాసింపజేసి, జీవరూపమున నా యా యుపాధుల నావేశించి యుండునో, జగత్పితయగు నా పరమేశ్వరుడు సర్వద్రష్ట యగుటచే నీ మంత్రమున 'ఋషి' యని కీర్తింప బడినాడు. (మా. సా.భా; ఉవట-మహీ-భా; వేం-మా-భా).

'జన్మాద్యస్య యతః: శాస్త్రయోనిత్వాత్' — ఇత్యాది బ్రహ్మ సూత్రములచే నే పరమేశ్వరలక్షణము బాదరాయణ మహర్షిచే నిరూపింప బడినదో యట్టి పరమేశ్వరలక్షణమునే యీ ఋగ్వేదమంత్రము ప్రదర్శించు చున్నది. సృష్టిస్థితిలయకర్త, సర్వజ్ఞుడు, సర్వద్రష్ట యగు పరమేశ్వరుడు

1) ఋ. 10-81-1; వా.సం. 17-17; తై.సం. 4-6-21; మై.సం. 2-10-2; కాఠ.సం. 18-1.

ఆదిఋషి. అద్వితీయుడగు నీ ఋషియే యుపనిషత్తులయందును 'ఏకర్షి' యని కీర్తింపబడినాడు.

"క్రియావంతః శ్రోత్రియా బ్రహ్మనిష్ఠా స్వయం జుహ్వత
ఏకఋషిం శ్రద్ధయన్తః" — ము. ఉ. 2-10.

"పూష న్నేకర్షే యమ సూర్య ప్రాజాపత్య....." — ఈశా. ఉ. 16.

ఈ ఏకర్షియొక్క అద్వితీయ ద్రష్టృత్వమును ఉపనిషత్తులు—

"నాన్యోఽతోఽస్తి ద్రష్టా" బృ. ఉ. 3-7-23.

యని బహుముఖముల వివరించినవి. ఆధ్యాత్మికముగ మూర్ధభాగమున సహస్రారమునందు వెలుగొందు పరంజ్యోతియే యీ ఏకర్షి.

"తత్ర సూర్యోఽగ్నిర్నామ సూర్యమండలాకృతిః
సహస్రరశ్మిభిః పరివృత ఏకర్షి ర్భూత్వా మూర్ధ్ని
తిష్ఠతి, యస్మాదుక్తః" —ప్రాణాగ్ని. ఉ. 2-3.

ఈ యుపనిషత్తు 'యస్మా దుక్తః' అని యనుచు, వేదప్రతిపాదితుడైన పరంజ్యోతియే సహస్రారమున వెలుగొందెడి ఏకర్షి – అని చెప్పుచున్నది. ఏకర్షి యనగా ముఖ్యర్షి యనియు చెప్పబడుచున్నాడు.

"ఏకర్షిః ముఖ్యర్షిః శివః" — బ్ర. సూ. 3-3-3. శివార్కమణిదీపిక.

ఇంతేకాదు. వేదముల ననుసరించియే శివ, విష్ణ్వాది సహస్రనామములందును పరమేశ్వరునకు 'మహర్షి' యనియు నామము ప్రసిద్ధమైనది.

కాన పైవిషయముల బరిశీలించినచో 1. పరమేశ్వరుడు ఏకర్షి లేక ముఖ్యర్షి 2. పరమేశ్వరునకు గల ఋషిత్వము వేదములం దొకతీరుగను, ఉపనిషత్తులయం దింకొక తీరుగను, తరువాత బ్రహ్మసూత్ర పురాణాదులందు వేఱ్వేఱు తీరులుగను లేదనుట స్పష్టమైనది.

వేదము - ఋషిత్వము :

ఋషియగు నీ పరమేశ్వరుని దర్శింపజేయునది యగుటచే (దర్శనాత్) వేదమునకు ఋషి యను నామము సార్థక మని శ్రుతుల వలన దెలియుచున్నది. ఇక వేదమునకు గల ఆర్షధర్మము ను జూతము.

"ఏతా[1] అర్షన్తి హృద్యాత్సముద్రా చ్ఛతవ్రజా రిపుణా నావచక్షే।
ఘృతస్య ధారా అభిచాకశీమి హిరణ్యయో వేతసో మధ్య ఆసామ్॥"

ఋ. 4-58-5; వా. సం 17-93; కాఠ. సం. 40-7.

హృద్యాత్ సముద్రాత్ శతవ్రజా ఏతా అర్షన్తి :

శ్రద్ధ యనెడి యుదకముతో పరిప్లుతమైన నిరంతర దేవతా యాథాత్మ్య చింతనమే సముద్రము. అట్టి చింతనము నిగమ - నిరుక్త - నిఘంటు - వ్యాకరణ - శిక్ష - ఛందస్సులచే దోషరహితము గావింపబడి సుసంస్కృత మగుచో హృద్య మగును. హృద్యమగు నీ చింతనసంతానరూప సముద్రము నుండి యీ వేదవాక్కులు ఉద్గమించుచున్నవి (ఏతా అర్షన్తి). అట్టి యీ వాక్కులు శత వ్రజములు; అనగా వివిధార్థబోధకములగుటచే శతపథములై యర్థగాంభీర్యముతో విలసిల్లి యుద్గమించుచున్నవి.

రిపుణా నావచక్షే :

ఇట్టి యీ వాక్కులు 'కుతార్కికవాదము' అనెడి శత్రువునకు లొంగవు; పరాభూతములు కావు.

---

1. మహీ. భా :— "ఏతా వాచ అర్షన్తి ఉద్గచ్ఛన్తి। కస్మాత్। హృద్యాత్ సముద్రాత్। శ్రద్ధోదక పరిప్లుతాత్ దేవతా యాథాత్మ్యచింతన సంతానరూపాత్ సముద్రాత్. నిగమ నిరుక్త నిఘంటు వ్యాకరణ శిక్ష చ్ఛందోభిః పావనైః పూతాత్। కీదృశ్యో వాచః। శతవ్రజాః శతం వ్రజం వ్రజా గతయో యాసాం తాః బహుగతయః, బహ్వర్థా ఇత్యర్థః। యాశ్చ అర్షన్తి రిపుణా కుతార్కికబృన్ద శత్రుణా న అవచక్షే న అవచక్ష్యంతే। నాపవదితుం ఖండయితుం శక్యన్తే। తా ఘృతస్య ధారా ఇవాభి

ఘృతస్య ధారా అభిచాకశీమి :

ఘృతధారలు దేవతలకును, దేవాత్మకుడైన పరమేశ్వరునకును ప్రీతికరము లగునట్లు, ఈ వాగ్ధారలను గూడ ప్రీతికరములుగ దర్శించుచున్నాను; ఇంతే కాదు.

హిరణ్యయో వేతసో మధ్య ఆసామ్ :—

ఈ వాక్కులయం దంతర్నిహితుడై తేజోమయుడై వెలుగొందెడి వాగధిష్ఠానభూతుడైన యే యగ్ని కలడో యా జ్యోతిని దర్శించుచున్నాను — అని పై మంత్రార్థము. దీని తరువాతి మంత్రము.

"సమ్యక్ స్రవన్తి సరితో న ధేనా అంతర్ హృదా
మనసా పూయమానాః। ఏతే అర్ష న్త్యూర్మయో
ఘృతస్య మృగా ఇవ క్షిపణో రీషమాణాః।"

— ఋ. 4-58-5; వా. సం 17-94; 13-38.

ధేనాః అనగా వాక్కులు. జల్లెడతో ధాన్యాదికమును అన్యపదార్థములనుండి వేఱుచేసి పవిత్రపఱచునట్లు శ్రద్ధాది పరిప్లుతమైన బుద్ధిచే (అంతర్ హృదా) సుసంస్కృతమైన మనస్సుద్వారా (మనసా) శబ్దదోషములనుండి వేఱు చేయబడి పవిత్రములైన (పూయమానాః) యీ వేదవాక్కులు నదులవలె (సరితో న) నవిచ్ఛిన్నగతితో ప్రవహించి యగ్నిని పొందుచున్నవి.

చాకశీమి। ఇత్యోపమానమ్। అహం పశ్యామి। ఆసాం వాచాం మధ్యే యో హిరణ్మయో హిరణ్మయో దీప్యమానో వేతసోఽగ్నిః తం చాభిచాకశీమి। అగ్ని ర్హి వాచా మధిష్ఠాత్రీ దేవతా। యద్వా ఘృతధారా ఏవోచ్యన్తే। యా ఏతా హృద్యాత్ సముద్రాత్ ఘృతధారా అర్షంతి .... యో వేతసోఽగ్ని రాహవనీయః ఆసాం ధారాణాం మధ్యే స్థితః తం చ పశ్యామి। ప్రత్యక్షదేవతాం శ్చ యాథాత్మ్యే నాహం పశ్యామి త్యర్థః। (మా. ఉవట. భా.)

బోయవానికి వెఱచి క్రేళ్లుఱుకు లేళ్ళవలె నీ ఘృతధారలును, ఘృతధారల వంటి వాగ్ధారలును ఉద్గమించుచు అగ్నిని తృప్తినొందించుచున్నవి. ఇట్లు వాగ్ధారలును, ఘృతధారలును, అనగా 'శ్రుతి, ద్రవ్యము' - ఈ రెండును అగ్నికొఱకే ప్రవృత్తము లగుచున్నవి-అని యర్థము. (చూ.ఉవట,మహీ.భా.)

ఈ పై రెండు ఋక్కులును వేదవాక్కుల స్వభావమును, వానికి గల ఋషిత్వమును వ్యక్తము చేయుచున్నవి. మొదటి మంత్రమున "ఏతా అర్షన్తి"- అని ఋషిశబ్ద నిర్వచనము (అర్షన్తి, ఋషీ గతౌ, వ్యత్యయేన శప్) జూపబడినది. పరమేశ్వరుని దర్శింపజేయుటచే (వేదయతీతి) మంత్రరాశికి వేదము అని సార్థక నామధేయమైనట్లు, శ్రద్ధాపరిప్లుతమైన బుద్ధిచే షడంగాది సుసంస్కృతమైన మనస్సుద్వారా దోషరహితములు గావింపబడి యుద్గమించి పరమేశ్వరుని దర్శింపచేసెడి లేక పరమేశ్వరుని బొందెడి ఈ వేదవాక్కులకును ఋషి యను నామము సార్థకము. అనగా పరమేశ్వరుని తెలియజేయనిచో వేదమునకు 'వేద'మను నామము సార్థకము కాజాలని రీతిగా, పైన చెప్పిన యట్లు ఉద్గమించి పరమేశ్వరుని దర్శింప జేసి తదభిముఖములు గానిచో వీనికి ఋషి యను నామము సార్థకము కాదనియు నిట సూచిత మగుచున్నది. కాన, వేదశబ్దము వలెనే, ఋషి శబ్దము గూడ ఋగాదిశబ్దరాశికిని పరమేశ్వరునకును గల ప్రతిపాద్య ప్రతిపాదకభావరూప సంబంధమును దృఢపఱచుచున్నది.

ఇంతే కాదు. 'ఏతే అర్షన్త్యూర్మయో ఘృతస్య'- అనుచు నీ రెండవ మంత్రము ఘృతధారలకు గల ఆర్షధర్మము గూడ నుపలక్షింప జేయుచున్నది. వేదమూలములై, తదనుసారులైన కర్మార్థకామములయందు వేదత్వము ఉపలక్షితమగునట్లు, ఋషిరూప వేదవాక్ప్రేరితములై అగ్నిని తృప్తినొందించెడి ఘృతధారలయందు - అనగా హవిస్సులయందును ఋషిత్వ ముపలక్షిత మగునని చెప్పనగును. ఇట్లు వాక్కులును, హవిస్సులును

ఋషిత్వోపలక్షకము లగుటచే వానిచే సుసంస్కృతాంతఃకరణుడై వేద మంత్రముల నుచ్చరించుచు, హవిర్దానాదులచే నగ్నిని తృప్తి నొందించెడి యజమానుడును ఋషి యగుట సూచితము.

ఈ మంత్రములు కేవలము వాగ్ధారలను, ఘృతధారలను వర్ణించుటకు ప్రవృత్తములయినవి కావు. ఇవి వేదవాక్కుల స్వభావ మెట్టిదో, అవి యెప్పు డెట్లు ఋషులై వెలయునో, తెల్పుటకు ప్రవృత్తము లయినవి. మఱియు యజమానులు శ్రద్ధావంతులై సుసంస్కృతాంతఃకరణులై, అంతర్ముఖులై వాని నుచ్చరించుచు క్రియావంతులై, శ్రోత్రియులై, దేవతల దృప్తి నొందించుచు, క్రమముగ బ్రహ్మనిష్ఠులై ఏకర్షి యగు బ్రహ్మను పొందవలెనని ప్రబోధించుచున్నవి. ఈ విషయమునే ఉపనిషత్తులు నిట్లు ప్రబోధించుచున్నవి.

"క్రియావంతః శ్రోత్రియా బ్రహ్మనిష్ఠా స్వయం
జుహ్వత ఏకఋషిం శ్రద్ధయ న్తః।" —ము. ఉ. 2-10.

మఱియు పై మొదటి ఋక్కు "రిషణా నావచక్షే" అనగా శత్రువునకు లొంగవనుచు, వేదవాక్కు 'అజేయము'లని చెప్పినది. కాని యీ శత్రువెవరు? వేదవాక్కులకు పైన జెప్పబడిన ఆర్షభావమును గమనింపక విమర్శించువారే శత్రువులు. అందుచే 'కుతార్కికబృందమనెడి శత్రువునకు లొంగనివి' యని భాష్యకర్తలు వివరించిరి. ఈ శ్రుత్యర్థమునే మహాకవి భారవియు కిరాతార్జునీయమున నిట్లనువదించినాడు.

"ప్రసాదరమ్య మోజస్వి గరీయో లాఘవాన్వితమ్।
సాకాంక్ష మనుపస్కారం విష్వగ్గతి నిరాకులమ్॥
న్యాయ నిర్ణీతసారత్వా న్నిరపేక్ష మివాగమే।
అప్రకంప్యతయాఽన్యేషా మామ్నాయవచనోపమమ్॥"
—11-38, 39

ఈ శ్లోకములయందు అర్జునుడు ఇంద్రుని వాక్యములను ఆమ్నాయ వచనములతో బోల్చుచు తద్వ్యాజమున శ్రుతివాక్య స్వభావమును వివరించుట గానవగును. శ్రుతివాక్యము ప్రసాదాది గుణములతో నొప్పుటయే గాక 'విష్వగ్గతి' యని చెప్పబడినది. ఇది (విష్వగ్గతి) పై మంత్రమునందలి 'శతవ్రజాః' అను పదము యొక్క అర్థము ననువదించు చున్నది. బహ్వర్థములు గలిగి అర్థగాంభీర్యముతో నొప్పునది యని యర్థము. మఱియు 'హ్రద్యాత్ సముద్రాత్ అర్షంతి; అంతర్ హృదా మనసా పూయమానాః; సక్తు మివ తితఉనా పునంతో యత్ర ధీరా మనసా వాచ మక్రత' ఇత్యాది శ్రుతిప్రతిపాదితార్థమే యీ శ్లోకములందు 'న్యాయనిర్ణీత సారత్వాత్ నిరపేక్ష మివాగమే' యను వాక్యముచే ననువదింపబడినది. శిక్షాది షడంగములచేతను న్యాయములచేతను నిర్ణీతార్థముగలిగి న్యాయబద్ధమై అన్యనిరపేక్షమై స్వతః ప్రామాణ్యము గలది యని యర్థము. ఇట్లు నిశ్చితార్థములతో విలసిల్లున దగుటచే కుతార్కికవాద మనెడి శత్రువునకు లొంగనిది యని చెప్పెడి శ్రుత్యర్థమే ఇచట 'అప్రకంప్యతయాఽన్యేషాం ఆమ్నాయవచనోపమమ్' అను వాక్యముచే ననువదింపబడినది. ప్రతివాదులు జూపెడి ప్రత్యక్షము, అనుమానము మున్నగు నితరప్రమాణములచే పరాహతము గాక అజేయమై స్థిరముగ నిల్చునది - అని భావము.

వేదవాక్కులు అప్రకంప్యములు అను శ్రుతిసిద్ధాంతమును శ్రీమద్రామాయణము నిట్లనువదించుచున్నది.

"న శక్త స్త్వం బలా ద్ధర్తుం వైదేహీం మమ పశ్యతః ।
హేతుభి ర్న్యాయసంయుక్తై ర్ధ్రువాం వేదశ్రుతీ మివ ॥"

—రామా. 3-50-21.

కామోపహతుడై రావణుడు పతివ్రత యగు సీతను బలాత్కరించి గొని పోవుచుండ నా రావణుని వారించుచు జటాయువు పలికిన వాక్య మిది.

ఇచట సీతాదేవి వేదశ్రుతితో పోల్పబడి, యా వ్యాజమున శ్రుతియొక్క— నిశ్చలత్వము లేక అప్రకంప్యత్వము వివరింపబడినది. "న్యాయనిర్ణీత సారము గలిగి యవివాద్యమైన వేదవాక్కును కుతార్కిక హేతువాదములు కదలింప జాలని యట్లు, నేను జూచుచుండగా, కామోపహతుడవైన రావణా! నీవు పతివ్రత యగు సీతాదేవిని నీ బలప్రయోగముతో నపహరింపజాలవు" అని యర్థము.

పతివ్రత యగు సీత నిరంతర శ్రీరామచంద్రపరాయణయై అనన్య చిత్త యయినట్లు వేదశ్రుతియు న్యాయ నిర్ణీతసారము గలిగి నిరంతర ధర్మ బ్రహ్మపరాయణమై, అప్రకంప్యమై, యనన్యార్థ ప్రతిపాదకము—అని తాత్పర్యము.

పైన తెల్పబడిన 1. శతపథములై యర్థగాంభీర్యముతో నొప్పి యుండుట 2. శిక్షాద్యంగములచే సుసంస్కృతములై న్యాయ నిర్ణీతసారము గల్గి యొప్పుట 3. కుతార్కిక హేతువాదములకు లొంగక, యజేయములై విలసిల్లుట 4. ఈ ధర్మములచే నొప్పుచు యజమానుల నంతర్ముఖుల గావించి నిరంతరము ఏకర్షి పరమేశ్వరతత్త్వమును దర్శింపజేయుటయే (దర్శనాత్) వేదముయొక్క ఋషిత్వమని తెలియనగును.

ఇట్టి యీ వేదవాక్కులు తత్త్వప్రకాశకము లగుటచే పవిత్రములైన ఋషులు — అని శ్రుతి యింకొకచోట యిట్లు వర్ణించుచున్నది.

"సికతా ఇవ సంయన్తి । రశ్మిభిః సముదీరితాః ।
అస్మాల్లోకా దముష్మాచ్చ ఋషిభి రదాత్ పృశ్నిభిః ॥"

తై. ఆ. 1-27-5.

వాయువుచే ప్రేరితములై సైకతరేణువు లొకచోటనుండి మఱియొకచోటునకు బోవుచు నొకదానితో నొకటి గలిసి ప్రోవుపడి విడివడుచుండును. అట్లే

కర్మప్రేరితులై సంసారమున గలియుచు, విడివడుచు, నానా లోకముల జరించుచు నుండెడి జీవుల ననుగ్రహించుటకొఱకై పరమేశ్వరుడు తత్త్వ ప్రకాశకములగు ఋషులచే (వేదములచే) జ్ఞాన మొసగును. — అని యర్థము.

తేషాం సర్వేషాం అనుగ్రహాయ పరమేశ్వరః సృష్టిభిః శుక్లైః
తత్త్వప్రకాశకైః ఋషిభిః మన్త్రైః అవాత్ జ్ఞానం ప్రయచ్ఛతి – సా.భా.

ఇచట "ఋషులు, అనగా వేదమంత్రములు స్వచ్ఛములు" అని చెప్పబడినవి. ఇట్లు చెప్పుటచే పురుషబుద్ధిగత దోషరహితములని సూచిత మగుచున్నది. అట్టి మంత్రములు తత్త్వప్రకాశకములగు ఋషులు — అని భాష్యమున వివరింపబడినది.

భాగవతమునందలి శ్రుతిగీతలలో శ్రుతులే తమ్ము ఋషులుగ నిర్దేశించుకొని—'అత ఋషయో దధు స్త్వయి మనః—మా లక్ష్యము నీవే' యని పరమేశ్వరుని నుతించినవి.

ఋషిః—నారాయణః—వేదః:-

"న స వేద పరం బ్రహ్మ యో న వేద చతుష్టయమ్।
వ్యక్తావ్యక్తం చ య త్తత్త్వం సంప్రోక్తం పరమర్షిణా॥
వ్యక్తం మృత్యుముఖం విద్యా దవ్యక్త మమృతం పదమ్।
ప్రవృత్తిలక్షణం ధర్మ మృషిర్నారాయణోఽబ్రవీత్॥"
—భార. శాన్తి. 217-1,2

'పరమర్షిణా నారాయణేన। .... ఋషి ర్వేదః, స ఏవ నారాయణవాక్యత్వా న్నారాయణః" —నీలకంఠః

ఇట మొదటి శ్లోకమున నారాయణుడు 'పరమర్షి' యని కీర్తింపబడినాడు. రెండవ శ్లోకమున ఋషి యగు వేదము నారాయణ వాక్య మగుటచే నారాయణః అని చెప్పబడినది.

మంత్రద్రష్టలు — ఋషిత్వము :-

ఇంతవఱకు మొదట పరమేశ్వరుని యొక్క పరమర్షిత్వమును, తన్నిఃసృతమై, తత్ప్రతిపాదకమైన ఋగాదిశబ్దరాశికిని గల ఋషిత్వమును, తద్ద్వారా వేదవాక్కుల స్వభావమును దర్శించితిమి. ఇంతియే కాదు. తత్త్వ ప్రకాశకములగు నా మంత్రములను దర్శించువారును, వేద చోదితమైన పరమార్థమును (ధర్మ—బ్రహ్మ స్వరూపమును) దర్శించువారును 'ఋషులు' అని వేదమున వ్యవహరింపబడిరి. శ్రుతియే స్వయముగ ఋషి పదమును నిర్వచించుచు నీ విషయమును నిట్లు వివరించినది.

"అజాన్ హ వై పృశ్నీగ్ం స్తపస్యమానాన్ బ్రహ్మ
స్వయంభ్వభ్యానర్షత్। త ఋషయోఽభవన్। తదృషీణాం
ఋషిత్వమ్॥"
—తై. ఆ. 2-9, నిరు. 2.11.

'య దేనాం స్తపస్యమానాం స్తపస్యమానాన్ బ్రహ్మ
ఋగ్యజుఃసామాఖ్యం స్వయంభు అకృతక మభ్యాగచ్ఛత్।
అనధీత మేవ తత్త్వతోదదృశు స్తపోవిశేషేణ తదృషీణాం
ఋషిత్వమ్। ఇత్యేవం బ్రాహ్మణేఽపి విచార్యమాణే జ్ఞాయతే॥'
—దుర్గాచార్య భాష్యమ్.

తపశ్చర్యాపరతంత్రులైన మధుచ్ఛందాది మునులకు స్వయంజాత మగు (అకృతకమగు) ఋగ్యజుఃసామాత్మక మగు వేదము (బ్రహ్మ), వారధ్యయనము చేయకయే భాసించెను (అభ్యానర్షత్). అనగా తపోవిశేష

ముచే దర్శించిరి. అందుచే వారు ఋషులైరి. అదియే ఋషులయొక్క ఋషిత్వము—అని బ్రాహ్మణమువలన గూడ దెలియుచున్నది—అని యర్థము.

మంత్రద్రష్టలగు నీ ఋషులు కర్మబద్ధులై మరల మరల జన్మించు వారు కారు. కల్పాదియందు మాత్రమే బ్రహ్మచే సృజింపబడువారు. కాన 'అజాః' అని యిట శ్రుతియందు జెప్పబడిరి. వారు సహజముగనే పరిశుద్ధాంతఃకరణులు. కాన 'పృశ్నీన్' అని చెప్పబడిరి. అట్లు పరిశుద్ధ స్వరూపులయ్యు తప మాచరించిరి. ఆ తపస్సమాధిలో స్వాయంభువమగు బ్రహ్మ (వేదము) వారికి అభివ్యక్త మైనది.

ఇచట 'స్వయంభు—బ్రహ్మ' పదములచే జగత్కారణుడగు పరమేశ్వరుడు చెప్పబడినట్లును గ్రహింపనగును. పరమేశ్వర సాక్షాత్కారమును బొంది యా ఋషులు బ్రహ్మయజ్ఞమును దర్శించినట్లు (త ఏతం బ్రహ్మ యజ్ఞ మపశ్యన్) తరువాతి శ్రుతివాక్యముల వలన తెలియును (చూ. సా.భా). బ్రహ్మయజ్ఞ మనగా స్వాధ్యాయము (స్వాధ్యాయపదమును జూచునది). ఇట్లు వేదములను యజ్ఞములను లోకమున బ్రవర్తింప జేయుటకై కల్పాది యందు ఈశ్వరానుగ్రహముచే నవతరించిన అజులగు ఆధికారిక పురుషులే మంత్రద్రష్టలగు ఋషులని శ్రుతితాత్పర్యము.

'పృశ్ని యన వేదము; పరమేశ్వరుడు పృశ్నిగర్భుడు: దోషరహితము లగుటచే మంత్రములును పృశ్నులగు ఋషులు' – అని పూర్వము వివరింపబడినది. అట్టి మంత్రములను దర్శించెడి మంత్రద్రష్టలును పృశ్నులగు ఋషులుగ నీ మంత్రమున చెప్పబడుట గమనార్హము.

ఇట్లు 'పృశ్ని' పద పరిశీలనము జేయుచో 'పరమేశ్వరుని వలెనే వేదమును పరిశుద్ధము; పురుషబుద్ధిదోషరహితము; అట్లే మంత్రద్రష్టలును పరిశుద్ధాన్తఃకరణులై ఈశ్వరప్రేరితులై, తదనుగ్రహపాత్రులై తప స్సమాధిలో నీ మంత్రజాతమును దర్శించిరి; ఇది వారి స్వకపోల కల్పితము కాదు.' అని తెలియనగును.

తపోజాః - స్వయంభు - దైవీవాక్ :

అట్టు తపస్సమాధిలో భాసించునది యగుటచే వేదవాణిని 'తపోజా' అని శ్రుతి కీర్తించుచున్నది.

"తపోజాం వాచ మస్మే నియచ్ఛ దేవాయువమ్ ।" - తై.ఆ. 4-7-3.

"తపోజాం వాచ మస్మే నియచ్ఛ దేవాయువ మిత్యాహ ।
యా వై మేధ్యా వాక్ । సా తపోజాః । తామేవావరున్ధే'' ॥
— తై.ఆ. 5-6-25.

'తపోజా మిత్యనేన యజ్ఞయోగ్యా మంత్రరూపా వా గ్వివక్ష్యతే,
తస్యాః తపస్వినా పురుషేణ లభ్యమానత్వాత్' _ సా.భా.
(మా. వా. సం. 37-16; శ. బ్రా, 14-1-4-8)

తపస్సుచే లభించునది యగుటచే తపోజా అనియు, నిరంతరము దేవుని లేక దేవత్వము కోరునది లేక లక్షింపజేయునది యగుటచే 'దేవాయువం' అనియు వేదవాణి యిట కీర్తింపబడినది. అనగా దైవీవాక్ అని యర్థము.

తపోజా యనుటచే 'అంతకు పూర్వములేక క్రొత్తగా బుట్టినది' అనెడి వాదము తిరస్కృత మగుచున్నది. అనాదిసిద్ధమై యున్న వేదవాణియే తపస్సువలన నభివ్యక్తమైనదని తెలియును. స్వాయంభువమగు బ్రహ్మ అనగా వేదము వీరికి తపస్సమాధియందు అభివ్యక్తమైనది (అభ్యానర్షత్) అని చెప్పుచు పూర్వమంత్రము గూడ 'నీ వాక్కు అనాదినిధనమైన వాక్కు' అని స్పష్టము జేయుచున్నది. ఈ విషయము ఇంకను చూతము.

మంత్రకృత్ - ఋషికృత్ :-

ఇట్లు తపోజా, స్వయంభు — ఇత్యాది పదముల బురస్కరించుకొని యీ దేవీవాక్కు అనాది యని చెప్పుచో వేదమునం దచటచట గన్పట్టెడి

మంత్రకృత్, ఋషికృత్ — ఇత్యాది పదముల ననుసరించి యీ వాక్యము మంత్రకర్తృరచితమే యనియు చెప్పనగును గదా! యన నట్లు గాదు. ఈ విషయమును జూతము.

> "నమో వాచే యాచోదితా యా చానుదితా తస్యై వాచే నమో నమో వాచే నమో వాచస్పతయే నమ ఋషిభ్యో మంత్రకృద్భ్యో మంత్రపతిభ్యో మా మా మృషయో మంత్రకృతో మంత్రపతయః । పరాదు ర్మాఽహ మృషీన్ మంత్రకృతో మంత్రపతీన్ పరాదామ్ । వైశ్వదేవీం వాచ ముద్యాసగ్ం శివామదస్తాం జుష్టాం దేవేభ్యః ।" — తై. ఆ. 4-1

ఈ మంత్రమున ఉదితయు అనుదితయు నగు వేదవాక్కునకును, వాచస్పతికిని, మంత్రద్రష్టలు మంత్రపతులు నగు ఋషులకును నమస్కారము చేయబడి, 'అట్టి యా ఋషులకు నేనెన్నడు నవజ్ఞ సేయను. వారును నన్ను అవజ్ఞ చేయకుందురు గాక' — యని వారి యనుగ్రహ మర్థింపబడుచున్నది. మఱియు (1) సర్వదేవతా ప్రతిపాదికయు (వైశ్వదేవీ), సర్వమంగళయు (శివా), అనుపక్షీణయు, అనగా అనాదినిధనయు (అదస్తా), దేవప్రియయు నగునట్టి వాక్కు నుచ్చరించుచున్నాను' — అని యజమానునిచే చెప్పబడుచున్నది.

ఇట వేదవాక్కు తనను వైశ్వదేవీ, శివా, అదస్తా, దేవజుష్టా యని కీర్తించుకొనుట గమనార్హము. ఈ మంత్రమున ఒకయెడ 'మంత్రకృద్భ్యః, మంత్రపతిభ్యః' — అను పదములును, ఇంకొకయెడ అదస్తా (అనుపక్షీణా వాక్), శివా, వైశ్వదేవీ, దేవజుష్టా యను పదములును గన్పట్టుచున్నవి. ఇచట మంత్రకృత్ పదమునకు మంత్రకర్త యని యర్థము జెప్పుచో అదస్తా ఇత్యాది పదముల యర్థములు సంగతములు కావు. మంత్రము మంత్రకర్తృరచితమై క్రొత్తగా బుట్టిన దగుచో నా మంత్రము అనుపక్షీణము

(పూర్ణము లేక అనాది) అని యనుట యెట్లు ? కాన, మంత్రరూపమగు వాక్కు అనాది; అది తపస్సమాధిలో దర్శింపబడి యభివ్యక్తము చేయబడినది: అట్లభివ్యక్తము చేయువారే మంత్రకృత్తులు, మంత్రపతులు నగు ఋషులుగ నీ మంత్రమున గీర్తింపబడిరి. అట్లు గ్రహించినపుడే మంత్రము సరసముగ సమన్వయ మయి, యాపాతముగ కలిగెడి పై శంకలకు తావుండదు. ఈ విషయ మీ క్రింది మంత్రము వలనను స్పష్టమగుచున్నది.

"యా ఋషయో మంత్రకృతో మనీషిణః । అన్వైచ్ఛన్
దేవా స్తపసా శ్రమేణ । తాం దేవీం వాచగ్ం హవిషా
యజామహే । సా నో దధాతు సుకృతస్య లోకే ॥"

— తై. బ్రా. 2, 8-8

'ధారణశక్తి యుక్తులును, మంత్రద్రష్టలు నగు ఋషులును, దేవతలును బహుప్రయాససాధ్యమగు తపస్సు ద్వారా ఏ వాక్కును అన్వేషించిరో యట్టి దైవీవాక్కును హవిస్సుచే నారాధించుచున్నాను. అట్టి యా వాక్కు నన్ను సుకృతలోకము నొందించుగాక' — అని యర్థము.

ఇచట ఋషులును, దేవతలును ఎన్నో ప్రయాసల కోర్చి తపస్సు ద్వారా ఈ దైవీవాక్కును అన్వేషించినట్లు గలదు. అట్లన్వేషించి దర్శించి యా మంత్రములను లోకమున బ్రవర్తింపజేయుటచే వీరు 'మంత్రకృతః' అని చెప్పబడిరి. అందుచే నీ వేదవాణి 'అనాదినిధన' యని యనుటయే శ్రుతి తాత్పర్యము. అట్లు గానిచో, ఆర్యులనెడి వివిధ జాతులవారి రచన లనబడు ఈ మంత్రముల నన్వేషించుటకై దేవతలు దీర్ఘతపస్సమాధినిష్ఠులై శ్రమించుట యేమి ? ఇట్లు చెప్పుట యసంగతమే యగునుగదా ? కాన 'మంత్రకృత్' అనగా మంత్రద్రష్ట యనియే జెప్పవలసి యున్నది. ఇంతే కాదు.

"హస్తే దధానో నృమ్ణా విశ్వా న్యమే దేవాన్ ధాత్
గుహా నిషీదన్ । విదన్తీ మత్ర నరో ధియంధా
హృదా యత్ తష్టా మంత్రాగ్ం అశంసన్॥'' —ఋ. 1-67. 3; 4.

''అగ్ని హవిస్సులతోగూడ నంతర్హితుడు కాగా, దేవతలు భయపడి, సుసంస్కృతములై హృదయమునుండి యుద్గమించెడి మంత్రములతో నీ యగ్నిని స్తుతించి, గుహాయం దంతర్నిహితుడై యున్న ఆ యగ్నిని తెలిసికొనిరి. అనగా సాక్షాత్కరించుకొనిరి—అని యర్థము".

ఇట 'హృదా తష్టాన్ మంత్రాన్' -అని గలదు. 'హృదయావస్థితయా బుద్ధ్యా నిర్మితాన్ మంత్రాన్' - అని శ్రీ సాయణులు వ్యాఖ్యానించిరి. అందుచే 'బుద్ధికుశలతతో రూపొందించిన (అనగా రచించిన) మంత్రములను' - అని యర్థము చెప్ప నగును గదా! యన నట్లు గాదు. హవిస్సులతో నంతర్హితుడైన యగ్నిని సాక్షాత్కరించుకొను టెట్లు? అని దేవతలకు విచికిత్స గలిగెను. వారు స్వయంప్రతిభాతవేదులు. కాన నిలీనుడైన యా యగ్ని నే మంత్రములతో శంసనము చేయుటయా యని యాలోచించి, హృదయమున నిశ్చయించి, యట్టి మంత్రములతో శంసనము చేసిరి అని యర్థము. 'హృదయే సంకల్పితైః మంత్రైః స్తువన్తీ త్యర్థః' అని శ్రీ స్కందస్వామియు వ్యాఖ్యానించెను. శ్రీ సాయణుల యభిప్రాయము గూడ నిదియే యని గ్రహింప నగును. వేదమంత్రములు పురుషబుద్ధి కల్పితములు కావని గదా సాయణుల హృదయము. వేదములం దెడనెడ నిట్టి ప్రయోగములు గలవు. ఉదా;— 'హృదా తష్టేషు మనసో జవేషు' (ఋ. 10-71-8) 'హృదా బుద్ధిమతాం హృదయేన తష్టేషు నిశ్చితేషు పరికల్పితేషు' — అని సాయణుల భాష్యము. కాన పై మంత్రమున గూడ హృదయమున వివేచించి నిశ్చితములైన మంత్రములతో దేవతలు శంసనము చేసి రనియే సాయణుల తాత్పర్యముగా గ్రహించుట యుక్తము.

కాని యిట్టి ప్రయోగముల నాధారము చేసికొని చారిత్రికులు వేదములు పురుషబుద్ధి కల్పితము లని నిరూపించి చరిత్ర కల్పించుటకై పాటుబడిరి. పోనీ, వారి వాదము నంగీకరింత మన్నను పై మంత్రము ననుసరించి మంత్రముములు దేవకర్తృకము లని యనవలసి వచ్చుచున్నది గదా! అట్లు చెప్పుచో 'మంత్రము లార్యు లనెడివారి రచనలు' — అను వారి యూహ పొసగదు.

మఱియు పూర్వమంత్రమున ఋషులును, దేవతలును తపస్సు చేసి శ్రమించి మంత్రముల నన్వేషించినట్లు గలదు, ఇట, గుహ యందు (ఆకాశమునందు లేక హృదయాకాశమునందు) అంతర్నిహితుడై యున్న యగ్నిని దేవతలు మంత్రములతో సాక్షాత్కరించుకొనినట్లు గలదు. ఇట్లు దేవతలు మంత్రములతో శంసనము జేయుట పెక్కు మంత్రములందు గలదు. మంత్రములు మానవరచితము లని చెప్పినచో నట్టి మంత్రములతో దేవతలు శంసనము జేసి రనుట సంగత మగునా?

అగ్ని హవిస్సులతో నదృశ్యుడగుట, దేవతలు మంత్రములతో నగ్నిని స్తుతించి సాక్షాత్కరించుకొనుట — అను నీ యితిహాసము, ఇట్టివే పెక్కులును మహాభారతాది ఇతిహాసములందు తత్త్వార్థోద్దీపకములుగ ప్రసంచింపబడినవి. (చూ. భార. వనపర్వ. అగ్నివంశోపాఖ్యానము) కాన, నీ మంత్రములు అసంబద్ధార్థము లనుట సంప్రదాయాభిమతము కాదు. ఇవి తత్త్వోద్దీపకము లనుట సంప్రదాయము. మంత్రములకు సంప్రదాయానుగుణ ముగ తాత్పర్యము దెలియుట యుక్తము. సంప్రదాయ మెఱిగి, మంత్రకృత్ పదమునకు మంత్రద్రష్ట యని అర్థము జెప్పుటయే తగును. ఇట్లు చెప్పి నపుడే వేదవాణికి, తపోజా, స్వయంభు, అదస్తా, వైశ్వదేవీ, దేవజుష్టా — ఇత్యాది విశేషణములు సార్థకములై యుపపన్నము లగును.

తపోజయై, ఋషులయందు నిహితయై యుండిన యీ వేదవాక్కు లోకమున నెట్లు వ్యాప్తమైనదియు నీ క్రింది ఋక్కు వివరించుచున్నది.

"యజ్ఞేన వాచః పదవీయ మాయన్ । తా మన్వవిందన్
ఋషిషు ప్రవిష్టామ్ । తా మాభృత్యా వ్యదధుః పురుత్రా।
తాం సప్త రేభా అభి సం నవన్తే॥" —ఋ. 10-71-3.

యజ్ఞేన వాచః పదవీయ మాయన్ :-

'ధీరులు యజ్ఞము చేతనే వేదవాక్కు యొక్క మార్గమును అనుగమించిరి'. అని మంత్రమునందలి మొదటి వాక్యము యొక్క యర్థము.

ఏ వాక్కు యొక్క మార్గము ? ఈ వాక్కు స్వకపోల కల్పితమా? లేక ఇతరకల్పితమా ? రెండును కాదని మంత్రమునందలి రెండవ వాక్యమిట్లు చెప్పుచున్నది.

తా మన్వవిందన్ ఋషిషు ప్రవిష్టామ్ :-

ఋషులయందు ప్రవిష్టమై నిహితమైయున్న యజ్ఞనిష్పాదిక యగు ఆ వాక్కును బొందిరి—అని యర్థము.

తా మాభృత్యా వ్యదధుః పురుత్రా :-

ఋషుల నుండి యా వాక్కును గ్రహించి అధ్యాపనము, యజ్ఞము మున్నగువాని ద్వారా పలు విధములుగ పలుచోట్ల వ్యాపింపజేసిరి.

తాం సప్తరేభా అభి సం నవన్తే :-

అట్టి యీవాక్కును సప్తచ్ఛందస్సులు అనుగమించుచున్నవి.

—చూ. సా. భా. ఉద్గీథ. భా.

ఈ మంత్రము బరిశీలించినచో ఋషులచే దర్శింపబడిన ఛందోమయియగు వేదవాక్కు యాజ్ఞికులచే యజ్ఞాదికర్మలయందు క్రమముగ

ప్రవర్తితమై సర్వత్ర వ్యాప్తమైనట్లు దెలియును. శ్రీశంకరభగవత్పాదులును దేవతాధికరణమున నీ మంత్రమునే యుదహరించి ''ఇతి స్థితామేవ వాచ మనువిన్నాం దర్శయతి" అని యనుచు నిందుకు వేదవ్యాస వచనమును గూడ నిట్లు జూపిరి.

'' యుగాంతేఽంతర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః।
లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతాః స్వయంభువా॥"

పై ప్రమాణముల ననుసరించి పరమేశ్వరానుజాతులై తపఃసమాధిలో వేద మంత్రముల దర్శించినవారును, పరంపరాగతములైన యా మంత్రములతో యజ్ఞాదికర్మల నొనర్చుచు క్రియావంతులై శ్రోత్రియులై క్రమముగ నంతర్ముఖులై పరమార్థమును దర్శించువారును ఋషు లగుదురనియు, నిట్లు పరంపరాప్రాప్త మగుటచే వేదవాక్కు 'అనాదినిధన' యగుట యుక్తమే యనియు దెలియును. కావుననే, వేదము 'వాచా' విరూప ః నిత్యయా' (ఋ. 8-75-6) అని యొక ఋక్కుచే దన స్వరూపమును కీర్తించుకొనినది. ఉత్పత్తిరహిత మగుటచే నిత్యమగు వాక్కు యని యర్థము.

కాన మంత్రకృత్, ఋషికృత్ పదములకు మంత్ర రచయిత యనెడి యర్థము సంగతము కాదు; మంత్రములను దర్శించి ప్రవర్తింపజేసిన యాధికారిక పురుషుడు-అని యర్థము గ్రహించుటయే యుక్తము. ఈ విషయము నింకను జూతము.

దేవతలు - ఋషిత్వము :-

పూర్వ ముదహరించిన ప్రమాణముల ననుసరించి దేవతలును శ్రమించి తపస్సు చేసి, మంత్రముల దర్శించినట్లు తెలియుచున్నది. మఱియు 'దేవతలు స్వయంప్రతిభాత వేదులు; జగద్యాత్రా నిర్వహణము నకై ప్రతి కల్పము నందును పరమేశ్వరుని చే నియుక్తులై, తమ తమ

పదము లందుండి తమ తమ యధికారముల నిర్వర్తించు ఆధికారిక పురుషులు; అణిమాదిసిద్ధి సంపన్నులు: కాన దేవతా నామములయి గన్పట్టు అగ్ని-ఇంద్రాది శబ్దములును, అట్లే మంత్రకర్తృబోధకములుగ గన్పట్టు వసిష్ఠ విశ్వామిత్రాది నామములును ఆధికారికపురుష వాచకములే (names denoting offices) కాని, వ్యక్తుల నామములు గావు'—అని సంప్రదాయానుగతమైన ప్రసిద్ధి. (చూ. దేవతాధికరణము; శ్రీ శంకరభగవత్పాద—భగవద్రామానుజాది భాష్యములు).

దేవతలు ఆధికారికపురుషులు, స్వయంప్రతిభాతవేదులు—అని యనుటచే జగద్యాత్రానిర్వహణకర్తవ్యమున వీరికి తమ తమ విధుల బోధించెడి యనాదిసిద్ధమైన చట్టము లేక శాస్త్రము వేదమే యగును. కాన, వేదముల దర్శించుటచేతను, తదనుగుణముగ నతీంద్రియ సృష్టికార్యనిర్వహణవిధుల దర్శించుటచేతను వీరు ఋషి శబ్దవాచ్యు లగుచున్నారు. శ్రుతి దేవతలను గూడ ఋషులు అని కీర్తించినది.

అగ్నిః ఋషిః

'అగ్నిర్ ఋషిః పవమానః పాంచజన్యః పురోహితః'

— ఋ. 9-66-20; తై. ఆ. 2-5-2.; వా. సం. 26-9 ఇత్యాది.

ఇంద్రః ఋషిః

'ఇంద్రో బ్రహ్మేంద్ర ఋషి రింద్రః పురూ పురుహూతః'

— ఋ. 8-16-7. ఇత్యాది

ఆదిత్యః ఋషిః

'ఋషి ర్హ దీర్ఘశ్రుత్తమః'

— తై. సం 1-6-12-2; మై. సం. 4-12-2; తై. ఆ 1-8-8

సోమః ఋషిః

'సోమో మీఢ్వాన్ పవతే గాతువిత్తమ ఋషి ర్విప్రో విచక్షణః'

— ఋ. 9-107-7. ఇత్యాది.

ఇట్లు త్రిస్థానదేవతలే కాక సర్వదేవతాత్మకుడు, సమష్టిలింగశరీరాభిమాని, సూత్రాత్మయు నగు హిరణ్యగర్భుడును ఋషి యనియు మహర్షి యనియు శ్రుతులయందు కీర్తింపబడినాడు.

"యో దేవానాం ప్రథమం పురస్తాత్ విశ్వాధికో రుద్రో
మహర్షిః । హిరణ్య గర్భం పశ్యత జాయమానం"

— తై.ఆ.10-10-3.

"రుద్రః రుత్ వైదికః శబ్దః, తం ద్రవతి ప్రాప్నోతి,
వేదప్రతిపాద్య ఇత్యర్థః; మహర్షిః ఋషీణాం అతీంద్రియార్థ
ద్రష్టౄణాం మధ్యే మహాన్ యః సర్వజ్ఞః సర్వవిత్ ఇత్యాది
శ్రుతిప్రతిపాద్య ఇత్యర్థః" — సా. భా.

రుద్రు డనగా వేదప్రతిపాద్యుడు; మహర్షి యనగా అతీంద్రియార్థద్రష్టలలో గొప్పవాడు — అని యర్థము. హిరణ్యగర్భుడు సమష్టిప్రాణరూపుడు; ప్రాణశబ్దముచే శ్రుతులయందు కీర్తింపబడినాడు.

"ఋషయ స్త్వా ప్రథమజాః దేవేషు" — వా, సం, 15-10.

"ప్రాణా వా ఋషయః ప్రథమజాః" — శ, బ్రా, 8-6-1-5.

'అస ద్వా ఇద మగ్ర ఆసీత్ । తదాహుః । కిం త దస
దాసీ దితి । ఋషయో వావ తేఽగ్రేఽసదాసీత్ ।
తదాహుః కే తే ఋషయ ఇతి। ప్రాణా వా ఋషయః । తే
య త్పురాఽఽస్మాత్ సర్వస్మా దిద మిచ్ఛన్తః శ్రమేణ
తపసా రిషన్ — తస్మా దృషయః' — శ. బ్రా, 6-1-1-1.

"సృష్టికి బూర్వమున నుండు ఋషులు ప్రాణములు. స్వనిష్పాద్యము, స్వాశ్రయము నగు ఈ జగత్తుయొక్క సృష్టిని గూర్చి తపస్సు నాచరించి తెలిసికొనినవి. అందుచే వానికి 'ఋషి' యని యన్వర్థనామము' - అని శ్రుతితాత్పర్యము. ఆధ్యాత్మికముగ వాగాది సప్తేన్ద్రియములకు సప్తప్రాణము లని పేరు. వానిని సప్తర్షులని శ్రుతి పేర్కొనినది.

'సప్తఋషయః ప్రతిహితాః శరీరే' — వా. సం. 34-55.

వేదములు ఆద్యఋషులు :-

పైన జూపిన శ్రుతివాక్యముల ననుసరించి హిరణ్యగర్భతత్త్వాత్మకములై, సృష్టికి బూర్వమున నున్న ప్రాణములు అద్యఋషులు అని తెలియును. హిరణ్యగర్భుడును (ప్రజాపతి) పూర్వసిద్ధములయి యున్న వేదవాక్యములను సృష్టికి బూర్వము పరమేశ్వరానుగ్రహముచే స్మరించి శ్రుతిప్రకాశితమైన యా సృష్టిని గూర్చి యాలోచన జేసెనని శ్రుతి వర్ణించినది.

"స మనసా వాచం మిథునం సమభవత్" —బృ. ఉ 1-2-4.

'స మనసా త్రయీ మాలోచితవాన్; త్రయీవిహితం
సృష్టిక్రమం మనసాఽన్వాలోచయ దిత్యర్థః' —శం. భా.

ఆ ప్రజాపతి మనస్సుతో శ్రుతిప్రకాశితమైన సృష్టిని గూర్చి యాలోచించెనని యర్థము. అట్లాలోచించుటలోని సామంజస్యమును గూర్చియు శ్రీశంకరభగవత్పాదు లిట్లు వివరించిరి.

"అపి చ, చికీర్షిత మర్థ మనుతిష్ఠన్ తస్య వాచకం శబ్దం పూర్వం స్మృత్వా పశ్చాత్ తమర్థ మనుతిష్ఠతీతి సర్వేషాం నః ప్రత్యక్ష

మేతత్। తథా ప్రజాపతే రపి స్రష్టుః సృష్టేః పూర్వం వైదికాః శబ్దాః మనసి ప్రాదుర్బభూవుః। పశ్చా త్తదనుగతా నర్థాన్ ససర్జేతి గమ్యతే। తథాచ శ్రుతిః—"స భూ రితి వ్యాహరన్ స భూమి మసృజత" (తై. బ్రా. 2-2-4-2) ఇత్యేవ మాదికా భూరాదిశబ్దేభ్య ఏవ మనసి ప్రాదుర్భూతేభ్యో భూరాదిలోకాన్ సృష్టాన్ దర్శయతి।"

— బ్ర, సూ. దేవతాధికరణమ్ — శం. భా.

లోకమున దాము తలపెట్టిన యర్థమును సిద్ధింప జేసికొనువారుకూడ మొదట తద్వాచకశబ్దములను స్మరించి పిదప నా యర్థము ననుష్ఠించుట ప్రత్యక్షసిద్ధమైన విషయము. అట్లే సృష్టికర్త యగు ప్రజాపతియు జగత్తును సృష్టింప గోరి తద్వాచకములగు పూర్వసిద్ధ వేదశబ్దములను మొదట స్మరించి పిదప తదనుగుణముగ సృష్టి గావించె నని తెలియును. శ్రుతిసిద్ధములైన భూః — ఇత్యాది శబ్దములను మనస్సున స్మరించి యా శబ్దముల నుచ్చరించుచు భూరాది లోకముల బ్రజాపతి సృష్టించినట్లు తైత్తిరీయ బ్రాహ్మణశ్రుతియు జెప్పుచున్నది.—అని యర్థము.

భగవద్రామానుజు లిట్లే యీ విషయమును వివరించిరి.

"అత ఏవ చ నిత్యత్వం॥ యత ఏవేంద్రవసిష్ఠాది శబ్దానాం దేవర్షివాచినాం తత్తదాకారవాచిత్వం — తత్తచ్ఛబ్దేన తత్తదర్థ స్మృతి పూర్వికా చ తత్తదర్థసృష్టిః".... ....

"అతః ప్రభవాత్॥ .... శ్రుతి స్తావత్ — వేదేన రూపే వ్యాకరోత్ సతాసతీ ప్రజాపతి రితి — తథా స భూరితి వ్యాహరన్ స భూమి మసృజత .... ఇత్యాది వాచకశబ్దపూర్వకం తత్త

"ఆద్యానాం వేదప్రసిద్ధానాం; లౌకికానాం ఇత్యతో వ్యతిరేక
నిర్దేశాత్; లోకా దన్యస్య వేదస్యైవ ఋటి త్యుపస్థితేః"

లౌకికభిన్నములు వైదికము లగుట శాస్త్రసంప్రదాయము. పతంజలి మహర్షియు మహాభాష్యము నుపక్రమించుచు మొదట—

'అథ శబ్దానుశాసనమ్। కేషాం శబ్దానాం? లౌకికానాం వైదికానాం చ' అని లౌకిక శబ్ద భిన్నములు వైదిక శబ్దములు అనెడి యనాది సంప్రదాయమునే వివరించినాడు. కాన పై శ్లోకమున నుదహరింపబడిన లౌకికఋషిభిన్నులగు ఆద్యఋషులు వేదప్రసిద్ధ ఋషులని చెప్పుట యుక్తమే. ఇట జెప్పబడిన వేదప్రసిద్ధులగు ఆద్యఋషు లెవరు? వసిష్ఠాదులను గ్రహించుద మన్న వారు వేదప్రసిద్ధులు గావచ్చును; కాని లౌకికులు (లోకేభవాః)కూడ. వారు జగద్యాత్రా నిర్వహణమునకై యీశ్వరానుజ్ఞాతులై యవతరించెడి యాధికారిక పురుషులు. శ్లోకమున బేర్కొనబడిన ఆద్యఋషులు లౌకిక భిన్నులు గదా! కనుక వ్యాఖ్యాతలు చెప్పిన వేదప్రసిద్ధఋషులు వేద మాత్ర ప్రసిద్ధములగు వేదమంత్రము లని చెప్పుట యుక్తతరము. అట్లు గ్రహించిననాడే 'స భూ రితి వ్యాహరన్ స భూమి మసృజత' ఇత్యాది పూర్వోక్త శ్రుతివాక్యార్థముతో నవిరోధము సిద్ధించి సరస సమన్వయము పొసగును.

మఱియు నీ కవి 'లౌకికానాం అర్థం వా గనువర్తతే' అనిమాత్రమే యనక 'సాధూనాం' అను పదమును గూడ జేర్చినాడు. ఇట వ్యాఖ్యాతలు లౌకికసాధువుల గూర్చి యిట్లు వివరించిరి.

'హి యస్మాత్, లోకే ఆప్తత్వేన ప్రసిద్ధాః లౌకికాః, తేషాం
భ్రమప్రమాదరహితానా మిత్యర్థః। సాధూనాం పరోపకార
రతానాం విప్రలిప్సారహితానా మిత్యర్థః। వాక్ ఉక్తిః,

అర్థం అభిధేయం, అనువర్తతే తదధీనా భవతి। తే హి
భ్రమ ప్రమాద విప్రలిప్సా ద్యభావాత్ యథావస్థిత
మర్థం వదన్తీతి భావః। భూతార్థవాదిన ఇతి హృదయమ్।"

లౌకికులగు సాధువులు భ్రమప్రమాదాది దోషరహితులైన భూతార్థవాదులని యర్థము. వైదికసంప్రదాయ ప్రవర్తకులగు ఆపస్తంబాదులును లౌకిక శబ్దము నీ యర్థమునందే ప్రయోగించుటయు గమనార్హము.

"లౌకికానాం పాకయజ్ఞశబ్దః"—ఆప. గృ. సూ. 1-2-9.

"లోకేభవా లౌకికాః లోకస్మృతిలక్షణా ఇత్యర్థః।
లోకశబ్దేన శిష్టా ఉచ్యన్తే।" —హరదత్తః.

"లోకయన్తి వేదై ర్వేదార్థా నితి లోకాః త్రైవిద్య
వృద్ధాః శిష్టాః ద్విజన్మానః" —సుదర్శనాచార్యః.

కాన 'లౌకిక-సాధు' శబ్దములకు వ్యాఖ్యాతలు చెప్పిన యర్థము గ్రహించుట యుక్తమే. అట్టివారు త్రైవిద్యవృద్ధులు, మంత్రద్రష్టలు, స్మృతికర్తలు నగు వసిష్ఠాదులే యగుదురు. వారు పరోపకార వ్రతు లగుచు భూతార్థరూప మగు శ్రుత్యర్థమును స్మరించి తదనుగుణముగ స్మృతుల వెలయింపజేసిరి. అందుచే "సాధువు లయిన వసిష్ఠాది స్మృతికర్తలయొక్క వాక్కు భూతార్థ శ్రుత్యర్థము ననుసరించుచున్నది"—యని చెప్పుట సమంజసముగా నున్నది.

వసిష్ఠాదులే కాదు; శ్రుత్యర్థమును స్మరించి తదనుగుణముగ ధర్మములను మొట్టమొదట స్మృతిరూపమున వెలయించినవాడు బ్రహ్మ యనియు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముప్పురును శ్రుతి - స్మృతి సమాచారనిర్ణేతలనియు, వేదమునకు కర్త లేడనియు, పితామహుని వలన ధర్మముల

గ్రహించి మన్వాదులు స్మృతుల బ్రవర్తింపజేసినా రనియు, మను-పరాశర స్మృతుల వలనను, తద్వ్యాఖ్యానములవలనను దెలియుచున్నది.[1]

'శ్రుతే రివార్థం స్మృతి రన్వగచ్ఛత్' - అని చెప్పుచు మహాకవి కాళిదాసు కూడ నీ విషయమునే ధ్వనింప జేసినాడు.

కాన పై భవభూతి మహాకవి శ్లోకమున బేర్కొనబడిన ఆద్య ఋషులు వేదమంత్రములు; లౌకికులగు సాధువులు వసిష్ఠాది స్మృతికర్తలు- అని గ్రహించుట యుక్తము. ఇట 'ఋషి' శబ్దము వేదవాచక మనుట వ్యాఖ్యాత్రభిమతము మాత్రమే గాదు; భవభూతి సమ్మతము గూడ ననియు దెలియ వలసి యున్నది. ఈ విషయ మీ క్రింది శ్లోకము వలన స్పష్ట మగును.

"ఋషయో రాక్షసీ మాహు ర్వాచ మున్మత్త దృప్తయోః।
సా యోనిః సర్వవైరాణాం సా హి లోకస్య నిర్‌ృతిః॥"

---

1. "కల్పే కల్పే క్షయోత్పత్త్యా బ్రహ్మ విష్ణు మహేశ్వరాః।
శ్రుతి స్మృతి సదాచార నిర్ణేతార శ్చ సర్వదా॥
న కశ్చిత్ వేదకర్తా చ వేదం శ్రుత్వా చతుర్ముఖః।
తథైవ ధర్మాన్ స్మరతి మనుః కల్పాంతరేఽంతరే॥" పరా. స్మృతి. 1-20,21.
"చతుర్ముఖ స్తస్మిం స్తస్మిన్ మహాకల్పే పరమేశ్వరేణ దత్తం వేదం స్మృత్వా తత్ర విప్రకీర్ణాన్ వర్ణాశ్రమాది ధర్మాన్ సంకలయ్య స్మృతిం గ్రంథరూపేణోపనిబధ్నాతి। తథా చ పితామహ వచనాని తత్ర నిబంధనకారై రుదాహ్రియన్తే। చతుర్ముఖస్య స్మృతిశాస్త్ర కర్తృత్వం మనునా వ్యక్తమ్।
"ఇదం శాస్త్రం తు కృత్వాఽసౌ మా మేవ స్వయ మాదితః।
విధివ ద్గ్రాహయామాస మరీచ్యాదీ నహం మునీన్॥ ఇతి.
యథా చతుర్ముఖః తథైవ చ స్వాయంభువో మను స్తస్మిం స్తస్మి న్మన్వంతరే కల్పే వేదోక్తధర్మాన్ గ్రథ్నాతి" —మాధవీయవ్యాఖ్య.

ఋషులు ఉన్మత్తుని యొక్కయు, గరువపోతుయొక్కయు వాక్కు రాక్షసీ వాక్ అని చెప్పిరి. అదియే అన్నివైరములకు మూలము. అదియే లోకమునకు పరిభవ హేతువు' – అని యర్థము. ఇట కవి యుద్దేశించిన ఋషు లెవరు ? వేదములే యగును. వేదము లిట్లు చెప్పుచున్నవి.

''యోఽయం రాక్షసీం వాచం వదతి సః, ఇతి యాం వై
దృప్తో వదతి యా మున్మత్తః సా వై రాక్షసీ వాక్, ఇతి
నాఽఽత్మనా దృప్యతి నాఽస్య ప్రజాయాం దృప్త
ఆజాయతే య ఏవం వేద ఇతి।'' — ఐ. బ్రా. 21-7.

"పరహింసాకరము, ఉద్వేజకరము, ఉచ్చైఃస్వరముతో భీతికరము నగు వాక్కు నెవడు ఉచ్చరించునో అతడు రాక్షసవాక్కు నుచ్చరించిన వా డగుచున్నాడు; గరువపోతు గాని ఉన్మత్తుడుగాని యుచ్చరించు వాక్కు రాక్షసవాక్కు అగును; వాక్స్వరూపము నిట్లు తెలిసికొని యెవడు గర్వింపడో యతని సంతతి యందెవడును గరువపోతు పుట్టడు'' – అని శ్రుత్యర్థము.

ఈ ఐతరేయశ్రుతి వాక్యములను గమనించుచో పై భవభూతి మహాకవి శ్లోకము ఈ శ్రుతివాక్యములకు ప్రతిబింబమూనమే యగుట స్పష్టము. భూతార్థమగు నీ శ్రుత్యర్థమును స్మరించి యా యర్థమును యథాతథముగ శ్లోకరూపమున నీ కవి యనువదించినాడు. వ్యాసవాల్మీకాది మహాకవులు పోయిన వాగ్ద్వారముననే పోయి, భూతార్థముల నిట్లు వర్ణించి ప్రదర్శించినాడు. కాన నిట రాక్షస వాక్స్వరూపము నుపదేశించిన ఋషులు శ్రుతులే యగుట భవభూత్యభిమతము.

అందుచే మొదటి శ్లోకమున నిర్దేశింపబడిన లౌకికభిన్నులగు ఆద్యఋషులు వేదమంత్రములు – అని చెప్పుట యందే కవిసంరంభ

విశ్రాన్తి. వేదములయొక్క ఋషిత్వమును మాత్రమే కాక, ఆద్యత్వమును (అనాదిత్వమును) గూడ వెల్లడించుటకై యీ శ్లోకము ప్రవృత్తమైనది.

ప్ర థ మ జా :-

ఇట్లు అనాది యగుటచే ప్రథమజ యనియు వేదవాణికి సార్థక నామము.

"పరీత్య భూతాని పరీత్య లోకాన్ పరీత్య సర్వాః ప్రదిశో దిశశ్చ।
ఉపస్థాయ ప్రథమజా మృతస్యా త్మనాత్మాన
మభి సంవివేశ ॥" వా. సం. 32.11

'ఇదానీం సర్వభూతే ష్వహ మస్మి, సర్వాణి మయి భూతానీతి జ్ఞానవతః సర్వమేధయాజినః ముక్తి రుచ్యతే.... బ్రహ్మజ్ఞానవతః యజమాన స్యాగ్నిహోత్రాదయో౽పి యజ్ఞాః సర్వమేధా ఏవే త్యాహ పరీత్య భూతానీతి కండికాభ్యామ్। ఏవం జ్ఞానవాన్ సర్వమేధయాజీ ఆత్మనా జీవరూపేణ ఋతస్య యజ్ఞస్యాత్మానం యజ్ఞాధిష్ఠితారం పరమాత్మాన మభిసంవివేశ ప్రవిశతి। బ్రహ్మైవ భవతీ త్యర్థః। కిం కృత్వా। భూతాని పరీత్య సర్వభూతాని బ్రహ్మ త్వేన విజ్ఞాయ, లోకాన్ భూరాదీన్ పరీత్య బ్రహ్మరూపాన్ జ్ఞాత్వా, సర్వాః ప్రదిశః విదిశః దిశశ్చ పరీత్య తద్రూపా జ్ఞాత్వా, ప్రథమజాం ప్రథమోత్పన్నాం త్రయీరూపాం వాచ ముపస్థాయ సంసేవ్య యజ్ఞాదికృత్వేత్యర్థః। "అపి హి తస్మాత్ పురుషాత్ బ్రహ్మైవ పూర్వమసృజ్యత" ఇతి శ్రుతేః ప్రథమజా వాక్ వేదరూపా. — మహీ-భా. (చూ. ఉవట. భా).

ఈ మంత్రమున త్రయీరూప మగు వేదవాక్కు ప్రథమజా యని కీర్తింపబడినది. సర్వమేధయాజి యగు యజమానుడు త్రయీరూప మగు నీ వాక్కును సంసేవించి యజ్ఞాధిష్ఠాత యగు పరమాత్మతో నేకీభావము జెంది బ్రహ్మభావాపన్ను డగుచు సర్వము బ్రహ్మరూపమున దర్శించుట యిందు బ్రతిపాదింపబడినది. ఇట 'ఉపస్థాయ ప్రథమజాం' అని యనుటచే ప్రథమజ యగు నీ వాక్కును సేవించుట వలననే బ్రహ్మవిద్య సిద్ధించు నని చెప్పబడినది. అనగా ఈ వేదవాక్కును సేవింపనియెడల బ్రహ్మవిద్య సిద్ధింపదని తాత్పర్యము.

ఈ వాక్కు ప్రథమజ యగుట ఋగ్వేదము నందును దర్శింప నగును.

"స పూర్వయా నివిదా కవ్యతాయోః" — ఋ. 1-96-2.

'అగ్నిః, పూర్వయా ప్రథమయా, నివిదా కవ్యతా గుణినిష్ఠ
గుణాభిధానరూప లక్షణాం స్తుతిం కుర్వతా స్తూయమానః'
— సా. భా.

కనుక 'ప్రథమజా, పూర్వజా' అను పదములు ఈ వేదవాక్కు యొక్క అనాదిత్వమును చాటుచున్నవి. అందుచేతనే వాల్మీకి మహర్షియు నీ వాక్కును 'అగ్ర్యా వాక్' అని కీర్తించినాడు, అనగా అగ్రజ యగు వాక్కు.

"స బద్ధో వాగ్భి రగ్ర్యాభి రభితుష్టావ వై సురౌ ।
ఇంద్ర మింద్రానుజం చైవ యథావ న్మునిపుత్రకః ॥"
— రామా. 1-62-25.

యూపబద్ధుడైన శునశ్శేపుడు వేదమంత్రములతో దేవతల స్తుతించె నని యర్థము.

వేదవాక్కునకు వలెనే హిరణ్యగర్భునకు గూడ ప్రథమజాః అని పేరు. హిరణ్యగర్భుడు 'ప్రథమశరీరి' యని శాస్త్రసంప్రదాయము. పరమేశ్వర నియోగముచే సృష్టికార్య నిర్వహణమునకై సృష్టికి పూర్వము శరీర ధారణము చేసిన ప్రథమజీవి యగు ఈశ్వరుడు హిరణ్యగర్భుడు. ఇట్లు ప్రథమోత్పన్ను డగుటచే ప్రథమజాః అని శ్రుతులయందు కీర్తింపబడినాడు.

"హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతి రేక ఆసీత్ ।"
— ఋ. 10-121-1; తై. సం. 4-1-8-3; వా.సం. 13-4.

'బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ విశ్వస్య కర్తా భువనస్య గోప్తా'। — ముం. ఉ. 1-1

'స వై శరీరీ ప్రథమః స వై పురుష ఉచ్యతే ! ఆదికర్తా స భూతానాం బ్రహ్మాగ్రే సమవర్తత' — శం. భా. బ్ర. సూ, 1-2-23.

ఇట్లు వేదవాక్కునకు, హిరణ్యగర్భునకు నిరువురకును ప్రథమజా అను పేరు వేదమున గన్పటుటచే నిందు ప్రాథమ్య మెవరికి? – అను ప్రశ్న యుదయింపవచ్చును. 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాం శ్చ ప్రహిణోతి తస్మై' – ఇత్యాది ప్రమాణముల ననుసరించి హిరణ్యగర్భుడు తనకంటె పూర్వసిద్ధమగు నీ వేదవాక్కును ఈశ్వరానుగ్రహముచే బడసి, శ్రుత్యర్థమును స్మరించుచు సృష్టివిషయక పర్యాలోచన జేసినట్లు పూర్వము వివరింపబడినది. కనుక హిరణ్యగర్భునికంటెను నీ వేదవాక్కునకు ప్రాథమ్య ముండుటచే ప్రథమజ యైనది. మఱియు నిది ప్రజాపతి యొక్క సృష్టికి ఆలంబన మగుచు ప్రప్రథమమున ఆయన ముఖమున నుండి 'స భూ రితి వ్యాహరన్' – ఇత్యాది పూర్వోక్త శ్రుత్యుక్త ప్రకారము ఆవిర్భవించి యుండుటచేతను

ప్రథమజయై యొప్పినది. ప్రథమజ యన 'అనాది సిద్ధమైన వాక్కై తొలుత ఈశ్వర-హిరణ్య గర్భ ముఖముల నుండి వినిఃసృతమై యావిర్భ వించినది' - అని యర్థము.

ఆర్షేయం ధనమ్ :

ఆద్యఋషు లగుటచే వేదములకు ప్రథమజా యను నామము సార్థక మయినట్లు తెలిసికొంటిమి. కాన ఋషిపదము వేదమునందును రూఢము. అందుచేతనే లౌకిక భిన్నములగు వేదశబ్దప్రయోగములకు ఆర్ష ప్రయోగము లను ప్రసిద్ధియు వచ్చినది. పిదప తదనుగతములై వర్తిల్లిన పురాణేతి హాసాదుల యందలి ప్రయోగములకు గూడ ఆర్షప్రయోగ మను వ్యవహారము గలిగినది. మఱియు ఋషి యగు వేదముచే ప్రవర్తితమై పరంపరాగతమైన భారతీయసంస్కృతియు ఆర్షసంస్కృతి యని ప్రసిద్ధ మైనది.

"ఆర్షం ధర్మోపదేశం చ వేద శాస్త్రావిరోధినా।
య స్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః ॥"

— మను 12-106.

ఋషిదృష్టత్వాత్ ఆర్షం వేదం, ధర్మోపదేశం చ తన్మూల స్మృత్యాదికం, య స్తదవిరుద్ధేన మీమాంసాదిన్యాయేన విచారయతి స ధర్మం జానాతి, న తు మీమాంసాఽనభిజ్ఞః

— కుల్లూక వ్యాఖ్య.

ఋషిదృష్ట మగుటచే వేదము ఆర్షము. ఆర్షమగు వేదమును, తన్మూల మగు స్మృత్యాదికమును, వేదశాస్త్రావిరుద్ధమగు మీమాంసాది న్యాయముచే పరిశీలనము సేయువాడే ధర్మజ్ఞుడు. మీమాంసాదులతో పరిచయము లేనివాడు ధర్మజ్ఞుడు కాడు - అని యర్థము.

వేదము ఋషి యగుటయే గాక, ఋషిదృష్ట మగుటచే 'ఆర్షము' అనియు ప్రసిద్ధమగుట పై స్మృతి వలన దెలియుచున్నది. ఋషిదృష్టమై పరంపరాప్రాప్తమైన యీ వేదమంత్రజాతము 'ఆర్షేయ ధనము' అని ఋగ్వేదశ్రుతియు స్వయముగ నిట్లు వివరించుచున్నది.

"అభీ నో అర్ష దివ్యా వసూ న్యభి విశ్వా పార్థివా
పూయమానః । అభి యేన ద్రవిణమశ్నవా
మాఽర్ష్యార్షేయం జమదగ్నివ న్నః॥"

— ఋ. 9-97-51; సామ 2-778.

ఈ మంత్రమున మొదట 'దివ్యములు - పార్థివములు' నగు సంపదల గురియు మని (నః అభ్యర్ష) సోముడు అర్థింపబడినాడు. ఈ సంపదలు రెండును యజ్ఞాధీనము లని తాత్పర్యము. పిదప నట్టి యజ్ఞమును ప్రవర్తింప జేసెడి ఆర్షేయధన మగు (ఆర్షేయం ద్రవిణం) మంత్రజాతమును వీర్యవత్తరము గావింపు మని సోము డర్థింపబడినాడు.

అనగా - ఈశ్వరానుగ్రహముచే ఆర్షేయధన మగు మంత్రరాశిని వీర్యవత్తరము గావించుకొనుచు యజ్ఞాదికర్మల బ్రవర్తింపజేసి తత్ప్రభావితములయిన దివ్య-పార్థివ సంపదలు రెంటితో దులదూగుచు సుఖింపు డని శ్రుతి యుపదేశముగా గ్రహింప నగును.

'ఋషి ర్దర్శనాత్'— ఈ దర్శన మెట్టిది?

పై గ్రంథసందర్భమును బరిశీలించుచో - ఋషి శబ్దము మొదట సర్వద్రష్ట యగు పరమేశ్వరుని, పిదప ద్రష్టలగుట చేతనే హిరణ్యగర్భాది దేవతలను, మంత్రద్రష్టలగు వసిష్ఠాదులను బోధించు నని చెప్పి, అతీంద్రియ దేవర్షిస్వరూపమును, ధర్మ మోక్ష స్వరూపమును దర్శింప

జేయునది యగుటచే సర్వజ్ఞకల్పమగు తనను గూడ ఋషి యని వేదము వ్యవహరించు కొనినట్లు తెలియును. ఇంతేకాదు; ఈ మంత్రరాశిని సేవించి (ఉపస్థాయ ప్రథమజాం), యజ్ఞాదికర్మల నొనర్చుచు క్రియావంతులై, శ్రోత్రియులై, క్రమముగ బ్రహ్మనిష్ఠులయి ఏకర్షిబ్రహ్మభావము నొందెడి వారును ఋషు లగుటయు శ్రుతి వివరించినది.

కాన 'ఋషి ర్దర్శనాత్' అను నిర్వచనము ననుసరించి దర్శన మనగా :- (1) ఈశ్వర హిరణ్యగర్భాది విషయమున సర్వద్రష్టృత్వము లేక క్రాంతదర్శనము, (2) మంత్రద్రష్టల విషయమున అతీంద్రియమంత్ర దర్శనము, క్రాంతదర్శనము (3) బ్రహ్మనిష్ఠుని విషయమున బ్రహ్మాత్మ భావ దర్శనము (4) వేదశబ్దరాశి విషయమున అతీంద్రియ ధర్మ మోక్ష స్వరూప ప్రదర్శనము—అని యీ రీతిగ ఋషిశబ్దము యొక్క ప్రవృత్తి నిమిత్తమగు దర్శనము సర్వత్ర అనుగతమైనట్లు గ్రహింపనగునని శ్రుతి, స్మృతు లుపదేశించుట గాంచితిమి. ఇట నొక విశేషము. వేదశబ్దరాశి సృష్టికి సహకారికారణ మని చెప్పబడుటచే హిరణ్యగర్భాదుల ద్రష్టృత్వము వేద మూలము; వేదమునకు గల దర్శనము (ఋషిత్వము) అనన్యాపేక్ష మగుటచే స్వతంత్రము—అనియు స్పష్టమైనది.

ఋషిశబ్దము - చారిత్రికులు :-

విషయ మిట్లుండ చారిత్రికులు కొందఱు 'ఋషి' యనగా మంత్రములను రచించినవాడు—అని యర్థమును జెప్పుచున్నారు.

> " Ṛṣi, 'Seer' is primarily a composer of hymns to Gods ..."—A.A. Macdonell and A.B.Keith
>
> —Vedic Index.

> "Rishi or Seer means no more than the subject or the author of a hymn ... ... the concepts of these Gods and the hymns adressed to them sprang up spontaneously and without any pre-established plan.
> —Max Muller—What India can Teach us. PP. 148.

ఈ చారిత్రికులు ఋషి శబ్దమునకు 'Seer' అని యనువదించుచునే, 'మంత్రరచయిత' యని యర్థమును గల్పించుచున్నారు. వేదగత పదములకు వేద సంప్రదాయానుగుణముగ నర్థము జెప్పుట యుక్తము. 'ఋషి' యను పదమునకు 'ద్రష్ట' అను నర్థమే సంప్రదాయసిద్ధము; 'రచయిత' అను అర్థము కాదు. ఈ పదమునకు రచయిత యను నర్థము జెప్పుట యందు శ్రుతికి ప్రవృత్తియే లేదు. పరమేశ్వరుడు మొదలు హిరణ్యగర్భాది దేవతలు, వసిష్ఠాది మంత్రద్రష్టలు, వేదవాక్కు, బ్రహ్మనిష్ఠులు_ వీరందఱియందును ఋషిత్వము, అనగా దర్శనము, అనుగతమై యున్నట్లు పైన వివరింపబడినది. ఋషిశబ్దమునకు 'రచయిత' యనునది ముఖ్యార్థమని (Primarily) చారిత్రికు లభిప్రాయపడిరి. అట్లు గ్రహించుచో పరమేశ్వరుడు మొదలుగా గల ఋషులయందు అనుగతమైన ప్రవృత్తినిమిత్తము (ఋషిత్వము) ఎట్లు పొసగును? ప్రవృత్తినిమిత్తమును పాటింపక యేదియో యర్థమును కల్పించుట శ్రుతిసమ్మతము కాదు.' సంస్కృతభాషా స్వభావవిరుద్ధము.

మఱియు 'వేదమంత్రములయందు బాహ్యదర్శనమే కాని యంతర్దర్శనము లేదు; బాహ్యప్రకృతి దృశ్యములను జూచి సంభ్రమాశ్చర్య పరవశులై, నిర్దిష్టమగు నొక తాత్త్వికసంస్కారము లేకయే (without any pre-established plan) దేవతాదుల గూర్చి చేసిన స్తోత్రములే యీ మంత్రములు; ఇట్టి మంత్రరచయితలే ఋషులు.' – అని చారిత్రికుల యభిప్రాయము. సామాన్యముగ బాహ్యప్రకృతిదృశ్యములను, వివిధ

సంఘటనలను జూచి పరవశులయి, భావోద్రేకముతో గద్యపద్యముల గూర్చుట చూచుచునే యున్నాము. అట్టి రచయితయే 'ఋషి' యని చారిత్రికు లభిప్రాయ పడినట్లు తెలియుచున్నది. కాని శ్రుతి తాత్పర్య మది కాదు. ద్రష్టయే ఋషి; రచయిత కాదు. అతీంద్రియార్థదర్శనమే ఋషిశబ్దముచే వివక్షితమైనట్లు శ్రుతి స్మృత్యాది ప్రమాణములు నిరూపించు చున్నవి. అతీంద్రియార్థముల దర్శింప జేయుటకే తాను ప్రవృత్తమైనట్లు శ్రుతి తనకు గల 'ఋషి, తపోజాః, స్వయంభు, ప్రథమజా, వేదః' – ఇత్యాది నామములచే నభివ్యక్తము చేసికొనుచున్నది కూడ. కాన వేద మంత్రజాతము అంతర్దర్శనము ప్రబోధించి తత్త్వమును దర్శింపజేయుటయే లక్ష్యముగా గలది. కావుననే ఇది శాస్త్ర మయినది. శాస్త్ర మనుచో నది అజ్ఞాతజ్ఞాపకము కావలెను. ఈ విషయము వేదశబ్దమున వివరింపబడినది. కేవల లోకసిద్ధార్థములనే బోధించుటకు లేక వర్ణించుటకు నిది ప్రవృత్త మైనదని చెప్పుచో వేదమునకు గల వేద – ఋషి – శాస్త్రాది నామములు సార్థకములు కావు. నిరర్థకము లనుట శ్రుతి (శాస్త్ర) సమ్మతము కాదు.

మఱియు ఋషి పదమునకు మంత్రరచయిత యను నర్థము జెప్పుచో వేదమునకు గల ప్రథమజా యను నామము సార్థకము కాదు. వేదములు మానవరచితము లగునెడల వేదభాగమంతయు నొకేసారి యొకే కాలమున రచింపబడి యుండుటకు వీలులేదు. అట్లగుచో భిన్నభిన్న కాలములలో భిన్నభిన్న రచయితలచే రచితము లని చెప్పబడెడి భాగములలో నే భాగము నకు ప్రథమజా అనియు, ఆద్యాః ఋషయః – అనియు వ్యవహారము సిద్ధింపవలయును ? వేదములో గొంతభాగమునకు ఆద్యత్వము మఱికొంత భాగమునకు అనాద్యత్వము కల్పించుట శ్రుతిసమ్మతము కాదు. త్రయీ రూపమైన వేదవాక్కంతయు తపోజయై ప్రథమజయై, ఆద్యఋషియై విలసిల్లుటయే శ్రుతిస్మృత్యాది సిద్ధమైన సంప్రదాయము. కాన పరమేశ్వరు

అభియుక్తోక్తి. అనగా కావ్యనిర్మాణమునకు ఋషిత్వ మావశ్యక మని భావము. కాగా కావ్యము ఋషిత్వానుమాపకము. వ్యాసవాల్మీకాదులు ఆర్ష(వేద) చక్షుస్సుతోనే తమ తమ కావ్యముల వెలయింప జేసినట్లు వారి కావ్యములు చెప్పుచున్నవి.

వేదవిదులలో నగ్రగణ్యుడు, తపః స్వాధ్యాయ నిరతుడు, దేవర్షియు నగు నారదునియొక్క యుపదేశముచే, తపస్వియగు వాల్మీకి పరిశుద్ధాన్తః కరణుడై తమసాతీరమున కేగెను. అచట క్రౌంచద్వంద్వ వియోగదృశ్య జనిత శోకపరిప్లుత మానసుడైన వాల్మీకియొక్క ముఖమునుండి యప్రయత్నముగ ఛందోబద్ధ మగుచు వాక్కు వెలువడినది. అట్టి తన వాక్కును జూచి విస్మితుడై, తదేకధ్యానచిత్తుడయి యుండ చతుర్ముఖుడగు బ్రహ్మ సాక్షాత్కరించి 'నా ప్రేరణ చేతనే నీ ముఖమునుండి వాక్కు ఇట్లు వెలువడినది. నారదునివలన వినిన శ్రీరామచరితమును జెప్పుము. నా యనుగ్రహముచే యావద్వృత్తాంతము కనులకు గట్టగలదు. నీ వాక్కు అనృతము కాదు. అనగా నీ వాక్కు భూతార్థవాదిని యగును' అని చెప్పి యంతర్హితు డయ్యెను.

ఈ విషయమును మహాకవి భవభూతి యిట్లు వివరించినాడు.

"తేన ఖలు పునస్సమయేన తం భగవంత మావిర్భూత శబ్దబ్రహ్మ ప్రకాశ మృషి ముపగమ్య భగవాన్ భూత భావనః పద్మయోని రవోచత్, 'ఋషే! ప్రబుద్ధో వాగాత్మని, త ద్బ్రూహి రామచరితం, అవ్యాహతజ్యోతి రార్షం తే చక్షుః ప్రతిభాతి, ఆద్యః కవి రసీ త్యుక్త్వా తత్రై వాంతర్హితః। అథ భగవాన్ ప్రాచేతసః .... రామాయణ మృషిః ప్రణినాయ" – ఉత్తర రామచరితమ్ – 2 అంక.

ఇక మంత్రార్థమును జూతము. ఇది అగ్నిదేవతా స్తుతిపరమైన మంత్రము. ఇట స్తోతవ్యుడైన యగ్ని జగత్కారణభూతుడైన పరమేశ్వరు డని పూర్వము వేదశబ్దమున వివరింపబడినది. అట్టి మహాగ్ని మహాతపః సంపన్నులైన ఋషుల కెందఱకో పూర్వము (యుగయుగములనుండి) యారాధ్యు డయ్యెను. నూతనులగు ఋషులకు గూడ నారాధనీయుడు వా మహాగ్నియే. మహాత్ములగు ఋషులకే యారాధనీయు డగు నన్నచో నిక నన్యుల విషయము చెప్ప నేల ? ఏ కాలమున గాని నెవరికిగాని యారాధ నీయు డా యగ్నియే - యని యగ్నియొక్క మహానుభావత్వ మిట శ్రుతిచే కీర్తింపబడుచున్నది. కావుననే ఋగ్వేదము అగ్నిని 'యుగే యుగే విదథ్యమ్' (ఋ 6-8-5) - అనియు కీర్తించినది. (యుగే యుగే కాలే కాలే విదథ్యం విదథో యజ్ఞః తదర్హః తం - సా. భా). సర్వకాలము లందును యజ్ఞములచే నారాధనీయుడు - అని యర్థము. కాన అగ్ని (పరమేశ్వరుని) యొక్క సార్వకాలికమైన యారాధనమును ప్రశంసించుటకే పై మంత్రము ప్రవృత్తమైన దనుట స్పష్టము. ఇది సంప్రదాయానుగతమైన యర్థము. ఇంతలి ఋషి పదము 'అతీంద్రియార్థదర్శనము గల ఋషులు'- అను నర్థమున బ్రయుక్తముగాని 'రచయితలు' అను నర్థమున గాదు. ఆ పదమున కట్టి యర్థమున బ్రవృత్తియే లేదని పూర్వము నిరూపింపబడినది. భారతీయుల దృష్టిలో ఆర్షదృష్టి యిట్టిది. 'ఋషి ర్దర్శనాత్' - అను నిర్వ చనము ననుసరించి ఋషి యనగా ప్రకరణానుగుణముగ వేదము, పరమేశ్వరుడు, మంత్రద్రష్ట, అతీంద్రియార్థద్రష్ట - ఇత్యాద్యర్థముల గ్రహించెడి సంప్రదాయమే శ్రుతితాత్పర్యానుగుణము. మంత్రరచయిత యని కాదు.

బ్రహ్మ యను నామము గూడ వేదమునకు గల యనాది నిధనత్వమును నిరూపించునట్టిది. ఇక బ్రహ్మ శబ్దమును జూతము.

చారిత్రికులయొక్క— యీ వైదిక కోశవచనముల ననుసరించి బ్రహ్మ శబ్దమునకు వేద మనిగాని, ఈశ్వరుడు లేక పరతత్త్వ మనిగాని యర్థ మున్నటుల చెప్పబడనే లేదు. ఇక కొందఱు చారిత్రికులు బ్రహ్మ శబ్దమునకు స్తోత్రము, పరతత్త్వము—ఇత్యాద్యర్థములు గలవని యంగీకరించిరి. కాని, ఆ యర్థము విషయమున పలువురు పలు రీతుల చరిత్ర కల్పనలు గావించిరి. సంగ్రహముగ నా యా వాదముల స్వరూప మిది :—

"1. హాగ్ (Haug) పండితుని యభిప్రాయము :— బ్రహ్మ శబ్దము 'బృహ్' ధాతువు నుండి పుట్టినది. ఆ ధాతువునకు ఉబ్బుట, లేక పెరుగుట (To swell or to grow) — అని యర్థము. బ్రహ్మ శబ్దము మొదట పెంపుదల (Growth)కు కారణము లయిన స్తోత్రములను, పిదప భౌతికశక్తి (Force of nature)ని, బోధింప జొచ్చినది.

2. రూథ్ (Roth) పండితుని యభిప్రాయము :— బ్రహ్మ శబ్దము మొదట దేవతావిషయక మగు ఇచ్ఛాశక్తికిని (Force of will directed to the gods), తరువాత మంత్రమునకు (Sacred Formula)ను తుదకు పరతత్త్వమునకును వాచకమైనది.

3. ఓల్డెన్‌బర్గ్ (Oldenberg) పండితుని యభిప్రాయము :— వేద కాలమున లోక మంతయు నద్భుతశక్తుల (mysterious forces)తో ప్రజలకు సుఖదుఃఖముల గల్గించెడి దేవతల నారాధించెడి ప్రజలతో నిండి యుండెడిది. ఆ కాలమున మాంత్రికశక్తితో గోరినదెల్ల సమకూర్పగల వైద్యునకు విశేషప్రాధాన్య ముండెడిది. ఆ రోజులలో 'బ్రహ్మ' యనగా మాంత్రికశక్తి (Magic spell)—అని యర్థము. బ్రాహ్మణముల కాలమున బ్రహ్మ యనగా యజ్ఞమున నుపయోగించెడి మంత్రము అని యర్థము. బహుశః అద్భుతశక్తుల (magical effects) ప్రదర్శించుటకు మంత్రము

ఉపయోగింపబడి యుండును. బ్రహ్మశబ్దము క్రమముగ నీ యర్థము నుండి మరలి తుదకు జగత్కారణమగు నొక కేంద్రశక్తి (central energy)ని బోధించుట కుపయోగింపబడినది.

4. డ్యూసెన్ (Deussen)పండితుని యభిప్రాయము :– 'బ్రహ్మ' శబ్దమునకు మొదట మానసికౌన్నత్యమును బెంపొందించెడి స్తోత్ర మని యర్థము. పిదప సత్యమును దర్శించినపుడు ఆ సత్యమే బ్రహ్మ శబ్దముచే గూడ బోధింపబడజొచ్చినది.

5. మాక్సుముల్లరు పండితుని యభిప్రాయము :– 'బ్రహ్మ' యనగా శబ్ద మని యర్థము. బృహస్పతి లేక వాచస్పతి శబ్దములబట్టి జూచిన నీ విషయము స్పష్ట మగును. ఏది యుచ్చరించునో యది బ్రహ్మ (That which utters is Brahman).

బ్రహ్మశబ్దము యొక్క పదనిష్పత్తి (etymology)ని గూర్చి శ్రమ పడుట యనావశ్యకము. మొత్తము మీద నేది వృద్ధి జెందుచుండునో, శ్వాసక్రియ నల్పునో లేక పెంపొందునో యట్టి వాస్తవిక తత్త్వము బ్రహ్మ యగుట స్పష్టము (Brahman means reality which grows, breaths or swells)." (డా–యస్. రాధాకృష్ణన్ - Indian Philosophy – vol I. PP 163–164).

ఈ చారిత్రికుల ననుసరించి బ్రహ్మ శబ్దము ఉపనిషత్కాండయందు మాత్రమే పరతత్త్వమును బోధించు ననుట యందఱకు సంమతము. తద్భిన్న వేదభాగమునందు కాదు. సంహితా–బ్రాహ్మణ–ఉపనిషద్భాగములం దీ పదము యొక్క యర్థము క్రమక్రమముగ మార్పు జెందినదని వీరి యభిప్రాయము. ఈ పదము యొక్క పదనిష్పత్తితో నిమిత్తము లేదనియు గొందఱి యభిప్రాయము. మొత్తము మీద బ్రహ్మ శబ్దమునకు వేద మను నర్థ మున్నటుల చరిత్రకారులు గ్రహింపలేదు.

చరిత్రకల్పనాలక్ష్యముతోనే, వేదభాగములకు పౌర్వాపర్య ముండి యుండవలె నని మొదట యూహించుకొని, తదనుగుణముగ బ్రహ్మ శబ్దము యొక్క యర్థము విషయమునను క్రమపరిణామము గలదని చెప్పుటకే చారిత్రికులు యత్నించినట్లు గన్పట్టును. అందుచే తమ తమ యూహల కనుగుణముగ, పరస్పరవిభిన్నమార్గముల నిట్టి విభిన్నకల్పనలు సాగినవి. పదము యొక్క అర్థనిర్ణయమునకై చరిత్రను ప్రాతిపదికగ గైకొనదలచుటయే యిట్టి వైమత్యమునకు గారణమైనది. ఇక శ్రుతిస్మృత్యాది - అనాదిసిద్ధప్రమాణముల గ్రహించి బ్రహ్మ శబ్దము యొక్క సంప్రదాయానుగతములగు నర్థముల జూతము.

బ్రహ్మ యన వేదము — శ్రుతిస్మృతిప్రసిద్ధి :-

"ఉప బ్రహ్మాణి వాఘతః" —ఋ. 1-3-5,6.

'బ్రహ్మాణి వేదరూపాణి స్తోత్రాణి' —సా. భా.

"కణ్వాసో వాం బ్రహ్మ కృణ్వ న్త్యధ్వరే" —ఋ. 1-47-2.

'బ్రహ్మ. స్తోత్రరూపం మంత్రం' —సా. భా.

"దేవత్తం బ్రహ్మ గాయత" —ఋ. 8-32-27.

'దేవప్రసాదలబ్ధం స్తోత్రం'—సా. భా.

"విశ్వేషా మి జ్జనితా బ్రహ్మణా మసి" —ఋ. 2-23-2.

'విశ్వేషాం సర్వేషాం బ్రహ్మణాం జనితా' —సా.భా.

"బ్రహ్మాణి హి చకృషే వర్ధనాని" —ఋ. 6-23-6.

"స క్రాంత స్తేపానో బ్రహ్మైవ ప్రథమ మసృజత
త్రయీ మేవ విద్యామ్" —శ. బ్రా. 8-1-1-5.

"బ్రహ్మ సరూప మను మేద మాగాత్"—తై. నా. 3-15-1.

"బ్రహ్మ ప్రావాదిష్మ తన్నో మాహాసీత్" —తై. నా. 4-42-5.
"తస్మా దేతత్ బ్రహ్మ నామరూప మన్నం చ జాయతే
—ము. ఉ. 1-1-9.

"అగ్ని వాయు రవిభ్యస్తు త్రయం బ్రహ్మ సనాతనమ్।
దుదోహ యజ్ఞసిద్ధ్యర్థం ఋగ్యజుః సామలక్షణమ్ ॥"
—మను. స్మృ. 1-23.

"తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే"—భాగ. 1-1.

"బ్రహ్మాక్షర సముద్భవమ్" —భ.గీ. 3-15.

ఇట్లు శ్రుతిస్మృతుల యందు వేదమునకును, వేదమంత్రములకును వాచకమై బ్రహ్మశబ్దము ప్రసిద్ధమై యున్నది. ఇట నీ శబ్దము నపుంసక లింగమై వేదమునకును, మంత్రమునకును, వేదమంత్రరూప స్తోత్రమునకును వాచక మగుట గమనార్హము. అందుచే 'నపుంసకలింగ మగు నీ శబ్దము వేదమున బ్రాహ్మణజాతి వాచకమె యగును'—ఇత్యాది చారిత్రికుల వైదిక కోశవచనము లాదరణీయములు కావు; శ్రుతి స్మృతి విరుద్ధములు.

బ్రహ్మశబ్దము - నిర్వచనము:-

"బ్రహ్మ బృంహణాత్, బృంహతి వర్ధతే నిరతిశయ
మహత్త్వలక్షణవృద్ధిమాన్ భవతీత్యర్థః, వేదః" —శబ్దకల్పద్రుమః.

బ్రహ్మ యనగా బృంహణశీలము గలది. ఇంతయని పరిమితి లేని వర్ధనము (వృద్ధి) బృంహణము: పరిమితులు గల వస్తువుల యొక్క వృద్ధి వానికంటె మహత్తరమైన వస్తువుల యొక్క వృద్ధికంటె న్యూనమై పూర్ణము గాదు. నిరతిశయమహత్త్వము గల వృద్ధి పూర్ణమై విరాజిల్లును. అట్టి పూర్ణతతో, లేక నిరతిశయమహత్త్వముతో నొప్పునది బ్రహ్మ, అట్టి

మహత్త్వము, లేక పూర్ణత్వము గలది యగుటచే వేదము బ్రహ్మ యగును-
అని యర్థము.

పరమాత్మ - బ్రహ్మత్వము:-

ఇట్టి పూర్ణతాలక్షణమైన బృంహణముతో నొప్పుటచే బ్రహ్మ శబ్దము పరమాత్మకును వాచకము,

“బ్రహ్మశబ్దస్య హి వ్యుత్పాద్యమానస్య నిత్యశుద్ధత్వాదయో ఽర్థాః
ప్రతీయన్తే, బృహతే ర్ధాతో రర్థానుగమాత్”

— శం.భా., బ్ర.సూ.జిజ్ఞాసాధికరణమ్.

“శ్రుతౌ సూత్రే బ్రహ్మశబ్దస్య ప్రయోగాఽన్యథాఽనుపపత్త్యా కశ్చిదర్థోఽస్తీతి జ్ఞాయతే। ప్రమాణవాక్యే నిరర్థక శబ్దప్రయోగాదర్శనాత్ । సచార్థో మహత్త్వరూప ఇతి వ్యాకరణా న్నిశ్చీయతే। ‘బృహి వృద్ధౌ’ ఇతి స్మరణాత్। సా చ వృద్ధి ర్నిరవధికమహత్త్వ మితి, సంకోచకాఽభావాత్ శ్రుతా వనంతపదేన సహ ప్రయోగాచ్చ జ్ఞాయతే. నిరవధికమహత్త్వం చాంతవత్త్వాది దోషవత్త్వే సర్వజ్ఞత్వాది గుణహీనత్వే చ న సంభవతి। లోకే గుణహీనదోషవతో రల్పత్వప్రసిద్ధేః। అతో బృంహణా ద్బ్రహ్మేతి వ్యుత్పత్త్యా దేశకాలవస్తుతః పరిచ్ఛేదాభావరూపం నిత్యత్వం ప్రతీయతే.... ఏవం సకలదోషశూన్యం నిర్గుణం ప్రసిద్ధమ్। తథా సర్వజ్ఞత్వాది గుణకం చ తత్పదవాచ్యం ప్రసిద్ధమ్” —రత్నప్రభా.

పై వాక్యముల బరిశీలించుచో బ్రహ్మ శబ్దము నిరతిశయ మహత్త్వ లక్షణము గల వేదమునకు వాచకమైనట్లే నిరతిశయమహత్త్వ లక్షణము గల పరమాత్మకు (సగుణ నిర్గుణ బ్రహ్మలకు) వాచక మగుట స్పష్టము. కనుక, బ్రహ్మ శబ్దము గూడ, వేద-ఋషి శబ్దములవలె, పరమాత్మకును వేదమునకును వాచకము. పరమాత్మకు గల యీ నిరతిశయమహత్త్వమును శ్రుతు లిట్లు చెప్పుచున్నవి.

పరంబ్రహ్మ తత్సర్వ మేక మేవేతి ప్రతిపాద్యతే .... ఋతం బృహత్ సత్య మబాధ్యం సర్వాధిష్ఠానం బ్రహ్మతత్త్వమ్'' — సా.భా.

ఋగ్వేద మిట్టి మంత్రములచే సత్యము, నిరతిశయ మహత్త్వలక్షణము, సర్వజగదధిష్ఠానభూతము నగు నా పురుషుని యొక్క బృంహణశీలము నభివ్యక్తము జేసినది. మఱియు కొన్నియెడల—

"బృహచ్ఛరీరో విమిమాన ఋక్వభిః'' — ఋ. 1-155-6.

ఇత్యాది మంత్రములయందు 'బృహచ్ఛరీరః' — అనుమ ముక్తకంఠముగ పరమాత్మయొక్క బృహత్త్వము నభివర్ణించినది. (ఏవం కాలాత్మకః విష్ణుః బృహచ్ఛరీరః విరాడాత్మనా సర్వదేవ మనుష్యాది శరీరాణాం స్వశరీరత్వాత్ । బృహచ్ఛరీరత్వ మేవోపపాదయతి....సా.భా) ఇంతే కాదు. ఆ పరమ పురుషుని 'బ్రహ్మ' శబ్దముచే ఋగ్వేదము పలుచోట్ల పేర్కొనినది.

"బ్రహ్మ దేవానాం పదవీః కవీనాం'' — ఋ. 9-96-6; తై. ఆ. 10-10-1.

ఇది పరమేశ్వరవిభూతిప్రతిపాదక మంత్రము. అగ్నీంద్రాది దేవతలలో బ్రహ్మయై (చతుర్ముఖుడై) పరమేశ్వరుడు నియామకు డగుచు నెలసియున్నాడు (దేవానా మగ్నీంద్రాదీనాం మధ్యే బ్రహ్మ చతుర్ముఖో భూత్వా పరమేశ్వరో నియామకత్వే నావతిష్ఠతే – సా.భా) — అని యర్థము.

"ఇంద్రో బ్రహ్మేంద్రఋషిః'' — ఋ. 8-16-7.

"ఇంద్రో బ్రహ్మ బ్రాహ్మణాత్ సుష్టుభః'' — అ.సం. 20-2-3.

'ఇంద్రః పరమైశ్వర్యాది గుణయుక్తో దేవః, స ఏవ బ్రహ్మ। బృహత్త్వాద్ బ్రాహ్మణత్వా చ్చ । ఇంద్రస్య బ్రహ్మాత్మనా స్తుతిః, 'ఇంద్రో బ్రహ్మేంద్రఋషిః (ఋ. 8-16-7)' — ఇత్యాది మంత్రవర్ణా దవగంతవ్యా' —అ.సం-సా.భా.

ఇట ఋగ్వేదమునందును, అథర్వవేదమునందును పరమైశ్వర్యాది గుణయుక్తుడగు ఇంద్రుడు బృంహణశీలము గలవాడగుటచే బ్రహ్మ యని స్తుతింపబడినాడు.

"బ్రహ్మణం బ్రహ్మవాహసమ్" — ఋ, 6-45-7.

'బ్రహ్మాణం పరివృఢం, బ్రహ్మవాహసం బ్రహ్మభిః
స్తుతిరూపై ర్మంత్రై ర్వహనీయమ్' — సా. భా.

"సఖాయో బ్రహ్మ వాహసేఽర్చత" — ఋ, 6-45-4.

'బ్రహ్మవాహసే బ్రహ్మభి ర్మంత్రై ర్వహనీయాయ
ప్రాప్తవ్యా యేంద్రాయ' — సా, భా.

ఇట నపుంసకలింగ బ్రహ్మశబ్దము మంత్రవాచకముగను, పుంలింగబ్రహ్మశబ్దము పరమాత్మవాచకముగను, ప్రయోగింపబడుట స్పష్టము. బ్రహ్మయగు పరమేశ్వరుడు బ్రహ్మవాహను డని యర్థము. బ్రహ్మలచే-మంత్రములచే- ప్రాప్తవ్యుడు లేక ప్రతిపాద్యు డని భావము. కాన 'వేదములందు పుంలింగబ్రహ్మశబ్దము పురోహితు డను నర్థమునందును, నపుంసకలింగ బ్రహ్మశబ్దము బ్రాహ్మణజాతి యను నర్థమునందుమాత్రమే ప్రసిద్ధము'- అనెడి చారిత్రికుల వచనము శ్రుతిస్మృతిసంప్రదాయవిరుద్ధము. బ్రహ్మశబ్దము ఉపనిషత్తుల యందును, పురాణేతిహాసాదులయందును నెట్లు పరతత్త్వవాచకముగను వేదవాచకముగను ప్రసిద్ధమో యట్లే ఋగ్వేదమునను ప్రసిద్ధమై యుండుట దర్శించితిమి. అనగా బ్రహ్మశబ్దార్థవిషయమున చారిత్రికు లూహించెడి క్రమపరిణతి శ్రుత్యభిమతము గాదు. ఇట్లు పరతత్త్వమే గాదు. పరమేశ్వరుని తర్వాత హిరణ్యగర్భుడును శ్రుతులయందు బ్రహ్మపదముచే గీర్తింపబడినాడు.

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాం శ్చ ప్రహిణోతి తస్మై" —గో.పూ.4-5; శ్వేతా. ఉ.6-18.

"యత్తత్కారణ మవ్యక్తం నిత్యం సదసదాత్మకమ్।
తద్విసృష్టః స పురుషో లోకే బ్రహ్మేతి కీర్త్యతే॥ —మను. 1-10.

"బ్రహ్మ దేవానాం ప్రథమ స్సంబభూవ విశ్వస్య కర్తా
భువనస్య గోప్తా" —ముం. 1-1.

ఈ హిరణ్యగర్భునియొక్క బ్రహ్మత్వమును (పరివృఢత్వమును) స్మృతు లిట్లు వివరించినవి.

"జ్ఞాన మప్రతిమం యస్య వైరాగ్యం చ జగత్పతేః।
ఐశ్వర్యం చైవ ధర్మశ్చ సహసిద్ధం చతుష్టయమ్॥"

ఇతి స్మరణాత్ ధర్మ జ్ఞాన వైరాగ్యైశ్వర్యైః సర్వా నన్యా నతిక్రమ్య వర్తత ఇతి పరివృఢత్వం సిద్ధ మిత్యర్థః
—ఆనందగిరి. ముం.ఉ. 1-1.

హిరణ్యగర్భునకు ధర్మ జ్ఞాన వైరాగ్యైశ్వర్యములు సహజసిద్ధములు. వీనిచే నందఱ నతిశయించి సర్వమహత్తరుడై వర్తిల్లుట జేసి యీయనకు బ్రహ్మత్వము (పరివృఢత్వము) సిద్ధమైనది—అని యర్థము. ఋగ్వేదము 'హిరణ్యగర్భః సమవర్తతాగ్రే' అని యనుచు, నొక సూక్తముచే (10-121) ప్రజాపతియగు హిరణ్యగర్భుని యొక్క నిరతిశయమహత్త్వలక్షణ బ్రహ్మత్వము నభివ్యక్తము చేసి యున్నది. ఇంకను పెక్కు నామములతో నీ ప్రాణదేవుని మహత్త్వమును కీర్తించుటను మనుస్మృతియందు గాంచగలము. ఇక వేదముయొక్క బ్రహ్మత్వమును పరిశీలింతము.

వేదము - బ్రహ్మత్వము:—

వేదపురుషుడగు బ్రహ్మను ప్రతిపాదించునది యగుటచే వేదశబ్ద రాశికిని బ్రహ్మ యని యన్వర్థనామము.

> "బ్రహ్మశబ్దో జగత్కారణే పరమాత్మని ముఖ్యతయా వేదే ప్రయుజ్యతే। తథా ఐతరేయిణః స్వకీయోపనిషది సమామనంతి — 'ప్రజ్ఞాప్రతిష్ఠా ప్రజ్ఞానం బ్రహ్మ' ఇతి। తైత్తిరీయాశ్చ— 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ ఇతి'। వాజసనేయినశ్చ—"విజ్ఞాన మానందం బ్రహ్మ" ఇతి। ఏవం సతి బ్రహ్మశబ్దస్య తత్ప్రతిపాదక వర్ణమాత్ర పరత్వేఽపి పరం బ్రహ్మణః సహసా బుద్ధిస్థత్వా దర్థా న్మంగళాచరణం సంపద్యతే। తస్య బ్రహ్మణః ప్రతిపాదకత్వేన వేదోఽపి బ్రహ్మ శబ్ద స్యార్థః। తతో గ్రంథాదౌ వేదపురుషోఽప్యనుస్మృతో భవతి" —తై.బ్రా. 1-1-1. సా.భా.

తైత్తిరీయబ్రాహ్మణము 'బ్రహ్మ సంధత్తం' అనుచు బ్రహ్మశబ్దముతో ప్రారంభమగుచున్నది. వేదమున బ్రహ్మశబ్దము ముఖ్యముగా నుపనిషత్ప్రతిపాద్యమగు బ్రహ్మ యందే యుపయుక్త మగుచున్నది. అట్టి బ్రహ్మను ప్రతిపాదించునది యగుటచే వేదముకూడ బ్రహ్మశబ్ద వాచ్య మగుచున్నది. అందుచే నీ గ్రంథాదియందున్న బ్రహ్మశబ్దము వేదమును, వేదపురుషుని — ఇరువురిని బోధించుచు మంగళవాచక మగుచున్నది—యని అర్థము. ఈ విషయమును శ్రుతియే యిట్లు చెప్పుచున్నది.

'బ్రహ్మాఽయం వాచః పరమం వ్యోమ' — ఋ. 1-164-35.

'బ్రహ్మ వై వాచః పరమం వ్యోమ' — తై. బ్రా. 3-9-5-5.

మంత్రాదిరూపమగు నీ వాక్కునకు పరమలక్ష్యము, ఆ వాగుత్పత్తికి గారణమైన పరమపదము నీ బ్రహ్మయే - యనుచు ఋగ్వేదము కీర్తించినది. (అయం బ్రహ్మ ప్రజాపతిరేవ వాచః మంత్రాది రూపాయాః పరమం వ్యోమ ఉత్కృష్టం రక్షకం స్థానం । తత్రైవోత్పత్తే స్తత్రైవ పర్యవసానాచ్చ —సా.భా.). కనుక వేదపురుషునినుండి యావిర్భూతమైన తన యొక్క పరమలక్ష్యము వేదపురుషుడగు బ్రహ్మయే యని శ్రుతి తన స్వభావమును వివరించికొనుట యిట గాంచనగును. ఇంతేగాదు. ఋగ్వేదము మరియొక ఋక్కుచే వాక్కు యొక్క నిరతిశయ మహత్త్వము నిట్లు కీర్తించినది.

"యావ ద్బ్రహ్మ విష్ఠితం తావతీ వాక్" —ఋ. 10-114-8.

"యావ ద్బ్రహ్మ విష్ఠితం తావతీ వాగితి యత్ర హ క్వ చ బ్రహ్మ త ద్వాక్ యత్ర వా వాక్ తద్వా బ్రహ్మే త్యేత దుక్తం భవతి" — ఐ. బ్రా. 1,3,8,16.

'బ్రహ్మై వాభిధేయం జగత్పదార్థరూపేణ యత్రాస్తి తత్రాభిధాయకం నామ । తథా యత్ర యత్ర వాచకః శబ్దః తత్రాభిధేయపదార్థం బ్రహ్మ - ఇత్యేవ మన్యోన్యస్య వ్యాప్తిస్వరూపం భవతి' — సా.భా.

ఈ ఋక్కు బ్రహ్మ యొక్కయు, తత్ప్రతిపాదక మగు వాక్కు యొక్కయు, నిరతిశయ మహత్త్వరూప బృంహణశీలమును, వాగర్థ సంపృక్తత్వమును తద్ద్వారా వేదవాక్స్వభావము నభివ్యక్తము చేయుటకై ప్రవృత్త మయినది.

వాక్కుచే బోధింపబడు పదార్థమునకు అభిధేయము అని పేరు. బ్రహ్మయే అభిధేయ జగత్పదార్థరూపమున భాసించుచున్నదని శ్రుతి

సంప్రదాయము. కాన నభిధేయ పదార్థమును బోధించుటకు వాక్కు ఎచట ప్రవృత్త మగునో యచట నా యభిధేయపదార్థరూపమున బ్రహ్మ భాసిల్లుచున్నాడు. ఇట్లు బ్రహ్మ యభిధేయ పదార్థరూపమున నెచటెచట భాసించుచుండునో యచ్చటచ్చట వాక్కు తద్వాచక – అభిధానరూపమున విలసిల్లుచుండును. ఇట్లు బ్రహ్మయు, వాక్కు నన్యోన్యవ్యాప్తి గల వగుటచే నభిధేయ పదార్థరూపమున బ్రహ్మయొక్క వ్యాప్తి యెంతయో వాక్కు యొక్క వ్యాప్తియు నంతియే — అనగా నా బ్రహ్మవలె వాక్కు గూడ నిరతిశయ మహత్త్వము గలది యని యర్థము.

లోకమున గో, అశ్వాది శబ్దములు, ఆవు, గుఱ్ఱము మొదలగు లౌకికములగు నర్థముల బోధించుచున్నటుల గన్పట్టుచున్నవి. శాస్త్రము అజ్ఞాతజ్ఞాపకము. కావున 'గో, అశ్వాది పదములు వ్యవహారసిద్ధికై లౌకికములగు నర్థములు బోధించుచున్నను, వాస్తవముగ నా పదములచే బోధింప బడెడిది యభిధేయ పదార్థరూపమున విలసిల్లు బ్రహ్మయే; అనగా వాక్కుకు పరమాభిధేయము బ్రహ్మయే'— యని శ్రుతి ప్రబోధించుచున్నది. 'వికారస్వరూపోపమర్దేన హి నామాదిజాతస్య బ్రహ్మత్వ మేవాశ్రితం భవతి' (బ్ర సూ. 4–1–4. శం. భా). లౌకికభాషాపదములవలె గాక, గో, అశ్వాది పశువాచకపదములు గాని, గంగాసరస్వతీత్యాది నదీనామములు గాని, అగ్నీంద్రాది దేవతానామములు గాని — ఇట్లు సంస్కృతపదము లన్నియును వ్యావహారికముగ నా యా యర్థముల బోధించునవి యైనను తమ తమ ప్రవృత్తినిమిత్తములచే పరమార్థరూపుడగు బ్రహ్మ నుపలక్షింపజేయుట సంస్కృతభాషాస్వభావ మని తెలియనగును. ఇట్లు దేవతాత్త్వోపలక్షకము లగుటచేతనే వేదపదములను దేవపదములని శతపథశ్రుతి యిట్లు కీర్తించినది.

'అప్యేకం దేవపద మధీయాతైవ' — శ.బ్రా. 11-5-69.

ఇంతే కాదు. సంస్కృతభాష యందలి యే యొక పదమునైన బాగుగ దెలిసికొని, ప్రయోగించినచో నా శబ్దము కామధేనువయి యిహపర లోకములందు గోరికల గురియించుననియు శ్రుతి చెప్పుచున్నది.

'ఏకః శబ్దః సమ్యక్ జ్ఞాతః సుష్ఠు ప్రయుక్తః స్వర్గే లోకే
కామధుక్ భవతి' — (చూ. పస్పశాహ్నికమ్ - మహాభాష్యమ్)

పై ప్రమాణములు రెండును సంస్కృతపదములలో నే యొక పదమునైన నధ్యయనము జేయు డనియు, ఏ యొక పదమునైనను దాని స్వభావమును జక్కగా బరిశీలించి ప్రయోగింపు డనియు ప్రబోధించుచున్నవి. రెంటిటె తాత్పర్య మొక్కటియే.

ఏ పదము నధ్యయనము జేయ మొదలిడినను మొదట నా పదమునకు గల ప్రకృతి ప్రత్యయ విభాగాది సంస్కారము, ప్రవృత్తి నిమిత్తము పరిశీలింపవలసి యుండును. తరువాత శ్రుతి స్మృతి పురాణేతిహాస కావ్య నాటక కోశాదులయందు ఆ పదమునకుగల ప్రసిద్ధి దర్శింపవలసి యుండును. అప్పుడు ఆ పదము శతపథమై యర్థ గాంభీర్యముతో నొప్పుచు తుదకు పరమార్థోపలక్షకమై యెట్లు వరలునో తెలియవలసి యుండును. అట్లు తెలిసి ప్రయోగింపవలసి యున్నదని శ్రుతి తాత్పర్యము. బీజము వృక్షరూపమున విస్తరించినట్లు, సంస్కృతపదము మొదట లౌకికార్థబోధక మైనట్లు కన్పడియు పరిశీలనము చేయుకొలది యర్థగాంభీర్యముతో సాక్షాత్కరించి, పెక్కు సంప్రదాయముల వివరించి మననశక్తిని పెంపొందించి తన మహత్త్వమును (బృహత్త్వమును) గోచరింప జేయును. సామాన్యముగ వేదమున గల పదము లన్నియు నిట్టి లక్ష్యము గలవియే. అందుచే నవి దేవపదము లని శ్రుతి తాత్పర్యము.

ఇట్టి పదములతో నొప్పి బ్రహ్మతత్త్వమును ప్రతిపాదించుటకై యవతరించిన వేదము నిరతిశయమహత్త్వము గలది యగుట సూచిత

మగుచున్నది. ఇంతేగాక పరమేశ్వరు డనంతు డగుటచే నా యనంతత్వమును ప్రబోధించుటకై యనంతవేదము లావశ్యకము లయినవి. 'అనంతా వై వేదాః' (తై. బ్రా. 3-10-11-4) అని శ్రుతి తన యనంతత్వమును చెప్పికొనినది. ఇట్లు అర్థగాంభీర్యముతో నొప్పెడి దేవపదములతో సముల్లసితమై యనంతునివలె ననంతశాఖలతో ననంతరూపిణియై, బ్రహ్మకును తనకును గల నిత్యసంపృక్తత్వమును ప్రబోధించుచు శ్రుతి 'బ్రహ్మ'యను సార్థకనామముతో వరలినది. ఇంతేగాదు. శ్రుతియే తనయొక్క బ్రహ్మత్వమును నింకొక తీరుగ గూడ నిట్లు నిర్వచించుకొనుచున్నది.

"(వాగితి) ఏత దేషాం (నామ్నాం) బ్రహ్మైతద్ధి
సర్వాణి నామాని బిభర్తి" — శ. బ్రా. 14-4-4-1.

మృత్తు సామాన్యరూపము. ఘటాదులు తద్విశేష రూపములు. ఘటాదివిశేషరూపములకు సామాన్యరూపమగు మృత్తు ఉపాదానకారణము. అట్లే వాక్కు సామాన్యరూపము. నామములు తద్విశేషరూపములు. విశేషరూపములగు నామములకు వాక్కు ఉపాదానకారణము. వాక్కు ఉపాదానకారణమై వాగ్విశేషములగు నామముల భరించుచున్నది. కాన భరణ రూపమగు ప్రవృత్తి నిమిత్తముచే వాక్కు బ్రహ్మ యగునని భావము. మఱియు కారణముకంటె కార్యము భిన్నము కాదు. అందుచే శ్రుతులయందు వాక్కు, వాగ్విశేష మగు వేదము కూడ బ్రహ్మ యని పలుచోట్ల కీర్తింప బడినది.

'వాగ్వై బ్రహ్మ' — ఐ. బ్రా. 6-3; శ.బ్రా. 2-1-4-10.
"వాక్ బ్రహ్మ" —గో. పూ. 2-10.
"సా యా సా వాక్ బ్రహ్మైవ తత్" —జై. ఉ. 2-13-2.
"వా గితి త ద్బ్రహ్మ"॥ — 2-9-6.

"వాగ్వై బ్రహ్మ" — ఐ.బ్రా. 2-15; 4-21.
"వేదో బ్రహ్మ" — జై. ఉ. 4-25-3.

వేదవాక్కు సర్వనామముల ధరించుచు సృష్టియందు బ్రహ్మకు సహకారి కారణమై యొప్పుట 'వేద - ఋషి - ప్రథమజా శబ్దములందు వివరింప బడినది. కాన. ఇట్లు సర్వనామములను ధరించుటచేతను (బిభర్తి) వేదములకు బ్రహ్మ యని యన్వర్థ సంజ్ఞ. 'బిభర్తి సర్వభూతాని వేద శాస్త్రం సనాతనమ్' అనెడి మనుస్మృతి వాక్యము కూడ నీ విషయమునే యుపలక్షింప జేయుచున్నది.

బ్రహ్మర్షి :-

బ్రహ్మర్షి పద పరిశీలనము వలనను వేదము యొక్క బ్రహ్మత్వ మభివ్యక్తమగును. వసిష్ఠాదులకు బ్రహ్మర్షులని ప్రసిద్ధి. 'బ్రహ్మ వేదం, పరబ్రహ్మ వా ఋషతి వేత్తీతి। వసిష్ఠాది మునిగణః'—అని బ్రహ్మర్షిపద నిర్వచనము (శ. శబ్ద. ద్రు; వాచ.). వేదమును గాని, పరబ్రహ్మను గాని యపరోక్షముగ సాక్షాత్కరింప జేసికొనినవాడు—అని యర్థము. అపరోక్ష బ్రహ్మాత్మానుభవము గలవాడు, స్వయంప్రతిభాతవేదుడు బ్రహ్మర్షి యగునని భావము. వసిష్ఠాదు లట్టివారు. రామాయణమునందలి విశ్వామిత్ర వృత్తాంత మీ విషయమును వివరించును.

'తతః సురగణా స్సర్వే పితామహ పురోగమాః।
విశ్వామిత్రం మహాత్మానం మధురం వాక్య మబ్రువన్॥
బ్రహ్మర్షే స్వాగతం తేఽస్తు తపసా స్మ సుతోషితాః।
బ్రాహ్మణ్యం తపసోగ్రేణ ప్రాప్తవానసి కౌశిక॥

దీర్ఘ మాయుశ్చ తే బ్రహ్మన్ దదామి సమరుద్గణః।
స్వస్తి ప్రాప్నుహి భద్రం తే గచ్ఛ సౌమ్య యథాసుఖమ్॥
పితామహవచః శ్రుత్వా సర్వేషాం చ దివౌకసామ్।
కృత్వా ప్రణామం ముదితో వ్యాజహార మహామునిః॥
బ్రాహ్మణ్యం యది మే ప్రాప్తం దీర్ఘమాయు స్తథైవ చ।
ఓంకారశ్చ వషట్కారో వేదాశ్చ వరయంతు మామ్॥

విశ్వామిత్రుడు బ్రహ్మర్షిత్వము సిద్ధించుటకై ఘోర తప మొనర్చెను. ఆ తపమునకు మెచ్చి దేవతాగణ సమేతుడై బ్రహ్మ సాక్షాత్కరించి — "ఓ బ్రహ్మర్షీ! ఉగ్రతపశ్చర్యా ఫలముగ బ్రాహ్మణ్యము (బ్రహ్మర్షిత్వము) సిద్ధించి నీ కోరిక యీడేరినది: చిరంజీవివై సకలభద్రములతో వర్ధిల్లుము" అని పలికెను. అంతట విశ్వామిత్రుడు ప్రహృష్టాంతరంగుడై చేతులు జోడించి యా దేవదేవున కిట్లనియెను. 'బ్రాహ్మణ్యము దీర్ఘాయువు నాకు సిద్ధించుచో ఓంకారము, వషట్కారము, వేదములును స్వయముగ నాకు భాసించుగాక (మాం వరయంతు స్వత ఏవాయాంతు—మహేశ్వరతీర్థః)— అని యర్థము.

ఈ కథా సందర్భమును బట్టి యెవనికి స్వయముగ ఓంకార వషట్కార వేదములు భాసించునో—అనగా నెవడు స్వయంప్రతిభాత వేదుడో— యతడు బ్రహ్మర్షి యని బ్రహ్మర్షి లక్షణము దెలియనగును. కాన పరబ్రహ్మము గాని, వేదము గాని దర్శించినవాడు బ్రహ్మర్షి — యనెడి పైన జెప్పిన నిర్వచన ముపపన్న మగును (చూ. వషట్కారశబ్దము). ఇట బ్రహ్మ యొక్క యనుగ్రహము చేతనే విశ్వామిత్రునకు బ్రహ్మ భాసించి బ్రహ్మర్షి యయ్యెనని తెలియుచున్నది. ఇట్టి సంప్రదాయము శ్రుతిస్మృతి పురాణేతిహాసముల యందు బహుళముగ గాననగును. ఇతిహాసపురాణాదులయందు గన్పట్టెడి యిట్టి కథ లతిశయోక్తులు కావు; వానిని యథాస్థితార్థ కథనములు

గనే గ్రహింప నగును—అని శ్రీశంకర భగవత్పాదులు బ్రహ్మసూత్ర దేవతాధికరణమున (1-3-33) నిట్లు వివరించిరి.

"తస్మా ద్ధర్మోత్కర్షవశాత్ చిరంతనా దేవాదిభిః ప్రత్యక్షం వ్యవజహ్రు రితి శ్లిష్యతే। అపిచ స్మరంతి - స్వాధ్యాయా దిష్టదేవతా సంప్రయోగః (యో. సూ. 2-44). - ఇత్యాది। యోగో ఉప్యణిమా ద్యైశ్వర్య ప్రాప్తిఫలః స్మర్యమాణో న శక్యతే సాహసమాత్రేణ ప్రత్యాఖ్యాతుమ్। శ్రుతిశ్చ యోగమాహాత్మ్యం ఖ్యాపయతి — 'పృథివ్యప్తేజోఽనిల ఖే సముత్థితే, పంచాత్మకే యోగగుణే ప్రవృత్తే। న తస్య రోగో న జరా న మృత్యుః ప్రాప్తస్య యోగాగ్ని మయం శరీరమ్॥ (శ్వేతా. ఉ. 2-12)' — ఋషీణా మపి మంత్రబ్రాహ్మణ దర్శినాం సామర్థ్యం నాస్మదీయేన సామర్థ్యే నోపమాతుం యుక్తమ్। తస్మాత్ సమూల మితిహాసపురాణమ్।"

తత్త్వావబోధమునకు వేదవిహిత కర్మానుష్ఠానముతోపాటు యమనియమా ద్యష్టాంగ యోగసంపత్తియు నావశ్యకము. స్వాధ్యాయము వలన నిష్ట దేవతాసాన్నిధ్యము, దేవతలతోడి సంభాషణము సిద్ధించునని పాతంజల యోగసూత్రము చెప్పుచున్నది. యోగవిద్య యోగాగ్నిమయ దేహమును, అణిమా ద్యష్టైశ్వర్యములను ప్రసాదించి దైవీశక్తి సంపన్నునిగా చేయునని శ్వేతాశ్వతరశ్రుతి చెప్పుచున్నది. అట్టి యోగవిద్య లేదు - అని చెప్పుట సాహసమే యగును. మన ప్రాచీనఋషు లట్టి దైవీశక్తి సంపన్నులు, మంత్రబ్రాహ్మణ ద్రష్టలు నయి వెలుగొందిరి. స్వాధ్యాయ తపోయోగ నిష్ఠితులయిన యా బ్రహ్మర్షుల సామర్థ్యమును మన సామర్థ్యముతో పోల్చి చూచుకొనుట యెంతమాత్రము సమంజసము కాదు. ధర్మపరాయణులై

ధ్యానపారవశ్యమున నుండి వారాయా దేవతలతో ప్రత్యక్షముగ మాటలాడి రనుట యుక్తమే. కాన నట్టి గాథాదికమును వివరించు నితిహాస పురాణములు సప్రమాణములే గాని నిష్ప్రమాణములు గావు—అని యర్థము.

కాన బ్రహ్మ విశ్వామిత్రునకు వేదములను 'మనసా'-సంకల్పమాత్రముననే—అనుగ్రహించుట, విశ్వామిత్రునకు స్వయముగ వేదములు భాసించి బ్రహ్మర్షి యగుట యను నీ గాథయు సప్రమాణమే యగునని గ్రహింపనగును. కావుననే దర్శనకారులందఱును మహామహిమప్రఖ్యాపక మైన యీ యోగవిద్య నాదరించిరి. మన ప్రాచీనాచార్యులును వేదవిహిత కర్మానుష్ఠానపరులు మాత్రమే కాక, యోగశక్తిసంపన్నులు నగుచు దర్శన స్పర్శనాదులచేతనే శిష్యులకు సకల వేదములు, శాస్త్రములు భాసించునట్లను గ్రహింపగలిగిరి. 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై'—అను శ్రుతియు, 'తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే'—యను భాగవతమును నిట్టి సంప్రదాయమును సూచించుచున్నవి. యోగేశ్వరుడగు పరమేశ్వరుడాదికవి యగు బ్రహ్మకు వేదములను 'మనసా' యనుగ్రహించెనని భావము. ఈ సంప్రదాయమునే మహాభారతము శాంతిపర్వమున వ్యాసశిష్యగాథా రూపమున వెలయించినది. అందు వ్యాసుడు శిష్యుల బలుకీతుల బరీక్షించి వారుత్తమాధికారులని తెలిసికొని—'సర్వే వేదాః ప్రతిభాస్యన్తి, ధర్మశాస్త్రాణి చ'—అన్ని వేదములును ధర్మశాస్త్రములును భాసించు గాక యని వారి ననుగ్రహించుట కాననగును. ఇట్లు స్వమహిమాత్మకములు లేక స్వశక్తిరూపములగు విద్యలను అధికారులగు శిష్యులకు 'మనసా' యనుగ్రహించుటయే 'శక్తిపాతము'—అను పేర ప్రసిద్ధమైనది.

"జ్ఞానం వేదాంత వాక్యోత్థం బ్రహ్మాత్మైకత్వ గోచరమ్।
శివ దేవప్రసాదేన గురోః సాక్షా న్నిరీక్షణాత్॥
జాయతే శక్తిపాతేన వాక్యా దేవాధికారిణామ్।"

—సూత.సం. 4-8-7.

ఉత్తమాధికారియైన శిష్యునకు దేవతాప్రసాదముచే, అనుగ్రహపూర్ణమగు గురువుయొక్క ప్రసన్న వీక్షణము చేతనే, శక్తిపాతముద్వారా, వేదాంత మహావాక్యజన్య—అపరోక్ష బ్రహ్మాత్మానుభవము సిద్ధించును— అని యర్థము. ఆచార్యునియందు ప్రతిష్ఠితమైయున్న విద్య శిష్యుని యందును జాగరిత మగునని భావము. ఇదియే శక్తిపాతము. విద్య భాసించుటకు శిష్యుని యందు ప్రతిబంధకముగా నున్న యజ్ఞానావరణము ఈశ్వరానుగ్రహము వలనను, గుర్వనుగ్రహము వలనను దొలగి, నిరావరణమైన శిష్యుని మనో వీథియందు విద్య స్వయముగ భాసించుటయే జాగరితమగుట యని గ్రహింప నగును. ఈ సంప్రదాయ మనూచానముగ భారతదేశమున నెలకొనియున్నది. ఈ సంప్రదాయమును పార్వతీవిద్యాభ్యాస వర్ణనావ్యాజమున మహాకవి కాళిదాసు కుమారసంభవకావ్యమున (1_30) నిట్లు గుర్తింప జేయుచున్నాడు.

"తాం హంసమాలాః శరదీవ గంగాం
మహౌషధీం నక్తమివాత్మభాసః।
స్థిరోపదేశా ముపదేశకాలే
ప్రపేదిరే ప్రాక్తన జన్మ విద్యాః॥"

హంసశ్రేణులు శరత్కాలమున గంగను బొందునట్లును, రాత్రులందు మహౌషధులు తమ కాంతులను బొందునట్లును, ఉపదేశకాలమున పార్వతిని ప్రాక్తన జన్మవిద్యలు పొందినవి—అని యర్థము.

ఇట గమనింపవలసిన యంశములు గలవు. హంసలన్నియు నొక్కమాఱుగా గంగానదిని జేరవు. ఒక శ్రేణి వెంట మఱియొక శ్రేణి క్రమముగ వచ్చి చేరుచుండును. అట్లే సంస్కారాతిశయక్రమము ననుసరించి పార్వతి యందు విద్యలు నొకదానివెంట నొకటి వచ్చి భాసించినవి. కాని హంసల యునికిపట్టు గంగ కాదు. అవి వేఱొక చోటునుండి గంగ కడకు

రావలెను. రెండవ యుపమాన మీ లోటును గూడ దీర్చినది. మహౌషధులు సహజముగ కాంతిమంతములు. ఆ కాంతులు వేఱొక చోటునుండి రానక్కఱ లేదు. కాని యవి పగలు సూర్యకాంతిపరాహతములై భాసింపవు. పగలు అనభివ్యక్తములై యణగియుండిన యా కాంతులు రాత్రులయందు ప్రతిబంధకము లేనందున సహజదీప్తులతో నభివ్యక్తము లగుచుండును. అట్లే పార్వతి యందణిగియున్నట్లున్న యా విద్యలు గురూపదేశకాలమున (ఉపదేశ మను వ్యాజముచే) నావరణము తొలగినంతనే సహజతేజస్సులతో భాసించిన వని భావము.

మఱియు హంసశ్రేణీ సమాగమమునకు శరత్కాలము, మహౌషధులు సహజదీప్తులతో దేజరిల్లుటకు రాత్రియు యుక్తములగు కాలములు. అట్లే యాత్మభావస్వరూపములగు విద్యలు భాసించుటకు అనుగ్రహపూర్ణ గురూపదేశకాలము యుక్తసమయ మనియు నిట సూచితము. అనగా నాచార్యుడు శిష్యునియందలి యజ్ఞానావరణమును దొలగించి యాతని యందణిగి యున్న విద్యల స్వయముగ భాసింపజేయునను సంప్రదాయము నీ కవి యిట గుర్తింపజేయుచున్నాడు. అంతియే కాదు. పార్వతి పరాదేవత. అయ్యును గురూపదేశకాలముననే విద్యలు భాసిల్లినవి. అంతకు బూర్వము గాదు. అట్లే శిష్యుడెంతటి ప్రజ్ఞాశాలి యైనను గురూపదేశ సంస్కృత చిత్తుడు గానిచో నాతని యందున్న విద్య భాసింపదు. అనగా నా విద్య యాతనికి పురుషార్థ సాధకము గాదు అందుచేతనే.

యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః ॥ —శ్వేతా.ఉ.

అని శ్రుతి గురుదేవతా భక్తివైశిష్ట్యమును బ్రతిపాదించినది. గురు — ఈశ్వరానుగ్రహపాత్రులగు వారికి మాత్రమే విద్య లనుభూతికి వచ్చి

ప్రకాశించునని భావము. కాన గుర్వనుగ్రహము చేతను, దేవతానుగ్రహము చేతను ఆవరణము (ప్రతిబంధము) తొలగి శిష్యునియందు విద్య స్వయముగ జాగరిత మగుటయే శక్తిపాతము. ఘోరతపశ్చర్య వలనను, ఈశ్వరానుగ్రహము వలనను గాని విశ్వామిత్రుని యందలి ప్రతిబంధము నివర్తింపలేదు. తొలగినంతనే బ్రహ్మయొక్క అనుగ్రహము చేతను, వసిష్ఠమహర్షి యొక్క సాక్షాన్నిరీక్షణ భాషణాదులవలనను విశ్వామిత్రుని యందు ఓంకార, వషట్కార, వేదవిద్యలు స్వయముగ భాసించి యాతడు బ్రహ్మర్షి పదము నధిష్ఠించినాడు. 'బ్రహర్షిస్త్వం న సందేహః సర్వం సంపత్స్యతే తవ' – నీవు బ్రహ్మర్షివి. సందియము లేదు. నీకు సర్వము సంపన్న మగును – అని చతుర్వేదవిదుడు బ్రహ్మిష్ఠుడు నగు వసిష్ఠుడనినంతనే వేదవాక్కామ ధేనువు విశ్వామిత్రునకును వశవర్తిని యైనది. ఇక కామధేనువును గూర్చిన వివాదమునకు తావు లేకపోయెను. అట్టి కామధేనువుతోపాటు బ్రాహ్మణ్యమును బొంది విశ్వామిత్రుడు వసిష్ఠుని బూజించినట్లు రామాయణము చెప్పుచున్నది. వసిష్ఠ విశ్వామిత్రాదు లిట్టి బ్రహ్మర్షులు.

ఈ సంప్రదాయము ననుసరించి బ్రహ్మణస్పతి యగు ఈశ్వరుని యందు ప్రతిష్ఠితమైయున్న వేదవిద్య హిరణ్యగర్భునియందును, పిదప మంత్రద్రష్టలగు ఋషుల యందును, పరమాచార్యుడగు ఈశ్వరుని సంకల్పమాత్రముననే జాగరితమై విలసిల్లినదని తెలియును. 'తామన్వవిందన్ ఋషిషు ప్రవిష్టామ్; దేవత్రం బ్రహ్మ గాయత' – ఇత్యాది ఋక్కులు నీశ్వరానుగ్రహముచే నీ వేదవిద్య ఋషులయందు జాగరితమైనదనియు, దేవప్రసాద లబ్ధమగు నిట్టి బ్రహ్మను (వేదమును) గానము జేయు డనియు నుద్బోధించుచున్నవి.

బ్రహ్మ, బ్రహ్మణస్పతి, బృహస్పతి - చారిత్రికుల యూహలు :-

పరమేశ్వరునకు బ్రహ్మ యను నామమే గాక బ్రహ్మ (వేద) సంరక్షకు డగుటచే వాక్పతి, వాచస్పతి, బృహస్పతి – ఇత్యాది నామములు శ్రుతిస్మృతులందు ప్రసిద్ధములు. కాని, చరిత్రకారులు బ్రహ్మ యను పదము ఋగ్వేదమున మంత్రములకు లేక స్తోత్రములకు మాత్రమే వాచకము.[1] బ్రహ్మణస్పతి యను నీ దేవత తరువాత కల్పింపబడినది; ఈ దేవత మొదట, స్తోత్రముల కధిపతి. కాని, యనతికాలములోనే యజ్ఞదేవు డయ్యెను. నిరాడంబరమైన వేదకాలపు మత దృక్పథము నుండి బ్రాహ్మణముల కాలమునాటి మతము జెందిన పరివర్తన మీ బ్రహ్మణస్పతి యందు జూడగలము"[2] – అని యీ రీతిగ జెప్పుచున్నారు. ఇట్లు చెప్పుట శ్రుతివిరుద్ధము. ఏలయన :—

"బ్రహ్మాయం వాచః పరమం వ్యోమ" — ఋ. 1-164-35.

"యావద్ బ్రహ్మ విష్ఠితం తావతీ వాక్" — ఋ. 10-114-8.

"బ్రహ్మా దేవానాం పదవీః కవీనామ్" — ఋ. 9-96-6.

"బ్రహ్మాణం బ్రహ్మవాహసమ్" — ఋ. 6-45-7.

"బ్రహ్మా తేన పునీహి నః" — ఋ. 9-67-23 ; వా. సం. 19-41.

---

1. S. Radhakrishanan – Indian Philosophy. Vol. I. 'Brahman in the Rgveda means a hymn or a prayer addressed to God' — Page 124.
2. Brahmanaspati is a very late God, belonging to the period when sacrifices began to come into vogue. Originally the lord of prayer, he soon became the God of sacrifices. We see in him the transition between the spirit of the pure Vedic religion and the later Brahmanism — Page. 89.

—ఇత్యాద్యనేక ఋగ్వేదమంత్రములందు బ్రహ్మపదము పరమేశ్వర వాచకముగ ప్రసిద్ధము. భాష్యకర్తలందఱును నిట్టియెడ నీ పదమును పరమేశ్వరవాచకముగనే గ్రహించి వ్యాఖ్యానించిరి. ఇం దుదహరించిన కొన్ని మంత్రముల తాత్పర్యము పూర్వము వివరింపబడినది గూడ. కాన, బ్రహ్మ యను పదము ఋగ్వేదమున మంత్రమును, లేక స్తోత్రమును, లేక పురోహితుని మాత్రమే బోధించుననుట యుక్తము కాదు. ఇక 'బ్రహ్మణస్పతి తరువాత కల్పింపబడిన దేవత' — అని యనుటయు తగదు. ఈ బ్రహ్మణస్పతి యొక్క బ్రహ్మణస్పతిత్వమును ఋగ్వేదమే యిట్లు వివరించుచున్నది.

> "ప్ర నూనం బ్రహ్మణస్పతి ర్మంత్రం వద త్యుక్థ్యమ్ ।
> యస్మి న్నింద్రో వరుణో మిత్రో అర్యమా దేవా ఓకాంసి
> చక్రిరే ॥" — ఋ. 1-40-5; వా. సం. 34-57.

ఇత్యాది మంత్రస్వభావమును వివరించు మంత్రము ఈ మంత్రమున 'బ్రహ్మణస్పతి (పరమేశ్వరుడు) యజ్ఞమునందు హోతృముఖమున నిలిచి ఇంద్రవరుణాది సర్వదేవతానిలయ మగు మంత్రమును నిజముగ నుచ్చరించుచున్నాడు' — అని చెప్పబడుచున్నది. ఈ బ్రహ్మణస్పతి యెవరు? బ్రహ్మలనగా మంత్రములు. అవి యింద్రవరుణాది దేవతలకు నిలయములు. అట్టి బ్రహ్మలకు, అనగా మంత్రములకు పతి యగువాడు బ్రహ్మణస్పతి. ఆ బ్రహ్మణస్పతియే యజ్ఞాదికర్మలయందు హోతృముఖమున మంత్రజాతము నుచ్చరించుచున్నా డని యిట జెప్పబడినది. అనగా ఋత్విఙ్ముఖముల నుండి మంత్రముల వెలువరింప జేయునది బ్రహ్మణస్పతియే యని గుర్తించుచు మంత్రముల నుచ్చరింప వలె నని తాత్పర్యము. ఈ బ్రహ్మణస్పతియే బృహస్పతి యనియు, ఆతడే సర్వజగన్నియంత యగు ఈశ్వరుడనియు, నీ క్రింది ఋక్కు చెప్పుచున్నది.

"సేమా మవిడ్ఢి ప్రభృతిం య ఈశిషేఽయా విధేమ
నవయా మహా గిరా। యథా నో మీఢ్వాన్ స్తవతే సఖా
తవ బృహస్పతే సీషధః సోతనో మతిమ్॥" —ఋ. 2-24-1.

ఇది బ్రహ్మణస్పతిదేవతాక మంత్రము. బ్రహ్మణస్పతియే యిట 'బృహస్పతే' యని సంబోధింపబడినాడు. కాన బ్రహ్మణస్పతియే బృహస్పతి. ఈ రెండు శబ్దములకు గల ప్రవృత్తినిమిత్త మొకటియే. 'బృహస్పతే – బృహతో బ్రహ్మణో మంత్రస్య స్వామిన్' (సా. భా.) మంత్రపతి లేక మంత్రస్వామి అని యిట పరమేశ్వరుడు సంబోధింప బడినాడు.

'హే బ్రహ్మణస్పతే, యః త్వం ఈశిషే సర్వస్య జగత
ఈశ్వరో భవసి సః త్వం, ఇమాం అస్మదీయాం, ప్రభృతిం
ప్రకర్షేణ భృతాం స్తుతిం, అవిడ్ఢి ప్రాప్నుహి' —సా. భా.

కాన నిచట బ్రహ్మణస్పతి (బృహస్పతి) సర్వజగన్నియంత యగు ఈశ్వరుడుగ కీర్తింపబడుచున్నాడు. ఈ బృహస్పతి నుండియే బృహత్త్వ ముతో నొప్పుచు మంత్రము లన్నియు నావిర్భూతము లయినట్లు ఈ క్రింది ఋక్కుకూడ చెప్పుచున్నది.

"ఉస్రా ఇవ సూర్యో జ్యోతిషా మహో విశ్వేషా మి జ్జనితా
బ్రహ్మణా మసి" — ఋ. 2-23-2.

తేజశ్శాలి యగు సూర్యుడు కిరణముల జనియింప చేయునట్లు, ఓ బృహస్పతీ! అన్ని మంత్రములను జనియింప జేయుచున్నావు – అని యర్థము.

సూర్యుని నుండి యప్రయత్నముగ కిరణములు ప్రసరించుచున్నట్లు వేదమంత్రములును పరమేశ్వరుని నుండి యప్రయత్నముగ నిఃసృతము

లగునని యీ మంత్ర తాత్పర్యము. 'విశ్వేషాం బ్రహ్మణాం జనితా'—అని యనుటచే బృహస్పతి యొక్క బ్రహ్మణస్పతిత్వము, అనగా సర్వమంత్ర ప్రవర్తకత్వము చెప్పబడినది. కాన, బృహస్పతియే బ్రహ్మణస్పతి. మాధవీయ ఋగ్వేదానుక్రమణిక యందు బ్రహ్మణస్పతి శబ్దము బృహస్పతి నామములలో పఠింపబడి యున్నది.

'బృహస్పతి ర్గణపతిః సప్తాస్యో బ్రహ్మణస్పతిః।
ఆంగిరసో నీలపృష్ఠః సప్తగు శ్చ బృహస్పతేః॥'

కాన ఋగ్వేదమున బ్రహ్మణస్పతి బృహస్పతికంటె భిన్నుడు కాడని తెలియును. ఇంతియే కాదు. తైత్తిరీయశ్రుతియు (3-11-4-2) ''బృహస్పతే బ్రహ్మణస్పతే'— అని బృహస్పతిని బ్రహ్మణస్పతిగా కీర్తించినది.

బృహస్పతి-బ్రహ్మణస్పతి-మంత్ర విభాగము :-

కాని ఋగ్వేదమున కొన్నిమంత్రములకు బార్హస్పత్య మంత్రము లనియు, కొన్నిమంత్రములకు బ్రాహ్మణస్పత్య మంత్రము లనియు విభాగము గలదు.

'యాసు బృహస్పతిశబ్దః శ్రూయతే తా బార్హస్పత్యాః।
శిష్టా బ్రాహ్మణస్పత్యాః' —సా.భా. (ఋ. 2-23; 2-24 మొ॥ సూ॥)

బృహస్పతియే బ్రహ్మణస్పతి యని చెప్పుచో నీ మంత్రవిభాగమునకు గారణ మేమి ? ఈ విషయము బరిశీలింప వలసియున్నది.

"మహాభాగ్యా ద్దేవతాయాః ఏక ఆత్మా బహుధా స్తూయతే॥"
— నిరు. 7-1-4.

మహాభాగ్యసంపన్న మగుటచే నొకే ఆరాధ్యదేవత బెక్కురీతుల బెక్కు నామములచే స్తుతింపబడుచుండు నని యర్థము. కాన నొక్కొక్క నామము ఆ దేవత యొక్క యొకొక్క విశిష్టతను బోధించుటకై ప్రవృత్త మగు చుండును. ఈ నామములు వాస్తవమునకు ఒకే దేవతాతత్త్వమును బోధింప జాలినవే. అయ్యును ఆ దేవతయొక్క విభిన్నములగు మహిమలను ప్రబో ధించెడి యా యా నామములతో నొప్పు మంత్రములు విభిన్నదేవతాకములుగ యజ్ఞాది కర్మనిర్వహణమునకై పరిగణనము చేయబడినవి. ఆ నామముచే నా దేవతయందు దెలియబడు విశిష్టతను గుర్తించుచు తత్తద్దేవతోద్దిష్ట హవి ర్దానాదికము చేయవలసి యున్నది.

'తస్మాత్ యథోక్తం తథైవ ప్రతిపత్తవ్యమ్ ఆత్మనః

శ్రేయ ఇచ్ఛద్భిః, జ్ఞానం వా కర్మ వా' —శం.భా. (బృ.ఉ. 2-4-10)

శ్రేయస్కాము లగువారు బ్రహ్మను గాని, కర్మను గాని శ్రుతి యెట్లుపదేశించినదో దాని నట్లే గ్రహింపవలెను; వేఱొక విధమున గాదు- అని యర్థము. కర్మానుష్ఠానసమయమున గాని, ఉపాసనాసమయమున గాని, బ్రహ్మజిజ్ఞాస జేయు సమయమునగాని, ఆ యా సమయములలో శ్రుత్యుపదేశములను యథాతథముగా గ్రహించి యందలి యర్థగాంభీర్య మును చర్చించి తరింపవలె నని తాత్పర్యము. కాన, బృహస్పతి, బ్రహ్మణస్పతి శబ్దములు నొకే దేవతా తత్త్వము నుద్బోధించునవి యైనను, అవి యా దేవతయందలి విభిన్నమగు విశిష్టతను తెలియజేయునట్టివి. ఈ శబ్దముల యందలి విశిష్టతను శ్రుతి యిట్లు వివరించుచున్నది.

"సో ఽయాస్య ఆంగిరసః। అంగానాం హి రసః। ప్రాణో
వా అంగానాం రసః। ప్రాణో హి వా అంగానాం రసః।
తస్మాత్ యస్మా త్కస్మా చ్చాంగాత్ ప్రాణ ఉత్క్రామతి।
తదేవ త చ్ఛుష్యతి। ఏష హి వా అంగానాం రసః॥ —21

ఏష ఉ ఏవ బృహస్పతిః। వా గ్వై బృహతీ। తస్యా ఏష
పతిః। తస్మా దు బృహస్పతిః॥ —22

ఏష ఉ ఏవ బ్రహ్మణస్పతిః। వా గ్వై బ్రహ్మ। తస్యా
ఏష పతిః। తస్మా దు బ్రహ్మణస్పతిః॥ — 23

ఏష ఉ ఏవ సామ। వా గ్వై సా। అమైషః। సా చామ
శ్చేతి త త్సామ్నః సామత్వమ్॥ —24

యత్ ఉ ఏవ సమః ప్లుషిణా। సమో మశకేన। సమో
నాగేన। సమ ఏభి స్త్రిభి ర్లోకైః। సమోఽనేన సర్వేణ।
తస్మాత్ ఉ ఏవ సామ।." —శ.బ్రా. 14-1-1-21 నుండి 24.

ఈ మంత్రమున నొకే ప్రాణదేవతయొక్క విభిన్నమహిమలను దెలియ జేసెడి విభిన్ననామములు నిర్వచింపబడుచున్నవి.

ఆంగిరసః :-

శరీరమునందలి యే అవయవము నుండి యైనను ప్రాణశక్తి యుత్క్రమించినపుడు ఆ యవయవము నీరసపడి శుష్కించుచున్నది. ప్రాణశక్తిగల యవయవములు నీరసపడుట లేదు; శుష్కించుటలేదు. కాన ప్రాణము అంగముల రసము (సారము). అంగరసభూతు డగుటచే, అనగా, స్థూల, సూక్ష్మ శరీరములకు ఆత్మ యగుటచే ప్రాణమునకు 'ఆంగిరసః' అని పేరు. ఈ ఆంగిరసుడగు సూత్రాత్మయే (ప్రాణదేవుడే) బృహస్పతి. ఇట ఆంగిరస పదముచే ప్రాణదేవతకు రూపప్రపంచాత్మత్వము చెప్పబడినది. ఇక బృహస్పతి, బ్రహ్మణస్పతి, సామ అను మూడు శబ్దములచే నామ ప్రపంచాత్మత్వము చెప్పబడుచున్నది.

బృహస్పతిః :-

ఈ ఆంగిరసుడే బృహస్పతి. వాక్కు బృహతి. బృహతికి పతి గాన బృహస్పతి. తరువాత 24 వ మంత్రములో 'ఏష ఉ వై సామ' -'ఇతదే సామ' యని యీ ప్రాణదేవతకు వాగ్విశేషమగు సామతో సామానాధి కరణ్యము చెప్పబడుచున్నది. అందుచే నీ మంత్రమున 'వాక్' పదముచే వాగ్విశేషములగు ఋక్కులు లక్షితము లగుచున్నవి. ఋక్కులన్నియు బృహతీ ఛందస్సునందు అంతర్భావము చెందు నని శ్రుతి మఱియొకచోట[1] చెప్పుచున్నది. మఱియు 'వా గ్వా అనుష్టుప్' (శ. బ్రా; 7-1-2-18) అను శ్రుతిప్రమాణముచే వాక్ అనగా అనుష్టుప్ ఛందస్సు; 32 అక్షరములు గలది. బృహతీఛందస్సునకు అక్షరములు 36. మహాసంఖ్యయం దవాంతర సంఖ్య యంతర్భావము చెందును. బృహతి యందు అనుష్టుప్ (వాక్) అంతర్భావము చెందును గాన వాక్కు బృహతీ యని ఇట చెప్పబడినది. ఇట్లు వాగ్రూప యగు బృహతికి, అనగా ఋక్కునకు, పతి యగుటచే నా ప్రాణదేవునకు బృహస్పతి యని పేరు.

బ్రహ్మణస్పతిః :-

ఈ బృహస్పతియే బ్రహ్మణస్పతి. వాక్కు బ్రహ్మ. బ్రహ్మరూపిణి యగు వాక్కుకు పతి గాన బ్రహ్మణస్పతి. వాక్కుచే బూర్వము ఋక్కులు లక్షితములు. అందుచే ఇట వాక్ పదముచే యజుస్సులు గ్రహింపబడు చున్నవి. వాగ్విశేషములగు యజుస్సులే యిట బ్రహ్మశబ్దలక్షితములు. అట్టి బ్రహ్మలకు అనగా యజుస్సులకు పతి గాన నా ప్రాణదేవుడే బ్రహ్మణస్పతి యగుచున్నాడు. బ్రహ్మశబ్దము నిఖిలమంత్రములకు నామ మయ్యును నిట యజుస్సులు చెప్పబడుచున్నవి.

---

1. స ఋచో వ్యౌహ ద్వాదశ బృహతీసహస్రా ణ్యేతావత్యో హర్చో యాః ప్రజాపతి సృష్టాః — శ. బ్రా. 10-4-2-23.

సామ :-

బృహస్పతియు, బ్రహ్మణస్పతియు నగు నా యాంగిరసుడే యిట సామశబ్దముచే చెప్పబడుచున్నాడు. 'సా చ అమ శ్చ సామ' అని సామ శబ్ద మిట నిర్వచింపబడినది. 'సా' అనగా వాక్కు. 'అమ' యనగా ప్రాణము. సామ శబ్దముచే వా క్ప్రాణరూప మిథునము చెప్పబడుచున్నది. కాన సామ వాక్-ప్రాణాత్మక మగును. అట్టి సామకు ప్రవృత్తిహేతు వగు ప్రాణమే యిట సామ శబ్దవాచ్యుడు — అని యర్థము.

మఱియు 'సా' అనునది సర్వనామ తచ్ఛబ్దము యొక్క స్త్రీలింగ రూపము ఇది నిఖిల స్త్రీలింగ శబ్దములకు ఉపలక్షకము, నిఖిల స్త్రీలింగ శబ్ద బోధ్యమగు వస్తుజాత మంతయు నిట 'సా' అను శబ్దముచే, అనగా వాక్కుచే లక్షిత మగుచున్నది. అట్లే 'అమ' యను శబ్దము నిఖిల పుంలింగ శబ్దములకు ఉపలక్షకము. నిఖిల పుంలింగ శబ్ద బోధ్య మగు వస్తుజాత మంతయు నిట 'అమ' శబ్దముచే, లక్షిత మగుచున్నది. కాన స్త్రీపుంసాత్మక మగు జగత్తే సామ. అట్టి సామకు ప్రవృత్తిహేతువగు ప్రాణమే యిట 'సామ' రూపుడు.

మఱియు లోకములో స్థూల సూక్ష్మ తారతమ్యములు గల శరీరము లనేకములు గలవు. సూక్ష్మాతిసూక్ష్మములగు కీటకాది శరీరములతోను, స్థూలములగు గజాది శరీరములతోను, ఈ మూడు లోకములతోను, ఇది యది యన నేల — దృశ్యమగు నీ సర్వప్రపంచముతో 'సముడు' అనగా సమాన పరిమాణము గలవాడు; కాన ప్రాణమునకు 'సామ' యని సార్థక నామము. — అని శ్రుతి తాత్పర్యము. (మూ. శం. భా; హరిస్వామి-భా.)

కాన నాకే ప్రాణదేవుడు 'అంగానాం రసః' — అను ప్రవృత్తి నిమిత్తము ననుసరించి ఆంగిరసు డైనాడు; ఋగ్రూపమగు బృహతికి

(వాక్కునకు) పతియై బృహస్పతి యైనాడు; యజూరూపమగు బ్రహ్మకూ (వాక్కునకు) పతియై బ్రహ్మణస్పతి యైనాడు; వాక్ప్రాణాత్మకమైన గీతీ రూపమగు సామకు ప్రవృత్తిహేతువగుచు 'సామ' రూపుడుగ జెప్పబడి నాడు; మఱియు స్త్రీపుంసాత్మక జగత్తు అనెడు సామకు, ప్రవృత్తిహేతు వగుచు సామరూపుడుగ జెప్పబడినాడు; స్థూలసూక్ష్మాది రూపమైన నిఖిల జగత్తుతో సముడు గాన సామరూపుడుగను జెప్పబడినాడు. అందువలన బృహస్పత్యాది శబ్దములు ఒకే దేవతను బోధించునవి యైనను, అవి యా దేవతయందలి యొక్కొక్క విశిష్టగుణము నుపలక్షింపజేయు నట్టివి. విశిష్టగుణస్ఫోరకము లగుటచే నీ నామములు గల మంత్రములకు ప్రత్యేక పరిగణన చేయబడినది. అట్లు పరిగణన చేయబడిన మాత్రమున బృహస్పతి వేఱు, బ్రహ్మణస్పతి వేఱు, ఆంగిరసుడు వేఱు అని యనుట శ్రుతి విరుద్ధము. ఇట్లు ఆపాతమున దోచు నానాత్వమునందు సంస్కార క్రమా సంపన్నులై యేకత్వమును దర్శించుట శ్రుతిసంమతమైన సంప్రదాయము.

పై బ్రాహ్మణ నిర్వచనము లందలి విశేషము గమనింప దగి యున్నది. రూపప్రపంచమునకు ఆత్మయై, ఆంగిరసుడై, విలసిల్లిన హిరణ్యగర్భుడే శబ్దప్రపంచమునకు ఆత్మయై బృహస్పతియు, బ్రహ్మణ స్పతియు నయి తుదకు సామరూపు డగుచున్నాడు. అనగా ఋక్కులకు, యజుస్సులకు పతియై వరలెడి ప్రాణదేవుడు సామలకు పతిగా చెప్పబడ లేదు. సామరూపుడుగ కీర్తింపబడినాడు. ఇంతియే కాదు. వాక్కునందు గల ఋగ్యజుఃసామరూప త్రైవిధ్యముచే నొకే ప్రాణదేవతయందు త్రైవిధ్యము చూపబడినది. (ఈ త్రైవిధ్యమును గూర్చి ముమ్ముందింకను వివరింప బడును.

మఱియొక విశేషము. ఋఙ్మంత్రములు దేవతాహ్వానరూపములు ను దేవతాస్తోత్రరూపములును. ఈ మంత్రములు దేవతాగణములకు నిలయము

లనియు (యస్మిన్ ఇంద్రో .... దేవాః ఓకాంసి చక్రిరే) బృహస్పతి యా మంత్రములను ప్రవర్తింపజేయువాడనియు పూర్వము చెప్పబడినది. అట్లు మంత్రరూపవాక్ప్రవర్తకుడై బృహస్పతి యగుచున్నాడు. ఇక బ్రహ్మణస్పతి బ్రహ్మలకు, అనగా యజుస్సులకు పతి, అని చెప్పబడినాడు. యజుస్సులు కర్మస్వరూప బోధకములు కాన కర్మస్వరూప బోధకములగు బ్రహ్మలకు (మంత్రములకు) పాలకు డగుటచే బ్రహ్మణస్పతి యని యన్వర్థనామము. కర్మప్రవర్తకములగు మంత్రములకు స్వామి యగుటచేతనే భారతీయులచే ప్రతిశుభకార్యారంభసమయము నందును పరమేశ్వరుడు బ్రహ్మణస్పతిగా నీ క్రింది ఋక్కుచే నారాధింపబడుచున్నాడు.

"గణానాం త్వా గణపతిం హవామహే కవిం కవీనా
ముపమశ్రవస్తమమ్। జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆ నః శృణ్వన్నూతిభిః సీద సాదనమ్॥" —ఋ. 2-23-1.

ఇట (1) 'గణానాం గణపతిం' అనుటచే ఈశ్వరుడు నిఖిలగణరూపుడు,[1] నిఖిలగణపాలకుడు నని చెప్పబడినాడు; (2) 'బ్రహ్మణాం బ్రహ్మణస్పతే' అని యనుటచే నిఖిల మంత్రరూపుడు; నిఖిల మంత్రపాలకుడు అనియు చెప్పబడినాడు. (3) 'జ్యేష్ఠరాజం, ఉపమశ్రవస్తమం, కవీనాం కవిం' ఇత్యాదిపదములచే నా పరమేశ్వరునియొక్క నిరతిశయ మహత్త్వము చెప్పబడుచున్నది. అందుచే 1. రూపప్రపంచాత్మత్వము 2. శబ్దప్రపంచాత్మత్వము 3. నిరతిశయ మహత్త్వము—అని ఈ ఋక్కునందు సంగ్రహముగ నిరూపితములైన యర్థములనే పై బృహదారణ్యకశ్రుతి విస్తరించి నిర్వచించినదని గ్రహింప నగును. నిఖిల నామ రూప ప్రపంచాత్మకుడై కర్మప్రవర్తక మంత్రస్వరూపుడు, తత్పాలకుడగుటచే మంత్రములును, కర్మలును, వీరక

1. గణానాం మధ్యే గణపతిం గణరూపేణ పాలకం
—మహీ. భాష్య. వా. సం. 23-19.

వర్తనములై శుభప్రదములగుటకు బ్రహ్మణస్పతిగా పరమేశ్వరుని ఆరాధించెడి సంప్రదాయము పరంపరాగతమై ప్రసిద్ధమైనది—సంప్రదాయానుగతమైన యీ యాచారము కూడ బ్రహ్మణస్పతియొక్క అనాదిత్వమును, ఈశ్వరత్వమును రెండిటి నుపలక్షింప జేయుచున్నది.

అందుచే 'ఆర్యులనెడి జాతివారికి ఇంద్రుడు ప్రధానదేవత: అతి ప్రాచీనదేవత; ఈ దేవతను గూర్చి పెక్కు సూక్తములు గలవు: బ్రహ్మణస్పతి అర్వాచీన కల్పితదేవత; ఈ దేవత నుద్దేశించిన సూక్తములు చాల తక్కువ; ఈ దేవత మొదట మంత్రములకు అధిపతియై పిదప యజ్ఞమును ప్రవర్తింపజేయు దేవత యయ్యెను' - ఇత్యాది చారిత్రిక కల్పనలు దేవతాతత్త్వ స్వరూపనిరూపకములు గావు. శ్రుతిసమ్మతములును గావు. అతిప్రాచీనుడని చెప్పబడెడి ఇంద్రదేవతతోనే బ్రహ్మణస్పతికిని, బృహస్పతికిని నిరంతర సాహచర్య మున్నట్లు 'ఇంద్రా బ్రహ్మణస్పతీ' (ఋ. 2-24-2) 'ఇంద్రా బృహస్పతీ' (ఋ. 4-49-1;4;5;6) - ఇత్యాది సమస్తపదముల ద్వారా ఋగ్వేదము తెలియజేయుచున్నది.

అగ్నియే అంగిరసుడు, బృహస్పతి, బ్రహ్మణస్పతి:-

ఇంతే కాదు. ఈ బ్రహ్మణస్పతి తర్వాత నెపుడో యజ్ఞదేవతయై వెలిసినా డనుటయు యుక్తము కాదు. ఋగ్వేదము మొదటి మంత్రమున 'అగ్ని మీడే పురోహితం యజ్ఞస్య దేవమ్' అని, యే మహాగ్ని తొలుదొలుత యజ్ఞదేవుడుగను, యజ్ఞపురోహితుడుగను కీర్తింపబడినాడో యా మహాగ్నియే అంగిరసుడు;[1] అతడే బృహస్పతి;[2] అతడే బ్రహ్మణస్పతి;[3] అతడే సోమ; అతడే ఇంద్రాది దేవతాత్మకుడును - అని ఋగ్వేదమే

1. ఋ. 1-1-6; 1-31-1; 2; 17 ఇత్యాది.
2. 1-139-10.
3. ఋ. 2-21 సూక్తమునంతయు చూచునది.

విస్పష్టముగ దెల్పుచున్నది. అగ్నియే గాదు, సోముడు గూడ ఋగ్వేదమున నొకచోట బ్రహ్మ యనియు ('బ్రహ్మా దేవానాం', 9-96-6), మఱొకచో బ్రహ్మణస్పతి యనియు ('పవిత్రం తే వితతం బ్రహ్మణస్పతే,' 9-83-1) కీర్తింపబడినాడు. కాన నీ దేవతానామములు ఆ యా దేవతలకు కేవల సాంకేతికనామములు గావు. ఇవి తమ ప్రవృత్తినిమిత్తములచే పరమేశ్వరుని నిరతిశయ మహత్త్వము (బ్రహ్మత్వము) న ద్దీపింప జేయునట్టివి.

దేవతానామములు - విశేషణవాచకములు :-

కాని ఒకచో నగ్నికి, ఇంకొకచో బృహస్పతికి, ఇట్లే సోమునకు, ఇంద్రునకు, విశ్వకర్మకు, సవితృదేవత మున్నగు వారికిని యీ నిరతిశయ మహత్త్వము శ్రుతులయందు వేర్వేఱు స్థలములయందు గన్పట్టుచుండుటచే వేర్వేఱు కాలములందు వేర్వేఱు రచయితలచే నిట్లు కల్పింపబడినట్లు చారిత్రికులచే పలుతీరులుగ నూహింపబడుచున్నది. ఈ దేవతా నామములు కేవలము సంకేతము లనుకొనుటచే నిట్టి యూహలు జనించి యుండవచ్చును. ఇవి కేవలసాంకేతికపదములు కావు. ఏలయన—

'ఇంద్రతమా హి ధిష్ణ్యా మరుత్తమా దస్రా' — ఋ. 1-182-2.

అని యీ మంత్రమున అశ్వినులు 'ఇంద్రతమౌ, మరుత్తమౌ 'యని కీర్తింప బడినారు. సామాన్యముగ దేవతావాచకములుగ ప్రసిద్ధము లయిన 'ఇంద్ర మరుత్' శబ్దము లిచట విశేషణవాచకములుగ ప్రయోగింపబడినవి. ఈ పదములకు గల యౌగికార్థముల గ్రహించిననేగాని యిట నర్థము పొసగ దనుట స్పష్టము. అశ్వినుల యందు అతిశయితమగు ఇంద్రత్వము (పారమైశ్వర్యము) మరుత్త్వము (వేగగామిత్వము లేక మితరాగిత్వము) దర్శింప బడవలె నని శ్రుతితాత్పర్యము. (ఇంద్రతమా హి ఈశ్వరతమౌ ఖలు మరుత్తమా మరుద్వద్వేగగామినౌ మితరాగిణౌ మితరావిణౌ వా'—సా.భా

ఇట్లే యుషోదేవతయు మఱియొక ఋక్కు (1-73-3) నందు 'ఇంద్ర తమా' యనియు, 'అంగిరస్తమా' యనియు బేర్కొనబడినది. (సర్వస్య ఈశ్వరతమా; గంతృతమా."సా.భా.) వహ్ని శబ్దము అగ్నిదేవతావాచక మయ్యును నొకచో ప్రజాపతి గూడ "వహ్నితమః" అని చెప్పబడినాడు. "దేవానా మసి వహ్నితమః"(ప్ర. ఉ. 2-8) (దేవానాం ఇంద్రాదీనాం అసి భవసి త్వం వహ్నితమః హవిషాం ప్రాపయితృతమః—శం.భా.)

ఇంతియేగాక ఒక దేవతావాచకపదము ఇతరదేవతావాచక పదమునకు విశేషణముగ బ్రయోగింపబడుట శ్రుతులందు బ్రసిద్ధము. అట్టియెడ యౌగి కార్థమును గ్రహించిననేగాని యర్థము పొసగదు.

"బ్రహ్మేంద్ర మగ్నిం జగతః ప్రతిష్ఠాం। దివ ఆత్మానగ్ం
సవితారం బృహస్పతిం। చతుర్హోతారం ప్రదిశోనుక్లప్తం
వాచో వీర్యం తపసాన్వవిందన్।" —తై. అ. 3-11.2. (చూ.సా.భా.)

ఈ ఋక్కునందు వేదవాక్సారభూతుడగు (వాచోవీర్యం) పరమేశ్వరుడు ఇంద్రశబ్దముచే చెప్పబడినాడు. ఇట 'జగతఃప్రతిష్ఠాం' ఇత్యాది విశేషణ ములతోపాటు 'అగ్నిం సవితారం, బృహస్పతిం' అని దేవతావాచకపదములు కూడ ఇంద్రునకు (పరమేశ్వరునకు) విశేషణములుగ నిర్దేశింపబడినవి. అనగా నీ పదముల యొక్క ప్రవృత్తినిమిత్తముల ద్వారా పరమేశ్వరుని యందలి విభిన్నమహత్త్వముల దర్శింపవలె నని శ్రుతి యుద్బోధించు చున్నది. ఇట్లు ఈ పదములయందు నిగూఢమై యున్న శక్తిని, గాంభీర్య మును దర్శించి, యివి యన్నియు పరమేశ్వరతత్త్వోపలక్షకము లని గ్రహించుట యుక్తము. అట్లుగాక యౌగికశక్తిని విడిచి వీనిని కేవలము సాంకేతికనామములుగ గ్రహించుటగాని, దేవతలయందు ప్రాచీనార్వాచీన భావముల బెంపొందింపజేసికొనుటగాని శ్రుతి విరుద్ధములగు నర్థముల జెప్పుటయే యగును.

బ్రహ్మ-బ్రహ్మకర్మ :-

'బ్రహ్మణాం బ్రహ్మణస్పతే' - ఇత్యాది ప్రమాణములచే కర్మ ప్రవర్తకము లగు మంత్రములు బ్రహ్మ లగుట దర్శించితిమి. కాన, అట్టి బ్రహ్మలచే (మంత్రములచే) నిర్వర్తింపబడు కర్మలును, స్తోత్రములును, హవిరాదులు గూడ 'బ్రహ్మాణి' యని శ్రుతులయందు బ్రసిద్ధము లయినవి. బ్రహ్మరూపము లగుటచేతను, బ్రహ్మలచే(మంత్రములచే) సుసంస్కృతము లగుటచేతను కర్మలకు 'బ్రహ్మకర్మ' లనియు బ్రసిద్ధి యేర్పడినది. కావుననే నేటికిని గూడ నిత్యనైమిత్తిక కర్మలన్నిటియందును 'పరమేశ్వరప్రీత్యర్థం బ్రహ్మకర్మ సమారభే' యని సంకల్పించెడి యాచారము సంప్రదాయానుగతమై వచ్చుచున్నది.

కాని, (1) బ్రహ్మ యనిన సామాన్యముగ నుపనిషత్ప్రతిపాద్యమగు బ్రహ్మ యను నర్థము స్ఫురించును. అగుచో బ్రహ్మను ప్రతిపాదించెడి యుపనిషద్భాగమునకు మాత్రమే బ్రహ్మ యను నామ ముండుట సమంజసముగ నుండిన నుండవచ్చును. తదితర వేదభాగమునకుగాని, యా వేదభాగముచే బ్రతిపాదింపబడు కర్మలు మున్నగువానికి గాని బ్రహ్మ యను నామమెట్లు సార్థకమగును? (2) సంహితలలోని మంత్రములకును, తత్ప్రతిపాదిత కర్మలు మొదలగు వానికిని గల బ్రహ్మ యను సాంకేతిక నామమునే తరువాత ఉపనిషత్కాండయు గ్రహించి స్వప్రతిపాద్య మగు వస్తువునకును బ్రహ్మ యను నామమును కల్పించినదా ?

ఇట్లనుట తగదు. బ్రహ్మ యనునది యొక సాంకేతికనామము కాదు. అది యర్థవత్తరము. నిరతిశయ మహత్త్వాది వివిధార్థోపబృంహితము. ఈ విషయము సప్రమాణముగ నిరూపితము. అట్టిచో నిది కేవల నిరర్థక సాంకేతికపద మనుటెట్లు ? ఈ పదము ఋగ్వేదమున నెట్టి యర్థముతో

విలసిల్లినదో యా యర్థమే ఉపనిషత్కాండయందు విస్తరించి నిర్వచింపబడినది. మంత్రములు స్తుతిరూపములై సూత్రాత్మకములై ప్రవర్తిల్లినవి : మిగిలిన వేదభాగము తద్వివరణమునకై ప్రవర్తిల్లినది. ఈ విషయమును అడుగడుగున భాష్యకర్తలును స్పష్టము చేసిరి. అందుచే శ్రుతియం దొక భాగముచే ప్రతిపాద్యమగు అర్థము వేఱు, ఇంకొక భాగముచే ప్రతిపాద్యమగు అర్థము వేఱు అన దగదు, ఒకే లక్ష్యమును అధికారిభేదము ననుసరించి యుద్బోధించుటకై శ్రుతి వివిధరూపములతో నవతరించినది. అందుకై కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ అను నామములును అధికారిభేధము ననుసరించి ప్రవృత్తము లయినవి. అంతియే, వీని యన్నిటి లక్ష్యము ఒకటియే. ఆ యొకటియే బ్రహ్మ.

బ్రహ్మ యనిన యుపనిషత్ప్రతిపాద్య మగు బ్రహ్మయే కాదు. సగుణమూర్తియై సృష్టి లయస్థితి కర్త యగు పరమేశ్వరుడును బ్రహ్మయే. తదనుగ్రహముచే నావిర్భవించిన ప్రథమశరీరియు, ఈశ్వరుడు నగు హిరణ్యగర్భుడును బ్రహ్మయే. విరాట్టు బ్రహ్మయే. ఈ నలువురియందును కొలది భేదములతో బ్రహ్మత్వ మనుగతమై యుండును. ఇట్టి బ్రహ్మత్వమును అధికారిభేదము ననుసరించి బోధించుటకే యిన్ని బ్రహ్మలు (మంత్రములు, కర్మలు మొ.) ప్రవృత్తము లయినవి. కావున, కృత్స్నవేదలక్ష్యము ఒకటియే. ఈ విషయమును ఋక్కులే అనేక విధములుగ వర్ణించి యున్నవి. వేదవాక్యములు, కర్మలు మున్నగున వన్నియు మత్స్వరూపావబోధకములే అని పరమేశ్వరుడు స్వయముగ జెప్పుట ఋగ్వేదము యొక్క మొదటి మండలము నందలి ఇంద్ర మరుత్సంవాదమున స్పష్టముగ గాంచ నగును.

"బ్రహ్మాణి మే మతయః శం సుతాసః శుష్మ ఇయర్తి ప్రభృతో
మే అద్రిః। ఆ శాసతే ప్రతి హర్యన్త్యుక్థేమా హరీవహత
స్తా నో అచ్ఛ॥" —ఋ. 1-165-4; వా. సం. 33-78.

'హే మరుతః, బ్రహ్మాణి మంత్రవాక్యాత్మకాని స్తుతివచాంసి, హవీంషి వా సోమాజ్యాదీని, మే మమ స్వభూతాని, చోదనా వాక్యే ఉగ్న్యాదిదేవతాంతరసంబంధేన ప్రతీయమానా న్యపి సర్వదేవతా ప్రాణాత్మనో మమేంద్రస్యైవ తానీతి భావః। మతయః మననయుక్తాః స్తుతయో ఒపి, శం మమ సుఖోత్పాదికాః, అతో యజ్ఞే గంతవ్య మితి భావః' — మహీ. భా.

ఈ మంత్రమునగల ఇంద్రశబ్దము సర్వదేవతా ప్రాణాత్మ యయిన పరమేశ్వరవాచకము. సర్వదేవతా ప్రాణాత్మ స్వరూపుడు మొదట పరమేశ్వరుడు, తరువాత హిరణ్యగర్భుడును గూడ నగుదురు. ఇంద్రాగ్న్యాది శబ్దములు దేవతావాచకములు అయ్యును కొన్నియెడల ప్రకరణము ననుసరించి పరమేశ్వరవాచకములు గూడ నగుచుండునని పూర్వము వివరింపబడినది. పరమేశ్వరుడు లోకోత్తర మహాభాగ్య సంపన్నుడగుటచే, ఆయన మహామహిమలను ప్రస్తుతించుటకు ఎన్నియేని నామములు శ్రుతియందు గానవచ్చును. ఇంద్రశబ్దము అట్టిదే (ఇది పరమైశ్వర్యే), ఇంద్రుడన పరమేశ్వరు డని యర్థము. ఇంద్రశబ్ద మొకదేవతా వాచకముగనే కాక పరమేశ్వరవాచకముగ శ్రుతులయందు బహుళముగ ప్రసిద్ధము. అందుచేతనే భాష్యకర్తలు నీ మంత్రము నందలి ఇంద్రపదమును సర్వదేవతా ప్రాణాత్మరూపుడగు పరమేశ్వర పరముగ గ్రహించి వ్యాఖ్యానించిరి. ఇక మంత్రార్థమును జూతము.

'ఆ యా దేవతల నుద్దేశించి చేయబడు మంత్రవాక్యాత్మకములగు స్తుతివచనములు, సోమాజ్యాది హవిస్సులు, నన్నియు నావియే. అనగా శ్రుతివాక్యమునందు అగ్ని మున్నగు నితరదేవతల నుద్దేశించినట్లు ప్రతీయమానములగు స్తోత్ర హవిరాదు లన్నియు సర్వదేవతాప్రాణాత్మరూపుడ నగుటచే నావియే యగును. మఱియు మననయుక్తములగు స్తుతులు

(మతయః) నాకు ప్రీతికరములు. కావున నో మరుత్తులారా! నేను యజ్ఞమున కేగ వలసి యున్నది. ఈ స్తోత్రహవిరాదు లన్నియు ఆత్మీయము లగుట చేతనే యజ్ఞభూమి కేగుట కాదు; యజమానులు, వారిచే ప్రవర్తింప జేయబడు స్తోత్ర శస్త్రము లన్నియు నన్నే యభిలషించుచున్నవి. అందుచే గూడ యజ్ఞమున కేగవలెను. మీరును రండు.'- అని మంత్రార్థము.

ఋగాదిమంత్రములును, సోమాది హవిస్సు లన్నియును 'తవాహ మస్మి'-'నేను నీ దానను' అని యీ రీతిగ ననుచు పరమేశ్వరునే కాంక్షించు చుండును; ఆ దేవునే పొందుచుండును- అని 'యో జాగార త మృచః కామ యన్తే'(ఋ.5-45-14,15)అను మంత్రము వివరించుచున్నది. ఈ విషయము వేదశబ్దమున వివరింపబడినది. 'బ్రహ్మ బ్రహ్మ యే జుజుషుర్హవిర్హవిః' (ఋ.9-77-3).ఇత్యాది ఋక్కులు మంత్రాత్మకమగు ప్రతి స్తోత్రము(బ్రహ్మ బ్రహ్మ) ప్రతి హవిస్సు సోముని (పరమేశ్వరుని) సేవించుచున్నట్లు చెప్పుచున్నవి. ఈ యర్థమునే భగవద్గీతయు నిట్లనువదించినది.

"యే ఽప్యన్యదేవతాభక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః।
తే ఽపి మా మేవ కౌంతేయ యజ న్త్యవిధిపూర్వకమ్॥
అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభు రేవ చ।
న తు మా మభిజానంతి తత్త్వే నాత శ్చ్యవన్తి తే॥"-9-23,24

మఱియు పై మంత్రమున 'బ్రహ్మాణి మే, మతయః మే' అని యనుటచే మంత్ర - హవి రాదు లన్నియు నానుండియే, నాకొఱకే-అనగా పరమేశ్వరుని కొఱకే-యను విషయము స్పష్ట మగుచున్నది. ఇంతే గాదు. పరమేశ్వరుడగు నింద్రుడు మంత్రములను స్వయముగ ప్రవర్తింపచేసి నట్లును, అవియు స్వయముగ (అనగా నిరపేక్షముగ) పురుషార్థ సాధకము లగుటయు మఱియొక ఋక్కునందును గాంచనగును.

"బ్రహ్మాణి హి చకృషే వర్ధనాని తావ త్త ఇంద్ర మతిభి
ర్వివిష్మః। సుతే సోమే సుతపాః శం తమాని రాంద్ర్యా
క్రియాస్మ వక్షణాని యజ్ఞైః॥" —ఋ. 6-23-6. (చూ. సా.భా.)

ఇట 'బ్రహ్మాణి హి చకృషే' - అని యనుటచే పరమేశ్వరుడే బ్రహ్మ (మంత్ర) ప్రవర్తకుడగుట చెప్పబడినది; ఈ మంత్రములు స్వయముగనే పురుషార్థ సాధకము లగుచు (వర్ధనాని స్వయమేవ వృద్ధికరాణి), నిరతిశయానందదాయకములు (శంతమాని శుభకృత్తమాని); కావున రమణీయములు (రాంద్ర్యా,రాంద్ర్యాణి రమణీయాని); హవిర్యుక్తములై వాహకములు (యజ్ఞైః హవిర్భిర్యుక్తాని వక్షణాని వాహకాని) - అగుట గమనింప దగినది.

పై ఋక్కులను బరిశీలించినచో (1) యజ్ఞకర్తయు, యజ్ఞసంరక్షకుడును, యజ్ఞములకు ప్రధానలక్ష్యభూతుడును, తత్తత్కర్మఫలప్రదుడును బ్రహ్మయే, అనగా పరమేశ్వరుడే. (2) మంత్రములు, ఆ యా దేవత నుద్దేశించి చేయబడు స్తోత్రశస్త్రములు, త్యాగము చేయబడు హవిరాదులు- అన్నియు పరమేశ్వరునివే - ఇట్టి యీ బ్రహ్మము అన్యనిరపేక్షముగ పురుషార్థసాధకము లగుచు నిరతిశయానంద దాయకములు, కావున, రమణీయములు అనియు తెలిసినది. ఇవి యిట్లు బ్రహ్మనుండి లేక బ్రహ్మ కొఱకే ప్రవర్తిల్లుటచే వీనికి 'బ్రహ్మ' యను నామము సార్థక మగుటయు గాంచనగును. (3) మఱియు నివి 'శంతమాని, రాంద్ర్యాణి' యను విశేషణములచే, యజమానుడు యజ్ఞాదికర్మల ననుష్ఠించుచు మననయుక్తములగు నీ మంత్రముల (మతయః) మననము చేయుకొలది క్రమముగ చిత్తపరిపాకవశమున నిరతిశయానంద స్వరూప బ్రహ్మభావ బోధకములై, తమయందు నిగూఢములైన రమణీయార్థముల దర్శింప జేయగల వనియు నిట సూచిత మగుచున్నది. యజ్ఞాదికర్మ లన్నియు

చిత్తశుద్ధి సంపాదనము ద్వారా క్రమముగ బ్రహ్మవిద్యాసాధనము లగుట శ్రుతులు నిట్లు వివరించినవి.

"త మేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన
దానేన తపసాఽ నాశకేన" — బృ.ఉ. 4.4-22.

ఈ విషయము బ్రహ్మసూత్రములందు సర్వాపేక్షాధికరణమున విపులముగ జర్చించి వివరింపబడియున్నది. కాన మంత్రము లిట్లు క్రమముగ బ్రహ్మస్వరూప ప్రాప్తిహేతువు లగుటచే గూడ వానికి 'బ్రహ్మణి' యను నామము సార్థకము. పైన చెప్పినట్లు ఈ బ్రహ్మ (మంత్రము లేక స్తోత్రము) దేవప్రసాదలబ్ధ మగుటచే దీనిని గానము చేయు డనియు ఋగ్వేదము ప్రబోధించుచున్నది.

"దేవత్తం బ్రహ్మ గాయత" — ఋ. 8-32-27.

'దేవప్రసాదలబ్ధం, బ్రహ్మ స్తోత్రం, ప్రగాయత' — సా. భా.

ఇట్లు దేవదత్తములైన యీ మంత్రములను (బ్రహ్మలను) శ్రుతి చమత్కారముగ బ్రహ్మవాహనము లని వర్ణించినది.

"బ్రహ్మణం బ్రహ్మవాహసం" — ఋ. 6-45-7.

"బ్రహ్మవాహస్తమం" — ఋ. 6-45-19.

"బ్రహ్మవాహః" — ఋ. 4-41-3.

"బ్రహ్మవాహసే" — ఋ. 5-34-1.

"సఖాయో బ్రహ్మవాహసః" — ఋ. 6-45-4.

'బ్రహాణి స్తోత్రాణి స్తుత్యతయా వహతీతి బ్రహవాహాః ; బ్రహ్మణా స్తోత్రేణ ప్రాప్యతే ఇతివా ; అతిశయేన బ్రహ్మభిర్మంత్రై ర్వహనీయః' — సా. భా.

బ్రహ్మలను (మంత్రములను) వహించువాడు : బ్రహ్మలచే వహింపబడదగినవాడు : కాన బ్రహ్మవాహసుడు - అని యర్థము. ఇట వాహనము బ్రహ్మ, వహింపబడునది బ్రహ్మ. కాన మంత్రమునకును బ్రహ్మకును గల ప్రతిపాద్య ప్రతిపాదకభావరూప సంబంధము ఈ బ్రహ్మశబ్ద పరిశీలనము జేయుకొలది దృఢతర మగుచున్నది. అందుచే బ్రహ్మలచే (వేదములచే) వహింపబడునది, అనగా తెలియజేయబడునది. లౌకికవిషయములు కావు : అలౌకికములు నతీంద్రియములగు ధర్మ బ్రహ్మలే - యను విషయ మీ 'బ్రహ్మాణం బ్రహ్మవాహసం' ఇత్యాది పదముల ద్వారా శ్రుతి బోధించుచున్నది. ఈ యర్థమును పురాణేతిహాసములు వేయినోళ్ళ గీర్తించియే యున్నవి.

బ్రహ్మ - అబ్రహ్మ :-

మంత్రములు బ్రహ్మ లగుటచేతను, బ్రహ్మతత్త్వ ప్రతిపాదనమే ఏకైకలక్ష్యముగా గలది యగుటచే కృత్స్నవేదరాశికివి బ్రహ్మ యను నామము ప్రసిద్ధమైనది. బ్రహ్మతత్త్వప్రాతిపాదనము లక్ష్యముగా గలది యగుటజేసి శ్రుతి తనను బ్రహ్మ యనియు, అట్టి లక్ష్యము లేని లౌకిక వాఙ్మయమును అబ్రహ్మ యనియు జెప్పుచున్నది.

"యచ్చ బ్రహ్మ యచ్చాబ్రహ్మ। అంత ర్బ్రహ్మన్ ప్రతిష్ఠితమ్ ॥"
—తై. బ్రా. 3-12-8-2.

'బ్రహ్మ వేదః। అబ్రహ్మ పౌరుషేయగ్రంథాః। అంత ర్బ్రహ్మన్ వేదమధ్యే, ప్రతిష్ఠితమ్ కర్మ జ్ఞానం చ' — సా. భా.

ఈ మంత్రము వేదము బ్రహ్మ యనియు, దానియందు కర్మ జ్ఞానములు ప్రతిష్ఠితములైనవనియు జెప్పి అట్లు ప్రతిష్ఠితము కానట్టి పౌరుషేయ మగు వాఙ్మయము అబ్రహ్మ యనియు దెల్పుచున్నది.

అందుచే కర్మ జ్ఞాన ప్రబోధమునకే యీ వేదశాస్త్ర మవతరించిన దని శ్రుతివలన దెలియును.

శబ్దబ్రహ్మ :-

వేదము బ్రహ్మయనియే గాక శబ్దబ్రహ్మ యనియు అపరబ్రహ్మ యనియు మిగుల బ్రసిద్ధమైనది.

"ద్వే విద్యే వేదితవ్యే తు శబ్దబ్రహ్మ పరం చ యత్।
శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥"
— అమృతబిందు. ఉ. 17; విష్ణు. పు. 6-5-64; 5-1-35.

"అహం వై సర్వభూతాని భూతాత్మా భూతభావనః।
శబ్దబ్రహ్మ పరబ్రహ్మ మమోభే శాశ్వతీ తనూ॥" —భాగ.6-16-51.

"త్వం హి బ్రహ్మ పరంజ్యోతిః గూఢం బ్రహ్మణి వాఙ్మయే।"
—భాగ, 10-63-36.

"పరావరే బ్రహ్మణి ధర్మతో వ్రతైః।
స్నాతస్య మే న్యూన మలం విచక్ష్వ॥" —భాగ. 1-5-7.

"తస్మా ద్గురుం ప్రపద్యేత జిజ్ఞాసు శ్శ్రేయ ఉత్తమమ్।
శాబ్దే పరే చ నిష్ణాతం బ్రహ్మ ణ్యుపశమాశ్రయమ్ ॥"
—భాగ. 3-11-25.

శబ్దబ్రహ్మ, లేక అపరబ్రహ్మ యగు వేదమునందు నిష్ణాతుడగువాడే, యందు నిగూఢమై యున్న పరబ్రహ్మతత్త్వమును దెలియగలడు. అందుచే శబ్దబ్రహ్మయందు నిష్ణాతుడై యపరోక్షాత్మానుభవ కుశలుడైన గురువును జిజ్ఞాసువు నధికారియు నగువాడు సేవింపవలెను - అని పై శ్లోకముల తాత్పర్యము. ఈ పై వాక్యము లన్నియు "బ్రహ్మణం బ్రహ్మవాహనం" ఇత్యాది శ్రుతితాత్పర్యము ననువదించునవి యగుట స్పష్టము.

దేవాలయములందు జరుపబడు బ్రహ్మోత్సవములు నీ యర్థము నుపలక్షింప జేయునవియే యని సంప్రదాయము. కాన నిట్లు శబ్దబ్రహ్మ యని ప్రసిద్ధి గాంచిన యీ వేదరాశిని లౌకిక చరిత్రను బోధించు లక్ష్యము గలదిగా గ్రహించుట యనుచితము.

బ్రహ్మ-బ్రహ్మపురము :-

బ్రహ్మశబ్దము ప్రధానముగ పరమేశ్వరునకును, హిరణ్యగర్భాదులకును తత్ప్రతిపాదకమగు వేదరాశికిని, తద్విహిత కర్మజాతమునకును వాచక మగుట దర్శించితిమి. త్రైలోక్యశరీరము (విరాట్స్వరూపము లేక బృహచ్ఛరీరము) బ్రహ్మశబ్ద లక్షిత మైనట్లే స్థూల - సూక్ష్మ - కారణరూప త్రైవిధ్యము గల్గి బ్రహ్మకర్మసాధన మగు యజమానుని శరీరముకూడ బ్రహ్మశబ్దిత మని ఋగ్వేదము వలన తెలియుచున్నది.

"య త్తే పవిత్ర మర్చి ష్యగ్నే వితత మంతరా।
బ్రహ్మ తేన పునీహి నః।" —ఋ. 9-67-23.

ఇది పవమాన గుణవిశిష్ట - అగ్ని దేవతాక మంత్రము. "ఓ పవమానాగ్నీ! అగ్ని విద్యు దాదిత్య రూపమయిన నీ తేజస్సునందు అంతర్నిహితమై, సర్వవ్యాప్తమై, పావనమై (అంతః ఆవితతం పవిత్రం) యే దివ్యతేజస్సు (శక్తి) గలదో, యా దివ్యతేజముతో మా యీ బ్రహ్మను (శరీరమును) పావనము చేయుము" — అని యర్థము. (మూ. సా. భా; వేం. మా. భా.).

దీని ననుసరించి బ్రహ్మకర్మ సాధనమైన శరీరము బ్రహ్మ యగుట స్పష్టము. పరమేశ్వరుని త్రైలోక్యశరీర మెట్లు అగ్నీంద్రాది దేవతా నిలయమో, అట్లే ప్రతిశరీరముగూడ దేవతానిలయముగ (దేవాలయముగ) గుర్తింప నగునని శ్రుతి ప్రత్యక్షముగను, పరోక్షముగను ప్రబోధించుచున్నది.

"శం నో మిత్రః శం వరుణః శం నో భవ త్వర్యమా।
శం న ఇంద్రో బృహస్పతిః శం నో విష్ణు రురుక్రమః।"
—ఋ. 1-90-9.

"నమో బ్రహ్మణే నమ స్తే వాయో త్వ మేవ ప్రత్యక్షం
బ్రహ్మాసి త్వ మేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి"–తై. ఉ. శిక్షావల్లి.

ఇట మిత్ర వరుణాది దేవతలు 'శం' కరులుగ నుతింపబడుచున్నారు. వీరందఱు నధ్యాత్మదేవతలు. ఆధిదైవికముగ జగద్యాత్రా నిర్వహణ సహకారులైన యీ దేవతలు ఆధ్యాత్మికముగ శరీరయాత్రా నిర్వహణమున గూడ ప్రాణదేవతా సహకారు లగుచున్నారు.

ఇందు ప్రాణవృత్త్యభిమాన దేవతయు, అహరభిమాన దేవతయు మిత్రుడు. అపానవృత్త్యభిమాన దేవతయు, రాత్ర్యభిమాన దేవతయు, వరుణుడు. చక్షురభిమాన దేవతయు, ఆదిత్యాభిమాన దేవతయు అర్యముడు. బలమున ఇంద్రుడును, వాగ్బుద్ధులయందు బృహస్పతియు, పాదముల యందు (గతియందు) ఉరుక్రముడగు విష్ణువును దేవతలు. ఇట్లు అధ్యాత్మ ప్రాణ కరణ (ఇంద్రియ) అభిమానిదేవతలయొక్క అనుగ్రహమర్థింప బడి, తరువాత సమష్టి దేవతాత్మకుడు ముఖ్యప్రాణరూపుడు నగు వాయు దేవత 'త్వ మేవ ప్రత్యక్షంబ్రహ్మాసి' – అని కీర్తింపబడి యర్థింప బడు చున్నాడు. వాయువు సూత్రాత్మ (హిరణ్యగర్భుడు) రూపమున పరోక్షముగ నుండునే కాని ప్రత్యక్షముగాడు. కాని ఆధ్యాత్మిక ప్రాణరూపమున సాక్షి వేద్యమై, ప్రత్యక్ష మగుచుండును గాన వాయువు ప్రత్యక్ష బ్రహ్మగా నిట స్తుతింపబడినాడు (చూ. శం. భా).

ఇట్లు శరీరము దేవతానిలయమై జ్ఞేయుడు, జీవునకు స్వరూపభూతుడు నగు బ్రహ్మకు నిలయమై వెలయుచుండుటచే శరీరము దేవాలయ మనియు బ్రహ్మపుర మనియు వైదికవాఙ్మయమున ప్రసిద్ధమైనది.

"అష్టాచక్రా నవద్వారా। దేవనాం పూ రయోధ్యా।
తస్యాగ్ంహిరణ్మయః కోశః। స్వర్గో లోకో జ్యోతిషాఽఽవృతః।
యో వై తాం బ్రహ్మణో వేద। అమృతే నాఽఽవృతాం పురీమ్।
తస్మై బ్రహ్మ చ బ్రహ్మాచ ఆయుః కీర్తిం ప్రజాం దదుః।"
—అథ. 10. 2-31; తై. ఆ. 1. 27-2,3.

"త్వగాద్యష్ట ధాతు రూపములగు అష్టచక్రములతోను, ఇంద్రియాది నవ ద్వారములతోను, అయోధ్య యను సార్థకనామమున బఱగుచు నజేయమై దేవతానిలయమగు నీ శరీర మనెడి పుర మొప్పుచుండును. ఈ పురమున జ్యోతిర్మయమైన కోశము స్వర్గలోకము. అయ్యది జీవచైతన్యరూపమగు జ్యోతిస్సుచే నావృతమై యుండును.

కావున నీ పురిని సత్యజ్ఞానానందలక్షణ బ్రహ్మకు సంబంధించిన దనియు, అమృతముతో (పరమానందముతో) నావృత మైనదనియు నెవడు దెలిసికొనునో యట్టి విద్వాంసునకు బ్రహ్మయు, అనగా పరమాత్మయు, ప్రజాపతియు ఆయురాది ఫలముల నొసగుదురు." – అని యర్థము.

"దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః"

ఇత్యాది వాక్యములన్నియు పై శ్రుతితాత్పర్యమునే యుద్బోధించుచున్నవి. అందుచే బాహ్యప్రపంచము వలెనే యాంతరప్రపంచము గూడ దేవతా నిలయము, బ్రహ్మపురము ననియు స్పష్టము. ఇట్టి యాంతరదర్శనము నుద్బోధించుటకే శ్రుతి తననే గాక శరీరమును గూడ బ్రహ్మ యని కీర్తించినది.

బ్రహ్మకోశః :-

ఇంతియే కాదు. బ్రహ్మకు సంబంధించిన దగుటచేత నే వేదమునకు 'బ్రహ్మకోశ' మని వ్యవహారము.

"ప్రజాపతే ర్బ్రహ్మకోశం బ్రహ్మ ప్రపద్యే" — తై. నా. 4-42-2.

'ప్రజాపతేః సంబంధి బ్రహ్మకోశం సర్వమంత్రాధారభూతం బ్రహ్మ వేదస్వరూపం ప్రపద్యే' — సా. భా.

'క్షాత్రో ధర్మః శ్రిత ఇవ తనుం బ్రహ్మకోశస్య గుప్త్యై'
—ఉత్తర రామచరితమ్. అ. 9.

సర్వమంత్రములకు నాధారభూత మగుటచే వేదము బ్రహ్మకోశ మని ప్రసిద్ధము. ఈ కోశము సృష్టికర్త యగు ప్రజాపతికి సంబంధించినది (ప్రజాపతేః బ్రహ్మకోశం) - అని యిట జెప్పబడినది. వేదమునకే కాక ప్రణవమునకును బ్రహ్మకోశ మని వ్యవహారము గలదు.

"బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః" — తై. శిక్షావల్లీ.

ప్రణవము నిఖిల వేదాత్మకము. ఒఱలో ఖడ్గము వలె నీ ప్రణవము నందు బ్రహ్మ నిగూఢమై యుండును. ఇట్లు బ్రహ్మయొక్క కోశమై యొప్పుట జేసి ప్రణవము బ్రహ్మకోశము. వేదము బ్రహ్మయొక్క కోశమే గాని లౌకిక విషయకోశము గాదని తాత్పర్యము.

బ్రహ్మచారీ - నిధిరక్షకః :-

ఈ విషయమునే యాథర్వణ శ్రుతియు భంగ్యంతరముగ నిట్లు వివరించుచున్నది.

"అర్వా గన్యః పరో అన్యో దివ స్పృష్ఠాద్ గుహా నిధీ
నిహితౌ బ్రాహ్మణస్య। తౌ రక్షతి తపసా బ్రహ్మచారీ
త త్కేవలం కృణుతే బ్రహ్మ విద్వాన్ ॥' —అ. వే. 11-5-10.

'దివః ద్యులోకస్య పృష్ఠాత్ ఉపరిభాగాత్ అధః భూలోకే అన్యః ఏకః నిధిః వేదాత్మకః గుహా గుహాయాం ఆచార్యహృదయరూపాయాం

నిక్షిప్తః । అన్యః అపరః నిధిః తత్ప్రీతిపాద్యదేవతారూపః పరః పరస్తా దుపరి దేశే గుహాయాం జ్ఞాతు మశక్యే స్థానే నిక్షిప్తః। బ్రాహ్మణస్య అధీతవేదస్య సంబంధినౌ తౌ నిహితౌ నిక్షిప్తౌ నిధీ బ్రహ్మచారీ తపసా బ్రహ్మచర్యనియమేన రక్షతి పాలయతి । విద్వాన్ వేదార్థ రహస్యాభిజ్ఞః తత్ శబ్ద తదర్థాత్మకం నిధిద్వయం కేవలం నిష్ప్రపంచం బ్రహ్మ కృణుతే । స్వాత్మభూతే పరబ్రహ్మణి వేదరాశే స్తదర్థస్య చ అధ్యస్తత్వేన అధిష్ఠానభూతం బ్రహ్మైవ తద్రూపేణ సాక్షాత్కరోతీ త్యర్థః'.

—సా. భా.

వేదాధ్యయనపరులయిన బ్రాహ్మణులయందు రెండు నిధులు గలవు. అందొకటి వేదరూపమైన నిధి. ఇది భూలోకమున నాచార్యహృదయ మనెడి గుహయందు నిక్షిప్తము. ఇక వేదప్రతిపాద్య దేవతారూప మయిన నిధి రెండవది. ఇదియును గుహయందు - అనగా - దుర్జ్ఞేయ మగు స్థానమున - నిహితమై యుండును. వేదాధ్యయనపరుడు నిరంతర మీ బ్రహ్మయందు జరించుచు బ్రహ్మచారియై బ్రహ్మచర్యనియమములతో నీ రెండు నిధులను సంరక్షించుచుండును. వేదార్థరహస్యాభిజ్ఞుడగు విద్వాంసుడు 'వాగర్థ' రూపములగు నీ రెండు నిధులను దర్శించి తుదకు అధిష్ఠానభూత - నిష్ప్రపంచ - బ్రహ్మరూపముననే యా వాగర్థరూప నిధిద్వయమును సాక్షాత్కరించుకొనును - అని యర్థము. ఈ మంత్రము వేదము యొక్క యనూచానత్వమును, దాని లక్ష్యమును, నియమపూర్వకముగ దానిని సంరక్షించు విధానమును, తాను, స్వప్రతిపాద్యవస్తువు - రెండును నిధులగుటయు, నిధి సాక్షాత్కారము నొందు అధికారి యొక్క స్వరూపమును కాంతాసంమితముగ వివరించినది.

మంత్రప్రవర్తకుడును, పాలకుడును, అందుచే వాక్పతియు నగు బృహస్పతి ఋగ్వేదమున బ్రహ్మచారి యని కీర్తింపబడినాడు.

'బ్రహ్మచారీ చరతి వేవిషద్విషః స దేవానాం భవత్యేక మఙ్గమ్। తేన జాయా మవిందద్ బృహస్పతిః సోమేన నీతాం జుహ్వం న దేవాః' — ఋ. 10.109-5.

పరాదేవతయు దేవీపురాణము (45 అధ్యా.) న బ్రహ్మచారిణి యని కీర్తింపబడినది.

'వేదేషు చరతే యస్మా త్తేన సా బ్రహ్మచారిణీ'
(చూ. వాచస్పత్యమ్)

బ్రహ్మ - బ్రాహ్మణమ్ :—

ఇట్లు కృత్స్న వేదరాశికిని బ్రహ్మ యను నామము గలదని దర్శించితిమి. ఇట నొక విషయము బరిశీలింపనగును. వేదములో గొంతభాగమునకు బ్రాహ్మణ మని పేరు. బ్రహ్మ లనగా మంత్రములు. బ్రాహ్మణము తద్వ్యాఖ్యానరూపము. ఇట్లు బ్రహ్మసంబంధి యగుటజేసి యీ భాగమునకు బ్రాహ్మణ మని పేరు. అందుచే నీ బ్రాహ్మణ మను నామము మంత్రములకు గల బ్రహ్మత్వమును నిరూపించుచున్నది గాన మంత్రములు బ్రహ్మశబ్ద వాచ్యములు గావచ్చును. కాని బ్రహ్మభిన్న మగు బ్రాహ్మణ భాగమునకు బ్రహ్మ యను నామ మెట్లు పొసగును ? ఒకవేళ నున్నదని యనినను ఈ వేదభాగమునకు 'బ్రహ్మ - బ్రాహ్మణ' నామములు రెండు నుండుటలోని సామంజస్య మేమి ? ఈ విషయమును జూతము.

పరమేశ్వరునకు గల యనేక నామములలో బ్రహ్మ, బ్రాహ్మణ శబ్దములు గూడ గలవు.

"బ్రహ్మణ్యో బ్రహ్మకృత్ బ్రహ్మా బ్రహ్మ బ్రహ్మ వివర్ధనః।
బ్రహ్మవిద్ బ్రాహ్మణో బ్రహ్మీ" —విష్ణుసహస్రనామ.

"తస్మై నమో బ్రహ్మణే బ్రాహ్మణాయ" భార. 12-270-47.

'బ్రాహ్మణాయ బ్రహ్మవిదభిన్నాయ' — నీలకంఠః.

బ్రాహ్మణు డన బ్రహ్మవిత్స్వరూపు డని యర్థము. 'జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్' - అను గీతావచనము నీ యర్థమును స్ఫురింప జేయుచున్నది.

బ్రహ్మ - బ్రాహ్మణశబ్దములచే జెప్పబడు నర్థము వేఱు గావచ్చును కాని, యీ రెండు నొకే పరమేశ్వరునకు నామములై యా దేవునియందలి విభిన్నమహత్త్వమును దెలియజేయుచున్నవి. అందుచే పరమేశ్వరుడు బ్రహ్మయు బ్రాహ్మణుడు గూడ నగుచున్నాడు. కాన, బ్రహ్మ బ్రాహ్మణ శబ్దముల ప్రవృత్తినిమిత్తములు భిన్నము లయినను నా రెండు శబ్దము లొకే తత్త్వమును బోధించునవి. ఈ సంప్రదాయము శ్రుతిసిద్ధ మైనదే. ఒకే యగ్ని శ్రుతుల యందు బ్రహ్మ బ్రాహ్మణశబ్దములచే గీర్తింప బడుట గాంచనగును.

"ఉత నో బ్రహ్మ న్నవిష ఉక్థేషు" —ఋ. 3-13-6.

"త్వం బ్రహ్మా రయివిత్ బ్రహ్మణస్పతే" — ఋ. 2-1-3.

ఈ మంత్రములయం దగ్ని బ్రహ్మ యని కీర్తింపబడినాడు.

"అగ్నే మహా నసి బ్రాహ్మణ భారత" —తై. సం. 2-5-9-1.

ఇట అగ్ని బ్రాహ్మణ శబ్దముచే గీర్తింపబడినాడు.

కనుక నొకే యగ్ని బ్రహ్మయు బ్రాహ్మణుడు నగుచున్నాడు. ఇంతే గాదు. యజ్ఞమును నిర్వర్తించెడి ఋత్విజులు శ్రుతులయందు బలుచోట్ల బ్రహ్మ బ్రాహ్మణ శబ్దములచే గీర్తింపబడినారు. ఇట్టి యీ సంప్రదాయము లౌకిక వ్యవహారమున గూడ ననుగతమైనది.

"సమానార్థావేతౌ బ్రహ్మన్ శబ్దో బ్రాహ్మణశబ్దశ్చ। అతశ్చ సమానార్థౌ। ఏవం హ్యాహ - కుతో ను చరసి బ్రహ్మన్, కుతో ను చరసి బ్రాహ్మణః ఇతి"....—మహాభాష్య. పా. సూ. 5-1-7.

కాన నీ శబ్దములు భిన్న ప్రవృత్తినిమిత్తములు గలవి యగుటచే నొకే వస్తువునకు వాచకములు కాజాలవనుట యుక్తము గాదు. మఱియు బ్రాహ్మణమే తనను బ్రహ్మ యని కీర్తించుకొనుచున్నది.

"యచ్చ బ్రహ్మ యచ్చాబ్రహ్మ। అంత బ్రహ్మన్ ప్రతిష్ఠితమ్।"

(ఈ మంత్రార్థ మింతకు బూర్వమే వివరింపబడినది) ఈ బ్రాహ్మణము ఈ వాక్యమును జెప్పుటకు బూర్వము 'ఋచో యజూంషి సామాని అథర్వాంగిరస శ్చ యే' - అని చతుర్విధ మంత్రజాతమును బేర్కొనినది. అందుచే నీ వాక్యమున గల 'బ్రహ్మ' పదము మంత్రపరము గాదు. మంత్రపర మగుచో పునరుక్తి యగును. అందుచే దీనిని కృత్స్నవేదపరముగనే గ్రహింపవలసి యున్నది. భాష్యకర్తలు నట్లే గ్రహించిరి. కనుక నిట 'బ్రహ్మ'పదము మంత్ర బ్రాహ్మణాత్మక కృత్స్నవేదపరము.

ఇంతే కాదు. ఈ బ్రాహ్మణము తనను బ్రహ్మ యని కీర్తించుకొనుచునే పరోక్షముగా దనకు గల బ్రాహ్మణత్వము నిట్లు వివరించుకొనినది. కర్మజ్ఞానము లెచ్చోట ప్రతిష్ఠితము లయి యుండునో యది బ్రహ్మ. అట్లు కాని పౌరుషేయ వాఙ్మయము అబ్రహ్మ. కాన, కర్మజ్ఞాన ప్రతిష్ఠితత్వము బ్రహ్మరూప (మంత్ర బ్రాహ్మణాత్మక) వేదలక్షణముగా నిట సూచిత మగుచున్నది. ఇట్టి లక్షణము నాది యని స్ఫురింపజేయుచు బ్రాహ్మణము తనను బ్రహ్మ యని యిట కీర్తించుకొనుచున్నది. మఱియు దనకు గల బ్రాహ్మత్వమును స్ఫురింజేయుచు నీ తైత్తిరీయబ్రాహ్మణము 'బ్రహ్మ సంధత్తమ్' అనుచు బ్రహ్మశబ్దముతో బ్రవృత్తమైనది.

(చూ. సా. భా.) ఈ బ్రాహ్మణభాగములే కొన్నియెడల దమయందలి మంత్రముల వ్యాఖ్యానించు పట్టున 'అథ బ్రాహ్మణమ్' అనుచు సాగిపోవు చుండును. ఇంతవరకు బ్రహ్మ (మంత్ర)భాగము; ఇకమీద బ్రాహ్మణము అని యర్థము. అందుచే నీ వేదభాగమునకు బ్రహ్మ బ్రాహ్మణ నామ ధేయము లర్వాచీన కల్పితములు గావు.

ఈ బ్రాహ్మణభాగమును వ్యాకరణాది దర్శనములు, పురాణేతి హాసాదులు బ్రహ్మ బ్రాహ్మణ శబ్దములచే బలుచోట్ల గీర్తించియున్నవి.

ఇంతియే కాదు. సంహితాభాగము కంటె భిన్నమైన వేదభాగమునకు బ్రాహ్మణ మని సామాన్యముగ బ్రసిద్ధి. ఈ వేదభాగమున 'బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు' అని మూడు అవాంతరభాగములు గలవు. ఈ మూడింటికి కలిపి బ్రాహ్మణభాగ మని వ్యవహారము. కాని, 'బ్రాహ్మణ మనగా సంహితాభాగముకంటె భిన్నమైనది' – యను నీ లక్షణము సర్వత్ర అనుగతము కాదు. కృష్ణయజుర్వేదీయ సంహితయందే కొంత బ్రాహ్మణ భాగము గూడ కలదు. అట్లున్నను మొత్తమునకు సంహిత యనియే ప్రసిద్ధి. సంహితయందలి బ్రాహ్మణమే గాక, మరల తైత్తిరీయశాఖకు ప్రత్యేకముగ బ్రాహ్మణము గలదు. అందుచే సంహితకంటె భిన్నమైనదియే బ్రాహ్మణము – అను లక్షణము వ్యవస్థిత మగుట లేదు. ఇట్లు వ్యవస్థితములు గాని లక్షణముల నన్నిటిని కాదని, ఋగ్వేదభాష్యభూమిక యందు శ్రీ సాయణులు 'మంత్రవ్యతిరిక్తభాగములు బ్రాహ్మణములు' అని జైమిన్యాది మహర్షులు జూపిన సంప్రదాయము ననుసరించి నిర్ణయించిరి. కాన మంత్రవ్యతిరిక్తభాగము బ్రాహ్మణము. అనగా సంహితలలో గాని, బ్రాహ్మణారణ్యకోపనిషత్తులలో గాని కన్పట్టు మంత్రములు మంత్రభాగ మనియు, తద్భిన్నములు బ్రాహ్మణభాగ మనియు అర్థము.

బ్రాహ్మణము గూడ నచ్చటచ్చట 'అథ బ్రాహ్మణమ్' – 'ఇకమీద బ్రాహ్మణము' అనుచు, తనయందు గల యంతకు పూర్వభాగము మంత్ర భాగ మను విషయమును స్ఫురింపజేయుచునే యున్నది. ఇంతేగాక 'ఇతి మంత్రాః; కల్పోఽత్ర ఊర్ధ్వమ్' 'ఇవి మంత్రములు, ఇకమీద కల్పము' అనుచు తన యందలి మంత్రభాగమును కల్పభాగమును వేఱుపఱచి చూపుచున్నది. కాన నేది నేడు బ్రాహ్మణభాగమని ప్రసిద్ధమై యున్నదో యదియు మంత్రబ్రాహ్మణాత్మకమే యగుట స్పష్టము. 'మంత్రబ్రాహ్మణయో ర్వేదనామధేయమ్' అని వేదలక్షణము. మంత్రబ్రాహ్మణాత్మకము లగుటచే, బ్రాహ్మణ – ఆరణ్యక – ఉపనిషత్ రూపములగు బ్రాహ్మణభాగము లందును ఈ వేదలక్షణము సువ్యవస్థిత మగుచున్నది. ఇట్లు మంత్రబ్రాహ్మణాత్మకమై వేదలక్షణ లక్షితమగుటజేసి, బ్రాహ్మణము తనను బ్రహ్మ (వేదము)యని కీర్తించుకొనుట యుపపన్నమే. షడ్వింశబ్రాహ్మణము గూడ దనను ముక్తకంఠముగ వేద మని కీర్తించుకొనినది.

> "య ఏతం వేద మనుబ్రూతే యదా వా ఏతం వేద మను
> బ్రూతే, అథ హైనం శ్మణ్వ న్త్యసా వస్వవోచతేతి
> తద్ధ్వై స జాయతే' — షడ్వింశ, బ్రా. 1.16.

ఇది షడ్వింశబ్రాహ్మణ వాక్యము. 'ఏతం వేదం' 'ఏతం వేదం' (ఈ వేదమును) అనుచు ఈ బ్రాహ్మణము తనను 'వేద'మని కీర్తించుకొనుట స్పష్టము. ఇట్లే యీ బ్రాహ్మణము మఱియొకచోట మన్త్రబ్రాహ్మణాత్మక శబ్దరాశిని 'బ్రహ్మ' యని కీర్తించినది.

> "త మోషధీభ్య శ్చ వనస్పతిభ్య శ్చ గోభ్య శ్చ పశుభ్య
> శ్చాదిత్యాచ్చ బ్రహ్మణ శ్చ బ్రాహ్మణాః సం నయంతే।
> తస్మాత్ సాంనాయ్యస్య సాంనాయ్యత్వమ్'— షడ్వింశ. బ్రా. 5-6-3.
> 'బ్రహ్మ మంత్రాద్యాత్మకో వేదః, తస్మాత్' — సా.భా.

సంప్రదాయప్రవర్తకుల వాక్యములు నిందుకు ప్రమాణము.

'తథాచ న్యాయవిదాం స్మరణమ్—

"కుర్యా త్క్రియేత కర్తవ్యం భవే త్స్యాదితి పంచమమ్।
ఏత త్స్యా త్సర్వవేదేషు నియతం విధిలక్షణమ్॥ ఇతి"

శం. భా. బ్ర. సూ. 3. 4.22..

1. కుర్యాత్ (చేయవలయును), 2. క్రియేత (చేయబడవలయును), 3. కర్తవ్యం (చేయదగినది), 4. భవేత్ (కావలెను), 5. స్యాత్ (ఉండును లేక ఉండవలెను) అను నవి యైదును సర్వవేదము లందును ప్రసిద్ధము లయిన విధిలక్షణములు - అని న్యాయవేత్తల యభిప్రాయము.' వేదములందు సామాన్యముగ గన్పట్టు లిఙ్, తవ్య ప్రత్యయాదులు వేద వాక్య విధిత్వ జ్ఞాపకములు. అనగా నివి విధివాక్యము లని తెలియజేయు నట్టివి - అని తాత్పర్యము.

బ్రాహ్మణ మనగా మంత్రభిన్న మయిన తత్తత్కర్మ విధాయక మగు వాక్యము - అనగా విధివాక్య జాతమునకు బ్రాహ్మణ మని పేరు. అట్టి విధివాక్య జాతమును న్యాయవిదులు వేద మని వ్యవహరించుట పై శ్లోకమున గాంచనగును.

బ్రహ్మయజ్ఞః - బ్రహ్మ-బ్రాహ్మణమ్ :—

తైత్తిరీయారణ్యకము నందును, శతపథబ్రాహ్మణము నందును బ్రహ్మయజ్ఞ ప్రశంస గలదు. ఈశ్వరానుగ్రహముచే ఋషులు బ్రహ్మ యజ్ఞమును దర్శించినట్లు (తై. ఆ. 2-9-1) పూర్వము వివరింపబడినది. (చూ. ఋషిశబ్దము). బ్రహ్మయజ్ఞ మనగా స్వాధ్యాయము. నిత్య మనుష్ఠింపవలసిన వేదమంత్ర జపయజ్ఞము - అని శ్రుతి యిట్లు వివరించు చున్నది.

"య దృచో ఒధ్యగీషత తాః పయ ఆహూతయో దేవానా మభవన్, య ద్యజూంషి ఘృతాహూతయో, య త్సామాని సోమాహూతయో, య దథర్వాంగిరసో మధ్వాహూతయో, య ద్బ్రాహ్మణానీతిహాసాన్ పురాణాని, కల్పాన్, గాథా నారాశగంసీ ర్మేదాహూతయో దేవానా మభవన్.—తై. ఆ. 2-9-1.

కొలది మార్పులతో ఈ మంత్రము శతపథబ్రాహ్మణము నందును (11-5-6-3 నుండి 8) గలదు. ఇచట ఋగ్యజుస్సామాథర్వణ మంత్రముల తోపాటు బ్రాహ్మణభాగాధ్యయనము కూడ విధింపబడి మొత్తము మంత్ర బ్రాహ్మణాత్మకమైన వేదముయొక్క యధ్యయనము బ్రహ్మయజ్ఞ మనియు, స్వాధ్యాయ మనియు చెప్పబడినది. కాన మంత్రబ్రాహ్మణాత్మక వేదరాశికి బ్రహ్మ యను ప్రసిద్ధి సర్వవేదశాఖాసమ్మత మగుట స్పష్టము.

ఈ కారణములచే బ్రాహ్మణభాగమునకు. 'బ్రహ్మ- బ్రాహ్మణ' నామములు రెండును శ్రుతిప్రసిద్ధములై యొప్పును. ఈవిషయ మింకను 'ఛందస్' శబ్దమున వివరింపబడును.

బ్రహ్మ - ప్రతిష్ఠా :-

వేదమునకు 'ప్రతిష్ఠ' యనియు నామము. ప్రతిష్ఠా శబ్దమునకు ఆలంబనము లేక ఆధారము అని యర్థము. సర్వప్రాణులకు ఆధారభూత మగుటచే పృథివికి 'ప్రతిష్ఠ' యని పేరు. 'స ఇమాం ప్రతిష్ఠా మవిందత' (తై. బ్రా. 2-2-9-5). ఉత్పతనాది క్రియల కాలంబన మగుటచే పక్షికి పుచ్ఛము (తోక) ప్రతిష్ఠ యగుచున్నది. 'ప్రతిష్ఠా పుచ్ఛం వయసాం' - తై. ఆ. 1-4-18. అట్లే సృష్ట్యాది క్రియలకు ఆలంబన మగుటచే ప్రజాపతికి త్రయీవిద్యారూప మగు వేదము ప్రతిష్ఠయై యొప్పుచున్నది.

ఇట్లు ప్రజాపతికి ప్రతిష్ఠారూపమై వెలయుటచే బ్రహ్మ (వేదము) సర్వమునకును ప్రతిష్ఠ యగునని శతపథ బ్రాహ్మణ మిట్లు చెప్పుచున్నది.

"సోఽయం పురుషః ప్రజాపతి రకామయత - భూయా న్స్యామ్, ప్రజాయేయేతి। సోఽశ్రామ్యత్। స తపోఽ తప్యత। స శ్రాంత స్తేపానో బ్రహ్మైవ ప్రథమ మసృజత। త్రయీ మేవ విద్యామ్। సైవాస్మై ప్రతిష్ఠా ఽభవత్। తస్మా దాహుః - "బ్రహ్మ స్య సర్వస్య ప్రతిష్ఠా" ఇతి। తస్మా దనూచ్య ప్రతితిష్ఠతి। ప్రతిష్ఠా హ్యేషా - య ద్బ్రహ్మ। తస్యాం ప్రతిష్ఠాయాం ప్రతిష్ఠితో ఽతప్యత॥"—శ. బ్రా. 6-1-1-8.

'సైవ త్రయీవిద్యా అస్మై ప్రజాపతేః ప్రతిష్ఠా జాతా, ఉత్తరసృష్టే రాలంబనం జాత మిత్యర్థః।....యతః సర్వస్య త్రయీవిద్యా ప్రతిష్ఠా తస్మాత్ త్రయీం అనూచ్య అధీత్య అనుష్ఠాయ చ ప్రతితిష్ఠతి' —సా. భా.

పై శ్రుతివాక్యముల వలన ప్రజాపతికి సృష్టికార్య నిర్వహణమున కాలంబన మగుటచే వేదమునకు ప్రతిష్ఠ యని సార్థకనామ మగుట తెలియును. ఇంతియ గాక ప్రతిష్ఠారూపవేదము నధ్యయనము జేసినవారును, తదనుగుణముగ ననుష్ఠించువారును ఆ 'ప్రతిష్ఠ'యందు ప్రతిష్ఠితు లగుదురు. అనగా తద్రూపు (వేదరూపు) లగుదు రని భావము. ప్రజాపతియు త్రయీవిద్యా ప్రతిష్ఠితుడై సృష్టినిగూర్చి యాలోచించి, యందు ప్రతిష్ఠితు డయ్యెనని శ్రుతి ప్రతిపాదించుచున్నది. అందుచే బ్రహ్మ (వేదము) సర్వమునకు ప్రతిష్ఠ.

ప్రతిష్ఠాశబ్దమునకు బ్రహ్మయనియు నర్థము. కల్పితవస్తువు అధిష్ఠాన వస్తువు నందే లయము చెందును. భ్రాంతిచే రజ్జువునందు కల్పితమైన

సర్పము అధిష్ఠానమగు రజ్జువునందే లయము చెందును. అట్లే బ్రహ్మ మందు అవిద్యాకల్పితమైన జగత్తు బ్రహ్మయందే లయము చెందును. (ప్రతిష్ఠితి). కాన జగత్తుకు బ్రహ్మ ప్రతిష్ఠ యగుచున్నాడు.

"బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా" — ఆనందవల్లి,

"సర్వస్యావిద్యాపరికల్పితస్య ద్వైతస్యావసానభూత
మద్వైతం బ్రహ్మ ప్రతిష్ఠా" — శం. భా.

"ప్రజ్ఞా ప్రతిష్ఠా ప్రజ్ఞానం బ్రహ్మ" — ఐ. ఉ. 5-3.

ఈ వాక్యములవలన వేదమునకును, తత్ప్రతిపాద్య మగు బ్రహ్మకును 'ప్రతిష్ఠా' యను నామము శ్రుతిప్రసిద్ధము, సార్థకము నగుట దర్శించితిమి.

ప్రజాపతికి సృష్టికార్య నిర్వహణమును దాలంబన మగుటచే వేదమునకు 'ప్రతిష్ఠ' యనునది సార్థకనామ మగుట శతపథశ్రుతి వలన తెలిసెను. అంతియే గాదు. బ్రహ్మవిద్యాప్రాప్తికి సాధనము లేక ఆలంబన మగుటవలనను వేదమునకు ప్రతిష్ఠ యను నామ మన్వర్థమగుట కేనోపనిషత్తు వలనను తెలియుచున్నది.

"తస్యై తపో దమః కర్మేతి ప్రతిష్ఠా వేదాః సర్వాంగాని
సత్య మాయతనమ్।" — కేన. ఉ. 48-.

బ్రహ్మవిద్యకు తపస్సు, దమము, అగ్నిహోత్రాది కర్మ, చతుర్వేదములు షడంగములు సత్యము-అన్నియు బ్రహ్మవిద్యకు ప్రతిష్ఠాభూతములు.

"తేషు హి సత్సు బ్రాహ్మ్యుపనిష త్ప్రతిష్ఠితా భవతి। వేదాః
చత్వారః అంగాని చ సర్వాణి; ప్రతిష్ఠే త్యనువర్తతే'
— శం. వాక్య. భాష్య.

ఇచట వేదములే గాక వేదాంగములును, వేదవిహితము లయి బహిరంగ సాధనము లయిన యజ్ఞాదికర్మలును, అంతరంగ సాధనము లయిన శమ దమాదులును గూడ ప్రతిష్ఠా శబ్దముచే జెప్పబడుచున్నవి ఇవి యన్నియు 'బ్రహ్మ' శబ్ద వాచ్యములై యొప్పినట్లే బ్రహ్మవిద్యాప్రాప్తి సాధనములై 'ప్రతిష్ఠా' యను నన్వర్థసంజ్ఞతో గూడ నొప్పుచున్నవి. ఇట కేనోపనిషత్తుచే సంగ్రహముగ వివరింపబడిన యీ విషయమును తైత్తిరీయారణ్యకము (10-63) ఆఖ్యాయికారూపమున విపులముగ వివరించినది. 'కిం భగవంతః పరమం వదంతి' - ఓ ప్రజాపతీ! పూజ్యులు మోక్షసాధనములలో వేనిని ఉత్కృష్టములు (పరమములు) గా జెప్పుదురు? అని జిజ్ఞాసువులై తనకడ కేతెంచిన యారుణికి ప్రజాపతి యిట్లు మోక్షసాధనముల నుపదేశించినట్లు అందు గలదు.

1) "సత్యం వాచః ప్రతిష్ఠా। సత్యే సర్వం ప్రతిష్ఠితమ్।
తస్మాత్ సత్యం పరమం వదన్తి".
2) తపసి సర్వం ప్రతిష్ఠితం తస్మాత్ తపః పరమం వదన్తి।
3) దమే సర్వం ప్రతిష్ఠితం తస్మాత్ దమః పరమం వదన్తి।
4) శమే సర్వం ప్రతిష్ఠితం తస్మా చ్ఛమః పరమం వదన్తి।
5) దానే సర్వం ప్రతిష్ఠితం తస్మా ద్దానం పరమం వదన్తి।
6) ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా....ధర్మే సర్వం ప్రతిష్ఠితం।
తస్మా ద్ధర్మం పరమం వదన్తి.
7) ప్రజననం వై ప్రతిష్ఠా....తస్మా త్ప్రజననం పరమం వదన్తి।
8) అగ్నయో వై త్రయీ విద్యా....తస్మా దగ్నీన్ పరమంవదన్తి।
9) అగ్నిహోత్రగ్ం సాయం ప్రాత ర్గృహాణాం నిష్కృతిః ....
తస్మా దగ్నిహోత్రం పరమం వదన్తి।

10) యజ్ఞే సర్వం ప్రతిష్ఠితం తస్మా ద్యజ్ఞం పరమం వదన్తి।
11) మానసే సర్వం ప్రతిష్ఠితం తస్మా న్మానసం పరమం వదన్తి।
12) న్యాస ఇత్యాహు ర్మనీషిణో బ్రహ్మాణం.... తస్మాన్న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః।"

ఇట మోక్షసాధనములు 12 ఉపదేశింపబడినవి. అందు మొదట 'సత్యం వాచః ప్రతిష్ఠా। సత్యే సర్వం ప్రతిష్ఠితమ్' అని మొదటి సాధనముగ జెప్పబడినది. త్రైకాలిక సత్య మగు బ్రహ్మయే సత్యము. ఈ సత్యమే వాక్కునకు ప్రతిష్ఠ (ఆధారము; లక్ష్యము). 'బ్రహ్మాయం వాచః పరమం వ్యోమ;' 'యావ ద్బ్రహ్మ విష్ఠితం తావతీ వాక్' ఇత్యాది వచనములు నీ యర్థమునే వివరించుట దర్శించితిమి. వాక్ప్రతిష్ఠారూపమగు నట్టిసత్యమును లేక బ్రహ్మను బొందుటకు సత్యవాక్పాలనము మొదటి సాధనముగ నిట బేర్కొనబడినది. పిదప క్రమముగ తపో, దమ శమాదులు, అగ్నిహోత్రాదులు బేర్కొనబడి తుదకు న్యాసము (సంన్యాసము) సర్వోత్కృష్ట సాధనముగ జెప్పబడినది. వేదవిహితములైన నివి యన్నియు గ్రమముగ బ్రహ్మవిద్యాప్రాప్తి సాధనము లగుచు ప్రతిష్ఠా శబ్దవాచ్యము లగుచున్నవి. ఇట్లు బ్రహ్మవిద్యాప్రాప్తికి సాధనములు గానియపుడు వేదములకుగాని, వేదవిహితము లయిన యీ సాధనములకు గాని 'ప్రతిష్ఠా' అను నీ నామము అన్వర్థమై యొప్పును.

మఱియు ప్రతిష్ఠా శబ్దము అవిచ్ఛిన్నమై అనూచానమైన స్థితిని బోధించునది (అశీమహి గాధ ముత ప్రతిష్ఠాం నమో దివే బృహతే సాదనాయ - ఋ. 5-47-7. చూ. సా. భా; ముద్గల.భా). ఇట్టి స్థితి గలవాడు త్రైకాలిక సత్యరూపుడగు బ్రహ్మ. అందుచే బ్రహ్మ, 'ప్రతిష్ఠా' శబ్దలక్షితుడైనాడు. ఇక వేదము అనాది. సర్వజ్ఞుడగు పరమేశ్వరుడు పూర్వకల్పీయ వేదమును స్మరించి హిరణ్యగర్భున కనుగ్రహించుట

పూర్వము వివరింపబడినది. ఇట్లు వేదముకూడ అవిచ్ఛిన్నమై యనూచానమైన స్థితి గలది యగుచున్నది. అందుచేతనే శతపథశ్రుతి 'బ్రహ్మ సర్వస్య ప్రతిష్ఠా - ఇతి' వేదమే సర్వమునకు 'ప్రతిష్ఠ' యని కీర్తించుటయు నుపపన్న మగుచున్నది.

ఇట్టి ప్రతిష్ఠాస్ఫూర్తిలక్ష్యము నుద్బోధించుటకో యనునట్లు శ్రీమద్రామాయణ మహాకావ్యరచనమునకు మూలకందమై—

"మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః।
య త్క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్॥"

అని ఛందోమయి యగుచు సరస్వతి, ప్రతిష్ఠాశబ్ద సుసంఘటితమై మహర్షి ముఖమునుండి యావిర్భవించినది.

ఇట్లు ప్రతిష్ఠాశబ్దము తత్ప్రతిపాద్య మగు బ్రహ్మకును, తద్విహితములై బ్రహ్మవిద్యాప్రాప్తికి సాధనము లయిన పైసాధనముల కును వాచకమై వెలయుచు వేదము యొక్క లక్ష్యమును, అనాదిత్వమును తెలియజేయుచున్నది. వేదమే యిట్లు 'ప్రతిష్ఠా'నామము ద్వారా తనకు గల సుప్రతిష్ఠితత్వమును వివరించుకొనుచుండ, అది కాదని వేదములు మానవరచితము లనియు, అందు బాహ్యదర్శనమే కాని యాంతరదర్శనము లేదనియు జెప్పుట శ్రుతిసమ్మతము కాదు.

బ్రహ్మ - శ్రీః :-

బ్రహ్మ యగు వేదము సర్వప్రతిష్ఠారూపమై వెలయుట దర్శించితిమి. ఋగ్యజుఃసామాత్మకమైన యీ బ్రహ్మను 'శ్రీః' అని శ్రుతి కీర్తించుకొనుచున్నది.

"అహే బుధ్నియ మంత్రం మే గోపాయ। య మృషయ
స్త్రైవిదా విదుః। ఋచః సామాని యజూగ్ంషి। సా హి
శ్రీ రమృతా సతామ్॥" —తై. బ్రా. 1-2-1-26.

అహే, బుధ్నియ - అని యిట ఆవసథ్యాగ్ని సంబోధింప బడుచున్నాడు నాశరహితుడు, జగదాదియం దుత్పన్నుడు నగు అగ్ని - అని యర్థము. అట్టి ఓ యగ్నీ! వేదత్రియాభిజ్ఞులు, అతీంద్రియద్రష్టలు నగు ఋషులు ఏ మంత్రమును (వేదమును) ఋక్ - యజుస్ - సామాత్మకముగ దెలిసి కొనిరో యట్టి నా యీమంత్రమును రక్షింపుము. అదియే సత్పురుషుల పాలిటి యమృతరూపిణి యైన సిరి (శ్రీః) - అని యర్థము.

లౌకికమగు ధనము వినాశశీలము గలది. ఋగాదిమంత్రరూప మగు ధనము అట్టిది కాదు; మరణధర్మము లేనిది. అనగా అవిచ్ఛిన్నమై యనూచానమై స్థితి (ప్రతిష్ఠ) గల్గి సత్పురుషుల కాశ్రయణీయమై 'అమృతా శ్రీః' అగుచున్నది- అని తాత్పర్యము.

అహే, బుధ్నియ, యని యగ్నికి గల విశేషణములు అధియజ్ఞముగ ఆవసథ్యాగ్నిని, ఆధిదైవికముగ సృష్ట్యాదియం దావిర్భూతమైన హిరణ్యగర్భాఖ్య మగు మహాగ్నిని, తన్మూలభూత మగు పరంజ్యోతిని, ఆధ్యాత్మికముగ శరీరాంతర్గత మగు జ్యోతిస్సును ఉపలక్షింప జేయుచున్నవి. అట్టి మహాగ్నిని సంబోధించెడి మంత్ర మగుటచే వేదవాణి యొక్కయు తద్విహిత యజ్ఞాదికర్మల యొక్కయు అనూచానత్వము సూచిత మగుచున్నది. మఱియు త్రయీవిదులగు మహర్షులు ఏ మంత్రమును (వేదరాశిని) దర్శించిరో యా మంత్రమునే నే నుచ్చరించుచున్నాను; దానిని రక్షింపుము- అని యనుటచే వేదమంత్రములు పురుషబుద్ధి కల్పితములు కావనుటయు, మంత్రము లనూచానము లనుటయు స్పష్టము చేయబడుచున్నది.

'సా హి శ్రీః అమృతా' - అనుటచే ఋగ్యజుఃసామాత్మక మగు త్రయీవిద్యయే శ్రీవిద్య. ఈ శ్రీవిద్యయే బ్రహ్మవిద్య యని ప్రసిద్ధము. బ్రహ్మవిద్యారూపిణి యగు పరాదేవతయే 'శ్రీ' రూపిణిగా ఋగ్వేదమున శ్రీసూక్తముచే కీర్తింపబడుచున్నది (చూ. ఖిలకాండ).

షడ్వింశబ్రాహ్మణమున సర్వదేవాత్మకము, సర్వవేదాత్మకము నగు 'సుబ్రహ్మణ్య'సామకు 'బ్రహ్మశ్రీః' అను నామము గలదు.

"బ్రహ్మశ్రీ ర్హ్వై నామైతత్ సామ యత్ సుబ్రహ్మణ్యా"
—షడ్వింశ. బ్రా. 1-2-10.

'అయం సుబ్రహ్మణ్యానిగదో బ్రహ్మశ్రీ ర్హ్వై, బ్రహ్మణా
వేదేన శ్రీయతే బ్రహ్మ వేదం శ్రీయతీతి వా బ్రహ్మశ్రీ రేవ'.
—సా. భా.

'బ్రహ్మశ్రీః'—అనెడి నామము గల యీ సుబ్రహ్మణ్యసామ బ్రహ్మ (వేద) సార భూతమగుటచే 'సుబ్రహ్మణ్య' యగునని ఐతరీయబ్రాహ్మణము చెప్పుచున్నది.

"త దాహుః కిం సుబ్రహ్మణ్యాయై సుబ్రహ్మణ్యాత్వ మితి,
వా గే వేతి బ్రూయాత్, వా గ్ఘ్వై బ్రహ్మ చ సుబ్రహ్మ చేతి॥"
—ఐ. బ్రా. 6-3-1.

'బ్రహ్మ వేదో, వా గ్ఘ్వై వాగాత్మక ఏవ, తస్మి న్నపి
వేదే సుష్ఠు బ్రహ్మ సారభూతం వేదవాక్యం తదుచ్ఛ్రేయం
వాగ్దేవతా । తస్మాత్ సారభూతస్య నిగదస్య సుబ్రహ్మణ్యేతి
నామధేయమ్' —సా.భా.

ఈ సుబ్రహ్మణ్యసామ సుబ్రహ్మణ్యదేవతాకము. అనగా ఇంద్రదేవతాకము. 'ఇంద్రాగచ్ఛ' యని యింద్రు డాహ్వానింపబడును.

'శోభనం బ్రహ్మ సుబ్రహ్మ వేదః, తస్మై హితః సుబ్రహ్మణ్య
ఇంద్రః' —తై.ఆ. 1-12-3, సా. భా.

అని సుబ్రహ్మణ్యశబ్ద నిర్వచనము. సుబ్రహ్మ యనగా కల్యాణప్రద మగు వేదము. అట్టి వేదవాణికి హితు డగుటచే ఇంద్రునకు సుబ్రహ్మణ్య

దని యన్వర్థ నామము. ఈ నిర్వచనము పూర్వము తెల్పిన 'బ్రహ్మాణం బ్రహ్మవాహసమ్' — ఇత్యాది ఋక్ప్రతిపాదితమైన యర్థమునే యనువదించుచున్నది. కాన యనంతవేదశాఖావాహనుడై తత్ప్రతిపాద్యుడై వెలయు పరమేశ్వరుడే సుబ్రహ్మణ్యుడు - అని యర్థము. తత్ప్రతిపాదక విద్యారూప మగుటజేసియు, తదాహ్వానమునకై వేదముచే నాశ్రయింప బడుటజేసియు సుబ్రహ్మణ్య సామకు 'బ్రహ్మశ్రీః' అని యన్వర్థనామము.

నేటికిని బ్రహ్మణ్యులును, పూజ్యులు నగు వారిని 'బ్రహ్మశ్రీ వేదమూర్తులు' అని సంబోధించుట శ్రుత్యనుగుణమైన సంప్రదాయముగ వచ్చుచున్నది. బ్రహ్మచే (వేదముచే) నాశ్రయణీయు లగుటచేతను లేక బ్రహ్మను (వేదమును) ఆశ్రయించువా రగుటచేగూడను, వేదమూర్తు లగు బ్రహ్మణ్యులు బ్రహ్మశ్రీ శబ్దవాచ్యు లని తాత్పర్యము.

ఇట్లు బ్రహ్మ శబ్దము వేదరూపార్థమునను, పరమేశ్వరరూపార్థమునను, శ్రుతిస్మృత్యాదులందే గాక దైనందిన వ్యవహారమున గూడ బహుళ ప్రశస్తి గాంచియున్నది.

బ్రహ్మాంజలి :—

"పాఠే బ్రహ్మాంజలిః; పాఠే విప్రుషో బ్రహ్మబిందవః" —అమర

'బ్రహ్మణే వేదాయ అంజలిః బ్రహ్మాంజలి: బ్రహ్మణి వేదపాఠే బిందవః బ్రహ్మబిందవః' —గురుబాలప్రబోధికా

వేదపాఠమున మ్రొక్కుటకై ఘటించెడి యంజలి బ్రహ్మాంజలి. వేదాధ్యయన సమయమున వెడలెడి నోటి తుంపురులు బ్రహ్మబిందువులు అని యర్థము.

బ్రహ్మవర్చః :-

"స్యాత్ బ్రహ్మవర్చసం వృత్తాధ్యయనర్ధిః" — అమరః.
'బ్రహ్మణో వేదస్య తపసో వా వర్చః' —అమరసుధా.

వేదాధ్యయనము లేక తపస్సు వలన సిద్ధించెడి తేజమునకు 'బ్రహ్మవర్చః —అని పేరు.

బ్రహ్మసూత్రమ్ :-

బ్రహ్మణి వేదగ్రహణకాలే ఉచితం సూత్రమ్, బ్రహ్మసూత్రమ్
బ్రహ్మప్రతిపాదకం సూత్రం బ్రహ్మసూత్రమ్ (శారీరకసూత్రమ్)
— వాచస్పత్యమ్.

'బ్రహ్మణః సూచకాని వాక్యాని బ్రహ్మసూత్రాణి—శం.భా.(భ.గీ. 13-4) బ్రహ్మసూత్ర మనగా (1) వేదగ్రహణకాలోచితమగు యజ్ఞోపవీతము. (2) బ్రహ్మప్రతిపాదక శారీరకసూత్రములు (3) బ్రహ్మసూచకము లగు వేదవాక్యములు — అని యర్థము.

బ్రహ్మస్థలి :-

"అగ్నిష్ఠే ష్వగ్నిశాలాసు తథా బ్రహ్మస్థలీషు చ ।
సరీసృపాణి దృశ్యన్తే హవ్యేషు చ పిపీలికాః"॥ —రామా. 6-10-16.

సీతాపహరణ మనెడి యపచారము వలన లంకయందు గల్గిన దుర్నిమిత్తములను విభీషణుడు నిండు కొలువులో రావణునకు వివరించెడి శ్లోక మిది.

"మహారాజా ! మహానసముల (పాకగృహముల) యందును, అగ్నిహోత్రశాలలయందును, బ్రహ్మస్థలుల (వేదాధ్యయనస్థానముల) యందును సర్పములు గన్పట్టుచున్నవి; దేవతల కొసగెడి ఆజ్యపురోడాశాది హవ్యములయందు పురుగులు గోచరించుచున్నవి—అని యర్థము.

ఇట పేర్కొనబడిన పవిత్రస్థానములలో బ్రహ్మస్థలులును గలవు. రాజు కామోపహతుడై చేసెడి యపచారముల వలన దేశమున గల పవిత్రములు, ప్రశాంతములు నగు స్థలములయందు గల్గెడి సంక్షోభ మిట్లు విభీషణునిచే వివరింపబడినది.

ఇట్లు బ్రహ్మశబ్దమున కనుమానముగ స్మృతిపురాణేతిహాస కావ్యాది వాఙ్మయమునందును దైనందిన వ్యవహారమునందును బ్రసిద్ధములై యేయర్థములు గన్పట్టుచున్నవో ఋగాదివేదరాశియందు నిట్టి యర్థములే ప్రసిద్ధములై యుండుట దర్శించితిమి. అందుచే నీ శబ్దముయొక్క యర్థము విషయమై క్రమపరిణతి గల దనెడి చారిత్రికుల యూహ శ్రుతిస్మృత్యాది సంప్రదాయ విరుద్ధము. పై గ్రంథసందర్భము ననుసరించి చూచినచో పరమేశ్వరునకును వేదమునకును గల ప్రతిపాద్య - ప్రతిపాదక భావసంబంధము నుపలక్షింప జేయుటకే, వేద-ఋషి శబ్దముల వలెనే, బ్రహ్మ-ప్రతిష్ఠా శబ్దములుగూడ పరమేశ్వరునకును వేదమునకునుగూడ వాచకములై బ్రసిద్ధము లయినట్లు స్పష్ట మగును. కాన బ్రహ్మ యనగా వేద మనుట నిర్వివాదము. ఇది యత్యంతపవిత్రము. అందుచే నిరంతరాధ్యయనాభ్యాసాదుల ద్వారా తరతరములనుండి సంప్రాప్తమైన యీ బ్రహ్మవృక్షము విషయమై యనాదరము వలదు; రక్షించుకొనుడు; తత్ఫలముల నాస్వాదింపుడు - అని మహాభారత మిట్లు ప్రబోధించుచున్నది.

"బ్రహ్మవృక్షో రక్ష్యమాణో మధు హేమ చ వర్షతి।
అరక్ష్యమాణః సతత మశ్రు పాపం చ వర్షతి॥"

— భార. 12-73-14.

ఇట్లు నిరంతరాధ్యయనాభ్యాసాదులచే రక్షింపబడునది యగుటచే వేదమునకు ఆమ్నాయః అని పేరు. ఇక ఆమ్నాయ శబ్దమును జూతము.

ఆమ్నాయః - శ్రుతిః

గురుశిష్య పరంపరావభాసాం
శ్రవణామ్నాయ సమాహితా ముదారామ్।
అవిలంఘ్యపదాం కుహేతువాదైః
శ్రుతి మాద్యాం కలయే హరిప్రియాం తామ్॥

— వేదమాతృ స్తవః.

శ్రుతిః, ఆమ్నాయః - అనియు వేదమునకు నామములు.

'శ్రుతిః స్త్రీ వేద ఆమ్నాయః' —అమరకోశము.

నియమపూర్వకముగ మరల మరల నావృత్తి చేయబడుచు నభ్యసింప బడునది యని ఆమ్నాయశబ్దార్థము. (ఆ-మ్నా-అభ్యాసే- కర్మణి ఘఞ్: 'ఆమ్నాయః సమ్యగభ్యాసః సమ్యక్ పాఠశ్చ - అభ్యాసస్య సమ్యక్త్వం చ నియమ ధారణ పూర్వకత్వం, గురుముఖ శ్రవణ పూర్వకత్వం చ - ఆమ్నాయస్య క్రియార్థత్వాత్' - జై. సూ. (వాచస్పత్యమ్-)

పై యర్థమును బరిశీలించుచో ఆమ్నాయపదముచే, వేదము గురుముఖోచ్చారణానూచ్చరణ రూపమున శ్రూయమాణ మగుచు ననాది కాలము నుండి నేటివఱకును గురుశిష్యపరంపరాప్రాప్తమై నిలిచి యుండుట - తెలియుచున్నది. కావుననే యీ వేదవిద్య సంప్రదాయవిద్య యని ప్రసిద్ధి జెందినది. 'అథామ్నాయః సంప్రదాయః' (అమరః) అని ఆమ్నాయపదము సంప్రదాయము-అను నర్థమున బ్రసిద్ధ మగుటయు నిందుకు దార్కాణము. ఇట్లు సంప్రదాయానుగతమై, శ్రూయమాణమై వర్తిల్లునది యగుటచే వేదమునకు శ్రుతి యనియు సార్థకనామము. శ్రుతి యనియే గాదు; శ్రుతా, అనుశ్రవ, - ఇత్యాది నామములు గూడ బ్రసిద్ధములు.

శ్రుతా :-

"గిరః శ్రుతాయాః పుష్పిణ్యాః" — భాగ. 4-2-25.

'శ్రుతాయాః వేదరూపాయాః' — శ్రీధరః.

"అభూ న్నృపో విబుధసఖః పరంతపః శ్రుతాన్వితో దశరథ ఇత్యుదాహృతః" —భట్టి 1- 1.

'శ్రూయన్తే ఇతి శ్రుతాని, వేదాదీని, తైరన్వితః' —జయమంగళ.

అనుశ్రవః :-

"ఆనుశ్రవిక ఏవ నౌ కశ్యప ఇతి" —తై. ఆ, 1-7-3.

'గురూపదేశ మను శ్రూయత ఇత్యనుశ్రవో వేదః, తత్రైవావగతః ఆనుశ్రవికః. —సా. భా,

"దేవానాం గుణలింగానా మానుశ్రవిక కర్మణాం" —భా. 3-25-32.

'గురో రుచ్చారణ మను శ్రూయత ఇత్యనుశ్రవో వేదః, తద్విహితమానుశ్రవికం - శ్రీధరః.

'అనుసృత్య అవిచ్ఛిన్న పాఠపరంపరా శ్రూయత ఇత్యనుశ్రవో వేదః, తద్విహిత మానుశ్రవికమ్' — వీరరాఘవీయవ్యాఖ్య.

'ఆనుశ్రవిక' పదము సాంఖ్య, యోగాది దర్శనములయందు నీ యర్థమున నత్యంత ప్రసిద్ధము.

ఈ శ్రుతి, శ్రుతా, అనుశ్రవ, ఆమ్నాయ - శబ్దము లన్నియు వేదముల యొక్క యవిచ్ఛిన్న గురుశిష్యపరంపరాప్రాప్తిని దెలియజేయు నట్టివి. అనగా నీ నాడు గురుముఖమునుండి వేదము శిష్యునిచే నెట్లు

ప్రాప్త మగుచున్నదో, యనాదినుండియు నట్లే గురుముఖమునుండి ప్రాప్త మగుచు వచ్చినది.

వేదస్యాధ్యయనం సర్వం గుర్వధ్యయనపూర్వకమ్ ।
వేదాధ్యయనసామాన్యా దధునాఽధ్యయనం యథా ॥"

అను నీ మీమాంసకన్యాయము 'శ్రుతి - ఆమ్నాయ' శబ్దార్థముల దలపింప జేయుచున్నది. ఈ శబ్దార్థ పర్యాలోచనల ననుసరించి వేదములు మానవ రచితములును, లిఖితములును గావనియు, లిఖితవేదపఠనము సంప్రదాయ విరుద్ధము (శ్రుతి - ఆమ్నాయ శబ్దతాత్పర్య విరుద్ధము) అనియు నర్థములు స్ఫురించుచున్నవి.

శ్రుతర్షిః - శ్రుత్కర్ణః:-

పరమేశ్వరునకు ఏకర్షి, మఖ్యర్షి యను నామములవలెనే (చూ. ఋషిశబ్దము) శ్రుతర్షి యనియు నామము గలదు.

"శ్రుతర్షి ముగ్ర మభి మాతిషాహమ్" —తై. బ్రా. 2-5-6-1.
'శ్రుతర్షిం ఋషిషు మంత్రేషు ఇంద్రసూక్తాదిషు
శ్రూయమాణం' —సా. భా.

శ్రుతిరూపము లగు స్తుతుల నాదరముతో వినుచుండు వాడగుటచే అగ్నీంద్రాదులకు 'శ్రుత్కర్ణః' అని పేరు.

'శ్రుత్ స్తుతీః సమ్యక్ శృణ్వన్ కర్ణః శ్రోత్రేన్ద్రియం
యస్య' —సా. భా. 10-140-6.

ఈ యగ్నీంద్రాది నామములు మానవకల్పితములు గావు. శ్రుతిచోదితము లని యనుచు తనకు గల శ్రుతిత్వమును శ్రుతి యిట్లభివ్యక్తము జేయుచున్నది.

"పదో యత్త్వం పరమ ఆ జనిష్ఠాః పరావతి శ్రుత్యం నామ
బిభ్రత్" —ఋ. 5-30-5.

ఈ మంత్రమున సర్వోన్నతు డగు నింద్రుడు శ్రుత్య మగు నామమును ధరించి యెల్లెడల నభివ్యక్త మగుచున్నట్లు చెప్పబడినది. శ్రుత్య మనగా శ్రుతిసిద్ధమై యజ్ఞమున శస్త్ర-స్తోత్రాదులందు శ్రవణీయ మగు నామము (శ్రుతిః స్తుతిః తత్ర భవం శ్రుత్యమ్ - సా.భా.ఋ. 1-117-23) - అని యర్థము.

పూర్వ్యం బ్రహ్మ :-

వేదవిద్యయొక్క యనూచానత్వమును శ్రుతియే స్వయముగ నిట్లు జెప్పికొనినది.

"యుజే వాం బ్రహ్మ పూర్వ్యం నమోభిః" — ఋ. 10-13-1;
అ. వే. 18-3-34; వా. సం. 11-5; తై. సం. 4-1-1-2.

'పూర్వ్యం పూర్వస్మిన్ కాలే భవం అనాదికాలప్రవృత్త
మిత్యర్థః। ఏవంభూతం బ్రహ్మ మంత్రమ్' — సా. భా.

ఈ మంత్రమున గల 'పూర్వ్యం బ్రహ్మ' అను పదములు వేద మనాదికాలప్రవృత్త మగుటను స్పష్టముగ దెలియజేయుచున్నవి.

పిత్ర్యా - సనజా - పూర్వ్యా :-

ఇట్లనాదికాల ప్రవృత్త మనియే కాక, పితృపరంపరాప్రాప్తమై, సనాతనమై యలరారుటయు శ్రుతి యిట్లు వివరించియున్నది.

"దివశ్చిదా పూర్వ్యా జాయమానా వి జాగృవి ర్విదథే
శస్యమానా। భద్రా వస్త్రాణ్యర్జునా వసానా సేయ మస్మే
సనజా పిత్ర్యా ధీః॥" — ఋ. 3-39-2.

ఈ మంత్రమున ఇంద్రు నుద్దేశించిన స్తుతిలక్షణమగు వాక్కు యొక్క స్వరూపము వివరింపబడుచున్నది. స్తుతిరూపమైన యీ వేదవాక్కు (పిత్ర్యా పితృక్రమాగతా, అతఏవ సనజా పురాతనీ సతీ ధీః తవ స్తుతి ర్భవతి' — సా. భా.) పితృక్రమాగత మగుచు, అందుచే పురాతనమైనది యని యర్థము. మఱియు నీ వేదవాక్కు యజ్ఞమున వినియుక్త మగు నపుడు (విదథే శస్యమానా) జాగరణశీలయై, అనగా స్తోతవ్యుడగు నింద్రుని ప్రబోధించునదై (జాగృవిః స్తుత్యస్య తవ జాగరణం కుర్వాణా), కల్యాణ కరములు దోషరహితములు దివ్యతేజఃసంపన్నము లగు వస్త్రములను, అనగా తేజస్సులను దాల్చినదై (భద్రా కల్యాణాని, అర్జునా శుక్లవర్ణాని, వస్త్రాణి యోగ్యతయా తేజాంసి, వసానా), వెలయునని యిట వివరింప బడినది. మఱియు 'దివశ్చిత్ ఆజాయమానా పూర్వ్యా' — అని యనుటచే దివముకంటెనుగూడ పురాతనమై యావిర్భవించినది యను నర్థమును ప్రతీత మగుచున్నది. (ద్యులోకమునుండి యావిర్భూతమై పురాతనమైనది — ద్యులోకాత్ ఉదీయమానా పురాతనీ — అని. వేం. మా. భా.).

ఈ మంత్రము ననుసరించి వేదవాక్కు అతిపురాతనము; అందుచే సనాతనము; పితృపరంపరాప్రాప్తము; యజ్ఞాదికర్మలయందు వినియుక్త మగునపుడు దేవతాప్రబోధకము—అనగా దేవతాతత్త్వ ప్రకాశక మగు వేదమై వెలయును; దివ్యతేజఃసంపన్నమై యొప్పును; లేనిచో నక్షరరాశిగ మాత్రమే కనుపట్టును—అను విషయ మిట సూచితము.

మఱియు నీ మంత్రము నందలి 'సనజా. పిత్ర్యా, పూర్వ్యా, విదథే శస్యమానా' —ఇత్యాది పదము లర్థవంతములు. వీనివలన వేదమంత్రములు మానవరచితములు గావనియు, ఈ వాక్కులకు అనాదికాలమునుండియు యజ్ఞాదికర్మలయందు మాత్రమే వినియోగము; దేవతాతత్త్వ ప్రకాశనము

నందే లక్ష్యము; లౌకికగ్రంథములకు వలె లౌకికసంఘటనల వర్ణించుట యందు తాత్పర్యము లేదనుటయు సూచిత మగుచున్నది,

అనాదికాలప్రవృత్తము, పితృపరంపరాప్రాప్తము—అగుటచే నన్య భాషలయందును, రచనలయందును కాలక్రమానుగతములై కన్పట్టెడి పరిణామము లీ వైదికవాణియందు దొరలియుండ లేదనుటయు స్పష్టమగుచున్నది. కాన. భాషాపరిణామ, భాషాసామ్యాది సిద్ధాంతముల బురస్కరించుకొని వేదభాగములకు పౌర్వాపర్యమును గల్పించుటయు, చరిత్ర కల్పనల జేయబూనుటయు శ్రుతి సంమతముగాదు. ఒకవేళనట్లు చేయ బూనుచో నపుడీ వేదవాక్కునకుగల పూర్వ్యా, పిత్ర్యా, సనజా, విదథే శస్యమానా, జాగృవిః—ఇత్యాది విశేషణము లుపపన్నము లగుట యెట్లు ?

కాని యీ పదములగూర్చి చరిత్రకారు లిట్లు చెప్పుచున్నారు. "Old poems were inherited and refurbished by members of the composer's family, but the great aim of the singers was to produce new and approved hymns. It is not till the time of the Brahmanas that the composition of the hymns appears to have fallen into disuse, though Poetry was still produced, for example. in the form of Gathas, which the priests were required to compose themselves and sing to the accompaniment of the lute at the sacrifice."

(Vedic Index – చూ. ఋషిశబ్దము).

"ఋగ్వేదకాలమున మంత్రరచయితలు (ఋషులు) పితృపరంపరగా దమకు సంక్రమించిన పద్యముల (poems) ను తమ కుటుంబసభ్యుల సాహాయ్యముతో మెఱుగులు దిద్దెడివారు; కాని సర్వామోదమును గాంచగల నూతనమంత్రముల (hymns) రచించుటయందే వారికి దృష్టి హెచ్చు: బ్రాహ్మణముల కాలమున నూత్నమంత్రరచనోద్యమము సన్నగిలినది: అయ్యును పురోహితులు గాథారూపములగు పద్యముల రచించి యజ్ఞము

లందు వానిని వీణమీద గానము చేయవలె ననెడి నియమము రూపొందినది." —అని యర్థము. మఱియు ఋగ్వేదమున గొన్ని యెడల 'పూర్వ, 'పూర్వ్య, నవ, నవ్య' - ఇత్యాది విశేషణములు మంత్రములచే జేయబడు స్తోత్రములకు' గలవు.

"తాన్ పూర్వయా నివిదా హూమహే" —ఋ. 1-89-3.

"ఇయం తే పూష న్నా ఘృణే సుష్టుతి ర్దేవ నవ్యసీ"
—ఋ. 3-62-7.

ఇట పూర్వమంత్రమున 'పూర్వయా నివిదా' అనియు, రెండవ మంత్రమున 'నవీయసీ సుష్టుతిః' అనియు స్తుతివిశేషణములు గన్పట్టు చున్నవి. ఇట్లు, పూర్వయా. నవీయసీ'—ఇత్యాది విశేషణములు గన్పట్టుట వలన ఋగ్వేదమున గొన్నిమంత్రములు పూర్వ్యములు—పితరులనుండి రచయితలకు సంక్రమించినవి; మఱికొన్ని నవ్యములు—నూతనముగా రచయితలచే రచింవబడినవి—అని చారిత్రికులు చెప్పుచున్నారు. ఇందలి సామంజస్యమును జూతము.

నవ - నవ్య - నవీయసీ :-

లోకవ్యవహారమున నవ, నవ్య, నవీయసీ—ఇత్యాది పదములకు నూతనమైనది యను నర్థము ప్రసిద్ధము. ఈ యర్థమును మాత్రమే గ్రహించి చారిత్రికులు మంత్రార్థవివరణమునకు బూనిరి. ఈ పదముల కర్థ మింతియే కాదు. ఇంతియే యగుచో నీ క్రిందిమంత్రముల కర్థము పొసగదు.

'తం త్వా వయం సుధ్యో నవ్య మగ్నే' —ఋ. 6-1-7.

'తం త్వా ను నవ్యం సహసో యువన్ వయమ్' —ఋ.1-141-10.

ఈ మంత్రములయందు అగ్నికి 'నవ్యం' అను విశేషణము గలదు.

ప్రాతఃసవనముతో బ్రివర్తిత మగుచుండును అందుచే నిత్యనూతనము నయియు నొప్పును. సూర్యచంద్రులతిప్రాచీనులు. అయ్యును ప్రతిదినము నుదయించుచు నిత్యనూతనులై యొప్పుదు రని శ్రుతి యిట్లు కీర్తించు చున్నది,

'నవో నవో భవతి జాయమానః' —ఋ. 10-85-19.

కాన, 'నవః' అను పదమునకు స్తుత్యుడు నూతనుడు - అనెడి యర్థములు రెండును గ్రాహ్యములు.

నవ శబ్దమునకు గల యీ రెండర్థములను కాళిదాసమహాకవి యు నిట్లు వ్యక్తము చేసినాడు.

''పంచానా మపి భూతానా ముత్కర్షం పుపుషు ర్గుణాః।
నవే తస్మిన్ మహీపాలే సర్వం నవ మివాభవత్'' -రఘు, 4-11.

దిలీపానంతరము రఘుమహారాజు సింహాసనము నధిష్ఠించినంతనే పృథివ్యాది పంచభూతముల యొక్క గంధాదిగుణము ఉత్కర్షతో- అపూర్వ మహత్త్వముతో- విరాజిల్లినవి. ఆ రఘువు నవభూపాలు డయినంతనే యిట్లు సర్వము నవ మయినట్లు తోచెను. పూర్వ మే భూతజాత ముండెనో యదియే పూజ్యుడు, స్తుత్యుడు నగు రఘువు నూతనముగ రాజపదము నధిష్ఠించినతరువాతను గలదు. కాని, యపు డది యపూర్వగుణసంపత్తిచే నపూర్వమై ప్రశస్తమైనది (స్తుత్యమైనది) వోలె నొప్పెనని తాత్పర్యము. ఇట జమత్కారముగ నవశబ్దమునకు గల రెండర్థములును నభివ్యక్తము జేయబడినవి.

అంగిరఇంద్రాదిదేవత లతిప్రాచీనులయ్యును ప్రతిదినమును యజ్ఞము లందు లేక కర్మానుష్ఠానములందు స్తూయమానులై యావిర్భవించుట

జేసి నవ్య లగుదురు. అనగా 'స్తుత్యులు—నిత్యనూతనులు'— అగుదురని యర్థము. కావుననే, భాష్యకారులు నీ పదముల నిట్లు వ్యాఖ్యానించిరి.

'ఇంద్రః నవీయాన్, నవతరః కల్యాణః, స్తుత్యః ।'

— సా. భా. ఋ. 6-44-7.

'ఉక్థైః శస్త్రైః, నవ్యః స్తుత్యో య ఇంద్రః ।' — సా, భా, 1-61-13,

"నమసా నవ్యో అర్కైః" — ఋ, 1-62-11.

'హే ఇంద్ర అర్కైః శస్త్రరూపైః మంత్రైః, నమసా నమస్కారేణ, యః త్వం, నవ్యః స్తుత్యో, భవసి' — సా. భా.

పై మంత్రముల బరిశీలించినచో ఇంద్రుడు లేక అగ్ని స్తోత్రములచే స్తూయమాను డగుటచే 'నవ్యః, నవీయాన్' అని కీర్తింపబడుట స్పష్టము. ఈ మంత్రము లన్నియు అగ్నీంద్రాదుల యొక్క సార్వకాలీన స్తుత్యత్వమును 'నవ్య' పదముచే దెలియజేయుచున్నవి. అందుచేతనే అగ్ని 'నవానవః' — (ఋ. 3-11-5.) అని కీర్తింపబడినాడు. నిరంతరస్తుత్యు డని యర్థము. అత్యంతప్రాచీను డయ్యును నిత్య నూతను డని తాత్పర్యము. ఈ విషయమును ఋగ్వేదమే యిట్లు జెప్పుచున్నది.

"యః పూర్వ్యాయ వేధసే నవీయసే" —ఋ. 1-156-2.

"పూర్వ్యాయ పూర్వకాలీనాయ నిత్యాయేత్యర్థః, వేధసేవివిధ జగత్కర్త్రే, నవీయసే నిత్యనూతనాయ, అత్యంతరమణీయాయేత్యర్థః"

—సా. భా.

"దివో రథేష్ఠా మజరం నవీయో" —ఋ. 6-21-1.

"హే ఇంద్ర ! త్వాం హవన్తే హ్వాయంతి, కీదృశమ్,
రథేష్ఠాం రథే స్థితం, అజరం జరారహితం, నవీయః
నవీయాంసం నవతరమ్" —సా. భా.

ఇట నీ పై రెండు మంత్రములందును పరమేశ్వరుడు పూర్వ్యుడయ్యును నవ్యుడు - నిత్యనూతనుడు - అత్యంతరమణీయుడు అని కీర్తింపబడినాడు. అనగా నిత్యుడు, నిత్యస్తుత్యుడు నని తాత్పర్యము. పరమేశ్వరునకు జెప్పబడెడి 'పూర్వ్య-నవ్య' ఇత్యాది విశేషణములే, ఋగ్వేదమున మంత్రిమునకును, మంత్రిములచే నొనర్పబడు స్తుతిరూపమగు వేదవాక్కునకును గూడ జెప్పబడినవి. యజ్ఞమెట్లు ప్రాచీనమై నవ్యమో, యజ్ఞదేవు డగు అగ్ని (పరమేశ్వరుడు) యెట్లు పూర్వ్యుడై నవ్యుడో, యట్లే యజ్ఞమునందుపయుక్త మయ్యెడి వేదవాక్కు గూడ పూర్వ్యమై నవ్యము నగును - అనగా - నిత్యము, స్తుత్యము నగును. అందుచేతనే పై నుదహరించిన 'పూర్వయా నివిదా' - యను పదములను శ్రీ సాయణు లిట్లే వ్యాఖ్యానించినారు.

'పూర్వయా పూర్వకాలీనయా నిత్యయా నివిదా వేదాత్మికయా వాచా'

ఇట నొక యాక్షేపము. వేదవాక్కు పూర్వ్యమై నవ్యమగు ననియు, అందుచే నిత్య మనియు జెప్పుట తగదు. స్తుతిరూపనుగు మంత్రజాతము యజ్ఞములయందు నూతనముగ నుత్పన్న మగునని ఋగ్వేదమున జెప్పబడుచున్నది. ఉదా :-

1. "నవం ను స్తోమ మగ్నయే దివః శ్యేనాయ జీజనమ్"
— ఋ. 7-15-4.

"అగ్నయే నవం నూతనం స్తోమం జీజనం జనయామి"
—సా. భా.

అగ్నికొఱకై నూతనమగు స్తోమమును జనింపజేయుచున్నాను - అని యర్థము.

2. "శుచిం ను స్తోమం నవజాత మద్యేంద్రాగ్నీ వృత్రహణా జుషేథామ్" — ఋ. 7-93-1.

'హే ఇంద్రాగ్నీ! శుచిం శుద్ధం నిరవద్యం, నవజాతం ఇదానీ ముత్పన్నం స్తోమం అస్మదీయం స్తోత్రం, అద్య అస్మిన్ కాలే, ను క్షిప్రం జుషేథామ్ సేవేథామ్' — సా. భా.

ఓ ఇంద్రాగ్నులారా! ఇపుడు నూతనముగ నిష్పన్నమైన మా యీ స్తోత్రము శుద్ధము - నిర్దోషము. దానిని మీరు గ్రహింతురు గాక యని యర్థము.

3. "శ్రుష్ట్యగ్నే నవస్య మే స్తోమస్య వీర విశ్పతే" —ఋ. 8-23-14.

'హేవీర! విశ్పతే అగ్నే! నవస్య ఇదానీం క్రియమాణత్వా న్నూతనం, మే మదీయం. స్తోమస్య స్తోత్ర శస్త్రాదికం శ్రుష్టి శ్రుత్వా' సా. భా.

ఓ యగ్నీ! ఇపుడు మాచే జేయబడిన యీ నూతన స్తోమమును (స్తోత్రశస్త్రాదికమును) విని .... అని యర్థము.

ఇట్లు పై మంత్రములందు స్తోత్రములు నూతనముగ నుత్పన్నము లగుట దెలియును. కాన వేదవాక్కు నిత్యమని యనుట యెట్లు?

ఈ యాక్షేపము సరి కాదు. ఇట నూతనముగ నుత్పన్నము లగు వట్లు చెప్పబడినవి స్తోత్రములు; మంత్రములు గావు. మంత్రములు వేఱు; స్తోత్రములు వేఱు. కాన సంప్రదాయము ననుసరించి స్తోత్రస్వరూపము ను

దర్శింపవలసి యున్నది. పూర్వసిద్ధము లయిన వేత్వేఱు పుష్పములతో మాలలను గ్రుచ్చుదురు. ఇట పుష్పములు స్వకల్పితములు గావు. హార ములు మాత్రమే నవజాతములు - నూతనముగ నిష్పాదితములు. అట్లే యజ్ఞమున జేయబడు స్తోత్రములు హారములవంటివి. ఇట స్తోత్రములు నవజాతములు. ఈ స్తోత్రములందు గూర్చబడెడి మంత్రములు నవజాత ములు గావు: పూర్వసిద్ధములు.

శస్త్రము, స్తోత్రము - అని యజ్ఞమునందు జేయబడు స్తుతి రెండు విధములు. ఋఙ్మంత్రములచే హోత యను ఋత్విక్కు చేయు శంసనమునకు 'శస్త్ర' మనియు, 'పుష్టి' యనియు పేరు. ఈ విషయమును ఋగ్వేదమే యిట్లు చెప్పుచున్నది.

> "ఋచాం త్వః పోష మాస్తే పుపుష్వాన్" —ఋ. 10-72-11.

> 'హోతృనామక ఏక ఋత్విక్ యజ్ఞకాలే స్వకీయవేదగతానాం ఋచాం పుష్టిం కుర్వ న్నాస్తే। భిన్నప్రదేశే ష్వామ్నాతానాం ఋచాం సంఘాత మేకత్ర సంపాద్యైతావ దిదం శస్త్ర మితి కల్పిం కరోతి; సేయం పుష్టిః' —సాయణ ఋగ్వేద భాష్యభూమికా.

> 'ఏకో హోతృనామకః ఋత్విక్ తత్ర విప్రకీర్ణత్వే నాధీతానాం ఋచాం యజ్ఞానుష్ఠానకాలే సంఘీభావ మాపాద్య పుష్టిం కుర్వన్నాస్తే' — సాయణ సామవేదభాష్యభూమికా.

యజ్ఞానుష్ఠానకాలమున హోత యను ఋత్విక్కు స్వకీయవేదగతము లయిన ఋక్కులకు పుష్టిని కూర్చుచుండును. తా నధ్యయనము జేసిన వేదములో భిన్నప్రదేశముల యందు పఠితము లయిన ఋక్కులను హోత యజ్ఞానుష్ఠానకాలమునం దొక సంఘాతముగ రూపొందించును. ఇట్లు కూర్పబడిన మంత్రసముదాయమే శస్త్రము. ఇదియే పుష్టి—అని యర్థము.

కాన నిట్లు శస్త్రములు హోతచే నిష్పన్నములు చేయబడుచుండును; మంత్రములు గావు. పూర్వసిద్ధము లయిన మంత్రముల చేతనే భిన్నభిన్న సవనములందు (ప్రాతఃసవన, మాధ్యందినసవన, తృతీయసవనము లందు) భిన్నభిన్నదేవతల నుద్దేశించి భిన్నభిన్నశస్త్రములు నిష్పన్నము లగుచుండును.

ఇక స్తోత్రము. 'సామ్నా స్తువీత'—సామలచేతనే స్తోత్రము చేయబడవలె' నని శ్రుతిశాసనము (చూ. జై. సూ. 9_2_30). కాన సామలచే చేయబడు స్తుతికి స్తోత్ర మని పేరు. సామ యనగా గానము. ఋక్కులయందే సామలు గానము చేయబడును. 'ఋచి అధ్యూఢం సామ' — (ఛాం. ఉ. 1_6_1); 'ఋచి సామ గీయతే'—శ. బ్రా. 8_1_3_3— అనుచు శ్రుతి యీ సంప్రదాయమును వివరించుచున్నది. కాన, యజ్ఞసమయములందు ఋక్కులయందు జేయబడు గానమునకు, సామ యని పేరు. కొన్నియెడల సామ యొక ఋక్కునందే గానము జేయబడును. దానికి, 'ఏకర్చగాన' మని పేరు. మఱికొన్నియెడల 'ఏకం సామ తృచే క్రియతే స్తోత్రియమ్' అను నియమము ననుసరించి యొకే సామ మూడు ఋక్కులయందు గానము జేయవలెను. కొన్నియెడల నొకే సామ రెండు ఋక్కులయందే గానము జేయబడును. అట్టియెడ పై నియమము ననుసరించి యా రెండు ఋక్కులను మూడు ఋక్కులుగ ప్రగథనముజేసి సామగానము జేయవలసి యుండును. దీనికి 'ప్రగాథ'మని పేరు, ఋక్త్రయమునందు జేయబడెడి సామ గానమునకు 'తృచగాన' మని పేరు. ఇట్లు ఈ సామగాన రూపమగు స్తోత్రము సవన—దేవతా—ఛందోభేదముల ననుసరించి వివిధగతుల మార్పు చెందుచుండును. ఋత్విజులు తత్కాలమున శ్రుత్యుక్తప్రకారము వీని నూహించి చేయవలసియుండును. కాన, స్తోత్రము గూడ యజ్ఞకాలమున నూత్నరూపముల నిష్పన్న మగుచుండును. ఈ విషయమును ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

"గాయత్రం త్వో గాయతి శక్వరీషు" —ఋ. 10-72-11.

'ఉద్గాతృ నామక ఏక ఋత్విక్ గాయత్రి శబ్దాభిధేయం స్తోత్రం శక్వరీశబ్దాభిధేయాసు ఋక్షు గాయతి। ధాతూనా మనేకార్థత్వేన స్తుతిక్రియావాచినో గాయతి ధాతో రుత్పన్నో గాయత్రశబ్దః'

—సాయణ ఋగ్వేదభాష్యభూమికా,

ఉద్గాత యను ఋత్విక్కు శక్వరీనామకము లగు ఋక్కులయందు గాయత్రి మను పేరు గల స్తోత్రమును (సామను) గానము చేయుచున్నాడు—అని యర్థము. కాన క్రిత్వనుగుణముగ నా యా ఋక్కులయందు సామ నూహించి గానము చేయు సంప్రదాయ మీ మంత్రము వలన తెలియును. ఇట్లు శస్త్ర—స్తోత్రము లనునవి పూర్వసిద్ధము లయిన మంత్రముల చేతనే తత్కాలమున ఋత్విక్ప్రోక్తవిధముగ ఋత్విజులచే యజ్ఞములందు గూర్పబడుచుండును. ఇందు శస్త్రముల గూర్చెడి ఋత్విజుని 'ఉక్థభృత్' అనియు, సామల (స్తోత్రముల) గూర్చెడి ఋత్విజుని 'సామభృత్' అనియు ఋగ్వేద మిట్లు కీర్తించుచున్నది.

'ఉక్థభృతం సామభృతం బిభర్తి' —ఋ. 7-34-14.

'ఉక్థభృతం శస్త్రాణాం సంభర్తారం, సామభృతం ఉద్గాతారం'—సా.భా.

(శస్త్ర—సామస్వరూపము, తద్గాననియమాదుల వివరణము సాయణ ఋక్—సామవేదభాష్యోపక్రమణికలయందును, తాండ్యమహాబ్రాహ్మణోపోద్ఘాతాదుల యందును గాంచనగును). పై గ్రంథసందర్భము ననుసరించి 'గానయుక్తమంత్ర సాధ్య మగు స్తుతి స్తోత్రము; గానరహిత మంత్రసాధ్య మగు స్తుతి శస్త్రము'—అని తెలిసినది. ఈ విషయము సాయణులచే స్పష్టముగ నిట్లు చెప్పబడినది.

'అపరిగీతమంత్రిసాధ్యా స్తుతిః శస్త్రమ్; పరిగీతమంత్రి సాధ్యా స్తుతిః స్తోత్రిమ్' —సా.భా.తై.సం. 3-2-7-3.

అందుచే ఋక్సామాత్మకములై కూర్పబడెడి శస్త్ర—స్తోత్రిములు శ్రుతి ప్రోక్తములై ప్రాచీనము లయ్యును నవజాతము లగుచుండునని శ్రుతి కీర్తించుట యుక్తమే. ఈ విషయము 'హరియోజన' శబ్ద పరిశీలనము వలనను స్పష్టమగును.

హరియోజనః :-

ఇంద్రిని యశ్వములకు 'హరీ' యను పేరు శ్రుతులయందు ప్రసిద్ధము. ఇంద్రుడు యజ్ఞార్థమై యేతెంచునపుడు హరులనెడి యీ యశ్వ ద్వయము రథమునకు యోజనము జేయబడును. కాన నింద్రునకు 'హరి యోజనః' అని ప్రసిద్ధి. ఇంద్రుని యీ రథాశ్వము లేవియో పరిశీలింతము.

"ఋక్సామే వా ఇంద్రస్య హరీ"
— తై. సం, 6-5-9-2; ఐ. బ్రా. 2-24; తై. బ్రా, 1-6-3-9.

"ఋక్సామే వై హరీ" — శ, బ్రా, 4-4-3-6.

"ఋక్సామవేదాత్మకా వింద్రస్యాశ్వౌ" —సా,బ్రా.తై,సం, 1-4-28-10.

ఋక్సామవేదము లింద్రిని యశ్వము లని యర్థము. ఋత్విజులు కర్తృత్వను గుణముగ దత్కాలమున నూహించి చేసెడు శస్త్రముల వలనను స్తోత్రిముల వలనను ఋక్సామాత్మకములగు వేదము లింద్రిని రథాశ్వములుగ రూపొందుచుండును.

"బ్రిహ్మణా తే బ్రిహ్మయుజా యునజ్మి హరీ" — ఋ, 3-35-4.

"హే ఇంద్ర బ్రహ్మయుజా బ్రహ్మణా మంత్రేణ యోక్తవ్యౌ....
తే తవ హరీ అశ్వౌ బ్రహ్మణా స్తోత్రేణ, యునజ్మి
రథే సంయోజయామి" — సా. భా.

ఇట నింద్రాశ్వములు 'బ్రహ్మయుజా' అని పేర్కొనబడినవి. బ్రహ్మచే (మంత్రరూపస్తోత్రముచే) యోక్తవ్యములు. కాన, బ్రహ్మచే (స్తోత్రముచే) యోజన చేయబడుచున్నట్లు చెప్పబడినది.

"యజ్ఞం విమాయ కవయో మనీష
ఋక్సామాభ్యాం ప్రరథం వర్తయన్తి" — ఋ, 10-114-6.

"ఛందాంసి గాయత్ర్యాదీని దధతః స్తుతశస్త్రాదిరూపేణ
ధారయన్తః, కవయః, మనీషా—మనీషయా బుద్ధ్యా, ఏవం
యజ్ఞం విమాయ నిర్మాయ, రథం రమన్తేఽత్రేతి రథో యజ్ఞః
తం రథం యజ్ఞం, ఋక్సామాభ్యాం ప్రవర్తయన్తి ప్రకర్షేణ
సంపాదయన్తి" —సా.భా.

ఋత్విజులు తమ బుద్ధితో వివేచన జేసి స్తోత్ర-శస్త్రముల జేయుచు ఋక్సామలచే యజ్ఞరథమును బ్రవర్తింప జేయుచున్నారు - అని యర్థము.

కాన, మొత్తము మీద వేదమంత్రము లతిప్రాచీనములు. శస్త్ర స్తోత్రములు ఋత్విజులచే తత్కాలమున క్రత్వనుగుణముగ (బ్రాహ్మణ-కల్ప—అనుసారముగ) నూహించి రూపొందింపబడుట స్పష్టము. ఇట్లు, దేవతాహ్వాన - స్తుతిసాధనములైన వీనిని 'నవ్యము' లని, ఋగ్వేదము పలుచోట్ల నిట్లు కీర్తించినది.

"నవ్య మతక్ష ద్బ్రహ్మ హరియోజనాయ". — ఋ. 1-62-13.

'హరియోజనాయ ఇంద్రాయ నవ్యం నూతనం బ్రహ్మ
ఏతత్సూక్తరూపం స్తోత్రం అతక్షత్ అకరోత్' —సా.భా.

"ఇంద్రియ స్తే నవీయసీం గిరం మంద్రా మజీజనత్"
—ఋ. 8-95-5.

'హే ఇంద్ర ! యః యజమానః నవీయసీం నవతరాం పునః పునః క్రియమాణతయా, మంద్రాం మదకరీం, గిరం స్తుతి లక్షణాం వాచం తే త్వదర్థం అజీజనత్ ఉదపీపదత్ అకార్షీ దిత్యర్థః'
— సా.భా.

ఇట స్తుతిలక్షణమగు వేదవాక్కు యజ్ఞమున ఋత్విజులచే పునః పునః క్రియమాణ మగుటచేతను, దేవతాహ్వాన-స్తుతి సాధనమై స్తుత్యమై ప్రశస్తమై యొప్పుటచేతను 'నవ్య-నవీయసీ' యని కీర్తింపబడినది.

ఇట్లు నిరంతరాధ్యయనాభ్యాసాదుల చేతను, యజ్ఞాదికర్మలయందు శస్త్ర-స్తోత్రాదిరూపమున పునః పున రావర్తితమై యామ్నాతమగుచు నిత్య నూతనమై విలసిల్లుటచేతను శ్రుతికి 'ఆమ్నాయ' మని సార్థకనామము. శ్రుతులయందలి 'నవ-నవ్య' ఇత్యాది పదములు శ్రుతి యొక్క ఆమ్నాయ త్వోద్బోధకములు. ఈ పదముల కర్థము నిట్లు దర్శింపక, వీని నాధారము జేసికొని ఋగ్వేదకాలమున నూత్నమంత్రరచనోద్యమము గలదని చెప్పెడి చారిత్రికుల కల్పన యుక్తిసహము కాదు ; శ్రుతితాత్పర్యానుగుణమును గాదు.

నవ - ప్రణవః :-

ఇంతవఱకును దేవతలు, మంత్రములు, స్తోత్రములు పూర్వ్య-నవ ఇత్యాది పదములచే గీర్తింపబడుట గాంచితిమి. ఈ శబ్దములు 'స్తుత్యము, ప్రశస్తము, నిత్యనూతనము, నిత్యము' అను నర్థముల బోధించుటయు జూచితిమి. అందుచేతనే సర్వదేవాత్మకుడు, సర్వవేదాత్మకుడు నగు

పరమేశ్వరుని బోధించెడి సర్వవేదాత్మకము, వేదమూలభూతము నగు ఓంకారము గూడ 'ప్రణవః' అను సార్థకనామధేయముతో నొప్పినది.

'ప్రణూయతే ప్రస్తూయతే ఇతి ప్రణవః' — అమరసుధా.

అతిశయించి, మరల మరల స్తూయమాను డగుటచే పరమేశ్వరునకు ప్రణవ శబ్దము వాచకమైనది.

"తస్య వాచకః ప్రణవః" — యోగ సూ.

నిరంతరము స్తూయమాన మగుటచే ఓంకారమునకును 'ప్రణవః' అని పేరు.

"ప్రణౌతీతి ప్రణవః, తస్మాదోమితి ప్రణౌతి ఇతి శ్రుతేః"
— శం. భా. (విష్ణు స.)

ఈ ప్రణవనామౌచిత్యము మహాభాష్యమున నిట్లు చెప్పబడినది.

"ప్రణవ ష్టేః" — పా సూ.

'ప్రణవ ఇత్యుచ్యతే। కః ప్రణవో నామ ? పాదస్య వాఽ
ర్ధర్చస్య వాఽన్త్య మక్షర ముపసంహృత్య తదాద్యక్షర
శేషస్య స్థానే త్రిమాత్ర మోంకారం త్రిమాత్ర మోకారం
వా విదధతి తం ప్రణవ ఇత్యాచక్షతే।" — మహాభాష్య.

"యజ్ఞకర్మణి టేః ప్రణవ ఆదేశో భవతి - ఇత్యాది"
— కాశికా,

యజ్ఞకర్మ యందు ఋక్పాదముయొక్క గాని, ఋగర్ధభాగముయొక్క గాని చివర 'టి' భాగమునకు విధింపబడెడి త్రిమాత్రమగు ఓంకారమా లేక ఓకారము ప్రణవము. ఉదా :—

'అపాం రేతాంసి జిన్వ తోఽతమ్.'
'దేవాన్ జిగాతి సుమ్నయోఽతమ్' — ఇత్యాది

ఇట్లు యజ్ఞకర్మ యందు మరల మరల ప్రస్తూయమాన మగుటజేసి 'ఓం' కారమునకు, లేక 'ఓ' కారమునకు ప్రణవ మనెడి సార్థకనామము సిద్ధించినట్లు మహాభాష్యవచనము వలన గ్రహింపనగును. ఈ సంప్రదాయము నేటికిని యజ్ఞములందు గాంచనగును. శస్త్రముల చివర ప్రణవోచ్చారణము నాంతరీయక మని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"ప్రణవైః శస్త్రాణాగ్ం రూపమ్" —వా. సం. 19-27.
'ప్రణవైః ఓంకారైః శస్త్రాణాం రూప మాప్యతే'
— ఉవట మహీధరౌ.

యజ్ఞాదులయందే గాదు, వేదాధ్యయనాదులు, వేదమంత్రోచ్చారణము — వీని నెపుడు జేసినను నాద్యంతముల యందు ప్రణవోచ్చారణము చేయవలె నని శ్రుతిసంప్రదాయము.

"యో వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాన్తే చ ప్రతిష్ఠితః"
—తై. ఆ. 10-10-3.

ఇట్లు ఓంకారము వేదాధ్యయనాదుల యందును, యజ్ఞాదికర్మల యందును పునఃపునరావర్తితమై ప్రస్తూయమాన మగుచు, నిత్యనూతన మగుచు ప్రశస్తమై 'ప్రణవ' రూప మగుచున్నది. యజ్ఞాదికర్మలయందు అగ్నియు (పరమేశ్వరుడు) పునఃపునః ప్రస్తూయమాను డగుచు నిత్యనూతనుడగుట చేతనే 'సదా నవః' (ఋ. 3-11-5) అని ఋగ్వేదమున కీర్తింపబడినాడు. ఈ సదానవత్వమే ప్రణవత్వము. ఇట్లే ప్రణవస్వరూప పరిశీలనము

వలనను నవ శబ్దము 'స్తుత్యము, ప్రశస్తము, నిత్యనూతనము' అను నర్థముల బోధించుట స్పష్టము. కాన శ్రుతులయందు గల 'పూర్వ్య-నవ్య' ఇత్యాది పదములచే గీర్తింపబడెడి వేదవాక్కు 'స్తుత్యము, ప్రశస్తము, నిత్యనూతనము; అందుచే నిత్యము' - నని గ్రహించుటయే సంప్రదాయాభిమతము. కావుననే,

'వాచా విరూప నిత్యయా" —ఋ. 8-75-6.

యనుచు ఋగ్వేదమే 'వేదవాక్కు-నిత్యము' - అని ముక్తకంఠముగ గీర్తించినది. కాన, 'ఋగ్వేదకాలమున మంత్రరచనోద్యమము సాగినది; బ్రాహ్మణములకాలమున సన్నగిలినది' - యనెడి చారిత్రికుల కల్పన నిర్మూలమై పరాస్తమగుచున్నది. ఇక 'బ్రాహ్మణములకాలమున మంత్ర రచన సన్నగిలినను, పురోహితుడు గాథారూపములగు పద్యముల (మంత్రముల) రచించి యజ్ఞములందు వానిని గానము చేయవలె ననెడి నియమ మేర్పడినది' - యనెడి చారిత్రికుల కల్పన యందలి సామంజస్యమును జూతము.

స్వయంకృత గాథా గానము — శ్రుతులు :-

అశ్వమేధయాగమున స్వయంకృతములైన గాథలను వీణ మీద గానము చేయు సంప్రదాయము శ్రుతిసిద్ధము. కాని యిది పురోహిత (ఋత్విక్) కృత్యము (The priests were required to compose and sing ...... at the sacrifice) - అని యనుట శ్రుతి సంప్రదాయవిరుద్ధము. గానము నందును, గద్య - పద్య - రచనమునందును కౌశలము గల యొక బ్రాహ్మణుడును, నొక క్షత్రియుడును నీ కృత్యమును నిర్వర్తింపవలె నని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"తస్యై ప్రయాజేషు తాయమానేషు బ్రాహ్మణో వీణాగాథీ దక్షిణత ఉత్తరమంద్రా ముదాఘ్నన్ తిస్రః స్వయం సంభృతా గాథా గాయతి' ఇత్యయజత, ఇత్యదదా దితి"
— శ. బ్రా. 13-4-2-8.

"అథ సాయం ధృతిషు హూయమానేషు రాజన్యో వీణాగాథీ దక్షిణత ఉత్తరమంద్రా ముదాఘ్నన్ తిస్రః స్వయం సంభృతా గాథా గాయతి; ఇత్యయుధ్యత, ఇత్యముం సంగ్రామ మజయదితి" — శ, బ్రా. 13-4-3-5.

"దివా బ్రాహ్మణో గాయేత్। నక్తగ్ం రాజన్యః ...."

"ఇత్యదదా ఇత్యయజథా ఇత్యపచ ఇతి బ్రాహ్మణో గాయేత్";

"ఇత్యజినా ఇత్యయుధ్యథా ఇత్యముగ్ం సంగ్రామ మహన్నితి రాజన్యః" — తై. బ్రా. 3-9-14-2, 3,

అశ్వమేధయాగమున పగలు ప్రయాజహోమ సమయమున బ్రాహ్మణుడును, సాయంహోమ సమయమున రాజన్యుడును 'ఉత్తరమంద్ర' యనెడి వీణ మీద స్వయంకృతములయిన మూడు గాథలను గానము చేయవలెను. అందు బ్రాహ్మణుడు — 'యజ్ఞదీక్షితుడగు నీ రాజు ఇట్లు యజ్ఞము చేసెను; ఇట్లు దానము చేసెను; ఇట్లు శాకపాకాదుల వండించెను'—అని వర్ణించుచు స్వకీయమైన గద్య పద్య రచనముతో గానము చేయవలెను. ఇక క్షత్రియుడు — 'ఈ రాజిట్లు యుద్ధము చేసెను; ఇట్లు సంగ్రామమున శత్రువుల సంహరించెను; ఇట్లు జయించెను, — అని వర్ణించుచు స్వకీయమైన గద్య పద్య రచనలతో గానము చేయవలెను — అని యర్థము.

ఈ శ్రుతి వాక్యముల బరిశీలించుచో గద్యపద్యముల రచించి గానము చేసెడి కృత్యము పురోహిత (ఋత్విక్) ధర్మము గాదని స్పష్టము. ఇట్లు రచింపబడి గానము చేయబడెడి గాథలు వేర్వేఱు

అశ్వమేధయాగము లందు, వేత్వేఱు దీక్షితులయిన రాజుల ప్రశంసించుచు, వేత్వేఱు గాయకులచే, వేత్వేఱు కాలములందు రచింపబడుచుండును. (తతో బ్రాహ్మణః స్వోచితార్థప్రతిపాదకై ర్గద్యైః పద్యైశ్చ గాయేత్.... అత ఏవ తద్విషయై ర్గద్యైః పద్యైశ్చ రాజన్యో గాయేత్ - తై. బ్రా.

ఇట్లు ఈ గాథలు (రచనలు) ఎప్పటికప్పుడు మాఱిపోవుచుండును. కావున నివి మంత్రములు గావనుట స్పష్టము. మంత్రములకు మార్పు ఉండదు, 'స్వయం కృతాభిః' అను విశేషణముచే గాయకులచే నివి స్వయంరచితము లని తెల్పబడుటచే నీ గాథలు మంత్రములు గావు - అని శ్రుతియే స్పష్టము చేయుచున్నది. మఱియు నట్టి గాథలు స్వయంకృతము లని చెప్పబడుటచే ఋత్విజులచే యజ్ఞమున వినియోగింపబడెడి తదితర మంత్రములు 'స్వయంకృతములు గావు; పురుషరచితములు గావు; అపౌరుషేయములు'- అను విషయము గూడ నిట శ్రుతిచే స్పష్టము జేయబడినది. కాన బ్రాహ్మణముల కాలమున గాథలనెడి మంత్రజాతమును పురోహితులు రచింపవలె నను నియమ మేర్పడిన దని జెప్పెడి చారిత్రికుల కల్పన శ్రుతిసంప్రదాయ విరుద్ధము. ఇట్టి యీ పదముల నాధారము జేసికొని మంత్రములు మానవరచితము లని చెప్పబూనుట యుక్తము కాదు.

కాన పూర్వోదాహృతము లయిన శ్రుతి, శ్రుత, అనుశ్రవ, పిత్ర్యా, సనజా, పూర్వ్యా, నవ్య, నవజాత - ఇత్యాది పదములు శ్రుతి యొక్క అనూచానత్వమును, ఆమ్నాయత్వము నుద్బోధించునవియే యగుట స్పష్టము. ఇంతేకాదు. అనుశాసన, అనూచానాది పదముల వలన నీ విషయ మింకను తేటపడగలదు.

అనుశాసనమ్ :-

ఈ వైదికవాణి నియమపూర్వకముగ గురుముఖము నుండియే గ్రహింపబడవలె నను సంప్రదాయమును శ్రుతియే —

"వేద మనూచ్యాచార్యోఽన్తేవాసిన మనుశాస్తి''—శిక్షావల్లి.

ఇత్యాద్యనుశాసనముల ద్వారా తెలియజేయుచున్నది. తనను అభ్యసించు విషయమై శ్రుతి యిట్లు అనుశాసించు టేమి?

1. వేదమంత్రోచ్చారణ విషయమునను, 2. మంత్ర వినియోగ విషయమునను, 3. అర్థావబోధవిషయమునను - పరంపరాప్రాప్తమైన సంప్రదాయములను సంప్రదాయపరినిష్ఠితుడైన యాచార్యుని ముఖమునుండి గ్రహింపవలె నని శ్రుతితాత్పర్యము. అట్లు ఆచార్యుని ముఖమునుండి గ్రహింపక లిఖితపాఠాది గ్రంథసాహాయ్యమున నెవరికి దోచిన యటుల వార లధ్యయనము జేయ బూనుచో పురుషబుద్ధిగత భ్రమప్రమాదాది దోషములచే నప్రయత్నముగనే యుచ్చారణాదులయందు వైషమ్యము సంభవించుట సహజము. సంప్రదాయానుగతమైన యర్థావగతి గలుగక విపరీతార్థప్రతీతియు గలుగుట సంభవ మగును. అట్టిచో శ్రుత్యుద్దిష్టమైన లక్ష్యము నెఱవేరదు. లిఖితగ్రంథాది సాహాయ్యముచే నుచ్చరింపబడు వాక్కు గాని, దానిని యథోచితముగ ననువదించి కల్పించెడి చరిత్రకల్పన గాని పవిత్ర్యము, సనాతనము, పూర్వ్యము, దేవతాజాగరణశీలము. కాజాలదు. అందుచే నాచార్యముఖమునుండి నియమపూర్వకముగ నుచ్చారణానుచ్చారణ రూపమున గ్రహింపబడవలె నని శ్రుతి యనుశాసించుచున్నది.

వాకః- అనువాకః- అనూచానః- అనూక్తమ్ :-

పై తైత్తిరీయశ్రుతి వాక్యమున 'వేదం అనూచ్య' అను పదములు వేదాధ్యయన మనగా వేదానువచనము - అను విషయమును వ్యక్తము చేయుచున్నవి. 'తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి' - ఇత్యాది శ్రుతివాక్యములును వేదాధ్యయనమునకు గల వేదానువచనత్వ ప్రసిద్ధిని దృఢపఱచుచున్నవి.

భరద్వాజుడు ఇంద్రానుగ్రహముచే త్రిపురుషాయుర్దాయమును బడసి వేదాధ్యయనము జేసెను. ఆయన జేసిన అధ్యయనము గురుముఖోచ్చారణానూచ్చారణరూపమే - అనగా వేదానువచనరూపమే - యగుట ఇంద్రవాక్యము వలన దెలియుచున్నది.

"స హోవాచ। భరద్వాజే త్వామన్త్ర్య। వేదా వా ఏతే।
అనంతా వై వేదాః। ఏత ద్వా ఏతైః త్రిభి రాయుర్భి
రన్వవోచథాః" — తై. బ్రా. 3-10-11,4.

'త్వ మేతైః త్రిభి రాయుర్భిః ఏత న్మిష్త్రిత్రయ పరిమితం
వేదజాతం గురూపదేశ మన్వధీతవా నసి' — సా.భా.

ఇట, 'అన్వవోచథా:' అను పదముచే వేదాధ్యయనము 'అనువచనరూపమే' యను సంప్రదాయమును శ్రుతి తెలియజేయుచున్నది. ఇట్టి సంప్రదాయమును శ్రుతి యడుగడుగున అనూచ్య, అన్వవోచత్-ఇత్యాది క్రియల ద్వారా చాటుచునేయున్నది. శతపథశ్రుతియు వాక్త్రైవిధ్యము నిట్లు చెప్పుచున్నది.

"ధీరసి దక్షిణాఽసి (వా.సం 4-29) ఇతి। ధియా ధియా
హ్యేతయా మనుష్యా జుజ్యూషన్తి। అనూక్తేనేవ,
ప్రకామోద్యేనేవ, గాథాభి రివ, తస్మా దాహ-ధీరసీతి"
— శ. బ్రా. 3-2-4-16.

'ధియా ఇత్థం వదిష్యామీతి బుద్ధ్యా చిత్తవ దభివదన రూపేణ కర్మణా వా। ధీరితి కర్మ నామ। జుజ్యూషన్తి జీవితు మిచ్ఛన్తి మనుష్యాః।....అనూక్తేన అనువచనేన వేదాధ్యయనేనేత్యర్థః। ప్రకామోద్యం ఇచ్ఛయా లౌకిక భాషణం। గాథా గద్యపద్యగీత్యాద్యాత్మికా। సర్వత్ర ఇవ శబ్దో వాక్యాలంకారార్థః। ఏవంవిధైర్వాగ్విశేషైర్యతో జీవితు మిచ్ఛన్తి అతో ధీరసీత్యుక్తమ్" — సా.భా.

సోమక్రయణీరూపిణి యగు ధేనువు వాగ్రూపిణిగ నిట స్తుతింపబడు చున్నది (వాగ్రూపాధ్యారోపకల్పనయా సోమక్రయణీ గౌః స్తూయతే_ ఉవట, మహీధర. భా.). ఇట్లు చెప్పెద నని మొదట బుద్ధిచే నిశ్చయించి యా యర్థము తరువాత వాక్కుచే ప్రకాశింపజేయబడును. ఈ వాక్కు లోకవ్యవహారమునకు మూలము. అట్టి వాక్కు 'అనూక్తము - ప్రకామోద్యము - గాథ' యని మూడు విధములు. అనూక్త మన అనువచనము - వేదాధ్యయనము. ప్రకామోద్య మనగా స్వేచ్ఛగ నొనరించెడి లౌకిక భాషణము. గాథ యన గద్యపద్యగీత్యాదిరూపము. ఇట్టి వాగ్విశేషముల చేతనే మానవ జీవితము నడచును. సోమక్రయణి యగు ధేనువు త్రివిధవాగ్రూపిణి; వాక్కు ధీరూపము. అందుచే 'ధీరసి' యని స్తుతింపబడినది - యని యర్థము.

ఇట పేర్కొనబడిన త్రివిధవాక్కులలో నొకటి అనూక్తము (వేదాధ్యయనము) చెప్పబడినది. అందుచే నిది తదితర లౌకికభాషణ, గాథారూపములగు వాక్కులకంటె విలక్షణ మగుట స్పష్టము. అనగా అనూచ్యమానత్వ మను ధర్మము వేదవాక్కునకే గాని తదితర వాక్కులకు లేదనెడు విషయ మిట స్పష్టము జేయబడినది.

ఇట్లు అనూచానముగ అనూచ్యమాన మగుచుండుటచే వేదమునకు 'అనూవాకః, అనూచానః' ఇత్యాది నామము లును ప్రసిద్ధములైనవి.

అనువాకః - వాకః :-

'అనూచ్యతే (అను + వచ్ + ఘఞ్)_గానకూన్యే ఋగ్విశేషే,
ఋగ్యజుఃసమూహే శస్త్రనామ్నా ఖ్యాతే వేదాంశే'

— వాచస్పత్యమ్.

ఈ నిఘంటువు ననుసరించి ఋగ్యజుస్సమూహరూప వేదమునకును శత్ర రూప వేదభాగమునకును 'అనువాకః' అని ప్రసిద్ధి యున్నట్లు తెలియు చున్నది. కాని, మహాభారతము ననుసరించి కృత్స్నవేదపాఠమునకు 'అనువాక' మని పేరున్నట్లు తెలియుచున్నది.

"శ్రోత్రియస్యేవ తే రాజన్ మందకస్యావిపశ్చితః ।
అనువాకహతా బుద్ధి ర్నైషా తత్త్వార్థదర్శినీ ॥"

— భారత, 3-35-19.

'అనువాకః గురూక్తి మనువచనమ్, తేన హతా అర్థజ్ఞాన శూన్యస్య వేదాక్షరమాత్రాభ్యాసినః' — నీలకంఠః.

ఈ వివరణము ననుసరించి అనువాక మనగా గురుముఖోచ్చారణ అనూచ్చారణరూపమైన వేదాధ్యయనము ; గురూపదేశము ననుసరించి యథాతథముగ మరల మరల నావృత్తి జేయబడు వేదమంత్రపాఠము—అని యర్థము.

మహాభారతమున నింకొకయెడ 'వాక, అనువాక' శబ్దముల ప్రయోగ మిట్లు గలదు.

"యం వాకే ష్వనువాకేషు నిష త్సూపనిషత్సు చ।
గృణన్తి సత్యకర్మాణం సత్యం సత్యేషు సామసు ॥"

— భారత. 12-47-26.

'వాకేషు మంత్రేషు సామాన్యతః కర్మప్రకాశకేషు, అనువాకేషు మంత్రార్థవివరణభూతేషు బ్రాహ్మణవాక్యేషు, నిషత్సు కర్మాంగాద్యవబద్ధ దేవతాదిజ్ఞానవాక్యేషు, ఉపనిషత్సు కేవలాత్మజ్ఞాపక వాక్యేషు - గృణన్తి ధ్యాయన్తి, సత్యం, అబాధితం, సత్యేషు అబాధితార్థేషు, సామసు జ్యేష్ఠసామాదిషు'. —నీలకంఠః.

వాకము లనగా సామాన్యముగ గర్మల ప్రకాశింపజేసెడి మంత్రములు. అనువాకము లనగా మంత్రార్థవివరణరూపము లగు బ్రాహ్మణ వాక్యములు. నిషత్తు లనగా కర్మలకును, తదంగములకును సంబంధించిన దేవతాదిజ్ఞానమును బోధించు వాక్యములు; ఉపనిషత్తు లనగా కేవలాత్మ జ్ఞాపక వాక్యములు— అని యర్థము.

భారతము ననుసరించి యనువాక మనగా 'వేదానువచనము' అను వర్థము పూర్వశ్లోకమున దెల్పబడినది. ఈ శ్లోకమున మంత్రార్థ వివరణ రూపములగు బ్రాహ్మణము లని యర్థము తెల్పబడినది. మొత్తముమీద అనూచ్యమానధర్మము గలవి యగుటజేసి ఋగాది మంత్రములకును అనువాకము లని పేరు. ఇంతే కాదు.

అనూచానః - నిధిః :—

పై కారణములచేతనే వేదములకు 'అనూచానః' అను నామము శ్రుతిప్రసిద్ధము.

"అథ యదేవాఽనుబ్రువీత – తేన ఋషిభ్య ఋణం జాయతే।
తద్ధ్యేభ్య ఏతత్ కరోతి – ఋషీణాం నిధిగోపః – ఇతి
హ్యనూచాన మాహుః ॥" —శ. బ్రా. 1-7-2-3.

'ఉథేతి అనుబ్రువీత అనువచనం కుర్యాత్ అధీయేతేత్యర్థః ।
నిధిగోప ఇతీతి। ఉపభుజ్యమానోఽపి యో న వినశ్యతి స
నిధిః । తాదృశః ఋషీణాం సంబంధీ యో వేదాఖ్యో నిధిః
తస్య గోపయితా ఇతి వేదం అనూచ్యమానం ఆహుః ఋషాః।
అత స్తేషాం ప్రవచనం ధన మితి గమ్యతే॥' —సా. భా.

ఎంత యనుభవించినను నేది తఱుగదో యది నిధి. వేదము అట్టి నిధి. ఋషులు దీర్ఘ తపఃసమాధిలో దర్శించి యనుగ్రహబుద్ధితో లోకమున

దేవ, ఋషి, పితృఋణవిముక్తి నొందుటకై యే విధముగ నియమపూర్వక వేదాధ్యయనముజేసి విహితకర్మానుష్ఠానపరు లగుచు నిధిరక్షకులు గావలెనో శ్రుతి స్మృతి పురాణేతిహాసాదులు పెక్కురీతుల నాదేశించినవి.

1. "విద్యా హ వై బ్రాహ్మణ మాజగామ గోపాయ మా శేవధి ష్టే
ఒహ మస్మి। అసూయకా యానృజవే ఒయతాయ న మా బ్రూయా
వీర్యావతీ తథా స్యామ్॥

2. య ఆతృణ త్త్యవితథేన కర్ణా వదుఃఖం కుర్వ న్నమృతం
సంప్రయచ్ఛన్। తం మన్యేత పితరం మాతరం చ తస్మై న
ద్రుహ్యేత్ కతమ చ్చ నాహ॥

3. అధ్యాపితా యే గురుం నాద్రియన్తే విప్రా వాచా మనసా
కర్మణా। యథైవ తే న గురో ర్భోజనీయ స్తథైవ తా న్న
భున క్తి శ్రుతం తత్॥

4. య మేవ విద్యాః శుచి మప్రమత్తం మేధావినం బ్రహ్మ
చర్యోపపన్నమ్। య స్తేన ద్రుహ్యేత్ కతమచ్చ నాహ
తస్మై మా బ్రూయా నిధిపాయ బ్రహ్మన్ ॥"

సంహితోపనిషద్బ్రాహ్మణమ్ 3; నిరు. 2-4; విష్ణు. స్మృ. 29, 30 అధ్యాః
వాసిష్ఠ. స్మృ. 2-8; మను. స్మృ. 2-114, 115, 145.

'ఋణాని త్రీ ణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్ ।
అనపాకృత్య మోక్షం తు సేవమానః వ్రజ త్యధః ॥'

— మను, 6-35.

పూర్వోక్తప్రమాణముల ననుసరించి దేవదత్తము, ఋషిప్రోక్తము, పితృపరంపరాప్రాప్తము నైన నిధి యగుటచే, దేవ - ఋషి - పితృ ఋణవిముక్తి నందుటకై యీ వేదము అధ్యయన, అధ్యాపన, కర్మానుష్ఠానముల

దేవ, ఋషి, పితృఋణవిముక్తి నొందుటకై యే విధముగ నియమపూర్వక వేదాధ్యయనముజేసి విహితకర్మానుష్ఠానపరు లగుచు నిధిరక్షకులు గావలెనో శ్రుతి స్మృతి పురాణేతిహాసాదులు పెక్కురీతుల నాదేశించినవి.

1. "విద్యా హ వై బ్రాహ్మణ మాజగామ గోపాయ మా శేవధి ష్టే ఒహ మస్మి। అసూయకా యానృజవే ఒయతాయ న మా బ్రూయా వీర్యవతీ తథా స్యామ్॥

2. య ఆతృణ త్త్యవితథేన కర్ణా వదుఃఖం కుర్వ న్నమృతం సంప్రయచ్ఛన్। తం మన్యేత పితరం మాతరం చ తస్మై న ద్రుహ్యేత్ కతమ చ్చ నాహ॥

3. అధ్యాపితా యే గురుం నాద్రియన్తే విప్రా వాచా మనసా కర్మణా। యథైవ తే న గురో ర్భోజనీయ స్తథైవ తా న్న భునక్తి శ్రుతం తత్॥

4. య మేవ విద్యాః శుచి మప్రమత్తం మేధావినం బ్రహ్మ చర్యోపపన్నమ్। య స్తేన ద్రుహ్యేత్ కతమచ్చ నాహ తస్మై మా బ్రూయా నిధిపాయ బ్రహ్మన్ ॥"

సంహితోపనిషద్బ్రాహ్మణమ్ 3; నిరు. 2-4; విష్ణు. స్మృ. 29, 30 అధ్యాః వాసిష్ఠ. స్మృ. 2-8; మను. స్మృ. 2-114, 115, 145.

'ఋణాని త్రీ ణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్ ।
అనపాకృత్య మోక్షం తు సేవమానః వ్రజ త్యధః ॥'

— మను, 6-35.

పూర్వోక్తప్రమాణముల ననుసరించి దేవదత్తము, ఋషిప్రోక్తము, పితృపరంపరాప్రాప్తము నైన నిధి యగుటచే, దేవ - ఋషి - పితృ ఋణ విముక్తి నందుటకై యీ వేదము అధ్యయన, అధ్యాపన, కర్మానుష్ఠానముల

ద్వారా తరతరములుగ సంరంక్షింపబడుచు వచ్చినదని తెలియును. అందుచే వేదమునకును, లేక వేదాధ్యయనమునకును, అనువాక, అనూచానాది నామములు సార్థకములై యొప్పుచున్నవి.

ఆమ్నాయాంబుధిమథనమ్ - అమృతపానమ్ :-

ఆమ్నాయపద లక్షితార్థము గూడ నిదియే. ఆమ్నాయ మనగా నిరంతరాభ్యాసపూర్వకముగ నధ్యయనము జేయబడునది - అని యర్థము. అధ్యయనము లేక యభ్యాస మనగా కేవలశబ్దరాశిని కంఠస్థము చేయుట, కంఠస్థము చేసి మరల మరల నావృత్తము జేయుట మాత్రమే యర్థము గాదు. ఆ మంత్రముల నా యా కర్మలయందు వినియోగపరచుటయు మాత్రమే గాదు. అంతియే యైనచో నది తత్త్వార్థదర్శిని కాజాలదు. 'నైషా తత్త్వార్థదర్శనీ' యని మహాభారత శ్లోకము హెచ్చరించుచున్నది. ఆ యభ్యాస స్వరూపమును మనుస్మృతి యిట్లు వివరించుచున్నది.

'వేదాభ్యాసేన సతతం శౌచేన తపసైవ చ ।
అద్రోహేణ చ భూతానాం జాతిం స్మరతి పౌర్వికీమ్ ॥
పౌర్వికీం సంస్మరన్ జాతిం బ్రహ్మైవాభ్యస్యతే పునః ।
బ్రహ్మాభ్యాసేన చాజస్ర మనంతం సుఖ మశ్నుతే ॥"

— మను. స్మృ. 4-148, 149.

శౌచ-సంతోషములు, తపస్సు, భూతస్నేహము - వీనితో గూడిన వేదాభ్యాసము వలన వేదవిదుడు జాతిస్మరుడై (పూర్వజన్మస్మృతి గలవాడై) బ్రహ్మాభ్యాసము చేసి యనంతసుఖమును బడయగలడు - అని యర్థము.

ఇందలి బ్రహ్మాభ్యాసపదమును వ్యాఖ్యాత లిట్లు వివరించిరి. 'సంసారే విరజ్యన్ బ్రహ్మైవ అజస్ర మభ్యస్యతి, శ్రవణ మనన ధ్యానైస్సాక్షాత్కరోతి'. వేదము బ్రహ్మశబ్దవాచ్య మగుట సోపపత్తికముగ

పూర్వశీర్షికయందు వివరింపబడినది. ఇట కేవలమంత్రపాఠాభ్యాసము వేదాభ్యాస మనియు, క్రమముగ విరక్తుడై తత్త్వజిజ్ఞాసతో జేయు శ్రవణ, మనన,ధ్యానరూప మగు అభ్యాసము బ్రహ్మాభ్యాస మనియు, నధికారిభేదము ననుసరించి యభ్యాసస్వరూప మీ శ్లోకములందు వివరింపబడినది. కాన, ఆమ్నాయ మనగా కేవల మంత్రపాఠాభ్యాసమే గాక తత్త్వదర్శక మగు బ్రహ్మాభ్యాస మనియు నర్థము గ్రహింపవలెను.'బ్రహ్మాణం బ్రహ్మ వాహసం' ఇత్యాది ఋక్కుల పరమార్థము 'ఆమ్నాయ' పద పరమార్థమును గ్రహించినపుడే సాధ్య మగును.

సుదృఢమైన భక్తితో నర్థానుసంధాన పూర్వకముగ మంత్రముల మననము జేయుచు నందు నిగూఢమై యున్న యమృతము నాస్వాదించుట 'ఆమ్నాయ' లక్ష్యార్థముగా శ్రీశంకర భగవత్పాదులును రూపకవిన్యాసమున నిట్లు వివరించిరి.

"ఆమ్నాయాంబుధి మాదరేణ సుమనస్సంఘా స్సముద్య న్మనో
మంథానం దృఢభక్తి రజ్జుసహితం కృత్వా మథిత్వా తతః ।
సోమం కల్పతరుం సుపర్వసురభిం చింతామణిం ధీమతామ్
నిత్యానందసుధాం నిరంతర రమాసౌభాగ్య మాతన్వతే॥"

— శివానందలహరి.

సుమనసు లనగా దేవతలు. విద్వాంసులు గూడ సుమన శ్శబ్దముచే చెప్పబడుదురు. దేవతలు క్షీరసాగరమును మథించి చంద్రుడు, కల్ప వృక్షము, కామధేనువు, చింతామణి మున్నగు వానిని బొందినట్లు మననశీలు రగు విద్వాంసులు శాస్త్రార్థవిజ్ఞాన కుశలమైన మనస్సు అనెడి కవ్వమును దృఢభక్తి యనెడి త్రాటితో బిగించి, ఆమ్నాయ మనెడి యంబుధిని ఆదరముతో మథించి, మథించి, యందు భక్తులపాలిటి కల్పవృక్షము, కామధేనువు, చింతామణియు నిత్యానందసుధాస్వరూపుడు, మోక్షలక్ష్మీ

సౌభాగ్యస్వరూపుడు నగు సోముని (ఉమాసహితు డగు పరమేశ్వరుని) పొందుదురు - అని యర్థము.

ఇట జెప్పినట్లు, ఆమ్నాయమును భక్తిపురఃసరముగ నాదరముతో మథించుకొలదియు, మొదట అక్షరరాశిగ, అనగా అక్షరరూప సముద్రముగ, మాత్రమే గన్పట్టెడి వేదవాణి క్రమముగ బ్రహ్మవిద్యా స్వరూపిణి యగుచు తన నారాధించెడి సుమనసుల పాలిటి కల్పలతయై, కామధేనువై, చింతామణియై, తుదకు ఉమా (బ్రహ్మవిద్యా) సహితుడగు సోముని పొందింపజేయు ననెడి భావము గూడ లక్షిత మగుచునే యున్నది. 'సా హి శ్రీ రమృతా సతామ్' అని పూర్వ ముదహరించిన శ్రుతిచే లక్షిత మగు నర్థము గూడ నిదియే.

'ఆమ్నాయ' పదముచే నుద్దిష్టమైన నిరంతరాభ్యాసమే మథనము. అదియే పై శ్లోకమున ప్రబోధింప బడినది. - ఇట్టి మథనముచే లభించెడి యమృతము దేవతాదులకు గూడ దుర్లభము; అచార్యోపదేశైక లభ్యము— అని పరమగురుస్వరూపమున శ్రీ శంకరభగవత్పాదు లిట్లు వివరించిరి.

"ప్రజ్ఞా వైశాఖవేధక్షుభితజలనిధే ర్వేదనామ్నోఽంతరస్థం
భూతా న్యాలోక్య మగ్నా న్యవిరతజననగ్రాహఘోరే సముద్రే।
కారుణ్యా దుద్దధారామృత మిద మమరై ర్దుర్లభం భూతహేతో
ర్య స్తం పూజ్యాభిపూజ్యం పరమగురు మముం పాదపాతై
ర్నతోఽస్మి" ॥ — గౌడపాదకారికా - అ.శా. ప్రకరణమ్.

ఘోరమగు సంసారసాగరమున బడి యీదులాడెడి జనుల నుద్ధరించుటకై, కరుణతో, వేదసాగరమును మథించి, దేవతలకు గూడ దుర్లభమైన నీ యద్వైత తత్త్వామృతము నుద్ధరించి (విష్ణువు దేవతలకు వోలె) సుమన స్సంఘములకు బంచి యిచ్చిన పరమగురువులు, పూజ్యాభిపూజ్యులు నగు శ్రీ భగవద్గౌడపాదాచార్యులకు సాష్టాంగప్రణామము—అని యర్థము.

కాన (1) ఆమ్నాయముయొక్క పరమతాత్పర్యము మోక్షలక్ష్మీ సామ్రాజ్యమే యనియు, (2) అట్టి యమృతపానము సుమనసస్సంఘమున కు మాత్రమే లభ్య మనియు, (3) వారికిని గూడ గురూపదేశాదుల ననుసరించి, అనగా సంప్రదాయమార్గమున, మథించిననే గాని లభ్యము కాదనియు పై శ్లోకముల వలన దెలియ నగును.

ఇప్పుడు శ్రుతి, ఆమ్నాయ శబ్దార్థముల బరిశీలించినచో 'ఆమ్నాయః' అను నామము శ్రుతి యొక్క శ్రుతిత్వము, అట్లే శ్రుతి యను పదము ఆమ్నాయము యొక్క ఆమ్నాయత్వమును అన్యనిరపేక్షముగ పరస్పరము నిరూపించుకొనుచున్నవని తెలియనగును.

సమామ్నాయః :-

అర్థానుసంధానపూర్వకముగ అధ్యయనము జేయబడు ఆమ్నాయమే సమామ్నాయ మనియు జెప్పబడుచున్నది.

"ఏత ఏంతః సమామ్నాయో యోగః సాంఖ్యో మనీషిణామ్।
త్యాగ స్తపో దమః సత్యం సముద్రాంతా ఇవాపగాః॥"

—భాగ. 10-47-33.

"ఏషః మనోరథః అంతః సమాప్తి ఫలం యస్య సః సమామ్నాయః వేదః" — శ్రీధరః). సమామ్నాయము యొక్క అనగా వేదము యొక్క లక్ష్యము మోక్ష మని భావము.

విద్య - ఆమ్నాయయోగము :-

ఇట్లు ఆమ్నాయ, అనువాక, వాక, అనూవాన, అనుశ్రవ, సమామ్నాయ, శ్రుతి, శ్రుతా, శ్రవ, అనుశ్రవ, పిత్ర్యా. సనజా, పూర్వ్యాః,

నిధి—ఇత్యాది పదము లన్నియు సార్థకములై, వేదము అనాది యనియు, ఋషిప్రోక్త మనియు, పితృపరంపరాప్రాప్త మనియు తఱుగని నిధి యనియు, సంప్రదాయము ననుసరించి నిరంతరాభ్యాసాదిరూప మథనము జేయుకొలదియు సుమనసులకు నమృతము నావిర్భవింప జేయు క్షీరసాగర మనియు దెలియజేయుచున్నవి.

అందుచే నీ వేదములు వేత్వేఱు రచయితల రచన లనియు, నందు పౌర్వాపర్యము గలదనియు, ఆంతరదర్శనము లేదనియు, లౌకికదృశ్య సంఘటనాదుల వర్ణన లనియు, అసంబద్ధప్రలాపము లనియు, జెప్పుట తగదు. అట్లు జెప్పుచో వేదవాణి స్వరూపస్వభావాదుల దెలియజేయుటకై ప్రవృత్తము లయిన యీ పదములు సార్థకములుగాక నిరర్థకములే గావలసి వచ్చును. అట్లగుట శ్రుతిసంమతము కాదుగదా ! అందుచే శ్రుత్యుక్తము, సంప్రదాయానుగతమునైన దృష్టితో మాత్రమే, అనగా నామ్నాయాది శబ్దార్థముల గుర్తెఱిగి యీ యామ్నాయాంబుధిని మథింప బూనినపుడే యందలి పదములు సార్థకములై, సుమనసులగు శంకరాదులకు వలె, నమృతప్రాప్తికి దోహదకారు లగును. లేనిచో గావు—అని అమ్నాయాది శబ్దతాత్పర్యము.

వాల్మీకి మహర్షియు భంగ్యంతరముగ ఆమ్నాయముల యొక్క ఆమ్నాయత్వము నిట్లు వివరించినాడు.

"తస్య సందిదిహే బుద్ధి ర్ముహు స్సీతాం నిరీక్ష్య తు।
ఆమ్నాయానా మయోగేన విద్యాం ప్రశిథిలా మివ ॥
దుఃఖేన బుబుధే సీతాం హనుమా ననలంకృతామ్।
సంస్కారేణ యథా హీనాం వాచ మర్థాంతరం గతామ్॥"
—రామా. 5-15-38,39.

ఆమ్నాయ। మన నిరంతరాభ్యాసము; అది శ్రవణ మనన నిదిధ్యా, రూపము. అట్టి ఆమ్నాయములు లేని విద్య సంస్కారహీనమై, ప్రశిథిలమై 'అదియే యిది' యని గుర్తించుటకు శక్యము గాక యుండును. అట్టి విద్య వలె, సంస్కారహీనయై అనలంకృతయై యున్న సీతను జూచి 'సీత యీమెయా !' యని హనుమంతుడు సందేహించెను. తరువాత నెట్లో యతి కష్టము మీద 'ఈమె సీతయే' యనియు, సంస్కారహీనమైన వాక్కు వివక్షితార్థమును గాక విపరీతార్థము బొందియుండురీతి, నీమెయు సంస్కారహీనయై యవశయై రావణుని యధీనమున నున్నది యని తెలిసికొనెను— అని యర్థము.

ఇట శ్లోకములలో విద్యా, వాక్ పదములచే జెప్పబడిన విద్యగాని వాక్కుగాని యేది ? హనుమంతుడు కిష్కింధకాండయందు 'నానృగ్వేద వినీతస్య నాయజుర్వేదధారిణః। నాసామవేద విదుషః శక్య మేవం ప్రభాషితుమ్' (4-3-28) ఇత్యాది శ్లోకములచే వేదవి దగ్రేసరుడుగ శ్రీరామునిచే గొనియాడబడినాడు. అట్టివాని దృష్టిలో విద్య యన వేదవిద్యయే యగును. శ్రుతులయందును పురాణాదులయందును విద్య యన త్రయీవిద్యయే. ఆమ్నాయావశ్యకత త్రయీవిద్యకు జెప్పబడినట్లుగ మఱి యే విద్యకును ప్రసిద్ధము కాదు. అట్టి ఆమ్నాయావశ్యకత గలది యగుట చేతనే యా విద్యకు ఆమ్నాయత్వ ప్రసిద్ధి వచ్చినట్లు పూర్వము వివరింపబడినది.

ధర్మ, బ్రహ్మ రూప పురుషార్థముల దెలియజేయునది (వేదయతి) యగుటచే వేదవిద్యకు విద్య యని సార్థకనామము. అట్లు దెలిసికొనుటకు కేవల వేదమంత్ర పాఠాభ్యాసము చాలదు. ధర్మజిజ్ఞాస జేసి ధర్మస్వరూపమును, శ్రవణమననాదుల ద్వారా బ్రహ్మస్వరూపమును దెలియవలసి యున్నది కర్మవినియోగమునకును, పరమార్థదర్శనమునకు నుపయోగపడని కేవల వేదరాశియందు విద్యాత్వము నామమాత్రావశిష్టమై యుండి

'నిజముగ నిది విద్యయా ?' యని యాపాతముగ సందేహమునకు దావు గల్గుచుండును,

ఇక సీతవిషయము. రావణాంతఃపురములో రూపవతులగు స్త్రీల నెందఱినో హనుమంతుడు గాంచియుండెను. అందే యొకరియందును, తన మనసున ప్రతిష్ఠితమై యున్న సీతాదేవియొక్క రూపముగాని, వైశిష్ట్యము గాని హనుమంతునకు గన్పట్టలేదు. అశోకవనికయం దనలంకృతయై యవశయై శోకసమాక్రాన్తయై, స్పష్టముగా నభివ్యక్తముగాని తేజముతో గూడినదై యున్న, సీతను గాంచి, హనుమంతు డామెయందు స్వమనఃపట ముద్రితసీతాదివ్య రూపమును గాంచెను. కాని, నిజముగ నీమె సీతయా ? సీత యగుచో నిట్లున్నదేమి ? యని సందేహించెను.

పరవిద్యాస్వరూపిణి యగు నీ దేవత. ప్రశిథిలవిద్య వోలె, నిట్లు గన్పట్టు టేమి ?—యని సందియపడి హనుమంతుడు విద్యాస్వరూపమును, వాక్స్వరూపము నెఱిగిన వాడగుటచే 'సంస్కారహీన మైనపుడు వాక్కు వివక్షితార్థమును జెప్పక విపరీతార్థమును బొందునట్లు, ఈమెయు పతి సాన్నిధ్యము లేక యసంస్కృతయై, యవశయై, పరాధీనమై యున్నటుల నున్నది, యని సమాధానపడెను.

ఇట సంస్కారవతియగు వాక్కు యేది ? వేదవిదుడగు హనుమంతుని దృష్టిలో గల సంస్కారవతియగు వాక్కు వేదవాణియే. సంస్కార మనగా ప్రకృతి ప్రత్యయాది సంస్కారము. శబ్దవ్యుత్పత్తి, ప్రవృత్తి నిమిత్తములు గల వాక్కు సంస్కృతరూపిణియైన వేదవాక్కే యగును. అట్టి సంస్కారము అన్యవాక్కులకు ప్రసిద్ధము గాదు. ఆ ప్రసిద్ధి వేదవాక్కునకే గలదు.

శబ్దవ్యుత్పత్తియు, ప్రవృత్తినిమిత్తము దెలియని యపుడు, ఆ వాక్కు ఏదియేని విపరీతార్థమునందు ప్రవృత్తమయి యున్నట్లున్నను, తత్సంస్కా-

రాదుల నెఱిగి మననము జేసినపుడు వివక్షిత మగు పరమార్థమునే లక్షింప జేయుచుండును.

'సీత యిపుడు సంస్కారము లేనిదై పరాధీనయై యున్నట్లు గన్పట్టి నను, వాస్తవమునకు పరాధీన కాదు; పతిసాన్నిధ్యమును బొంది సుసంస్కృతయై సహజతేజముతో, తానుద్దేశించిన సీతారూపమున నలరారగలదు' అని యూహించుకొని, హనుమంతు డిట్లతికష్టము మీద 'ఇట్లున్నను ఈమె సీతయే గావచ్చు' నని కొంతవరకు సమాధానపడినాడు. (దుఃఖేన బుబుధే) ఇట్లే మఱికొన్ని యుపపత్తులద్వారా తర్కవితర్కముల జేసి 'యీమె సీతయే' యని తుదకు నిర్ధారించు కొనినట్లు తరువాతి శ్లోకములు వలన దెలియును.

పై శ్లోకము వలన (1) శబ్దవ్యుత్పత్తి, ప్రవృత్తినిమిత్తముల యావశ్యకతయు (2) అవి దెలిసికొని ఆమ్నాయము జేయవలసిన-అనగా శ్రవణ మననావ్యాఖ్యానము జేయవలసిన-యావశ్యకతయు, కాంతాసమ్మిత ముగా జెప్పబడినది. అట్లు జేయనినాడు ఆ వేదవాక్కు వివక్షిత పరమార్థమును గాక, విపరీతార్థముల బోధింప గలదనియు నట్టియెడ నది 'ప్రశిథిలవిద్య' యై సంస్కారహీనయై నామమాత్రావశిష్టయై వర్తిల్లగల దనియు హెచ్చరికగూడ నిందిమిడి యున్నది.

కాన వేదము యొక్క అమ్నాయత్వ మిట్టిది. వాక్యార్థజ్ఞానమునకు పదార్థజ్ఞానము (శబ్దార్థజ్ఞానము) కారణము. పదార్థజ్ఞానము సిద్ధించుటకు స్వరసంస్కారజ్ఞానము ఆవశ్యకము. దానిచే శబ్దప్రవృత్తినిమిత్తముల దెలిసికొని యా పదముచే దెలియనగు యావదర్థమును దర్శింపవలెను. ఇట్లు దెలిసి, ఉపక్రమోపసంహారాది షట్-లింగములచే సంప్రదాయానుగుణముగ వాక్యతాత్పర్యము నిర్ణయించి, శ్రవణమననాదుల ద్వారా బ్రహ్మాభ్యాస మొనర్ప వలయును. అపుడే యా వేదవాక్కు అవివక్షిత

విరుద్ధార్థముల గాక, వివక్షిత పరమార్థమును దర్శింపజేసి 'విద్య' యను సార్థకనామమున విలసిల్ల గలదు - అని మహర్షి తాత్పర్యము.

స్వరసంస్కారములు పదార్థజ్ఞానమును దెలియజేయ సమర్థములు- అనెడి విషయము సోపపత్తికముగ యాస్కనిరుక్తము నందిట్లు వివరింప బడినది

"తద్యేషు పదేషు స్వరసంస్కారౌ సమర్థౌ ప్రాదేశికేన
గుణేనాన్వితౌ స్యాతాం తథా తాని నిర్బ్రూయాత్" —ని.2-1-1.

వ్యాస వాల్మీకాదుల యడుగుజాడలలో నడచిన మహాకవి కాళిదాసు గూడ కుశలవులతోగూడిన సీతాదేవిని స్వరసంస్కారములలో నొప్పు వేదవాక్కుతో బోల్చుట గమనార్హము.

"స్వరసంస్కారవత్యాఽసౌ పుత్రాభ్యా మథ సీతయా।
ఋచేవోదర్చిషం సూర్యం రామం మునిరుపస్థితః॥"
— రఘు. 15-76.

స్వరసంస్కారాదుల ద్వారా మంత్రార్థము నెఱిగి యజ్ఞమున వినియుక్తమయినపుడు (విదథే శస్యమానా) వేదవాక్కు కల్యాణకరములు, స్వచ్ఛములు నగు దివ్యతేజస్సులతో (భద్రా వస్త్రా ణ్యర్జునా వసానా) విలసిల్లును; జాగరణశీలమై వివక్షిత దేవతార్థ ప్రబోధకమై (జాగృవిః) యలరారును. అట్లు వినియుక్తము గానిచో కేవల శబ్దరాశిగ మాత్రమే గన్పట్టును - అను నీ యర్థమును 'దివశ్చి దా పూర్వ్యా' (ఋ. 3-39-2) అను ఋక్కు చెప్పుచున్నట్లు పూర్వము వివరింపబడినది. ఆ శ్రుత్యర్థమే యిట చమత్కారముగ వాల్మీకి మహర్షిచే ననువదింపబడిన దనుట గమనార్హము.

ఇట సీతాదేవి వేదవాక్కుతో పోల్చబడుటచే, ఆమె ప్రాసాదమున నున్నను అడవియందున్నను, అలంకృతయైనను, ననలంకృతయై గన్పట్టి

నది, అనగా పతిసాన్నిధ్యమున నున్నను, దూరమున నున్నను ఆమె లక్ష్యము పతి యగు శ్రీరామచంద్రుడే యయినట్లు, వేదవాక్కు గూడ సంస్కృతమై గన్పట్టినను, నసంస్కృతమై యున్నట్లు గన్పట్టినను ఆ వాక్కునకు పరమలక్ష్యము యజ్ఞేశ్వరుడగు పరమేశ్వరుడే యగుటయు నిట ధ్వనితము.

వేదశ్రుతిః :-

పరమార్థమే లక్ష్యముగా గలిగి, న్యాయసంసిద్ధములగు హేతువులచే సుదృఢముగా ప్రతిష్ఠితమై, కుతార్కికులకు అప్రకంప్యమై, యనన్య నిరపేక్షమై, యానూచానమై వెలయుటచే నీ యామ్నాయము 'ధ్రువా వేద శ్రుతిః' యని ప్రసిద్ధమైనట్లు పూర్వము వివరింపబడినది (చూ. ఋషిశబ్దము.) వేదశ్రుతి యనగా స్వతః ప్రమాణభూతమైన శ్రుతి యని అర్థము.

"వేదశ్రుతి వేదః, స్వతః ప్రమాణభూతాం శ్రుతి మిత్యర్థః"
— గోవిందరాజీయవ్యాఖ్య—రామా. 3-50-21.

కాన శ్రుతి-ఆమ్నాయ శబ్దముల బరిశీలించుచో—

(1) నిరంతరము గురుముఖోచ్చారణానూచ్చారణ రూపమున ననాది నుండియు శ్రూయమాణమగుచు వరలునది; (2) శ్రూయమాణ మగుటయేగాక నియమపూర్వకముగ ప్రతిదిన మధ్యయనాధ్యాపనాదుల ద్వారా యభ్యసింప బడుచుండునది; (3) యజ్ఞాదికర్మల యందు మరల మరల శస్త్రస్తోత్రాది రూపమున వినియుజ్యమానమగుచు నిత్యనూతనమై వెలయునది: (4) నిరంతర శ్రవణమననాదులచే బ్రహ్మవిద్యారూపిణియై సాక్షాత్కరించునది - యని వేదవాక్స్వరూపము స్పష్ట మగును. ఇట్లు గురుముఖమున గ్రహింప బడకయు, నియమపూర్వకామ్నాయములు లేకయు, కర్మలయందు

వినియుక్తము గాకయు, నిరంతర శ్రవణమననాది రహితమై యీ వేదవాణి యెవరికడ నుండునో, యది సంస్కారహీనమై లంకలోనున్న సీతాదేవివలె, ప్రశిథిలవిద్యయై యొప్పును. అందుచే నట్టి వేదవాక్కు వివక్షితార్థ ప్రతిపాదకము గాక, యవివక్షితార్థ ప్రతిపాదనశీల వలె గన్పట్టును. అయ్యును వాస్తవముగ దాని లక్ష్యము పరమార్థమే - యగుననియు దెలిసినది. శ్రుతి-**ఆమ్నాయస్వరూప మిట్టిది.**

ఇట్టి ఆమ్నాయమే స్వాధ్యాయము. ఇక స్వాధ్యాయ శబ్దమును జూతము.

స్వాధ్యాయః

ఋషిం త్వాం వేదం త్వాం సువిమలతపోజాం ప్రథమజాం
త్రయీం స్వాధ్యాయం త్వాం భిషజ మనఘం బ్రహ్మ పరమమ్।
స్వతః ప్రామాణ్యాం త్వాం సురగిర మథామ్నాయమహితాం
స్వయంజాతాం దివ్యాం హరిహృదయలక్ష్మీం హృది భజే॥

—వేదమాతృస్తవః.

అధ్యాయః - వేదః :-

అధ్యయనము లేక యభ్యాసము నన నెట్టిదో యామ్నాయశబ్దమున వివరింపబడినది. అధ్యయన మనగా బ్రహ్మయజ్ఞము లేక వేద - వేదాంగాధ్యయన మనియే సామాన్యముగ ప్రసిద్ధి.

'అధ్యయనం బ్రహ్మయజ్ఞః స్యాత్' —అభిధానచింతామణి.

అధ్యయనము జేయదగినది యగుటచే వేదమునకు అధ్యాయః అని పేరు.[1]

'అధీయన్త ఇత్యధ్యాయాః వేదాః' —విజ్ఞానేశ్వరీయ (యాజ్ఞ.1-1-42).
—స్మృతిచంద్రిక (సంస్కారకాండ - ఉపాకర్మ).

---

1. "నష్ట జ్వలన సంపాతా ప్రశాంతాధ్యాయ సత్కథా।
తిమిరేణాభిలిప్తేవ తదా సా నగరీ బభౌ॥" —రామా. 2-48-34.

'అధ్యాయః వేదః; సత్కథా పురాణాదిః; నివృత్తవేదాధ్యయన పురాణ పాఠేత్యర్థః' — గోవిందరాజీయవ్యాఖ్య.

'నేతి ప్రతిషేధార్థీయో భాషాయామ్। ఉభయ మన్వధ్యాయమ్"—నిరు. 1-5.

'ప్రతిషేధార్థీయ ఉపమార్థీయ శ్చేత్యుభయ మన్వధ్యాయమ్ ఛందసి ప్రసిద్ధమ్' —ముకుందశర్మ వ్యాఖ్య.

ఇంతేగాక 'స్వాధ్యాయః' అనియు వేదమునకు నామము ప్రసిద్ధము.

స్వాధ్యాయః - వేదః :—

'స్వాధ్యాయో ఽ ధ్యేతవ్యః' — తై. ఆ. 2-16; శ.బ్రా- 11-5-6-3. స్వాధ్యాయమును, అనగా వేదము నధ్యయనము జేయవలెను—అని శ్రుతి విధించుచున్నది. ఇంతేగాక—

'బ్రాహ్మణేన నిష్కారణః షడంగో వేదో ఽ ధ్యేతవ్యో జ్ఞేయశ్చ" యనియు సాక్షాత్తు వేదపదము నుచ్చరించుచు షడంగసహిత వేదాధ్యయనమును, తదర్థమీమాంసను జేయవలె ననియు శ్రుతి శాసించుచున్నది.

"ద్వితీయం ప్రాప్యానుపూర్వ్యాత్ జన్మోపనయనం ద్విజః।
వసన్ గురుకులే దాంతః బ్రహ్మాధీయీత వాగ్యతః॥"
— భాగ. 11-17-21.

ఇట 'బ్రహ్మ' పద ముచ్చరింపబడి వేదాధ్యయనము విధింపబడినది. కాన, పై ప్రమాణముల ననుసరించి స్వాధ్యాయ - వేద - బ్రహ్మపదములు సమానార్థకము లగుట శ్రుతి స్మృతి సంమతము. కాని, యీ విషయమై కొన్ని యాక్షేపములు గలవు.

స్వాధ్యాయ శబ్దార్థము - పూర్వపక్షములు :-

1) స్వాధ్యాయ పదమునకు 'స్వశాఖారూప మగు వేదము (స్వః స్వశాఖారూపః అధ్యాయః వేదః') - అను నర్థము కూడ సంప్రదాయానుగతమై వచ్చుచున్నది. కాని, యీ యర్థమును మాత్రమే గ్రహించి కొందఱు పై శ్రుతివాక్యమునకు 'స్వశాఖారూపమగు వేదము నధ్యయనము

జేయవలెను' – అను నర్థమును మాత్రమే చెప్పుచున్నారు. అట్టితఱి కృత్స్న వేదాధ్యయనము శ్రుతివిహితమా ? లేక స్వశాఖాధ్యయనము మాత్రమే శ్రుతివిహితమా ?

2) కృత్స్న వేదాధ్యయనమే శ్రుతిసంమత మగుచో 'అధ్యాయో ఒధ్యేతవ్యః'–అని చెప్పిన జాలును గదా ! స్వాధ్యాయః – అని యనుచు 'స్వ' పదమును గూడ జేర్చుట లోని తాత్పర్య మేమి ?

అందుచే 'స్వాధ్యాయో ఒధ్యేతవ్యః'–అను వాక్యము యొక్క యర్థ విచారము జేసి శ్రుతి స్మృత్యనుగుణముగ 'స్వాధ్యాయ' స్వరూపమును దర్శింపవలసి యున్నది.

స్వాధ్యాయ మనగా స్వశాఖారూప వేదమే – యని చెప్పినచో నధ్యయనము జేయువారికి తదితరశాఖలు స్వాధ్యాయములు కాకపోవలసి వచ్చును. అనగా తదితరశాఖాధ్యయనము విధివిహితము గాకపోవలసి వచ్చును. అందుచే నొకవేళ నితరశాఖాధ్యయనమును గూడ నెవరేని జేసినచో వారు విధిచోదితముగాని యధ్యయనము జేసినవారే కావలెను. అదియును గాక 'స్వశాఖాధ్యయనము విధి విహిత మనినంతమాత్రమున నన్యశాఖాధ్యయనము నిషిద్ధము గాదు; అందుచే నితరశాఖాధ్యయనము గూడ జేసిన జేయవచ్చు' – నని యనుటకును వీలు లేదు. అన్య శాఖాధ్యయనము శ్రుతినిషిద్ధము గాదని యనినచో నది విధివిహిత మగునా ? కనుక నీ యర్థమునే యనుసరించుచో నన్యశాఖాధ్యయనము స్వాధ్యాయము కాజాలదు. అన్యశాఖ లెట్లయినను స్వశాఖలు కానేరవు గదా !

అట్లని యితర వేదశాఖాధ్యయనముతో నిమిత్తము లేదని యనుటకును వీలులేదు. 'అథా ఒతో ధర్మజిజ్ఞాసా' 'అథాతో బ్రహ్మ జిజ్ఞాసా'–యని జైమిని బాదరాయణ మహర్షులు వేదాధ్యయనానంతరము ధర్మ–బ్రహ్మ జిజ్ఞాసల

జేయుట శ్రుతివిహిత మనుచు, నధికారిభేదము ననుసరించి, కర్తవ్యము నుప దేశించి యున్నారు. ధర్మజిజ్ఞాస గాని, బ్రహ్మజిజ్ఞాస గాని స్వశాఖామాత్ర పరిమితజిజ్ఞాసలు కానేరవు. అందు అధికరణమర్యాదా పురఃసరముగ కృత్స్న వేదార్థపరిశీలనము జేసి ధర్మబ్రహ్మ జిజ్ఞాసలు చేయబడినవి. స్వశాఖయందు గాని, యన్యశాఖలయందుగాని, యే వేదమందైనను విధివిహితమైన దేదియో యది ధర్మము.

'వేదో உఖిలో ధర్మమూలమ్' —మను. 2-6.

కాన, పై సూత్రముల తాత్పర్యము బరిశీలించిన కృత్స్న వేదశాఖాధ్యయ నావశ్యకత తేటపడుచున్నది.

స్మృతులు - కృత్స్న వేదాధ్యయనము :-

"షట్త్రింశ దాబ్దికం చర్యం గురౌ త్రైవేదికం వ్రతమ్ ।
తదర్థికం పాదికం వా గ్రహణాంతిక మేవ వా ॥
వేదా నధీత్య వేదౌ వా వేదం వాஉపి యథాక్రమమ్ ।
అవిప్లుత బ్రహ్మచర్యో గృహస్థాశ్రమ మావసేత్ ॥" –మను. 3-1,2.

"తపోవిశేషై ర్వివిధై ర్వ్రతైశ్చ విధిచోదితైః ।
వేదః కృత్స్నో உధిగంతవ్యః సరహస్యో ద్విజన్మనా ॥"
— మను. 2-165.

"ప్రతివేదం బ్రహ్మచర్యం ద్వాదశాబ్దాని పంచ వా ।
గ్రహణాంతిక మిత్యేకే కేశాంత శ్చైవ షోడశే ॥"— యాజ్ఞ. 2-36.

"వేదం వేదౌ తథా వేదాన్ వేదాం శ్చ చతురో ద్విజాః ।
అధీత్య గురవే దత్వా దక్షిణాం చ భవే ద్గృహీ ॥"
– సౌర.పు. 17-4.

"ఏవం వేదం వేదౌ వేదాన్ వా స్వీకుర్యాత్, తతో
వేదాంగాని—" —విష్ణు.పు. 28.

"వేదం వేదౌ తథా వేదాన్ వేదా న్వా చతురో ద్విజః।
అధీత్య చాధిగమ్యార్థం తతః స్నాయా ద్ద్విజోత్తమః॥"—కూర్మం.

"వసే ద్ద్వాదశవర్షాణి చతుర్వింశతి మేవ వా।
షట్త్రింశతం వా వర్షాణి ప్రతివేదం వ్రతం చరేత్"॥ —యమ.స్మృ.

"ప్రతివేదం బ్రహ్మచర్యం ద్వాదశాబ్దాని పంచ వా।"
— యోగీశయాజ్ఞవల్క్యః.

"వేదాన్ కృత్స్నాన్ బ్రాహ్మణః ప్రాప్నుయాత్"
— భార. 13-20-81.

"అధీత్య వేదా నఖిలాన్ గురుశుశ్రూషణే రతః।
గురూణా మనృణో భూత్వా సమావర్తేత యజ్ఞవిత్॥"
—భార. 12-234-3.

"ద్వాదశవర్షా ణ్యేకవేదే బ్రహ్మచర్యం చరేత్;
ప్రతిద్వాదశ వా సర్వేషు; గ్రహణాంతం వా...."
— గౌ. ధర్మ. సూ. 1-2-51,52,53.

'వేద మధీత్య స్నాయాత్" — ఆప. గృ. సూ. 5-1.

'వేద మిత్యవివక్షిత మేకవచనమ్। వేదం వేదౌ వేదాన్ వా
అధీత్య' — హరదత్తః.

'వేదం మంత్రబ్రాహ్మణలక్షణం; ఏకవచనం జాత్యభిప్రాయమ్'
— సుదర్శనాచార్యః,

"ద్వాదశవర్షాణి వేదబ్రహ్మచర్యమ్" "గ్రహణాంతం వా"
— ఆశ్వ. గృ. 1-22-3-4.

'వేదగ్రహణం కథమ్? ఏకైకస్య ద్వాదశవర్షాణి బ్రహ్మచర్యం స్యా దితి। తేన ద్వయో శ్చతుర్వింశతిః త్రయాణాం షట్ త్రింశత్। చతుర్ణా మష్టాచత్వారింశత్' — నారాయణవృత్తిః.

పై వచనముల ననుసరించి కృత్స్న వేదాధ్యయనము విధింపబడుచున్నటుల దెలియును. అంతియే గాదు. సామర్థ్యమును బట్టి వేదములు నాలుగు గాని, మూడు గాని, రెండు గాని తుద కొకటి గాని యధ్యయనము జేయదగు నని శ్రుతి తాత్పర్యము వివరింపబడినది.

పాండవులు నిఖిలవేదాధ్యయనము జేసినట్లు మహాభారతము వచించుచున్నది.

"తేఽధీత్య సకలాన్ వేదాన్ శాస్త్రాణి వివిధాని చ।
న్యవసన్ పాండవా స్తత్ర పూజితా అకుతోభయాః॥"

— భార. 1-1-31.

చతుర్వేదవిదులగు విప్రులు వేలకొలది యున్నట్లును మహాభారతము వలన దెలియుచున్నది.

"తతః సహస్రం విప్రాణాం చతుర్వేదవిదాం తథా।
గవాం సహస్రే ణై కై కం వాచయామాస మాధవః॥"

— భార. 12-53-8.

శ్రీకృష్ణుడు సాంగ నిఖిల వేదాధ్యయనము గావించినట్లు శ్రీమద్భాగవత మిట్లు చెప్పుచున్నది.

"ప్రోవాచ వేదా నఖిలాన్ సాంగోపనిషదో గురుః" — భాగ.10-45-3.

శ్రీమద్రామాయణము గూడ శ్రీరామచంద్రుని సాంగ నిఖిల వేదవేత్తగ వర్ణించినది

"సమ్యగ్విద్యావ్రతస్నాతః యథావత్సాంగవేదవిత్" — 2-1-20.

'అధీత్య స్నాయా దితి విధ్యుక్తరీత్యా సమ్యగ్వేదా నధీత్య వ్రతాని చ కృత్వా కృతసమావర్తనః' అని వ్యాఖ్యాతలు వివరించిరి. భరతుడు చిత్రకూటమునకు వచ్చినపుడు 'కచ్చిత్తే సఫలా వేదాః' అని శ్రీరామచంద్రుడు భరతుని యడుగుచున్నాడు. ఇంతేగాదు రామాయణ రచనానంతరము దీని నెవరి కుపదేశించుటయా ? —యని వాల్మీకి యాలోచించు సమయమున కుశలవు లేతెంచిరి. వారు నిఖిలవేదముల యందు పరినిష్ఠితు లయినట్లు రామాయణము వర్ణించుచున్నది.

"స తు మేధావినౌ దృష్ట్వా వేదేషు పరినిష్ఠితౌ॥"—రామా. 1-4-6.

'వేదేషు ఋగ్ యజుః సామాథర్వణ లక్షణేషు చతుర్షు విషయే.........పరినిష్ఠితౌ' —గోవిందరాజీయమ్.

ఉత్తరరామచరితమున గూడ కుశలవులు ఆన్వీక్షక్యాది విద్యలతోపాటు త్రయీవిద్యయందు పరినిష్ఠితు లైనట్లు చెప్పబడినది.

"పరిసమాప్త చౌలకర్మణో ప్త్రయీవర్జ మితరా స్తిస్రో విద్యాః
సావధానేన పరినిష్ఠాపితాః। సమనంతరం చ గర్భైకాదశే
వర్షే క్షాత్రేణ కల్పే నోపనీయ త్రయీవిద్యా మధ్యాపితౌ"

2. అంక.

మిథిలాధిపతియగు జనకుడు సర్వవేదములయందును, శాస్త్రములందును పరినిష్ఠితుడు. అట్టి మహనీయుని నీవే స్వయముగ నాహ్వానించి యశ్వమేధ యాగమునకు గొనితెమ్మని దశరథునితో వసిష్ఠు డిట్లు జెప్పుచున్నాడు.

"మిథిలాధిపతిం శూరం జనకం సత్యవిక్రమమ్ ।
నిష్ఠితం సర్వశాస్త్రేషు తథా వేదేషు నిష్ఠితమ్ ॥
త మానయ మహాభాగం స్వయ మేవ సుసత్కృతమ్ ।"

— రామా. 1-13-20, 21.

స్వాధ్యాయాధ్యయనమన కృత్స్నవేదాధ్యయనమే :-

పై ప్రమాణముల ననుసరించి స్వాధ్యాయాధ్యయన మనగా నిఖిల వేదాధ్యయన మని శ్రుతిసమ్మతమైన యభిప్రాయముగ జెప్పవలసి యున్నది. వాల్మీకి మహర్షికి శ్రీరామచరితము నుపదేశించిన నారదుడు 'తపః స్వాధ్యాయ నిరతః........ 'వాగ్విదాం వరః' అని శ్రీమద్రామాయణము మొదటి శ్లోకమున బేర్కొనబడినాడు. ఇట 'స్వాధ్యాయ నిరతః' అను పదముచే నారదుడు స్వశాఖాధ్యయనమాత్ర నిరతుడు — అని చెప్పుట సమంజసము కాదు. ఏలయన, నారదుడు నిఖిలవేదాధ్యయనపరు డగుట ప్రసిద్ధము.

"సదోపయోగేఽపి గురు స్స్వ మక్షయో
నిధిః శ్రుతీనాం ధనసంపదా మివ।" — శిశు. 1-28.

ఇట నారదుడు అక్షయ నిఖిల వేదనిధి స్వరూపుడు, సంప్రదాయ ప్రవర్తకుడు నగు గురువుగ కీర్తింపబడినాడు. ఛాందోగ్యశ్రుతియు నారదుడు సాంగ నిఖిల వేదాధ్యయనపరు డని తెల్పుచున్నది.

"ఋగ్వేదం భగవో ఽ ధ్యేమి,యజుర్వేదం సామవేద
మాథర్వణం చేతి" — ఛాం. ఉ. 1-1-2.

కాన, నారదుడు నిఖిలవేదాధ్యయనరూప - స్వాధ్యాయ నిరతు డగుట పై రామాయణశ్లోక తాత్పర్యము. వ్యాఖ్యాతలు నిట్లే వివరించిరి.

'సోఽధ్యైష్ట వేదాన్' —భట్టికావ్య. 1-2.

'సః (దశరథః) వేదాన్ అధ్యైష్ట అధీతవా నితి స్వాధ్యాయ
ఉక్తః — జయమంగళవ్యాఖ్య.

ఇట దశరథుడు నిఖిలవేదాధ్యయన మొనర్చినట్లు భట్టికావ్యము చెప్పుచున్నది.

అట్లధ్యయనము గావింపబడిన చతుర్వేదములను స్వాధ్యాయముగా జయమంగళ వ్యాఖ్యానము వివరించినది.

ఛందోలోక మగు బ్రహ్మలోకమును బొందగోరు నైష్ఠికబ్రహ్మచారి యధిక నియమ వ్రత పరాయణుడై, స్వాధ్యాయార్థమై, తన దేహమును గురువున కర్పింపవలెనని, అనగా తనదేహమును గురుశుశ్రూష కొఱకు మాత్రమే వినియోగించుచుండ వలెనని భాగవత మిట్లు చెప్పుచున్నది.

"యద్యసౌ ఛందసాం లోక మారోక్ష్యన్ బ్రహ్మవిష్టపమ్ ।
గురవే విన్యసే ద్దేహం స్వాధ్యాయార్థం బృహద్వ్రతః ॥"
— భా. 11-17-30.

ఈ శ్లోకము నందలి 'స్వాధ్యాయార్థం' అను పదమునకు 'అధిక స్వాధ్యాయార్థం – అని వ్యాఖ్యాతలు వివరించిరి. అట్లు చెప్పుటచేతను స్వశాఖాధ్యయనము మాత్రమే గాక యధికముగ జేయబడు నితరవేదశాఖాధ్యయనము గూడ స్వాధ్యాయాధ్యయనమే యగుట తెలియును.

"న చ తస్మిన్ శయనే స్వాధ్యాయ మధీయీత" — గౌ.ధ.సూ.9-27.

'తస్మిన్ శయనే నాధీయీత, స్వాధ్యాయగ్రహణాత్ వేదమ్'
— మస్కరిభాష్య.

'న తస్మిన్ వేద మధీయీత' — హరదత్తవ్యాఖ్య.

పాన్పునందుండి స్వాధ్యాయాధ్యయనము జేయగూడ దను నియమ మిట జెప్పబడుచున్నది.

"తస్య వా ఏతస్య యజ్ఞస్య ద్వా వనధ్యాయౌ
యదాత్మాఽశుచి ర్యద్దేశః" – తై. ఆ. 2-15-1.

తాను అశుచిగా నున్నపుడును, దేశ మశుచిగా నున్నపుడును, స్వాధాయాధ్యయనము చేయరాదు — అను నియమమును శ్రుతి చెప్పుచున్నది.

ఇట్టి పై వాక్యముల ననుసరించి స్వాధ్యాయాధ్యయనము చేయరాదనగా 'స్వశాఖాధ్యయనము చేయరాదు; అన్యశాఖాధ్యయనము చేయవచ్చును' — అని చెప్పుట యుక్తము కాదు గదా ! కావుననే, వ్యాఖ్యాతలిట 'వేదాధ్యయనము చేయరాదు'— అను నర్థమునే వివరించిరి. కాన నిట స్వాధ్యాయ పదము స్వశాఖారూప వేదమాత్రపరము గాక నిఖిలవేదపరమని గ్రహింపక తప్పదు.

కోశములు - స్వాధ్యాయపదము :-

కోశములును వేద, స్వాధ్యాయ శబ్దములను పర్యాయపదములుగ బేర్కొనినవి

'స్వాధ్యాయో జప ఇత్యుక్తో వేదాధ్యయనకర్మణి'
— శబ్దరత్నావళి (వాచస్పత్యమ్)

'స్వాధ్యాయో వేదతపసోః' — వైజయన్తీ.

'స్వాధ్యాయః శ్రుతి రామ్నాయ శ్ఛందో వేదః' —అభిధానచింతామణి.

'స్వాధ్యాయో జప వేదయోః' —నానార్థరత్నమాల.

శ్రుతులు - వేదాధ్యయన సంప్రదాయము :-

ఇక శ్రుతులయందు వేదాధ్యయనమును గూర్చిన సంప్రదాయమెట్లున్నదో దర్శింతము.

"శతధార ముత్స మక్షీయమాణం విపశ్చితం పితరం
వక్త్వానామ్। మేళిం మదంతం పిత్రో రుపస్థే తం రోదసీ
పిపృతం సత్యవాచమ్॥'' —ఋ. 3-26-9.

ఈ మంత్రమున విశ్వామిత్రుడు తనకు విద్యాదాతయైన యాచార్యుని ప్రశంసించుచు, నభిమత ఫలముల నిచ్చి తన యాచార్యుని రక్షింపవలసినదిగా దేవతల ప్రార్థించుచున్నాడు. విశ్వామిత్రు డొనర్చిన యాచార్యప్రశంసా వ్యాజమున నాచార్యలక్షణములను శ్రుతి యిట బేర్కొనుచున్నది. విశ్వామిత్రుని యాచార్యుడు—

1) అక్షీయమాణ బహుముఖ నదీ ప్రవాహము వలె నవిచ్ఛిన్న, బహుముఖవాగ్ఝరీ సమేతుడు. (శతధారం అపరిమిత జలధారా యుక్తం అక్షీయమాణం న కదాపి విచ్ఛిన్న ప్రవాహం, ఉత్సం ఉత్స| మివ సతత ప్రవాహోపేతం స్రోత ఇవ అవిచ్ఛిన్న వాక్సరణీ సమేతం).

2) సకల శాస్త్రాభిజ్ఞుడైన మేధావి. (విపశ్చితం మేధావినం సకల శాస్త్రాభిజ్ఞం)

3) విద్యాశరీర ప్రదాత; పాలకుడును. (పితరం శిష్యాణాం విద్యోపదేశేన పాలకం)

4) నానా శ్రుతిశాఖాగతము లయిన వాక్యముల నేకైక లక్ష్యమగు పురుషార్థము నందు సమన్వయపఱచి బోధించువాడు. (వక్త్వానాం వక్తవ్యానాం వేదవాక్యానాం, మేళిం మేళకం నానా శాఖాగతానాం వాక్యానాం ఏకస్మి న్నర్థే సంకలయ్య, వక్తారం)

5) పితరుల సన్నిధిలో అనగా ద్యావాపృథువులయొక్క సన్నిధిలో జ్ఞానాతిశయముచే నిర్భరానంద పరవశుడు; కావుననే సత్యవాది. (పిత్రోః

ద్యావాపృథివ్యోః ఉపస్థే మదంతం జ్ఞానాతిశయేన హృష్యంతం అతఏవ సత్యవాచం అజ్ఞాతార్థాభావాత్ పరప్రతారణే చ కారణాభావాత్ సత్యవాదినం సా. భా.)

శ్రుతిచోదితమైన పై యాచార్యలక్షణముల బరిశీలించుచో నాచార్యుడు మేధావియై, సకలశాస్త్రాభిజ్ఞుడై, నిఖిల వేదశాఖాగత వాక్యముల నొకే లక్ష్యమునందు సమన్వయము జేయగల మహావిద్వాంసుడు – అని తెలియుచున్నది. 'తత్తు సమన్వయాత్' అని మహర్షి బాదరాయణు డుద్దేశించిన నిఖిల శ్రుతివాక్య సమన్వయ మిట్టిదే. కాన నిఖిల వేదాధ్యయనము గూడ శ్రుతిసంమత మయిన సంప్రదాయము – అని గ్రహింపనగును. ఈ సంప్రదాయము ఛాందోగ్యశ్రుతి వలనను నిట్లు తెలియును.

> "స హ ద్వాదశ వర్ష ఉపేత్య చతుర్విగ్ంశతి వర్షః సర్వాన్వేదా నధీత్య మహామనా అనూచానమానీ స్తబ్ధ ఏయాయ"
>
> — ఛాందో. ఉ. 6-2.

> 'యావ చ్చతుర్వింశతివర్షో బభూవ తావత్సర్వాన్ వేదాన్ చతురో ఽప్యధీత్య తదర్థం చ బుద్ధ్వా' — శం. భా.

శ్వేతకేతువు పండ్రెండు వత్సరములు గురుకులవాసము జేసి నాలుగు వేదముల నధ్యయనము జేసినట్లు ఈ శ్రుతివలన దెలియును. నారదుడు చతుర్వేదాధ్యయనము జేసినట్లు ఈ శ్రుతియే మఱియొకచోట (7-1-3) వివరించినది.

నిఖిలశాఖాధ్యయనము – ఏకశాఖాధ్యయనము :-

> "స్మర్యతే చ వైశంపాయనః సర్వశాఖాధ్యాయీ, కఠః పున రిమాం కేవలాం శాఖా మధ్యాపయాంబభూవేతి। స బహు శాఖాధ్యాయినాం సన్నిధా వేకశాఖాధ్యాయీ అన్యాం శాఖా మనధీయానః" — శాబరభాష్య, జై. సూ. 1-1-30.

వైశంపాయనుడు సర్వవేదశాఖాధ్యాయి. ఇట్లు బహుశాఖాధ్యయనము జేసిన వారెందఱో యుండగా కతు డొకే శాఖ నధ్యయనము జేసెను. ఇతరశాఖల నధ్యయనము చేయక యా శాఖనే ప్రవచించెను – అని యర్థము. ఇట్లు సర్వశాఖాధ్యయనము, ఏకశాఖాధ్యయనము – అను రెండు సంప్రదాయములు నున్నట్లు మీమాంసాదర్శనము వలన దెలియును.

వేదశాఖాధ్యయనము – సంప్రదాయము :–

నిఖిల వేదాధ్యయనముగూడ శ్రుతి స్మృతి సంమత మని యింత వరకును వివరింపబడినది. ఇట నొక విషయము గమనింపదగినది. నిఖిల వేదాధ్యయన మనగా స్వశాఖాధ్యయన పూర్వకమైన యితర శాఖాధ్యయన మనియే గ్రహింపవలెను. స్వశాఖను విడిచి యన్యశాఖాధ్యయనము జేయుట దోషముగ గూడ బరిగణింపబడినది. ఈ విషయము పరాశరమాధవీయమున నిట్లు వివరింపబడినది.

"తదాహ వసిష్ఠః–

"పారంపర్యాగతో యేషాం వేదః సపరిబృంహణః।
తచ్ఛాఖాకర్మ కుర్వీత తచ్ఛాఖాధ్యయనం తథా॥" ఇతి.

స్వశాఖాపరిత్యాగం స ఏవ నిషేధతి.

"స్వీయశాఖోజ్ఝితా యేన బ్రహ్మ తేనోజ్ఝితం పరమ్।
బ్రహ్మహైవ స విజ్ఞేయః సద్భి ర్నిత్యం విగర్హితః॥" ఇతి.

స్వశాఖాధ్యయనపూర్వకం తు అన్యశాఖాధ్యయనం తేనైవాంగీకృతమ్.

"అధీత్య శాఖా మాత్మీయాం పరశాఖాం తతః పఠేత్ ఇతి"
— ఆచారకాండ. 1-38.

దీని ననుసరించి స్వశాఖాధ్యయనము జేసియే యితర శాఖాధ్యయనమును జేయదగు ననెడి సంప్రదాయము స్పష్టము. స్వశాఖ యన నేది ?

> ''యద్యప్యేకైకస్య వేదస్య బహ్వ్యః శాఖాః। ఏకత్రింశతిధా[1] బహ్వృచః, ఏకశతం యజుఃశాఖాః, సహస్రవర్త్మా సామవేదః, నవధా ఽథర్వణో వేద ఇతి। తథాపి తత్ర తత్ర వేదే పూర్వై రధ్యయనానుష్ఠానాభ్యాం పరిగృహీతా యావతీ శాఖా తావ త్యత్ర వేదశబ్దేన వివక్షితా। య ఏకం వేద మధీతే స ద్వాదశ వర్షాణి గురుకులే బ్రహ్మచర్యం చరేత్। య స్తు చతురో వేదా నప్యధ్యేతుం శక్తః స ప్రతిద్వాదశ ప్రతివేదే ద్వాదశ వర్షాణీత్యర్థః। యదాహ ఆపస్తంబః - 'ఉపేత స్యాచార్యకులే బ్రహ్మచారివాసో ఽష్టచత్వారింశద్వర్షాణీ'తి। యావతా కాలేనైకో వేదో ద్వౌ వా గ్రహీతుం శక్యా స్తావంతం కాల మితి కేచిత్॥
>
> — హరదత్తమితాక్షరా, గౌ. ధ. సూ. 1-2-51, 52. 53.

ఒక్కొక్క వేదమునకు అనేక శాఖ లున్నవి. ఋగ్వేదమునకు శాఖలు ముప్పదియొక్కటి. యజుర్వేదమునకు శాఖలు నూటఒక్కటి. సామవేదము సహస్రశాఖాత్మకము. అథర్వణవేదమునకు శాఖలు తొమ్మిది. ఇట్లు బహుశాఖలతో నొప్పు వేదముల నాల్గింటి నెవ డధ్యయనము చేయగలడో యత డొక్కొక్క వేదమునకు 12 సంవత్సరములచొప్పున నలుబది యెనిమిది వత్సరములుగాని లేక యెంతకాలమావశ్యకమో యంతవరకు గాని గురుకులమున **నుం**డవలెను. అట్లు కృత్స్న వేదము **న**ధ్యయనము చేయజాలని

1. ఇట హరదత్తు ననుసరించి ముప్పదియొక్కశాఖ లని తెలియుచున్నది. కాని మహాభాష్య, చరణవ్యూహాది గ్రంథముల ననుసరించి ఋగ్వేదశాఖ లిరువది యొకటి యని దెలియును.

వాడు మూడుగాని, రెండుగాని, తుదకొకటిగాని వేదము నధ్యయనము చేయ వలెను. ఏ యొక్క వేదమున కైనను పెక్కు శాఖలు గలవు. అశక్తు డన్ని శాఖలతో నొప్పు వేదము నధ్యయనము చేయలేకపోవచ్చును. అట్టి యతడు తనపూర్వులచే సంప్రదాయానుగతముగ నే శాఖ లేక యే శాఖ లధ్యయనము జేయబడుచు వచ్చినవో వాని నధ్యయనము జేయవలయును. పరంపరాగత శాఖాధ్యయనమే యట్టివానికి స్వాధ్యాయాధ్యయన మగును. (చూ. మస్కరి భాష్యముగూడ).

పరంపరాగతశాఖనే గాక యన్యశాఖలను గూడ నధ్యయనము చేయగల శక్తిసంపన్నుడు సైతము స్వశాఖను విడిచి మొదట నన్యశాఖాధ్యయనమును చేయరాదు; స్వశాఖాధ్యయనము జేసియే యన్యశాఖాధ్యయనమునకు గడగవలెను— అని పై ప్రమాణముల వలన తెలియుచున్నది.

కాని 'స్వశాఖాధ్యయనము మాత్రమే స్వాధ్యాయాధ్యయనము, ఇతర శాఖాధ్యయనము స్వాధ్యాయాధ్యయనము కాదు— అను నిషేధము గాని, నిర్ణయము గాని యీ వచనముల వలన గన్పట్టుట లేదు.

ఈ విషయమును వివరించుచు భాట్టచింతామణి యందొక విశేష మిట్లు చెప్పబడుచున్నది.

"యే కులపరంపరయైవ ద్వివేదిన స్త్రివేదినో వా తేషా
మప్యేకశాఖాధ్యయనం నిత్యం, అన్య దభ్యుదయార్థ
మైచ్ఛిక మితి ద్యోతనార్థత్వేన సార్థక్యాత్। తేన వేదా నధీత్య
వేదౌ వా వేదం వాఽపి యథాక్రమ మితి స్మృతే రియ
మేవ శ్రుతి ర్మూల మితి ద్రష్టవ్యమ్।"

—భాట్టచింతామణి 1-1; భాట్టదీపికావ్యాఖ్య.

కులపారంపర్యము ననుసరించి కొందఱు చతుర్వేదులు, అట్లే మఱికొందఱు త్రివేదులు, ద్వివేదులు, ఏకవేదులును గావచ్చును. అట్టి

క్రమ మితి—ఏకవేదపక్షే పితృపితామహాది పరంపరా ప్రాప్త
ఏవ వేదో ఒధ్యేతవ్య ఇత్యభిప్రేత్య స్వాధ్యాయో ఒధ్యేతవ్య
ఇతి స్వశబ్ద ఆమ్నాతః" — ఋగ్వేద భాష్యభూమిక.

ఉపనీతుడగువాడు వేదములన్నిటిని గాని లేక వానిలో నొకటి గాని తన శక్తి ననుసరించి అధ్యయన మొనర్పవలెను. యాజ్ఞవల్క్య-స్మృతియు నీ విషయమే చెప్పుచున్నది. ఏకవేదపక్షమున మాత్రము పితృపితామహాది పరంపరాప్రాప్తమగు వేదమునే యధ్యయనము జేయవలెనని తెలియ జేయుటకే 'స్వాధ్యాయోఽధ్యేతవ్యః' అను శ్రుతియందు 'స్వ' శబ్దము ఆమ్నాతమైనది — అని యర్థము.

కనుక శ్రీసాయణు ననుసరించి ఏకవేదపక్షము, బహువేదపక్షము — అను రెండు పక్షములును 'స్వాధ్యాయోఽధ్యేతవ్యః' అను శ్రుతి తాత్పర్యము ననుసరించి సిద్ధము లగుచున్నవని తెలియుచున్నది.

ఇట్లు రెండు పక్షము లున్నట్లు న్యాయసుధ యందు నిట్లు చెప్పబడు చున్నది

"యో ఒల్పేన కాలేన బహూన్ వేదా నధ్యేతుం సమర్థ స్తం
ప్రతి బహువేదపక్షో ఒసమర్థం ప్రత్యల్పవేదపక్ష ఇతి సామర్థ్య
మంగీకృత్య గార్హస్థ్యాశ్రమాయోగ్యం ప్రతి బహువేదపక్షః,
తద్యోగ్యం ప్రత్యల్పవేదపక్ష ఇత్యాశ్రమ యోగ్యత్వ మంగీ
కృత్యాపేక్ష్యేతి న్మనసోచ్యత ఇత్యర్థః"

— భట్టసోమేశ్వరః — న్యాయసుధా (తంత్రవార్తికవ్యాఖ్యా) 1-3-4.

కావున (1) బహువేదాధ్యయనము (2) అశక్తుల విషయమున స్వశాఖాధ్యయనము — రెండును 'స్వాధ్యాయోఽధ్యేతవ్యః' అను శ్రుతి ననుసరించిన సంప్రదాయములే. ఇంతియే కాదు; అశక్తుల స్వాధ్యాయమును గూర్చి మీమాంసాదర్శనకారుల యభిప్రాయ మిట్లున్నది.

“జ్ఞాతే చ వాచనం న హ్యవిద్వాన్ విహితోఽస్తి”
—జై. సూ. 3-8-18.

‘తత్ర హోమమాత్రే చోదితే వేదాధ్యాయీ శక్త ఇత్యధి క్రియతే, నావిద్వాన్। కియతా పున ర్విదితేన విద్వా నధి క్రియత ఇతి। యావతా విదితేన శక్తో భవతి యథోక్తం క్రతు మభినిర్వర్తయితుం తావ ద్యో వేద స తేన క్రతునాఽధిక్రియతే। నను వేద మధీయీతేతి వచనా త్కృత్స్నో వేదో ఽధ్యేతవ్య ఇతి భవతి, న వేదావయవేనాధిక్రియత ఇతి। ఉచ్యతే । క్రతూనాం జ్ఞానార్థం వేదాధ్యయనం కార్యమ్। తత్రాన్యస్మిన్ క్రతౌ కర్తవ్యే ఽన్యక్రతుజ్ఞానం న దృష్టాయ భవతి। తస్మాత్ క్రత్వంతరజ్ఞానం అధికారే నాఽఽదర్తవ్యమ్। క్రత్వంతరజ్ఞానాయ క్రత్వంతరగ్రంథః। సర్వే క్రతవః కథం జ్ఞాయేరన్ పృథ గ్పృథ గితి కృత్స్నస్య వేదస్య అధ్యయనం శ్రూయతే। తస్మాత్ స్వపదార్థజ్ఞో ఽధిక్రియేతేతి। తేన అస్వపదార్థజ్ఞస్య కర్మైవ నాస్తి। కథ మసౌ వాచ్యేత। తస్మాత్ సాధ్వభిధీయతే జ్ఞ ఏవ వాచయితవ్య ఇతి’. — శాబర భాష్యమ్.

‘యద్యపి స్వాధ్యాయగ్రహణేన సకలో వేదః పరిగృహీత స్తథాఽపి దర్శపూర్ణమాసౌ కుర్వాణస్య జ్యౌతిష్టోమిక మంత్రబ్రాహ్మణం న క్వచి దుపయుజ్యత ఇతి, అసదపి నాధికారం వ్యావర్తయతి, ఇష్టివేదేనైవ యోగ్యతాయాః సిద్ధత్వాత్। తేన తద్యాజినః తావా నేవ స్వాధ్యాయః। .... కామశ్రుత్యపరిగ్రహా చ్చ సర్వై రనారభ్యవాద విధ్యధీతో వేదో ఽపేక్షిత ఇత్యవశ్యం బ్రహ్మచర్యకాల ఏవ సమస్తో

వేదో ఒధ్యేతవ్యః। యది తు కశ్చి దశక్తో నాధీతే సకలం,
అగ్నిహోత్ర దర్శపూర్ణమాత్రం కథంచి దధిగచ్ఛతి ,న
తస్య తత్రానధికారః। ఏవం చ సతి బాహ్యాజ్ఞానం దూర
విప్రకృష్ట మేవ। యత్తు ఆత్మజ్ఞానం తేన వినా ప్రవృత్తి
రేవ నాస్తి, అతః సర్వకర్మార్థ మంగీకర్తవ్యమ్ ।'

— తంత్రవార్తికమ్.

'స్వాధ్యాయో ఒధ్యేతవ్యః, వేద మధీయీత' ఇత్యాది వచనములచే సకల వేదాధ్యయనము విధింపబడుచున్నది. కాని యాశక్తుడగు నత డగ్నిహోత్ర దర్శపూర్ణమాసాది కర్మల ననుష్ఠించుటకై, యా కర్మభాగమునకు సంబంధించిన వేదభాగమును మాత్ర మెట్లో యధ్యయనము జేసి యా కర్మలయందు ప్రవృత్తుడు గావచ్చును. అట్టివాని విషయమై యత డొనర్చిన యా వేదభాగాధ్యయన మతనికి స్వాధ్యాయమే (తేన తద్యాజినః తావా నేవ స్వాధ్యాయః) యగును. అనగా నా యా క్రతువులకు సంబంధించిన వేదభాగమునైన నియమపూర్వకముగ ముందధ్యయనము జేసి తర్వాత నా కర్మలయందు ప్రవృత్తుడు గావలయును. శక్తుడగువాడు బ్రహ్మచర్య కాలముననే కృత్స్న వేదము నధ్యయనము జేయవలెను. ఇట్లు జేసియు 'స్వ' పదార్థజ్ఞుడు గానిచో వానికి గర్మలయం దధికారము లేదు. 'స్వ' పదార్థజ్ఞాన మనగా ఆత్మజ్ఞానము; దేహాతిరిక్తుడై కర్తయు, కర్మఫల భోక్తయు నై విలసిల్లు ఆత్మను గూర్చిన జ్ఞాన మని యర్థము. ఈ జ్ఞానములేనిది కర్మల యందు ప్రవృత్తియే యుండదు, కాన ఆత్మజ్ఞానము సర్వకర్మార్థ మంగీకర్తవ్యము – అని పై వచనముల తాత్పర్యము.

దీనివలన 1) బహువేదపక్షము 2) ఏకవేదపక్షము మాత్రమే గాక 3) క్రత్వర్థమై నియమపూర్వకముగ నధ్యయనము జేయబడు వేదభాగము కూడ నా క్రతుయాజికి 'స్వాధ్యాయ' మగుటయు దెలియ నగును. ఈ

మూడును సంప్రదాయములే. అందుచే ఏకవేదపక్షమున, శ్రీ సాయణులు చెప్పినట్లు, స్వాధ్యాయపదము నందలి 'స్వ' శబ్దమునకు 'స్వశాఖారూప మగు వేదము' అని యర్థమును సంకోచము చేసి చెప్పుట యుక్తమే.

కాని యిట నొక విషయము పరిశీలింపనగును. మహర్షివేదవ్యాసుడు వేదవిభాగము చేసిన తరువాత నా యా శాఖాప్రవర్తకుల ననుసరించి స్వశాఖాధ్యయనము సంప్రదాయానుగత మయినట్లు[1] పురాణాదుల వలన దెలియుచున్నది. కావున వేదవిభాగాద్యనంతరము స్వాధ్యాయ మనగా స్వశాఖారూపవేదాధ్యయన మనెడి యర్థము సంప్రదాయానుగత మైనట్లు కొందఱు చెప్పుటయు గలదు. అట్టిచో వేదశాఖాది విభాగమునకు బూర్వము శ్రుతియందలి 'స్వాధ్యాయ' పదములోని 'స్వ' శబ్దమున కర్థ మేమయి యుండును ?

అంతే కాదు. స్వాధ్యాయ పదమును వేదపర్యాయ వాచకముగా గ్రహింపక, 'స్వః అధ్యాయః' అని విగ్రహమును జెప్పి స్వశబ్దము స్వశాఖాపర మని చెప్పుచో బహువేదాధ్యయన పక్షమున స్వాధ్యాయపదము నందలి 'స్వ' శబ్దమున కర్థ మేమి ? లేక స్వాధ్యాయశబ్దము వేదసామాన్యము నందు గాక 'స్వశాఖారూపవేదము' అను నర్థమునందే రూఢమా ? ఈ విషయముల బరిశీలింతము.

స్వాధ్యాయము యొక్క స్వాధ్యాయత్వము :-

మహాభాష్యమునందు స్వాధ్యాయ శబ్దమును గూర్చి యిట్లు చర్చింపబడినది.

---

1. పరాశరమాధవీయమ్; ఆచారకాండ. 1-20; భాగ. 12-6; విష్ణు. 3-3-7; వాయు. 1-60, 2-42; అగ్ని. 150-271; కూర్మ. 1-52; నారద. 1-50; బ్రహ్మాండ. 1-33-5.

మూడును సంప్రదాయములే. అందుచే ఏకవేదపక్షమున, శ్రీ సాయణులు చెప్పినట్లు, స్వాధ్యాయపదము నందలి 'స్వ' శబ్దమునకు 'స్వశాఖారూప మగు వేదము' అని యర్థమును సంకోచము చేసి చెప్పుట యుక్తమే.

కాని యిట నొక విషయము పరిశీలింపనగును. మహర్షి వేదవ్యాసుడు వేదవిభాగము చేసిన తరువాత నా యా శాఖాప్రవర్తకుల ననుసరించి స్వశాఖాధ్యయనము సంప్రదాయానుగత మయినట్లు[1] పురాణాదుల వలన దెలియుచున్నది. కావున వేదవిభాగాద్యనంతరము స్వాధ్యాయ మనగా స్వశాఖారూపవేదాధ్యయన మనెడి యర్థము సంప్రదాయానుగత మైనట్లు కొందఱు చెప్పుటయు గలదు. అట్టిచో వేదశాఖాది విభాగమునకు బూర్వము శ్రుతియందలి 'స్వాధ్యాయ' పదములోని 'స్వ' శబ్దమున కర్థ మేమయి యుండును ?

అంతే కాదు. స్వాధ్యాయ పదమును వేదపర్యాయ వాచకముగా గ్రహింపక, 'స్వః అధ్యాయః' అని విగ్రహమును జెప్పి స్వశబ్దము స్వశాఖా పర మని చెప్పుచో బహువేదాధ్యయన పక్షమున స్వాధ్యాయపదము నందలి 'స్వ' శబ్దమున కర్థ మేమి ? లేక స్వాధ్యాయశబ్దము వేదసామాన్యము నందు గాక 'స్వశాఖారూపవేదము' అను నర్థమునందే రూఢమా ? ఈ విషయముల బరిశీలింతము.

స్వాధ్యాయము యొక్క స్వాధ్యాయత్వము :-

మహాభాష్యమునందు స్వాధ్యాయ శబ్దమును గూర్చి యిట్లు చర్చింపబడినది.

---

1. పరాశరమాధవీయమ్; ఆచారకాండ. 1-20; భాగ. 12-6; విష్ణు. 3-3-7; వాయు. 1-60, 2-42; అగ్ని. 150-271; కూర్మ. 1-52; నారద. 1-50; బ్రహ్మాండ. 1-33-5.

1) సు, సుకృతాయ ఆవృత్య అధ్యాయో ఽధీతిః స్వాధ్యాయః
2) సుష్ఠు ఆవృత్య అధ్యాయః వేదాధ్యయన మితి—శబ్దకల్పద్రుమః.

ఇట్లు రెండు వ్యుత్పత్తులు గూడ ప్రదర్శింప బడుచుండుటచే 'స్వాధ్యాయ' పదము స్వశాఖారూపవేదము అను నర్థమున మాత్రమే రూఢము గాదనుట స్పష్టము.

ఇందు మొదటి వ్యుత్పత్త్యర్థము ననుసరించి నిరంతర మావృత్తి జేసి చక్కగ నధ్యయనము జేయబడు వేదము 'స్వాధ్యాయ' మగుచున్నది. అట్లు నిరంతర మభ్యసింపబడని, లేక మననము జేయబడని వేదము స్వాధ్యాయము గాదనియు భావము. ఇట్లు చెప్పినచో స్వాధ్యాయశబ్దము పైన జెప్పిన ఆమ్నాయశబ్దతత్త్వమును వివరించిన దగును.

ఇక అమరసుధాకారుని రెండవ వ్యుత్పత్తిని జూతము. 'స్వార్థ మధ్యయనం స్వాధ్యాయః' - ఆత్మార్థమగు, అనగా ఆత్మస్వరూప ప్రాప్తికొఱకైన, లేక పరమపురుషార్థము కొఱకైన, యధ్యయనము వేదము_ అని యర్థము. అట్లుగాక తనకొఱకు, అనగా తన యశస్సు కొఱకో లేక ధనలాభాదికము కొఱకో చేయబడెడి యధ్యయనము 'స్వాధ్యాయ' మని చెప్పరాదు. అట్లుచెప్పిన 'బ్రాహ్మణేన నిష్కారణః షడంగో వేదో ఽధ్యేతవ్యో జ్ఞేయ శ్చ' యనెడి శ్రుతివాక్యముతో విరోధము సంభవించును. కాన ఆత్మార్థమైన, అనగా ఆత్మస్వరూపావబోధార్థమైన యధ్యయనమే 'స్వాధ్యాయ' మని యర్థము జెప్పుట యుక్తతరము.

నిఖిలవేదములకు సాక్షాత్తుగ గాని, పరంపరగ గాని యాత్మ స్వరూపమును దర్శింపజేయుటయే లక్ష్య మని 'వేద, ఋషి, బ్రహ్మాది' శబ్దవిచారమునందు వివరింపబడినది. అటులే వేదమునకు గల యీ

స్వాధ్యాయ మను నామముగూడ వేదముయొక్క లక్ష్యము పరమ పురుషార్థ దర్శనమే- యని తెలియజేయుచున్నదని గ్రహింపనగును.

శ్రీసాయణాచార్యాదులు, భాష్యకారుడు ప్రదర్శించిన మూడవ వ్యుత్పత్తి ననుసరించి 'స్వః అధ్యాయః స్వాధ్యాయః' అని చెప్పినట్లు గన్పట్టును. 'స్వః అధ్యాయః'- అను పదములకు ప్రకరణము ననుసరించి 'స్వశాఖారూపమగు వేదము' అను నర్థమును జెప్పినను, పైన జూపిన వ్యుత్పత్తి ననుసరించి యనుగతమైన యర్థమును గూడ గ్రహింపవలసి యున్నందున 'స్వం ఆత్మవిషయకం అధ్యయనం స్వాధ్యాయః' అను నర్థమును గూడ అధికారిభేదము ననుసరించి గ్రహింపవలసి యుండును.

శ్రీ శబరస్వామియు 'తస్మాత్ స్వపదార్థజ్ఞో ఉధిక్రియేతేతి, తేన అస్వపదార్థజ్ఞస్య కర్మైవ నాస్తి' (జై. సూ 3-8-18) — 'స్వ'పదార్థజ్ఞుడే కర్మలయం దధికృతుడు; 'స్వ'పదార్థజ్ఞుడు గానివానికి కర్మయే లేదు' — అనుచు, కర్మలకు 'స్వ'పదార్థజ్ఞానము నాంతరీయకము; కర్మానుష్ఠాన సమయమున స్థూలదేహాతిరిక్తుడును, కర్మఫలభోక్తయు నగు ఆత్మను ('స్వ'పదార్థమును) గూర్చిన జ్ఞానము, ఆవశ్యకము—అని చెప్పుచు స్వాధ్యాయము యొక్క ఆత్మపరత్వమును (స్వపరత్వమును) నిపుణముగ దెలియ జేయుట దర్శింపనగును.

శ్రీ కుమారిలభట్టపాదులును పై శబరవాక్యమును —'యత్తు ఆత్మజ్ఞానం, తేన వినా ప్రవృత్తి రేవ నాస్తి, అతః సర్వకర్మార్థ మంగీకర్తవ్యమ్' — అని వివరించుచు స్వాధ్యాయము క్రత్వర్థమైనను దానికి గల ఆత్మపరత్వమును విస్మరింపరాదని హెచ్చరించుటయు గమనార్హము.

శ్రీ కుమారిలభట్టపాదుల హృదయమును భట్టసోమేశ్వరుడును న్యాయసుధయం దిట్లు వివరించినాడు.

'శరీరాది వ్యతిరిక్తాత్మప్రతిపాదక వాక్యానాం తర్హి కర్మజ్ఞానా నుపయోగాత్ సగుణోపాసన వాక్యవచ్చాభ్యుదయ ఫలత్వా భావాత్ నిర్గుణోపాసన వాక్యవద్వాఽపవర్గ ఫలత్వాభావాత్ అనర్థక మధ్యయనం స్యా దిత్యాశంక్యాహ యత్త్వితి'

శరీరాతిరిక్త-ఆత్మజ్ఞానమును బోధించెడి వాక్యములకు సాక్షాత్తుగ క్రతువున వినియోగము లేకపోయినను, ఆ యాత్మజ్ఞానము లేనిది క్రతువే లేదు; కనుక సాధ్యాయము క్రత్వర్థమైనను దానియొక్క ఆత్మపరత్వము గుర్తించుట యత్యన్తావశ్యకము—అని తాత్పర్యము.

పైన బేర్కొనిన 'యద్యసౌ ఛందసాం లోకం' అను భాగవత శ్లోకము (11-17-30) నైష్ఠికబ్రహ్మచారి యొక్క స్వాధ్యాయమునకు (కృత్స్నవేదాధ్యయనమునకు) లక్ష్యము ఛందోలోకమైన బ్రహ్మలోక మని చెప్పుచున్నది. స్వాధ్యాయమునకు గల యీ యర్థమును (ఆత్మను, లేక బ్రహ్మను గూర్చిన యధ్యయన) గ్రహించి నపుడే భాగవతోద్దిష్టమైన లక్ష్య ముపపన్న మగును.

'వేదా బ్రహ్మాత్మవిషయా స్త్రికాండవిషయా ఇమే' (భాగ. 11-36); వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యః; సర్వే వేదా య త్పద మామనంతి; బ్రహ్మాణం బ్రహ్మవాహనమ్'— ఇత్యాది శ్రుతి స్మృతి వచనములందు బేర్కొనబడిన 'బ్రహ్మ. ఆత్మా. అహమ్, పరమం పదమ్' అనునవి స్వాధ్యాయ లక్ష్యము లగుట 'స్వ' శబ్దముచే దెలియ నగును.

స్వాధ్యాయమే బ్రహ్మయజ్ఞము:-

"స్వాధ్యాయో బ్రహ్మయజ్ఞః" అని శతపథబ్రాహ్మణము (1-5-6-2) నందలి బ్రహ్మయజ్ఞాధికార ప్రకరణములోని వాక్యము. స్వాధ్యాయమే బ్రహ్మయజ్ఞ మని యర్థము. సాంగ నిఖిల వేదాధ్యయనము, లేక

అధ్యాపనము, బ్రహ్మయజ్ఞ మగును. ఇది ప్రతిదినము జేయవలసిన పంచమహాయజ్ఞములలో నొకటి. ఇట్టి బ్రహ్మయజ్ఞమును జేయు సంప్రదాయము నేటికిని గలదు. ఇట శ్రుతి స్వాధ్యాయ, బ్రహ్మయజ్ఞశబ్దముల రెండింటిని పర్యాయపదములుగ బ్రయోగించుట స్పష్టము.

స్వాధ్యాయ, బ్రహ్మయజ్ఞ శబ్దములు రెండును పర్యాయపదములను విషయము ఆపస్తంబధర్మసూత్రములందు నిట్లు గలదు.

"అథాపి వాజసనేయ బ్రాహ్మణమ్ - బ్రహ్మయజ్ఞో హ
వా ఏష యత్ స్వాధ్యాయః" — 1-4-3.

'అథాపి అపి చ స్వాధ్యాయో నామ య ఏష బ్రహ్మయజ్ఞః బ్రహ్మ వేదః, తత్సాధనో యాగః। యథా దర్శపూర్ణమాసాదయః పురోడాశాది సాధనాః। హ వై శబ్దౌ ప్రసిద్ధిం ద్యోతయతః' — హరదత్తవ్యాఖ్య.

స్వాధాయమే బ్రహ్మయజ్ఞ మని వాజసనేయ బ్రాహ్మణము; ఇందలి హ, వై శబ్దములు స్వాధ్యాయమునకు గల బ్రహ్మయజ్ఞత్వ ప్రసిద్ధి నభివ్యక్తము జేయు నట్టివి. దర్శపూర్ణమాసాది కర్మలకు పురోడాశాదు లెట్లు సాధనములో యీ స్వాధ్యాయ యజ్ఞమునకు బ్రహ్మ (వేదము) సాధనము - అని యర్థము.

ఇట హరదత్తవ్యాఖ్య ననుసరించి బ్రహ్మయజ్ఞ మనగా బ్రహ్మ (వేదము) సాధనముగా గల యజ్ఞము - అని యర్థము సిద్ధించుచున్నది. వేదాభ్యాసము జేయు బ్రహ్మచారి విషయమున నిది బ్రహ్మప్రాప్తికి - బ్రహ్మరూప వేదశబ్దరాశి ప్రాప్తికి - సాధన మని యర్థము. కాని యభ్యాసము జేయుకొలది యధికారిభేదము ననుసరించి యీ స్వాధ్యాయము

వేదరూపుడగు బ్రహ్మయొక్క ప్రాప్తికి సాధనమగు నను విషయము గూడ నిట సూచితము. 'ఏకవేదస్య చాజ్ఞానాత్ వేదా స్తే బహవోఽభవన్' - ఇత్యాది పూర్వోదాహృత వాక్యములు ఏకవేద (జ్ఞాన) స్వరూపుడగు పరమాత్మను దెలియ జేయుటకే వేదము లన్నియు సాధనములై వెలసినట్లు చెప్పుచున్నవి. శ్రీ సాయణుడును స్వాధ్యాయరూప బ్రహ్మయజ్ఞము పరమ పురుషార్థ సాధన మని చెప్పినాడు.

> ''యస్మాత్ స్వాధ్యాయవ్యతిరేకేణ సుకృతమార్గో న జ్ఞాయతే
> తస్మాత్ స్వాధ్యాయో ఽధ్యేతవ్యః, గ్రహణాధ్యయనం
> – బ్రహ్మయజ్ఞాధ్యయనం చ కర్తవ్యమ్। తచ్చోభయం పరమ
> పురుషార్థ సాధనమ్' — సా. భా. తై.ఆ. 2-15.

కాన స్వాధ్యాయము యొక్క పరమలక్ష్య మదియే యని 'స్వాధ్యాయో బ్రహ్మయజ్ఞః' అను శ్రుతివాక్యము దర్శింపజేయుచున్నటుల గ్రహింపనగును.

స్వాధ్యాయము బ్రహ్మయజ్ఞ మని యింతవరకు దర్శించితిమి. ఇంతే కాదు.

ప్రణవజపము - స్వాధ్యాయము :-

అధికారిభేదము ననుసరించి స్వాధ్యాయ మనగా ప్రణవజపము - అను నర్థము గూడ సంప్రదాయసిద్ధమై గన్పట్టుచున్నది.

> "తపః స్వాధ్యాయ ఈశ్వరప్రణిధానాని క్రియాయోగః"
> — యోగ. సూ. 2-1.

> 'స్వాధ్యాయః ప్రణవాది పవిత్రాణాం జపః; మోక్షశాస్త్రా
> ధ్యయనం వా.' — వ్యాసభాష్య.

"శౌచ సంతోష తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః"
— యోగ. సూ. 2-32.

'స్వాధ్యాయో మోక్షశాస్త్రాణా మధ్యయనం, ప్రణవజపో వా'
— వ్యాసభాష్య.

పై వ్యాసభాష్యమును వివరించుచు శ్రీ వాచస్పతిమిశ్రుడు తన తత్త్వవైశారదీ వ్యాఖ్యయందు యోగశాస్త్రమున బేర్కొనబడిన యీ యమ నియములే విష్ణుపురాణము (6_7 అధ్యా.) గూడ వివరించుచున్నట్లు ఈ శ్లోకముల నుదహరించినాడు.

"బ్రహ్మచర్య మహింసాం చ సత్యాస్తేయాపరిగ్రహాన్ ।
సేవేత యోగీ నిష్కామో యోగ్యతాం స్వమనో నయన్ ॥
స్వాధ్యాయ శౌచ సంతోష తపాంసి నియతాత్మవాన్ ।
కుర్వీత బ్రహ్మణి తథా పరస్మిన్ ప్రవణం మనః ॥
ఏతే యమాః సనియమాః పంచ పంచ ప్రకీర్తితాః ।
విశిష్టఫలదాః కామ్యా నిష్కామాణాం విముక్తిదాః ॥"
—వి.పు. 6-7-36,37,38.

కాన స్వాధ్యాయ మనగా 'ప్రణవజపము లేక మోక్షశాస్త్రాధ్యయన' మనియు నర్థము లుండుట స్పష్టము. స్వాధ్యాయాది యమ నియములు ఫలాభిసంధి గలవారికి విశిష్టఫలప్రదములు; ఫలాభిసంధిలేని నిష్కామయోగులకు మోక్షసాధనము లని విష్ణుపురాణము వలనను దెలియుచున్నది.

ధర్మశాస్త్రములందు మునికి స్వాధ్యాయము విధింపబడినది. ఇట స్వాధ్యాయ మనగా ప్రణవజప మనియే యర్థము.

"అనగ్ని రనికేతః స్యా దశర్మా ఽశరణో మునిః।
స్వాధ్యాయఏవోత్సృజమానో వాచం గ్రామే ప్రాణవృత్తిం
ప్రతిలభ్యా ఽనిహో ఽనము త్రశ్చరేత్" —ఆప. ధ. సూ. 2-21-10.

'స్వాధ్యాయః ప్రణవాది పవిత్రణాం జపః, అత్ర బౌధాయనః_ వృక్షమూలికో వేదసంన్యాసీ, వేదో వృక్షః, తస్య మూలం ప్రణవః, ప్రణవాత్మకో వేదః, ప్రణవో బ్రహ్మభూయాయ కల్పత ఇతి హో వాచ ప్రజాపతి రితి। (బోధా.ధ.సూ. 2-10-29నుండి 33 వరకు.).

తత్రైవ వాచం విసృజేత్ అన్యత్ర మౌనవ్రతః స్యాత్'

—హరదత్తవ్యాఖ్య.

"అనగ్ని రనికేతః స్యా దశర్మా ఽశరణో మునిః। భైక్షార్థీ గ్రామ మన్విచ్ఛేత్। స్వాధ్యాయే వాచ ముత్సృజే, దితి।"

—బోధాయన ధ. సూ. 2-10-25, 26, 27.

"స్వాధ్యాయః ప్రణవః, సమస్తవేదో వా" (గోవిందస్వామివ్యాఖ్య.)

పాపమును ఛేదించునది యగుటచే వేదము వృక్షము (వృక్షో వ్రశ్చనాత్ పాపస్య). వేదవృక్షమునకు మూలము ప్రణవము. అందుచే వేదము ప్రణవాత్మకము. ముని యగువాడు చేయవలసిన స్వాధ్యాయ మీ ప్రణవ జపము — అని ధర్మశాస్త్రవచనముల తాత్పర్యము.

ఇట గమనింపవలసిన యంశము గలదు. కృత్స్నవేద ప్రతినిధి రూప మగు ప్రణవము స్వాధ్యాయ మని చెప్పబడుటచే స్వాధ్యాయపదము కృత్స్నవేదమునకు వాచక మగుట స్పష్టము. మఱియు పరమేశ్వరవాచక మగు నీ ప్రణవము స్వాధాయ మగుచో నపుడు స్వాధ్యాయపదము లోని "స్వ శబ్దము ఆత్మ లేక పరమేశ్వరపరముగనే గ్రహింపబడవలసియున్నది. ప్రణవజప మొనర్చెడి మునివిషయమున 'స్వశాఖారూపవేదము' అను నర్థమునకు బ్రసక్తియే యుండదు.

స్వాధ్యాయము మోక్షశాస్త్రాధ్యయనము :-

బ్రహ్మజిజ్ఞాసయం దధికృతు లగువారు గురువుకడ జేసెడి మోక్ష శాస్త్రాధ్యయనమునకును స్వాధ్యాయ మని పేరు.

'మంత్ర శ్చాయం స్వాధ్యాయార్థో జపార్థ శ్చ'

— శం. భా. బృ. ఉ. 2-6-3.

'స్వాధ్యాయః స్వాధీనోచ్చారణక్షమత్వే సత్యధ్యాపనం,
జప స్తు ప్రత్యహ మావృత్తి రితి భేదః' — ఆనందగిరి.

బృహదారణ్యకశ్రుతి యందలి మధుకాండవంశబ్రాహ్మణాత్మక మగు మంత్రముగూడ స్వాధ్యాయార్థము-జపార్థము నగును. జప మనగా నిత్య స్వాధ్యాయము. అనగా బ్రహ్మయజ్ఞము. స్వాధ్యాయ మనగా అధ్యాపనము (స్వాధీనోచ్చారణక్షమత్వే సత్యధ్యాపనమ్) - అని యర్థము.

పాతంజలమహాభాష్యమున స్వాధ్యాయ మన వేదాభ్యాస మనియు నర్థము జెప్పబడినది.

'చతుర్భి శ్చ ప్రకారై ర్విద్యోపయుక్తా భవతి। ఆగమకాలేన,
స్వాధ్యాయకాలేన, ప్రవచనకాలేన, వ్యవహారకాలేనేతి'

— మహాభాష్య. 1-1-1.

'ఆగమకాలః - గ్రహణకాలః, స్వాధ్యాయకాలః - అభ్యాసకాలః,
ప్రవచనకాలః - అధ్యాపనకాలః, వ్యవహారః యాజ్ఞే కర్మణి'

— కైయటః.

ఆగమకాల మన వేదగ్రహణకాలము, స్వాధ్యాయకాల మన అభ్యాస కాలము, ప్రవచనకాల మన అధ్యాపనకాలము. యాజ్ఞకర్మలయందు విని యోగించుట వ్యవహారకాలము. ఇట్లు విద్య చతుర్విధముల నుపయుక్త మగు చుండు నని యర్థము.

కాన స్వాధ్యాయన మన వేదాభ్యాసము, వేదాధ్యాపనము - అను నర్థములును గ్రాహ్యము లని తెలియును.

పై గ్రంథసందర్భము నంతయు బరిశీలించినచో స్వాధ్యాయ మనగా ప్రకరణము ననుసరించియు నధికారిభేదము ననుసరించియు (1) నిఖిల

ఇట శ్రుతి స్వాధ్యాయప్రశంస నారంభించుచు 1) స్వాధ్యాయ ప్రవచనములు రెండును ప్రియములు - అని పేర్కొనినది; ప్రియము లనగా అనుకూల వేదనీయము లని యర్థము. వాస్తవముగ స్వాధ్యాయాధ్యయనము గాని, అధ్యాపనము గాని రెండు నత్యంత శ్రమసాధ్యములు. శ్రమసాధ్యము లైనను వీనియందు వైముఖ్యము కూడదు. ఏదేని యుత్కృష్టఫలము నాశించి చేసెడి శ్రమ యంతయు, ఆశించిన ఫలము దృష్టియందుండుటచే, శ్రమ యనిపించదు. ఫలప్రాప్త్యనంతరము తాను పడిన శ్రమ ప్రియ మయియే యొప్పును, అప్రియము కాదు. ఇట్లు లౌకిక ఫలప్రాప్తికై చేసిడి శ్రమయే ప్రియమై యొప్పుచుండ, అనన్యలభ్య మగు మహోత్కృష్ట ఫలములు సిద్ధింపజేసెడి స్వాధ్యాయాధ్యయనము గాని అధ్యాపనము గాని ప్రియములై యొప్పుటలో నాశ్చర్యము లేదు. కావున నివి ప్రియములు 'అనుకూల వేదనీయములు' అని శ్రుతి ప్రబోధించుచున్నది.

(2) 'యుక్తమనా భవతి' — స్వాధ్యాయనమునకు గాని, అధ్యాపనమునకు గాని యేకాగ్రత యావశ్యకము. అది లేనిది యీ రెండును సిద్ధింపవు. స్వాధ్యాయప్రవచనములు చేయుచో చేయుకొలది యేకాగ్రతయు ననుగతమై యప్రయత్నముగ సిద్ధించుచుండును. కావుననే శ్రుతి యట్టివాడు 'యుక్తమనా భవతి' ఏకాగ్రచిత్తు డగును' అని కీర్తించినది.

(3) 'అపరాధీనో ఉహరహ రర్థాన్ సాధయతే' — స్వాధ్యాయ ప్రవచనపరుడై యేకాగ్రత సిద్ధించిన వేదవిదుడు పరాధీనుడు గాకయే, యనన్యాపేక్షముగ దైనందినము ధర్మాద్యర్థముల సాధించుకొనగలడు. స్వధర్మప్రతిష్ఠితుడై యోగ్యార్థసాధకు డగు నని యర్థము

(4) 'సుఖం స్వపితి' — స్వధర్మనిరతుడై యీ వేదవిదుడు సుఖస్వాపము చెందును ; అనగా నిర్విచారుడై సుఖముగ నుండు నని భావము.

ఇట్లు ఆత్మచికిత్సక మని చెప్పబడుటచే స్వాధ్యాయాధ్యయన మనగా శబ్దరాశిని కంఠస్థము జేయుటయే కాదు; యోగ్యత ననుసరించి ధర్మ బ్రహ్మ జిజ్ఞాసల నొనర్చి శ్రుతిప్రతిపాదితార్థముల నవగతము జేసికొనుటయే ఆత్మకు జేయబడెడి చికిత్స యగును. అట్టి చికిత్స వలన గలిగెడి ఇంద్రియ సంయమాదుల ద్వారా లభించునదియే ఆత్మారామత్వము. అదియే స్వాధ్యాయ లక్ష్యము — అని పై స్వాధ్యాయప్రశంసాశ్రుతి తాత్పర్యము.

కావున— స్వం అధ్యయనం స్వాధ్యాయః — అను మహాభాష్యోక్త నిర్వచనము ననుసరించి స్వం ఆత్మవిషయకం అధ్యయనం స్వాధ్యాయః - ఆత్మవిషయకమైన యధ్యయనము స్వాధ్యాయ మని గ్రహింపనగును. అట్లు బ్రహ్మ (ఆత్మ) విషయక స్మరణ హేతు వగుటచే తత్ప్రతిపాదక గ్రంథమునకును 'స్వాధ్యాయః' అని పేరు. కనుకనే స్వాధ్యాయపదము బ్రహ్మతాత్పర్యక 'వేద' పదమునకు పర్యాయపదముగ ప్రసిద్ధమై నిఘంటు కారులచే గూడ గ్రహింపబడినది.

ఇట్లు స్వాధ్యాయశబ్ద పరిశీలనమువలన వేదములు 'స్వ' పరములు కాని లౌకిక చారిత్రిక విషయబోధనతత్పరములు గావు. అట్లు 'స్వ' పర ములుగ దర్శించి యధ్యయనము చేసినపుడే వేదము స్వాధ్యాయమై వెలయ గలదు. అని స్వాధ్యాయ శ్రుతితాత్పర్యము.

స్వాధ్యాయము - చరిత్రకారులు :

SVADHYAYA (reciting to oneself) in the Brahmanas denotes the study or repetition of the Vedic Texts.

— *Vedic Index ; A. A. Macdonell & A. B. Keith.*

"స్వాధ్యాయ పదమునకు 'స్వయముగ (తనకు దాను) వల్లెవేసి కొనుట' యని యర్థము; బ్రాహ్మణములలో నీ పదము వైదికసంహితా భాగములను చదువుట లేక ఆవృత్తి చేయుటను తెలియజేయును" — అని యర్థము.

దీనినిబట్టి యీ చరిత్రకారులు స్వాధ్యాయ మనగా 'వేదము' అను నర్థము గ్రహించినట్లే కన్పట్టదు. మఱియు బ్రాహ్మణములలో గన్పట్టు స్వాధ్యాయపదము 'వేదము' అను నర్థమును బోధించుటలేదనియు పై వాక్యముల వలన దెలియుచున్నది. అది యుక్తము కాదు.

'స్వాధ్యాయో ఽ ధ్యేతవ్యః' —శ.బ్రా. 11-5-6-3.

'ప్రియే స్వాధ్యాయ ప్రవచనే భవతః' —శ.బ్రా. 11-5-7-1.

'అహ రహః స్వాధ్యాయ మధీతే' —శ.బ్రా. 11-5-6.

ఇత్యాది బ్రాహ్మణవాక్యము లన్నియు స్వాధ్యాయపదమును వేదపర్యాయ పదముగనే గ్రహించినవి. ఈ పదము శ్రుతి, స్మృతి, పురాణ, కోశాదుల యందు వేదపర్యాయ వాచకముగ సుప్రసిద్ధము. కాన బ్రాహ్మణములలో నీ పదము 'వైదికసంహితల జదువుట లేక యావృత్తి జేయుట'—యను నర్థమును మాత్రమే బోధించుచున్న దనుట తగదు,

మఱియు స్వాధ్యాయపదము 'తనకు దాను వల్లెవేసికొనుట[1]'— యను నర్థము మాత్రమే చెప్పుచున్నదనుటయు సంగతము గాదు. కృత్స్న వేదాధ్యయనము, అధికారిభేదము ననుసరించి చేయబడెడి స్వశాఖాధ్యయ నము, క్రత్వర్థమై చేయబడు వేదభాగాధ్యయనము, మఱియు బ్రహ్మ యజ్ఞము, తుదకు ప్రణవజపము, మోక్షశాస్త్రాధ్యయనము—అన్నియు స్వాధ్యాయపద వాచ్యము లగుట శ్రుతి, స్మృత్యాది ప్రమాణసిద్ధము.

స్వాధ్యాయపదమునకు 'తనకు తాను అవృత్తి జేసికొనుట' యను నర్థముగూడ లేక పోలేదు. కాని యా పదముచే దెలియవలసిన తాత్పర్య

1. స్వయంవఢ్‌నా—వైదికకోశ - సూర్యకాన్త. (మాగ్డొనెల్, కీత్ పండితుల వేదిక్ ఇండెక్సును ఆధారముగ జేసికొనిన హిందీ వైదికకోశము.

మంతియే కాదు. అంతియే యగుచో నమరకోశాది గ్రంథములను భౌతిక శాస్త్రాదులను, ఇతర పారాయణోపయుక్త గ్రంథములను లేక గ్రంథభాగ ములను, కంఠస్థము చేసి యావృత్తి జేసికొనెడి యాచారము గలదు, కాని, వానికి 'స్వాధ్యాయ' మను ప్రసిద్ధి లేదు. అందుచే స్వాధ్యాయ మన'తనకు దాను అవృత్తి జేసికొనుట' అని మాత్రమే జెప్పిన చాలదు. దేనినిఆవృత్తి జేసికొనవలెను ? ఎందుకు ? ఎట్లు ? — అను నాకాంక్షపరిపూర్తి యీ చరిత్రకారుల యర్థనివరణము వలన సిద్ధించుట లేదు. స్వాధ్యాయా ధ్యయన స్వరూపమును, స్వాధ్యాయ బ్రాహ్మణములే చక్కగ వివరించి యున్నవి. అందుచే బ్రాహ్మణవిహిత మయిన స్వాధ్యాయాధ్యయన స్వరూపము దెలియవలసి యున్నది.

స్వాధ్యాయో ఒధ్యేతవ్యః — అనునది నియమవిధి యని సంప్రదాయము. అధ్యయనము విషయమై యొక విశిష్ట నియమమును బోధించునది యని యర్థము. కావున స్వాధ్యాయము నధ్యయనము జేయవలె ననగా కేవలశబ్దరాశిని కంఠస్థముజేయుట యని యర్థము కాదు. అధ్యయనసంస్కృతమైన స్వాధ్యాయము (వేదము) చేతనే యర్థమును గ్రహింపవలె నను నియమమును శ్రుతి యిట విధించుచున్నది (తస్మాత్ అధ్యయన సంస్కృతేనైవ స్వాధ్యాయేన అర్థం జానీయాత్ ఇతి విధత్తే)

(సాయణః, అథర్వవేద భాష్యభూమికా)

నియమపూర్వకముగ, పితృపరంపరాప్రాప్త మయిన విధముగ, వేదమును గురువు నొద్ద నధ్యయనము జేసి సంప్రదాయానుగుణముగ ధర్మ – బ్రహ్మరూపార్థముల గ్రహింపవలె నని యీ నియమతాత్పర్యము. అంతియే గాని లిఖితపాఠ – భాషాంతరీకరణాద్యధ్యయనాదుల ద్వారా యర్థజ్ఞానమునకై యత్నించుట స్వాధ్యాయాధ్యయనము గాదని స్వాధ్యాయ

శ్రుతి తాత్పర్యము. ఈ విషయము మీమాంసాశాస్త్రమున విపులముగ జర్చించి వివరింపబడినది. (చూ. జిజ్ఞాసాధికరణము. శాస్త్రదీపిక, భాట్టదీపికమొ. చూ. భామతీ. బ్ర. సూ. 1-3-34. మొ).

అందుచే 'స్వాధ్యాయ పదము తనకు దాను వల్లించుట' యను నర్థమును మాత్రమే చెప్పుచున్న దనుట శ్రుతివిరుద్ధము. స్వాధ్యాయాధ్యయన మనగా 'శ్రవణమననాద్యభ్యాసరూప మగు నధ్యయనము' అనియు నర్థము బ్రాహ్మణముల వలన దెలియును.

"స హోవాచాహ మప్యేత న్న వేద, సదస్యేవ వయం
స్వాధ్యాయ మధీత్య హరామహే, య న్నః పరే దద
త్యేహ్యుభౌ గమిష్యావ ఇతి" —కౌషి. ఉ. 1-1.

గార్గ్యాయణి యగు చిత్రుడను నాతడు (రాజు) యజ్ఞమును జేయగోరెను. ఆ యజ్ఞమును బ్రవర్తింప జేయుటకై ఆరుణి యను ఋత్విజుడు వచ్చెను. కాని యట చిత్రు డడిగిన బ్రహ్మతత్త్వవిషయకము లయి నిగూఢము లయిన ప్రశ్నలకు బదులు చెప్పలేక యింటి కేగి యాచార్యుడగు తండ్రి నడిగెను. తండ్రి యపుడు కుమారునితో జెప్పిన వాక్యము లివి.

'నాయనా: ఇది నాకును దెలియదు. సదస్సు (సభ) నందే మనము స్వాధ్యాయాధ్యయనము జేయుదము. చిత్రునివలన నీ విషయమును దెలిసికొందము. రమ్ము. పోదము.' - అని పై శ్రుతివాక్యముల కర్థము.

పిదప సమిత్పాణులై యేగి వారు చిత్రుని వలన విద్యోపదేశము బొందినట్లు గలదు. ఇచట స్వాధ్యాయాధ్యయన మనగా దనకు దాను వల్లించుకొనుట యను నర్థము పొసగదు. గురువును జేరి చేయు వేదార్థ

విచారరూపమగు నధ్యయనమే యిట స్వాధ్యాయాధ్యయనము - ఆత్మతత్త్వ ప్రతిపాదక వేదవాక్య శ్రవణ మననాదిరూపము.

"స్వాధ్యాయ మధీత్య। ఏత దర్థప్రతిపాదకం వేదభాగం సార్థ మధిగమ్య చిత్రాత్ గార్గ్యాయణేః హరామహే ఉధిగచ్ఛామః"

అనియే శ్రీ శంకరానందులును పై శ్రుతివాక్యముల కర్థమును వివరించిరి. ఏ యర్థము (బ్రహ్మ) ను గూర్చి సందియము గలిగినదో యా యర్థమును బ్రతిపాదించెడి స్వాధ్యాయమును (వేదభాగమును) గురుముఖముననే, సభలో, నర్థజ్ఞానపూర్వకముగ దెలిసికొందమని యర్థము. కాన స్వాధ్యాయ మనగా 'శబ్దరాశిని (సంహితాభాగమును) తనకు దాను వల్లెవేసికొనుట' - యను నర్థమే బ్రాహ్మణములందు బ్రసిద్ధ మనియెడి చారిత్రికుల యర్థ కల్పనము శ్రుతివిరుద్ధము. ఇట స్వాధ్యాయ మన 'ఆత్మవిషయకమైన అధ్యాయ (వేద) మనియు నర్థస్ఫూర్తి గలుగుచున్నది.

కాన స్వాధ్యాయ మనగా ఆత్మచికిత్సకొఱకైన యధ్యయనము. దేహాతిరిక్తుడు, కర్తయు, భోక్తయు నైన ఆత్మయొక్క చికిత్స మొదట వేదాధ్యయనముతో నారంభమై, వివిధ కర్మానుష్ఠానాదులయందును వ్యాప్తమై, స్వధర్మప్రతిష్ఠితుని గావించి, క్రమముగ నధికారము సిద్ధించుకొలది శ్రవణ మననాద్యభ్యాసరూపమగు నధ్యయనము ద్వారా ఆత్మారామత్వము సిద్ధింపజేసి నివృత్త మగును. ఇట్లు స్వ (ఆత్మ) చికిత్స కొఱకైన యధ్యయనము (స్వార్థం అధ్యయనం) స్వాధ్యాయము.

స్వాధ్యాయాధ్యయనము వలన ధర్మ-బ్రహ్మావబోధము కలుగుటయు అభ్యుదయ నిఃశ్రేయస ప్రయోజనములు సిద్ధించుటయు శ్రీ వాచస్పతి మిశ్రునిచే నిట్లు వివరింపబడినది.

"దృష్టస్య స్వాధ్యాయస్యాధ్యయన సంస్కారః । తేన హి పురుషేణ స ప్రాప్యతే, ప్రాప్తశ్చ ఫలవత్కర్మ బ్రహ్మావ

బోధ మభ్యుదయ నిఃశ్రేయసప్రయోజన ముపజనయతి....
యదా చాధ్యయనసంస్కృతేన స్వాధ్యాయేన ఫలవ త్కర్మ
బ్రహ్మావబోధో భావ్యమానో ఒభ్యుదయ నిఃశ్రేయస
ప్రయోజన ఇతి స్థాపితమ్, తదా యస్యాధ్యయనం తస్యైవ
కర్మబ్రహ్మావబోధో ఒభ్యుదయ నిఃశ్రేయస ప్రయోజనో
నాన్యస్య...." —భామతీ. బ్ర. సూ. 1-3-34.

మఱియు బ్రాహ్మణములందు గల యీ స్వాధ్యాయపదము సంహితాభాగములను జదువుట, ఆవృత్తి జేయుట యను నర్థమును — తెల్పు ననెడి చారిత్రికుల వివరణము సరియైనది కాదు. సంహితలే గాదుః అనుశాసన, విద్యా, వాకోవాక్య, ఇతిహాస, పురాణగాథాదిరూప మగు బ్రాహ్మణభాగముగూడ నిత్యము నధ్యయనము జేయుటయే బ్రహ్మయజ్ఞ మని స్వాధ్యాయబ్రాహ్మణములు విధించుచున్నవి.

"మధ్వాహుతయో హ వా ఏతా దేవానాం యదనుశాసనాని
విద్యా, వాకోవాక్య మితిహాస పురాణం గాథా నారాశంస్యః।
స య ఏవం విద్వా ననుశాసనాని విద్యా వాకోవాక్య
మితిహాస పురాణం గాథా నారాశంసీ రితి అహ రహః
స్వాధ్యాయ మధీతే। మధ్వాహుతిభి రేవ తద్దేవాం స్తర్పయతి"
— శ.బ్రా. 11-5-6-1.

'తత్ర ఋగాదిశబ్దైః మంత్రభాగ స్యాధ్యయనం ప్రతిపాదితమ్ ।
అధునా బ్రాహ్మణభాగస్యాధ్యయనం ప్రతిపాద్యతే' — సా. భా.

తైత్తిరీయశ్రుతియందు స్వాధ్యాయబ్రాహ్మణము ఋగాదిమంత్రాధ్యయనము విధించి, తర్వాత బ్రాహ్మణభాగాధ్యయనమును గూడ నిట్లు విధించినది.

'య ద్బ్రాహ్మణా నీతిహాసాన్ పురాణాని కల్పాన్
గాథా నారాశగ్ంసీ ర్మేదాహుతయో దేవానా మభవన్ ....
బ్రహ్మణః సాయుజ్యం ఋషయో ఽగచ్ఛన్' — తై. ఆ. 2-9-1.

కర్మబ్రహ్మబోధక మగు మంత్రబ్రాహ్మణాత్మక వేదరాశి నధ్యయనము జేయుట స్వాధ్యాయరూప బ్రహ్మయజ్ఞ మనియు, బ్రహ్మజ్ఞానసిద్ధి ద్వారా బ్రహ్మయజ్ఞము ముక్తిహేతు వనియు పై బ్రాహ్మణముల వలన దెలియును.

'బ్రహ్మజ్ఞానోత్పాదన ద్వారా ముక్తిహేతుత్వం బ్రహ్మయజ్ఞస్య యుక్తమ్.' —సా. భా.

అందుచేతనే 'యజ్ఞానాం బ్రహ్మయజ్ఞోఽహమ్' – (భాగ. 11-16-23) అని పరమేశ్వరుడు తనను బ్రహ్మయజ్ఞస్వరూపునిగ గీర్తించుకొనినాడు.

స్వాధ్యాయరూప బ్రహ్మయజ్ఞ మిట్లు అత్యంత ముత్కృష్ట మైనది గనుకనే యెంతటి దుర్బలుడైనను తుదకు 'అప్యేకం దేవపదం మధీయీతైవ, – దేవతాతత్త్వప్రకాశక మగు నీ స్వాధ్యాయపదము నొక్కటియైన నధ్యయనము జేయవలెను గాని యూరకుండరాదు' అని శతపథశ్రుతి బ్రహ్మయజ్ఞప్రకరణమున నత్యంత దుర్బలుని గూడ హెచ్చరించుచున్నది.

స్వాధ్యాయః - తపః :-

తైత్తిరీయ శ్రుతియు పురుషార్థసాధనోపాయములను మతభేదోపన్యాస వ్యాజమున పెక్కు ప్రదర్శించి తుదకు స్వాధ్యాయప్రవచనములే పురుషార్థసాధనము లని ప్రవచించినది.

'ఋతం చ స్వాధ్యాయ ప్రవచనే చ। సత్యంచ స్వాధ్యాయ ప్రవచనేచ। తప శ్చ స్వాధ్యాయప్రవచనే చ। దమ శ్చ స్వాధ్యాయప్రవచనే చ। శమ శ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నయ శ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నిహోత్రం చ

స్వాధ్యాయప్రవచనే చ। అతిథయ శ్చ స్వాధ్యాయప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజన శ్చ స్వాధ్యాయ ప్రవచనే చ। ప్రజాతి శ్చ స్వాధ్యాయప్రవచనే చ। సత్య మితి సత్య వచా రాథీతరః। తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః। స్వాధ్యాయప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః, తద్ధి తప స్తద్ధి తపః। —తై. ఉ 1-9-1.

ఇట శ్రుతియందు ఋతము, సత్యము, తపము, దమము, శమము, అగ్నులు, (ఆధానము చేయదగినవి), అగ్నిహోత్రము, అతిథిసత్కారము, మానుషము (లౌకికవ్యవహారదక్షత), సత్సంతానము, నియమబద్ధ గార్హస్థ్యము, పుత్రోత్పత్తి — ఇందు గొన్నిటిని గాని, లేక యన్నిటిని గాని సాధించుచున్నను, లేక సాధించిననుగూడ స్వాధ్యాయప్రవచనములు.రెండును ప్రయత్నపూర్వకముగ ననుష్ఠింపవలసిన వని తెల్పుటకే యిందలి ప్రతి యొకదానితో గూడ స్వాధ్యాయప్రవచనములు చేర్చబడినవి. స్వాధ్యాయ ప్రవచనములు యథావిధిగ జేయుచో బైన బేర్కొనిన శమ దమాదు లన్నియు ననుగతములే యగుచుండును. కనుక స్వాధ్యాయప్రవచనములే పురుషార్థ సాధక మగు తపస్సుగా నిర్దేశింపబడినది. 'తపో హి స్వాధ్యాయః (తై. ఆ. 2-9.)

స్వాధ్యాయము _ పరమోత్కృష్టశ్రమ :-

"యే హ వై కే చ శ్రమాః। ఇమే ద్యావాపృథివీ అంతరేణ। స్వాధ్యాయో హైవ తేషాం పరమతా కాష్ఠా। య ఏవం విద్వాన్ స్వాధ్యాయ మధీతే। తస్మాత్ స్వాధ్యాయో ఉధ్యేతవ్యః।" — శ.బ్రా. 11-5-7-2.

భూమ్యాకాశములమధ్య, లోకమందు, ఎన్నియేని శ్రమలు – శ్రమ సాధ్యములగు తపస్సులు – గలవు. శ్రమసాధ్యములగు నీ తపస్సులకు పరాకాష్ఠ స్వాధ్యాయరూపమగు తపస్సు. ఇట్టి దీని యుత్కృష్టత నెఱిగి యధ్యయనము జేయువాడే విద్వాంసుడు. అతడే తత్ఫలావాప్తి నొందును. కాన స్వాధ్యాయము నధ్యయనము జేయవలెను – అని యర్థము.

లోకమున నేదియేని సుఖము గాని ఫలము గాని సాధించుటకై దీక్ష బూనెడివా రెంతటి శ్రమకైన వెనుదీయరు. ఫలము సిద్ధించువఱకు నిద్రింపరు. అగాధము లగు సముద్రముల జొత్తురు. ఉత్తుంగపర్వత శిఖరాగ్రముల నధిరోహింతురు. అనంతాకాశపథమున దూసికొని పోదురు. ఇట్లు దీక్షగా నేదియేని పనిని నిర్వహించి కృతార్థుడైనను, లేక విఫలుడైనను, 'దీనికై తపస్సు ధారవోసితి' ననుట లోకసహజము. ఇవి శ్రమసాధ్యము లైన తపస్సులే. ఇట్టివి సుఖదాయకములుగను, కీర్తిదాయకములుగను గన్పట్టుచు మరల మరల నుద్యమింప జేయుచుండును. ఇట్టి శ్రమలు నిరవధికముగ సాగుచునే యుండును. కాని యివి సుఖదుఃఖమిశ్రితములు; అభిలషితమైన సుఖముతోపాటు అనభిలషణీయ మైన దుఃఖమును గూడ దెచ్చిపెట్టుచు, మనస్సును వ్యామోహపఱచి, సంసారబంధమున జిక్కువడ జేయుచు, ఆత్మకు సుఖశాంతుల నీయజాలవు.

ఆత్మకు యథార్థసుఖశాంతుల నీయగల విద్యయే విద్య. అట్టి విద్యలలో నత్యంత ముత్కృష్టమైనది తపోరూపమైన స్వాధ్యాయము. ఆత్మచికిత్సాకర మగుచు, ప్రవృత్తినివృత్తిరూప ధర్మదీక్షితుల నొనర్చి సుఖశాంతుల గూర్చుటయే స్వాధ్యాయతపస్సు యొక్క యుత్కృష్టత.

"హుతేన శామ్యతే పాపం స్వాధ్యాయైః శాంతి రుత్తమా"

అని యనుచు మహాభారతము (12_191_2) గూడ నుత్తమ శాంతియే

స్వాధ్యాయఫల మని చెప్పుచున్నది. పరమాత్మదర్శనమే స్వాధ్యాయము యొక్క పరమప్రయోజన మని విష్ణుపురాణముగూడ నిట్లు చెప్పుచున్నది.

"స్వాధ్యాయసంయమాభ్యాం స దృశ్యతే పురుషోత్తమః।
తత్ప్రాప్తికారణం బ్రహ్మ తదేత దితి పఠ్యతే॥
స్వాధ్యాయా ద్యోగ మాసీత యోగాత్స్వాధ్యాయ మావసేత్।
స్వాధ్యాయయోగ సంపత్త్యా పరమాత్మా ప్రకాశతే॥
తదీక్షణాయ స్వాధ్యాయ శ్చక్షు ర్యోగ స్తథా పరమ్।
న మాంసచక్షుషా ద్రష్టుం బ్రహ్మభూత స్స శక్యతే॥"

—విష్ణు. పు. 6-6-1,2,3,

స్వాధ్యాయము, యోగము - ఈ రెండిటివలననే పరమాత్మ దర్శింపబడును. పరమాత్మయే పురుషోత్తముడు - బ్రహ్మ. బ్రహ్మప్రాప్తిసాధనము లగుటచే నీ స్వాధ్యాయ-యోగములకును 'బ్రహ్మ' యని ప్రసిద్ధి. స్వాధ్యాయము వలన యోగమును, యోగము వలన స్వాధ్యాయమును ఉపాసింపవలెను. ఈ స్వాధ్యాయ - యోగసంపత్తి చేతనే పరమాత్మ ప్రకాశించును (దర్శింపశక్యమగును),; అతీంద్రియుడు, సర్వకారణకారణుడు నగు పరమాత్మను మాంసచక్షుస్సుతో (స్థూలదృష్టితో) దర్శింప శక్యము కాదు. ఆ బ్రహ్మను దర్శించుటకు యోగ్యములైన నేత్రములు స్వాధ్యాయ యోగములు - అని యర్థము.

ఇట్లు యోగసంపన్నమగు స్వాధ్యాయమునకు పరబ్రహ్మ సాక్షాత్కారమే పరమప్రయోజనము; బ్రహ్మప్రాప్తిసాధన మగుటచే నిట్టి స్వాధ్యాయమునకు బ్రహ్మ యని ప్రసిద్ధి - యని చెప్పబడుచున్నది కాన నాత్మచికిత్సక మగుచు నాత్మను దర్శింపజేయుటయే స్వాధ్యాయముయొక్క స్వాధ్యాయత్వ మని తాత్పర్యము యాజ్ఞవల్క్యస్మృతియు నీ విషయము నిట్లు చెప్పుచున్నది.

"ఇజ్యాచార దమా ఒహింసా దాన స్వాధ్యాయ కర్మణామ్।
అయం తు పరమో ధర్మో యద్యోగేనాత్మదర్శనమ్॥ — 1-8.

"ఇజ్యాదీనాం కర్మణా మయ మేవ పరమో ధర్మః య ద్యోగేన
బాహ్య చిత్తవృత్తినిరోధేనాత్మనో దర్శనం యాథాతథ్య జ్ఞానమ్"
— విజ్ఞానేశ్వరీయమ్.

బాహ్యచిత్తవృత్తి నిరోధమునకు యోగ మని పేరు. ఇట్టి యోగముచే నాత్మను దర్శింపజేయుటయే యాగ - ఆచార - దమ - అహింసా - దాన - స్వాధ్యాయకర్మలకు పరమధర్మము (పరమప్రయోజనము)- అని యర్థము. యోగసంపన్నమగు స్వాధ్యాయ మాత్మదర్శనసాధన మగు ననెడి పూర్వోక్తార్థమే యిట వివరింపబడుట స్పష్టము.

వేదములు మానవరచితములే యయి, వానికి లౌకికదృశ్యములను మఱియు నొకనాటి సాంఘిక సంఘటనలను వర్ణించుటయందే పరమ తాత్పర్య మగుచో నివియు నితర గ్రంథముల వలెనే చూడబడెడివి. వానిని యావజ్జీవము ప్రతిదినము బ్రహ్మయజ్ఞరూపమున నధ్యయనము జేయవలసిన యావశ్యకతగాని, యజ్ఞాదికర్మలయందు నిరంతరము వినియోగింపవలసిన యావశ్యకతగాని యుండెడిది గాదు. ఒక తపస్సుగ నధ్యయనము జేయవలసిన యావశ్యకత, నియమము, సంప్రదాయము స్వాధ్యాయమునకు గలవు. 'తద్ధి తప స్తద్ధి తపః' — అనుచు శ్రుతియే స్వయముగ స్వాధ్యాయమును ముఖ్యతపస్సుగ వేయినోళ్ళతో కీర్తించినది.

స్వాధ్యాయ మట్టిది. అట్టి ముఖ్యతపోరూప స్వాధ్యాయమే తపః స్వాధ్యాయము. లేక స్వాధ్యాయ తపము కావుననే మహర్షులు తపః స్వాధ్యాయనిరతులుగ పురాణేతిహాసాదులయందు దఱచుగ గీర్తింపబడిరి.

'యజ్ఞైస్తు దేవాన్ ప్రీణాతి స్వాధ్యాయతపసా మునీన్"

—భార. 1-120-19.

"ఛందాం స్యధీత్య ధర్మేణ తపఃస్వాధ్యాయ సంయుతః"

—భాగ. 12-8-7.

నారదు డట్టి తపఃస్వాధ్యాయ నిరతుడు. తపఃస్వాధ్యాయ నిరతత్వమును ప్రబోధించుటకో యనునట్లు 'తపఃస్వాధ్యాయనిరత' పదముతో శ్రీమద్రామాయణ మహాకావ్యారంభము మహర్షిచే గావింపబడినది.

స్వాహా, స్వధా, వషట్ శబ్దములు గూడ స్వాధ్యాయ తాత్పర్యమును వివరించు వేదనామములు. ఇక నా శబ్దముల జాతము.

స్వాహా

అసంసేవ్యాం దాసై రనధిగమనీయాం బహుధనైః
అనాస్వాద్యాం రాగై రనుపసరణీయాం శతమఖైః।
అగంతవ్యాం తర్కై రనుదితవిపక్షాం యుగశతైః
స్వధాం స్వాహాం దేవీం హరిహృదయలక్ష్మీం హృది భజే॥

ప్రజాపతే ర్యా భువనస్య భర్తుః
స్వకీయవాగాహ సరస్వతీ యా।
స్వాహేతి నామ్నా శ్రుతిషు ప్రసిద్ధా
హరిప్రియా రక్షతు వేదమాతా॥ —వేదమాతృస్తవః.

స్వాహాశబ్దము వేదవాచకమగునా :-

స్వాధ్యాయ పదమువలెనే స్వాహాపదము కూడ వేదవాచక మని చెప్పబడినది. కాని స్వాహాశబ్దము వేదవాచక మగునా? ఈ శబ్దము సామాన్యముగ హోమార్థము లయిన మంత్రముల తుదిని వినవచ్చుచుండును. అందుచే నిది హోమసూచకమైన సాంకేతికపదముగ గ్రహింపబడు చుండును.

"స్వాహాకారో హోమార్థ మంత్రాంత జ్ఞాపనార్థః"
— శం. భా; తై. ఉ. 1-4

ఈ పదమునకు స్వాహాదేవి యనియు, హవిప్రదాన మనియు రెండర్థములు కోశముల వలన దెలియును.

"అథాగ్నాయీ, స్వాహా చ హుతభుక్ప్రియా" —అమరకోశము.

"స్వాహాగ్నాయీ ప్రియాఽస్య చ" —అభిధానచింతామణి.

"స్వాహాగ్నాయీ చ తత్ప్రియా" —వైజయంతి.

"స్వాహా దేవహవిర్దానే శ్రౌషట్ వౌషట్ వషట్ స్వధా"
—అమరకోశము.

"శ్రౌషట్ వౌషట్ వషట్ స్వాహా స్వధా దేవహవిర్హుతౌ"
—అభిధానచింతామణి.

స్వాహాశబ్దమువలెనే స్వధాశబ్దము గూడ హోమసూచకమయిన సాంకేతిక పదముగ గ్రహింపబడుచుండును. దేవతల నుద్దేశించి 'స్వాహా' యనియు పితరుల నుద్దేశించి 'స్వధా' యనియు హవిస్సు లీయబడుచుండును. కాని వైదికనిఘంటువునందును మాధవీయ ఋగ్వేదానుక్రమణిక యందును స్వాహాపదము వాఙ్నామములలో బఠింపబడియున్నది. 'వాక్'పదము కొన్నిచోట్ల వాగింద్రియాది రూపమున గన్పట్టినను, వేదములందు సామాన్యముగ వేదవాక్కు, వేదమంత్రము, లేక వాగ్దేవత – యను నర్థము లందు ప్రసిద్ధము. ఎట్లయినను హోమసూచకమై సాంకేతిక పదముగ ప్రసిద్ధమయిన స్వాహాశబ్దము వాఙ్నామములలో బఠింపబడుట యెట్లు? అసలా విది వేదవాచక మగుట యెట్లు? వేదవాచక మగుచో నే యర్థమును బోధించును?

వైదికనిఘంటువున వాక్కునకు శ్లోకాది బేకురాంత నామములు ఏబదియేడు గలవు. మాధవీయ ఋగ్వేదానుక్రమణిక యందు స్తుతి నామములు ఎనుబది గలవు. ఇన్ని నామము లున్నను, నిత్య నైమిత్తిక కర్మలు, యాగాది క్రియలు నన్నియు స్వాహాకార పూర్వక మగు నామమంత్రములతో నారంభ మగుచున్నవి. స్వాహా స్వధాకార వివర్జితము లయిన హోమములు సామాన్యముగ నుండవు. కావున మిగిలిన

వాఙ్నామములకంటె స్వాహా స్వధా శబ్దములం దొకవైలక్షణ్య మున్నటుల గన్పట్టును. అది యేది ?

స్వాహా, స్వధా-వైశిష్ట్యము :-

స్వాహా, స్వధా యను నీ రెండును మహిమాన్వితము లయిన మంత్రములని దేవీభాగవత మిట్లు పేర్కొనుచున్నది.

"స్వాహా స్వధా నామ మనుప్రభావైః
తృప్యన్తి దేవాః పితర స్తథైవ ।
యజ్ఞేషు సర్వేషు ముదా హరన్తి
యన్నామయుగ్మం శ్రుతిభి ర్మునీంద్రాః॥" —దేవీ. భా. 3-27-25.

అగ్నికర్మలయందును వేదమంత్రములకు జివర స్వాహా స్వధా యను నీ మంత్రద్వయమును జేర్చి హవిర్దానము జేసినపుడే యా మంత్రద్వయ ప్రభావముచే దేవతలును పితరులును దృప్తి నొందెదరు — అని యర్థము. కాని మంత్రములకు జివర స్వాహా స్వధా పదముల జేర్చు టెందుకు ? అను ప్రశ్నకు సమాధానముగా దేవతల జీవనము స్వాహాశక్త్యధీనమనియు దేవీభాగవత మిట్లు చెప్పుచున్నది.

"యజ్ఞేషు దేవి యది నామ న తే వదన్తి
స్వాహేతి వేదవిదుషో హవనే కృతేఽపి ।
న ప్రాప్నువంతి సతతం మఖభాగధేయం
దేవా స్త్వామేవ విబుధేష్వపి వృత్తిదాఽసి॥" —1-7-35.

ఓ దేవీ ! స్వాహా యను నీ నామము నుచ్చరింపక, వేదవిదులు యజ్ఞము లందు హోమ మొనర్చినను, దేవత లా యజ్ఞభాగముల నొందలేరు. కావ నీవే స్వాహా యను నామముద్వారా దేవతలకు జీవనదాత్రి (వృత్తిదా)

స్వాహుతి :-

ఇక శ్రుతియందు స్వాహా శబ్దమునకు గల సంప్రదాయానుగతము లయిన యర్థముల జూతము. కేశవాయ స్వాహా; ప్రాణాయ స్వాహా; ఇంద్రాయ స్వాహా; సూర్యే జ్యోతిషి జుహోమి స్వాహా-ఇత్యాది స్థలముల యందు స్వాహాపదమునకు సామాన్యముగ 'స్వాహుతమస్తు, సుహుతమస్తు' అనగా తత్తద్దేవతోద్దిష్టమైన హవిస్సు సుహుత మగుగాక, లేక స్వాహుతి యగుగాక - యను నర్థము తఱచుగ గన్పట్టుచుండును. ఇచట సుహుత మగుట యన నేమి ? లేక స్వాహుతి యన నేమి? అగ్నియందు ప్రక్షిప్త మగు ఆజ్యాదిద్రవ్యము స్వయముగనే దగ్ధమగును. అట్లే లోనికి గ్రహించెడి జలాదికము గూడ స్వయముగనే జీర్ణ మగును. ఇట్లు అగ్నియందు సమర్పింపబడు ద్రవ్యము ప్రత్యక్షముగ దగ్ధమై, లేక జీర్ణమై, రూపఱుచుండ నిక దేవతలకును. పితరులకును జెందునదేమి? స్వాహాకారముతో ప్రయోజన మేమి ? యనుశంకలు సామాన్యముగ గలుగవచ్చును. కనుక శ్రుత్యుద్దిష్టమైన స్వాహుతి స్వరూపమును దర్శించి స్వాహాశబ్దార్థమును దర్శింపవలసి యున్నాము.

వేదము సనాతనమైన శాస్త్రము; శాస్త్రము అజ్ఞాతజ్ఞాపకము (వేదయతి); అనగా లోకసిద్ధము లయిన యర్థములను మరల యనువదించి చెప్పుటకు ప్రవృత్తమైనది కాదు. అట్లు చెప్పుచో దానికి శాస్త్రత్వమే యుపపన్నము గాదు. అందుచే లోకసిద్ధములుగాని యతీంద్రియము లయిన యర్థముల దర్శింపజేయుటకు ప్రవృత్తమైనది -యని పూర్వము వివరింపబడినది. కాన స్వాహుతి యనగా వస్తువుల నగ్నియందు చక్కగ దగ్ధము జేయుట, లేక జీర్ణ మొందించుట మాత్రమే శ్రుతితాత్పర్యమని గ్రహింపరాదు. యజ్ఞాదిక్రియలు, వానికి సంబంధించిన పరికరములు, అగ్నియందా యా ద్రవ్యముల నర్పించుట - మున్నగునవన్నియు ప్రత్యక్షగోచరము

వగుచున్నావు— అని యర్థము. కాన 'స్వాహా' స్వధా యను నీ రెండును దేవతాప్రీతికరములు, దేవతాజీవనహేతువులు నగు మహిమాన్వితములగు మంత్రము లగుట సంప్రదాయ మని పెక్కు పురాణముల వలన దెలియు చున్నది.[1] ఈ సంప్రదాయము శ్రుతిసిద్ధమైన దగుట యీ క్రింది ఋక్కు వలన దెలియనగును.

'స్వాహా స్తోమస్య వర్ధనా' — ఋ. 8-8-5.

'హే అశ్వినౌ, స్వాహా స్వాహాకృతౌ, స్వాహాకారేణ సమ్య గిష్టౌ సన్తౌ, యద్వా స్వాహేతి వాఙ్నామ, స్తుతిరూపయా వాచా స్తుతౌ, వాచా స్తోమస్య స్తోతుః ప్రవర్ధకౌ'' — సా.భా.

అశ్వినులు స్వాహాకారముచే బాగుగ నర్చింపబడినవారై, లేక స్తుతిరూప మగు వేదవాక్కుచే స్తుతింపబడినవారై, యీ వాక్కుతో స్తోత్రము జేసెడి స్తోతను వర్ధిల్ల జేయునట్టివారు - అని యర్థము.

ఇచట స్వాహా పదమునకు (1) స్వాహాకారపూర్వక మయిన హవిర్దానము (2) స్తుతిలక్షణమగు వేదవాక్కు - అను రెండర్థములు ప్రదర్శింపనడినవి. ఏ యర్థమును జెప్పినను, లేక రెండర్థముల జెప్పినను 'స్వాహా' పదోచ్చారణముచే దేవతలు ప్రీతినొందుటయు, అట్లు ప్రీతి నొందిన దేవతలు స్తోత్రము చేయు స్తోతను వర్ధిల్లజేయుటయు జెప్పబడినవి. ఇట స్తోతను వర్ధిల్లజేయుట యనగా స్తోతయొక్క వేదమంత్రరూపమైన వాక్కులో నొకవిధమగు నతిశయమును (ప్రభావమును) చేకూర్చి యుద్ధరించుట యని భావము. కాన పై దేవీభాగవతవచనములు నిట్టి శ్రుత్యర్థము ననువదించుచున్న వనుట స్పష్టము.

---

1. త్వన్నామోచ్చార్య మంత్రాంతే యో దాస్యతి హవి ర్నరః ।
మరేభ్యః తత్ప్రాప్నువంతి మరాః స్వానందపూర్వకమ్ ॥ — బ్ర. వై. పు.

స్వాహుతి :-

ఇక శ్రుతియందు స్వాహా శబ్దమునకు గల సంప్రదాయానుగతము లయిన యర్థముల జాతము. కేశవాయ స్వాహా; ప్రాణాయ స్వాహా; ఇంద్రాయ స్వాహా; సూర్యే జ్యోతిషి జుహోమి స్వాహా-ఇత్యాది స్థలముల యందు స్వాహాపదమునకు సామాన్యముగ 'స్వాహుతమస్తు, సుహుతమస్తు' అనగా తత్తద్దేవతోద్దిష్టమైన హవిస్సు సుహుత మగుగాక, లేక స్వాహుతి యగుగాక - యను నర్థము తఱచుగ గన్పట్టుచుండును. ఇచట సుహుత మగుట యన నేమి? లేక స్వాహుతి యన నేమి? అగ్నియందు ప్రక్షిప్త మగు ఆజ్యాదిద్రవ్యము స్వయముగనే దగ్ధమగును. అట్లే లోనికి గ్రహించెడి జలాదికము గూడ స్వయముగనే జీర్ణ మగును. ఇట్లు అగ్నియందు సమర్పింపబడు ద్రవ్యము ప్రత్యక్షముగ దగ్ధమై, లేక జీర్ణమై, రూపఱుచుండ నిక దేవతలకును. పితరులకును జెందునదేమి? స్వాహాకారముతో ప్రయోజన మేమి? యనుశంకలు సామాన్యముగ గలుగవచ్చును. కనుక శ్రుత్యుద్దిష్ట మైన స్వాహుతి స్వరూపమును దర్శించి స్వాహాశబ్దార్థమును దర్శింపవలసి యున్నాము.

వేదము సనాతనమైన శాస్త్రము; శాస్త్రము అజ్ఞాతజ్ఞాపకము (వేదయతి): అనగా లోకసిద్ధము లయిన యర్థములను మరల యనువదించి చెప్పుటకు బ్రవృత్తమైనది కాదు. అట్లు చెప్పుచో దానికి శాస్త్రత్వమే యుపపన్నము గాదు. అందుచే లోకసిద్ధములుగాని యతీంద్రియము లయిన యర్థముల దర్శింపజేయుటకు బ్రవృత్తమైనది -యని పూర్వము వివరింప బడినది. కాన స్వాహుతి యనగా వస్తువుల నగ్నియందు చక్కగ దగ్ధము జేయుట, లేక జీర్ణ మొందించుట మాత్రమే శ్రుతితాత్పర్యమని గ్రహింప రాదు. యజ్ఞాదిక్రియలు, వానికి సంబంధించిన పరికరములు, అగ్నియం దా యా ద్రవ్యముల నర్పించుట - మున్నగునవన్నియు ప్రత్యక్షగోచరము

ఈ మంత్రమువలన (1) కర్మానుష్ఠానసమయమున అగ్ని సర్వ దేవతాత్మకుడై, దేవరూపుడై యావిర్భవించుటచే అగ్నికి 'దేవయోని' యను సార్థకనామము సిద్ధించుటయు, (2) దేవయోని యయిన యా యగ్ని వలనను, ఆ యా దేవతల నుద్దేశించిన యాహుతుల వలనను యజమానుడు దేవతా రూపుడు (దివ్యశక్తిసంపన్నుడు) అగుటయు దెలియనగును. ఇంతే కాదు.

"ఋఙ్మయో యజుర్మయః సామమయో వేదమయో
బ్రహ్మమయో ఽమృతమయః సంభూయ దేవతా
అప్యేతి య ఏవం వేద య శ్చైవం విద్వా నేతేన
యజ్ఞ క్రతునా యజతే" —ఐ.బ్రా. 4-5.22.

పై 'అగ్ని ర్వై దేవయోనిః' అనెడి శ్రుతి ననుసరించి యగ్ని యొక్క దేవతాత్మత్వమును, అట్లే యజమానునకు గల్గెడి దివ్యత్వమును నెవరు తెలిసికొనగల్గుదురో, తెలిసికొని యనుష్ఠింతురో యట్టివారికి సర్వవేద మయత్వము, సర్వదేవమయత్వము, క్రమముగ నమృతత్వము సిద్ధించునని యీ శ్రుతి తెలియజేయుచున్నది (వేదయతి). మఱియు కర్మానుష్ఠానసమయ మున నగ్నియొక్క దేవయోనిత్వము, యజమానునకును సిద్ధించెడి దివ్య త్వమును దెలిసికొనుట యత్యంతావశ్యకము (య ఏవం వేద) అనియు నిట శ్రుతి హెచ్చరించుచున్నది. ఇట్టి దేవతాత్మవిజ్ఞానముచే సుసంస్కృతు డయిన యజమానుడు స్వాహాకారమొనర్చుచు మంత్రపూర్వకముగను, దేవతాహ్వాన పురఃసరముగను అగ్ని (ప్రాణాగ్ని మొ॥) యందు సమర్పించునదియే ఆహుతి, లేక హవిస్సు, లేక హవ్యము అగుచున్నది. ఇట్టి యాహుతులవలన యజమానునకు దివ్యత్వము సిద్ధించునని శ్రుతి తాత్పర్యము. ఈ 'ఆహుతి' యొక్క స్వరూపమును శ్రుతి యిట్లు వివరించుచున్నది.

ఆహుతి-ఆహితి: దేవతల పరోక్ష ప్రియత్వము: భోక్తృ భోగ్య స్వరూపము :—

"ద్వయం వా ఇదమ్-అత్తా చైవాద్యం చ తద్ యదోభయం సమాగచ్ఛతి- అత్తైవాఖ్యాయతే। నాద్యమ్। స వై యః సోఽత్తా- అగ్ని రేవ సః। తస్మిన్ యత్కించ అభ్యాదధాతి- ఆహితయ ఏ వాస్య తాః। ఆహితయో హ వై తా ఆహుతయ ఇత్యాచక్షతే పరోక్షమ్। పరోక్షకామా హి దేవాః''

— శ. బ్రా. 10-6-2-2.

'అత్తా - అద్యము, అనగా భోక్త - భోగ్యము' - అని జగత్తు ద్వివిధము. భోక్తృ భోగ్య రూప మగు నీ జగత్తు ఏకీభూత మగునపుడు ఈ రెండింటికిని గలిపి 'అత్తా' యనియే, అనగా భోక్త యనియే వ్యవహారము. భోగ్యము అను వ్యవహారము లేదు. ఆ భోక్త ఎవరు? అగ్నియే. అగ్ని యనగా అధియజ్ఞముగ ఆజ్యాదిహవిస్సుల గ్రహించెడి యగ్ని, ఆధిదైవికముగ నాదిత్యుడు: ఆధ్యాత్మికముగ ప్రాణము (ప్రాణాగ్ని). అట్టి యగ్నియందు సమంత్రకముగ నుంచబడెడి ఆజ్య సోమ అన్నాదిహవిస్సులకు 'ఆహితయః' అని పేరు. అనగా నగ్నియం దాధానము చేయబడునవి (ఆధానా దాహితయః - సా. భా.) యని యర్థము. ఇట్టివి వాస్తవముగ 'ఆహితయః' అని చెప్పబడవలసియున్నను, పరోక్షముగ 'ఆహుతయః (ఆహుతులు)అని చెప్పబడుచుండును. అట్లేల చెప్పబడవలెను? దేవతలు పరోక్షప్రియులు. అందుచే నట్లే చెప్పబడవలెను-అని శ్రుతితాత్పర్యము.

ఇట ఆహుతులయందు పరోక్షముగ, అనగా విగూఢముగ, నున్న 'ఆహితత్వము'ను శ్రుతి దర్శింపజేయుచున్నది. ఇట్లే యజ్ఞాది కర్మనామముల యందును, అగ్ని-ఇంద్రాది దేవతానామముల యందును

పరోక్షముగ నిగూఢమై యుండెడి యర్థముల బరిశీలించి దర్శింపవలె నని తెలియజేయుటకే శ్రుతి యడుగడుగున 'పరోక్షప్రియా ఇవ హి దేవాః' "దేవతలు పరోక్షప్రియులు' అని హెచ్చరించుచున్నది. ఇట భోక్త యని చెప్పబడిన అగ్ని యెవరు ?

అగ్నిః - అగ్రిః :-

"స యదస్య సర్వస్యాగ్ర మసృజ్యత తస్మా దగ్రి ర్హ వై
త మగ్ని రిత్యాచక్షతే పరోక్షమ్।"
— శ. బ్రా. 6-1-1-11; మా. శ. బ్రా. 2, 2, 4. 2.

అగ్నికి 'అగ్రిః' అనునది ప్రత్యక్షనామము. సర్వమునకు అగ్రమున (పూర్వమున) సృజింపబడినవాడు - అని యర్థము. 'అగ్నిః' అనునది పరోక్షనామము. ఇట్లే ఇంద్రశబ్దమును బరిశీలింతము.

ఇంద్రః—ఇంధః-భోక్తృ భోగ్య స్వరూపము :-

"ఇంధో హ వై నామైష యోఽయం దక్షిణేఽక్షన్ పురుష స్తం
నాఽఏత మింధగ్ం సంత మింద్ర ఇత్యాచక్షతే పరోఽక్షే
ణైన పరోక్షప్రియా ఇవ హి దేవాః ప్రత్యక్షద్విషః।
అథైత ద్వామేఽక్షణి పురుషరూప మేషాఽస్య పత్నీ విరాట్
తయో రేష సగ్ంస్తావో య ఏషోఽ న్త ర్హృదయ ఆకాశో
ఽథైనయో రేతదన్నం య ఏషోఽ న్త ర్హృదయే లోహిత
పిండః" — బృ. ఉ. 4-2-2,3

ఆదిత్యమండలాంతర్గతపురుషుడే ఆధ్యాత్మికముగ దక్షిణనేత్రమున విశేషముగ నభివ్యక్తమగుచుండును. దక్షిణాక్షిగత పురుషజ్యోతికి ఇంధః అని పేరు. దీప్తిగుణాతిశయముచే నీ జ్యోతి కిది ప్రత్యక్షనామము. ఈ

ఇంధుని పరోక్షముగ ఇంద్రు డని వ్యవహరింతురు. వామనేత్రమునగల పురుషార్థప్రకాశమునకు 'ఇంద్రాణి' యని పేరు. ఈ ఇంద్రాణియే విరాడ్రూపమునను, భోగ్య – అన్నరూపమునను నొప్పును. భోక్తయగు నింద్రుడును, భోగ్యరూప యగు నింద్రాణియు హృదయపుండరీకాంతర్గతాకాశమున పరస్పరతాదాత్మ్యభావనతో మిథునీభావముజెంది వినోదించుచుండురు. ఈ మిథునము జాగరితమున వైశ్వానరనామమునను, స్వప్నమున తైజసనామమునను బఱగుచు జాగరస్వప్నావస్థలయందు పుత్ర, మిత్ర, బంధు దర్శనాదిరూప క్రీడల సలిపి సలిపి యలసి విశ్రాంతి జెందును. ఇట్టి విశ్రాంతికి సుషుప్తి యని పేరు. ఈ స్థితియం దీ మిథునము 'ప్రాజ్ఞ' నామమున బరగుచు, స్వస్వరూపానందమున బ్రతిష్ఠితమై యుండి తిరిగి హృదయదేశమునుండి యూర్ధ్వముగ బ్రసృతమగు 'సంచరణీ' నాడీ మార్గమున జాగ్రదవస్థ నొందుచుండును. (మా. శం. భా.)

పై ప్రత్యర్థమునే శ్రీ శంకరభగవత్పాదు లిట్లు శతశ్లోకియందును వివరించిరి.

"ఇంద్రేంద్రాణ్యోః ప్రకామం సురతసుఖజుషోః స్యా ద్రతాంతః
సుషుప్తిః, తస్యామానందసాంద్రం పద మతిగహనం య త్స
ఆనందకోశః। తస్మి న్నో వేద కించి న్నిరతిశయ సుఖాభ్యంతరే
లీయమానో, దుఃఖీ స్యా ద్బోధితః స న్నితి కుశలమతి
ర్బోధయే న్నైవ సుప్తమ్॥ —శతశ్లోకి. 65.

ఇట్లు శ్రుతి యగ్నీంద్రాదులయొక్క ప్రత్యక్ష పరోక్ష నామముల నుపదేశించి యా యా దేవతాతత్త్వమును దెలియజేయుటయే గాక, యతీంద్రియమగు 'భోక్తృ-భోగ్య' స్వరూపమునుగూడ వివరించుచున్నది.

స్థూలశరీరోపాధికుడగు జీవుడు భోక్త. అతని యుపభోగమున కనుపడు వస్తుజాలమంతయు భోగ్యము. జగత్తు ఇట్టి భోక్తృ-భోగ్యాత్మక

మని పూర్వమంత్రమున జెప్పబడినది. భోగ్యపదార్థము భోక్తచే గ్రహింపపడి, భోక్తతో నేకీభూత మగునపుడు అది భోక్తృరూపమనవే వ్యవహరింపబడుచుండును. కావుననే భోక్తృభోగ్యాత్మకమగు శరీరముతో తాదాత్మ్యముచెంది జీవుడు 'అహమ్' అని (భోక్తృరూపమునవే) వ్యవహరించును. అనగా ప్రాణాగ్నియందు ఆహితమై, ఆహుతిరూపమై భోగ్యవస్తుజాత మంతయు ప్రాణాత్మకుడును, భోక్తయు నగు జీవుని రూపముననే వ్యవహరింపబడుచున్నది. ఇట్టి జీవుడు జాగ్రద్దశయందు వైశ్వానరుడు, స్వప్నమున తైజసుడు, సుషుప్తియందు ప్రాజ్ఞుడు అను రూపముల బరగి విలసిల్లుచుండునని శ్రుతి చెప్పుచున్నది. ఇంతియే కాదు. భోక్తయై ప్రసిద్ధుడైన జీవుడు 'ఇంద్ర-ఇంద్రాణీ దేవతామిథునరూపుడు' అనియు శ్రుతి చెప్పుచున్నది. అందును మఱల ఇంద్రుడు భోక్త; ఇంద్రాణి భోగ్యవిరాడస్వరూపిణి. ఈ దేవతామిథునీభావమే జగదుత్పత్తికి మూలము. భోక్తృభోగ్యరూపమగు ఈ దేవతామిథునమే భోక్తయగు జీవరూపమున ప్రసిద్ధమగుచున్నది.

ప్రాణము స్వప్నస్వరూపము:-

శతపథబ్రాహ్మణము మఱియొకచోటగూడ (10-5-2-9) ఇట్లే ఇంద్రేంద్రాణీ దేవతామిథునస్వరూపము వివరించినది. పిదప నా యక్షి పురుషుని ముఖ్యప్రాణస్వరూపునిగ జెప్పి స్వప్నస్వరూపునిగగూడ నిట్లు వివరించినది.

"ఏష ఉ ఏవ ప్రాణః, ఏష హీమాః సర్వాః ప్రజాః
ప్రణయతి। తస్యైతే ప్రాణాః స్వాః। స యదా స్వపితి -
అథైన మేతే ప్రాణాః స్వాః అపియన్తి। తస్మాత్
స్వాప్యయః। స్వాప్యయో హ వైతం స్వప్న ఇత్యాచక్షతే-
పరోక్షమ్। పరోఽక్షకామా హి దేవాః" — శ. బ్రా. 10-5-2-14.

ఈ యక్షిపురుషుడే (సూర్యమండలాంతర్గత పురుషుడే) ప్రాణము. ఇతడు సర్వప్రజలను ప్రణయనము జేయును, అనగా లోకాంతరము నొందించును. కాన 'ప్రాణ' శబ్దవాచ్యుడు. (ప్రణయతి, లోకాంతరం ప్రాపయతీతి ప్రాణః - సా. భా.). ప్రాణరూపుడగు అక్షిపురుషునకు ప్రాణాపానాదులును, ఇంద్రియములును స్వకీయములు (స్వాః). ఆ యక్షి పురుషు డెపుడు నిదురించునో యపు డీ యింద్రియాదిప్రాణములును ఆ పురుషునే పొందును (అపియన్తి). ఇట్లు 'స్వకీయుల అప్యయము (లయము)' గలవా డగుటచే నా పురుషునకు 'స్వాప్యయః' అని పేరు. ఇది యా పురుషునకు ప్రత్యక్షనామము. కాని దేవతలు పరోక్షప్రియులు. అందుచే 'స్వప్న' మనునది పరోక్షనామ మైనది. - అని శ్రుత్యర్థము.

ఇట్లు దేవతాతత్త్వమును దెలిపెడి ప్రత్యక్షపరోక్ష నామములు బెక్కులు గలవు. వానిని దెలిసి, దేవతాతత్త్వమును, భోక్తృభోగ్య స్వరూపమును, ఆహుతిస్వరూపమును, యజ్ఞాదిక్రియా సమగ్రస్వరూపమును గమనింపవలసి యున్నది. 'అగ్నియందు ఆహిత మైనది, అనగా ఆధానము జేయబడిన హవిస్సు - ఆహితి; దీని పరోక్షనామము ఆహుతి' - యని శ్రుతి తెల్పుచున్నది. అధియజ్ఞముగను, ఆధిదైవికముగను, ఆధ్యాత్మికము గను, హవిర్భోక్తయగు 'అగ్ని' యొక్క స్వరూపము నిట్లు శ్రుత్యను గుణముగ దెలిసిననే గాని 'ఆహుతి' యొక్క ఆహితిత్వము స్పష్టము గాదు. అట్టి యగ్నియందు సమంత్రకముగ నాధానము చేయబడు హవిస్సు 'ఆహుతి' యని యింతవరకు దెలిసినది. శ్రుతి యింకను ఆహుతి స్వరూపము నిట్లు వివరించుచున్నది.

ఆహుతి దేవతాహ్వానరూపము :-

"ఆహూతయో వై నామైతా యదాహుతయ ఏతాభి ర్వై దేవాన్ యజమానో హ్వయతి తదాహుతీనా మాహూతిత్వమ్।"

— ఐ. బ్రా. 1-2-2.

'ఆహుతులు' అని యేవి చెప్పబడుచున్నవో యవి ఆహూతులు. యజమానుడు వీనిచే దేవతల నాహ్వానించును. కాన నీ యాహుతులకు ఆహూతిత్వ ముపపన్న మగుచున్నది. అందుచే ఆహుతు లన దేవతాహ్వానరూపములు (హ్వాయ త్యాభి రితి తద్వ్యుత్పత్తిః। జుహోతి ధాతో రుత్పన్నః శబ్దః పూర్వం ప్రసిద్ధః। అయం తు హ్వాయతి ధాతో రుత్పన్న ఇతి విశేషః - సా.భా.)

ఆహుతి యనగా దేవత నుద్దేశించి హోమము చేయబడునది యను నర్థము మాత్రమే గాక, 'దేవతాహ్వానరూపము'- అను విశేషార్థ మిట ప్రదర్శింపబడినది. అందుచే భాష్యకర్తలు ఆహుతి శబ్దమున కీ రెండర్థము లను గ్రహించిరి. ఇంతే గాదు. ఆహుతి యాహ్వానరూపమగుటను శతపథశ్రుతి యింకొకవిధముగగూడ నిట్లు వివరించుచున్నది.

ఆహుతి యజమానాహ్వానరూపము :-

"అథ యా మేతా మాహుతిం జుహోతి। ఏషా హ వా అస్యాహుతి రముష్మిన్ లోక ఆత్మా భవతి। స యదైవంవి దస్మా ల్లోకాత్ ప్రైతి। అథైన మేషాఽఽహుతి రేతస్య పృష్ఠే సత్యాహ్వయతి। ఏహి, అయం వై త ఇహాత్మాఽ స్మీతి। తద్యదాహ్వయతి। తస్మా దాహుతి ర్నామ।"

— శ. బ్రా. 11-2-2-6.

యజ్ఞములయందు స్వాహాకారపూర్వకముగగాని, వషట్కారపూర్వకముగ గాని యొసగబడెడి యాహుతి, స్వర్గలోకమున హవిర్దాతయగు యజమానుని యాత్మయై, అనగా శరీరమై, యొప్పును. ఆహుతిస్వరూపము నిట్లు తెలిసికొనిన యజమానుడు స్వర్గమున కేగినపు డాతని వెనుక నిలిచి యా యాహుతి "ఇటు రమ్ము; నీయొక్క ఆత్మనై నే నిట నున్నాను"- అని

యా యజమాను నాహ్వానించును. ఇట్లు 'ఆత్మ' రూపమున నొప్పు యజమాను నాహ్వానించు నట్టిది యగుటజేసి 'ఆహుతి' యని సార్థకనామము- అని యర్థము. ఇట్లు ఆహుతులు యజమానాహ్వానరూపము లగుట ఆథర్వణికశ్రుతి వలనను దెలియును.

"ఏహ్యేహీతి త మాహుతయః సువర్చసః సూర్యస్య
రశ్మిభి ర్యజమానం వహన్తి। ప్రియాం వాచ మభివదన్త్యోఽ
ర్చయన్త్య ఏష వః పుణ్యః సుకృతో బ్రహ్మలోకః॥"

—ముండక. ఉ. 1-2-6.

ఈ శ్రుతివచనముల వలన ఆహుతులు స్వర్గాది సుకృతలోకములందు యజమానునకు ఫలభోగసాధనశరీరములై, అనగా మూర్తిమంతములై యొప్పి. యజమానుల నాహ్వానించునట్టివి యని తెలిసినది.

ఆహుతులు స్వాహాకృతములు :-

ఆహుతులు స్వాహాకార, వషట్కార పూర్వకముగ అగ్నియందు ఆహితము (ఆధానము చేయబడినవి) లయినపుడే ఆహుతిత్వమునొంది, యవి పైన దెల్పినటుల దేవతాహ్వానరూపములు, యజమానాహ్వాన రూపములు నయి యొప్పును. లేనిచో గావు.

"స్వాహాకృతాహుతి రేతు దేవాన్" — తై. బ్రా. 3-7-11-1.

"న హ వై తా ఆహుతయో దేవాన్ గచ్ఛన్తి యా
అవషట్కృతా వాఽస్వాహాకృతా వా భవన్తి।"

— కౌ. బ్రా. 12-4; శ. బ్రా. 9-3-6-14.

స్వాహాకార వషట్కార పూర్వకములుగాని యాహుతులు దేవతలకు చెందవే చెందవని యర్థము. ఇట్లు స్వాహాకారపూర్వకము లగుటచేతనే హవిస్సులకు స్వాహాకృతములను నామము వేదమున ప్రసిద్ధము.

"స్వాహాకృతాన్యా గహ్యాప హవ్యాని వీతయే"

— ఋ. 1-142-13.

"అస్య హోతుః ప్రదిశ్యృతస్య వాచి స్వాహాకృతం హవి రదన్తు దేవాః" — ఋ. 10-110-11 : నిరు. 8-21.

"స్వాహాకృతం స్వాహాకారబలాత్ మంత్రేణ ప్రక్షిప్తం హవిః"

— దుర్గాచార్యభాష్యం.

"స్వాహాకారేణ సంస్కృతం హవిః" — సా. భా.

స్వాహాకృతములగు నిట్టి హవిస్సుల స్వీకరించువారగుటజేసి దేవతలకును 'స్వాహాకృతయః' అని పేరు వేదమున ప్రసిద్ధము.

"తదాహుః కా దేవతాః ? స్వాహాకృతయ ఇతి, విశ్వేదేవా ఇతి బ్రూయాత్, తస్మాత్ 'స్వాహాకృతం హవిరదన్తు దేవా' ఇతి యజంతీతి, ఇతి" — ఐ. బ్రా. 3-13-5.

ఈ శ్రుతివచనమువలన దేవత లందఱును 'స్వాహాకృతి' నామకులని తెలియును.

స్వాహాకారము — శ్రుతి యాదేశము :-

స్వాహాకార మొనర్చియే హవిర్దానము చేయుడని శ్రుతియు పెక్కుచోట్ల నాదేశించుచున్నది.

"స్వాహా గాయత్రవేపసే హవ్య మింద్రాయ కర్తన"

— ఋ. 1-142-12.

సర్వదేవాత్మకుడు, సామరూపుడు (గాయత్రవేపసే) నగు ఇంద్రునకు హవిస్సు నర్పించుటకై స్వాహాకారము చేయుడు — అని యర్థము.

"స్వాహాయజ్ఞం కృణోతన నేంద్రాయ యజ్వనో గృహే"

— ఋ. 1-13-12.

యజమానుని గృహమున ఇంద్రుని ప్రీతికొఱకై స్వాహాయజ్ఞమును చేయుడు- స్వాహాకార సంస్కృతములైన హవిస్సులతో యజ్ఞమును నిర్వర్తింపుడని భావము.

'వేదవాక్ - స్వాహాకార - యజ్ఞ - అవినాభావ సంబంధము :—

ఇంతవరకును పై ప్రమాణములచే (1) స్వాహాకారముయొక్క వైశిష్ట్యము (2) అగ్నియొక్క దేవయోనిత్వము, యజమానుని దేవతా రూపత్వము (3) ఆహుతియొక్క ఆహితిత్వము, ఆహూతిత్వము, (4) భోక్తృభోగ్యస్వరూపము (5) హవిస్సుల స్వాహాకృతత్వము (6) దేవతల స్వాహాకృతిత్వము (7) స్వాహాకారవిషయమై శ్రుతి యాదేశము, (8) అందుచే స్వాహాకారపూర్వకములగు హవిస్సులకే స్వాహూతిత్వము - మున్నగువిషయములు స్పష్టము లయినవి. వీనివలన స్వాహాశబ్దమునకును, వేదవాక్కునకును, యజ్ఞాదికర్మలకును అవినాభావసంబంధము గల దనుటయు స్పష్టమైనది. శ్రుతి యీ సంబంధము నిట్లు స్పష్టీకరించుచున్నది.

'అథ యత్ — 'స్వాహా స్వాహా' ఇతి కరోతి । యజ్ఞో వై స్వాహాకారః । యజ్ఞ మేవైత దాత్మన్ ధత్తే । అత్రో ఏవ వాచం యచ్ఛతి । వాగ్వై యజ్ఞః । యజ్ఞ మేవైత దాత్మన్ ధత్తే।" శ. బ్రా. 3-1-3-27.

'యజ్ఞో వై స్వాహాకారః । యజ్ఞియ మేవైత దిదం సకృత్ సర్వం కరోతి ।' —శ. బ్రా. 7-2-3-44.

"వాగ్ఘి యజ్ఞః" — శ. బ్రా. 3. 1. 4. 2.

"అథ వాచం యచ్ఛతి। వాగ్వై యజ్ఞః। అవిక్షుబ్ధో యజ్ఞం తనవా ఇతి।" — శ. బ్రా. 1-1 2-2.

"అథ యద్దీక్షితః ఋచం వా యజుర్వా సామ వా వ్యాహరతి-
అభిష్ఠిర మభిష్ఠిర మేవైత ద్యజ్ఞ మారభతే। తస్మా దముత్రైవాంగుళీ ర్న్యచే దముత్ర వాచం యచ్ఛేత్।
అథ య ద్వాచం యచ్ఛతి వాగ్వై యజ్ఞః। యజ్ఞ మేవైత దాత్మన్ ధత్తే." — శ. బ్రా 3. 2-1-37,38.

యజ్ఞము హవిస్త్యాగాత్మకము: హవిస్త్యాగము స్వాహాకారపూర్వకము: స్వాహాకారము హవిస్త్యాగాదికమునుసర్వమును యజ్ఞియ మొనర్చును కావున స్వాహాకారము యజ్ఞాత్మకము; యజ్ఞము స్వాహాకారాత్మకము నగుచున్నది. మఱియు యజ్ఞము ఋగ్యజుఃసామాత్మక వేదమంత్రసాధ్యము: కావున యజ్ఞము వేదవాగాత్మకము. యజ్ఞదీక్షితుడగువాడు ఇట్టివాక్కును తనయందు నియత మొనర్చుకొనుటచే యజ్ఞమునే తనయందు ధరించినవాడగుచున్నాడు. కావుననే దీక్షితుడైన యజమానుడు న్యక్తాంగులియై (గుప్పిలిపట్టి), దేవతాసంబంధరహితమగు లౌకిక వాగ్వ్యవహారమును మాని, దైవీవాక్కునే అనగా సంస్కృతభాషనే యాశ్రయించుచు యజ్ఞనిర్వహణమున కావశ్యకములగు ఋగాది మంత్రోచ్చారణ సేయుచు, యజ్ఞము నాత్మయందు ధరించి యుండును - అని తాత్పర్యము. (చూ, తై.బ్రా. 1-2-1.) కావున వేదమంత్రరూపమగు వాక్కునకును, యజ్ఞాదికర్మకును స్వాహాకారమునకు నవినాభావసంబంధము.

స్వాహాశబ్దము - సార్థకత:-

ఇట్లు మహిమాన్వితముగ గీర్తింపబడెడి స్వాహాశబ్దము హోమసూచకమైన సాంకేతికపదము మాత్రమే కాదు: సార్థకమగు వాక్యము. దీని సార్థకత యాస్కనిరుక్తమున (8-20) నిట్లు వివరింపబడినది.

(1) స్వాహే త్యేతత్ సు ఆహేతి వా (సు ఆహ).
(2) స్వా వాగాహేతి వా (స్వా వాక్ ఆహ).
(3) స్వం ప్రాహేతి వా (స్వం ప్రాహ).
(4) స్వాహుతం హవి ర్జుహోతీతి వా (సు ఆ జుహోతి).

భాష్యకారు లందఱు యథోచితముగ నీ యర్థముల నన్నిటి గ్రహించిరి. (చూ. సా, భా. ఋ. 10-110-11; అ.వే .2-16-1 మొ.)
ఈ వ్యుత్పత్తుల నన్నిటిని బరిశీలించినచో స్వాహాస్వరూపము తేటపడ గలదు. ఈ నిర్వచనములలో నొక వైశిష్ట్యముగూడ గాననగును. అందుచే నాల్గవ వ్యుత్పత్తిని మొదట జూతము.

1) స్వాహుతం హవిర్జుహోతి (సు ఆ జుహోతి):—

దీనిని వ్యాఖ్యాత లిట్లు వివరించిరి.

"య దనేనైవ హవి ర్జుహోతీతి తదేవ సుష్ఠ్వాపాద్య యథావిధాన మగ్నౌ జుహోతీతి హవిఃప్రధానోఽత్ర నిర్దేశః" — దుర్గ. భాష్య.
"య దనేన స్వాహాకారేణ జుహోతి తదేవ సుష్ఠు మర్యాదయా జుహోతీతి" — నిఘంటువ్యాఖ్య. దేవరాజయజ్వ.

స్వాహాకార పూర్వకముగనే హవిస్సును హోమము జేయుట యనగా సౌష్ఠవమును (దివ్యత్వమును) ఆపాదించి యథావిధిగ హోమము చేయుట, లేక హవిస్త్యాగము చేయుట — అని యర్థము. అగుచో నీ దివ్యత్వాపాదన మెవరికి? ఎట్లు? వాగ్వై యజ్ఞః: యజ్ఞో వై స్వాహాకారః — ఇత్యాది శ్రుతుల ననుసరించి యజ్ఞము వేదవాగాత్మకము, స్వాహాకారాత్మకము. అట్టి యజ్ఞాది కర్మానుష్ఠాన సమయమున అగ్ని దేవయోనియై యావిర్భవించుటయు, దేవయోనియగు నా యగ్ని వలనను, స్వాహాకృతములగు నాహుతుల వలనను యజమానుడు దైవీసంపదతో నొప్పారు

టయు పైన వివరింపబడినవి. 'స్వాహా స్తోమస్య వర్ధనా' ఇత్యాది శ్రుతి వాక్యములవలన స్వాహాకారముచే, లేక స్వాహారూప వేదవాక్కుచే అభిష్టుతులు, అర్చితులు నగు దేవతలు స్తోత్రమునం దొకవిధమగు నతిశయము (దివ్యత్వము)ను ఆపాదించి స్తోతను వర్ధిల్లజేయుటయు పైన వివరింపబడినది. కాన స్వాహా యనగా (1) అగ్ని యందును (2) యజమానుని యందును (3) వేదవాగాత్మకమగు స్తుతి యందును (4) హవిస్సునందును—సౌష్ఠవమును (దివ్యత్వమును)ఆపాదించునది యని తాత్పర్యము. ఇట్టి శ్రుతితాత్పర్యమునే 'స్వాహాతం హవి ర్జుహోతి' యను వ్యుత్పత్తి ద్వారా యాస్కుడు ప్రదర్శించినట్లు గ్రహింపనగును. ఈ వ్యుత్పత్తివలన 'స్వాహా' యనునది 'దివ్యత్వాపాదక శక్తిరూప' మగుట తెలియును. దీని యందలి యీ వైశిష్ట్యము మిగిలిన మూడు వ్యుత్పత్తుల వలన గ్రహణముగ గాంచనగును.

2) స్వా వాక్ ఆహ - 'స్వాహా' వేదవాక్ :-

శ్రుతియే యీ వ్యుత్పత్త్యర్థము నొక యాఖ్యాయికారూపమున నిట్లు వివరించినది.

"ప్రజాపతి రగ్ని మసృజత। తం ప్రజా అన్వసృజ్యన్
త మభాగ ఉపాస్త। సోఽస్య ప్రజాభి రపాక్రామత్। త
మవరురుత్సమానో ఽన్వైత్। త మవరుధ న్నాశక్నోత్। స
తపో ఽతప్యత। సోఽగ్ని రుపారమతాతాపి వై స్య ప్రజాపతి
రితి। స లలాటా దుదమృష్ట।
తద్ ఘృత మభవత్। ....। త దగ్నౌ ప్రాగృహ్ణాత్। త
ద్వ్యచికిత్సత్। జుహవాని 3 మా హౌషా 3 మితి। త
ద్విచికిత్సాయై జన్మ, ఇతి। య ఏవం విద్వాన్ విచికిత్సతి।
వసీయ ఏవ చేతయతే, ఇతి। తం వా గభ్యవద జ్జుహుధీతి।

సోఽబ్రవీత్। క స్త్వమసీతి। స్వైవ తే వా గిత్యబ్రవీత్। సో
ఽజుహోత్ స్వాహేతి। త త్స్వాహాకారస్య జన్మ. ఇతి।
య ఏవగ్ం స్వాహాకారస్య జన్మ వేద। కరోతి స్వాహాకారేణ
వీర్యం, ఇతి। యస్యైవం విదుషః స్వాహాకారేణ జుహ్వతి।
భోగాయైవాస్య హుతం భవతి, ఇతి।" —తై.బ్రా. 2-1-2-1,2,3,4

"ప్రజాపతిచే నగ్నియు, నగ్నితోపాటు ప్రజలును సృజింపబడిరి. అగ్ని కొంతకాలము ప్రజాపతి నుపాసించుచు యజ్ఞభాగరహితు డైనందున ప్రజాపతినుండి ప్రజలతోపాటు తొలగి పోయెను. ఆ యగ్ని నడ్డగించుటకై ప్రజాపతి యాతని వెన్నంటెను. కాని యడ్డగింపలేకపోయెను. అంతట ప్రజాపతి తప మొనర్పగా నగ్నియు విడిచిపోవుట మానెను. తపస్సంతప్తుడైన ప్రజాపతి తన లలాటము నుండి స్వేదజలమును తుడిచెను. అది ఘృతమై యావిర్భవించెను. దాని నగ్నియందు హోమము చేయుటకై గ్రహించినంతనే - దీనితో నగ్నియందు హోమము చేయుటయా? మానుటయా?" యను విచికిత్స ప్రజాపతికి పొడమెను. ఇదియే విచికిత్సయొక్క జన్మ. లోకమున విచికిత్స యిట్లావిర్భవించినది.

ప్రజాపతికి గలిగిన యీ విచికిత్సోత్పత్తిని గూర్చి తెలిసికొని స్వయముగ నెవడు శాస్త్రార్థవిచారము చేయునో యాతడే వస్తుతత్త్వమును నిశ్చయించుకొనువాడు. అనగా వస్తుతత్త్వవిషయక నిశ్చయాత్మకజ్ఞానము కలుగు నని భావము.

అట్లు విచికిత్సాపన్నుడైన ప్రజాపతి నుద్దేశించి యశరీరిణియగు నొక వాక్కు 'జుహుధి— హోమము చేయుము'— అని పలికెను. నీ వెవరవు? అని ప్రజాపతి యడిగెను. నీ స్వభూతమైన వాక్కే నేను (స్వైవ తే వాక్) అని యా యదృశ్యవాణి పలికెను. అంతట ప్రజాపతి 'స్వాహా' యని యుచ్చరించుచు హోమము జేసెను ఇట్లు 'స్వా—అహ'

అను రెండు పదముల చేరికచే స్వాహాకార మావిర్భవించినది స్వాహాకారో త్పత్తిని (సార్థకతను, లేక స్వరూపమును) ఇట్లెవరు తెలిసికొందురో వారే స్వాహాకారముచే వీర్యమును (సౌష్ఠవమును, లేక దివ్యత్వమును) ఆపాదింతురు. ఎవరిట్లు తెలిసికొనినవారై స్వాహాకారపూర్వకముగ హోమము చేయుదురో ఆ యాహుతి స్వాహుతి యగుచు తద్భోగమునకే యగును. అనగా నభీష్టసిద్ధి నొసగుటకు సమర్థమగును"—అని శ్రుత్యర్థము.

ఈ శ్రుత్యర్థమును బరిశీలింతము :—

ఇచట యజ్ఞభాగవివర్జితు డగుటచే అగ్నియు, అగ్నితోపాటు ప్రజయు మొదట ప్రజాపతికి దూరమయిరి. కాని తప మాచరించిన యంతనే అగ్ని తిరిగి యావిర్భవించెను. అనగా అగ్నికి నెవరు భాగము కల్పింపరో వారి కగ్నియు, అగ్నితోపాటు ప్రజయు దూరమగుదురు. అట్లు గాక నియమవ్రతపరాయణులై శ్రుతిచోదిత కర్మానుష్ఠానతత్పరు లగుచు నెవరు తపఃసంపన్ను లగుదురో యట్టివారికి అగ్ని దేవయోనియై యావి ర్భవించును— అనెడి 'అగ్ని ర్వై దేవయోనిః' ఇత్యాది పూర్వోక్త శ్రుత్యుక్తార్థము ఇట సూచితము.

తపఃసంపన్నుడైన ప్రజాపతి లలాటభాగమున పొడమిన స్వేదము నగ్నియందు హోమము చేయుటకై గ్రహింప నది 'ఘృత' మయ్యెను. ఘృత మనగా నేయి యని సామాన్యముగ నర్థము. ఘృతమును 'తేజో' రూపముగ శ్రుతి[1] పెక్కుచోట్ల కీర్తించినది. కాన నిట హోమమునకు

1. 'ఘృతస్య నామ గుహ్యం యద స్తి జిహ్వా దేవానా మమృతస్య నాభిః'
—ఋ. 4-58-1,2; వా. సం. 17-88,90; తై.ఆ. 10-10-2.

"తేజోఽసి శుక్రమ స్యమృత మసి ధామ నామాసి ప్రియం దేవానా మనాధృష్టం దేవయజన మసి"—వా.సం.1-31 ; శ.బ్రా. 1-3-1-18.

"ఘృతం తేజో మధుమ దింద్రియమ్ । మయ్యయ మగ్ని ర్దధాతు"
— తై. ఆ. 3-11-8.

గ్రహింపబడిన ఘృతరూప హవిస్సును—తపస్సంభూత బ్రహ్మతేజోరూప ముగ గ్రహింపనగును. తపస్సంపన్ను లగువారు బ్రహ్మతేజోవిరాజితు లగుట ప్రసిద్ధమే. కాన కర్మానుష్ఠానసమయమున దేవయోనియై యావిర్భ వించెడి యగ్నియందు వ్రేల్చెడి ఘృతమును ప్రజాపతియొక్క బ్రహ్మ తేజోరూపముగ (దైవీసంపద్విలసితముగ) దర్శింప నగునని తాత్పర్యము.

అట్లావిర్భవించిన ఘృతమును ఆ యగ్నియందు హోమము చేయు టయా ? మానుటయా ? యను విచికిత్స (వివిధస్య కేతనస్య జ్ఞానస్య ఇచ్ఛా విచికిత్సా, కోటిద్వయాత్మకః సంశయ ఇత్యర్థః—సా.భా.) ప్రజా పతికి కలిగెను. అట్టి సందేహము సామాన్యముగ నందఱకు గలుగ వచ్చును. కాని యీ సందియములు తీఱు టెట్లు ? ప్రజాపతికి గల్గిన సందియము గూడ దానియంతట నది నివర్తింప లేదు. ఇది యతీంద్రియవిష యము. జన్మచే మహాభాగ్య సంపన్ను డగుటచే నశరీరిణియైన యొకవాక్కు 'సంశయింపకుము; హోమము జేయుము (జుహుధి)' అని ప్రబోధించినది. ఆ సందియమును తీర్చిన యదృశ్యవాక్కు ఏది ? అది ప్రజాపతికి స్వభూత మైన వాక్కు (స్వైవ తే వాక్) ఇట్లు ప్రజాపతికి స్వభూతమైన వాక్కు ఏది యగును ? ప్రజాపతికి స్వభూతయై సృష్టిరచనయందు సహకారిణియై విలసిల్లిన వాక్కు వేదవాక్కు—అని పూర్వము బ్రహ్మ, ఋషి, ప్రథమజా, తపోజాది శబ్దముల యందు వివరింపబడినది. కాన నిట సందియమును దొలగించుచు 'జుహుధి' యని కర్తవ్యమును బోధించిన వాక్కు వేదవాక్కే యగుట శ్రుతితాత్పర్యానుగుణమే యగును. ప్రజాపతికి వాక్కు స్వభూతము అని తాండ్య. కాఠక శ్రుతులును నిట్లు పేర్కొనుచున్నవి.

'ప్రజాపతి ర్వా ఇద మేక ఆసీత్ తస్య వాగేవ స్వ మాసీత్'

తాం. బ్రా. 20-14-2; కాఠ. సం. 12-5; 27-1.

ప్రజాపతి వాక్పతి యగుట శ్రుతులయందు ప్రసిద్ధము. (చూ. వాచస్పతి, బ్రహ్మణస్పతి, బృహస్పతి–శబ్దములు).

'ప్రజాపతి ర్వై వాక్పతిః' —శ.బ్రా. 3-1-3-2.

స మనసా వాచం మిథునం సమభవత్' —ఉ, బృ. 1-2-4.

కాన ప్రజాపతికి స్వభూతమైన వాక్కు వేదవాక్కే యగుట శ్రుతితాత్పర్య మని చెప్పనగును. మఱియు :—

స్వయం తే సరస్వతీ ఆహ - స్వాహా :-

శ్రీ భాస్కరమిశ్రుడు ఆ వాక్కు 'సరస్వతి' యని యిట్లు వ్యాఖ్యానించినాడు.

'స్వయం సరస్వతీ ఆహ బ్రూతే, సైవ తే వా గిత్యబ్రవీత్– ఇతి బ్రాహ్మణమ్। స్వయ మేవాహేత్యస్యార్థస్య ద్యోతకో ఽయం నిపాతః। ప్రదేశాంతరేఽపి విభక్త్యన్త సముదాయాత్మ నిపాతః స్వాహేతి, సంస్కారవిశేషానవధారణాత్ నావగృహ్యతే'

— నిఘంటువ్యాఖ్య – దేవరాజయజ్వ.

సరస్వతి యను నామము వాగ్దేవికిని. వేదవాక్కునకును ప్రసిద్ధము (చూ. భారతీశబ్దము). కాన శ్రీ భాస్కరమిశ్రుని వ్యాఖ్యానము ననుసరించి (స్వయం తే సరస్వతీ ఆహ – స్వాహా) ప్రజాపతికి స్వభూతయైన సరస్వతి వేదవాణియే యగుచున్నది. శ్రీ సాయణాచార్యులును స్వాహా శబ్దమునకు బెక్కుచోట్ల 'స్వకీయా సరస్వతీ ఆహ, స్వకీయా వా గాహ' – అనియే యర్థమును వ్రాసిరి. (చూ. తై. సం. 1-11-9-1 ; చిత్తిపన్న మంత్రములు)

కాగా, ప్రజాపతికి గల్గిన సందియమును ప్రజాపతికి స్వభూత మైన వేదవాక్కు తీర్చె ననుట స్పష్టము. అట్లే యీ వేదవాక్కు నెవరి కధ్యయనాదులద్వారా స్వభూత మగుచుండునో వారికి గల సందియము లన్నియు తదనుగ్రహముచే విడివడుచుండు నని తాత్పర్యము. ఇట్లనుటచే వేదము యొక్క వేదత్వము—అనగా అజ్ఞాతజ్ఞాపకత్వ మిట సూచిత మగు చున్నది. కాన స్వాహాపదము అడుగడుగున 'కర్మానుష్ఠానవిషయమున నెట్టి సంశయములు వలదు; యథావిధిగ జేయుడు' — అని బ్రహ్మకు స్వభూత మైన వాగ్దేవి యొక్క, అనగా సరస్వతియొక్క, ప్రబోధమును స్మరింప జేయునట్టిది. ఇదియుగాక :—

స్వః మహిమాం ఆహ - స్వాహా.-

స్వాహాకారోత్పత్తిని గూర్చిన యిట్టి యాఖ్యాయిక మైత్రాయణీ సంహితయందును (1-8-1) గలదు. కొలది మార్పులతో నిది శతపథ బ్రాహ్మణమునం దిట్లు గలదు.

> "స వ్యచికిత్సత్ జుహవాని ౩ మాహౌషా ౩ మితి। తం
> స్వో మహిమా ఒ భ్యువాద। జుహుధీతి। స ప్రజాపతిః
> విదాంచకార-స్వో వై మా మహిమాహేతి। స స్వాహే
> త్యేవాజుహోత్-తస్మా దు స్వాహే త్యేవ హూయతే।
> — శ. బ్రా. 2-2-4-6.

విచికిత్స నొందిన ప్రజాపతి తన మహిమయే 'జుహుధి—యని చెప్పి నట్లు (స్వో మహిమా ఆహ) తెలిసికొని స్వాహా యనియే హోమము చేసెను. అందువలన స్వాహా యనియే హోమము చేయబడుచున్నది—అని యర్థము. ప్రజాపతికి స్వభూతమైన ఈ మహిమ యేది యగును ? యీ మహిమ వాక్కే—యని శ్రుతియే స్వయముగ నిట్లు వివరించినది.

'వాగ్వా అస్య (ప్రజాపతేః) స్వో మహిమా' —శ.బ్రా. 2-2-4-4.

కాన ప్రజాపతికి స్వభూతమైన మహిమ పైన దెల్పినరీతి వేదవాక్కే యగుట స్పష్టము. వేదవాక్కు స్వభూత మగుచో (అధ్యయనాదుల ద్వారా) ప్రజాపతికి వలెనే మహిమరూపమై యొప్పి సందియముల దీర్చుచుండునని భావము. వేదవిదుని మహిమ వేదవాక్కే—యని తాత్పర్యము. ఇంతేకాదు.

'అగ్నేః స్వో మహిమా—ఈ వాక్కే అగ్నియొక్క స్వభూతమైన మహిమ యనియు శ్రుతి స్పష్టము జేయుచున్నది.

"స్వం మహిమాన మావహ, ఇతి" —తై. బ్రా. 3-5-3-1.

'తత్ స్వం మహిమాన మావోఢ్వా ఆహ। వాగ్వా అస్య (అగ్నేః) స్వో మహిమా। త ద్వాచ మావోఢ్వా ఆహ ।'

—శ.బ్రా. 1-4-2-17

"అస్య మహతో భూతస్య నిఃశ్వసిత మేతత్; పతంగో వాచం మనసా బిభర్తి" (ఋ. 10-177-2)— ఇత్యాది శ్రుతి ప్రామాణ్యముచే మొదట పరమేశ్వరునకు స్వభూతమై యొప్పిన వేదవాణియే పిదప ప్రజాపతికిని (హిరణ్యగర్భునకును), పిమ్మట నగ్నికిని (విరాడగ్నికి) స్వభూతమై— స్వమహిమాత్మకమై— విలసిల్లినది. అందుచే పరమేశ్వర, ప్రజాపతుల వలెనే యగ్నియు వాక్పతి యని ప్రసిద్ధుడైనాడు. కాన స్వాహారూపిణి యగు నీ వాక్కు 'అగ్నాయీ' యనియు గీర్తింపబడుచున్నది.

"తస్మా దగ్నే ర్వాచ శ్చ సంబంధాత్ అగ్నాయీ స్వాహా వాగిత్యుచ్యతే" —నిఘంటువ్యాఖ్య-దేవరాజయజ్వ.

'స్వాహాపతిః' అనియు అగ్ని శ్రుతులయందు (ఋ. 8-63-౬) గీర్తింపబడుట గలదు. కాన అగ్నియొక్క స్వాహాపతిత్వము 'వేదవాక్పతిత్వమే' యని గ్రహింపనగును.

ఈ 'స్వా వాక్ ఆహ', లేక 'స్వయం సరస్వతీ ఆహ', లేక 'స్వో మహిమా ఆహ' - అను నీ వ్యుత్పత్తుల ననుసరించి 'స్వభూత (స్వకీయ లేక ఆత్మీయ)గా జేసికొనుచో ప్రజాపతికి వలెనే విచికిత్సల బోగొట్టి కర్తవ్యమును బోధించుదానను' - అని వేదవాక్కు తన మహిమను తలపింప జేయుచు స్వాహారూపిణియై యడుగడుగున ప్రబోధించుచున్నది యని గుర్తింపనగును.

మఱియు 'స్వయం తే సరస్వతీ ఆహ' - ప్రజాపతికి స్వభూతమైన సరస్వతి యగు వేదవాక్కు చెప్పినది యను నీవ్యుత్పత్తి వేదవాక్కు యొక్క స్వతఃప్రమాణత్వమును గూడ దెలియజేయుచున్నది.

3) సు ఆహ - స్వాహా :-

అతీంద్రియ విషయములందు ప్రమాణమై, సంశయవిచ్ఛేదక మగుచు కల్యాణకరమగు నర్థమును (పురుషార్థమును) ప్రబోధించునట్టిది వేదమంత్రరూపవాక్కు. ఈ యర్థమే 'సు ఆహ స్వాహా' యను యాస్కుని మొదటి వ్యుత్పత్తిచే దెలియబడుచున్నది.

"అయ మర్థః యస్యాన్తే శ్రూయతే స హోమమంత్రః శోభన మర్థ మాహ' —నిఘంటువ్యాఖ్య-దేవరాజయజ్వ.

(చూ. దుర్గాచార్య, భా.

4) స్వం ఆహ-స్వాహా :-

స్వం ఆత్మానం ఆహ_ఆత్మను గూర్చి చెప్పునది యని యర్థము. ఈ నిర్వచనము ననుసరించి యాత్మస్వరూప ప్రబోధకము అని చెప్పుచో స్వాహాపదము స్వాధ్యాయశబ్దార్థమును తలపింపజేయునది యగును.

స్వాహా - వేదశరీరిణీ - పరాదేవతా (పరమాత్మా) :-

(1) ఇట్లు ఆత్మతత్త్వబోధకము గావుననే, పరదేవత స్వాహాశబ్ద ప్రతిపాద్యయు, స్వాహాకారాత్మికయు నగునని శ్రుతి చెప్పుచున్నది.

> "అవరం స్వాహాకారం కరోతి। పరాం దేవతామ్। ఏష వై స్వాహాకారః। య ఏష తపతి। ఏష ఉ ప్రవర్గ్యః। త దేత మేవైత త్ప్రీణాతి। తస్మా దవరం స్వాహాకారం కరోతి పరాం దేవతామ్।" — శ. బ్రా. 14-1-3-26.

> 'కథం స్వాహాకారస్య పరదేవతాత్మకతా? ఇతి। తత్రాహ। ఏష వా ఇతి। య ఏషః సూర్య స్తపతి। ఏషః ఖలు స్వాహాకారః, స్వాహాశబ్ద ప్రతిపాద్యః స్వాహాకారాత్మకో వా'
> —సా. భా.

పై శ్రుతివలన పరదేవతాస్వరూపుడగు నాదిత్యుడు స్వాహాశబ్ద ప్రతిపాద్యుడు, లేక స్వాహాకారాత్మకు డగుట తెలియును. అనగా వేద ప్రతిపాద్యుడు, వేదాత్మకుడు — అని తాత్పర్యము. "వేదై రశూన్య స్త్రిభి రేతి సూర్యః; సైషా త్రయ్యేవ విద్యా తపతి య ఏషోఽన్త రాదిత్యే హిరణ్మయః పురుషః" మున్నగు శ్రుతు లనేకము లాదిత్యుడు వేదాత్మకు డని కీర్తించినవి.

(2) ఇంతియే కాదు పరాదేవి యగు స్వాహాదేవి యొక్క స్వరూపమును ప్రశ్నోత్తరరూపమున షడ్వింశబ్రాహ్మణ మిట్లు వివరించుచున్నది.

> "స్వాహా వై కుతః సంభూతా? కస్య దుహితా? కేన ప్రకృతా? కిం గోత్రా? కత్యక్షరా? కతి పదా? కతి మాత్రా? కతి వర్ణా? కత్యుచ్ఛ్వాసా? కిం చాస్యాః శరీరమ్? కాన్యంగాని? కాని లోమాని? కతి శిరాంసి? కతి వా చక్షూంషి? కి మస్యా ఆస్యమ్? కిం ప్రావృతా? కౌ బాహూ? కౌ పాదౌ? క్వ చ స్థితా? కిమధిష్ఠానా? కథం చ స్వాహాం ప్రతిగృహ్ణాసి?"

"స్వాహా వై సత్యసంభూతా। బ్రహ్మణో దుహితా। బ్రహ్మప్రకృతా లాతవ్యసగోత్రా। త్రీణ్యక్షరాణి। ఏకం పదమ్। త్రయోఽ స్యై వర్ణాః। శుక్లః పద్మః సువర్ణ ఇతి। చత్వారోఽస్యై వేదాః శరీరమ్। షడంగాన్యంగాని। ఓషధి వనస్పతయో లోమాని। ద్వే చాస్యాః శిరసీ। ఏకం శిరోఽ మావాస్యా। ద్వితీయా పౌర్ణమాసీ। చక్షు శ్చంద్రాదిత్యౌ। ఆజ్యభాగౌ హుంకమ్। దక్షిణా ప్రాకృతా। బృహద్రథంతరమ్। ఋగ్యజుః సామగతిః। సా స్వాహా। సా స్వధా। స వషట్కారః। సైషా దేవేషు వషట్కారభూతా ప్రయుజ్యతే। పితృయజ్ఞేషు స్వధాభూతా। శకటీముఖీం పృథివీ మంతరిక్షేణ విపర్యేతి। తస్యా అగ్ని ర్దైవతమ్। బ్రాహ్మణో రూపమ్। యత్కామా స్తే జుహుమ స్త న్నో అస్తు। వయం స్యామ పతయో రయీణామ్। స్వాహేతి।" — ష. వి. బ్రా. 5-7.

ఇట స్వాహాదేవివర్ణనము విరాట్పురుషవర్ణనమును బోలియుండుట స్పష్టము. షడంగసహిత వేదచతుష్టయ మీమె శరీరము; స్వాహా స్వధా వషట్కారము లామెయే; బ్రహ్మయొక్క దుహిత; సత్యసంభూత; ఋగ్యజుఃసామ సంచారిణి; వేదవిదుడగు బ్రహ్మనిష్ఠు డామె రూపము - ఇత్యాది వర్ణనలు 'స్వాహా యన వేదాత్మిక యగు వాగ్దేవియే' - యగుట స్పష్టము జేయుచున్నవి.

(3) 'స్వాహా'యన పరమేశ్వర వశవర్తిని యగు మాయాశక్తి యని గోపాల పూర్వతాపనీయోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది.

"కృష్ణం సంతం విప్రా బహుధా యజన్తి 'గోవిందం సంతం బహుధా రపన్తి। గోపీజనవల్లభో భువనాని దధ్రే' స్వాహాశ్రితో జగ దైజయ త్సురేతాః॥" —1-3.

''కేనేదం విశ్వం సంసరతీతి?.... .. స్వాహేదం సంసరతీతి ....
కా స్వాహేతి?....తన్మాయా చేతి।'' 1-1.

శ్రీకృష్ణుడు పరబ్రహ్మ, తదాశ్రిత మాయాశక్తియే స్వాహాదేవి. ఈ మాయాశక్తిచేతనే జగత్తు ప్రాదుర్భవించును - అని యర్థము.

(4) లలితాసహస్రనామ స్తోత్రమునందు పరాదేవత స్వాహా, స్వధా శబ్దములతో బేర్కొనబడినది.

(5) దేవీభాగవతమునగూడ నీ పరాదేవతయే గాయత్రి యనియు, స్వాహా యనియు, స్వధా యనియు, వేదకలాస్వరూపిణి యనియు నిట్లు వర్ణింపబడినది.

"గాయత్ర్యసి ప్రథమవేదకలా త్వ మేవ।
స్వాహా స్వధా భగవతీ సగుణార్ధమాత్రా।
ఆమ్నాయ ఏవ విహితో నిగమో భవత్యా
సంజీవనాయ సతతం సురపూర్వజానామ్।" —దేవీ.భా. 3-4-45.

ఇంతేగాక, వేదములందుగల స్వాహాప్రసిద్ధిని, ప్రశస్తిని దేవీభాగవత మిట్లు చెప్పుచున్నది.

న వేదా స్త్వా మేవం కలయితు మిహాపన్నపటవో
యత స్తే నోచు స్త్వాం సకలజనధాత్రీ మవికలామ్।
స్వాహాభూతా దేవీ సకల మఖహోమేషు విహితా
తదా త్వం సర్వజ్ఞా జనని ఖలు జాతా త్రిభువనే॥

జననీ! భువనేశ్వరీ! నీవు సకల జన ధాత్రివి. సర్వజ్ఞత్వాది గుణసంపన్నవు. వైకల్యరహితవు. పరాదేవతవు. వేదములు నిన్ను ఈ రీతిగా వర్ణింపకపోవచ్చును. అంతమాత్రమున నిన్ను బ్రతిపాదించుటకు

వేదములు సమర్థములు కావు—అని యనుట తగదు. వేదములచే సకల యజ్ఞక్రియా హోమములయందు 'స్వాహా రూపమున నీవు' విధింపబడితివి. అందుచేతనే సర్వజ్ఞవగా త్రిభువనముల యందు ప్రసిద్ధి గాంచితివి—అని యర్థము.

ఈ శ్లోకమును పరిశీలించుచో నిఖిల వేదములకు లక్ష్యము ఏ పరాదేవతయో సర్వజ్ఞయగు నా దేవియే స్వాహారూపమున నిఖిలయజ్ఞాది కర్మలయందు స్మరింపబడుట శ్రుతి తాత్పర్య మని స్పష్టమగుచున్నది. కర్మలయందు హోమవాచకమై (హవిర్దానవాచకమై) శ్రూయమాణమగు స్వాహాపదము పర దేవతావాచకము—పరతత్త్వప్రతిపాదకము—అని భావము. ఇట్లు శ్రుతి, పురాణాది గ్రంథ సందర్భము ననుసరించి స్వాహా యను 'స్వం ఆత్మానం ఆహ—ఆత్మను లేక పరాదేవతను బోధించునది'—యను నర్థము పర్యవసిత మగుచున్నది.

స్వాహాశబ్దము—వ్యుత్పత్తుల క్రమగతి:—

వాఙ్నామము, లేక వాగ్దేవతానామమగు నీ స్వాహాశబ్దమునకు వ్యుత్పత్తుల ప్రదర్శించుటలో యాస్కమహర్షి యొక్క క్రమగతిని సూచించుచున్నట్లు తోచును.

(1) అందు మొదటి వ్యుత్పత్తి 'సుష్ఠు ఆహ స్వాహా' — శోభన మర్థ మాహ — అనగా మంత్రముయొక్క కల్యాణార్థ బోధకత్వమును తెలియజేయునది యని యర్థము. ఇది ఎట్లు తెలియజేయును?

(2) స్వా వాక్ ఆహ స్వాహ — ఇది పరమేశ్వరునకును, ప్రజాపతికిని, అగ్నికిని స్వభూతయైన వాక్కు యొక్క లేక వాగ్దేవత యొక్క సంబోధరూపము. కావుననే—

(3) స్వం ప్రాహ స్వాహా — ఆత్మను, లేక పరాదేవతను ప్రబోధించునది; అనగా అట్లు ప్రబోధించు పరాదేవతావాచకమగు మంత్రము. అందుచే—

(4) స్వాహుతం హవి ర్జుహోతీతి స్వాహా - దివ్యత్వము నాపాదించు హవిర్దాన వాచకము—అగుచున్నది.

ఇట్లు యాస్కమహర్షిచే ప్రదర్శింపబడిన పై నిర్వచనములు మాత్రమే గాక సంప్రదాయానుగతములైన యితరనిర్వచనములును గలవు.

(1) సుష్ఠు హూయతే యయా ఇతి స్వాహా
సా పంచమప్రయాజదేవతా। —భట్టభాస్కరః. (తై.బ్రా). 3-5-5-1.

(2) సుష్ఠు ఆహ్వయతి స్వాహా —క్షీరస్వామి (నిఘంటువ్యాఖ్య)

(3) (స్వాహా సుహుత మస్తు) అథవా స్వస్యాహానమస్తు।
హానం హా న హా అహాః స్వస్యాహా ఉపరిత్యాగ ఆత్మనో
ద్రవ్యస్య వేతి। —దేవత్రాతభాష్యమ్-అగ్నిహోత్రచంద్రికా. 26.

ఇందు మొదటి వ్యుత్పత్తి ననుసరించి 'ఆహ్వానింపబడు దేవత' - యని యర్థము. రెండవవ్యుత్పత్తి ననుసరించి 'దేవతాహ్వానవాచకము. ఇక మూడవనిర్వచనము ననుసరించి తనను (యజమానుని) తనచే విధిపూర్వకముగ త్యాగము చేయబడిన ద్రవ్యమును ఆ దేవత త్యజింపకుండు గాక' - యని యర్థము. అనగా స్వాహాకార పూర్వకముగ హవిస్సు నొసగుచో నా దేవత తప్పక దానిని గ్రహించి, యజమానుని విడువక యుండు (దేవతాత్వము నావేశింపజేయు) నని తాత్పర్యము. ఇది 'సుహుత మస్తు' అని సామాన్యముగ జెప్పు నర్థమునకు తాత్పర్య వివరణాత్మకమే యగును. ఇట్లీ వ్యుత్పత్తులు భిన్నములుగ గన్పట్టినను యాస్కమహర్షి చూపిన వ్యుత్పత్తులలో నంతర్భావము నొందుచునే యున్న వనవచ్చును.

ఒక శబ్దమున కనేకార్థము లుండవచ్చును. ఆ యా యర్థముల నా యా ప్రకరణానుసారముగ గ్రహించెడి సంప్రదాయము గలదు. కాని స్వాహాశబ్దమున కట్లుగాక దీనికి ప్రదర్శింపబడిన యర్థముల నన్నియెడల గ్రహింపవలసి యున్నది. భాష్యకారుల యభిప్రాయము నట్లే కన్పట్టును. ఉదా:- "ప్రాణాపానౌ మృత్యోర్మా పాతం స్వాహా" —అ.సం. 2-16-1. అను మంత్రము నందలి స్వాహాపదమునకు శ్రీసాయణాచార్యులు 'స్వాహుత మస్తు' అని సామాన్యముగ నర్థము చెప్పి - "స్వాహా ఇతి దేవానాం హవిర్దానే........అక్షరార్థస్తు యాస్కేనోక్తః" - అని యనుచు స్వాహాశబ్దమునకు యాస్కమహర్షి ప్రదర్శించిన నిర్వచనముల నన్నింటిని జూపినాడు. అందుచే హవిర్దానవాచకముగ సామాన్యముగ గ్రహింపబడెడి యీ స్వాహాశబ్దమునకు అక్షరార్థము నన్నియెడల నీ నిర్వచనముల ద్వారా గ్రహింపనగు ననియే శ్రీ సాయణాభిమతము.

కాని యిట నొక విశేషము. మంత్రాంతమున శ్రూయమాణ మగు స్వాహా శబ్దమునకు పై యర్థము లన్నియు గ్రాహ్యములే యగును. కాని మంత్రమధ్యపతిత మగు స్వాహా శబ్దము హవిఃప్రదానవాచకము గాదు. అట్టియెడల హవిర్దానరూపార్థము తప్ప మిగిలిన యర్థములు గ్రాహ్యము లగుచుండును. ఉదా:—

"మనసస్పత ఇమం నో దివి దేవేషు యజ్ఞమ్। స్వాహా దివి
స్వాహా పృథివ్యాం స్వాహాన్తరిక్షే స్వాహా వాతేధాం స్వాహా॥"
— అ. సం. 7-97-8.

"హే మనసస్పతే । సర్వభూతానా మంతరాత్మతయా మన
సోఽపి పతే, హే దేవ । ....నః అస్మదీయం ఇమం
యజ్ఞం, దివి ద్యులోకే వర్తమానేషు దేవేషు అగ్న్యాదిషు
ధాం, పురుషవ్యత్యయః, ధాః ధేహి స్థాపయ ఇతి, స్వాహా

సరస్వతీ. అబ్రవీ దిత్యర్థః। మంత్రమధ్యవర్తినాం స్వాహా శబ్దానాం ప్రదానార్థత్వాభావాత్। వస్తుత శ్చ స్వాహాశబ్దస్య వాక్కర్తృక వచనరూపేఽర్థే నిరుక్తత్వాత్ స్వా స్వకీయా ప్రజాపతిసంబంధినీ వాక్, ఆహ అబ్రవీత్ ఇతి స్వాహా శబ్దస్య అర్థ ఉక్తః। తథాచ తైత్తిరీయకే వాక్ప్రజాపత్యో రుక్తిప్రత్యుక్తిరూపం వాక్యం ఏవం శ్రూయతే 'తం వాగ భ్యవదత్ — త త్స్వాహాకారస్య జన్మ' ఇతి। అనంతరం ద్యుపృథివ్య న్తరిక్షలోకేషు అస్మదీయం యజ్ఞం, ధాః స్థాపయేతి సరస్వత్యాహేతి।తతః అస్మదీయం యజ్ఞం, వాతే సర్వకర్మాధారే ధాః స్థాపయ। యస్మాత్ అయం యజ్ఞః ప్రవృత్తః తత్రైవ వాతే స్థాపయ। వాతా దధ్వర్యుః యజ్ఞం ప్రయుజ్త్రే' (తై. బ్రా. 3-3-9-12) ఇతి శ్రుతేః। 'మనసస్పతినా దేవేన వాతా ద్యజ్ఞః ప్రయుజ్యతామ్' ఇతిచ (తై. బ్రా. 3-7-4-1)। స్వాహా ఇదం ఆజ్యం స్వాహుత మస్తు ఇతి అంతిమ స్వాహాశబ్దస్య ప్రదానార్థతా।" —సా. భా.

సర్వభూతాంతరాత్మయై మనస్సునుగూడ నియమించెడి యో దేవా! మా యీ యజ్ఞమును ద్యులోకమున నుండెడి అగ్న్యాదిదేవతలయం దుంచుము— అని స్వాహాదేవియగు సరస్వతి యాదేశించుచున్నది. అట్లే పృథివ్యన్తరిక్ష ద్యులోకముల యందును, సర్వకర్మాధారభూతమగు వాతమునందును—అనగా సర్వ పరిస్పందాశ్రయభూతుడగు పరమేశ్వరుని యందును[1] – స్థాపింపు మని స్వాహాదేవి యగు సరస్వతి యాదేశించుచున్నది. మనసస్పతియగు నా దేవుని కై యీ హవిస్సు సుహుత మగు గాక – అని మంత్రార్థము.

1. 'మనసస్పతినా మనసోఽపి పాలయిత్రా పరమాత్మనా దేవేన దీప్తిమతా వాతాత్ సర్వపరిస్పందాశ్రయాత్ ప్రాణాత్ ఈశ్వరస్య క్రియాశక్తిరూపాత్'
— భట్టభాస్కరః. తై. బ్రా. 3-7-4-1.

'వాతః వాయుః సర్వపరిస్పందాశ్రయః క్రియాశక్తి రీశ్వరస్య'
— భట్టభాస్కరః – తై. బ్రా. 3-3-9-12.

ఈ మంత్రమున మంత్రమధ్యమునందును, మంత్రాంతమునందును స్వాహాశబ్దము గలదు. మంత్రమధ్య పతిత మగు స్వాహాశబ్దము హవిర్దాన వాచకము గాదు. అందుచే నా స్వాహాపదమునకు సరస్వతి యనియే యర్థము. 'స్వా స్వకీయా ప్రజాపతిసంబంధినీ వాక్ ఆహ' యనెడి పూర్వోదాహృత శ్రుత్యుక్తనిర్వచనము ననుసరించి ప్రజాపతికి స్వభూత మైన వాగ్దేవి లేక వేదవాక్కు పలికెను – అను నర్థమే యిట గ్రహింప వలెను. అనగా యజ్ఞమును, పైన చెప్పినట్లు, సర్వత్ర విలసిల్లజేయుట సరస్వతి యాదేశముగా గ్రహింప నగును. మంత్రాంతమున గల స్వాహా శబ్దము హవిర్దానవాచకము గూడ నగును. అందుచే నీ హవిస్సు సుహూత మగుగాక యని యర్థవివరణము శ్రీ సాయణులచే జేయబడినది.

కాన స్వాహాశబ్దము వాఙ్నామములలో బఠింపబడుట యుక్తమే. ఇది యితర వాఙ్నామముల వలె కేవలము వాఙ్నామ మగుటయే గాదు; మహామహిమాన్వితమైన యొక మంత్రముగ గూడ నగుచు విలసిల్లినది. అందుచేతనే కొన్ని యెడల నే యితర వేదమంత్రము నుచ్చరింపకయే కేవలము స్వాహామంత్రోచ్చారణము జేయవలె ననెడి సంప్రదాయము శ్రుతులయందు గలదు. (వా. సం. 7-2; మై. సం. 1-8-1; కా. సం. 4-13; ఐ. బ్రా. 7-2-3; శ. బ్రా. 2-2-1-4; తై. బ్రా. 2-1-2-3 మొ.)

పై గ్రంథసందర్భము ననుసరించి స్వాహా యనగా— 'మంత్రగత కల్యాణార్థబోధకము, ప్రజాపతి స్వభూత వేదవాక్ప్రబోధరూపము, లేక వాగ్దేవతాప్రబోధరూపము, ఆత్మతత్త్వ ప్రబోధకము, పరదేవతావాచకము నగుచు దివ్యత్వము నాపాదించు హవిర్దానవాచక మగు మంత్రరాజము' – అని యర్థము. ఇట్టిది గనుకనే యెన్ని వాఙ్నామము లున్నను నిత్యనైమిత్తికకర్మలు, యాగాదికర్మలు నన్నియు స్వాహాకారపూర్వక మగు నాచమనక్రియతో నారంభ మగుచున్నవి.

ఇక శ్రుతి స్మృత్యనుగుణముగ స్వధాస్వరూపమును బరిశీలింతము.

స్వధా

విధానం ధర్మాణాం ప్రథితప్రణిధానం రసజుషాం
నిధానం విద్యానాం విమలపరిధానం శ్రుతవతామ్ ।
సమాధానం బుద్ధేః ధన మిహ పరం నః ప్రవిమలం
స్వధాం దేవీం వందే వినుతగుణధామీం బుధనుతామ్ ॥

స్వస్మిన్ దధానా హ్యఖిలం చ విశ్వం
స్వధాఽసి శక్తి ర్జగతః పితు స్త్వమ్ ।
పత్నీ పితౄణాం వసు రుద్ర సూర్య
ప్రభా స్వధా పాహి హరిప్రియా నః ॥

— వేదమాతృ స్తవః.

స్వాహాదేవియే పితృయజ్ఞములందు స్వధారూపిణి యగుచున్నదని షడ్వింశబ్రాహ్మణము చెప్పుచున్నది. (పితృయజ్ఞేషు స్వధాభూతా). కావున స్వాహాశబ్దమువలెనే స్వధాశబ్దము కూడ మహిమాన్విత మని తెలియును. దేవీభాగవతముకూడ 'స్వాహా స్వధా నామ మనుప్రభావైః' అను శ్లోకమున నీ విషయము స్పష్టము చేసినట్లు పూర్వము వివరింపబడినది. 'పితృభ్యః స్వధాస్తు, పితృభ్యః స్వధా నమః'-అని పితరుల నుద్దేశించి స్వధాకారము చేయబడుచుండును. ఇదియే పితరుల నుద్దేశించిన వషట్కారము (స్వధా నమ ఇతి వషట్కారః - శ. బ్రా. 2-6-1-24) అని చెప్పబడుచున్నది. ఇట్టి స్వధాస్వరూపమును బరిశీలింతము.

స్వధా - భోగ్య వస్తుజాతరూప ప్రకృతి - పారమేశ్వర శక్తి. (భోగ్య - భోక్తృస్వరూపము) :-

స్వధాశబ్దమునకు సామాన్యముగ 'అన్నము' అను నర్థము ప్రసిద్ధము. అన్నమనియు, హవిర్లక్షణమగు అన్న మనియు మాత్రమే గాక, భోగ్య

మగు వస్తుజాత మంతయు అన్నశబ్దముచే నుపలక్షిత మగుచుండును. అనగా నా యా యింద్రియములచే నుపభోగ్యమగు శబ్ద స్పర్శ రూప రస గంధాదిరూప విషయజాత మంతయు అన్నశబ్దముచే నుపలక్షితము. కాన భోగ్యవస్తుజాతమయ మగు ప్రకృతి యంతయు 'స్వధ' యగును. అందు చేతనే ద్యావాపృథువులు రెండును స్వధారూపములుగ ప్రసిద్ధములైనవి (ఋ. 9-86-10). వైదికనిఘంటువునందును 'స్వధే, పురంధీ' యనుచు ద్యావాపృథివీనామములలో స్వధాశబ్దము పఠింపబడినది. ఇంతేకాక ప్రకృతికి గారణభూతమగు పారమేశ్వరశక్తికి (మాయాశక్తికి) స్వధ యని పేరు.

"తిరశ్చీనో వితతో రశ్మి రేషా మధః స్విదాసీ ౩ దుపరి
స్విదాసీ ౩ త్ । రేతోధా ఆసన్ మహిమాన ఆసన్ స్వధా
అవస్తా త్ప్రయతిః పరస్తాత్ ।"

— ఋ. 10-129-5; వా. సం. 33-74; తై. బ్రా. 2-8-9-5.

ఇది 'నాస దాసీత్' సూక్తములోని మంత్రము. దీనికి బూర్వ మంత్రములందు అవిద్యా-కామ-కర్మలు సృష్టిహేతువులుగ వివరింప బడినవి. వీనిలో కర్మలకు కామము, కామమునకు అవిద్యయు గారణ ములు. అనగా జగత్సృష్టిహేతువు అవిద్య. ఈ యవిద్యయే మాయాశక్తి. ఈ శక్తికే 'స్వధా' అని పేరు స్వధాశబ్దవాచ్యములైన ఈ మాయా-అవిద్యాది శబ్దములచే చెప్పబడెడి యే పారమేశ్వరశక్తి కలదో యది జగత్తునకు అవమమగు (స్వధా అవస్తాత్) కారణము. అనగా స్వతంత్ర మగు కారణము కాదు. ఈ మాయాశక్తికి నాధారభూతుడగు పరమాత్మయే ప్రయతి (ప్రయతితా భోక్తా - సా. భా. ఋగ్భాష్య) భోక్తయు, మాయాధ్యక్షుడు నగు ఈ పరమాత్మయే జగత్తుకు నుత్తమకారణము (ప్రయతిః పరస్తాత్). ఇట్లు జగత్కారణభూతు లయిన శక్తి-పరమాత్మలే ప్రకృతిపురుష (భోగ్య-భోక్త) లని శాస్త్రములందు నిర్దేశింపబడుచున్నారు.

'ఏవం స్వధాశబ్దవాచ్య మాయాఽవిద్యాది శబ్దేనాభిధీయమానా పారమేశ్వరశక్తి రవస్థా దధమం కారణమ్। ప్రయతిః సా శక్తిః। ప్రయతతే యస్మిన్ పరమాత్మని సోఽయం శక్తి ప్రయత్నాధారః పరమాత్మా ప్రయతిః। స చ పరస్తాత్ పరమ ముత్తమం కారణమ్। తా వేతౌ శక్తిపరమాత్మానా వేవ జగత్కారణభూతౌ ప్రకృతిపురుషా వితి శాస్త్రేషు వ్యపదిశ్యేతే' —సా.భా.తై.బ్రా. (చూ.వా.సం; ఉవట మహీధర భాష్యములు).

ఇంతే కాదు. ఈ సూక్తముననే రెండవ ఋక్కునందును సర్వజగత్కారణ రూప మాయాశక్తిగా ఈ స్వధాశక్తి పేర్కొనబడినది.

"ఆనీ దవాతం స్వధయా త దేకమ్"

—ఋ. 10-129-2; తై.బ్రా. 2-8-9-4.

'స్వస్మిన్ ధీయతే ధ్రియత ఆశ్రిత్య వర్తత ఇతి స్వధా మాయా, తయా తద్ బ్రహ్మైక మవిభాగాపన్న మాసీత్'

— సా.భా, ఋగ్భాష్య.

ప్రలయకాలమున స్వధారూపిణి యగు మాయాశక్తి బ్రహ్మ నాశ్రయించి యుండి యా బ్రహ్మకంటె వేఱుగాక, బ్రహ్మతో నవిభాగాపన్నమై యుండెను. అనగా బ్రహ్మతత్త్వము మాయతో నవిభాగాపన్నమై ప్రాణితమై (ఆనీత్ అవాతం) యుండె నని భావము. ఈ శ్రుత్యర్థమే శతశ్లోకి యందు శ్రీ శంకరభగవత్పాదులచే నిట్లు వివరింపబడినది.

"అప్రాణం శుద్ధ మేకం సమభవ దథ త న్మాయయా కర్తృసంజ్ఞమ్।
తస్మా దన్యచ్చ నాసీత్ పరివృత మజయా జీవభూతం తదేవ॥"

— శతశ్లోకి 24

పై శ్రుతియందలి 'స్వధా'శబ్దము 'మాయయా- అజయా' అను శబ్దములచే నిట వివరింపబడుట గమనార్హము. కనుక పై శ్రుతివాక్యముల ననుసరించి పరమేశ్వరుడు భోక్తయు, పురుషుడు ననియు, స్వధ యనగా జగత్కారణ మగు పారమేశ్వరశక్తి యనియు నంతేగాక తత్కార్యము, భోగ్యజాత రూపము నగు ప్రకృతి యనియు దెలిసినది. 'స్వస్మిన్ ధీయతే ధ్రియత ఆశ్రిత్య వర్తత ఇతి స్వధా' అను నిర్వచనము ననుసరించి ఆత్మయందు, లేక పరమాత్మయందు ఆశ్రయించి యుండునది యని యర్థము. దీని ననుసరించియు బ్రహ్మ నాశ్రయించి యుండి, తదభిన్నమై యొప్పునది యనెడి పై శ్రుత్యర్థమే సంగ్రహముగ నిరూపిత మగుచున్నది.

స్వధా—భోక్త లేక పరమేశ్వరుడు:—

భోగ్యజాతరూపమగు ప్రకృతిగాని, లేక తత్కారణమగు మాయా శక్తిగాని తదధిష్ఠానరూపుడును చిద్రూపుడు నగు ఏ బ్రహ్మ నాశ్రయించి వరలుచుండునో ఆ బ్రహ్మయు స్వధాశబ్ద వాచ్య డగుట శ్రుతుల యందు ప్రసిద్ధమే.

> "త్రిధా హితం పణిభి ర్గుహ్యమానం గవి దేవాసో ఘృత
> మన్వవిందన్। ఇంద్ర ఏకగ్ం సూర్య ఏకం జజాన వేనా
> దేకగ్ం స్వధయా నిష్టతక్షుః ।" —తై. ఆ. 10-10-3.

"చత్వారి శృంగా త్రయో అస్య పాదా' — అనునది దీని పూర్వమంత్రము. దానిచే ప్రణవము యొక్క స్వరూపమును, ఈ మంత్రముచే తత్ప్రతి పాద్యార్థమును ప్రపంచింపబడినది. ఈ మంత్రమునందలి 'ఘృత' శబ్దముచే స్వప్రకాశాత్మకమగు బ్రహ్మతత్త్వము చెప్పబడుచున్నది. ఆ బ్రహ్మతత్త్వము శరీరమున 'విశ్వ-తైజస-ప్రాజ్ఞ' రూపముగను, బ్రహ్మాండమున 'విరాట్-హిరణ్యగర్భ-అవ్యాకృత' తత్త్వరూపముననూ—ఇట్లు త్రివిధముగ విలసిలు

చుండును (త్రిధాహితం). ఇట్టి తత్త్వమును సాత్త్వికులై, యంతర్ముఖులై, దివ్యశక్తిసంపన్నులైన పురుషులు వేదాత్మిక యగు గోవునందు అనగా వేదవాక్కునందు దర్శింతురు (గవి దేవాసో ఘృత మన్వవిందన్). ఇట్టి బ్రహ్మతత్త్వరూపమగు ఘృతము దుర్జ్ఞేయము; శ్రోతలు లేక ఉపదేష్టలు నగు ఆచార్యులు ఈ ఘృతమును గాపాడుచుందురు(పణిభిః గుహ్యమానం). అనగా గురూపదేశైకలభ్య మని యర్థము.

ఇంద్రుడనగా నిట పరమైశ్వర్యయుక్తు డగు విరాట్పురుషుడు. సూర్యు డన నిట హిరణ్యగర్భుడు. వేను డనగా సర్వదుఃఖరహితము, కమనీయము నగు అవ్యాకృత – ఈశ్వరతత్త్వము. వీరిలో ఇంద్రుడు జాగరణమునకును, సూర్యుడు స్వప్నమునకును, వేనుడు సుషుప్తికిని గారకులు. కాని యీ ముగ్గురును ఈ జాగ్రత్స్వప్నసుషుప్తులకు స్వతంత్రముగా కారకులు. కారు. ఇట స్వధా యన, చిద్రూపుడగు (చైతన్యరూపుడగు) బ్రహ్మ యని యర్థము. అట్టి స్వధ చే – చిద్రూపుడగు బ్రహ్మ చే నావిష్టులై ఈ యింద్ర–సూర్య–వేనులు జాగ్రత్స్వప్న సుషుప్తులను రూపొందించుచున్నారు (స్వధయా నిష్టతక్షుః) – అని యర్థము. ఇందలి స్వధా శబ్ద మిట్లు నిర్వచింపబడినది.

"స్వస్మిన్నేవ ధీయతే ఉవస్థాప్యత ఇత్యాశ్రయాంతర రహితా బ్రహ్మరూపా చిత్ స్వధా శబ్దేనోచ్యతే, 'స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి స్వే మహిమ్ని 'ఇతి శ్రుత్యంతరాత్ । తయా స్వధయా బ్రహ్మరూపయా చితా' — సా. భా.

కాన పై నిర్వచనము ననుసరించి 'స్వధా' యన 'తనయందే ప్రతిష్ఠితమై యుండునది; అనగా ఆశ్రయాంతర రహితము' – అని యర్థము. ఆశ్రయాంతరరహితుడు బ్రహ్మయే. అందుచే స్వధాశబ్ది

వాచ్యుడైనాడు. 'స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి స్వే మహిమ్ని' అను శ్రుత్యుక్తార్థమే యిట స్వధాశబ్ద నిర్వచనము ద్వారా ప్రదర్శింపబడినది.

ఇట్లు స్వప్రతిష్ఠితు డగుటచేతనే పరమేశ్వరుడు 'స్వధృతః' అనియు గీర్తింపబడినాడు. "స్వేనైవ ఆత్మనా ధార్యత ఇతి స్వధృతః, 'స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి స్వే మహిమ్ని' ఇతి శ్రుతేః"

— శం. భా; విష్ణుసహస్రనామస్తోత్రమ్

కాగా, భోగ్యము–భోక్త; ప్రకృతి–పురుషుడు; లేక శక్తి – శక్తిమంతుడు - ఇరువురును స్వధారూపులు, లేక స్వధాశబ్దవాచ్యులు నగుదురని తెలిపినది. జగత్కారణభూతు లగుటచే 'జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ' - అని యీరీతిగ వీరిరువురు జగత్పితరులుగ బ్రసిద్ధులైనారు.

స్వధా = త్రయీవిద్య :—

ఆశ్రయాంతరరహితుడై జగత్ప్రతిష్ఠా హేతువైన బ్రహ్మ స్వధాశబ్దవాచ్యు డయినట్లు, ఆశ్రయాంతర రహితయై జగత్ప్రతిష్ఠా హేతువై స్వతఃప్రమాణమై విరాజిల్లు వేదవిద్యయు (చూ. ప్రతిష్ఠా|శబ్దము) పై 'స్వస్మిన్ ధీయతే' - యను నిర్వచనము ననుసరించి స్వధాశబ్దవాచ్యము గూడ నగును.

"యా మైరయం శ్చంద్రమసి స్వధాభిః" — వా. సం.1-28.

'స్వధాశబ్దో యద్యప్యన్నవాచీ, తథాప్యత్రాన్న హేతుభూతా వేదత్రయీ కథ్యతే। యాం చంద్రమసి బ్రహ్మణా దధుః (శ. బ్రా 1_2_5_19) ఇతి శ్రుతేః'

— మహీధరభాష్య (చూ. ఉవటభాష్య)

ఈ వాజసనేయశ్రుతి యందలి 'స్వధాభిః' యనుపదమును శతపథశ్రుతి 'బ్రహ్మణా' యని వివరించినది. బ్రహ్మ యన వేదము. కాన నిట

స్వధ (స్వధాభిః) యన త్రయీవిద్య యని వివరింపబడినది. ('బ్రహ్మణా మంత్రేణ-ఏతచ్చ స్వధాభి రిత్యస్య వ్యాఖ్యానమ్' — సా.భా.శ.బ్రా. 1-2-5-19.

కనుక నిట్లు వేదవిద్యయు, తత్ప్రతిపాద్యుడగు బ్రహ్మయు - ఇరువురును గూడ స్వధాశబ్దవాచ్య లగుట గమనార్హము. వేదవాణియు తత్ప్రతిపాద్యుడగు బ్రహ్మయు నిరువురును గూడ వేద, బ్రహ్మ, ఋషి, స్వాహా శబ్దవాచ్య లగుట పూర్వము జూచితిమి. అట్లే యిపుడు స్వధా శబ్దవాచ్య లగుటయు గాననగును.

అగ్ని వాయు సూర్యులు (వసు-రుద్ర-ఆదిత్యులు) పితరులు; స్వధారూపులు :-

జగత్పిత యయిన పరమేశ్వరు నాజ్ఞానువర్తులై లోకయాత్రను నిర్వహించెడి అగ్ని - వాయు - సూర్యులు పితరు లని శ్రుతులందు ప్రసిద్ధము.

"తిస్రో మాతౄ స్త్రీన్ పితౄన్ బిభ్ర దేక ఊర్ధ్వ స్తస్థౌ"
— ఋ. 1-164-10.

ఈ ఋక్కునందు జగత్పాలకులును, లోకత్రయాభిమానుల నగు అగ్ని-వాయు-సూర్యులు ముగ్వురు పితరులుగను, సస్యవృష్ట్యాదుల పెంపొందింపజేయు భూ ర్భువః సువర్లోకములు మూడును మాతలుగను నిర్దేశింపబడినవి. ఈ మాతాపితరులను అద్వితీయుడు నమహీయుడు నగు పరమేశ్వరుడు భరించుచున్నట్లును, అతడీ ముగ్వురి కంటె నతీతుడై యూర్ధ్వముగ నున్నట్లును (బిభ్ర దేక ఊర్ధ్వ స్తస్థౌ) ఇట చెప్పబడినది.

అగ్నివాయుసూర్యులు లోకత్రయాభిమానదేవతలు. ఈ విషయ మును బృహద్దేవత యిట్లు తెల్పుచున్నది.

"వ్యాహృతీనాం సమస్తానాం దైవతం తు ప్రజాపతిః।
వ్యస్తానా మయ మగ్ని శ్చ వాయుః సూర్య శ్చ దేవతా॥"
— బృ.దే. 2-124.

'భూః-భువః-స్వః' - అను నీ మూడును వ్యాహృతులు. సమష్టిగ నీ మూడింటికి ప్రజాపతి దేవత. వ్యష్టిగ వీనికి అగ్ని వాయు సూర్యులు క్రమముగ దేవతలు. లోకత్రయపాలకు లగుటచే నీ ముచ్చురును పితరులుగ పై ఋక్కునందు జెప్పబడిరి. పితరులగు నీ అగ్ని వాయు సూర్యులు 'స్వధా' రూపులుగను ఋగ్వేదమున నిట్లు కీర్తింపబడుచున్నారు.

"త్రిభిః పవిత్రై రపుపో ద్ధ్యర్కం హృదా మతిం జ్యోతి రనుప్రజానన్ । వర్షిష్ఠం రత్న మకృత స్వధాభి రాది ద్ద్యావా పృథివీ పర్యపశ్యత్॥ — ఋ- 3-26-8.

ఇయ్యది 'అగ్ని రస్మి జన్మనా జాతవేదాః (చూ. వేదశబ్దము) అను మంత్రము తరువాతిది. పరతత్త్వమును సాక్షాత్కరించుకొనిన యగ్ని ముక్తపురుషుడై తన సర్వాత్మకత్వానుభవమును ఆవిష్కరించు కొనుట యిట వివరింపబడినది. (అగ్న్యద్వైతవాదినీ త్రిష్టుప్-మహీధరః).

అగ్నివాయుసూర్యులు జగత్పావనులు, కాన పవిత్రులు. పవిత్రు లగు నీ ముచ్చురికంటెనుగూడ వారిచే అర్చనీయుడగు ఆత్మను అతి పవిత్రునిగా ముక్తపురుషుడైన అగ్ని దర్శించెను. ఇట్లు దర్శించిన అగ్ని యత్యుత్తమమగు స్వాత్మరూపమును స్వధారూపులయిన అగ్ని వాయు సూర్యులచే రమణీయముగ నొనర్చెను (రత్న మకృత స్వధాభిః). అనగా నగ్ని వాయు సూర్యులు ఆత్మస్వరూప మగు జగత్తునందు భోగ్యజాతమును ప్రవర్తింపజేసి రమణీయముగ నొనర్చి రని భావము. 'యస్మిన్ జ్ఞాతే సర్వం జ్ఞాతం భవతి'-ఆత్మ స్వరూపము దెలిసినంతనే సర్వము దెలియ

బడగనే, ఆ యాత్మయందు ప్రతిష్ఠితమైన ద్యావాపృథివ్యాత్మకమగు (స్థూల సూక్ష్మ) జగత్తు నంతయు స్వాత్మరూపముగ నగ్ని దర్శించెను – అని యర్థము.

ఈ మంత్రమున అగ్ని వాయు సూర్యులు జగత్పావను లగుటచే బవిత్రులుగను, భోగ్యజాతమును ప్రవర్తింప జేసి ముల్లోకముల ధరించు వారగుటచే స్వధారూపులుగను గీర్తింపబడినారు. ఈ కారణము చేతనే అగ్ని–ఇంద్రాదులు 'స్వధావాన్, స్వధాపతిః, స్వధావః' – అని యీ రీతిగ శ్రుతులయందు ప్రసిద్ధులయినారు (ఋ. 1-95-4; 1-173-6; 1-63-6; 1-36-12; 6-44-1,3 మొ.).

> 'స్వధాభిః, స్వేన లోకాన్ దధాతీతి స్వధా, తైః
> అగ్నివాయుసూర్యైః' — సా. భా.

ఆత్మచే, లేక పరమాత్మచే, ప్రేరితులయి లోకముల ధరించువారు – అని యర్థము. ఇట్లు స్వధారూప భోగ్యజాతమయ మగు లోకత్రయమును బాలించెడి పితరులగు అగ్ని వాయు సూర్యులును స్వధారూపులుగ బ్రసిద్ధులయినారు. అనగా 'భోగ్యము–భోక్త' – ఇరువురును స్వధారూపులు లేక స్వధాశబ్దవాచ్యు లగుట గమనార్హము.

అగ్ని వాయు సూర్యులు వేదత్రయాత్మకు లగుట శ్రుతిప్రసిద్ధమే (చూ. భారతీశబ్దము). అందుచేగూడ స్వధారూప వేదాత్మకు లగుటచే గూడ నీ ముప్వురును స్వధారూపు లగుటయు దెలియనగును.

స్వధా – జీవుని భోగము; భోగాయతనమగు శరీరము :–

> "అపాఙ్ ప్రాఙేతి స్వధయా గృభీతోఽమర్త్యో
> మర్త్యేనా సయోనిః" — ఋ, 1-164-38; నిరు. 14-23.

ఆత్మ, లేక జీవుడు మరణధర్మము లేనివాడు. భూతాత్మక మగు దేహము మరణధర్మము గలది. అయ్యును జీవుడు దేహముతోపాటు సమానస్థానము గలవాడు, లేక సమానోత్పత్తి గలవాని వలె నొప్పుచున్నాడు. (అమర్త్యో మర్త్యేన సయోనిః). మఱియు నమర్త్యుడగు నీ జీవుడు స్వధావశుడై, అనగా స్వకర్మవశుడై లేక భోగాయతన శరీరాభిమానియై (స్వధయా గృభీతః) అశుభకర్మ నాచరించి యధోగతి నొందును. (అపాఙ్ ఏతి): పుణ్యకర్మల నాచరించి యూర్ధ్వగతి నొందును (ప్రాఙ్ ఏతి) - అని యర్థము.

> 'స్వధయా అన్నోపలక్షిత తద్భోగేన గృభీతః। యద్వా స్వధాశబ్దేన అన్నమయం శరీరం లక్ష్యతే, తేన గృహీతః సన్'
>
> — సా. భా.

ఇట స్వధాశబ్దము స్వకీయభోగమునకును, అన్నమయ శరీరమునకు నుపలక్షక మని చెప్పబడినది. భోగమునకు గాని, శరీరమునకు గాని స్వధ (అన్నము) నిమిత్త మగుటచే స్వధాశబ్దము వాని నిట నుపలక్షింప జేయుచున్నది. జీవుడు స్వధాగృహీతుడై జీవించుటను గూర్చి ఋగ్వేదము మఱియొక ఋక్కున నిట్లు చెప్పుచున్నది.

> "జీవో మృతస్య చరతి స్వధాభి రమర్త్యో మర్త్యేనా సయోనిః"
>
> — ఋ. 1-164-30.

అమర్త్యుడగు జీవుడు మర్త్యమగు దేహముతో సమానస్థానము లేక ఉత్పత్తి గలవాడై, మృతదేహమును విడిచి స్వధలతో జరించుచుండును. అనగా 'స్వ విద్యాకర్మల' ననుసరించి చరించును; పుత్రాదిదత్తములగు స్వధలతో హవిస్తర్పణములతో దృప్తుడై చరించుచుండు ననియు నర్థము. కావున జీవుని యాతాయాతమునకు గారణము స్వధలు. అవి యేవి ? అవి

జీవుని వెంట నంటి వచ్చు విద్యాకర్మలు, పూర్వప్రజ్ఞయు నగును. ఈ విషయమును బృహదారణ్యకశ్రుతి యిట్లు వివరించుచున్నది.

"తం విద్యాకర్మణీ సమన్వారభేతే, పూర్వప్రజ్ఞా చ"

— బృ. ఉ. 4-4-2.

"తం పరలోకాయ గచ్ఛంత మాత్మానం, విద్యాకర్మణీ .... విద్యా సర్వప్రకారా విహితా ప్రతిషిద్ధా చ, అవిహితా ఽప్రతిషిద్ధా చ, తథా కర్మ విహితం ప్రతిషిద్ధం చ, అవిహిత మప్రతిషిద్ధం చ, సమన్వారభేతే సమ్య గన్వారభేతే అన్వాలభేతే అనుగచ్ఛతః,పూర్వప్రజ్ఞా చ పూర్వానుభూత విషయా ప్రజ్ఞా, అతీత కర్మఫలానుభవవాస నేత్యర్థః। సా.చ వాసనా ఽపూర్వకర్మారంభే కర్మవిపాకే చాంగం భవతి। తేనా ఽసా వప్యన్వారభతే .... తస్మా దేత త్త్రియం శాకటికసంభార స్థానీయం పరలోకపథ్యదనం విద్యాకర్మ పూర్వప్రజ్ఞాఖ్యమ్।"

— శం. భా.

శరీరమునుండి యుత్క్రమించు జీవునివెంట యాత దార్జించిన విద్యాకర్మలు రెండును ననుగతము లగుచుండును. విద్య యనగా 'శాస్త్రవిహితము, అవిహితము, శాస్త్రనిషిద్ధము, అనిషిద్ధము' నగు విద్య యని యర్థము. అట్లే కర్మ యనగా 'శాస్త్రవిహితము, అవిహితము, శాస్త్రనిషిద్ధము, అనిషిద్ధము' నగు కర్మ యని యర్థము, ఇట్టి విద్యాకర్మలు రెండును జీవుని ననుగమించుచుండును. ఇంతే కాదు. పూర్వప్రజ్ఞయు ననుగమించును. పూర్వప్రజ్ఞ యనగా పూర్వానుభూత విషయమైన ప్రజ్ఞ యని యర్థము. అనగా నతీత కర్మఫలానుభవ వాసన. ఇట్టి యపూర్వప్రజ్ఞ, లేక వాసన (సంస్కారము) అనుగత మగుచుండుట చేతనే జీవుడు నూతన శరీరముల దాల్చి పూర్వానుభూత విద్యాసంస్కార బలముచే వివిధవిద్యలయందు

(గాన, చిత్రకర్మాది విద్యలందును) ఎక్కువ యభ్యాసము లేకయే కౌశలము గల్గియుండుటయు, లేక యెన్ని సౌకర్యము లున్నను ఎంత యభ్యాస మొనర్చినను కౌశలము గడింపలేక పోవుటయు సంభవించుచున్నది. కాన వాసనావైచిత్ర్యమే యా యా కర్మలయందు ప్రవృత్తికి, నివృత్తికిని గారణము. కాగా 'విద్యా-కర్మ-పూర్వప్రజ్ఞ'లను నీ మూడును జీవుని అనుగమించు చుండునని భావము.

ఈ బృహదారణ్యక శ్రుతి ననుసరించి పై రెండు ఋక్కులలోని 'అమర్త్యః స్వధయా గృభీతః; జీవః మృతస్య చరతి స్వధాభిః' అను వాక్యములకు జీవుడు 'విద్యా-కర్మ-పూర్వప్రజ్ఞ' లనెడి స్వధలతో భోగ శరీరముతో ఊర్ధ్వాధోలోకముల జరించుచుండు ననియే తాత్పర్యమును గ్రహింపనగును.

జీవేశ్వరులు - స్వధాశక్తి :-

ఇట గమనింపవలసిన యంశములు గలవు.

ఆశ్రయాంతరరహితు డగుటచే పరమేశ్వరునకు స్వధ యని పేరు. అట్లే ఆశ్రయాంతరరహితమై స్వతఃప్రమాణమై పరమేశ్వరునియందు ప్రతిష్ఠితమై యుండెడి త్రయీవిద్యకును స్వధ యని పేరు. పరమేశ్వరాధిష్ఠితమై విలసిల్లెడి ప్రకృతికిని, మాయాశక్తికిని స్వధ యని పేరు. కాన భోక్తయు, పురుషుడు నగు పరమేశ్వరుడును, భోగ్యవస్తుజాతమయ మగు ప్రకృతియు, పారమేశ్వరశక్తియు, సృష్టికార్యమునందు పరమేశ్వరునకు సహకారిణియై విలసిల్లు త్రయీవిద్యయు, అగ్ని వాయు సూర్యులు —అంతయు స్వధారూపమే యగుట దర్శించితిమి.

కాని ప్రకృతికి లేక మాయాశక్తికి, లేక త్రయీవిద్యకును గల స్వధాత్వము వేఱు పురుషుడును భోక్తయునగు పరమేశ్వరునకు గల స్వధాత్వము వేఱు కావచ్చును. ప్రకృతిగాని, మాయాశక్తిగాని, త్రయీ-

విద్యగాని, అగ్ని వాయు సూర్యులుగాని పురుషుని (పరమేశ్వరుని) కంటె అనన్యము లగుటచే పురుషునియందు గల స్వధాత్వము వీనియందును ననుగత మగుచుండునని గ్రహింపనగును. కాన వీవి యందుగల భిన్నభిన్న స్వధాత్వముల దర్శించుచు, వీనియం దనుగతమై యనువృత్త మగుచుండు స్వధాత్వమును (స్వప్రతిష్ఠితత్వమును) దర్శింపవలెను. అనగా వీనియం దనుగతమగుచుండెడి స్వధారూప బ్రహ్మతత్త్వమును దర్శింపవలసి యున్నది. అపుడే దీనికి గల స్వధాత్వము పరమేశ్వరుని స్వధాత్వము కంటె భిన్నము గాదని తెలియును.

మరియొక విశేషము: చిద్రూపుడైన పరమేశ్వరుడు స్వధా (మాయా) గృహీతశరీరుడై వసురుద్రాదిత్యరూపములతో (స్వధలతో) స్వాత్మరూపమగు జగత్తును రమణీయమొనర్చి (త్రిభిః పవిత్రైః.... రత్న మకృత స్వధాభిః) చరించుచున్నాడు. అట్లే అమర్త్యుడగు జీవుడును స్వధాగృహీతశరీరుడై కర్మ-విద్యా-పూర్వప్రజ్ఞలతో (స్వధలతో) జరించు చున్నాడు (స్వధయా గృభీతః; స్వధాభిః చరతి) కాని యిట భేదము గలదు. 'పరమేశ్వర వశవర్తినియైన స్వధ సృష్టిస్థితిలయములకు గారణము జీవుడు .స్వధా (అవిద్యావశుడై స్వకర్మానుగుణముగ) నూర్ధ్వాధోలోకముల నొందుచు జరించుచున్నాడు' — అని గ్రహింపదగును.

అగుచో నిట్లు స్వకర్మపరవశు లయి యూర్ధ్వాధోలోకముల బరి భ్రమించెడి జీవులు పితృదేవత లెట్లగుదురు? శ్రాద్ధాదులచే నెట్లు తృప్తు లగుదురు? తామే యశక్తు లగుచు వారు పుత్రాదుల నెట్లు తరింప జేయ గలరు? — ఈ విషయముల బరిశీలింపవలసి యున్నది.

వసురుద్రాదిత్యులు-పితృపితామహప్రపితామహులు :—

భూర్భువస్సువర్లోకపాలకు లగు అగ్ని వాయు సూర్యులు పితరు లనియు స్వధారూపు లనియు బూర్వము దెల్పబడినది. ఈ అగ్నివాయు

సూర్యులే వసురుద్రాదిత్యరూపులు (చూ-భారతీశబ్దము). వీరే శ్రాద్ధదేవులగు పితరులు.

"వసురుద్రాదితిసుతాః పితరః శ్రాద్ధదేవతాః ।
ప్రీణయన్తి మనుష్యాణాం పితౄన్ శ్రాద్ధేన తర్పితాః ॥

ఆయుః ప్రజాం ధనం విద్యాం స్వర్గం మోక్షం సుఖాని చ ।
ప్రయచ్ఛన్తి తథా రాజ్యం ప్రీతా నృణాం పితామహాః ॥
— యాజ్ఞ. స్మృ. 1-10-269,70; అగ్ని. పు. 163-40,41.

వసురుద్రాదిత్యులు శ్రాద్ధదేవతలగు పితరులు. శ్రాద్ధముచే తర్పితులై, వీరు మనుష్యపితరులను తృప్తిసందింతురు. మఱియు నీ వస్వాదిపితరులు ప్రీతులగుచో ఆయుష్య ప్రజాధనాది ఫలములను, స్వర్గ మోక్ష సుఖములను నొసగుదురు[1] - అని యర్థము.

1. విజ్ఞానేశ్వరీయమ్ :- న హ్యత్ర దేవదత్తాదయ ఏవ శ్రాద్ధకర్మణి సంప్రదానభూతాః పిత్రాది శబ్దై రుచ్యన్తే, కింత్వధిష్ఠాతృ వస్వాది దేవతాసహితా ఏవ। యథా దేవదత్తాది శబ్దై ర్న శరీరమాత్రాది. నా ప్యాత్మమాత్రం. కింతు శరీర విశిష్టా ఆత్మాన ఉచ్యన్తే, ఏవ మధిష్ఠాతృ దేవతాసహితా ఏవ దేవదత్తాదయః పిత్రాది శబ్దై రుచ్యన్తే। అత శ్చాధిష్ఠాతృదేవతా వస్వాదయః పుత్రాదిభి ర్దత్తే నాన్నపానాదినా తృప్తాః సంత స్తా నపి దేవదత్తాదీం స్తర్పయన్తి, కర్తౄం శ్చ పుత్రాదీన్ ఫలేన సంయోజయంతి। యథా మాతా గర్భపోషణా యాన్యదత్తేన దోహదాన్నపానాదినా స్వయ ముపభుక్తేన తృప్తా సతీ స్వ జఠరగత మపత్యం తర్పయతి, దోహదాన్నాది ప్రదాయిన శ్చ ప్రత్యుపకారఫలేన సంయోజయతి తద్వ ద్వసవో రుద్రా అదితిసుతాః ఆదిత్యా ఏవ యే పితరః పితృ-పితామహ-ప్రపితామహ శబ్దవాచ్యాః న కేవలం దేవదత్తాదయ ఏవ శ్రాద్ధ దేవతాః శ్రాద్ధకర్మణి సంప్రదానభూతాః కింతు మనుష్యాణాం పితౄన్ దేవదత్తాదీన్ స్వయం శ్రాద్ధేన తర్పితా స్తర్పయన్తి జ్ఞానశక్త్యతిశయయోగేన- కించ న కేవలం పితౄం స్తర్పయన్తి అపి తు శ్రాద్ధకారిభ్యః ఆయుః — రాజ్యం చ శాస్త్రోక్త మన్యదపి ఫలం స్వయం ప్రీతాః పితామహాః వస్వాదయః ప్రయచ్ఛంతితి।.

స్వకృతములగు శుభాశుభకర్మల ననుసరించి స్వర్గనరకాదుల బొందుచుండెడి మనుష్యపితరులు పుత్రాదులచే నొసగబడెడి యన్నపానాదులచే నెట్లు తృప్తి నొందుదురు? తృప్తి నొందినను అశక్తు లగుటచే వారు పుత్రాదులకు స్వర్గాదిఫలముల నెట్లీయగలరు? - అను శంకలకు సమాధానములుగ పై స్మృతివచనములు ప్రవర్తిల్లినవి.

శ్రాద్ధకర్మయందు ఉద్దిష్టులగు పితరులు (సంప్రదానభూతాః) మనుష్యపితరులే. కాని వారు వసురుద్రాదిత్యరూపులుగ నర్చింపబడుచుందురు. ఇది సంప్రదాయము. అనగా మనుష్యపితరులగు దేవదత్తాదులు మాత్రమే. యిట పితృశబ్దముచే గ్రహింపబడుట లేదు, దివ్యపితరులును శ్రాద్ధదేవులు నగు వసు-రుద్ర-ఆదిత్యులచే నధిష్ఠితులగు దేవదత్తాదిరూప మనుష్యపితరులే యిట పితృక్రియలయందు 'పితృ' శబ్దముచే గ్రహింపబడుచున్నారు.

లోకమున దేవదత్తాది శబ్దములచే కేవలము శరీరముగాని, కేవలము ఆత్మగాని గ్రహింపబడక శరీరవిశిష్టమగు నాత్మయే వ్యవహారమున గ్రహింపబడుచున్నది. అట్లే అధిష్ఠాతృ దేవతాసహితులగు దేవదత్తాది మనుష్యపితరులే యిట పితృ-పితామహ-ప్రపితామహ శబ్దములచే గ్రహింపబడుచుందురు. అధిష్ఠాతృదేవతలగు వస్వాదులు పుత్రాదులచే నొసగబడెడి హవిస్తర్పణాదులచే తాము తృప్తు లగుచు దేవదత్తాది మనుష్యపితరుల దృప్తి నొందింతురు; కర్తలగు పుత్రాదులకు ఆయుఃప్రజాది వివిధఫలముల నొసగుచుందురు.

గర్భపోషణకై యితరులచే నొసగబడెడి దోహదాన్నపానాదులచే దాను తృప్తి జెందుచు తల్లి స్వగర్భస్థశిశువును గూడ తృప్తి నొందించును. గర్భదోహదమునకై యన్నపానాదుల నొసగిన యితరులను ప్రత్యుపకారా

హేమాద్రి (చతుర్వర్గచింతామణి) యందును శ్రాద్ధమునం దుద్దిష్ట లగు పితరు లెవరు? వస్వాదులా? లేక మనుష్యపితరులా? వీరికి సముచ్చయమా, లేక వికల్పమా?' — ఇత్యాది విషయము లన్నియు విపులముగ చర్చింపబడినవి. వివిధ స్మృతి పురాణ[1] వచనములకు సమన్వయము జూపి, యివి యన్నియు నభేదదృష్టిని బోధించు వచనములే- యని నిర్ణయము చేయబడినది.

"అభేదదృష్టివిధయో వై తే। అయం తు పక్షః సిద్ధాన్తతయాఽ-
భ్యుపగంతుం న్యాయ్యః। అయ మేవ హ్యాచారే దృశ్యతే।
అయ మేవ హి సర్వేషాం విశ్వరూపాదీనాం సమ్మతః।
అయ యేవ హ్యనవద్యః"

— హేమాద్రి - శ్రాద్ధకల్ప-దేవతానిర్ణయప్రకరణమ్

---

1. నందిపురాణమున బ్రహ్మ విష్ణు మహేశ్వరులు పితృ పితామహ ప్రపితామహరూపులుగ జెప్పబడిరి.

"విష్ణుః పితాఽస్య జగతో దివ్యో యజ్ఞః స ఏవ చ।
బ్రహ్మా పితామహో జ్ఞేయో హ్యహం చ ప్రపితామహః॥"

భవిష్య పురాణమున నిట్లు గలదు.

"అనిరుద్ధః స్వయం జ్ఞేయః ప్రద్యుమ్న శ్చ పితా స్మృతః।
సంకర్షణ స్తు జనకో వాసుదేవ స్తు తత్పితా॥"

అనిరుద్ధుడు స్వయంకర్త. ప్రద్యుమ్న సంకర్షణ వాసుదేవులు పితృపితామహ ప్రపితామహులు — అని యర్థము.

"ప్రథమో వరుణో జ్ఞేయః ప్రాజాపత్య స్తథాఽపరః।
తృతీయోఽగ్నిః స్మృతః పిండో హ్యేష పిండవిధిః స్మృతః॥"

వరుణ-ప్రాజాపత్య-అగ్నులు పిండరూపులగు పితృపితామహప్రపితామహులు - అని యర్థము.

ఆదిత్యపురాణమున మాస-ఋతు-సంవత్సరములు పితృపితామహప్రపితామహు లని చెప్పబడినది.

"మాసా శ్చ పితరో జ్ఞేయా ఋతవ శ్చ పితామహాః।
సంవత్సరః ప్రజానాం చ సుష్ఠ్వైకః ప్రపితామహః॥"

పై యాజ్ఞవల్క్య, మను, దేవలాది స్మృతివచనముల ననుసరించి నిర్ణయసింధుకర్తయు (కమలాకరభట్టు) 'తదభేద ధ్యానార్థమ్'- అనియే యనినాడు. కనుక పితృ-పితామహ-ప్రపితామహులను వసు-రుద్ర-ఆదిత్యులకంటె నభిన్నులుగ దర్శింపవలె ననియే యన్నిటి తాత్పర్యము. బ్రహ్మపురాణమునం దింకను 'పితరులను-స్వధను' గూర్చి యిట్లు చెప్పబడినది.

"అగ్ని ర్వాయు శ్చ సూర్య శ్చ స్థానం హి భవతా మితి।
బ్రహ్మ విష్ణు శ్చ రుద్ర శ్చ భవతా మధిపూరుషాః॥

ఆదిత్యా వసవో రుద్రా భవతాం మూర్తయ స్త్విమాః।
యోగినో యోగదేహాశ్చ యోగధారాశ్చ సువ్రతాః॥

కామతో విచరిష్యధ్వం ఫలదాః సర్వజన్తుషు।
స్వర్గస్థాన్ నరకస్థాంశ్చ భూమిస్థాంశ్చ చరాచరాన్॥

నిజ యోగబలేనై వాఽప్యాయయిష్యధ్వ ముత్తమాః।
ఇయం మూర్జా శశిసుతా కీలాలమధువిగ్రహా॥

భవిష్యతి మహాభాగా దక్షస్య దుహితా స్వధా।
తత్రేయం భవతాం పత్నీ భవిష్యతి వరాననా॥"—14-101 నుండి 105

'పితరులకు అగ్ని-వాయు-సూర్యలోకములు స్థానములు; వసు-రుద్ర-ఆదిత్యులు మూర్తులు; బ్రహ్మ-విష్ణు-మహేశ్వరు లధిపూరుషులు, వసురుద్రాదిత్యరూపులగు నీ పితరులు యోగులై, యోగశరీరధారు లగుచు కామచారులై నిజయోగబలముచేత సర్వప్రాణుల నధిష్ఠించి యుందురు; స్వర్గ నరకాది లోకములందలి చరాచరములను దృప్తి నొందింతురు; అన్న, జల, మధురూపిణి - అమృతరూపిణి- శక్తిరూపిణి యగు స్వధ 'శశిసుత, దక్షదుహిత, పితృపత్ని' యనియు నిట గీర్తింపబడినది.

మత్స్యపురాణమున గూడ పితరుల స్వరూపము, పితృకార్యావశ్యకతయు నిట్లు వివరింపబడినది.

ఋషయః —

"కథం కవ్యాని దత్తాని హవ్యాని చ జనై రిహ।
గచ్ఛంతి పితృలోకస్థాన్ ప్రాపకః కోఽత్ర గద్యతే ?

యది మర్త్యో ద్విజో భుఙ్క్తే హూయతే యది చాపరే।
శుభాశుభాత్మకం ప్రేతదత్తం తద్భుజ్యతే కథమ్ ?"

సూతః :—

"వసూన్ వదన్తి చ పితౄన్ రుద్రాం శ్చైవ పితామహాన్।
ప్రపితామహాం స్తథాఽఽదిత్యా నిత్యేవం వైదికీ శ్రుతిః॥

నామగోత్రే పితౄణాం తు ప్రాపకం హవ్యకవ్యయోః ।
శ్రాద్ధస్య మంత్రాః శ్రద్ధా చ ఉపయోజ్యాశ్చ భక్తితః ॥

అగ్నిష్వాత్తాదయ స్తేషా మాధిపత్యే వ్యవస్థితాః।
నామగోత్రం కాలదేశాః భవాంతరగతా నపి॥

ప్రాణినః ప్రీణయం త్యేతే తదాహారత్వ మాగతాన్॥"

—19-1 నుండి 5 శ్లో.

పుత్రాదులచే నొసగబడెడి హవ్యకవ్యములు పితరుల నెట్లు చెందును ? అనెడి ఋషుల ప్రశ్నకు సూతుని సమాధానమిది. 'పితృ-పితామహ-ప్రపితామహులు వసురుద్రాదిత్యరూపు లని యనాదిశ్రుతి. నామగోత్ర సంకీర్తనము జేయుచు వేదమంత్రోచ్చారణపూర్వకముగ పితృకార్యముల శ్రద్ధాభక్తులతో ననుష్ఠించుచో నా పితరు లే కాలమున, నే దేశమున

నేజన్మ నందియున్నను, పుత్రాదులచే వారి కిట నొసగబడు హవిరాది కము వారి కాహార మగుచు వారల దృప్తి నొందించును—' అని తాత్పర్యము.

పై పురాణవచనముల వలనను పితృ పితామహ ప్రపితామహులు వసురుద్రాదిత్యాధిష్ఠితులై, తద్రూపులై, తృప్తినొందుట దెలియుచున్నది.

పితృపితామహప్రపితామహులు - విష్ణుస్వరూపులు :-

పితృ పితామహ ప్రపితామహులు విష్ణుస్వరూపు లని మహాభారత మిట్లు చెప్పుచున్నది.

"పితా పితామహ శ్చైవ తథైవ ప్రపితామహః।
అహ మేవాత్ర విజ్ఞేయ స్త్రిషు పిండేషు సంస్థితః॥

నాస్తి మత్తోఽధికః కశ్చిత్ కోఽవాన్యోఽర్చ్యో మయా స్వయమ్।
కో వా మమ పితా లోకే అహ మేవ పితామహః॥

పితామహపితా చైవ అహ మే వాత్ర కారణమ్।
ఇత్యేత దుక్త్వా వచనం దేవదేవో వృషాకపిః"

— భార. 12-345-21, 22, 23.

పిండత్రయరూపమున నర్చింపబడు పితృ-పితామహ-ప్రపితామహులు నేనే; పిండత్రయము నధిష్ఠించి యుండి యర్చింపబడునది నేనే - యని యిట దేవదేవుడగు శ్రీ మహావిష్ణువు చెప్పుచున్నాడు. పితరుల నర్చించుచో తదధిష్ఠాతృదేవతలు, దివ్యపితరులు, శ్రాద్ధదేవులును నగు వసురుద్రాదిత్యు లర్చితులై తాము తృప్తులై, మనుష్యపితరులను తత్పుత్రాదులను తృప్తి నొందింతు రని పూర్వము చెప్పబడినది. పితరుల నర్చించుచో శ్రీ మహా విష్ణువే యర్చితు డగుచున్న ట్లిట మహాభారతమున జెప్పబడుచున్నది.

కాన నీ వచనముల బట్టి పితరుల నర్చించుచో తదధిష్ఠాతృదేవతలగు వసురుద్రాదిత్యులను, నా యధిష్ఠాతృదేవతల ధరించుచు (బిభ్ర దేక ఊర్ధ్వ స్తస్థౌ) తద్రూపుడు, తదతీతుడు, సర్వాధిష్ఠానరూపుడునై విరాజిల్లెడి శ్రీమహావిష్ణువు ప్రీతుడై పితరుల దృప్తి నొందించి తద్ద్వారా తత్పుత్రాదుల నా యా ఫలముల నొసగి సంరక్షించుచుండునని గ్రహింప నగును.

శ్రుతియు అగ్నివాయ్వాదిత్య లోకములగు భూర్భువస్స్వర్లోకములు శ్రీమహావిష్ణువు యొక్క మూడు పదము లనియు, అవి స్వధామయము లనియు నిట్లు చెప్పుచున్నది.

> "యస్య త్రీ పూర్ణా మధునా పదా న్యక్షీయమాణా స్వధయా
> మదంతి। య ఉ త్రిధాతు పృథివీ ముత ద్యా మేకో దాధార
> భువనాని విశ్వా" — ఋ. 1-154-4.

ఏ శ్రీ మహావిష్ణువు ద్యావాపృథివ్యంతరిక్షము లను, సర్వభువనము లను కాలత్రయవిశిష్టముగను లేక గుణత్రయ (త్రిధాతు) విశిష్టముగను నొనర్చి యద్వితీయుడై ధరించి యుండెనో, యా దేవుని యొక్క యీ త్రిపదములు (అగ్ని-వాయు-సూర్యలోకములు) మధుర దివ్యామృత పూర్ణములై, యక్షయములై స్వధచే (అన్నముచే- తత్తదుపభోగ్య వస్తుజాతముచే) జనుల నానందింపజేయుచున్నవి (యస్య విష్ణోః మధురేణ దివ్యే నామృతేన, పూర్ణా పూర్ణాని, త్రీణి పదాని పాదప్రక్షేపణాని, అక్షీయమాణా అక్షీయమాణాని, స్వధయా అన్నేన, మద న్తి మాదయ న్తి తదాశ్రితజనాన్ - సా.భా.) - అని యర్థము.

అగ్ని వాయు సూర్యులు స్వధారూపులని పూర్వమంత్రముల వలన దెలిసినది. ఈ మంత్రము వలన శ్రీ మహావిష్ణువు యొక్క యనుగ్రహముచే అగ్ని వాయు సూర్యులు భూర్భువస్స్వర్లోకములను తత్తదుపభోగ్య

వస్తుజాతము చే (స్వధచే) నింపి జనుల నానందింప జేయుదురని గ్రహింపనగును. కావున 'పితరుల నర్చించుచో నేనే యర్చింపబడుచున్నాను: పితృ-పితామహ-ప్రపితామహ స్వరూపుడ నేనే'- యను భారతమునందలి పరమేశ్వరుని వచనము శ్రుతితాత్పర్యానుగుణమే యయి యున్నది. 'అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభు రేవ చ' - అను గీతావచనము కూడ నీ విషయమునే స్పష్టీకరించుచున్నది.

ఆదిత్యమండలాంతర్గత పురుషుడు నారాయణు డని సంప్రదాయము. అట్టి యాదిత్యునిచే (విష్ణువుచే) పితరు లుపజీవితు లగుదురని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

> "అథ యత్ప్రథమా స్తమితే తన్నిధనం తదస్య పితరోఽన్వాయత్తా స్తస్మా త్తా న్నిదధతి నిధనభాజినో హ్యేతస్య సామ్న ఏవం ఖల్వము మాదిత్యగ్ం సప్తవిధగ్ం సామో పాస్తే।" — ఛాం.ఉ. 2-9-8.

> 'అథ యత్ప్రథమా స్తమితే ఉదర్శనం జిగమిషతి సవితరి తన్నిధనం, తదస్య పితరోఽన్వాయత్తా స్తస్మా త్తా న్నిదధతి పితృ-పితామహ-ప్రపితామహరూపేణ దర్భేషు నిక్షిపంతి, తాం స్తదర్థం పిండాన్ వా స్థాపయన్తి। నిధనసంబంధా న్నిధనభాజినో హ్యేతస్య సామ్నః పితరః-' —శం.భా.

ఆదిత్యునకు వాస్తవముగ నుదయాస్తమయములు లేవు. ఎల్లయెడల నేకరూపుడు కాన సముడు. మఱియు నందఱకు నేకరూపుడై పొడగట్టును కాన సముడు. ఇట్లు సర్వదా సర్వసము డగుటచే నాదిత్యుని సామరూపునిగ నుపాసింపవలె నని శ్రుతిచే బూర్వము విధింపబడినది. మఱియు సామకు 'హింకార-ప్రస్తావ-ఆది-ఉద్గీథ-ప్రతిహార-ఉపద్రవ-నిధనము"

లనెడి సప్తావయవములు గలవు. అందు హింకారాది సామావయవ రూప మునను, ఆదిత్యోపాసన విధింపబడినది. ఇట ఆదిత్యుని నిధనరూపునిగ నుపాసింపవలె నని విధింపబడుచున్నది.

అస్తోన్ముఖుడగు నాదిత్యుడు నిధనరూపుడు. నిధనరూపుడగు నాదిత్యు ననుగమించుచు నా యాదిత్యునిచే పితరు లుపజీవితు లగుదురు. కావుననే యా సమయమున దర్భలయందు పితృ-పితామహ-ప్రపితామహ రూపులగు పితరులను నిక్షేపింతురు (నిధధతి); లేక తద్రూపమున దర్భలయందు పిండముల నుంచుదురు (నిదధతి). ఇట్లు పిండనిధన సంబంధముచే నిధన భాజనుడగు ఆదిత్యుని యనుగమించుచు నాదిత్యునిచే పితరు లుపజీవితు లగుచుందురు. ఇట్లు సప్తవిధసామరూపునిగ నాదిత్యు నుపాసింపవలెను— అని యర్థము. ఆదిత్యునిచే పితరు లుపజీవితు లగుదురని చెప్పుటచే ఆదిత్య మండలాంతర్గత పురుషుడగు శ్రీమహావిష్ణువుచే నుపజీవితు లగుదురనియే తాత్పర్యము. కాన పితరుల నర్చించినచో తద్రూపమున శ్రీమహావిష్ణువే యర్చితు డగుచున్నాడు.

స్వధా పితృభ్యః (అస్తు స్వధా) :-

కాన, పై గ్రంథసందర్భము ననుసరించి పితృక్రియలందు జెప్పబడెడి 'స్వధా పితృభ్యః, అస్తు స్వధా'—అను మంత్రములయొక్క వివిధార్థముల నిట్లు దెలియనగును.

(1) ఇట నర్చించుట కుద్దిష్టులైనది పితృ-పితామహ-ప్రపితామహ రూప మనుష్యపితరులే. అయినను నర్చింపబడునది తదధిష్ఠాతృ దేవతలగు వసు-రుద్ర-ఆదిత్యులును, వారల కధిష్ఠానరూపుడు జగత్పితయు నగు పరమేశ్వరుడు నని తెలియనగును. ఈ విషయమును స్ఫురింపజేయుటకే 'స్వధా పితృభ్యః'- అని స్వధాకారము చేయబడుచున్నది. స్వధామయులు,

స్వధాప్రవర్తకులు నగు పితరులు మొదట పరమేశ్వరుడు, తరువాత అగ్ని-వాయు-సూర్యులును గదా! అందుచే 'స్వధా పితృభ్యః' — అను నీ మంత్రము పుత్రులచే నర్పింపబడెడి హవిర్లక్షణాన్నరూపమగు స్వధ పరమేశ్వరశక్తిరూపమై (స్వధయై), తదనుగ్రహముచే పితరులకు జీవన హేతువగు నమృతమై(ఊర్జా-కీలాలమధువిగ్రహా-పితృపత్నీ -బ్రహ్మా.పు.) వరలు ననెడి యర్థము స్ఫురింప జేయుచుండును.

(2) జీవులు ముక్తు లగువరకు స్వధాపరవశులై. విద్యా-కర్మ-పూర్వప్రజ్ఞ లనెడి స్వధలతో నూర్ధ్వాధోలోకముల జరించుచుందురని చెప్పబడినది. ఊర్ధ్వాధోగతులకు గారణ మగుచుండ నీ స్వధల నుండి క్రమముగ విముక్తులై స్వప్రతిష్ఠితుడు, జగత్పితయు నగు పరమేశ్వరు ననుగ్రహము వలనను, స్వధారూపిణియైన త్రయీవిద్యాశక్తి వలనను, పునరావృత్తిరహిత స్థితికి గారణమగు స్వధను (పారమేశ్వరశక్తిని) పితరులు పొందుదురు గాక — యను నర్థమును గూడ 'స్వధా పితృభ్యః యను నీ మంత్రము స్ఫురింప జేయుచుండును. అందుచేతనే 'పునరావృత్తిరహిత శాశ్వతబ్రహ్మలోక నిత్యనివాససిద్ధి రస్తు'-అని కర్మాచరణసమయమున పుత్రాదు లాచరించుటయు నిందుకు దార్కాణము.

(3) 'స్వర్గం లోక దధాతి యజమానస్యేతి స్వధా (సా. భా. ఋ. 3-17-5) పితరుల యూర్ధ్వలోకగతికి గారణ మయ్యెడి స్వధాశక్తియే యజమానుని యూర్ధ్వగతికిని గారణ మగు నని భావము. కావున 'స్వధా పితృభ్యః' 'అస్తు స్వధా'యను నీ మంత్రములు (1) విద్యా-కర్మ-ప్రజ్ఞ లనెడి స్వధలు జీవుల యూర్ధ్వాధోలోకగతులకు గారణము లని గుర్తింప జేయుచు యజమానుల హెచ్చరించు చుండును. (2) మఱియు నుత్తమ గతులకు గారణభూతమైన త్రయీవిద్యారూపస్వధ (వేదవాక్కు) వైపునకు యజమానుల దృష్టిని మరల్చుచు, తచ్చోదిత కర్మానుష్ఠానమునందు శ్రద్ధ

నినుమడింపజేయును. ఏలయన 'స్వర్గం లోకం దధాతి' – యను నీ నిర్వచనము ననుసరించి స్వర్గలోక ప్రాపకత్వము హవిర్లక్షణమైన స్వధకే గాక, తత్కారణభూతమగు త్రయీవిద్యారూప స్వధకును నొప్పును. వేద వాక్కు హవిర్దానాదిహేతువై స్వర్గప్రాప్తిహేతు వగుట ప్రసిద్ధమే.

"పతంగో వాచం మనసా బిభర్తి తాం గంధర్వోఽవద ద్గర్భే
అంతః। తాం ద్యోతమానాం స్వర్యం మనీషా మృతస్య పదే
కవయో నిపాంతి॥"

— ఋ. 10-177-2; తై. ఆ. 3. 11-11.

"ద్యోతమానాం స్వర్యం స్వర్గమయిత్రీం, స్వర్గాయ హితం
వా, మనీషాం మనస ఈశిత్రీం, తాం త్రయీరూపాం
వాచమ్" — సా. భా.

పతంగుడన సూర్యుడు, లేక పరమాత్మ యని యర్థము. ఆ పతంగుని యందు విలసిల్లెడి యీ త్రయీరూపమగు వాక్కు స్వయంప్రకాశశీలము (ద్యోతమానా); స్వర్గప్రాప్తిహేతువు (స్వర్యం): మనోనియామకము (మనీషా); పరబ్రహ్మవిషయకము (ఋతస్య పదే కవయో నిపాంతి). – అని వేదవాక్కు వర్ణింపబడినది. జైమినీయోపనిషద్బ్రాహ్మణము గూడ ప్రాణము (ప్రాణాత్మ) పతంగ మనుచు నీ ఋక్కు నిట్లు వివరించు చున్నది.

"పతంగో వాచం మనసా బిభర్తీతి। ప్రాణో వై పతంగః
తాం ద్యోతమానాం, స్వర్యం మనీషా మితి। స్వర్యా
హ్యేషా మనీషా య ద్వాక్" — జై. ఉ. బ్రా. 3-36-1.

కాన 'అస్తు స్వధా – స్వధా పితృభ్యః' అను నీ మంత్రములు స్వర్గాది– ఊర్ధ్వగతికి గారణమగు నను నర్థమునుగూడ స్ఫురింపజేయునవి.

(4) స్వం ఆత్మానం దధాతీతి స్వధా—(సా.భా.ఋ. 3-36-10) ఆత్మను ధరించునది — అనగా — ఆత్మవిధారకమగు శక్తి, బలము, లేక. తేజస్సు అని యర్థము, ఆత్మను లేక పరమాత్మను ప్రతిపాదించునది యగుచు ధరించునది గాన (గవి దేవాసో ఘృత మన్వవిందన్ తై. ఆ. 10-10-3) వేదవాక్కు స్వధ యన నొప్పును, ఆత్మరూపుడగు పరమేశ్వరుని ధరించునవి యగుట చేతనే యుదకము (ఆపః) లకు స్వధా యను నామము ప్రసిద్ధము.

'స్వం ఆత్మానం సర్వాంతర్యామిణం భగవంతం నారాయణం
ధారయతీతి స్వధా।
'ఆపో[1] నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః।
అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః॥. ఇతి।'
—వైదిక నిఘంటువ్యాఖ్య - దేవరాజయజ్వ.

కాన స్వధాకారము జేయుచు పితరుల కొసగబడెడి యన్నజలాదికము పితరుల కాత్మవిధారకశక్తియై లేక తేజమై వెలయును; మఱియు నా యన్నోదకములు తమయందు అంతర్యామియై విలసిల్లు నారాయణుని ధరించునవై స్వధారూపములై వరలి పితరులను, పుత్రాదియజమానులను తరింపజేయును అని 'స్వధా పితృభ్యః అస్తు స్వధా' యను మంత్రములు స్ఫురింపజేయును.

1. ఇచట "ఆపః" అను శబ్దమునకు జలములని మాత్రమే యర్థము గాదు. "అప్" శబ్దము పంచభూతముల కుపలక్షకము. సర్వవ్యాపన శీలము లగుట జేసి పంచభూతములకు "ఆపః" అను వ్యవహార ముపపన్న మగును. మఱియు "అప్" రూపములగు నీ పంచభూతములకు "వాక్" అను వ్యవహారము గూడ శ్రుతిప్రసిద్ధము.
సోఽపోఽసృజత—వాచ ఏవ లోకాత్ । వాగేవాస్య సాఽసృజ్యత।
సేదం సర్వ మాప్నోత్ । యదిదం కించ . యదాప్నోత్ తస్మా దాపః
య దవృణోత్ తస్మా ద్వాః ।" —శ. బ్రా. 6-1-1-9.
"అనేన అపాం వాక్ఛబ్ద వ్యవహార్యత్వ ముక్త మితి మంతవ్యమ్" — సా.భా.
(చూ. ఐ. ఉ. 1-2-2; శం.భా; ఆనందగిరిటీకా.)

నా యనోన్నదకములు తమయందు అంతర్యామియై విలసిల్లు నారాయణుని ధరించునవై, స్వధారూపములై వరలి పితరులను, పుత్రాదియజమానులను తరింపజేయును— అని 'స్వధా పితృభ్యః అస్తు స్వధా' యను మంత్రములు స్ఫురింపజేయును.

శ్రాద్ధవృత్తి :-

(5) ఇట్లు అంతర్యామియై విరాజిల్లు నారాయణుడే శ్రద్ధావంతులకు శ్రాద్ధవృత్తిప్రణేత యగుచుండునని హరివంశ మిట్లు చెప్పుచున్నది.

"ఆసన్నః సన్నతరః సాధనానాం
శ్రద్ధావతాం శ్రాద్ధవృత్తిప్రణేతా ।
పతి ర్గణానాం మహతాం సత్కృతీనాం
పాయీ న్మేషః పూరణః షడ్గుణానామ్॥ — హరివంశ. 2-72-52.

'ఆసన్నః అంతర్యామిత్వేన నికటగః। సాధనానాం తద్వతాం తు సన్నతరః అనావృతః, శ్రాద్ధవృత్తిః శ్రద్ధాగృహీత మహావాక్యజా వృత్తి రహంబ్రహ్మాస్మీతి జ్ఞానం, తస్య ప్రదాతా। మా మాం ఈషః ఇష్యమాణస్యార్థస్య పూరణః షడ్గుణానాం చ సర్వజ్ఞత్వాదీనాం పూరణః' —నీలకంఠః.

అంతర్యామియై సకలప్రాణులకు సమీపవర్తి యయ్యును, పరమేశ్వరుడు సాధనసంపత్తిగల యుత్తమసాధకులకు అనావృతుడై—అపరోక్షముగా ననుభూయమాను డగును; శాస్త్రవిహితమగు రీతిని శ్రద్ధతో నుచ్చరింపబడెడి 'అహం బ్రహ్మాస్మి' ఇత్యాది మహావాక్యముల వలన అఖండ బ్రహ్మాకార వృత్తిరూప మగు జ్ఞానమును బ్రసాదించువాడు. ఈ పరమేశ్వరుడే నిఖిల గణములకు పతి (గణపతి). ఉత్తమ సత్కర్మలకును,

తత్కర్తలకును పాలకుడు. సర్వజ్ఞత్వాది షడ్గుణైశ్వర్య సంపన్నుడు— అని యర్థము.

ఇట శ్రాద్ధవృత్తి యనగా శ్రద్ధవలన సిద్ధించెడి బ్రహ్మవిద్య యని వివరింపబడినది. ఈ క్రింది వాజసనేయశ్రుతి వలన నీ విషయము స్పష్టమగును.

'శ్రద్ధయా సత్య మాప్యతే' —వా.సం. 19-30.

'శ్రదితి సత్యనామసు పఠితమ్–శ్రత్ సత్యం ధీయతే యస్యాం సా శ్రద్ధా ఆస్తిక్యబుద్ధిః, పుణ్యవతాం మనోవిశేషః। శ్రద్ధయా సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మాప్యతే ప్రాప్యతే। శ్రద్ధాం వినా జ్ఞానాభావాత్' —ఉవట మహీధరౌ.

'శ్రత్' అను పదము సత్యనామములలో పఠింపబడినది. 'శ్రత్' అనగా సత్యము–సత్యజ్ఞానానంతరూపము. అట్టి సత్యమును ధరించెడి లేక దర్శింపజేసెడి యాస్తిక్యబుద్ధికి శ్రద్ధ యని పేరు. కాన శ్రద్ధచే సత్యము (బ్రహ్మ) ప్రాప్త మగును – అని యర్థము. ఇట్టి శ్రుత్యర్థమే యిట హరివంశముచే ననువదింపబడిన దనుట స్పష్టము.

శ్రాద్ధకర్మలయందు సామాన్యముగ, 'అన్నం బ్రహ్మ; అహం చ బ్రహ్మ, భోక్తా చ బ్రహ్మ' – అని యీ రీతిగ కర్తృ భోక్తృ భోగ్య (అన్న) రూపమగు సర్వము బ్రహ్మాత్మకముగ దర్శించెడి లేక దర్శింపజేసెడి సంప్రదాయ సమాచారముగ వచ్చుచున్నది. ఇట్లు కర్మసమయములందు శ్రద్ధాపూర్వకముగ నుచ్చరింపబడెడి మహావాక్యముల వలన నుదయించెడి జ్ఞానమే శ్రాద్ధవృత్తి యని పై హరివంశవచనమువలన దెలియును. ఇట్టి జ్ఞానము శ్రద్ధావంతులగు సాధకులకు మాత్రమే యీశ్వరానుగ్రహముచే

గలుగు ననియు పై 'శ్రాద్ధవృత్తిప్రణేతా' యను హరివంశవచనము దెలియజేయును. 'ఈశ్వరానుగ్రహా దేవ పుంసా మద్వైతవాసనా' యని గదా సంప్రదాయము. ఆయుః, కీర్తిః, ప్రజా, ధనమ్- మున్నగు నైహిక ఫలములతోపాటు మోక్షముగూడ సిద్ధించునని యాజ్ఞవల్క్యాది స్మృతుల ననుసరించి పూర్వము చెప్పబడినది. కాన శ్రాద్ధకర్మచే నుద్దిష్టమగు పరమ ప్రయోజనము బ్రహ్మవిద్యాఫలమగు 'అపవర్గ' మని తెలియ నగును. బ్రహ్మయే స్వధ (స్వధా బ్రహ్మరూపా చిత్-తై.ఆ. 10-10-3.) యనియు పూర్వము చెప్పబడినది. అట్టి స్వధాప్రాప్తియే పరమలక్ష్య మని 'స్వధా పితృభ్యః-అస్తు స్వధా' యను నీ మంత్రము ఉత్తమసాధకుల కడుగడుగున ప్రబోధించుచుండును.

మఱియు 'శ్రద్ధయా సత్య మాప్యతే' యను వాజసనేయ సంహితా వాక్యము వలనను, 'శ్రాద్ధవృత్తి ప్రణేతా' యను హరివంశవచనముచేతను పితృకార్యములగు శ్రాద్ధకర్మలవలననేగాక శ్రద్ధతో జేయబడెడి యజ్ఞాది కర్మలవలనను ఉత్తమసాధకులకు గ్రమముగ పరమపురుషార్థము సిద్ధించు ననియు గ్రహింపనగును.

6. స్వధా-ప్రాణధారణాశక్తి :-

మఱియు శరీరమునందు వాయుధారణము (ప్రాణాయామము)నకు స్వధ యని పేరు.

"త్రిధా ప్రణీతో జ్వలనో మునిభి ర్వేదపారగైః।
అత స్తే తత్త్వ మాపన్నా య దేక స్త్రివిధః కృతః॥
ఏక ఏవ మహా నగ్ని ర్హ్వవిషా సంప్రవర్తతే।
స్వధాకారేణ మంత్రజ్ఞ మంత్రాణాం కార్యసిద్ధయే॥"

"స్వయం చ దక్ష సంప్రాప్తో భగవాన్ భూతసత్కృతః।
బ్రహ్మ బ్రాహ్మణనిర్మాతా సర్వభూత పితామహః।"
— హరివంశమ్ 3 23-5,6.7.

జ్వలను డనగా ప్రాణాగ్ని. ఆ యగ్ని పూరక-కుంభక-రేచకములచే నాడీ మార్గముల ద్వారా త్రివిధముగా సంచారిత (త్రిధాప్రణీత) మగు చున్నది. ఇట్టి పూరకాద్యభ్యాసము వలన సుసమాహిత మానసులై వేదపారగులగు మునులు ఆత్మతత్త్వమును దెలియగలరు. ప్రాణాయా మాభ్యాసముచే నర్చితుడగు ప్రాణాగ్నికి క్షీర-ఘృత-మిష్టాన్న-మితా హారములు ప్రశస్యములగు హవిస్సులు. ఈ హవిస్సులచేతను పూరకాద్య భ్యాసముచేతను మొదట సూక్ష్మముగ నుండెడి యా ప్రాణాగ్ని క్రమముగ బ్రజ్వరిల్లి మహాగ్ని యగును. శరీరమునందు జేయు వాయుధారణమునకు- ప్రాణధారణమునకు- 'స్వధ' యని పేరు. (స్వస్మిన్ శరీరే ధానం విధానం దేహే వాయో ర్ధారణేతి యావత్) ఈ స్వధారూప మగు (ప్రాణధారణ రూపమగు) కారణముచేత శాస్త్రోక్త మంత్రసంబంధి కార్యమైన పృదివ్యాది భూతజయమునకై యా ప్రాణాగ్ని ప్రవృత్త మగును. ప్రాణధారణము చేయుచో ప్రాణముతోపాటు మనస్సుకూడ ఆత్మయందు నిశ్చలమై నిలచును. ఇట్లాత్మయందు ధారణ చేయబడెడి ప్రాణము క్రమముగ మహత్త్వము నొంది 'దక్ష' రూపు డగును; అనగా సూత్రాత్మ (హిరణ్య గర్భ) రూపుడగును. (దక్షతే సర్వస్మిన్ కార్యే సన్నహ్యతీతి దక్షః సూత్రాత్మా తద్రూపేణ సంప్రాప్తో భవతి). అతడే బ్రహ్మ. సర్వభూత పితామహుడు - (చూ. నీలకంఠ వ్యాఖ్య).

జీవు డనగా ప్రాణాధారము చేయువాడు(జీవ ప్రాణాధారణే). ప్రాణ ధారణము జీవసాధారణ ధర్మము. అయ్యును శాస్త్రవిహితమగు ప్రాణ ధారణము, తద్ద్వారా మనోధారణము-యమాదిగుణయుక్త మగు మనస్సును ఆత్మయందు నిలుపుట-ఇదియే యిట ధారణ.

"యమాది గుణయుక్తస్య మనసః స్థితి రాత్మని।
ధారణే త్యుచ్యతే సద్భిః శాస్త్రతాత్పర్యవేదిభిః॥"

—యోగియాజ్ఞస్మృతి.

ఇట్టి ధారణశక్తియే స్వధ. కాని యిట హవిస్సు వేఱు; స్వధ వేఱుగా జెప్పబడినవి. మొదట సూక్ష్మముగ నుండెడి ప్రాణాగ్ని ప్రశస్యములగు క్షీరాదిహవిస్సులచేతను, రేచక పూరకాద్యభ్యాసము చేతను క్రమముగ ప్రజ్వరిల్లి మహాగ్ని యగును. ఇది హవిస్సు యొక్క కార్యము. ఇట్లు ప్రవృద్ధుడైన మహాగ్ని ప్రాణధారణ రూపమగు స్వధాకారముచేత మంత్రములచే నయ్యెడి కార్యసిద్ధికై (భూతజయమునకై) ప్రవృత్తు డగును. ఇది స్వధయొక్క కార్యము. కాన మంత్రకార్యసిద్ధికై ప్రవృత్తు డయ్యెడి యగ్నికి సహకారికారణమై తోడ్పడునది స్వధ యని తెలియుచున్నది. ఇట్లు ఈ స్వధ, ప్రాణాగ్ని సూత్రాత్మరూపుడై వెలయు నంతవరకు తోడ్పడుచుండును. కాన స్వధాప్రయోజనము సూత్రాత్మత్వ (హిరణ్యగర్భత్వ — లేక దక్షత్వ) సిద్ధి యని తెలియనగును.

ఇట గమనింపవలసిన యంశము గలదు. ఈ హరివంశవచనములు మంత్రకార్యసిద్ధికి ప్రాణాగ్న్యుపాసనావశ్యకతను బోధించుచున్నవి. కర్మానుష్ఠానమునకు, తత్ఫలప్రాప్తికి ప్రాణాగ్న్యుపాసనము నాంతరీయకము. కాగా కర్మాచరణము లేని ప్రాణాగ్న్యుపాసన గాని ప్రాణాగ్న్యుపాసనము లేని కర్మాచరణము గాని ప్రశస్తము గాదు. కావుననే కర్మాంగముగ 'ప్రాణానాయమ్య'— అని ప్రాణాయామము విధింపబడుచున్నది. కొన్నియెడల 'ప్రాణాయామాన్ షడాచరేత్' అని యీ రీతిగ ప్రాణాయామము ప్రాయశ్చిత్తముగ విధింపబడుచున్నది. ప్రాణాయామముచే ప్రాణధారణముచేసి స్వధాశక్తిసంపన్నులైన యపుడే మంత్రములును, వానిచే నొసగబడు హవిస్సులును వీర్యవత్తరములగును. శాస్త్రవిహిత ఫలప్రాప్తియు

జేకూరును. కర్మసంన్యాసము నొనర్చిన యోగులకును పూర్వోక్త స్వధాశక్తి భూతజయమును సాధించి శ్రవణ మనన నిదిధ్యాసల నొనర్చుటకు దోహదకారి యగును. ఇట్లు స్వధాశక్తి సంపన్ను లయి స్వధామయు లగువారు తుదకు స్వధారూపు లగుదురు. అనగా చిత్స్వరూపు లగుదురని 'స్వధా పితృభ్యః; అస్తు స్వధా' — యను నీ మంత్రము లజ్ఞాతార్థమును జ్ఞాపకము జేయుచున్నవి. కావుననే సర్వపితృకర్మలయందు స్వధాకారమే (అస్తు స్వధా) మహత్తరమైన యాశీర్వాదముగ బరిగణింపబడును.

"స్వధా స్త్విత్యేవ తం బ్రూయు ర్బ్రాహ్మణా స్తదనంతరమ్।
స్వధాకారః పరా హ్యాశీః సర్వేషు పిత్ర్యకర్మసు॥"—మను. 3-25-2.

స్వాహాః - స్వధః - వషట్ :-

ఈ స్వాహా — స్వధా శబ్దములు స్త్రీలింగము లగుచు పరదేవతా వాచకము లయినట్లు పుంలింగములై పరమేశ్వరవాచకములుగ గూడ గన్పట్టుచున్నవి.

"ప్రణమ్య ఋగ్యజుఃసామ్నే స్వాహాయ చ స్వధాయ చ।
వషట్కారాత్మనే చైవ తుభ్య మరాత్మనే నమః॥

—మత్స్య. 47-163.

ఋగ్యజుఃసామాత్మకుడు, స్వాహరూపుడు, స్వధరూపుడు, వషట్కారాత్మకుడు, తత్ప్రతిపాద్యార్థస్వరూపుడు - నగు పరమేశ్వరునకు నమస్కారము అని యర్థము.

ఇట వాగర్థస్వరూపుడగు పరమేశ్వరుడు స్వాహః, స్వధః, వషట్కారాత్మా, - ఋగ్యజుఃసామాత్మా యనియు, తదర్థస్వరూపు డనియు గీర్తింపబడినాడు. కాన ఋగ్యజుఃసామలచేతను, అట్లే స్వాహా—స్వధా—

వషట్కార శబ్దములచేతను ప్రతిపాద్య మగు పరమార్థము పరమేశ్వరుడే యని తాత్పర్యము.

ఇంతవరకు స్వాహా, స్వధాస్వరూపముల దర్శించితిమి. ఇక వషట్ స్వరూపమును జూతము.

వషట్

జగద్ధితైకలక్షణాం జగత్ప్రతే రనన్యగాం
జగత్కుటుంబసంస్కృతిం జగద్వివర్తమోహినీమ్।
వషట్క్రియా విధాన యజ్ఞ తత్త్వ బోధ సంభృతాం
వషట్స్వరూపిణీం శివాం నమామ వేదమాతరమ్॥

విశ్వ మేత దఖిలం చ యా వశే
స్వేచ్ఛయా నను కరోతి సా వషట్।
యా షడంగయుత వాక్స్వరూపిణీ
భావయామి హృది తాం హరిప్రియామ్॥

—వేదమాతృస్తవః.

హవిస్త్యాగప్రకారము - వషట్కార ప్రాశస్త్యము :-

స్వాహా–స్వధా–శబ్దములవలెనే వషట్కారముగూడ పరమేశ్వర వాచక మని దర్శించితిమి. ఇంతియే గాదు. స్వాహాకారము వలెనే వషట్కారముగూడ మహిమాన్వితము, దేవహవిర్దానవాచకము నగు మంత్రము.

"వి పృచ్ఛామి పాక్యా ౩ న దేవాన్ వషట్కృతస్యాద్భుతస్య దస్రా । పాతం చ సహ్యసో యువం చ రభ్యసో నః"

—ఋ. 1-120-4.

'వషట్కృతస్య వషట్కారేణాగ్నౌ హుతస్య, అద్భుతస్య ఆశ్చర్యభూతస్య, మహతః, సహ్యసః అతిశయేన బలవతః బలోత్పాదకస్య సోమస్య....' —సా. భా.

వషట్కారముచే నగ్నియందు హోమము చేయబడెడి సోమరూప మగు హవిస్సు అద్భుతమై మహత్త్వసంపన్నము, అతిశయబలసంపన్నమై బలోత్పాదకము నగు నని యీ మంత్రమున జెప్పబడుచున్నది. కాన స్వాహాకృతమగు హవిస్సువలెనే వషట్కృతమగు హవిస్సుగూడ మహిమాన్వితమై దేవతాప్రీతిహేతు వగు ననుట శ్రుతిసంప్రదాయము. యజ్ఞములయందు గొన్నియెడల స్వాహాకారపూర్వకముగను, మఱికొన్నియెడల వషట్కారపూర్వకముగను హవిర్దానము చేయబడుచుండును. ఈ విషయమున శ్రుతిసంప్రదాయమును జూతము.

దేవతల నుద్దేశించి చేయబడు హవిస్త్యాగమునకు యాగ మని పేరు. ఈ యాగశరీరమును నిష్పన్నము చేయు మంత్రము లయిదు. అవి యివి. (1) ఆశ్రావయ (2) అస్తు శ్రౌషట్ (3) యజ (4) యే యజామహే (5) వషట్. ఇవి యాగశరీరమును రూపొందించు ప్రధానమంత్రములు. వీనికి పూర్వాపరభాగములయందు గన్పట్టు అంగము లన్నియు శరీరగత వస్త్రాలంకార సదృశములు[1]. ఇందలి 'ఆశ్రావయ' యనెడి మొదటి మంత్రము ముఖ్యప్రారంభరూపము (ప్రాయణమ్). తరువాతి మూడు మంత్రములు ప్రతిష్ఠారూపములు. (ప్రతిష్ఠా మధ్యకాలవర్త్యనుష్ఠానమ్). చివరిది యగు వషట్కారము ఉదయన (సమాప్తి) రూపము. యజమాను డీ ప్రారంభాదిత్రయము నెఱిగి యజ్ఞకర్మాచరణమునకు బూనుకొనవలెను. ఇక హవిస్త్యాగప్రకారమును జూతము.

---

1. దేవతోద్దేశేన ద్రవ్యత్యాగరూపస్య యాగశరీరస్యైతైరేవ మంత్రై ర్నిష్పన్నత్వా దవశిష్టాని ప్రాచ్యా న్యుదీచ్యాని చాంగాని శరీరగత వస్త్రాలంకార స్థానీయాని — సా. భా. తై. సం. 1-6-11-1; చూ. ఉపోద్ఘాతము. తాం.బ్రా. -చిన్నస్వామిశాస్త్రి.

అధ్వర్యుడు అను ఋత్విక్కు జుహ్వాదిపాత్రలయందు హవిస్సును గ్రహించి, హోత యను ఋత్విజుని జూచి 'అగ్నయే అనుబ్రూహి' - యని యాజ్ఞాపించును. అగ్నికొఱకు 'అనువాక్యా'రూప మగు ఋక్కును పఠింపు మని యర్థము. ఈ యనువాక్యకు 'పురోనువాక్య' యనియు పేరు. హోత 'అనువాక్య'ను పఠించిన పిదప ఆగ్నీధ్రు డను ఋత్విజుని జూచి యధ్వర్యుడు 'ఆ శ్రా వ య' యని పలుకును. 'అగ్నికి హవిస్సు నొసగవలసి యున్నాను: ఆ విషయము నగ్నికి నివేదింపుము'- అని యర్థము. అంతట ఆగ్నీధ్రుడు 'అస్తు శ్రౌ ష ట్' అని పలుకును. అస్తు అనగా నట్లే నివేదించెద నని యర్థము. శ్రౌషట్ అనునది నివేదన ప్రకారము. అధ్వర్యు డపుడు హోతను జూచి 'యజ' యని పలుకును. ప్రకృతదేవతాకమైన 'యాజ్యా'రూప మగు ఋక్కును బఠింపు మని యర్థము. హోత యపుడు 'యే యజామహే' యని పలుకును. నీచే ప్రేషితుల మగు మేము 'యాజ్య'ను బఠింతు మని యర్థము. హోత, యిట్లు పలికి, యాజ్యను బఠించి, యాజ్యాంతమున 'వౌ ష ట్' అని వషట్కారము జేయును. అట్లు వషట్కారము జేయబడు సమయమున గాని, వషట్కారాంతమున గాని యధ్వర్యుడు స్వహస్తమునందున్న హవిస్సు నగ్ని యందుంచును.

యజమానుని కోరికల గురియించునట్టిది యగుటచే వేదవాక్కు కామధేనువు. వేదవాక్కునకే 'సూనృతవాక్' అని పేరు. ఆ వేదవాక్కే యజ్ఞక్రియా నిర్వాహకమై యజ్ఞరూప మున బ్రవర్తిల్లుచుండును. అందుచే యజ్ఞమే సూనృతవాగ్రూపమగు కామధేనువుగ శ్రుతియందు వర్ణింపబడినది ('యజ్ఞో వై సూనృతా'. తై.సం. 1-7-11-3). లోకమున తృణాదిరూప మగు నాహారము నిచ్చుటకై గోవులను వానికి బ్రియములు సాంకేతికములు నగు నామములతో, లేక శబ్దములతో, బిలిచెడి యాచారము గలదు. యజ్ఞ

రూపమగు నీ వేదవాగ్ధేనువు లోకసిద్ధమగు గోవువంటిది కాదు. అలౌకిక మగు నీ ధేనువు నాహ్వానించి స్వాభిమత ఫలముల బిదుకు టెట్లు ? అందుచే నీ ధేనువును లౌకికములగు నామములతో గాక దేవనామములతోనే పిలుచుట యుక్తము. 'ఆశ్రావయ' — ఇత్యాది మంత్రము లట్టి యాహ్వాన మున కుపయుక్తము లగునని శ్రుతి నిర్దేశించినది.

> "యజ్ఞో వై సూనృతా౽౽శ్రావయే త్యైవై నా మహ్వాత్,
> అస్తు శ్రౌష డిత్యుపావాస్రాక్, యజే త్యుదనైషీత్, యే
> యజామహ ఇత్యుపాసదత్, వషట్కారేణ దోగ్ధి, ఏష వై
> సూనృతాయై దోహో య ఏవం వేద" —తై. సం. 1-6-11-3.

యజమానుడు 'ఆశ్రావయ' యను మంత్రపాఠము చేతనే యజ్ఞరూప సూనృతవాగ్ధేనువు నాహ్వానించుచున్నాడు.'అస్తు శ్రౌషట్' అను మంత్రముచే పాలు చేపునకు వచ్చుటకై వత్సమును ధేనుసమీపమునకు దోలుచున్నాడు. (వత్స ముపావసృజతి). 'యజ' యను మంత్రముచే దోహనపాత్రను సిద్ధపఱచుచున్నాడు. 'యే యజామహే' యను మంత్రముచే దోగ్ధ యగు యజమానుడు ధేనువును సమీపించి, వౌషట్' అను మంత్రముచే అభిమత ఫలరూప క్షీరమును పిదుకును—ఇదియే యజ్ఞరూప సూనృతవాగ్ధేను దోహన ప్రకారము— అని యర్థము. ఇట్లు రూపకకల్పనద్వారా శ్రుతి యీ అయిదు మంత్రముల ప్రాశస్త్యమును వివరించినది. అందు చివరిది యగు వషట్కారము దోహనసాధనమై యభిమతఫల వర్షణశీల మని తెల్పబడినది.

ఇంతే కాదు; ఆశ్రావయ – ఇత్యాది మంత్రపంచకమునకు పదునే డక్షరములు; సప్తదశాక్షర సంమిత మగు నీ మంత్రపంచకము ఛందః సారము; కాన ఛందస్యము; ప్రజాపతిరూపము – అనియు నీ శ్రుతి యిట్లు వివరించుచున్నది.

"ఏష వై స ప్తదశః ప్రజాపతి ర్యజ్ఞ మన్వాయ త్తః....
ఏష వై ఛందస్యః ప్రజాపతిః" — తై. సం. 1-6-11-1, 4.

మహాభారతము (12-47-43) గూడ నీ మంత్రపంచకముచే యజ్ఞములందు సర్వదేవతాత్మకు డగు విష్ణువు హూయమాను డగుచుండునని యీ మంత్ర పంచకముయొక్క ప్రాశ స్త్యమును వివరించుచున్నది.

'చతుర్భి శ్చ చతుర్భి శ్చ ద్వాభ్యాం పంచభి రేవ చ।
హూయతే చ పున ర్ద్వాభ్యాం స మే విష్ణుః ప్రసీదతు॥'[1]

దశేంద్రియ-పంచప్రాణ-మనోబుద్ధులతో విలసిల్లెడి[2] సూక్ష్మ శరీరము (లింగశరీరము) నకును స ప్తదశక మనిపేరు. ప్రాణశ క్తిసంభృత మైన యీ సూక్ష్మశరీరమే భోగసాధన మగుచు స్థూలశరీర యాత్రానిర్వాహ కము; కాన నత్యంతప్రధానము. అట్లే స ప్తదశాక్షరోపేతమై, ఛందః సారమై, ప్రజాపతిరూపమై యొప్పు నీ మంత్రపంచకము యజ్ఞశరీర నిష్పాదకమై యజ్ఞ నిర్వాహకము; అందుచే నత్యంతప్రధానమై యొప్పునని శ్రుతి, స్మృతితాత్పర్యము.

వషట్కారము ఆదిత్యరూపము, దేవపాత్రము :

ఇట్లీ మంత్రపంచకము ఛందస్సారమై మహిమాన్విత మగుటచేతనే యీ మంత్రముల నుచ్చరించుచు వషట్కారమును జేయునపుడుగాని, చేసిగాని, హోమము జేయవలెను. తత్పూర్వము చేయరాదు. శ్రుతియు నీ విషయము నిట్లు చెప్పుచున్నది.

1. 'తస్మై హోమాత్మనే నమః' - అనియు పాఠాంతరము.

2. పంచప్రాణ మనోబుద్ధి దశేంద్రియ సమన్వితమ్।
అపంచీకృత భూతోత్థం సూక్ష్మాంగం భోగసాధనమ్॥ —ఆత్మబోధ.

"అసౌ వా అనువాక్యా, ఇయం యాజ్యా - తే ఉభే యోషే।
తయో ర్మిథున మస్తి వషట్కార ఏవ। తద్వా ఏష ఏవ
వషట్కారః - య ఏష తపతి। స ఉద్యన్నేవామూ మధి
ద్రవతి, అస్తం యన్నిమా మధిద్రవతి। తదేతేన వృష్ణేమాం
ప్రజాతిం ప్రజాయతే - య్యైనయో రియం ప్రజాతిః॥

సోఽనువాక్య మనూచ్య, యాజ్యా మనుద్రుత్య పశ్చా
ద్వషట్కరోతి ... దేవపాత్రం వా ఏష యద్వషట్కారః।
తద్యథా పాత్ర ఉద్ధృత్య ప్రయచ్ఛేత్ - ఏవం తత్। అథ
యత్పురా వషట్కారా జ్జుహుయాత్ - యథాధో భూమౌ
నిదిగ్ధం తదమియా స్యాత్ - ఏవం తత్। తస్మా దు సహ
వైవ వషట్కారేణ జుహుయాద్ వషట్కృతే వా॥"
— శ. బ్రా. 1-7-2-11 నుండి 14.

హోతచే పఠింపబడెడి దేవతాహ్వానరూప మగు ఋక్కు అనువాక్య. హవిఃప్రదానమునకై పఠింపబడెడి ఋక్కు యాజ్య. మొదట అనువాక్యను తరువాత యాజ్యను పఠించి యాజ్యానంతరము వషట్కారము జేయవలెను. 'యాజ్యా-అనువాక్యా' అను శబ్దములు రెండును స్త్రీ లింగము లగుటచే స్త్రీ రూపములు. వషట్కారము పుంలింగ మగుటచే పురుషరూపము. స్త్రీరూపములగు నీ యాజ్యానువాక్యలకు పురుషరూపమగు వషట్కారముతో మిథునభావ (దాంపత్య) మేర్పడుచున్నది. మఱియు, దేవతాస్తుతిరూపమై దేవతాసంబద్ధ మగుచు అనువాక్య ద్యులోకరూపము. హవిఃప్రదాన సాధన మగుచు యాజ్య పృథివీరూపము. ఇట్లు పురోనువాక్యాయాజ్యలు రెండును ద్యావాపృథివీ రూపములు. ద్యావాపృథువుల రెండింటిని వెలయింప జేయుచు వెలుగొందెడి యాదిత్యుడే వషట్కారము. ఆదిత్యుడు వర్షణశీలు డగుటచే 'వృషా' యని చెప్పబడును. అట్టి యాదిత్యునితో సంగతము లయి ద్యావా

పృథువులు వివిధ ప్రజోత్పాదన సమర్థము లగుచుండును. అట్లే వషట్కారముతో (ఆదిత్యునితో) సంగతము లయి యాజ్యానువాక్యలును అభిమతఫలప్రజనన సమర్థము లగును. కాన వౌషట్ అనుచు వషట్కారము జేయుసమయమునగాని, తదనంతరముగాని హవిఃప్రదానము జేయవలెను; అంతకు బూర్వము చేయరాదు.

ఇంతే కాదు. ఈ వషట్కారము దేవపాత్రము (పిబన్త్యనేన దేవా ఇతి దేవపాత్రమ్). దేవతలకు లోకసిద్ధము లయిన పాత్రలు తగవు; వారు హవిరాదుల గ్రహించుటకు యోగ్యమైన యలౌకికపాత్రయే వషట్కారము. వషట్కారానంతరము హవిస్సు నొసగుచో దేవపాత్రతో హవిస్సు నుద్ధరించి యొసగినట్లగును (పాత్రోద్ధారపూర్వక ప్రదాన మివ భవతి). అందుచేగూడ వషట్కారమునకు బూర్వమే హవిస్సు నిచ్చుచో నది నేల పాలయిన వస్తువువలె (భూమౌ నిదిగ్ధం యథా) నిరుపయోగ మగును — అని యర్థము. వషట్కార రూపమగు దేవపాత్రతోనే దేవతలు తృప్తి జెందెదరని ఐతరేయబ్రాహ్మణముగూడ నిట్లు చెప్పుచున్నది.

> "దేవపాత్రం వా ఏత ద్వషట్కారో వషట్కరోతి దేవపాత్రే
> ణైవ తద్దేవతా స్తర్పయతి, ఇతి।'' — ఐ. బ్రా. 3-5.

వషట్కారముయొక్క ప్రాశస్త్య మిట్టిది. అది యాదిత్యరూపము. ఆదిత్యునివలె స్వయంప్రకాశశీలమై నూతన శక్త్యాధాయకము, అభిమతఫలవర్షకము నగునవి తెలియనగును; యజ్ఞములందు హవిస్సుల వహించునదియగుట చేతను వషట్కారము దేవపాత్రమై యొప్పును.

> ''ఉహ్యతేఽనేన ఇతి వషట్; వహ ప్రాపణే; వౌషట్,
> వషట్ చ'' —అమరసుధాటీక.

వాక్-ప్రాణాపానములు - వషట్కారము :-

వషట్కారముచేయు హోత యను ఋత్విజునియొక్క వాక్కు, ప్రాణాపానములును గూడ వషట్కారము లగునని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"ఓజశ్చ హ వై సహశ్చ వషట్కారస్య ప్రియతమే తన్వౌ....
వాక్ చ వై ప్రాణాపానౌ చ వషట్కారః; త ఏతే
వషట్కృతే వషట్కృతే వ్యుత్క్రామంతి, తా ననుమంత్ర
యేత వా గోజః సహ ఓజో మయి ప్రాణాపానౌ
విత్యాత్మన్యేవ తద్ధోతా వాచం చ ప్రాణాపానౌ చ ప్రతిష్ఠా
పయతి సర్వాయుః సర్వాయుత్వాయ" — ఐ.బ్రా. 3-8.
ఏతే ఏవ వషట్కారస్య ప్రియతమే తనూ య దోజశ్చ
సహశ్చ" — కౌ. 3-5.

హోత యను ఋత్విక్కు వషట్కారము జేయునపు డెల్ల వషట్కార రూపము లగు నా హోతయొక్క వాక్-ప్రాణాపానములు శరీరమునుండి యుత్క్రమించుచుండును. అపుడు హోత 'వాగోజః సహ ఓజో మయి ప్రాణాపానౌ' అనుచు అనుమంత్రణము జేయవలెను. ఓజస్సు సహస్సు అనునవి వషట్కారముయొక్క ప్రియతమములైన రెండు శరీరములు. ఇట్టి ప్రియతమ శరీరములతో నొప్పెడి యో వషట్కారమా! నీ యనుగ్రహము వలన నాయందు ఓజస్సహస్సులు సిద్ధించుగాక! వాక్-ప్రాణాపానము లనెడి యీ వషట్కారములు నాయందు సుఖముగ నుండుగాక-యని యనుమంత్రణమంత్రార్థము. ఇట్లనుమంత్రణము జేయుటవలన హోత యొక్క వాక్-ప్రాణాపానము లుత్క్రమింపవు. అతనియందే ప్రతిష్ఠితము లగును. ఆతడు నాయుష్మంతుడై వర్ధిల్లును-అని పై మంత్రార్థము.

ఇట 'వాగోజః సహ ఓజో మయి ప్రాణాపానౌ' అనుచు హోత వషట్కారమును ప్రార్థించుచున్నాడు. ఇట్లు ప్రార్థింపబడు ఓజస్సహ శ్శరీర సంపన్న మగు వషట్కారము ఆదిత్యుడే లేక ప్రజాపతియే యగును. ఓజస్సు అనగా జగద్విధారక మగు పారమేశ్వరశక్తి. ఈ శక్తితోనే పరమేశ్వరుడు జగత్తును భరించుచున్నట్లు భగవద్గీతయందును గాంచనగును.

"గా మావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా।" —15-13.

"ఓజసా బలేన, య ద్బలం కామరాగవివర్జిత మైశ్వరం జగద్విధారణాయ పృథివ్యాం ప్రవిష్టమ్, యేన గుర్వీ పృథివీ నాఽధః పతతి న విదీర్యతే చ" — శం. భా.

కాన, కామరాగవివర్జితమై జగత్తును భరించెడి పారమేశ్వరశక్తియే ఓజస్సు. ఈ శక్తియే అష్టమధాతురూపమున ప్రాణిశరీర ధారణము జేయుచుండును. కామరాగవివర్జితులై జితేంద్రియులగు మహాత్ములయం దీ యోజశ్శక్తియు, దానితోపాటు సహశ్శక్తియు విశేషముగ నభివ్యక్త మగుచుండును. సహస్సు అనగా శత్రువులను, లేక అరిషడ్వర్గమును సహించెడి (తిరస్కరించెడి) శక్తి. బ్రహ్మచర్యాది కఠిననియమములవలన ఓజస్సుతోపాటు సహశ్శక్తియు వృద్ధిజెందుచుండును. కాన ఓజస్సహశ్శక్తి పరిపూర్ణుడగు పరమేశ్వరుడే యిట వషట్కారశబ్దవాచ్యుడు. అట్టిశక్తుల ననుగ్రహింపు మని హోత యభ్యర్థించుచున్నాడు. పరమేశ్వరానుగ్రహముచే నట్టిశక్తులతో విలసిల్లు జితేంద్రియులగు మహాత్ములయొక్క 'వాక్-ప్రాణాపానములు' గూడ వషట్కారములే యగునని శ్రుతి చెప్పుచున్నది. ఇంతే కాదు; 'వాగోజః సహ ఓజః' అను నీ శాంతికరణరూప మగు మంత్రస్వరూపము వాజసనేయసంహితయం దిట్లు గలదు,

"ఋచం వాచం ప్రపద్యే మనో యజుః ప్రపద్యే సామ ప్రాణం ప్రపద్యే చక్షుః శ్రోత్రం ప్రపద్యే । వాగోజః సహౌజో మయి ప్రాణాపానౌ" — వా.సం. 36-1.

"వాగాదిగ్రహణం సప్తదశావయవోపలక్షణమ్। సప్తదశావయవం ప్రజాపతేర్లింగం ప్రపద్యే ఇత్యర్థః। త్రయీవిద్యాం లింగ శరీరం చ ప్రపన్నం ప్రవర్గ్యో న నాశయేదితి భావః। తథా వాగింద్రియం ఓజో మానసం బలం ధార్ష్ట్యమ్। పున రోజో గ్రహణా చ్ఛారీరం చ బలమ్। ప్రాణాపానౌ చ ఏతే సహ ఏకీభూతాః సంతో మయి వర్తన్తే। అతోఽపి ప్రవర్గ్యో ఽస్మాన్ న హన్తీతి భావః —మహీ.భా. (మూ. ఉవట. భా)

ఇట ఋగ్యజుఃసామాత్మక మగు వేదవాక్కు వాఙ్మనః ప్రాణాత్మకముగ జెప్పబడినది. వాగాదులు సప్తదశావయవోపేత మగు సూక్ష్మ శరీరమున కుపలక్షకములు. అందుచే త్రయీవిద్య నాశ్రయించి స్థూలదేహాభిమాన రహితుడై సప్తదశావయవోపేతము, ఛందఃసార సమాహితము ప్రాణశక్త్యభినివిష్టము (ప్రజాపతే ర్లింగం) నగు లింగశరీరము నావేశించి యుండువానికి నాశ ముండదు; వాగింద్రియము, ఓజస్సు, ప్రాణాపానములు ఏకీకృతములై యుండును; అందువలనను గూడ నాశము సంభవింపదు—అని యర్థము.

ఇట జగద్విధారకములైన పరమేశ్వరుని ఓజస్సహశ్శక్తులే వషట్కారమునకు ప్రియతమము అగు శరీరము లని చెప్పబడుట గమనార్హము. కాగా వషట్కారము పరమేశ్వరస్వరూపము, తద్వాచకము నని పర్యవసిత మగుచున్నది. వషట్కారరూపుడగు పరమేశ్వరునే యిట అనుమంత్రణ మంత్రముచే ప్రార్థించుచున్నాడు. తదనుగ్రహముచేతను, త్రయీవాక్సంపత్తి చేతను, ప్రాణశక్త్యభినివిష్ట మగు లింగశరీర తాదాత్మ్యముచేతను హోత

యొక్క వాక్ప్రాణాపానములు గూడ ఓజస్సహశ్శక్తి సంపన్నములై వషట్కారరూపములై యాతనియందు ప్రతిష్ఠితము లగును. అట్టి ఋత్విజులచే జేయబడెడి వషట్కారము ఆదిత్యునివలె, లేక పరమేశ్వరుని వలె ఓజస్సహశ్శక్తి సంపన్నమై యభిమతఫల వర్షణశీలమై (వృషా) యొప్పును. ఇక వషట్శబ్ద నిర్వచనముల బరిశీలించినను నియ్యది పరమేశ్వరరూపము; తద్వాచకము, వేదవాచకము నగుట గాంచగలము.

వషట్కారము-పరాదేవత (పరమేశ్వరుడు):—

"యః సూర్యః స ధాతా స ఉ ఏవ వషట్కారః"

— ఐ. బ్రా. 3-48.

"తద్వా ఏష ఏవ వషట్కారః య ఏష తపతి"

— శ. బ్రా. 1-7-24.

అనుచు శ్రుతులచే విధాతయగు నాదిత్యుడు వషట్కారరూపుడుగ జెప్ప బడినాడు. సవితృభర్గస్స్వరూపిణి యగు గాయత్రీపరాదేవతయు త్రిసంధ్యల యందు 'ఓజోఽసి సహోఽసి' యనుచు ఓజస్సహశ్శక్తిరూపిణిగ ధ్యానింపబడుచున్నది. వషట్కారముగూడ ఓజస్సహశ్శరీరములతో వెలయు నని పూర్వము చెప్పబడినది. బ్రహ్మవిద్యారూపిణి యగు పరదేవత 'వషట్' రూపిణిగ హరివంశమున (2-3-23) నిట్లు కీర్తింపబడినది.

'విద్యానాం బ్రహ్మవిద్యా త్వ మోంకారోఽథ వషట్ తథా'

కాన వషట్కారము పరదేవతా (పరమేశ్వర) రూపము, తద్వాచకము ననియు గ్రహింప వగును. వషట్కారము పరమేశ్వరనామముగ సహస్ర నామము లందును బ్రసిద్ధము.

"విశ్వం విష్ణు ర్వషట్కారః" — విష్ణుసహస్రనామ.

"యదుద్దేశేన అధ్వరే వషట్క్రియతే స వషట్కారః। యస్మిన్ యజ్ఞే వా వషట్క్రియా, యజ్ఞో వై విష్ణుః ఇతి శ్రుతేః। వషట్కారాది మంత్రాత్మనా వా దేవాన్ ప్రీణయతి స వషట్కారః। దేవతా వా, ప్రజాపతిశ్చ వషట్కారశ్చ ఇతి శ్రుతేః। చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభి రేవ చ। హూయతే చ పున ర్ద్వాభ్యాం స మే విష్ణుః ప్రసీదతు॥ ఇత్యాది స్మృతే శ్చ" — శం. భా.

వషట్కారముచే యజ్ఞములం దుద్దిష్ట డగుటచే యజ్ఞస్వరూపి యగు విష్ణువునకు వషట్కారః అని పేరు. వషట్కారాది (ఆశ్రావయ ఇత్యాది) మంత్రాత్మకుడై దేవతల ప్రీతుల గావించువాడగుట చేతను విష్ణువు 'వషట్కారః' అని చెప్పబడినాడు. 'ప్రజాపతిశ్చ వషట్కారశ్చ' అను శ్రుతి ననుసరించియు, స్మృతుల ననుసరించియు ఛందస్యుడగు (వేదసారరూపుడగు) ప్రజాపతియు, పరమేశ్వరుడును వషట్కారరూపులు- అని యర్థము.

విశ్వము నంతయు స్వేచ్ఛగా స్వవశమున నుంచుకొను వా డగుటచే పరమేశ్వరునకు 'వషట్కారః' అను నామము సార్థక మని శ్రీ పరాశర భట్టాదు లిట్లు వివరించిరి.

"వషట్కారః- సర్వం, వశం స్వేచ్ఛానువర్తి, కరోతీతి; కరోతేః కర్మణ్యణ్, వశ కాన్తౌ ఇత్యస్మా ద్ధాతోః"

— పరాశరభట్టభాష్యం.

"వషట్కారః- సర్వం, వషట్ వశం స్వేచ్ఛావర్తి కరోతీతి"

— నిర్వచనవ్యాఖ్య.

"స్వేచ్ఛయా యో వశే సర్వం కరోతి స వషట్కారః"

— నిరుక్తివ్యాఖ్య.

వౌ (ఆదిత్యః), షట్ (ఋతవః) - వౌషట్ :-

"వౌషళితి వషట్కరోతి. అసౌ వావ వా వృతవః ష శేత మేవ త దృతు ష్వాదధాతి, ఋతుషు ప్రతిష్ఠాపయతి, యాదృగివ వై దేవేభ్యః కరోతి తాదృగి వాస్మై దేవాః కుర్వన్తి" —ఐ.బ్రా. 3-6.

"మంత్రే పూర్వభాగో వౌ శబ్దో నిపాతత్వా ద్వాగతి ప్రజనేత్యాది ధాతుజత్వా ద్వా గమనస్వభావ మాదిత్య మభిధత్తే। త దేత దభిప్రేత్య అసౌ వావ వా విత్యు క్తమ్। వసంతాద్యా ఋతవః సంఖ్యావశాత్ షడిత్యభిధీయంతే। తన్మంత్రపాఠేన ఏత మేవ వౌ శబ్దాభిధేయ మాదిత్యం షట్శబ్దాభిధేయేషు ఋతుషు ఆదధాతి। న కేవల మాధాన మాత్రమ్, కింతు తేషు ఋతుషు ప్రతిష్ఠాపయతి; స్థైర్యేణావస్థాపయతి। ఏవం సత్యసౌ హోతా దేవేభ్యో యాదృశ మేవ ప్రయోజనం కరోతి తాదృశ మేవ ప్రతిష్ఠారూపం ప్రయోజనం అస్మై హోత్రే తద్ద్వారేణ యజమానాయ దేవాః కుర్వంతి" —సా.భా.

వౌషట్ అను మంత్రము వౌ-షట్ అను పదద్వయాత్మకము. వౌ అను పూర్వపదము నిరంతరగమనశీలు డగు ఆదిత్యుని బోధించును. షట్శబ్దము వసంతాది షడృతు వాచకము. ఇట్టి యీ పదముల రెంటితో రూపొందిన వౌషట్ అను మంత్రమును బలికెడుచో నాదిత్యుడు ఋతువులయం దాధానము జేయబడును. అంతే గాదు; అందు ప్రతిష్ఠితుడు గావింపబడును. అనగా ఋతుధర్మములయందు వ్యాకులపాటు సంభవింపకుండ ఋతువుల స్వస్వ ప్రయోజన సమర్థము లగునట్లు గావించును. (ఋతూన్ కల్పయతి

స్వ స్వ ప్రయోజన సమర్థాన్ కరోతి। తావతా ఋతవః వ్యాకులతా మంతరేణ ప్రతితిష్ఠంతి — సా. భా. ఐ. బ్రా. 3-6). ఈ వషట్కారణముచే హోత దేవతల నెట్లు తృప్తినొందించునో దేవతలును నట్లే ఋతువ్యవస్థా రూప మగు ప్రయోజనమును హోతద్వారా యజమానున కనుగ్రహింతురు- అని యర్థము.

విధివిహితముగ నా యా ఋతువులయందు - నా యా కాలముల యందు - యజనము జేయువారు (ఋతౌ యజన్తి, కాలే కాలే యజన్తీతి వా ఋత్విజః — చూ. భారతీశబ్దము) ఋత్విజులు. ఇట్లు యజనము జేయుచు నాదిత్యు నా యా ఋతువుల యందు ప్రతిష్ఠితుని గావింతురు. ఆదిత్యునకు ఋతుకర్త యని ప్రసిద్ధి. యజనముచేసినను,చేయక పోయినను నాదిత్యుడు స్వయముగనే ఋతువుల (కాలభాగముల) బ్రవర్తింప జేయును. కాని యజనము జేయుచో యజ్ఞప్రభావితుడై ప్రీతు డగును. ఋతువులును సువ్యవస్థితములై పరస్పర సంకీర్ణములు గాక లోకకల్యాణకరము లగు ఋతుధర్మములతో నొప్పి యజమానుల ననుగ్రహించునని భావము. కాన వౌషట్ అను మంత్రము శబ్దశక్తిచే ఆదిత్యుడు ఋతువులయందు ఆధానము చేయబడి సుప్రతిష్ఠితు డగుటను దెలియజేయును.

వాక్, షట్ (ఋతువులు) - వషట్ (అషాఢా) :-

'వౌక్-షట్' అను పదముల చేరికచే గూడ వౌషట్ పద మేర్పడు చున్నదని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"స వై వౌగితి కరోతి। వాగ్వై వషట్కారః। వాగ్ రేతః। రేత ఏవైతత్ సించతి। షడితి। ఋతవో వై షట్। తద్ ఋతుష్వేవ ఏతద్ రేతః సిచ్యతే। తదృతవో రేతః సిక్త

మిమాః ప్రజాః ప్రజనయంతి। తస్మా దేవం వషట్కరోతి॥"

— శ. బ్రా. 1-7-2-21.

"వౌగితి ఉచ్చారణం కుర్యాత్। తత్ ప్రశంసతి వాగ్వా ఇతి। వౌ గిత్యేత దౌకారస్థానే ఆకారేకృతే వాగితి భవతి। అతో వషట్కారో వాక్। సా చ వాగ్ రేతః, సేచనసాధన త్వాత్। ఉచ్చారణ మేవ తత్సేకః। తథా షడితి కరోతీ త్యనుషజ్యతే। బ్రూయా దిత్యర్థః। సంఖ్యాయా ఋతుష్వపి సంభవాత్। ఋతవ ఏవ షట్ ఇత్యనేన వివక్షితాః; ప్రాక్ షడిత్యతః వౌగి త్యేతస్య స్థాపనాత్। తేన సిక్తం రేతః ఇమాః సర్వాః ప్రజా ఉత్పాదయన్తి। తస్మా దేవం వౌషడితి వషట్కుర్యాత్"

— సా. భా.

'వౌక్-షట్ అను పదముల జేర్చి వౌషట్ అని యుచ్చరింపవలెను. వౌక్ అనగా వాక్కు. ప్రజననశక్తిసాధన మగుటచే నీ వాక్కు రేతోరూపము. ఉచ్చారణమే రేతఃసేకము. ఇక షట్ శబ్దము షడృతువుల కుపలక్షకము. వాక్కు నుచ్చరించుచు రేతఃసేచనము చేసి ఋతువులయందు శక్తి నాధానము జేయుచో ఋతువులు వాగ్రేతఃసిక్తములై ప్రభావితము లగును. సువ్యవస్థితములై సుప్రజాప్రజనన సమర్థములగును— అని యర్థము.

వౌక్ అనగా వాక్కు అని యిట జెప్పబడినది. అనగా వేదవాక్కు అని యర్థము. అందుచే వౌషట్ అను మంత్రము శబ్దశక్తిచే 'వేదవాక్కు షడృతువులయందు ఆధానము చేయబడుట'ను దెలియ జేయును. వషట్కార పూర్వకముగ వేదమంత్రప్రభావితము లయిన ఋతువులు దివ్యశక్తి సంపన్నము లగుచు నుత్తమసంస్కార సంపన్నము, ఓజస్సహశ్శక్తి విలసితము, లోకక్షేమసంధాయకము నగు ప్రజను (ప్రకర్షేణ జాయత ఇతి ప్రజా) గలుగ జేయు నని భావము.

ఇట వాక్కుచే ఋతువులు ప్రభావితము లగునని చెప్పబడినది. ఋతువు లనగా వసంతాది షడృతువులే కాదు. ఋతువులచే నుపజీవితులై, ఋతుయాజులై, (విధివిహిత కాలాతిక్రమణము జేయక యజనము చేయు వారై) వరలెడి ఋత్విజాదులు నిట ఋతుశబ్దముచే నుపలక్షితు లగుచున్నారు. అట్టి ఋత్విజులను ఋతురూపులుగ దర్శింపవలె నని శ్రుతి సంప్రదాయము ('ఋతవ ఋత్విజః। స యోహ వా ఋతవ ఋత్విజ ఇతి వేద'—శ. బ్రా. 11-2-7-2). కాన నిట ఋతువు లనగా ఋత్విజులు నగుదు రని తెలియ నగును. వేదవాక్కు ఋతురూపు లగు నట్టి ఋత్విజు లందు లేక యజమానులందు ప్రతిష్ఠితమై ఓజస్సహశ్శక్తి సమన్వితమై విలసిల్లు ననియు శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

> "యద్వేవాషాఢా ముపదధాతి। వాగ్వా ఉఅషాఢా। వాచైవ తద్దేవా అసురాన్ సపత్నాన్ భ్రాతృవ్యా నస్మా త్సర్వస్మా దసహంత। తథైవైత ద్యజమానో వాచైవ ద్విషంతం భ్రాతృవ్య మస్మా త్సర్వస్మా త్సహతే.... ఋతుషు తద్వాచం ప్రతిష్ఠాపయతి। సేయం వాక్ ఋతుషు ప్రతిష్ఠితా వదతి।.. అషాఢాఽసి సహమానా (వా. సం. 13-26) ఇతి। అసహన్త హ్యేతయా దేవా అసురాన్ ।
>
> —శ. బ్రా. 7-4-2-34, 37-39.

> "అథాధ్యాత్మమ్.... వా గషాఢా.... ఆత్మనో హ్యేవేయం వాక్.... త్ర్యాలిఖితా భవతి। త్రేధా విహితా హి వాక్-ఋచో యజూంషి సామాని।" —శ.బ్రా. 6-5-3-4.

చయనమునందు అషాఢేష్టకోపధానమునకు సంబంధించిన వాక్యము లివి. ఋగ్యజుఃసామరూపమైన వేదవాక్కు ఇట 'అషాఢా' యని చెప్పబడు

చున్నది. ఈ వాక్కుచేతనే దేవత లసురులను సహించిరి (తిరస్కరించిరి). ఈ వాక్కు అనంతశక్తి సంపన్న మగుటచే "సహస్రవీర్యాఽసి" (వా.సం. 13-26)- అనియు జెప్పబడుచున్నది. అనంతశక్తిమహితమై శత్రుసహన శక్తిసంపన్న మగుటచే నీ వాక్కుకు 'అషాఢా' యని యన్వర్థనామము. ఈ వాక్కుచే దేవతలవలె యజమానుడును శత్రు సహనశక్తి సంపన్నుడగును; ఋతువులయందు, అనగా ఋత్విజులయందు, త్రయీరూపమగు నీ వాక్కు అషాఢయై- పరాభిభవనశీలయై- విలసిల్లును- అని యర్థము.

కాన, వషట్కారము (వాక్-షట్)చే వాక్కు ఋతువులందు ప్రతిష్ఠిత మగుట యనగా- (1) అన్ని ఋతువులందును నా యా కాలములందు జేయదగిన యజ్ఞకర్మల ద్వారా వేదవాక్కును ప్రతిష్ఠితము గావించుట; సహస్రవీర్యాత్మక మగు నీ వేదవాక్కుచే వసంతాది ఋతువులు ప్రభావితము లగుట, (2) ఋతువులయందు, అనగా ఋత్విజులయందు ప్రతిష్ఠితమై త్రయీరూప మగు నీ వేదవాక్కు అనంతశక్తి సంపన్నమై, అషాఢయై విలసిల్లుట - యను రెండర్థములు నిట దెలియ దగియున్నవి. కాగా, అనంతశక్తిసంపన్నమగు నీ వాక్కు ఋత్విజులను, యజమానుని, యజ్ఞాదికర్మలను, తద్ద్వారా దేశకాలములను ప్రభావిత మొనర్చి సుప్రజా ప్రజనన సమర్థమై, లోకకల్యాణహేతువై విలసిల్లునని 'వషట్'శబ్దము శబ్దశక్తిచే ప్రబోధించుట తెలియును.

వాక్కు-షడంగములు : వషట్ :-

స్వాహా, స్వధా శబ్దములవలెనే వషట్కారము గూడ పరదేవతా వాచక మని షడ్వింశబ్రాహ్మణ మిట్లు వర్ణించుచున్నది.

"చత్వారో௨స్యై వేదాః శరీరమ్। షడంగా న్యంగాని.... సా స్వాహా। సా స్వధా। స వషట్కారః। సైషా దేవేషు వషట్కారభూతా ప్రయుజ్యతే" — 5-7-2.

పరదేవతకు నాలుగువేదములు శరీరము. శిక్షాదిషడంగము లంగములు. ఆమెయే స్వాహా, స్వధా, వషట్కారము దేవయజ్ఞములందు జేయబడెడి వషట్కారము పరదేవతారూపము - అని యర్థము. పితృయజ్ఞములందు జేయబడెడి స్వధాకారమె వషట్కారము (స్వధా నమ ఇతి వషట్కారః - శ. బ్రా. 2-6-1-24)- అని పూర్వము వివరింపబడినది. అందుచే నిచటి వషట్పదము గూడ, పూర్వోదాహృత శ్రుతి ననుసరించి వాక్ - షట్ పదముల చేరికచే సిద్ధించిన దనియే తెలియనగును. వాక్ అనగా వేద వాక్కనియే యర్థము. కాని యిచటి 'షట్' పదము ప్రకరణము ననుసరించి షడంగములకు గూడ నుపలక్షకము. నాలుగువేదములు శరీరము, షడంగము లంగములు - అని పరదేవతావర్ణన మిట గన్పట్టుచున్నది. కాన నిచటి వషట్ పదముచే పరదేవత షడంగ సహిత వేదవాక్స్వరూపిణి - అనగా మంత్రబ్రాహ్మణాత్మక వేదస్వరూపిణి - యని తెలియును.

కాన పై ప్రమాణముల ననుసరించి వషట్ అనగా :— 1. షడంగోపేత వేదవాక్కు, 2. తత్ప్రతిపాద్యయు వేదశరీరిణి యగు పరాదేవత, 3. షడృతుప్రతిష్ఠితు డగు ఆదిత్యుడు, 4. ఋతు (ఋత్విజ) ప్రతిష్ఠిత మగు వేదవాక్కు, 5. హవిస్సుల వహించెడి దేవపాత్రము, 6. ఓజస్సహశ్శక్తి సంపన్నము లగు వాక్-ప్రాణాపానములు, 7. ఆశ్రావయేత్యాది మంత్రపంచకముచే హూయమాను డగు విష్ణువు, 8. జగత్తును తన వశమున నుంచుకొను పరమేశ్వరుడు, 9. ఛందస్యుడగు ప్రజాపతి - ఇత్యాద్యర్థములు శ్రుతిస్మృతుల వలన దెలియుచున్నవి. కాగా వేదాదిశబ్దముల

వలెనే యీ శబ్దముగూడ వేదమునకును పరమేశ్వరునకును గల ప్రతిపాద్య ప్రతిపాదక భావసంబంధము నభివ్యక్తము చేయుట స్పష్టము.

ఇట్లు స్వాహా - స్వధా - వషట్కార శబ్దములు విలక్షణ మహామాన్వితములై యభిమతఫల వర్షకము లగుటచే శ్రుతియందు వాగ్ధేనుస్తనములుగ వర్ణింపబడినవి.

స్వాహా - స్వధా - వషట్ - హంతకారములు - వాగ్ధేనుస్తనములు :—

"వాచం ధేను ముపాసీత - తస్యాశ్చత్వారః స్తనాః - స్వాహా కారో వషట్కారో హంతకారః స్వధాకారః - తస్యై ద్వౌ స్తనౌ దేవా ఉపజీవంతి స్వాహాకారం చ వషట్కారం చ, హంతకారం మనుష్యాః, స్వధాకారం పితరః - తస్యాః ప్రాణ ఋషభో, మనో వత్సః" — బృ. ఉ. 5-8-1.

వేదవాక్కును ధేనువుగ నుపాసింపుడు. ఆ ధేనువునకు స్వాహాకారము, వషట్కారము, హంతకారము, స్వధాకారము - అనియెడి స్తనములు నాలుగు గలవు. ధేనువు క్షీరము నొసగురీతిని, ఈ వేదవాగ్ధేనువు దేవాదుల కుపభోగ్య మగు నన్నము నొసగుచుండును. అందు దేవతలు స్వాహాకార వషట్కారముల వలనను, మనుష్యులు హంతకారము వలనను, పితరులు స్వధాకారము వలనను నుపజీవితు లగుచున్నారు. ఆ వాగ్ధేనువునకు పతి యగు వృషభము ప్రాణము. మనస్సు వత్సము - అని యర్థము.

ఇట స్వాహాకారాదులు స్తనము లనుటచే నట్టి లక్షణములు గల వాక్కు వేదవాక్కే. అందుచే నిట వేదవాక్కును ధేనువుగా నుపాసింపవలె ననియే యర్థము. ధేనువు ఆత్మసారమగు క్షీరమును వత్సమునకును,

తనను పాలించువారలకును నందజేయును. అట్లే వేదవాగ్ధేనువు అభిలషణీయ స్వర్గాదిఫలములను తన నుపాసించి పాలించు ప్రజకు పంచిపెట్టుచుండును. ఆకలిగొని వచ్చినంతనే పాలు చేపునకు వచ్చి ధేనువు క్షీరధారల గురియు చుండును. అట్లే ఫలజిజ్ఞాసా పరవశమై మనోరూపవత్సము వేదవాగ్ధేనువును సమీపింపగనే — అర్థాద్యనుసంధానపూర్వకముగా వేదవాక్కు నుపాసింప గనే — యా ధేనువు స్వాహాకారాది స్తనముల ద్వారా యభిమతఫలము లనెడి క్షీరముల గురియించును.

'పార్థో వత్సః సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్'

ఆకలిగొని గీతాధేనువును జేరిన వత్సము పార్థుడు. గీతాధేనువు గురియించిన క్షీరధారల ననుభవించినది పార్థుడే కాదు, పార్థునితోపాటు ఆ ధేనువును పాలించెడి ధీమంతులగు విద్వాంసు లెల్లరు నాస్వాదించుచున్నారు. అట్లే అరాద్యనుసంధాన పూర్వకముగ భక్తి ప్రవణమగు మనస్సుతో త్రయీ లక్షణ మగు నీ వాక్కు నుపాసించుచో దత్ఫలము నాతడే గాదు, ఆ ధేనువును బాలించు ధీమంతు లెల్లరు తత్ఫలభాజను లగుచుందురు.

స్వాహాకారాదు లిట వాగ్ధేనుస్తనములుగ రూపణము జేసి చెప్ప బడుటచే నవి వాగ్రూపములు, ఛందఃసారమును గురియించు మహిమాన్విత మంత్రములు నగుట స్పష్ట మగుచునే యున్నది. అందు స్వాహాకార వషట్కారములు దేవతల హవిర్దానముల యందును,—అనగా దేవయజ్ఞాదు లందును, స్వధాకారము పితరుల హవిర్దానములందును, — అనగా పితృ యజ్ఞములయందును, హంతకారము మనుష్యుల (అతిథుల) కన్నాదుల నొసగు నపుడును — అనగా మనుష్యయజ్ఞము లందును నుపయుక్తము లగుచుండును.

'అతిథిదేవో భవ; అభ్యాగతః స్వయం విష్ణుః' —ఇత్యాది వచనముల ననుసరించి భక్తితో నతిథుల కాతిథ్య మిచ్చి సత్కరించు సమయమున

వినయపూర్వకముగ జెప్పెడి వచనమునకు — అనగా 'నా స్త్యుష్ణతా నా స్త్యహూపో నాస్త్యోదనసౌష్ఠవం చ కృపయా భో_క్తవ్యమ్' (ఆముక్తమాల్యద) —ఇత్యాది వచనమునకు హంతకార మని పేరు.

"అపేక్షితం యాచితవ్యం త్యాజ్యం చైవానపేక్షితమ్।
ఉపవిశ్య సుఖేనైవ భోక్తవ్యం స్వస్థమానసైః॥" —

అని యుపచార వచనముల బలికెడి యాచారము నేటికిని గలదు. ('హంతకారః, యద్యదపేక్షిత మిత్యర్థః'— ఆనందగిరి.)

ఇట్లు ఈ స్వాహాకారాదులు నాల్గును వివిధయజ్ఞములందు హవిర్దానవాచకములై, యభిమతఫలసాధనము లగుటచే వాగ్ధేనుస్తనములుగ శ్రుతిచే నిట గీర్తింపబడినవి. ఉత్తమఫలసాధనము లగు నిట్టి స్తనములతో నొప్పెడి వేదవాగ్ధేనువు నుపాసింపుడు (వాచం ధేను ముపాసీత); ఉపాసించి వాగుపాధిక బ్రహ్మభావము నొందుడు—అని శ్రుతి యాదేశము.

"ఏవం వాగ్ధేనూపాసక స్తాద్భావ్య మేవ ప్రతిపద్యతే" —శం. భా.
'తాద్భావ్యం, యథోక్త వాగుపాధికబ్రహ్మరూపత్వ మిత్యర్థః'
—ఆనందగిరి.

కాన స్వాహా-స్వధాదులు కేవల హవిర్దానవాచకములే కాదు. అభిమత ఫలముల నొసగి బ్రోచి పేయు మహిమాన్విత మంత్రములు. ఇవి యజ్ఞాదులందు వినియుక్తము లగుచు కర్మతత్త్వబోధకములగుచునే తమను వాగ్ధేను స్తనములుగ దర్శించి వాగ్ధేనూపాసనము నెవరు జేయుదురో వారికి బ్రహ్మతత్త్వావబోధకములు గూడ నగుచుండు నని శ్రుతితాత్పర్యము. కాన వేదవాక్కు కామధేనువు; స్వాహా స్వధా వషట్కార రూపిణి; తత్ప్రతిపాద్య పరాదేవత లేక పరమేశ్వరుడు స్వాహా స్వధా వషట్కార రూపుడు-అని స్పష్టమైనది, కావుననే నివి బ్రహ్మ (పరదేవతా) వాచకములుగ బ్రసిద్ధము లైనవి.

"ఓం స్వాహా స్వధా వషట్ నమ ఇతి పంచ బ్రహ్మణో నామాని" —భట్టభాస్కరః, రుద్రాధ్యాయభాష్య.

ఓం, స్వాహా, స్వధా, వషట్, నమః - అనెడి యీ యైదును బ్రహ్మకు నామము లని యర్థము.

"హిరణ్యగర్భం త్వా మాహుః స్వధా స్వాహా చ కేశవ" అనుచు భారతము (12-44-15)కూడ పరమేశ్వరుని స్వధా స్వాహాదిశబ్దములతో గీర్తించినది. కావుననే 'నమః స్వధాయై స్వాహాయై నిత్య మేవ నమోనమః' - అనుచు కర్మాచరణ సమయమున నా పరదేవతను స్మరించి యారాధించెడి యాచారము పరంపరాగతమైనది

స్వాహా, స్వధా, వషట్ శబ్దములు-చరిత్రకారులు :-

స్వాహా స్వధా వషట్ శబ్దములు మహిమాన్వితములు, వివిధార్థ బోధకములు, వేదవాచకములు నగుచు, పరతత్త్వబోధకములు నగుట శ్రుతి స్మృతి పురాణానుసారముగ దర్శించితిమి. కాని చరిత్రకారులచే జేయబడిన భాషాంతరీకరణములలో నీ పదములు కేవలము హోమసంకేత వాచకములుగను, జయజయధ్వని వాచకముల వంటివిగను గ్రహింపబడినవి. All bliss to you; All hail to thee – అని యీరీతిగ అనువదింపబడినవి. ఇట్టి యీ యనువాదములవలన నీ పదముల యర్థగాంభీర్యమే మాత్రము చెప్పబడుటలేదు. వారు కూర్చిన వేదశబ్దకోశము (Vedic Index – A. A. Macdonell and A. B. Keith) లో ఈ పదములకు స్థానమే కల్పింపబడలేదు. ఈ పదముల సార్థకతను శ్రుతియే పెక్కుతీరుల వివరించినది. శ్రీ సాయణాదిభాష్యకర్తలును స్వాహాదిపదములకు గల యాస్కప్రోక్తము శ్రుత్యనుగుణము నగు అక్షరార్థమునుగూడ నెడ

నెడ వివరించుచు వచ్చిరి. అక్షరార్థమును వివరించినపుడే యా పదముల యర్థగాంభీర్యము దర్శింప నగును.

వేదములు మానవరచితము లని చెప్పుచో స్వాహా స్వధా వషట్ శబ్దములకు శ్రుతి ప్రదర్శించిన యర్థము లెట్లు పొసగును ? షడంగోపేతము లయిన నాల్గువేదములును పరాదేవతకు శరీర మగుట యెట్లు ? ఆ వేద వాక్కు ప్రజాపతికి స్వభూత మగుట యెట్లు ?

ఆదియునుగాక, వేదములు ఆర్యు లనెడి పలుతెగలవారి రచనలని యొకవేళ నంగీకరింతము. అట్టియెడ వారును ఇతర రచయితల పలెనే దేవతాప్రీతికరము లయిన స్తోత్రముల గూర్చియుండ వచ్చును. వానిచే దేవతల దృప్తి నొందింప నగును. దేవతల ప్రీతి నొందింపగల్గిన యా రచనలు నిజముగ మహిమోపేతములే గావలెను. కాని యా రచయితలే స్వాహా పదము యొక్క యావశ్యకతను గూర్చి వారి తొలి రచన యని చెప్పబడెడి ఋగ్వేదమునందే_

"స్వాహా యజ్ఞం కృణోతన; స్వాహాకృతం హవి రదంతు
దేవాః; స్వాహా గాయత్రవేపసే హవ్య మింద్రాయ కర్తన;
స్వాహా స్తోమస్య వర్ధనా"_

అని పెక్కురీతుల నుగ్గడించుచు (1) స్వాహాకారపూర్వకముగనే యజ్ఞము జేయుడు (2) స్వాహాకార పూర్వక మగు హవిస్సునే దేవతలు గ్రహింతురు గాక (3) సోమశరీరుడగు ఇంద్రునకు స్వాహాకారపూర్వకముగ హవిస్సు నిండు (4) స్వాహాకారముచే ప్రీతులైన దేవతలు మంత్రములందు (తమ రచనల యందు) దివ్యత్వము నాపాదింతురు _ కాన నిట్లు స్వాహాంతమగు హోమమంత్రమే మహిమాన్వితమగును _ అని చెప్పిరి. ఇట్లే స్వధా, వషట్ శబ్దముల విషయమై కూడ జెప్పిరి. ఇది యెట్లు పొసగును.

స్వాహాకారాదులు లేనిచో వారిచే రచింపబడిన మంత్రములును. చేయబడెడి యజ్ఞములును ఈయబడెడి ఆహుతులును వీర్యవత్తరములు కాజాలవని యనుటలోని తాత్పర్య మేమి? ఈ స్వాహా, స్వధా వషట్ శబ్దముల మొదట గూర్చిన రచయిత యెవరు? అ రచయితయొక్క యీ కూర్పు నితర రచయితలును కర్మప్రవర్తకులును నామోదించి యుండవలెను. ఆమోదించి యీ పదముల కిట్లు పట్టము గట్టుటకు గారణ మేమి?

ఏ రచయితయు తన రచన నిరర్థక మని భావించుచో రచింపడు. వేదములు ఆంతరదృష్టిలేక కేవల బాహ్యదృష్టి గల్గిన నిరర్థకరచనలే యగుచో నెపుడో రూపటి యుండెడివి. అట్లుగాక యిది గురుశిష్య పరంపరా ప్రాప్తము లయినవి. కాన నివి సార్థకములు భూతార్థకథనములు గావలెను. అగుచో స్వాహా, స్వధా, వషట్ స్వాహాయజ్ఞః, స్వాహావరః, స్వధావాన్, స్వధాపతిః – ఇత్యాది పదము లన్నియు సార్థకములే కావలెను. సార్థకములే యగుచో స్వాహా, స్వధా వషట్ శబ్దములకు శ్రుతి ప్రదర్శించిన యావదర్థమును గ్రహించుట సమంజసము. అట్లు గాక కేవలసాంకేతిక పదము లనియో రూఢిపదము లనియో గ్రహించుచో శ్రుతిసమ్మతములు గాని యర్థములతో శ్రుతుల కర్థము జెప్పుట యగును, శ్రుతిసమ్మతమైన యర్థమునే గ్రహించుచో 'ఈ వేదమంత్రములు కేవలము దేవతాస్తుతులు మాత్రమే, ఇందు ఆంతర దృష్టి లేదు – ఇత్యాది చారిత్రికుల యూహ లుపపన్నములు గానేరవు.

ఇట నొక విషయము పరిశీలింప నగును. షడ్వింశబ్రాహ్మణమున స్వాహారూపిణి యగు పరాదేవత చతుర్వేద శరీరిణిగా బేర్కొనబడి మరల 'ఋగ్యజుః సామగతిః' – అనగా ఋగ్యజుః సామరూప పాదత్రయాత్మిక గా నిర్దేశింపబడినది. చతుర్వేదాత్మిక యగు నాదేవి 'త్రిపద' యగు టెట్లు? ఈ విషయము త్రయీస్వరూపమును బరిశీలించినగాని తేలపడదు. కాన త్రయీస్వరూపమును జూతము.

త్రయీ

కర్మ భక్తి సాంఖ్యయోగ తత్త్వబోధ సంభృతాం
ఋగ్-యజుశ్చ సామచేతి మంత్రబృందభాసురామ్ ।
త్రాయతే జగచ్చ యా త్రయీతి లోకవిశ్రుతా
తాం త్రయీం హరిప్రియాం నమామి వేదమాతరమ్ ॥

—వేదమాతృస్తవః.

వేదమునకు త్రయీ యనియు, త్రయీవిద్య యనియు నామములు ప్రసిద్ధములు. కాని యిట నొక యాక్షేపము చెప్పబడుచున్నది.

I. 'అథర్వవేదము అర్వాచీనము'-ఆక్షేపము :—

'ఋగ్యజుః సామ వేదములు మూడింటికిని గలిపి మాత్రమే త్రయీ వ్యవహారము; నాల్గవది యగు అథర్వవేదము ఆర్యు లనెడివారి యొక్క అనంతరకాలీన రచన; అయ్యది ఋగ్యజుః సామ వేదములకు 'త్రయీ' యను వ్యవహార మేర్పడిన తరువాత రచింపబడినది; లేదా అనంతరకాలీన రచన యగు అథర్వవేదమునకు వేదత్వము లే దనుటకే యీ మూడింటికిని గలిపి 'త్రయీ' యను నామము ప్రచారము లోనికి వచ్చియుండ వచ్చును.' — అని చారిత్రికులచే నూహింపబడుచున్నది. ఇందుకు చూపబడుచున్న ప్రమాణము లివి.

(1) వేదత్రయోత్పత్తి :—

"ఋచః సామాని జజ్ఞిరే.... యజు స్తస్మా దజాయత"

—ఋ. 10-90-7.

"త్రయో వేదా అజాయన్త, ఋగ్వేద ఏ వాగ్నే రజాయత,
యజుర్వేదో వాయోః, సామవేద ఆదిత్యాత్" —ఐ. బ్రా. 5-32.

"వేదై రశూన్య స్త్రిభి రేతి సూర్యః" —తై. బ్రా. 3-12-9-1.

"య మృషయ స్త్రైనిదా విదుః ఋచః సామాని యజూగ్ంషి"
—తై. బ్రా. 1-2-1-26.

"సైషా త్రయ్యేవ విద్యా తపతి" —తై. ఆ. 14-1.

పై శ్రుతి వచనముల వలన వేదత్రయోత్పత్తియే చెప్పబడుచున్నది. పరమేశ్వరుడు వేదత్రయాత్మకుడుగను, వేదవిదులు ఋగ్యజుః సామరూప త్రయీవిదులుగను చెప్పబడుచున్నారు.

(2) ఋగ్యజుఃసామలకే యజ్ఞాంగత్వము :—

"య ద్వై యజ్ఞస్య సామ్నా యజుషా క్రియతే శిథిలం
(తత్) య దృచా త ద్దృఢమ్" —తై. సం. 6-5-10-3.

"సైషా త్రయీ విద్యా యజ్ఞః" —శ. బ్రా. 1-1-4-3.

"ఉచ్చైర్ ఋచా క్రియతే, ఉపాంశు యజుషా ఉచ్చైః సామ్నా"
—సత్యా. శ్రౌ. సూ. 1-1-10.

"యజ్ఞం వ్యాఖ్యాస్యామః। స త్రిభి ర్వేదై ర్విధీయతే।"
—ఆప. పరి. సూ. 3; సత్యా. శ్రౌ. సూ. 1-1-1.

"ఋగ్వేదేన హోతా కరోతి, సామవేదే నోద్గాతా, యజుర్వేదే
నాధ్వర్యుః, సర్వై ర్బ్రహ్మా" —ఆప. పరి. సూ. 18,19,20,21.

"య దృచైవ హౌత్రం క్రియతే, యజుషాఽఽధ్వర్యవం,
సామ్నోద్గీథం వ్యారబ్ధా త్రయీ విద్యా భవతి। అథ కేన
బ్రహ్మత్వం క్రియత ఇతి త్రయ్యా విద్యయేతి బ్రూయాత్"
— ఐ. బ్రా. 5-33.

పై వచనములు ఋగ్యజుఃసామలకే యజ్ఞాంగత్వమును దెల్పుచున్నవి. యజ్ఞమున ప్రధాన ఋత్విజులు నలుగురు. అందు హోతయను ఋత్విక్కు ఋగ్వేదముచే హౌత్రమును, అధ్వర్యుడు యజుర్వేదముచే ఆధ్వర్యవమును, ఉద్గాత సామవేదముచే ఔద్గాత్రమును నిర్వర్తింతురు. ఇక బ్రహ్మ యను నాల్గవ ఋత్విక్కు త్రయీవిద్య చేతనే, అనగా ఋగ్యజుఃసామల చేతనే బ్రహ్మత్వమును నిర్వహించును - అని చెప్పబడుచున్నది.

(3) స్మృతులు కోశములు త్రయీవ్యవహారము.

"షట్త్రింశ దాబ్దికం చర్యం గురౌ త్రైవేదికం వ్రతమ్"
— మను స్మృతి. 3-1.

"ఇతి వేదా స్త్రయ స్త్రయీ" — అమరకోశః.

పై మనుస్మృతి, అమరకోశాదుల వచనముల ననుసరించియు ఋగ్యజుః సామ వేదములు మూడింటికి మాత్రమే త్రయీవ్యవహారము, వేదత్రయాధ్యయన ప్రసక్తియు గలదు.

ఇట్లు శ్రుతి, శ్రౌతసూత్ర, స్మృతి, కోశాది ప్రమాణముల ననుసరించి వేదత్రయోత్పత్తి మాత్రమే చెప్పబడి యా వేదత్రయము చేతనే యజ్ఞ నిర్వహణము సిద్ధించుటచే నీ వేదత్రయమునకు మాత్రమే త్రయీ, త్రయీవిద్య యనెడి నామములు శ్రుతుల యందు బ్రసిద్ధమై, తరువాత స్మృతి కోశాదుల యందును నట్లే గ్రహింపబడి నటుల గన్పట్టుచున్నది. కావ నాల్గవవేదము యొక్క యావశ్యకత లేదనియు, నందుచేతనే చాల కాలము వఱకు అథర్వణమునకు వేదత్వ మంగీకరింపబడ లేదనియు,

నందుచే నది యార్యు లనెడి వారి తరువాతి రచన కావచ్చు ననియు చారిత్రికులు[1] చెప్పుచున్నారు.

కాన నీ విషయముల బరిశీలించి త్రయీ స్వరూపమును దర్శింప వలసి యున్నది. అందుకై మొదట నథర్వవేదము యొక్క యావశ్యకతను, ప్రాశస్త్యమును, శ్రుతిస్మృత్యాదు లందు గల యథర్వవేద ప్రస్తావమును బరిశీలించి, తరువాత త్రయీపదము యొక్క సంప్రదాయానుగతమైన యర్థమును బరిశీలింతము.

II. అథర్వవేదము (బ్రహ్మవేదము) ఆవశ్యకత :-

బ్రహ్మకర్తవ్యోపదేశ తత్పర మగుట జేసి యజ్ఞవిషయమున నథర్వవేద మావశ్యకమే యగుచున్నది. హౌత్రము, ఆధ్వర్యవము, ఔద్గాత్రము- లనెడి క్రియలను బ్రతిపాదించుట యందు మాత్రమే ఋక్ యజుః సామ వేదములకు తాత్పర్యము. అందుచే వీనికి బ్రహ్మకర్తవ్యమును బ్రతిపాదించుటయందు తాత్పర్యము లేదు. ఏల యన హౌత్రమును బ్రతిపాదించు ఋగ్వేదమునకు ఆధ్వర్యవమును గాని ఔద్గాత్రమును గాని ప్రతిపాదించుట యందు దాత్పర్యము లేదు కదా; యజుఃసామవేదముల విషయమున గూడ నిట్లే. కనుక బ్రహ్మకర్తవ్యమును బ్రతిపాదించుటకు నాల్గవవేద మావశ్యకమే యగును. అది యథర్వవేదము.

కాని బ్రహ్మత్వము ఋగ్యజుఃసామ వేదము లందు నచటచట సూక్ష్మముగ జెప్పబడి యున్నను నది యసంపూర్ణము; సమగ్రముగ బ్రహ్మకర్తవ్యమును బ్రతిపాదించునది యథర్వవేదమే.

1. మారీస్ బ్లూమ్‌ఫీల్డు - The Atharva veda and the Gopath Brahmana. యస్. రాధాకృష్ణన్ - Indian Philosophy chap. 3-1,2. ఈయనయు బ్లూమ్‌ఫీల్డు విట్నే యను పాశ్చాత్యపండితుల యభిప్రాయములనే యుదహరించి వారితో నేకీభవించెను.

మఱియు వాఙ్మనస్సులు రెండిటితో నిర్వర్తింపదగినది యజ్ఞ శరీరము. అందు వాగ్రూప మగు శరీరార్ధభాగము ఋగ్యజుః సామల చేతను, మిగిలిన సగభాగము అథర్వవేదము చేతను నిష్పన్న మగుచున్న దని శ్రుతులు చెప్పుచున్నవి. (అతఏవ వాఙ్మనస నిర్వర్త్యస్య యజ్ఞ శరీరస్య అర్ధ మేవ త్రిభి ర్వేదై ర్నిష్పాద్యతే। అర్ధాంతరం తు అథర్వ వేదేనై వేతి శ్రూయతే - సాయణః)

"స వా ఏష త్రిభి ర్వేదై ర్యజ్ఞస్యాన్యతరః పక్షః
సంస్క్రియతే। మనసైవ బ్రహ్మా యజ్ఞస్యాన్యతరం
పక్షం సంస్కరోతి" — గో. బ్రా. 3-2.

"అయం వై యజ్ఞో యోఽయం పవతే। తస్య వాక్ చ
మనశ్చ వర్తన్యౌ। వాచా చ హి మనసా చ యజ్ఞో
ఽవర్తత। ఇయం వై వాక్। అదో మనః। త ద్వాచా
త్రయ్యా విద్యయైకం పక్షం సంస్కుర్వంతి। మనసైవ
బ్రహ్మా సంస్కరోతి।'' — ఐ. బ్రా. 5-33.

ఇట్లు అథర్వవేదీయ మగు గోపథబ్రాహ్మణము, ఋగ్వేదీయ మగు ఐతరేయబ్రాహ్మణము - రెండును వాఙ్మనసరూప మగు యజ్ఞశరీరమును నిష్పన్నము జేయుటకు నాల్గువేదముల యావశ్యకత జెప్పుచున్నవి. కాన బ్రహ్మకర్తవ్య ప్రతిపాదనమునకై యథర్వవేద మావశ్యక మగుట స్పష్టము. (చూ. శ్రీసాయణ విరచిత అథర్వవేద భాష్యభూమికా). అందు కనియే దానికి బ్రహ్మవేద మని పేరు.

"త మృచశ్చ సామాని చ యజూంషి చ బ్రహ్మ
చానువ్యచలన్" — అ. వే. 15-6-8.

"ఋచాం చ వై స సామ్నాంచ యజుషాంచ బ్రహ్మణశ్చ
ప్రియం ధామ భవతి య ఏవం వేద'' — అ. వే. 15-6-9.

"చత్వారో వా ఇమే వేదా ఋగ్వేదో యజుర్వేదః సామ
వేదో బ్రహ్మవేదః" — గో. బ్రా. 2-16.

పై శ్రుతి వాక్యములందు బ్రహ్మపదముచే నథర్వవేదము చెప్పబడుచున్నది.

III. అథర్వవేదమునకు గల నామములు :-

అథర్వవేదమునకు ఇట్లు బ్రహ్మవేదమనియే గాక అంగిరోవేదము, అథర్వాంగిరోవేదము, భృగ్వంగిరోవేదము, క్షత్రవేదము, భైషజ్యవేద మనియు నామములు శ్రుతి ప్రసిద్ధములు.

"తా ఉపదిశతి। ఆంగిరసో వేదః సో౽య మితి।"
—శ. బ్రా. 13-4-3-5.

"తా న పదిశతి అథర్వాణో వేదః సో౽య మితి।"
— శ. బ్రా. 13-4-3-7.

"యస్మా దృచో అపాతక్షన్ యజు ర్యస్మా దపాకషన్।
సామాని యస్య లోమాని అథర్వాంగిరసో ముఖమ్।"
—అ. వే. 10-7-20.

"ఏత ద్వై భూయిష్ఠం బ్రహ్మ య దృృగ్వంగిరసః"
— గో. బ్రా. 3-4.

"ఉక్థం.... యజుః ... సామ.... క్షత్రం.... వేద"
— శ. బ్రా. 14-8-14-2.

"ఋచః సామాని భేషజా యజూంషి హోత్రా బ్రూమ'
—అ. వే. 11-6-14.

IV అథర్వవేదప్రాశస్త్యము (బ్రహ్మత్వసంప్రదాయము)

శ్రీమద్రామాయణమున వసిష్ఠుడు 'క్షత్రవేదవిదాం శ్రేష్ఠో బ్రహ్మవేదవిదా మపి'— (1-65-23) అని కీర్తింపబడినాడు. ఇట బ్రహ్మవేద

మనగా ఋగ్యజుః సామ వేదము లనియు. క్షత్రవేద మనగా అథర్వవేద మనియు వ్యాఖ్యాతలు వివరించినారు. కాళిదాసు గూడ వసిష్ఠుని 'అథర్వ నిధి' యని కీర్తించెను.

"అథాథర్వనిధే స్తస్య విజితారిపురః పురః ।
అర్థ్యా మర్థపతి ర్వాచ మాదదే వదతాం వరః॥' —రఘు. 1-59.
"స బభూవ దురాసదః పరై ర్గురుణా ఽథర్వవిదా
కృతక్రియః। పవనాగ్నిసమాగమో హ్యయం సహితం
బ్రహ్మ య దస్త్రతేజసా॥" —రఘు. 8-4.

ఇట్లు వసిష్ఠుడు అథర్వనిధి యని కీర్తింపబడుటచే 'ఋగ్యజుః సామవిదుడే గాక యథర్వవేదాభిజ్ఞుడు గూడ నగువాడే పురోహిత కృత్య కుశలుడు, శాంతిక పౌష్టిక కర్మనిర్వహణ సమర్థుడు, రాజగురుపదమున కర్హుడు' — అను సంప్రదాయము తెలియుచున్నవి. ఈ విషయమును స్మృతులు పురాణాదులు నిట్లు వివరించుచున్నవి.

"త్రయ్యాం చ దండనీత్యాం చ కుశలః స్యాత్ పురోహితః ।
అథర్వవిహితం కర్మ కుర్యా చ్ఛాన్తిక పౌష్టికమ్ ॥"
—కామందకః.

"పురోహితం ప్రకుర్వీత దైవజ్ఞ ముదితోదితమ్।
దండనీత్యాం చ కుశలం అథర్వాంగిరసే తథా॥"
— యాజ్ఞ. స్మృ. 1-313.

"పౌరోహిత్యం శాంతిక పౌష్టికాది రాజ్ఞా మథర్వవేదేన
కారయేత్, బ్రహ్మత్వంచ" — విష్ణు. పు. 1-10.

"పురోహితం తథాథర్వమంత్ర బ్రాహ్మణ పారగమ్"
— మత్స్య. పు.

"అభిషిక్తో ఽథర్వమంత్రై ర్మహీం భుఙ్క్తే ససాగరామ్"
— మార్క. పు.

"యస్య రాజ్ఞో జనపదే అథర్వా శాంతిపారగః।
నివస త్యపి త ద్రాష్ట్రం వర్ధతే నిరుపద్రవమ్॥
తస్మాత్ రాజా విశేషేణ అథర్వాణం జితేంద్రియమ్।
దానసమ్మాన సత్కారై ర్నిత్యం సమధిపూజయేత్॥"

అథర్వపరిశిష్ట. 4-6.

"శాంతి పుష్ట్యభిచారార్థా ఏకబ్రహ్మా శ్రివిగాశ్రయాః।
క్రియంతేఽథర్వవేదేన త్రయ్యే వాత్మీయ గోచరా॥"

— తంత్రవార్తిక. 1-3,4.

ఇంతే కాదు. అథర్వమంత్రములకు సిద్ధమంత్రము లనియు ప్రసిద్ధి గలదు.

"న తిథి ర్నచ నక్షత్రం న గ్రహో న చ చంద్రమాః।
అథర్వమంత్ర సంప్రాప్త్యా సర్వసిద్ధి ర్భవిష్యతి।"

—పద్మ. పు.

"య స్తత్రాథర్వణాన్ మంత్రాన్ జపే చ్ఛ్రద్ధాసమన్వితః।
తేషా మర్థోద్భవం కృత్స్నం ఫలం ప్రాప్నోతి స ధ్రువమ్"

— స్కాంద. పు. (కమలాలయఖండ)

"అథాతః సంప్రవక్ష్యామి సామర్గ్యజు రథర్వాణామ్।
కర్మభి ర్యై రవాప్నోతి క్షిప్రం కామాన్ మనోగతాన్॥"

—బో. ధ. సూ. 4-5-1.

"ఇమం మంత్రం గృహాణ త్వం ఆహ్వానాయ దివౌకసామ్।
యం యం దేవం త్వ మేతేన మంత్రేణావాహయిష్యసి॥
తేన తేన వశే భద్రే స్థాతవ్యం తే భవిష్యతి।
అకామో వా సకామో వా స సమేష్యతి తే వశే॥
విబుధో మంత్ర సంశాంతో భవే ద్భృత్య ఇవానతః॥
తత స్తాం మనవద్యాంగీం గ్రాహయామాస స ద్విజః।
మంత్రగ్రామం తదా రాజన్ న్నథర్వశిరసి శ్రుతమ్॥"

—భార. 3-305-16 నుండి 20.

ఇట్లు పై వచనములు అథర్వవేదము యొక్క ప్రాశస్త్యమును, అవశ్యకతను దెల్పుచున్నవి. ఇంతే గాక పురోహితుడు, లేక వసిష్ఠుడు, లేక బ్రహ్మ, లేక బృహస్పతి, లేక రాజగురువు అగువాడు ఋగ్యజుః సామవేదము లందే గాక యథర్వవేదమునందు గూడ బరినిష్ఠితుడై యుండవలె ననెడి సంప్రదాయమును జెప్పుచున్నవి. శ్రుతియు యథర్వవిదునే బ్రహ్మగా వరింపవలె నని యిట్లాదేశించుచున్నది.

"అథ ప్రజాపతిః సోమేన యక్ష్యమాణో వేదాన్ ఉవాచ।
కం వో హోతారం వృణీయామ్। కం అధ్వర్యుమ్। కం
ఉద్గాతారమ్। కం బ్రహ్మాణమ్। ఇతి। తే ఊచుః। ఋగ్విద
మేవ హోతారం వృణీష్వ। యజుర్విదం అధ్వర్యుమ్।
సామవిదం ఉద్గాతారమ్। అథర్వాంగిరోవిదం బ్రహ్మాణం।
తథాహాస్య యజ్ఞః చతుష్పాత్ ప్రతితిష్ఠతి" — గో. బ్రా. 2-24.

అథర్వవిదుని బ్రహ్మగా వరింపనిచో ప్రత్యవాయము గూడ నిట్లు చెప్పినది.

"అథ చేత్ నైవం విదం బ్రహ్మాణం వృణుతే దక్షిణత
ఏవైషాం యజ్ఞో రిచ్యతే" — గో. బ్రా. 2-24.

"యథైకపాత్ పురుషో యన్ అనుభయచక్రో వా రథో
వర్తమానో భ్రేషం న్యేతి ఏవ మేవాస్య యజ్ఞో భ్రేషం న్యేతి"
— గో. బ్రా. 3-2.

తైత్తిరీయశ్రుతియు మనోమయాత్మ స్వరూపమును చతుర్వేదాత్మకముగ నిట్లు వివరించినది.

"తస్య యజు రేవ శిరః। ఋక్ దక్షిణః పక్షః। సామోత్తరః
పక్షః। ఆదేశ ఆత్మా। అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా"
— తై. ఉ. 2-3-1.

శ్రుతి యిచట అథర్వవేదమును మనోమయాత్మ స్వరూపమున పుచ్ఛముగా- ఆధారముగా- నిర్దేశించుచు, అథర్వవేద వైశిష్ట్యమును దెలియజేయుచున్నది. సూతసంహిత గాయత్రీపరాదేవత యొక్క స్వరూపమును వివరించుచు అథర్వవేదము యొక్క ప్రాధాన్యము నిట్లు వర్ణించినది.

"ఋగ్యజుః సామ రూపా శ్చ పాదా అస్యాః ప్రకీర్తితాః"
— 4- 6-11.

....

శిక్షా ద్యంగాని శీర్షాణి వక్త్ర మగ్ని ర్మహాద్యుతిః।
మీమాంసా లక్షణం తస్యా శ్చేష్టా చా ఽ ఽథర్వణీ శ్రుతిః॥ — 15.

'అథాతో ధర్మజిజ్ఞాసా - ఇత్యాదికం మీమాంసాశాస్త్ర మస్యాః తటస్థలక్షణమ్। అథర్వణా దృష్టా శ్రుతి ర్వేదో అస్యా శ్చేష్టాత్మకః। ఉక్తం హి - లక్షణం మీమాంసా, అథర్వవేదో విచేష్టితమ్-ఇతి। — మాధవీయ తాత్పర్యదీపికా.

శ్రీ గాయత్రీ పరాదేవతకు ఋగ్యజుఃసామలు పాదములు; మీమాంసా శాస్త్రము తటస్థలక్షణము; అథర్వవేదము చేష్ట - అని యర్థము. సూతసంహిత యందే మఱియొకచోట గూడ అథర్వవేదము యొక్క ప్రాశస్త్య మిట్లు చెప్పబడినది.

"శిఖా ఽప్యాథర్వణీ సాధ్వీ సర్వవేదోత్తమోత్తమా।
అస్మి న్నర్థే సమాప్తా సా శ్రుతయ శ్చాపరా అపి॥ 31
యథా సాక్షా త్పరం బ్రహ్మ ప్రతిష్ఠా సకలస్య చ।
తథై వాథర్వణో వేదః ప్రతిష్ఠై వాఖిలశ్రుతేః॥ 32
కంద స్తార స్తథా బిందుః శక్తి స్తారో మహాద్రుమః।
స్కందశాఖా అకారాద్యా వర్ణా యద్వ త్తథైవ తు॥ 33

తారః కందః శ్రుతే ర్జాతిః శక్తి రాథర్వణో ద్రుమః।
స్కంథశాఖా స్త్రయో వేదాః పర్ణాః స్మృతిపురాణకాః॥" 34
— సూ. సం. యజ్ఞవైభవఖండ. సూత. గీత.

తన యందధ్యస్త మయిన నిఖిలప్రపంచమునకు బ్రహ్మ ఆశ్రయభూతు డయినట్లు, ఆథర్వణశ్రుతియు రహస్యార్థ ప్రతిపాదక మగుటచే నిఖిల శ్రుతులకు నాశ్రయభూతము. మఱియు అథర్వవేద మొక మహావృక్షము. ఋగ్యజుఃసామ వేదములు దానికి స్కంధశాఖలు, స్మృతిపురాణములు పర్ణములు- అని యిట జెప్పబడినది.

ఏది యనావశ్యక మని ప్రతిపక్షవాదులచే నూహింపబడుచున్నదో యట్టి యథర్వవేదము బ్రహ్మైక ర్తవ్యప్రతిపాదకము; సిద్ధమంత్రాత్మకము; నిఖిల శ్రుతుల కాశ్రయభూతము; అందుచే నుత్తమోత్తమము నగుట దర్శించితిమి. ఇట్టి యథర్వవేద మర్వాచీన మనుట యుక్తము కాదు. ఈ శ్రుతియొక్క ప్రస్తావము సంహితలయందును, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషద్భాగము లందును, గృహ్య-ధర్మ సూత్రముల యందును, నిరుక్త వ్యాకరణాది దర్శనముల యందును బహుళముగ గలదు.

బ్రాహ్మణారణ్యకములు-చతుర్వేదప్రస్తావన :-

"ఋచో యజూగ్ంషి సామాని అథర్వాంగిరస శ్చ యే"
—తై. బ్రా. 3-12-8-2.

"య దృచో ఽధ్యగీషత తాః పయ ఆహుతయో దేవానా మభవన్ య ద్యజూగ్ంషి ఘృతాహ్వుతయో। యత్సామాని సోమాహుతయో। య దథర్వాంగిరసో మధ్వాహుతయో"।
—తై. ఆ. 2-9-2.

"యజుః— ఇతి ఏష హీదం సర్వం యునక్తి। సామ —
ఇతి ఛందోగాః, ఏతస్మిన్ హీదం సర్వం సమానమ్।
ఉక్థమితి బహ్వృచాః, ఏష హీదం సర్వ ముత్థాపయతి।
యాతుః ఇతి యాతువిదః— ఏతేన హీదం సర్వం యతమ్—
(యాతుః అథర్వవేదః—హరిస్వామి భాష్య) —శ. బ్రా. 10-5-2-20.

ఇచట నొకే యాదిత్యుడు (పరమేశ్వరుడు) యజుర్వేదీయులచే 'యజుః' అనియు, సామవేదీయులచే 'సామ' యనియు, ఋగ్వేదీయులచే 'ఉక్థ' మనియు (ఋక్ అర్చనీయః ఆదిత్యః), అథర్వవేదీయులచే 'యాతుః' అనియు నుపాసింప బడుచున్నట్లు చెప్పబడుచున్నది.

"పయ ఆహుతయో వావ ఏతా దేవానాం య దృచః। స య
ఏవం విద్వాన్ ఋచో ఽహరహః స్వాధ్యాయ మధీతే ....
య దథర్వాంగిరసః స య ఏవం విద్వాన్ అథర్వాంగిరసో
ఽహరహః స్వాధ్యాయ మధీతే" —శ.బ్రా. 11-5-6-4 నుండి 8.

ఇట బ్రహ్మయజ్ఞ సమయమున నాల్గువేదములు నధ్యయనము జేయవలెనని చెప్పబడినది.

ఉపనిషత్తులు - చతుర్వేదప్రశంస :—

"అస్య మహతో భూతస్య నిఃశ్వసిత మేతద్ యద్
ఋగ్వేదో యజుర్వేదః సామవేదో ఽ థర్వాంగిరసః"
—బృ.ఉ. 4-4-10.

"ఏతస్య మహతో భూతస్య నిఃశ్వసిత మేతద్ యద్
'ఋగ్వేదో యజుర్వేదః సామవేదో ఽథర్వాగిరసః'
—మైత్రా.ఉ. 6-32.

ఈ శ్రుతులయందు నాల్గువేదములు పరమేశ్వరుని నిఃశ్వాసరూపములుగ జెప్పబడినవి.

"వాచా వై సమ్రాడ్ బంధుః ప్రజ్ఞాయత ఋగ్వేదో
యజుర్వేదః సామవేదో ఽథర్వాంగిరసః" — బృ. ఉ. 4-1-2.

"సైషో ఽగ్నిస్త్రేయమా ఇష్టకా య దృగ్యజుఃసామా
థర్వాంగిరసః" —మైత్రా. ఉ. 6-33.

"ఋగ్యజుఃసామాథర్వాణ శ్చత్వారో వేదాః సాంగాః
సశాఖాః చత్వారః పాదా భవన్తి" — నృ. పు. తా. ఉ. 1-2.

"ప్రథమం పాదం జానీయాద్ ఋగ్యజుఃసామాథర్వరూప....
— నృ. పు. తా. ఉ. 1-4.

"ఋగహం యజు రహం సామాహం అథర్వాంగిరసో
ఽహమ్।" — అథర్వశిరస్. ఉ. 1-1.

"ఋగ్వేదాది విభాగేన వేదా శ్చత్వార ఈరితాః"— ముక్తి.ఉ.1-11-14.

"సో ఽ ధ్యాయత పూర్వాభిముఖో భూత్వా భూ రితి వ్యాహృతి
ర్గాయత్రం ఛంద ఋగ్వేదః అగ్ని ర్దేవతా। పశ్చిమాభిముఖో
భూత్వా భువ ఇతి వ్యాహృతి స్త్రైష్టుభం ఛందో యజుర్వేదో
వాయు ర్దేవతా। ఉత్తరాభిముఖో భూత్వా స్వ రితి వ్యాహృతి
ర్జాగతం ఛంద స్సామవేద స్సూర్యో దేవతా । దక్షిణాభి
ముఖో భూత్వా మహ ఇతి వ్యాహృతి రానుష్టుభం ఛందో
ఽథర్వవేద స్సోమో దేవతా" —మహా. ఉ. 1.

"తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదో ఽథర్వవేదః"
—ముండక ఉ. 1-1-5.

"తద్వా ఏత త్సుదర్శనం మహాచక్రం సర్వకామికం మోక్ష ద్వారం ఋఙ్మయం యజుర్మయం సామమయం బ్రహ్మ మయ మమృతమయం భవతి" —నృ. పూ. తా. ఉ. 5-2.

"ఋగ్వేదం భగవో ఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథ ర్వణం చతుర్థ మితిహాస పురాణం పంచమమ్" —ఛాం.ఉ. 7-12.

"నామ వా ఋగ్వేదో యజుర్వేదః సామవేద ఆథర్వణ శ్చతుర్థః" — ఛాందో. 7-1-4.

"వా గ్వావ నామ్నో భూయసీ వాగ్ వా ఋగ్వేదం విజ్ఞాప యతి యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థ మితిహాస పురాణం పంచమమ్" — ఛాందో. 7-2-1,

"విజ్ఞానం వావ ధ్యానా ద్భూయో విజ్ఞానేన వా ఋగ్వేదం విజానాతి యజుర్వేదగ్ం సామవేద మాథర్వణం చతుర్థ మితిహాస పురాణం పంచమమ్" — ఛాందో, 7-7-1.

ఇట్లుపనిషత్తులే గాక గృహ్యసూత్ర[1], నిరుక్త[2], వ్యాకరణాదులన్నియును వేదములు నాలుగు అని కంఠోక్తిగ జెప్పుచున్నవి.

ఋగ్వేదాది శ్రుతులు : వేదత్రయ - వేదచతుష్టయ ప్రస్తావము :-

పై ప్రమాణముల ననుసరించి నాల్గు వేదములును పరమేశ్వర నిఃశ్వాసరూపములు ; అనాదులు ; యజ్ఞనిర్వహణము నందు ఈ నాల్గును

1. ఆప. గృ. సూ. 3-2-6 ; శాం. గృ. సూ. 1-2-4-8 ; హిరణ్యకేశి గృ. సూ. 2-19-6 ; పారస్కర గృ. సూ. 2-10-7, 21 ; ఆశ్వ. గృ. సూ. 3-3-1 (స్వాధ్యాయవిధి).
2. పాణిని. 4-3-133 ; 6-4-174 ; 4-2-63.

అపేక్షితములు - అని తెలిసినది. కాని యిట్లు చెప్పుచో 'సైషా త్రయీ విద్యా యజ్ఞః ; సైషా త్రయ్యేవ విద్యా తపతి' ఇత్యాది పూర్వోదాహృత శ్రుతివాక్యములతో విరోధము సంభవించుట లేదా ? - యన నట్లు గాదు. శ్రుతులలో నచటచట గన్పట్టు త్రయీ, త్రయీవిద్యా - అను పదములకు వేదములు మూడే ; నాలుగు కాదు' — అని నాల్గవవేదమును నిషేధించుట యందు తాత్పర్యము లేదు. అట్లున్న దనుట శ్రుతిసమ్మతము కాదు. ఏలయన :—

1) నాలుగు వేదములను పరమేశ్వర నిఃశ్వాసరూపము అని చెప్పిన బృహదారణ్యకోపనిషత్తు మరల నొకచోట 'త్రయో వేదా ఏవ, వా గేవ ఋగ్వేదః మనో యజుర్వేదః ప్రాణ ఏవ సామవేదః'- అని వేదత్రయమునే పేర్కొనుచున్నది.

2) ఛాందోగ్యోపనిషత్తు కూడ చతుర్వేదముల గూర్చి పెక్కుచోట్ల ప్రశంసించుట పైన వివరింపబడినది. ఆ యుపనిషత్తే మరల నొకచోట వేదత్రయమునే యిట్లు చెప్పుచున్నది.

'తాను తత్ర మృత్యు ర్యథా మత్స్య ముదకే పరిపశ్యే దేవం
పర్యపశ్య దృచి సామ్ని యజుషి। తే ను విదిత్వోర్ధ్వా
ఋచః సామ్నో యజుషః స్వర మేవ ప్రావిశన్'
— ఛాం. 1-4-3.

3) షడ్వింశబ్రాహ్మణము (5.7) నందు పరాదేవత యగు స్వాహా స్వరూప వర్ణనము నందు 'చత్వారోఽస్యై వేదాః శరీరమ్' అని చెప్పబడి మరల నచటనే వేఱొక వాక్యమున 'ఋగ్యజుః సామగతిః' అని చెప్పబడుట స్వాహాశబ్దమున వివరింపబడినది.

4) శతపథబ్రాహ్మణము ఒకచోట — త్రయీ వై విద్యా ఋచో యజూంషి సామాని (4-6-7-1): సైషా త్రయీవిద్యా యజ్ఞః(1-1-4-3): స (ప్రజాపతిః) శ్రాంత స్తేపానో బ్రహ్మైవ ప్రథమ మసృజత త్రయీ మేవ విద్యామ్ (6-1-1-8) — అని యీ రీతి త్రయీవిద్యను గూర్చి ప్రస్తావించినది. మరల నీ శ్రుతియే స్వాధ్యాయబ్రాహ్మణమున నాల్గు వేదములను కంఠోక్తిగ నిట్లు పేర్కొనినది.

"పయ ఆహుతయో హ వా ఏతా దేవానాం యదృచః....
యదథర్వాంగిరసః .... స్వాధ్యాయ మధీతే"

—11-5-6-4 నుండి 8.

ఈ శ్రుతి యింకను 10-5-2-20; 13-4-3 నుండి 8 మున్నగు చోట్ల నాల్గు వేదములను నామనిర్దేశ పూర్వకముగ పేర్కొనినది.

5) తైత్తిరీయారణ్యకము గూడ నొకచోట 'సైషా త్రయ్యేవ విద్యా తపతి' — యని ఆదిత్యమండలమును త్రయీవిద్యాత్మకముగ వర్ణించినది. మరల నీ శ్రుతియే స్వాధ్యాయబ్రాహ్మణమున నాల్గు వేదముల నిట్లు పేర్కొనినది.

"యదృచో ఽ ధ్యగీషత తాః పయ ఆహుతయో దేవానా
మభవన్ య ద్యజూగ్ంషి — య దథర్వాంగిరసో
మధ్వాహుతయో."

—తై. ఆ. 2-9-2.

6) ఇట్లే తైత్తిరీయబ్రాహ్మణము గూడ నొకచోట 'వేదై రశూన్య స్త్రిభి రేతి సూర్యః' — అని యాదిత్యుని వేదత్రయాత్మకు డని వర్ణించి, మరల నొకచోట నాల్గువేదముల నిట్లు పేర్కొనుచున్నది.

"ఋచో యజూగ్ంషి సామాని అథర్వాంగిరస శ్చ యే"

— 3-12-8-2.

7) తైత్తిరీయసంహితయు నొకచోట 'య ద్వై యజ్ఞస్య సామ్నా యజుషా క్రియతే శిథిలమ్ (తద్) యద్ ఋచా తద్దృఢమ్' — అని ఋగ్యజుః సామల మూడింటిని మాత్రమే పేర్కొని. వేఱొకచోట అశ్వమేధాంగ మంత్రములలో నాల్గువేదముల నిట్లు పేర్కొనినది.

"ఋగ్భ్యః స్వాహా యజుర్భ్యః స్వాహా సామభ్యః
స్వాహా ఽంగిరోభ్యః స్వాహా వేదేభ్యః స్వాహా"
— తై. సం. 7-5-11-2.

8) ఋగ్వేదీయమైన ఐతరేయ బ్రాహ్మణము నొకచోట 'త్రయో వై వేదా అజాయన్త' అని వేదత్రయోత్పత్తిని జెప్పి మఱియొకచోట నాలుగువేదముల నిట్లు పేర్కొనినది.

"ఋఙ్మయో యజుర్మయః సామమయో వేదమయో
బ్రహ్మమయో ఽమృతమయః సంభూయ దేవతా అప్యేతి"
—ఐ.బ్రా. 4-6-22.

9) ఇక ఋక్సంహితయు నొకచోట 'ఋచః సామాని జజ్ఞిరే.... యజు స్తస్మా దజాయత' — అని ఋగ్యజుఃసామోత్పత్తిని జెప్పి మఱికొన్నిచోట్ల 'చత్వారి శృంగాః' ఇత్యాది మంత్రములచే యజ్ఞము, లేక యజ్ఞేశ్వరుడు, చతుర్వేదాత్మకుడై యొప్పుటను కాంతాసమ్మితముగ బ్రతిపాదించినవి.

ఋక్సంహితయే యింకొకచోట ఋత్విక్కర్మ వినియోగ వ్యాజమున నాల్గువేదముల ప్రసక్తి నిట్లు సూచించినది.

'ఋచాం త్వః పోష మాస్తే పుపుష్వాన్
గాయత్రం త్వో గాయతి శక్వరీషు ।

బ్రహ్మా త్వో వదతి జాతవిద్యాం
యజ్ఞస్య మాత్రాం విమిమీత ఉ త్వః ॥" —10_17_11.

యజ్ఞసమయమున 1. హోత యను ఋత్విక్కు స్వకీయవేద (ఋగ్వేద) గతము లయిన ఋక్కులకు పుష్టిని గల్పించుచున్నాడు. పుష్టి యనగా భిన్నభిన్న ప్రదేశములలో నున్న ఋక్సముదాయమును శస్త్ర మనెడి పేరుతో నొకచోట సమకూర్చుట (త్వః పుపుష్వాన్ ఋచాం పోషం ఆస్తే). 2. ఉద్గాత యను ఋత్విక్కు గాయత్ర మను పేరు గల స్తోత్రమును శర్వరీనామకము లగు ఋక్కులందు గానము చేయుచున్నాడు (త్వః గాయత్రం శక్వరీషు గాయతి). 3. బ్రహ్మ యను నొక ఋత్విక్కు ప్రణయనాది క్రియలు జేయవలసి వచ్చినప్పు డెల్ల అనుజ్ఞ నొసగుచున్నాడు. ఋత్విక్కులు 'బ్రహ్మన్ అపః ప్రణేష్యామి' అని యీరీతిగ సంబోధించి యనుజ్ఞ కోరినప్పు డెల్ల 'ఓం ప్రణయ' అని యీరీతిగ బ్రహ్మ యనుజ్ఞ నొసగుచున్నాడు (బ్రహ్మా త్వో వదతి జాతవిద్యాం). 4) అధ్వర్యు డను మఱియొక ఋత్విక్కు విశేషించి యజ్ఞస్వరూప నిష్పాదనము గావించు చున్నాడు. యజ్ఞస్వరూపమును నిరూపించునది యధ్వర్యునకు సంబంధించిన యజుర్వేదము. ఋక్సామలు యజ్ఞాంగము లయిన స్తోత్రశస్త్రములను బూరించును. కాన అధ్వర్యుడు యజ్ఞశరీర నిష్పాదకు డగును. (యజ్ఞస్య మాత్రాం విమిమీత ఉ త్వః). – అని యర్థము.

ఈ ఋక్కు యజ్ఞము నందలి నలుగురు ప్రధానఋత్విజుల కర్తవ్యములను నిర్దేశించుచున్నది. ఈ నలువురిలో హోతకు ఋగ్వేదము, అధ్వర్యునకు యజుర్వేదము, ఉద్గాతకు సామవేదము నియతములై యున్నవి. వారు స్వ స్వ వేదోక్త మంత్రములచే హౌత్రాదుల నెఱపు చుందురు. ఇక బ్రహ్మ, వేదత్రయోక్త కర్మాభిజ్ఞుడై యోగ్యత ననుసరించి యా కర్మల కనుజ్ఞ నొసగుట, ఏదేని ప్రత్యవాయము సంభవించినవుడు సవరించు

కౌశలము గల్గి యజ్ఞకర్మను యథావిధిగ ప్రవర్తింపజేయుట బ్రహ్మయొక్క కర్తవ్యము. అందుచే బ్రహ్మ యగు ఋత్విజుడు ఋగ్యజుఃసామ వేదముల యందే గాక యథర్వవేదము నందు గూడ బరినిష్ఠితుడై యుండి నపుడే యజ్ఞమును నిర్విఘ్నముగ యథావిధిగ నిర్వహించెడి కౌశలము గలిగి యుండును. కావుననే 'అథర్వాంగిరోవిదం బ్రహ్మాణం' అనుచు గోపథ బ్రాహ్మణ శ్రుతి బ్రహ్మ యథర్వవిదుడై యుండవలె నని యాదేశించినది.

యజ్ఞముయొక్క వాగ్రూపశరీరార్ధము ఋగ్యజుఃసామలచే(అధ్వర్యు, హోత, ఉద్గాత లనెడి ఋత్విజులచే) సంస్కరింపబడు ననియు, మనోరూపమగు యజ్ఞశరీరార్ధభాగము అథర్వవేదముచేతనే (బ్రహ్మచే) సంస్కరింపబడు ననియు గోపథ-ఐతరేయబ్రాహ్మణములు వివరించుచున్నట్లు పూర్వము జెప్పబడినది. ('త ద్వాచా త్రయ్యావిద్య యైకం పక్షం సంస్కుర్వంతి, మనసైవ బ్రహ్మ సంస్కరోతి' — ఐ. బ్రా. 5-33 - 'అతఏవ వాఙ్మనస వివర్తస్య యజ్ఞశరీరస్య అర్ధ మేవ త్రిభి ర్వేదైః నిష్పాద్యతే। అర్ధాంతరం తు అథర్వవేదే నైవేతి శ్రూయతే - సాయణః, అథర్వవేద భాష్యభూమికా).

ఇట్లు శ్రుతులే కాదు. పురాణములు కూడ యజ్ఞమున బ్రహ్మ యగు ఋత్విక్కు అథర్వవిదుడై యుండవలె ననెడి సంప్రదాయమును స్పష్టముగా జెప్పుచున్నవి.

"ఆధ్వర్యవం యజుర్భి స్తు ఋగ్భి ర్హౌత్రం తథా మునిః।
ఔద్గాత్రం సామభి శ్చక్రే బ్రహ్మత్వం చా ప్యథర్వభిః॥"
"రాజ్ఞాం త్వథర్వవేదేన సర్వకర్మాణి స ప్రభుః।
కారయా మాస మైత్రేయ బ్రహ్మత్వం చ యథావిధి॥"

— విష్ణు. పు. 3-3.

"ఏక ఆసీ ద్యజుర్వేదః తం చతుర్ధా వ్యకల్పయత్।
చాతుర్హోత్ర మభూ ద్యస్మిన్ తేన యజ్ఞ మథాకరోత్॥
ఆధ్వర్యవం యజుర్భిః స్యాత్ ఋగ్భి ర్హోత్రం ద్విజోత్తమాః।
ఔద్గాత్రం సామభి శ్చక్రే బ్రహ్మత్వం చా ప్యథర్వభిః॥"
— కూర్మ. పు. 49.6.

కనుక బ్రహ్మ అథర్వవిదుడై యుండవలె ననునది సంప్రదాయము - అని తెలియుచున్నది. కాని యిట్లు చెప్పుచో 'యజ్ఞం వ్యాఖ్యాస్యామః స త్రిభి ర్వేదైః విధీయతే' -అనెడి పూర్వోక్త -'ఆపస్తంబాది శ్రౌతసూత్రములతో విరోధము సంభవించుట లేదా ? యన నట్లు కాదు. సూత్రకారుల యీ వచనముల కథర్వవేదమును నిషేధించుటయందు తాత్పర్యము లేదని యీ యీ వ్యాఖ్యాత లందఱును స్పష్టముగ వివరించిరి. (చూ. హరదత్తవ్యాఖ్య. ఆప.పరి.భా. సూ: మహాదేవకృత వైజయన్తీవ్యాఖ్య. సత్యా. శ్రౌ.సూ.). శ్రీ సాయణాచార్యులును 'ఋగ్యజుఃసామల యందే గాక యథర్వవేదము నందు గూడ బరినిష్ఠితుడైన వాడే బ్రహ్మత్వమునకు ముఖ్యాధికారి: అట్టివాడు లభింపని యపుడు మాత్రమే వేదత్రయపరినిష్ఠితుని బ్రహ్మగా వరించుట శ్రుతితాత్పర్యము'ని యథర్వవేదభాష్యభూమికయం దిట్లు వివరించిరి.
"స త్రిభి ర్వేదై ర్విధీయత ఇతి స్మృతి స్తు ఉదాహృత శ్రుత్యనుసారేణ ముఖ్యస్య అథర్వవిదో ఽసంభవే తచ్ఛాఖాసు యావదుక్త బ్రహ్మత్వ మాత్రేణాపి క్రతుశరీరనిష్పత్తి ర్భవతీ త్యేవ మభిప్రాయః"-
— అథర్వవేదభాష్యభూమిక.

చారిత్రికులవాదము - అసామంజస్యము :-

ఇంతవరకును వివిధ బ్రాహ్మణారణ్యకోపనిషత్తుల యందును, తైత్తిరీయసంహితయందును, ఋగ్వేదమునందును గూడ, నొకచోట వేదత్రయప్రస్తావము మఱియొకచోట నాలుగువేదముల ప్రస్తావము

నుండుట దర్శించితిమి. ఇట్లుండుటేల ? — అను విషయమును తరువాత చూతము. ఈ విషయమున చారిత్రికుల వాద మిట్లున్నది.

"ఋగ్వేదము ఆర్యులను వారి తొలిరచన; అందును పదియవ మండలము మిగిలినవానికంటె నర్వాచీనము; అథర్వవేదము మిగిలిన మూడు వేదముల కంటె మిక్కిలి యర్వాచీనము; నాల్గువేదముల ప్రశంస ఋగ్వేదమున నెచ్చటను గానవచ్చుట లేదు; 'ఋచాం త్వః పోష మాస్తే' అను ఋక్కు పదియవ మండలము లోనిది; ఆ ఋక్కునందును మిగిలిన ఋత్విజుల విషయమున నే యే వేదములు నియతములై యుండునో స్పష్టముగ దెలియుచున్నది; బ్రహ్మ యను ఋత్విక్కు అథర్వవిదుడై యుండవలె నను నియమము స్పష్టముగ నట గానవచ్చుట లేదు; ఇక 'చత్వారి శృంగాః' — ఇత్యాది ఋక్కుల బురస్కరించుకొని యజ్ఞము, లేక యజ్ఞపురుషుడు చతుర్వేదాత్మకు డని చెప్పుట యాలంకారిక కల్పనమే యగును: నాలుగువేదములు నా కాలమున నున్న వనుటకు స్పష్టమైన ప్రమాణములు కాజాలవు.

ఇక పదియవ మండలమున 'ఋచః సామాని జజ్ఞిరే — యజుః తస్మా దజాయత' యని యజుఃసామల ప్రస్తావన యుండుటచే నా మండలము యజుఃసామవేదముల రచన యనంతరము రచింపబడి యుండవలెను; అందును గూడ ఋగ్యజుఃసామ వేదములు మూడే యజ్ఞేశ్వరునుండి ప్రాదుర్భవించినటుల గలదు; అథర్వవేదావిర్భావ మప్పటికి కాలే దని తెలియ నగును; ఆ మూడింటికిని క్రమముగ త్రయీ యను వ్యవహార మేర్పడినది; తరువాత కాలమున నథర్వవేద మావిర్భవించినను ఆ మంత్రములకు యజ్ఞమున వినియోగము లేదు; గాన నది వేదముగ గుర్తింపబడి యాదరింపబడుటకు చాల కాలము పట్టెను; అది వేదముగ గుర్తింపబడి, 'యజ్ఞమునందు బ్రహ్మగా నుండవలసినవాడు

అథర్వవేదజ్ఞుడై యుండవలె' నను నియమము పుట్టిన తర్వాత అథర్వ వేదమునకు 'బ్రహ్మవేదము' అను నామ మేర్పడినది; ఈ యథర్వ వేదమునకు వేదత్వమును సిద్ధింపజేయుట కయియే గోపథబ్రాహ్మణ మవతరించినది".[1]

చరిత్రకారుల యీ వాదమునం దెంత సామంజస్య మున్నదో చూతము.

1) వీరి ననుసరించి 'ఋచః సామాని జజ్ఞిరే....యజు స్తస్మా దజాయత' - యనెడి ఋక్కు యజ్ఞేశ్వరుని నుండి వేదత్రయోత్పత్తిని గదా చెప్పుచున్నది ! నాల్గవవేదము లేదనుటకును, ఒకవేళ అథర్వవేద మర్వాచీనముగ వెలసినను, దానికి యజ్ఞము నందు తావు లేదనుటకు నీ ఋక్కే గదా ప్రమాణముగ జూపబడుచున్నది ! ఈ ఋక్కున కట్టి యర్థమే యుండుచో, చతుర్థవేద నిషేధపర మగు నీ మంత్రము చతుర్థవేద మన బరగెడి యథర్వవేదము నందు (19-6-13) గూడ నుండుట లోని సామంజస్యమేమి ? నాల్గవవేదముగా పరిగణింపబడుటకై బహుకాలము యత్నించిన దని చెప్పబడెడి యథర్వవేదము ఆత్మనిషేధపరము లయిన యిట్టి మంత్రములను తనలో నెట్లిమిడ్చుకొని యుండును ?

2) ఇంతే కాదు. అథర్వవేదము నందలి యీ క్రింది మంత్రముల జూడుము.

"ఋచం సామ యజామహే యాభ్యాం కర్మాణి కుర్వతే।
ఏతే సదసి రాజతో యజ్ఞం దేవేషు యచ్ఛతః॥
ఋచం సామ య దప్రాక్షం హవి రోజో యజు ర్బలమ్।
ఏష మా తస్మా న్మా హింసీద్ వేదః పృష్టః శచీపతే॥" 7-54-1-2.

1. (a) Bloom Field - The Atharva Veda & the Goptha Brahmana.
(b) సంగ్రహ ఆంధ్రవిజ్ఞానకోశము - అథర్వవేదము.

ఇందు మొదటి మంత్రమున ఋక్సామవేదములు స్తుతిశస్త్రముల ద్వారా యజ్ఞనిర్వాహకములై యజ్ఞమంటపమున (సదసి రాజతః) విరాజిల్లు చున్నట్లు కీర్తింపబడినవి. ఋక్సామవేదములు యజ్ఞనిర్వాహకము లని యిట కీర్తింపబడినంత మాత్రమున యజుర్వేదము లేదని కాని, అది యజ్ఞనిర్వాహకము కాదని గాని, యభిప్రాయ మగునా? యజుస్సు లేనిచో యజ్ఞమే లేదు కదా! యజుస్సు యజ్ఞశరీర నిష్పాదక మగుటచే నది భిత్తి (కుడ్య) స్థానీయము (Back ground). ఋక్సామలు కుడ్యగత చిత్రస్థానీయములు. కుడ్యము నందలి చిత్తరువుల (వర్ణ-ఆకృతుల) గూర్చి ప్రశంసించు నపుడు కుడ్యముయొక్క యునికిని గూర్చిన విచారణతో బనియే యుండదు. ఎవరేని 'కుడ్య మిచట ప్రస్తావింపబడలేదు గాన కుడ్యము లేదు'. - అని చెప్పుచో నది హాస్యాస్పదమే యగును.

"కర్మకాండవిషయే యజుర్వేదస్యైవ ప్రాధాన్యాత్ ....
భిత్తిస్థానీయో యజుర్వేద శ్చిత్రస్థానీయా వితరౌ"
— సాయణః - కాణ్వసం. భాష్యభూమికా.

కాన నీ యథర్వమంత్రము నందలి 'యజామహే — యజ్ఞమ్' — అను రెండు పదములును భిత్తిస్థానీయ మైన యజుస్సు నుపలక్షింప జేయుచునే యున్నవి.

ఇట పై రెండవ మంత్రమున హవిస్సును ఓజస్సును ఉద్దేశించి ఋక్సామలును, బలము నుద్దేశించి యజస్సును కోరబడినవి. (అనగా అధ్యయనము, అధ్యాపనము జేయబడినవి). అట్టి ఋగ్యజుఃసామాత్మక మైన యీ వేదము (ఏష వేదః) నన్ను హింసింపకుండుగాక — అని యధ్యాపకుడు వాగమశాసనకర్త (శచీపతి) యగు ఇంద్రుని ప్రార్థించు చున్నాడు.

ఇది యేమి ! ఇచట ఋగ్యజుః సామలను మూడింటిని బేర్కొని యీ మంత్రము - 'ఏషః వేదః' - అని చెప్పుచున్నది. నాలుగవ వేద మిచట స్మరింపబడలేదు. కాన అథర్వవేదము అనెడి వేదము లే దని గాని. లేక యది వేదమే కా దని గాని చెప్పుట యీయాథర్వణిక మంత్ర తాత్పర్య మగునా ? అట్టిచో వేదత్వ పరిగణనకై తాపత్రయపడుచుండినట్లు చెప్ప బడెడి యథర్వవేదము ఆత్మనిషేధపరము లైన యిట్టి మంత్రములను తనలో నె ట్లిమిడ్చుకొనగల్గి యుండును ? అథర్వవేదమే కంఠోక్తిగా (15-6-8, 9) నాలుగువేదముల బేర్కొనినట్లు పూర్వము వివరింపబడినది గదా !

3) ఇక నథర్వవేదమునకు వేదత్వమును సుసంఘటితము గావించుటకై యవతరించినట్లు చెప్పబడెడి యథర్వవేదీయ గోపథ బ్రాహ్మణము గూడ నాలుగు వేదములను కంఠోక్తిగా - చత్వారో వా ఇమే వేదా ఋగ్వేదో యజుర్వేదః సామవేదో బ్రహ్మవేదః (2-16)'- అని పేర్కొని మరల ఓంకారమును ఋగ్యజుః సామాత్మకముగ మాత్రమే యిట్లు కీర్తించినది.

"తస్మా దోంకార ఋచ్యృక్ భవతి యజుషి యజుః సామ్ని
సామ సూత్రే సూత్రం బ్రాహ్మణే బ్రాహ్మణమ్...."
— గో. బ్రా. 1-1-23.

"....బ్రాహ్మణ మృగ్యజుఃసామ తస్మా ద్బ్రహ్మవాదిన
ఓంకార మాదితః కుర్వంతి...." —గో. బ్రా. 1-1-24.

ఇట పై రెండువాక్యము లందును నాల్గవ (అథర్వ) వేదముయొక్క ప్రసక్తి లేదు.

4) ఇంతే కాదు. అథర్వవేదీయ - ఉపనిషత్తులలో గూడ నిట్లే యొకచో చతుర్వేదప్రశంసయు, మఱియొకచో ఋగ్యజుఃసామరూప త్రయీ ప్రస్తావము బహుళముగ గన్పట్టుచున్నది.

(1) ముండకోపనిషత్తులో - "తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదో ఽథర్వవేదః-" అని నాలుగువేదముల నపరావిద్యగా పేర్కొనినది. మరల ద్వితీయముండకమున (2-1-6) "తస్మాదృచః సామ యజూంషి దీక్షా యజ్ఞాశ్చ సర్వే క్రతవో"-అని ఋగ్యజుఃసామలే యక్షరాత్మక పురుషుని నుండి యావిర్భవించినట్లు పేర్కొనబడినది.

(2) ప్రశ్నోపనిషత్తు నందు వేదత్రయప్రశంస యిట్లు గలదు.

"అరా ఇవ రథనాభౌ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్। ఋచో
యజూంషి సామాని యజ్ఞః క్షత్రం బ్రహ్మ చ। 2-6.

"ఋగ్భి రేతం యజుర్భి రంతరిక్షం స సామభి ర్యత్త
త్కవయో వేదయంతే' 5-7వ

(3) శాండిల్యోపనిషత్తు నందొకచో శాండిల్యుడు నాల్గువేదముల నధ్యయనము జేసినట్లును, మఱియొకచో మూడు వేదములే యావిర్భవించినట్లును నిట్లుగలదు.

"అథాహ శాండిల్యో హ వై బ్రహ్మర్షి శ్చతుర్వేదేషు...." అ 1-2.

"అథైత త్తస్మా త్తప్యమానాత్ సత్యకామాత్ త్రీ ణ్యక్షరా
ణ్యజాయన్త। తిస్రో వ్యాహృతయః। త్రిపదా గాయత్రీ।
త్రయో వేదా స్త్రయోదేవాః....।" — అ. 3.

ఇట్లెన్ని యేని యుదాహరణల జూప నగును. అథర్వవేదేతరములగు సంహితా-బ్రాహ్మణ-ఆరణ్యక-ఉపనిష ద్భాగముల యందలి యుదాహరణలు గొన్ని పూర్వమే చూపబడినవి.

ఋగ్వేదమున గూడ నిట్లే యొకచోట (ఋ. 5-62-5) - 'బర్హిరివ యజుషా రక్షమాణా' - యనుచు యజుస్సు మాత్రమే యజ్ఞరక్షక మగుచున్నట్లు చెప్పబడినది. ఇంకొకచోట (1-164-39) - 'ఋచో అక్షరే

పరమే వ్యోమన్' - అనుచు ఋక్కులు మాత్రమే నిర్దేశింపబడినవి॰ మఱియొకచోట (2-23-16, 17) త్వష్ట (ప్రజాపతి) సామలకు కర్తగా నిర్దేశింపబడినాడు. వేఱొకచోట (8-95-7;10-114-6 ఇత్యాది) ఋక్సామలు రెండు మాత్రమే నిర్దేశింపబడినవి. మఱికొన్నిచోటుల (ఋ. 9-97-34 ఇత్యాది) 'తిస్రో వాచ ఈరయతి' యనుచు ఋగ్యజుః సామలు మూడును బరమేశ్వరునిచే ప్రేరేపింపబడినట్లు చెప్పబడినవి. అట్లే యింకను గొన్ని చోటుల 'చత్వారి శృంగా' ఇత్యాది మంత్రములచే నాలుగు వేదములు చెప్పబడినవి. ఏల ?

మఱియు ఋగ్వేదమున నలుగురు ఋత్విజులతో యజ్ఞము నిర్వహింపబడుట - యను విషయము పైన పేర్కొనబడిన 'ఋచాం త్వః పోష మాస్తే' (10-17-11) అను ఋక్కున మాత్రమే గాదు. వసిష్ఠుడు బ్రహ్మస్థానము నధిష్ఠించి మిగిలిన ఋత్విజులతో యజ్ఞమును నిర్వహించె నట్లు ఋ. 7-33-14 ఇత్యాది ఋక్కుల వలన దెలియును. కాన ఋగ్వేదమున చతుర్వేదప్రసక్తియు, నలువురు ఋత్విజుల ప్రసక్తియు లేదనెడి చరిత్రకారుల వాదము సరికాదు. ఇట్లు శ్రుతులయం దొకచో ఏకవేద ప్రసక్తి, మఱొకచో రెండు, వేఱొకచో మూడు, ఇట్లే చతుర్వేద ప్రసక్తియు నుండుటలో నా యా ప్రకరణముల ననుసరించి తాత్పర్యమును గ్రహించుటయే యుక్తము.

ఇట్లు అథర్వేతర వేదభాగము లందు వలెనే అథర్వవేదము నందును, దానికి సంబంధించిన బ్రాహ్మణ- ఉపనిషద్భాగము లందును గూడ వేదచతుష్టయ ప్రస్తావము,దానితోపాటు ఋగ్యజుఃసామాత్మక త్రయీ నిర్దేశము నుండుట గమనార్హము. కాన శ్రుతులయం దెడనెడ గన్పట్టు త్రయీనిర్దేశమునకు చతుర్థవేద నిషేధమునందు తాత్పర్యము లేదనుట శ్రుతిసమ్మతమైన యభిప్రాయము.

కాని, శ్రుతి సంప్రదాయము నిట్లు గ్రహింపక –"అథర్వవేదమునకు వేదత్వమును స్థాపించుటకై యవతరించిన గోపథబ్రాహ్మణమే పొరబడి, యచటచట నాల్గవవేదము యొక్క యునికిని మఱచి మూడు వేదములనే ప్రస్తావించినది"– యనెడి చారిత్రికుల వాదమునం దెంత సామంజస్య మున్నదో విచారింప నగును. అట్టిది పొరపాటే యగుచో నది యొక గోపథబ్రాహ్మణము నందే గాదు; శ్రుతులయం దెల్ల యొకలాగి సంప్రదాయము బహుళముగా గాన నగుట పై యుదాహరణముల వలన స్పష్టము.

శ్రుతులయందే కాదు; స్మృతి పురాణేతిహాస కావ్యము లందును విట్టే గలదు. ఇట్లుండుటలోని తాత్పర్యమును గ్రహించుటకు మారుగా–ఇది యనాదిసిద్ధ సంప్రదాయమని గ్రహించుటకు మారుగా–దీనిని పొరపాటు అని యనుట పొరపాటు గదా?

'చత్వారిశృంగా' - ఇత్యాది ఋక్కులు - అర్థమీమాంస :-

ఇట్లు ఆథర్వణశ్రుతుల యందును, తదితర శ్రుతుల యందును, ఒకచోట వేదచతుష్టయ ప్రస్తావము, మఱియొకచోట వేదత్రయ ప్రస్తావము గన్పట్టుచుండుటచే త్రయీ పదమునకు గాని, వేదత్రయప్రస్తావమునకు గాని, చతుర్థవేద నిషేధము నందు తాత్పర్యము లేదని స్పష్ట మైనది.

ఇక 'చత్వారిశృంగా' ఇత్యాది మంత్రములచే జెప్పబడెడి 'చతుః శృంగత్వము – త్రిపదత్వము' శ్రుత్యనుగుణముగ దర్శించిన గాని శ్రుతికి గల త్రయీత్వము తేటపడదు. కనుక నీ మంత్రములకు శ్రుత్యంతర సంవాదము ననుసరించి సంప్రదాయానుగత మైన యర్థమును జూతము.

సామవేదీయ మగు షడ్వింశబ్రాహ్మణము —

"చత్వారో ఽస్యై వేదాః శరీరమ్— ఋగ్యజుఃసామగతిః"

అని పరాదేవతయు యజ్ఞస్వరూపిణియు నగు స్వాహాదేవీ స్వరూపమును వివరించి యున్నది. దీనివలన స్వాహాదేవికి నాలుగువేదములు శరీరము : ఋగ్యజుఃసామలు మూడును పాదములు (గతిః_చేష్ట) _ అని స్పష్ట మగుచున్నది. 'ఛందసాం మాతా; వేదమాతా' _ యని శ్రుతి ప్రసిద్ధ మైన గాయత్రీపరాదేవతకు ఋగ్యజుఃసామలు పాదములని శ్రుతి స్మృతి పురాణేతిహాసాదుల యందు ప్రసిద్ధి గలదు.

'ఋగ్యజుఃసామరూపా శ్చ పాదా అస్యాః ప్రకీర్తితాః'

—సూత. సం. 4-6-11.

ఋగ్వేదము కూడ యజ్ఞేశ్వరు డగు అగ్నిని ఇట్లే వర్ణించినది.

"వయం నామ ప్ర బ్రవామా ఘృతస్య _ అస్మిన్ యజ్ఞే
ధారయామా నమోభిః। ఉప బ్రహ్మా శృణవ చ్ఛస్య
మానం। చతుఃశృంగో ఽవమీ ద్గౌర ఏతత్ ॥"

— ఋ. 4-58-2 ; వా. సం. 17-90 ; తై. ఆ. 10-10-2.

"చత్వారి శృంగా త్రయో అస్య పాదా। ద్వే శీర్షే సప్త
హస్తాసో అస్య। త్రిధా బద్ధో వృషభో రోరవీతి।
మహో దేవో మర్త్యా ఆ వివేశ ॥"

— ఋ. 4-58-3 ; వా. సం. 17-91 ; తై. ఆ. 10-10-2 ; నిరు. 13-7

ఇచట బ్రహ్మకు, లేక యజ్ఞేశ్వరునకు నాల్గు శృంగములు, మూడు పాదములు ఉన్నట్లు చెప్పబడినవి.

యాస్కుడు యజ్ఞపక్షమున యజ్ఞాత్మకు డగు నగ్నికి గల నాల్గు శృంగములు నాల్గువేదములే యని చెప్పినాడు.

'చత్వారి శృంగేతి వేదా వా ఏత ఉక్తాః' —నిరుక్తమ్.

శ్రీ సాయణాచార్యులును చతుఃశృంగము లనగా నాలుగువేదము లనియే గ్రహించిరి. వాజసనేయసంహిత యందు గల యీ మంత్రమును వ్యాఖ్యానించుచు ఉవట మహీధరులు బ్రహ్మ- ఉద్గాత-హోత-అధ్వర్యు లనెడి నలుగురు ఋత్విజులే నాలుగు శృంగములు; ఋగ్యజుఃసామలు మూడును పాదములు- అని వివరించిరి. ఇట యజ్ఞేశ్వర (అగ్ని) పరముగ జెప్పు నపుడు నాలుగువేదము లనియు, యజ్ఞక్రియాపరముగ జెప్పు నపుడు చతుర్వేదములకు బ్రతినిధు లగు నలుపురు ఋత్విక్కు లనియు గ్రహించుట సమంజసమే. ఋగ్వేదముచే హౌత్రము నెఱపెడి హోత ఋగ్వేదమునకును, ఆట్లే యధ్వర్యుడు యజుర్వేదమునకును, ఉద్గాత సామవేదమునకును బ్రతి నిధులు. ఇక బ్రహ్మ వేదత్రయోక్తకర్మాభిజ్ఞుడును, అథర్వవిదుడును నగుచు బ్రహ్మత్వమును నిర్వహించును గాన బ్రహ్మ చతుర్వేదప్రతినిధి యనవొప్పును.

ఇట్లు చతుఃశృంగ పదముచే నాల్గువేదముల గ్రహించుచో స్వాహా దేవికి లేక గాయత్రీదేవికి వలెనే స్వాహాపతి యగు యజ్ఞేశ్వరునకు (లేక బ్రహ్మకు) చతుర్వేదమయత్వము (చతుఃశృంగత్వము) ఋగ్యజుఃసామ సంచారిత్వము నుపపన్న మగును.

'చత్వారిశృంగా' యను నీ మంత్రమున కిట్లు యజ్ఞ, యజ్ఞేశ్వర పరముగనే గాక యొకచో 'ఓంకార' పరముగను, వేఱొకచో 'సూర్య' పరముగను, మఱియొకచో వైయాకరణులచే 'శబ్దబ్రహ్మ' పరముగను, మంత్రశాస్త్రవేత్తలచే 'పరావాక్' పరముగను-బెక్కురీతుల వినియోగము, సమన్వయమును గన్పట్టుచున్నది. ఇట్లీ మంత్రముననే గాదు. ఈ క్రింది మంత్రమున గూడ నిట్లే చెప్పబడుచున్నది.

"చత్వారి వాక్పరిమితా పదాని। తాని విదు ర్బ్రాహ్మణా
యే మనీషిణః। గుహా త్రీణి నిహితా నేంగయంతి।
తురీయం వాచో మనుష్యా వదన్తి॥"

— ఋ. 1-164-45; అథర్వ 9-10.27; తై.బ్రా 2-8-8-5; శ. బ్రా. 4-1-3-17; జై. ఉ. బ్రా. 1-7-3; 40-1; నిరు. 13-9,

ఇచట వాక్కుచే పరిమితము లగు నాలుగు పదము లేవి ?
"కతమాని తాని చత్వారి పదాని ?"

1. ఓంకారో మహావ్యాహృతయ శ్చేత్యార్షమ్ (వేదవాదినాం ఋషీణాం మతమ్).

2. నామాఖ్యాతే చోపసర్గ నిపాతా శ్చేతి వైయాకరణాః.

3. మంత్రః కల్పో బ్రాహ్మణం చతుర్థీ లౌకికీతి యాజ్ఞికాః.

4. ఋచో యజూంషి సామాని చతుర్థీ వ్యాహారికీతి నైరుక్తాః.

5. సర్పాణాం వాగ్వయసాం క్షుద్రస్య సరీసృపస్య చతుర్థీ వ్యావహారికీ త్యేకే.

6. పశుషు తూణవేషు మృగే ష్వాత్మని చే త్యాత్మప్రవాదాః.

— నిరు. 13-9.

ఇట్లు ఒకే మంత్రమునకు బెక్కు తీరుల సమన్వయములు జెప్పబడుచున్నపు డిం దేది ప్రామాణికము ? 'చత్వారి శృంగా-చత్వారి వా క్పరిమితా పదాని' - ఇత్యాది ఋక్కులు వివిధార్థములు ధ్వనింప జేయుచున్న యాలంకారిక రూపణములే యగును. స్పష్టార్థప్రతీతి లేని యిట్టి మంత్రముల నాధారముగ గైకొని ఋగ్వేదమున నాల్గువేదముల ప్రస్తావన గల దని చెప్పబూనుట యుక్తమా ? యన నట్లు కాదు.

వివిధ దర్శనకారులు మంత్రముల యందు వివిధార్థముల దర్శించుట యుక్తమే. మంత్రములు వివిధగతులు, లేక వివిధ వినియోగములు గలిగి శతపథములై బహ్వర్థబోధకములు (శతవ్రజాః) అగుచు యజ్ఞేశ్వరుని, వాగధిష్ఠాన దేవత యగు నగ్నిని, లేక బ్రహ్మను బొందుచుండుట మంత్ర స్వభావ మని శ్రుతియే (ఋ. 4-58-5; వా. సం. 17-93) స్వయముగ వివరించినది (చూ. ఋషిశబ్దము). కాన పరమేశ్వరుడు వేఱు వేఱు రూపములతో దన నారాధించెడి భక్తులకు అధికారి భేదము ననుసరించి సాక్షాత్కరించు నట్లు, మంత్రముకూడ అధికారిభేదము ననుసరించియు, వినియోగభేదము ననుసరించియు వివిధార్థములతో నాత్మస్వరూపమును సాక్షాత్కరింప జేయుచుండును. ఉదా :- 'చత్వారి శృంగా' - ఇత్యాది మంత్రములు తైత్తిరీయారణ్యకమున తత్త్వోపదేశ ప్రకరణమున బఠింప బడినవి.

> "యథోక్త ప్రశంసోపేత పుణ్యానుష్ఠానేన నిషిద్ధాచరణ
> వర్జితేన శుద్ధాంతఃకరణస్య పురుషస్య తత్త్వ ముపదేష్టుం
> అయ మనువాక ఆరభ్యతే" —— సా. భా. - తై. ఆ. 10-10-2.

కాన 'చత్వారి శృంగా' - ఇత్యాది మంత్రములకు యజ్ఞమునందు మాత్రమే వినియోగము — అని చెప్పదగదు, ఇవి తత్త్వమును కూడ దర్శింపజేయ సమర్థములు. అందుచేతనే శ్రుతియందు తత్త్వోపదేశ ప్రకరణమున గూడ బఠింపబడినవి. ఇట్లు తత్త్వోపదేశ ప్రకరణ మధ్య పఠిత మగుటజేసి యీ మంత్రమున కచట యజ్ఞపరముగ నర్థమును వివరించుట పొసగదు. అందుచే నచట 'అ' కారాది ప్రణవమాత్ర లనెడి చతుఃశృంగములును, విశ్వ-తైజస-ప్రాజ్ఞులు లేక విరాట్-హిరణ్యగర్భ- అవ్యాకృతములు - అను మూడు పాదములును గల్గి యొప్పెడి ప్రణవ్యాఖ్య బ్రహ్మతత్త్వమును బ్రతిపాదించు నట్లీ మంత్రార్థము వివరింపబడినది (చూ. సా. భా.).

అకారాది ప్రణవమాత్రలు ఋగాది వేదరూపము లగుటయు, అందుచే ప్రణవము వేదమయ మగుటయు శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాదుల యందు స్పష్టము.

ఇట్లే సూర్యపక్షమున నాలుగు దిక్కులు నాలుగు శృంగములుగ జెప్పబడినవి. ఇందుల కుపపత్తి యిట్లు గాంచ నగును.

"ఋచాం ప్రాచీ మహతీ ది గుచ్యతే దక్షిణా మాహు
ర్యజుషా మపారామ్ । అథర్వణా మంగిరసాం ప్రతీచీ
సామ్నా ముదీచీ మహతీ ది గుచ్యతే ॥"

"ఋగ్భిః పూర్వాహ్ణే దివి దేవ ఈయతే
యజుర్వేదే తిష్ఠతి మధ్యే అహ్నః ।
సామవేదే నా స్తమయే మహీయతే
వేదై రశూన్య స్త్రిభి రేతి సూర్యః ॥" —తై.బ్రా.3-12.9.1.

"ఏతా శ్చతుర్వేదాభిమానిదేవతా ఆదిత్యస్య ప్రాచ్యాదిదిక్షు అవస్థాయ సేవన్తే .... ఏతచ్ఛందోగాః — 'అసౌ వా ఆదిత్యో దేవో మధు' — ఇత్యస్యాం మధువిద్యాయాం బహుప్రపంచేనా ఒమనంతి ।" .... సా. భా.

పై శ్రుతివాక్యముల బరిశీలించుచో వేదమయము లయిన ప్రాచ్యాది దిక్కులను నాల్గింటిని సూర్యునకు చతుశ్శృంగములుగ జెప్పుట యుపపన్నమే యగును. మఱియు నిట్లు చతుర్వేదమయు డగు సూర్యుడు. ఇచట 'వేదై రశూన్య స్త్రిభి రేతి' — యని గూడ చెప్పబడుటచే స్వాహా దేవికిని, గాయత్రికిని, అగ్నికిని వలెనే సూర్యునకును చతుర్వేద మయత్వము, ఋగ్యజుఃసామ సంచారిత్వము నొప్పును.

ఇక మంత్రశాస్త్రజ్ఞులు 'చత్వారి శృంగా' మంత్రమును పరావాక్ దేవతాపరముగను, వైయాకరణులు స్ఫోటాఖ్య శబ్దబ్రహ్మ పరముగను, నైరుక్తులు చతుర్వేద శృంగాత్మక దేవతాపరముగను నీ మంత్రార్థమును దర్శించిరి. సూక్ష్మముగ బరిశీలించినచో నొకే పరతత్త్వమును భిన్న భిన్న ప్రకరణము లందు భిన్నభిన్న రూపములతో నుపాసనాభేదము ననుసరించి దర్శించి రనుట స్పష్టము. కాన నివి యన్యోన్యవిరుద్ధము లని యను కొనరాదు. ఇవి యధికారిభేదముచే సాధకులు దర్శించు సత్యదర్శనములే యగును.

ఇంకొక విషయము. ఈ మంత్రములకు త్రేతాగ్నిసాధ్యము లగు యజ్ఞాదిక్రియల యందు మాత్రమే గాక, ఏకాగ్నిసాధ్యము లగు వివాహోప నయనాది సంస్కారముల యందును గూడ వినియోగముగలదు. ఉదా:– ఈ 'చత్వారి శృంగా' యను మంత్రముచే నిత్యనైమిత్తికము లయిన కర్మలయం దన్నిటి యందును అగ్నిదేవతా ధ్యానము చేయు సంప్రదాయము కలదు. అట్టియెడ ఏకాగ్నిసాధ్య కర్మప్రకరణ మగుటచే నీ మంత్రముచే నిట ఋత్విక్చతుష్టయసాధ్య యజ్ఞేశ్వరరూపమున అగ్నిని దర్శించుట పొసగదు – అనగా చతుశ్శృంగములచే నిట నలుగురు ఋత్విజులను గ్రహించుటకు వలనుపడదు. తత్త్వోపదేశప్రకరణము గాదు గాన నిట ప్రణవాఖ్యబ్రహ్మపరముగ సమన్వయము జెప్పను వీలు లేదు. అట్లే శబ్దబ్రహ్మపరముగ గాని, పరావాగ్దేవి పరముగ గాని యర్థముల జెప్ప నమయము గాదు. కాగా చతుర్వేదాత్మక దేవతా (పరమేశ్వర) స్వరూపునిగ మాత్రమే యగ్ని నిట దర్శింప వలసి యున్నది. అందుచే నిట నగ్నికి గల చతుశ్శృంగములు చతుర్వేదోపలక్షకము లగుట శ్రుతి సమ్మతము; సంప్రదాయావిరుద్ధము. శ్రీమద్భాగవతము గూడ 'చత్వారి శృంగా' యను నీ మంత్రమును శ్లోకరూపమున బ్రవర్తింప జేసి పరమేశ్వ

రుడు చతుర్వేదశరీరు డనియు, త్రయీవిద్యారూపు డనియు వర్ణించినది (చూ, 8_6-11). (ఈ విషయము ముందు వివరింపబడును).

మఱియొక యాక్షేపము :-

'యజ్ఞం వ్యాఖ్యాస్యామః, స త్రిభి ర్వేదైః విధీయతే' – అనుచు యాజ్ఞికులు ఋగ్యజుః సామ వేదముల మూడింటికే యజ్ఞమున వినియోగము జెప్పిరి; కావున నాథర్వణిక మంత్రములకు యజ్ఞమున వినియోగము లేదు; యజ్ఞమున వినియోగము లేనందున నా మంత్రములకు వేదత్వ మెట్లుపపన్న మగును ? వేదత్వమే యుపపన్నము గానిచో యజ్ఞేశ్వరు డగు వగ్ని చతుర్వేద శృంగాత్మకు డగుట యెట్లు ? కాన 'చత్వారి శృంగా' – ఇత్యాది మంత్రముల నాధారము జేసికొని ఋగ్వేదమున చతుర్వేదముల ప్రస్తావన గల దని చెప్పుట యుక్తమా ? – యన నట్లు గాదు.

వేదత్వము - యజ్ఞసంబంధము :-

అథర్వణిక మంత్రములు కృత్స్న బ్రహ్మత్వ ప్రతిపాదకము లగుచు యజ్ఞసంబంధము గల్గియున్న వని పూర్వము వివరింపబడినది. కాన వానికి యజ్ఞసంబంధము లే దనుట యుక్తము కాదు. ఒకవేళ నా మంత్రములకు యజ్ఞమునందు సాక్షాత్తు వినియోగము లేక పోవచ్చును. అంతమాత్రముచే వీనికి వేదత్వ ముపపన్నము గా దనుట యుక్తము గాదు. యజ్ఞవినియోగరూప సంబంధము చేతనే వేదత్వము సిద్ధించు నని చెప్పుచో యజ్ఞముల యందు వినియోగములేని యుపనిషత్తులకును వేదత్వ ముపపన్నము కాకపోవును. ప్రత్యక్షాది ప్రమాణములచే దెలియజాలని పురుషార్థోపాయముల దెలియ జేయుటయే (వేదయతీతి వేదః) వేదము యొక్క వేదత్వ మని పూర్వము వివరింపబడినది. (చూ:_ వేదశబ్దము).

అనగా కర్మార్థము లగుచు నతీంద్రియ మగు ధర్మమును, మోక్షార్థము లగుచు నుపనిషత్తులచే నతీంద్రియ మగు బ్రహ్మము బోధించుట వేద సామాన్యలక్షణము. ఇతరవేదముల వలెనే యథర్వవేదముగూడ బ్రాహ్మ ణాదులతో విలసిల్లుచు ధర్మ బ్రహ్మ బోధక మగుచున్నది.

ఇతరవేదములకు వలెనే అథర్వవేదమునకును శాఖలు గలవు. ఈ విషయమును సంప్రదాయవిదు లిట్లు చెప్పుచున్నారు.

"మహాన్ శబ్దస్య ప్రయోగవిషయః। సప్తద్వీపా వసుమతీ।
త్రయోలోకా శ్చత్వారో వేదాః సాంగాః సరహస్యా బహుధా
భిన్నా ఏకశత మధ్వర్యు శాఖాః సహస్రవర్త్మా సామవేదః
ఏకవింశతిధా బాహ్వృచ్యం నవధా ఽఽథర్వణో వేదో
వాకోవాక్య మితిహాసః పురాణం వైద్యక మిత్యేతావాన్ శబ్దస్య
ప్రయోగవిషయః" — మహాభాష్యమ్ - పస్పశాహ్నికమ్.

మఱియు పతంజలిమహర్షి శబ్దానుశాసనమును ప్రారంభించుచు—

"వైదికాః ఖల్వపి –శంనో దేవీ రభిష్టయే– ఇషే త్వోర్జే త్వా –
అగ్నిమీళే పురోహితం –అగ్న ఆయాహి వీతయ – ఇతి"

అనుచు నాలుగు వేదముల యందలి వాక్యములను (ఆద్య మంత్ర ప్రతీకములను) వైదికవాక్యములుగా నుదహరించినాడు. ఇందు మొదట నుదహరింపబడిన 'శం నో దేవీ రభిష్టయే' అనునది ఆథర్వణ వేదవాక్యము. సామాన్యముగ ప్రసిద్ధమైన ఋగ్– యజుః–సామ–ఆథర్వణము లనెడి క్రమమును విడిచి యిట ముందు ఆథర్వణ వేదవాక్యమే యుదహరింప బడినది.

ఇట్లే మహాభాష్యమున మఱియొకచోట గూడ –

"కిం పున రిదం వ్యాకరణ మే వాధిజిగాంసమానేభ్యః

ప్రయోజన మన్వాఖ్యాయతే న పున రన్య దపి కించిత్,
ఓ మిత్యుక్త్వా వృత్తాంతశః శ మిత్యేవ మాదీన్ శబ్దాన్
పఠన్తి"

యనుచు నథర్వవేదమునకు గల ప్రాథమ్యము కంఠోక్తిగ దెలియజేయ బడినది. వ్యాఖ్యాతలు నితరవేదములకంటె దీనికి గల ప్రాథమ్యము లేక వైలక్షణ్యము దీనిచే సూచిత మగుచున్నట్లు తెలియ నగు నని వివరించిరి.

మఱియు పతంజలి యథర్వవేదీయు డనియు, నందుచే నా వేద వాక్యమును మొదట నుదహరించె ననియు కొందఱి యభిప్రాయము. (చూ. మహాభాష్యటిప్పణీ). అథర్వవేదమునకు వేదత్వమే లేనిచో లేక వేదత్వము తరువాత గల్పింపబడినచో, కల్పిత వేదత్వ ప్రతీతి గల యా వేదము నాదరించి పతంజలి మహర్షి దాని నిట శబ్దానుశాసనారంభమున మొదట నుదహరించుట యుపపన్నము గానేరదు. 'రక్షార్థం వేదానా మధ్యేయం వ్యాకరణమ్' – అని వేదరక్షార్థమై కదా వ్యాకరణము ప్రవృత్త మయినది। అట్లు ప్రవృత్త మయిన శబ్దానుశాసనారంభమున నిట్లు కల్పిత వేదత్వ ప్రతీతి గలదని చెప్పబడెడి యీ యథర్వణ వేదవాక్యమును మొదట నుదహరించుట సంప్రదాయవిదుత్తముడు, ప్రామాణికుడు నగు పతంజలి మహర్షికి జెల్లదు. అందుచే నట్లు మొదట నుదహరించుట లోని తాత్పర్య మేదియో కనుగొనవలసి యున్నది. ఆ విషయమును క్రమముగ జూతము. ముందు అథర్వవేదముయొక్క వేదత్వమును జూతము.

"స్వాధ్యాయస్య తథాత్వేన హి సమాచారే ఽధికారాచ్చ
సవవచ్చ తన్నియమః" — బ్ర. సూ. 3-3-3.

శ్రీ బాదరాయణ మహర్షి యీ సూత్రముచే నితరవేదాధ్యయన మెట్లు స్వాధ్యాయ మగునో యథర్వవేదాధ్యయనము గూడ నట్లే స్వాధ్యాయ

మగుట స్పష్టము చేసినాడు. మఱియు 'సవవచ్ఛ త న్నియమః' అను పదములచే నాథర్వణమంత్రములకు ఏకాగ్నిసాధ్య కర్మపరత్వమును వివరించినాడు.

'యజ్ఞం వ్యాఖ్యాస్యామః స త్రిభి ర్వేదై ర్విధీయతే' — అని చెప్పిన శ్రౌతసూత్రకారులును తమ గృహ్య, ధర్మసూత్రములలో స్వాధ్యాయాధ్యయన విధుల యందు నాల్గువేదముల పఠించినారు. కనుకనే 'త్రిభి ర్వేదై ర్విధీయతే' — అను వాక్యము చతుర్థవేద నిషేధపరము కా దని స్పష్టమగుచున్నది.

కాన అథర్వవేదమునకు వేదత్వ మనాదిసిద్ధమే కాని యాగంతుకము కాదు. వేదములు గాని, వేదాంగములు గాని, స్మృతి పురాణేతిహాస కావ్యాదులు గాని, యథర్వవేదమునకు వేదత్వ మెట్లుపపన్న మగును ?'— అని శంకించుట యెచటను గానము. అట్లు శంకింపక పోగా పురాణేతిహాసాదు లాథర్వణికమంత్రములను సిద్ధమంత్రము లని వేనోళ్ళ బొగడినవి. ఆ యుదాహరణములు గొన్ని పూర్వము చూపబడినవి. అంతేగాక యథర్వవేదమునకు యజ్ఞము నందలి విశిష్టస్థానమును గూడ వివరించి చెప్పినవి. వేదవేత్తయు మహాతపస్వియు నగు ఋశ్యశృంగుడు అథర్వణికమంత్ర ప్రకాశితమైన పుత్రకామేష్టిని యథావిధిగ దశరథునిచే జేయించినట్లు శ్రీమద్రామాయణము చెప్పుచున్నది.

"మేధావీ తు తతో ధ్యాత్వా స కించి దిద ముత్తమమ్ ।
లబ్ధసంజ్ఞ స్తత స్తం తు వేదజ్ఞో నృప మబ్రవీత్ ॥
ఇష్టిం తేఽహం కరిష్యామి పుత్రీయాం పుత్రకారణాత్ ,
అథర్వశిరసి ప్రోక్తై ర్మంత్రై స్సిద్ధాం విధానతః ॥"

— రామా. బాల. 15 సర్గ.

హరివంశము యజ్ఞము చతుర్వేదాత్మక మని చెప్పుచు, అథర్వణవేదము యజ్ఞమునకు శీర్షస్థానీయ మని యిట్లు కీర్తించినది.

"నేత్రాభ్యాం జనయ ద్దేవో ఋగ్వేదం యజుషా సహ ।
సామవేదం చ జిహ్వాగ్రా దథర్వాణం చ మూర్ధతః ॥
జాతమాత్రా స్తు తే వేదాః క్షేత్రం విందంతి తత్త్వతః ।
తేన వేదత్వ మాపన్నా యస్మా ద్విందంతి తత్పదమ్ ॥
తే సృజంతి తదా వేదా బ్రహ్మ పూర్వం సనాతనమ్ ।
పురుషం దివ్య రూపాభం స్వైః స్వై ర్వ్యాపై ర్మనోభవైః ।
అథర్వణ స్తు యో యోగః శీర్షం యజ్ఞస్య తత్కృతమ్ ।
గ్రీవా బాహ్వంతరం చైవ ఋగ్భాగః స భవే త్తతః ॥
హృదయం చైవ పార్శ్వం చ సామభాగ స్తు నిర్మితః ।
బస్తి శీర్షం కటీ దేశం జంఘోరు చరణైః సహ ।
ఏవ మేష యజుర్భాగః సంభూతో యజ్ఞకల్పితః ॥
పురుషో దివ్యరూపాభః సంభూతో హ్యమరా త్పదాత్ ।
స హి వేదమయో యజ్ఞః సర్వభూతసుఖావహః ॥

— హరివంశ. 3-17-47 నుండి 53.

మహాభారత మీ యథర్వవేదము నుత్తమోత్తమ శ్రుతి యని యిట్లు కీర్తించినది.

"అథర్వాంగిరసో హ్యేషా శ్రుతీనా ముత్తమా శ్రుతిః ।
అవిచార్యైవ కార్యైషా శ్రేయస్కామై ర్నరైః సదా ॥"

— భార. 8-70-86.

ఇట్లు పురాణేతిహాసముల యందు త్తమశ్రుతిగా గీర్తింపబడుట వలనను 'అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా' - అని యీ రీతిగా శ్రుతులును అథర్వ

వేదముయొక్క మహత్వమును గీర్తించుటజేసి పతంజలి మహర్షియు శబ్దానుశాసనారంభమున దాని మహత్త్వమును దెలియజేయుటకై యా వేద వాక్యమును మొదట నుదహరించె నని చెప్పుట యుక్తము.

శ్రీ సాయణాచార్యులును 'చత్వారి శృంగా' యను ఋక్కున కర్థమును వివరించుచు అథర్వవేదమును గూర్చి యిట్లు వివరించిరి.

"యద్య ప్యాప స్తంబేన యజ్ఞం వ్యాఖ్యాస్యామః స త్రిభి ర్వేదై ర్విధీయత ఇత్యుక్తమ్; తథాఽపి ఆథర్వణస్య ఇతరానపేక్షయైవ ఏకాగ్నిసాధ్యానాం కృత్స్నకర్మణాం అభిధాయకత్వాత్ తదపేక్షయా చత్వారి శృంగే త్యుక్తమ్'

— సా. భా. ఋ. 1-164-45.

కాన 'చత్వారి శృంగా' యను మంత్రమున యజ్ఞేశ్వరు డగు అగ్ని చతుర్వేద శృంగాత్మకు డగుట యుక్తమే, ఇట్లు ఋగ్వేదమున నీ మంత్రముననే కాదు. చతుర్వేద ప్రస్తావము గల ఋక్కు లింకను గలవు.

ఉదా :-

"పాహి నో అగ్న ఏకయా పా హ్యుత ద్వితీయయా। పాహి గీర్భి శ్చతసృభి రూర్జాం పతే పాహి చతసృభి ర్వసో।"

— ఋ. 8-60-9; వా. సం 27-43; తై. ఆ. 10-5-1.

తైత్తిరీయారణ్యకమునం దీ మంత్రము కొలది మార్పులతో గలదు. ఋగ్యజుః సామాథర్వణ రూపము లగు నాల్గు వాక్కులతో (చతసృభిః గీర్భిః) అభిష్టుతుడవై జగన్నివాసహేతుభూతుడవైన యగ్ని (వసో) రక్షింపుము - అని యర్థము.

"హే అగ్నే, హే వసో, జగన్నివాసహేతో। ఋగ్యజుః
సామాథర్వణ రూపాభి శ్శ్రుతస్మృభి ర్గీర్భి రభిష్టుతః సన్
నః పాహి।" సా. భా.

కావున స్వాహాదేవికిని, గాయత్రికిని, సూర్యునకును, ప్రణవాఖ్య బ్రహ్మకును వలెనే యజ్ఞేశ్వరుడగు అగ్నికి గూడ చతుర్వేదమయత్వము, ఋగ్యజుః సామసంచారిత్వము ఉపపన్నమే యగును.

చతుర్వేదములు త్రయీవిద్యారూపములు :-

కాని, 'చత్వారో ఒస్యై వేదాః శరీరమ్- ఋగ్యజుఃసామగతిః; అష్టే- చత్వారిశృంగాః త్రయో అస్య పాదాః'- అని యీ రీతిగ జెప్పుచో చతుర్వేదములు శరీరము లేక శృంగము లగు టేమి ? ఋగ్యజుసామలు మూడును పాదము లగు టేమి ? ఇవి పరస్పర విరుద్ధములుగ గన్పట్టుట లేదా ? యన నట్లు గాదు.

మంత్రత్రైవిధ్యము :-

ఇచట చతుర్వేదములను శృంగములుగను, లేక శరీరముగను మొదట బేర్కొని, తర్వాత ఋగ్యజుఃసామలను పాదములుగా బేర్కొనుటచే, నిచట ఋక్-యజుః-సామ పదములు వేదపరములు గా వనుట స్పష్టము. ఇవి మంత్రపరములు. అనగా పై నాలుగువేదముల యందలి మంత్రములు ఋక్కులుగనో, లేక యజుస్సులుగనో, లేక సామలుగనో యుండు నని మంత్ర త్రైవిధ్యమును దెల్పునవి. దీనివలన సామాన్యముగ ఋగ్వేదము, యజుర్వేదము- అని యీ రీతిగ వేదపద సాహచర్య మున్నపుడు ఋగ్యజుస్సామలు వేదపరములు. అట్లు వేదపద సాహచర్యము లేనియపుడు ప్రకరణము ననుసరించి వానిని మంత్ర

పరములుగనే గ్రహించుట సంప్రదాయము. కాన పూర్వోదాహృతము లయిన_ 'ఋచః సామాని జజ్ఞిరే....యజుః తస్మా దజాయత'_ ఇత్యాది స్థలములయందు ఋగ్రూపములు, యజూరూపములు, సామరూపములు నయిన మంత్రములే యావిర్భవించిన వని యర్థము. అనగా చతుర్వేదములు ఋగాది త్రివిధమంత్రాత్మకములై యావిర్భవించిన వని యర్థము. ఎడనెడ నీ పదములు ప్రకరణము ననుసరించి వేదపరములుగ గన్పట్టినను గన్పట్టవచ్చును.

కాని 'తస్మా ద్యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే ఛందాంసి జజ్ఞిరే తస్మాత్ యజు స్తస్మా దజాయత' _ అను నీ మంత్రము నందలి ఋగ్_యజుః_సామ పదములు మంత్రపరములు గావు; అవి వేదపరములే యని కొందఱు విమర్శకు[1] లిటు చెప్పుచున్నారు.

"పై మంత్రమున 'ఛందాంసి' యను పదమునకు అథర్వవేద మని యర్థము. కాన పై మంత్రముచే చతుర్వేదోత్పత్తి తెలియుచున్నది. ఏలయన ఋగ్_యజుః_సామ వేదములు గాయత్ర్యాది ఛందోబద్ధములే కదా? ఋగాది వేదము లావిర్భవించిన వని చెప్పుచో ఛందస్సులు నావిర్భవించిన వనియే యర్థము. మరల 'ఛందాంసి జజ్ఞిరే తస్మాత్' అని చెప్పుట యేల? కాన 'ఛందాంసి' యను పద మథర్వవేదోత్పత్తిని దెలియజేయును. ఇట్లు చెప్పుటకు ప్రమాణమును గలదు.

"ఋచాం ...గాయత్రం ఛందః। యజుషాం....త్రైష్టుభం ఛందః।
సామ్నాం....జాగతం ఛందః। అథర్వణాం....సర్వాణి ఛందాంసి॥"

— గో.బ్రా. 1-1-29.

1. భగవద్దత్త. _ జైమినీయ _ ఉపనిష ద్బ్రాహ్మణ భూమిక (దయానంద మహావిద్యాలయ సంస్కృత గ్రంథమాల).
దయానందసరస్వతి - ఋగ్వేదాది భాష్యభూమిక.

పై శ్రుతివాక్యముచే ఋగ్వేదాదుల కొక్కొక ఛందస్సుతోనే విశిష్ట సంబంధము. అథర్వవేదమున కట్లుగాక యన్ని ఛందస్సులతోను విశిష్ట సంబంధము గలదని తెలియును; ఇట్లు సర్వచ్ఛందో విశిష్ట మగుటచేతనే యథర్వవేదము 'ఛందాంసి' యను పదముచే జెప్పబడుచున్నది; అదియును గాక 'ఛందో హ జజ్ఞిరే తస్మాత్' అని యేకవచనాంత ఛందఃపద ఘటిత పాఠ మథర్వవేదమున గానవచ్చుచున్నది; కాన ఛందఃపదముచే అథర్వ వేదము తనను సూచించుకొనుచున్నది; మఱియు నిట 'ఋచః సామాని' యను నీ రెండు పదములు బహువచనాంతములు; 'ఛందః-యజుః' అను నీ రెండు నేకవచనాంతములు; ఏకవచనాంత మయ్యు యజుఃపదము వేద బోధక మగుట శ్రుతులయందు గాన నగును;

> "యస్మా దృచో అపాతక్షన్ యజు ర్యస్మా దపాతక్షన్
> సామాని యస్య లోమా న్యథర్వాంగిరసో ముఖమ్...."
>
> — అ. వే. 10-7-20.

ఈ మంత్రమున 'అథర్వాంగిరసః' అను పదము అథర్వవేదవాచకము; కాన నిచటి యేకవచనాంత మగు యజుఃపదము కూడ యజుర్వేదపరము; ఋక్సామపదములు ఋక్సామ వేదపరములు; కాన 'తస్మా ద్యజ్ఞా త్సర్వహుతః' అను అథర్వవేదీయ మగు ప్రకృతమంత్ర మందలి 'ఛందః-యజుః' అనెడి ఏకవచనాంత పదములు గూడ వేదబోధకములే; కాన చతుర్వేదావిర్భావమే పై మంత్రము యొక్క ఆశయము. ఇంతియే కాదు; 'ఛందః' అను పదమే పారశీకభాషలో 'జెంద్' అయినది. జెంద్ అనునది పారశీకుల ధర్మగ్రంథము (జెందవెస్తా Zend Avesta): ఇందు అథర్వణు లగు పురోహితులయొక్క నామములు పలుచోట్ల గానవచ్చును; హాగ్ మతానుసారముగ దీనియందలి మంత్ర మొకటి యథర్వవేదముయొక్క మొదటిమంత్రము; కాన జెందవెస్తా-అథర్వ వేదములకు విశేషసంబంధము

గలదని తెలియుచున్నది. కాన నీ మంత్రమున 'ఛందః' పదముచే అథర్వ వేదమును గ్రహించుట యుక్తము."

ఇది కేవల మూహాకల్పిత మైన సమన్వయమే యగును. 'ఛందః' పదమునకు అథర్వవేద మను నర్థము వేదములందు గాని, పురాణేతి హాసాదుల యందుగాని, కోశములందు గాని యెచటను గన్పట్టదు. కాని యిట 'ఛందాంసి జజ్ఞిరే' యని వేఱుగ జెప్పుట యేల ?– యని యడుగ వచ్చును. వేదములు ఛందోమయము లయి యవతరించిన వని చెప్పుటయే శ్రుతి తాత్పర్యము. అంతియే కాదు. 'ఋచః సామాని జజ్ఞిరే, ఛందాంసి జజ్ఞిరే తస్మాత్'– అని చెప్పి, చివరకు 'యజు స్తస్మా దజాయత' అని చెప్పబడినది. కాన 'ఋక్ సామలు ఛందోబద్ధము లయిన మంత్రములు; నియత పాదాక్షరావసానములు గలవి; యజుస్సు లట్టివి కావు'– అని తెలియజేయుటకే 'ఋచః సామాని జజ్ఞిరే' యను వాక్యము తరువాత 'ఛందాంసి జజ్ఞిరే' యని చెప్పబడినది. యజుస్సులు ఛందోబద్ధములు కావనెడి విషయము 'ఛందః' శబ్దమున వివరింపబడును.

శ్రీ జైమిని మహర్షియు ఋక్–యజుః–సామ పదములను మంత్ర పరములుగనే గ్రహించి వాని లక్షణముల నిట్లు ప్రత్యేకించి పేర్కొనినాడు.

'తచ్చోదకేషు మంత్రాఖ్యా'	— 2-1-32.
'శేషే బ్రాహ్మణ శబ్దః'	— 2-1-33.
'తేషాం ఋక్ యత్రార్థవశేన పాదవ్యవస్థా'	— 2-1-35.
'గీతిషు సామాఖ్యా'	— 2-1-36.
'శేషే యజుః శబ్దః'	— 2-1-37.

పాదబద్ధమైన మంత్రములు ఋక్కులు. గానయుక్తములు సామలు. మిగిలినవి అనగా ప్రశ్లిష్టపాఠము గల్గినవి యజుస్సులు. కాన ఋగ్యజుః సామ పదముల మంత్రపరములుగ గ్రహించుటయే సంప్రదాయము.

ఛందఃపదము పారశీకభాషయందు జెంద్ అని వికృతరూపము దాల్చిన దాల్చవచ్చును. ఛందః పదమునకు గాయత్ర్యాదిఛందస్సు లనియే గాక 'వేదములు' అనియు శ్రుతిసంప్రదాయానుగుణమైన యర్థము. జెంద వెస్తా యందు ఆథర్వణికమంత్రములే గాక ఋగ్వేదీయమంత్రములు నధిక ముగ గలవు. అనగా ఛందోబద్ధ మైన మంత్రములయొక్క వికృతిరూపము లట గలవు. కనుక ఛందోబద్ధ మంత్ర ప్రకృతి రూప మగుట జేసి జెంద్ అను వ్యవహార మేర్పడి యుండనచ్చును. కాన ఛందః పదము అథర్వణ వేద వాచక మనుటలో ప్రమాణము గన్పట్టదు.

అందుచే 'తస్మా ద్యజ్ఞాత్ సర్వహుతః' అను పై మంత్రమున ఋగ్రూపములు యజూరూపములు, సామరూపములు వగు త్రివిధము లైన మంత్రము లావిర్భవించిన వని గ్రహించుటయే యుక్తతరము. శ్రీ సాయణు లును వీనిని వేదపరములుగ గాక, మంత్రపరములుగనే యిట్లు వ్యాఖ్యా నించిరి.

> 'య మృషయ స్త్రయివిదా విదుః। ఋచః సామాని యజూగ్ంషి' (తై. బ్రా. 1-2-1-26) ఇతి। త్రైవిధ్యం తు వేద గత మంత్రాభిప్రాయమ్। తదుక్తం జైమినినా - తచ్చోద కేషు మన్త్రాఖ్యా.... శేషే యజుః శబ్ద ఇతి। 'త దస్మి న్నపి వేదే విద్యత ఇతి న చతుష్ట్వ వ్యాకోపః'
>
> — అథర్వవేద. భాష్యభూమిక.

త్రయీవిదు లనగా ఋగ్యజుఃసామ వేదవేత్త లని యర్థము కాదు. ఋగ్యజుఃసామరూపము లగు త్రివిధ మంత్రజాతమునకు 'త్రయీ' యని పేరు; అట్టి త్రయిని తెలిసినవారు త్రయీవిదు లగుదురు - అని యర్థము. పై శ్రుతి యందలి త్రైవిధ్యము వేదగత మైన మంత్రత్రైవిధ్యమును బోధించునది. శ్రీ జైమిని మహర్షియు ఋగ్యజుఃసామలను మంత్ర పరములుగనే గ్రహించినాడు. అట్టి మంత్రత్రైవిధ్యము అథర్వవేదము నందును గలదు. కాన నీ వేదమునకును 'త్రయీ' యను వ్యవహార ముపపన్న మగును — అని యర్థము.

పై ప్రమాణముల ననుసరించి యీ నాల్గు వేదములలో ప్రతివేదము (శాఖయు) ఋగ్యజుఃసామ లనెడి యవయవ త్రయముతో నొప్పుటచే త్రయీ యగుచున్నది. ఇట్లు త్రయీ యను పదము వేదసామాన్యమునకు నామ మగుటచే త్రయీవిద్య యనగా వేదవిద్య యను నర్థము ప్రసిద్ధ మయి యున్నది. ఈ సంప్రదాయమును మహాభారత మిట్లు చెప్పుచున్నది.

"త్రయీవిద్యా మవేక్షేత వేదేషూక్తా మథాంగతః।
ఋక్సామవర్ణాక్షరతః యజుషో ఽథర్వణ స్తథా ॥"

— భార. 12-235-1.

ఋగ్యజుఃసామాథర్వణము లనెడి నాల్గు వేదము లందును త్రయీవిద్య ప్రతిష్ఠితమై యున్నట్లు ఈ భారతవచనము స్పష్టము జేయుచున్నది. నాల్గు వేదములును ఋగ్యజుఃసామ మంత్రాత్మకము లగుటచే నాల్గు వేదములయందును త్రయీవిద్య ప్రతిష్ఠితమై యున్నది. కాన త్రయీ పదముచే నాల్గు వేదముల గ్రహించుట సంప్రదాయము.

శ్రీమద్భాగవతము గూడ 'చత్వారి శృంగా' యను శ్రుతి ప్రతిపాదితార్థముతో బరమేశ్వరుని యజ్ఞస్వరూపునిగ గీర్తించుచు నీ విషయము నిట్లు తెలియజేయుచున్నది.

"నమో ద్విశీర్ష్ణే త్రిపదే చతుఃశృంగాయ తంతవే।
సప్తహస్తాయ యజ్ఞాయ త్రయీవిద్యాత్మనే నమః॥"–8–16–31.

ఇట యజ్ఞరూపు డగు పరమేశ్వరుడు త్రయీవిద్యాత్మకము లగు నాలుగు శృంగములు – నాలుగు వేదములు – గలవాడుగా కీర్తింపబడినాడు. వ్యాఖ్యాతలు నిట్లే వివరించినారు ('చత్వారి శృంగేతి వేదా ఏవ ఉక్తాః' – శ్రీధరః). కాన నాలుగు వేదములకు త్రయీవిద్య యను వ్యవహారము సంప్రదాయాభిమతము. వ్యాసభగవానుడు వేదవిభాగము జేయుటకు బూర్వ మేకరాశిగా నున్న వేదమునకు గూడ ఋగ్యజుఃసామ రూప మంత్ర త్రైవిధ్యముచే త్రయీత్వ ముపపన్న మగును. ఇక మొదట నాక్షేపమున జూపబడిన శ్రుతివాక్యముల జూతము.

'వేదై రశూన్య స్త్రిభి రేతి సూర్యః' —తై.బ్రా. 3-12-9-1.
'సైషా త్రయ్యేవ విద్యా తపతి' —తై.ఆ. 14-1.
'సైషా త్రయీ విద్యా యజ్ఞః' —శ.బ్రా. 1-1-4-3.

ఇత్యాది పూర్వోదాహృత శ్రుతివాక్యములు సూర్యునకును, యజ్ఞమునకును త్రయీమయత్వమును జెప్పుచున్నవి. ఇట ఋగ్యజుఃసామ రూప మగు త్రివిధ మంత్రజాతమే త్రయీవిద్య. అంతియే కాని మూడువేదము లని యర్థము గాదు. శ్రీ సాయణులు నిట్లే వ్యాఖ్యానించిరి. ఇక–

"త్రయో వేదా అజాయన్త, ఋగ్వేద ఏ వాగ్నే రజాయత,
యజుర్వేదో వాయోః, సామవేద ఆదిత్యాత్" — ఐ.బ్రా. 5-32.

అను నీ శ్రుతివాక్యము గూడ అగ్నివాయ్వాదిత్యుల వలన క్రమముగ ఋగ్యజుఃసామ రూప మంత్రత్రైవిధ్యము గల వేదశబ్దరాశి యావిర్భవించి నట్లే చెప్పుచున్న దని గ్రహింప నగును. అగ్నివాయ్వాదిత్యాత్మకు డగు

ప్రజాపతి నుండి త్రయీవిద్యారూప వేదశబ్దరాశి యావిర్భవించిన దని భావము (చూ. భారతీశబ్దము).

త్రయీవిద్య - యోగత్రయము :-

పరమపురుషార్థమును దర్శింపజేయుటకు కర్మ - ఉపాసనా - జ్ఞాన యోగముల నుపదేశించుట వేదముల యందలి వైలక్షణ్యము. అట్లు కర్మ-ఉపాసనా - జ్ఞాన యోగత్రయ విలసిత మగుటచే గూడ వేదమునకు త్రయీత్వ ముపపన్న మగుననియు జెప్ప నగును. పరమేశ్వరునకు త్రయీవేద్యు డని పేరు ప్రసిద్ధము. అనగా వేదప్రతిపాద్య కర్మ-ఉపాసనా - జ్ఞానైక వేద్యు డని యర్థము. పరమేశ్వరుడు త్రయీవేద్యు డయినట్లు కర్మ-ఉపాసనా-జ్ఞానయోగయుక్తు డగు సాధకుడును 'త్రయయాయ్యః' అగునని శ్రుతులు కీర్తించినవి.

"అథా హి విక్ష్వీడ్యో ఽసి ప్రియో నో అతిథిః। రణ్వః
పురీవ జూర్యః సూను ర్న త్రయయాయ్యః॥"

— ఋ. 6-2-7.

"త్రయం విద్యా తపః కర్మ లక్షణం త్రయం యాతీతి
త్రయయాయ్యః" — సా. భా.

విద్యా-తపః-కర్మ త్రయముచే సుసంస్కృతుడై రమణీయుడైన (రణ్వః) పుత్రుని వలెను (సూను ర్న), వృద్ధుడు, హితోపదేశకుడు నగు రాజు వలెను, మనల కతిథియు ప్రియుడును నగు అగ్ని రమణీయుడై ప్రాప్తవ్యు డగుచున్నాడు. — అని యర్థము.

ఇట విద్యాతపఃకర్మ త్రయముచే సుసంస్కృతు డయిన పుత్రుని వలె నగ్నియు రమణీయుడై ప్రాప్తవ్యు డగుట చెప్పబడినది. కాని యగ్ని

యందు రమణీయత్వమును దర్శించు టెట్లు? విద్యాతపః కర్మ త్రయముచే-అనగా కర్మ-ఉపాసనా-జ్ఞాన యోగత్రయముచే చిత్తము సుసంస్కృతమై రమణీయ మగుకొలది యగ్నియందు దివ్యత్వమును లేక అలౌకికరామణీయకమును దర్శింప నగునని శ్రుతితాత్పర్యము.

ఇట్టి త్రయమును ప్రతిపాదించునది గాన వేదము త్రయీ యని ప్రసిద్ధ మైన దనవచ్చును. "య మృషయ స్త్రైవిదా విదుః.... ఋచః సామాని యజూగ్ంషి, సా హి శ్రీ రమృతా సతామ్" - అను శ్రుతి ఋగ్యజుఃసామాత్మక మంత్రరాశిని 'శ్రీః' అని వ్యవహరించినది. శ్రీ రూపుడై, కర్మ-ఉపాసనా-జ్ఞానాత్మక విద్యాత్రయమును వర్ధిల్ల జేయువాడగుటచే - తదుక్తార్థానుష్ఠానపరు లగు సాధకులను వర్ధిల్ల జేయువాడగుటచే - పరమేశ్వరునకు 'శ్రీవర్ధనః' అను పేరు ప్రసిద్ధము.

'ఋచః సామాని యజూగ్ంషి సా హి శ్రీ రమృతా సతామ్ - ఇతి శ్రుతే ర్వేదత్రయరూపాం శ్రియం కర్మోపాస్తి జ్ఞాన కాండాత్మికాం వర్ధయతి త త్తదుక్తార్థానుష్ఠానేన సమ్యక్ పరిపోషయతి స శ్రీవర్ధనః'

— నీలకంఠవ్యాఖ్య. భార. 13-17-53.

కనుక త్రయీవిద్య యనగా శ్రీవిద్య, లేక వేదవిద్య యనియు, వయ్యది విద్యా తపః కర్మ — (లేక కర్మోపాసనాజ్ఞాన) కాండాత్మక మనియు సంప్రదాయార్థము. శ్రీ శంకర భగవత్పాదులు నీ విషయ మిట్లు వివరించిరి.

'కర్మోపాసనా జ్ఞానకాండ భేదేన చత్వారోఽపి వేదాః త్రిప్రకారాః' — లలితాత్రిశతీభాష్యమ్. 58 శ్లో.

ఇక త్రయీశబ్దము నిట్లుగాక, స్మృతులలోని కొన్ని కొన్ని వాక్యముల బురస్కరించుకొని చరిత్రకారులు విపరీతార్థకల్పనలతో జరిత్రాంశముల సృజించుటను జూతము.

స్మృతివచనములు - చారిత్రికుల కల్పన :-

"షట్త్రింశ దాబ్దికం చర్యం గురౌ త్రైవేదికం వ్రతమ్"

అను మనుస్మృతి వచనము ననుసరించి 'మూడు వేదములకే త్రయీ వ్యవహారము గల దనెడి యాక్షేపమును జాతము. పై శ్లోకమున గల 'త్రైవేదికం' అను పదము మూడు వేదముల బోధించు మాట సత్యమే. కాని యది చతుర్థవేద నిషేధపరము కాదు. ఏలయన మనుస్మృతియే మఱియొకచోట—

'శ్రుతీ రథర్వాంగిరసీః కుర్యాది త్యవిచారయన్' — 11-33.

అనుచు 'అథర్వాంగిరసీః శ్రుతీః' అను పదములచే నథర్వవేదము యొక్క శ్రుతిత్వమును ఆవశ్యకతను ఖ్యాపనము చేయుచున్నది. కాన పై త్రైవేదికమ్' అను పదము చతుర్థవేద నిషేధపరము కాదు.

'అయం చ మానవః త్రైవేదిక వ్రతచర్యా విధి ర్నాథర్వవేద
వ్రతచర్యాం నిషేధతి। తత్పరత్వే వాక్యభేదప్రసంగాత్।
శ్రుత్యంతరే వేదమాత్రే వ్రతశ్రవణాచ్చ' — కుల్లూకభట్టవ్యాఖ్య.

అనుచు వ్యాఖ్యాతలును త్రైవేదికపదము చతుర్థవేద నిషేధపరము గాదనియే గ్రహించిరి.

ఇంతే కాదు. బ్రహ్మయజ్ఞము నందు (స్వాధ్యాయము)నందు నాల్గు వేదముల నధ్యయనము జేయుట వలన నాల్గు ఫలములు కలుగు నని శ్రుతులు (తై. ఆ. 2_9_2; శ. బ్రా. 11_5_6_4) నిర్దేశించుచున్నవి. మనుస్మృతియు శ్రుత్యనుగుణముగ నాలుగుఫలముల నిట్లు నిర్దేశించినది.

"యః స్వాధ్యాయ మధీతే ఒబ్దం విధినా నియతః శుచిః।
తస్య నిత్యం క్షర త్యేష పయో దధి ఘృతం మధు॥" — 2-107.

కాన శ్రుత్యనుగుణ మైన స్వాధ్యాయాధ్యయనమే, అనగా చతుర్వేదాధ్యయనమే మనుస్మృతి తాత్పర్యము. స్వాధ్యాయాధ్యయన ఫలముల నిట్లే యాజ్ఞవల్క్యాదిస్మృతులును వివరించినవి.

కాని యిట్లు అథర్వవేదమును వేదముగా పరిగణించినను, స్మృతులు కొన్ని యచటచట ఆథర్వణమంత్రముల నధ్యయనము జేసినవారి యెడ ననాదరభావము జూపిన వనియు, నందుచే అథర్వవేదమునకు ఇతర వేదములతోపాటు సమానస్థానమును గొన్ని స్మృతుల లంగీకరించుటలేదు' - అనియు చరిత్రకారుల[1] యాక్షేప మొకటి గలదు. ఇది సరికాదు.

ఈ చరిత్రకారులు చూపిన మనుస్మృతి, విష్ణుస్మృతి మొదలగు వాక్యములు కేవలము ఆభిచారిక కర్మతత్పరుడై ఇతరుల హింసించుటకై ప్రవృత్తుడగువాని నుద్దేశించినవి. వేదోక్తము లయిన యితరధర్మములను, సత్యాహింసాది గుణములను విడిచి హింసామార్గమున జరించుచు నీ మంత్రములద్వారా లోకకంటకులయి పతితు లయ్యెడివారిని హెచ్చరించి ధర్మమార్గమున బ్రవర్తింపజేయుటకై యీ స్మృతివచనములు ప్రవృత్తము లయినవి, ఉదా :-

"ఉద్యతాసివిషాగ్నిం చ శాపోద్యతకరం తథా।
ఆథర్వణేన హంతారం పిశునం చైవ రాజసు॥"

— విష్ణు. స్మృ. 5-191.

"అభిచారేషు సర్వేషు కర్తవ్యో ద్విషతో దమః।
మూలకర్మణి చానాప్తైః కృత్యాసు వివిధాసు చ"

— మను, స్మృ. 9-290.

ఇట్టి స్మృతివచనములు చాల గలవు. ఇవి యభిచారకర్మల నాచరించి, యితరుల మారణమునకై ప్రవృత్తు లగు వారిని క్షమింపక కఠినముగ

1. Bloom Field - The Atharvaveda & Gopatha Brahman.

దండింప వలయునని శాసించుచున్నవి. ఇట్టి వాక్యము లథర్వ వేదమునకు న్యూనత నాపాదించుటకై ప్రవృత్తము లని చెప్పుట యుక్తమా ? కాదు. పైగా నీ స్మృతులే యాపద వచ్చినపుడు ముందు వెనుకలు జూడక ధర్మ రక్షణమునకై యాథర్వణమంత్రములతో గార్యసిద్ధిని సాధింపవలె నని 'శ్రుతీ రథర్వాంగిరసీః కుర్యాది త్యవిచారయన్' (మను. 11_33) - అని యీ రీతిగా ప్రబోధించుచున్నవి.

వసిష్ఠుడు అథర్వనిధి యగుట, ఋష్యశృంగు డథర్వప్రోక్త మంత్రములతో దశరథునకు పుత్రకామేష్టి చేయించుట, దూర్వాసమహర్షి యుపదేశించిన యాథర్వణికసిద్ధ మంత్రములతో కుంతీదేవి సూర్యు నారాధించుటయు బూర్వము వివరింప బడినవి. అథర్వవిదులు గూడ నగుటచే నిట్టి మహర్షులు విశేషించి కీర్తింపబడి, పూజ్యస్థానము నలంకరించిరి గాని యనాదరము చేయబడినట్లు గన్పట్టదు. అందుచే చరిత్రకారుల కల్పన శ్రుతి స్మృతి సమ్మతము కాదు.

'ఇతి వేదా స్త్రయ స్త్రయీ' :-

పై ప్రమాణముల ననుసరించి త్రయీపదము ఋగాది మంత్ర త్రైవిధ్య ప్రతిపాదకమే గాని వేదత్రయ సంఖ్యా బోధకము గాదు; అనగా చతుర్థవేద నిషేధపరము కాదు _ అని దర్శించితిమి.

ఇట నొకయాక్షేపము. (1) ఇతి వేదా స్త్రయ స్త్రయీ_యను నమర సింహుని వాక్యము ననుసరించి త్రయీపదము వేదత్రయరూప సంఖ్యా బోధకమై కన్పట్టుచున్నది. అట్టిచో త్రయీపదము మంత్రత్రైవిధ్య ప్రతిపాదకముగా జెప్పుట యెట్లు? మఱియు అమరకోశమున అథర్వవేద ప్రసక్తి లేదు_అనెడి యాక్షేపము గూడ గలదు. వీనిని జూతము.

అమరసింహుడు మొదట—

'శ్రుతిః స్త్రీ వేద ఆమ్నాయ స్త్రయీ, ధర్మ స్తు తద్విధిః'

అని యనుచు శ్రుతి, వేద, ఆమ్నాయ, త్రయీ శబ్దములు నాలుగింటిని వేదసామాన్య వాచకములుగా బేర్కొనినాడు. పిదప—

'స్త్రియా మృక్సామ యజుషీ ఇతి వేదా స్త్రయ స్త్రయీ'

యని త్రయీశబ్దమును ఋగ్—యజుః—సామ రూప వేదత్రయ పరముగా జెప్పినాడు. కాన త్రయీపదము వేదసామాన్యమునకును, వేదత్రయమునకును గూడ వాచక మగుట యమరసింహుని యభిమతము. గురుబాల ప్రబోధిక యందును, అమరసుధ[1] యందును నమరసింహుని యభిప్రాయ మిట్లే సోపపత్తికముగ వివరింపబడినది.

త్రయీ శబ్దము ఋగ్యజుఃసామ వేదత్రయ వాచకమయినను,త్రయ్యను వాదరూప మగుట జేసి యథర్వవేదము గూడ గ్రహింపబడు నని మఱి యొక వ్యాఖ్యాత వివరించినాడు.

---

1. 'అత స్త్రయ్యంతాని చత్వారి వేదస్య నామాని। న చ 'వేదా స్త్రయ స్త్రయీ' ఇత్యనేన పౌనరుక్త్యం శంక్యమ్। సామాన్య విశేష రూపేణోభయ సంభవాత్। బ్రాహ్మణ క్షత్రియ వైశ్యా ద్విజాః, విప్రోఽపి ద్విజ ఇతి యథా। న చ ధర్మ మస్త్రియా మిత్యనేన పౌనరుక్త్యమ్। తత్ర ధర్మపర్యాయాణా మభిధానాత్। ఇహ తు ధర్మస్వరూపస్య ధర్మప్రమాణస్య చాభిధానాత్। య దపి - సమాసే గుణీభూతస్యాపి త్రయీశబ్దస్య బహూనివక్షవశా త్తచ్ఛబ్దేన పరామర్శః - ఇత్యుక్తమ్। తదపి న। తన్మతే త్రయీధర్మశబ్దస్య విధేయత్వా త్తదేకదేశస్య త్రయీశబ్ద స్యానువాద్యత్వాసంభవాత్। వేదస్యైవ తచ్ఛబ్దేన పరామర్శసంభవాచ్చ। య దపి - యథా శబ్దానుశాసనం - ఇతి దృష్టాన్త దర్శనమ్। తద ప్యేతేన ప్రత్యుక్తమ్। వేదస్యైవ పరామర్శ సంభవాత్।'

— అమరసుధా.

'ఆథర్వణ స్తు త్రయ్యనువాద ఏవేతి స్వామీ'—అమరసుధాటిప్పణీ

హేమచంద్రాచార్యుడు ఆథర్వణము వేదత్రయోద్ధృత మనినాడు.

'స్వాధ్యాయః శ్రుతి రామ్నాయః, అథర్వా తు త దుద్ధృతిః'

— అభిధానచింతామణి.

కాని యాథర్వణము ఋగ్వేదాదుల కంటె విలక్షణమై యితరానపేక్షముగ నేకాగ్నిసాధ్య కృత్స్నకర్మలను బ్రతిపాదించు నని పైన వివరింపబడినది. ఇంతియే కాదు. ఇయ్యది శాంత-ఘోరరూపము.

"అనుపమ శమ దీప్తతా గరీయాన్ కృతపదపంక్తి
రథర్వణేవ వేదః"

అనుచు భారవి మున్నగు కవులు నాథర్వణవేదమునం దితరవేద విలక్షణములైన శమ-దీప్తతాది పరస్పర విరుద్ధలక్షణము లున్నటుల వివరించిరి. (ఈవిషయము ముందు వివరింపబడును). అట్టిచో నీ యాథర్వణము త్రయ్యనువాదరూప మని చెప్పుట యెట్లు పొసగును ? అందుచేతనే యాథర్వణము వేదత్రయోద్ధృత మనుటయు నెట్లు చెల్లును ? కాన శ్రీ సాయణాచార్యులు చెప్పినట్లు త్రయీ పదము త్ర్యవయవవాచక మగుచు మంత్రత్రైవిధ్య ప్రతిపాదక మనుటయే శాస్త్రసమ్మతము, యుక్తిసహము.

శ్రీ సాయణాచార్యులే కాదు, శ్రీ శంకర భగవత్పాదులును ఋగాది పదములను మంత్రపరములుగ వ్యాఖ్యానించిరి.

(1) ''అరా ఇవ రథనాభౌ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్। ఋచో యజూంషి సామాని'' — ప్రశ్న. ఉ. 2-6

'ఋచో యజూంషి సామానీతి త్రివిధా మంత్రాః' —శం. భా.

(2) ''తస్మాద్ ఋచః సామ యజూంషి'' — ముండక. ఉ. 2-1-6.

'ఋచః....యజూంషి..సామాని..ఏవం త్రివిధా మంత్రాః'

కాన ఋగ్యజుఃసామ పదములు ప్రకరణము ననుసరించి మంత్రపరములుగ గ్రహించుట సంప్రదాయసిద్ధము.

కాని యమరకోశమున 'స్త్రియా మృక్సామయజుషీ ఇతి వేదా స్త్రయస్త్రయీ – అను వాక్యముచే త్రయీ యన మూడువేదము లని కంఠోక్తిగ జెప్పబడినది, అందు నాల్గవ వేదప్రసక్తి కానరాదు: కాన నిట త్రయీ పదము చతుర్థవేద నిషేధపరము కాదా? — యన నట్లు కాదు. అమర కోశమునందే సంకీర్ణార్థవర్గయందు—

'అపి సాహస్ర కారీష చార్మణా౽థర్వణాదికమ్'

అనుచు సమూహవాచక పదములలో 'ఆథర్వ'పదము నుదహరించినాడు.

'అథర్వణాం మంత్రాణాం సమూహః ఆథర్వణమ్' – అథర్వ మంత్రముల సమూహము-అని యర్థము. వ్యాఖ్యాతలు నట్లే వివరించిరి. కాన అమరకోశమున అథర్వవేద ప్రసక్తి లేదనుట తగదు. అథర్వణవేద ప్రసక్తి యుండుటచే నిందలి త్రయీపదము చతుర్థవేద నిషేధపరము కాదు. మఱియు 'ఆథర్వణం' అని ప్రత్యేకముగా జెప్పుటచే ఆథర్వణ వేదమునకు గల యితరవేద వైలక్షణ్యమును సూచిత మగుచున్నది. కాన త్రయీశబ్దము వేదసామాన్యవాచకము, వేదత్రయవాచకము గూడ నగుట యమరసింహుని యభిమతముగా గ్రహింపనగును.

మఱియు త్రయీశబ్దము కేవలసంఖ్యావాచకము గాదు. 'మూడు అవయవములు గలది' యను నర్థమును బోధించునది. త్రయీశబ్దము యొక్క వ్యుత్పత్తిని బరిశీలించిన నీ విషయము స్పష్టము గాగలదు.

"త్రయో౽వయవా యస్యాః సా సంహతిః త్రయీ –
త్రిశబ్దాత్ సంఖ్యాయా అవయవే తయప్ (5-2-42.
పా.సూ.)। ద్విత్రిభ్యాం తయస్య (5-2-43) ఇత్యయచ్।
టిడ్ఢాణఞ్ (5-2-15) ఇతి జీప్।" — అమరసుధ.

ఇట త్రిశబ్దముకంటె అవయవార్థమున ప్రత్యయము వచ్చుట చేసి త్రయీ పదము కేవలసంఖ్యావాచకము కాదు.

అథర్వవేదము - రెండు సంప్రదాయములు :-

'అముష్య విద్యా రసనాగ్ర నర్తకీ। త్రయీవ నీతాంగగుణేన విస్తరమ్॥'

అను నైషధీయశ్లోకమును వ్యాఖ్యానించుచు మల్లినాథసూరి గూడ ఆథర్వణము పృథగ్వేద మను పక్ష మొకటియు; అది త్రయ్యంతర్భూత మను పక్ష మొకటియు నున్నట్లు జెప్పినాడు. ఋగ్యజుఃసామరూప మంత్రత్రైవిధ్యముచే నాథర్వణము త్రయీరూప మగుచున్నది. త్రయీరూప మయ్యును ఇతరవేద విలక్షణమై పృథగ్వేద మగు ననియు సూరి యభిప్రాయముగ గ్రహింపనగును.

హరదత్తాచార్యుడును 'త్రయ్యా మాన్వీక్షక్యాం వా అభివినీతః' అను గౌతమధర్మసూత్రము(2-2-3)నందలి త్రయీపదమును వివరించుచు, త్రిత్వ వివక్ష జేసినపుడు ఋగ్యజుఃసామరూప మంత్రత్రియాత్మక మగుటచే నాథర్వణవేదము త్రయి యం దంతర్భూతమగు ననియు, అట్లు చేయని యపుడు ప్రవచనము ననుసరించియు, వైలక్షణ్యము ననుసరించియు నది పృథగ్వేదముగ గ్రహింపబడుచుండు ననియు రెండు సంప్రదాయము లను జెప్పినాడు.

'ఋగ్యజుఃసామాత్మకా స్త్రయో వేదా స్త్రయీ। ఆథర్వణ శ్చ వేద స్తే ష్వంతర్భవతి। తత్రాపి హి మంత్రా ఋచో యజూంషి సామాని వా। భేదవ్యవహార స్తు ప్రవచన నిమిత్తః। శాంతిక పౌష్టికాది ప్రమేయ నిబంధనో వా'—ఇతి.

రాజశేఖరుడు ఆథర్వణమును పృథగ్వేదముగ నిట్లు పరిగణనము చేసినాడు.

"ఋగ్యజుఃసామ వేదా స్త్రయీ । అథర్వ తురీయమ్ । ....
ఋచో యజూంషి సామాని చాథర్వాణి త ఇమే చత్వారో
వేదాః ॥" — కావ్యమీమాంసా. 2 అధ్యా.

కాని వ్యాఖ్యాతలు (మధుసూదనమిశ్రులు) ఋగ్యజుఃసామరూప మంత్ర త్రైవిధ్యము గల వేదము త్రయీశబ్దముచే గ్రహింపబడు నని యిట్లు చెప్పిరి.

"త్రయీ గద్య పద్య గీత్యాత్మక రచనాశాలీ వేద స్త్రయీ
శబ్దేన వ్యవహ్రియత ఇతి భావః....తథాచోక్తమ్ –
"వినియోక్తవ్యరూప శ్చ త్రివిధః సంప్రదర్శ్యతే ।
ఋగ్యజుఃసామరూపేణ మంత్రో వేదచతుష్టయే॥" –ఇతి.

కనుక నీ వచనముల ననుసరించి నాలుగువేదములును గూడ ఋగ్యజుః సామ (గద్య-పద్య-గీతి) రూప మంత్ర త్రైవిధ్యము గలవి యగుట జేసి త్రయీ యను వ్యవహారము వివక్ష ననుసరించి వేదచతుష్టయమునకును, ప్రతియొక వేదమునకును, తుదకు ప్రతియొక వేదశాఖకును గల దను సంప్రదాయము వ్యవస్థిత మగుచున్నది.

త్రయీ = శ్రుతిసంప్రదాయము :-

అదియునుగాక యీ విషయమున శ్రుతిస్వభావము గూడ బరిశీలింప దగి యున్నది. ఋతువిభాగముల బేర్కొనుచు శతపథబ్రాహ్మణ మొక చోట ఆఱు ఇంకొకచోట అయిదు, మఱియొకచోట మూడు, వేఱొకచోట ఏడు – ఋతువుల నిట్లు పేర్కొనినది.

'షడ్వా ఋతవః సంవత్సరస్య' — శ.బ్రా. 1-2-5-12.

'పంచ వా ఋతవః' — శ.బ్రా. 2-2-3-14.

'త్రయో వా ఋతవః సంవత్సరస్య'

— శ.బ్రా. 3-4-4-17; 11-5-4-11.

'సప్త హి ఋతవః' — శ.బ్రా. 9-3-1-19; 9-5-2-8.

తాండ్యబ్రాహ్మణమునం దొకచోట ఆఱు, మఱియొకచోట అయిదు ఋతువు లిట్లు పేర్కొనబడినవి.

'ద్వౌ ద్వౌ హి మాసా వృతుః' — తాం.బ్రా. 10-12-8.

ఋతువునకు రెండు మాసము లని యిట చెప్పబడి ఆఱు ఋతువులు గ్రహింపబడినవి.

'పంచ హ్యృతవః' — తాం.బ్రా. 12-4-8 : 13-2-6.

ఐతరేయబ్రాహ్మణము హేమంతశిశిరముల నొకటిగా గ్రహించి అయిదు ఋతువుల పేర్కొనినది.

'పంచర్తవో హేమశిశిరయోః సమాసేన' ఐ.బ్రా. 1-1.

కౌషీతకీబ్రాహ్మణము ఋతువునకు నూటయిరువదిదినములు (నాలుగు మాసములు) జెప్పినది. అనగా మూడు ఋతువులనే గ్రహించినది.

'వింశతి శతం వా ఋతో రహాని' — కౌ.బ్రా. 11-7.

తైత్తిరీయారణ్యకమున ఆఱు ఋతువులు చెప్పబడినవి.

'షట్సంపద్యంతే। షడ్వా ఋతవః। ఋతుభ్య ఏవ
యజ్ఞస్యశిరోఽవరుంధే' — తై. ఆ. 5-6.

ఇట నొకే శతపథశ్రుతియందును, తాండ్యబ్రాహ్మణమునను భిన్నభిన్న స్థలములలో ఋతుసంఖ్య భిన్నభిన్నముగా నున్నది. ఇంకొక శ్రుతియందు

మూడే చెప్పబడినవి. ఇంకొకదానియందు అయిదు గ్రహింపబడినవి. దీనిని బట్టి ఆ యా శ్రుతులుగాని, శ్రుతులలో నా యా భాగములుగాని రచింప బడుసమయమున నట బేర్కొనబడిన సంఖ్య ననుసరించియే ఋతువు లుండెడి వవి గాని, ఆ యా భిన్నభిన్న ఋతుసంఖ్యలను బట్టి యానాటి రచయితలకు గల కాలవిజ్ఞానవిశేష మిది యని గాని చెప్పవలనుపడునా? ఇంకొకవిషయము.

ఛాందోగ్యశ్రుతియందు పంచభూతముల సృష్టి చెప్పబడలేదు. ఆ శ్రుతి పంచభూతములలో మూడవది యగు తేజస్సుతో సృష్టివర్ణనము నారంభించి 'తేజోఽబన్నముల (తేజః-అప్-అన్న) సృష్టిక్రమమునే వివరించినది.

"తత్తేజోఽసృజత....తదపోఽసృజత....తా అన్న మసృజంత"

— ఛాం. 6-2-3, 4.

తైత్తిరీయశ్రుతి సృష్టివర్ణన మాకాశముతో నారంభించి పంచభూతాది సృష్టిక్రమమును వివరించినది.

"తస్మా ద్వా ఏతస్మా దాత్మన ఆకాశః సంభూతః, ఆకాశా
ద్వాయుః, వాయో రగ్నిః, అగ్నే రాపః, అద్భ్యః పృథివీ"

— తై. ఉ. 2.

కాని ఛాందోగ్యశ్రుతిరచనాకాలమున భూతత్రయోత్పత్తియే జరిగినది గాని ఆకాశవాయువులసృష్టి జరుగలేదనిగాని, లేక యానాటి రచయితలకు వానిని గూర్చిన పరిజ్ఞానము లేదని గాని చెప్ప నగునా? ఇట్టియెడ పరస్పర విరుద్ధములుగ గన్పట్టు శ్రుతివాక్యముల సమన్వయపరచు సంప్రదాయము శ్రీ బాదరాయణుడు బ్రహ్మసూత్రములందు వివరించియే యుండిరి. (చూ- అవిరోధాధ్యాయము, వియదధికరణము మొ॥).

అట్లే త్రయీశబ్దవిషయమున గూడ సంప్రదాయమును గమనించుట యుక్తము. వేదములు నాలుగైనను శ్రుతి కొన్నిచోట్ల ఏకత్వవివక్ష చేసి 'వాక్' అనియే వేదసామాన్యమును వ్యవహరించినది.

'వాచా విరూప నిత్యయా' — ఋ. 8-75-6,

'దేవీం వాచ మజనయన్త దేవాః' — ఋ. 8-100-11.

'యద్ వా గ్వద న్త్యవిచేతనాని' — ఋ. 8-100-12.

'వాచం ధేను ముపాసీత' — బృ. ఉ. 5-8-1.

'వా గితి త ద్బ్రహ్మ'

— ఐ. బ్రా. 6.3; 2-15; శ. బ్రా. 2-1-4-10; జై. ఉ. 2-9-6; గో. పూ- 2-10,11.

'వాగ్ దీక్ష' — కౌషీ. బ్రా. 30-1.

శ్రుతులు కొన్నిచోట్ల వేదములను తిస్రో వాచః అని పేర్కొనినవి.

"తిస్రో వాచ ఈరయతి" — ఋ. 9-97-34.

"తిస్రో వాచ ఉదీరత" — ,, 9-33-4.

తిస్రో వాచః ప్రవద — ,, 7-101-1.

'త్రేధా విహితా హి వాక్ ఋచో యజూంషి సామాని'

— శ. బ్రా. 6-5-34; 10-4-5-2,

కొన్నియెడల నీ వేదములు నాల్గు వాక్కులుగా జెప్పబడినవి.

'చత్వారి వాక్ పరిమితా పదాని' — ఋ. 1-164-45.

'చత్వారి శృంగా' — ,, 4-58-3.

'పాహి చతసృభిః (గీర్భిః)వసో' — ,, 8-60-9.

'చతస్ర ఈమ్ ఘృతదుహః — ,, 9-89-5.

'చతుష్కపర్దా యువతిః సుపేశా' — ,, 10-114-3.

చతుర్వేద ప్రసక్తి గల్గిన పై ఋక్కులలో మొదటి మూడును పూర్వము వివరింపబడినవి. నాల్గవమంత్రమున నాల్గువేదములు సోముని సేవించెడి నాలుగు గోవులు (వాక్కులు) గను, ఐదవ మంత్రము నందు వాగ్దేవికి చతుష్కపర్దములుగను వర్ణింపబడినవి. ఇట నొకే శ్రుతి (ఋగ్వేదము) భిన్నభిన్నస్థలముల యందు ప్రకరణానుసారముగ నేకత్వ వివక్ష చేసి వేదములను వాక్ అనియు, త్రిత్వవివక్ష చేసి 'తిస్రో వాచః' అనియు, చతుష్ట్వ వివక్షచేసి 'చత్వారి వాక్ పరిమితా పదాని' ఇత్యాదిగా వ్యవహరించుట కాన నగును. అట్లే యమరసింహుడును త్రయీపదమును మొదట ఏకత్వవివక్షచేసి వేదసామాన్యపరముగను, పిమ్మట త్రిత్వవివక్ష చేసి వేదత్రయసమూహపరముగను జెప్పినాడనుట స్పష్టము.

త్రయీశబ్దము - ముఖ్యార్థము:-

త్రయీశబ్దము 1) త్రిత్వసంఖ్యా వాచకముగను, అనగా 'మూడు వేదముల సమూహము' - అను నర్థము నందును 2) అవయవత్రయ సమూహవాచకముగను, అనగా 'ఋగ్-యజుఃసామరూప మంత్రములు అవయవములుగా గల వేదము' - అను నర్థ మందును—ఇట్లు రెండర్థము లందును గూడ ప్రసిద్ధ మగుచో నిం దేది ముఖ్యార్థము ? ఇందొకటి ముఖ్య మగుచో రెండవది లక్ష్యార్థము గావలెను ? కావ నీ విషయమువ గూడ శ్రుతిసంప్రదాయమును జూతము. శ్రుతియందు—

'త్రయీ వై విద్యా కావ్యం ఛందః' —శ. బ్రా. 8-5-2-4.

'త్రయీ విద్యా యజ్ఞః' — శ. బ్రా. 1-1-4-3.

ఇత్యాది ప్రయోగములు గలవు. ఇంతియే కాదు.

"తా హైతా త్రయ్య ఆపః- య న్మండూకః, అవకా వేతస

శాఖా, ఏతాభి రేవైన మేత త్రియాభి రద్భిః శమయతి"
—శ. బ్రా. 9-1-2-22.

'తా ఏతా త్రివిధా ఆపః ఖలు। తస్మాత్తై రవకర్షణే ఏతాభిః
త్రివిధాభి రపి అద్భిః ఏనం అగ్నిం శమితవాన్ భవతి' — సా. భా.

ఇచట 'త్రయాభిః అద్భిః' అని బహువచన ప్రయోగము గలదు. ఇట త్రయాశబ్దమును సంఖ్యావాచకముగ గ్రహించి 'మూడు జలములు' అను నర్థము గ్రహించుట కవకాశము లేదు. త్రివిధములగు జలము లనియే యర్థము పొసగును. శ్రీ సాయణులును 'త్రివిధాః ఆపః' అనియే వ్యాఖ్యానించిరి. ఈ శ్రుతియే వేఱొకచోట 'త్రేధా విహితా హి వాక్ ఋచో యజూంషి సామాని' యని వాక్త్రైవిధ్యమును బ్రతిపాదించుట పైన బేర్కొనబడినది. త్రిశబ్దముకంటె అవయవార్థమున బ్రత్యయము వచ్చి త్రయా శబ్దము నిష్పన్న మగుటయు బూర్వము వివరింపబడినది. కాన త్రయాశబ్దమునకు 'మంత్రత్రైవిధ్యము గలది' యనునదియే ముఖ్యార్థమని గ్రహింప నగును.

ఋగ్వేదము గూడ వేదరూప మగు వాక్కు త్రైవిధ్యముతో నొప్పుచు బ్రవృత్త మయినట్లు చెప్పుచున్నది.

'అసర్జి వాం స్థవిరా వేధసా గీ ర్బాళ్హే అశ్వినా త్రేధా క్షరన్తీ'
— ఋ. 1-181-7.

'గీః స్తుతిరూపా వాక్....కీదృశీ। స్థవిరా అత్యంతం స్థిరా నిత్యా వేదమయీ, త్రేధా మంత్రాదిభేదేన త్రిప్రకారా' —సా. భా.

త్రయాశబ్దమునకు ఋగ్యజుఃసామ మంత్రత్రైవిధ్యము గలది'- యను నర్థమే గాక 'రక్షించునది' (త్రాయతే రక్షతే ఇతి త్రయా) యను నర్థము గూడ సంప్రదాయానుగతమై కన్పట్టుచున్నది.

"వార్తామూలో హ్యయం లోకః త్రయ్యా వై ధార్యతే సదా।
తాత్పర్యం వర్తతే సమ్యగ్యదా రక్షతి భూమిపః॥"

— భార. 12-68-35.

'వార్తా జీవికా తన్మూలః, త్రయ్యా చ వృష్ట్యాది హేతుతయా
త్రాయతే రక్షతే సర్వం త్రయీ వార్తాదిః' — నీలకంఠః.

వార్త యన జీవికకొఱకైన వృత్తి. లోకము దీనిపై నాధారపడి యుండును. వార్తాదులు వృష్ట్యాదిహేతువులై లోకమును సర్వదా రక్షించుచుండును. కాన వానికి త్రయీ యని పేరు. భూపాలకుడు వీనిని జక్కగా రక్షించుచో నివియు జక్కగా నుండి ప్రజల గాపాడును: లేనిచో లేదు - అని యర్థము.

కనుక (ఈ నిర్వచనము ననుసరించియు) రక్షకత్వధర్మము వేదసామాన్యము నం దుండుటచే త్రయీశబ్దము వేదసామాన్యవాచకముగా నిట గ్రహింపబడినది.

త్రయీ - పరాదేవత :-

వేదాదిశబ్దములు వేదవాచకము లగుచు పరమేశ్వర వాచకములు నయినట్లు త్రయీశబ్దము గూడ వేదవాచక మగుచు పరదేవతా వాచకముగ ప్రసిద్ధము.

'ఋగ్యజుః సామ భాగేన సాంగవేదగతాపి యా। (యతః)
త్రయీతి పఠ్యతే లోకే దృష్టాదృష్టార్థ సాధినీ'॥

— దేవీపురాణమ్ (వాచస్పత్యమ్).

ఋగ్యజుః సామ మంత్రరూపమున సాంగవేదములను వ్యాపించి యధ్యయనము జేయబడుటచే పరాదేవియే త్రయీ యని చెప్పబడుచున్నది- అని యర్థము. పరాదేవత యిట్లే యితరపురాణము లందును గీర్తింపబడినది.

"మమైవాన్యా పరాశక్తి ర్వేదసంజ్ఞా పురాతనీ।
ఋగ్యజుః సామ రూపేణ సర్గాదౌ సంప్రవర్తతే॥" — కూర్మ. పు.
"ఆన్వీక్షకీ త్రయీ దేవి దండనీతి శ్చ కథ్యసే" — పద్మ. పు.
"త్రయీ త్రివర్గనిలయా" — లలితాసహస్రనామ.

'ఓం'కారము త్రయీవిద్యా ప్రతినిధిరూప మని శ్రుతి నిర్దేశించుచున్నది.

"ఓ మితి ప్రతిపద్యత ఏత ద్వై యజు స్త్రయీం విద్యాం
ప్రత్యేషా వా గేత త్పరమ మక్షరమ్" — తై.ఆ. 2-11.

పై ప్రమాణముల వలన త్రయీశబ్దము పరమేశ్వరునకును, లేక పరాదేవతకును, ఋగ్యజుస్సామ మంత్రాత్మక మగు వేదరాశికిని నామ మగుట దెలియవచ్చుచున్నది. కాన వేద, ఋషి, బ్రహ్మాది పూర్వోక్త వేదనామము లన్నిటి యట్లే యీ త్రయీపదము గూడ పరమేశ్వరునకు వాచక మగుచు, వేదసామాన్యము నకును వాచక మగుచున్న దని గ్రహించుట యుక్తము.

అథర్వవేదము - భిన్న నామములు - ఔచిత్యము :-

పైన జెప్పినట్లు అన్ని వేదములు మంత్రత్రైవిధ్యము గలవి యగుచో వానికి భిన్నభిన్న నామము లుండుటకు గారణ మేమి ? యన వచ్చును. ఋగాది మంత్రముల ప్రాధాన్యమును బురస్కరించుకొని నాలుగు వేదము లను వ్యవహార మేర్పడినది. ఋక్కులు ప్రధానముగా గలది ఋగ్వేదము. యజుస్సులు ప్రధానముగా గలది యజుర్వేదము. సామలు ప్రధానముగా గలది సామవేదము. నాల్గవది యథర్వవేదము. ఋగ్వేదము వలెనే యథర్వవేదము గూడ ఋక్ప్రధాన మైనదే. కనుక దీనికిని ఋగ్వేద మని వ్యవహార ముండ దగును గదా ! అట్లుగాక యథర్వవేద మను పేరుతో దీనిని ప్రత్యేకించి నాల్గవవేదముగ బరిగణించుట యేల ?

ఇతరవేదముల కంటె విలక్షణమైన దగుట చేతనే యీ వేదమును పృథక్కరించి పరిగణింప వలసి వచ్చినది. ప్రధానముగ శాంతిక పౌష్టికాది కర్మ ప్రతిపాదక మగుచు నైహికాముష్మిక పురుషార్థ పరిజ్ఞానోపాయభూత మగుట యిందలి వైలక్షణ్యము (చూ. అథర్వవేద భాష్యభూమిక). దీని యందలి యనితర సాధారణ వైలక్షణ్యమును సూచించుటకో యనునట్లు శ్రుతియే బ్రహ్మవేదము, క్షత్రవేదము, భైషజ్యవేదము, అథర్వవేదము, అంగిరోవేదము, అథర్వాంగిరోవేదము, భృగ్వంగిరోవేదము — అనెడి వివిధనామములతో నీ వేదమును వ్యవహరించుకొనినది. ఈ నామముల యౌచిత్యమును జూతము.

భైషజ్యవేదము - అంగిరోవేదము :-

శ్రుతిస్మృతుల యందు పరమేశ్వరుడు భిషక్ (వైద్యుడు) అనియు, భిషక్తమః అనియు గీర్తింపబడినాడు.

"భిషక్తమం త్వా భిషజాం శృణోమి" — ఋ. 2-33-4.

"ప్రథమో దైవ్యో భిషక్" — తై.సం. 4-5-1-2; వా.సం. 16-5.

"భేషజం భిషక్" — విష్ణుసహస్రనామ.

'సంసారరోగస్య ఔషధం భేషజం। సంసారరోగ నిర్మోక్ష కారిణీం పరాం విద్యా ముపదిదేశ గీతా స్వితి భిషక్' — శం. భా.

పరమేశ్వరుడు సంసారరోగములను నివర్తింప జేయు దివ్యౌషధము· సంసారరోగము నుండి విముక్తిని బ్రసాదించు పరావిద్యను గీతల యందుపదేశించుటచే భిషక్ — అని యర్థము. నిఖిలవిద్యావేత్త యగుటచే బరమేశ్వరుడు 'వైద్యః' అనియు సహస్రనామముల యందు గీర్తింప బడినాడు.

'భీషయతీతి భిషక్ - అథవా - బిభేత్యస్మాద్రోగ ఇతి భిషక్'
— వాచస్పత్యమ్.

'భీషాఽస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః' — తై. ఉ.

పరమేశ్వరుని వలన భీతులై సూర్యాది దేవతలు స్వ స్వ కార్యముల యందు ప్రవర్తిల్లుచున్నారు - అనెడి శ్రుతుల ననుసరించి సూర్యాది దేవతా భయకారణ మగుటచే బరమేశ్వరునకు 'భిషక్' అని సార్థకనామము: లేక యెవని వలన భయపడి యాధివ్యాధులు తొలగిపోవునో లేక సంసార రోగము నివర్తించునో యట్టి పరమేశ్వరుడు భిషక్.

"యజ్ఞస్య హైవ భిషక్ య ద్బ్రహ్మా యజ్ఞాయైవ
త ద్భేషజం కృత్వా హరతి' —ఐ. బ్రా. 5-9-34.

'యో బ్రహ్మాఽస్తి ఏష యజ్ఞస్య భిషక్ చికిత్సకః । తస్మా
త్కారణాత్ యజ్ఞాయైవ భేషజం కృత్వా యజ్ఞాస్యాంగ
వైకల్యరోగం శమయిత్వా దక్షిణాం హరతి' — సా. భా.

ఋత్విక్కులలో బ్రహ్మ యను ఋత్విక్కుకు భిషక్ అని పేరు. ఇతడు యజ్ఞమునకు సంభవించెడి యంగవైకల్య మనెడి వ్యాధిని చికిత్స జేసి శమింప జేయును. కాన హోత, ఉద్గాత మున్నగు ఋత్విక్కులతోపాటు దక్షిణను గ్రహించును—అని యర్థము.

'అతఏవ సంప్రదాయవిద ఆహుః —
'అథర్వక్షేత్రవాన్ బ్రహ్మా వేదేష్వన్యేషు భాగవాన్,
తస్మా ద్బ్రహ్మాణం బ్రహ్మిష్ఠ మితి హ్యారణ్యకే శ్రుతమ్'
— సా. భా. — ఐ. బ్రా. 5-8-33.

కాన యజ్ఞమునందు బ్రహ్మ యను ఋత్విక్కు ఋగ్యజుఃసామ వేద విదుడే గాక ప్రధానముగ నథర్వవేదవిదుడు నయి యుండవలె నని తెలియు

చున్నది. అట్టి బ్రహ్మయే భిషక్ కాగలడు. అట్టి యతడే యజ్ఞమయ మున నాధ్యాత్మికముగను, నాధిదైవికముగను, నాధిభౌతికముగను సంభ వించెడి యుపద్రవముల 'నాథర్వణిక సిద్ధ మంత్రములచే శమింపజేయ గలడు. ఇట్లాతనికి దోడ్పడు వేద మగుటచే భైషజ్యవేద మని సార్థక నామము.

మఱియు 'అంగానాం హి రసోఽంగిరసః' — అంగరసము లగు సప్తధాతువులకు సంబంధించిన చికిత్సను విశేషముగ ప్రతిపాదించునట్టి దగుటచేత నీ భైషజ్యవేదమే యంగిరోవేద మను సార్థకనామము నొంది నట్లును సంప్రదాయవిదులు జెప్పుదురు. అంగిరసు లనెడి మహర్షులచే దర్శింపబడుటచే 'అంగిరోవేదము' అని ప్రసిద్ధి వచ్చిన దనెడి విషయము ముందు వివరింపబడును.

బ్రహ్మవేదము - క్షత్రవేదము:-

'క్షతాత్ త్రాయతే-ఇతి క్షత్రమ్' - ఆపదనుండి కాపాడునది యని యర్థము. రక్షః పిశాచ శత్రు సర్ప విష రోగా ద్యుపద్రవముల నుండి కాపాడుచు, కార్యసిద్ధి గూర్చు సిద్ధమంత్రములతో నొప్పునది యని భావము. యజ్ఞాదికర్మలయం దెట్టి యుపద్రవములు గల్గినను వారించు సామర్థ్య మాథర్వణిక మంత్రములకు గలదు. శ్రీమద్రామాయణమున వసిష్ఠుడు 'బ్రహ్మవేదవిదాం శ్రేష్ఠః క్షత్రవేదవిదాం వరః' అని కీర్తింపబడినట్లు పూర్వము వివరింపబడినది. కనుక బ్రహ్మ (లేక పురోహితుడు, లేక గురువు లేక వసిష్ఠుడు నగువాడు బ్రాహ్మక్షాత్ర తేజములు రెండిటితో విలసిల్లుచుండ నగు నని శ్రుతితాత్పర్యమై యున్నది. కాని యిట నథర్వ వేదమునకు క్షత్రవేద మనియు, మిగిలిన మూడింటికిని బ్రహ్మవేదము అనియు వ్యవహార మున్నట్లు పై రామాయణశ్లోకము ననుసరించి తెలియు

చున్నది. బ్రహ్మకర్తవ్య ప్రతిపాదక మగుటచే నాథర్వణమునకు బ్రహ్మవేద మను వ్యవహార ముపపన్న మైనట్లు పైన వివరింపబడినది. కాన ప్రకరణము ననుసరించి యీ వేదముల కిట్టి భిన్నభిన్న నామములతో వ్యవహార మేర్పడినట్లు గాన నగును. ఇవి యన్నియు వ్యవహార నామములు లేక కర్మనామధేయములు; కాగా రూఢినామములు గావని తెలియుచున్నది. యజుర్వేదము ప్రధానముగ నధ్వర్యుకర్మ ప్రతిపాదక మగుటచే ఆధ్వర్యవ కాండ, అట్లే ఋగ్వేదము హౌత్రకాండ, సామవేదము ఔద్గాత్రకాండ, యయినట్లు, ఆథర్వణముకూడ ప్రధానముగ బ్రహ్మకర్తవ్య ప్రతిపాదక మగుచు బ్రహ్మవేదము; క్షత్త్రాణ ధర్మముచే క్షత్రవేదము నగుచు, బ్రహ్మతత్త్వ ప్రతిపాదక మగు నెడ మిగిలిన వేదములతోపాటు నిడియు బ్రహ్మవేద మగుచుండును.

వసిష్ఠః - బ్రహ్మ :—

ఇట నొక విషయము గమనింప దగును. త్రేతాగ్నిసాధ్య యజ్ఞకర్మ నిర్వాహకు డగు ఋత్విజునకు బ్రహ్మ యను నామము ప్రసిద్ధ మయినట్లే ఏకాగ్నిసాధ్య వివాహోపనయనాది సంస్కారముల నిర్వహించు పురోహితునకు గూడ బ్రహ్మ, వసిష్ఠ – ఇత్యాది నామములు అనాది సిద్ధములు. వసిష్ఠుడు పురోహితుడయి పెక్కురాజుల యజ్ఞాదికార్యముల నిర్వహించి నట్లు శ్రుతులయందు గలదు.

> "ఉక్థభృతం సామభృతం బిభర్తి గ్రావాణం బిభ్ర
> త్ప్రవదా త్యగ్రే। ఉపైన మాధ్వం సుమనస్యమానా
> ఆ వో గచ్ఛాతి ప్రతృదో వసిష్ఠః ॥" — ఋ. 7-33-14

ఇట వసిష్ఠుడు బ్రహ్మస్థానీయు డగుచు (1) హోతను (ఉక్థభృతం శస్త్రాణాం నంశక్తారం), (2) ఉద్గాతను (సామభృతం), (3) అధ్వర్యుని

(గ్రావాణం బిభర్తి అభిషవణం బిభ్రతం అధ్వర్యుం), — ఇట్టి ముప్వురిని భరించుచు యజ్ఞమున భ్రేషాది(ప్రాయశ్చిత్తాది) నిమిత్తమైన కర్తవ్యము నుపదేశింపగలవాడు. అట్టి బ్రహ్మ లేక పురోహితుడైన వసిష్ఠుని ఆరాధింపుడు (ఏనం ఉప ఆధ్వం) — అని యింద్రుడు తృత్సులను (రాజులను) ప్రబోధించుట మంత్రార్థము.

ఇట ముప్వురు ఋత్విజులను — యజ్ఞమును వసిష్ఠుడు భరించుచున్నట్లు బ్రహ్మకర్తవ్యమును శ్రుతి తెల్పుచున్నది. భరించువా డగుటచే వసిష్ఠుడు ఇట బ్రహ్మ యగుట 'భిభర్తి' అను నిర్వచనము ద్వారా వివరించుచున్నది. ఇంకొక మంత్రమును జూతము.

'దండా ఇవేద్గో అజనాస ఆసన్ పరిచ్ఛిన్నా భరతా అర్భకాసః।
అభవచ్చ పుర ఏతా వసిష్ఠ ఆదిత్తృత్సూనాం విశో అప్రథన్త॥'
—ఋ. 7-33-6.

ఈ మంత్రమున గూడ భరతులకు వసిష్ఠుడు పురోహితుడు (పుర ఏతా) అయినట్లును, వారు తమ శత్రువులచే బరాభూతు లయి యెంత దుర్బలు లయినను ఆ వసిష్ఠమహర్షియొక్క పౌరోహిత్యసామర్థ్యము వలన ప్రజల వర్ధిల్ల జేసిరి — అని చెప్పబడినది.

మఱియు జలోదరవ్యాధిపీడితు డయి హరిశ్చంద్రు డను రాజు సంకల్పించిన యజ్ఞమునందు విశ్వామిత్రాది మహర్షులు నలుపురు ఋత్విజులు; అందు వసిష్ఠుడు బ్రహ్మస్థాన మలంకరించినట్లు ఐతరేయబ్రాహ్మణ[1]మున గలదు. ఇంతే కాదు.

---

1. 'తస్య హ విశ్వామిత్రో హోతాసీ జ్జమదగ్ని రధ్వర్యు ర్వసిష్ఠో బ్రహ్మా ఽయాస్య ఉద్గాతా....' — ఐ.బ్రా. 7-4-16.

'తతో వసిష్ఠపురోహితాః ప్రజాః ప్రాజాయన్త
తస్మా ద్వాసిష్ఠో బ్రహ్మ కార్యః ప్రైవ జాయతే'
— తై.సం. 3-5-2-1.

ఇంద్రుడు వసిష్ఠునకు 'స్తోమభాగాః' అనెడి బ్రహ్మత్వోపయుక్త మంత్ర జాతము నుపదేశించెను. అట్లు ఇంద్రుడు మంత్రజాతమును వసిష్ఠున కనుగ్రహించుటచే ప్రజ లందఱు వసిష్ఠుడే పురోహితుడుగా గల్గి యుద్భవించుచుందురు. ఆ కారణముచేతనే సోమయాగమును సంకల్పించు వారు వాసిష్ఠుని (లేక ఆ సంప్రదాయము నెఱిగిన వానిని గాని) బ్రహ్మగా వరింపవలెను. అట్లు చేసినచో యజమాను డట్టి సత్సంతానమును గాంచ గలడు - అని యర్థము. కొలది మార్పులతో నీ శ్రుతివాక్యము తాండ్య బ్రాహ్మణము నందును గలదు.

"తతో వై వసిష్ఠపురోహితాః భరతాః ప్రాజాయన్త"
— తాం.బ్రా. 15-5.24.

జైమినిమహర్షియు - 'వాసిష్ఠానాం వా బ్రహ్మత్వస్య నియమాత్; సర్వేషాం వా ప్రతిప్రసవాత్ (6-6-24, 25)' - అను సూత్రముల ద్వారా వాసిష్ఠులు గాని, స్తోమభాగల నధ్యయనము జేసి తత్సంప్రదాయము నెఱిగినవారు గాని బ్రహ్మత్వమున కర్హు లని వివరించినాడు. బృహద్దేవతయు నీ విషయము నిట్లు చెప్పుచున్నది.

"వసిష్ఠాశ్చ వసిష్ఠా శ్చ బ్రాహ్మణా బ్రహ్మకర్మణి।
సర్వకర్మసు యజ్ఞేషు దక్షిణీయతమా స్తథా॥"
తస్మా ద్యే ఽద్యాపి వాసిష్ఠాః సదస్యాః స్యు స్తు కర్హి చిత్।
అర్హా యే దక్షిణాభి స్తాన్ భాల్లవేయీ శ్రుతి స్త్వియమ్॥
— బృ.దే. 5-158, 159.

వసిష్ఠుడు అథర్వుడు :-

వసిష్ఠుడే అధర్వు డని కిరాతార్జునీయకావ్యమున మల్లినాథవ్యాఖ్య వలన దెలియుచున్నది.

"యమ నియమ కృశీకృత స్థిరాంగః
పరిదదృశే విధృతాయుధః స తాభిః।
అనుపమ శమ దీప్తతా గరీయాన్
కృతపదపంక్తి రథర్వణేవ వేదః॥"—10-10.

అభ్యుదయకాండచే శాంతరూపము, అభిచారకాండచే నుగ్రరూపము నయి నియతానుపూర్వి గల్గిన వేదమును అథర్వణుడు దర్శించినట్లు, యమనియ మాదులచే కృశించియు స్థిరాంగుడై (నిశ్చలుడై) బ్రాహ్మతేజముతోను, శస్త్రధారియై క్షాత్రతేజముతోను వెలుగొందుచున్న యర్జునుని స్త్రీలు గాంచిరి— అని యర్థము.

ఇట మల్లినాథుడు – 'అథర్వణా వసిష్ఠేన, కృతా రచితా పదానాం పంక్తి రానుపూర్వీ యస్య స వేదః। చతుర్థ వేద ఇత్యర్థః। ఆథర్వణ స్తు మంత్రో వసిష్ఠకృత ఇత్యాగమః' — అని వ్యాఖ్యానించినాడు.

అథర్వమంత్రములు వసిష్ఠకృతము లని యీ వ్యాఖ్య వలన దెలియుచున్నది. ఈ విషయ మింకను బరిశీలింప వలసి యున్నది. కాని యథర్వాంగిరసులచే దర్శింపబడుటచే దీనికి అథర్వవేదము, అథర్వాంగిరో వేదము—ఇత్యాది నామములు ప్రసిద్ధము లయినట్లు శ్రుతి, స్మృతి, పురాణా దుల వలన దెలియుచున్నది. వసిష్ఠుడే అథర్వణు డగుచో 'వసిష్ఠకృతము' అను మల్లినాథవాక్యమునకు వసిష్ఠునిచే దర్శింపబడిన దని యర్థమును గ్రహింపనగును. మంత్రకృత్ ఇత్యాది పదముల కిట్లే యర్థము గ్రహింప దగు నని పూర్వము వివరింపబడినది (చూ. ఋషిశబ్దము). ఇట్లు గ్రహించి

వనే ఋగిత్యాదులతో నవిరోధము సిద్ధించును. ఏలయన నథర్వవేదమే కాదు, వసిష్ఠుడు నిఖిలవేదరాశితోపాటు మిత్రావరుణులకు మానసపుత్రుడుగ నావిర్భవించినట్లు ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

"ఉతాసి మైత్రావరుణో వసిష్ఠోర్వశ్యా బ్రహ్మన్ మనసో
ఽధిజాతః। ద్రప్సం స్కన్నం బ్రహ్మణా దైవ్యేన విశ్వే
దేవాః పుష్కరే త్వాదదన్త ॥" —ఋ. 7-33-11.

'హే బ్రహ్మన్। వసిష్ఠః ఏవం జాతం త్వా త్వాం, దైవ్యేన
దేవసంబంధినా, బ్రహ్మణా వేదరాశినా అహంభువా,
యుక్తం, పుష్కరే విశ్వేదేవాః అదదన్త అధారయన్త — సా.భా.

దివ్యము, స్వాయంభువము నగు వేదరాశితోపాటు వసిష్ఠు డవతరించుట యీ ఋక్కు చెప్పుచున్నది. మఱియు నిట వసిష్ఠుడు బ్రహ్మన్। అని సంబోధింపబడుట గమనార్హము. బ్రహ్మజ్ఞానసంపన్నుడై లేక సర్వవేదమయుడై యవతరించుట జేసి వసిష్ఠుడు బ్రహ్మ యని సంబోధింపబడినాడు. వేదమయు డయిన యీ మహర్షి ప్రాణాత్మ స్వరూపు డగుటచే వసిష్ఠ డని సార్థకనామ మొందినట్లు ఐతరేయారణ్యక మిట్లు చెప్పుచున్నది.

"ఏత ద్ధ స్మ వై త ద్విద్వాన్ వసిష్ఠో వసిష్ఠో బభూవ।
అత ఏత న్నామధేయం లేభే" — ఐ.ఆ. 2-12.

'అతిశయేన నివాసహేతుత్వం ఆచ్ఛాదయితృత్వం వా
వసిష్ఠత్వమ్। ప్రాణో హి స్వప్రవేశేన నివాసహేతు ర్భవతి।
స్వవ్యాప్త్యా సర్వ మాచ్ఛాదయతి। తాదృశ ప్రాణాత్మత్వం
ధ్యానేన ప్రాప్తవా న్ముని రపి అర్థద్వయవత్త్వేన వసిష్ఠ
నామకత్వం లబ్ధవాన్' — సా.భా.

శరీరమున బ్రవేశించి నివాసహేతు వగుటయు, అంతట వ్యాపించి యాచ్ఛాదించుటయు ప్రాణధర్మము. దానికే వపిష్ఠత్వ మని పేరు.

ప్రాణాత్మ ధ్యానముచే నీ మహర్షియు నా రెండు ధర్మములు గల్గి, వసిష్ఠు డని సార్థకనామ డయ్యెను - అనగా నిరంతర ప్రాణాత్మ ధ్యానపరవశుడై తదభేద భావనతో నొప్పి ప్రాణాత్మగత వసిష్ఠత్వ ధర్మముతో విలసిల్లి యీ మహర్షి వసిష్ఠశబ్దవాచ్యు డయ్యె నని యర్థము.

కాగా వసిష్ఠు డను నామము మొదట ప్రజాపతి యగు హిరణ్యగర్భునకు (ప్రాణాత్మ లేక సూత్రాత్మకు), తరువాత తదనుగ్రహపాత్రుడై తద్ధర్మములతో నొప్పెడి మహర్షికిని ప్రసిద్ధ మైన దని తెలియును. ప్రాణాత్మ లేక ప్రజాపతి వసిష్ఠు డగుట శ్రుతి ప్రసిద్ధమే.

1. 'ప్రజాపతి ర్వై వసిష్ఠః' —కౌషీ.బ్రా. 25-2 ; 26-15.

2. (వా.సం. 13-54) 'ప్రాణో వై వసిష్ఠ ఋషిః'—శ.బ్రా. 8-1-1-6.

3. ఏష (ప్రజాపతిః) వై వసిష్ఠః (సర్వశ్రేష్ఠః-సా.భా.)
— శ.బ్రా. 2-4-4-2.

4. య ద్వై ను శ్రేష్ఠ స్తేన వసిష్ఠో ఽథో య ద్వ స్తృతమో
వసతి తేనో ఏవ వసిష్ఠః — శ.బ్రా. 8-1-1-6.

5. సా హ వా గువాచ - (హేప్రాణ) యద్వా ఽహం
వసిష్ఠాస్మి త్వం తద్వసిష్ఠోఽసీతి' — శ.బ్రా. 14-9-2-14.

పై నిర్వచనముల జూచుచో శ్రుతుల యందు ప్రాణాత్మ యగు ప్రజాపతికి గల వసిష్ఠు డనెడి ప్రసిద్ధి దెలియును. మఱియు ప్రజాపతియే వసిష్ఠుడనియు, తద్గత మైన వాక్కు వసిష్ఠా యనియు పై శ్రుతుల వలన దెలియుచున్నది. వేదరాశితోపాటు వసిష్ఠు డుద్భవించుట (ఋ. 7-33-11) పూర్వము దెల్పబడినది. ప్రజాపతికి స్వభూత మైన వాక్కు (వేదవాక్కు)నకు స్వాహా, యని ప్రసిద్ధి యున్నట్లును పూర్వము వివరింపబడినది. అట్టి స్వాహాపతి లేక వాక్పతి యగు నగ్నియు వసిష్ఠు డని ఋగ్వేదము చెప్పుచున్నది.

"అదబ్ధవ్రత ప్రమతి ర్వసిష్ఠః సహస్రంభరః శుచిజిహ్వో అగ్నిః।" — ఋ. 2-9-1. ఐ. బ్రా. 1-28.

ఈ మంత్రమును ఐతరేయబ్రాహ్మణ మిట్లు వివరించినది.

"అదబ్ధవ్రత ప్రమతి ర్వసిష్ఠ ఇ త్యగ్ని ర్వై దేవానాం వసిష్ఠః"

సర్వవిధారకుడు, సర్వనివాసహేతుభూతుడు (సర్వస్య వాసయితృతమః) నగుటచే అగ్ని యిట వసిష్ఠుడుగ స్తుతింపబడుచున్నాడు. యజ్ఞము నందు స్తుతింపబడెడి యిట్టి లక్షణములు గల యగ్ని సర్వదేవాత్మకు డగు ప్రజాపతియే యగును. అగ్ని వసిష్ఠ డని ఋగ్వేదమున నింకను పెక్కుమంత్రము లందు (7_1_8; 7_9_1: 7_9_6 మొ॥) కీర్తింపబడినాడు. ఈ యగ్నియే యజ్ఞదేవుడు, పురోహితుడు, ఋత్విజుడు, ఫలప్రదాతయు నని ఋగ్వేదము మొదటి మంత్రమున (అగ్ని మీడే పురోహితం యజ్ఞస్య దేవ మృత్విజమ్) స్తుతింపబడినాడు. ఈ మంత్రము నందలి పురోహితపదముచే నగ్నికి గల వసిష్ఠత్వము సూచిత మగుచున్నది. కాన వసిష్ఠ డను నామము మొదట ప్రజాపతి (ప్రాణాత్మ) యందును, పిదప తద్గత భూయోధర్మములతో నొప్పు మహర్షి యందును రూఢ మయినట్లు దెలియుచున్నది.

ఈ వసిష్ఠుడు కారణాత్మ యగు పరమేశ్వరునిచే బ్రవర్తిత మగు సంసారపరిధిని (వస్త్రమును) విస్తరింపజేయుటకు (ప్రవర్తింప జేయుటకు) మహామహిమసంపన్నుడై లౌకికాలౌకిక ప్రజ్ఞానముతో నొప్పి యావిర్భూతుడయినట్లు ఋగ్వేదము చెప్పుచున్నది.

"స ప్రకేత ఉభయస్య ప్ర విద్వాన్ సహస్రదాన ఉత వా సదా నః। యమేన తతం పరిధిం వయిష్యన్ అప్సరసః పరిజజ్ఞే వసిష్ఠః॥" — ఋ. 7-33-12.

"ప్రకేతః ప్రకృష్టజ్ఞానః, ఉభయస్య ఉభయం దివం చ పృథివీం చ ప్రవిద్వాన్ ప్రకర్షేణ జానన్ .... యమేన కారణాత్మనా సర్వనియంత్రా తతం విస్తృతం పరిధిం వస్త్రం, పరిధి రిత్యనేన సంసారప్రవాహో వివక్షితః, తం వయిష్యన్ .... జాతః —సా. భా.

మహాభారతము గూడ శ్రుత్యనుగుణముగ వసిష్ఠశబ్దము నిట్లు నిర్వచించినది.

"[1]వసిష్ఠో ఽస్మి వరిష్ఠో ఽస్మి వసే వాసగృహే ష్వపి।
వసిష్ఠత్వా చ్చ వాసా చ్చ వసిష్ఠ ఇతి విద్ధి మామ్॥"

— భార. 13-93-88.

శ్రుతిప్రసిద్ధము లగు పృథివ్యంతరిక్షాదులకు వసువులు (వసవః) అని పేరు. ఇవి యెవని యధీనమున నుండునో యతడు వసుమంతుడు (వసుమాన్). అట్టివారిని అతిశయించినవాడు (అతిశయేన వసుమాన్) అగుటచే వసిష్ఠుడు. మఱియు నతిశయించి సర్వమును వ్యాపించినవాడు (అతిశయేన ఉరుః) గాన వరిష్ఠుడు. సర్వము నెవని యధీనమున నుండునో, అన్యాధీనమున నెవ డుండడో యతడు వసిష్ఠు డని పై రెండు నిర్వచనముల భావము. వాసగృహము లనగా వాసయోగ్యములు,

1. వసిష్ఠః - వాయు శ్చ పృథివీ చ వాయు శ్చాంతరిక్షం చ ద్యౌ శ్చాదిత్య శ్చంద్రమా శ్చ నక్షత్రాణి చేతి వసవ, ఏతేషు హీదం సర్వం వసు హిత మేతే హీదం సర్వం వాసయంత - ఇతి శ్రుతి ప్రసిద్ధా వసవ స్తే యస్య స్వాధీనా భవంతి స వసుమాన్, ప్రాప్తాణిమా ద్యైశ్వర్యో మహాయోగీ, అతిశయేన వసుమా నితి వసిష్ఠః.... అతిశయేన ఉరు రస్మి....సర్వం మ ద్వశే ఽస్తి. అహం తు న కస్యాపి వశే ఽస్మీతి నామద్వయార్థః॥ వాసగృహేషు వాసయోగ్యేషు గృహస్థాశ్రమేషు సర్వేషా ముపజీవ్యేషు వసే వసామి। అతో ఽహం వ స్తూనాం మధ్యే అతిశ్రేష్ఠ ఇతి వసిష్ఠోఽస్మి।....సర్వేషా మాశ్రయ భూతత్వా న్మమ మాం దేవా రక్షం తీతి భావః। — నీలకంఠః.

నితరాశ్రమముల కాధారభూతములగు గృహస్థాశ్రమము అని యర్థము. అందు వసించుటచేతను, అట్లు వసించువారిలో నతిశ్రేష్ఠు డగుటచేతను గూడ వసిష్ఠుడు - అని యర్థము.

పై నిర్వచనముల బరిశీలించుచో వసిష్ఠుడు శ్రుతిప్రతిపాదిత మహామహిమసంపన్నుడై, ప్రజాపతి యగు బ్రహ్మకు గల వసిష్ఠత్వాది ధర్మములతో నొప్పి యుండుట దెలియును. ఇట్టి వసిష్ఠత్వధర్మముతో నొప్పెడి ఋత్విజుడే బ్రహ్మయై యజ్ఞకర్మనిర్వహణము జేయ నగు నని శ్రుతి స్మృతి తాత్పర్యము. బ్రహ్మ యగు ఋత్విక్కు లక్షణమును ఐతరేయారణ్యకశ్రుతి యిట్లు వివరించుచున్నది.

> "వేదపురుష ఇతి య మవోచామ। యేన వేదాన్ వేద ఋగ్వేదం యజుర్వేదం సామవేదం తస్యైతస్య బ్రహ్మ రస ఇతి। తస్మాద్ బ్రహ్మాణం బ్రహ్మిష్ఠం కుర్వీత యో యజ్ఞ స్యోల్బణం పశ్యేత్ ఇతి" —ఐ. ఆ. 3-2-3-9.

> 'యస్మా ద్వేదత్రయాభిజ్ఞానరూపస్య వేదపురుషస్య హిరణ్య గర్భోపాసకో బ్రహ్మ రసః, తస్మా, ద్బ్రహ్మ నామ సామ్యాత్ యాగేఽపి బ్రహ్మాణం ఋత్విజం బ్రహ్మిష్ఠం అతిశయేన వేదత్రయగతం కుర్వీత। బ్రహ్మ యజ్ఞసంబం ధినం, ఉల్బణం తీవ్రగుణం దోషం వా ద్రష్టుం సమర్థ స్తాదృశం కుర్వీత' — సా. భా.

ఋగాది వేదములచే జేయబడెడి హౌత్ర, ఆధ్వర్యవ, ఔద్గాత్రము లను మనస్సుతో ననుసంధానించి సంస్కరించు వేదపురుషుడు హిరణ్య గర్భుడు. అట్టి వేదపురుషుని లేక హిరణ్యగర్భుని ఉపాసించుచు తత్తా దాత్మ్యాభిమానముతో జరించు బ్రహ్మ యను ఋత్విక్కు వేదపురుషునకు

సారభూతుడు (రసః). అనగా తత్తేజోవిలసితుడు. 'బ్రహ్మ' యను నామసామ్యముచే వేదత్రయాభిజ్ఞుడై యజ్ఞము నందలి గుణదోషములను దర్శింపజాలిన బ్రహ్మిష్ఠునే యజ్ఞమున బ్రహ్మపదము నధిష్ఠింపజేయవలెను– అని యర్థము. అనగా హిరణ్యగర్భోపాసకుడై తద్దేవతానుగ్రహము నొందిన వేదపురుషుడే బ్రహ్మ కాదగు నని భావము. ఇతడు యజ్ఞము నందు సంభవించెడి దోషములను, లేక యుపద్రవములను గమనించి శమింపజేయగలవాడై యుండవలె ననియు శ్రుతి తెల్పుచున్నది. అందుచే బ్రహ్మ యథర్వవేదవిదు డయి యుండవలె ననియు సూచిత మగుచున్నది. ఈ శ్రుతి తాత్పర్యమును సంప్రదాయవిదులు నిట్లు వివరించిరి.

'అతఏవ సంప్రదాయవిద ఆహుః –

అథర్వక్షేత్రవాన్ బ్రహ్మ వేదే ష్వన్యేషు భాగవాన్। తస్మా
ద్బ్రహ్మణం బ్రహ్మిష్ఠ మితి హ్యైరణ్యకే శ్రుతమ్॥'–ఇతి.

— సా. భా.–ఐ. బ్రా. 5-8-33.

వసిష్ఠ డట్టివా డగుట శ్రుతిస్మృత్యనుగుణముగ పూర్వము వివరింపబడినది. ఇంతియే కాదు. యజ్ఞము నందలి బ్రహ్మను (ఋత్విజుని) గూర్చి తైత్తిరీయబ్రాహ్మణ మిట్లు చెప్పుచున్నది.

"యో వై బ్రహ్మణే దేవేభ్యః ప్రజాపతయేఽప్రతి
ప్రోచ్యాశ్వం మేధ్యం బధ్నాతి ఆదేవతాభ్యో వృశ్చ్యతే।
పాపీయాన్ భవతి। యః ప్రతిప్రోచ్య న దేవతాభ్య
ఆవృశ్చ్యతే। వశీయాన్ భవతి। ఇతి.

య దాహ। బ్రహ్మ న్నశ్వం మేధ్యం భన్త్స్యామి దేవేభ్యః
ప్రజాపతయే తేన రాధ్యాస మితి। బ్రహ్మ వై బ్రహ్మ।
బ్రహ్మణ ఏవ దేవేభ్యః ప్రజాపతయే ప్రతిప్రోచ్యాశ్వం
మేధ్యం బధ్నాతి, న దేవతాభ్య ఆవృశ్చ్యతే। వశీయాన్
భవతి, ఇతి. — తై. బ్రా. 3-8-3-1.

బ్రహ్మ యగు ఋత్విజునకు నివేదింపక దేవతా-ప్రజాపతి భాగరూపమ్ము, యాగయోగ్యము నయిన యశ్వమును బంధించువాడు దేవతానుగ్రహ దూరుడై మిక్కిలి పాపియగును; అట్లుగాక బ్రహ్మయొక్క యనుజ్ఞ గొని యశ్వబంధనము సేయువాడు దేవతానుగ్రహపాత్రుడై యైశ్వర్యవంతు డగును; ఏలయన బ్రహ్మపదము నధిష్ఠించెడి బ్రహ్మ యను ఋత్విక్కు సాక్షాత్ పరబ్రహ్మయే; బ్రహ్మకు నివేదించుట యనగా పరబ్రహ్మకు నివేదించుటయే యగును; బ్రహ్మస్వరూపుడగు నట్టి బ్రహ్మ (ఋత్విక్కు) యొక్క యనుమతియు, ననుగ్రహమును బొందిన యాగమే సఫలమై యైశ్వర్యప్రద మగును - అని యర్థము.

ఈ తైత్తిరీయశ్రుతి బ్రహ్మస్థానము నధిష్ఠించిన వేదమూర్తి యగు ఋత్విజుని పరబ్రహ్మస్వరూపునిగ దర్శింపవలె నని యుపదేశించుచున్నది. 'బ్రహ్మాఽయం వాచః పరమం వ్యోమ'(ఋ. 1-164-35; వా.సం 23-62) అను శ్రుతియు వేదాత్మికయగు వాక్కునకు పరమస్థానము బ్రహ్మ యని కీర్తించుచున్నది. బ్రహ్మయగు ఋత్విక్కు కూడ పరబ్రహ్మస్వరూపు డగుటచే వేదవాక్కునకు స్థానము లేక యాశ్రయ మగు ననియు నర్థము. (చూ. ఉవట మహీధరభాష్య).

వసిష్ఠు డట్టివాడు. ఆ మహర్షి త్రయీవిదుడు, నథర్వవిదుడు గూడ నగుచు సకలవేదరాశితో జన్మించి బ్రహ్మయై యజ్ఞకర్మల బ్రవర్తింప జేసియు. తన పౌరోహిత్య సామర్థ్యముచే రాజులకును, సర్వప్రజలకును ఐహికాముష్మిక ఫలముల నంద జేయుచు, సర్వసుఖ నివాస హేతుభూతుడై (వాసయితృతమః, పుర ఏతా) తన వసిష్ఠనామమును సార్థకము గావించు కొనిన బ్రహ్మిష్ఠుడు. శ్రుతిసిద్ధమైన యిట్టి సంప్రదాయమున జరించునట్టి వారును నేడు కూడ బ్రహ్మ. వసిష్ఠః, పురోహితః, గురుః, బృహస్పతిః— ఇత్యాద్యన్వర్థ నామములతో బరగుచు వైదికకర్మ (బ్రహ్మకర్మ) నిర్వాహకు లగుచున్నారు.

ఇట్టి బ్రహ్మకర్తృత్వ ప్రతిపాదక మగుటచే నథర్వవేదమునకు బ్రహ్మవేద మని యన్వర్థనామము ప్రసిద్ధ మైనట్లు తెలియగలము.

అథర్వవేదము - అథర్వాంగిరసః - భృగ్వంగిరసః :-

అథర్వపదమును యాస్కమహర్షి యిట్లు నిర్వచించినాడు.

"అథర్వాణో ఽథనవంత స్థర్వతి శ్చరతి కర్మా తత్ప్రతిషేధః"
— నిరు. 11-18.

"న థర్వన్తీ త్యథర్వాణః స్థిరప్రకృతయో హి తే" — దుర్గా-భాష్యం.

పై నిర్వచనము ననుసరించి అథర్వు డన నిశ్చలుడు, లేక స్థిరప్రకృతిగలవా డని యర్థము. యథర్వపదమునకు ప్రాణాత్మ, లేక ప్రజాపతి (బ్రహ్మ) యను నర్థములు వేదమున బ్రసిద్ధము.

"(వా. సం.[1] 11-32) ప్రాణోవా ఽఅథర్వా" — శ. బ్రా.6-4-2-1.

"ప్రాణో ఽథర్వా" — శ. బ్రా. 6-4-2-2.

ఇట ప్రాణాత్మ యగు ప్రజాపతి యథర్వు డని కీర్తింపబడినాడు. ఈ ప్రజాపతియే మొదట నగ్నిని మథించిన ట్లీ శ్రుతి చెప్పుచున్నది. కనుక వసిష్ఠశబ్దము వలెనే అథర్వశబ్దము కూడ మొదట ప్రజాపతికి వాచకము. ఇట్లు వసిష్ఠ-అథర్వశబ్దములు రెండును వేత్వేఱు ప్రవృత్తినిమిత్తముల ననుసరించి ప్రజాపతికి వాచకము లగుచున్నవి. కాన వసిష్ఠు డథర్వుడే యగుచున్నాడు.

---

1. పురీష్యోఽసి విశ్వభరా అథర్వా త్వా ప్రథమో నిరమంథ దగ్నే ।
త్వా మగ్నే పుష్కరా దధ్యథర్వా నిరమంథత ।
మూర్ధ్నో విశ్వస్య వాఘతః ॥"
— వా. సం. 11-32; తై. సం. 4-1-3-2; ఋ. 16-3-13.

బ్రహ్మ యను ఋత్విక్కు పరబ్రహ్మస్వరూపు డగుట పైన వివరింపబడినది. నిశ్చలు డయియే బ్రహ్మ, అగ్ని వాయ్వాదిత్యులద్వారా సర్వజగత్ప్రవర్తకు డగునట్లు (సృష్టి యజ్ఞమును నిర్వర్తించునట్లు) బ్రహ్మ యను ఋత్విక్కు కూడ బ్రహ్మిష్ఠుడై యజ్ఞమున కదలక స్థిర ప్రకృతియై యుండి హోత్రాది ఋత్విజుల ద్వారా యజ్ఞప్రవర్తకు డగుట యథర్వపద నిర్వచనము సూచించుచున్నది.

ప్రజాపతియే అంగరసభూతు డగుటచే అంగిరసు డనియు, ఋగ్రూపమగు బృహతికి (వాక్కుకు) పతి యగుటచే బృహస్పతి యనియు, యజూరూప మగు బ్రహ్మకు పతి యగుటచే బ్రహ్మణస్పతి యనియు, సామకు ప్రవృత్తిహేతు వగుటచే సామ యనియు — ఇట్లు నామ రూప ప్రపంచాత్మకు డనియు బూర్వము జెప్పబడినది (చూ. బ్రహ్మశబ్దము). ఇట్లు ఆంగిరసపదము కూడ వసిష్ఠ, అథర్వపదముల వలెనే మొదట ప్రజాపతికి వాచక మగుచున్నది. ఇట్టీ పదము లన్నియు మొదట ప్రజాపతికి వాచకములై పిదప మహర్షులకును వాచకము లయినట్లు గ్రహింపవలసి యున్నది.

అథర్వమహర్షియు, భృగుమహర్షియు నభిన్ను లని గోపథబ్రాహ్మణము చెప్పుచున్నది. అథర్వవేదము అనెడి పేరు వచ్చుటకు గారణమునం దిట్లు చెప్పబడుచున్నది.

"పూర్వము ప్రజాపతి సృష్టికొఱకు తపము చేయుచుండగా నాతని రోమకూపములనుండి స్వేదజలము పుట్టెను. అందు తన ప్రతిబింబమును జూచుచున్న ప్రజాపతికి రేతస్సు చలించినది. అట్టి రేతస్సుతో గూడిన యా జలములు రెండు భాగము లయ్యెను. ఒక భాగమునుండి భృగుమహర్షి పుట్టెను. భృగువు తన కుత్పాదకు డగు ప్రజాపతిని దర్శింపగోరుచుండగా నశరీరవాణి—

"అథార్వా గేనం ఏతా స్వేవా ప్స్వన్విచ్ఛ" —గో. బ్రా. 1-4.

నీకు ఉత్పాదకు డగు (కారణభూతుడగు) ప్రజాపతిని ఈ జలములందే యభిముఖముగ నన్వేషింపుము - అని పలికెను. ఆ యశరీరవాణి వాక్యమందు మొదట 'అథార్వాక్' అని యుండుటచే నీ భృగుమహర్షికి 'అథర్వా' అనియు రెండవనామము లభించెను.

ఇక రేతస్సుతో గూడిన రెండవభాగ మగు జలముచే నావృతు డగుటచే ప్రజాపతి వరుణశబ్దవాచ్య డయ్యెను. (ఆవృతత్వాత్ వరుణః). తపస్సు జేయదొడిగిన యా ప్రజాపతి యొక్క సర్వాంగముల నుండియు రసము స్రవించెను. సర్వాంగ రసభూత మగు నా రసము నుండి ఆంగిరసుడు (అంగిరాః) అను మహర్షిపుట్టెను. అనంతర మా బ్రహ్మ యథర్వాణుని, యంగిరసుని తప స్సపుల గావింపగా నా యిరువురినుండి ఏకర్చ, ద్వ్యృచాది మంత్రములకు ద్రష్ట లయిన అథర్వాణులును అంగిరసులును నిరువదిమంది మహర్షులు బుట్టిరి. అట్లు సృజింపబడిన అథర్వాంగిరసమహర్షులు తపము జేయుచుండగా వారినుండి నిఃసృతములై ప్రజాపతిచే దర్శింపబడిన మంత్రములే అథర్వాంగిరోమంత్రములు; వానికే అంగిరోవేద మనియు, భృగ్వంగిరో వేద మనియు, అథర్వాంగిరో వేద మనియు వ్యవహార మేర్పడినది." - (చూ. సాయణః - అథర్వవేద భాష్యభూమికా).

ఈ కథను బరిశీలించుచో (1) అథర్వుడే భృగుమహర్షి (2) భృగ్వంగిరసులనుండి యుద్భవించిన బ్రహ్మతేజఃసంభూతులు, మహాతపఃసంపన్నులు నగు అథర్వాంగిరో మహర్షుల తపఃఫలమే యథర్వవేదము. (3) అథర్వు డగు ప్రజాపతిచే దృష్ట మగుటచే నిది యథర్వవేద మైనది - (అథర్వాఖ్యేన బ్రహ్మణా దృష్టత్వాత్ తన్నామ్నా అయం వేదో

వ్యపదిశ్యతే - సాయణః) యనియు, అందుచే మానవబుద్ధికల్పితము కాదనియు దెలియును.

మంత్రద్రష్ట లయిన యీ యథర్వాంగిరసులే అథర్వాణులు, భృగువులు, అంగిరసులు వసిష్ఠులు - ఇత్యాది నామములతో బ్రసిద్ధ లయి లోకమున యజ్ఞప్రవర్తకు లయినట్లు ఋగ్వేదాది శ్రుతు లిట్లు తెల్పుచున్నవి.

'అంగిరసో నః పితరో నవగ్వా అథర్వాణో భృగవః
సోమ్యాసః। తేషాం వయం సుమతౌ యజ్ఞియానా మపి
భద్రే సౌమనసే స్యామ॥ — ఋ. 10-14-6; వా.సం. 19-50;
అ.సం. 18-1-58; తై సం. 2-6-12-6; నిరు. 11-19.

"యే నః పూర్వే పితరః సోమ్యాసో ఽనూహిరే సోమపీథం
వసిష్ఠాః।" — వా.సం. 19-51.

ఈ యంగిరసాది ఋషులందఱును ప్రజాపతి సంభూతు లగుటచే దివ్యత్వముతో నొప్పి దేవర్షులు; గోత్రప్రవర్తకులై పూర్వపితరులును (నః పితరః) అయిరి. (ఏషాం అంగిరః ప్రభృతీనాం ఋషిగణమధ్యే ప్రాధాన్యాత్ ఇదానీంతనానా మపి ప్రాచుర్యేణ తద్గోత్రత్వాత్ పితృత్వమ్- సా. భా; అ. సం. 18-1-58). ఇట్లు దేవర్షులు, పితరులు, మహాతేజః సంపన్నులు, యజ్ఞప్రవర్తకులు నగుటచేతనే వారి నామములు నేటికిని యజ్ఞాదికర్మల యం దిట్లు స్మరింపబడుచున్నవి.

"భృగూణా మంగిరసాం తపసా తప్యధ్వమ్"

— కాణ్వ. సం. 1-7; 31-6; తై. సం. 1-1-7-2; వా. సం. 1-18;
తై. బ్రా. 1-1-4-8; 3-2-7-1.

ఈ శ్రుతివాక్యమును శతపథశ్రుతి యిట్లు వివరించినది.

"భృగూణా మంగిరసాం తపసా తప్యధ్వ మితి। ఏత ద్వై
తేజిష్ఠం తేజో య ద్భృగ్వంగిరసామ్। సుతప్తా న్యస
న్నితి-తస్మా దేవ మభ్యూహతి" — శ. బ్రా 1-2-1-13.

అంగారములచే కపాలముల నాచ్ఛాదించుచు జెప్పెడి మంత్రమిది. 'భృగ్వంగిరసుల తపోవిశేష జనితమైన తేజస్సు అగ్న్యాదుల తేజస్సుకంటె మిగుల తేజోవంత మైనది, కాన నీ కపాలములును దేవర్షు లగు భృగ్వంగిరసుల తపోరూప మగు నగ్నిచే తప్తము లగుగాక - ఈ యగ్నిని భృగ్వంగిరసుల తేజోరూపముగ భావన జేయవలె నని భావము. (అస్య అగ్నేః తదీయరూపత్వం భావయే దిత్యర్థః - మహీధరః). 'భృగూణా మంగిరసాం తపసా తప్యధ్వ మిత్యాహ। దేవతానా మేవైనాని తపసా తపతి'-అనుచు తైత్తిరీయబ్రాహ్మణము గూడ నీ యర్థమునే వివరించినది.

కపాలములను అగ్నియం దుంచినచో నవియే తప్తము లగును. ఈ మంత్రసంస్కారముతో బని యేమి? ఇట నగ్నిని భృగ్వంగిరసుల యొక్క తపోఒగ్ని విశేషరూపమున భావన జేయవలె ననెడి నియమమును విధించుటలో శ్రుతితాత్పర్య మేమి?

ఈ దేవర్షులు మహాతపస్సంపన్నులు, మంత్రద్రష్టలు, గోత్ర ప్రవర్తకు లగు పితరులు, తొలుదొలుత యజ్ఞమును బ్రవర్తింపజేసిన బ్రహ్మిష్ఠు లగు మార్గదర్శులు[1]. అందుచేతనే ఋగ్వేదము గూడ బెక్కుచోట్ల అథర్వవత్;

1. 'యజ్ఞై రథర్వా ప్రథమః పథ స్తతే' — ఋ. 1-83-5.
'యా మథర్వా మనుష్పితా దధ్యఙ్ ధియ మత్నత' — ఋ. 1-80-16.
'యజ్ఞై రథర్వా ప్రథమో విధారయ ద్దేవా దక్షై ర్భృగవః సం చికిత్రిరే' ఋ. 10-92-10.

'ఇమ ము త్య మథర్వవ దగ్నిం మంథంతి వేధసః'
— ఋ. 6-15-17 (చూ. 10-87-12).

భృగువత్ : అంగిరస్వత్ : మనుష్వత్' — అని యీరీతిగ నీ మహర్షుల నుపమానస్థానీయుల జేసి, వారు ప్రవర్తింప జేసిన సంప్రదాయముననే ప్రవర్తిల్లు డని హెచ్చరించుచున్నది. లక్ష్యభూతు లయి యజ్ఞాది సంప్రదాయ ప్రవర్తకు లైన యా దేవర్షులచే నే యగ్ని సమిద్ధుడై విలసిల్లెనో, యా సంప్రదాయమున ప్రవర్తిల్లెడి యీ యజ్ఞకర్మ యందలి యగ్నియు నా యగ్నియే — తత్తేజోరూపుడే — యని భావన జేయుటకే 'భృగూణా మంగిరసాం తపసా తపస్యధ్వమ్' అను నియమమును శ్రుతులు విధించినవి. అట్లు భావన చేసినపుడే తదనుగ్రహముచే నా యజ్ఞము అభ్యుదయకారి యగు ననియు మహాభాష్య మిట్లు చెప్పుచున్నది.

'యేనా నః పూర్వే పితరః పదజ్ఞా అర్చంతో అంగిరసో గా అవిందన్'
— ఋ. 1-62-2.

'వీళు చిద్దృళ్హా పితరో న ఉక్థై రద్రిం రుజ న్నంగిరసో రవేణ'
— ఋ. 1-71-2.

'ఆదంగిరాః ప్రథమం దధిరే వయ ఇద్ధాగ్నయః శమ్యా యే సుకృత్యయా'
— ఋ. 1-83-4,

'అంగిరస్వత్' — ఋ. 1-31-17; 45-3; 62-1; 78-3: 2-17-1 మొ॥

'దధు ష్ట్వా భృగవో మానుషే ష్వారయిం న చారుం సుహవం జనేభ్యః'
—ఋ. 1-58-6.

'ఆదోం రాజ్ఞే న సహీయసే సచా సన్నా దూత్యం భృగవాణో వివాయ'
— ఋ. 1-71-4.

'ఇమం విధన్తో అపాం సధస్థే ద్వితాదధుర్భృగవో విక్ష్వాఽయోః'
— ఋ. 2-4-2.

భృగువత్ - అంగిరస్వత్ .... ఋ. 8-43-13.

మనుష్వత్ — 1-31-17; 44-11 మొ॥

"అగ్నౌ కపాలా న్యధిశ్రిత్యా ఽభిమంత్రయతే—'భృగూణా మంగిరసాం ఘర్మస్య తపసా తప్యధ్వ' — మితి। అంత రేణాపి మంత్ర మగ్ని ర్దహనకర్మా కపాలాని సంతాపయతి। తత్ర చ నియమః క్రియతే—ఏవం క్రియమాణ మభ్యుదయ కారి భవతీ"తి। —వస్పశాహ్నికమ్,

వసిష్ఠాది ఋషులు-అథర్వనామధేయులు :—

వసిష్ఠ - గౌతమ - భృగు - అంగిరో మన్వాదులు బ్రహ్మర్షులు; లోక యాత్రా విధాయకు లగు ప్రజాపతులు; గోత్రప్రవ ర్తకులు; అథర్వ భూతులు — అని హరివంశ మిట్లు చెప్పుచున్నది.

"తతో ఽసృజ ద్వై త్రిపదాం గాయత్రీం వేదమాతరమ్।
అకరో చ్చైవ చత్వారో వేదాన్ గాయత్రిసంభవాన్॥
ఆత్మార్థే చాసృజత్ పుత్రాన్ లోకక ర్తౄన్ పితామహః।
విశ్వే ప్రజానాం పతయో యేభ్యో లోకా వినిఃసృతాః ॥
విశ్వేశం ప్రథమం నామ మహాతాపస మాత్మజమ్ ।
సర్వాశ్రమతమం పుణ్యం నామ్నా ధర్మం స సృష్టవాన్।
దక్షం మరీచి మత్రిం చ పులస్త్యం పులహం క్రతుం।
వసిష్ఠం గౌతమం చైవ భృగు మంగిరసం మనుం॥
అథర్వభూతా ఇత్యేతే ఖ్యాతా బ్రహ్మమహర్షయః ॥"

—హరివంశ. 3-14-25 నుండి 29.

అథర్వభూతు లగు నీ బ్రహ్మర్షుల మథితాగ్నితో లోకమున తొలుదొలుత యజ్ఞమును బ్రవర్తింప జేసి రని ఋగ్వేదమే పలుచోట్ల చెప్పుచుండుటచే యజ్ఞముతోపాటు త్రయీవిద్యాత్మకము లగు నాలుగు వేదములు బ్రవర్తిల్లిన వని గ్రహించుట యుచితము; సంప్రదాయాభిమతము.

అథర్వవేదము - ప్రాథమ్యము:-

కనుక అథర్వవేద మనునది (1) అథర్వు డగు ప్రజాపతిచేతను, పిదప తదనుగ్రహముచే నథర్వభూతు లగు నీ మహర్షులచే దర్శింపబడినది; (2) ప్రజాపతినామముతో నథర్వవేద మనియు, ఆ మహర్షుల నామముతో నథర్వాంగిరోవేదము లేక భృగ్వంగిరోవేదము - అని యీ రీతిగా ప్రసిద్ధ మైనది; (3) అథర్వాదిఋషులే తొలుదొలుత యజ్ఞమును ప్రవర్తింపజేసినవారు; అథర్వవిదులైన వాసిషులు యజ్ఞమున బ్రహ్మస్థానీయు లగుచు బ్రహ్మవేద మను నామమును సార్థక పఱచిరి: (4) తత్సంప్రదాయవిదులే బ్రహ్మ-వసిష్ఠ-గురు-బృహస్పతి- పురోహితాది నామములతో యజ్ఞాది కర్మనిర్వాహకులుగ ప్రసిద్ధులు - మున్నగు నిట్టి కారణములచే నథర్వవేదము - 'జ్యేష్ఠము; శ్రేష్ఠము; భేషజము; అమృతము, బ్రహ్మ' అని యీ రీతిగ శ్రుతియందును, పిదప పురాణేతిహాసాదుల యందును ప్రశంసింపబడినది. అందుచే మిగిలిన వేదములకంటె దీనికి గొన్ని యెడల బ్రాథమ్యము గలదు,

న్యాయమంజరీకారు డగు జయంతభట్టు గూడ అథర్వవేదము యొక్క ప్రాశస్త్యమును జెప్పుచు ఋగ్యజుఃసామ మంత్రత్రైవిధ్యము గలిగి యుండుటచే 'త్రయీ' యను వ్యవహారము అథర్వవేదమునకే ప్రధానముగ జెల్లు నని చక్కగ వివరించి, తుదకు దానికి గల ప్రాథమ్యము నిట్లు చెప్పినాడు.

"త దథర్వ ఏవ ప్రథమః, తతః పర మన్య మంత్రస్య బ్రాహ్మణః ప్రణవస్యాభివ్యక్తేః, తథాచ శ్రుతిః....తస్మా చ్ఛాంతా త్పంతప్తా దో మితి మన ఏవోర్ధ్వ మక్షర ముదకామ దిత్యాది; తథా మహావ్యాహృతీనాం శాఖాంతర

ప్రసిద్ధానా మప్రసిద్ధానాం చ బృహ దిత్యాదీనాం తత ఏవో
ద్ధానమ్; అథర్వవేద కృతోపనయన సంస్కారస్య
వేదాంతరాధ్యయన మవిరుద్ధమ్; అన్యవేదోపనీయమానస్య
తు నాథర్వణోపనయన సంస్కార మప్రాపిత స్యాథర్వ
వేదాధ్యయనే ఽధికారః; తదుక్తం....

— న్యాయమంజరీ. ప్రమాణప్రకరణమ్.

సర్వవేదమంత్రములకు ఆదియందును, అంతమందును ఉచ్చరింప బడెడి ప్రణవము నభివ్యక్తము జేసినది యథర్వవేద మని శ్రుతివలన దెలియుచున్నది. శాఖాంతరప్రసిద్ధములు, నప్రసిద్ధములు నగు బృహ దిత్యాది మహావ్యాహృతులు అథర్వవేదమునుండియే యుద్భవించినవి. అథర్వవేదముచే నుపనీతు డగువానికి ఇతరవేదాధ్యయనము చేయుట కధికారము సిద్ధించును; ఇతరవేదములచే నుపనీతు డగువానికి నథర్వ వేదము నధ్యయనము జేయుటకు అధికారము సిద్ధింపదు. అట్టివా డథర్వ వేదము నధ్యయనము జేయవలె నన్నచో మరల నథర్వవేదముచే నుపనీతుడు గావలె నని ధర్మశాస్త్రములు జెప్పుచున్నవి. కాన అథర్వ వేదమున కితరవేదములకంటె ప్రాథమ్య మొప్పును - అని యర్థము.

ఇట్టి యీ ప్రాథమ్యమును దెలియజేయుటకే మహాభాష్యకారుడును శబ్దానుశాసనారంభమున అథర్వవేదవాక్యమును మొదట నుదహరించినట్లు గ్రహింపనగును.

అథర్వాంగిరసులు - నామసాహచర్యము - చారిత్రకుల యూహ:-

'అథర్వులు-అంగిరసులు (లేక భృగువులు - అంగిరసులు) అనెడి రెండు తెగలు, లేక వంశములవారి రచన లగుటచే నీ వేదమునకు

అథర్వాంగిరోవేద మని నామము ప్రసిద్ధమై యుండవచ్చును. ఈ రెండు వంశములకును పరస్పరసాహచర్య మున్నట్లు ఈ నామముల వలనను, 'భృగూణా మంగిరసాం తపసా తప్యధ్వమ్' ఇత్యాది శ్రుతివాక్యముల వలనను దెలియవచ్చుచున్నది – అని చరిత్రకారులలో[1] గొందఱి యూహ.

ఇట్లు రెండు వంశము లుండి యుండవలె ననియు, నీ రెండు వంశములకు సాహచర్య ముండి యుండవచ్చు ననియు నూహించుచున్నారే గాని యా సాహచర్యమునకు గారణ మేమో చెప్పబడలేదు. అందుచే నీ యూహలు నిరాధారములు. కాన అథర్వ–అంగిరః పదముల సాహచర్య మునకు గల గారణమును జూడవలసి యున్నది.

"యా తే రుద్ర శివా తనూ రఘోరా పాపకాశినీ"

— తై. సం. 4-5-1-1; వా. సం. 16-2,49; మై.సం. 2-9-2; కా.సం. 17-11

ఇత్యాదిశ్రుతులు పరమేశ్వరునకు శాంతము, ఘోరమునగు రెండు రూపము లున్నట్లు చెప్పుచున్నవి. స్తంభము వెడలి ప్రత్యక్షమైన శ్రీ నరసింహుని రూపము భక్తాగ్రేసరు డగు ప్రహ్లాదునకు శాంత(అఘోర) రూపమున సాక్షాత్కరించి నట్లును ప్రబలద్వేషి యగు హిరణ్యకశిపునకు ఘోర రూపమున గన్పట్టి నట్లును బ్రసిద్ధము.

పారమేశ్వరశక్తిరూప మగు ప్రకృతియు శాంతఘోరరూపము. జీవుల కుపభోగ్య మైన వస్తుజాతము జీవనహేతు వగునపుడు భేషజము, లేక శాంతరూపము నగును. అదియే మృత్యుహేతు వగునపుడు ఘోర రూప మగును. ఉదా :- సర్వప్రాణులకు జీవనహేతువు అన్నము. శాస్త్ర మువదేశించినటుల సాత్త్విక రాజస తామసా హార భేదముల గుఱించి వివక్షతో పరిమితాహారము సేవించుచో నది జీవనహేతువు, సుఖ ప్రదము వగు భేషజ మగును. అట్లు గానియపుడు వ్యాధిహేతువై యది

1. Vedic Index.

దుఃఖప్రద మగుచు ఘోరరూప మగును. ఈ విషయమునే అన్నశబ్ద నిర్వచనము ద్వారా శ్రుతి యిట్లు వివరించినది.

"అద్యతేఽత్తి చ భూతాని తస్మా దన్నంత దుచ్యత ఇతి"
— తై. ఆ. 8-2-1; మై. ఉ. 6-12.

'అద్' (తినుట) అను ధాతువు నుండి 'అన్న'శబ్దము నిష్పన్న మైనది (1) తినబడునది (అద్యతే) కావున అన్నము; (2) తినునది (అత్తి) కావున అన్నము — అని యర్థము. ఇట్టి నిర్వచనములు రెండును అన్నమునకు గల శాంతఘోరరూపముల నుపలక్షింప జేయుచున్నవి.

ఋగ్వేదము వేదాత్మిక యగు సరస్వతీదేవి నొకే సూక్తమున ఘోర-ప్రియరూపిణిగ వర్ణించినది.

"ఉత స్యా నః సరస్వతీ ఘోరా హిరణ్యవర్తనిః ।
వృత్రఘ్నీ వష్టి సుష్టుతిమ్ ॥"
"ఉత నః ప్రియా ప్రియాసు సప్తస్వసా సజుష్టా ।
సరస్వతీ స్తోభ్యాభూత్ ॥" — ఋ. 6. 61-7, 10.

'ఘోరా శత్రూణాం భయకారిణీ.... హిరణ్యమయో వర్తనిః (రథః) యస్యాః సా; ప్రియాసు ప్రియాణాం మధ్యే ప్రియతమా, సప్తస్వసా గాయత్ర్యాదీని సప్తచ్ఛందాంసి స్వసారో యస్యా స్తాదృశీ....' — సా. భా.

ఇట మొదటి మంత్రమున సరస్వతి శత్రుభయకారిణి, వృత్రహంత్రి యగు ఘోరరూపిణిగ జెప్పబడినది. రెండవమంత్రమున ప్రియతమ (ప్రియాసు ప్రియా)గా గీర్తింపబడినది. వేదశరీరు డగు పరమేశ్వరునకు వలెనే వేదాత్మిక యగు సరస్వతికిని ఘోర-ప్రియరూపములు రెండు నున్నట్లు ఋగ్వేదము స్పష్టము చేయుచున్నది. ఇట్లు వేదసామాన్యము

శాంతఘోరరూప మైనను, ఈ రూపముల విశేషించి యభివ్యక్తము జేయునవి భృగ్వంగిరో (అథర్వాంగిరో) మంత్రములు.

అందుచే నథర్వుని (ప్రజాపతి) యొక్క శాంత ఘోరరూపములు అథర్వాంగిరో రూపమున ప్రకటితము లయినవి. పరమేశ్వరుని యందలి యా శాంత ఘోరరూపముల నభివ్యక్తము చేయునవియే యథర్వాంగిరో మంత్రములు.

అథర్వు డనగా నిశ్చలప్రకృతి గలవాడని పూర్వము తత్పద నిర్వచనము ద్వారా వివరింపబడినది. శాంతరూపు డని యర్థము. 'యేం ఉగారా స్తేఽంగిరసః' అను నిర్వచనము ఘోరరూపము నుపలక్షింప జేయుచున్నది. ఈ వేదము బ్రహ్మవేదము; క్షత్త్రవేదము కూడ. బ్రహ్మ యగు ఋత్విక్కు శాంత ఘోర రూప మంత్రాత్మకుడై బ్రాహ్మ క్షాత్త్ర తేజములతో విలసిల్లి యజ్ఞప్రవర్తకుడు, సంరక్షకుడును గావలయు నని శ్రుతి తాత్పర్యము. వసిష్ఠు డట్టివా డగుటయు నథర్వవేదము శమ, దీప్తతాది గుణములతో నొప్పి యుండుటయు బూర్వము తెల్పబడినది.

''అథర్వవేదో వేదః సో ఽయ మితి భేషజం నిగదేత్''

— శాం.శ్రౌ.సూ. 16-2-9.

''భేషజం వా ఆథర్వణాని భేషజ మేవ తత్కరోతి''

— తాం.బ్రా. 12-9-10.

''భేషజం వై దేవానా మథర్వాణో భేషజ్యాయై వారిష్ట్యై''

— తాం.బ్రా. 16-10-10.

''తా నుపదిశ త్యథర్వాణో వేదః సోఽయ మితి యద్భేషజం
నిశాంతం స్యా త్త న్నిగదేత్....తా ఉపదిశ త్యాంగిరసో
వేదః సోఽయ మితి యద్ఘోరం నిశాంతం స్యా త్తన్నిగదేత్''

— ఆప.శ్రౌ.సూ. 10-7-1.

అథర్వ-భేషజ నామములు ఈ వేదమునకు గల శాంతరూపమును, ఆంగిరస-క్షత్త్రి నామములు ఘోరరూపము నుపలక్షింప జేయునవి యని పై ప్రమాణముల వలన స్పష్టము. ఈ పదములకు గల సాహచర్య మిట్టిది.

కాన శాంతఘోర రూపములగు అథర్వాంగిరో మంత్రముల దర్శించిన ఋషులే అథర్వాంగిరసులు. దృష్టిభేదము, లేక అధికారిభేదము ననుసరించి శాంతఘోరరూపములుగ భిన్నములై కన్పట్టినను, మొత్తము మీద పరమార్థమున నీ మంత్రము లన్నియు గూడ ఆత్మచికిత్సకొఱకై, లోకకల్యాణమునకై ప్రవృత్తము లయిన భేషజములు. అందుచేతనే భేదదృష్టిని స్ఫురింపజేయు 'అథర్వాంగిరోవేదము' (భృగ్వంగిరోవేదము) అను నామముతోనే గాక అభేదదృష్టిని ప్రబోధించెకి యథర్వవేదము, భైషజ్యవేదము అను నామములతో గూడ శ్రుతి తనను గీర్తించుకొనినది. ఈ మంత్రద్రష్ట లగు బ్రహ్మర్షులను అథర్వభూతు లని మహాభారతము కీర్తించుటలోని తాత్పర్యము నిదియే.

త్రయీశబ్దము-సంప్రదాయము-ఉపసంహారము:-

ఇంతవరకు నథర్వవేదమునకు గల నామముల యౌచిత్యమును దర్శించితిమి. అథర్వవేదము ప్రధానముగ ఋగ్రూపమైనను, ఋగ్వేద మని గాక పృథక్కరించి వేఱ్వేఱు నామములతో శ్రుతి తనను వ్యవహరించు కొనుటకు గల కారణములను దెలిసికొంటిమి. దీనివలన 'చత్వారి శృంగా' ఇత్యాది ఋక్కుల ననుసరించి నాలుగు వేదములును ఋగ్యజుః సామ మంత్రాత్మక త్రయీవిద్యా రూపములు అను విషయము స్పష్టమైనది.

కాన త్రయీపదము 1) పరమేశ్వర - పరాశక్తి వాచకము, 2) వేద సామాన్యవాచకము, 3) కొన్ని యెడల వేదత్రయవాచక మయ్యును నాలుగు

వేదముల నుపలక్షింపజేయునది, 4) కర్మోపాస్తి జ్ఞాన రూప కాండత్రయా త్మక మగు వేదరాశి - అని యీ రీతిగ సంప్రదాయానుగతము లయిన యర్థముల బోధించునట్టిది.

ఇట్లు కర్మోపాస్తిజ్ఞానరూప కాండత్రయాత్మక మగుచు అధికారి భేదము ననుసరించి వివిధార్థముల బోధించు ఈ త్రయీవిద్య 'కావ్యము' అనియు జెప్పబడుచున్నది.

"త్రయీ వై విద్యా కావ్యం ఛందః"

వా. సం; 15-4, శ.బ్రా. 8-5-2-4.

వేదమునకు, లేక త్రయీవిద్యకు గల కావ్యత్వమును దర్శించుట వలనను త్రయీస్వరూప మింకను తేటపడగలదు. అందుచే వేదమునకు గల కావ్యత్వమును బరిశీలింతము.

కవిః - కావ్యమ్

ఇమే వేదాః శశ్వత్ ప్రభు రివ జగ చ్ఛాసతి; తథా
పురాణం సస్నేహం సుహృ దివ పరం బోధయతి చ।
జగుః కావ్యం కాన్తేవ దయితముపచోభి ర్మోహయతి
త్యహో! శక్తి స్త్రేధా త్వయి హి పరమార్థా భగవతి॥

త్రయీవిద్యా కావ్యం సకల కవితాధార మతులం,
కవిం చాద్యం శశ్వ ద్వినుతశత సూక్తై ర్విలసితమ్,
కలా మాత్మాఽనన్యాం కవిజనసుగమ్యాం రసఘనాం
కవిం కావ్యం వందే హరిహృదయసౌందర్యలహరీమ్ ॥

— వేదమాతృస్తవః.

త్రయీవిద్య : ప్రభు - సుహృత్ - కాంతాసంమితము:-

'త్రయీ వై విద్యా కావ్యం ఛందః' (శ. బ్రా. 8-5-2-4) ఋగ్యజుఃసామ మంత్రాత్మక మగు త్రయియే విద్య: ఈ విద్యయే కావ్యము; అట్టి కావ్యమే ఛందస్సు, అనగా వేదము—అని యీ శ్రుతివలన దెలియుచున్నది. వేదము కావ్యము - అనినంతనే యది యాలంకారిక సమయ విరుద్ధ మని తోపక మానదు. వేదములు ప్రభుసంమితములు; పురాణములు సుహృత్సంమితములు; కావ్యములు కాంతాసంమితములు-అని యాలంకారిక సమయము. ప్రభుసంమిత మగు వేదము కాంతాసంమితమై కావ్య మగుట యెట్లు ? ఈ ప్రశ్న యుదయించుట సహజము. పై శ్రుతి వాక్యము వేదము కావ్య మని చెప్పుచున్నది. కావున వేదము కావ్యమే యగును కాని యది లౌకికకావ్యముకంటె విలక్షణమైన కావ్యము. అది

యధికారిభేదము ననుసరించి కొన్నియెడల ప్రభువై శాసించును; మఱికొన్ని యెడల సుహృత్తువలె నుపదేశించును. ఇంకొకయెడ కాంతవలె సరసవచో రీతుల నాత్మస్వరూపమును తేటపరచును. ఇట్టి మూడు శక్తులు పరమార్థమున వేదభారతియందు గలవు. ఈ విషయము వేదకావ్యస్వరూప పరిశీలనమువలన స్పష్టము కాగలదు.

వేదము ప్రభుసంమిత మగుట ప్రసిద్ధమే. ఆ విషయము నిట వివరింప బనిలేదు. ఇక సుహృత్సంమితత్వమును జూతము.

వేదః సచివిత్ (సఖివిత్) – పురాణమ్ :-

సుహృత్సంమితముగ నుపదేశించుట శ్రుతియే యొక సూక్తముఖమున (ఋ. 10–71) స్వయముగ జెప్పికొనినది. అందలి యొక మంత్రమును జూతము.

> "య స్తిత్యాజ సచివిదం సఖాయం న తస్య వాచ్యపి భాగో అస్తి।
> య దీమ్ శృణో త్యలకం శృణోతి న హి ప్రవేద సుకృతస్య పన్థామ్॥" —ఋ. 10-71-6; ఐ. ఆ. 3-2-4-3; తై.ఆ. 1-3-1; 2-15-1.

సంప్రదాయము విచ్ఛిన్నము గాకుండ వేదాధ్యయనము జేయువారు వేదమునకు సఖులు. అట్లు తనను (వేదమును) అధ్యయనము జేయు సఖుని గుర్తించునది యగుటజేసి వేదము సచివిత్ (సఖివిత్) అగుచున్నది (యో ఉద్యేతా స వేదస్య సఖా; సంప్రదాయోచ్ఛేద నివారకత్వేన వేదం ప్రత్యుపకారిత్వాత్। తాదృశ ముపకారిణ మధ్యేతారం వేత్తీతి సచివిత్ —సా.భా.) అట్లు తనతో జెలిమి యొనర్చు సఖులయెడ సుహృద్భావముతో ప్రవర్తించి సఖియై వేదము స్వార్థబోధనము ద్వారా వారి కుపకార మొనర్చుచుండును. అట్టి వేదరూప సఖుని విడినాడిన వాని వాక్కు లక్ష్మీవిలసితము కాదు;

అనగా నట్టివారి వాక్కు పురుషార్థప్రదము కాదు. మఱియు నట్టివాడు -వేద వ్యతిరిక్తమగు లౌకికవాఙ్మయమును గూర్చి యెంత వినినను నది వ్యర్థ ప్రయాసమే యగును. (అలకం అలీకం వ్యర్థ మేవ శృణోతి). ఏలయన లౌకికవాక్కు పురుషార్థ మార్గ దర్శకము కాదు (న హి ప్రవేద సుకృతస్య పన్థామ్) - అని యర్థము. 'న తస్యానూక్తే భాగోఽస్తి' - అనుచు ఐత రేయారణ్యకమును, 'తం యో ఽనూత్సృజ త్యభాగో వాచి భవ త్యభాగో నాకే' - యనుచు తైత్తిరీయారణ్యకమును పై యర్థమునే వివరించినవి.

పై మంత్రార్థము బరిశీలించినచో తాను (వేదము) సుహృత్ సంమి తముగ బరమార్థము నుపదేశించుటకై యవతరించినట్లు భంగ్యంతరముగ జెప్పికొనుట కాన నగును. (దాదాపు ఈ సూక్తమున గల మంత్రము లన్నియు వేదవాణికి గల సుహృత్సంమితత్వమును నిరూపించు నవియే.) సుహృత్సంమితము గావుననే పురాణ మనియు వేదమునకు నామము ప్రసిద్ధము.

'ఏత చ్ఛ్రుత్వా బ్రహ్మదత్త స్తా నువాచ మహాసురాన్ ।
యజ్ఞభాగో న విహితః పురాణే ఽసురసత్తమాః॥"

—హరివంశ. 2-83-13.

'పురాణశబ్దే నాత్ర వేదో ఽభిధీయతే' —నీలకంఠః.

వేదము - కాంతాసంమితత్త్వము :-

ఇక శ్రుతియందు గల కాంతాసంమితత్త్వమును జూతము. కాంతా సంమితముగ నుపదేశించుట వేదమునకు వెన్నతో బెట్టిన విద్య.

"ఏవా హ్యస్య సూనృతా విరప్శీ గోమతీ మహీ ।
పక్వా శాఖా న దాశుషే ॥" — ఋ. 1-8-8; అ. సం. 20-60-4

వేదమునకు 'సూనృతవాక్' అని పేరు. అట్టి సూనృతవాక్కు పరమేశ్వరుని వాక్కు (అస్య సూనృతా)గా నిట జెప్పబడినది. 'అది నియమపూర్వక యజ్ఞాది కర్మానుష్ఠానశీలురకు వివిధార్థ ప్రతిపాదక వాక్యరూపము (విరప్శీ- వివిధ రచణోపేత వాక్యయుక్తా, బహువిధోపచార వాదినీత్యర్థః - సా.భా; వివిధగుణోపేత వాక్యయుక్తా, బహువిధోపచార వాదినీత్యర్థః- ముద్గల. భా.). పురుషార్థరూపమగు నమృతము నొసగి ప్రోదిసేయు గోమతి (గోవులతో- వాక్కులతో నొప్పునది). పై కారణములచే పూజనీయ(మహీ)యు నగుచు పక్వఫలయుక్త శాఖవోలె నొప్పారునది' — అని యర్థము.

ఇట (1) వేదవాక్స్వరూపము; (2) వేదవాక్కు అభిమతార్థముల నిచ్చెడి కామధేనువు - అను విషయములు శ్రుతిచే కాంతాసంమితముగ జెప్పబడినవి. అయితే కాంతాసంమితత్వ మన నేమి?

కాంత తన హావభావ విలాసాదులచే నాయకుని తన కభిముఖుని గావించుకొని తన యభిమతార్థములయందు ప్రవర్తింపజేయుచుండును. అట్లే కావ్యముగూడ గుణాలంకార రసాదులచే సరసత నాపాదించి సహృదయుల తన కభిముఖుల గావించుకొని కర్తవ్యార్థముల జెప్పి ప్రవర్తింప జేయు చుండును; పై మంత్రమునందలి సూనృతా- విరప్శీ- గోమతీ- మహీత్యాది విశేషణములు వేదవాక్కులు గాంతాసంమితము లగుట దెలియజేయును.

సూనృతా :—

సూనృత యనగా సత్యము, ప్రియమును నగు వాక్కు. వేద వాక్కులు శాస్త్రమునందువలె సత్యములు మాత్రమే (సత్యార్థ స్వరూప ప్రకాశకములు మాత్రమే)గావు; సత్యములు ప్రియములు గూడ. అందుచే సహృదయులకు ప్రీతి నుత్పాదింప జేసి భావన జేయుకొలది సత్య స్వరూపము నుద్బోధించునవి యని యర్థము.

విరప్శీ :-

వివిధ రపణోపేత వాక్యయుక్తా - వివిధార్థబోధకవ్యణములతో గూడిన వాక్యములతో నొప్పునది. గంటను మ్రోగించినంతనే వివిధశబ్దతరంగములు నొకదానివెంట నొకటి ప్రాదుర్భవించునట్లు, వేదవాక్కులను గదలించినంతనే (పరిశీలించినంతనే) వివిధార్థములు క్రమముగ నభివ్యక్తము లగుచుండును. కావుననే యీ వేదవాక్కులు 'శతవ్రజాః' అని కీర్తింపబడుట పూర్వము వివరింపబడినది (చూ. ఋషి శబ్దము). ఋగ్వేద మొక ఋక్కునందు (6-23-6) వేదవాక్కులను 'వర్ధనాని; శంతమాని; రాంద్ర్యాః; వక్షణాని' అని కీర్తించినది. ఈ మంత్రములు స్వయముగనే పురుషార్థసాధకములు (వర్ధనాని స్వయమేవ వృద్ధికరాణి); అందుచే నిరతిశయానంద దాయకములు (శంతమాని శుభకృత్తమాని; కావున రమణీయములు (రాంద్ర్యాః రాంద్ర్యాణి రమణీయాని); హవిర్యుక్తములై వాహకములు (యజ్ఞైర్హవిర్భి ర్యుక్తాని వక్షణాని వాహకాని-సా.భా). అని చెప్పబడినది. కావున 'విరప్శీ' యనగ వివిధ రమణీయార్థ ప్రతిపాదక వాక్యయుక్తము - అను నర్థ మిట సూచిత మగుచున్నది.

గోమతీ :-

"అగ్నిమధ్యే గవాం మధ్యే బ్రాహ్మణానాం చ సంసది।
విద్యా వేద వ్రతస్నాతాః బ్రాహ్మణాః పుణ్యకర్మిణః॥
అధ్యాపయేదన్ శిష్యాన్ వై గోమతీం యజ్ఞసంమితామ్।"
— భార. 13-62-42,43.

ఇట భారతమున గూడ వేదము 'గోమతి' యని కీర్తింపబడినది. వేదవాక్కులు **గోవులు;** కాన వేదము గోమతి. గోవులు క్షీరాదులవలె వేదవాక్కులు తమ్మాశ్రయించి పాలించువారలకు అభిమతార్థముల నొసగి

ప్రోదిసేయు కామధేనువు లగుట సూచితము. వేదవాక్కులు గోవు లగుటచేతనే తత్ప్రతిపాద్యు డగు పరమేశ్వరుడును గోమన్ (వా.సం. 26_4), గోపాల గోవింద_ఇత్యాది పదములచే గీర్తింపబడుట ప్రసిద్ధము.

పక్వా శాఖా న దాశుషే :-

ఇట వేదవాక్కు పక్వఫలయుక్త శాఖతో బోల్చబడినది. శాఖను గదిలించినంతనే పక్వఫలములు రాలు నటుల ఈ వేదవాక్కును గదిలించినచో (సేవించినచో) నా యా యభీష్టఫలములు సిద్ధించును. ఈ యుపమానముచే వేదవాక్కు అభిమతఫలముల నొసగెడి కల్పవృక్ష మను విషయ మిట కాంతాసంమితముగ జెప్పబడినది.

కావున అనుష్ఠానశీలు డగు యజమానునకు (దాశుషే) వివిధ రమణీయార్థముల దర్శింప జేయుటయే (విరప్శీ) గాక, గోమతియై పురుషార్థప్రదయు, నందుచే పూజనీయ (మహీ)యు నగుచుండును-అని యీ విధముగ సూనృతాది విశేషణములు వేదవాక్కుయొక్క స్వరూపమును బ్రకటీకరించుచున్నవి. కాన సరసత నాపాదించి (ప్రీతిని గల్గించి) కర్తవ్యమున బ్రవర్తింప జేయుటయే వేదవాక్కుల స్వభావ మగుట స్పష్టము

శ్రుతిస్మృతులు - వేదవాక్స్వరూపము :_

తన స్వరూపమును వేదమే కొన్ని మంత్రములద్వారా తెలియ జెప్పినది. అందు గొన్నిటి జూతము.

"అమన్యమానాగ్ం అభిమన్యమానై ర్నిర్బ్రహ్మభి రధమో
దస్యు మింద్ర" — ఋ. 1-33-9.

'తదానీం త్వం, అమన్యమానాన్ మంత్రార్థ మనుధ్యాతు మశక్తా నపి కేవలపాఠకాన్ యజమానాన్, అభిమన్యమానైః అస్మదీయా ఏతే యజమానా రక్షణీయా ఇతి అభిమానం కుర్వద్భిః, బ్రహ్మభిః మంత్రైః, దస్యుం చోరం వృత్రాది రూప మసురం, నిః అధమః నిఃసారితవా నసి' – సా.భా.

అర్థభావన జేయజాలని కేవల మంత్రపాఠకు లయిన యజమాను లను గూడ – 'వీరు నావారు; రక్షణీయులు; – అని మంత్రము లభి మానించుచుండును. అట్టి బ్రహ్మల (మంత్రముల)చే నింద్రుడు వృత్రా ద్యసురుల బారద్రోలెను – అని యర్థము.

ఇట వేదము–'నే నిట్టిదానను; నా స్వరూప మిది'– యని వాచ్యముగ జెప్పికొనలేదు. ఇంద్రుడు మహిమాన్వితము లయిన మంత్రముల సాయముతో నసురుల సంహరించినట్లు చెప్పి, తన మహత్త్వమును భంగ్యంతరముగ దెలియజేయుచున్నది. మఱియు నర్థభావన జేయజాలక పోయినను శ్రద్ధాభక్తి సమన్వితులై, నియమపూర్వకముగ వేదమంత్రో చ్చారణ సేయు కర్మానుష్ఠానపరులను దనవారినిగా మంత్రము లభిమానించి రక్షించు నని మంత్రస్వభావమును నిపుణముగ వర్ణించినది. అందుచేతనే మంత్రార్థము నెఱుగక పోయినను నియమపూర్వక వేదమంత్రోచ్చారణముచే ఉపనయనాది సంస్కారములు జరుపుటయు, జరిపించుటయు, కేవల వేదమంత్రపారాయణము జేయుట యనెడి సంప్రదాయము నేటికిని శిష్టజనసంమతమై వరలుచున్నది. అంతే గాదు, వేదమంత్ర సంమితములగు గీతా రామాయణాది గ్రంథపారాయణము జేయుటయు నిందుకు తార్కాణము. కాని యంతమాత్రముచే నర్థభావనతో నిమిత్తము లేదని శ్రుతితాత్పర్యము గాదు. అర్థభావన జేయుకొలది ప్రీతిని గలుగజేయుచు మహిమాన్వితములై యింద్రునకు సాయపడినట్లు సాయపడగలవు; తుదకు లోకోత్తరాహ్లాద

జనకములు గాగల వనియు నీ మంత్రము భంగ్యంతరముగ నుపదేశించు చున్నది.

అర్థభావనలో పునఃపున రనుసంధానము (మననము) సేయువారికి మంత్రములు ప్రీతిని గూర్చు నను విషయము నీ క్రిందిమంత్రము గూడ జమత్కారముగ బ్రదర్శించుచున్నది.

"ఉత త్వః పశ్య న్న దదర్శ వాచ ముత త్వః శృణ్వ న్న
శృణో త్యేనామ్। ఉతో త్వస్మై తన్వం విసస్రే జాయేవ
పత్య ఉశతీ సువాసాః॥"

— ఋ. 10-71-4; నిరు. 1-19.

'అప్యేకః పశ్యన్ న పశ్యతి, వాచ మపి చ శృణ్వన్
న శృణోతి, ఏనా మితి అవిద్వాంస మాహ అర్ధమ్.'— నిరు.

అర్థభావన జేయజాలని వాడు వేదవాక్కును దర్శించియు నాదరముతో జూడలేడు. అనగా వ్యాకరణాది జ్ఞానరహితు డగుటజేసి యవ్యుత్పన్నుఁ డగుటవలన నధ్యయనము జేసియు దానియం దెక్కుడు నాదరభావము గల్గి యుండ లేడు. మఱియొకడు వ్యాకరణాది పరిజ్ఞానము గలిగి పాఠశుద్ధి గలవాడైనను మీమాంసాదృష్టి లేనికారణమున నా వేద వాక్కును వినియు వినని వాడే యగును. అనగా న్యాయనిర్ణయపూర్వక వేదవాక్యశ్రవణము చేయజాలడు.

'అ ప్యేకస్మై తన్వం విసస్రే ఇతి — స్వం ఆత్మానం
వివృణుతే, జ్ఞానం ప్రకాశన మర్థ స్యాహానయా వాచా' — నిరు.

వ్యాకరణాద్యంగములచే శబ్దార్థములను, మీమాంసచేసి తాత్పర్యమును బరిశీలించుటకు నెవడు పూనుకొనునో వానికి వేదవాక్కు వేదార్థప్రకాశన క్షమమైన సమ్యగ్జ్ఞానమును (ఆత్మస్వరూపమును) ప్రదర్శించును.

'జాయేవ పత్యే కామయమానా సువాసాః। కామయమానా
ఋతుకాలేషు। యథా స ఏనాం పశ్యతి స శృణోతీ
త్యర్థజ్ఞప్రశంసా' — నిరు.

అన్యసమయములందు గృహకృత్యపరాయణయై సామాన్య (మలిన) వస్త్ర ధారిణియై గన్పట్టు కాంతను ఆదరముతో జూడక, యామె జెప్పు హిత వాక్యముల వినకపోయినను, ఋతుకాలములందు శోభన వస్త్రాలంకృతయై ప్రేమమీఱ దనను జేరవచ్చు కాంత నాదరాతిశయముతో జూచి యామె జెప్పు నర్థములను (విషయములను) పతిహితబుద్ధితో నాలకించును. అట్లే చతుర్దశ విద్యాస్థాన పరిశీలన కుశలు డగు పురుషుని రమణీయార్థ ప్రతిపాదక శబ్దరూప కల్యాణవస్త్రశోభితయై తమిమీఱ దనను జేరవచ్చు వేదకావ్య మనెడి కాంత నాదరాతిశయముతో సాకల్యముగా జూచి తద్వాక్యములను హితబుద్ధితో శ్రవణము సేయును – వేదోక్త ధర్మ, బ్రహ్మ రూపార్థము లను హితబుద్ధితో స్వీకరించును. — చూ. సాయణః, ఋగ్వేదభాష్యభూమికా).

కొందఱు విమర్శకు లీసూక్తము (ఋ. 10–71) నందలి 'ఉత త్వః, సక్తు మివ' – ఇత్యాది మంత్రములు సామాన్య వ్యవహారభాషకును కవితకును (Ordinary languge and Poetry) గల తారతమ్యమును, అందు 'కవిత' యొక్క ప్రాశస్త్యమును వివరించుటకై ప్రవృత్తము లయి నట్లు చెప్పుచున్నారు. (చూ. The theories of Rasa and Dhwani- Dr. A. Sankaran).

అది సరికాదు. ఋగ్యజుఃసామల స్వభావమును బరిశీలించిన నీ విషయము స్పష్టము కాగలదు. వాని స్వభావమును గూర్చి శ్రుతియే యిట్లు చెప్పుచున్నది.

"అగ్ని ర్జాగార త మృచః కామయన్తే ఽగ్ని ర్జాగార
త ము సామాని యన్తి। అగ్ని ర్జాగార త మయం సోమ
అహ తవాహ మస్మి సఖ్యే న్యోకాః॥"

— ఋ. 5-45-15 ; సా.సం. 2-1177.

వినిద్రుడై - సర్వదా జాగరూకుడై - యెవడు వెలుగొందుచుండునో యా యగ్నిని ఋక్కులు కాంక్షించుచున్నవి; సామలు నా యగ్నినే పొందుచున్నవి. యజుస్సులచే త్యాగ మొనర్పబడు సోమము 'నేను నీ దానను; స్వీకరింపు' మని యా యగ్నితో జెప్పికొనుచున్నది. ఓ యగ్నీ! అట్టి నీ సఖ్యమునందే నియతుడనై యున్నాను - అని యర్థము.

ఈ మంత్రమున యజమానున కగ్నితో నుండెడి నిరంతరసఖ్యము, ఋగ్యజుఃసామలకును నగ్నితో గల నిరంతరసఖ్యము జెప్పబడినది, అగ్నితో, లేక పరమేశ్వరునితో నిరంతరసఖ్యమునకై ఋగ్యజుఃసామలు ప్రవృత్తము లైనవి. వాని ప్రధానలక్ష్యము పరమేశ్వరుడే యగుట స్పష్టమైనది. ఇట్లు వేదవాక్స్వభావము స్పష్ట మగుచుండ 'నీ మంత్రములు సాధారణభాషకును కవితకును గల తారతమ్యమును సామాన్యముగ కవితాప్రాశస్త్యమును జెప్పుటకు మాత్రమే ప్రవృత్తము లైనవి' - యని చెప్పుట శ్రుతితాత్పర్య విరుద్ధము; సాయణాది భాష్యకర్తలకును సంమతము గాదు. వేదవాక్స్వరూప నిరూపణపరము లైన యీ మంత్రముల వలన సామాన్యముగ కవితయొక్క ప్రాశస్త్యముకూడ సర్థసిద్ధ మగుచున్న దని చెప్పుట సహృదయ హృదయాభిమత మగును. 'అవిద్వాంసుడు వేద వాక్కును వినియు విననివాడే, విద్యావ్రత స్నాతు డగు వేదవిదునకు మాత్రమే కాంతవలె శ్రుతి ఆత్మ (లేక తన) స్వరూపమును దర్శింపజేయు' నను విషయమును బ్రతిపాదించుటయే పై శ్రుతితాత్పర్యము. వాల్మీకి మహాకవియు నుపమానవ్యాజమున జక్కగ జమత్కరించుచు నీ విషయము నిట్లు వ్యక్తము జేసినాడు.

'అహ మౌపయికీ భార్యా తస్యైవ వసుధాపతేః।
వ్రతస్నాతస్య ధీరస్య విద్యేవ విదితాత్మనః॥' — రామా. 5-21-17.

కామమోహితుడై తననుగూర్చి పలికిన రావణుని వాక్యములకు ధీరయై సీత యొసగిన సమాధాన మిది. విద్యావ్రతస్నాతుడు, ధీరుడు నాత్మజ్ఞాన సంపన్నుడు నగు వేదవిదునకు వేదవిద్యవలె వ్రతస్నాతుడు, ధీరుడు, నాత్మవిదుడు, వసుధాపతియు నగు శ్రీరామచంద్రునకే నేను లభ్య మగు - న్యాయ్య మగు - భార్యను (యుక్త మౌపయికం లభ్యం భజమానాభి నీతవత్ న్యాయ్యం చ త్రిషు షట్ - అమరః) - అని యర్థము.

శ్రీరామచంద్రునకే నేను లభ్యను; న్యాయ్య మగు భార్యను - అను రెండర్థములును నిట 'ఔపయిక' పదముచే స్ఫురించుచున్నవి. అట్లే విద్యావ్రతస్నాతుడు, ధీరుడు, ఆత్మతత్త్వవిదుడు నగు వేదవిదునకు మాత్రమే యీ వేదవిద్య లభ్యమై, న్యాయయుక్తమై కాంతవలె వశవర్తిని యగు నని తాత్పర్యము.

కాన 'జాయేవ పత్య ఉశతీ సువాసాః' - అను పై మంత్రము చతుర్దశ విద్యాస్థాన కుశలు డగు విద్వాంసునకు మాత్రమే వేదవాక్కు కాంతాసంమితముగ నర్థముల నుద్బోధించు నను నీ విషయము నుపమా వ్యాజమున నిపుణముగ వివరించు చున్నదని చెప్పుటయే యుక్తము. ఇంతే కాదు.

'తస్యోత్తరా భూయసే నిర్వచనాయ' — నిరు.

పూర్వోదాహృతము లయిన 'ఉత త్వః పశ్యన్' ఇత్యాది ఋక్కులచే జెప్పబడిన యర్థమును దానితరువాత పఠించెడి ఋక్కు ఇంకను నెక్కువ మిన్నగ నిర్వచించుచున్నది - యని యర్థము. ఆ మంత్ర మిది

"ఉత త్వం సఖ్యే స్థిరపీత మాహు ర్నైనం హిన్వన్త్యపి
వాజినేషు। అధేన్వా చరతి మాయయైష వాచం శుశ్రువాగ్ం
అఫలా మపుష్పామ్॥" — ఋ. 10-71-5; నిరు. 1-20.

పూర్వము 'య స్తిత్యాజ సచివిదం సఖాయం' అను మంత్రమున వేదమునకు గల సఖిత్వము చెప్పబడినది. ఇట్టి వేదరూపసఖునితో సఖ్యము నెఱపు వానిని గూర్చి యిట జెప్పబడుచున్నది. చతుర్దశ విద్యాస్థాన కుశలు డగు విద్వాంసుడే యట్టి వేదముతోడి సఖ్యముననుండి వేదోక్తార్థామృతపానమును జేసినవాడు (స్థిరపీతః) అని యభిజ్ఞులు చెప్పుదురు. అట్టి విద్వాంసుడు సభయం దున్నచో నెంతటి వాక్ప్రాగల్భ్యము గల వారైనను ఆయనతోడి వాదమునకు వెఱచి సమీపింప లేరు. అట్లు విద్యాకౌశలములేక మంత్ర పరిశీలనము చేయువాడు ఐంద్రజాలనిర్మిత మాయాధేనువుతో జరించిన వానితో సమాను డగును (అధేన్వా చరతి మాయయైషః). పూర్వకాండోక్త ధర్మజ్ఞానము పుష్పము ; ఉత్తరకాండోక్త బ్రహ్మజ్ఞానము ఫలము ; మాయా ధేనువు క్షీరాదుల నొసగి ప్రోదిసేయని యట్లు, వేదవాక్కుగూడ నవిద్వాంసులకు పుష్పఫలరహితయై గన్పట్టి పురుషార్థముల నొసగి ప్రోదిసేయు జాలదు — అని యర్థము (చూ- సా. భా.).

ఇట 'వేదవాక్కు అజ్ఞులపాలిటి మాయాధేనువు' అని చెప్పబడుటచే విజ్ఞులపాలిటి కామధేనువు అను విషయము భంగ్యంతరముగ దెలియజేయ బడుచున్నది. అంతియే కాదు. 'అఫలాం అపుష్పాం' అనుటచే వేద మొక మహావృక్ష మగుటయు సూచిత మగుచున్నది. అందును నొక విశేషము. వృక్షమును జక్కగ బోషించుచో నది మొదట పుష్పించును. ఎట్టి యుపద్రవము లేకుండ గాపాడుచో నా పుష్పములు ఫలముల నొసగును. అట్లే వేదవృక్షమును బోషించుచో నది మొదట ధర్మ మనెడి పుష్పముతో వికసించును. భద్రముగ రక్షించుకొనుచో నా ధర్మపుష్పము క్రమముగ బ్రహ్మజ్ఞాన ఫలము నొసగి ప్రోదిసేయ గలదు—అనగా వేదము మొదట ధర్మము నుపదేశించి తదనుష్ఠానముచే చిత్తశుద్ధి నొందిన యధికారులకు బ్రహ్మామృతానందరసము ననుగ్రహించును— అను విషయముగూడ కాంతా

సంమితముగ నిట నుపదేశింపబడుచున్నది. ఇట్లెన్నేని మంత్రముల నుదహరింప వచ్చును.

శ్రుతి తనకు గల కాంతాసంమితత్త్వమును కాంతాసంమితముగ వివరించుకొనుట యిట గమనార్హము. కాన కాంతాసంమితముగ నుపదేశించుట వేదమునకు వెన్నతో బెట్టిన విద్య యనుట శ్రుతిసంమతము; నిర్వివాదము.

మంత్రము లన్నియు కాంతాసంమితములా?

వేదమున నటనట కాంతాసంమితము లగు వాక్యములు గూడ నుండిన నుండవచ్చును; అన్నియు నట్టివి కావు గదా! అందుచే వేదము కాంతాసంమితమై కావ్య మగు టెట్లు? అన నట్లు గాదు.

లౌకికకావ్యమునందు కేవల కథాభాగ ప్రతిపాదక నీరసవాక్యము లన్నియు గాంతాసంమితములై చమత్కారాధాయకములు గావనుట యనుభవసిద్ధమే. విశ్వనాథకవిరాజు కూడ సాహిత్యదర్పణమున 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అని కావ్యలక్షణమును జెప్పి కావ్యగత నీరస పద్యములకు కావ్యత్వ మెట్లు సిద్ధించునని ప్రశ్నించుకొని యిట్లు సమాధాన పడినాడు.

> 'రసవత్పద్యాంతర్గత నీరసపదానామివ పద్యరసేన, ప్రబంధ
> రసేనైవ తేషాం రసవత్త్వాంగీకారాత్' — సాహిత్యదర్పణ.

రసవత్తరమగు పద్యమునందలి నీరసపదములకు పద్యరసముచేతనే రసవత్త్వము నంగీకరింపవలెను. అట్లే ప్రబంధరసము చేతనే నీరస పద్యములకును రసాత్మకత్వము సిద్ధించునని భావము. కనుక వేదశాస్త్ర విలక్షణములై యవతరించినట్లు చెప్పబడెడి కావ్యములందువలెనే వేదము

నందును కావ్యత్వపమన్వయ మవిరుద్ధము - ఈ విషయము ముఖ్యం దింకను జూతము.

భారతము - వేదమువలెనే ప్రభు - సుహృత్ - కాంతా సంమితము :-

వేదముల తరువాత పంచమ వేదమై బరగిన మహాభారతముగూడ వేదమువోలె ప్రభు-సుహృత్-కాంతా సంమితమునై వరలినది. ఈ విషయము భారతమే స్వయముగ జెప్పికొనినది.

"తపసా బ్రహ్మచర్యేణ వ్యస్య వేదం సనాతనమ్।
ఇతిహాస మిమం చక్రే పుణ్యం సత్యవతీసుతః॥

ఆత్మేవ వేదితవ్యేషు ప్రియేష్వేవ హి జీవితమ్।
ఇతిహాసః ప్రధానార్థః శ్రేష్ఠః సర్వాగమే ష్వయమ్॥

ప్రహానా ముదధిః శ్రేష్ఠో గా ర్వరిష్ఠా చతుష్పదాం।
యథైతానీతిహాసానాం తథా భారత ముచ్యతే॥"

పై వాక్యములవలన భారత మితిహాస మగుట దెలియగలము. ఇతిహాస మనుటచే నిది సుహృత్సంమిత మని చెప్పినట్లే యగును. ఇక ప్రభుసంమితత్వము.

"యో విద్యా చ్చతురో వేదాన్ సాంగోపనిషదో ద్విజః।
న చాఖ్యాన మిదం విద్యా న్నైవ స స్యా ద్విచక్షణః॥

అర్థశాస్త్ర మిదం ప్రోక్తం ధర్మశాస్త్ర మిదం మహత్।
కామశాస్త్ర మిదం ప్రోక్తం వ్యాసేనామితబుద్ధినా॥"

ఇట భారతము ధర్మ–అర్థ–కామ–మోక్షము లనెడి పురుషార్థములను దర్శింపజేయు శాస్త్రముగా బేర్కొనబడినది. శాస్త్రము గాన ప్రభుసంమిత మగుట జెప్పినట్లే యగును. ఇక కావ్యత్వము.

"కృతం మయేదం భగవన్ కావ్యం పరమపూజితమ్।
బ్రహ్మన్ వేదరహస్యం చ యచ్చాప్యభిహితం మయా॥....

జన్మప్రభృతి సత్యాం తే వేద్మి గాం బ్రహ్మవాదినీమ్।
త్వయా చ కావ్య మిత్యుక్తం తస్మాత్కావ్యం భవిష్యతి॥

అస్య కావ్యస్య కవయో న సమర్థా విశేషణే।
విశేషణే గృహస్థస్య శేషా త్రయ ఇవాశ్రమాః॥"

వ్యాసమహర్షి తన యెదుట సాక్షాత్కరించిన బ్రహ్మతో తాను భారత మను కావ్యమును రచించి నట్లు చెప్పెను. అంతట బ్రహ్మ 'పుట్టినది మొదలు నీ వాక్కు బ్రహ్మవాదిని (బ్రహ్మవాక్కు) అని యెఱుగుదును. నీవు కావ్య మంటివి. కాన నిది కావ్యమే యగును. మిగిలిన యాశ్రమములు మూడును గృహస్థాశ్రమము నతిశయింపనియట్లు మిగిలిన కవు లెవరును నీ కావ్యము నతిశయింపలేరు.' — అని చెప్పెను.

పై బ్రహ్మ–వ్యాస సంవాదమువలన భారతము కావ్య మగుటయు; మిగిలిన యాశ్రమములకు గృహస్థాశ్రమమువలె లౌకికకవుల కీ భారతము జీవనాధార మనియు స్పష్ట మగుచున్నది. వేదమువోలె భారతముగూడ నిట్లు ప్రభు–సుహృత్–కాంతాసంమిత రచనావైదగ్ధ్యములతో వేదబోధితార్థ వ్యాఖ్యానమునకు దొరకొని పంచమవేదమై ప్రవర్తిల్లినది.

భారతమువలెనే స్మృతులు, పురాణములు, లౌకికకావ్యములును, శ్రుత్యర్థానుగాములే. కాని యొక విశేషము. వేదమునగల త్రివిధ రచనా

వైచిత్ర్యములలో నొక ప్రభుసంమితత్త్వమార్గముననే ప్రధానముగ బ్రవర్తిల్లి స్మృతులు శాసకము లగుచు ధర్మశాస్త్రము లయినవి; సుహృత్సంమితత్వము మాత్రము నాదర్శముగా గొని పురాణములు శ్రుత్యర్థ ప్రఖ్యాపకము లయినవి; కేవల కాంతాసంమిత రచనావైచిత్ర్యమును గొని లౌకిక కావ్యములు శ్రుత్యర్థమునకు బుష్టిని జేకూర్ప దొరకొనినవి. భారతము మాత్ర మీ మూడింటికిని స్థానభూతము.

కాని, మహాభారతాదులు వేదార్థోపబృంహకములు గాన వానికిగల ప్రభుసంమితత్వము వేదానుగతము. నిరపేక్షమైన ప్రభుసంమితత్వము వేదమునకే. కాని యిట నొక విషయము బరిశీలింప నగును.

వేదమునకుగల కావ్యత్వ మౌపచారికమా ? :-

వేదమునందును, మహాభారతమునందును కాంతాసంమితత్వముతో పాటు ప్రభు-సుహృత్సంమితత్వములుగూడ నున్నవని చెప్పుచో వానికి ఏకాంశమున మాత్రమే కావ్యత్వము సిద్ధించును; లేక, ప్రబంధరసముచేతనే నీరసపద్యములకు రసవత్త్వము సిద్ధించు ననెడి సాహిత్యదర్పణకారుని వాదము నాశ్రయించి యౌపచారికకావ్యత్వమునైన గల్పింపవలయును. కాని 'కావ్యంఛందః'- (వా.సం. 15-4) అని వాజసనేయశ్రుతియు, తద్వివరణ రూపమగు 'త్రయీ వై విద్యా కావ్యం ఛందః'-(శ.బ్రా. 8-5-2-4) అని శతపథశ్రుతియు కృత్స్నవేదరాశికి కావ్యవ్యవహార మున్నటుల జెప్పుచున్నది. అట్లే బ్రహ్మ-వ్యాస సంవాదము మహాభారతమున కంతటికిని కావ్యత్వవ్యవహారము గలదని తెలియజేయుచున్నది. ఇట్లు వేదరాశికిని భారతమునకును కావ్యవ్యవహార ముండుటలో గల తాత్పర్యమేమి? పోనీ, వేదమునకుగల కావ్యత్వ మౌపచారిక మని చెప్పుదమా? పై శ్రుతివాక్యప్రామాణ్యముచే నట్లు ఔపచారిక మని చెప్పుట యుక్తము గాదు. అట్లే 'మహాభారతవిషయమున గూడ-

"జన్మప్రభృతి సత్యాం తే వేద్మి గాం బ్రహ్మవాదినీమ్।
త్వయా చ కావ్య మిత్యుక్తం తస్మా త్కావ్యం భవిష్యతి॥"

యను పై బ్రహ్మవచనము 'భారతమునకుగల కావ్యత్వము గౌణము కాదు; యథార్థము' - అను విషయమును స్పష్టము చేయుచున్నది. కాన 'వేద-భారత' గ్రంథములకు గల కావ్యత్వ మౌపచారికము కాదు. (ఈ విషయము మున్ముందింకను వివరింపబడును) వీనికిగల కావ్యత్వము ముఖ్య మనుచో నాలంకారికులు చెప్పెడు కావ్యలక్షణము వీనియందు సంగత మగునా? కాదా? యను విషయము జూడవలసియున్నది.

అలంకారికులు - కావ్యలక్షణము :-

మొట్టమొదట కావ్యలక్షణమును బరిష్కరించినది యగ్నిపురాణము.

''సంక్షేపా ద్వాక్య మిష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ।
కావ్యం స్ఫురదలంకారం గుణవ ద్దోషవర్జితమ్॥'' —అ.పు. 337-6.

గుణాలంకారయుక్తమై, దోషవర్జితమైన ఇష్టార్థప్రతిపాదక పదావళి (వాక్యము) కావ్యము - అని యర్థము. దండిమహాకవియు కావ్యాదర్శమున 'ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావలీ కావ్యమ్' - అనుచు, అగ్నిపురాణమునే యనుసరించినాడు. తర్వాత భామహునితో శబ్దార్థములు కావ్య మను వాదము బయలుదేరినది. అ వాదము ననుసరించి రుద్రటుడు, వామనుడు, ఆనందవర్ధనుడు, మమ్మటుడును శబ్దార్థముల రెంటిని కావ్యశరీరముగ గ్రహించిరి.

'శబ్దార్థౌ సహితౌ కావ్యమ్' —భామహః.

'నను శబ్దార్థౌ కావ్యమ్' — రుద్రటః.

'కావ్యశబ్దోఽయం గుణాలంకార సంస్కృతయోః

శబ్దార్థయో ర్వ ర్తతే' — వామనః.

'శబ్దార్థశరీరం తావ త్కావ్యమ్' —ఆనందవర్ధనః.

'తదదోషౌ శబ్దార్థౌ వనలంకృతీ పునః క్వాపి' —మమ్మటః.

వాగ్భటుడు పై లక్షణమును కొలదిగ నిట్లు సవరించినాడు.

'గుణాలంకార రీతి రసోపేతః సాధుశబ్దార్థ సందర్భః కావ్యమ్'
— వాగ్భటః.

తరువాత పీయూషవర్షుడు (జయదేవుడు) అట్లుగాక గుణాలంకారాదివిశిష్ట నిర్దోషవాక్యము కావ్య మని చెప్పినాడు.

'నిర్దోషం గుణాలంకారలక్షణ రీతి వృత్తిమద్వాక్యం కావ్యమ్'– పిమ్మట సాహిత్యదర్పణకారుడు (విశ్వనాథకవిరాజు) ను శబ్దార్థములు కాదనినాడు.

'వాక్యం రసాత్మకం కావ్యమ్'

అని రసాత్మకవాక్యమునే కావ్యముగ జెప్పుచు తన ప్రాచీనులకంటె విలక్షణమైన కావ్యలక్షణము జెప్పి క్రొత్తమార్గము త్రొక్కినాడు. కావ్య ప్రకాశ వ్యాఖ్యాతయగు గోవిందఠక్కురు పై లక్షణమును 'రసాదిమ ద్వాక్యం కావ్యమ్' – అని సంస్కరించినాడు. తరువాత పండితరాజ జగన్నాథుడును శబ్దార్థములు కావ్య మనెడి వాదము ను ఖండించి—

'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్'

అని కావ్యలక్షణమును బరిష్కరించినాడు. నేటికిని పండితామోదమును బడసి నిలిచిన కావ్యలక్షణ మిదియే–యని చెప్పనచ్చును.

కాని 'త దధీతే త ద్వేద' యను పాణినిసూత్రస్థ భాష్యమును ప్రమాణముగా గ్రహించి 'శబ్దార్థములు కావ్యము' అను వాదమును నాగేశ భట్టు మున్నగువారు కొందఱు సమర్థించిరి. కాని జగన్నాథుని కావ్య లక్షణమే బహుళప్రచారము గాంచియున్నది.

ఇట నొక విషయము గమనింప నగును. అగ్నిపురాణము నందలి 'ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావలీ కావ్యమ్' అను ఆర్షలక్షణమే తుదకు 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్' అను జగన్నాథుని కావ్యలక్షణముగ రూపొందిన దని యనవచ్చును. ఆర్షలక్షణము నందలి 'ఇష్టార్థము' ఇచట 'రమణీయార్థ' మైనది. రెండిటి లక్ష్య మొకటియే. తన కావ్యలక్షణమును జగన్నాథు డిట్లు పరిష్కరించుకొనినాడు.

'చమత్కారజనక భావనావిషయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్'

ఇందలి 'భావనా' పదమునకు కావ్యార్థమును పునఃపున రనుసంధానము జేయుట - యని యర్థము. ఏ యర్థమును పునఃపున రనుసంధానము జేయుటచే లోకోత్తరాహ్లాదము (చమత్కారము) కలుగునో యట్టి భావనా గోచర మగు నర్థమే రమణీయార్థము. అట్టి రమణీయార్థమును ప్రతి పాదించు శబ్దమే కావ్యము - అని యర్థము.

వేదవాక్యములకు మంత్రము లని యసాధారణ నామము. మంత్రము లనగా పునఃపున రనుసంధానము (మననము) చేయదగినవి యని యర్థము. (మననా న్మంత్రః). ఈ మననమునే జగన్నాథుడు 'భావన' యనినాడు. అట్లు మననము జేయుచో ప్రీతిని (లోకోత్తరాహ్లాదమును) అనుగ్రహించు నట్టి సూనృతవాక్కులు మంత్రములు. ఈ రీతిగ బరిశీలనము చేయుచో జగన్నాథుని కావ్యలక్షణమునకు ప్రధానలక్ష్యము వేదకావ్యమే యని చెప్ప నగును. అపుడు ఆలంకారిక కావ్యలక్షణము వేదకావ్యము నందును సంగతమే యగును. కనుక 'కావ్యం ఛందః' అను శ్రుతిప్రమాణము

ననుసరించియు, ఆలంకారికుల కావ్యలక్షణము ననుసరించియు కృత్స్న వేదము కావ్య మని చెప్ప నొప్పును.

ఆక్షేపము : సమాధానము :-

అయినను వేదముగాని, భారతముగాని కావ్య మనుట యుక్తము కాదు; ఏలయన నగ్నిపురాణము శాస్త్రేతిహాసములకంటె కావ్యము విలక్షణ మైనదని స్పష్టముగ నిట్లు పేర్కొనుచున్నది.

"శాస్త్రే శబ్దప్రధానత్వం ఇతిహాసేషు నిష్ఠతా।
అభిధాయాః ప్రధానత్వాత్ కావ్యం తాభ్యాం విభిద్యతే॥"

విష్ణుధర్మోత్తర పురాణముగూడ నిట్లే చెప్పుచున్నది.

"తదేవ కావ్య మిత్యుక్తం ఉపదేశై ర్వినా కృతమ్" 15. అధ్యా.

పై ఆర్షవచనములబట్టి శాస్త్రేతిహాసములయం దేకాంశమునను గూడ కావ్యత్వము లేదని చెప్పవలసియుండును గదా!

కాని యిట్టి పురాణవచనములందు ఇతిహాసము కావ్యముకంటె విలక్షణమైనదని చెప్పిన వ్యాసుడే యితిహాసమైన భారతమునే కావ్య మని ముక్తకంఠముగ జెప్పినాడు. అట్లు చెప్పుటలోని యాంతర్యమును గమనింపవలసి యున్నది. భారతమునే కాక శాస్త్ర మగు వేదమునుగూడ కావ్య మని వ్యాసు డిట్లు కీర్తించినాడు.

"నాసూయామి ద్విజాన్ విప్ర రాజాఽస్మీతి కదాచన।
కావ్యాని వదతాం తేషాం సంయచ్ఛామి వహామి చ॥
తే విస్రబ్ధాః ప్రభాషన్తే సంయచ్ఛన్తి చ మాం సదా।
తే మాం కావ్యపథే యుక్తం శుశ్రూషు మనసూయకమ్॥

ధర్మాత్మానం జితక్రోధం నియతం సంయతేంద్రియమ్।
సమాసించంతి శాస్తారః క్షౌద్రం మధ్విన మక్షికాః॥

సో ఽహం వాగగ్రవిద్యానాం రసానా మవలేపితా।
స్వజాత్యా నధితిష్ఠామి నక్షత్రాణీవ చంద్రమాః॥

ఏతత్ పృథివ్యా మమృత మేత చ్చక్షు రను త్తమమ్।
య ద్బ్రాహ్మణముఖే కావ్య మేత చ్ఛ్రుత్వా ప్రవర్తతే॥

ఏతావ చ్ఛ్రేయ ఇత్యాహ ప్రహ్లాదో బ్రహ్మవాదినమ్॥

భార. శాన్తి. 124-34 నుండి 39.

ప్రహ్లాదుడు తన సౌశీల్యముచే త్రైలోక్యరాజ్యము నాక్రమించెను. ఇంద్రుడు క్రమముగా బృహస్పతి_శుక్రుల యొద్ద శ్రేయస్సుయొక్క స్వరూపమును దెలిసికొనియు, దృప్తినొందక వారలచే ననుజ్ఞాతుడై, శ్రేయఃస్వరూపము నెఱుగుటకై బ్రాహ్మణరూపమున బ్రహ్లాదుని జేరి సేవించి మెప్పు వడసెను. అపుడు ప్రహ్లాదు డింద్రునితో తన సౌశీల్యాతిశయమునకు గారణ మిట్లు చెప్పుచున్నాడు.

'ద్విజవర్యా! నేను రాజును గదా యని ద్విజులయెడ నెన్నడు నసూయ వహింపను; కావ్యముల (వేదముల) నుచ్చరించు వారి నాదరించి పోషింతును; వారును నాయెడ నాదరముతో నుండి విస్రబ్ధముగ మాట లాడుచు నన్ను కావ్యపథమున (వేదచోదిత మార్గమున) నియమించు చుందురు; ఆ మార్గమున నిరతుడనై, శుశ్రూషాపరాయణుడనై, జితేంద్రియు డనై, వర్తిల్లు నాయందు మధుకరములు తేనెపట్టునందు తేనెనువలె నా ద్విజులు విద్యాసారమును నింపుదురు; వారివలన వాగగ్రవిద్యల రసమును (వేదవిద్యా సారమును) గ్రోలి చుక్కలలో చంద్రునివలె నాజాతివారలలో విరాజిల్లుచున్నాను; బ్రాహ్మణముఖమున బ్రవర్తిల్లెడు కావ్యమే (వేదమే)

లోకమున నమృతము; అదియే నేత్రము (జ్ఞాననేత్రము): దీనిని శ్రవణము జేసి (ఏతద్ శ్రుత్వా) ప్రవర్తించుటయే శ్రేయస్సు' – అని యర్థము'

కావ్యపథము :-

ఇట కావ్యమనగా లౌకికకావ్యముల గ్రహించుట కవకాశము లేదు. ఏలయన – పై సంవాదమున ప్రహ్లాదుడు తాను కావ్యపథమున వర్తిల్లుచున్నటుల (కావ్యపథే యుక్తం) పేర్కొనెను. ఇట కావ్యపథ మన నేది? కావ్య మనగా వేదము కాన కావ్యపథ మనగా అది వేదచోదిత మార్గమే యగును. అట్లుగాక లౌకికకావ్యముల నిట గ్రహించుచో నవియు వేదచోదితమార్గమున బ్రవర్తిల్లునవియే యగును. అందుచే వేదమార్గముగాక యా లౌకికకావ్యములచే బ్రవర్తింపజేయబడు మార్గము వేఱొకటి గల దని చెప్ప వలనుపడదు. కాన నిట కావ్యపథము వేదచోదిత మార్గ మనియే గ్రహింప నగును.

వాగగ్రవిద్యా తతవతీ శ్రీః :-

మఱియు ప్రహ్లాదుడు ద్విజముఖమున శ్రవణము జేసి, వాగగ్రవిద్యారసావలిప్తుడై (వాగగ్రవిద్యానాం రసానా మవలేపితా) తన జాతివారల నతిశయించి నట్లు చెప్పబడినది. ఈ వాగగ్రవిద్య లెవ్వి? వాగగ్రవిద్యలనగా లౌకికవాక్కుల (విద్యల) కంటె బూర్వమే సిద్ధమై యున్న విద్యలు. అవి వేదవిద్యలే యగును. వాగగ్ర శబ్దమునకు – లౌకికవాక్కులు ప్రవర్తిల్లుటకు బూర్వము సిద్ధమై యున్న – అను నర్థము వైదికసంప్రదాయ సిద్ధము.

"బృహస్పతే ప్రథమం వాచో అగ్రం య త్ప్రైరత
నామధేయం దధానాః । యదేషాం శ్రేష్ఠం యదరిప్ర మాసీ
త్ప్రేణా త దేషాం నిహితం గుహావిః ॥

— ఋ. 10-71-1; ఐ. ఆ. 1-3-3-4.

ఇది పరమపురుషార్థ సాధనము, పరబ్రహ్మజ్ఞాన స్తుతిపరము నగు సూక్తము. బృహస్పతి వేదార్థాభిజ్ఞు లయిన బాలకులను జూచి విస్మయపడి 'బృహస్పతే' యని స్వాత్మను సంబోధించుచు నిట్లు చెప్పుచున్నాడు.

'ఓ బృహస్పతీ ! ప్రథమమున - పుట్టిన తర్వాత ఇతరపదముల నుచ్చరించుటకు బూర్వము - పదార్థముల కా యా నామధేయములు బెట్టుటకు బూర్వము బాలురు 'తత', 'తాత' యని యేది యుచ్చరింతురో యది వాచో ఽగ్రము - వాగగ్రము అగును. అట్లుచ్చరించెడి దశయందున్న యీ బాలుర గాంచుము. శ్రేష్ఠము, పాపరహితము (అరిప్రం)నై, నిగూఢముగ (గుహా నిహితం) వీరియందున్న వేదార్థజ్ఞానము వేదాఖ్యాన కాలమున ప్రేమచే (ప్రేణా) నావిర్భూత మగును. వేదాఖ్యానకాలమున సరస్వతి (వేదవాణి) స్వార్థము ను వీరికి ప్రకాశింప జేయును (వేదాఖ్యానకాలే సరస్వతీ స్వార్థ మేభ్యః ప్రకాశయతీత్యర్థః - సా భా.) - అని యర్థము.

పసితనమున మాటలు రాకపూర్వము బాలు రుచ్చరించు తత, తాతేత్యాది శబ్దములు 'తత్' శబ్దమున కుపలక్షకములై తచ్ఛబ్దవాచ్య పరమేశ్వర ప్రతిపాదకములు. కాన నా శబ్దములు 'వాగగ్రములు' అని శ్రుతితాత్పర్యము. ఐతరేయారణ్యకము నీ మంత్రమును వివరించుచు నీ పదముల నిట్లే వ్రాగగము లని పేర్కొనినది.

"ఏతాం వావ ప్రజాపతిః ప్రథమాం వాచం వ్యాహార దేకాక్షర

> ద్వ్యక్షరాం తతేతి తాతేతి తథైవైత త్కుమారః ప్రథమవాదీ వాచం వ్యాహర త్యేకాక్షర ద్వ్యక్షరాం తతేతి, తయైవ త త్తతవత్యా వాచా ప్రతిపద్యతే। తదు క్త మృషిణా, 'బృహస్పతే ప్రథమం వాచో అగ్ర మితి।"

కాన 'తత-తాతే' త్యాది వాక్కులు వాగగ్రము లగుట శ్రుతిసంప్రదాయము. మరియు నీ వాక్కులను 'తతవతీ వాక్' అని ఐతరేయారణ్యకము నిర్దేశించుచున్నది. తత-తాత శబ్దములు 'తత్' శబ్దమున కుపలక్షకములు. కాన 'తత్' శబ్దముతో నారంభ మయ్యెడి "త ది దాస భువనేషు జ్యేష్ఠమ్" (ఋ. 10-120-1 ; అ.సం. 5-2-1 ; సా.సం; 2-833 ; వా.సం. 33-80) ఇత్యాది వాక్కులు (మంత్రములు) తతవతీవాక్కులు.

వేదాభ్యాసమునకు మూల మగు గాయత్రియు 'తత్' శబ్దముతో నారంభ మగుచు తతవతీ వాక్కు యగుట గమనార్హము. ఇట్టి తతవతి యగు వేదవిద్యయే వాగగ్రవిద్య. ఇంతే కాదు.

తాండ్య బ్రాహ్మణము 'శ్రీ'కారమును వాగగ్రవిద్య యని యిట్లు చెప్పుచున్నది.

> "శ్రీ ర్వై వాచోఽగ్రగ్ం శ్రియ మేవాస్మిన్ దధాతి" — 6-9-12.

> 'వాచః అభివదనస్య య దగ్రం పురోభాగః స శ్రీ ర్వై శ్రీ రేవ ఖలు, బహూనాం మధ్యే యస్య వాక్ ప్రథమం ప్రవృత్తా స శోభతే। తథా సతి ఏతత్ పాఠేనాస్మిన్ యజమానే శ్రియ మేవ దధాతి' —సా.భా.

పలువురిమధ్య నెవడు మొదట మాటలాడునో యాతని వాక్కు వాచోఽగ్రము: అదియే మిగుల శోభించును. అట్టివాక్కుకు 'శ్రీః' అని పేరు.

లోకమున అందఱికంటె ముందుగా నెవ డేపని నైన నారంభిం చునో నట్టి వానిని జూచి 'దీనికి శ్రీకారము జుట్టిన దితడు' అని యనుట సంప్రదాయము. కాన 'శ్రీ'ని వాగగ్రముగ శ్రుతి పేర్కొనినది. 'సా హి శ్రీ రమృతా సతాం' అనుచు శ్రుతి ఋగ్యజుః సామాత్మక మంత్రరాశిని, లేక త్రయీవిద్యను శ్రీః అని వ్యవహరించుట పూర్వము వివరింపబడినది. (చూ. త్రయీశబ్దము). లౌకికవిద్యలకు మూలమై, విజ్ఞానమునకు మొదట శ్రీకారము జుట్టిన వాగగ్రవిద్య శ్రీవిద్య లేక వేదవిద్యయే యగును.

అగ్రశబ్దమునకు 'పూర్వము' అనియే గాక 'చివర' యనియు నర్థము గలదు. 'వాక్ అనగా వేదము; వాగగ్ర విద్యలు ఉపనిషత్తులు'—అనియు జెప్ప నగును. అట్టి వేదములు కావ్యము లగు నని స్ఫురింప జేయుటకే పై ప్రహ్లాదవచనములందు 'రస' పదముకూడ నుపయోగింప బడినది. (వాగగ్రవిద్యానాం రసానా మవలేపితా) కాన వేదకావ్య రసాస్వాదపరుడు —అని యర్థము. అట్టి ప్రహ్లాదుని దృష్టిలో కావ్యములు వేదములే యగును.

బ్రాహ్మణముఖే కావ్యమ్[1] :

ప్రహ్లాదు డా కావ్యమును బ్రస్తుతించిన విధము గమనార్హము.

"ఏత త్పృథివ్యా మమృతమేత చ్చక్షు రనుత్తమమ్।
యద్బ్రాహ్మణముఖే కావ్యమేత చ్ఛ్రుత్వా ప్రవర్తతే ॥
ఏతావ చ్ఛ్రేయః"

'బ్రాహ్మణముఖే కావ్యమ్' అను పదములు - గురుశిష్య పరంపరాగతమై ఉచ్చారణానుచ్చారణ రూపమున బ్రాహ్మణముఖమున నిలిచి యున్న

---

1 పై యింద్రప్రహ్లాద సంవాదము నందలి బ్రాహ్మణముఖే కావ్యమ్; కావ్యాని వదతాం తేషాం - ఇత్యాది స్థలములలో—'కావ్యాని శుక్రప్రోక్తాని నీతిశాస్త్రాణి

కావ్యము' అను నర్థమును స్ఫురింప జేయుచున్నవి. అట్లు బ్రాహ్మణ ముఖస్థమైన కావ్యము వేదమే యగును వేదమునకు ముఖస్థత్వ నియమ మున్నట్లితర లౌకిక కావ్యములకు ముఖస్థత్వ నియమము లేదు.

మఱియు 'బ్రాహ్మణముఖే కావ్యమ్' అనగా బ్రాహ్మణప్రోక్తమైన కావ్య మని యర్థము. బ్రాహ్మణ ప్రోక్త మనగా వారిచే ప్రోక్త మగుచుండునది మాత్రమే కాని వారిచే రచింపబడినది కాదని యర్థము. 'తేన ప్రోక్తమ్' (4-3-101) అను పాణిని సూత్రమును వివరించుచు పతంజలి మహర్షి యిట్లు 'ప్రోక్త' శబ్దార్థమును సోదాహరణముగ జెప్పినాడు.

"యత్ తేన ప్రోక్తం న చ తేన కృతం - మాధురీ వృత్తిః"

ఈ వృత్తి మాధురునిచే బ్రకాశింప జేయబడినది గాని రచింప బడలేదు. కనుక 'మాధురీ వృత్తిః' అను రూపము సిద్ధించినది.

అని మహాభారత వ్యాఖ్యాత నీలకంఠపండితుని వివరణము గన్పట్టుచున్నది. ప్రహ్లాదుడు దైత్యరాజు. శుక్రుడు దైత్యగురువు. శుక్రునకు 'కవిః' అనియు, 'కావ్యః' అనియు నామములు గలవు. శుక్రుడు కవి గాన తత్ప్రోక్తములగు నీతిశాస్త్రములు కావ్యము లగు నని నీలకంఠపండితుని యభిప్రాయము గావచ్చును. ఇంకను పై సంవాదము నందలి 'వాగగ్ర విద్యానాం' అను పద మిట్లు వివరింపబడినది, 'వాగగ్ర ఏవ న తు పుస్తకే విద్యా యేషాం తేషాం'—ముఖస్థము లైన విద్యలు గలవారు అని యర్థము. ఈ యర్థము ననుసరించి 'వాగగ్ర విద్యానాం రసానా మవలేపితా' యను వాక్యమునకు వాగగ్రవిద్యలు గల ద్విజులయొక్క రసముచే అవలిప్తుడు—అని యర్థము జెప్పవలసి యుండును. ద్విజుల రసముతో నవలిప్తు డగుట యన నర్థమేమి? కాన ఈ నీలకంఠపండిత వ్యాఖ్యానమును సూక్ష్మదృష్టితో బరిశీలింపవలసి యుండును. వాగగ్రవిద్య యనగా వేదవిద్య లను నర్థము వైదిక సంప్రదాయానుగుణ మని పైన వివరింపబడినది. కాన నిట వాగగ్రవిద్యచే వేదవిద్యనే గ్రహించుట యుచితము. అట్లు గ్రహించిననే — అమృతమ్; చక్షు రనుత్తమమ్; బ్రాహ్మణముఖే కావ్యమ్; ఏతచ్ఛ్రుత్వా ప్రవర్తతే; ఏతావచ్ఛ్రేయః—అని యీ రీతిగా ప్రహ్లాదునిచే జేయబడిన

"యత్ తేన కృతం న చ తేన ప్రోక్తం వారరుచం కావ్యమ్"

ఈ కావ్యము వరరుచిచే రచింపబడినది. కాని ప్రకాశింప జేయబడలేదు. అని యర్థము.

బ్రాహ్మణముఖ కావ్యప్రశంస తత్త్వతః ఉపపన్న మగును, 'పితృ దేవ మనుష్యాణాం వేద శ్చక్షుః సనాతనమ్' పితృ దేవ మనుష్యులకు వేదము సనాతన మగు జ్ఞాననేత్రము- అని మనుస్మృతి కీర్తించినది. నీతిశాస్త్రమునకును "చక్షుః" అని వ్యవహార మున్నది. కాని యది స్వతంత్రమై మార్గదర్శకము గాదు. వేదమార్గానుగతమై యదియు ప్రమాణ మగును. కాన వేదమే స్వతంత్రమై మార్గదర్శక మైన నేత్రము. నీలకంఠపండితుడు 'శుక్రప్రోక్తాని నీతిశాస్త్రాణి' యని వివరించినాడు. ఆ నీతి శాస్త్రములు పరంపరాగతములై శుక్ర ప్రోక్తములు - శుక్రునిచే ప్రకాశితములు గాని శుక్రరచితములు గావు - అని యర్థము. కాన నీలకంఠపండితుని 'నీతిశాస్త్రాణి' యను పదము పరంపరాగతము లైన వేదముల కుపలక్షకములుగా గ్రహింప నగును. అట్లు గాక కావ్యపదముచే శుక్రనీతి శాస్త్రమునే గ్రహించుచో 'స్వజాత్యా నదితిష్ఠామి నక్షత్రాణీవ చంద్రమాః' అను ప్రహ్లాదవచనము సుసంగతము కాదు. ప్రాయికముగా రాక్షసులందఱును శుక్రనీతిశాస్త్ర పరాయణులే. వారివలెనే ప్రహ్లాదుడును శుక్రనీతిశాస్త్ర పరాయణుడు మాత్రమే యగుచో నితరులకంటె ప్రహ్లాదునియందు విశిష్టత యేమి ? 'చుక్కలలో చంద్రునివలె నా జాతివారల నతిశయించుచున్నాను' అని చెప్పుట యెట్లు పొసగును ? ఇతడు తన జాతివారలవలె గాక త్రయీవిద్యా రసావలిప్తు డగుటయే ప్రహ్లాదుని యందలి విశిష్టత. 'ప్రకావ్య ముశనేవ బ్రువాణః (ఋ. 9-97-7)' అనుచు ఋగ్వేదము 'శుక్రునిచే ప్రోక్త మగు కావ్యము వేదము' - అని తెల్పుచున్నది కావుననే దైత్య స్వభావసిద్ధ మైన బ్రాహ్మణద్వేషము ప్రహ్లాదునకు లేదు; అట్టి విశిష్టతయే త్రైలోక్యరాజ్య దురంధరత్వమునకు మూలకందమైన ప్రహ్లాదుని శీలమునకు ప్రధానకారణ మైనది.అందుచేతనే 'నాసూయామి ద్విజాన్ విప్ర రాజాఽస్మీతి కదాచన' అని తొలుదొలుత ప్రహ్లాదుడు చెప్పుట యుక్తియుక్తముగా నున్నది. కాన ప్రహ్లాదుడు త్రయీవిద్యా రసాస్వాద కుశలుడు - అని నీలకంఠపండితుని తాత్పర్యముగ గ్రహించుట యుక్తము.

కాన బ్రాహ్మణముఖకావ్య మనగా బ్రాహ్మణులచే రచితము గాక, ప్రోక్త మగు కావ్యము— అనియే యర్థము. అట్టిది వేదమే యగుట సంప్రదాయము. ఇట్టి సంప్రదాయము లౌకికకావ్యమునకు లేదు.

ఇక పై శ్లోకమున కావ్యమునకు గల 'అమృతమ్ ; చక్షుః ;అనుత్తమమ్ ;' (న విద్యతే ఉత్తమం యస్మాత్—సాటిలేనిది) — ఇత్యాది విశేషణములు వేదకావ్యమునకే చెల్లును గాని, తత్త్వతః లౌకికకావ్యమునకు జెల్లవు. ఇంకను, దీనిని శ్రవణము జేసి ప్రవర్తించుటయే శ్రేయస్సు.(ఏత చ్ఛ్రుత్వా ప్రవర్తతే ఏతావ చ్ఛ్రేయః) అనియు జెప్పబడినది. శ్రవణ మనగా వేదవాక్యార్థ విచారము ద్వారా వేదతాత్పర్యావధారణము. 'శ్రోతవ్యో మంతవ్య' — ఇత్యాది స్థలము లందు శ్రవణ మన నీ యర్థమే గ్రహింపబడినది. అట్టి శ్రవణముచే శ్రేయస్సు సిద్ధించుట వేదకావ్య శ్రవణ సంప్రదాయమునే తెలియజేయును. ఇట్టి సంప్రదాయము లౌకికకావ్య విషయమున లేదు.

ఇట్లు ఇంద్ర-ప్రహ్లాద సంవాదమున సాక్షాత్తు వేదపదము నుచ్చరింపక వేదస్వరూప స్వభావాదుల దెలియజేయు విశేషణాదుల ద్వారా వేదము యొక్క కావ్యత్వమును భంగ్యంతరముగ బ్రతిపాదించుట భారతము నందలి కాంతాసంమితత్వమునకు దార్కాణము.

కనుక వ్యాసమహర్షి భారతమునే గాక, వేదమును గూడ కావ్యమని వివరించుట స్పష్టము.

అట్లు చెప్పుచో శాస్త్రేతిహాసముల కంటె కావ్యము విలక్షణమైనది యనెడి పూర్వోదాహృత పురాణవచనముల ననుసరించి వేదముగాని, భారతముగాని కావ్య మగుట యెట్లు? అను నాక్షేపము నిక బరిశీలింతము.

వేదగత విలక్షణ కావ్యత్వము.

శాస్త్రేతిహాసములకంటె కావ్యము విలక్షణ మైనదని యగ్నిపురాణము చెప్పుటచే నాలంకారికులలో గొందఱు వేదశాస్త్రేతిహాసాదుల కంటె విలక్షణమైన కావ్యలక్షణమును బరిష్కరించు కొనిరి. అట్టి యాలంకారికుల దృష్టిలో వేదములును, పురాణేతిహాసములును కావ్యములు గాక పోవచ్చును. కాని వ్యాసమహర్షియే వేదములను కావ్యము లని కీర్తించుట వలన నవి లౌకికకావ్య విలక్షణము లగు కావ్యము లగుట వ్యాసాభిమత మని గుర్తింప నగును.

అలంకారికులలో గూడ నుద్భట మమ్మటాదులు వేదగతవిలక్షణ కావ్యత్వమును గుర్తించియే యలంకారశాస్త్రమును బ్రవర్తింపజేసినట్లు గన్పట్టును. ఉద్భటుడు పూర్వకవి నమస్కార వ్యాజమున నీ విషయము నిట్లు వివరించుచున్నాడు.

"ఏకోఽభూ న్నలినా త్తత స్తు పులినా ద్వల్మీకత శ్చాపరః ।
తే ఏవ ప్రథితాః కవీంద్రగురవః తేభ్యో నమస్కుర్మహే ॥"

ఇట నుద్భటుడు బ్రహ్మ-వ్యాస-వాల్మీకులను కవీంద్రులకు గురువులనుగా గీర్తించి నమస్కరించినాడు. వీరు మువ్వురు వరుసగా పద్మము, పులినము, పుట్టల నుండి యుద్భవించిరి. ఈ వర్ణనము ననుసరించి యాదికవి బ్రహ్మ. తన్ముఖము నుండి యుద్భవించిన యాదికావ్యము వేదము. తరువాత కవి వాల్మీకి. ఆయననుండి వెలువడిన యాదికావ్యము రామాయణము. పిదప వెలసిన మహాకవి వ్యాసుడు. తన్ముఖ నిఃసృతమైన యాదికావ్యము పంచమవేదరూప మగు మహాభారతము. ఇవి పరస్పర విలక్షణము లైన ఆదికావ్యములు. ఈ కావ్యములే తర్వాత వెలసిన కావ్యములకు మార్గదర్శకము లయినవి. కనుక నివి లౌకికకావ్య విలక్షణములు. అందును భారత-

రామాయణములకు వేదము మార్గదర్శకము. కాన నీ రెండిటికంటె వేదము సర్వతో విలక్షణము. వేదము లపార పారావారములు. తత్ప్రాదుర్భూత ములై, తద్విలక్షణ మధురజలధారలతో ప్రవహించిన మహాస్రోతస్సులు రామాయణ-భారతములు. ఆ మహాస్రోతస్సులనుండి యేర్పడిన కుల్యలు రఘువంశాది కావ్యములు - అని చెప్ప నొప్పును. దీనినిబట్టి యీ కావ్య ములకంటె భారతాదులు, వానికంటె వేదములు పరస్పరవిలక్షణము లగుచు నుత్తరోత్తరములకు బూర్వపూర్వములు జీవనాధారము లగుట దెలియును.

వేదగత విలక్షణకావ్యత్వ మింకొక తీరుగగూడ దర్శింపవలసి యున్నది. దానిని జూతము.

వేదములు - కవులు :-

"సుపర్ణం విప్రాః కవయో వచోభి రేకం సంతం బహుధా కల్పయ న్తి" — ఋ. 10-114-5.

మేధావులగు (విప్రాః) కవులు వివిధ స్తుతిలక్షణము లగు వాక్కులతో (వచోభిః) నొకే పరమాత్మను బహుప్రకారముల గల్పించుచున్నారు - అని యర్థము. ఒకే పరమాత్మను ఇంద్ర మిత్ర వరుణాది బహుప్రకారముల గల్పించెడి యీ కవు లెవరు ? ఒకవేళ మంత్రద్రష్ట లన్నచో, వారు పరమాత్మ నెట్లు దర్శించి వివరించిరి? వారిచే గూడ నట్లు తొలుదొలుత బహుప్రకారముల దర్శింప జేసినవి వేదమంత్రములే గదా! ఇవి యపౌరుషేయము లగుటచే నిట బేర్కొనబడిన కవులు వేదమంత్రములే యగును. వేదములే పరమాత్మ స్వరూపమును వివరించుటకై బహు కల్పనలతో భాసిల్లిన వని తాత్పర్యము. వేదములకు 'కవులు' అను ప్రసిద్ధి మహాభారతమున నిట్లు గలదు.

'వాచో వికారం కవయో వదన్తి' — భార. 5-44-31.

'కవయః వికారం వాచైవ అస్తీతి వదన్తి; న స్వరూపేణా స్తీత్యర్థః। తథాచ శ్రుతిః — 'వాచారంభణ మితి' — నీలకంఠః.

'స్వరూపతః (వాస్తవముగ) వికారము లేకపోయినను, వాక్కులే వికార మున్నట్లు చెప్పుచున్నవి - యని కవులు చెప్పుచున్నారు. ఈ విషయమును - 'వాచారంభణం వికారో నామధేయం మృత్తికే త్యేవ సత్యమ్' అని శ్రుతి వివరించినది - అని పై వాక్యముల యర్థము. కాగా 'వాచారంభణము వికారము' అని ప్రతిపాదించిన కవులు వేదము లగుట జేసి యీ భారతవచనము నందలి కవులు వేదము లగుట స్పష్టము. 'వేదములు 'ఆద్యా ఋషయః' అని పూర్వము (ఋషి శబ్దమున) నిరూపింపబడినది. అందుచే ఆద్యఋషులే ఆద్యకవులు.

'ఏతే వై కవయః యద్ ఋషయః' — శ.బ్రా. 1-4-2-8.

అనుచు ఋషి-కవి శబ్దములను సమానాధికరణములుగ శ్రుతి నిర్దేశించినది. కనుక వేదములు ఆద్యఋషు లగునట్లు ఆద్యకవులు నగును. లోకమున కవులు వేఱు; తద్రచిత కావ్యములు వేఱు. ఇట వేదములే కవులు; కావ్యముగూడ వేదమే. ఇదియు వేదకావ్యమున గల వైలక్షణ్యము.

వేదకావ్యము - శ్రుతిప్రసిద్ధి :-

శ్రుతియే తనను కావ్య మని పెక్కుచోటుల నిట్లు వ్యవహరించు కొనినది.

" అయం కృత్ను రగృభీతో విశ్వజి దుద్భి దిత్సోమః।
ఋషి ర్విప్రః కావ్యేన" —ఋ. 8-79-1; తై. బ్రా. 2-4-7-6.

ఋషియు మేధావియు నగు సోముడు (పరమేశ్వరుడు) కావ్యము (వేద మంత్రము) చే స్తుత్యు డగుచున్నాడు.

" అస్మా ఇత్ కావ్యం వచ ఉక్థ మింద్రాయ శంస్యమ్"

—ఋ. 5-39-5.

వాగ్రూపము, కావ్యరూపము నగు నీ స్తోత్రము (మంత్రజాతము)ను ఇంద్రుని (పరమేశ్వరుని) కొఱకు శంసనము జేయవలెను.

" ఆత్మా యజ్ఞస్య రంహ్యా సుష్వాణః పవతే సుతః।
ప్రత్నం నిపాతి కావ్యమ్॥" —ఋ. 9-6-8; కాఠ. సం. 35-6.

ఈ మంత్రమున వేదకావ్య మతిపురాతనము (ప్రత్నం) కావ్యమ్ అనియు, యజ్ఞమునకు ఆత్మభూతు (ఆత్మా యజ్ఞస్య) డగు సోముడు (సుతః=రసః) ఈ పురాతన కావ్యమును రక్షించుచున్నట్లును కీర్తింప బడినది.

"ప్ర కావ్య ముశనేవ బ్రువాణో దేవో దేవానాం జనిమా వివక్తి।" —ఋ. 9-77-7; సా. సం. 1-524; తా. బ్రా. 14-13.

దివ్యశక్తిసంపన్ను డగు స్తోత ఉశన (శుక్ర) ఋషివలె నీ కావ్యము (మంత్రము) నుచ్చరించుచు దివ్యమైన సోమరసము ఆ యా పాత్రల బ్రవేశించు నపుడు తత్తద్దేవతావిర్భావమును వివరించుచున్నాడు.

"శ్చోతంతి ధారా మధునో ఘృతస్య। వృషా యత్ర వావృధే కావ్యేన"' —ఋ. 3-1-8.

యజమానునిచే జేయబడెడి కావ్యముచే (మంత్రరూప స్తోత్రముచే) సంతుష్టు డగుచో నపు డగ్ని మధూదక ధారలు (వృష్టిధారలు) గురియును.

'యథా యజమాన స్తోత్రేణాగ్ని స్తుష్టో భవతి తదానీం వృష్టి ర్భవతీత్యర్థః —సా. భా.

వేదకావ్యము - శాశ్వత కవిసంబంధిత్వము :-

"ని కావ్యా వేధసః శశ్వత స్కర్హస్తే దధానో నర్యా పురూణి।
అగ్ని ర్భువ ద్రయిపతీ రయీణాం సత్రా చక్రాణో అమృతాని
విశ్వా॥" —ఋ. 1-72-1; తై.సం. 2-2-12-1.

ఈ మంత్రమున శాశ్వతు డగు బ్రహ్మకు సంబంధించిన కావ్యములను (మంత్రములను) అగ్ని నియమముగ స్వాభిముఖములను జేసికొను చున్నాడు - (శశ్వతః శాశ్వతిస్య నిత్యస్య, వేధసః విధాతు ర్బ్రహ్మణః, సంబంధీని, కావ్యా కావ్యాని మంత్రరూపాణి స్తోత్రాణి, అయ మగ్నిః, ని కః నియమేన స్వాత్మాభిముఖం కరోతి) - అని చెప్పబడినది.

ఇట గమనింప వలసిన విశేషము గలదు. కావ్యములు (వేద మంత్రములు) శాశ్వతు డగు బ్రహ్మకు సంబంధించినవి యని యిట నిర్దేశింపబడినవి. కాన శాశ్వత బ్రహ్మసంబంధిత్వము వేదకావ్యముయొక్క అసాధారణ లక్షణముగా గ్రహింప నగును. ఇంతే కాదు.

'సుపర్ణం విప్రాః కవయో వచోభి రేకం సంతం బహుధా
కల్పయన్తి'
'ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే'
'ఇంద్రం మిత్రం వరుణ మగ్ని మాహు రథో దివ్యః స
సుపర్ణో గరుత్మాన్। ఏకం స ద్విప్రా బహుధా వద
న్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః'
'ఏష ఉ హ్యేవ సర్వే దేవాః'

ఇత్యాది శ్రుతివాక్య ప్రామాణ్యము ననుసరించియు, ని కావ్యా వేధసః - అను పై ఋక్కు ననుసరించియు, నా యా మంత్రములు స్థూలముగ

అగ్ని, ఇంద్ర, సోమ, వరుణాది వివిధ దేవతాపరములుగ గన్పట్టినను, ఆ మంత్రములను తత్తద్దేవతోపలక్షిత శాశ్వత బ్రహ్మ బోధకములుగ గ్రహించుట శ్రుతితాత్పర్యము. 'మంత్రముల నన్నిటిని అగ్ని స్వాభిముఖములుగ జేసికొనును' అని చెప్పబడుటచే నే యే దేవత నుద్దేశించి యే మంత్రము నుచ్చరించినను దానిని అగ్ని (పరమేశ్వరుడు) స్వాభిముఖముగ జేసికొనును - అను విషయము స్పష్ట మగుచున్నది ఇట్లు అన్ని మంత్రములును, అందలి పదములును పరమేశ్వరు నుపలక్షింపజేయు ననుట సంప్రదాయము.

ఈ విషయము దేవీభాగవత - తద్వ్యాఖ్యానము లిట్లు వివరించు చున్నవి.

"స చాత్మా స పరం బ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే।
కృషిస్తద్భక్తివచనో నశ్చ తద్దాస్యవాచకః॥
భక్తిదాస్య ప్రదాతా యః స చ కృష్ణః ప్రకీర్తితః।
కృషిశ్చ సర్వవచనో నకారో బీజ మేవ చ॥
స కృష్ణః సర్వస్రష్టా ఽఽదౌ సిసృక్షన్నేక ఏవ చ॥"

— దేవీ. భాగ. 9-2-26.

"కృష్ణ శబ్దో హి యోగరూఢ్యా గోలోకవాసి దేవతాయాం రూఢః। కేవల యోగార్థ మాదాయ తు పరమాత్మని ప్రయుక్తః। ఏవ మేవ సర్వేఽపి శబ్దా యోగరూఢ్యా తత్తద్విశేషపదార్థ వాచకా అపి యోగార్థ మాదాయ సర్వే బ్రహ్మవాచకా అపి భవన్తీతి న దోషః" — నీలకంఠః

కృష్ణశబ్దము యోగరూఢి ననుసరించి గోలోకవాసి దేవతావాచకముగ రూఢమైయున్నది, కాని యీ పదమే యోగార్థముచే పరమాత్మవాచకము గూడ నగుచుండును. ఇట్లే శబ్దము లన్నియు యోగరూఢిచేత నా యా

విశేషపదార్థములను బోధించుచునే యౌగార్థముచే నన్నియు బ్రహ్మ వాచకములు గూడ నగుచుండును - అని యర్థము.

లౌకికసంస్కృతమున 'యౌగికము - రూఢము - యోగరూఢము - యౌగికరూఢము' - అని యీ రీతిగ పదస్వరూపము ప్రసిద్ధము. ఇంచుమించుగ నిట్టి విభాగము శాస్త్రకర్త లందఱిచే నాదరింపబడినది. యౌగికార్థముతో నిమిత్తము లేకయే యా యా పదార్థముల బోధించెడి గో-మండలాది పదములు రూఢములు. లౌకికవ్యవహారమున నింతియే. వైదికశబ్దము లట్టివి కావు; అవి యౌగికములు - యోగరూఢములు మాత్రమే - యని పై నీలకంఠ వచనము వైదికసంప్రదాయమును గుర్తింప జేయుచున్నది. (సర్వేఽపి శబ్దా యోగరూఢా తత్తద్విశేష పదార్థవాచకా అపి యోగార్థమాదాయ సర్వే బ్రహ్మవాచకా అపి భవంతి). పై శ్రుతి, స్మృతి తాత్పర్యమును ఉపమాన వ్యాజమున మహాకవియగు భారవియు తన కావ్యమున నిట్లు వివరించుచున్నాడు.

"సంస్కారవత్త్వా ద్రమయత్సు చేతః ప్రయోగ శిక్షా గుణభూషణేషు।
జయం యథార్థేషు శరేషు పార్థః శబ్దేషు భావార్థ మివాశశంసే॥"
— కిరాత. 17-8.

ఇట అర్జునుడు మాయాకిరాతునిపై (శివునిపై) ప్రయోగించెడి శరములు వేదశబ్దములతో పోల్చబడినవి. కావుననే. సంస్కృతి వాక్కులకు గీర్వాణము లనియు ప్రసిద్ధి. ఇట రెంటికి లక్ష్యము శివుడే. ప్రయోగ-శిక్షా-గుణ భూషితములు గానిచో శరములు లక్ష్యమును వేధింప నేరవు. అవి నామ సార్థకతను (శృణంతి హింసంతీతి శరాః) గోల్పోవును. వైదికశబ్దములు నట్టివే. అవి సామాన్యముగ నియతార్థమును (యథార్థాః - నియతార్థాః) గలిగియుండును. గో-అశ్వ-అగ్ని-ఇంద్రాది శబ్దములు ఆ యా విశేషార్థములనే బోధించుచుండును. అవియే ప్రయోగ శిక్షా గుణ భూషితము

లగుకొలది లోకోత్తరాహ్లాదజనక మగు భావార్థము (పరమార్థము) నుద్దీపింప జేయును.

వేదవిదుడు వేదశబ్దముల యందు పరమార్థ దర్శనరూప జయమును కాంక్షించునట్లు పార్థుడును తన శరములయందు కిరాతజయమును కాంక్షించె నని తాత్పర్యము.

కాగా వైదికశబ్దములు యోగరూఢములై నియతార్థముల బోధించునవి, యోగశక్తిచే భావార్థమును (పరమార్థమును) బోధించునవి యనెడి పై శ్రుతి స్మృతి సంప్రదాయమే యిట వివరింపబడె ననుట స్పష్టము (చూ. భారతీశబ్దము).

ఇట్టి యీ సంప్రదాయము ననుసరించి వేద కావ్యమునందలి అగ్ని ఇంద్రాది శబ్దములు యోగరూఢిచే నా యా దేవతావిశేష వాచకము లయ్యును యోగశక్తిచే బరమేశ్వరవాచకము గూడ నగుచుండును. కాన శాశ్వతబ్రహ్మ సంబంధిత్వము వేదముయొక్క అసాధారణ లక్షణ మగుట నిర్బాధము. ఇట్లు వేదమంత్రజాతము, తత్ప్రతిపాద్య యజ్ఞాదికర్మజాతము, తత్తద్దేవతోపాసనాదికము, సాక్షాత్తుగ నుపనిషత్కాండయు, నన్నియు శాశ్వత బ్రహ్మసంబంధము గలవి యగుచున్నవి. చరిత్రకారులు తలచునట్లు లౌకికార్థ నియతములు గావు. ఇంతే కాదు.

పరమేశ్వరుడు కవి - కావ్యలక్షణము :-

మఱియు వేదములు పరమేశ్వరునుండి యభివ్యక్తము లగుట శ్రుతిసంప్రదాయము. పరమేశ్వరాభివ్యక్తము లగుటచేతను గూడ నీ వేద కావ్యమునకు శాశ్వతబ్రహ్మసంబంధిత్వ ముపపన్న మగుచున్నది. వేద కావ్యమును బ్రవర్తింప జేసిన పరమేశ్వరునకు శ్రుతిస్మృతులయందు కవి యను ప్రసిద్ధి గలదు.

1. గణానాం త్వా గణపతిం హవామహే కవిం కవీనామ్।
—ఋ. 2-23-1.

2. అనంత మవ్యయం కవిమ్. —తై. అ. 10-11-2.

3. కవి ర్మనీషీ పరిభూః స్వయంభూః — ఈశా.ఉ. 8.

4. వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవిత్కవిః -విష్ణు.సహస్ర.

5. కవిం పురాణ మనుశాసితారమ్ — భ.గీ.

6. పురాణస్య కవే స్తస్య — రఘు. 10-36; కుమార. సం. 2-17.

ఇంతే కాదు. శ్రుతులందు అగ్ని, ఇంద్ర, సోమ, బృహస్పతి, శుక్ర, ఆదిత్యాది దేవతలును కవిశబ్దముచే బలుచోట్ల కీర్తింపబడినారు. అందు చేతనే 'కవిం కవీనా ముపమశ్రవస్తమమ్' 'పదవీః కవీనాం' అనుచు పరమేశ్వరుని కవులలో కవిగా శ్రుతి ప్రశంసించినది. అట్టి కవినుండి యావిర్భవించుటచేతను, కవి యగు పరమేశ్వరుని తత్త్వమును ప్రతిపాదించుటచేతను - ఇట్లు కవితో నిత్యసంబద్ధమై (శాశ్వత బ్రహ్మసంబద్ధమై) వెలయుటచే వేదమునకు కావ్య మని యన్వర్థనామము.

కావుననే - 'కావ్యం ఛందః' - అను వాజసనేయశ్రుతివాక్యమును 'కవేః పరమాత్మన ఇదం కావ్యమ్ వేదత్రయీరూపం ఛందః; త్రయీ విద్యా కావ్యం ఛందః (శ.బ్రా. 8-5-2-4) ఇతిశ్రుతేః' - అని ఉవట మహీధరు లిరువురును వివరించిరి. కవి యగు పరమాత్మకు సంబంధించినది యగుటచే వేదము కావ్యము - అని యర్థము. 'కవేః పరమాత్మన ఇదం కావ్యమ్' - అను నీ కావ్యపదవ్యుత్పత్తియు వేదకావ్యమునకు 'కవి (పరమాత్మ) సంబంధిత్వము'ను నిరూపించుచున్నది. కాన కవి యగు పరమాత్మనుండి యావిర్భూతమై, కవియగు నా పరమేశ్వరుని తత్త్వమును ప్రతిపాదించుట త్రయీవిద్యారూప ఛందః కావ్య లక్షణము.

ఇంతే కాదు. శివేతరక్షతి ద్వారా పరనిర్వృతిని గలిగించి యమృతత్వమును బ్రసాదించుట వేదకావ్యముయొక్క లక్షణము; ప్రయోజనము గూడ.

> పశ్చాత్పురస్తా దధరా దుదక్తాత్ కవిః కావ్యేన పరిపాహి రాజన్।
> సఖే సఖాయ మజరో జరిమ్ణే ఒగ్నే మర్తాగ్ం అమర్త్య స్త్వం నః॥
> —ఋ. 10-87-21.

ఓ రాజా! క్రాంతదర్శనుడవై కవి వగు నీవు నీ కావ్యముతో (కవి కర్మ యగు వేదకావ్యముతో) నలువైపుల యుపద్రవములనుండి కాపాడుము. సఖుడా! నీవు జరారహితుడవు. నీతోడను, వేదకావ్యముతోడను, సఖ్యమొనర్చు సఖుడ నైన నన్ను గూడ జరారహితుని గావింపుము. ఓ యగ్నీ! నీ వమర్త్యుడవు. మర్త్యులమగు మమ్ము నమర్త్యుల గావింపుము- అని యర్థము.

ఈ మంత్రమున కావ్య మనగా కవికర్మ యని వివరింపబడినది. 'కవేః కర్మ కావ్యమ్'—అనియు నిర్వచనము ప్రసిద్ధము. ఇట నలువైపుల యుపద్రవముల నిర్మూలించుటచే శివేతరక్షతియు, కవి యగు పరమేశ్వరునితోను, వేదకావ్యముతోను సఖ్యము జేయుకొనుటచే పరనిర్వృతియు, తన్మూలమువ జరామరణ ప్రవాహరూప సంసారనివృత్తియు సిద్ధించును; ఇదియే వేదకావ్యమువలన సిద్ధించెడి యమృతత్వము. ఇట్లు శివేతరక్షతిని, పరనిర్వృతిని (అమృతత్వము) గల్గించుట త్రయీవిద్యారూప ఛందః కావ్య ప్రయోజనము. వేదకావ్యము నాదరించుటవలన గలిగెడి ప్రయోజనముల నింకను ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

> "యః సమిధా య ఆహుతీ యో వేదేన దదాశ మర్తో
> అగ్నయే। యో నమసా స్వధ్వరః॥"

"తస్యే దర్వన్తో రంహయన్త ఆశవ స్తస్య ద్యుమ్నితమం యశః।
న త మంహో దేవకృతం కుతశ్చన న మర్త్యకృతం నశత్॥"
— ఋ. 8-19-5. అ.

సమిధలతో, ఆహుతులతో, వేదము (వేదాధ్యయనముతో)తో, యజ్ఞాదులందు చరుపురోడాశాదులతో నెవ డగ్నిని సేవించునో యాతని యింద్రియములు (ఆశవః అర్వన్తః) తీక్ష్ణము లగును; ఐశ్వర్యవంతుడై యశస్సును (ద్యుమ్నితమం యశః) గాంచును. దేవ మనుష్య కృత పాపముల బొందడు - అని యర్థము.

వేదవిదు డగువాడు సభలలో శోభించును; ఆతనితోకి వాదమునకు వెఱతురు (నైనం హిన్వన్త్యపి వాజినేషు - ఋ. 10-71-5; నిరు. 1-20) అని పూర్వము వివరింపబడినది. కాన వేదాధ్యయనాదుల ద్వారా వేదమును బరిచరించుచో ఇంద్రియదీప్తి, యశఃప్రాప్తి, పాపనివృత్తి మున్నగు ప్రయోజనములు ప్రాప్తించు నని పై మంత్రము వలన దెలియును.

కావ్యం యశసే ఒర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే।
సద్యః పరనిర్వృతయే కాంతాసంమితత యోపదేశయుజే॥

అనుచు నాలంకారికులును - యశస్సు, అర్థప్రాప్తి, వ్యవహారవిజ్ఞానముల తోపాటు శివేతరక్షతి, సద్యఃపరనిర్వృతియు కావ్యప్రయోజనము లని పేర్కొనిరి. అందును సద్యఃపరనిర్వృతియే కావ్యముయొక్క పరమ ప్రయోజన మని మమ్మటాదులు బేర్కొనిరి. కాన ఆలంకారికులు చెప్పిన కావ్యప్రయోజనము శ్రుతిసంప్రదాయానుగుణ మగుట స్పష్టము.

వేదకావ్యలక్షణము : ఆలంకారికులు :-

పైన బేర్కొనిన వేదకావ్యలక్షణము (కవే రిదం కావ్యమ్) ను ఆలంకారికులును, మహాకవులును, నచటచట వాగ్దేవతాస్తోత్ర వ్యాజమున భాసింపజేయుటయు గమనార్హము.

"నియతికృత నియమరహితాం
హ్లాదైకమయీ మనన్య పరతంత్రామ్ ।
నవరసరుచిరాం నిర్మితి
మాదధతీ భారతీ కవే ర్జయతి॥" — కావ్యప్రకాశ.

కావ్యప్రకాశకర్త యగు మమ్మటుడు గ్రంథారంభమున నీ శ్లోకముతో వాగ్దేవతా నమస్కారరూప మంగళ మాచరించినాడు. అందు బ్రహ్మసృష్టి కంటె కవిభారతి యందని వైలక్షణ్యము నీ కవి దర్శింపజేయుచున్నట్లు లౌకిక కవిభారతి పరముగ వ్యాఖ్యాత లీ శ్లోకము నిట్లు వివరించిరి.

'లౌకికకవి యొక్క భారతి ప్రకృతినియమముల కతీతమైనది. బ్రహ్మసృష్టియగు ప్రకృతి యందు పద్మమునకు సౌరభము నియతమై యుండును; పద్మ మున్నచో గంధ ముండవలెను – ఇది నియతికృత నియమము; కవిసృష్టి యగు ముఖపద్మమునకు లోకసిద్ధ సౌరభముతో బని లేదు; అది కవిప్రతిభా కల్పిత సౌరభవిశేషముచే విరాజిల్లును; కవి సృష్టి యిట్లు నియతికృత నియమరహితము. బ్రహ్మసృష్టి నియతముగ సుఖదుఃఖ మోహస్వరూపము; పరమాణ్వాది కారణపరతంత్రము; కట్వా మ్లాది షడ్రసమయము; కవిసృష్టి యట్లు గాదు. అది ఆనందైకమయము; కేవల కవిప్రతిభాసిద్ధ మగుట జేసి యనన్య పరతంత్రము; శృంగారాది నవ రసోజ్జ్వలము. ఇట్లు బ్రహ్మసృష్టికంటె విలక్షణమై కవిసృష్టి యొప్పా రును'— అని వ్యాఖ్యాతల యభిప్రాయము.

కాని పై శ్లోకమును బరిశీలించిన నందలి విశేషణములు తత్త్వతః కవిభారతి – కవి యగు పరమేశ్వరునుండి యావిర్భవించిన భారతి – యగు వేదకావ్యమునకే చెల్లును. ఏలయన—

నియతికృత నియమరహితా - అనన్యపరతంత్రా :-

(1) ఆ భారతి (వేదము) నియతికృత నియమరహితము. లౌకికకావ్యమున కట్లు గాదు. దానికి కర్త యొక డుండవలెను. కవి వేఱు; తద్రచిత కావ్యము వేఱు. వేద మట్లు గాదు. అదియే కవియు కావ్యము గూడ.

(2) లౌకికకావ్యము శబ్దానుశాసనాది శాస్త్రనియమ పరతంత్రము; ఇది నియతికృత నియమము. వేదకావ్య మట్టిది కాదు. ఆమెయే నియతి. ఆమెయే లౌకికవ్యవహారమునకు, లౌకికకావ్యములకును, శబ్దానుశాసనాదుల కును వలయు వాఙ్మయమును నియమపూర్వక సంప్రదాయముల ననుగ్ర హించినది. 'ఛందోవ త్కవయః కుర్వన్తి; ఛందోవ దృషయః కుర్వన్తి' అని యనుచు పతంజలిమహర్షి కవులకును, ఋషులకును 'సంప్రదాయాను గ్రాహకము వేదమే' యను విషయము నభివ్యక్తము జేసినాడు.

అనాది నిధనా నిత్యా వా గుత్సృష్టా స్వయంభువా ।
ఆదౌ వేదమయీ దివ్యా యతః సర్వాః ప్రవృత్తయః ॥
నామరూపే చ భూతానాం కర్మణాం చ ప్రవర్తనమ్ ।
వేదశబ్దేభ్య ఏవాదౌ నిర్మమే స మహేశ్వరః ॥
సర్వేషాం తు స నామాని కర్మాణి చ పృథక్పృథక్ ।
వేదశబ్దేభ్య ఏవాదౌ పృథ క్సంస్థా శ్చ నిర్మమే ॥ —మనుస్మృతి.

ఇట్లు స్మృతులును వేదములయొక్క అనన్య పరతంత్రత్వమును, తదితర మగు లోకవ్యవహారమునకు వేదపరతంత్రత్వమును వివరించుచున్నవి.

"జనానాం సౌభాగ్యం సుఖ మమృతరూపం కలయితుం
పురాణానాం వ్రాతం స్మృతిశత మమీ కావ్యనివహాః ।

యత స్త్వాం సర్వజ్ఞాం ఖలు సమనుయంతి ప్రతిపదం
తతః సమ్రాజ్ఞీ త్వం భువి విజయసే ఒనన్యవిభవా॥"
— వేదమాతృ స్తవః.

పై ప్రమాణముల వలన కవిభారతి యగు వేదము అనన్యపరతంత్రము, నియతికృత నియమరహితము అని కీర్తింపబడుట యుక్తమే.

హ్లాదైకమయీ :-

'బ్రహ్మసృష్టి నియతముగా సుఖదుఃఖ మోహస్వరూపము; లౌకిక కవిభారతి యట్లు గాక ఆనందైకమయము' - అని చెప్పబడినది. లౌకిక కావ్యములు ఆనందస్ఫూర్తిని కలిగించుట నిజమే. కాని ఆ యానందము తత్కాలమాత్ర పర్యాప్తము. అది యలౌకిక విభావాది సామగ్రీ సముల్లసిత రత్యాది సంవలితమై భాసించు నని చెప్పబడుట జేసి విషయానందమే యగును. వేదకావ్యమును జాతము. ఇది జిజ్ఞాసువుల దృష్టిని సుఖదుఃఖ మోహస్వరూప ప్రకృతినుండి శాశ్వత బ్రహ్మరసానందము వైపు మరల్చుటకై యవతరించినది. తైత్తిరీయ శ్రుతి 'సైషా ఽఽనందస్య మీమాగ్ంసా భవతి' యనుచు ఆనందమీమాంస జేసినది. అందు ప్రాకృతజనులు పొందెడి యానందముకంటె సార్వభౌమానందము ఉత్కృష్టము. దానికి మానుషానంద మని పేరు - 'స ఏకో మానుష ఆనందః'. దానికంటె మనుష్యగంధర్వుల యానందము నూఱురెట్లు ఉత్కృష్టము. ఇట్లు దేవగంధర్వ - పితృలోక - ఆజానజదేవ- కర్మదేవ- దేవ-ఇంద్ర-బృహస్పతి-ప్రజాపతి (విరాట్టు)-బ్రహ్మ (హిరణ్యగర్భుడు) లయొక్క యానందములు క్రమముగ శతగుణోత్తరోత్తరోత్కర్ష గలవి యని శ్రుతి వివరించినది. ఆ యానందము లన్నియు, తుదకు హిరణ్యగర్భానందము కూడ కామోపహతుడుగాని - రాగద్వేషవర్జితు డగు

శ్రోత్రియుడు పొందెడి యానందముకంటె భిన్న గాదు – (శ్రోత్రియస్య చాకామహతస్య) అని యుపసంహారము జేసినది. శ్రోత్రియు డనగా నియమపూర్వకముగ ఫలవదర్థావబోధ పర్యన్తము వేదాధ్యయనము జేసిన యతడు.

పాణినిమహర్షియు 'శ్రోత్రియ శ్ఛందో ఽధీతే' యను సూత్రముచే శ్రోత్రియస్వరూపము నిట్లే వివరించినాడు.

"యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్।
తృష్ణాక్షయ సుఖ స్యైతే నార్హతః షోడశీం కలామ్॥"

అనుచు స్మృతులును తృష్ణాక్షయ సుఖమున కే సుఖముగూడ సాటిరాదని జెప్పినవి. ఈ యానంద ముపాధిభేదముచే భిన్నముగా గన్పట్టును గాని వాస్తవమున కొకటియే యను విషయమును 'స యశ్చాయం పురుషే యశ్చాసా వాదిత్యే స ఏకః' అనుచు శ్రుతి వివరించినది. అట్టి యానందమే జిజ్ఞాస్యము; జ్ఞేయము. కామోపహతుడుగాని శ్రోత్రియుడు – తత్త్వజ్ఞాని – పొందెడి యానంద మిదియే. శ్రుతియు 'యే విద్వాగ్ంస స్తే కవయః' (వా. సం. 12–67; శ.బ్రా. 7–2–2–4) 'శుశ్రువాగ్ంసో హి కవయః' (తై.బ్రా. 3–2–2–3) అని యనుచు నట్టి విద్వాంసులనే కవులని కీర్తించినది. ఆ లోకోత్తరాహ్లాదమే రమణీయార్థము. అట్టి రమణీయార్థమును ప్రతిపాదించెడి దగుటచే వేదవాక్కు తత్త్వవిదః హ్లాదైకమయి యగు కవిభారతి – యన జెల్లును. మఱియు లౌకికకావ్యముచే గలిగెడి యానందమే గాదు, హిరణ్యగర్భానందము గూడ నా యానందము యొక్క లేశమే యనియు శ్రుతి వివరించినది.

'ఏషో ఽస్య పరమ ఆనంద ఏతస్యైవానందస్యాన్యాని భూతాని మాత్రా ముపజీవన్తి' –

ఆనందము యొక్క లేశమును స్ఫురింప జేయుటచేతనే లౌకిక కవిభారతి 'హ్లాదైకమయీ' యని కీర్తింపబడుచో పూర్ణ రసానంద స్ఫూర్తిని గలిగించెడి వేదవాక్కు హ్లాదైకమయి యగు కవిభారతి యగుట నిర్బాధము.

నవరసరుచిరా :-

ప్రకృతి కల్యాణ్ల్హాది షడ్రసమయము ; కవిభారతి యట్లుగాక శృంగారాది నవరసోజ్జ్వలము — అని చెప్పబడినది. లౌకిక కవిభారతీ పరముగ జెప్పుచో నంతియే. లౌకిక - కావ్య - లక్షణముల నిర్దేశించుటకై కావ్యప్రకాశికా గ్రంథమును బ్రవర్తింపజేయుచు గ్రంథకర్తచే జేయబడిన యాదిమ మంగళశ్లోక మిది. అందు బ్రహ్మ సృష్టి కంటె లౌకిక కవిభారతి యొక్క యుత్కర్ష జెప్పుటయే కవి తాత్పర్య మగుచో నది వాగ్దేవతా స్తోత్ర మనుటకు వీలులేదు. అట్టియెడ గ్రంథాది మంగళశ్లోకము గానేరదు. ఈ శ్లోకముచే లౌకిక కవిభారతీ వైశిష్ట్యస్ఫూర్తి గలిగిన గలుగ వచ్చును. కాని లౌకిక కవిభారతికి ప్రేరయిత్రి యగు వాగ్దేవత, లేక వేదవాణి 'నవ రసరుచిరా' - నిత్య నిరతిశయ పూర్ణ రసానందోజ్జ్వలయను నర్థస్ఫూర్తిని గలిగించి, యామె సర్వోత్కృష్టమును గీర్తించు మంగళశ్లోక మనుట యందే కవిసంరంభ విశ్రాన్తి యన నగును. అట్లు రెండర్థములు స్ఫురింపు టకే మమ్మటుడు సామాన్యముగ 'భారతీ కవేర్జయతి' యనినాడు. కవిభారతి యన లౌకికకవిభారతియు, కవియగు పరమాత్మయొక్క భారతియు గావచ్చును. అట్టియెడ నీ మంగళశ్లోక మప్రియత్నముగా 'కవేః ఇదం కావ్యమ్' అనెడి వేదకావ్యలక్షణమును స్పష్టముగా భాసింపజేయుట సహృదయ హృదయామతము.

వేదకావ్య లక్షణము - మహాకవులు :-

భవభూతి మహాకవియు ఉత్తరరామచరితనాటక - ఆది మంగళశ్లోకమున పై వేదకావ్యలక్షణము నిట్లు స్ఫురింప జేసినాడు.

''ఇదం కవిభ్యః పూర్వేభ్యో నమోవాకం ప్రశాస్మహే।
వందేమహి చ తాం వాణీ మమృతా మాత్మనః కలామ్॥"

ఈ శ్లోకమున నిర్దేశింపబడిన పూర్వకవులు ఎవరు ?

వ్యాసవాల్మీకాదు లని వ్యాఖ్యాతలు కొందఱు వివరించిరి. కాని మొదట లౌకికకవులకు నమస్కరించి, వారల గూడ ననుగ్రహించెడి యమృత కలాస్వరూపిణి యగు వాగ్దేవతకు (వేదవాణికి) నమస్కరించుట సంప్రదాయము గాదని ఘనశ్యామాది వ్యాఖ్యాతల యభిప్రాయము. వ్యాస వాల్మీకాది మహాకవులకంటెను పూర్వకవులు వైదికకవులే యని యిట్లు వ్యాఖ్యానించిరి.

'పూర్వేభ్యః పురాతనేభ్యః అలౌకికేభ్య ఇత్యర్థః; వైదికేభ్య ఇతి యావత్, వేదానాం లోకపూర్వత్వా దితి భావః। కవిభ్యః గణపతయే ఇత్యర్థః, గణపతిం హవామహే కవిం కవీనా మితి శ్రుతేః, కవిః శుక్ర గజాననా వితి జయః। బహువచనం తు పూజాయామ్' — ఘనశ్యామ టీక.

కాన నిట పేర్కొనబడిన పూర్వకవులు వైదికకవులే. కాని యిట ఘనశ్యామ టీకయందు లౌకికకవులకంటె పూర్వు లగు వైదికకవులనే గ్రహింప వలె నని చెప్పి యా వైదికకవి గణపతి; బహువచనము పూజార్థము - అని వివరింపబడినది. బహుశః కావ్యరూపము లగు వేదమంత్రములకు 'కవులు' అను ప్రసిద్ధి యెట్లని తలచి వేదమంత్ర ప్రవర్తకు డగు నా బ్రహ్మణస్పతినే పూర్వకవిగా గ్రహించి యుండవచ్చును. కాని యా పక్షమున 'కవిభ్యః - పూర్వేభ్యః' అను బహువచనము సార్థకము కాదు. కనుక బహువచన స్వారస్యముచే వేదమంత్రములనే పూర్వకవులుగా గ్రహించుట యుక్తతరము. వేదమంత్రములు కవు లగుట పూర్వము వివరింపబడినది.

మఱియొక విశేషము. ఈ శ్లోకము మొదటి పాదమున 'కవిభ్యః పూర్వేభ్యో నమోవాకం ప్రశాస్మహే' అనిన చాలును గదా? ఇదం శబ్దము ఎందుకు? దానిచే గ్రంథాది మంగళశ్లోకమున కవి యుద్దేశించిన ప్రయోజనమేమి? యని పరిశీలించిన నా శబ్దమున కెట్టి ప్రత్యేకప్రయోజన మున్నటుల వ్యాఖ్యాతలు వివరింప లేదు. కాని యా శబ్దప్రయోగ మవట విప్రయోజనమా? కాదు. సూక్ష్మముగ బరిశీలించుచో నట్లు 'ఇదం' శబ్దపూర్వక నమస్కారాచరణము వేదసంప్రదాయానుగుణ మగుట దెలియును.

'ఇదం నమో వృషభాయ స్వరాజే'

— ఋ. 1-51-15; మై. సం. 4-14-14;

'ఇదం నమో రుద్రాయ ప్రేష్ఠమ్' — ఋ. 7-36-5.

'ఇదం నమో దేవేభ్యః' — మై. సం. 4-13-9; 212-13.

'ఇదం నమో దేవేభ్యః' — తై. సం. 2-6-9-8, శ. బ్రా. 1-9 1-23; తై. బ్రా. 3-5-10-5.

పై మంత్రములందు 'ఇదం' శబ్దపూర్వక నమస్కారాచరణము గాన నగును. ఇంతే గాదు.

'ఇదం నమ ఋషిభ్యః పూర్వజేభ్యః పూర్వేభ్యః పథికృద్భ్యః'

—ఋ. 10-14-15; అ. సం. 18-2-2; తై. ఆ. 6-5-1.

ఈ మంత్రముయొక్క ప్రతిరూపమే— ఇదం కవిభ్యః పూర్వేభ్యః— అనెడి భవభూతి మహాకవి వాక్య మనవచ్చును. ఆ శ్రుతివాక్యమే కొలది మార్పులతో నిట శ్లోకముగా రూపొందినది యని స్ఫూర్తి కలిగించుటకే యా కవి మొదట 'ఇదం' శబ్దము నిలిపి యుంచుట యని తెలియ నగును. కాని

వాణీం' అని తత్ శబ్దముచే బరామర్శించి — ఆత్మనః కలామ్ — ఆత్మ కలాస్వరూపిణి — యని కీర్తించి నమస్కరిలచినాడు. వాణి యాత్మ యొక్క కళ యనుచో నైన జెప్పిన 'కవేః పరమాత్మన ఇదం కావ్యమ్'— అనెడి వేదకావ్యలక్షణము యొక్క స్ఫూర్తి గలుగుచునే యున్నది.

ఇంతే కాదు, మహాకవి యగు భారవియు నింద్రవాక్య ప్రశంసా వ్యాజమున వేదవాక్కు యొక్క లక్షణముల నిట్లు వివరించినాడు.

ప్రసాదరమ్య మోజస్వి గరీయో లాఘవాన్వితమ్।
సాకాంక్ష మనుపస్కారం విష్వగ్గతి నిరాకులమ్॥
న్యాయనిర్ణీతసారత్వా న్నిరపేక్ష మివాగమే।
అప్రకంప్యతయాన్యేషా మామ్నాయ వచనోపమమ్॥

— కిరాతార్జునీయమ్. 11-38, 39.

ఇంద్రవాక్యమువలె ఆమ్నాయవచనము ప్రసాదరమ్యము: ఓజోగుణ యుక్తము; అర్థగాంభీర్య విలసితము (శబ్దాడంబరము లేక యర్థవత్తరము); లాఘవాన్వితము (విస్తరదోష రహితము); విష్వగ్గతి (శతపథమై కృత్స్నార్థ ప్రతిపాదకము); నిరాకులము (అసంకీర్ణార్థ ప్రతిపాదకము); మీమాంసా న్యాయములచే నిర్ణీతమైన యర్థముతో నొప్పి స్వతంత్ర మైనది; కావుననే యనుమానాది ప్రమాణములకు చలింపనిది— అని యర్థము.

ఇందు ప్రసాదరమ్యం, ఓజస్వి — ఇత్యాది విశేషణములచే వేదమునకు గల కాంతాసంమితత్వము; సాకాంక్షం, అనుపస్కారం, విష్వగ్గతి, నిరాకులం, న్యాయనిర్ణీతసారం— ఇత్యాది విశేషణములచే సుహృత్సంమితత్వము; నిరపేక్షం, అప్రకంప్యం— అను విశేషణములచే ప్రభుసంమితత్వమును సూచితము లగుచున్నవి. హేతువాదములకు చలింపనిది కావుననే— అషాఢాసి సహమానా.... సహస్రవీర్యాసి (వా.సం. 13–26)

యనియు 'శతవ్రజా రిపుణా నావచక్షే' (వా.సం. 17-93) యనియు శ్రుతి వేదవాక్కును గీ ర్తించుట గమనార్హము. (చూ. ఋషి, వషట్కార శబ్దములు)

కాన (1) కవియగు పరమేశ్వరుని నుండి యావిర్భవించుట (2) తానే కవిశబ్ద వ్యపదేశ్య మగుట (3) ఎరుగదగువ కవి యగు పరమేశ్వరుని తత్త్వమును ప్రతిపాదించుచు కవిసంబద్ధమై కావ్య మని యన్వర్థనామము ధరించుట (4) ప్రభు - సుహృత్ - కాంతాసంమితమై యొప్పుటయు త్రయీవిద్యారూప ఛందః కావ్య లక్షణము. లౌకిక కావ్యములకంటె వేదకావ్యము నందలి వైలక్షణ్య మిట్టిది ఇంతే కాదు.

వేదకావ్య-లౌకికకావ్యములు _ సామాజికులు:

లౌకికకావ్య రసాస్వాదము చేయువారు సహృదయు లగు సామాజికులు. వారు కవులు గా నక్కఱ లేదు. వేదకావ్యమట్టిది కట్టు గాదు. వేదకావ్య రసాస్వాదము చేయువారు ఆత్మవిదులగు కవులు; అట్టి కవులే వేదకావ్య రసాస్వాదము జేయగల వారు- అని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

> "వాచో వీర్యం తపసా ఒన్వవిందత్": 'చతుర్హోతౄణా మా త్మానం కవయో విచిక్యుః': 'వాయో రాత్మానం కవయో నిచిక్యుః': 'హృదా పశ్య న్తి మనసా మనీషిణః': 'సముద్రే అంతః కవయో విచక్షతే' 'తాం ద్యోతమానాగ్ం స్వర్గ్యం మనీషాం, 'ఋతస్య పదేకవయోనిపాంతి.'
>
> — తై. ఆ. 3-11; ఋ. 10-177-1-2, (చూ. స్వరాశబ్దము. స్వర్గ్య)

పై శ్రుతివాక్యముల వలన ఆత్మవిదులు కవులు; వారు వేదకావ్య రసాస్వాదము జేయగలవా రని స్పష్ట మగును. ఈ విషయమునే శ్రీ మద్భాగవతము నిట్లు చెప్పుచున్నది.

"శాబ్దస్య హి బ్రహ్మణ ఏష పంథా యన్నామభి ర్ధ్యాయతి ధీ రపార్థైః
పరిభ్రమం స్తత్ర న విందతేఽర్థాన్ మాయామయే వాసనయా శయానః॥
తతః కవి ర్నామసు యావ దర్థః స్యా దప్రమత్తో వ్యవసాయబుద్ధిః
సిద్ధే ఽన్యథార్థే న యతేత తత్ర పరిశ్రమం తత్ర సమీక్షమాణః॥"
—భాగ. 2-2. 2,3.

కవి గానియతడు శబ్దబ్రహ్మరూప వేదవాక్యముల కపార్థముల గల్పించుకొని మాయావాసనా జాలమున జిక్కుకొనును; ఆ యర్థములనే సదా భావన జేయుచు బరిభ్రమించుచుండును; కాని పురుషార్థముల నొందలేడు; పిదప కవి యగు విద్వాంసుడు వేదశబ్ద నిహిత యావదర్థము నప్రమత్తతతో నిశ్చయించును; అపార్థముల భావనజేయుట వృథాశ్రమ యని గుర్తించి వానివైపు పోడు — అని యర్థము.

ఇట్లు శ్రుతిస్మృతులయందు కవియే వేదశబ్దార్థము (వాచో వీర్యం) నప్రమత్తతతో నిశ్చయించి నిర్వృతి నొందుచుండు నని చెప్పబడినది. కాని యీ కవి యెవరు? వేదవిహిత కర్మానుష్ఠానముచే జిత్తశుద్ధి నొంది సాధనచతుష్టయ సంపన్నుడై గురూపదేశానుసారము వేదకావ్యములతో జెలిమి చేయుచు తదర్థభావన జేయు మహాభక్తు డగు విద్వాంసుడే —క్రాంత దర్శియే — కవి. అట్టి యతడే వేదకావ్య రసాస్వాదపరు డగుట (వాగగ్రి విద్యానాం రసానా మవలేపితా) యింద్ర ప్రహ్లాద సంవాదమున స్పష్టమైనది. ప్రహ్లాద నారద పరాశరాదు లట్టివారు.

"య మంతః సముద్రే కవయో వయన్తి, త దేవ బ్రహ్మ
పరమం కవీనామ్" —తై. ఆ. 10-1-1.

"ఋగ్భి రేతం యజుర్భి రంతరిక్షం సామభి ర్యత్ త త్కవయో
వేదయన్తే" —ప్రశ్న. ఉ. 5-7.

ఇత్యాది శ్రుతులు అధ్యాత్మ తత్త్వవిదులు కవు లని చెప్పుచున్నవి.

భాగవతముగూడ అధ్యాత్మ తత్త్వవిదుని కవిగా నిట్లు పేర్కొను చున్నది.

''అహం భవా న్నచాన్య స్త్వం త్వ మేవాహం విచక్ష్వ భోః।
న నౌ పశ్య న్తి కవయ శ్ఛిద్రం జాతు మనా గపి॥'' —భా.4-28-62,

నేనే నీవు: నీవే నేను; వేఱు కాదు; కవులు మన యిరువురిలో నేమాత్రము నంతరమును (భేదమును) గాంచరు - అని యర్థము. అధ్యాత్మ తత్త్వ విదుడు 'కవి' యగుట యీ శ్లోకములవలన స్పష్టము.

యజ్ఞప్రవర్తకులు, ఋత్విజులు నగు నట్టి విద్వాంసులను కవులుగా శ్రుతి కీర్తించినది.

"సీరా యుంజ న్తి కవయః యుగా వితన్వతే పృథక్।
ధీరా దేవేషు సుమ్నయా।"
— ఋ. 10-101-4; వా.సం. 12-67; తై.సం. 4-2-5-5.

ఈ మంత్రమున యజ్ఞకర్మకుశలురు, దేవతాధ్యాన సమాహితచిత్తులు (ధీరాః) నగు కవులు (ఋత్విజులు) దేవహితార్థమై నాగలి బట్టుట వర్ణింప బడినది.

"యే విద్వాంస స్తే కవయః" —శ.బ్రా.7-2-2-4.

అనుచు శతపథశ్రుతి పై మంత్రము నందలి కవులను విద్వాంసులనుగా కీర్తించినది. కాన విద్వాంసు లగు కవులే, వారే పనిని జేయుచున్నను. వేదకావ్య రసాస్వాద కుశలు రగుట శ్రుతి, పురాణ సంమతము. అట్టి కవు లనుభవించు ఆత్మానుభూతియే రసానుభూతి యని 'రసో వై సః' అను శ్రుతివలన వ్యక్త మగుచున్నది. అదియే రమణీయార్థము. 'రమణీ

యార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్'- అనెడి యాలంకారికుల కావ్యలక్షణము నకు తత్త్వతః లక్ష్యము వేదకావ్యమే.

కావ్యజీవితము - ఆలంకారికులు :-

కాని యొక విశేషము. కవియే వేదకావ్య రసాస్వాద సమర్థుడు. అందఱు నట్టి కవులు గా జాలరు. అందుచే నిత్యము నిరతిశయము నగు బ్రహ్మానందానుభవము నెల్లరచే దిఙ్మాత్రముగా నైన గుర్తింప జేయుటకై మహాకవులు లోకోపకార బుద్ధితో నేర్పరచిన వెలుగుబాటలే లౌకిక కావ్యములు. ఆ కారణముచేతనే యీ లౌకిక కావ్యార్థ భావనచే సామాజికుడు బొందు నిర్వృతి 'బ్రహ్మానంద సబ్రహ్మచారి' యని యాలంకారికులచే బేర్కొనబడినది. కావున నట్టి రసమే కావ్యజీవితము.

కావ్యజీవిత విషయమై కూడ నాలంకారికుల యభిప్రాయమును జూతము.

అగ్నిపురాణము, భరతనాట్య శాస్త్రము రెండును కావ్యజీవితము 'రసము' అని పేర్కొనినవి. నాట్యశాస్త్ర వ్యాఖ్యాన మగు అభినవభారతి యందు నభినవగుప్తుడు రసవాదమును బాగుగ పోషించినాడు. కాని తరువాత క్రమముగ భామహ, ఉద్భట, దండి, రుద్రట, ప్రతిహారేందు రాజాదులు అలంకారమునకే ప్రాధాన్యము నంగీకరించి రని చెప్పవచ్చును. పూర్వుల కాదని, వామనుడు క్రొత్తమార్గము త్రొక్కినాడు.

> 'రీతి రాత్మా కావ్యస్య। విశిష్ట పదరచనా రీతిః। విశేషో గుణాత్మా' — కావ్య.సూ. 1-2-6 నుండి 8.

రీతియే కావ్యాత్మ యని వామనుని యభిప్రాయము. కుంతకుడు వక్రోక్తి (వైదగ్ధ్య భంగీ భణితిః)ని కావ్యాత్మగా నిరూపించినాడు. పై వాదముల

త్రోసి రాజని ఆనంద వర్ధనుడు ధ్వని (వ్యంగ్యార్థము)ని కావ్యాత్మగా గ్రహించి, యది ప్రాచీనసంమత మగుటయు వివరించినాడు. ఈ వ్యంగ్యార్థమును అనుమానమునం దంతర్భావము జేయవచ్చు ననుచు నీ వాదము నెదుర్కొనినది మహిమభట్టు. కాని యీ వాదమునకు తరువాత ఆశ్రయము లభింపలేదు. ఆలంకారికు లందఱు మహిమభట్టు వాదమును ఖండించి 'ధ్వని'కే పట్టము గట్టిరి. కాని మూడు విధము లగు 'వస్తు-అలంకార-రస' ధ్వనులలో రసధ్వనికే ప్రాధాన్యము నంగీకరించిరి.

ఇట్లు కావ్యజీవిత విషయమై యెన్ని వాదములు నొకదాని వెంట నొకటి క్రమముగ బయలుదేరినను తుదకు అగ్నిపురాణ, నాట్యశాస్త్ర ప్రోక్త మగు 'రసాత్మ' వాదమే నిలిచినది.

అభినవగుప్తుడు-రసస్వరూపము-లక్ష్యము :-

శ్రుతిసిద్ధమైన రసస్వరూపమును దర్శింపజేయుటయే యాలంకారికుల తాత్పర్యము. ఈ విషయమై యభినవగుప్తుని యభిప్రాయమిది.

"ఆమ్నాయసిద్ధే కి మపూర్వ మేతత్
సంవిద్వికాసే ఽధిగతాగమిత్వమ్।
ఇత్థం స్వయంగ్రాహ్య మహార్ఘహేతు
ద్వంద్వేన కిం దూషయితా న లోకః॥

ఈ రసతత్త్వము నూతనము గాదు. ఆమ్నాయసిద్ధము. ఈ వైదిక సిద్ధాంతమును ఖండించుటకు కొందఱాచార్యులు ప్రయత్నించిరి. అందుచే నా ప్రాచీనాచార్యుల మతముల పట బర్యాలోచనము జేయవలసి వచ్చినది. ఇది పర్యాలోచనమే గాని వారి మతఖండనము గాదు. ఆమ్నాయ సిద్ధాంతము నీ రీతిగ బర్యాలోచన చేయుట లోపముగా నెన్నబడదు. ఇట్టి మతముల

పర్యాలోచనము జేయు కొలది శ్రుతిసిద్ధార్థము సుష్ఠు పరామృష్టమై దాని వాస్తవిక ప్రామాణిక స్వరూపము కన్నుల గట్టిన ట్లగును. అట్లుగాక ఆమ్నాయ సిద్ధార్థమునే ఖండించుటకు ప్రయత్నము జేయుచో స్వతః ప్రమాణభూత వేదసిద్ధార్థ ఖండనకు బూనుకొనువాడు దూషితుడు కాడా? ఆమ్నాయసిద్ధార్థము నపలపించుటకు శక్యము కాదు- అని భావము.

"ఊర్ధ్వోర్ధ్వ మారుహ్య యదర్థతత్త్వం
ధీః పశ్యతి శ్రాంతి మవేదయంతీ।
అలం తదాద్యైః పరికల్పితానాం
వివేక సోపాన పరంపరాణామ్"

ప్రాచీనాచార్యుల మతముల బర్యాలోచన సేయుకొలది విచార్యమాణార్థము యొక్క యథార్థస్వరూపము గోచర మగును. ప్రాచీనాచార్య విచారధారలు పరమార్థప్రాప్తికి సోపానపరంపరలు. పరమార్థము గోచరింపగనే సోపానాత్మక ప్రాచీన మతములతో బని లేదు.

"చిత్రం నిరాలంబన మేవ మన్యే
ప్రమేయసిద్ధౌ ప్రథమావతారమ్ ।
తన్మార్గ లాభే సతి సేతుబంధ
పుర ప్రతిష్ఠాది న విస్మయాయ ॥

లోకమున గన్పట్టు ప్రమేయ పదార్థముల కన్నింటికి నేదో యొక యాధారము—మూలము—గన్పట్టును. కాని యా మూలమునకు మూల ముండదు. 'మూలే మూలాభావా దమూలం మూలమ్'— మూలమునకు మూల మేది? జడమునకు జడము మూలము గాదు. జడములకు జడవిలక్షణమైన మూలము ఆదిమూలము. ఇది నిరాధారము – అమూలము. ఈ నిరాధార మూలాధారము మీద జగన్నిర్మాణము జరిగినది. అట్లే రససాధక – ఆధార

'వస్తుతస్తు వక్ష్యమాణ శ్రుతిస్వారస్యేన రత్యాద్యవచ్ఛిన్నా భగ్నావరణా చిదేవ రసః' —రసగగంగాధరః.

'య ద్వై తత్ సుకృతం రసో వై సః' - అని శ్రుతి బ్రహ్మను రసస్వరూపునిగ నిర్వచించినది. సాధనచతుష్టయ సంపన్నుడై మహా వాక్యార్థ విచారము సేయు తత్త్వజ్ఞానికి ఈశ్వరానుగ్రహముచే బ్రహ్మాత్మైక్యజ్ఞానము సిద్ధించును. జ్ఞానముచే అజ్ఞానావరణము తొలగును. అంతట ప్రమాతృత్వ భావము నశించి అపరోక్షాత్మానందానుభవము గలుగును. ఈ యలౌకికాత్మానందమే రసమని శ్రుతితాత్పర్యము.

అట్లే మహాకవి తన ప్రతిభతో సమకూర్చిన అలౌకిక విభావ-అనుభావ-వ్యభిచారిభావ రూప కావ్యసామగ్రిచే ప్రభావితుడై పరవశుడైన సామాజికునకు తత్కాలమున ఆనందాంశము నావరించెడి యజ్ఞానము దొలగును. అందుచే పరిమిత ప్రమాతృత్వభావము నశించి పూర్వవాసనా రూప రతి, శోకాది స్థాయీభావ సంవలితమై స్వ ప్రకాశ చిద్రూపానందము భాసించును. అదియే రసము - అని జగన్నాథపండితునిచే రసనిర్వచనము చేయబడినది.

ఇట రసనిరూపణమున (1) ఆనందాంశావరణాజ్ఞానము తొలగుట, (2) అందుచే పరిమిత ప్రమాతృత్వ ధర్మము తొలగుట, (3) పిదప (రత్యాది సంవలితమై) స్వప్రకాశ చిద్రూపానందము భాసించుట - యను ప్రక్రియ వేదాంతశాస్త్ర ప్రక్రియ ననుసరించినదే. అట్లనుసరించి రస స్వరూపమును నిర్వచించుటకు 'రసో వై సః' అను శ్రుతి ప్రమాణముగా జూపబడినది.

కాని కావ్యసామగ్రిచే తత్కాలమున గలుగున దగుటచే నిది బ్రహ్మానందముగాక బ్రహ్మానంద సబ్రహ్మచారి యైనది. విభావాది

కావ్యసామగ్రివలన గాక, పైన జెప్పినట్లు మహావాక్యజన్య తత్త్వజ్ఞాన సిద్ధ మగుటచే శ్రుతిసిద్ధమైన రసము బ్రహ్మానందపద వ్యపదేశ్య మైనది. కాన కావ్యరసము శ్రుతికావ్యసిద్ధ రస స్వరూపమును గుర్తింప జేయునది యని నిరూపించుట యలంకారశాస్త్ర తాత్పర్యము.

బ్రహ్మానంద సబ్రహ్మచారి రసాభివ్యంజక రచనలు కావ్యము లయినట్లు, సాక్షాత్తు బ్రహ్మానంద రసానుభవమును గలిగించు శ్రుతులును తత్త్వతః కావ్యము లగుట నిర్బాధము. అందుచే 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్' అను కావ్యలక్షణమునకు తత్త్వతః లక్ష్యము శ్రుతికావ్య మన జెల్లును.

మఱియొక విశేషము. పై కావ్యలక్షణమున రమణీయ మర్థ వంతము. ఈ రమణీయత్వమును మహర్షు లెట్లు దర్శించిరో చూతము.

"అకర్దమ మిదం తీర్థం భరద్వాజ నిశామయ।
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్య మనో యథా।"

— రామా, 1.

నారదోపదేశము వలన బరమార్థము నెఱిగి నిర్మలచిత్తుడై మాధ్యాహ్నిక క్రియార్థమై తమసాతీరమున కేగి యా తీర్థజలమును జూచిన వాల్మీకి మహర్షి నుండి వెలువడిన వాక్య మిది.

'ఓ భరద్వాజా! చూచితివి కదా! ఈ తీర్థజలము అడుగునగాని మీదగాని (బురద) మాలిన్యము లేక, లోపల పాపపుటాలోచనగాని వెలుపల బాపపుచర్యగాని లేని పరిశుద్ధాంతఃకరణు డగు సత్పురుషుని మనస్సువలె, ప్రసన్నముగాను(అందుచే) రమణీయముగాను నున్నది'. -అని యర్థము.

వాల్మీకిమహర్షి యా తీర్థమును క్రొత్తగా నిపుడు చూచుట లేదు. మున్నెన్నిమాఱులో జూచి యుండెను. అపుడు తీర్థజలము తీర్థజలముగానే

గన్పట్టెను. కాని నేడు నారదోపదేశ శ్రవణము జేసి, శుద్ధాంతఃకరణు డై నంతనే, శుద్ధాంతః కరణుని మనస్సువలె నా యకర్దమతీర్థము ప్రసన్నము రమణీయము నై కన్పట్టెను. ఈ శ్లోకము రమణీయ రామాయణ మహాకావ్య రచనము నుపక్రమింప బోవు వాల్మీకిమనస్సు నారదోపదేశముచే నెట్లు ప్రసన్నమై, రమణీయ మైనదో తెలియ జేయుచున్నది. ఇంతేకాదు

"ఆపో హి ష్ఠా మయోభువ స్తా న ఊర్జే దధాతన।
మహే రణాయ చక్షసే।"
"యో వః శివతమో రస స్తస్య భాజయతేహ నః।
ఉశతీ రివ మాతరః॥"

— తై. ఆ. 4.2.24; 10-1-11; ఋ. 10-9-1,2.

'హే ఆపః' దధాతన పోషయత। కస్మై ప్రయోజనాయ? చక్షసే పరమాత్మ దర్శనాయ। కథం భూతాయ। రణాయ రమణీయాయ। తథా మహత్తే పూజ్యత ఇతి మహత్, తస్మై మహే మోక్షరూపఫలత్వా న్మహతే, ముక్తి ప్రయోజనా యాస్మాన్ పోషయత....వో యుష్మాకం యః శివతమః కల్యాణతమో రసో మాధుర్యలక్షణోఽస్తి తస్యేహాస్మాం భువి విద్యమానా న్నో ఽస్మాన్, భాజయత....యథా మాతరః స్వాపత్య ముత్తమ గుడాది ప్రాపయన్తి తథా' — సా. భా; తై. ఆ.

'పరమాత్మదర్శనము రమణీయము; మోక్షప్రదము: అట్టి పరమాత్మ దర్శనము ప్రసాదింపుడు: తల్లులు వాత్సల్యముతో మధురపదార్థములను బిడ్డలకు బెట్టునట్లు, అబ్దేవతయు శివతమమగు - మిగులరమణీయ మగు -'రసమును మాయందు నింపు గాక' —అని యర్థము.

'అప్-సలిల' ఇత్యాది శబ్దములకు సామాన్యముగ జలము లనియే యర్థము. కాని పరమాత్మ దర్శనమును గలిగించెడి లక్షణము వేదవాక్కులకే గలదు. అట్టి పరమాత్మ దర్శనము గలిగించెడి అబ్దేవత యిట వాగ్దేవత

యగుననను నర్థము గూడ లక్షిత మగుచున్నది. 'గౌరీ ర్మిమాయ సలిలాని తక్షతీ .... సహస్రాక్షరా పరమే వ్యోమన్ (ఋ. 1-164-1)'; సో౽పో౽సృజత - వాచ ఏవ లోకాత్, వాగే వాస్య సా౽సృజ్యత' (శ. బ్రా. (6-1-1-9)- ఇత్యాది శ్రుతివాక్యము లందు అప్, సలిల శబ్దములు వాక్ పరములుగ గూడ ప్రసిద్ధములు. వాగ్దేవత యగు సరస్వతి యబ్దేవతగ గూడ శ్రుతుల యందు ప్రసిద్ధము. కాన పై మంత్రము నందు జెప్పబడిన రసప్రదాత్రి యగు దేవత యబ్దేవతయే గాక వాగ్దేవతయు నగు ననెడి యర్థము గూడ నుపలక్షిత మగుచున్న దని గ్రహింప నగును. ఏలయన నదులను జలప్రవాహములుగ మాత్రమే గాక వేదవాక్స్వరూపములుగ గూడ దర్శించుట సంప్రదాయము. ఇచ్చట రసపదము జలమును, బ్రహ్మానంద రసమును_ రెండిటిని బోధించునది.

బ్రహ్మ — 'ఇయం వై నిర్మితా పూర్వం మయా వై వేదరూపిణీ ।
వేదపాదాత్ సముత్పన్నా పుణ్యా లోకైకపావనీ ॥

—స్కాంద- సనత్కుమారసంహిత - కృష్ణామాహాత్మ్యమ్. 22 అధ్యా.

కృష్ణవేణీనది వేదరూపిణి యని స్పష్టముగా నిట జెప్పబడినది. ఈ నదియే యీ గ్రంథమున మఱియొకచోట బ్రహ్మానంద స్వరూపిణిగ గూడ నిట్లు కీర్తింపబడినది.

"కృష్ణా కృష్ణాంగ సంభూతా సర్వలోకోపకారిణీ ।
బీజా న్యాదాయ గచ్ఛన్తీ బ్రహ్మానంద స్వరూపిణీ ॥" 18 అధ్యా.

"బ్రహ్మామృతానంద రసేన పూర్ణాం
జలేన పూర్ణా మితి వేనిరే౽జ్ఞాః ।
తాం త్వావగాహామి పిబామి కృష్ణే
దేవాన్ ఋషీం స్తర్పయిష్యే పితౄంశ్చ ॥" 23 అధ్యా.

ప్రాకృతజనుల దృష్టిలో నీ కృష్ణానది జలప్రవాహపూర్ణముగ మాత్రమే గన్పట్టును. కాని వాస్తవముగ నిది బ్రహ్మామృతానంద రసపూర్ణము. అట్లు భావన జేయుచు, నా నదీజలములలో నవగాహము జేయుచు, ఆనంద రసాస్వాదము జేయవలెను; దేవతలను, ఋషులను, పితరులను తృప్తి నొందింప వలెను — అని యర్థము.

పండితరాజ జగన్నాథుడును గంగానదిని 'శ్రుతి సర్వస్వ రూపిణి'గ దర్శించి యిట్లు కీర్తించినాడు.

"సమృద్ధం సౌభాగ్యం సకల వసుధాయాః కిమపి తత్
మహైశ్వర్యం లీలా జనిత జగతః ఖండపరశోః।
శ్రుతీనాం సర్వస్వం సుకృత మథ మూర్తం సుమనసాం
సుధాసోదర్యం తే సలిల మశివం నః శమయతు॥" -గంగాలహరి.

అందుచే పై శ్రుతివాక్యమున నుద్దిష్ట మగు అబ్దేవత వేదమాత యనియు, అందలి శివతమ మగు రసము బ్రహ్మామృతానంద రస మనియు గ్రహించుట సంప్రదాయానుగుణమే యగును కాన తల్లి బిడ్డలకు వలె నీ వేదమాతయు రమణీయము, కల్యాణతమము నగు రసముతో (శివతమో రసః) మమ్ము వింపు గాక యనియు నర్థము పై మంత్రమున సూచిత మగుచున్నది.

"శం నో దేవీ రభిష్టయ ఆపో భవన్తు పీతయే।
శంయో రభిస్రవన్తు నః" — ఋ. 10-9-4; అ.సం. 1-6-1.

అబ్దేవత (వాగ్దేవత) కామక్రోధాది పాపవృత్తుల బోనాడి శాంతిని (సుఖమును) గూర్చు గాక యని తాత్పర్యము. నారదోపదేశానంతరము వాల్మీకిమహర్షి దర్శించిన యకర్దమ తీర్థజలము నందలి రమణీయత్వము పై శ్రుత్యర్థముల దలపింప జేయుచున్నది. జగన్నాథుడును పై కావ్య

లక్షణము నం దుద్దేశించిన రమణీయత్వ మట్టిది. శమప్రధానులై తపోధను లగు మహర్షుల మనస్సుల యందును, శాంతము లగు వారి యాశ్రమ పదము లందును ననిర్వచనీయ మగు నిట్టి రామణీయకము వెల్లివిరియు చుండును. ఇంతియే కాదు.

కావ్యములలో శృంగారాది రసముల తోపాటు శాంతరసమునకును స్థానము గలదు. స్థాన ముండుటే గాదు. ప్రాణులకు శాంతము స్వాభావికము; శృంగారాదు లాగంతుకములు; కాన శాంతము ప్రకృతి రసము; శృంగారాదులు వికృతిరసములు; వికృతిరసములకు తుదకు ప్రకృతిరసము నందే లయము – అని యాలంకారికులు[1] చెప్పుదురు. ఈ శాంతరసము శ్రుతి ప్రతిపాదిత తత్త్వజ్ఞానమునకు మిగుల దోహదకారి యగును. అట్టి శాంతమును 'రససార్వభౌమ' మని కీర్తించుటయు శ్రుతిసిద్ధ రస స్వరూపమును గుర్తింపజేయుట యం దాలంకారికులకు గల తాత్పర్యము నభివ్యక్తము జేయును.

'తుష్యంతి తరుణాః కామే విదగ్ధాః సమయాశ్రితే।
అర్థే ష్వర్థపరా శ్చైవ మోక్షే ష్వథ విరాగిణః॥'

అను భరతవచనము శాంతము యొక్క ప్రకృతిత్వమును నిరూపించు చున్నది.

---

1. 'భావా వికారా రత్యాద్యాః శాంత స్తు ప్రకృతి ర్మతః।
వికారః ప్రకృతే ర్జాతః పున స్తత్రైవ లీయతే॥
స్వం స్వం నిమిత్త మాసాద్య శాంతా ద్భావః ప్రవర్తతే।
పున ర్నిమిత్తాపాయే తు శాంత ఏవ ప్రలీయతే॥' —అభినవగుప్తః.
'క్షణభంగిని జంతూనాం స్ఫురితే పరిచింతితే।
మూర్ధాభిషేకః శాంతస్య రసః సోఽత్ర విచార్యతామ్॥
తదమంద రసస్యంద సుందరీయం నిపీయతామ్।
శ్రోత్ర శుక్తిపుటైః స్పష్ట మజ్ఞః రాజతరంగిణీ॥' — రాజతరంగిణీ.

అభినవగుప్తుడు శాంతమును ప్రకృతిరసముగ నిరూపించినాడు. అంతియే కాదు:

"శమార్థం సర్వశాస్త్రాణి నిర్మితాని మనీషిభిః ।
తస్మాత్స సర్వశాస్త్రజ్ఞః యస్య శాంతం మనః సదా॥"

'పండితుడై వ్యాఖ్యాన కౌశల మున్నంత మాత్రమున సర్వశాస్త్రజ్ఞుడు కాడు సర్వశాస్త్రముల లక్ష్యము శమసంపత్తి. అది కలవాడే సర్వశాస్త్రజ్ఞుడు' — అనుచు పైన వాల్మీకి దర్శించిన రమణీయత్వమును స్ఫురణకు దెచ్చుచున్నాడు. తెచ్చుటయే కాదు; అట్టి రమణీయత్వమే ప్రధాన మనియు స్ఫురింప జేసినాడు. కావుననే శమప్రధానులైన యట్టి మహాత్ముల వాక్కులు ప్రసన్నగంభీరములై, పునఃపున రనుసంధానము సేయుకొలది యపూర్వ రమణీయార్థ ప్రతిపాదకములై భాసించును. మహాకవి భారవియు నెంతయో సుకృతాత్ములకు గాని యట్టి ప్రసన్న గంభీర వాక్కు ప్రసరింప దనినాడు.

"వివిక్త వర్ణాభరణా సుఖశ్రుతిః
ప్రసాదయన్తీ హృదయా న్యపి ద్విషామ్ ।
ప్రవర్తతే నాకృత పుణ్యకర్మణాం
ప్రసన్న గంభీర పదా సరస్వతీ॥"

కావున 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్'—అను జగన్నాథ పండితుని కావ్యలక్షణమునకు లక్ష్యము లేవి యనుచో మొదట వేదములు, తరువాత భారత రామాయణాదులు, పిదప లౌకిక కావ్యములు—అని చెప్ప వలసి యున్నది.

ఆలంకారికులు వేదముల యడుగుజాడలలో నడచి రను విషయమును 'కాణే' పండితుడు నిట్లు వివరించినాడు.

When DHVANI or RASA is said to be the soul of poetry (కావ్యస్యాత్మా ధ్వని రితి) it is virtually employing the language of the upanishads about Atman and Ananda (ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్). There is a remarkable similarity between the aesthetic experience on reading a poem or on seeing a good drama and the spiritual experience derived from the Vedanta discipline by one who has realised and contemplates upon the one reality. It is therefore that Mammata speaks of RASA as 'బ్రహ్మాస్వాద మి వానుభావయన్'.

But there are differences between the two experiences. Art experience does not last long; vanishes when the stimulus is withdrawn, while the bliss of one who has reached the 'బ్రాహ్మీస్థితి' is permanent. Art experience does not necessarily require moral elevation, while spiritual life is not possible without moral discipline.

P. V. Kane. History of Sanskrit Poetics. P. P. 391.

'కావ్యజీవితము ధ్వని లేక రసము (కావ్యస్యాత్మా ధ్వని రితి) అని యనినంతనే, ఆత్మను లేక ఆనందమును గూర్చి చెప్పిన యుపనిషద్వాక్యములనే (ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్) యాలంకారికులును అవలంబించిరనుట స్పష్టము; చక్కని కావ్యమును జదివినపుడుగాని నాటకమును జూచినపుడుగాని గలిగెడి యానందమునకును శమాది సాధనసంపత్తి గలిగి యాత్మనిష్ఠుడగు తత్త్వజ్ఞాని బొందెడి యానందమునకును సామ్యము గలదు; ఇది గమనార్హము; కావుననే మమ్మటాచార్యుడు కావ్యరసము బ్రహ్మానంద సబ్రహ్మచారి (బ్రహ్మాస్వాద మి వానుభావయన్) అని యనినాడు.

ఇట్లు సామ్య మున్నను. ఈ రెండు అనుభూతులలోను మిగుల వ్యత్యాసము గలదు:(1)కావ్యాది కళల వలన గలిగెడి యనుభూతి క్షణికము—

తత్కాల మాత్ర పర్యాప్తము; ఉద్దీపన సామగ్రి దూరము కాగానే అనుభూతియు మఱుగుపడును. శ్రుతిసిద్ధ మగు ఆత్మానందానుభూతి (బ్రాహ్మీస్థితి) యట్లు గాదు: అది శాశ్వతము. (2) కావ్యనాటకాది కళా రసాస్వాదమునకు నైతిక మగు ఔన్నత్యముతో (క్రమశిక్షణతో) బని లేదు. బ్రహ్మానంద రసానుభూతి కట్లు గాదు; దానికి శమాది సాధనసంపత్తి జనిత చిత్తసంస్కార మావశ్యకము' – అని యర్థము.

'వేదకావ్యము; కావ్యనాటక సంగీతాది కళలు' – ఈ రెంటిటి యనుభూతి విశేషస్వరూపము శివలీలార్ణవమున నిట్లు ప్రపంచింపబడినది.

"స్తోతుం ప్రవృత్తా శ్రుతి రీశ్వరం హి
న శాబ్దికం ప్రాహ న తార్కికం వా।
బ్రూతే తు తావ త్కవి రిత్యభీక్ష్ణం
కాష్ఠా పరా సా కవితా తతో నః॥" 1–16.

పరమేశ్వరుని స్తోత్రము జేయుటకై గదా శ్రుతి ప్రవృత్త మైనది। అట్టి శ్రుతి యీశ్వరుని శాబ్దికు (వైయాకరణు) డని గాని, తార్కికు డని గాని గాక యడుగడుగున కవి యనియే కీర్తించినది. అట్టి కవియొక్క కవిత యగు వేదకావ్యమే మనకు శరణ్యము.

"కర్ణం గతం శుష్యతి కర్ణ ఏవ
సంగీతకం సైకత వారి రీత్యా।
ఆనందయ త్యంత రనుప్రవిశ్య
సూక్తిః కవే రేవ సుధాసుగంధా॥" 1–17

ఇసుకలో బడిన నీరు, అందే వెంటనే యింకి పోవునట్లు చెవిని బడెడి సంగీతము గూడ చెవియందే యింకి పోవును. కవిసూక్తి యట్లుగాక యమృతప్రాయమై హృదయాంతరాళము జొచ్చి యానందింప జేయును.

"పశ్యేయ మేకస్య కవేః కృతిం చేత్
సారస్వతం కోశ మవైమి రిక్తమ్।
అంతః ప్రవిశ్యాయ మవేక్షిత శ్చేత్
కోణే ప్రవిష్టా కవికోటి రేషా॥" 1–18.

ఏదైన నొక కవియొక్క కృతిని గాంచినపుడు సారస్వత కోశము (వేదవాఙ్మయము)లోని శబ్దజాల మంతయు నందుపయుక్తమయి యది (సారస్వతకోశము) పట్టిపోయినదా యని యనిపించును. ఆ సారస్వత కోశములోనికి జొచ్చి దర్శించుచో, కవికోటి యంతయు నందొకమూల నొదిగి యున్నట్లు గన్పట్టును.

"అనాయత ప్రాణ మసంయతాక్ష
మబ్రహ్మచర్యానశనాది ఖేదమ్।
చిత్తం మహేశే నిభృతం విధాతుం
సిద్ధః కవీనాం కవితైవ యోగః॥" 1_26.

యోగాభ్యాసమునకు ప్రాణాయామము, ఇంద్రియసంయమము, బ్రహ్మచర్యము, ఆహారనియమాదు లావశ్యకములు. ఇట్టి నియమములు గాని వీని వలని ఖేదము గాని లేకయే, చిత్తమును బరమేశ్వరు నందు నిలుపుటకై యీ కవితాయోగము కవులకు ఆజన్మసిద్ధము.

అలంకారశాస్త్రము-లక్ష్యము:-

పై గ్రంథసందర్భమును బట్టి పరమేశ్వరుడు కవి; తత్సంబంధి కవితయే వేదవాక్యము; ఈ కవియొక్కయు వేదకావ్యముయొక్కయు స్వరూపమును దర్శింప జేయుటయే లౌకికకావ్యముల లక్ష్యము; ఆలంకారికుల దృష్టియు నిదియే యని తెలిసినది. ఇంతే కాదు.

అలంకారశాస్త్రము గూడ పురాణేతిహాసాదుల వలెనే వేదార్థోప బృంహణమునకై ప్రవర్తిల్లినది. అలంకారశాస్త్ర పరిచయము లేనిది వేదవాక్యగతము లయిన వివిధాలంకార స్వరూపము గాని, వేదవాక్యగత గూఢ చమత్కారార్థావగతి గాని కలుగదు. కావుననే షడంగముల తోపాటు అలంకారశాస్త్రమును గూడ వేదార్థోపబృంహణమునకై యేడవ యంగముగా గ్రహింప నగు నని రాజశేఖరుడు తన కావ్యమీమాంసా గ్రంథమున బేర్కొనినాడు.

'ఉపకారకత్వా దలంకారః సప్తమాంగ మితి యాయావరీయః; ఋతే చ తత్స్వరూప పరిజ్ఞానాత్ వేదార్థానవగతిః। యథా - ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వ జాతే। తయో రన్యః పిప్పలం స్వా ద్వత్తి అనశ్న న్నన్యో అభిచాకశీతి' — కావ్యమీమాంసా - 2 అధ్యా.

'ద్వా సుపర్ణా' అను నీ మంత్రమున నతిశయోక్త్యలంకారము. (రసగంగాధరమున గూడ నీ యలంకారమున కుదాహరణముగా నీ మంత్రమే యుదహరింప బడినది). ఇట్టి మంత్రముల యందలి అలంకారాది స్వరూప పరిజ్ఞానమునకై యలంకారశాస్త్ర మావశ్యక మని యర్థము.

కాన వేదకావ్య మలంకార శాస్త్రమునకు లక్ష్యమే యగుట యాలంకారికాభిమతము 'కవేః పరమాత్మన ఇదం కావ్యమ్' అను నిర్వచనము ననుసరించియు పై నుదహరించిన శ్రుతి స్మృత్యాది ప్రామాణ్యము ననుసరించియు కావ్య మను నామము ప్రధానముగా శ్రుతికే చెల్లును. కృత్స్నవేదము పరంపరగా గాని, సాక్షాత్తుగ గాని కవి యగు పరమాత్మకు సంబంధించిన దగుట జేసి కావ్య మగును. 'అప్యేకం దేవపద మధీయాత' ఇత్యాది శ్రుతివాక్యములు వేదకావ్యగత పదము

లన్నియు దేవపదములు (దేవునకు సంబంధించినవి) అని చెప్పుచున్నవి. వ్యాసాది మహాకవులు నా దృష్టితోనే వేదమును భారతమును కావ్య మని కీర్తించియుందు రనుట స్పష్టము. కాని నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయాది వర్ణనలకు గాని, అలౌకిక విభావానుభావాది కావ్యసామగ్రికి గాని ప్రాధాన్యము లేమిం జేసి 'లౌకిక కావ్యములకంటె వేదము విలక్షణమైన' దను విషయమును పై యగ్నిపురాణ వచన మనువదించినది.

కాగా శ్రుతిదృష్టిలోను మహర్షుల దృష్టిలోను కావ్యలక్షణము వేఱు; లౌకికకావ్యకర్తల దృష్టిలో కావ్యలక్షణము వేఱు. మహర్షు లాదరించిన కావ్యలక్షణము (కవేః కర్మ; కవేః పరమాత్మన ఇదం) అన్వర్థము. లౌకిక కావ్యలక్షణము కవి యగు పరమాత్మకే సంబంధింపక, లౌకిక విషయానుబంధి గూడ నగుట జేసి యౌపచారిక మన దగును. ఈ విషయముల దృష్టియం దుంచుకొనియే పండితరాజ జగన్నాథుడు నిపుణముగ 'లోక-వేద' సాధారణమైన కావ్యలక్షణమును బరిష్కరించినాడు - అని చెప్ప నగును. కనుక వేదము కావ్య మన నది యాలంకారిక సమయము విరుద్ధము కా దని స్పష్ట మైనది.

అధికారి భేదము ననుసరించి వేదమునకు ప్రభు-సుహృత్-కాంతాసంమితత్వము:-

ఇక అధికారి భేదము ననుసరించి వేదము కొన్నియెడల ప్రభువై శాసించును; ఒకచో సుహృత్తువలె నుపదేశించును; ఇంకొక యెడ కాంతా సంమితముగ దెలియ జెప్పును - అను విషయమును బరిశీలింప వలసి యున్నది. "అధికారిణః ప్రమితిజనకో వేదః ఇతి న్యాయే నేయ ముపనిషత్ బుభుత్సో ర్బ్రహ్మాత్మత త్త్వే ప్రమితిం జనయతి"

—సా. భా. తై. ఆ. 7-1.

చిత్తసంస్కృతి ననుసరించి పరమేశ్వరుడా యా రూపములతో సాక్షాత్కరించు నట్లు భిన్నభిన్న చిత్తసంస్కృతులు గల యధికారులకు భిన్నభిన్న రూపములతో శ్రుతియు బొడగట్టును. కొన్నియెడల ప్రభువు వలె శ్రుతి యాదేశించుచుండును. ప్రభువు నానతిని నెఱవేర్చు పట్టున హేతువాదమునకు దావు లేదు. అట్లే శ్రుతివిహిత వేదాధ్యయన, కర్మానుష్ఠానాది సమయము లందు హేతువాదముతో బని లేదు. అట్టియెడ వేదము ప్రభుసంమితమై యొప్పుచుండును

మహాయజ్ఞముల చేతను, యజ్ఞముల చేతను శరీరము బ్రాహ్మమగును. అనగా నియమపూర్వక కర్మానుష్ఠానపరులై బ్రాహ్మీమూర్తులగుదు రని స్మృతులు చెప్పుచున్నవి. 'మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః' (మను.) అట్టి మహాత్ములు శమాది సాధన సంపద గల్గి జిజ్ఞాసాపరులై వేదవాక్యార్థ విచారణకు బూనుకొను సమయమున హితుని వోలె శ్రుతి యుపదేశించుటకు బూనుకొనును.

అట్లు నిరంతర కర్మానుష్ఠాన, మంత్రార్థ విచారములచే గలిగిన విలక్షణ చిత్తసంస్కృతి ప్రాభవముతో నలరారెడి యా బ్రాహ్మీమూర్తికి శ్రుతి చెలియై క్రమముగ నాత్మస్వరూపమును దర్శింపజేయుచు బ్రహ్మానంద రసావలిప్తుని జేయును. అట్టి బ్రాహ్మీమూర్తి వేదమూర్తియై వేదముతో ననన్యభావము చెందును.

కాన నధికారిభేదము ననుసరించి కర్మ-ఉపాసనా-జ్ఞాన యోగనిష్ఠులకు శ్రుతి భిన్నభిన్నరూపములతో సాక్షాత్కరించు ననుట యుక్తమే. శ్రుతి చమత్కారముగ నీ విషయము నీ మంత్రమున నిట్లు సూచించుచున్నది.

"పశ్చాత్పురస్తా దధరా దుదక్తాత్ కవిః కావ్యేన పరిపాహి రాజన్।
సఖే సఖాయ మజరో జరిమ్ణేఽగ్నే మర్తాగ్ంఅమర్త్యస్త్వం నః॥"

— ఋ. 10-87-21.

కవిః కావ్యేన పరిపాహి రాజన్ :-

ఇట పరమేశ్వరుడు (అగ్ని) క్రాంతదర్శను డగు కవి యని చెప్ప బడి, యెల్లెడల నుపద్రవములనుండి కాపాడెడి ప్రభువుగా 'రాజన్' అని మొదట సంబోధింప బడినాడు. రాజు ప్రజలను కాపాడుటకు చట్టము కావలెను. ఆ చట్టమే యిట వేదకావ్యము. ఆ కావ్యముతో రక్షింపుము (కావ్యేన పరిపాహి) అని కవి యిట నర్థింపబడుచున్నాడు. అట్టివేద నా చట్టము ప్రభుసంమితమై కర్తవ్యమును శాసించి యుపద్రవముల నుండి కాపాడెడి కావ్య మగుచున్నది. ఇంతే గాదు.

సఖే సఖాయ మజరో జరిమ్ణే :-

కవి యగు పరమేశ్వరుడే యీ రెండవ వాక్యమున జరారహితు డగు సఖుడుగ సంబోధింప బడినాడు: సఖు డగు సాధకుని గూడ కావ్యముతో జరారహితుని గావింపు మని యర్థింపబడుచున్నాడు. వేదకావ్యముతో జెలిమి యొనర్చుచో వేదము 'సచివిత్' (సఖివిత్) అగు నని పూర్వము దెల్పబడినది. అట్టి యతడు పరమేశ్వరునకుగూడ సఖు డగును. ఇట్లు పరమేశ్వరునితోడి నిరంతరసఖ్య మొనర్చు సఖునకు ఈశ్వరానుగ్రహముచే జిజ్ఞాస జనియించును. జిజ్ఞాసాపరు డగు నట్టి సఖునకు వేదకావ్యము హితుని వోలె వేదకావ్యార్థ విచారము ద్వారా కర్తవ్యాకర్తవ్యముల నుపదేశించుచుండును. కావున నీ రెండవ వాక్యము వలన వేదముయొక్క సుహృత్సంమితత్వము సూచితమగుచున్నది. మఱియు—

అగ్నే మర్తాగ్ం అమర్త్య స్త్వం నః -

ఈ వాక్యమున కవి యగు పరమేశ్వరుడు అమర్త్యుడగు అగ్నిగా సంబోధింప బడినాడు; మర్త్యులను తనతోపాటు కావ్యముచే అమర్త్యుల నొనరింపు మని యర్థింపబడుచున్నాడు. ప్రభువై, నెచ్చెలియై కన్నట్టిన

పరమేశ్వరుడే యిట నమర్త్యుడు సర్వవ్యాపకుడు నగు అగ్ని (అంగతి సర్వత్ర గచ్ఛతీ త్యగ్నిః)గ దర్శింపబడినాడు 'జీవో మృతస్య చరతి స్వధాభి రమర్త్యో మర్త్యేనా సయోనిః' (ఋ. 1-164.30) అనెడి పూర్వోదాహృత ఋఙ్మంత్రమున (చూ. స్వధాశబ్దము) 'దేహాదులు మర్త్యములు -మరణధర్మము గలవి; జీవుడు అమర్త్యుడు- మరణధర్మము లేనివాడు' అని చెప్పబడినది. కాన జీవునకు అమర్త్యత్వము స్వాభావికము; మర్త్యత్వము ఆగంతుకము- దేహతాదాత్మ్యాభిమాన మూలము. అందుచే బరమేశ్వరుని వలెనే జీవుడును వాస్తవముగ నమర్త్యుడు. అట్టి యమృతత్వమును వేదకావ్యముచేత ననుగ్రహింపు మని యిట నర్థింపబడినది. జిజ్ఞాసాపరు డగు వేదవిదునకు ఈశ్వరానుగ్రహముచే శ్రుతి సఖి (చెలి) యై ఆత్మస్వరూపము దర్శింప జేయవలె (జాయేవ పత్య ఉశతీ సువాసాః)నని తాత్పర్యము.

పై మంత్రార్థము బరిశీలించుచో – అగ్ని (పరమేశ్వరుడు) ప్రభువై శాసించు నెడల నీ వేదకావ్యము శాసించెడి చట్టమైనది; నెచ్చెలియై నపుడీ వేదకావ్యము కర్తవ్యాకర్తవ్యముల నుపదేశించు నెచ్చెలియైనది. అమర్త్యుడై యాత్మస్వరూపుడై భాసించు నపు డీ కావ్యము గూడ నమర్త్యత్వమును దర్శింపజేయు చెలియై యనన్యభావము జెందు నను విషయ మిట సూచిత మగుచున్నది. ఈ విషయమునే శ్రుతి యీ క్రింది మంత్రమున జమత్కరించుచున్నది.

"మాతా రుద్రాణాం దుహితా వసూనాం
స్వసాదిత్యానా మమృతస్య నాభిః।
ప్ర ను వోచం చికితుషే జనాయ
మా గా మనాగా మదితిం వధిష్ట ॥"

— ఋ. 8-101-15; తై.ఆ. 8-12-1; సామ. మం.బ్రా. 2.8-15.

ఇది గోదేవతాక మైన మంత్రము. గోరూపిణియైన దేవి రుద్రులకు మాతః వసువులకు దుహితః ఆదిత్యులకు స్వస; అమృతమున కావాసస్థానము: నిరపరాధియు అదితియు నగు నీ గోరూపధారిణీ దేవిని హింసింపకు దని జ్ఞానియగు జనునకు జెప్పుచున్నాను – అని యర్థము.

దీని తరువాతి మంత్రము గూడ గోదేవతాకమే.

"వచోవిదం వాచ ముదీరయంతీం విశ్వాభి ర్ధీభి రుపతిష్ఠమానామ్।
దేవీందేవేభ్యః పర్యేయుషీం గా మా మావృక్త మర్త్యో దభ్రచేతాః॥"

ఈ దేవి వాక్స్వరూపమును దెలియ జేయునది; వాక్ప్రేరయిత్రి; తన యన్ని వాక్కుల చేతను పరమాత్మ నుపాసించునది; దేవార్థమై యేతెంచునట్టిది: అట్టి నన్ను (వాగ్దేవి యగు గోదేవతను) అల్పబుద్ధిగల మర్త్యుడు పరిత్యజించును – అని యర్థము.

ఈ మంత్రములకు సామాన్యముగ గోదేవతాపరముగ నర్థవివరణము గలదు. కర్మాంగముగ మంత్రవినియోగ సమయమున నా యర్థము గ్రాహ్యమే. కాని యీ మంత్రములు గోసామాన్యార్థ స్ఫూర్తిని గలిగించు చునే వేదవాక్స్వరూప వివరణాత్మకములునై పఱగుచు నా గోదేవిని వేదరూపిణిగ భావించు విధానమును వివరించుచున్నవి. మొదటి మంత్రమున జాతము రుద్రులకు మాత, వసువులకు దుహిత, ఆదిత్యులకు స్వస, అమృతమున కావాసస్థానము – అని యిట్లు చెప్పుటవలన దెలియ దగిన యంశ మేది ?

దుహితా వసూనామ్ :-

వేదవిదుడు వసు–రుద్ర–ఆదిత్యరూపుడగుట శ్రుతివలన దెలియును.

"తస్మాత్ స్వాధ్యాయో ఒధ్యేతవ్యో యం యం క్రతు మధీతే తేన తేనా స్యేష్టం భవతి– అగ్నే ర్వాయో రాదిత్యస్య

సాయుజ్యం గచ్ఛతి। త దేషాభ్యుక్తా। యే అర్వా జుత వా
పురాణే వేదం విద్వాగ్ంస మభితో వద న్త్యాదిత్య మేవ తే
పరివద న్తి సర్వే అగ్నిం ద్వితీయం తృతీయం చ హగ్ంస
మితి' — తై.అ. 2-15-1. (చూ. అ.సం. 10-8-17)

'స్వాధ్యాయాధ్యయనము జేయవలెను; అట్లధ్యయనము జేయుచో నే యే క్రతుభాగము నధ్యయనము జేయుదురో వారు తమ యోగ్యత ననుసరించి క్రతుఫలముల నొందుదురు; అగ్ని-వాయు-ఆదిత్య దేవతా సాయుజ్యము నొందుదురు; ఈ విషయము ఋఙ్మంత్రముచే గూడ నిట్లు చెప్పబడినది; అర్వాచీన వేదవిద్వాంసుని గాని, ప్రాచీన వేదవిద్వాంసుని గాని యెవరు నిందింతురో వారందఱు అగ్ని-వాయు-అదిత్య దేవతానింద జేసిన వారగుదురు.

'అస్య వేదవిదః అగ్ని వాయ్వాదిత్య సాయుజ్య యోగ్యత్వాత్
ఏత న్నిందైవ తేషాం నిందా - ఇత్యనేనైవ మంత్రేణ
అగ్న్యాది రూపత్వ లక్షణం వేదవి న్మాహాత్మ్యం దర్శితమ్'—సా. భా.

వేదవిదుని నిందయే అగ్ని వాయ్వాదిత్య నింద యని చెప్పుటచే వేదవిదుడు అగ్నివాయ్వాదిత్య స్వరూపుడు; అందుచే అనింద్యుడు. అని వేదవిదుని మాహాత్మ్యము చెప్పబడుచున్నది — అని యర్థము.

స్వాధ్యాయాధ్యయనముచే వేదవిదుడు సంస్కార క్రమాభివృద్ధి గల్గి అగ్ని-వాయు-ఆదిత్య స్వరూపు డగు నని తాత్పర్యము.

వేదవిదుడు అగ్నివాయ్వాదిత్యరూపు డగుట యెట్లు ?

అగ్నియే వసు వని 'వసు రగ్ని ర్వసుశ్రవాః' (ఋ. 5-24-2, సా. సం. 2-458; వా. సం. 3-25; తై సం 1-5-6-3; శ.బ్రా. 2-3-4-31 మొ॥)

ఇత్యాది శ్రుతులు చెప్పుచున్నవి. కాని 'అష్టవసువులు' అను ప్రసిద్ధిగూడ శ్రుతులయందును, పురాణము లందును గలదు. వసువు లన సూర్యరశ్ము లనియు నిరుక్తము చెప్పుచున్నది. కొన్నియెడల నగ్నియు, కొన్నిచోట్ల వాయువు, ఇంకొక యెడ ఆదిత్యుడును 'వసువు' అని శ్రుతులు కీర్తించి నవి. ఇట్లు 'వసు' శబ్దము ప్రకరణము ననుసరించి వేర్వేఱర్థముల బోధింప వచ్చును. కాని 'స ఏషో ఽత్ర వసుః' (శ.బ్రా. 9-3-2-1) – ప్రకృతత్వాత్ ఏత చ్ఛబ్దేన చిత్యాగ్నిం పరామృశతి (సా. భా.) అను శ్రుతి ననుసరించి అగ్ని చయనాది కర్మల యందు ప్రకృతు డగుటచే ఇట చిత్యాగ్నినే వసువుగా గ్రహింపవలసియున్నది. ఈ సంప్రదాయము ననుసరించి కర్మానుష్ఠాన సమయమున అగ్నినే వసువుగా గ్రహింపవలెను. అగ్ని వసు వగుచో నిరంతరము నగ్న్యారాధనపరు డగు వేదవిదుడు అగ్ని లేక వసు స్వరూపు డగును.

'యజమానో ఽగ్నిః' —శ. బ్రా. 6-3-3-21; 6-5-2-8.

'యజమానో ఽగ్నిః ఇతి విరాడ్రూపస్యాగ్నే ర్యజమాన
భావి శరీరాత్మకతయా చ తద్రూపత్వమ్' —సా. భా.

కర్మానుష్ఠాన పరు డగు యజమానుడు ఉపాస్య దేవతా స్వరూపు డగు నని ఐతరేయబ్రాహ్మణము వలనగూడ దెలియుచున్నది:

"అగ్ని ర్వై దేవయోనిః సో ఽగ్నే ర్దేవయోన్యా
ఆహుతిభ్య స్సంభవతి" — ఐ.బ్రా. 4-5-22.

'.... స యజమానో దేవయోనిరూపా దగ్నే రనుష్ఠితాభ్య
ఆహుతిభ్యశ్చ దేవతారూపః సంభవ త్యుపపద్యతే' — సా. భా.

కాన అగ్న్యారాధనపరు డగు వేదవిదుడు విరాడగ్ని స్వరూపు డగుట, అనగా వసురూపు డగుట శ్రుతిసంమతము.

ఇట్లు వసురూపు డగు కర్మానుష్ఠాతకు వేదము దుహిత యగును. దుహిత యన పుత్రిక యని సామాన్యముగ నర్థము.

'దుర్హితా- దుఃఖేన హితా దుహితా'

అని యాస్కనిర్వచనము. దుఃఖకర మయ్యును హితమును గూర్చునది యని యర్థము. కటౌషధము వలెను, ప్రభువువాక్య వలెను వేదాధ్యయనము గాని తద్విహిత కర్మానుష్ఠానము గాని దుఃఖకర మయ్యును —మొదట క్లేశమును గల్గించున దయ్యును- పిదప హితమును గూర్చును. 'దూరే హితా దుహితా' అనియు మఱియొక నిర్వచనము నిరుక్తమున గలదు. దూరమున నుండియు హితమును గూర్చునది యని యర్థము. అర్థజ్ఞాన రహితులకు వేదమంత్రములు దూరముగా నున్న ట్లున్నను హిత కరములే యగును. కాన వసువులకు శ్రుతి దుహిత యగు నని చెప్పుట యాలంకారికముగ యుక్తమే యగును.

మాతా రుద్రాణామ్ :-

రుద్రులకు (మరుత్తులకు లేక ప్రాణములకు) మాత యని యర్థము. శమాది సాధనసంపత్తి గలిగి జిజ్ఞాసాపరుడై శ్రవణము జేసి వేదమంత్రముల మననము జేయుచు తత్తన్మంత్ర ప్రతిపాద్యార్థ స్వరూపము ననుధ్యానించు వేదవిదునకు శ్రుతి మాతయై (శివతమోరసః....ఉశతీ రివ మాతరః) వాత్సల్యము మీఱ మధురము, శివతమము నగు రసమును ఆస్వాదింప జేయుచు నుపదేశించును. రసాస్వాదపరు డగు నా వేదవిదుడు స్థూలశరీరాభిమానరహితు డగుచు ప్రాణశక్త్యభినివిష్టు డగును. (రమణీయ సూక్ష్మ శరీరాభినివిష్టు డగును). తత్తద్దేవతా మంత్రానుధ్యాన పారవశ్యమున తత్తద్దేవతా తాదాత్మ్యము నొందు నని శ్రుతులును, సంప్రదాయ విదులును జెప్పుదురు.

ప్రజాపతియొక్క సూక్ష్మశరీరము రమణీయ మనియు తదుపాసకు డగు యజమానుడును రమణీయ సూక్ష్మశరీర సంపత్తితో వెలయుచు ప్రజాపతి రూపు డగుననియు శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"స ప్రజాపతిః, సో ఽగ్నిః, స యజమానః స హిరణ్మయో భవతి...."

"త దస్మి న్నేతాం రమ్యాం తనూం మధ్యతో ఽదధుః। త ద్య దస్యై తస్యాం రమ్యాయాం తన్వాం దేవా అరమన్త- తస్మా ద్ధి రమ్యమ్। హిరమ్యమ్ హ వై త ద్ధిరణ్య మి త్యా చక్షతే పరో ఽక్షమ్। తథై వా స్మి న్నయ మేతాం రమ్యాం తనూం మధ్యతో దధాతి। ప్రాణో వా అస్య సా రమ్యా తనూః" — శ. బ్రా. 7-4-1-15,16.

సః పురుషః ప్రజాపతిః స్థూల ప్రపంచాభిమానీ విరాడాత్మకః, సః ఏవ అగ్నిః సూక్ష్మప్రపంచాభిమానీ హిరణ్యగర్భాత్మకః, యజమానస్య తద్రూప ప్రాప్తే ర్యజమానాత్మకో ఽపి స ఇత్యర్థః। ....తస్మా ద్రమణీయా జ్ఞానక్రియా శక్తిరూపా సూక్ష్మా తనూః .... ఏతస్యాం హితాయాం స్థాపితాయాం జ్ఞానక్రియా శక్త్యాత్మకత్వేన రమణీయాయాం తన్వాం యస్మా ద్దేవా అరమన్త తస్మాత్ హితే ఽస్మిన్ రమత ఇతి వ్యుత్పత్త్యా హిరమ్యమ్ ఇతి నామ సంపన్నమ్, తదేవ పారోక్ష్యేణ హిరణ్య మిత్యుచ్యతే... తథైవ ....అయం యజమానః। — సా. భా.

యజమానుడు విరాడ్రూపుడు, హిరణ్యగర్భరూపుడు నగును: ప్రజాపతియొక్క సూక్ష్మశరీరము జ్ఞాన క్రియా శక్తిరూపమై రమణీయము. హిత మగు దీనియందు దేవతలు రమింతురు గాన హితరమణీయ మగు నీ సూక్ష్మశరీరమునకు (హితరమ్యమ్) 'హిరమ్య' మని పేరు. దేవతలు

పరోక్షప్రియులు. అందుచే హిరమ్యమే పరోక్షముగా హిరణ్య మని చెప్పబడుచున్నది. తదారాధనా పరు డగు యజమానుని విషయమున గూడ నిట్లే; అనగా యజమానుని సూక్ష్మశరీరము గూడ హిరణ్య మగును - అని శ్రుతితాత్పర్యము.

దీనినిబట్టి యజమాను డగు సాధకుడు సంస్కార క్రమాభివృద్ధి గల్గి, రమణీయ సూక్ష్మశరీరసంపత్తి గల్గి యుండు నని తెలియుచున్నది.

"యో దేవానాం ప్రథమం పురస్తాత్ విశ్వాధికో రుద్రో
మహర్షిః। హిరణ్యగర్భం పశ్యత జాయమానమ్।"

— తై.ఆ. 10-10-3.

సమష్టి ప్రాణరూపు డగు హిరణ్యగర్భుడు రుద్రు డని యీ శ్రుతివాక్యము చెప్పుచున్నది. కాన స్థూలశరీరాభిమాన రహితు డగుచు రమణీయ ప్రాణశక్త్యభినివిష్టు డగు వేదవిదుడును రుద్రరూపు డగును. సాధకుడు, జిజ్ఞాసాపరుడు, రుద్రరూపుడు నగు వేదవిదునకు శ్రుతి మాతయై వాత్సల్యము మీఱ నుపదేశించు నని "మాతా రుద్రాణాం" అనుచు శ్రుతి యాలంకారికముగ జెప్పినది. శ్రుతి మాతయై యుపలాలించుచు బోధించు నను విషయమును శ్రీ శంకరభగవత్పాదులు నిట్లు చెప్పిరి.

"త్వం బాలం రోదమానం చిరతరసమయం శాంతి మానేతుమగ్రే
ద్రాక్షం ఖర్జూర మామ్రం సుకదల మథవా యోజయత్యంబికాఽస్య।
తద్వ చ్చేతో ఽతిమూఢం బహు జననభవా న్మౌఢ్య సంస్కారయోగాత్
బోధోపాయై రనేకై రవశ ముపనిష ద్బోధయామాస సమ్యక్"

— శతశ్లోకి - 8.

తల్లి యెంతసేపటి నుండియో యదే పనిగ బోరు పెట్టి యేడ్చుచున్న (రోదమానం) తన బిడ్డపోరు మాన్పుటకై ద్రాక్ష, ఖర్జూర, మామిడి,

అరటి మున్నగు పండ్లను దెచ్చి యా బాలుని ముందుంచును. అట్లే యుపనిషత్తు గూడ బహుజన్మార్జితము లగు మూఢ సంస్కారములతో నిండి, వివేకము గోల్పోయి, కామ క్రోధాది దోష సంమోహితమై, పరతంత్రమై క్లేశపడు నంతఃకరణమునకు జ్ఞానసాధనోపాయముల నెక్కింటిని యధికారి తారతమ్యానుగుణముగ జూపి యుద్బోధించినది - యని యర్థము.

పై యుపమానముచే కామక్రోధాది పరవశమై క్లేశపడెడి (రోదించెడి) చిత్తము నెదుట శ్రుతి, మాతయై జ్ఞాన సాధనోపాయముల జూపి యుపదేశించు నను విషయము స్పష్టమైనది. రోదనధర్మముచే ప్రాణములకును రుద్రు లని పేరు.

"ప్రాణా వై రుద్రాః। ప్రాణా హీదం సర్వం రోదయన్తి।"
— జై. ఉ. 4-2-6.

"ప్రాణా వావ రుద్రా ఏతే హీదగ్ం సర్వగ్ం రోదయన్తి।"
— ఛాం. ఉ. 3-16-3.

రుద్రులై క్లేశపడెడి ప్రాణములను తల్లివోలె ఉపలాలించి శ్రుతి కర్తవ్యము నుపదేశించు ననుట యాలంకారికముగ యుక్తమే యగును.

స్వసాఽఽదిత్యానామ్ :

ఆదిత్యులకు స్వస - అని యర్థము. ఈశ్వరానుగ్రహముచే బ్రహ్మజిజ్ఞాసానంతరము బ్రహ్మనిష్ఠుడైన వేదవిదుడు ఆదిత్యస్వరూపుడు. అట్టి వానికి శ్రుతి స్వసయై యొప్పును.

ప్రాణములు పురుషుని ప్రథమవయస్సున వసువులు; మధ్యమ వయస్సున రుద్రులు; మూడవ వయస్సున ఆదిత్యులు నగు నని శ్రుతి

సంప్రదాయము. మొదటి ఇరువదినాలుగు సంవత్సరములు ప్రథమవయస్సు. తరువాత నలుబదినాలుగు సంవత్సరములు అనగా ఇరువదినాల్గవ వత్సరము మొదలుకొని అరువదియెనిమిదవ వత్సరము వరకు గల మధ్యకాలము- మధ్యమ వయస్సు. అదిమొదలు నలుబది యెనిమిది వత్సరముల జీవిత కాలము మూడవ వయస్సు - ఇట్టి త్ర్యాయుష పరిమిత కాలము నూట పదునారు వత్సరములు.

ఇట్టి పురుషజీవితకాలము ఒక యజ్ఞముగ (ఈశ్వరారాధన రూపముగ) భావన జేయుచు నీ పురుష యజ్ఞమును నిర్వర్తింప వలె నని శ్రుతి యాదేశము; ఉపదేశము. అగ్నిష్టోమాది క్రతువుల యందు ప్రాతః సవనము, మాధ్యందినసవనము, తృతీయ సవనము - అను మూడు సవనములకును వరుసగా వసు- రుద్ర- ఆదిత్యు లధిపతులు అట్లే పురుష యజ్ఞమున నీ త్ర్యాయుషములు మూడు సవనములు. ఆ సవనములం దధిపతు లగు వసురుద్రాదిత్యులు ప్రాణములు. అనగా నీ ప్రాణములు ప్రాతఃసవనరూప మగు ప్రథమవయస్సున వసువులు; మాధ్యందిన సవన రూప మగు మధ్యమవయస్సున రుద్రులు; తృతీయసవనరూప మగు తృతీయవయస్సున నాదిత్యులు నగుచు, నీ పురుషయజ్ఞమున సవనత్రయా ధిపతు లగుదురు. ఒకే ప్రాణములయందు వసురుద్రాదిత్యత్వమును దర్శించుట కుపపత్తిని నిర్వచనపూర్వకముగా శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"పురుషో వావ యజ్ఞః తస్య యాని చతుర్విగ్ంశతి వర్షాణి త త్ప్రాతః సవనమ్। చతుర్విగ్ంశత్యక్షరా గాయత్రీ। గాయత్రం ప్రాతః సవనమ్। త దస్య వసవో ఽన్వాయత్తాః। ప్రాణా వావ వసవ ఏతే హీదగ్ం సర్వం వాసయ న్తి........"

"అథ యాని చతుశ్చత్వారిగ్ంశ ద్వర్షాణి త న్మాధ్యందినగ్ం సవనమ్। చతుశ్చత్వారిగ్ంశ దక్షరా త్రిష్టుప్। త్రైష్టుభం

మాధ్యందినగ్ంసవనమ్। త దస్య రుద్రా అన్వాయత్తాః ప్రాణా వావ రుద్రా ఏతే హీదగ్ం సర్వగ్ం రోదయన్తి........"

"అథ యా న్యష్టాచత్వారిగ్ంశ ద్వర్షాణి త త్తృతీయసవనమ్। అష్టాచత్వారిగ్ంశ దక్షరా జగతీ। జాగతం తృతీయ సవనమ్। త దస్యాఽఽదిత్యా అన్వాయత్తాః। ప్రాణా వా వా ఽఽదిత్యా ఏతే హీదగ్ం సర్వమాదదతే........"

—ఛాం, ఉ. 3-16-1.35., జై. ఉ. 4-2.

సుఖ నివాస హేతువు (ఏతే హీవగ్ం సర్వం వాసయంతి) లగుటచే ప్రాణములు వసువులు. యజమాను డభిలషించెడి యిహాముత్ర ఫలములకు గారకుడై సుఖనివాస హేతుభూతు డగుటచే గర్మానుష్ఠాన సమయమున నగ్నియు వసురూపు డగును. అట్టి ప్రాణములతో దాదాత్మ్యము జెందు పురుషుడును (యజమానుడును) వసు వగును.

'రుదన్తి రోదయన్తీతి ప్రాణా రుద్రాః। క్రూరా హి మధ్యమే వయ స్యతో రుద్రాః।' — శం. భా.

'రోదించునవి. రోదింపజేయునవి' గాన ప్రాణములకు 'రుద్రాః' అని పేరు. ఇవి మధ్యమవయస్సున నతిక్రూరములై యొప్పును. అందుచే వీనికి 'రుద్రాః' అని యన్వర్థసంజ్ఞ.

'పరిణామ తాప సంస్కార దుఃఖై ర్గుణవృత్తి రోధా చ్చ దుఃఖ మేవ సర్వం వివేకినః' — పాతం. యో. సూ. 2-15.

కర్మలచే- భోగములచే- నింద్రియములకు గలుగు తృప్తి సుఖము. అట్లు తృప్తి లభింపక కలిగెడి యశాంతి దుఃఖము. "నాస్తి తృష్ణాసమం దుఃఖం నాస్త్యతృష్ణాసమం సుఖ' మ్మని యభియుక్తోక్తి. వివేకు లగు మహనీయుల దృష్టిలో తాత్కాలిక మగు నీ సుఖ మంతయు గూడ దుఃఖరూపమే

యగును. అట్లు దుఃఖము వలన క్లేశపడెడి ప్రాణములు రోదనధర్మము గల్గి రుద్రరూపము లగు నని శ్రుతితాత్పర్యము.

తృతీయ సవనరూప మగు తృతీయవయస్సున ఆదాన ధర్మముతో నొప్పి ప్రాణము లాదిత్యరూపములు (ఏతే హీదగ్ం సర్వ మాదదతే) అగును. ఆదిత్యున కాదాన మసాధారణ ధర్మము. 'ఆదత్తే హి రసం రవిః' అను కాళిదాససూక్తియు నీ విషయమును జెప్పుచున్నది. ఆదిత్యుడు రసమును (జలాదికమును) గ్రహించు నట్లు పరిణత మగు వయస్సున నుండెడి వేదవిదుని ప్రాణములును శబ్దాదిజాతమును సర్వమును గ్రహించును – అని శ్రుతితాత్పర్యము. (తే హీదం శబ్దాదిజాత మాదదతే ఇత ఆదిత్యాః – శం. భా.)

కాన సవనత్రయాత్మక మగు పురుషయజ్ఞము త్ర్యాయుషము. ఎట్టి విచ్ఛిత్తియు లేకుండ యజ్ఞనిర్వహణార్థమై యిట్టి యీ త్ర్యాయుషము నను గ్రహింపు మని యుపనీతు లగు వటువులు గూడ సమిదాధానరూప మగు అగ్నికార్యసమయమున నగ్ని నర్థించెడి సంప్రదాయము గలదు.

"త్ర్యాయుషం జమదగ్నేః కశ్యపస్య త్ర్యాయుషం
యద్దేవానాం త్ర్యాయుషం తన్మే అస్తు త్ర్యాయుషమ్."

జైమినీయోపనిషద్బ్రాహ్మణము గూడ నీ పురుషయజ్ఞ స్వరూపము నిట్లే వివరించి, పిదప త్ర్యాయుష మన నిదియే యను నట్లుగా నట్టి త్ర్యాయుషము నర్థించెడి పై మంత్రమును కొలది మార్పుతో ని ట్లుదహరించినది.

"త్ర్యాయుషం కశ్యపస్య జమదగ్నే స్త్రాయుషమ్।
త్రీణ్యమృతస్య పుష్పాణి త్రీ ణ్యాయూంషి మే ఉకృణోః"

— 1-4-3.

పుష్పముల గాపాడుకొనుచో నవి ఫలముల నొసగు రీతిని, కర్మా ద్యను ష్ఠాన తత్పరుడై త్ర్యాయుషము లనెడి యీ పుష్పముల గాపాడుకొనుచో నమృతత్వ ప్రాప్తి యోగ్యము లయిన ఫలముల నొసగ గలవు. అందుచే వీనిని 'అమృతస్య పుష్పాణి' యని శ్రుతి నిర్దేశించినది.

ఇక ప్రకృతమునకు వత్తము. పై శ్రుతి ప్రామాణ్యము ననుసరించి మొదట కర్మనిష్ఠుడై వసురూపుడు, జిజ్ఞాసాపరుడై రుద్రరూపుడు నైన వేదవిదుడు బ్రహ్మనిష్ఠుడై యాదిత్యరూపు డగు ననుట యుక్తమే. అట్టి యాదిత్యరూపులకు శ్రుతి స్వసయై యొప్పును.

స్వస యన సోదరి యని సామాన్యముగ నర్థము. 'స్మస్మిన్ సీదతీతి స్వసా' - అని యాస్కనిర్వచనము. 'సు అసా వేషు సీదతీతి స్వసా' అనియు మఱియొక నిర్వచనము (నిరు. టిప్పణి). జిజ్ఞాసాపరుడై బ్రహ్మనిష్ఠు డైనవానికి శ్రుతి తన వాక్యము లన్నియు నాత్మయందే (స్మస్మిన్) సమన్వయ పఱచి వెలయుచు, తోడనుండి, స్వస యగు నని భావము. ఆదిత్యుడు రసమును గ్రహించునట్లు, బ్రహ్మనిష్ఠుడై యాదిత్యరూపు డగు నీ వేదవిదుడు త్రయీవిద్యా సారమగు రసమును (బ్రహ్మామృతానంద రసమును) గ్రహించి యాదిత్యు డను అన్వర్థనామము నొందును.

కాగా, మొదట వేదాధ్యయన కర్మానుష్ఠానాదులు, పిదప శ్రవణ మననాదులు—'వీని ద్వారా శ్రుతి ప్రభుసంమితము, సుహృత్సంమితము నగుచు సాధకుని హృదయము నందు గ్రమముగ పరసత (చక్కని చిత్తసంస్కృతి) నాపాదించి, తుదకు కాంతాసంమితముగ నాత్మ (లేక తన) స్వరూపమును దర్శింప జేయుచు బ్రహ్మానంద రసావలిప్తుని గావించు చున్నది

అమృతస్య నాభిః_ అనాగా- అదితిః -

శ్రుతియందలి యిట్టి వైదగ్ధ్యమును దర్శించిన వేదవిదు లగు మహనీయులనే 'యే విద్వాంస స్తే కవయః' - అని శ్రుతి కీర్తించినది. అట్టి విద్వాంసు లగు కవులే వేదకావ్యకుశలు రగు సహృదయు లని పూర్వము చెప్పబడినది. వారికి అమృతరూప మగు నానందమును దర్శింప జేయునది గావుననే శ్రుతి 'అమృతస్య నాభిః_ అమృతమున కావాసస్థానము' అగు చున్నది.

అపౌరుషేయమై, యందుచే పురుషబుద్ధికృత దోషరహితమై (అనాగాం), అఖండనీయమై- సర్వదేవతా మంత్ర తత్త్వ ప్రఖ్యాపిక యగుచు సర్వదేవతా మాతృమూర్తియై, అదితి[1] స్వరూపిణి యగు వైదిక వాణిని వధింపకుడు (మా వధిష్ట) - హింసింపకుడు- అని పై మంత్రమునకు శ్రుతిపర మైన యర్థము.

ఇట్లు 'మాతా రుద్రాణామ్' అను నీ మంత్రము ద్వారా శ్రుతి తన స్వభావమును తానే భంగ్యంతరముగ నిరూపించుకొనినట్లు స్పష్ట మగును. పై శ్రుతివలన బ్రహ్మనిష్ఠు లయిన వేదవిదులకు శ్రుతి బ్రహ్మవిద్యా రూపిణియై స్వసయై యుప్పు నని తెలిసినది.

అంబిక - బ్రహ్మవిద్యారూపిణి - స్వస :-

బ్రహ్మవిద్యారూపిణి యగు అంబికయు బరమేశ్వరునకు 'స్వస'యై విరాజిల్లుచుండు నని శ్రుతి యిట్లు చెప్పుచున్నది,

'ఏష తే రుద్ర భాగః సహ స్వస్రాఽమ్బికయా, తం జుషస్వ'

— తై.సం. 1-8-6-1.

---

1. అదితి ర్ద్యౌ గౌః — వా.సం. 38-2; శ.బ్రా. 14-2-1-7; 2-3-4-348.
వా గ్వా అదితిః — శ.బ్రా. 6-5-2-20.

వాజసనేయశ్రుతియందు (3-57) నీ వాక్య మిట్లే గలదు. శతపథశ్రుతి యీ వాక్యము నిట్లు వివరించినది.

> 'అమ్బికా హ వై నామాఽస్య స్వసా, తయాఽస్యైష
> సహభాగః' — శ. బ్రా. 2-6-2-9.

కాన బ్రహ్మవిద్యారూపిణి యగు పరమేశ్వరి పరమేశ్వరునకు స్వస యైనట్లు బ్రహ్మనిష్ఠు డయిన వేదవిదునకు బ్రహ్మవిద్యారూపిణి యగు శ్రుతియు స్వసయై యొప్పుట శ్రుతిసంప్రదాయానుగుణమే యగును.

కేనోపనిషత్తునందును ఇంద్రునకు సాక్షాత్కరించిన హైమవతియగు ఉమ పరమేశ్వరసహవర్తిని, బ్రహ్మవిద్యారూపిణి యగు పరాదేవత యని శ్రీశంకరభగవత్పాదు లిట్లు వివరించిరి.

> 'తస్యేంద్రస్య యక్షే భక్తిం బుద్ధ్వా విద్యా ఉమారూపిణీ ప్రాదురభూత్ స్త్రీరూపా। స ఇంద్ర స్తా ముమాం బహుశోభమానాం - సర్వేషాం హి శోభమానానాం శోభనతమా విద్యా, తదా బహుశోభమానేతి విశేషణ ముపపన్నం భవతి, హైమవతీం హేమకృతాభరణవతీ మివ బహుశోభమానా మిత్యర్థః। అథవా ఉమైవ హిమవతో దుహితా హైమవతీ నిత్య మేవ సర్వజ్ఞే నేశ్వరేణ సహ వర్తత ఇతి జ్ఞాతుం సమర్థేతి కృత్వా తాం - ఉపజగామ' — పదభాష్య.

> 'స శాన్తాభిమాన ఇంద్రోఽత్యర్థం బ్రహ్మజిజ్ఞాసుః.... స్త్రియ మతిరూపిణీం విద్యా ముమాజగామ। అభిప్రాయోద్బోధ హేతుత్వా ద్రుద్రపత్న్యుమా హైమవతీవ సా బహుశోభ మానా విద్యైవ। విరూపోఽపి విద్యావాన్ బహు శోభతే।'
> — వాక్యభాష్య.

విజయగర్వమోహితులై యగ్నివాయువులు తమ యెదుట ప్రత్యక్షమైన యక్షమును యక్షమును గానే దర్శించిరి. ఆ యక్షము తన యెదుట నుంచిన తృణమునుగూడ నగ్ని దహింపలేకపోయెను. వాయు వా తృణమును గదిలింపనే లేకపోయెను. ఇట్లు వారు పరాభూతు లయిన పిదప ఇంద్రుడు రాగా నా యక్ష మంతర్హిత మయ్యెను. కాని యింద్రు డా యక్షమును యక్షముగా గాక పరమేశ్వరస్వరూప మని గుర్తింప నాతని మనస్సు భక్తినిర్భరము, శాంతాభిమానమై జిజ్ఞాసాపరవశము నయ్యెను. అగ్నివాయువుల వలె గాక యింద్రుడు శాంతాభిమానుడు బ్రహ్మనిష్ఠుడు; నగుట జేసి హైమవతి యగు ఉమ బహుశోభమాన యగుచు సాక్షాత్కరించెను. ఇంద్రు డంతట – 'ఈమె సర్వజ్ఞు డగు పరమేశ్వరునితో నిత్యము తోడ నుండునది; బ్రహ్మవిద్యాస్వరూపిణి; కాన పరమేశ్వర స్వరూపమును దెలియజాలినది' యని తెలిసి యామెను జేరి యుపాసించెను. బుద్ధిని వికసింపజేసి పరమార్థమును దర్శింపజేయు విద్యలలో బ్రహ్మవిద్య యుత్తమోత్తమము. ఎంతటి విరూపవంతు డయినను విద్యచే శోభించును. అందును బ్రహ్మవిద్యచే మిగుల శోభించును. కనుక బ్రహ్మవిద్యారూపిణి యగు ఉమ 'బహుశోభమానా' యని కీర్తింపబడినది – అని యర్థము.

ఇట భక్తిప్రవణుడై జిజ్ఞాసాపరవశు డయిన యింద్రునకు పరాదేవత బ్రహ్మవిద్యాస్వరూపిణియై సాక్షాత్కరించి పరమార్థమును దర్శింపజేయుట గమనార్హము. యక్షరూప పరమేశ్వర స్వరూప దర్శన భాషణాదులచే నగ్నివాయువులు ఇతరదేవతల కంటె భాగ్యాతిశయ సంపన్నులే. వారికంటెను గూడ భక్తినిష్ఠుడై, శాంతాభిమానుడై, బ్రహ్మవిద్యాసాక్షాత్కారము నొందిన యింద్రుడు లోకోత్తరభాగ్యశాలి. కావుననే ఏతద్ (తృణం) దహ; 'ఏతద్ (తృణం) ఆదత్స్వ' – ఇది దహింపుము ఇది కదిలింపుము – అని యిట్లు పరీక్షించి పరోక్షముగ నగ్నివాయువులకు

దన పారమైశ్వర్యమును ప్రబోధించిన యక్షమే శాంతాభిమానుడై, భక్తి ప్రవణమనస్కుడై జిజ్ఞాసువై యుత్తమాధికారి యయిన యింద్రునకు ఉమారూపిణియై స్త్రీరూపమున సాక్షాత్కరించి బ్రహ్మవిద్యోపదేశము జేయుట గుర్తింప నగును.

శ్రీ మాధవాచార్యులచే గూడ నీ శ్రుతితాత్పర్య మిట్లే కాలమాధవీయమున నిట్లు వివరింపబడినది.

'భక్తానుగ్రాహిమూర్తిస్వీకార శ్చ తలకాలాఖ్యే సామవేద శాఖావిశేషే కస్యాంచి దాఖ్యాయికాయా మామ్నాయతే। తస్యాం హ్యాఖ్యాయికాయా మేవ ముక్తమ్ - అగ్ని వాయ్వింద్రాదయో దేవా ఈశ్వరానుగృహీతాః సన్తో విజయమానాః స్వకీయ మేవైత త్సామర్థ్య మిత్యభిమన్యంతే। తాన్ బోధయితు మవాఙ్మానసగమ్యం పర మేవ బ్రహ్మ పూజ్యాం యక్షరూపాం కాంచి న్మూర్తిం ధారయిత్వా ప్రాదుర్బభూవ। తయా సహ వాదం కృత్వాఽపి రాజస చిత్తా వగ్నివాయూ బ్రహ్మత్వం నైవ బుబుధాతే। ఇంద్ర స్తు సాత్త్వికచిత్తో బుబుధే' - ఇతి. — ఉపోద్ఘాతప్రకరణమ్.

పరమేశ్వరుడా యా సమయములందు భక్తుల చిత్తసంస్కృతుల ననుసరించి తత్తదనుగ్రహయోగ్య మూర్తివిశేషముల స్వీకరించుచుండు నను విషయమును కేనోపనిషత్తు ఒక యాఖ్యాయికారూపమున వివరించినది. పరమేశ్వరుడు పూజ్య యక్షరూపమున సాక్షాత్కరించినను విజయాభిమాన మోహితులై రాజసచిత్తు లగుట జేసి యగ్నివాయువులు బ్రహ్మతత్త్వము దెలియజాలక పోయిరి. సాత్త్వికచిత్తు డగుటచే నింద్రుడు తెలియజాలెను- అని యర్థము.

రాజసచిత్తులగు నగ్నివాయువులకంటె సాత్త్వికచిత్తుడై యుత్తమాధి కారి యయిన యింద్రునకు బ్రహ్మవిద్య స్త్రీరూపమున సాక్షాత్కరించి యాత్మస్వరూపమును దర్శింపజేయుట స్పష్ట మని తెలియనగును. కాన పరమేశ్వరునకు సహవర్తినియై స్వసయై శోభిల్లు పరాదేవతవలె బ్రహ్మ నిష్ఠుడై పరలెడి వేదవిదునకు శ్రుతి తోడ నుండి స్వసయై యాత్మస్వరూప సౌందర్యాదుల దర్శింపజేయు ననుట యుక్తమే యగును.

'ఉతో త్వస్మై తన్వం విసస్రే జాయేవ పత్య ఉశతీ సువాసాః' (ఋ.10-71-4) ఇత్యాది శ్రుత్యర్థమే యిట నాఖ్యాయికారూపమున జమత్కార ముగ శ్రుతిచే బ్రదర్శింపబడిన దని తెలియనగును. కాన అధికారిభేదము ననుసరించి ప్రభు–సుహృత్–కాంతా సంమితత్వ మార్గముల ద్వారా సాధకుల కర్మ–ఉపాసనా–జ్ఞాననిష్ఠుల నొనరించుటయే త్రయీవిద్యారూప వేదకావ్య స్వభావము.

చారిత్రికుల దృష్టి :-

కాని చరిత్రకారులు కవి– కావ్య పదములకు బైన బేర్కొనిన శ్రుతి స్మృతి కావ్య సంప్రదాయ సిద్ధము లయిన యర్థముల గ్రహించినట్లు కన్పట్టదు. వారు 'Poet-Poetry' అని యీరీతిగానే యా పదముల ననువదించిరి. ఆ పదములకు గల యర్థగాంభీర్యము వారిచే రూపొందింప బడిన కోశముల వలనను తేటపడుట లేదు. 'Poet-Poetry' అను నీ యాంగ్లపదములను పాశ్చాత్యకవులు విమర్శకులు ప్రాయికముగ నే యే యర్థము లందు బ్రయోగించి, యట నట నా పదముల యర్థముల నిర్వ చించిరో, యా దృష్టితోనే శ్రుతిని, యందలి కవి కావ్య పదముల బరిశీలించుటకు చారిత్రికులు బూనుకొని నట్లు గన్పట్టును. ఆ దృష్టితోనే చూచి లౌకికకావ్యము లందు వలె వేదమున 'చమత్కృతి (Poetic Merit)

యెడ నెడ కొలదిగ గన్పట్టుచున్నను మొత్తముమీద వేదమునందు కావ్య లక్షణము లేదను భావమే వారి వ్రాతలు దెలియజేయుచున్నవి. అందు చేతనే శ్రుతియందలి 'కవి కావ్య' యనుపదములు 'మంత్రరచయిత - వారిరచన - లేక స్తోత్రము' అను నర్థముల బోధించు నవిగనే వారికి గన్పట్టినవి. శ్రుతిదృష్టిలోను తత్సంప్రదాయ ప్రవర్తకు లగు మహర్షుల దృష్టిలోను మహాకవుల దృష్టిలోను గల కావ్యలక్షణము వేఱు; ఈ చరిత్రకారుల దృష్టిలో గల కావ్యలక్షణము వేఱు. దృష్టిభేదమే యీ పదముల కిట్టి యర్థమును జెప్పుటకు కారణ మైనది.

పాశ్చాత్యపండితులు, కవులు - వీరి దృష్టిలోని కావ్య (Poetry) స్వరూపమును జూతము. కావ్య (Poetry) మనగా :-

1) Metrical Composition — ఛందోబద్ధమైన రచన.

— జాన్సన్.

2) 'The art of uniting pleasure with truth by calling imagination to the help of reason' — చమత్కారజనకమగు కల్పనతో సహేతుకముగ వాస్తవికతను ఆనందముతో మేళవించెడి కళ.

— కోశము.

3) 'The thought and words in which emotion spontaneously embodies itself — అప్రయత్నముగ నావేశముతో రూపొందు భావము, శబ్దములు.

4) The art of employing words in such a manner as to produce an illusion on the imagination, the art of doing by means of words what the painter does by means of colours — వాస్తవముగ లేకున్నను చిత్రలేఖకుడు రంగులతో నొక వస్తువును సజీవముగ నున్న యటుల చిత్రించునట్లు, శబ్దములతో లేని యర్థము నున్న యటుల భ్రాంతిని గొల్పి చమత్కరించు కళ. — మెకాలే.

5) The expression of the imagination — ఊహాభివ్యక్తి.

— షెల్లీ.

6) The language of the imagination and the passions — ఊహలను, భావోద్రేకములను ప్రతిబింబింప జేయు భాష.

— హాజ్లిట్.

7) The anti–Thesis of science, having for its immediate object pleasure, not truth — కవితకు లక్ష్య మానందము; వాస్తవికత గాదు: కాన భౌతికశాస్త్రమున కిది విరుద్ధము. — కోలెరిడ్జ్.

8) The most delightful and perfect form of utterance that human words can reach — మానవుడు శబ్దజాలముతో రూపొందింప గల్గిన ఆహ్లాదకరము, పూర్ణము నగు రచన. —మాథ్యూ ఆర్నాల్డ్.

9) Musical thought – లయసమన్విత భావము. —కార్లైల్.

10) The spontaneous overflow of powerful feelings – ఒక్కసారిగా పొంగి పొరలెడి ప్రబల – ఉదాత్త – భావపరంపర.

—వర్డ్స్‌వర్త్.

దాదాపు ఇట్టి యభిప్రాయములనే ప్రతిబింబింపజేయు నిర్వచనము లింకను గలవు. ఈ నిర్వచనము లన్నియు తమ తమ యభిరుచుల ననుసరించి వెలువడినవి. ఒకే లక్ష్యము నుద్దేశించి ప్రవృత్తము లయినవి కావు. కొందఱకు ఆనందమే లక్ష్యము; వాస్తవికత గాదు. కొందఱకు ఆనందముతో గూడిన వాస్తవికత ధ్యేయము. వాస్తవము గానిమ్ము; కాక పోనిమ్ము; గిలిగింతలు పెట్టి యాకర్షించుట కొందఱ కభిమతము. పొంగి పొరలెడి ప్రబల భావావేశపరంపరలో తన్మయీభావము కొందఱు కాంక్షించునది. ఇట్లు పరిశీలించుచో నీ నిర్వచనముల కొకే లక్ష్యము లేదనుట స్పష్టమగును. ఇవి యన్నియు దాదాపు అలంకార ప్రాధాన్యమును జెప్పెడి భారతీ

యాలంకారికుల నిర్వచనములలో నంతర్భూతము లగు నని చెప్ప వచ్చును. 'సౌందర్య మలంకారః' అని భట్టవామనుని వచనము. మనస్సును రంజింప జేయు సౌందర్యము అలంకార మని యర్థము. 'A thing of beauty is Joy for ever' ఇత్యాది పాశ్చాత్యకవుల వచనములు భట్టవామనుని వచనమును స్ఫూర్తికి దెచ్చుచుండును. 'బాహ్యసౌందర్యమును జూచి ప్రభావితమై పొంగి పొరలెడి యావేశముతో మూర్తీభవించెడి చమత్కారజనక శబ్దార్థ సన్నివేశము కావ్యకళ' అని యీ యన్ని నిర్వచనముల గలిపి జూచిన సిద్ధించెడి సారాంశముగా దెలియనగును.

ఇట్టి దృష్టితోనే – 'ప్రకృతి దృశ్యముల జూచి పరవశులైన ఆర్యులనెడి వారి రచనలు వేదములు' – అని చారిత్రికుల కల్పన సాగినది. 'శ్రుతుల యందలి ద్యావా పృథివీ – అగ్ని – వాయు – ఆదిత్యాది వర్ణనలు కేవలము ప్రకృతిదృశ్య వర్ణనలు గావు; అవి మంత్రములు; మననశీలములు; మననము జేయు కొలది ఆధిభౌతిక – ఆధిదైవిక – ఆధ్యాత్మికార్థముల ప్రబోధించునవి; బాహ్యసౌందర్య వర్ణన వ్యాజమున అంతర దృష్టిని గలిగించునవి; శివతమ రసాస్వాదరూప మగు నజ్ఞాతార్థము వైపు దృష్టిని మరల్చునవి (వేదయతీతి వేదః; నితరాం వేదయతీతి నిపత్)' –అనియెడి యిట్టి విషయములు చారిత్రికుల దృష్టిలో నున్నట్లు వారి విమర్శల వలన గోచరింపదు.

భారతీయాలంకారికులు, మహాకవులు, మహర్షులు, శ్రుతియును జూపిన కవి–కావ్య–రస–ఆనంద–అలంకార–రీతి–శయ్యాది స్వరూపములు గాని, అధికారిభేదము ననుసరించి యీ పదములచే దెలియబడెడి విశిష్ట వివిధార్థ స్వరూపము గాని చారిత్రికుల విమర్శల వలన దెలియదు. అట్టి యర్థగాంభీర్యమును దర్శించి యా దృష్టితో శాస్త్రమును ప్రవర్తింపజేసిన వారు భారతీయాలంకారికులు. ఈ లక్ష్యమును విస్మరింపక భవ్య కవితావేశ

ముతో గావ్యముల గానము చేసినవారు భారతీయ మహాకవులు. అందుచే భారతీయాలంకారికుల వచనములు, భారతీయ మహాకవుల సూక్తులు బరిశీలించినచో శ్రుతి యుద్దేశించిన 'కవి-కావ్య' స్వరూపము తేటపడు నట్లు, అట్టి దృష్టిని ప్రతిబింబింప జేయని చారిత్రికుల కల్పనల నెంత బరిశీలించినను నా స్వరూపము గోచరము గాదు.

శ్రుతియే ప్రత్యక్షముగను, పరోక్షముగను, కాంతాసంమితముగను తాను ప్రభు - సుహృత్ - కాంతాసంమితముగ కర్మ - భక్తి - జ్ఞాన యోగముల ప్రబోధించెడి త్రయి; విద్య; కావ్యము; ఛందస్సు - అని చెప్పికొనుట పూర్వము వివరింపబడినది. కాన శ్రుతి యందలి త్రయీ-విద్యా- కావ్య- ఛందః స్వరూపముల సాకల్యముగ దర్శించిన గాని శ్రుతి స్వరూపమును యథాతథముగ గ్రహింప శక్యము గాదనుట శ్రుతి తాత్పర్యము.

'భారతీ' యనియు వేదవాణికి నామము. భారతీ స్వరూప పరిశీలనము జేసియు నీ వేదముయొక్క 'త్రయీ- విద్యా- కావ్య' స్వరూప మింకను తేటపడ గలదు. ఇక భారతీ స్వరూపమును జూతము.

భా ర తీ

భరంతీ త్రైలోక్యం త్రిభువనపతే ర్యా సహచరీ
వసంతీ చిత్తేషు ప్రథయతి పదం సాధయతి చ ।
చరంతీ యజ్ఞేషు హ్వాయతి చ సురాన్ పాలయతి యా
పరాం భారత్యాఖ్యాం హరిహృదయలక్ష్మీం హృది భజే ॥

అంబ ! భారతి ! నిరుక్తి రంజితే
సూనృతే మధుర సూక్త శోభితే ।
భావనాంబర విహార విశ్రుతే
పాహి పావని హరిప్రియే శివే ॥

భారతీ భరతస్యేయం హరే స్సర్వస్వరూపిణీ ।
హృదయే హృదయే నిత్యం విహరంతీ విరాజతామ్ ॥

— వేదమాతృస్తవః

తిస్రో దేవ్యః :-

వేదవాణి తన నారాధించెడి వసు-రుద్ర-ఆదిత్యస్వరూపు లగు వేదవిదుల యధికారి (అవస్థా) భేదము ననుసరించి యొకపుడు దుహితయై, ఇంకొకయెడ మాతయై, పిదప స్వసయై - ఇట్లు మూడు రూపములతో వెలసి యుపదేశించుచు అదితియై అనగా సర్వదేవతాత్మక మగు నఖండ వాణి లేక శక్తియై, తుదకు అమృతనాభియై వరలు నని యింతకు బూర్వము వివరింపబడినది. ఈ వేదవాణియే భారతి.

కాని శ్రుతులయందు ఒక భారతినామమే గాక దీనితోపాటు ఇడా-సరస్వతీ నామములు గూడ తఱచుగ వినవచ్చుచున్నవి. ఈ మూడు

నామములతో శ్రుతులయందు ముప్వురు దేవతలు సాక్షాత్కరింతురు ఈ ముప్వురికి నిరంతర సాహచర్య మున్నట్లును గన్పట్టును. వీరు 'తిస్రో దేవ్యః' (ఋ 1-13-9; తై.బ్రా. 2-6-14-4 మొ) అని వ్యవహరింపబడుచు యజ్ఞభూమి కాహ్వానింపబడుట శ్రుతులయందు పెక్కుచోట్ల గానవగును. ఒక్కొకపుడు ఇడా-సరస్వతీ-భారతీ[1] యని ప్రత్యేకముగ మూడు నామములతోను, కొన్నియెడల[2] 'ఇడాః, లేక సరస్వతీః, లేక భారతీః' అని యొక్కొకనామముచేతనే ముప్వురు వ్యవహరింపబడుటయు గలదు, ఇంకొకయెడ మహీః, మాతరః - ఇత్యాదిపదములచే గూడ గీర్తింపబడుటయు గలదు - ఇట్లు జూచినచో నీ క్రింది యాక్షేపము లుత్పన్నములు కాగలవు.

ఆక్షేపములు :-

1) ఇడా-సరస్వతీ-భారతీ యను నీ ముప్వురును దేవతలు గదా। అట్టియెడ భారతి యను పద మొకదేవతావాచక మగును గాని వేదవాచక మగుట యెట్లు ?

---

1. 'ఇడా సరస్వతీ భారతీ' — వా.సం. 27-19; తై.సం. 4-1-8-2; మై.సం. 4-13-8; కా.సం. 18-17; 19-13; తై.బ్రా. 3-6-13-1.

"సరస్వతీ సాధయంతీ ధియం న ఇళా దేవీ భారతీ విశ్వతూర్తిః।"

"తిస్రో దేవీః" — ఋ. 2-3-8.

'ఇడా సరస్వతీ భారతీ మహీః' — వా.సం. 28-8; తై.బ్రా. 2-6-7-4.

'ఇడా సరస్వతీ మహీ' — ఋ. 1-13-9 మొ॥; అ.సం. 5-27-9; మై.సం. 2-16-6,

2. 'భారతీః' — తై.బ్రా, 2-6-17-6;

'ఇడాభిః' — వా,సం. 21-14.

2) మఱియు భారతీపదము ఈ దేశము నందును, ఇందలి ప్రజ యందును ప్రసిద్ధ మైన ట్లీ క్రింది పురాణవచనముల వలన దెలియు చున్నది.

దుష్యంతపుత్రుడు భరతుడు-భారతీప్రజ :-

"భరతా ద్భారతీ కీ ర్తిః యే నేదం భారతం కులమ్।
అపరే యే చ పూర్వే వై భారతా ఇతి విశ్రుతాః॥"
— భార, 1-74-134.

"దుష్యంతా ద్భరతో జజ్ఞే విద్వాన్ శాకుంతలో నృపః।
తస్మా ద్భారతవంశస్య వి ప్రతస్థే మహద్యశః॥"
— భార. 1-94-19.

"చక్రవర్తీ తతో జజ్ఞే దుష్యంతా త్పృమితింజయః।
శకుంతలాయాం భరతో యస్య నామ్నా తు భారతాః॥"
— మత్స్య. 49-11.

ఋషభపుత్రుడు భరతుడు_భారతవర్షము:_

"అథ భగవాన్ ఋషభదేవ....ఆత్మజానాం ఆత్మసమా నానాం శతం జనయామాస। తేషాం ఖలు మహాయోగీ భరతో జ్యేష్ఠః శ్రేష్ఠగుణ ఆసీత్; యేనేదం వర్షం భారత మితి యత ఆరభ్య వ్యపదిశంతి"
— భాగ. 5-4-8;9.10.

"ఋషభాత్ భరతో జజ్ఞే వీరః పుత్రశతాగ్రజః।
సోఽభిషి చ్యాఽథ ఋషభః పుత్రం ప్రావ్రాజ్య మాస్థితః॥

హిమాహ్వం దక్షిణం వర్షం భరతాయ న్యవేదయత్।
తస్మా త్తద్భారతం వర్షం తస్య నామ్నా విదు ర్బుధాః"
— వాయు. పు. 33-51, 52. — విష్ణు. పు. 2.1-27 నుండి 32.

మనువు భరతుడు—భారతవర్షము—భారతీప్రజ :-

"వర్షం య ద్భారతం నామ యత్రేమా భారతీ ప్రజా॥
భరణా చ్చ ప్రజానాం వై మను ర్భరత ఉచ్యతే।
నిరుక్తవచనా చ్చైవ వర్షం త ద్భారతం స్మృతం॥
—వాయు. పు. 47-76; మత్స్య. పు. 113-5.

లోకమే భారతము :-

"లోకో౽యం భారతం వర్షమ్" —అమరకోశః

"మహర్షి వ్యాసరచితే జంబూద్వీపే చ భారతమ్॥" —రభసః

"వర్షం స్థానం విదుః ప్రాజ్ఞా ఇమం లోకం చ భారతమ్"—భారవి

"వర్షో౽స్త్రీ భారతాదౌ చ జంబూద్వీపాబ్దవృష్టిషు" —అమరసుధా

"అత ఏవ సామాన్యవిశేషభావాత్ జంబూద్వీపే తదేకదేశే చ భారతప్రయోగః, ప్రకరణాదిభి స్తు తదవగమః"
—ముకుటః (చూ. అమరసుధాటిప్పణి).

పై పురాణవచనములయం దొకచో దుష్యంతపుత్రు డగు భరతుని వలనను, వేరొకచో ఋషభపుత్రు డగు భరతుని వలనను, నింకొకచో భరతు డగు మనువు వలనను నీ దేశమునకు భారతవర్ష మనియు, నిందలి ప్రజకు భారతీప్రజ యనియు ప్రసిద్ధి వచ్చినట్లు గన్పట్టును. ఇంతే కాదు. లోకమున కంతటికిని భారతవర్ష మని ప్రసిద్ధి యున్నట్లు అమరసింహుని యొక్కయు భారవి యొక్కయు వచనముల వలన దెలియుచున్నది. జంబూద్వీపమే

భరతవర్ష మనియు కొన్నికోశములు చెప్పుచున్నవి. మొత్తముమీద భరత భారత—భారతీ పదములు లోకవాచకములుగనో, ఈ దేశనామములుగనో, లేక యిందలి ప్రజానామములుగనో ప్రసిద్ధమై యుండుట స్పష్టము. అట్టి యెడ నీ భారతీపదము వేదవాచక మగు టెట్లు ?

మఱియు భారతదేశము, భారతీప్రజ యను ప్రసిద్ధికి పై వచనము లలో నొకటి ప్రమాణ మగుచో మిగిలినవి యప్రమాణములు కావలసి వచ్చును. అట్లుగాక యన్నియు ప్రమాణము లనుట యెట్లు ?

(3) ఇదియుగాక చరిత్రకారుల వాద మింకొక తీరుగ నున్నది. 'వేదరచయిత లని చెప్పబడెడి యార్యులలో బెక్కు తెగలు గలవు. వానిలో 'భరతులు' అను తెగ యొకటి. ఆర్యుల లోని యన్ని తెగలవారికి నగ్ని యారాధనీయుడే. అయినను భరతులచే నారాధింపబడుటచే నగ్నికి 'భారతః' అనియు, వారిని రక్షించి బ్రోచెడి యొక దివ్యశక్తికి (Protective Divine Power) 'భారతీ' యనియు ప్రసిద్ధి గలిగినది. భారతీదేవికి సరస్వతీసాహచర్యము గన్పట్టుట జేసి భరతు లనెడి తెగవారికి సరస్వతీ నదితో సంబంధ మున్నట్లు తెలియును, అనగా ఈ భరతు లను తెగవారు సరస్వతీనదీ తీరమున నివసించి యుండి తమదేవత యగు భారతిని గొల్చి యుండవలెను.' (చూ. 'Vedic Index of Names and Subjects' by A. A. Macdonell & A. B. Keith). మఱియు భరతులు సరస్వతీ నదీ తీరమున నివసించి యా నదిని గూడ నొక దేవతగా భావించియుందు రని పెక్కు చరిత్రకారుల యభిప్రాయము. భరతులు, భారతులు, సరస్వతి — వీనిని గూర్చిన విషయమై చారిత్రికులలో మతభేదములు చాల గలవు. ఏమైనను ఈ చారిత్రికుల వాదములను బట్టియు భారతీపదము వేదవాచకము గాదని తెలియును అగుచో వేదవాణిని భారతి యనుట యెట్లు ?

కాన భారతీస్వరూపము తేటపడుటకై పై విషయముల బరిశీలింప వలసి యున్నది. ముందు చారిత్రికుల వాదములో సామంజస్య మెంత గలదో చూతము.

భరత_భారత-భారతీపదములు - చారిత్రికుల కల్పన-అసామంజస్యము :-

(1) 'భరతు లనెడి యొక తెగవారిచే నారాధింపబడుటజేసి యగ్నికి భరతు డనియు, ఆ తెగవారిని రక్షించెడి యొక దివ్యశక్తికి వారి ననుసరించి భారతి యనియు బ్రసిద్ధి గలిగినది.'_యనెడి వాదము కేవలము ఊహా కల్పితము; శ్రుతిప్రసిద్ధము కాదు; యుక్తిసహమును గాదు. లోకమున నేదేని యొక దేవతను ప్రధానముగ నారాధించుట వలన తదారాధకులకు తదనుగుణముగ శైవులు, వైష్ణవులు గాణాపత్యులు — అని యీ విధముగ వ్యవహార మేర్పడుట గలదు. ఒక మహాప్రవక్త ననుసరించి తదనుయాయులకు బౌద్ధులు, జైనులు _ అని యీ రీతి బ్రసిద్ధి వచ్చుటయు గలదు. లేక యా మహాప్రవక్తలచే బ్రవచింపబడెడి యొక మూలసిద్ధాంతము నాదరించుట వలనను ద్వైతులు, విశిష్టాద్వైతులు_అని యీ రీతిగ బ్రసిద్ధి గల్గుటయు గలదు. అంతియే కాని ఆరాధకుల వర్గము, లేక సంఘము మొదలగు వాని ననుసరించి యా యా దేవతకు గాని, ప్రవక్తకు గాని, నామము కల్పింపబడుట లోకన్యాయ విరుద్ధము. కాన భరతు లనెడి తెగవారిచే నారాధింపబడుటచే భరత, భారతీ నామము లా యా దేవతలకు బ్రసిద్ధము లయిన వని చెప్పుట సమంజసము కాదు.

(2) 'భరతు లను నొక తెగవా రున్నట్లు శ్రుతులవలన దెలియుచున్నది.' _అని చెప్పుటయు తగదు. భరతు లనగా నొక పురోహిత

వర్గము (Priest class) అని చరిత్రకారు లూహించి తదనుగుణముగ పెక్కు చరిత్రకల్పనల జేయుచున్నారు. ఇట్లు చెప్పుట శ్రుతిసంమతము కాదు. శ్రుతులయందు భరత-భారతీ శబ్దములకు బెక్కు నిర్వచనములు గానవచ్చును. అందెచటను 'భరతు లనగా నొక పురోహితవర్గము' అను విషయము గానరాదు.

ఋత్విజులు భరతులు :-

యజ్ఞాదికర్మ ప్రయోగకుశలులై యజ్ఞమును నిర్వహించెడి వారికిని, యజ్ఞమును జేసెడి యజమానులకును -'ఋత్విజులు' అనియు. భరతులు లేక భారతులు' -అనియు శ్రుతుల యందు బ్రసిద్ధి గలదు.

''అమంథిష్టాం భారతా రేవ దగ్నిం'' — ఋ. 3-23-2.

"ఋత్విజో గ్రావహస్తాసో భరతా వృక్తబర్హిషః"

— మాధవీయ ఋగ్వేదానుక్రమణిక.

"భరతాః- యజ్ఞద్వారేణ సర్వాన్ సంభరంతి''

— స్కందస్వామి.

"భరత ముద్ధరే మనుషించ'' — తై. బ్రా. 3-7-5-5.

''అత స్త్వం భరత మిమం యజమాన ముద్ధర। దేవేభ్యో హవి ర్భరణా ద్యజమానో భరతః' — సా. భా.

"తద్వైక ఆహు స్త్రా న్వో మహ ఇతి శంసే దేతాం వావ వయం భరతేషు శస్యమానా మభి వ్యజానీమ ఇతి వదన్తః''

—ఐ, బ్రా. 12-7.

'బిభర్తి హవి మితి భరో యజ్ఞ స్తం భరం తన్వ న్తీతి భరతా ఋత్విజః' —సా. భా.

వైదికనిఘంటువు నందును భారతశబ్దము ఋత్విఙ్నామములలో బఠింపబడి యున్నది. ఋత్విక్కు అనగా 'యజ్ఞము జేయువాడు, లేక చేయించువాడు'— అను నర్థము నిర్వచనముల ద్వారా నిరుక్తమున నిట్లు వివరింపబడినది :

'ఋత్విక్ కస్మాత్ ? ఈరణః । ఋగ్యష్టా భవతీతి
శాకపూణిః । ఋతుయాజీ భవతీతి వా' —నిరు. 3-19.

'భ్రియంతే దక్షిణాభి స్త ఇతి భరతాః। కుర్వ న్తి కర్మాణీతి
కురవః। .... ఈరయితా హి స స్తుతీనాం భవతీతి ఋత్విక్।
.... ఋగ్భి ర్హ్యసౌ యజతీతి ఋత్విక్ । .... ఋతుయాజీ
.... స హి కాలే కాలే దేవతా యజతీతి వా; ఋతౌ
యాజయతీతి వా। స హి కాలే కాలే ఏవ యాజయతే నాకాలే'
—దుర్గా - భా.

మాధవీయ ధాతువృత్తి యందును ఋత్విక్ శబ్ద మిట్లు నిర్వచింపబడినది.
'ఋతౌ యజతి; ఋతుం యజతి, ఋతుప్రయుక్తో వా యజతీతి ఋత్విక్'

పై శ్రుతులను, నిర్వచనములను బరిశీలించుచో యజనశీలు రగు యజమానులును, యజ్ఞమును నిర్వహించెడి యాజకులును - 'ఋత్విజులు; భరతులు' - అగుట తెలియును. ఇట్లు యజమానులకును, యాజకులకును భరతు లను ప్రసిద్ధి వచ్చుటకు గారణము ముందింకను వివరింపబడును ఈ భరతులు (ఋత్విజులు) ఆర్య లనెడి వారిలో నొక తెగ యని శ్రుతులయం దెవటను గన్పట్టదు; కాన నట్లు చెప్పుట శ్రుతిసంమతము కాదు.

3) 'ఈ ఋత్విజులు యజ్ఞకర్మలయందు అరణుల మథించి యగ్ని నుత్పాదింప జేయుదురు. అందుచే నట్టి యగ్ని వీరికి పుత్రస్థానీయుడు,

మథన హవిర్దానాదులచే భరతులకు సంబంధించినవాడు: కాన అగ్ని భారతుడగు' నని భాష్యకర్తలు కొన్నియెడల నాలంకారికముగ వివరించిరి. (ఋ. 2-7-1; 5; భరతా ఋత్విజః తేషాం సంబంధీ భారతః; భారతః ఋత్విజాం పుత్రస్థానీయః — సా.భా.) ఇట్టి ప్రయోగము లింకను గలవు. ఇట్లు అగ్ని పుత్రస్థానీయు డగు నను విషయము భాష్యకర్తలచే గల్పితము కాదు. ఇట్టి యభిప్రాయముల వివరించు ప్రయోగములు శ్రుతుల యందు బెక్కు గలవు. 'ద్రావిణోదాః; సహసస్పుత్రః; సహసః సూనుః; సహసో యహుః; ఋషీణాం పుత్రః' — ఇత్యాది పదము లిట్టివే.

ద్రావిణోదాః :-

ద్రవిణ మన ధనము లేక బలము. ద్రవిణదాత యగుటచే దేవతకు (అగ్ని-ఇంద్ర) 'ద్రవిణోదాః' అని పేరు. మఱియు ద్రవిణ మని హవిస్సునకును పేరు. హవిర్దాత లగుటచే ఋత్విజులకును 'ద్రవిణోదసః' అని పేరు. వారల వలన నుద్భవించుటచే నగ్నికి 'ద్రావిణోదాః' అని పేరు. ఈ విషయము నిరుక్తమున నిట్లు వివరింపబడినది.

> 'యథో ఏతత్- అగ్నిం ద్రావిణోదస మాహేతి, ఋత్విజోఽత్ర ద్రవిణోదస ఉచ్యన్తే, హవిషో దాతార స్తే చైనం జనయన్తి। ఋషీణాం పుత్రో అధిరాజ ఏషః ఇత్యపి నిగమో భవతి' — నిరు. 8.2.

కాన ఋత్విజులకు అగ్ని పుత్రస్థానీయు డని ప్రసిద్ధి. దీనిని బురస్కరించుకొని ద్రవిణోదసులను నొక తెగవా రున్నటుల నూహించుట సమంజస మగునా ? అంతే కాదు.

ఋషీణాంపుత్రః[1] :-

'ఋత్విజః వేదవిదః ఋషయః తై రుత్పాదితత్వాత్ తేషాం పుత్రవత్ పుత్రః' — మహీ-భా. (వా.సం.5-4.)

'ఋషీణాం పుత్రః మంత్రేణోత్పద్యమానత్వాత్'
—సా.భా. (శ.బ్రా. 3-4-1-25.)

'ఋషీణాం మంత్రాణాం ఋత్విజాం వా పుత్రః, తై రుత్పాదితత్వాత్' — సా.భా. (తై.సం. 1-3-7-2.)

ఋషు లనగా మంత్రములు: లేక మంత్రవిదు లగు ఋత్విజులు. అట్టి ఋషులచే మథింపబడి యభివ్యక్తము చేయబడుటచే నగ్ని 'ఋషిపుత్రు'డని యుపచరింపబడినది. ఇట్లు అగ్నియే కాదు; మంత్రములచే నభిషేక సంస్కారము చేయబడు రాజు కూడ 'ఋషీణాం పుత్రః' అని శ్రుతి[2]యందు జెప్పబడుచున్నాడు.

సహసస్పుత్రః :-

వేదవిదు లగు ఋత్విజులు బలముకొలది యరణుల మథించి నపు డగ్ని ప్రాదుర్భవించును. అందుచే నగ్నికి సహస స్పుత్రః[3] సహసః సూనుః[4] సహసో యహుః[5] అనియు నామములు గలిగినవి.

---

1. అ.వే. 4-39-9; వా.సం. 5-4; తై. సం. 1-3-7-2; మై. సం. 1-2-7. కా.సం. 3-4; శ.బ్రా. 3-4-1-26; తై.బ్రా. 2-7-15-1.
2. 'ఋషీణాం పుత్రో అభిశ స్తిపా అయమ్' —తై. బ్రా. 2-7-15-1.
'అయ మభిషేకార్హో రాజా... సో౽యు మృషీణా మృత్విజాం పుత్రో౽భిషేక సంస్కారేణ తై రుత్పాదిత్వాత్' —సా. భా.
3. ఋ. 2-7-6; వా. సం. 11-70; తై. సం. 4-1-9-2. మొ
4. ఋ. 3-24-3; 3-28-3; 8-19-25 మొ.
5. ఋ. 1-26-10; 8-60-13 మొ.

యజ్ఞముల యందు మంత్రపూర్వకముగ బలముకొలది యరణుల మథించుచో నగ్ని ప్రాదుర్భవించు నట్లు ఆధ్యాత్మికముగ మనస్సు అను అరణిని ఓజస్సుతో (తేజోరూప మగు బలముతో) మథించుకొలది దివ్య జ్యోతిస్సు ప్రాదుర్భవించు ననుట శ్రుతి[1] స్మృతి[2] ప్రసిద్ధము. అట్లు మథించెడి యోగులకు, లేక మహర్షులకు నా దివ్యజ్యోతి పుత్రస్థానీయమే యగును. యజ్ఞముల యందలి అరణిమథనము ఆధ్యాత్మికముగ జేయవలసిన మనో మథనమును భావింప జేయునది. భాష్యకర్తలును 'పుత్రవ త్పుత్రః' అని వివరించుచు శ్రుత్యుక్త మగు ఆలంకారిక భావమునే వివరించి రనుట స్పష్టము. ఈ యాలంకారిక ప్రయోగములు పరమార్థమును ప్రబోధించుటకే యుద్దిష్టములు. ఇట్టి ప్రయోగముల నుండి పరమార్థమునకు మాఱు చరిత్ర నూహించుట శ్రుతి తాత్పర్యానుగుణము గాదు. అగ్ని 'ఋషీణాం పుత్రః' అని చెప్పబడుచున్నందున ఋషు లనెడి యొక తెగవారు గల రందుమా? అట్లే భరతు లొక తెగవా రనుటయు నా తెగవారి వలన నగ్నికి 'భారత' అను ప్రసిద్ధి యేర్పడిన దనుటయు దగదు.

భరతు లనెడి యొక తెగవారివలన నగ్నికి భారత అని ప్రసిద్ధి గల్గిన దని చెప్పుచో, నా తెగవారికి భరతు లని పేరు వచ్చుటకు గారణ మేమి? దీనికి గారణమును చరిత్రకారులు చెప్పుట లేదు.

4) కొన్నియెడల భరతశబ్దము ప్రజావాచకము. తైత్తిరీయశ్రుతి యందు 'తతో వసిష్ఠపురోహితాః ప్రజాః ప్రాజాయన్త' (తై.సం. 3-5-2-1) అని గలదు. ఈ వాక్యమే కొలది మార్పులతో తాండ్యబ్రాహ్మణము నందును-'తతో వై వసిష్ఠపురోహితాః భరతాః ప్రాజాయన్త' (15-5-24)

1. 'ఆత్మాన మరణిం కృత్వా' బ్రహ్మ. ఉ. 18; కైవల్య. ఉ. 11; ధ్యాన. బిం. 22; సదానంద. ఉ. 15. మొ.

2. హరివంశము.

యని గలదు. ఈ రెండు శ్రుతులచే బ్రతిపాద్య మగు నర్థమొకటియే (చూ. త్రయీశబ్దము). ఇందలి భరతాః, ప్రజాః- అను పదములు రెండును పర్యాయ పదము లగుట స్పష్టము. అందుచే భరతు లన ప్రజ యనియు నర్థమే కాని యొక తెగయొక్క నామ మనెడి వాదము నిరాధారము. ఈ విషయము మున్ముం దింకను బరిశీలింపబడును.

5) మఱికొన్ని యెడల భరతశబ్దమునకు 'యోధులు- యుద్ధకర్మ కుశలుడు-' అనియు నర్థము గలదు. అందుచే 'భరతు లనెడి తెగవారు యుద్ధకుశలురు కూడ' నని చరిత్రకారుల యభిప్రాయము. సంగ్రామము క్షత్రియధర్మముగాని పురోహితవర్గధర్మము గాజాలదు గదా!

6) ఇడా-సరస్వతీ-భారతీ యను మువ్వురు దేవతలు పరస్పర సాహచర్యము గల్గి యున్నట్లును, కొనియెడల వీరు మువ్వురు 'మహీః, ఇడాః, సరస్వతీః, భారతీః' అని యొకే పదముచే జెప్పబడుటయు, మఱియు 'తిస్రో దేవ్యః, తిస్రో మాతరః' అని వ్యవహరింపబడుటయు శ్రుతులయందు గలదు గదా; అట్లేల చెప్పబడవలెను ? చారిత్రికులచే వీరి సాహచర్యము గూర్చి యేమియు జెప్పబడుట లేదు.

భరతు లనెడి యొక తెగవారు సరస్వతి యను నొక నదీతీరమున వసించి యుందురను నూహచేసి, 'యా కారణమున వారిదేవత యగు భారతికిని సరస్వతీనదికిని సంబంధము'-అని చరిత్రను గల్పించుచున్నారు. కాని ఇడాసాహచర్యము సంగతి యేమి? దీనినిగూర్చి యేమియు వివరింప బడలేదు.

7) 'సరస్వతి యను పదము వేదములలో మొదట నదీవాచకము మాత్రమే; అది రానురాను కొంతకాలమునకు వాగ్దేవతావాచకముగ గూడ బరిణమించినది'-అనియు చరిత్రకారుల యూహ. అట్లేల పరిణమింపవలసి

వచ్చినది ? ఎపుడు పరిణమించెను ? ఇందుకు సమాధానములు చారిత్రికులు చెప్పియుండలేదు. అందుచే వారి వాదము యుక్తిసహముగా గన్పట్టదు. ఇక శ్రుత్యనుగుణముగ భారతీ స్వరూపమును జూతము.

అగ్ని-వాయు-ఆదిత్యులు: సాహచర్యము :-

శ్రుతి అగ్నినే గాక వాయు-ఆదిత్యులను గూడ భరతు లని కీర్తించి యున్నది. వీరు భరతు లెట్లగుదురో తెలియవలెను. మఱియు ఇడా-సరస్వతీ-భారతీ యను నీ మువ్వురు దేవతలకు అగ్నివాయ్వాదిత్యులతో నిరంతర సాహచర్యము గలదు. ఈ సాహచర్య తాత్పర్య మేమి ? వీరు మువ్వురు పరస్పర సాహచర్యము గలవా రగుటచే వీరిలో నే యొకరిని గూర్చి దెలియవలె నన్నను మిగిలిన యిరువురిని గూర్చియు దెలియవలసి యుండును. కాన మొదట అగ్నివాయ్వాదిత్య దేవతాస్వరూప- సాహచర్యముల బరిశీలింపవలసి యున్నది.

అగ్నివాయ్వాదిత్యులు ప్రత్యక్షముగ గన్పట్టెడి భౌతికరూపముతోనే గాదు; వారు విలక్షణమైన దేవతాస్వరూపములతో గూడ నొప్పియుందు రని బ్రహ్మ, స్వాహా, స్వధా, త్రయీ శబ్దములయందు గొంత వివరింపబడినది. 'భూమియందలి అగ్ని, అంతరిక్షమునందు వ్యాపించు వాయువు, ఆకాశము నందలి సూర్యబింబము - ఈ మూడుమ ప్రధాన దేవత లని భ్రమించి యీ మువ్వురుదేవతలే జగద్యాత్రా నిర్వహణమునకు గారణభూతులుగ ఋగ్వేదకాలమున ప్రాచీనార్యులు భావించిరి'- అని చరిత్రకారులు చెప్పుదురు; ఈ వాదమునం దెంత సామంజస్య మున్నదో చూడవలసి యున్నది. కాన మొదట ఋగ్వేదము అగ్ని వాయ్వాదిత్యాది దేవతా స్వరూపము, సాహచర్యము నెట్లు వివరించినదో చూచి పిమ్మట వారు భరతు లెట్లగుదురో, ఇడా-సరస్వతీ-భారతీ యను వారల సాహచర్య మెట్టిదో చూతము.

అగ్నిః :—

"అగ్నే య త్తే దివి వర్చః పృథివ్యాం య దోషధీ ష్వప్స్వా యజత్ర।
యే నాంతరిక్ష ముర్వా తతంథ త్వేషః స భాను రర్ణవో నృచక్షాః ॥[1]

యజనీయుడ వగు నో యగ్నీ (యజత్ర అగ్నే) ! ద్యులోకమున ఆదిత్యాఖ్య మగు నే జ్యోతిస్సు కలదో (యత్ తే దివి వర్చః) అది నీదియే; పృథివియందు ఆహవనీయాది రూపమునను, ఓషధులయందును జలములయందును నిగూఢముగను, మఱియు దాహ-పాక-ప్రకాశనాది సామర్థ్యముతో ప్రకటముగను- ఇట్లు సర్వత్ర వ్యాప్తమై యుండెడి జ్యోతిస్సు నీదియే; అంతరిక్షమున వాయురూపమున విస్తరించియున్న తేజము నీదియే: ఇట్లు తేజఃశాలి (త్వేషః) వై అగ్నివాయ్వాదిత్యాది రూపములతో లోకత్రయమును వ్యాపించి భాసించుచు సముద్రమువలె అనంతరూపమున (అర్ణవః) విశ్వవ్యాపకుడవై నరులకు (ప్రాణులకు) సాక్షి వగుచు ద్రష్టవై (నృచక్షాః) వెలయుచున్నావు— అని యర్థము.

ఈ మంత్రమును శతపథబ్రాహ్మణముగూడ విశ్లేషించి వివరించినది.

'అగ్నే' య త్తే దివి వర్చ ఇతి। ఆదిత్యో వా అస్య దివి వర్చః । పృథివ్యా మితి । అయ మగ్నిః పృథివ్యామ్। య దోషధీ ష్వప్స్వా యజత్రేతి । య ఏ వౌషధిషు చాప్సు చాగ్ని స్త మేత దాహ । యేనాంతరిక్ష ముర్వా తతంథేతి । వాయుః సః త్వేషః స భాను రర్ణవో నృచక్షా ఇతి। మహాన్ స భాను రర్ణవో నృచక్షా ఇత్యేతత్॥

(చూ. సా. భా.)

1. ఋ. 3-22-2; వా.సం 12-48; తై. సం. 4-2-4-2; మై. సం 2-7-11, 89-13; కా.సం. 16-11. శ.బ్రా. 7-1-1-23.

ఈ మంత్రమున 'యజత్ర అగ్నే' అను పదములచే యజ్ఞకర్మ యందు ఆహవనీయాదిరూపమున యజనీయుడైన యగ్నియే సంబోధింపబడుట స్పష్టము. భౌతికముగ గన్పట్టెడి యీ యగ్ని మాత్రమే యిట గ్రహింపబడె నని చెప్పుచో, యజ్ఞవేదియందు పరిచ్ఛిన్న (conditioned) రూపమున ప్రత్యక్షముగ గన్పట్టెడి యీ యగ్నియొక్క దీప్తియు (వర్చః) పరిమిత మయియే యుండును. ఆ దీప్తి యజ్ఞశాలను, లేక తత్పరిసరములను దాటి ప్రసరింప నేరదు. అది సర్వవ్యాపక మగుట యెట్లు? కనుక శ్రుతియం దుద్దిష్ట మైన యగ్నిస్వరూపము వేఱు. అది పరంజ్యోతీరూప మగు మహాగ్ని; అపరిచ్ఛిన్నము; అనంతము; సర్వవ్యాపకము; నిఖిల ప్రాణులయందు సాక్షియై ద్రష్టయై విలసిల్లునది యని చెప్పబడినది.

జడమై భౌతిక మగు జ్యోతిస్సుకు లేక శక్తికి (Physical force or light or energy) సాక్షిత్వము – ద్రష్టృత్వము ఉపపన్నము గాదు. అట్టి శక్తి (ద్రష్టృత్వము) చైతన్యరూప మగు పరంజ్యోతికే కలదు. (చూ. బ్ర.సూ. ఈక్షత్యధికరణము). సాక్షియై–వినిద్రుడై – నిరంతరము జాగరూకుడై విలసిల్లెడి యగ్నినే ఋగ్యజుఃసామ మంత్రములు కాంక్షించుచున్నవి యని – 'అగి ర్జాగార త మృచః కామయన్తే' – ఇత్యాది ఋక్కుల వలన పూర్వము స్పష్టమైనది. (చూ. వేదశబ్దము) ఇట్టి యీ యర్థమునే 'సాక్షీ చేతా కేవలో నిర్గుణ శ్చ' (శ్వే.ఉ. 6-11) అని యీ రీతిగా నుపనిషత్తులును వివరించినవి. ఆ పరంజ్యోతియొక్క జ్యోతిస్సు చేతనే అగ్ని–వాయ్వాదిదేవతలు, పృథివ్యాది పంచమహాభూతములు– సర్వము వెల్గొందుచున్నట్లు పై ఋక్కున జెప్పబడినది. ఇట్లు చెప్పుచో–

"త మేవ భాన్త మనుభాతి సర్వం తస్య భాసా సర్వ మిదం విభాతి" — కఠ, ఉ. 5-15; ముండక. ఉ. 2-2-10; శ్వేత. ఉ. 6-14.

'భీఽషాఽస్మా ద్వాతః పవతే భీషోదేతి సూర్యః ।
భీషాఽస్మా దగ్ని శ్చేంద్ర శ్చ మృత్యు ర్ధావతి పంచమ ఇతి॥"
—తై. ఉ. 2-7.

అని యీ రీతిగ ప్రతిపాదింప బడెడి యుపనిష దర్థమే పై ఋక్కున శ్లిష్టమై యున్న దనుటయు స్పష్టము. ఇట్టీ యర్థమును గ్రహించుచో అగ్ని—వాయు—ఇంద్ర—సూర్యాది పదములు ప్రకరణము ననుసరించి తత్త ద్దేవతావాచకము లగుచునే పరంజ్యోతీరూప మగు తత్త్వమును గూడ నుపలక్షింప జేయుచుండు ననెడి సంప్రదాయమును ప్రవర్తింపజేయుటయే వేదము యొక్క తాత్పర్యముగా గ్రహింప నగును. కనుక అగ్ని యనగా—

1. అధియజ్ఞముగ ఆవహనీయాది త్రేతాగ్నులు;

2. ఆధిదైవికముగ పృథివ్య న్తరిక్ష ద్యులోకములయం దుండెడి అగ్నివాయ్వాదిత్యాత్మక త్రేతాగ్నులు.

3. ఆధ్యాత్మికముగ శరీరాంతర్గత మగు అగ్ని.

4. పృథివియందును, ఓషధులయందును, జలములయందును ప్రకటముగను నిగూఢముగను వ్యాప్తమై యుండెడి తేజస్సు.

5. ప్రాణులయందు సాక్షిరూపమున వెల్గొందెడి పరంజ్యోతి. అగ్ని పదముయొక్క సామర్థ్య మట్టిది. ఇట్టి సంప్రదాయమును వివరించు మంత్రము లెన్ని యేని ఋగ్వేదమున గలవు. 'అగ్ని రస్మి జన్మనా జాతవేదాః' ఇత్యాది ఋక్కులు నిట్టి యర్థమునే బోధించున వగుట పూర్వము (వేద, ఋషి, బ్రహ్మాదిశబ్దములందు) వివరింపబడినది.

వాయువు (వాయుః-వాతః)

వాయు వనగా పంచభూతములలో నొకటి యగు వాయువు (గాలి) మాత్రమే కాదు; సర్వవ్యాపక మగు అగ్ని (పరంజ్యోతి)యే అంతరిక్షతేజో రూపమగు వాయువు-అని పై ఋక్కున దెల్పబడినది. కావుననే ఋగ్వేద మున (10-68 సూ) వాయువు-

"విశ్వస్య భువనస్య రాజా"

"అపాం సఖా ప్రథమజా ఋతావా క్వ స్విజ్జాతః కుత ఆ బభూవ"
"ఆత్మా దేవానాం భువనస్య గర్భో యథావశం చరతి దేవ ఏషః"

అని కీర్తింపబడినాడు. వాయువు 1) నిఖిలభువనములకు రాజు (నిఖిల భువనముల విరాజిల్ల చేయువాడు; పాలకుడు): 2) నిఖిలభువనములకు గర్భ (ప్రాణ) భూతుడు: 3) సకలదేవతలకు ఆత్మ 4) ప్రథమజాః (ప్రథమజీవి); 5) ఋతావా (సత్యశీలుడు)- అని చెప్పబడుటచే నిట్టి యీ విశేషణములు శ్రుతిసంప్రదాయము ననుసరించి సమష్టి ప్రాణస్వరూపు డగు (Universal Life Principle) హిరణ్యగర్భుని బోధించునవి. (చూ- ప్రథమజాశబ్దము మొ.). కాన నిట పంచభూతములలో నొకటి యగు వాయువును మాత్రమే గాక, యీ విశేషణములచే సర్వదేవాత్మక హిరణ్యగర్భ బ్రహ్మ తత్త్వమును బోధించుటయే శ్రుతితాత్పర్య మగుట స్పష్టము. ఈ యర్థమునే తైత్తిరీయ శ్రుతియు నిట్లు వివరించుచున్నది.

"వాతం ప్రాణం మనసాఽన్వారభామహే। ప్రజాపతిం యో
భువనస్య గోపాః। స నో మృత్యోస్త్రాయతాం
పాత్వగ్ంహసః। జ్యోగ్జీవా జరా మశీమహి।"

— తై. ఆ. 10.47; తై. బ్రా. 3-7-7-2.

'వయం తం ప్రజాపతిం పరమాత్మానం, మనసా అంతరంగేణాన్వారభామహే । కథంభూతం ప్రజాపతిమ్ । ప్రాణం సమస్తపిండాండస్య ప్రాణాపానాదిరూపమ్। వాత మంతరిక్షస్థ వాయురూపమ్। ఏతేన పిండాండ బ్రహ్మాండోభయ వికారకత్వం ప్రజాపతే రుక్తం భవతి। యః ప్రజాపతిః, భువనస్య బ్రహ్మాండస్య, గోపా రక్షకః'.... — సా. భా.

ఇట వాయువు అనగా శరీరములందు ప్రాణరూపమునను, అంతరిక్షమున వాయురూపమునను వర్తించుచు పిండాండ బ్రహ్మాండవికారకారకమై ; నిఖిలభువన రక్షకము - అని చెప్పబడినది. 'ఆత్మా దేవానాం భువనస్య గర్భః' ఇత్యాది ఋక్కులలో సూత్రప్రాయముగ జెప్పబడిన వాయువు యొక్క భువనగర్భత్వాది విశిష్టధర్మము లిట ప్రపంచింపబడినవి.

"ఓం తద్బ్రహ్మ ఓం తద్వాయుః ఓం తదాత్మా ఓం తత్సర్వం ఓం తత్పురోం నమః" — తై.అ. 10-29-1.

"ఓం ప్రణవప్రతిపాద్యం త త్సర్వవేదాంతప్రసిద్ధం బ్రహ్మ త త్త్వమ్। తథా వాయుః సూత్రాత్మరూపో హిరణ్యగర్భ ఓం తత్ప్రణవప్రతిపాద్యం బ్రహ్మైవ। తథైవాఽఽత్మా జీవోఽపి...." — సా.భా.

'సూత్రాత్మరూపుడగు హిరణ్యగర్భుడును (వాయుః), జీవుడును (ఆత్మ) స్థూల-సూక్ష్మ-కారణ శరీరము లనెడి త్రిపురములును సర్వము ప్రణవ ప్రతిపాద్యము, 'తత్' శబ్దోపలక్షితము, వేదాంతప్రసిద్ధము నగుబ్రహ్మ' - అని యర్థము.

కాన వాయు వనగా—

(1) పంచభూతములలో నొకటి యగు వాయువు;

(2) శరీరాంతర్వర్తి యగు ప్రాణము (ప్రాణశక్తి);

(3) అంతరిక్షము నందంతట వెలయు వాయుదేవత (మాధ్యమిక దేవత);

(4) సూత్రాత్మ, సమష్టిప్రాణస్వరూపుడు సర్వదేవతాత్మయు నగు హిరణ్యగర్భ బ్రహ్మ;

(5) ప్రణవప్రతిపాద్యము, వేదాంతప్రసిద్ధము, ప్రాణమునకు ప్రాణము (ప్రాణస్య ప్రాణః) నగు బ్రహ్మతత్త్వము.

పై శ్రుతివాక్యముల బరిశీలించుచో ఋగ్వేదప్రతిపాద్య మగు వాయుస్వరూపము వేఱు; తదితర శ్రుతిప్రతిపాద్య వాయుస్వరూపము వేఱుకాదని తేలినది. 'వాయు' పద సామర్థ్య మట్టిది

ఆదిత్యః – సూర్యః :-

'అగ్నే యత్తే దివి వర్చః' – అను పై ఋక్కునందు ఒకే యగ్ని పృథివియం దాహవనీయాద్యగ్నిరూపమునను, అంతరిక్షమున వాయురూపమునను, ద్యులోకమున ఆదిత్యరూపమునను విరాజిల్లుచుండు నని చెప్పబడినది. అగ్ని-వాయుస్వరూపముల జూచితిమి. ఇక ఋగ్వేద ప్రతిపాద్య మగు నాదిత్యస్వరూపమును గూడ జూతము

"చిత్రం దేవానా ముదగా దనీకం చక్షు ర్మిత్రస్య వరుణ స్యాగ్నేః ।
ఆ ప్రా ద్యావాపృథివీ అంతరిక్షం సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ"[1]

1. ఋ. 1-115-1; అ.సం. 13-2-35; వా.సం. 7-42; తై.సం. 1-4-43-1; మై.సం. 1-3-37; కా.సం. 4-9; ఐ.బ్రా. 4-9-11; శ.బ్రా. 4-3-4-10; తై.బ్రా. 2-8-7-3; ఐ.అ. 3-2-3-10; తై.అ. 1-7-6 మొ॥.

ఇట ఉదగాత్_అను క్రియ వలన నీ మంత్రము దినదిన ముదయించెడి సూర్యుడు దేవతగా నుపాసింపబడుటకై యుద్దిష్టమైన దనుట స్పష్టము. సూర్యదేవతాక మగు నీ మంత్రమునకు యజ్ఞమున జేయబడు శంసనము నందును, హోమము నందును వినియోగము గలదు. ఇది బాలభానుని యుదయమును జూచి యావేశపారవశ్యమున జేయబడిన రచన యని జెప్ప వీలులేదు. మంత్రార్థమును జూతము,

దేవానా మనీకం చిత్ర ముదగాత్ :-

తమయందు రక్తశ్వేతాది వివిధవర్ణములు నిగూఢముగా గలిగి దీప్తిమంతములై లోకముల బ్రకాశింపజేయు కిరణముల పుంజము మహా సైన్యము వలె నొక్కుమ్మడిగా జిత్రముగా నుద్గమించినది — అని మండల పరమైన యర్థము.

సూర్యుని నుండి — పరమేశ్వరుని నుండి — వివిధ శక్తిసంపన్నమై లోకయాత్రానిర్వహణక్షమమైన దేవతానీకము (దేవసేన) చిత్రముగా నుద్గమించినది—యని పరమాత్మపరముగ నర్థము.

మిత్రస్య వరుణస్య అగ్నేః చక్షుః — ఆ ప్రా ద్యావాపృథివీ అంతరిక్షమ్ :-

ఇట్టి సూర్యుడు మిత్ర-వరుణ-అగ్నులకు చక్షువుగా జెప్పబడినాడు. ఈ 'మిత్ర-వరుణ-అగ్ని' పదములు 'ద్యావా-పృథివీ-అంతరిక్ష' గత దేవతాపరములు. అట్టి దేవతాత్రయమునకు సూర్యుడు చక్షువు—అనగా తదుపలక్షితమైన జగత్త్రియమునకు చక్షువు — ప్రకాశకుడు—లేక ప్రకాశక మగు చక్షురింద్రియస్థానీయుడు—అని యర్థము.

అగ్ని-వాయు-సూర్యులు పృథివీ - అంతరిక్ష - ద్యులోకములకు పాలకు లగుట ఋగ్వేదమున ప్రసిద్ధము. 'సూర్యో నో దివస్పాతు, వాతో అంతరిక్షాత్: అగ్ని ర్నః పార్థివేభ్యః' (ఋ. 10-158-1) ఇత్యాది ఋక్కు లీ విషయమును స్పష్టము జేయుచున్నవి. కాన పై ఋక్కున జెప్పబడిన ద్యావాపృథివ్యంతరిక్ష గతులగు 'మిత్ర వరుణాగ్నుల' ను ఇట్టి ఋక్ప్రతిపాదితార్థముతో నవిరోధముగ సమన్వయించి దర్శింపవలసి యున్నది. కాగా, 'త్రిలోకాధిపతు లగు అగ్ని-వాయు-ఆదిత్యులకును తదుపలక్షితము లగు మూడు జగత్తులకును చక్షువు సూర్యుడు'-అని తాత్పర్యము.

ఇట్లు చెప్పబడుటచే మండలరూపియై గన్పట్టు సూర్యుడు మాత్రమే యట జెప్పబడె ననుట పొసగదు. మిత్రవరుణాగ్నులకు - తదధిష్ఠిత లోక త్రయమునకు - చక్షుర్భూతుడగు సూర్యుడు, తదతీతుడై తత్ప్రేరకుడు నగు సూర్యుడు గావలెను. అట్టి సూర్యుడే సవిత; పరమాత్మ. కావుననే యీ సూర్యుడు ఋగ్వేదమున - 'చక్షుః;[1] చక్షుషే చక్షుః'[2]- అని యీ రీతిగ బలుచోట్ల నిర్దేశింపబడినాడు. ఇట్టి యర్థమునే 'చక్షుషశ్చక్షుః'- (కేన. ఉ. 1-2; బృ. ఉ. 4-4-18) అని యీ రీతిగ నుపనిషత్తులును ప్రతిపాదించినవి. ఈ విషయ మింకను పై ఋక్కు ఇట్లు స్పష్టము చేయుచున్నది.

'ఆ ప్రా ద్యావాపృథివీ అంతరిక్షం, సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ :-

'తన తేజస్సుతో మూల్లోకముల వ్యాపించి అంతర్యామియై సర్వ ప్రేరకు డగుచు స్థావరజంగమాత్మక మగు జగతునకు ఆత్మయే-స్వరూప

1. "చక్షు ర్నో దేవః సవితా" —ఋ. 10-158-3.

2. "చక్షు ర్నో దేహి చక్షుషే చక్షు ర్వ్యఖ్యై తనూభ్యః" —ఋ. 10-158-4.

భూతుడై — పరమాత్మయై — మండలాంతర్గతపురుషుడు విరాజిల్లు చున్నాడు'— అని భావము.

కాన పై మంత్రమునందలి సూర్యుడు కేవలము బింబస్వరూపుడు కాడు. స్థావర జంగమాత్మక మగు కార్యజాత మంతటికిని గారణము (ఆత్మ) అగుచున్నాడు. కారణము కంటె కార్యము భిన్నము కాదు. (చూ. బ్ర. సూ. ఆరంభణాధికరణము—శం. భా.) స్థావరజంగమాత్మక మగు జగత్తు (కార్యము) ఆత్మయగు సూర్యుని (కారణము) కంటె భిన్నము కాదు. కాన నీ మంత్రము సూర్యదేవతాక మగుచునే ఉపనిష చ్ఛ్రుతిప్రతిపాద్య-అద్వయ పరమేశ్వరతత్త్వము నుపదేశించుచున్నది. ఐతరే యారణ్యకము గూడ 'చిత్రం దేవానామ్' అను నీ మంత్రవర్ణము నందలి సూర్యుని దర్శింపవలసిన విధానము నిట్లు చెప్పుచున్నది.

"శరీరపురుష ఇతి య మవోచామ స య ఏవాయం దైహిక ఆత్మా, తస్య యో உయ మశరీరః ప్రజ్ఞాత్మా స రసః।....' మహాపురుష ఇతి య మవోచామ సంవత్సర ఏవ ప్రధ్వంస య న్నన్యాని భూతాన్యైక్యా భావయ న్నన్యాని తస్యై తస్యాసా వాదిత్యో రసః"

"స యశ్చాయ మశరీరః ప్రజ్ఞాత్మా యశ్చాసా వాదిత్య ఏక మేతదితి విద్యాత్; తస్మాత్ పురుషం పురుషం ప్రత్యాదిత్యో భవతి। తదప్యేత దృషిణో క్తమ్। చిత్రం దేవానాం.... సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చేతి।" — ఐ. ఆ. 3-2-3-1.

'దేహమే ఆత్మ - అను ప్రత్యయముతో జరించువాడు శరీరపురుషుడు. స్వామియై లోపల విరాజిల్లు అశరీరుడు, ప్రజ్ఞాత్మ (చిద్రూపుడు) యగు పురుషుడు ఈ శరీరపురుషునకు రసము (సారము). ప్రాణులు పుట్టుటకును

గిట్టుటకును గారణభూతుడగు కాలాత్మ (సంవత్సరః) మహాపురుషుడు. సూర్యమండలమున గోచరుడగు నాదిత్యుడు (ఈశ్వరుడు) ఈ కాలాత్మ యొక్క రసము. శరీరసారభూతుడగు ప్రజ్ఞాత్మయు, మహాపురుషసార భూతుడగు ఆదిత్యుడు (ఈశ్వరుడు)ను భిన్నులు గారు; ఈ యిరువురు నొకే తత్త్వము (ఏక మేతత్) - అని దర్శించుటకై యుపాసింపవలెను (విద్యాత్, సాక్షాత్కారపర్యన్త ముపాసీత - సా. భా.). ఈ ప్రజ్ఞాత్మ-ఆదిత్యుల (జీవేశ్వరుల) ఏకత్వము వాస్తవికము. కావుననే ప్రతి పురుషునకు సంముఖుడై యాదిత్యు డుదయించుచున్నాడు. అనగా 'వాస్తవముగ మన ముభయులము భిన్నులము కాము; ఒకే తత్త్వము' - అని యుద్బోధించుటకై యుదయించుచున్నాడు. ఈ యర్థమునే 'చిత్రం దేవానాం' అను ఋషి (మంత్రవర్ణము)చే చెప్పబడినది.' - అని యర్థము.

కాన 'చిత్రం దేవానాం' అను మంత్రమునందలి సూర్యుడు మండలాంతర్గత పురుషుడగు ఈశ్వరుడు; అతడే శరీరాంతర్వర్తి యగు ప్రజ్ఞాత్మ (జీవుడు); ఇట్లు దర్శించుటయే ఋక్కు యొక్క తాత్పర్య మని ఐతరేయశ్రుతి చెప్పుచున్నది. అందుచే ఉపనిషత్ప్రతిపాద్యమగు అద్వైత తత్త్వమే యిట జెప్పబడినది. ఇట్లు ఈ ఋక్కుననే కాదు; 'అగ్ని రస్మి జన్మనా జాతవేదాః' - 'న వి జానామి యదివేద మస్మి' - 'పురుష ఏవేదం సర్వమ్' - 'హంసః శుచిషత్' - ఇత్యాది ఋక్కుల యందును ఇట్టి యద్వైతతత్త్వమే ప్రతిపాదింపబడుట పూర్వము వివరింపబడినది.

కాన అగ్ని-వాయు-ఆదిత్యాది దేవతాత్మకుడు, సర్వప్రేరకుడు, సర్వవ్యాపకుడు, స్థావరజంగమాత్మక కార్యప్రపంచమునకు గారణభూతుడు (ఆత్మ), కర్మసాక్షియు నగు ఆదిత్యుడు (పరమేశ్వరుడు)ను, ప్రజ్ఞాత్మ (జీవుడు)యు నిరువురు నొకే తత్త్వమని దర్శింపజేయుటకై యుదయించు

సూర్యబింబము చిత్రము (చాయనీయం పూజ్యమ్). అట్టి సూర్యుని దర్శింపజేయుటయే శ్రుతితాత్పర్యము. దినదిన మెల్లరును సూర్యున కభి ముఖముగ నిలిచి ధ్యానించు సంప్రదాయమునకు[1] లక్ష్యము నిదియే.

కావున సూర్యు డనగా 1) సూర్యమండలము. 2) మండలాభి మాని యగు సూర్యదేవత; ద్యుస్థానదేవత. 3) మండలాంతర్గతుడగు ఆదిత్యుడు (ఈశ్వరుడు). 4) శరీరపురుషాంతర్గతుడు, అశరీరుడునగు ప్రజ్ఞాత్మ (జీవుడు). 5) జీవేశ్వరాత్మకమగు ఒకే తత్త్వము. 'సూర్య' పద సామర్థ్య మట్టిది.

త్రిస్థానదేవతలు-ఏకాత్మకత్వము :-

ఇట్లు అగ్ని-వాయు-సూర్య స్వరూపముల దర్శించుచో నీ పదములు భౌతికముగ ప్రత్యక్షగోచరములగు నగ్న్యాదులను బోధించుచునే త్రిస్థాన గత మగు తదధిష్ఠాన దేవతాత్రయ స్వరూపమును గూడ బోధించుచున్నవి. అంతియే కాదు. ఆ ముగ్గురు దేవతలు 'ఒకే తత్త్వము యొక్క భిన్నములై గన్పట్టు మూడురూపము' లనియు దెలియును. అందుచేతనే యీ మూడు పదములలో నే యొక్కటియు గూడ పరమేశ్వరవాచకమై - పరమేశ్వర తత్త్వస్ఫోరకమై - అంతరదృష్టిని ప్రబోధింపజాలినది. ఋక్కులలో నచటచట అగ్ని, వాయు, సూర్యపదములే గాక ఇంద్ర-సోమ, బృహస్పతి వరుణాది పదములును త్రిస్థానగత దేవతావాచకములుగనే గాక ప్రకరణము ననుసరించి పరమేశ్వరవాచకములుగ గూడ గన్పట్టుటకు గారణ మిదియే.

"ఏక ఏవాగ్నిః బహుధా సమిద్ధః ఏకః సూర్యో విశ్వ మను ప్రభూతః। ఏకై వోషాః సర్వ మిదం విభా త్యేకం వా ఇదం వి బభూవ సర్వమ్" —ఋ, 10-58-2.

---

1. "ఉద్యన్త మ స్తం యన్త మాదిత్య మభిధ్యాయన్ ....అసౌ ఆదిత్యో బ్రహ్మ"; "సూర్యే జ్యోతిషి జుహోమి స్వాహా"

ఒకే అగ్ని బహుప్రకారముల తేజరిల్లుచున్నాడు. సర్వప్రాణిప్రేరకుడగు నొకే సూర్యుడు జీవరూపమున విశ్వమున ననుప్రవిష్టుడై, యనేకాత్మ రూపమున ప్రాదుర్భవించుచున్నాడు, ఒకే యుషోదేవత (పరాశక్తి) యెల్లెడల నావరించియున్న తమస్సును బోనాడుచు జగత్తును విశేషముగ ప్రకాశింపజేయుచున్నది. కాన నేకము నద్వితీయము నగు బ్రహ్మయే దృశ్యమగు నీ జగదాకారమున భాసించుచున్నాడు. (తస్మా దేకం వై ఏక మేవాద్వితీయం బ్రహ్మ ఇద మాబ్రహ్మ స్తంబపర్యంతం జగత్ విబభూవ విశేషేణాభవ'దితి యుక్త మితి శేషః–సా.భా.)–అని యర్థము.

ఈ మంత్రము పూర్వోదాహృతము లయిన (1) అగ్నే యత్తే దివి వర్చః (2) విశ్వస్య భువనస్య రాజా; ఆత్మా దేవానాం భువనస్య గర్భః (3) సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ– అను మంత్రార్థములను, 'తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్' (తై. ఉ. 2–6) – ఇత్యాద్యుపనిషద్వాక్యార్థములను తలపింపజేయుట స్పష్టము. కాన నొకే దేవత (పరమాత్మ) జగద్యాత్రాసిద్ధికై అగ్ని–వాయు–ఆదిత్య దేవతారూపమున త్రిస్థానములందు త్రిధా అభివ్యక్తమైనది. ఈ ముగ్వురు దేవతలు కొన్నియెడల 'అగ్ని – ఇంద్ర–ఆదిత్యులు[1], అగ్ని–విద్యుత్–ఆదిత్యులు, వసు–రుద్ర–ఆదిత్యులు' ఇత్యాది నామములతో 'హవిర్వహన–రసానుప్రదాన–రసాదాన'[2] కర్మలయం దధికృతులై వెలయునట్లు శ్రుతులయందు గన్పట్టుదురు. శ్రుతుల యందు ప్రస్ఫుటమయ్యెడి దేవతాతత్త్వమును యాస్కుడును నిరుక్తమున నిట్లు వివరించినాడు.

---

1. "అగ్ని ర్జ్యోతి ర్జ్యోతి రగ్నిః ఇంద్రో జ్యోతి ర్జోతి రింద్రః సూర్యో జ్యోతి ర్జోతిః సూర్యః"

—సామ. సం. 1831. (చూ. వా.సం. 3-9; మై. సం. 1-6-10;

2. చూ. దుర్గాచార్యభాష్యము.

"మహాభాగ్యా ద్దేవతాయా ఏక ఆత్మా బహుధా స్తూయతే" – 7_4.

"అగ్నిః పృథివీస్థానో వాయుర్వేంద్రో వాఽంతరిక్షస్థానః
సూర్యో ద్యుస్థానః, తాసాం మహాభాగ్యా దేకైకస్యా అపి
బహూని నామధేయాని భవంతి । అపి వా కర్మ పృథక్త్వాత్"
— 7_5.

"యదస్య దివి తృతీయం త దసా వాదిత్య ఇతి బ్రాహ్మణమ్ ।
తదగ్నికృత్య స్తౌతి అథైన మేతయాదిత్యకృత్య స్తౌతి"
— 7_28.

'భాగః' అనగా అణిమాద్యైశ్వర్యము. అదియే దేవత యొక్క మహాభాగ్యము. మహాభాగ్యసంపన్న మగుటచే నొకే దేవత నానారూపమున స్తుతింపబడుచుండును. అగ్ని పృథివీస్థాన దేవత; వాయువు లేక ఇంద్రుడు మధ్యమస్థానదేవత; మహాభాగ్యసంపన్న మగుట జేసియు, నధికారికర్మభేదము ననుసరించియు, వీరిలో నొక్కొక్కరికి బెక్కు నామములు గలవు. ద్యుస్థానమున వెలయు నాదిత్యుడు అగ్ని యొక్క తృతీయరూప మని శ్రుతులు చెప్పుచున్నవి. అందుచేతనే ఆదిత్యు డగ్నిగను, అగ్ని యాదిత్యుడుగను స్తోత్రము చేయబడుచున్నారు – అని యర్థము. దీనిని దుర్గాచార్యుడు విట్లు వివరించినాడు.

"బ్రాహ్మణ మపి చైత మేవార్థం బ్రవీతి – అయ మేవాగ్ని
రాదిత్యో భవతీతి । ఏక మేవేదం జ్యోతిః జ్యోతిష్ట్వా
విశేషాత్ । త త్పున రేతద్ జగద్యాత్రాసిద్ధయే త్రిధా
విభక్తం – పృథివ్యా మంతరిక్షే దివి చ విభక్తాభిధానం
సంపద్యతేఽగ్ని ర్విద్యు దాదిత్య ఇతి"

ఈ యగ్నియే ఆదిత్యుడని శ్రుతి చెప్పుచున్నది. ఒకే జ్యోతిస్సు జగద్యాత్రాసిద్ధి కొఱకై పృథివ్యంతరిక్షద్యులోకముల యందు అగ్ని–విద్యుత్–

ఆదిత్యరూపమున త్రిధా విభక్తమై యున్నది. ఈ మూడును వాస్తవముగ నొకే తత్త్వమయ్యును స్థానభేదము, కర్మభేదము ననుసరించి అగ్ని విద్యుదాదిత్యులని వేఱుగా విభజించి చెప్పుటయు యుక్తమే. అందుచే వీరు భిన్నులుగను అభిన్నులుగను స్తోత్రము చేయబడుచున్నారు — అని యర్థము. త్రిస్థాన దేవతాగణములను గూర్చి బృహద్దేవత యందు విట్లు వివరింపబడినది.

"అసతశ్చ సతశ్చైవ యోని రేషా ప్రజాపతిః ।
యదక్షరం చ వాచ్యం చ యథైత ద్బ్రహ్మ శాశ్వతమ్ ॥
కృత్వైష హి త్రిధాఽఽత్మానం ఏషు లోకేషు తిష్ఠతి ।
దేవాన్ యథాయథం సర్వాన్ నివేశ్య స్వేషు రశ్మిషు ॥
ఏతద్భూతేషు లోకేషు అగ్నిభూతం స్థితం త్రిధా ।
ఋషయో గీర్భి రర్చన్తి వ్యంజితం నామభి స్త్రిభిః ॥
తిష్ఠత్యేష హి భూతానాం జఠరే జఠరే జ్వలన్ ।
త్రిస్థానం చైన మర్చంతి హోత్రాయాం వ్యక్తబర్హిషః ॥
— బృ. దే. 1-61 నుండి 65.

'వ్యాహృతీనాం సమస్తానాం దైవతం తు ప్రజాపతిః
వ్యస్తానా మయ మగ్నిశ్చ వాయుః సూర్యశ్చ దేవతాః — 2-124.

కాన పైన నుదహరింపబడిన శ్రుతి, నిరుక్త, బృహద్దేవతాది వచనముల ననుసరించి దేవతాస్వరూపము నిట్లు గ్రహింపనగును.

పరమేశ్వరు నను గ్రహముచే దివ్యశక్తిసంపన్నులయిన దేవతలు జగద్యాత్రానిర్వహణము కొఱకై, భిన్నరూపములతో భిన్నకర్మలయం దధికృతులై పృథివీ-అంతరిక్ష-ద్యులోకము లందును, ఆధ్యాత్మికముగ దేహమునను త్రిస్థానములందు వర్తిల్లుదురు. వివిధశక్తిసంపన్ను లగుట

జేసి భిన్న భిన్న కర్మ నామధేయములతో గూడ వ్యవహరింప బడుచుందురు. పృథివీస్థానగతు లగు దేవతలు 'అగ్నయః' అనియు, మధ్యమస్థానదేవతలు 'వాయవః' (మరుతః ప్రాణాః) అనియు, ద్యుస్థానదేవత లాదిత్యు లనియు, వీరే క్రమముగ వసురుద్రాదిత్యు లనియు జెప్పబడుదురు. కొన్ని యెడల అగ్నయః, వసవః, రుద్రాః, ఆదిత్యాః — అని యీ రీతిగ నొక్కొక్క నామముచే గూడ నీ త్రిస్థానదేవతాగణములు వ్యవహరింప బడును.

ఈ అగ్న్యాదులలో నొక్కొక్కరియందును ప్రకరణము ననుసరించి మూర్తిత్రయవివక్షయు గలదు. అనగా—అగ్న్యాదులు పృథివీస్థానదేవతలు; ఇంద్ర-వాయు-రుద్ర-మరుత్-పర్జన్యాదులు అంతరిక్షస్థానదేవతలు, ఆదిత్యులు ద్యుస్థానదేవతలు'—అని విభక్తస్థానములతో నొప్పుచున్నను, వీరు పరస్పర సాహచర్యము గల దేవతలు, ఒకే జ్యోతిస్సు యొక్క విభిన్నమూర్తులు నగుటజేసి వీరిలో నే యొకరియందైనను మూర్తిత్రయవివక్ష జేయుట యుక్తమే. అందుచేతనే యీ త్రిస్థానదేవతలను సమష్టిగ అగ్నయః, వసవః—అనియు నీ రీతిగా శ్రుతి వ్యవహరించినది. విభిన్న దేవతాస్వరూప దర్శనముతోపాటు, తత్సాహచర్యము, తదనుస్యూత మగు ఏకత్వమును భావించి, దర్శించుటకు సాధకుల కిట్టి వివక్ష మిగుల తోడ్పడును. ఇది శ్రుత్యర్థ పరమార్థ సిద్ధమైన దేవతాస్వరూపదర్శనము.

అట్లుగాక — 'ఆర్యు లనెడివారిలో కొందఱు అగ్నికిని, మఱి కొందఱు ఇంద్రునకును,—ఇట్లే సోమ, వరుణాది దేవతలకును తమ తమ యభిరుచుల ననుసరించి వేర్వేఱు కాలములలో సృష్టికర్తృత్వమును కట్టబెట్టి యుందురు' — అనెడి చారిత్రికుల కల్పన శ్రుతిసమ్మతము, యుక్తిసహము కాదనుట పై గ్రంథసందర్భము వలన స్పష్ట మగుచున్నది.

యజ్ఞము వసురుద్రాదిత్యాత్మకము; విష్ణుస్వరూపము:-

యజ్ఞమునందలి ప్రాతఃసవన, మాధ్యందినసవన, తృతీయసవనములు వసురుద్రాదిత్యాత్మకములు.

"త్రయో వై దేవాః। వసవో రుద్రా ఆదిత్యాః। తేషాం
విభక్తాని సవనాని। వసూనా మేవ ప్రాతఃసవనమ్।
రుద్రాణాం మాధ్యందినం సవనమ్। ఆదిత్యానాం
తృతీయ సవనమ్।" —శ.బ్రా. 4-3-5-1.

"ప్రాతఃసవనం గాయత్రీఛందస్కమ్। గాయత్రీ పాద శ్చాష్టా
క్షరః। సా చాక్షరగతాష్టత్వసంఖ్యా వసుష్వపి విద్యతే। అష్టౌ
వసవః ఇతి వసూనామష్టత్వాత్। అతః సంఖ్యా ద్వారా
గాయత్రీసంబంధాత్ గాయత్రం ప్రాతఃసవనం వసూనా మేవ
విభక్తమ్। ఏవం ఉత్తరయో రపి సవనయోః — —" —సాభా..

ప్రాతఃసవనము గాయత్రీ ఛందస్సును. మాధ్యందినసవనము త్రిష్టుప్ ఛందస్సును, తృతీయసవనము జగతీ ఛందస్సును గల్గియున్నవి. గాయత్రీ ఛందస్సున పాదమున కెనిమిదేసి యక్షరములు; త్రిష్టుప్ ఛందస్సున పదునొకం డక్షరములు; జగతీ ఛందస్సున ద్వాదశాక్షరములు నుండును అష్ట వసువులు. ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు నని త్రిస్థాన దేవతలకును సంఖ్యా ప్రసిద్ధి గలదు. ఈ మూడు ఛందఃపాదముల యందలి అక్షరగత సంఖ్యాసామ్యమును బురస్కరించుకొని వసువులకు ప్రాతఃసవనము, రుద్రులకు మాధ్యందినసవనము, ఆదిత్యులకు తృతీయసవనమును విభక్తము లయినవి — అని యర్థము.

"బ్రహ్మవాదినో వదన్తి య ద్వసూనాం ప్రాతఃసవనగ్ం,
రుద్రాణాం మాధ్యందినగ్ం సవన మాదిత్యానాం చ
విశ్వేషాం చ దేవానాం తృతీయసవనమ్" —ఛా.ఉ. 2-24-1.

అని యీ రీతిగ శ్రుతులయందు నీ మూడు సవనములు వసురుద్రాదిత్యాత్మకము లగుట ప్రసిద్ధము కాగా యజ్ఞము వసురుద్రాదిత్యాత్మకము. అందు చేతనే శ్రుతియు,

"అథేమం విష్ణుం యజ్ఞం త్రేథా వ్యభజన్త వసవః
ప్రాతఃసవనమ్ రుద్రా మాధ్యందినగ్ం సవన మాదిత్యా
స్తృతీయసవనమ్". —శ. బ్రా. 14-1-1-15.

యజ్ఞము విష్ణుస్వరూపము; అది వసురుద్రాదిత్యాత్మక సవనత్రయరూపముగ విభక్తము - అని చెప్పుచున్నది. యజ్ఞవేదిని గూడ వసురుద్రాదిత్యాత్మకముగ దర్శింపవలె నని శ్రుతి విధించుచున్నది.

"ఇమాం నరాః కృణుత వేది మేత్య వసుమతీగ్ం రుద్రవతీ
మాదిత్యవతీమ్" — తై.బ్రా. 3-7-7-13.

ఈ త్రిస్థానదేవతాస్వరూపము నిరుక్తము (దేవతాకాండము) నందును, బృహద్దేవత (1-2-3 అధ్యా) యందును వివరింపబడినది. మొత్తముమీద నెట్లు కీర్తింపబడినను ఆ యా దేవతావాచకపదములు అధియజ్ఞముగ తత్తద్దేవతావాచకములై యొప్పుచు నవి పరమేశ్వరు (పరమాత్మ) నుపలక్షింప జేయుచునే యుండును.

ఇడా - సరస్వతీ - భారతీ - సాహచర్యము :-

అగ్ని-వాయు-ఆదిత్యులకు వలెనే ఇడా-సరస్వతీ-భారతీ యను దేవతలకును సాహచర్యము గలదు. వీరొకరిని విడిచి యొకరెపుడును

యజ్ఞభూమికి రారు. సహచారిణులై యేతెంచి కర్మసమృద్ధిని గావింతురు. అగ్నివాయ్వాదిత్య (లేక వసురుద్రాదిత్య) పదములు వలెనే ఇడా–సరస్వతీ–భారతీ యను పదములలో నే యొకటియైన మూర్తిత్రయమును బోధింపజాలును. అనగా నొకే దేవతయందు మూర్తిత్రయవివక్ష జేయుటయు గలదు.

"దేవీ స్తిస్రః తిస్రో దేవీః। సరస్వ త్యశ్వినా భారతీడా"
— తై.బ్రా. 2-6-14-4.

'సరస్వతీ భారతీడే త్యేతా స్తిస్రః సప్తమానుయాజదేవతాః।
తాశ్చ పరస్పరం కదాచిద ప్యవియుక్తా ఇతి వక్తుం పున
స్తి స్రో దేవీ రిత్యుక్తమ్। అథవా ఏకైకస్యా దేవతాయా
మూర్తిత్రయవివక్షయా తదుక్తిః।" — సా.భా.

వీరు ముప్వురును వాగ్దేవతలని శ్రుతులయందు ప్రసిద్ధి. కాని వైదిక నిఘంటువులలో నీ మూడు పదములు వాఙ్నామములందును బఠింపబడినవి. లౌకిక నిఘంటువులయందును[1] నివి దేవతానామములుగను, వాఙ్నామములు గను గూడ గన్పట్టుచున్నవి. కాన నీ మూడు పదములు వాగ్వాచకములు, వాగ్దేవతావాచకములు గూడ నగును. సంస్కృతభాషలో గొన్ని పదములు వాగ్దేవతావాచకము లగుచునే వాగ్వాచకములుగ గూడ ప్రసిద్ధి నందినవి.

'బ్రాహ్మీ తు భారతీ భాషా గీ ర్వాగ్ వాణీ సరస్వతీ'
—అమరకోశః

ఇవి వాగ్దేవతావాచకము లని వ్యాఖ్యాత లందఱును వివరించిరి. ఇవి వాగ్వాచకములు నగుట ప్రసిద్ధమే.

1. గో భూవాచ స్త్విడా ఇలా -అమరకోశః

"వ్యాహార ఉక్తి ర్లపితం భాషితం వచనం వచః"
ఈ పదములు వాగ్దేవతావాచకములు గావు. వాగ్వాచకములు మాత్రమే. వేదమున 'వాక్' పదమునకు సామాన్యముగా వేదవాక్కు అనియే యర్థము.

"వాచా విరూప నిత్యయా" —ఋ. 8_75_6; తై.సం. 2_6_11-2;
"పతంగో వాచం మనసా బిభర్తి"—ఋ. 10_117-2;తై.ఆ.3_11.
"వాచా విప్రా స్తరత" —ఋ.10_42-1; అ.సం.20_89-1.
'వాచా సరస్వతీ భిషక్" —వా.సం. 19_12.
"వాచా సరస్వతీ మహః" —వా.సం. 21-37; తై.బ్రా.2-6_11_7.
"వాగ్ఘోతా దీక్షా పత్నీ" —తై. ఆ. 3_6_1.
"వాచో వీర్యం తపసాఽన్వవిందత్" —తై. ఆ. 3_11_?.
"వాచస్పతేఽచ్ఛిద్రయా వాచా" —తై. ఆ. 3_4_1.

ఇట్లు శ్రుతులు 'వాక్' అనగా వేదవాక్కు అని బోధించుచున్నవి. భాష్యకర్తలు నట్లే త్రయీరూప వాక్కుగ నీ 'వాక్' పదమును గ్రహించిరి. ఈ వేదవాక్కు 'ఋక్—యజుః—సామ' మంత్రరూపమున త్రివిధ మగుట జేసి యగ్నియు 'అగ్ని—వాయు—సూర్య' రూపమున త్రివిధరూపు డయ్యెననియు శ్రుతి చెప్పుచున్నది.

"సా వా ఏషా వాక్ త్రేధా విహితా — ఋచో యజూంషి
సామాని। తేనాగ్ని స్త్రేధా విహితః" —శ.బ్రా. 10_5_12.

"తేనాగ్ని స్త్రేధా విహితః అగ్ని—వాయు—సూర్యాత్మ
నేత్యర్థః —— —— వేదత్రయ ద్వారాఽగ్నే రుక్త
త్రైవిధ్యోపసంహారః" —సా. భా.

"త్రయో వేదా అజాయన్త, ఋగ్వేద ఏవాగ్నే రజాయత,
యజుర్వేదో వాయోః, సామవేద ఆదిత్యాత్" — ఐ.బ్రా. 5-32.

ఇత్యాది శ్రుతివాక్యములు అగ్ని-వాయు-సూర్యులు వేదాత్మకు (వాగాత్మకు) లగుట జెప్పుచున్నవి. వీరితో నిరంతరసాహచర్యము గల్గిన వాగ్దేవతలగు ఇడా-సరస్వతీ-భారతీ యను దేవతలును వేదాత్మికలు-వాగాత్మికలు-నగుదురు. కాగా వాఙ్నామములలో జఠింపబడినందునను, వాక్ పదము శ్రుతులలో వేదవాచకముగ ప్రసిద్ధ మగుటవలనను, ఇడా-సరస్వతీ-భారతీ పదములు వేదవాచకములు, వాగ్దేవతావాచకములు గూడ నగును. వేదశరీరిణులగు నీ దేవతలు వసురుద్రాదిత్యులతో నిరంతరసాహచర్యము గల్గి యజ్ఞముల ప్రవర్తింపజేయుదురు.

"ఆదిత్యై ర్నో భారతీ వష్టు యజ్ఞగ్ం సరస్వతీ సహ రుద్రై
ర్న ఆవీత్। ఇడోపహూతా వసుభిః సజోషా యజ్ఞం నో
దేవీ రమృతేషు ధత్త" — తై.సం. 5-1-11-2; వా.సం. 29-8.

ఆదిత్యులతో భారతియు, రుద్రులతో సరస్వతియు వసువులతో ఇడయు కలిసి యజ్ఞమున కేతెంచుట యీ మంత్రము వలన దెలియును. ఈ ముగ్వురు దేవతల గూర్చి బృహద్దేవత యందు నిట్లు చెప్పబడినది.

"తిస్రస్తు దేవ్యో యాః ప్రోక్తాః త్రిస్థానైవేహ సా తు వాక్।
త్రివిధేనోచ్యతే నామ్నా జ్యోతిఃషు త్రిషు వర్తినీ॥

అగ్ని మేవానుగేళా తు మధ్యం ప్రాప్తా సరస్వతీ।
అముం స్థితా ఽర్ధ్వలోకం తు భారతీ భవతి, హ్యసౌ॥

సైషా తు త్రివిధా వాగ్వై దివి చ వ్యోమ్ని చేహ చ।
వ్యస్తా చైవ సమస్తా చ భజ త్యగ్నీ నిమానపి॥"
— బృ.దే. 3-12,13,14.

పృథివ్యంతరిక్షద్యులోకము లందలి మూడు జ్యోతిస్సులు అగ్ని-వాయు-సూర్యులు వీరియం దనుగతమై వాక్కు వర్తించుచున్నది. త్రిస్థానగతమైన యీ వాక్కే ఇడా-సరస్వతీ-భారతీ యనెడి ముగ్గురు దేవతలు. ఒకే వాక్కు త్రిస్థానగతమై మూడు నామములతో నభివ్యక్త మగుచున్నది. అగ్నిగతమై పృథివియందు వ్యాప్తమైన వాక్కు ఇడ. వాయు (ఇంద్ర-రుద్రాది దేవతా) గతమై యంతరిక్షమున వ్యాప్తమై యుండెడి మాధ్యమిక వాక్కు సరస్వతి. ఈ వాక్కు శచీ, గౌరీ, ఇత్యాది నామములతో గూడ బరగును (చూ. వైదికనిఘంటు). ఆదిత్యగతమై ద్యులోకవ్యాప్తమైన వాక్కు భారతి (సూర్యా, సావిత్రీ-ఇత్యాది నామములతో గూడ నొప్పును) ఈ వాగ్దేవి సమష్టిరూపమున వాక్కుతో లోకత్రయమును వ్యాపించి యుండును. మరల నీమెయే యజ్ఞమున త్రేతాగ్నులయందు విభక్తమై మూడు నామములతో బరగుచున్నది.—అని యర్థము.

దీని ననుసరించి యొకే వాక్కు త్రేధా విభక్తమై అగ్నివాయ్వాదిత్యుల యం దనుగతమై ఇడా-సరస్వతీ-భారతీ నామములతో బరగునని తెలియును. అగ్ని-వాయు-సూర్యులు వేదాత్మకు లగుటచే వారియం దనుగతమై యుండెడి వాక్కు 'ఋగ్యజుఃసామ'రూప వేదవాక్కే యని పూర్వము వివరింపబడినది. శ్రుతియే 'తాను (వాగ్రూపిణి, లేక వాగ్దేవతా రూపిణి యగు తాను) వసురుద్రాదిత్యాది దేవతలయం దనుగతమై యుండి సర్వజగన్నిర్వహణ మొనర్చుచు పరమాత్మ కంటె ననన్యమైన పరమేశ్వరి యగుట' - యొక సూక్తముఖమున జెప్పికొనినది.

'అహం రుద్రేభి ర్వసుభి శ్చరా మ్యహ మాదిత్యై రుత
విశ్వదేవైః । అహం మిత్రావరుణోభా బిభర్మ్యహ
మింద్రాగ్నీ అహ మశ్వినోభా'

—ఋ. 10-125 సూ. అ. వం 4-30.

ఇచట 'బిభర్మి (భరించుచున్నాను)' — అను క్రియ యీ దైవీ వాక్కు (లేక వాగ్దేవి) సర్వజగద్భరణధర్మము చే 'భారతి' యగునని సూచించు చున్నది. ఈ సూక్తమునందే మఱియొకచోట దవ ప్రాశస్త్యము నిట్లు జెప్పికొనినది.

"అహం రాష్ట్రీ సంగమనీ వసూనాం చికితుషీ ప్రథమా
యజ్ఞియానామ్ ।"

నేను పరమేశ్వరిని; కర్మఫలదాత్రిని; ద్రష్టవ్యమగు నాత్మ యొక్క యపరోక్షసాక్షాత్కారము గలదానను (చికితుషీ యత్ సాక్షాత్కర్తవ్యం పరం బ్రహ్మ తద్ జ్ఞాతవతీ, స్వాత్మతయా సాక్షాత్కృతవతీ - సా భా); యజ్ఞముచే నారాధ్యు లగు దేవతలలో బ్రప్రథమురాలను (ప్రథమా యజ్ఞియానామ్).

"అహమేవ స్వయ మిదం వదామి జుష్టం దేవేభి రుత
మానుషేభిః। యం కామయే తం త ముగ్రం కృణోమి
తం బ్రహ్మాణం త మృషిం తం సుమేధామ్॥"

ఇంద్రాది దేవతలకును మనుష్యులెల్లరకును నారాధనీయమగు నీ బ్రహ్మ తత్త్వమును నేనే స్వయముగ నుపదేశించుచున్నాను. (అహం స్వయమేవ ఇదం వస్తు బ్రహ్మాత్మకం, వదామి ఉపదిశామి—సా.భా); ఎవడు నా యను గహపాత్రు డగునో యాతనిని మేధావంతుని జేసి సర్వోన్నతుని గావింతును; క్రాంతదర్శనము గల ఋషి నొనర్తును; బ్రహ్మ నొనర్తును — అని యర్థము.

మానవులే గాక దేవతలు గూడ సేవింపదగిన బ్రహ్మతత్త్వము నేనే స్వయముగ జెప్పుచున్నాను—అని యిట జెప్పబడినది. ఈ యర్థమునే మనుస్మృతియు నిట్లనువదించినది.

'పితృ దేవ మనుష్యాణాం వేద శ్చక్షుః సనాతనమ్'

పితృ—దేవ—మనుష్యులకు వేదము సనాతనమైన జ్ఞాననేత్రము: కాన పై ఋక్కులలోని వాక్కు వేదవాక్కు, లేక వాగ్దేవత యగును. మానవ రచితములగు గ్రంథములలో నెవటగాని సామాన్యముగ నా యా ఫలముల నుద్దేశించి దేవతల యనుగ్రహము కొఱకు జేయబడెడి ప్రార్థనాదికము గానవచ్చును. కాని స్వగ్రంథప్రతిపాదితార్థమును దేవతలు సైతము సేవింప వలె ననెడి శాసనములు గన్పట్టవు. ఒకవేళ నట్టి శాసనము లెచటనైన గన్పట్టిన నవి యున్మత్తప్రలాపములే యనబడును. ప్రకృతమున వేదమునం దట్టి శాసనము గన్పట్టుచున్నది. (జుష్టం దేవేభి రుత మానుషేభిః). వేద ప్రతిపాద్యమగు బ్రహ్మవిద్య యందు దేవతలు గూడ నధికారులు (చూ. బ్ర.సూ. దే.తాధికరణము). స్మృతులును, పురాణేతిహాసాదులును నిఃశంక ముగ నా శ్రుత్యర్థము ననుసరించి, యా సత్యమును లోకమున బ్రబోధిం చినవే కాని, యర్థరహితము లనుచు శ్రుతిశాసనములను త్రోసిరాజనలేదు.

కాన పై ఋక్కుల ననుసరించి వేదవాణి లేక వాగ్దేవత—వసు రుద్రాదిత్యులతో సంచరించుచు నిరంతరసాహచర్యము గలది. సర్వమును భరించు పరమేశ్వరి, కర్మఫలదాత్రి, అపరోక్షాత్మసాక్షాత్కారము గలది. బ్రహ్మతత్త్వప్రతిపాదికయు నగుచున్నది. ఇంతేగాదు. వసురుద్రాదిత్యుల యందు పారమేశ్వరతేజ మనుగతమై యుండునట్లే, వారితో సంచరించుచు వారియం దనుగతమై యుండెడి వేదవాణియందును, ఆ పారమేశ్వర తేజ మనుగతమై యుండును. అట్లు వారియం దనుగతమై యుండెడి యొకే వాగ్దేవి ఇడా—సరస్వతీ—భారతీత్యాది వివిధనామముల దాల్చుచు సర్వమును భరించుచున్నది' — అని తెలియనగును.

మఱియు - 'యం కామయే తం త ముగ్రం కృణోమి తం బ్రహ్మాణం త మృషిం తం సుమేధామ్' - అని యనుటచే, నీ వేదవాణితో నెవరు సఖ్యము చేయుదురో వారు ఆధ్యాత్మికౌన్నత్యము గలవారై యధికారిభేదము ననుసరించి క్రమముగ మేధాసంపద, క్రాంతదర్శనము (ఋషిత్వము), తుదకు బ్రహ్మత్వముగూడ నందెద రనియు దెలియును. వేదవాణితో సఖ్యము జేసెడి వేదవిదుడు క్రమముగ వసు-రుద్ర-ఆదిత్య రూపుడై తుదకు బ్రహ్మానందరసావలిప్తు డగు నని చెప్పెడి పూర్వోదాహృతములైన - 'మాతా రుద్రాణామ్; అగ్నే ర్వాయో రాదిత్యస్య సాయుజ్యం గచ్ఛతి' - ఇత్యాది శ్రుతివాక్యములును పై ఋగర్థమునే భంగ్యంతరముగ వివరించుచున్నవి.

ఇక నొకే వేదవాణి యవస్థాభేదముచే ఇడా-సరస్వతీ-భారతీ రూపములతో సాక్షాత్కరించి యుపదేశించుచు నెట్లు కావ్యమై వరలునో చూతము.

ఇడా-శాసనీ; యజ్ఞానూకాశినీ; దేవహూః, యజ్ఞనీః :-

'వేదవిదుడు వసు-రుద్ర-ఆదిత్యరూపు డగును; దేవతాత్రయరూపు డగుచు వెలయు నాతనియం దనుగతమై విలసిల్లు వాక్కు వేదవాణియే; అగ్ని నారాధించుచు కర్మానుష్ఠానపరుడగు వేదవిదుడు వసురూపుడు'- అని పూర్వము వివరింపబడినది. కర్మానుష్ఠానసమయమున వేదవిదునియం దుండెడి వేదవాక్కు ఇడారూపిణి యగును. కావుననే శ్రుతులయందు ఇడ - 'శాసనీ; యజ్ఞానూకాశినీ; దేవహూః' - అని యీరీతిగ కీర్తింప బడినది.

"ఇడా మకృణ్వన్ మనుషస్య శాసనీమ్" — ఋ. 1-31-11.

"మనుషస్య మనోః ఇడాం ఏతన్నామధేయాం పుత్రీం,
శాసనీం ధర్మోపదేశకర్త్రీం అకృణ్వన్ కృతవన్తః" — సా.భా.

మనువు పుత్రిక యగు ఇడ ధర్మోపదేశకర్త్రి (శాసనీ) యని యిట జెప్ప బడినది. తైత్తిరీయబ్రాహ్మణము మనువుకు సంబంధించిన గోరూపిణి యగు దేవత ఇడ యని యిట్లు వర్ణించినది.

“ఇడా వై మానవీ యజ్ఞానూకాశి న్యాసీత్” —తై. బ్రా. 1-1-4-4.

‘‘ఇడా నామ గోరూపా కాచిత్ దేవతా; సా చ మనుసంబంధినీ; తత్సంబంధ శ్చ మానవీ ఘృతపదీ మైత్రావరుణీ—ఇతి ఇడో పాహ్వానస్య బ్రాహ్మణే స్పష్ట మామ్నాతః—మానవీత్యాహ మను ర్హ్యేతా మగ్రేఽపశ్యత్ ’— ఇతి సాచేడా యజ్ఞానూకాశినీ యజ్ఞతత్త్వప్రకాశన సమర్థాఽఽసీత్’’ —సా. భా.

సృష్ట్యాదియందు యజ్ఞాదికర్మలను, ధర్మములను ప్రవర్తింపజేసినవాడు మనువు. అట్లు ప్రవర్తింపజేయుటకు దోడ్పడిన గోదేవత ఇడ. యజ్ఞతత్త్వప్రకాశికయు, ధర్మోపదేశకర్త్రియు గోదేవతయు నగు ఇడ వేదవాణి యే యగును. గోదేవతాకములగు ‘మాతా రుద్రాణామ్; వచో విదం వాచ ముదీరయన్తీమ్’ ఇత్యాది మంత్రములు కర్మాంగములుగ ‘గో’ పరము లయ్యును, నవి యా గోవును వేదరూపిణి యగు ధేనువుగా దర్శింపజేయునట్టివి యని పూర్వము వివరింపబడినది. కాన నిచట మానవి (మనోః సంబంధినీ) యగు ఇడ వేదవాణి యని గ్రహింపనగును.

మఱియు ‘య మాహు ర్మనవ స్తీర్ణబర్హిషం —(వా.సం. 15-49)’ అను శ్రుతివాక్యము నందలి ‘మనవః’ అను పదమును ‘యే విద్వాంస స్తే మనవః’ (శ.బ్రా. 8-6-3-18) అని శతపథశ్రుతి వివరించినది. మనువు ప్రవర్తింపజేసిన ధర్మమార్గమున జరించుచు కర్మానుష్ఠానపరులగు విద్వాంసులును ‘మను’ రూపులే యగుదురని తాత్పర్యము. ప్రజాపతి యగు మనువునకు ధర్మోపదేశకర్త్రి (శాసని) యై, యజ్ఞతత్త్వప్రకాశికయై తోడ్పడి

నశ్లైే, యా మనుమార్గమున జరించుచు మనురూపులగు వేదవిదులకును ఇడారూపిణియై వేదవాణి తోడ్పడునని శ్రుతితాత్పర్యముగ గ్రహింపనగును.

యజమానుడు కర్మానుష్ఠాన సమయమున నీ వేదవాక్కుతో నా యా దేవతల నాహ్వానించి స్తుతించును. స్తుతిరూపమగు నా వాక్కు ఇడ యనియు, మహత్త్వసంపన్నము, గణనీయము నగునని ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

''ఇడా యేషాం గణ్యా మాహినా గీః'' — ఋ. 3-7-5.

''యేషాం మనుష్యాణా మగ్నివిషయా, మాహినా మహతీ,
ఇడా, గీః స్తుతిరూపా వాక్, గణ్యా గణనీయా పూజ్యా'' —సా. భా.

కర్మానుష్ఠానసమయమున నగ్ని నుద్దేశించిన స్తుతిరూపమగు వాక్కు ఇడ యని యిట నిర్దేశింపబడినది. ఇట్లు అగ్నిని, అగ్నిముఖమున సర్వదేవతలను, ఆహ్వానించుట కుపయుక్త మగుటచే వేదవాణికి 'ఇడా' (ఈడ్యతే స్తూయతే అనయా) యని సార్థకనామము.

''ఇడా దేవహూా ర్మను ర్యజ్ఞనీః'' — తై.సం, 3-3-2-1,

అని తైత్తిరీయశ్రుతియు ఇడాస్వరూపమును వివరించుచున్నది. ఈమె దేవతాహ్వానమున కుపయుక్త మగుటజేసి 'దేవహూః' అగుచున్నది. అట్లు దేవతాహ్వానాదుల ద్వారా యజ్ఞమును ప్రవర్తింపజేయునది యగుటజేసి 'యజ్ఞనీః' అగుచున్నది. ఈ యర్థమే 'శాసనీ, యజ్ఞానూకాశినీ' అను పదములచే గూడ పైన అభివ్యక్తము చేయబడినది. ఇంతే కాదు. మంత్రరూపమై మననము చేయదగినది యగుట జేసి 'మనుః' అనియు కీర్తింపబడినది. విష్ణుసూరిభాష్యమున నీ యర్థ మిట్లు వివరింపబడినది.

"ఇడా గోరూపిణీ బ్రహ్మవిద్యా। సా చ స్వ సత్తయా దేవాహ్వానకరత్వాత్ దేవహూ రిత్యుచ్యతే-ఇడే రన్తేఽదితే సరస్వతీ త్యాది మంత్రలింగాత్[1] 'గాయంతం త్రాయసే యస్మా ద్గాయత్రీ త్వం ప్రతిష్ఠితా'-ఇతి స్మృతేః....। తథా మను ర్మంత్రరూపా వాగ్దేవతా। సా చ కర్మమార్గోపదేశక త్వాత్ యజ్ఞం నయతి ప్రాపయతీతి యజ్ఞనీః ఇత్యుచ్యతే''

— రుద్రాధ్యాయః; విష్ణుసూరిభాష్యమ్.

గోరూపిణి యగు బ్రహ్మవిద్యయే ఇడ. ఆమెయే దేవతాహ్వాన-యజ్ఞప్రవర్తకత్వ ధర్మముల ననుసరించి 'దేవహూః, యజ్ఞనీః' అగుచు మంత్రరూపిణియై మననీయ యగుచు 'మనుః' అగుచున్నది - అని తాత్పర్యము. ఇడ యన బ్రహ్మవిద్యారూపిణి యగు వేదవాణి యగుట శ్రుతి తాత్పర్యము. అయ్యును వేదవిదునియం దుండెడి వేదవాణి ఇడయై కర్మానుష్ఠాన సమయమున శాసించుచు యజ్ఞ(ధర్మ) మార్గమున బ్రవర్తింప జేయునది యగుటజేసి వేదకావ్యము యొక్క ప్రభుసంమితత్వము సూచిత మగుచున్నది.

సరస్వతీ :-

వేదవాణి మంత్రరూపమై మననీయ మగుటచే 'మనుః' అగునని పైన జెప్పబడినది. శ్రవణమననాదులు జేయుచు నుపాసనాపరుడగు వేద విదుడు రుద్రరూపుడగు నని యు బూర్వము (కవి కావ్యశబ్దమున 'మాతా రుద్రాణామ్' అను మంత్రమున) చెప్పబడినది. అట్టి వేదవిదునియం దుండెడి వేదవాణియే సరస్వతి (లేక గౌరీ - శచీ ఇత్యాది నామములతో బరగునది). శ్రవణము జేసి శ్రుత్యర్థమును జక్కగా మననము జేయు

1. తై.సం. 1-1-6-8; వా.సం. 8-43; శ.బ్రా. 4-5-8-10.

విద్వాంసుని మనస్సు వివిధవిజ్ఞానములకు నిలయమై 'సరస్వాన్' అగుచున్నది. తద్గత మగు వాక్కు (వేదవాణి) సరస్వతి యగును. ఈ విషయమును శతపథశ్రుతి యిట్లు వివరించుచున్నది.

"మనో హి సరస్వాన్। వాక్ సరస్వతి। ఏతౌ సారస్వతౌ వుత్సౌ"
—శ. బ్రా. 7-5-1-31.

"సరస్వాన్ మన ఉచ్యతే। సరస్వతీ చ వాక్। ఏతౌ సారస్వతౌ ఇతి స్వార్థికోఽణ్ ప్రత్యయః। ఉత్సౌ వారి ప్రవాహౌ వాఙ్మనసాత్మకౌ। మనస స్తావత్ సర్వశాస్త్రార్థ పరిజ్ఞాన రసాధారత్వాత్, వాచశ్చ తత్ప్రతిపాదన రసాధారత్వా దుత్సత్వ మనయోః" — సా. భా.

మనస్సు 'సరస్వాన్' అనియు, వాక్కు సరస్వతి యనియు, నీ రెండును సారస్వత ప్రవాహము లనియు నిట జెప్పబడినవి. వాఙ్మనస్సులు జల ప్రవాహముల వంటివి (ఉత్సౌ-ఉత్స్యందనౌ): లేక ఊటబావుల వంటివి (Fountains or Springs). ఊటబావులలో తోడినకొలది నీరు పైకి ఉబుకుచుండు రీతి విజ్ఞానవిషయముల మననము చేయుకొలది మనస్సున నూత్న నూత్నాంశములు స్ఫురించుచుండును. వాక్కు కూడ చిత్త సంస్కృతి క్రమము ననుసరించి నూత్ననూత్నార్థములతో శోభిల్లుచు గన్పట్టి వివిధ నిగూఢార్థముల దర్శింప జేయుచుండును. అందుచే నీ వాఙ్మనస్సులు ఊటబావులతో పోల్చబడినవి. మఱియు ప్రవాహము నిత్యసరణశీలము. ప్రవాహము వలె వాఙ్మనస్సులు గూడ నిత్యసరణశీలములై సారస్వతప్రవాహరూపములై వెలయుచుండును. అట్టియెడ మనస్సు నిఖిలశాస్త్రార్థ విజ్ఞానరసమున కాకర మగును. వాక్కు గూడ తద్రస ప్రతిపాదకమై రసాధార మగును. కాన నీ రెండును సారస్వతప్రవాహరూపములగు ఉత్సములు — అని యర్థము.

ఇట 'శ్రవణమననాదులచే బరిపక్వమైన వేదవిదుని మనస్సు శాస్త్రార్థ విజ్ఞానరసపరిప్లుతమై 'సరస్వాన్' అగుచున్నది' - అని చెప్పుటచే నట్టి మనస్వి యగు వేదువిదుడును సరస్వంతు డగును. ఆ సరస్వంతుని యొక్క వేదవాక్కు తత్ప్రతిపాదక రసాధార మగుచు సరస్వతి యగును. శాస్త్రార్థపరిజ్ఞానరసమే యిట శ్రుతియందు 'సరః' పదముచే నుపలక్షిత మగుచున్నది. వేదవిదునకు మాత వలె వివిధశాస్త్రార్థవిజ్ఞానరసము నందించెడి వేదవాక్కు సరస్వతి యగు నని శ్రుతితాత్పర్యము. వేదాభ్యాససమయమున సరస్వతి తల్లివోలె తనయందు నిగూఢమై యున్న విజ్ఞానరసము నందించు నని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"యదేషాం శ్రేష్ఠం యదరిప్ర మాసీత్ ప్రేణా తదేషాం
నిహితం గుహావిః" — ఋ. 10-71-11.

'ఏషాం శ్రేష్ఠం ప్రశస్యతమం, యత్ యచ్చ, అరిప్రం
పాపరహితం వేదార్థజ్ఞానం, ఆసీత్, ఏషాం తద్ జ్ఞానం
గుహా గుహాయాం, నిహితం గోప్యం, తత్ ప్రేణా ప్రేమ్ణా
ఽఽవిర్భవతి। వేదాభ్యాసకాలే సరస్వతీ స్వార్థ మేభ్యః
ప్రకాశయతీత్యర్థః' — సా. భా.

మఱియు యజ్ఞభూమి కాహ్వానింపబడు ఇడా-సరస్వతీ-భారతీ యను మువ్వురు దేవతలలో బుద్ధిని సంస్కరించి విజ్ఞానప్రబోధము జేయునది సరస్వతి. ఈ విషయమును శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"సరస్వతీ సాధయన్తీ ధియం న ఇలా దేవీ భారతీ విశ్వతూర్తిః।
తిస్రో దేవీః స్వధయా బర్హి రేద మచ్ఛిద్రం పాంతు శరణం
నిషద్య॥ — ఋ. 2-3-8.

ఈ మంత్రమున ముగ్గురు దేవతలు నాహ్వానింపబడిరి. అందు బుద్ధిని సంస్కరించి ప్రబోధించెడి ధర్మము (సాధయన్తీ ధియం నః) సరస్వతికే చెప్పబడినది. సరస్వతి యొక్క యిట్టి యీ స్వభావ మింకను పలు మంత్రములందును గాననగును.

> "పావకా నః సరస్వతీ వాజేభి ర్వాజినీవతీ ।
> యజ్ఞం వష్టు ధియా వసుః ॥"[1]
> "చోదయిత్రీ సూనృతానాం చేతన్తీ సుమతీనామ్ ।
> యజ్ఞం దధే సరస్వతీ ॥"[2]

పావకా – ధియావసుః :-

> 'హేమ్నః సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధిః శ్యామికాఽపి వా'
> — రఘు.

హిరణ్యము (బంగారము) యొక్క పరిశుద్ధి గాని, మాలిన్యము గాని అగ్నియందు స్ఫుటముగా నభివ్యక్త మగును – అని యర్థము. ఇట్టి శోధకత్వధర్మము గలవాడగుటచే నగ్నికి 'పావకః'(పావయతి శోధయతీతి పావకః) – అని పేరు. జ్ఞానక్రియాశక్తి సంపన్నమై 'హితరమ్య' మగుటచే సూక్ష్మశరీరమునకు 'హిరమ్య' మని పేరు; హిరమ్యమే పరోక్షముగా హిరణ్య మని చెప్పబడు నని పూర్వము (చూ. కవి–కావ్యము) వివరింపబడినది. హిరణ్యరూప మగు సూక్ష్మశరీరము నందలి విశుద్ధిని, మాలిన్యమును శోధించి దర్శింపజేయునది గాన సరస్వతియు 'పావక' యగును. బుద్ధి నావేశించి యుండి 'ధియావసుః' – అగును.

---

1. ఋ. 1-3-10; సా.వే. 1-189: వా. సం. 20-84; తై. బ్రా. 2-4-3-1; ఐ. ఆ. 1-1-4-16.

2. ఋ. 1-3-11; వా. సం. 20-85; తై. సం. 4-1-11-2;

"ధియావసుః బుద్ధ్యా సర్వా నాచ్ఛాదయన్తీ, బుద్ధిప్రదేత్యర్థః"
— సా. భా. (ఐ. ఆ.).

'ధియావసుః ప్రజ్ఞాధనా.... ప్రజ్ఞయాఽఽచ్ఛాదయిత్రీ సర్వార్థానామ్'
— స్కందస్వామి.

'ప్రజ్ఞయా సర్వేషాం వాసయిత్రీ' — వేం. మా. భాష్యమ్.

పావమానీ _ వేదమాతా :-

శోధకత్వధర్మమును బురస్కరించుకొని 'పావకా' యనియే గాక, పావమానీ యనియు వేదవాక్కు చెప్పబడుచున్నది.

'స్తుతా మయా వరదా వేదమాతా ప్రచోదయన్తాం పావమానీ ద్విజానామ్। ఆయుః ప్రాణం ప్రజాం పశుం కీర్తిం ద్రవిణం బ్రహ్మవర్చసం మహ్యం దత్వా వ్రజత బ్రహ్మలోకమ్'
— అ. సం. 19-71-1.

(ఈ మంత్రము కొలది మార్పులతో తైత్తిరీయారణ్యకము (10-36) నందును గలదు).

'మయా వేదాధ్యాయకేన, సావిత్రీం జపతా వా, స్తుతా అభిష్టుతా స్వభ్యస్తా. వరదా ఇష్టకామప్రదాత్రీ, పవమానః పాపాత్ పరిశోధకః సూత్రాత్మా। 'వాయు రేవ పవమానో దిశో హరిత ఆవిష్ట' — ఇతి ఐతరేయకశ్రుతేః (ఐ. ఆ. 2-1-1). తత్ప్రతిపాదికా పావమానీ, వేదమాతా వేదస్య ఋగాదిరూపస్య మాతా సర్వవేదసారత్వేన మాతృవత్ ప్రధానభూతా సావిత్రీ, వేద ఏవ వా మాతా మాతృవ ద్ధితకారిత్వాత్.... బ్రహ్మలోకం బ్రహ్మణో లోకః సత్య లోకః, బ్రహ్మైవ వా లోకః లోక్యమానం విద్వద్భి

రనుభూయమానం పరతత్త్వం, ప్రజత....శబ్దావగమ్య బ్రహ్మాకారం పరిత్యజ్య వాఙ్మనసాతీతార్థబ్రహ్మరూపో భవేతి మంత్రదర్శినా ఋషిణా సాక్షాత్కృతపరతత్త్వే నోచ్యతే' — సా. భా.

వేదాధ్యయనపరునిచే నధ్యయనము చేయబడెడి, లేక గాయత్రీజపపరాయణు నిచే స్తుతింపబడెడి వేదమాత యిట 'పావమానీ' యని కీర్తింపబడినది. వేదమాత యనగా 'ఋగాదివేదజనని యగు సావిత్రి; సర్వవేదసార భూతయై తల్లి వలె గణనీయురాలు - అని యర్థము; లేక వేదరూపిణి యగు మాత; తల్లివలె హితకారిణి యగుటచే వేదమే మాత' - అని యర్థము. పరాదేవత యగు సావిత్రి యొక్కయు, లేక వేదరూపిణి యగు మాతయొక్కయు ననుగ్రహముచే, బ్రహ్మలోకము నొందుము. బ్రహ్మ లోక మనగా సత్యలోకము; విద్వాంసులగు కవులచే ననుభూత మగు చుండు బ్రహ్మ యనెడి పరతత్త్వమే బ్రహ్మలోకము. అట్టి వేదప్రతి పాద్యము, వాఙ్మనసాతీతమును నగు బ్రహ్మభావము నొందుము - అని యర్థము.

ఇట్లు బ్రహ్మభావము నొందించు వేదవాక్కు 'పావమాని' యని చెప్పబడినది. పవమాను డనగా వాయువు; అనగా సూత్రాత్మ యగు హిరణ్యగర్భబ్రహ్మ. పాపము నుండి పరిశుద్ధి నొనర్చువా డగుటచే నీ ప్రాణదేవునకు 'పవమానః' అని పేరు. పవమానుని (బ్రహ్మ) యొక్క తత్త్వమును ప్రతిపాదించునది యగుటచే వేదమాతకు 'పావమానీ' యని పేరు — అని శ్రుతితాత్పర్యము.

శోధకత్వధర్మము గల్గియు, పవమాన (బ్రహ్మ) తత్త్వప్రతిపాదిక యగుచును చతుర్వేదరూప మగు వాక్కు అంతయు పావమానియే యగు చున్నది. కాని వేదములందు ప్రత్యక్షముగ పవమానదేవతాకము లయిన

వేదసూక్తములకు 'పావమానము' లని పేరు. ఇవి యత్యన్త పవిత్రములు_ అని ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

"యః పావమానీ రధ్యే త్యృషిభిః సంభృతం రసమ్ ।
సర్వం స పూత మశ్నాతి స్వదితం మాతరిశ్వనా ॥"

—ఋ. 9-67-31.

"తస్మై సరస్వతీ దుహే క్షీరం సర్పి ర్మధూదకమ్"

—ఋ, 9-67-32; తై. బ్రా. 1-4-8-4.

పవమానదేవతాకము లయిన ఋక్కులు వేదరసభూతములు (సారభూతములు). వీని నధ్యయనము జేయుచో నా స్వాధ్యాయపరునకు నుపభోగ్యమగు వస్తుజాతము నంతయు పవమానదేవత పాపరహిత (పవిత్ర) మొనర్చును. అట్లు పరిపూతమైన భోగ్యజాతమునే స్వాధ్యాయపరుడనుభవించును. వేదమాత యగు సరస్వతి యాతనికి 'క్షీర-ఘృత-మధు-ఉదక' రూపములగు చతుర్వేదాధ్యయన (స్వాధ్యాయాధ్యయన) ఫలముల స్వయముగ సమకూర్చును-యజ్ఞాది కర్మానుష్ఠాపరుని గావించి వేదశాస్త్ర విదుని గావించును (ఏనం నరం యాగాదిపరం వేదశాస్త్రవిదం కరోతీత్యర్థః సా.భా.) — అని యర్థము.

ఇట సోమదేవతాకము లయిన సూక్తములు పావమానమంత్రములుగ జెప్పబడుచున్నవి. 'సోమః' అనగా యజ్ఞమునం దభిషుత మయ్యెడి సోమరస మని యర్థము. దీనిని వేదప్రతిపాద్యుడు, వేదరసభూతుడు నగు బ్రహ్మను పవమానునిగా దర్శింపవలెనని శ్రుతి తాత్పర్యము.

పవిత్రమ్ వేదమంత్రః – దేవతా :-

ఈ పవమానుడు శ్రుతి యందు 'పవిత్రః' అనియు గీర్తింపబడును. తత్ప్రతిపాదకమై, పాపము నుండి విశుద్ధుల నొనర్చుటచే వేదమంత్రము

నకును 'పవిత్ర' మని పేరు. అందుచే నీ 'పవిత్ర' శబ్దము దేవతాపరము గను, వేదమంత్రపరముగను గ్రహింపబడుచుండును.

"పవిత్రం తే వితతం బ్రహ్మణస్పతే ప్రభు ర్గాత్రాణి పర్యేషి
విశ్వతః। అత ప్తతనూ ర్న తదామో అశ్నుతే శృతాస ఇ
ద్వహ న్త స్తత్సమాశత॥" —ఋ.9_83-1; తాం.బ్రా. 1_2_8.

"హే బ్రహ్మణస్పతే ! మంత్రస్య స్వామిన్ ! సోమ ! తే,
పవిత్రం శోధక మంత్రం, వితతం సర్వత్ర విస్తృతం, సః
ప్రభుః ప్రభవితా....శృతాస ఇత్ శృతా ఏవ పరిపక్వా ఏవ,
వహ న్తః, తత్పవిత్రం ఆశత వ్యాప్నువ న్తి"
— సా.భా; (తాం.బ్రా.)

ఇట సోముడు బ్రహ్మణస్పతి - మంత్రపతి - గా సంబోధింపబడినాడు. అట్టి సోము (బ్రహ్మ) నుద్దేశించిన మంత్రము 'పవిత్ర' శబ్దముచే జెప్ప బడినది. 'పూఞ్' ధాతువు కంటె 'ఋషి (మంత్ర) - దేవతా' రూపార్థ మున 'ఇత్ర' ప్రత్యయము వచ్చి 'పవిత్ర' అను రూపము సిద్ధించును.

"క ర్తరి చర్షిదేవతయోః' —పా.సూ. 3_2_186.

"పువ ఇత్రః స్యాత్ ఋషౌ కరణే. దేవతాయాం క ర్తరి ।
ఋషిర్వేదమంత్రః తదు క్త మృషిణేతి దర్శనాత్, పూయతేఽ
నేనేతి పవిత్రమ్। దేవతాయాం తు 'అగ్నిః పవిత్రం' స మా
పునాతు" —సిద్ధా న్తకౌముదీ.

'పూయతే అనేనేతి పవిత్రమ్' అను నిర్వచనము ననుసరించి పవిత్రహేతు వగు వేదమంత్రము పవిత్రము. పవిత్రము చేయువారు గాన దేవతలకును పవిత్ర వ్యవహారము గల దని శబ్దానుశాసనము వలన దెలియుచున్నది.

కాన ఋగ్యజుఃసామాత్మక మంత్రరాశి 'పవిత్రశబ్ద వాచ్యమై శ్రుతిస్మృతుల యందు ప్రసిద్ధమైనది.[1]

ఇంతే కాదు. ఋగ్యజుఃసామాత్మకు లగు నగ్ని-వాయు-సూర్యులును పవిత్రశబ్దవాచ్యులు.

"త్రిభిః పవిత్రై రపుపో ద్ధ్యర్కం హృదా మతిం జ్యోతి రను ప్రజానన్" —ఋ. 3-28-6.

'సర్వాత్మకః అగ్నిః. హృదా అంతఃకరణవృత్త్యా, మతిం మననీయం, జ్యోతిః స్వప్రకాశరూపం పరబ్రహ్మాఖ్యం తేజః, అను ప్రజానన్ శ్రవణమననాది క్రమేణ ప్రకర్షేణ సంశయ విపర్యాస భావనా బుద్ధినిరాసేన స్వాత్మరూపతయా జానానః సన్, పవిత్రైః పావనైః, త్రిభిః అగ్ని వాయు సూర్యైః, అర్కం అర్చనీయం స్వాత్మానం, అపుపోద్ధి తేభ్యోఽపి నిర్మలతయా పావనం పరిచిచ్ఛేద ఖలు। యథా దశాపవిత్రేణ సోమం పావయతి తద్వత్ ।' —సా. భా.

---

1. నిశమ్య తే ఘర్ఘరితం స్వఖేదక్షయిష్ణు మాయామయసూకరస్య ।
జన స్తపః సత్యనివాసిన స్తే త్రిభిః పవిత్రై ర్మునయో గృణన్ స్మ॥
—భాగ. 3-13-27.

'త్రిభిః పవిత్రైః ఋగ్యజుః సామ మంత్రైః' —శ్రీధరః.

'మంత్రః పవిత్ర ముచ్యతే' —సా.భా. ఋ. 10-27-15.

"కుర్యా త్త్రిషవణస్నాయీ కృచ్ఛ్రం చాంద్రాయణం తథా।
పవిత్రాణి జపే త్పిండాన్ గాయత్ర్యా చాభిమంత్రయేత్॥"
యాజ్ఞ. స్మృ. ప్రాయశ్చిత్త కాండ. 325.

"సావిత్రీం చ జపే న్నిత్యం పవిత్రాణి చ శక్తితః" —మను. 11-225.

"తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని యోగః—స్వాధ్యాయః ప్రణవాది పవిత్రాణాం జపః" — శం.భా. (యోగసూత్ర).

ఇట పరతత్త్వరూపమును సాక్షాత్కరించుకొనిన యగ్ని (ముక్తపురుషుడు) తన సర్వాత్మకత్వానుభవమును ఆవిష్కరించు కొనుచున్నాడు. దశాపవిత్రముచే సోమము పరిశుద్ధమై పావన మగునట్లు, పవిత్రులగు నగ్నివాయు సూర్యులచే నర్చనీయుడగు స్వాత్మ, వారికంటె నిర్మలుడు, పవిత్రుడు నని ముక్తపురుషుడగు అగ్ని శ్రవణ మననా ద్యభ్యాసక్రమముచే దర్శించెను— అని యర్థము.

కాగా ఋగ్యజుః సామలు పవిత్రములు; తదాత్మకులగు నగ్ని వాయు సూర్యులు పవిత్రులు. ఆత్మ పరమపవిత్రము[1]. 'అత్యాశ్రమేభ్యః పరమం పవిత్రమ్' (శ్వే.ఉ. 6-21-)— వేదాంతప్రతిపాద్య మగు బ్రహ్మ పరమపవిత్రము—అని యుపనిషత్తులును ముక్తకంఠముగ గీర్తించినవి. అట్టి బ్రహ్మప్రతిపాదక మగుచు ఆత్మచికిత్సకము, పరిశుద్ధిహేతువునైన వేదరూపిణి యగు సరస్వతి- 'పావకా, పావమానీ, పవిత్ర' - శబ్ద వాచ్య యగుచున్నది.

చోదయిత్రీ సూనృతానాం; చేతన్తీ సుమతీనామ్ :-

అగ్నియందు శోధకత్వధర్మమే గాదు; తేజఃశాలి యగుటచే నంధకారమును దొలగించి పదార్థముల నభివ్యక్తము చేసి భాసింపజేయు ధర్మము గూడ గలదు. అట్లే సరస్వతియు శ్రవణము చేసి మననము చేయుకొలది యంతఃకరణమున నెలకొనిన యజ్ఞానాంధకారావరణముల గ్రమముగ దొలగించును మొదట స్తుతిరూపములై వాక్యసామాన్యరూపమున మాత్రమే గోచరించు మంత్రరాశిని, సూనృత (సత్యప్రియ) వాక్యములుగ దర్శింప

1. "యత్తే పవిత్ర. మర్చిష్యగ్నే వితత మంతరా బ్రహ్మ తేన పునాతు మా"
—వా.సం. 19-41; తై.బ్రా. 1-4-8-20.
అగ్నే తే తవ అర్చిషి జ్వాలాయా మంతరా మధ్యే యత్ బ్రహ్మ త్రయీరూపం. పరబ్రహ్మరూపం వా పవిత్రమ్, విततం విస్తృతం ప్రసారితం, తేన పవిత్రేణ మా మాం భవాన్ పునాతు"- ఉవట, మహీధరౌ; మూ.సా.భా.

జేయును; అనగా వాక్యములను ప్రియములుగ దర్శింపజేసి యవి సత్యార్థ బోధకము లనెడి స్ఫూర్తిని గలిగించును. ధీమంతులను చైతన్యవంతులను నొనర్చి యుజ్జీవింప జేయును. కాగా ఇడవలె సరస్వతియు బ్రహ్మవిద్యా రూపిణియే యయ్యును ఇడవలె శాసించునది గాక, కర్మాద్యనుష్ఠాన సమయమున యజమానుని బుద్ధి నావేశించి యుండి తల్లివోలె యుక్తాయుక్తముల నుపదేశించు చుండునది—యని తాత్పర్యము. మహాభారతము గూడ సరస్వతీ స్వరూపము నిట్లు వివరించుచున్నది.

> 'అగ్నిహోత్రా దహ మభ్యాగతాస్మి
> విప్రర్షభాణాం సంశయచ్ఛేదనాయ ।
> త్వత్సంయోగా దహ మేత దబ్రువం
> భావే స్థితా తథ్య మర్థం యథావత్ ॥' —భార. 3-186-22.

సరస్వతీదేవి స్వయముగ తార్క్ష్య డను మునికి దన స్వరూపమును వివరించిన వాక్య మిది—'అగ్నిహోత్రాది సత్కర్మలవలన పరా-అపరా విద్యారూపిణియై యావిర్భవింతును; వేదవిదులకు గల సంశయముల బోనాడు చుందును; నీ కిపుడు 'కర్మలు క్రమముగ ముక్తిహేతువు లగుట- యనెడి పరావిద్యయు, సగుణబ్రహ్మవిద్యయు నుపదేశించితిని. నే నెవరిభావమందు నిలిచి యుందునో యాతడు శ్రద్ధావంతుడై యగ్నిహోత్రాది కర్మలచే దేవతాప్రసాదమును, పిదప కర్మ-ఉపాసనా-జ్ఞానఫలములను బొందును - అని యర్థము (చూ. నీలకంఠవ్యాఖ్య).

ఇట కర్మానుష్ఠానముజేసి చిత్తపరిపాకము నొందిన వేదవిదులకు పరా-అపరావిద్యల విషయమై గలిగెడి సందియముల దీర్చు తల్లి సరస్వతి; ఆమె వేదవిదుల హృదయాకాశవీథిని విహరించుచు జల్లని చూపులచే వేదనిహితగూఢార్థముల బ్రకాశింప జేయునది - యని చెప్పబడుటచే -

'చోదయిత్రీ సూనృతానామ్'-ఇత్యాది ఋగర్థమునే యీ మహాభారతశ్లోకము వివరించుట స్పష్టమగును. మహాభారతము మొదటి మంగళ శ్లోకమును బరిశీలించినను నీ విషయము స్పష్టముగా దెలియును.

''నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం చైవ తతో జయ ముదీరయేత్॥''

ప్రాణిశరీరములకు పిండాండ మనియు, దృశ్యమగు చరాచరమునకు బ్రహ్మాండ మనియు పేరు. పిండాండమున కధినేత యగుటచే జీవునకు నరు డని పేరు. అట్లే బ్రహ్మాండమున కధినేత యగు పరమేశ్వరునకును నరు డని పేరు. నరుడగు పరమేశ్వరుని నుండి యావిర్భవించుటచే నీ చరాచరమునకు 'నారం' అనియు, వ్యాపకత్వధర్మముచే 'అపః' అనియు పేరు. అట్టి నారమునకు, అనగా చరాచరమునకు అయనము-అనగా అధిష్ఠానరూపుడై వసతిస్థాన మగుటచే బరమేశ్వరునకు 'నారాయణః' అని పేరు ప్రసిద్ధము. నరనారాయణు లగు జీవేశ్వరు లిరువురకును స్వరూపభూతుడై యధినేత యగు నిర్గుణ బ్రహ్మకును 'నరః' అని పేరు. ఇట్లు నర, నారాయణ, నిర్గుణబ్రహ్మలు మువ్వురును నరశబ్దవాచ్యులే. చేతను డగుటచే జడవర్గముకంటె జీవుడు ఉత్కృష్టుడు. జీవునికంటె కారణాత్మ యగు నారాయణు డుత్కృష్టతరుడు. వీరిరువురికంటెను ''సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ'' ఇత్యాది శ్రుతి ప్రతిపాద్య మగు నిర్గుణబ్రహ్మతత్త్వము ఉత్కృష్టతమము. కావున నట్టి నిర్గుణ తత్త్వము 'నరోత్తమం' అని యిట కీర్తింపబడుట యుక్తమే. ఇట్టి యీ నర-నారాయణ-నరోత్తమతత్త్వములను బ్రకాశింపజేయు తల్లి సరస్వతి. అట్టి తత్త్వముల నితిహాసాదివ్యాజమున బ్రకాశింపజేయుచు సంసార జయమునకు సాధనభూతమై ప్రవర్తిల్లిన దగుటచే నీ మహాభారతమునకు 'జయ' మని పేరు. మహాభారతమే కాదు ; సర్వపురుషార్థప్రతిపాదకమై సంసారజయమునకు సాధనభూతములైన పురాణాదులును, శారీరకసూత్ర

భాష్యాదిగ్రంథములను 'జయ' శబ్దవాచ్యములే యగును. అట్టి గ్రంథముల జదువుట కుపక్రమించు నపుడు నర-నారాయణ-నరోత్తములను, తత్త్వ ప్రకాశిక యగు సరస్వతిని, అట్టి సరస్వతీదేవి యనుగ్రహమునకు బాత్రు డగు వ్యాసుని స్మరించి నమస్కరింపవలె నని పై శ్లోకమునకు సంప్రదాయానుగతమైన యర్థము.[1]

ఈ భారతము మొదటి మంగళశ్లోకమున నర-నారాయణ-నరోత్తమ తత్త్వములను అనగా జీవేశ్వర బ్రహ్మ తత్త్వములను ప్రకాశింపజేయు తల్లి సరస్వతి యని కీర్తింపబడుట గమనార్హము.

'సరస్వతీ సాధయంతీ ధియం నః' – ఇత్యాది శ్రుతులు జిజ్ఞాసువుల బుద్ధిని సంస్కరించి తత్త్వము నుద్దీపింపజేయు తల్లి సరస్వతి యని చెప్పుచున్నవి. అట్టి శ్రుత్యర్థమే యాదిమమంగళ శ్లోకరూపమున గ్రంథారంభ సమయమున మహర్షిచే తలపింప జేయబడుచున్నది. నీలకంఠపండితుడును శ్రుత్యర్థానుగుణముగనే పై శ్లోకవ్యాఖ్యానమున సరస్వతీస్వరూపము నిట్లు వివరించినాడు.

"దేవీం నరనారాయణ నరోత్తమ తత్త్వప్రద్యోతనీం
సరస్వతీం చ నమస్కృత్యైవ॥ — నీలకంఠః.

---

1. "పిండ బ్రహ్మాండ నేతృత్వా న్నరౌ జీవేశ్వరా వుభౌ,
తయో శ్చ నయనా చ్ఛుద్ధం బ్రహ్మాఽపి నర ఉచ్యతే॥
నరజానా మపాం కార్యం నారం బ్రహ్మాండ మిష్యతే,
త దస్య వసతిస్థానం తేన నారాయణో విభుః॥
స్వావిద్యాస్సృష్టపిండేన తాదాత్మ్యం యో గతో నరః॥
న జీవః న పరం బ్రహ్మ నరోత్తమపదాభిధమ్॥
తద్ద్యోతికాం గిరం నత్వా తతో వ్యాప్త స్తయైవ సన్,
సంసారజయినం గ్రంథం జయనామాన మీరయేత్॥—ఇత్యాది
(చూ. – నీలకంఠవ్యాఖ్య)

భిషక్ :-

వైద్యుడు చికిత్స జేసి శారీరకదోషముల మాత్రమే తొలగింప గలడు. సరస్వతి మనోదోషముల నిర్మూలించి ఆత్మచికిత్సక మగును. ఇట్లు చికిత్స చేయుటకు సాధనము వేదవాక్కు — అని శ్రుతి చెప్పుచున్నది.

'వాచా సరస్వతీ భిషక్' — వా. సం. 19-12.

'సరస్వతీ చ, వాచా త్రయీలక్షణయా, భిష గాసీత్'
— ఉవటః, మహీధరః.

వేదవాక్కు ఆత్మచికిత్సక మని స్వాధ్యాయశబ్దమున వివరింపబడినది.

రసాత్మికా :-

వాగ్దేవతయగు సరస్వతి అబ్దేవత గూడ నగునని పూర్వము (కవి_కావ్య శబ్దమున) వివరింపబడిది. ఈమె మధ్యమస్థానదేవత; మాధ్యమిక వాక్కు — అనియు జెప్పబడును. ఈమె వాగ్దేవతయై హృదయాంబర వీథి నిలిచి బుద్ధిసమాయుక్తయై మాధ్యమికవాగ్రూపిణి యగుచు వాక్ప్రేరయిత్రి యగు (అథ తదేవ శబ్దబ్రహ్మ తేనైవ వాయునా హృదయపర్యంత మభివ్యజ్యమానం నిశ్చయాత్మికయా బుద్ధ్యా యుక్తం విశేషస్పందప్రకాశరూప నాదమయం సత్ మధ్యమా వా గిత్యుచ్యతే। .... అథ హృదయగో బుద్ధియు ఙ్మధ్యమాఖ్యః — సౌభాగ్యభాస్కరరాయః_లలితాసహస్రనామవ్యాఖ్య). ఈ దేవియే యంతరిక్షమునం దంతట వ్యాపించి వాయుసమాయుక్తయై వృష్ట్యుదకముల గల్పించెడి మాధ్యమికవాక్కు. ఇట్లు ఆధిదైవికముగను, ఆధ్యాత్మికముగను నీమె వాగ్దేవత యగుచున్నది అంతరిక్షమున సలిలరూపరసమును (సరః), ఆధ్యాత్మికముగ విజ్ఞానరసమును

(సరః) తల్లి వలె బ్రోదిసేయునది యగుటచే సరస్వతి యని యన్వర్థనామము. అందుచే సరస్వతీదేవతాకము లయిన మంత్రములు వాగ్దేవతాపరములుగను, అబ్దేవతాపరములుగను గూడ నర్థముల స్ఫురింప జేయుట శ్రుతిసంప్రదాయము. ఈ విషయము నీ క్రిందిఋక్కు స్పష్టము చేయుచున్నది.

"మహో అర్ణః సరస్వతీ ప్రచేతయతి కేతునా।
ధియో విశ్వా విరాజతి ॥" —ఋ. 1-3-12; వా.సం. 20-86.

'సరస్వతి తన ప్రజ్ఞచే మహాజలరాశిని చైతన్యవంతమొనర్చి ప్రవర్తింప జేయుచున్నది; అనుష్ఠాతల బుద్ధులను విజ్ఞానముతో నింపి వికసింప జేయుచున్నది' — అని యర్థము. ఇట నొకే సరస్వతికి 'మహాజలరాశిని ప్రవర్తింప జేయుట, అనుష్ఠాతల బుద్ధుల వికసింపజేయుట' — యని రెండు ధర్మములు చెప్పబడుటచే వాగ్దేవతయే అబ్దేవత యగుట శ్రుతితాత్పర్యము.

కాన సరస్వతి యనగా (1) వాగ్దేవి (2) వేదవాక్కు (3) వాక్కు. అట్లే 1) అబ్దేవత 2) జలప్రవాహరూపమగు నది 3) కొన్నియెడల నొక నదీనామము — అని తెలియును. దీనిచే 'సరస్వతీ' పదము మొదట నదీవాచకము; క్రమముగ వాగ్దేవతా వాచకముగ బరిణమించినది' — అనెడి చారిత్రికుల కల్పన శ్రుతిసంమతము కాదని స్పష్ట మగుచున్నది. వాగ్దేవతా రూపములు గూడ నగుటచేతనే గంగా యమునాది నదు లన్నియు స్నాన, పూజాది సమయములందు స్మరింపబడు సంప్రదాయము నేటికిని గలదు. ఇవి ప్రత్యక్షముగ జలప్రవాహరూపములుగ గన్పట్టినను, బ్రహ్మామృతానంద రసపూర్ణములుగ దర్శింపవలె నను విషయము పూర్వము వివరింపబడినది. కాన శ్రవణ మననాదుల నొనర్చు వేదవిదునకు సఖి వోలె, లేక మాత వోలె రసస్వరూపమును దర్శింపజేయు రసాత్మిక యగు వేదవాక్కు సరస్వతి.

భారతీ :-

వేదాంతవాక్యశ్రవణాదులు జేయుచు నిదిధ్యాసనపాటవమున జ్ఞానయోగారూఢుడైన వేదవిదు డాదిత్యరూపు డన నొప్పును. ఒకే ప్రాణములు ప్రథమవయస్సున వసువులు, మధ్యమ వయస్సున రుద్రులు, తృతీయ వయస్సున నాదిత్యులు నగునని పూర్వము వివరింపబడినది. మఱియు ఆదానక్రియ ఆదిత్యున కసాధారణధర్మము.

'ప్రాణా వా ఆదిత్యా ఏతే హీదగ్ం సర్వ మాదదతే'
— ఛాం. ఉ. 3-16-5.

'సవనాత్ సవితాఽఽదానా దాదిత్యః' — మై. ఉ. 6.

'సహస్రగుణ ముత్స్రష్టు మాదత్తే హి రసం రవిః' — రఘువంశ.

జ్ఞానయోగారూఢుడైన వేదవిదుడును వేదవాక్యముల నన్నిటి నాత్మ(బ్రహ్మ) పర్యవసానములుగ గ్రహింపజాలిన విద్వాంసుడు. సూర్యుడు రసాదానము జేయునట్లు వేదవాఙ్మయమునం దంతటను బ్రహ్మామృతానందరసము నాస్వాదింపజాలినవా డగుటజేసి యాత డాదిత్యరూపమున నొప్పియుండు ననుట యుక్తమే యగును. అట్టి సమయమున నీ త్రయీవిద్య యా వేదవిదుని సమాహితచిత్తమున సరసత నాపాదించి కాంత వలెను (ఉతో త్వస్మై తన్వం విసస్రే) తోడనుండి స్వస వలెను (స్వసాఽఽదిత్యానాం) ఆత్మస్వరూపమును దర్శింపజేయును. అట్లు దర్శించిన వేదవిదున కీ వేదవాణి యాత్మ యొక్క అమృతకలాస్వరూపిణిగ సాక్షాత్కరించును (వందేమహి చ తాం వాణీం అమృతా మాత్మనః కలామ్). ఆదిత్యరూపు డగు వేదవిదుడు భరతుడు ; ఆతనియందు విలసిల్లెడి వేదవాణి భారతి (బ్రహ్మవిద్యారూపిణి) యగును. ఈ విషయమును జూతము.

ఆదిత్యుడు భరతుడు, తద్దీప్తి, లేక వాక్కు, లేక పత్ని భారతి :-

ఆదిత్యుడు భరతశబ్దవాచ్యు డగుట శ్రుతులయందు ప్రసిద్ధము. వైదిక నిఘంటువున ఆదిత్యనామములలో భరత శబ్దము పఠింపబడినది. 'భరత ఆదిత్యః, తస్య భాః భారతీ' అని యాస్కనిరుక్తము. 'భరతు డాదిత్యుడు ; ఆయన పత్ని. దీప్తి లేక వాక్కు భారతి' యని భాష్యకర్త లందఱును వివరించిరి. ఆదిత్యుడు భరతుడు ; త్రయీమయుడగు నా యాదిత్యుని యందలి వాక్కు (త్రయీవిద్య) భారతి యగుటచే నాదిత్య రూపుడగు వేదవిదుడును భరతుడు; ఆయన తోడనుండెడి వేదవాణియు భారతి యే యగును.

ఇట్లు పరిశీలించుచో నొకే వేదవాణి యొకే వేదవిదుని యందు సంస్కారక్రమము ననుసరించి వెలయు చిత్తపరిపాక వశమున మొదట ఇడయై శాసించి; తరువాత సరస్వతియై యుపదేశించి, తుదకు భారతియై యాత్మస్వరూప సాక్షాత్కారమునకు దోడ్పడి బ్రహ్మవిద్యాప్రదాత్రి యగు నని తెలియనగును. ఇంతియే గాదు. ఆదిత్యుడే గాక అగ్నివాయువులును భరతులు; వారియందు విరాజిల్లు ఇడా, సరస్వతులును భారతీరూపు లగు దురు. కాన మొదట అగ్ని యొక్క భరతత్వమును జూతము.

అగ్ని - భరతుడు :-

శ్రుతులయం దగ్ని 'భరత—భారత' నామములచే బలుచోట్ల [1]వ్యవ హరింపబడినాడు. దేవతల కొఱకు హవిస్సుల భరించు వా డగుటచేసి యజ్ఞాది కర్మానుష్ఠానసమయమున నగ్నికి భరతు డని పేరు.

---

1. ఋ. 1-96-3; 2-7-15; 4-25-4; 6-16-9; 6-16-45; 7-8-4; 7-96-3 ఇత్యాది.

"తస్మా అగ్ని ర్భారతః శర్మ యంసత్" —ఋ. 4-25-4.

"అగ్ని రగామి భారతో వృత్రహా పురుచేతనః" —ఋ. 6-16-9.
"ఉదగ్నే భారత" —ఋ. 6-16-45.

"భారతః హవిషో భర్తా అగ్నిః" —సా.భా.

"అగ్నే మహాగ్ం అసీత్యాహ మహాన్ హ్యేష యదగ్ని
ర్బ్రాహ్మణే త్యాహ బ్రాహ్మణో హ్యేష భారతే
త్యాహైష హి దేవేభ్యో హవ్యం భరతి"
—తై. సం. 2-5-9; తై.బ్రా. 3-5-3.1; శ.బ్రా. 1-4-2-2;

బ్రాహ్మణములు గూడ నీ పదము యొక్క యర్థము నిట్లే వివరించినవి.

"అగ్ని ర్వై భరతః స వై దేవేభ్యో హవ్యం భరతి" —కౌ.బ్రా.3-2.

"ఏష (అగ్నిః) హి దేవేభ్యో హవ్యం భరతి తస్మా
ద్భరతోఽగ్ని రిత్యాహుః" —శ.బ్రా. 1-4-2-2; 1-5-1-8.

కాన కర్మానుష్ఠానసమయమున నగ్ని హవ్యవాహనుడు, లేక హవిర్భర్త యగుచు, భరతు డగుచున్నాడు. ఆ యగ్ని యొక్క దీప్తి - తదనుగతమై ఇడా రూపమున నుండెడి వాక్కు - భారతి యగుచున్నది. అట్టియెడ భారతి (హవీంషి భరతీతి) యన హోమనిష్పాదిక (హోత్రా) యని యర్థము. కర్మానుష్ఠానపరుడగు వేదవిదుడును అగ్ని (వసు) రూపుడై దేవతల కొఱకు హవ్యముల భరించును గాన నాతడును భరతుడే యగును. ఋత్విజులు భరతు లగుట బూర్వము వివరింపబడినది. అట్టి వేదవిదులయం దుండెడి వేదవాణి హోమనిష్పాదిక (హోత్ర) యై భారతియై యొప్పును. ఈ విషయ మీ మంత్రమువలన స్పష్టమగును.

"శుచి ర్దేవే ష్వర్పితా హోత్రా మరుత్సు భారతీ ।
ఇడా సరస్వతీ మహీ బర్హిః సీదంతు యజ్ఞియాః॥"—ఋ. 1-142-9.

మరుత్తు లనగా అమరణధర్మము గల దేవత లనియు, ఋత్విజు లనియు రెండర్థములు ప్రసిద్ధములు (చూ. వైదికనిఘంటు): భరతుడగు నాదిత్యునియం దుండెడి వాక్కు భారతి (భరతస్య ఆదిత్యస్య సంబంధినీ ద్యుస్థానా వాక్ — సా. భా). ఆ వాక్కు అమరణధర్మము గల దేవతలయం దనుగతమై పవిత్రమై (శుచిః) వెలయును. ఆ భారతియే భరతులగు ఋత్విజుల యందు (మరుత్సు) నిలిచి హోమనిష్పాదికయై — దేవతలకు హవ్యము భరించుచు - భారతి యగును. ఈమె శాసకత్వధర్మము గల్గి ఇడయు నగును. వారి హృదయముల నిలిచి, దేవతాతత్త్వమును, తద్గత మహత్త్వమును దీపింపజేయుచు సరస్వతి యగును. ఇట్లు వేదవాక్స్వరూప మును యజ్ఞస్వరూపమును దర్శింపజేయు నీ త్రిస్థాన వాగభిమానదేవత లిట 'యజ్ఞియాః' అని కీర్తింపబడి యాహ్వానింపబడుచున్నారు.

వాయువు (మధ్యమస్థానాగ్ని) - భరతుడు :—

అగ్ని వలెనే మధ్యమస్థానదేవత యగు వాయువు—అంతరిక్షాగ్ని యు—భరతుడే. ఇట భరతు డన నర్థము వేఱు. హవ్యవహన మనెడి ధర్మము అగ్నికే గాని వాయువునకు (రుద్ర—ఇంద్రాది దేవతలకు) జెప్ప బడుట లేదు. వాయురూపుడగు నీ భరతుని యందలి యసాధారణ ధర్మ మును శ్రుతు లిట్లు చెప్పుచున్నవి.

"సరస్వతీవాన్ భారతీవాన్ ఇతి వాగేవ సరస్వతీ ప్రాణో భరతః" —ఐ. బ్రా. 2-24.

"శరీరభరణహేతుత్వాత్ ప్రాణో భరతశబ్దవాచ్యః, తదీయ వృత్తి ర్భారతీ" —సా. భా.

"ఏష హి దేవేభ్యో హవ్యం భరతి తస్మా ద్భరతోఽగ్ని
రిత్యాహుః। ఏవ ఉ వాఽఇమాః ప్రజాః ప్రాణో భూత్వా
బిభ ర్తి తస్మాద్వేవాహ భరతవ దితి"

—శ. బ్రా. 1-5-1-8.

యజ్ఞములందు దేవతలకొఱకు హవ్యముల భరించెడి యే యగ్ని కలడో, యా యగ్నియే (మధ్యమస్థానదేవత యగుచు) ప్రాణరూపుడై నిఖిల ప్రాణులను భరించుచున్నాడు. 'నిఖిల ప్రాణిభరణము'—అను ధర్మముచే ప్రాణరూపుడైన యగ్ని భరతుడు— అని యర్థము.

ప్రాణరూపుడై యగ్ని దేహమును ధరించునట్లు. ఆధిదైవికముగ వాయురూపుడై జగత్ప్రాణశబ్దవాచ్యుడై భువనముల భరించుచున్నాడు. కాన రుద్ర–ఇంద్ర–వాయ్వాది శబ్దవాచ్య మగు మధ్యమస్థానదేవత (ప్రాణ దేవత) భరతశబ్దవాచ్య మగును. అట్టి భరతుని వృత్తి, దీప్తి, వాక్కు– లేక పత్ని భారతి యగును. 'ప్రాణదేవత వాచస్పతి; వాక్కు– ప్రాణ పత్ని'—అని శ్రుతి సంప్రదాయము. అనగా మధ్యమస్థానవాగ్దేవత యగు సరస్వతియే యాధ్యాత్మికముగను ప్రాణరూపభరతుని పత్నియై, వృత్తియై, దీప్తియై, లేక వాగ్రూపిణియై, తదనన్యయై నిఖిలప్రాణుల భరించి[1] జగద్ధాత్రి

1. 'వాగ్వాఽఇదం కర్మ ప్రాణో వాచస్పతిః' — (వా. సం. 30-1); శ. బ్రా. 6-3-1-19.

'నమో వాచే ప్రాణపత్న్యై స్వాహా' — ష. విం. బ్రా. 2-9.

'వాక్ చ వై ప్రాణశ్చ మిథునమ్' — శ. బ్రా. 1-4-1-2.

'వాక్ చ వై మనశ్చ దేవానాం మిథునమ్' — ఐ. బ్రా. 5-23.

'సాహ వా గువాచ- (హేప్రాణ) యద్వా అహం వసిష్ఠా స్మి త్వం తద్వసిష్ఠోఽసీతి' — శ. బ్రా. 14-9-2-14.

'వాగ్వై తస్య (ప్రాణస్య) పత్నీ' — గో. ఉ, 2-9. (చూ. పేజి 568)

నిర్వహణము గావించుచు భారతి యను సార్థకనామమున గూడ బరగును.

శ్రవణమననాదుల నొనర్చుచు మంత్రవాక్యార్థ జిజ్ఞాసాపరు డగు వేదవిదుడును ప్రాణ (రుద్ర) రూపు డగునని పూర్వము చెప్పబడినది. ప్రాణాత్మనిష్ఠుడగు వేదవిదుడు భరతు డన జెల్లును. అట్టియెడ నాతనియం దుండెడి సరస్వతియు భారతియై యొప్పును. మంత్రవాక్యార్థవిజ్ఞానమునకు బుద్ధివృత్తుల ప్రేరేపించుటచే (సరస్వతీ సాధయన్తీ ధియం నః) సరస్వతియు, భారమును - వేదవిజ్ఞానసారమును - విస్తరింపజేయునది (భారం వేదవిజ్ఞానసారం తనోతి ఇతి) యగుటచే భారతియు నగును. ఇట్టి ధర్మమును, లేక భారమును (వేదవిజ్ఞానసారమును), విస్తరింపజేయుటచేతనే పంచమవేద మనబడు మహాభారతమునకును 'భారత' మనెడి యన్వర్థసంజ్ఞ యని చెప్పుదురు (చూ. నీలకంఠవ్యాఖ్య : వాచస్పత్యమ్ : శబ్దకల్పద్రుమః).

భారతీ-బ్రహ్మవాదినీ-బ్రాహ్మీ :-

ద్యుస్థానదేవత యగు నగ్ని లేక యాదిత్యుడు - భరతు డనియు, తద్దీప్తి లేక పత్ని, లేక వాక్కు, భారతి యనియు బైన దెల్పబడినది. తన దివ్యతేజముచే జగముల నెల్ల భరించుటజేసి యాదిత్యుడు భరతుడు; తద్దీప్తియు జగద్భరణక్షమమై భారతి; అట్లే యోగారూఢుడై వేదవాక్యముల నెల్ల నాత్మపర్యవసానములుగ గ్రహించెడి వేదవిదుడును ఆదిత్యరూపు డగుచు భరతుడు; ఆతనియందుండు వేదవాణి భారతి' - యగు ననియు

'వాగ్వై వాయుః' — తై. బ్రా. 1-8-8-1 ; తాం. బ్రా. 18-8-7.
'తస్మాత్ సర్వే ప్రాణాః వాచి ప్రతిష్ఠితాః' — శ. బ్రా. 12-8-2-25.
'తస్యా (వాచః) ఉ ప్రాణ ఏవ రసః' — జై. ఉ. 1-1-7.
'తస్య (మనసః) ఏషా కుల్యా యద్వాక్' — జై. ఉ. 1-38-3.

పైన జెప్పఁబడినది. అట్టి భారతీస్వరూపమును మహాభారత మిట్లు చెప్పు చున్నది.

"గౌరివ ప్రసవ త్యర్థాన్ రస ముత్తమశాలినీ ।
సతతం స్యందతే హ్యేషా శాశ్వతం బ్రహ్మవాదినీ ॥
దివ్యా దివ్యప్రభావేన భారతీ గౌః శుచిస్మితే।"

—భారత. 14-22-22.23.

'వాచం ధేను ముపాసీత తస్యా శ్చత్వారః స్తనాః.... ఇతి శ్రుతేః। స్తనై స్త త్కర్మఫలరూపం రసం అర్థాన్ ప్రసవతి, బ్రహ్మవాదినీ ఉపనిషద్వాక్ తు శాశ్వతం మోక్షం స్యందతే ప్రసవతి సతతం నిత్యసిద్ధమ్" —నీలకంఠవ్యాఖ్య.

వేదవాక్కు ధేనువు. ఆ ధేనువు నుపాసించుచో స్వాహాకార, స్వధాకార హంతకార వషట్కారము లనెడి స్తనములతో గర్మఫలరూపమగు క్షీరము (రసము) నొసగును (చూ. స్వధాశబ్దము). కర్మఫలముల గోరక సేవించు వేదవిదునకు నీ భారతి బ్రహ్మవాదినియై శాశ్వతము నిత్యసిద్ధము నగు మోక్షము (బ్రహ్మామృతానందరసము) నొసగును—అని యర్థము.

కర్మపరులకు నాత్మచికిత్సక మగుచు గ్రమముగను, కర్మఫలము గోరనివారికి సాక్షాత్తుగను, బ్రహ్మతత్త్వావబోధకమై శ్రుతి బ్రహ్మవాదిని యగు కామధేనువు; ఈ ధేనువే భారతి — యని భావము. 'బ్రహ్మవాదిని యనుటచే శ్రుతికి గల బ్రాహ్మీత్వము — బ్రహ్మపరత్వము చెప్పినట్లగును. అందుచేతనే—రహస్యతత్త్వప్రతిపాదిక యగుటచేతనే—శ్రుతిని 'బ్రాహ్మీ ఉపనిషత్' అని వ్యవహరించెడి సంప్రదాయమును గలదు. ఈ విషయ మీ భాగవత వచనములవలన స్పష్టము కాగలదు.

రాజా —

'బ్రహ్మన్ బ్రహ్మణ్యనిర్దేశ్యే నిర్గుణే గుణవృత్తయః।
కథం చరన్తి శ్రుతయః సాక్షాత్సదసతః పరే॥'

శ్రీశుకః :—

"బుద్ధీన్ద్రియ మనః ప్రాణాన్ జనానా మసృజ త్ప్రభుః।
మాత్రార్థం చ భవార్థం చ ఆత్మనే కల్పనాయ చ॥
సైషా హ్యుపనిష ద్బ్రాహ్మీ పూర్వేషాం పూర్వజై ర్ధృతా।
శ్రద్ధయా ధారయే ద్య స్తాం క్షేమం గచ్ఛే దకించనః॥"

—భాగ. 10-37-1,2,3.

'పరంపరయా సాక్షా ద్వా సర్వాసాం శ్రుతీనాం బ్రహ్మణి పర్యవసానమ్.... సైషా యథోక్తలక్షణా యథోక్తాలంబనా వా, బ్రాహ్మీ బ్రహ్మపరా, శ్రద్ధయా ఆదరేణ వైతండికతర్కానభినివేశేన యః శ్రవణాదినా ధారయేత్, సః అకించనః నిరస్తదేహాద్యుపాధిః సన్, తతః పరం పదం ప్రాప్నుయా దితి' — శ్రీధరః.

"సైషా ఉపపాదితా, బ్రాహ్మీ బ్రహ్మసంబంధినీ సర్వశబ్దానాం బ్రహ్మ ణ్యభిధానవృత్తి రిత్యర్థః, ఉపనిషత్ రహస్యతమా, ఉపనిషదర్థవిచారే ణావగంతవ్యేతి వాఽర్థః' — వీరరాఘవాచార్యః.

ఇవి శ్రుతిగీతోపాఖ్యానారంభ శ్లోకములు. ప్రశ్నోత్తరవ్యాజమున శ్రుతిస్వరూప మిట జెప్పబడినది. 'ధర్మార్థకామమోక్షఫలముల సిద్ధింపజేసి కొనుటకే జనులకు బుద్ధి–ఇంద్రియ–మనః–ప్రాణముల నీశ్వరుడు ప్రసాదించును; ఇందు ప్రధానము తురీయపురుషార్థము: అధికారితారతమ్యమును బట్టి క్రమముగనో లేక సాక్షాత్తుగనో బ్రహ్మ (ఆత్మ) స్వరూపమును

దర్శింపజేయుటయే శ్రుతుల తాత్పర్యము; కావుననే - ఇట్లు బ్రహ్మపరమై రహస్య తత్త్వ ప్రతిపాదిక యగుటచేతనే_ శ్రుతి 'బ్రాహ్మీ ఉపనిషత్' అని చెప్పబడును: దీనియం దాదరము గల్గి వితండవాదములు చేయక యెవడు దీనిని ధరించునో యతడు చిత్త-సంస్కారక్రమమున బరిపక్వమతియై యకించను డగును; అకించను డనగా నేమియు లేనివాడు. అనగా దేహాద్యభిమానవర్జితుడై బ్రహ్మభావము నొందును _అని యర్థము.

ఈ భారత, భాగవత వచనముల వలన'శ్రుతు లన్నియు సాక్షాత్తుగ గాని, పరంపరగ గాని బ్రహ్మయందు పర్యవసన్నములు - శ్రుతిగత శబ్దము లన్నియు బ్రహ్మపరములు'_ అని తెలిసినది. అట్లు దర్శించు వేదవిదునకు శ్రుతి యంతయు నుపనిషద్రూపమున సాక్షాత్కరించును, (సైషా హ్యుపనిష ద్బ్రాహ్మీ). ఇట్టి యీ శ్రుతియే బ్రహ్మవాదినీ, బ్రాహ్మీ-భారతీ యని తెలియును.

యోగము - యోగశక్తి:—

ఇట నొక విషయము పరిశీలింప నగును. వైదికశబ్దము యోగరూఢిచే తత్తద్విశేషపదార్థవాచకము, యోగశక్తిచే పరమాత్మవాచకము నగు నని కవి - కావ్య శబ్దమున వివరింపబడినది.(ఏవమేవ సర్వేఽపి శబ్దా యోగరూఢ్యా తత్తద్విశేషపదార్థ వాచకా అపి యోగార్థ మాదాయ సర్వే బ్రహ్మవాచకా అపి భవన్తి_నీలకంఠః). దీనిచే వేదవాక్కునకు గల శాశ్వత బ్రహ్మసంబంధిత్వము (కవేః పరమాత్మన ఇదం కావ్యం) సిద్ధమై పై భారత భాగవత వచన తాత్పర్యమును స్పష్టము చేయుచున్నది. వేదవాక్కుతో బరమార్థమును సంయోజనము చేయుటయే యోగము. ఆ యోగశక్తిచే సిద్ధమైన యర్థమే యోగార్థము. ఇదియే సర్వపదార్థాధిష్ఠానమగు పరమార్థము. సర్వపదార్థాధిష్ఠానభూతమగు నీ యోగార్థమునందు (రూఢములై)

భాసించెడి తత్తద్విశేషరూపార్థములను గూడ బోధించెడి వగుటజేసి వేద శబ్దములు యోగరూఢములు నగును. వేదవిదుడు వేదవాక్కులయందు తుదకు దర్శింపవలసిన యోగశక్తి యిట్టిది. ఈ యోగశక్తిచే జ్ఞాపకము చేయబడెడి పరమార్థమును దర్శింపజేయుట కయియే వేదవాణి కర్మ-భక్తి-జ్ఞాన యోగముల నుపదేశించినది. ఇవియు యోగములే. అనగా బుద్ధీంద్రియ మనఃప్రాణములను వేదవాక్సాహాయ్యమున బరమార్థముతో సంయోజనము చేయునవిగాన యోగములు. కాన (1)వేదవాక్కుతో బరమార్థమును సంయోజనము చేయుట, (2) తత్సాహాయ్యమున బుద్ధీంద్రియ మనఃప్రాణములను పరమార్థముతో సంయోజనముచేయుటయు యోగము.

ఈ విషయమును కాళిదాసమహాకవి యిట్లు చమత్కరించినాడు.

"త మర్థ మివ భారత్యా సుతయా యోక్తు మర్హసి ।
అశోచ్యా హి పితుః కన్యా సద్భర్తృప్రతిపాదితా"—కు.సం.6-79.

ఓ గిరిరాజా। యోగ్యుడగు వరున కిచ్చిన కన్యకై తరువాత వగవవలసి యుండదు. కాన, భారతితో (వాక్కుతో) నర్థమును వలె, నిత్యసంబంధముకై నీ పుత్రిక యగు పార్వతితో నా దేవుని గూర్చుట మంచి పని -అని యర్థము.

ఇట కన్యను వరునితో గూర్చు మనిగాక, కన్యతో వరుని గూర్చుమని చెప్పబడినది. భారతితో (వాక్కుతో) నిత్యసంబద్ధమై యుండెడి యర్థమును యోజనము చేయునట్లు, పార్వతితో బరమార్థరూపుడైన యా దేవుని గూర్చుము (యోజనము చేయుము)- అని చెప్పబడినది. పరాదేవితో నిట పోల్చబడిన భారతి లౌకికభారతి (వాక్కు) గాదు, బ్రహ్మవాదిని (బ్రాహ్మి) యగు వేదభారతి. వేదవాక్యము లన్నియు నాత్మపర్యవసానములు. ఆత్మయే పరమార్థము. వేదభారతితో నా పరమార్థము నిత్య

సంబద్ధము. అయ్యును నంద తెలుగరు. (చూ. విశ్వవిత్, అవిశ్వమిన్వా శబ్దములు). యోగారూఢుడైన వేదవిదుడు ఆ వాగర్థసంబంధము నెఱిగి వేదభారతితో నా పరమార్థమును యోజనము సేయును. ఓ రాజా ! నీవు నట్టి మహాత్ముడవు ; నీ పుత్రిక పరాదేవత. పార్వతీ-పరమేశ్వరుల సంబంధము నిత్యము ; అది గుర్తించి యామెతో బరమార్థ సత్యరూపు డగు నా దేవుని గూర్చుము' - అని భావము. 'యోక్తు మర్హసి' - యనుచు యోగస్వరూప మిట కవిచే వివరింపబడుట స్పష్టము. నేటికిని కన్యాదాన సమయమున 'నారాయణస్వరూపాయ వరాయ -- లక్ష్మీనామ్నీం కన్యామ్' — అనుచు వధూవరులను ఆది దంపతులనుగా భావించెడి లేక దర్శించెడి సంప్రదాయము గలదు. లక్ష్మీరూపిణి యగు కన్యతో నారాయణస్వరూపు డగు వరుని యోజనము చేయుట యనెడి సంప్రదాయమే యిట నీ శ్లోకమున వివరింపబడినది. కాన వివాహసంస్కార మిట్టి యోగము నుపలక్షింపజేయునది.

కాగా బ్రహ్మవాదిని (బ్రాహ్మీ) యగు వేదవాణి భారతి, (భరతస్య కవేః పరమాత్మన ఇయమ్) - అగుట కాంతాసంమితముగ నిట మహా కవిచే జెప్పబడినది. కాన యోగారూఢుడగు వేదవిదున కీ వేదవాణి సహ చారిణియై తోడనుండి, క్రాంతదర్శి యగు నా కవి (పరమాత్మ) యొక్క భారతియై విరాజిల్లు ననుట యుక్తమే.

'భారతి కవే ర్జయతి — భరతస్య కవేః పరమాత్మన ఇయం భారతీ' భరతుడును, కవియు నగు నా పరమాత్మ యొక్క వాక్కుగా వేదవిదునకు సాక్షాత్కరించుచు భారతియై యాత్మస్వరూపమును దర్శింపజేయును. అందుచే 'భరత స్యేయం భారతీ'—యను నీ నిర్వచనము 'కవేః పరమాత్మన ఇదం కావ్యమ్' —అను పూర్వోక్తమగు త్రయీవిద్యారూప ఛందః కావ్య లక్షణమును స్పష్టము జేయుచున్నది.

ప్రజాపతి-భరతుడు; వసురుద్రాదిత్యులు ప్రజ :-

అగ్ని—వాయు—ఆదిత్యు లనెడి త్రేతాగ్నులు భరతు లని దర్శించితిమి. అంతియే కాదు. దేవతాత్రయాత్మకుడు, అఖండాగ్నియు నగు ప్రజాపతియు భరతశబ్ద వాచ్యుడే. ప్రజాపతి శబ్దముచే శ్రుతులయందు గొన్నియెడల దేవతాత్రయాత్మకుడగు విరాట్పురుషుడును,[1] గొన్నియెడల హిరణ్యగర్భుడును,[2] మఱికొన్ని యెడల పరమేశ్వరుడును[3] జెప్పబడుచుందురు. కాని ప్రజాపతిశబ్దముచే ప్రకరణము ననుసరించి మువ్వురిని గ్రహింపనగును.

అగ్ని—వాయు—సూర్యులు ప్రజలు—ప్రకృష్టజన్మ గలవారు—అని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

"త్రయః కృణ్వన్తి భువనేషు రేతః తిస్రః ప్రజా ఆర్యా
జ్యోతి రగ్రాః" — ఋ. 7-33-7.

ఈ మంత్రమును శాట్యాయనబ్రాహ్మణ మిట్లు వివరించినది.

"త్రయః కృణ్వన్తి భువనేషు రేత ఇత్యగ్నిః పృథివ్యాం
రేతః కృణోతి వాయు రంతరిక్ష ఆదిత్యో దివి,తిస్రః ప్రజాః
ఆర్యా జ్యోతిరగ్రా ఇతి వసవో రుద్రా ఆదిత్యా స్తాసాం జ్యోతి
ర్య దసా వాదిత్యః" — (చూ. సా.భా.)

1. "ప్రజాపతిః పరమేష్ఠీ విరాట్"
— తై.సం. 5-7-4-4; అ.సం. 4-1-7; 18-5-10.

2. "హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతి రేక ఆసీత్"
—ఋ. 10-121 సూ;తై. సం.4-1-8-3; వా.సం. 13-4; అ.సం.4-2 ఇత్యాది

3. "ప్రజాపతి శ్చరతి గర్భే అంతః అజాయమానో బహుధా విజాయతే"
—తై.అ. 3-13-1; వా.సం. 31-19; అ.సం. 10-8-13.

అగ్ని-వాయు-సూర్యు లనెడి ముష్వురు దేవతలు క్రమముగ పృథివ్యంతరిక్ష ద్యులోకము లందు తమ రేతస్సును (తేజస్సును) నింపుచున్నారు. ఈ వసురుద్రాదిత్యులే ప్రకృష్టజన్మ గల ప్రజలు. (తిస్రః ప్రజాః). వీరికి గారణభూత మగు జ్యోతిస్సు ఆదిత్యుడు (పరమేశ్వరుడు). ఆ మహా జ్యోతిస్సు నుండి యభివ్యక్త మగుటచే నీ ముష్వురు 'జ్యోతిరగ్రాః (తాసాం జ్యోతిః యదసౌ వాదిత్యః) - అని చెప్పబడిరి. ఇంతే కాదు.

ప్రణవ మనెడి యా మహాజ్యోతిస్సు నుండి యభివ్యక్తములగు ఋగ్యజుఃసామ లనెడి త్రివిధ వాక్కులును 'జ్యోతిరగ్రాః' అని చెప్పబడినవి. (తిస్రః త్రివిధా ఋగ్యజుఃసామాత్మికాః స్తుతిరూపాః వాచః....జ్యోతిరగ్రాః జ్యోతి ర్ద్యోతమానః ప్రణవోఽగ్రే ప్రముఖో యాసాం తాదృశీః - సా.భా. ఋ. 7-101-1). కనుక వసురుద్రాదిత్యుల వలెనే వారియం దనుగతములై యుండెడి వాక్కులు గూడ జ్యోతిరగ్రములే.

వసురుద్రాదిత్యు లట్టి ప్రకృష్టజన్మ గలవా రగుటచేతనే 'ఆర్యాః' అని చెప్పబడిరి. ఆర్యు లనగా శ్రేష్ఠులు, ప్రాప్యులు నని యర్థము. వీరికి గారణభూతమగు జ్యోతిస్సు ఈశ్వరుడు. సర్వప్రాప్యమగు నా పరంజ్యోతిని దర్శించుటకు నీ ప్రజలు ముష్వురు ద్వారభూతులు. అనగా అగ్ని - వాయు - సూర్యదేవతానుగ్రహము వలన గ్రమముగ విరాట్-హిరణ్యగర్భుల యొక్కయు, ఈశ్వరుని యొక్కయు ననుగ్రహము సిద్ధించును. కనుకనే అగ్నివాయుసూర్యులు ముష్వురిని ఆర్యు లని శ్రుతి నిర్దేశించినది. ప్రకృష్టదేవతాజన్ము లయిన యీ ప్రజలకు (తిస్రః ప్రజాః) పాలకు డగుటచే విరాట్టు, లేక హిరణ్యగర్భుడు, లేక పరమేశ్వరుడు' ప్రజాపతి యగుట పై మంత్రమున సూచిత మగుచున్నది. ఇట్టి ప్రజాపతి భరతుడని శ్రుతి చెప్పుచున్నది.

"ప్రజాపతి ర్వై భరతః స హీదం సర్వం బిభర్తి"

—శ. బ్రా. 6-8-1-14.

దృశ్యమగు నీ ప్రపంచమంతయు భరించుటచే ప్రజాపతి భరతుడు–జగద్భర్త –అని యర్థము. ఈ లక్షణము ప్రధానముగ బరమేశ్వరునందును, తర్వాత విరాట్-హిరణ్యగర్భుల యందును నొప్పును. మరుత్తులు (ప్రాణములు) జగద్భర్త యగు భరతుని పుత్రులని శ్రుతి (ఋ. 2-36-2) చెప్పుచున్నది. పరమేశ్వరునుండి నిఃశ్వాసముల వలె నప్రయత్నముగ నభివ్యక్తములైన జ్యోతిరగ్రములు వేదవాక్కులని పైన జెప్పబడినవి. అట్లు భరతుని నుండి నిఃసృత యగుటజేసియు, భరత స్వరూప ప్రతిపాదిక యగుటజేసియు–ఇట్లు నిరంతర భరత సంబద్ధ యగుటజేసియు వేదవాణికి 'భారతీ' యని యన్వర్థనామము.

"వ్యవహృతయే వికల్ప ఇషితోఽన్ధపరంపరయా
భ్రమయతి భారతీ త ఉరువృత్తిభి రుక్థజడాన్।"

—భాగ. 10-87-37.

'తే తవ భారతీ వేదవాక్' —శ్రీధరః.

"పురాణస్య కవే స్తస్య వర్ణ స్థాన సమీరితా।
బభూవ కృతసంస్కారా చరితార్థైవ భారతీ॥" —రఘు,

హంసవ ద్విదుషాం రాజా ద్విజానాం తత్ర భారతీమ్॥
శుశ్రువే వేదవిదుషాం పుష్కలార్థపదాక్షరామ్॥"

—భార. 12-39-20.

కావ భరత (పరమేశ్వర) సంబద్ధ యగుటజేసి వేదవాణి భారతియై ప్రసిద్ధ యగుట పై శ్లోకముల వలన దెలియును.

ప్రజాపతి భరతుడని శ్రుతి చెప్పుచున్నది. వేదవాణి ప్రజాపతికి స్వభూత యగుట (ప్రైవ తే వాగాహ - స్వాహా) స్వాహా శబ్దమున వివరింపబడినది. నిఖిలవేదరాశియు పరమేశ్వర నిఃసృత మనియు చెల్ప బడినది. అందుచే బరమేశ్వరునకు స్వభూత యగుచు, అనూచాన సృష్టి రచనా రహస్యముల నుద్బోధించుచు జగద్యాత్రానిర్వహణమున సహ చారిణియై యుండి తోడ్పడున దగుటచే అనగా భరతునకు సహచారిణి యగుచు వేదవాక్కు భారతి యన నొప్పును.

బ్రహ్మజ్ఞాని బ్రహ్మయే యగు (బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి) నని సంప్రదాయము. అనగా భారతీస్వరూపము నెఱిగిన వేదవిదుడు భరత స్వరూపుడే యగును. అట్టి బ్రహ్మవేత్తకు వేదవాణి 'స్వభూత-(స్వస)-యగును. అందుచే నాతడు భరతుడు, భారతియు కూడ నగును. బ్రహ్మ వేత్త కుదయించెడి యఖండబ్రహ్మాకారవృత్తికి 'భా' యని పేరు. నిరంతర మద్దానియందు 'రతుడు' (తన్నిష్ఠుడు) అగుటచే బ్రహ్మవేత్త భారతుడు (భాయాం రతః భారతః)అగు ననియు సంప్రదాయవిదులు చెప్పుదురు.

బ్రహ్మవిద్యయే మంత్రశాస్త్రమున శ్రీవిద్య గా ప్రసిద్ధము. శ్రుతియు 'ఋచో యజూంషి సామాని సా హి శ్రీ రమృతా సతామ్' - అనుచు త్రయీవిద్యయే శ్రీవిద్య యని పేర్కొనినది. అట్టి శ్రీవిద్య, లేక పరా దేవత భారతి యనియు, భారతి నుపాసించువారు భారతు లనియు మంత్ర శాస్త్రప్రసిద్ధి.

'భాయాం శ్రీవిద్యాయాం రతాః భారతాః'

'భారత్యా ఉపాసకాః భారతాః' —సౌందర్యలహరి; లక్ష్మీధరవ్యాఖ్య.

కాగా, భరతు డన నాత్మస్వరూపనిష్ఠు డనియు నర్థము. అట్టి మహనీయు డగుటచే వేదవ్యాసుని ధృతరాష్ట్రుడు 'త్వం హి భారతీ' (భార. 6-3-42)- నీవు భారతివి - నీవు భారతివి - అని కీర్తించెను.

"విద్యాభారేణ సంపూర్ణః సర్వభారం పరిత్యజేత్'
దుఃఖభారం న జానాతి భారతీ పరికీ ర్తితా" — (శబ్దకల్పద్రుమః).

విద్యాభారపరిపూర్ణుడై, భారముల నన్నిటివి విడిచి, దుఃఖభారము నెఱుగని వాడు భారతి – అని యర్థము. అట్టి మహాత్ములను భారతి, సరస్వతీ, ఇంద్రసరస్వతీ – ఇత్యాది నామములతో బిలిచెడి సంప్రదాయము నేటికిని గలదు. కాగా –

"(కవేః) భరతాత్ ఆగతా భారతీ ; (కవేః) భరతస్య
ఇయం భారతీ ; భారం వేదవిజ్ఞానసారం తనోతీతి భారతీ"

అను నిర్వచనముల ద్వారా భారతీస్వరూపమును దర్శింపనగును. పై గ్రంథసందర్భము ననుసరించి 'అగ్నివాయ్వాదిత్యులు ముగ్వురును, తదాత్మకుడగు ప్రజాపతియు, పరంజ్యోతీరూపు డగు పరమేశ్వరుడును అందఱును భరతులు. లేక భారతులు; అట్టి భరతుల యొక్క వృత్తి, దీప్తి, పత్ని, లేక వాక్కు వ్యష్టిగను, సమష్టిగను ఇడా–సరస్వతీ–భారతీ రూపిణి; అట్లే వేదవిదులును భరతులు. వారియందలి వేదవాణియు ఇడా–సరస్వతీ–భారతీరూపిణి, లేక సమష్టిగ నఖండభారతీరూపిణి'– అని తెలియగలము.

విశ్వవిత్-అవిశ్వమిన్వా :-

అట్టి యా దేవతాతత్త్వము గాని, వాగ్దేవతాతత్త్వము గాని యత్యంత విగూఢము, దానిని దర్శించుట దేవతలకు గూడ దుష్కర మని ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

"తిస్రో మాతౄ స్త్రీన్ పితౄన్ బిభ్ర దేక ఊర్ధ్వ స్తస్థౌ
నే మవగ్లాపయన్తి। మంత్రయన్తే దివో అముష్య పృష్ఠే
విశ్వవిదం వాచ మవిశ్వమిన్వామ్॥"

— ఋ. 1. 164-10; అ.సం. 9-9-10.

పృథివ్యంతరిక్షము లనెడి ముప్పురు తల్లులను (తిస్రో మాతౄః). లోకత్రయపాలకు లయిన ముప్పురు పితరులను (త్రీన్ పితౄన్) పుత్రస్థానీయు డగు నాదిత్యు డొక్కడే యసహాయుడై భరించుచు (బిభ్రత్), తదతీతుడై సర్వోన్నతుడై విలసిల్లుచున్నాడు. (ఏక ఊర్ధ్వ స్తస్థౌ). అట్టి యాదిత్యున కెవరు నెట్టి గ్లానిని గల్పింపలేరు. (ఈం న అవగ్లాపయన్తి). ఈ వాక్కు అట్టి యాదిత్యునకు సంబంధించినది (అముష్య). ఇది సర్వమును దెలియజేయజాలినది (విశ్వవిదం); కాని యీ వాక్కు అందఱి యందు నభివ్యక్తము కాదు (అవిశ్వమిన్వాం)—అని బ్రహ్మలోకవాసులగు (దివః పృష్ఠే) దేవతలు ఆదిత్యుని గూర్చి రహస్యముగ బరస్పరము చెప్పికొనుచున్నారు (మంత్రయంతే) — అని యర్థము.

ఇట లోకత్రయమును, తత్పాలకులను ముప్పురిని భరించుచు తదతీతుడై, సర్వోన్నతుడై, అద్వితీయుడై (ఊర్ధ్వః ఏకః), అవికార్యుడై యొప్పుచున్నట్లు ఆదిత్యుడు కీర్తింపబడినాడు. కాన నిట నాదిత్యు డనగా పరమేశ్వరు డనియే గ్రహింపవలెను. అతడు లోకత్రయమును, తత్పాలకులను, వాక్కును—సర్వమును భరించువాడని చెప్పుటచే నీ యాదిత్యుడు భరతు డను విషయ మిట సూచిత మగుచున్నది. (బిభర్తి సర్వ మితి భరతః).

ఈ వాక్కు ఆ దేవునకు సంబంధించినది (అముష్య). కాన తన్నిఃసృతమై తత్ప్రతిపాదక మగుచు నీ వాక్కు భారతి(భరతస్య ఇయం: భరతా దాగతా) యగుటయు సూచిత మగుచున్నది. 'ఇట్టి యీ భారతి సర్వమును దెలియజేయునది (విశ్వవిత్); అయ్యును నందఱియం దభివ్యక్తము గాదు (అవిశ్వమిన్వా), కాన సర్వజ్ఞకల్ప మగు నీ వేదవాణి క్రాంతదర్శనము గల ద్రష్టలగు మహర్షులయందు మాత్రమే యభివ్యక్త మగును; అన్యులయందు కాదు: మఱియు నా దైవీవాక్కు నుపాసించు వారికే

(సఖ్యము చేయువారికే)తత్ప్రతిపాదితార్థములు, సంప్రదాయములు, రహస్యములు మున్నగునవి యభివ్యక్తము లగును గాని, యన్యులకు గాదు'— అనియు దెలియును.

ఇది యత్యన్తనిగూఢ మగు పరతత్త్వరహస్య మగుటచే నధికారు లగువారి యొద్దనే యీ విషయము ప్రస్తావింప నగునుగాని యందఱి కడ కాదు. కావుననే దేవతలు కూడ నీ విషయమును గూర్చి పరస్పరము రహస్యముగ జెప్పికొనుచున్నట్లు శ్రుతి తెల్పుచున్నది. తానే కవియు కావ్యము నగుటచే వేదము తన స్వరూపమును దేవతారహస్య సంవాద రూపమున జమత్కారముగ వివరించినదని గ్రహింపనగును.

క్రాంతదర్శనము—కవి—స్మృతులు :-

ఈ విభిన్నదేవతాతత్త్వమును, దేవతైక్యమును దర్శించుటయే క్రాంతదర్శనము. ఆ దర్శనము గలవారు కవులు. అట్టి కవులు విరళముగ నుందురు — అను విషయమును ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

"అవః పరేణ పితరం యో అస్యాను వేద పర ఏనావరేణ।
కవీయమానః క ఇహ ప్రవోచ ద్దేవం మనః కుతో అధిప్రజాతమ్॥"
— ఋ. 1-164-18; అ.సం. 9 9-18.

పృథివీలోకపాలకు డగ్ని. ద్యులోకపాలకు డాదిత్యుడు. వీరిరువురును పితరులు. (పాలకులు). వీరిరువురు భిన్నులుగ గన్పట్టినను వాస్తవముగ భిన్నులు గారు. అగ్నియే ఆదిత్యుడు; ఆదిత్యుడే అగ్ని-అని యెవ డుపాసించునో (యః అను వేద) యతడే క్రాంతదర్శనము గల కవి. లేక వీరిరువురు వాస్తవమున నద్వితీయము, శుద్ధసత్త్వమాయోపాధికము నగు నీశ్వరతత్త్వమే యని యెవడు దర్శించునో యతడే కవి (అభిభూత

రజస్తమసోః ఉద్బుద్ధసత్త్వో అత ఏవ స్వాధీనమాయో ఏతౌ ఏకత్వేన వా అధిగచ్ఛతి - సా. భా.). అగుచో కవి ననుచు తన క్రాంతదర్శనమును లోకమున నెవడు చాటుకొనగలడు ? (కవీయమానః కవివ దాచరన్, క్రాంతదర్శిత్వ మాత్మనః ఖ్యాపయన్, క ఇహ అస్మిన్ లోకే, ప్రవోచత్ ప్రబ్రవీతి ?) కవితాప్రయోజక మగు దైవీశక్తిసంపన్నమగు మనస్సు ఏ యదృష్టవిశేషము వలన ప్రకర్షాధిక్యము గలిగి సిద్ధింపగలదు? (దేవం మనః కుతో అధిప్రజాతమ్ ?) - అని యర్థము. శ్రుతి యందలి యీ రెండు ప్రశ్నలు గమనార్హములు.

1. కవిననుచు తన క్రాంతదర్శనము నెవడు లోకమున ప్రకటించు కొనగలడు ?

2. అట్టి దర్శనమును సిద్ధింపజేయు దైవీశక్తి సంపన్నమగు మనస్సు ఎట్లు సంప్రాప్తి మగును ?

ఇట్టి దర్శనము సిద్ధించుట కొరకు సంప్రదాయక్రమమును శ్రుతియే యిట్లు భంగ్యంతరముగ సూచించుచున్నది. ఈశ్వరానుగ్రహము వలననే అద్వైత వాసన సిద్ధించును - (ఈశ్వరానుగ్రహా దేవ పుంసా మద్వైతవాసనా). నియమపూర్వక కర్మానుష్ఠానము, ఉపాసన- ఈ రెండును లేక యీశ్వరాను గ్రహము సిద్ధింపదు. అనగా నీ రెండిటివలననే దైవీశక్తిసంపన్న మగు మనస్సు (దేవం మనః) ప్రాప్తించును. ఈ మంత్రమున అగ్ని-ఆదిత్యు లిరువురు నుపాస్యదేవతలుగ బేర్కొనబడినారు. కర్మలయం దగ్నియు, సంధ్యోపాసనాదులయందు సవితృ (ఆదిత్య) దేవతయు ప్రధానముగ నారాధ్యులు. వీరు భిన్నులయి కన్పట్టినను వాస్తవముగ భిన్నులు కారు. అభిన్నులుగ నుపాసింపవలెను. (కావుననే సంధ్యావందనసమయమున 'సూర్యే జ్యోతిషి జుహోమి స్వాహా' - యనుచు ప్రాణాగ్నిని సూర్య జ్యోతీరూపమునను, 'దేవ సవితః ప్రసువ' - అని యనుచు అగ్నికార్య,

ఔపాసనాది సమయములందు అగ్నిని సవితృరూపమునను దర్శించెడి-యారాధించెడి సంప్రదాయము వరలినది). అట్టి కర్మోపాసనల వలననే క్రమముగ చిత్తము పరిశుద్ధ మగును. దివ్యశక్తిసంపన్న మగును. క్రమముగ నద్వయ పరమేశ్వరతత్త్వ విజ్ఞానము గల్గి క్రాంతదర్శను డగును. ఈ తత్త్వమును దర్శించి లోకానుగ్రహబుద్ధితో ప్రబోధించెడివారే కవులు. ఈ దర్శనము ఈశ్వరానుగ్రహాధీనము, వేదైకగమ్యము నగుటచే నివి రెండును లేకుండ 'నేను కవి నని యెవడు చాటుకొనగలడు? - అని శ్రుతి ప్రశ్నించుచున్నది. ఈ ప్రశ్న వలన - 'క్రాంతదర్శనము గల్గి లోకమున బ్రబోధించెడి యాదికవిని నేనే' - యని వేదము భంగ్యంతరముగ జెప్పికొనినట్లు గ్రహింపనగును.

ఈశ్వరానుగ్రహముచే మహర్షులు మంత్రద్రష్టలయి క్రాంతదర్శనముతో నొప్పి వేదముల బ్రవచించి కవులుగ బ్రసిద్ధు లయినట్లు శ్రుతులే జెప్పినవి (తా మన్వవిందన్ ఋషిషు ప్రవిష్టామ్ - చూ. ఋషిశబ్దము). ఈ వేదమాత యొక్క యనుగ్రహముచే దరువాత నెందఱో కవు లయినట్లు పురాణాదుల వలన దెలియగలము. వ్యాస, వాల్మీకాదిమహర్షు లట్టి కవులు ; వేదమూర్తులు ; లేక భారతీస్వరూపులు. ఈ వేదవాణి సర్వమును దెలియజేయునది (విశ్వవిత్) యయ్యును నందఱియం దభివ్యక్తము కాదు (అవిశ్వమిన్వా)' - అని శ్రుతి చెప్పినది.

త్రిపథగామినీ :-

క్రమముగ చిత్తసంస్కారపరిపాకము గలిగించి తుదకు నాత్మస్వరూపసాక్షాత్కారము గలిగించుటకే శ్రుతి లోకానుగ్రహబుద్ధితో కర్మ-ఉపాసనా-జ్ఞాన కాండత్రయరూపమున నవతరించినది. అట్లు మూడు మార్గముల బ్రవర్తిల్లుటచే వేదవాణి త్రిపథగామిని యైనది. ఈ విషయమును భాగవత మిట్లు చెప్పుచున్నది.

"కిం విధత్తే కిమాచష్టే కి మనూద్య వికల్పయేత్ ।
ఇత్యస్య హృదయం లోకే నాన్యో మద్వేద కశ్చన ॥
మాం విధత్తేఽభిధత్తే మాం వికల్ప్యాపోహ్యతే హ్యహమ్।"
—భాగ. 11-12-42, 43.

ఉద్ధవునకు భగవానువిచే వేదస్వభావ మిట్లు తెల్పబడినది.

'వేదము కర్మకాండ యందు విధివాక్యములచే యజ్ఞరూపమున నన్నే విధించుచున్నది. దేవతాకాండ యందు నా యా దేవతారూపమున నన్నే జెప్పుచున్నది. తుదకు జ్ఞానకాండ యందు — 'నానుండియే యాకాశాది ప్రపంచసృష్టి గలుగు' నని యీ రీతిగ బెక్కు వికల్పముల జూపి తుదకు నన్నే అద్వితీయ బ్రహ్మస్వరూపునిగ నిరూపించుటకై సర్వమును నిషేధించి యుపరతవ్యాపార మగుచున్నది ' — అని యర్థము.

ఈ భాగవత శ్లోకమున వేదమును గూర్చిన మూడు ప్రశ్నలు, మూడు సమాధానములు గలవు. (1) కిం విధత్తే ? ఏమి విధించుచున్నది ? (2) కి మాచష్టే ? ఏమి యుపదేశించుచున్నది ? (3) కి మనూద్య వికల్పయేత్ ? ఏ యర్థముల ననువదించి నిషేధించి తుదకు నుపరత వ్యాపార మగుచున్నది? ఇందు మొదటి ప్రశ్న వలన వేదమునకు గల ప్రభుసంమితత్త్వము, రెండవ ప్రశ్నవలన సుహృత్సంమితత్త్వము, మూడవప్రశ్న వలన కాంతాసంమితత్త్వమును సూచితము లగుచున్నవి. కాన అధికారిభేదము ననుసరించి ప్రభు - సుహృత్ - కాంతాసంమితత్త్వ మార్గముల ద్వారా తత్త్వము నుపదేశించుటకై వేదకావ్యము ప్రవర్తిల్లె ననుట సంప్రదాయాభిమత మని తెలియును.

అగ్ని-వాయు-ఆదిత్యు లనెడి త్రిస్థానజ్యోతిస్సులందును తద్రూపు లగు వేదవిదులయందును ఇడా-సరస్వతీ-భారతీ రూపమున ననుగతమై, కర్మ-భక్తి-జ్ఞాన తత్త్వప్రబోధకమై, ప్రభు - సుహృత్ - కాంతాసంమిత

మగుచు త్రయీవిద్యారూప వేదవాణి 'త్రిపథగామిని'గా నొప్పుచున్నది. మఱియు అబ్దేవతయే వాగ్దేవత యని పూర్వము చెప్పబడినది. అబ్దేవతయు వాగ్దేవియు నగు సరస్వతి త్రిలోకవ్యాపినియై త్రిపథగామిని యగుటచేతనే శ్రుతులయందు 'త్రిషధస్థా స ప్తధాతుః (ఋ. 6-61-12)' – అని కీర్తింప బడినది.

> "త్రిషధస్థా త్రిషు లోకేషు సహావతిష్ఠమానా, త్రిలోక
> వ్యాపినీ, స ప్తధాతుః స ప్తధాతవోఽవయవా గాయత్ర్యాద్యా
> గంగాద్యా వా యస్యాః సా తథోక్తా" – సా.భా.

ఋక్-యజుః-సామరూప మంత్రత్రైవిధ్యముతో నొప్పియు వేద వాణి త్రిపథగామిని యగుచున్నది. (చతుర్వేదశరీరిణీ-ఋగ్యజుః సామ గతిః). ఇట్లు వివిధరీతుల త్రిపథగామినియై యొప్పుచు కాండత్రయాత్మిక యగు నీ వేదవాణి నన్నే (పరమాత్మనే) బోధించుచున్నది యని పై భాగవత శ్లోక తాత్పర్యము. కర్మోపాసనాది వివిధార్థముల నధికారానుగుణ ముగ బోధించుచునే యుత్తమసాధకునకు వేదరాశియంతయు నాత్మస్వరూప పరమై కన్పట్టును. ఇట్లు చెప్పుచో నీ శ్లోకము-వేద (వేదం పరమేశ్వరం వేదయతి), స్వాహా (స్వం ఆహ), స్వధా (స్వం దధాతి), స్వాధ్యాయ (స్వం ఆత్మవిషయకం అధ్యయనమ్), కావ్య (కవేః పరమాత్మన ఇదం) –ఇత్యాది వేదనామముల సార్థకతను దలపింప జేయునది యగుచున్నది.

మహానటుడు – భరతుడు : (శిల్పములు - ఆత్మ సంస్కృతి) :-

పై మంత్రము లందును భాగవతశ్లోకమునందును పరమేశ్వరుడే యజ్ఞాది కర్మరూపమునను, వివిధదేవతారూపమునను, ఆకాశాది భూత భౌతికరూపమునను ప్రవర్తిల్లుచు తదతీతుడై యద్వయరూపమున నుండు నట్లు చెప్పబడినది.

"ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే"

"రూపం రూపం ప్రతిరూపో బభూవ"

— ఋ. 6-47-18, శ. బ్రా. 14-5-5; బృ. ఉ. 2-5-19.

"రూపం రూపం మఘవా బోభవీతి"—ఋ. 3-53-8. జై. బ్రా. 1-44-67.

"రూపాణి బిభ్రతం పృథక్" – వా. సం. 28-32; తై. బ్రా. 2-6-1,7.

అని యీ రీతిగా శ్రుతులు పరమేశ్వరుడు వివిధరూపముల ధరించుట పెక్కు చోట్ల వివరించినవి. వివిధరూపధారణము చేయువాడగుటచే నీశ్వరుడు 'మహానటుడు, నటరాజు' – అని ప్రసిద్ధి.

'మహాకాలో మహానటః' — అమరః.

నటునకు భరతుడని పేరు. వివిధభూమికల ధరించువాడగుటచే నటుడు భరతు డయ్యెను. యాజ్ఞవల్క్యస్మృతి యట్టి భరతునితో నాత్మను బోల్చినది.

"యథా హి భరతో వర్ణై ర్వర్ణయ త్యాత్మన స్తనుమ్ ।
నానా రూపాణి కుర్వాణ స్తథాఽత్మా కర్మజా స్తనూః ॥

— యాజ్ఞ. స్మృ. 3-162.

భరతుడు (నటుడు) వివిధవర్ణములతో రామ రావణాది వివిధరూపముల ధరించియు స్వస్వరూపమున నుండునట్లు ఆత్మయు కర్మానుగుణముగ నానావర్ణాత్మకము లయిన వివిధదేహముల దాల్చియు స్వస్వరూపమున విరాజిల్లుచుండును – అని యర్థము.

ఇట స్మృతి ఆత్మను భరతునితో బోల్చి, ఆత్మ భరతుడగుట సూచించినది. 'వ్యావృత్తాయ యవిష్ఠాయ భరతాయ చ రక్షసే' – యనుచు మత్స్యపురాణము(47-149) శివుని భరతు డని కీర్తించినది. ఇట్టి భరత (ఆత్మ) స్వరూపమును అధికారిభేదము ననుసరించి దర్శింపజేయుటకే

త్రయీవిద్య యగు భారతి యవతరించినది. ప్రాకృతజనులకు సైతము కాంతాసంమితముగ నీ భరత-భారతీ స్వరూపమును దర్శింపజేయుటకే భరతనాట్యశాస్త్రము ప్రవర్తిత మయినట్లు చెప్పబడుచున్నది. కావుననే యా శాస్త్రము నాట్యవేద మనియు గీర్తింపబడినది.

"నాట్యసంజ్ఞ మిమం వేదం సేతిహాసం కరో మ్యహమ్ ।
ఏవం సంకల్ప్య భగవాన్ సర్వవేదా ననుస్మరన్ ॥
నాట్యవేదం తత శ్చక్రే చతుర్వేదాంగ సంభవమ్ ।
జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్ సామభ్యో గీత మేవ చ ॥
యజుర్వేదా దభినయాన్ రసా నాథర్వణా దపి ।
వేదోపవేదైః సంబద్ధో నాట్యవేదో మహాత్మనా ॥"

—భరతనాట్యశాస్త్ర 1వ అధ్యా.

పై శ్లోకముల వలన చతుర్వేదముల యొక్క లక్ష్యమును దర్శింప జేయుటయే చతుర్వేదసారరూప మగు నాట్యవేదము యొక్క లక్ష్య మని తెలియును. ఇట్లు నాట్యకళయే కాదు. సంగీతాది చతుఃషష్టి కళల లక్ష్యము నిదియే. శ్రుతియు నీ విషయము నిట్లు చెప్పుచున్నది.

"దేవశిల్పా న్యేతేషాం వై శిల్పానా మనుకృతీహ శిల్ప మధిగమ్యతే .... ఆత్మసంస్కృతి ర్వావ శిల్పాని చ్ఛందోమయం వా ఏతై ర్యజమాన ఆత్మానం సంస్కురుతే॥"

—ఐ. బ్రా. 6-27.

"శిల్పశబ్ద శ్చాఽఽశ్చర్యకరం కర్మ బ్రూతే। తచ్చ శిల్పం ద్వివిధమ్। దేవశిల్పం మానుషశిల్పం చేతి। నాభానేదిష్ఠాదీని యాని శిల్పాని సంతి దేవానాం ప్రీతిహేతుత్వా ద్దేవశిల్పా నీత్యుచ్యన్తే, ఏతేషామేవ దేవశిల్పానా మనుకృతి సదృశ

రూప మిహ మనుష్యలోకే శిల్ప మధిగమ్యతే ప్రతీయతే....
వక్ష్యమాణాని నాభానేదిష్ఠాదిశిల్పా న్యాత్మ సంస్కృతి
ర్జీవాత్మనః సంస్కారకారణాని। తస్మా దేతై ర్యజమానో
జీవాత్మానం ఛందోమయం వేదమయో యథా భవతి తథా
సంస్కురుతే'' —సా. భా.

"శిల్ప మనగా నాశ్చర్యకరమగు కర్మ. శిల్పము ద్వివిధము—దేవశిల్పము; మానుషశిల్పము. నాభానేదిష్ఠాది శస్త్రములకు శిల్పము లనిపేరు. ఇవి దేవప్రీతికరములు; కాన దేవశిల్పములు. మానుషశిల్పము లీ దేవశిల్పములకు అనుకృతులు. ఈ దేవశిల్పములు ఆత్మసంస్కార హేతువులు. ఈ శిల్పములచే యజమానుడు 'జీవాత్మ వేదమయుడగు నట్లు'గా సంస్కరించుకొనును —అని యర్థము.

శస్త్రములు దేవతాతత్త్వప్రబోధకములు, తత్ప్రీతికర కర్మప్రకాశకములగు మంత్రసముదాయము రూపము లగుటజేసియు, తద్ద్వారా ఆత్మసంస్కార హేతువు లగుట జేసియు, దేవశిల్పము లని యిట గీర్తింపబడినవి. దేహాద్యభిమానముతో సంసారమున బరిభ్రమించు యజమానుని యాత్మను క్రమముగ సంస్కరించి యాతనిని భరతునిగను, భారతీమయునిగను తీర్చి దిద్దుటయే దేవశిల్ప రహస్యము. నాభానేదిష్ఠాది శిల్పములును నట్టివి; ఉదా :-

"ఇయం మే నాభి రిహ మే సధస్థ మిమే దేవా అయ మస్మి
సర్వః। ద్విజా అహ ప్రథమజా ఋతస్యేదం ధేను రదుహ
జ్జాయమానా॥'' —ఋ. 10-61-19.

నేను ఆదిత్యరూపుడను. ఆదిత్యుడు వాగ్రూపుడు. అందుచే నాదిత్యగతమగు నీ వాక్కు నాకు నాభి (ఇయం మే నాభిః). ఈ ఆదిత్యమండలము

నాకు స్వస్థానము (ఇహ మే సధస్థం): ఈ దేవతలు నాకు స్వభూతులు (ఇమే దేవాః మే). ప్రథమోత్పన్నులగు ఋషులును నాకు స్వభూతులు (అహ ద్విజా ఋతస్య ప్రథమజాః). నాకు నాభిస్థానీయమై స్వభూతమగు నీ వాక్కే దృశ్యమగు నీ ప్రపంచమును నభివ్యక్తము జేయుచున్నది. (ధేనుః జాయమానా ఇదం అదుహత్). కాన ఆదిత్యరూపుడ నగు నేను సర్వాత్మకుడను (అయ మస్మి సర్వః) —అని నాభానేదిష్ఠుని సర్వాత్మకత్వానుభవము నీ మంత్ర మభివ్యక్తము జేయుచున్నది. 'అగ్నిరస్మి జన్మనా జాతవేదాః న విజానామి యది వేద మస్మి' — ఇత్యాది పూర్వోదాహృత మంత్ర తాత్పర్యము నిదియే.

ఆదిత్యుడు భరతుడు; తద్గత మగు వాక్కు భారతి —యని పూర్వము చెప్పబడినది. 'సా యా వా గసౌ స ఆదిత్యః—(శ. బ్రా. 10-5-1-4)'— అనుచు శతపథశ్రుతియు నాదిత్యుడు వాగ్రూపు డగుట వివరించుచున్నది. పై మంత్రము ఆదిత్యోపాసకుడై జ్ఞానియైన బ్రహ్మవిదుని (నాభానేదిష్ఠుని) ఆదిత్యరూపునిగను, తద్గత వాగ్రూపునిగను, సర్వదేవాత్మకునిగను, తుదకు సర్వాత్మకునిగను గీర్తించుచున్నది. శ్రుతి యుద్దేశించిన దేవశిల్ప మిట్టిది. కాగా, భారతీయుల దృష్టిలో శిల్పములనగా రమణీయార్థములను దర్శింపజేసి యలౌకికానంద రసపరిపూర్ణుల గావించు లక్ష్యము గలవి. ఇదియే భారతీయ సంస్కృతి. ఈ సంస్కృతిని ప్రతిబింబింప జేయునవియే చతుఃషష్టికళలు. ఇవి దేవశిల్పములకు ప్రతిరూపములు. దేవశిల్పము లాత్మసంస్కారహేతువులు. అట్లే తదనుకృతిరూపములగు మానుషశిల్పములకును ఆత్మసంస్కారమే లక్ష్య మని పై శ్రుతి వలన దెలియును. జీవాత్మ వేదమయు డగునట్లుగ. అనగా భారతీమయుడగు భరతుడగునట్లుగ, నొనరించుకొనుటయే ఆత్మసంస్కృతి. ఇట్టి యీయాత్మసంస్కృతి నుద్దీపింప

జేయుటకే దేవాలయ విమాన గోపుర ప్రాకారాదులన్నియు శిల్పమయములై వెలసినవి.

మహాభారతము-అగ్ని (భరత) వంశము :-

బ్రాహ్మణములందు కర్మ విధివాక్యములలో గన్పట్టుచు యజ్ఞములందారాధింపబడెడి వివిధాగ్నుల స్వరూపము నాఖ్యాయికారూపమున మహాభారతము (వనపర్వము) వివరించినది.

"తత్ర నానావిధా నగ్నీన్ ప్రవక్ష్యామి మహాప్రభాన్।
కర్మభి ర్బహుభిః ఖ్యాతాన్ నానార్థాన్ బ్రాహ్మణే ష్విహ॥"
— భార. 217-21.

పరమేశ్వరుడాదిగా గల యీ యగ్నివంశము, అందలి వివిధాగ్నుల క్రమము, ఆ యగ్నుల 'యుత్పత్తి-స్వరూప-ప్రయోజనాదులు' వేత్వేఱుగ వర్ణించి, తుదకు నగ్ను లెందఱైనను తదాత్మకమగు తేజ మొక్కటియే యని యిట్లు చెప్పబడినది

"అద్భుతస్య తు మాహాత్మ్యం యథా వేదేషు కీర్తితమ్।
తాదృశం విద్ధి సర్వేషా మేకో హ్యేష హుతాశనః॥
ఏక ఏవైష భగవాన్ విజ్ఞేయః ప్రథమోఽంగిరాః।
బహుధా నిఃసృతః కాయాత్ జ్యోతిష్టోమః క్రతు ర్యథా॥
ఇ త్యేష వంశః సుమహా నగ్నీనాం కీర్తితో మయా।
యోఽర్చితో వివిధై ర్మంత్రై ర్హవ్యం వహతి దేహినామ్॥"
—భార.222-30 నుండి 32

పై శ్లోకముల బరిశీలించుచో వేదప్రతిపాదితమై యజ్ఞాదికర్మల యందారాధింపబడెడి యగ్ని యొక్క స్వరూపమును దర్శింపజేయుటకై యీ

యగ్నివంశోపాఖ్యానము ప్రవృత్తమైన దగుట స్పష్టము. ప్రజాపతి యగు నా యగ్ని భరతుడని యిట్లు నిర్వచింపబడినది.

"భరతో భరతస్యాగ్నేః పావకస్తు ప్రజాపతేః ।
మహా నత్యర్థమహిత స్తథా భరతసత్తమ ॥" —219-8.

'భరతః భరణం కుర్వతః — తేన భరతశబ్దస్య నిర్వచనం దర్శితమ్ । భరతస్య ప్రజాపతేః పావకః సుతః, సః అత్యర్థం మహితత్వాత్ మహాన్' —నీలకంఠః.

భరణధర్మము గల్గి భరతుడైన ప్రజాపతికి (అగ్నికి) పావకు డను నగ్ని మహామహిమాన్వితుడై జనించెను.

'గురుభి ర్నియమై ర్జాతో భరతో నామ పావకః ।
అగ్నిః పుష్టిమతి ర్నామ తుష్టః పుష్టిం ప్రయచ్ఛతి॥'
'భరత్యేష ప్రజాః సర్వా స్తతో భరత ఉచ్యతే ।' —221-1.

ఈ పావకు డను నగ్నికి భరతు డనియు పుష్టిమతి యనియు నామములు గలవు. సంతుష్టుడై పుష్టి నొసగువా డగుటచే పుష్టిమతి యని నామము. హవిరాదుల ద్వారా ప్రజలను భరించుటచే భరతుడని నామము. ఒకే జ్యోతిస్సు ఎపుడు హవిరాదుల భరించునో యపు డది యగ్ని యగును. లేనిచో కారణస్వరూపమున నుండును. (అత్ర అగ్నిశబ్దేన దిగ్దేశకాల కర్తా ద్యాత్మా సూత్రసంజ్ఞో హిరణ్యగర్భ ఉచ్యతే; తస్య అగ్నిత్వత్యాగః కారణాత్మనాఽవస్థానమ్ — నీలకంఠః. 217-16). ఆ యగ్ని యొక్క హవిర్భరణ, ప్రజాభరణాది ధర్మముల బోధించునదియే 'భరత' పదము.

ఇంతియే కాదు. జడములై యచేతనము లయిన భూతములను దీపింపజేయుచు భరించువా డగుట జేసియు నగ్నికి భరతు డను నామము చెప్పబడుచున్నది.

'అగ్ని ర్గృహపతి ర్నామ నిత్యం యజ్ఞేషు పూజ్యతే ।
హుతం వహతి యో హవ్యం అస్య లోకస్య పావకః ॥
అపాం గర్భో మహాభాగః సత్త్వభుక్ యో మహాద్భుతః ।
భూపతి ర్భువభర్తా చ మహతః పతి రుచ్యతే ॥'
దహన్ మృతాని భూతాని తస్యాగ్ని ర్భరతోఽభవత్।
అగ్నిష్టోమే చ నియతః క్రతు శ్శ్రేష్ఠో భరస్య తు॥
—222-4, 5, 6.

పావకుడగు నీ యగ్ని యజ్ఞములందును, అట్టి దేహమునందును వర్తించుచు పిండబ్రహ్మాండములయం దుండెడి దేవతలను అన్నాది హవిస్సులతో దృప్తి నందించి హవ్యవాహను డగుచున్నాడు.

అపాం గర్భః :-

ఈ భరతుడు అద్భుతుడు. ఇతడు 'అప్తుడు' అను అగ్నికి పుత్రుడు అనగా నవ్యక్తకారణము నుండి యావిర్భవించినవాడు - అని యర్థము. (అప్సంబంధా దాపాపరనామా సహ ఏవాత్ర అప్శబ్దార్థః తస్య గర్భః పుత్రః....సహశబ్దేన కారణ మవ్యక్తాఖ్యమ్ । అప్ శబ్దేన, 'సలిల ఏకో ద్రష్టాఽద్వైతో భవతీత్యాది శ్రుతౌ సలిలేనోపమితం శుద్ధం బ్రహ్మాగ్రాహ్యమ్.
సత్త్వభుక్:- 'సత్త్వభుక్' అనగా నాధ్యాత్మికముగ బుద్ధిని, ఆధిభౌతికముగ లోకత్రయమును లయ మందించువాడు. భూర్భువర్లోకములకు పతి; ఆధ్యాత్మికముగ మహత్తత్త్వమునకు(సూక్ష్మబుద్ధికి)పతి. మహత్తత్త్వ మనెడి యగ్ని నుండి 'అహంకారము' అను పేరు గల యగ్ని యుద్భవించెను. ఈ యగ్నియు భరతుడు. ఇతడు ఆధిభౌతికముగను, ఆధ్యాత్మికముగను జడములై యచేతనము లయిన భూతములను (మృతాని భూతాని) దీపింప జేయుచు, లయ మొందించుచు - ఇట్టి భరణధర్మముచే భరతు డగుచున్నాడు. ఈ యగ్ని అధియజ్ఞముగ నగ్నిష్టోమమునందు నియతు డగుచున్నాడు 'తస్యైవం విదుషో యజ్ఞస్యాత్మా యజమానః, శ్రద్ధా పత్నీ,

శరీర మిధ్మ' మని యీ రీతిగా శ్రుతిచే జెప్పబడిన యాధ్యాత్మికయజ్ఞము అగ్నిషోమము; ఇది మరణరూప – అవభృథాంతము నిత్యము చేయదగినది. ఇటి యీ యజ్ఞమున నారాధింపబడెడి యగ్ని భరతుడు —(చూ. నీలకంఠవ్యాఖ్య).

అట్టి మహాదేవుడు, మహానటుడు నగు భరతుని యం దనుగతమై యజ్ఞతంత్రమును, లోకతంత్రమును నిర్వహించెడి వేదవాణి భారతి. ఈ మహాభారతవచనముల ననుసరించియు నాధ్యాత్మికముగ, నాధిభౌతికముగ, నధియజ్ఞముగ హవిర్భరణ–శరీరభరణాది ధర్మములచే నగ్నికి భరతుడని ప్రసిద్ధి స్పష్టము. అందుచే –'ఆర్యులలో భరతు లనెడి యొక తెగవారికి నారాధ్యు డగుటచే నగ్నికి భరతు డను వ్యవహారము కల్గినది' – అనెడి చారిత్రికుల కల్పన శ్రుతి స్మృతి తాత్పర్యవిరుద్ధము.

కోశ-పౌరాణిక వచనములు- భారతీప్రజ-భారతీసంస్కృతి :-

"ప్రజాపతి ర్వై భరతః సహీదం సర్వం బిభర్తి–"

జగద్భర్త యగుటచే ప్రజాపతి భరతుడు – అని శ్రుతినిర్వచనము. జగద్భర్తయగు భరతుని నుండియే యీ లోకము ప్రవర్తిత మగుచున్నందున నీ లోకము – 'భారతము; భారతవర్షము' – అను నన్వర్థసంజ్ఞతో నొప్పినది. అందుచే 'లోకోఽయం భారతం వర్షమ్। వర్షం స్థానం విదుః ప్రాజ్ఞా ఇమం లోకం చ భారతమ్' – ఇత్యాది వచనము లుపపన్నములే యగుచున్నవి.

"త్వం భారతే కార్యగురు స్త్వం చక్షు స్త్వం పరాయణమ్।
తదాగచ్ఛ హృషీకేశ క్షితౌ తాన్ జహి దానవాన్॥"

—హరివంశః 1-54-86.

ఈ శ్లోకమున 'భారతే-క్షితౌ' అను పదములు రెండును సమానాధికరణము లుగ ప్రయోగింపబడినవి.

"మయ్యాసక్తాం చ జానామి భారతీం మహతీం ధురమ్।
సర్వం తచ్చ విజానామి"- —హరివంశః 1-55-10.

దానవసంహారమునకై భూమియందు (లోకమునందు) అవతరింపు మని యెడి పై యభ్యర్థనకు భగవానుని ప్రతివచన మిది. 'భారతీ (లోక - ప్రజా) రక్షణభారము నాయందున్నదని యెఱుగుదును' - అని యర్థము. కాన భారత, భారతీ పదములు లోక-ప్రజా-వాచకము లగుట శ్రుతి స్మృతి సంమతము.

"ప్రజాపతిర్వై మనుః। సహీదం సర్వ మమనుత।
ప్రజాపతి ర్వా ఏతదగ్రే కర్మ అకరోత్" —శ.బ్రా. 6-6-1-19.

ప్రజాపతి యగు మనువు యజ్ఞాదికర్మ (ధర్మ) మార్గమును లోకమున మొదట ప్రవర్తింపజేసిన యధికారపురుషుడు; రాజర్షి (చూ. 'మనుష్వత్' -త్రయీశబ్దము) ప్రజాపతి భరతుడని శ్రుతిచే జెప్పబడినది. 'భరణాచ్చ ప్రజానాం వై మను ర్భరత ఉచ్యతే' - అని పురాణాదులును ప్రజాపతి యగు మనువు భరతుడని కీర్తించినవి. భరతుడగు మనువు యొక్క ధర్మ మార్గమున ప్రవర్తిల్లెడి ప్రజ భారతి యగును. ప్రజ యన ప్రకృష్టజన్మ గలది, (ప్రజాయతే ఇతి) యని యర్థము. అగ్ని-వాయు-ఆదిత్యులు ప్రకష్టజన్మగల ప్రజలు(తిస్రః ప్రజా ఆర్యా జ్యోతి రగ్రాః) అని పూర్వము వివరింపబడినది. తదారాధకు లగుచు మనువు చూపిన ధర్మమార్గమున వర్తించుటయే భారతీప్రజ యందలి ప్రకృష్టత్వము గావచ్చును. కర్మల యం దగ్నిని-ఆధ్యాత్మికముగ శరీరాంతర్నిహిత జ్యోతిని అన్నాదిహవిస్సులతోను, వాయు(ప్రాణాత్మక)రూపమగు జ్యోతిస్సును ప్రాణాయామాద్యభ్యాసము

చేతను, అభిముఖులై నిలిచి ఆదిత్యుని ఉపాసనాదులతో నారాధించెడి సంప్రదాయము అనాదిసిద్ధము.

"రేఖామాత్ర మపి క్షుణ్ణా దామనో ర్వర్త్మనః పరమ్ ।
న వ్యతీయుః ప్రజా స్తస్య నియంతు ర్నేమివృత్తయః ॥"
— రఘు.

మనుధర్మమార్గ మనాదిసిద్ధ మని పై శ్లోకముచే కాళిదాసమహాకవి స్పష్టము చేయుచున్నాడు.

కాన అగ్ని-వాయు-ఆదిత్యులు, తదాత్మకుడగు ప్రజాపతి, సర్వ కారణుడు నగు పరమేశ్వరుడు, లోకమున ధర్మప్రవర్తకుడగు మనువు— అందఱు భరతులు; వీరియందును, వేదవిదులగు భరతులయందును ననుగతమై యుండెడి ఇడా-సరస్వతీ-భారతీరూపిణి యగు వేదమాత భారతి; వేదచోదిత కర్మ-భక్తి-జ్ఞానమార్గముల ప్రవర్తిల్లుచు నీ భరత-భారతీ దేవతా రాధనము సల్పుట భారతీసంస్కృతి - యని దెలియనగును. నదీ-నద-పర్వతాదులయందును, లతావృక్షాదులయందును, భరత-భారతదేవతాత్వము దర్శించి యారాధించుట భారతీసంస్కృతి. ఇట్టి దేవతాతత్త్వము నుద్దీపింప జేయుచు భారతీప్రజపాలిటి కల్పవృక్షములై యవతరించినవి యీ లతా వృక్షాదులు. ఈ విషయ మీ క్రింది వచనము వలన స్పష్టము కాగలదు.

"కల్పవృక్షస్వరూపా యా భారతే వృక్షరూపిణీ।
భారతీనాం ప్రీణనాయ జాతా యా పరదేవతా॥"
— దేవీ-భాగ. 9-1-70.

భారతీ ప్రజ పాలిటి కల్పవృక్షమై భారతమున (లోకమున) తులసీవృక్ష రూపమున బరదేవత యావిర్భవించినది యని యర్థము. తులసి మహౌషధియై స్థూలశరీరమును, పరాదేవతయై సూక్ష్మశరీరమును ఆధివ్యాధులనుండి

రక్షించెడి కల్పవృక్ష మని.భావము. ఇట్లు లతావృక్షాదులయందు నైతమను గతమై తన నారాధించెడి భారతులను పాలించెడి పరాశక్తియే భారతి.

"భద్రకాళీ భుజంగాక్షీ భారతీ భారతాశయా" — దేవీ.భాగ. 12-6-118.

'భారతాశయా, భా స్వప్రకాశా సంవిత్ తస్యాం రతా
యే జ్ఞానిన స్తేషు ఆశయో యస్యాః సా' — నీలకంఠః

'భా' - యన స్వప్రకాశాత్మకమగు జ్ఞానము. దానియందు రతులు (ఆసక్తులు) భారతులు, జ్ఞాను లని యర్థము. ఆ భారతుల యందు 'ఆశయము-దృష్టి' కలది యగుటజేసి పరదేవత 'భారతాశయా' యగును. అట్టి యా పరాదేవతయే భారతి యని యిట కీర్తింపబడినది. కావ నగ్ని వాయ్వాది దేవతారాధనకును, తులసీవృక్షాదిపూజలకును, యోగుల యోగ సాధనకును - అన్నిటికిని లక్ష్యము పరదేవత యగు భారతియే. పరాదేవతా భావనతో నారాధనల సల్పుట భారతీసంస్కృతి యని దెలియును.

"భరం సంగ్రామం తనోతీతి భరతః" భర మనగా సంగ్రామము. దానియందు కుశలులు, లేక దానిని విస్తరింప జేయువారు గాన భరతులు- అనెడి పూర్వోదాహృతమైన యీ నిర్వచనము కూడ భారతీయసంస్కృతి స్వరూపమును దెలియజేయునదియే. చిత్తమున నిరంతరము పొడసూపు ఆసురీప్రవృత్తిని దైవీసంపదతో (దేవం మనః) నెదుర్కొనుటయు సంగ్రామమే. ఇట్టి సంగ్రామమునందును గుశలు రగువారే భరతులు. ఆసురీప్రవృత్తి నెదుర్కొనజాలెడి దైవీసంపదను సమకూర్చున దగుటచే యజ్ఞమునకు 'భరః' అని శ్రుతులయందు ప్రసిద్ధి. (ఋ. 5_37_5, భరే సంగ్రామే, భరణవతి యజ్ఞే_సా.భా.).

'బలం భరం భవతి బిభర్తేః' అను నిరుక్తవచనము (3_2-9)

బల-భరశబ్దములు రెండును సమానార్థకములని చెప్పుచున్నది. కాన బలమనగా బ్రాహ్మ-క్షాత్ర-తేజోరూపమగు బలము. 'భరం యజ్ఞం ఆత్మ బలం వా తనోతీతి భారతీ' - యజ్ఞమును (ఈశ్వరారాధనను), తద్ద్వారా యాత్మబలమును బెంపొందించునది యగుటజేసి వేదవాణి భారతి. ఆ భారతి నుపాసించువారు, అనగా ధర్మానుష్ఠానపరులు - తద్రక్షకులును, భారతులు; ఇదియే భారతీసంస్కృతి.

పై గ్రంథసందర్భము ననుసరించి యిట్టి సంస్కృతి పూర్వము విశ్వవ్యాప్తమై యుండి యుండవలెను. నేటికిని భారతీసంస్కృతిని దలపింపజేసెడి శిల్పకళాఖండములు, భాషాసామ్యము మున్నగునవి యితరదేశములందును నచటచట గన్పట్టుట యిందుకు దార్కాణము. ఆ సంస్కృతి కాలక్రమమున లుప్తమై భారతదేశమున మాత్రమే సుస్థిరముగ నిలిచియుండవచ్చును.

"ఉత్తరం యత్సముద్రస్య హిమాద్రేశ్చైవ దక్షిణమ్
వర్షం తద్భారతం నామ భారతీ యత్ర సంతతిః" _విష్ణు.పు. 2-3-1-

సముద్రమునకును హిమాద్రికిని మధ్య భారతీసంతతి యెచట గలదో యది భారతవర్షము _ అని యర్థము. భారతీసంతతిని బట్టి యీ దేశమునకు భారతవర్ష మను ప్రసిద్ధి వచ్చినట్లు పై పురాణవచనము వలన దెలియును.

సామాన్యముగ ప్రజలు వ్యవహరించుకొను భాషను బట్టియే యా ప్రజకు గాని, వారు నివసించు దేశమునకు గాని పేరు ప్రసిద్ధ మగు చుండును, తెలుగుదేశము, తమిళనాడు, కన్నడదేశము, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ _ ఇత్యాదు లిందు కుదాహరణము. ఈ లోకన్యాయము ననుసరించుచో నీ భారతి (సంస్కృతవాణి) యొకపుడు విశ్వవ్యాప్తమై యుండు టచే లోకమునకు భారత వర్ష మను ప్రసిద్ధికి గారణమై యుండవలెను.

"ఉత్తిష్ఠత మా స్వప్త అగ్ని మిచ్ఛధ్వం భారతాః"

— తై. ఆ. 1-27-2.

భారతులారా ! లెండు, నిదురింపకుడు ; అగ్నిని(ఈశ్వరుని)ఆరాధింపుడు- అని వేదభారతి భారతులను హెచ్చరించుచున్నది. ఇది భారతీయులకు మఱువరాని హెచ్చరిక.

ఇంతవఱకు 'త్రయీ వై విద్యా కావ్యం ఛందః' – అను శ్రుతి వాక్యమునందలి త్రయీవిద్యా-కావ్యశబ్దములు పరిశీలింపబడినవి. వేదకావ్య స్వరూపము ఛందః శబ్దపరిశీలనము వలనను స్పష్టపడును. ఇంక ఛందః శబ్దమును జూతము.

మంత్రబ్రాహ్మణాత్మక మైవ శ్రుతికి 'ఛందః' అను వ్యవహారము ప్రసిద్ధ మైనట్లు పై కోశముల వలన దెలియును. ఇంతే కాదు. నియతాక్షర పాద-వ్యవస్థారూపము లగు గాయత్రీ, ఉష్ణిక్, అనుష్టుప్, త్రిష్టుప్ — మున్నగు వానికిని ఛందస్సులని పేరు.

ఛందస్సులు—నాగేశభట్టవాదము :-

"మంత్రబ్రాహ్మణాత్మకశబ్దరాశికి బ్రహ్మ, శ్రుతి, స్వాధ్యాయ, ఆమ్నాయ, వేద—ఇత్యాది నామములు చెల్లును గాని 'ఛందః' అను నామము చెల్లదు; గాయత్ర్యాది ఛందోబద్ధమంత్రములే ఛందస్సులు; బ్రాహ్మణములు ఛందోబద్ధములు గానందున ఛందస్సులు కావు; ఏలయన-

"ఛందో బ్రాహ్మణాని చ తద్విషయాణి" — పా.సూ. 4-2-66.

"ఛందఃపదేన గాయత్ర్యాది ఛందోయుత మంత్రాణా మేవ గ్రహణ మితి బ్రాహ్మణగ్రహణమ్। జుష్టార్పితే ఛందసీ త్యత్ర బ్రాహ్మణే లక్షణా। నిత్యం మంత్రే ఇత్యు త్తరసూత్రే మంత్రగ్రహణాత్" —నాగేశభట్టః-లఘుశబ్దేందుశేఖరః

పై పాణిని సూత్రమున ఛందః-బ్రాహ్మణ పదములు రెండును నిర్దేశింపబడినవి ; ఛందః పదమునకు 'మంత్రబ్రాహ్మణాత్మక వేదము-అను వర్థమే యున్నచో నొక ఛందః పదము నుపయోగించిన జాలును ; మఱల 'బ్రాహ్మణ'పద నిర్దేశమేల ? అట్లు నిర్దేశము చేయుట వలన ఛందః పదము మంత్రభాగమునే బోధించునుగాని బ్రాహ్మణమును బోధింప దనుట సూత్రకారాభిమతము ; కాని కొన్నియెడల ఛందఃపదము ముఖ్యార్థమగు 'మంత్రము, అను వర్థమును విడిచి 'బ్రాహ్మణము' అను నర్థమును గూడ జెప్పవచ్చును ; ఉదా :—

"జుష్టార్పితే ఛందసి ; నిత్యం మంత్రే" (6-1-209, 210).

నిబంధన నియమము లేదని యర్థము. ఛందోబద్ధములు కానందున మంత్ర భాగాత్మకము లగు యజుస్సులకును ఛందస్త్వము లేదనవలసి వచ్చును - గదా ! అట్లుగాక పింగళ నాగ వైదికచ్ఛందఃసూత్రము ననుసరించి ఏకాక్షరాది యజుస్సులకు గూడ ఛందోనియమ మున్నదని కొందఱు చెప్పుదురు.

"ఛందః గాయత్రీ దైవ్యేకమ్" — పింగళఛందఃసూత్రము.

కావుననే ఏకాక్షరమగు ప్రణవము గూడ 'ఓమితి ప్రతిపద్యతే ఏతద్వై యజుః (తై.ఆ. 2-11)' అను శ్రుతిప్రామాణ్యము చే యజూరూపము; దైవీగాయత్రీ ఛందోబద్ధము - అని చెప్పుదురు.

"ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ। అగ్ని ర్దేవతా బ్రహ్మ ఇత్యార్షమ్।
గాయత్రం ఛందం పరమాత్మం సరూపమ్" — తై.నా. 19-33.

అను శ్రుతియు ప్రణవము గాయత్రీఛందోబద్ధ మని నిర్దేశించుచున్నది. దీనివలన ఏకాక్షర ద్వ్యక్షరాత్మకము లగు యజుస్సులకు గాయత్ర్యాదుల కంటె విలక్షణమైన ఛందస్సులు గలవని తెలియుచున్నది. 'ఏకపదా గాయత్రీ; ద్విపదా విరాడ్గాయత్రీ; మధ్యే జ్యోతి స్త్రిష్టుప్; ఏకపదా త్రిష్టుప్; త్రిపదా త్రిష్టుప్' - అని యీ రీతిగ నిబంధనకారులు యజుస్సులకు గల ఛందోనామముల నా యా మంత్రముల కడ నిర్దేశించి యున్నారు. అయితే కాత్యాయన సర్వానుక్రమసూత్రము అనియతాక్షరరూపము లగు యజుస్సు లకు కొన్నింటికే ఛందోనియమము కలదు గాని యన్నిటికి లేదని చెప్పుచున్నది.

"యజుషా మనియతాక్షరత్వా దేకేషాం ఛందో న విద్యతే'
— కాత్యా. సర్వ. సూ.

చార్యులును తైత్తిరీయసంహితాభాష్యమున యజుస్సులు ఛందోరహితము లని చెప్పిరి.[1] మఱల కాణ్వసంహితాభాష్యమున[2] పైన జెప్పిన రెండు సంప్రదాయములు గలవని వివరించిరి. పై రెండు సంప్రదాయములలో యజుస్సులకు ఛందోనియమము లేదను సంప్రదాయము ననుసరించినచో, ఛందోబద్ధములు కాకపోవుటచే యజుస్సులు ఛందస్సులు కాకపోవలసి వచ్చును. రెండవ సంప్రదాయము ననుసరించినను 'హోతా యక్ష ద్వనస్పతి మభిహి' - ఇత్యాది యజుస్సులు, ఛందఃకల్పన లేదు గాన, ఛందస్సులు కాకపోవలసి వచ్చును. కాని పై నాగేశవచనముల ననుసరించి 'మంత్రములు ఛందస్సులు - బ్రాహ్మణములు కావు' - అనియే తెలియును. కాన యజుస్సులకు ఛందస్త్వము నాగేశు డంగీకరించినట్లే యగుచున్నది. అట్టియెడ 'ఛందోబద్ధము లగుటచే మంత్రములు ఛందస్సులు' - అనెడి నాగేశుడు చెప్పిన లక్షణము పై రెండు సంప్రదాయముల ననుసరించియు యజుస్సుల కుపపన్న మగుట లేదు.

మఱియు 'ఛందోబద్ధము కాకపోవుటచే బ్రాహ్మణభాగమునకు ఛందస్త్వము లేదు' - అను నాగేశవాక్యము కూడ నుపపన్నము కాదు. కొన్ని యజుస్సులు పింగలప్రోక్త ఛందోబద్ధము లయినట్లు, కొన్ని బ్రాహ్మణ

1. "యది కామయేత ఛందాగ్ంసి యజ్ఞయశసే నార్పయేయ మిత్యృచ మంతమాం కుర్యా చ్ఛందాగ్ంస్యేవ యజ్ఞయశసేనార్పయతి యది కామయేత యజమానం యజ్ఞయశసేనార్పయేయ మితి యజు రంతమం కుర్యాత్. ఛందోబద్ధాయా ఋచ స్స్వాంతిమత్వే యజ్ఞఫలం ఛందస్సు గచ్ఛేత్ యజుషస్తు ఛందోరహితత్వేన యజ్ఞఫలం ఛందోగామి న భవతి; కింతు యజమానగామ్యేవ భవతి"

— సా.భా. తై. సం. 1-1-1 1; 5-1-1-3.

2. "ఛందస్తు మంత్రాణాం ఇషేత్వాదీనా మనియతాక్షరత్వా న్నాస్త్యేవ। యే తు యజుషా మపి ఛంద ఇచ్ఛన్తి తైః కాత్యాయనోక్త సర్వానుక్రమణికాయాం పంచమాధ్యాయ మభ్యస్య తద్ద్వారేణ తత్త న్మంత్రచ్ఛందోఽనుసంధేయమ్॥"

—సా.భా. కాణ్వసంహితా. భాష్యభూమికా.

పాణిని మహర్షి పెక్కు సూత్రములందు ఛందఃపదమును మంత్రబ్రాహ్మణాత్మక వేదపర్యాయపదముగ ప్రయోగించినాడు. ఉదా :—

'ఛందసి పునర్వస్వో రేకవచనమ్' — పా. సూ. 1-2-61.

"ద్వయో రేకవచనం వా స్యాత్। పునర్వసు ర్నక్షత్రం పునర్వసూ వా। లోకే తు ద్వివచన మేవ' — సిద్ధాంతకౌముదీ.

పునర్వసునక్షత్రములు రెండు. అయినను ఛందస్సునందు పునర్వసు శబ్దమునకు ద్వివచనము వికల్పముగా వచ్చును. పునర్వసుః, పునర్వసూ. లోకమునందు ద్వివచనమే – అని యర్థము.

ఇట ఛందస్సు కంటె భిన్నమైన లోకము (లౌకికసంస్కృతము) నందు ద్వివచనము నిత్యము—అని వివరింపబడినది. వ్యాఖ్యాత లందఱితో పాటు నాగేశుడు కూడ నిట్లే వివరించినాడు. లోకముకంటె ఛందస్సు భిన్నమైనదని యనుటచే నిట ఛందః పదము మంత్రబ్రాహ్మణాత్మక వేదమునకు మొత్తమునకు వాచక మగుచున్నది. అట్లుగాక పై నాగేశ వాక్యము ననుసరించి బ్రాహ్మణభాగమునకు ఛందస్త్వము లేనిచో ఛందో భిన్నము లోకమే కాక, బ్రాహ్మణభాగము కూడ కావలెను. అట్లగుట పైన చెప్పినట్లు భాష్యకారా ద్యభిమతము కాదు. ఇట నాగేశుడు నట్లు వివరింప లేదు. ఇంతే కాదు – ఇట్లే.

"షష్ఠీ యుక్త శ్ఛందసి వా" – పా సూ. 1-4-8.

"వా ఛందసి సర్వే విధయో భవన్తి" – మహాభాష్య.

ఇత్యాది స్థలములయందును ఛందః పదము లోకభిన్నమగు మంత్రబ్రాహ్మణాత్మక వేదసామాన్యపరముగనే గ్రహింపబడినది. కాన నీ దృష్టితోనే 'ఛందో బ్రాహ్మణాని చ తద్విషయాణి' అను పై సూత్రమును గూడ

బరిశీలించినచో ఛందఃపదము సామాన్యవాచకము, బ్రాహ్మణ పదము విశేషవాచకము నని గ్రహింపవలసి యుండును. సామాన్యవిశేషవాచక పదములు రెండును నొకచో బ్రయోగింపబడినపుడు విశేషముకంటె వ్యతిరిక్తమగు నర్థమునే సామాన్యవాచకము బోధించుట సంప్రదాయము.

"విశేషవాచక పదసన్నిధానే సామాన్యవాచక పదానాం
తద్విశేషాతిరిక్త పరత్వమ్"

'విప్రులు వచ్చిరి; వసిష్ఠుడును వచ్చెను' - ఇట వసిష్ఠుడును విప్రుడే. అందుచే నిట విప్రపదము సామాన్యవాచకము. వసిష్ఠపదము విశేషవాచకము. వసిష్ఠుని కంటె భిన్నులగు విప్రులు వచ్చి రనియే యిందలి మొదటి వాక్యమున కర్థము. ఈ న్యాయము ననుసరించి పై సూత్రమున సామాన్యవాచకమగు ఛందః పదము బ్రాహ్మణభాగవ్యతిరిక్త వేద వాచకముగనే గ్రహించుట యుక్తము. కైయటుడును మహాభాష్య వ్యాఖ్య యగు ప్రదీపమున నిట్లే వ్యాఖ్యానించినాడు.

"గోబలీవర్దన్యాయేన ఛందఃపదేన బ్రాహ్మణానాం గ్రహణమ్।
యథా జుష్టార్పితే చ ఛందసీతి బ్రాహ్మణానాం గ్రహణం,
నిత్యం మంత్ర ఇతి మంత్రగ్రహణాత్" — ప్రదీప. 1-3-10

కాన నాగేశప్రోక్తమగు 'గాయత్ర్యాది ఛందోబద్ధత్వము ఛందస్త్వము'- ఆపాతలక్షణమే యగును. గాయత్ర్యాది ఛందోబద్ధమైనను, కాకపోయినను, మంత్రబ్రాహ్మణాత్మక వేదరాశి కంతటికిని ఛందస్సు అను వ్యవహారము గలదనుట స్పష్టము. కోశప్రసిద్ధియు నిట్లే గలదు.

'ఇక బ్రాహ్మణములకు వేదత్వమే లేదు'-అనెడి శ్రీదయానందాదుల వాదము గూడ నిట బరిశీలింప దగియున్నది. ఆ వాదముల గూడ బరిశీలించి పిదప ఛందః స్వరూపమును దర్శింతము.

బ్రాహ్మణములకు వేదసంజ్ఞ - శ్రీ దయానందాదుల యాక్షేపము :-

"వేద మను సంజ్ఞ మంత్రభాగరూపసంహితకే; బ్రాహ్మణమునకు గాదు; కాని 'మంత్రబ్రాహ్మణయో ర్వేదనామధేయమ్' – అను కాత్యాయన వచనము ననుసరించి బ్రాహ్మణభాగమునకు గూడ వేద మను సంజ్ఞ గలదని చెప్పబడుచున్నది. అట్లు చెప్పుట తగదు. ఏలయన :- (1) బ్రాహ్మణములకు పురాణేతిహాస మని సంజ్ఞ ప్రసిద్ధము; వేద మని కాదు. (2) బ్రాహ్మణములు మంత్రవ్యాఖ్యానరూపములు; వ్యాఖ్యానము లగుటచే మూలగ్రంథమగు మంత్రభాగము కంటె నర్వాచీనము లనుట యుక్తము. (3) మంత్రభాగము వలె బ్రాహ్మణములు ఈశ్వరప్రోక్తములు గావు; ఋషిప్రోక్తములు; కాన పురుషబుద్ధిరచితములు. (4) కాత్యాయనుడు కాక మిగిలినఋషు లెవ్వరును బ్రాహ్మణములకు వేదసంజ్ఞ నంగీకరింప లేదు" – అని శ్రీ దయానందుల వాదము.[1]

దయానందుల యాక్షేపమునకు సమాధానము :-

పై వాదము నందలి సామంజస్యమును జూతము. బ్రాహ్మణములకు 'పురాణము; ఇతిహాసము' – అనియే కాని వేద మను సంజ్ఞ ప్రసిద్ధము కాదు; కాత్యాయనుడు కాక మిగిలిన ఋషు లెవ్వరును బ్రాహ్మణములకు

1. "అథ కోఽయం వేదో నామ? మంత్రభాగసంహితే త్యాహ। కించ మంత్రబ్రాహ్మణయో ర్వేదనామధేయ మితి కాత్యాయనోక్తే ర్బ్రాహ్మణభాగస్యాపి వేదసంజ్ఞా కుతో న స్వీక్రియత ఇతి। మైవం వాచ్యమ్। న బ్రాహ్మణానాం వేదసంజ్ఞా భవితు మర్హతి। కుతః? పురాణేతిహాససంజ్ఞకత్వాత్, వేదవ్యాఖ్యానాత్, ఋషిభి రుక్తత్వాత్, అనీశ్వరోక్తత్వాత్, కాత్యాయనభిన్నైః ఋషిభి ర్వేదసంజ్ఞాయా మస్వీకృతత్వాత్, బుద్ధిరచితత్వాచ్చేతి."

— దయానంద ఋగ్వేదాదిభాష్యభూమికా. పుట. 80.

వేదసంజ్ఞ నంగీకరింపలేదు—అని శ్రీ దయానందులు చెప్పిరి. ఇట్లనుట సరి కాదు. ఏలయన కోశములు, వ్యాకరణ, న్యాయ, వైశేషిక, పూర్వోత్తరమీమాంసాదర్శనములు, మున్నగువానియందు బ్రాహ్మణములు వేదభాగములుగ నిర్దేశింపబడినవి.

కోశప్రసిద్ధి :-

"బ్రాహ్మణం బ్రహ్మసంఘాతే వేదభాగే నపుంసకమ్।
భూమిదేవే తు పుంలింగః" —మేదినీ.

"వేదే బ్రాహ్మణం పుంసి తు ద్విజే" — —నానార్థరత్నమాలా.

"అథ బ్రాహ్మణో ద్విజే।
ఆత్మజ్ఞే క్లీ తు విధివద్వేదభాగ తదంశయోః" —వైజయంతీ.

"ప్రపాఠక స్స్యాహ్నికో ఽథో అనువాకశ్చ ఖండికా।
బ్రాహ్మణం చ త్వవచ్ఛేదాః" — —వైజయంతీ.

ఇట్లు కోశములందు బ్రాహ్మణములు వేదభాగములుగ నిర్దేశింపబడినవి. ఇట వైజయంతీకోశము బ్రాహ్మణమును వేదభాగ మని నిర్దేశించుటయే కాక, వేదైకదేశవాచకము లగు ప్రపాఠక, ఆహ్నిక, అనువాక, ఖండికా శబ్దములతోపాటు బ్రాహ్మణ శబ్దమును గూడ బేర్కొనినది. అందుచే ననువాకాది శబ్దముల వలెనే బ్రాహ్మణ శబ్దము గూడ వేదైకదేశవాచక మనియు దెలియును. ఇక దర్శనకారుల దృష్టిలో వేదస్వరూపమును జూతము.

పూర్వమీమాంసాదర్శనము-ప్రసిద్ధి :-

'తచ్చోదకేషు మంత్రాఖ్యా। శేషే బ్రాహ్మణ శబ్దః'
—జై. సూ. 2-6-32, 33.

ఇట మొదట మంత్రలక్షణము పేర్కొనబడినది. పిదవ 'శేషే బ్రాహ్మణ శబ్దః'— అని బ్రాహ్మణ లక్షణము చెప్పబడినది. కాన మంత్రశేషభాగము బ్రాహ్మణ మని యర్థము. శేష మనగా మొదట గ్రహింపబడిన సముదాయములో మిగిలిన ఏకదేశము. ఇట మొదట గ్రహింపబడిన సముదాయము వేదము. అందు మంత్రభాగము పోగా మిగిలిన బ్రాహ్మణభాగము మంత్ర శేష మగును. కాన నది వేదభాగమే కావలెను. ఇట్టి యర్థముననే శేష శబ్దము నింకొక చోట గూడ జైమిని మహర్షి ప్రయోగించుటయు గుర్తింప దగినది.

"తేషాం ఋక్ యత్రార్థవశేన పాదవ్యవస్థా। గీతిషు
సామాఖ్యా। శేషే యజుః శబ్దః॥ —జై.సూ. 2-35-36.37.

మంత్రములు మూడు విధములు. అందు అర్థానుసారముగ పాదవ్యవస్థతో నొప్పు మంత్రము ఋక్కు; గానయుక్తము సామము; మిగిలినది (శేషః) యజుస్సు—అని యర్థము. ఇచట గూడ మంత్రములలో గొన్ని ఋక్కులు, గొన్ని సామలు - అని వాని లక్షణముల జెప్పి పిదవ మిగిలినవి యజుస్సు లని చెప్పబడినవి. అట్లు మిగిలిన యజుస్సులు మంత్రములే యగును గాని వేఱు కావు. అట్లే వేదసముదాయములో నొక భాగము మంత్రమని చెప్పి, మిగిలినది బ్రాహ్మణ మనుటచే నదియు వేదైకదేశమే యగును; వేదభిన్నము కాదు. కాన బ్రాహ్మణభాగమునకు వేదసంజ్ఞ జైమినిమహర్షిసంమతము. శ్రీ శబరస్వామియు పై సూత్రము నిట్లే వ్యాఖ్యానించినాడు.

"అథ కిం లక్షణం బ్రాహ్మణమ్ ? మంత్రాశ్చ బ్రాహ్మణం చ వేదః। తత్ర మంత్రలక్షణే ఉక్తే పరిశేషసిద్ధత్వాత్ బ్రాహ్మణ లక్షణ మవచనీయమ్। మంత్రలక్షణవచనేనైవ సిద్ధమ్। యస్యైతల్లక్షణం న భవతి తద్ బ్రాహ్మణ మితి పరిశేషసిద్ధం బ్రాహ్మణమ్।"

వ్యాకరణదర్శనము-ప్రసిద్ధి :-

పాణినిమహర్షి పెక్కుచోట్ల 'ఛందసి, ఛందసి' యనుచు ఛందఃపదముచే మంత్రబ్రాహ్మణాత్మక వేదసముదాయమును గ్రహించుటయు, ఛందోభిన్నమును 'భాషాయామ్' అని వ్యవహరించుటయు, వ్యాఖ్యాతలు నట్లే వివరించుటయు నైన వివరింపబడినది. మహాభాష్యకారుడు నెడనెడ శ్రుతివాక్యము లనుచు నా యా బ్రాహ్మణవాక్యముల నుదహరించుటయు గమనింపదగినది.

> "తేఽసురాః' — 'తేఽసురా హేలయో హేలయ ఇతి కుర్వన్తః
> పరా బభూవుః। తస్మా ద్బ్రాహ్మణేన న మ్లేచ్ఛితవై
> నాఽపభాషిత వై, మ్లేచ్ఛో హ వా ఏష యదపశబ్దః
> (శ.బ్రా. 3-1-5-24), మ్లేచ్ఛా మా భూమే త్యధ్యేయం
> వ్యాకరణమ్॥"
> —పస్పశాహ్నిక.

ఇట్లెన్నియేని యుదాహరణముల నీయవచ్చును. అదియును గాక పాణినీయసూత్రములందలి ఛందఃశబ్దము యొక్క అర్థము నెట్లు దర్శింపవలసినదియు కాశికావృత్తియందును, తద్వ్యాఖ్యానములగు పదమంజరీ-న్యాసముల యందును నిట్లు వివరింపబడినది.

> "ఛందో నామ్ని చ" — పా, సూ. 3-3-34.
> "వృత్త మత్ర ఛందో గృహ్యతే, యన్య గాయత్ర్యాదయో
> విశేషాః, న మంత్రబ్రాహ్మణమ్; నామగ్రహణాత్"
> — కాశికావృత్తి.
> "న మంత్రబ్రాహ్మణ మితి 'బహుళం ఛందసి' - ఇత్యాదౌ
> యద్యపి తేషా మేవ గ్రహణం ప్రసిద్ధమ్।తథాపీహ తేషాం
> గ్రహణం న భవతి। కుతః ఇత్యాహ-నామగ్రహణాదితి'
> —పదమంజరీ.

"ఛందః శబ్దోఽయ మస్త్యేవ మంత్రబ్రాహ్మణే। అస్త్యన్య
దక్షరాణా మియత్తావిశిష్టవృత్తే యస్య గాయత్ర్యాదయో
విశేషాః। తదిహ కతర స్తదర్థో గృహ్యతే....యద్యత్ర
మంత్రబ్రాహ్మణ మిష్టం స్యాత్ నామగ్రహణం న
కుర్యాత్, ఛందసీత్యేవ బ్రూయాత్। ఏవ మపి హ్యుచ్య
మానే మంత్రబ్రాహ్మణగ్రహణం లభ్యత ఏవ, యథా
'బహులం ఛందసి' ఇత్యాదౌ వాక్యే। తస్మా న్నామ
గ్రహణా ద్వృత్త మిహ చ్ఛందో గృహ్యతే" —న్యాసః.

ఛందఃశబ్దమునకు రెండర్థములు గలవు. 1. మంత్రబ్రాహ్మణాత్మక వేదరాశి, 2. అక్షరసంఖ్యానియమము గల గాయత్ర్యాది వృత్తములు. పై సూత్రమునందలి ఛందఃశబ్దముచే నే యర్థమును గ్రహించుట యుక్తము? బహులం ఛందసి ఇత్యాది సూత్రములందు ఛందఃపదముచే మంత్రబ్రాహ్మణాత్మక వేదభాగము గ్రహింపబడుచునే యున్నది. ఇచట గూడ మంత్రబ్రాహ్మణములనే గ్రహించుట యభిమత మైనచో మిగిలిన సూత్రములయందు వలెనే 'ఛందసి' యని నిర్దేశించిన జాలును. 'నామ్ని' యని యధికముగ నామపదనిర్దేశ మెందుకు? నామపదగ్రహణముచే నిట వృత్తమునే గ్రహింపవలెను; మంత్రబ్రాహ్మణముల గాదు - అని యర్థము. దీని ననుసరించి నామనిర్దేశము లేకుండ నష్టాధ్యాయి యందు ఛందఃపద మెచట నిర్దేశింపబడినను నది మంత్రబ్రాహ్మణాత్మక వేదభాగవాచక మగుట పాణిన్యాదిసంమత మని తెలియును.

న్యాయదర్శనము - ప్రసిద్ధి :-

"తదప్రామాణ్య మనృతవ్యాఘాత పునరుక్తదోషేభ్యః"

— న్యాయదర్శనమ్. 2-1-57.

ఇది వేదములు ప్రమాణములు గావని శంకించెడి పూర్వపక్షసూత్రము. 'అనృతవ్యాఘాత (పరస్పరవిరోధ) - పునరుక్తిదోషములతో నిండి యుండుటచే వేదము (తత్) ప్రమాణము గాదు' - అని యిట్లు పూర్వపక్షము చేసి, వానికి తగిన సమాధానములు తరువాతి సూత్రములలో జెప్పబడినవి. వాని తర్వాత గల యీ క్రింది సూత్రముల జాతము.

'వాక్యవిభాగస్య చార్థగ్రహణాత్' — న్యా. సూ. 2-1-61.

'విధ్యర్థవాదానువచన వినియోగాత్' — న్యా. సూ. 2-1-62.

'విధి ర్విధాయకః' — న్యా. సూ. 2-1-63.

"ప్రమాణం శబ్దో యథా లోకే। త్రిధా ఖలు బ్రాహ్మణ వాక్యాని వినియుక్తాని। విధివచనాని, అర్థవాదవచనాని, అనువాదవచనానీతి। యద్వాక్యం విధాయకం చోదకం స విధిః। విధిస్తు నియోగోఽనుజ్ఞా వా। యథా-అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామ ఇత్యాది........"

— వాత్స్యాయనభాష్యమ్.

లోకమున ప్రత్యక్షానుమానముల వలె శబ్దము గూడ ప్రమాణము. వేదము ఆప్తవాక్యరూపము. కాన ప్రమాణము. అట్టి వేదరూపబ్రాహ్మణవాక్యములు మూడు విధములు. 1. విధివాక్యములు. 2. అర్థవాదవాక్యములు. 3. అనువాదవాక్యములు. విధాయకవాక్యములకు చోదకము లని పేరు. విధి యన నియోగము, లేక యనుజ్ఞ. ఉదా :- అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామః - మొదలగునవి - అని యర్థము.

ఇట మొదట 'తదప్రామాణ్యం' అను సూత్రమున 'తత్'శబ్దముచే వేదమును బరామర్శించి, ఆ వేదమునకు అప్రామాణ్యశంక జేయబడినది. పిదప అప్రామాణ్యశంకానిరాసకములైన సిద్ధాంతసూత్రముల జెప్పు ప్రకరణమున నీ సూత్రములు పఠింపబడినవి. వేదము ప్రమాణ మని

పేర్కొని, వేదవాక్యములుగా బ్రాహ్మణవాక్య విభాగమిట జెప్పబడినది. కాన మొదట 'తత్'శబ్దముచేత మంత్రబ్రాహ్మణాత్మక వేదరాశినే గౌతమ మహర్షి పరామర్శించె ననుట స్పష్టము. ఈ విషయమును పై సూత్రవృత్తి యందు విశ్వనాథపంచాననుడు నిట్లు వివరించినాడు.

"మంత్రబ్రాహ్మణభేదాత్ ద్వివిధో వేదః। తత్ర బ్రాహ్మణ
స్యాఽయం విభాగః, —విధివచనత్వేన, అర్థవాదవచనత్వేన,
అనువాదవచనత్వేన చ వేదస్య వినియోగాత్ విభజనాత్"
—న్యా- సూ. వృత్తి.

కాన న్యాయదర్శనకారుల ననుసరింది వేదము మంత్రబ్రాహ్మణాత్మక మగుట స్పష్టము.

వైశేషికప్రదర్శనము-ప్రసిద్ధి :-

"బుద్ధిపూర్వా వాక్యకృతి ర్వేదే" —వై. శే. సూ. 6-1-1.

"వేదవాక్యాని బుద్ధిమత్కర్తృకాని, ప్రమాణవాక్యత్వాత్,
లౌకిక ప్రమాణవాక్యవత్" "వేదః ప్రమాణం మహాజన
పరిగృహీతత్వాత్" —రసాయనవ్యాఖ్య.

మహాజనులు (శిష్టజనులు) ఆదరించుట జేసి వేదము ప్రమాణము. ఆప్త వాక్యములు — వివేకవంతులగు పురుషులచే లోకహితము గోరి యుచ్చరింప బడిన వాక్యములు — ప్రమాణములు. అట్లే ప్రమాణభూతములగు నీ వేద వాక్యములు గూడ నొక సర్వజ్ఞునిచే లోకహితమునకై యుచ్చరింపబడి యుండవలెను. దృష్టాదృష్టవిషయముల నెఱుగజాలిన సర్వజ్ఞుడు ఈశ్వ రుడే యగును గాని అస్మదాదులు కాజాలరు. కాన దృష్టాదృష్టవిషయముల నెక్కింటిని బ్రతిపాదించెడి వేదము ఈశ్వరప్రోక్త మని యవశ్య మంగీక రింపవలెను — అని పై సూత్ర తాత్పర్యము. ఇట్లు వేదవాక్యమే కాదు,

వేదమునందలి ప్రతి యొక పదము యథార్థజ్ఞానసాధక మగునని తరువాతి సూత్రమున వివరింపబడినది.

"బ్రాహ్మణే సంజ్ఞాకర్మ సిద్ధిలింగమ్" 6-1.2

"బ్రాహ్మణే మంత్రబ్రాహ్మణాత్మక భాగద్వయరూప వేదగత బ్రాహ్మణభాగే, సంజ్ఞాకర్మ కర్మణాం కర్మారాధ్య దేవతానాం చ నామకరణం సిద్ధౌ బుద్ధౌ లింగ మితి"

— రసాయన వ్యాఖ్య.

ఇట్టి యాకారము గలది గోవు; ఇట్టి ఫలమును సాధించెడి క్రియ పాకక్రియ: ఈ ప్రదేశవిశేషమున కిది నామము - అని యా యా గవాది వ్యక్తుల యొక్కయు, కర్మల యొక్కయు, ప్రదేశవిశేషముల యొక్కయు స్వరూప, స్వభావ, రహస్యముల సాంగోపాంగముగ నెఱిగినవారిచే మొదట వానివానికి అన్వర్థనామకరణము చేయబడి యుండవలెను. మంత్ర బ్రాహ్మణాత్మకమైన వేదములో నేకదేశమగు బ్రాహ్మణభాగమున బెక్కు కర్మలయొక్కయు, నా యా కర్మలచే నారాధనీయులగు నగ్ని-, వాయు-, ఇంద్రాది దేవతలయొక్కయు నామములు గన్పట్టుచున్నవి. అట్లే 'ఉద్భిదా యజేత; జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత'- అని యీ రీతిగ ఉద్భిద్-జ్యోతిష్టోమాది కర్మనామధేయములును గలవు. భూః-భువః-సువః- ఇత్యాది వివిధ లోకనామములు, తద్విశేషములును వేదమున వర్ణింపబడినవి. మఱియు కర్మాచరణ విషయమున నొక నియమము గూడ నిట్లు గలదు.

"తత్తచ్ఛబ్దసంకీర్తన పురఃసరం కృత మేవ కర్మ ఫలతి,
న తు పర్యాయశబ్దాంతర ప్రయోగే" —రసాయనవ్యాఖ్య.

వేదోపదిష్టములయిన శబ్దముల నుచ్చరించుచు జేసిననే వేదవిహితకర్మ ఫలవంత మగును. అట్లుగాక పర్యాయశబ్దముల నుచ్చరించి చేసినచో నా

కర్మ నిష్ఫల మగు నని యర్థము. ఈ నియమము వలన-ఆ యా కర్మల యొక్కయు దేవతలయొక్కయు స్వర్గాదులయొక్కయు నామములు అర్థవంతములు. అవియే వాని వాని స్వరూపస్వభావాదుల దెలిజేయజాలినవి. కాన అపూర్వశక్తిమంతములు. పర్యాయశబ్దము లట్టివి కావు - అని తెలియును. కాన వాని స్వరూపస్వభావాదుల రహస్యమును సమగ్రముగ నెఱిగిన మేధావి యొకడు వానికి నా యా నామధేయముల గూర్చి యుండ వలెను. యజ్ఞాదులు, దేవతలు, స్వర్గాదులు, ధర్మాధర్మములు-వీనియొక్క తత్త్వము నెఱిగిన మేధావి పరమేశ్వరుడే యగునుగాని యల్పబుద్ధులగు మానవులు గారు-అని పై సూత్ర తాత్పర్యము. ఈ రెండు సూత్ర తాత్పర్యముల బరిశీలించినచో మంత్రభాగము వలెనే బ్రాహ్మణ భాగము గూడ ఈశ్వరప్రోక్త మగు వేదమే-యని వైశేషిక దర్శనప్రవర్తకు డయిన కణాదమహర్షి యభిప్రాయ మగుట స్పష్టము.

ఉత్తరమీమాంసా దర్శనము - ప్రసిద్ధి :—

వేదము మంత్రబ్రాహ్మణాత్మక సముదాయ మను దృష్టితోనే బాదరాయణ మహర్షిచే ఉత్తరమీమాంసాదర్శనము ప్రవర్తితమైనది. 'శాస్త్రయోనిత్వాత్' ఇత్యాది సూత్రములు నా దృష్టితోనే ప్రవర్తిల్లిన వనుట స్పష్టము. భాష్యకర్తలగు శ్రీ శంకర-రామానుజాదులు గీతా-సూత్ర-ఉపనిషత్ప్రస్థానముల యందు నీ విషయమును బెక్కుచోట్ల వివరించినారు. బ్రాహ్మణ వాక్యములను గూడ ప్రమాణభూత శ్రుతివాక్యములుగ నడు గడుగున నుదహరించినారు. శ్రుతి యవతరణమును గూర్చి బృహదారణ్యక శ్రుతియు నిట్లు చెప్పుచున్నది.

"స యథాఽఽర్ద్రైధాగ్నే రభ్యాహితాత్ పృథగ్ధూమా వినిశ్చ రన్త్యేవం వా అరేఽస్య మహతో భూతస్య నిశ్శ్వసిత

మేత ద్యదృగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వాంగిరస
ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రా
ణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానా న్యస్యైవైతాని విశ్వసితాని" –2-4-10.

తడిసిన కట్టెలతో మండెడి యగ్నినుండి నానా ప్రకారములుగ విస్ఫులింగ
ములు, పొగలు పైకి లేచునట్లు (ఆవిర్భవించునట్లు) ఓ మైత్రేయీ !
ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము, ఇతిహాసము
(ఊర్వశీ పురూరవ స్సంవాదాది రూపమగు బ్రాహ్మణము), పురాణము
(అసద్వా ఇదమగ్ర ఆసీత్–ఇత్యాది సృష్టిపర్యాలోచనారూపమగు బ్రాహ్మ
ణము); విద్య (దేవజనవిద్య–నృత్యగీతాది శాస్త్రరూపమగు బ్రాహ్మణము)
ఉపనిషత్తులు, శ్లోకములు (బ్రాహ్మణప్రభవా మంత్రాః), సూత్రములు
(ఆత్మేత్యేవోపాసీత – ఇత్యాది వస్తుసంగ్రహవాక్యములు), అనువ్యాఖ్యా
నములు (మంత్రవివరణములు – లేక వస్తుసంగ్రహవాక్య వివరణములు),
వ్యాఖ్యానములు (అర్థవాదములు లేక మంత్రవివరణములు) – అను ఏ
రూపముగ వేదములు పరమాత్మనుండి నిశ్శ్వాసముల వలె విప్రయత్నముగ
నావిర్భవించినవి –అని యర్థము.

శ్రీ శంకరభగవత్పాదులు పై శ్రుత్యర్థము నిట్లే వివరించిరి.
ఇంతియే కాదు. వేదప్రామాణ్యము నిట్లు వివరించిరి.

"ఏవం అష్టవిధం బ్రాహ్మణమ్। ఏవం మంత్రబ్రాహ్మణ
యోరేవ గ్రహణమ్। నియతరచనావతో విద్యమానస్యైవ
వేదస్యాభివ్యక్తిః, పురుషనిశ్శ్వాసవత్; న చ పురుషబుద్ధి
ప్రయత్న పూర్వకః। అత్ర ప్రమాణం నిరపేక్ష ఏవస్వార్థే।
తస్మా ద్యత్తేనోక్తం త త్తథైవ ప్రతిపత్తవ్యమాత్మనః।
శ్రేయ ఇచ్ఛద్భిః జ్ఞానం వా కర్మ వేతి।" –శం భా

పైన (శ్రుతియందు) జెప్పినట్లుగా బ్రాహ్మణము అష్టవిధము, ఇట నిఃశ్వాసములవలె పరమేశ్వరుని నుండి మంత్రబ్రాహ్మణములు రెండును అభివ్యక్తము లయినవని గ్రహింపవలెను. ఉన్న నిఃశ్వాసములే శరీరము నుండి యభివ్యక్తము లగును. అట్లే నియతవాక్యరచనాస్వరూపము గలిగి నిరంతరము విలసిల్లుచుండు వేదమే యప్రయత్నముగ పరమేశ్వరుని నుండి యభివ్యక్తమయినది. కాన నీ వేదము పురుషబుద్ధి ప్రయత్నపూర్వకము గాదు. పురుషబుద్ధిదోషరహితమై యన్యనిరపేక్షముగ స్వతంత్రమై ప్రమాణ మగును. ప్రమాణభూత మగుటచే శ్రేయస్కాము లగువారు వేదోపదిష్టమగు ధర్మములగాని, జ్ఞానమునుగాని యథాతథముగనే గ్రహించుట యుక్తము — అని యర్థము.

పై శ్రుతివాక్యములను, తద్వివరణరూపము లగు శ్రీ శంకరుల వచనములను బరిశీలించినచో, (1) వేదములు మంత్రబ్రాహ్మణాత్మకములు (2) అవి పరమేశ్వర నిఃశ్వాసరూపములు; (3) పురుషబుద్ధికల్పితములు కావు: కావున స్వతఃప్రమాణములు — అని స్పష్ట మగును. ఇంతేగాదు. వేదము మంత్రరూపమున నావిర్భవించుటయే గాక యామంత్రమునందు నిగూఢములైన వివిధార్థముల నుద్దీపింపజేయుటకై పురాణేతిహాసవిద్యాది రూపములతో నొప్పెడి యష్టవిధ బ్రాహ్మణరూపమునను నావిర్భవించిన దనియు దెలియును. కాగా 'మంత్రవ్యాఖ్యానరూపము లగుటచే బ్రాహ్మణములు మంత్రము లావిర్భవించినతర్వాత నెవరిచేతనో రచింపబడియుండు' ననెడి వాదమునకు తావు లేదు. కాని యిట నొక యాక్షేపము.

ఆక్షేపము :-

"తదేత త్సత్యం మంత్రేషు కర్మాణి కవయో యా న్యపశ్యన్ ।
తాని త్రేతాయాం బహుధా సంతతాని" — ముండక. ఉ. 1-2-1.

'తదేతత్ సత్యం అవితథమ్। కిం తత్? మన్త్రేషు ఋగ్వేదాద్యాఖ్యేషు, కర్మాణి అగ్నిహోత్రాదీని, మన్త్రైరేవ ప్రకాశితాని, కవయః మేధావినో వసిష్ఠాదయః, యాని అపశ్యన్ దృష్టవన్తః, యత్తదేతత్ సత్యం ఏకాన్తపురుషార్థసాధనత్వాత్। తాని చ వేదవిహితాని ఋషిదృష్టాని కర్మాణి, త్రేతాయాం త్రయీసంయోగలక్షణాయాం హౌత్రాధ్వర్యవౌద్గాత్రప్రకారాయాం అధికరణభూతాయాం, బహుధా బహుప్రకారం, సంతతాని సంప్రవృత్తాని, కర్మిభిః క్రియమాణాని త్రేతాయాం వా యుగే ప్రాయశః ప్రవృత్తాని"

— శం. భా.

'ఋగ్యజుఃసామరూపమంత్రములచే ప్రకాశితము లయిన యగ్నిహోత్రాది కర్మలను మేధావులగు వసిష్ఠాది కవులు (ఋషులు) దర్శించిరి: అవి పురుషార్థసాధకము లగుటచే సత్యములు; వేదవిహితములు ఋషిదృష్టములు నగు నా కర్మలు హౌత్రము, ఆధ్వర్యవము, ఔద్గాత్రము నాధారముజేసికొని బహుప్రకారములుగ ప్రవృత్తము లయినవి; లేక యా కర్మలు త్రేతాయుగమున ప్రచురములు' - అని యర్థము.

పై శ్రుతిని, శంకరభాష్యమును బరిశీలించినచో నీ ప్రశ్న యుదయింపవచ్చును. వేదములు మొదట మంత్రరూపమున నావిర్భవించినవి. పిదప వేదపారగులైన వసిష్ఠాదిమహర్షులా మంత్రములయందు గల కర్మల దర్శించి తద్వ్యాఖ్యానరూపమున బ్రాహ్మణభాగముల రచించిరి. కాన బ్రాహ్మణములు పౌరుషేయము లన దగును గదా।

సమాధానము :-

ఈ యాక్షేపము సరియైనది కాదు. బ్రాహ్మణములు వసిష్ఠాది ఋషిరచితము లనుచో నవియు వసిష్ఠాది ఋషిరచిత స్మృతుల వలె

పౌరుషేయములై స్మృతు లనియే వ్యవహరింపబడి యుండెడివి. అట్టియెడ నవి వేదములు కాకపోవలసి వచ్చెడిది. మఱియు బ్రాహ్మణభాగమున విహితములైన కర్మలు స్మృత్యుక్త కర్మల వలె వేదమూలములు గావచ్చును గాని వేదవిహితములు కాకపోవలసి వచ్చును. అట్లు చెప్పుచో 'వేదవిహితాని ఋషిదృష్టాని కర్మాణి' 'ఋషిదృష్టములగు వేదవిహిత కర్మలు)' - అను పై శంకరభగవత్పాద వాక్యముతో విరోధము సంభవించును. కాన బ్రాహ్మణభాగమందు విహితములగు కర్మలు వేదవిహితములగుట శ్రీ శంకరభగవత్పాద సంమతము. బ్రాహ్మణభాగము కూడ మంత్రభాగము వలెనే వేదమయి ఋషిదృష్టమైనపుడే బ్రాహ్మణవిహిత కర్మలు వేదవిహితకర్మ లగును. అట్లు బ్రాహ్మణభాగమును వేద మని యంగీకరించుచో నది వసిష్ఠాది రచిత మనుట పొసగదు. కాన మంత్రభాగము వలెనే బ్రాహ్మణభాగము కూడ మంత్రద్రష్టలగు కవులచే దర్శింపబడిన దనుట యుక్తము. అట్లు చెప్పునపుడే శ్రుతియందలి 'అపశ్యన్'అను క్రియయు సార్థక మగును. (అపశ్యన్ - అనగా దర్శించి రనియేగదా యర్థము.) ఇంతియే కాక మంత్రములతోపాటు బ్రాహ్మణములు కూడ పరమేశ్వరుని నుండి నిఃశ్వాసముల వలె నప్రయత్నముగ నభివ్యక్తమైన వనెడి పై బృహదారణ్యకశ్రుతితో సంవాదము గూడ లభించును. ఈ విషయమును ఛాందోగ్యమున గూడ శ్రీ శంకరు లిట్లు వివరించిరి.

"నామ్ని మంత్రా ఏకం భవంతి, మంత్రేషు కర్మాణి"

— ఛాం.ఉ. 7-4-1.

"మంత్రేషు కర్మాణ్యేకం భవంతి। మంత్రప్రకాశితాని కర్మాణి క్రియంతే, నామంత్రక మస్తి కర్మ। యద్ధి మంత్రప్రకాశనేన లబ్ధసత్తాకం సత్ కర్మ బ్రాహ్మణేనేదం కర్తవ్య మస్మై ఫలాయేతి విధీయతే। యాఽప్యుత్పత్తిః బ్రాహ్మణేషు కర్మణాం

దృశ్యతే, సాఽపి మంత్రేషు లబ్ధసత్తాకానామేవ కర్మణాం స్పష్టీకరణమ్। న హి మంత్రాప్రకాశితం కర్మ కించిత్ బ్రాహ్మణ ఉత్పన్నం దృశ్యతే। త్రయీవిహితం కర్మేతి ప్రసిద్ధం లోకే। త్రయీ శబ్దశ్చ ఋగ్యజుఃసామ సమాఖ్యా। 'మంత్రేషు కర్మాణి కవయో యాన్యపశ్యన్' – ఇతి చాఽఽథర్వణే। తస్మాద్ యుక్తం మంత్రేషు కర్మాణ్యేకం భవన్తీతి।" – శం. భా.

కర్మల ప్రకాశింపజేయునవి మంత్రములు. మంత్రప్రకాశిత కర్మలనే 'ఆ యా ఫలము నుద్దేశించి యా యా కర్మను జేయునది' – యని బ్రాహ్మణము విధించుచున్నది. అనగా మంత్రప్రకాశితమైన యర్థమును బ్రాహ్మణము వివరించుచున్నది. కాన మంత్రప్రకాశితములుగాని కర్మలను బ్రాహ్మణము స్వతంత్రముగా స్వోపజ్ఞముగా విధించుటలేదు, ఇట్లు చెప్పుటచే 'కర్మలు త్రయీవిహితములు' – అనెడి లోకప్రసిద్ధియు నుపపన్న మగును. 'మంత్రేషు కర్మాణి కవయో యాన్యపశ్యన్' – అను ఆథర్వణ శ్రుతియు నిందుకు ప్రమాణము. కాన కర్మలు మంత్రములం దేకీభవించుననుట యుక్తమే – యని యర్థము. ఆనందగిరియు పై శాంకరభాష్యము నిట్లు వివరించినాడు.

"బ్రాహ్మణస్య మంత్రవ్యాఖ్యాన రూపత్వాత్ అతిస్పష్ట
మంత్రానుపలంభేఽపి కల్ప్యతే మంత్రోక్తత్వ మితి"

'బ్రాహ్మణము మంత్రవ్యాఖ్యానరూపము' కావున బ్రాహ్మణోక్త కర్మలను ప్రకాశింపజేసెడి మంత్రములు కొన్నియెడల స్పష్టముగ (ప్రస్తుతము) లభింపకపోయినను ఆ కర్మలకును మంత్రోక్తత్వము కలదనియే గ్రహింపవలెను– అని యర్థము. పై విషయముల బరిశీలించుచో వేదమే మంత్రరూపమునను తన్నిగూఢ కర్మప్రకాశక బ్రాహ్మణ భాగ రూపమునను నావిర్భవించినదని తెలియును. అగుచో

మంత్రములందు కర్మలను మొదట దర్శించిన కవులు బ్రాహ్మణములే యని యనదగును. పిదప నా మంత్రబ్రాహ్మణాత్మక వేదరాశియందు వసిష్ఠాది ఋషులు మహాతపఃసమాధిలో కర్మలను దర్శించిరి. అనగా మంత్ర బ్రాహ్మణాత్మకమైన వేదరాశిని దర్శించి తద్విహిత కర్మల బ్రవర్తింప జేసిరని తెలియవలెను. కాన 'మంత్రేషు కర్మాణి కవయో యా న్యపశ్యన్' ఇత్యాది స్థలములయందు 'కవులు దర్శించిరి' _ అను నర్థమే సరసము; శ్రుతిభాష్యాదిసంమతము నగును గాని 'రచించిరి'_అని కాదు. అందుచే వశిష్ఠాది కవులు బ్రాహ్మణముల రచించి రని చెప్పెడి వాదమునకు తావే లేదు. బ్రాహ్మణశేషములే యారణ్యకములు, ఉపనిషత్తులును. కాన నివియు బ్రాహ్మణములే. ఇట్లు బ్రాహ్మణరూపములైన బ్రాహ్మణారణ్యకోపనిషత్తులను గూడ అపౌరుషేయము లనియు, స్వతఃప్రమాణము లనియును సూత్రకర్త యగు బాదరాయణమహర్షియు, మతత్రయ భాష్యకర్తలును శ్రుత్యనుగుణముగ గీర్తించియున్నారు.

ఇంతే కాదు. సంహితాభాగముకంటె భిన్నమైన వేదభాగమునకు బ్రాహ్మణ మని సామాన్యముగ బ్రసిద్ధి. అయినను దానిననుసరించి 'బ్రాహ్మణ మనగా సంహితాభాగము కంటె భిన్నమైనది' _ యని లక్షణము చెప్పుట సరికాదు; కొన్నియెడల తైత్తిరీయాది సంహిత యందే బ్రాహ్మణ భాగ ముండుటయు, బ్రాహ్మణ భాగ మని ప్రసిద్ధి గలిగిన వేదభాగము గూడ మంత్రబ్రాహ్మణాత్మక మగుటయు నిందుకు గారణము _అవి సోదాహరణముగ సోపపత్తికముగ బ్రహ్మశబ్దమున వివరింపబడినది. ఉత్తర మీమాంసా దర్శనకారుల యభిప్రాయము నిదియే.

"బ్రహ్మవిదాప్నోతి పరమ్। తదేషాభ్యుక్తా। సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయామ్ పరమే వ్యోమన్।.... అన్యోఽన్తర ఆత్మాఽఽనందమయః" _ఇత్యాది

_తై. ఉ. 2.

"మాంత్రవర్ణిక మేవ చ గీయతే" —బ్ర. సూ. 1-1-15.

"ఇత శ్చానందమయః పర ఏవాత్మా, 'యస్మాత్' బ్రహ్మ విదాప్నోతి పర మిత్యుపక్రమ్య 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' – ఇత్యస్మిన్ మంత్రే యత్ ప్రకృతం బ్రహ్మ సత్యజ్ఞానానంతవిశేషణై ర్నిర్ధారితం,....యస్య విజ్ఞానాయ 'అన్యోఽంతర ఆత్మాఽన్యోఽంతర ఆత్మా ఇతి ప్రక్రాంతం, తన్మాంత్రివర్ణిక మేవ బ్రహ్మేహగీయతే' అన్యోఽంతర ఆత్మాఽనందమయ ఇతి। మంత్ర బ్రాహ్మణయో శ్చైకార్థత్వం యుక్తమ్, అవిరోధాత్। అన్యథా హి ప్రకృతహానాప్రకృతప్రక్రియే స్యాతామ్। న చాన్నమయాదిభ్య ఇవానందమయా దన్యోఽంతర ఆత్మాఽభిధీయతే। ఏతన్నిష్ఠైవ చ సైషా భార్గవీ వారుణీ విద్యా (తై. 3-6)" —శం. భా.

'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ'—యనునది తైత్తిరీయోపనిషద్భాగ మగు ఆనందవల్లి యందలి మంత్రవర్ణము. మిగిలిన యుపనిషత్తంతయు ఏత న్మంత్రవ్యాఖ్యానరూప మగు బ్రాహ్మణ మని సంప్రదాయము. బ్రహ్మ సూత్రములలో ఆనందమయాధికరణమున గల 'మాంత్రవర్ణిక మేవచ గీయతే'— యను సూత్రమును వ్యాఖ్యానించుచు శ్రీ శంకరు లీ విషయము నిట్లుస్పష్టము చేసిరి. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ — యనునది మంత్ర వర్ణము; అన్యోఽంతర ఆత్మా ఆనందమయః — ఇత్యాది వాక్యము లన్నియు తద్వ్యాఖ్యారూప మగు బ్రాహ్మణము: మంత్రబ్రాహ్మణములు భిన్నార్థముల బ్రతిపాదింపవు; అవి ఏకార్థబోధకము లగుట యుక్తము: అట్లు కానిచో 'ప్రకృతహాన—అప్రకృతబోధకత్వ' మను దోషములు సంభ వించును; కాన 'సత్యం జ్ఞాన మనంతంబ్రహ్మ'—యనూ యను మంత్రముచే

నే ముఖ్యబ్రహ్మ బోధింపబడుచున్నదో తద్వ్యాఖ్యానరూపమగు 'అన్యోఽంతర ఆత్మా ఆనందమయః'- అను బ్రాహ్మణముచే గూడ నా బ్రహ్మయే బోధింపబడుచున్న దనుట యుక్తము. కాన నిట నానందమయుడు పరమాత్మయే గాని సంసారి యగు జీవుడు కాడు"-అని యర్థము.

భగవద్రామానుజులు నీ సూత్రమున నీ విషయము నిట్లు వివరించిరి.

"బ్రాహ్మణోక్తస్యార్థస్య వైశద్య మనేన మంత్రేణ
క్రియత ఇత్యర్థః" —శ్రీభాష్య.

బ్రాహ్మణభాగమగు నీ యుపనిషత్తుచే జెప్పబడిన యర్థమును విశదీకరించుట కయియే "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"-యను మంత్రవర్ణ మిట నుదహరింపబడినది _ అని యర్థము. పై రామానుజవాక్యమును శ్రుతప్రకాశికావ్యాఖ్యానమున శ్రీ సుదర్శనభట్టారకాచార్యు లిట్లు వివరించిరి.

"శ్రుతిషు మంత్రాణాం ప్రాబల్యం కేచి ద్వదంతి । తద్వ్యుదాసార్థ మాహ బ్రాహ్మణోక్తస్యేతి । బ్రాహ్మణోక్తార్థ విశదీకరణరూపో మంత్ర ఇతి ప్రయోజకమ్ । సంగ్రహేణోక్తస్య విస్తరేణ కథనం, విస్తృతస్య ప్రతిపత్తిసౌకర్యాయ సంగ్రహేణ కథన మపి వైశద్యావహమ్। నిత్యనిర్దోషత్వావిశేషా న్మంత్రబ్రాహ్మణయోః ప్రాబల్యదౌర్బల్యవిభాగోఽనుపపన్న ఇతి భావః ।",

శ్రుతులయందు బ్రాహ్మణముల కంటె మంత్రములు ప్రబలములు - అనెడి వాద మిట నిరసింపబడుచున్నది, మంత్రప్రకాశితార్థమును బ్రాహ్మణము విశదీకరించునట్లే, బ్రాహ్మణోక్తార్థమును మంత్రము విశదీకరించుచుండును. విశదీకరణ మనగా సంగ్రహముగా చెప్పినదానిని విస్తరించి చెప్పుటయే కాదు; జ్ఞాతృసౌకర్యము కొఱకై విస్తృతార్థమును సంగ్రహించి

చెప్పుటయు విశదీకరణమే యగును. నిత్యత్వము, నిర్దోషిత్వము - అను లక్షణములు మంత్రబ్రాహ్మణముల రెండిటియందును సమానము. కాన వీని విషయమై ప్రాబల్య దౌర్బల్య విచార మనుపపన్నము - అని యర్థము. ఇట్టి వైశద్యము కొఱకయియే పురాణేతిహాసాది రూపమున స్పష్టవిధముగ బ్రాహ్మణ మవతరించినది. కొన్నియెడల శ్రుతి శిష్యరూపమున ప్రశ్నించి తానే యాచార్యరూపమున సమాధానము చెప్పుచుండును.

"శిష్యభూతయా శ్రుత్యా చోదితే సైవాఽఽచార్యరూపా పరిహరతి వాగేవేతి" — ఆనందగిరి. ఛాం. ఉ. 1.1.5.

పై శంకరరామానుజాది భాష్యముల తాత్పర్యమును పరికించినచో ఉపనిషత్తు స్థూలముగ బ్రాహ్మణభాగ మయ్యును మరల నది మంత్రబ్రాహ్మణాత్మకరూపమున విలసిల్లుచుండు నని తెలియును. ఇట్టి యుదాహరణముల నెన్నియేని జూపనగును. ఇట్లు బ్రాహ్మణాత్మకమైన వేదరాశి గూడ మంత్రబ్రాహ్మణాత్మక మగుటచే సంహితాభాగము కంటె భిన్నమైన భాగము బ్రాహ్మణ మని చెప్పుటగాని, అది బ్రాహ్మణప్రోక్త మని యనుటగాని, అందుచే బ్రాహ్మణ మని ప్రసిద్ధమైనదని యనుటగాని, అందుచేతనే పౌరుషేయ మని చెప్పుటగాని యుక్తము గాదు. కనుక ఉత్తర మీమాంసాదర్శనము ననుసరించియు మంత్రములతోపాటు బ్రాహ్మణములకు గూడ ఛందస్త్వము (వేదత్వము) సిద్ధమై యున్నదనుట స్పష్టము. ఇక వేదాంగములలో నొకటి యగు నిరుక్తశాస్త్రమును జూతము.

నిరుక్తము-ప్రసిద్ధి :-

మంత్రవాక్యార్థనిర్ణయమునకై నిరుక్తశాస్త్రము ప్రవృత్తమైనది. అందు - "మంత్రములు అనర్థకములు; తద్వాక్యార్థనిర్ణయమునకై నిరుక్త

శాస్త్రారంభము వ్యర్థము" - అనెడి కౌత్సుని వాద ముదహరింపబడినది. కౌత్సుని వాద మిది:

"(1) లోకవ్యవహారము అర్థవంతమైన వాక్యములతో జరుగు చున్నది; ఆ వాక్యములలో నియతమైన యానుపూర్వి లేదు; ఉండవలసిన నియమము గూడ లేదు; పాత్రం ఆహర; ఆహర పాత్రం (పాత్రను తెమ్ము; లేక తెమ్ము పాత్రను) - అని యీ రీతిగ వాక్యములందలి పద రచన వక్తృవివక్షాధీనమై యనియతముగ నుండవచ్చును; మంత్రము లందట్లు గాదు; ఉదా :- 'అగ్న ఆయాహి....' - ఇది యొక మంత్రము; ఇందలి పదరచనను వక్తృవివక్షాధీనముగ 'ఆయా హ్యగ్నే' - అని యీ రీతిగ మార్చిగాని, లేక పర్యాయపదముల నుపయోగించి 'వహ్నే ఆయాహి; ఆయాహి వహ్నే' - అని యీ రీతిగగాని యుచ్చరించుటకు వలనుపడదు. మంత్రము లర్థవంతములే యగుచో లోకవ్యవహారము నందలి వాక్యముల వలె నివియు ననియతపదరచన గలిగి, వక్తృవివక్షాధీనముగ నుచ్చరించుటకు యుక్తములై యుండవలెను. అవి యట్టివి కావుగదా! కాన మంత్రము లనర్థకములు (యది మంత్రార్థప్రత్యయాయ అనర్థకం భవతీతి కౌత్సః। అనర్థకా హి మంత్రాః। తదేతేనోపేక్షితవ్యమ్। నియతవాచో యుక్తయో నియతానుపూర్వ్యా భవన్తి - నిరు). (2) నియతపదరచన గలిగియున్నను బ్రాహ్మణవాక్యములే యర్థవంతములు గాని మంత్రములు గావు; బ్రాహ్మణవాక్యము లా యా కర్మల విధించుచు, నా యా కర్మలలో నా యా దేవతాలింగములుగల మంత్రముల వినియోగమును విధించుచున్నవి. అర్థమున్నను లేకపోయినను బ్రాహ్మణవాక్యప్రామాణ్యముచే నా యా సమయముల యందు నా యా మంత్రముల వినియోగపరచుటయే కర్తవ్యము; మంత్రములకు వినియోగమును విధించునవి యగుటజేసి బ్రాహ్మణము లర్థవంతములు. అర్థనిరపేక్షముగ వినియోక్తవ్యము లగుటజేసి మంత్ర ములు నిరర్థకములు (అథాపి బ్రాహ్మణేన రూపసంపన్నా విధీయన్తే-నిరు)."

ఇట్లు మంత్రములు నిరర్థకము లని యనుటకు కౌత్సుని వాదము ననుసరించి మఱికొన్ని హేతువులు గూడ నిరుక్తమున యాస్కునిచే జూపబడినవి (అథా ప్యనుపపన్నార్థా భవంతి । అథాపి విప్రతిషిద్ధార్థా భవంతి। ....ఇత్యాది). ఈ కౌత్సుని వాదమును యాస్కు డిట్లు ఖండించి నాడు.

'అర్థవన్తః శబ్దసామాన్యాత్' — నిరు. 1-16.

లోకమున శబ్దము లర్థవంతములు. మంత్రములును శబ్దరూపములే యగుట జేసి యవి యర్థవంతము లని యంగీకరింపవలెను. అందు గొన్ని శబ్దము లకు లోకప్రసిద్ధి లేనందువలన వాని నుచ్చరించినంతనే యర్థస్ఫూర్తి కలుగకపోవచ్చును. ప్రౌఢమహాకవిప్రయోగములు అవిద్వాంసులకు వెంటనే యర్థస్ఫూర్తిని గలిగింపనంతమాత్రమున నవి యర్థరహితము లగునా? అంధునకు వస్తుదర్శనము లేనంతమాత్రమున నది వస్తుదోష మగునా? పురుషదోషమే యగును (నైష స్థాణో రపరాధో యదేన మంధో న పశ్యతి। పురుషాపరాధః స భవతి). కాన నర్థస్ఫూర్తి వెంటనే కలుగకపోవుట పురుషదోషమే యగును కాని శబ్దదోషము కాదు. కోశాది సాహాయ్యమునను, గుర్వనుగ్రహాదులచేతను నా శబ్దము లర్థవంతములుగ భాసిల్లుచున్నవి. అట్లే బ్రాహ్మణాది సాహాయ్యముతో మంత్రములయందు గల యర్థముల బ్రకాశింపజేయుటయే యీ నిరుక్తశాస్త్రారంభప్రయోజనము.

మంత్రములందు వలెనే లౌకికవాక్యములందును నియతపదరచన విషయమై నియమములను వ్యాకరణాదిశాస్త్రములు విధించినవి. శాస్త్రాను సారముగ బ్రయోగించినపుడే యది సాధువై శిష్టజనసంమత మగుచున్నది. (శాస్త్రేణ ధర్మనియమః క్రియతే - మహాభాష్య, పస్పశాహ్నిక) ఉదా:-

"లౌకికే ష్వప్యేతత్ యథా ఇంద్రాగ్నీ పితాపుత్రా వితి"

— నిరు. 1-16.

ఇంద్రాగ్నులు, పితాపుత్రులు (ఇట్లే భార్యాభర్తలు, నలదమయంతులు, సీతారాములు) మున్నగు పదములలో నియతపదరచన శాస్త్రవిహితమై యనూచానముగ గన్పట్టుచున్నది. కాన నియతపదరచన గల్గియుండుట యను కారణముచే మంత్రము లనర్థకము లని యనుట యుక్తము కాదు. కర్మలయందు మంత్రముల వినియోగపఱచుచు విధాయకము లగుటజేసి బ్రాహ్మణవాక్యము లర్థవంతము లనియు, వినియోజ్యము లగుటచే మంత్రము లనర్థకము లని చెప్పుటయు యుక్తము కాదు.

"ఏతద్వై యజ్ఞస్య సమృద్ధం యద్రూపసమృద్ధం యత్కర్మ క్రియమాణం ఋగ్యజు ర్వాభివదతీతి చ బ్రాహ్మణమ్"

— నిరు. 1-16.

మంత్రము లర్థవంతము లనుటకు పై గోపథబ్రాహ్మణవాక్యము (2-2-6 ; 2-4-2) ప్రమాణము. మంత్రములు స్వార్థబోధనము ద్వారా దేవతాలింగ ప్రకాశకములు. అట్టి మంత్రములచే నేది ప్రకాశింపజేయబడునో యా యర్థమే యజ్ఞసమృద్ధికి గారణ మగును. బ్రాహ్మణములచే విహితములై యనుష్ఠింపబడు కర్మలన్నిటిని ఋక్కుగాని యజుస్సుగాని తత్తల్లింగము లచే బ్రకాశింపజేయుచునే యుండును (యత్కర్మ క్రియమాణం ఋగ్యజు ర్వాభివదతి). కొత్పుడును 'అథాపి బ్రాహ్మణేన రూపసంపన్నా విధీయన్తే' అని యనుచు బ్రాహ్మణముచే తత్తద్దేవతాలింగప్రకాశకము లయిన మంత్ర ములు విధింపబడుచున్న వనియే చెప్పినాడు. మంత్రము లర్థవంతములు గాకిచో నవి తత్తద్దేవతాలింగప్రకాశకము లగుట యెట్లు? ఆ యా కర్మల బ్రకాశింపజేయుటెట్లు? ఆ యా కర్మల యందు బ్రత్యేకించి యా యా మంత్రములనే బ్రాహ్మణములు వినియోగపరచుటకు గారణ మేమి? బ్రాహ్మణముల దృష్టిలో మంత్రము లర్థవంతములే యగును. ఒకే కర్మ యందు సమానలింగములు గల పెక్కు మంత్రములు 'ఖలే కపోత

న్యాయము' చే ప్రాప్తించుచుండగా నచట బ్రాహ్మణము 'ఈ మంత్రమునే వినియోగింపవలె'నని నియమించుచు విధించుచున్నది. ఇట్లు మంత్రములు, బ్రాహ్మణములు రెండును పరస్పరానుబద్ధములై యర్థవంతములు. కావన తద్వాక్యార్థనిరూపణకై నిరుక్తశాస్త్రారంభ మావశ్యక మని యాస్కుడు సిద్ధాంతీకరించెను.

ఇచట కౌత్సుని పూర్వపక్షమును, యాస్కుని సిద్ధాంతమును - రెంటిని సూక్ష్మముగ బరిశీలించినచో నుభయులును మంత్రబ్రాహ్మణములు రెండిటికిని అపౌరుషేయత్వమును, స్వతఃప్రామాణ్యమును గుర్తించుమే పూర్వపక్షసిద్ధాంతముల జేసినట్లు గాంచనగును. మంత్రముల యర్థపరిశీలనము తో నిమిత్తము లేకయే, బ్రాహ్మణవాక్యప్రామాణ్యముచే, నవి యథాతథముగ గర్మలయందు వినియోగింపబడిన జాలును గదా యని కౌత్సుని యాశయము. అంతియేగాని సర్వథా మంత్రము లనర్థకములని కౌత్సుని యభిమతము గాదు. ఇక యథాతథముగ, అనగా బ్రాహ్మణోక్త ప్రకారము మంత్రవినియోగము జేయుట యాస్కునకు నభిమతమే. గోపథబ్రాహ్మణప్రామాణ్యము ననుసరించియు, తత్తద్దేవతాలింగప్రకాశకము లగుటజేసియు మంత్రము లర్థవంతములు; కావున అర్థజ్ఞానపూర్వకముగ గర్మలయందు మంత్రవినియోగము జరుగవలె నని యాస్కుని సిద్ధాంతము. "ఋచో అక్షరే పరమే వ్యోమన్.... యస్తన్న వేద కి మృచా కరిష్యతి- మంత్రముల యర్థము, వాని లక్ష్యము తెలియక నా మంత్రములతో జేయ గల్గిన దేమిః"- అని శ్రుతియే స్వయముగ బ్రశ్నించుచున్నది. అర్థజ్ఞాన పూర్వకముగ మంత్రవినియోగము శ్రుత్యభిమత మని స్పష్ట మగుచున్నది. అందుచే యాస్కుని సిద్ధాంతము శ్రుతిసంప్రదాయానుగుణము. కావన నిరువురి దృష్టిలోను మంత్రములతోపాటు బ్రాహ్మణములుగూడ వేదభాగ ములు, స్వతఃప్రమాణములు నని తెలియును. బ్రాహ్మణములు పునరుక్తి

రచితములే యయినచో నవి స్వతఃప్రమాణములుగ నిరువురిచేతను గ్రహింపబడి యుండెడివి కావు.

నిరుక్తమున కౌత్సవాదము-చారిత్రికుల యాక్షేపము-సమాధానము :-

పైన బేర్కొనబడిన నిరుక్తమునందలి కౌత్స-యాస్కుల యొక్క పూర్వపక్ష సిద్ధాంతముల నాధారము జేసికొని చారిత్రికులు కొన్ని యభూతకల్పనల జేయుటకు బూనుకొనిరి.

'The gap between the poets and the early interpreters was indeed so great that one of Yaska's predecessors,named, Kautsa, actually had the audacity to assert that the science of Vedic exposition was useless, as the Vedic hymns and formulas were obscure, unmeaning, or mutually contradictory. Such criticisms, Yaska meets by replying that it was not the fault of the rafter if the blindman did not see it. Yaska himself interprets only a very small portion of the hymns of the Rigveda. In what he does attempt to explain he largely depends on etymological considerations for the sense he assigns. He often gives two or more alternative or optional senses to the same word. The fact that he offers a choice of meanings shows that he had no earlier authority for his guide, and that his renderings are simply conjectural; for no one can suppose that the authors of the hymns had more than one meaning in their minds.'

— Macdonell : History of Sanskrit Literature - pp. 61.

"వేదమంత్రరచయితల తరువాత నెంతకాలమునకో గాని మంత్రార్థముల నిర్వచించెడి నిరుక్తకారులు బయలుదేర లేదనుట స్పష్టము ; కావుననే యాస్కునకు బూర్వులలో నొకడగు కౌత్సుడు, సాహసించి," ఈ

వేదమంత్రములు దుర్బోధములు, అనర్థకములు, పరస్పరవిప్రతిషిద్ధార్థకములు; కాన వాని యర్థముల నిర్వచించుటకై నిరుక్తశాస్త్రారంభము వ్యర్థము' — అని చెప్పగలిగెను. 'గ్రుడ్డివాడు చూడలేనిచో నది స్థాణ్వపరాధము గాని స్థాణుగతదోషము కాదు' — అనెడి సమాధానముతో నిట్టి విమర్శలను యాస్కు డెదుర్కొనెను. కాని తానుమాత్రము ఋగ్వేదములో గల కొలది మంత్రములకే యర్థనిర్వచనము జేసెను. అందును, అర్థనిర్వచనమునకై యెక్కువగ వ్యుత్పత్త్యర్థముల మీద నాధారపడెను. కొన్ని యెడల నొక్కొక్క పదమునకు ఒక యర్థమునుమాత్రమే గాక రెండు లేక పెక్కు వికల్పముల గూడ జూపెను. ఒక్కొక్క పదమున కిట్లు పెక్కు వికల్పముల జూపినందున, పదపదార్థనిర్ణయవిషయమై యాతనికి సంప్రదాయానుగతమైన నిర్దిష్టప్రమాణము లేదు; ఆతడు జూపిన నిర్వచనములు గాని యర్థములుగాని స్వప్రతిభోన్నీతములు — అని తెలియును. ఏలయన, మంత్రరచయితలు తమ రచనలకు నిర్దిష్టమగు నొకే యర్థమునుగాక వివిధార్థముల నుద్దేశించియుందు రని యెవరును భావింపరు." —అని యర్థము.

చారిత్రికుల యిట్టి యూహలు సరియైనవి కావు. మంత్రము లొకే యర్థమును గాక యధికారిభేదము ననుసరించియు, ప్రకరణము ననుసరించియు వివిధార్థబోధకములు, శతవ్రజములు, శతపథములు నగునవి శ్రుతులే స్వయముగ జెప్పికొనినట్లు 'ఋషి' మొదలగు శబ్దములలో సప్రమాణముగ సోపపత్తికముగ వివరింపబడినది. మఱియు బ్రాహ్మణములు మంత్రార్థప్రకాశకము లనునది నిర్వివాదము. బ్రాహ్మణమే కొన్ని యెడల తానే నిరుక్తమై మంత్రార్థముల బెక్కు రీతుల బెక్కుచోట్ల వివరించినది. 'ఇత్యధిదైవం, అథాధ్యాత్మం' — అనియు నీ రీతిగ నాధ్యాత్మికాద్యర్థముల గ్రహింప నగునని చెప్పినది. అధికారిభేదము ననుసరించి తత్త్వము నుద్బోధించుట కయి వివిధార్థముల బ్రకాశింపజేయుట మంత్రముల

స్వభావము. అంతియేకాని యీ వివిధార్థములు వివిధవికల్పములు గావు; అర్వాచీనకల్పనలును గావు. మంత్రబ్రాహ్మణములచే బ్రకాశితములైన యర్థముల శ్రుతి చెప్పినచొప్పున నిర్వచించి జిజ్ఞాసువుల కందించి తోడ్పడుట కయియే నిరుక్తశాస్త్రారంభము. శాఖోపశాఖలతో విస్తరించిన వేదరాశియందు ప్రకాశితము లయి, పరంపరాగతము లయిన యర్థములే యందు దిఙ్మాత్రముగ జూపబడినవి. అట్లు చూపుటలో యాస్కుడు తన కంటె బ్రాచీనులగు ఔడులోమి, శాకపూణ్యాది నిరుక్తకారుల నెందరినో యుదహరించినాడు. 'ఇతి చ బ్రాహ్మణమ్, ఇత్యపి నిగమో భవతి, — అని యీ రీతిగ ననుచు స్వప్రతిపాదితార్థవిషయమై వివిధశాఖాగత మంత్ర బ్రాహ్మణవాక్యముల బ్రమాణముగ జూపినాడు. కాన యాస్కుడు చూపిన యర్థముల విషయమై సంప్రదాయానుగతమైన ప్రామాణ్యము లేదనుట యుక్తము కాదు. వేదవాక్యముల యొక్క సంప్రదాయానుగతమైన యర్థము నిగమ-నిరుక్త-వ్యాకరణాధీన మని మీమాంసాదర్శనకారుల యభిప్రాయము గూడ.

'సతః పర మవిజ్ఞానమ్' — జై. సూ. 1-2-49.

'విద్యమానోఽప్యర్థః ప్రమాదాలస్యాదిభి ర్నోపలభ్యతే ।
నిగమ నిరుక్త వ్యాకరణవశేన ధాతుతోఽర్థః కల్పయితవ్యః'
— శాబరభాష్య.

యాస్కుడు సాయణాదిభాష్యకర్తల వలె వేదమంత్రభాష్యరచనకై పూనుకొనలేదు. నిరుక్తశాస్త్రమును బ్రవర్తింపజేయుటకు బూనుకొనెను. పదగత స్వరసంస్కారాదుల దెలియజేయుచు వ్యాకరణశాస్త్ర మెట్లు వేదాఙ్గములలో నొకటియై వరలినదో, స్వరసంస్కారజ్ఞానము గలిగి వేదపదగత యావదర్థమును దెలియగోరు జిజ్ఞాసువులకు నా పదములయందు సంప్రదాయానుగతమైన యర్థముల దర్శించువిధాన మిది' — యని

చూపుటకై నిరుక్తశాస్త్రము కూడ వేదాఙ్గమై వరలినది. ఇట నొక విషయము గమనింప దగినది. నిరుక్తము, వ్యాకరణము - అను నీ రెండు శాస్త్రములును స్వతంత్రవిద్యాస్థానములు. అయ్యును ఇతరేతరాశ్రియ ములు. అర్థపరిజ్ఞానము నిరుక్తశాస్త్రాధీనము. స్వరసంస్కారపరిజ్ఞానము వ్యాకరణశాస్త్రాధీనము. నిరుక్తశాస్త్రసాహాయ్యముచే గలిగెడి యర్థమును దృష్టియం దుంచుకొనియే వ్యాకరణశాస్త్రము స్వరసంస్కారస్వరూపమును దెలియజేయును. అటులే వ్యాకరణశాస్త్రప్రతిపాదిత స్వరసంస్కార స్వరూపమును దృష్టియం దుంచుకొనియే నిరుక్తము ప్రకృత్యనుగుణముగ పదగతార్థపరిజ్ఞానమును దర్శింపజేయును. యాస్కు డీ విషయము నిట్లు వివరించియున్నాడు.

"అథాపీద మంతరేణ మంత్రే ష్వర్థప్రత్యయో న విద్యతే। అర్థ మప్రతియతో నాత్యంతం స్వరసంస్కారోద్దేశః। తదిదం విద్యాస్థానం వ్యాకరణస్య కార్త్స్న్యమ్। స్వార్థసాధకం చ।"

— నిరు. 1-5-15.

"నహ్యనవధృతార్థః స్వరసంస్కారా వవధారయితుం శక్నుయాత్। అర్థవశేన హి స్వరసంస్కారా వవతిష్ఠేతే। తదిదం ఏవం కృత్వా నిరుక్తశాస్త్రం విద్యాస్థానం, ఏత దధీనత్వా దర్థపరిజ్ఞానస్య। అర్థవశగత్వాచ్చ స్వరసంస్కారయో రిదం వ్యాకరణస్య కార్త్స్న్యం కృత్స్నభావం కరోతీతి వాక్యశేషః। వ్యాకరణే హి స్వరసంస్కారౌ చింత్యేతే। తస్మా దపరినమాప్త మేవ తావ ద్వ్యాకరణం యావ న్నిరుక్తం నాధిగత మితి। ....తస్మాత్ స్వతంత్ర మేవేదం విద్యాస్థాన మర్థనిర్వచనమ్। వ్యాకరణం తు లక్షణప్రధాన మితి విశేషః।" — దుర్గాచార్యభాష్యం.

కావున వేదపదగతార్థ స్వరూపమును దర్శింపజేయు శాస్త్రము నిరుక్తము. శాస్త్రము లక్షణముల జెప్పి, వానికి నొకటి రెండు ఉదాహరణల జూపి, యిట్లే మిగిలినవానిని దర్శించునది యనుచు మార్గదర్శక మగుచుండును. వ్యాకరణశాస్త్రము స్వరసంస్కారవిషయమై లక్షణముల జెప్పి తత్సాహాయ్యముతో నిఖిలపదగత స్వరసంస్కారముల దర్శించుటకు మార్గదర్శక మగుచున్నటులే నిరుక్తశాస్త్రము కూడ వైదికనిఘంటుపదములను, తత్తత్సందర్భానుగుణముగ నితరపదములను నిర్వచించి పదగత యావదర్థ స్వరూపమును దర్శించు విధానమును జూపి యిట్లే వేదగత నిఖిలపదములకు నర్థస్వరూపమును దర్శించునది, యని చెప్పినది. కాన నిది శాస్త్రము. దీని నిట్లు దర్శింపక 'యాస్కుడు కొన్ని పదములకు మాత్రమే యర్థము జూపగల్గెను'-అని విమర్శించుట శాస్త్రసంప్రదాయానుగుణము గాదు.

మఱియు జైమిని బాదరాయణులకు బూర్వము పూర్వోత్తర మీమాంసాసంప్రదాయములు లేవనిగాని, పాణినికంటె బూర్వము వ్యాకరణ సంప్రదాయము లేదనిగాని యనుట యెట్లు పొసగదో యాస్కునకు బూర్వము నిరుక్తసంప్రదాయము లేదనుటయు బొసగదు. ఏలయన, నీ సంప్రదాయముల నన్నిటిని మొదట బ్రవర్తింపజేసినది శ్రుతియే. సృష్ట్యాది నుండి యధ్యయనసంప్రదాయము, యజ్ఞాది ధర్మాచరణ సంప్రదాయము నవిచ్ఛిన్నముగ బ్రవర్తించినట్లే నాంతరీయకము లగుటచే వానితోపాటు వ్యాకరణ-నిరుక్తాది విద్యాసంప్రదాయములు నవిచ్ఛిన్నముగ బ్రవర్తించిన వనియే తెలియనగును.

ఓహాబ్రహ్మణః-శ్రుతిమతిబుద్ధిలక్షణా విద్యాః-

ఈ నిరుక్తవిద్యాసంప్రదాయ మనాదిసిద్ధ మయినట్లు ఋగ్వేదము నందే దర్శింపగలము. నిరుక్తవిద్యాసంప్రదాయరహస్యాభిజ్ఞులగు విద్వాంసులను 'ఓహబ్రహ్మాణః' - అని ఋగ్వేదము కీర్తించినది.

"హృదా తష్టేషు మనసో జవేషు యద్బ్రాహ్మణాః
సంయజన్తే సఖాయః। అత్రాహ త్వం విజహుర్వేద్యాభి
రోహబ్రహ్మాణో విచరన్త్యుత్వే ॥" — ఋ 10-71-8.

ప్రీతితో సఖ్య మొనర్చెడి వేదవిదులగు సఖులు, పరిపక్వ మగు బుద్ధితో, గుణదోషనిరూపణము జేసి, వేదార్థముల నిశ్చయించి, యా యర్థముల విషయమై ఏకభావము జెంది సమానఖ్యానము గల్గియుందురు. ఊహాపోహ కుశలురగు నా విద్వాంసులతో నొప్పెడి సమాజమున ఊహాపోహాసమర్థుడు, మందప్రజ్ఞుడు, అవిజ్ఞాతార్థస్వరూపుడు నగు నవిద్వాంసు డున్నచో వానిని బరిహరింతురుగాని వానితో తత్త్వనిరూపక ప్రశ్నప్రతివచనాదుల నొనరింపరు. అట్టి విద్వాంసులకు 'ఓహబ్రహ్మాణః' – అని పేరు. వారా సమాజమున సమానఖ్యానము గల సఖులతో ప్రశ్నప్రతివచనాదుల జేయుచు వేదార్థవిర్ణయమునకై ప్రవర్తింతురు – అని యర్థము.[1]

---

1. "హృదా హృదయేన, బుద్ధ్యా తష్టేషు తనూకృతేషు సంస్కృతేషు నిశ్చితేషు సత్సు,....మనసః జవేషు స్వేన మనసా ఊహాపోహాభ్యాం యేఽర్థాః సమ్యక్ ఉహ్యన్తే జ్ఞాయన్తే గమ్యన్తే నోపదేశమాత్రేణ తేషు సూక్ష్మే ష్వర్థేషు, తద్గమ్యా నర్థాన్ స్వయం మనసాఽఽలోచ్య బుద్ధ్యా పరిచ్ఛిద్యేత్యర్థః। యత్ యత్ర సమాజే యదా వా కాలే, బ్రాహ్మణాః సంయజన్తే సంగచ్ఛన్తి, సఖాయః సమానాఖ్యానా ఋత్విజః అన్యే చ శాస్త్రార్థజ్ఞాః। అత్ర సమాజే కాలే వా, త్వం ఏకం మందప్రజ్ఞం ఊహాపోహాసమర్థం. వి జహుః వివిధం త్యజన్తి. వేద్యాభిః.... సప్తమ్యర్థే చ తృతీయా। వేద్యతే జ్ఞాయతే తత్త్వం యాభి స్తాః వేద్యాః ప్రశ్న ప్రతివచన ప్రవృత్తయః, తాసు నైనం కించిత్ పృచ్ఛన్తి నాప్యస్మై ప్రతిబ్రువన్తీత్యర్థః। యే ఓహబ్రహ్మాణః ఓహం ఉహ్యమానా బ్రహ్మ పరా విద్యా యై స్తే, ఊహాపోహసమర్థా ఇత్యర్థః- .... త ఏవైకేఽత్ర వి చరన్తి వివిధం చరన్తి ప్రవర్తన్తే పరస్పరం పృచ్ఛన్తి ప్రతిబ్రువన్తి చేత్యర్థః' — ఉద్గీథ. భా.

"ఓహబ్రహ్మాణః ఉహ్యమానం బ్రహ్మ విద్యా శ్రుతిమతిబుద్ధిలక్షణం యేషాం తే తథోక్తాః తాదృశా స్త ఏకే విద్వాంసః వి చరన్తి యథాకామం వేదార్థేషు వినిశ్చయార్థం ప్రవర్తన్తే ॥" — సా. భా.

ఇట శ్రుతియందు ఊహాపోహకుశలురై — గుణదోషనిరూపణ సమర్థులై—వేదార్థనిర్ణయము చేయగలిగిన వేదసఖులగు విద్వాంసులు 'ఓహ బ్రహ్మాణః' — అని కీర్తింపబడిరి. శ్రుతి మతి బుద్ధిలక్షణ మగు బ్రహ్మ ఎవరిచే వహింపబడుచుండునో వారికి 'ఓహబ్రహ్మాణః' అని పేరు. శ్రుతి మతి బుద్ధిలక్షణ మగు నీ విద్యకే బ్రహ్మ యని పేరు. (ఈ విద్యాస్వరూపము ముందు వివరింపబడును.) ఇయ్యది నిరుక్తశాస్త్రవిజ్ఞాన ప్రభవ మగు విద్య యనుట సంప్రదాయము. ఈ విషయము నిరుక్తమున నిట్లు వివరింపబడినది.

"హృదా తష్టేషు మనసాం ప్రజవేషు....ఓహబ్రహ్మాణ ఊహ బ్రహ్మాణ ఊహ యేషాం బ్రహ్మేతి వా సేయం విద్యా శ్రుతి మతిబుద్ధిః తస్యా స్తపసా పార మీప్సితవ్యం, తదిద మాయు రిచ్ఛతా న నిర్వక్తవ్యం, తస్మా చ్ఛందస్సు శేషా ఉపేక్షితవ్యాః."

— నిరు. 13-13-

"ఏవ మేతస్మిన్ మంత్రే....మంత్రార్థచింతాభ్యూహస్య బ్రహ్మత్వం శ్రూయతే। తస్మా దిదమపి నిరుక్త శాస్త్రం బ్రహ్మైవ। వేద ఇత్యర్థః। ఇదానీ ముపసంహరతి సేయం విద్యా ఇతి।"

— దుర్గాచార్యభాష్య.

"సేయం ఏత న్నిరుక్తశాస్త్రవిజ్ఞానప్రభవా విద్యా వేదార్థవిజ్ఞాన లక్షణా శ్రుతి మతి బుద్ధిశబ్దే నాఖ్యాయతే నైరుక్తైః"

— ముకుందఝాబక్షీ నిరుక్తవ్యాఖ్య.

మంత్రార్థచింతాభ్యూహరూప మగు నీ విద్యకు బ్రహ్మ యని పేరు. అట్టి విద్యారూపమగు నీ నిరుక్తశాస్త్రము కూడ బ్రహ్మయే - వేదమే - యగునని 'హృదా తష్టేషు' - యను నీ శ్రుతివలన దెలియుచున్నది. తాదృశ విద్యారూప బ్రహ్మసంపన్నులగు విద్వాంసులకు "ఊహా బ్రహ్మాణః" - అని పేరు. శ్రుతి మతి బుద్ధిలక్షణమగు పరావిద్య నిరుక్తశాస్త్రవిజ్ఞానలభ్యము. అట్టి యీ విద్యయందు పారంగతు లగుటకు తపస్సే ముఖ్యసాధనము (తపసా పార మీప్సితవ్యమ్). తపఃసంపన్నులు గాక లౌకిక భోగ పరాయణులై ఆయురైశ్వర్యాదులయం దాసక్తు లగువారలకీ విద్యయం దధికారము లేదు. పరావిద్యాసాధనమగు నీ నిరుక్తవిద్యాసాహాయ్యముతో శ్రుత్యనుగుణముగ నేను జూపిన మార్గమున బోయి వివేచనచేసి ఛందో గతము లయిన-మంత్రబ్రాహ్మణగతము లయిన - మిగిలిన పదముల యర్థస్వరూపమును దర్శించునది - అని యర్థము.

పై గ్రంథసందర్భము వలన నిరుక్తవిద్య శ్రుతి మతి బుద్ధిలక్షణ మగు పరావిద్యకు సాధన మనియు, ననాదిసిద్ధ మనియు స్పష్ట మయినది. పరావిద్య యొక్క శ్రుతిమతిబుద్ధిలక్షణమును నిరుక్తమే మఱియొకచోట నిట్లు వివరించినది.

"త్రిస్రో వాచ ఈరయతి ప్రవహ్నిః ఋతస్య ధీతిం బ్రహ్మణో
మనీషామ్" — ఋ. 9-97-34.

"వహ్ని రాదిత్యో భవతి, స తిస్రో వాచః ప్రేరయతి, ఋచో
యజూంషి సామాని, ఋత స్యాదిత్యస్య కర్మాణి.
బ్రహ్మణో మతాని. ఏష ఏవైత త్సర్వ మక్షర మిత్యధి
దైవతమ్; అథాధ్యాత్మం: వహ్నిరాత్మా భవతి. స తిస్రో
వాచ ఈరయతి ప్రేరయతి, విద్యామతిబుద్ధిమతాం, ఋత
స్యాత్మనః కర్మాణి బ్రహ్మణో మతాని, అయ మేవైత
త్సర్వ మనుభవ త్యాత్మగతి మాచష్టే" — నిరు. 14-14.

"విద్యా—మతి—బుద్ధిమతాం—విద్యావతాం మతిమతాం బుద్ధి
మతా మేతేషాం త్రయాణాం తిస్రో వాచః। విద్యావతాం
వాగ్ భిన్నా। తథా మతిమతామ్। తథైవ బుద్ధిమతామ్। తే
విద్యావంతః యే శ్రుతిం జానంతి। తే మతిమంతః యే
తర్కేణ అర్థాన్ పశ్యన్తి। తే బుద్ధిమంతః యే బ్రహ్మ
జానంతి। నిరు. 13.13 — ఇత్యత్ర సేయం విద్యా శ్రుతి—
మతి—బుద్ధిః ఇత్యుచ్యతే। శ్రుతిరూపా విద్యా ప్రథమా।
మతిరూపా ఊహరూపా వా అస్యాః ఉచ్చతరా। బుద్ధిరూపా
సర్వాసా ముత్తమా। విద్యా—మతి—బుద్ధిమతా మిత్యత్ర విద్యా
శబ్దస్య శ్రుతి రిత్యర్థః స్యాత్।" —ఆనందాశ్రమనిరుక్తటిప్పణీ.

ఇట నిరుక్తమున పై ఋక్కునకు ఆధిదైవికముగ నాదిత్యుని పరముగను, ఆధ్యాత్మికముగ నాత్మపరముగను రెండర్థములు జూపబడినవి. 'బ్రహ్మ యొక్క మనీషా రూపములు, స్వకర్మ రూపములు నగు మూడు వాక్కులను — ఋగ్యజుఃసామలను — ఆదిత్యుడు ప్రేరేపించుచున్నాడు'—అని ఆధిదైవికార్థము. 'బ్రహ్మ మనీషా రూపములును, స్వకర్మరూపములు నగు మూడు వాక్కులను—విద్యా మతి బుద్ధిరూపము లగు వాక్కులను—అట్టి విద్వాంసులకు నాత్మ ప్రేరేపించును'—అని ఆధ్యాత్మికార్థము. ఋగ్యజుఃసామలక్షణ మగు నొకే వేదవాక్కు అధికారిభేదము ననుసరించి విద్యావంతులకు వేఱుగను, మతిమంతులకు వేఱుగను, బుద్ధిమంతులకు వేఱుగను దోచును. ఆత్మచే బ్రేరేపింపబడు మూడు వాక్కులు నివియే. విద్యావంతు లనగా నియమపూర్వకముగ వేదాధ్యయనము జేసినవారు. ఊహాపోహకుశలురై తర్కముతో వేదార్థనిర్ణయము జేయగల్గిన విద్వాంసులు మతిమంతులు. బ్రహ్మవిదులగు విద్వాంసులు బుద్ధిమంతులు (జ్ఞానులు). శ్రుతిరూపమగు విద్యకంటె మతి(ఊహ) రూప మగు విద్యయు, దానికంటె బుద్ధిరూప మగు విద్యయు నుత్తరోత్తర ముత్కృష్టములు — అని యర్థము.

ఒకే వేదవాణి కర్మానుష్ఠానాధ్యయనాది సమయమున ఇడారూపిణిగను, జిజ్ఞాసువై మననము జేయు సాధకుల హృదయముల సంస్కరించుచు (సాధయంతీ ధియం నః) సరస్వతీరూపముననను, బ్రహ్మర్షులకు స్వవశయై భారతీరూపముననను నొప్పుచుండు నని కవి–కావ్య, భారతీ శబ్దములందు వివరింపబడినవి. పరావిద్యారూపిణి యగు నా వేదవిద్యయే యిట 'శ్రుతి–మతి–బుద్ధిరూపిణి' గా వివరింపబడుట గమనార్హము. కావున వైదిక కావ్య సంప్రదాయము శ్రుతిసిద్ధము, అనాదిసిద్ధము నగుట స్పష్టము. అందుచే పై వారిత్రికుల యూహలు నిరాధారములు. ఇక ప్రకృతమునకు వత్తము.

మంత్రబ్రాహ్మణములు రెండును పురుషబుద్ధిరచితములు గావనెడి విషయమును యాస్కుడు మఱియొకచోట నిరుక్తమున నిట్లు వివరించినాడు.

"తేషాం మనుష్యవ ద్దేవతాభిధానమ్। పురుషవిద్యాఽనిత్యత్వాత్।
కర్మసంప త్తి ర్మంత్రో వేదే" — నిరు. 1-2-7.

నామ, ఆఖ్యాత, ఉపసర్గ, నిపాత లనెడి చతుర్విధపదజాలముతో లోకవ్యవహారము కొనసాగుచున్నది. ఈ శబ్దములు అవయవాదులతో నొప్పు మనుష్యాదులను, వారి కర్మలను బోధింప జాలినట్లే. అవయవాదియుక్తులైన దేవతలను తత్కర్మలను బోధింపజాలును. అట్టియెడ నా యా దేవతల నుద్దేశించి చేసెడి హవిఃప్రదానాది కర్మల జేయుటకై లౌకికశబ్దములు చాలును గదా ! అందుకై వేదమున గల మంత్రములు పఠింపనేల ? యని యనరాదు. పురుషుల బుద్ధులు అలౌకికములగు దేవతాస్వరూపములను, తత్కర్మలను దర్శింపలేవు ఒకవేళ ప్రతిభావ్యుత్పత్తులతో నేదియేని దేవతల నుద్దేశించి కల్పించి చెప్పినను నయ్యది యథార్థ మనియు, యథాతథము గ ప్రమాణభూత మనియు లోకము గ్రహింపదు. పురుషు డెంతటి ప్రతిభావంతుడైనను, లౌకికవిషయములం దెంత సుశిక్షితుడైనను అలౌకిక దేవతాస్వరూప స్వభావాదివిషయమున నశిక్షితుడే యగుచున్నాడు. ఇట్లు

పురుషబుద్ధి అల్పము, అశిక్షితము, విస్మరణశీలము, భ్రమప్రమాదాది దోష బహుళము నగుటచే పురుషబుద్ధికల్పిత దేవతాస్వరూపస్వభావాదులు గాని, కర్మలుగాని సమ్యగ్జ్ఞానమును బోధింప సమర్థములు గావు. పురుషబుద్ధిదోష ప్రచురములైన యా లౌకికశబ్దముల నుపయోగించుచో కర్మసమయముల యందు దేవతానిర్భావముగాని, తదనుగ్రహముచే గర్మలు సఫలము లగుట గాని సిద్ధింపదు పురుషవిద్య యనియతమై యనిత్య మగుటచే లౌకికశబ్దములు కర్మవినియోగానర్హములు. అందుచే పురుషబుద్ధిదోషరహితములగు మంత్రములు కర్మాదివినియోగమునకై వేదమున సమామ్నాతము లైనవి— అని యర్థము.

పై విషయమును బరిశీలించుచో—కర్మసమృద్ధిని గలుగజేయునవి లౌకికవాక్యములు గావు. వేదమంత్రములే; కర్మసంపత్తిని గల్గించు మంత్రములు సంహితాభాగమునను, బ్రాహ్మణభాగమునను గలవు. అందుచే మంత్రబ్రాహ్మణములు రెండును అపౌరుషేయములే; పురుషబుద్ధి కల్పితములు గావు'— అనుట యాస్కాభిమతము.

ఇంతియే కాదు. యాస్కుడు నిరుక్తమున నచటచట బ్రాహ్మణ వాక్యముల బ్రమాణముగ నుదహరించి వానిని ఆమ్నాయవచనము లనియు, నిగమము లనియు బేర్కొనుట గమనార్హము. ఉదా :— 'ఓషధే త్రాయస్వైనం' – ఇది వాజసనేయసంహిత (4-1) యందును, తైత్తిరీయ సంహిత (1-2-1-1) యందును గలదు. ఈ వాక్యము నుదహరించుచు దీనిని ఆమ్నాయవచన మనినాడు. (ఆమ్నాయవచనాత్ – నిరు. 4-1). మఱియొకచోట 'యథో ఏతత్ రోహాత్ ప్రత్యవరోహ శ్చికీర్షితః' – అని బ్రాహ్మణవాక్యము నుదహరించి దీనిగూడ ఆమ్నాయవచన మనినాడు (ఆమ్నాయవచనా దేత ద్భవతి – నిరు. 7-24-1). ఇట్లే 'యస్మాత్పరం నాపర మస్తి కించిత్ (తై.ఆ. 10-10-3; శ్వేత.ఉ. 3-9): అను

బ్రాహ్మణవాక్యము నుదహరించి యిది నిగమ మనినాడు (ఇత్యపి నిగమో భవతి – నిరు. 2-1-4). కాన నిరుక్తసంప్రదాయము ననుసరించియు బ్రాహ్మణము గూడ నపౌరుషేయమై వేద మగుట స్పష్టము. ఇక నీ విషయమై శ్రౌతసూత్ర, గృహ్యసూత్రకారుల యభిప్రాయము జ్ఞాతము.

శ్రౌత-గృహ్యసూత్రములు: స్మృతులు-ప్రసిద్ధి :-

"మంత్రబ్రాహ్మణయో ర్వేదనామధేయమ్"
— ఆప.పరి.సూ॥ 31. - సత్యా.శ్రౌ.సూ. 1.1; - ఆప.శ్రౌ.సూ. 24.1-31.1.

"ఆమ్నాయః పునః మంత్రాశ్చ బ్రాహ్మణాని చ"
— అథర్వ.కౌశి.సూ. 1.3.

"మంత్రబ్రాహ్మణయో రాహు ర్వేదశబ్దం మహర్షయః"
— షడ్గురుశిష్యః : సర్వానుక్రమణికావృత్తిభూమికా.

"మంత్రబ్రాహ్మణాత్మకం తావ ద్వేదస్యాదుష్టం లక్షణమ్"
— సాయణః — ఋగ్వేద భాష్యభూమికా.

"ఆమ్నాయో వేదః-బ్రాహ్మణం విధ్యర్థవాదరూపమ్। మంత్రస్తు కర్మాంగభూత ద్రవ్యదేవతాస్మారకమ్"
— ఉవట.వాజ.ప్రాతిశాఖ్యభాష్య.

"మంత్రబ్రాహ్మణయో ర్వేదనామ ప్రోక్తం ఋగాది"
— శుక్రనీతి. 4.271.

"ఉదితేఽనుదితే చైవ సమయాధ్యుషితే తథా।
సర్వథా వర్తతే యజ్ఞ ఇతీయం వైదికీ శ్రుతిః॥
— మను. 2.15.

ఇట మనుస్మృతి 'ఉదితే జుహోతి, అనుదితే జుహోతి' యను నీ బ్రాహ్మణ వాక్యములను 'వైదికీ శ్రుతిః' యని పేర్కొనినది. ఇట్లే బ్రాహ్మణప్రోక్త ధర్మముల బరామర్శించుచు వానిని 'ఇతి వైదికీ శ్రుతిః' అని పలుచోట్ల స్మృతులు పేర్కొనినవి.

ఇట నొక విషయము పరిశీలింపదగినది. మానవధర్మశాస్త్రమును బ్రవర్తింపజేసిన మనువు సృష్ట్యాదికాలికుడు. ఈ విషయము నిరుక్తమున నిట్లు జెప్పబడినది.

'అవిశేషేణ పుత్రాణాం దాయో భవతి ధర్మతః ।
మిథునానాం విసర్గాదౌ మనుః స్వాయంభువోఽబ్రవీత్ ॥
— నిరు. 3-4.

'విసర్గాదౌ' - యన సృష్ట్యాదియందు అని యర్థము. మనువు సృష్ట్యాది యందు ధర్మముల బ్రవర్తింపజేసినట్లు పై శ్లోకమువలన దెలియును మనువు మొదట యజ్ఞముల బ్రవర్తింపజేసి తరువాతి మానవుల కాదర్శ భూతు డయినట్లు ఋగ్వేదము చెప్పుచున్నది

"మనుష్వ దగ్నిం మనునా సమిద్ధం" — ఋ. 7-2-3.
'మనుష్వత్ మనుష్యవత్, మనునా సమిద్ధం యథేదానీం
మనుష్యాః సమిన్ధతే తథా పూర్వం మనునా ప్రజాపతినా
సమిద్ధ మగ్నిం' — సా. భా.

కనుక మనువు మొదట—సృష్ట్యాదియందు—యజ్ఞాదిరూపమైన ధర్మమును బ్రవర్తింపజేసె నమట స్పష్టము. 'బ్రాహ్మణములు చతుర్వేదపారగులైన ఋషులచే ప్రోక్తములు; కాన పురుషబుద్ధిరచితములు' - అని చెప్పెడి శ్రీదయానందులును (తదనుయాయులును) మనువు సృష్ట్యాదికాలికు డనియే యనుచు 'సత్యార్థప్రకాశ' యను గ్రంథమున నిట్లు చెప్పినారు.

"యహ్ మనుస్మృతి జో సృష్టి కే ఆది మేఁ హుయీ హై
ఉస్‌కా ప్రమాణ హై' —11 సముల్లాస.

ఇట్లు మనువు సృష్ట్యాదికాలికు డనుట యీ విమర్శకులకు నభిమతమే. అగుచో పై ఋగ్వేదమంత్రమున 'మనువుచే యజ్ఞమున సమిద్ధుడైన యీ యగ్నినే యజ్ఞసంపత్తి కొఱకు నెల్లపుడు పూజింపవలయును (మనునా సమిద్ధ మగ్నిం, అధ్వరాయ యజ్ఞాయ, సదమిత్ సదైవ, సంమహేమ సంపూజయత - సా.భా)' - అనెడి హెచ్చరికయు గలదు. యజ్ఞసంపత్తి మంత్రబ్రాహ్మణముల రెండిటివలననే సిద్ధించు ననుట వైదికసంప్రదాయము.

"మంత్ర బ్రాహ్మణే యజ్ఞస్య ప్రమాణమ్''
''మంత్రబ్రాహ్మణయో ర్వేదనామధేయమ్'' —ఆప.పరి.సూ. 32-33.

"మంత్రబ్రాహ్మణాభ్యాం హి సాంగోపాంగో యజ్ఞః ప్రమీయతే"
—కర్క. భాష్య.

మంత్రబ్రాహ్మణములకు వేద మని నామధేయము. ఇవి రెండు నితరేతరాశ్రయములై సాంగోపాంగయజ్ఞనిర్వహణకు బ్రమాణము లగుచుండునవి యర్థము. కాగా సృష్ట్యాదియందు మనువు మంత్రబ్రాహ్మణముల రెండిటిని బ్రమాణముగ గొనియే యజ్ఞాదిధర్మప్రవర్తకు డయ్యె నని యంగీకరింప వలెను. మనువు త్రొక్కిన మార్గముననే పోయి తరువాతివారును యజ్ఞాదుల నిర్వహింపవలె నని పై శ్రుతి యాదేశము. అప్రతిహతము క్షుణ్ణము నైన మనుప్రదర్శిత ధర్మమార్గముననే ప్రజలు ప్రవర్తిల్లినట్లు మహాకవి కాళిదాసు రఘువంశమహాకావ్యమున నిట్లు తెలియజేయుచున్నాడు.

"రేఖామాత్ర మపి క్షుణ్ణా దా మనో ర్వర్త్మనః పరమ్।
న వ్యతీయుః ప్రజా స్తస్య నియంతు ర్నేమివృత్తయః॥"

కనుక మనువునాటి నుండి – సృష్ట్యాదినుండి – యవిచ్ఛిన్నముగ గురు శిష్యపరంపరాప్రాప్తమై స్వాధ్యాయాధ్యయన మెట్లు విలసిల్లుచున్నదో, యటు లనే యజ్ఞాది ధర్మమార్గము, తదనుగుణముగ నిరుక్తాది షడంగముల సంప్ర దాయము ప్రాప్తమైనటుల గ్రహింపవలసియున్నది. అంతియేకాని యీ సంప్రదాయములు విచ్ఛిన్నము లైనవనిగాని, మఱల నా యా కాలములందు తమతమ ప్రతిభలకొలది వేర్వేఱు పురుషులచే గల్పితములనిగాని చెప్పుట యుక్తిసహము, శ్రుత్యాదిసంమతము గాదు. ఇట్టి సంప్రదాయ మవిచ్ఛిన్న మని యంగీకరింపవలసి యున్నది. మంత్రములతోపాటు బ్రాహ్మణములు నావిర్భవించిన వనియు, అందుచే వానికి వేదత్వము నిర్బాధ మగుననియు గ్రహింపనగును.

కనుక 'కాత్యాయను డొకడు కాక మిగిలిన ఋషు లెవ్వరును బ్రాహ్మణములకు వేదసంజ్ఞ నంగీకరింపలేదు – అనెడి శ్రీదయానందాది విమర్శకుల వాదము గ్రాహ్యము కాదు. కాత్యాయనుడే గాక కోశకారులు దర్శనకారులు, నిరుక్తశాస్త్రప్రవర్తకులు, స్మృతికర్తలు, శ్రౌత-గృహ్య సూత్రకర్తలు, శ్రీసాయణాదిభాష్యకర్తలు నెల్లరును గూడ బ్రాహ్మణములు వేదములని ముక్తకంఠముగ గీర్తించియుండుట గాంచితిమి. ఈ విషయ మును "బ్రాహ్మణాచ్ఛంసీ" యను పదమును బరిశీలించినను స్పష్టము కాగలదు.

శ్రుతిప్రసిద్ధి - బ్రాహ్మణాచ్ఛంసీ :-

యజ్ఞమున అధ్వర్యుడు, హోత, ఉద్గాత, బ్రహ్మ యను ప్రధాన ఋత్విజులు నలువు రుందురు. అందొక్కొక్కరికి ముగ్గురు ముగ్గురు అనుయాయు లుందురు.

1	2	3	4
అధ్వర్యుః	హోతా	ఉద్గాతా	బ్రహ్మ
ప్రతిప్రస్థాతా	మైత్రావరుణః	ప్రస్తోతా	బ్రాహ్మణాచ్ఛంసీ
నేష్టా	అచ్ఛావాకః	ప్రతిహర్తా	ఆగ్నీధ్రః
ఉన్నేతా	గ్రావస్తుత్	సుబ్రహ్మణ్యః	పోతా

ఇట బ్రహ్మవర్గములో రెండవవాడు 'బ్రాహ్మణాచ్ఛంసి' ఈ పదమును మహాభాష్యాది గ్రంథము లిట్లు నిర్వచించినవి.

"అన్యార్థే చైషా పంచమీ ద్రష్టవ్యా। బ్రాహ్మణాని శంసతీతి బ్రాహ్మణాచ్ఛంసీ। అథవా యుక్త ఏవాత్ర పంచమ్యర్థః। బ్రాహ్మణేభ్యో గృహీత్వా ఆహృత్య ఆహృత్య శంసతీతి బ్రాహ్మణాచ్ఛంసీ" — మహాభాష్య. 6-3-2.

"బ్రాహ్మణాచ్ఛంసిన ఉపసంఖ్యానమ్। బ్రాహ్మణ మాదాయ శంసతీతి బ్రాహ్మణాచ్ఛంసీ ఇతి। ఋత్విగ్విశేషస్య రూఢి రియమ్। తస్య వ్యుత్పత్తిః అసతా సతావా అవయవార్థేన క్రియతే।" — కాశికావృత్తి.

"ఏవ మపి హోతృప్రభృతిష్వపి బ్రాహ్మణాచ్ఛంసీతి ప్రాప్నోతి। తత్రాహ ఋత్విగ్విశేషస్య రూఢి రియ మితి"
— పదమంజరీ. (మా.వ్యాస.).

బ్రాహ్మణాచ్ఛంసి యనగా బ్రాహ్మణములందు విహితములగు శస్త్రములను, శంసనము చేయువాడు; లేక బ్రాహ్మణముల నుండి శస్త్రముల గ్రహించుచు శంసనము చేయువాడు - అని యర్థము. బ్రాహ్మణములను గ్రహించి

శస్త్రములను శంసనము చేయు ధర్మ మితర ఋత్విజులందును గలదు. అయిన నీ పద మీ ఋత్విజుని యందే రూఢము. శ్రౌతసూత్రకారులు వ్యాఖ్యాతలు నీ నిర్వచనమునే యాదరించిరి.

"బ్రాహ్మణాచ్ఛంసిన ఉపసంఖ్యాన మితి పంచమ్యా అలుక్
బ్రాహ్మణే విహితాని శస్త్రా ణ్యుపచారా ద్బ్రాహ్మణాని ।
తాని శంసతీతి బ్రాహ్మణాచ్ఛంసీ, ఋత్విగ్విశేషః ।
ద్వితీయార్థే పంచ మ్యుపసంఖ్యానాదేవ"
— మహాదేవకృత వైజయంతీవ్యాఖ్య - సత్యా. శ్రౌ. సూ. 7-7-21.

ఋగ్వేదమున గొన్నిచోట్ల బ్రాహ్మణ శబ్దము 'బ్రాహ్మణాచ్ఛంసి' యను నర్థమున బ్రయోగింపబడినది.

"బ్రాహ్మణా దింద్రరాధసః" — ఋ. 1-15-5.

'బ్రాహ్మణాత్ బ్రహ్మశబ్దే నాత్ర బ్రహ్మవర్గే ద్వితీయో బ్రాహ్మణాచ్ఛంసీ కథ్యతే....(తత్సంబద్ధ) చమసపరో ఽత్ర బ్రాహ్మణ శబ్దః — సా. భా.

"బ్రాహ్మణా దా తృపత్ పిబ" — ఋ. 2-36-5.

'బ్రాహ్మణాత్ బ్రాహ్మణాచ్ఛంసినో యాగాత్' — సా. భా.

"స సద్మ పరి ణీయతే హోతా మంద్రో దివిష్టిషు ।
ఉత పోతా ని షీదతి ।" — ఋ. 4-9-3.

"ఉత గ్నా అగ్ని రధ్వర ఉతో గృహపతి ర్దమే ।
ఉత బ్రహ్మా ని షీదతి" — ఋ. 4-9-4.

"వేషి హ్యధ్వరీయతా ముపవక్తా జనానాం ।
హవ్యా చ మానుషాణామ్ ।" — ఋ. 4-9-5.

"బ్రహ్మణత్వాత్, బ్రహ్మ వేదః తదధ్యేతృత్వాత్ బ్రహ్మతో
బ్రాహ్మణాచ్ఛంసీ నామ" —నీలకంఠః

బ్రాహ్మణము – అనుబ్రాహ్మణము :-

బ్రాహ్మణములందు గొంత భాగమునకు 'అనుబ్రాహ్మణ' మని పేరు. ఈ విభాగమును గూర్చి సూత్రకారు లిట్లు వివరించుచున్నారు.

"పౌరోడాశికం యాజమానం హోతారః హౌత్రం పితృమేధ
ఇతి సబ్రాహ్మణాని సానుబ్రాహ్మణాని ప్రాజాపత్యాని"
— బోధా. గృ. సూ. 3-3.

"అను బ్రాహ్మణా దినిః" అని పాణినీయసూత్రము (4-2-62). "బ్రాహ్మణసదృశో ఽయం గ్రంథో ఽనుబ్రాహ్మణమ్" – అని కాశికా వృత్తియందు 'అనుబ్రాహ్మణ' శబ్దార్థము వివరింపబడినది. బ్రాహ్మణ సదృశగ్రంథమనుబ్రాహ్మణము. దాని నధ్యయనము జేయువాడు 'అనుబ్రాహ్మణీ' యగును. శ్రీ సాయణాచార్యులను అనుబ్రాహ్మణ స్వరూపము నిట్లు వివరించిరి

"అష్టమే మంత్రకాండస్థే కర్మణాం బహులత్వతః ।
తత్తత్సన్నిధయే ప్రోక్తాః మంత్రా విధిపురఃసరాః ॥
అనూద్య తాన్ విధీ నర్థవాదో బ్రాహ్మణ ఈరితః ।
సంప్రదాయవిదో ఽతో ఽత్ర బ్రాహ్మణద్వయ మూచిరే ॥
బ్రాహ్మణం మంత్రకాండస్థ విధిజాత మితీరితమ్ ।
అనుబ్రాహ్మణ మన్యత్తు కథితం సార్థవాదకమ్ ॥"

"అనుమత్యై పురోడాశ మష్టాకపాలం నిర్వపతి। ఏతస్మిన్ ముఖ్యే బ్రాహ్మణే ప్రధానం కర్మ విహితమ్। అను బ్రాహ్మణం తు గ్రంథాంతరే ప్రథమకాండే షష్ఠ సప్త మాష్టమ ప్రపాఠకరూపమ్' — సా. భా. తై. సం. 1-8-1.

బ్రాహ్మణము, అనుబ్రాహ్మణము - అని రెండు బ్రాహ్మణభాగములు గలవు. అందు బ్రాహ్మణ మనగా మంత్రకాండప్రకాశిత విధిజాతమును దెలియజేయు భాగము. బ్రాహ్మణమునం దర్థవాదసహిత మగు బ్రాహ్మణ 'మన బ్రాహ్మణ' మని సంప్రదాయవిదులు చెప్పుదురు. 'అనుమత్యై పురోడాశ మష్టాకపాలం నిర్వపతి'—ఇది ముఖ్యబ్రాహ్మణము. ఇందు ప్రధాన కర్మ విహితమైనది. తైత్తిరీయ బ్రాహ్మణము ప్రథమకాండమున షష్ఠ, సప్తమ, అష్టమ ప్రపాఠకము లనుబ్రాహ్మణము—అని యర్థము. ఇట్లే 'ఇషే త్వోర్జేత్వా'—ఇది మంత్రము. దీనికి "తృతీయస్యా మితో దివి సోమ ఆసీత్ ప్రత్యుష్టగ్ం రక్షః (తై. బ్రా. ప్ర. 3-2)" — ఇత్యాది ప్రశ్న ద్వయము బ్రాహ్మణము, మరల నీ మంత్రమునకే తైత్తిరీయసంహిత (2-5-1) యందలి "విశ్వరూపో వై త్వాష్ట్రః" — "సమిధో యజతి"— అను ప్రశ్నద్వయ మనుబ్రాహ్మణము.[1] కాన మంత్రములకు బ్రాహ్మణము అనుబ్రాహ్మణము అని బ్రాహ్మణద్వయము గలదు. తైత్తిరీయసంహిత యందు బ్రాహ్మణభాగమే గాక, పైన జెప్పినట్లు అనుబ్రాహ్మణము గూడ నుండుట గమనార్హము.

విమర్శకులు చెప్పునట్లు 'బ్రాహ్మణప్రోక్తము లగుటచే బ్రాహ్మణము లను పేరు వచ్చినదని జెప్పుచో, కొంత భాగమునకు బ్రాహ్మణ మనియు, మఱికొంతభాగమున కనుబ్రాహ్మణ మనియు బేరు వచ్చుటకు గారణమేమి?

1. చూ. గజానందశర్మ - వేదవేదికానామ్ని తైత్తిరీయసంహితాభూమికా

అందును సంహితలు బ్రాహ్మణప్రోక్తములు కావనియే శ్రీ దయానందాది విమర్శకుల యభిప్రాయము. అట్టియెడ సంహితయందే కొంతభాగము బ్రాహ్మణ మగుటకును, మఱికొంతభాగము అనుబ్రాహ్మణ మగుటకును గారణ మేమి? కాన 'బ్రాహ్మణప్రోక్తము లగుటచే బ్రాహ్మణము లనెడి ప్రసిద్ధి వచ్చిన' దనెడి విమర్శకుల యూహ సరియైనది కాదు.

మంత్రబ్రాహ్మణాత్మక వేదము ధర్మమూలము :-

వేదమునకు శ్రుతి యనియు, ధర్మశాస్త్రమునకు స్మృతి యనియు బ్రసిద్ధి.

"శ్రుతిస్తు వేదో విజ్ఞేయో ధర్మశాస్త్రం తు వై స్మృతిః"

— మను. 2-10.

కృత్స్నవేదరాశి ధర్మమునకు మూలము. (వేదోఽఖిలో ధర్మమూలమ్-మను-2-6; శ్రుతిప్రమాణో ధర్మః స్యాత్-భార. 3-206-41). కావున స్మృతు లడుగడుగున శ్రుత్యర్థము ననుసరించుచుండును. 'శ్రుతే రివార్థం స్మృతి రన్వగచ్ఛత్' (రఘువంశ) - ఇత్యాది వాక్యము లన్నియు నీ యర్థమునే చెప్పుచున్నవి. ఇట శ్రుతి యన నేది? కేవలము మంత్రభాగమా? లేక మంత్రబ్రాహ్మణభాగములు రెండు నగునా? వేదములు ధర్మమునకు బ్రమాణమనుచో మంత్రబ్రాహ్మణములు రెండును గూడ వేదశబ్దముచే గ్రహింపబడవలసియున్నది. మంత్రబ్రాహ్మణముల రెండిటిచేతను సాంగోపాంగయజ్ఞకర్మ సిద్ధించు నని పూర్వము వివరింపబడినది. మఱియు 'చోదనాలక్షణోఽర్థో ధర్మః (జై. సూ. 1-1-2)' - అని మీమాంసా దర్శనమున ధర్మలక్షణము చెప్పబడినది. విధివాక్యములకే 'చోదన' యని పేరు. అట్టి విధివాక్యమే (చోదనయే) ధర్మమునందు బ్రమాణము; లేక

ధర్మమునందు విధివాక్యము ప్రమాణమే - యని పై సూత్రమునకు రెండర్థములు (చోదనైవ లక్షణం ప్రమాణం యస్యసః; చోదనా లక్షణ మేవ యస్య సః చోదనాలక్షణః) చెప్పబడుచున్నవి. మొదటి యర్థముచే విధివాక్యములకంటె నితరములు ధర్మమునందు ప్రమాణములు గావు. రెండవ యర్థముచే విధివాక్యము లప్రమాణములు గావు; ప్రమాణములే - యని తెలియనగును. విధివాక్యములు మంత్రభాగమున విరళముగను, బ్రాహ్మణభాగమున బహుళముగను గలవు. కావున పై సూత్రము ననుసరించి మంత్రబ్రాహ్మణములు రెండును ధర్మమునకు మూలము లని యంగీకరింపవలెను. అందుచే వేదైకదేశమాత్రము గాక నిఖిలవేదము ధర్మమునకు మూల మని స్మృతికర్తలు చెప్పినారు.

శ్రుతిస్మృతుల కెచటనైన బరస్పరము విరోధము గన్పట్టినచో నపుడు శ్రుతియే ప్రబలప్రమాణము; స్మృతి కాదు - అని సంప్రదాయము. ఇక మంత్ర-బ్రాహ్మణవిషయమున నిట్లు కాదు. మంత్రములకు బ్రాహ్మణములకు విరోధము గన్పట్టుటగాని, అట్టియెడ బ్రాహ్మణముకంటె మంత్రమే ప్రబలప్రమాణ మని చెప్పెడి సంప్రదాయముగాని కానరాదు. విమర్శకులు చెప్పునట్లు బ్రాహ్మణములు పురుషరచితములే యగుచో, శ్రుతిస్మృతుల విషయములో వలె, మంత్రబ్రాహ్మణవిషయమునను గూడ నట్టి భేదము ప్రవర్తిల్లియుండెడిది. కాని లేదు. కావున బ్రాహ్మణములు పురుషబుద్ధికల్పితము లనెడి వాదము శ్రుతిస్మృతి సంప్రదాయానుగతము కాదు.

యాజ్ఞవల్క్యబ్రాహ్మణములు-ఆక్షేపసమాధానములు:-

కాని యాజ్ఞవల్క్య (శతపథ) బ్రాహ్మణములు మాత్రము

అర్వాచీనము లనియెడి యాక్షేప మొకటిగలదు.[1] అందుకు జూపబడు ప్రమాణములు.

"పురాణప్రోక్తేషు బ్రాహ్మణకల్పేషు" — పా.సూ. 4-3-105.

"పురాణేతి కిం? యాజ్ఞవల్క్యాని బ్రాహ్మణాని"

— సిద్ధాన్తకౌముదీ; కాశికావృత్తి.

పురాణప్రోక్తము లనగా 'పురాణ మునిప్రోక్తములు' - అని యర్థము. పై సూత్రమున 'పురాణ' అను పదము చెప్పనిచో పురాణ మునిప్రోక్తములు గానట్టి యాజ్ఞవల్క్యబ్రాహ్మణములు గూడ గ్రహింపబడును. అర్వాచీన మునిప్రోక్తములగు యాజ్ఞవల్క్యబ్రాహ్మణములను నిషేధించుట కొఱకే సూత్రమున 'పురాణ' అను పదము ప్రయోగింపబడినది. యాజ్ఞవల్క్యబ్రాహ్మణము లర్వాచీనము లని మహాభారతము గూడ చెప్పుచున్నది.

"ప్రతిష్ఠాస్యతి తే వేదః సఖిలః సోత్తరో ద్విజ।
కృత్స్నం శతపథం చైవ ప్రణేష్యసి ద్విజర్షభ॥
తతః శతపథం కృత్స్నం సరహస్యం ససంగ్రహమ్।
చక్రే సపరిశేషం చ హర్షేణ పరమేణ హ॥
కృత్వా చాధ్యయనం తేషాం శిష్యాణాం శతముత్తమమ్।
సూర్యస్య చానుభావేన ప్రవృత్తోఽహం నరాధిప॥
కర్తుం శతపథం వేద మపూర్వం చ కృతం మయా।
యథాఽభిలషితం మార్గం తథా తచ్చోపపాదితమ్॥"

— భార. 12-318-10 నుండి 17.

కావ యాజ్ఞవల్క్యబ్రాహ్మణము లర్వాచీనములు - అని యాక్షేపము.

1. భగవద్దత్త - హంసరాజకృత వైదికకోశ-ఉపోద్ఘాత.

ఈ వాదము సరికాదు. సిద్ధాంతకౌముది యందును, కాశికావృత్తి యందును జేయబడిన పై సూత్రవ్యాఖ్యానము భాష్యవార్తికవిరుద్ధము; కాన నాదరణీయము గాజాలదు. వార్తికమునందును తద్వివరణరూపమైన భాష్యమునందును యాజ్ఞవల్క్యబ్రాహ్మణములు ఇతరబ్రాహ్మణతుల్యకాలము లని స్పష్టముగ జెప్పబడినది.

"పురాణప్రోక్తేషు బ్రాహ్మణకల్పేషు యాజ్ఞవల్క్యాదిభ్యః
ప్రతిషేధః, తుల్యకాలత్వాత్" — వార్తికమ్.

"పురాణప్రోక్తే ష్విత్యత్ర యాజ్ఞవల్క్యాదిభ్యః ప్రతిషేధో
వక్తవ్యః । యాజ్ఞవల్క్యాని బ్రాహ్మణాని సౌలభాని ఇతి।
కిం కారణమ్? తుల్యకాలత్వాత్। ఏతాన్యపి తుల్యకాలానీతి"
— మహాభాష్య - (చూ. మహాభాష్య. ఛందోబ్రాహ్మణాని చ తద్విషయాణి. 4-2-66.)

భాష్యవ్యాఖ్యానములగు ప్రదీప-ఉద్యోతములు రెండిటియందును మిగిలిన బ్రాహ్మణముల వలెనే యాజ్ఞవల్క్యబ్రాహ్మణములు గూడ పురాణప్రోక్తములే గాని యర్వాచీనములు గావని స్పష్టముగ వివరింపబడినది. కాన యాజ్ఞవల్క్యబ్రాహ్మణములు అర్వాచీన మునిప్రోక్తము లనుట భాష్యవార్తికసంమతము గాదు. బ్రాహ్మణము లన్నియు గూడ నతిపురాణము లనెడి యథాస్థితార్థమును స్పష్టముగ గుర్తింపజేయుటకే పాణినిమహర్షి పై సూత్రమున 'పురాణ'పదమును నిర్దేశించె నని భాష్యవార్తికానుగుణముగ నర్థమును గ్రహించుట యుక్తము. మఱియు యాజ్ఞవల్క్యబ్రాహ్మణముగ ప్రసిద్ధమగు శతపథబ్రాహ్మణము గూడ మిగిలిన బ్రాహ్మణముల వలెనే ప్రమాణభూతమైన శ్రుతిభాగముగ జైమిని, బాదరాయణాది మహర్షులును, ధర్మబ్రహ్మసూత్రభాష్యకారు లందఱును గ్రహించి తమతమ దర్శనములందు విషయవాక్యములుగ బలుచోట్ల నుదహరించిరి. ఇట్లు జైమిని-బాదరాయ

ణాది మహర్షు లందఱిచేతను శతపథబ్రాహ్మణము ప్రమాణభూతమగు శ్రుతిగ నాదరింపబడుటచే మహాభారతమునందలి యాఖ్యాయికను తదవిరోధముగ సమన్వయము జేసికొనవలసియున్నది. శాస్త్రము వలె నాఖ్యాయిక స్వతః ప్రమాణము కాదని సంప్రదాయము. ఆఖ్యాయిక యర్థవాదరూప మగుటచే స్తుతిరూపముగ గ్రహింపవలసియున్నది. అందువలననే 'శతపథం చక్రే'- అను మహాభారతవాక్యమునకు - "చక్రే కర్మకర్తరిప్రయోగః। స్వయమేవ ఆవిరభూ దిత్యర్థః - స్వయముగనే యావిర్భవించెను" - అని నీలకంఠపండితుడును, "ప్రవచనవిషయీకృతవాన్-శిష్యులకు బ్రవచనము చేయుచు వ్యాప్తి నొందించెను"-అని తదితరపండితులును సంప్రదాయానుగుణముగ నర్థముల వివరించిరి. మంత్రకృత్, ఋషికృత్ - ఇత్యాది ప్రయోగముల కిట్లే యర్థమును గ్రహించెడి సంప్రదాయము పూర్వము ఋషిశబ్దమున వివరింపబడినది. కాన శతపథబ్రాహ్మణ మర్వాచీన మనియెడి యాక్షేపము సరి కాదు.

బ్రాహ్మణశబ్దనిర్వచనము-ఆక్షేపసమాధానములు:-

"మఱియు బ్రాహ్మణశబ్ద నిర్వచనమును గూర్చి విమర్శకులు[1] చెప్పుచున్న యాక్షేప మొకటి గలదు; వారి వాద మిది: జైమినిమహర్షి 'శేషే బ్రాహ్మణశబ్దః (2-1-33)'- అని బ్రాహ్మణలక్షణము చెప్పినాడు. మంత్రభాగాతిరిక్తమగు వేదభాగము బ్రాహ్మణ మని యర్థము; ఈ లక్షణము యుక్త మని ఋగ్వేదభాష్యభూమికాదులయందు సాయణాదులచే నంగీకరింపబడినది; కాని యీ లక్షణము బ్రాహ్మణశబ్దార్థ జ్ఞానోపయుక్తము కాదు; దీనివలన బ్రాహ్మణగ్రంథ స్వరూపప్రతీతి యేమియు గలుగుటలేదు; కనుక నిది గ్రాహ్యము కాదు; బ్రాహ్మణభాగము వేద మని యనుటలో మాకు

1. ఆచార్య సత్యవ్రతసామశ్రమీ-ఐతరేయాలోచనమ్.

విప్రతిపత్తియుండుట వలనను, జైమినిమహర్షి చెప్పిన యీ లక్షణము గ్రాహ్యము కాదు: కాన 'కర్మచోదనా బ్రాహ్మణాని (35 సూ)' – అని యాపస్తంబుడు చెప్పిన బ్రాహ్మణలక్షణమే గ్రాహ్యము; అగుచో కర్మవిధాయకములు మంత్రములు గూడ నగునుగదా! ఈ లక్షణ మెట్లు తగును? అని యందురేమో! పదార్థస్వరూపమును దెలియజేయుట కుపయుక్తముగాని నిర్దోషలక్షణము కంటె, పదార్థస్వరూపబోధ కుపయోగ పడెడి లక్షణము సదోషమైనను గ్రాహ్యమే: వస్తుతః యజుస్సులు బహుళముగ నుండుటచే యజుర్వేద మని చెప్పినట్లు, కర్మవిధాయక వాక్యములు బహుళముగ నుండుటచే వీనికి బ్రాహ్మణము అను పేరు తగును: వీనిని రచించినవారు బ్రాహ్మణులు: బ్రాహ్మణరచితము లగుటచే వీనికి బ్రాహ్మణము లని యన్వర్థసంజ్ఞ; శ్రీ దయానందసరస్వతీస్వాములును, హౌగ్‌పండితుడును బ్రాహ్మణశబ్దనిర్వచనము నిట్లే చెప్పిరి: అంతియేగాని 'బ్రహ్మ యన వేదము; తద్వ్యాఖ్యానరూపము లగుటచే వీనికి బ్రాహ్మణము లని సార్థకనామము' – అని చెప్పుట శబ్దానుశాసనవిరుద్ధము: 'బ్రాహ్మో జాతౌ – (పా.సూ. 6-4-117)' – అను పాణినిసూత్రము ననుసరించి యపత్యార్థమున (బ్రహ్మణః అపత్యం) బ్రాహ్మణ – అను రూపము సిద్ధించును: అందుచే బ్రహ్మకు (వేదమునకు) సంబంధించినది యనియెడి యర్థమున 'బ్రాహ్మమ్' అనియే రూపము సిద్ధించునుగాని. 'బ్రాహ్మణమ్' అను రూపము సిద్ధింపదు; కాన బ్రాహ్మణప్రోక్త యాగవిధ్యాదిబోధక మగు వచనము బ్రాహ్మణము; లేక యట్టి వచనజాతముతో నొప్పు గ్రంథము బ్రాహ్మణము; లేక వేదార్థకుశలు రగు బ్రాహ్మణులచే ప్రోక్తమై యాగ విద్యానుస్యూతమగు భాష్యమే బ్రాహ్మణము" – అని యాక్షేపము.

ఇట్లు చెప్పుట తగదు. 'మంత్రవ్యతిరిక్త వేదభాగము బ్రాహ్మణము' – అను జైమినిలక్షణము నిర్దుష్టమని యావిమర్శకులు గూడ నంగీకరించిరి.

కాని బ్రాహ్మణము వేదభాగము కాదని వారి వాద మగుటచే నీ లక్షణము నిర్దుష్టమైనను వారికి గ్రాహ్యము కాకపోయినది. బ్రాహ్మణము వేదభాగ మని పైన సప్రమాణముగ నిరూపింపబడినది. కాన జైమినిమహర్షి చెప్పిన లక్షణము గ్రాహ్యమే యగును. అట్టిచో బ్రాహ్మణములు బ్రాహ్మణులచే రచితము లని యనుటకును వలనుపడదు. మఱియు ఋగ్వేదము మొదటి మండలముననే 'బ్రాహ్మణాచ్ఛంసి' యను ఋత్విజుని ప్రశంస గలదు. దానిని పూర్వము వివరించితిమి. బ్రాహ్మణవిహితములగు శస్త్రముల శంసనము జేయువాడగుటచే 'బ్రాహ్మణాచ్ఛంసి' యని యతనికి సార్థకనామ మని మహాభాష్యాదిగ్రంథముల వలన దెలియుచున్నది.తరువాత నెప్పుడో బ్రాహ్మణులచే రచింపబడనున్న బ్రాహ్మణములచే విహితము లయ్యెడి శస్త్రములను (మంత్రముల) నా ఋత్విక్కు శంసనము జేయుటెట్లు? అట్టి వానిని గూర్చి ముందుగా ఋగ్వేదమంత్రములు జెప్పుటెట్లు? కాన 'బ్రాహ్మణప్రోక్త మగుటచే బ్రాహ్మణము అనెడి లక్షణము శ్రుతిసంమతము, యుక్తిసహమును గాదు. 'కర్మచోదనా బ్రాహ్మణాని' -యనెడి యాపస్తంబ సూత్రము బ్రాహ్మణస్వరూపానువాదకమే గాని బ్రాహ్మణలక్షణము గాదని విమర్శకులే యంగీకరించిరి. కాన 'శేషే బ్రాహ్మణశబ్దః' - అను జైమిని లక్షణమే నిర్దుష్టబ్రాహ్మణలక్షణము.

జైమినిలక్షణ మంగీకరించినచో నిది 'బ్రాహ్మణశబ్దార్థజ్ఞానోపయుక్తము కాదు; బ్రాహ్మణస్వరూపప్రతీతి గలుగుటలేదు' - అని యనుటయు సరి కాదు. బ్రహ్మ యనగా మంత్రరూపవేదభాగము. దానికి సంబంధించినది, అనగా తద్వ్యాఖ్యానరూప మగుటజేసి బ్రాహ్మణ మని యన్వర్థసంజ్ఞ. మంత్ర ప్రకాశితము గాని దేదియు బ్రాహ్మణభాగమున స్వతంత్రముగ జెప్పబడి యుండలేదు. ఒకవేళ బ్రాహ్మణభాగమునకు మూల మగు మంత్ర మేదియైన స్పష్టముగ నుపలభ్యము కాకపోయినను శాఖాంతరీయమగు మంత్ర

మేదియో మూలభూతమై యుండి యుండునని గ్రహింపవలె ననియు బూర్వము చెప్పబడినది. కాన బ్రాహ్మణము బ్రహ్మ (మంత్ర) సంబద్ధము; తద్వ్యాఖ్యానరూపము ; కాన బ్రాహ్మణ మను నామధేయ మన్వర్థము. (బ్రహ్మేణి నామ మంత్రాః సంహన్యంతే సృష్టీక్రియంతే వ్యాఖ్యాయంతే వా యస్మిం స్తాదృశే వేరభాగే బ్రాహ్మణశబ్ద ఇత్యర్థః – శ్రీధరశర్మా – శతపథబ్రాహ్మణ – ఉపోద్ఘాత).

ఇట్లు నిర్వచనమును జెప్పుచో 'బ్రాహ్మో జాతౌ' అను పాణిని సూత్రముతో విరోధము వచ్చు ననుటయు సరి కాదు. పై సూత్రము ననుసరించి జాతిరూపార్థమున, అనగా 'బ్రహ్మకు (బ్రాహ్మణునకు) సజాతీయభార్యయందు బుట్టినవాడు' - అను నర్థమున 'బ్రాహ్మణ' - అను రూపము సిద్ధించును. 'బ్రహ్మకు సంబంధించినది'యను నర్థము చెప్పుచో 'బ్రాహ్మమ్'అను రూపము సిద్ధించునుగాని బ్రాహ్మణమ్' అను రూపము సిద్ధించు టెట్లు ? - అని యాక్షేపము. ఇట్లాక్షేపించుట యుక్తమే. పై సూత్రముచే జెప్పబడిన నియమము లౌకికసంస్కృతమున గ్రాహ్యము కావచ్చును. కాని లౌకికసంస్కృతమునను, పురాణాదులయందును, వేదమునను గూడ బ్రాహ్మణశబ్దము జాతిరూపార్థముననే గాక 'బ్రహ్మాధ్యయనపరుడు, బ్రహ్మవేత్త, వేదపారగుడు' - ఇత్యాద్యర్థములందుగూడ బ్రసిద్ధము.

> ''అథ బ్రాహ్మణో ద్విజే ఆత్మజ్ఞే। క్లీతు విధివద్వేదభాగ తదంశయోః'' —వైజయన్తీ.

> ''బ్రాహ్మణో బ్రాహ్మణత్వాచ్చ'' — హరివంశ. 3-106-7.

> ''బ్రాహ్మణత్వాత్, బ్రహ్మ వేదః, తదధ్యేతృత్వాత్ బ్రాహ్మణో బ్రాహ్మణాచ్ఛంసీ నామ'' — నీలకంఠః.

బ్రహ్మ యనగా వేదము. దాని నధ్యయనము చేసినవాడగుటచే బ్రాహ్మణుడు- అని బ్రాహ్మణాచ్ఛంసి యనెడి ఋత్విక్కుచే జెప్పబడును.

"బ్రాహ్మణః బ్రహ్మవిత్" — నీలకంఠః, హరివంశ. 2-72-43.

"చత్వారి వాక్పరిమితాపదాని తాని విదు ర్బ్రాహ్మణా యే మనీషిణః"
— ఋ. 1-164-45.

"బ్రాహ్మణాః వేదవిదః" — సా. భా. వేం. మా. భా.

"బ్రహ్మ విద న్తీతి బ్రాహ్మణాః—టిలోపాభావ శ్ఛాందసః"
— నిర్ణయసాగర మహాభాష్య టిప్పణీ.

'బ్రాహ్మణ(ణీ) — బ్రహ్మ వేదం, శుద్ధం చైతన్యం వా వేత్తి అధీతే వా, అణ్.

ఇంతేగాదు. అగ్నిని శ్రుతి బ్రాహ్మణు డని వ్యవహరించినది.

"స ప్రజాపతి ర్బ్రాహ్మణ మబ్రవీత్" —తై.సం, 2-5-11-8.

"యో౽యం మానుషో౽గ్నిః స బ్రాహ్మణః— బ్రహ్మణి
వేదే విహితం కర్మ సాధయితుం ప్రవృత్తత్వాత్" —సా. భా.

బ్రహ్మయందు (వేదమునందు)విహితమైన కర్మను సాధించుటకు (నిర్వర్తించుటకు) బ్రవృత్తు డగుటచే నీ యగ్ని బ్రాహ్మణుడు—అని యర్థము. కాన బ్రాహ్మణు డన బ్రహ్మ (వేద) విహిత కర్మసాధన ప్రవృత్తు డని యర్థము. ఈ లక్షణము అగ్నియందును వేదవిహితకర్మానుష్ఠానపరుల యందును, బ్రహ్మవిహిత కర్మప్రకాశకము గాన బ్రాహ్మణగ్రంథము నందును నొప్పును.

"త్రీ నిమాన్ కృతవాన్ లోకాన్ యథాఽహ బ్రాహ్మణీ శ్రుతిః"
—హరివంశః 3-14-3.

"బ్రాహ్మణీ బ్రహ్మప్రతిపాదికా" —నీలకంఠః.

బ్రహ్మప్రతిపాదక మగుటచే శ్రుతి బ్రాహ్మణియై యొప్పును - అని యర్థము. బ్రహ్మప్రతిపాదిక యగు శ్రుతి బ్రాహ్మీ యని గాక బ్రాహ్మణీ యని యిట జెప్పబడుట గమనార్హము. కాన పై సూత్రము ననుసరించి జాతిరూపార్థమునవే 'బ్రాహ్మణ' అను రూపము సాధు వగు ననుట యుక్తము గాదు. బ్రహ్మ సంబద్ధమై బ్రహ్మవేతృత్వము, బ్రహ్మవిహితకర్మ ప్రకాశకత్వము వను ధర్మములు గలిగి యొప్పుటజేసి మంత్రవ్యతిరిక్త వేదభాగము బ్రాహ్మణ మనెడి యన్వర్థసంజ్ఞతో నొప్పుట స్పష్టము.

మంత్రములకు వలె బ్రాహ్మణములకు ఋషి-ఛందో-దేవతాజ్ఞాన నియమము లేనందున మంత్రములవలె బ్రాహ్మణము లపౌరుషేయములు కావు -అనెడి యాక్షేపము గూడ నొకటి గలదు. ఇక దానిని బరిశీలింతము.

మంత్రము : ఋషి-ఛందో-దేవతాపరిజ్ఞానము:-

"మంత్రముల విషయమై ఋషి - ఛందో - దేవతలతో గూర్చిన యనుక్రమణికలు గన్పట్టుచున్నవి; బ్రాహ్మణముల విషయమున గన్పట్టుట లేదు; సంహితలకు ఋష్యనుక్రమణిక గలదు; కాని వానియందు గొన్ని యెడల గల బ్రాహ్మణభాగమునకు లేదు; దీనినిబట్టి జూచినచో ఋషిచ్ఛందో దేవతా నియమములు గల మంత్రభాగము మాత్రమే యపౌరుషేయమనియు, అట్టి నియమములు లేనందున బ్రాహ్మణభాగము పౌరుషేయమనియు స్పష్ట మగుటలేదా ?" — యని యాక్షేపము.[1]

1. భగవద్దత్త-హంసరాజకృత వైదికకోశోపోద్ఘాత.

ఈ వాదము సరి కాదు. ఋషి-ఛందో-దేవతా-బ్రాహ్మణసహితమైన మంత్రములతోనే యజన-యాజన-అధ్యాపనాదిక్రియలు సలుపవలె ననియు. నట్లు జేయనిచో ప్రత్యవాయము సంభవించు ననియు శ్రుతి యిట్లు శాసించు చున్నది.

"యో హ వా అవిదితార్షేయ చ్ఛందో దైవత బ్రాహ్మణేన మంత్రేణ యజతి యాజయతి వాఽధ్యాపయతి వా స్థాణుం వర్ఛతి గర్తే వా పాత్యతే ప్రమీయతే పాపీయాన్ భవతి। ....తస్మా దేతాని మంత్రే మంత్రే విద్యాత్"

— ఆర్షేయబ్రాహ్మణమ్ 1-1-6 (చూ. సాయణకృత తై.సం. భాష్యభూమికా).

"పదం పాదం విధాం మాత్రాం ఛందో విజ్ఞాయ దైవతమ్।
ఆర్షం చ బ్రాహ్మణం చైవ తతః సామ ప్రయోజయేత్॥

— ఛందోగపరిశిష్ట (చూ. విష్ణ్వాత్మజకృత సంహితోపనిషద్బ్రాహ్మణభాష్య. 3-31).

ఇట్లు శ్రుతిశాసన మగుటజేసి మంత్రవిషయమున ఋషి చ్ఛందో దైవతానుక్రమణిక లావశ్యకములు. మంత్రవినియోగవిషయమున (యజన యాజనాది సమయమున) ఋషి-ఛందో-దైవతాదులతోపాటు బ్రాహ్మణము కూడ తెలియదగి జ్ఞేయకోటిలో జేరియున్నది. అందుచే శ్రుతితాత్పర్యము ననుసరించి బ్రాహ్మణముల విషయమై ఋషి చ్ఛందో దైవ తజ్ఞాన మావశ్యకము గాదు. కాని బ్రాహ్మణగత మంత్రముల విషయమై, యవి బ్రాహ్మణగతములై నను, మంత్రము లగుటజేసి శ్రుతి యాదేశానుగుణముగ ఋష్యాదిజ్ఞాన మావశ్యకమైనది. కాన ఋషిసంబంధ బోధక-అనుక్రమణిక లేనందున బ్రాహ్మణములు పౌరుషేయము లనుట తగదు. ప్రయోగసమవేతములు మంత్రములే కాని విధివాక్యాదిరూపము లగు బ్రాహ్మణ వాక్యములు కావు గదా। యజన యాజనాది సమయములందు ఋషిచ్ఛందోదైవత

జ్ఞానము, తత్సంబంధి బ్రాహ్మణోద్దిష్టార్థపరిజ్ఞానము—వీనితోగూడిన మంత్ర ప్రయోగమే కర్మసమృద్ధికి గారణ మనుట సంప్రదాయము. ఋషులచే నెపుడు మంత్రములు దర్శింపబడినవో, కర్మసమృద్ధికై యపుడే బ్రాహ్మణ సహితములైన మంత్రములే దర్శింపబడిన వని తెలియదగును. "యజ్ఞేన వాచః పదవీయ మాయన్। తా మన్వవిందన్ ఋషిషు ప్రవిష్టామ్।" (ఋ. 10_71-3) - అను శ్రుతివాక్యము నీ విషయము నిట్లు స్పష్టము చేయుచున్నది. "ధీరు లగువారు యజ్ఞముచేతనే వేదవాక్కు యొక్క మార్గము ననుగమించిరి." ఏ వాక్కుయొక్క మార్గము? అది స్వకపోల కల్పితమా? ఇతరకల్పితమా? రెండును కాదు. "ఋషులయందు ప్రవిష్టమై నిహితమై యున్న యజ్ఞనిష్పాదిక యగు వాక్కును బొందిరి"- అని శ్రుతి చెప్పుచున్నది. ఇక నీ మంత్రము యొక్క రెండవ పాదము. "తా మాభృత్యా వ్యదధుః పురుత్రా తాం సప్తరేభా అభి సం నవన్తే" "ఋషులనుండి యా వాక్కును గ్రహించి యధ్యాపనము, యజ్ఞము మున్నగువానిద్వారా పలువిధములుగ బలుచోట్ల వ్యాప్తి జేసిరి. అట్టి యీ వాక్కును సప్తచ్ఛందస్సులు ననుగమించుచున్నవి" - అని యర్థము. (చూ. సా.భా; ఉద్గీథ.భా; ఋషిశబ్దము). దీని ననుసరించి ఋషులచే దర్శింపబడి వారియందు నిహితమై యున్న ఛందోమయి యగు నీ వాక్కే యజ్ఞనిష్పాదిక యగు వాక్కు. అదియే యజన-యాజనాధ్యాపనాదుల ద్వారా సర్వత్ర వ్యాప్తమైనట్లు దెలియగలము. యజన-యాజనాది సమయములందు ఋషి చ్ఛందో దైవతబ్రాహ్మణ జ్ఞానరహిత మగు మంత్రమును బ్రయోగింప రాదని శ్రుతిశాసనము. కనుక యజ్ఞనిష్పాదిక యగు వేదవాక్కునే ఋషులు దర్శించిరి; అనగా కర్మసమృద్ధికై బ్రాహ్మణసహితమగు మంత్రజాతమునే దర్శించి రనుట శ్రుతిసంమతము, యుక్తిసహము గూడ. మఱియు బ్రాహ్మణములకు ఋషి-ఛందో-దేవతాజ్ఞాన మావశ్యకము కా దనినంత

మాత్రముచే వానికి ఋషిసంబంధము (ఆర్షేయత్వము) లేదనుటయు, కాన నవి పౌరుషేయములే యని యనుటయు యుక్తము గాదు. బ్రాహ్మణము లకు గల ఋషిసంబంధము సాయణాదిభాష్యకర్తలచే నుదహరింపబడిన కాండానుక్రమణికావచనములచే దెలియనగును.

"శాఖాదిం యాజమానం చ హోతౄన్ హౌత్రం చ దార్శికమ్ ।
తద్విధీన్ పితృమేధం చ నవాహుః కస్య తద్విదః॥
అధ్వరప్రభృతి త్రీణి తద్విధి ర్వాజపేయకౌ,
సవా శ్శుక్రియకాండే చ నవేందో రితి ధారణా॥"

— కాండానుక్రమణికా.

"శాఖాదిః 'ఇషేత్వా' ఇత్యాది ప్రపాఠకః, యాజమానాః 'సం త్వా సించామి' ఇత్యా ద్యనువాక షట్క మంత్రాః। హోతారః 'చిత్తిః స్రుక్' ఇత్యాదయో మంత్రాః। 'సత్యం ప్రపద్యే' ఇత్యాదికం దార్శికం హౌత్రమ్। తద్విధయః ప్రోక్తానాం చతుర్విధమంత్రాణాం చత్వారి బ్రాహ్మణాని। పితృమేధః 'పరేయువాగ్ంస' మితి। తా న్యేతాని నవకాండాని ప్రజాపతినా దృష్టాని" — తై. సం. సా. ఉపోద్ఘాతః.

'ఆప ఉంద న్త్విత్యాదిక మధ్వరకాండమ్ । ఆదదే గ్రావాసీ త్యాదికం గ్రహకాండమ్। ఉదుత్యం జాతవేదస మిత్యాదికం దక్షిణాకాండమ్ । తాన్యేతాని త్రీణి । ప్రాచీన వగ్ంశం కరోతీత్యాదికం త్రయాణా మేతేషాం విధిః । దేవ సవితః ప్రసువేత్యాదికం వాజపేయస్య మంత్రకాండమ్ । దేవా వై యథా దర్శం యజ్ఞా నాహరన్తేత్యాదికం వాజపేయస్య విధికాండమ్ । త్రివృత్స్తోమో భవతీత్యాదికాః సవాః।

నమో వాచే యాచోది తేత్యాదికం శుక్రియ మంత్రకాండమ్।
దేవా వై సత్ర మాసతే త్యాదికం తద్విధికాండమ్। తాన్యేతాని
నవ సంఖ్యాకాని చంద్రస్య కాండాని। అత స్తేషు చంద్ర
ఋషి రితి ధ్యేయమ్।" — సా. భా. - తై. సం. 1-2-1.

పై కాండానుక్రమణికాశ్లోకములను, శ్రీ సాయణకృత తదర్థవివరణమును బరిశీలించుచో తైత్తిరీయసంహితయందలి దార్శికాద్యశ్వమేధ మంత్రాది కాండలు ప్రజాపతి-సోమాదులచే దృష్టము లయినట్లే, తద్విధిరూపము లగు బ్రాహ్మణములును వారిచేతనే దృష్టము లయినట్లు స్పష్ట మగును. ఇట్లే వివిధశాఖాగత మంత్ర బ్రాహ్మణవిషయమునను దెలియదగును.

"కొన్నియెడల బ్రాహ్మణములకు ద్రష్ట ప్రజాపతి యని చెప్పబడుచున్నాడు. ప్రజాపతి పరమేశ్వరునుండి మంత్రభాగమును గ్రహించి, పిదప వేదవ్యాఖ్యానరూపములగు బ్రాహ్మణముల బ్రవచించెను: ఇట్లు వేద వ్యాఖ్యాన ప్రవచనకర్త యగుటజేసియే ప్రజాపతి యచటచట బ్రాహ్మణములకు ఋషిగా జెప్పబడినాడు"—అనియు విమర్శకుల యాక్షేపము.[1]

ఇట్లనుట సరికాదు. 'ఋషి ర్దర్శనాత్'—అని ఋషిశబ్ద నిర్వచనము. దీని ననుసరించి 'దర్శనము' వలననే ఋషిత్వవ్యవహార మేర్పడవల యునుగాని 'వ్యాఖ్యాప్రవచనముల' వలన గాదు. వేదగతార్థమును దర్శించి వ్యాఖ్యాప్రవచనముల జేసినవారు స్మృతికర్తలు. వారు మంత్రబ్రాహ్మణ ద్రష్టలై, ఋషులై, పిదప స్మృతికర్త లయిరి. అంతియేకాని స్మృతికర్తృత్వము—వ్యాఖ్యాప్రవచనకర్తృత్వము—ఋషిత్వప్రయోజకము కాదు. (చూ- ఋషిశబ్దము). ద్రష్టృత్వప్రయుక్తమే ఋషిత్వము, కాగా ప్రజాపతికి గల ద్రష్టృత్వము వ్యాఖ్యాప్రవచనపూర్వకము కాదనుట శ్రుతిస్మృతి సంప్ర

1. భగవద్దత్త—వైదికకోశోపోద్ఘాత-పుట. 46.

దాయాభిమతము. శ్రీ సాయణాదులును 'ప్రజాపతినా దృష్టాని' యని వ్యాఖ్యానించుట గమనార్హము. కాన వేదవ్యాఖ్యానరూప బ్రాహ్మణముల ప్రవచించుటచే ప్రజాపతికి ఋషిత్వవ్యవహారము గలదనుట సంప్రదాయాభిమతము, యుక్తిసహము గాదు.

వాత్స్యాయనమహర్షియు 'మంత్రబ్రాహ్మణద్రష్టలగు ఋషులే పురాణేతిహాస—ధర్మశాస్త్రకర్తలు'—అని యనినాడు.

> "ద్రష్టృ ప్రవక్తృ సామాన్యా చ్చాప్రామాణ్యానుపపత్తిః'—య ఏవ మంత్రబ్రాహ్మణస్య ద్రష్టారః ప్రవక్తారశ్చ తే ఖల్వితిహాసస్య పురాణస్య ధర్మశాస్త్రస్య చేతి"
>
> —వాత్స్య.భా; న్యా.సూ. 4-1-62.

> "య ఏవ వేదస్య ద్రష్టారోఽనుష్ఠాతారశ్చ తదర్థస్య త ఏవ స్మృతీతిహాసాదీనాం ప్రవక్తారః — — ఇత్యర్థః"
>
> —ఉద్యోతవ్యాఖ్య.

మంత్రబ్రాహ్మణ (వేద) ద్రష్టలును ప్రవక్తలు నగు ఋషులే పురాణేతిహాస—ధర్మశాస్త్రప్రవక్తలు — అని యర్థము. ఇట 'మంత్రబ్రాహ్మణయోః ద్రష్టారః' అనిగాక 'మంత్రబ్రాహ్మణస్య ద్రష్టారః' అని యేకవచన ప్రయోగము గలదు. మంత్రబ్రాహ్మణయో ర్వేదనామధేయమ్' — ఇత్యాది స్థలములయందు నితరేతరయోగద్వంద్వముచే మంత్రబ్రాహ్మణములకు గల నిరంతరసాహచర్య మభివ్యక్త మగును, ఇట న్యాయభాష్యమున 'మంత్ర బ్రాహణస్య ద్రష్టారః'—అని సమాహారద్వంద్వ మాశ్రయించి యేకవచనము ప్రయోగింపబడినది. అందుచే ఋషులు మంత్రబ్రాహ్మణసముదాయరూప వేదరాశియొక్క ద్రష్టలు; తదేకదేశమునకు గాదు'—అను విషయముగూడ నభివ్యక్త మగుచున్నది. కాన ఋషులు దర్శించినది మంత్రబ్రాహ్మణ

సముదాయము; తదేకదేశము కాదు. తత్ప్రోక్తములు పురాణేతిహాస ధర్మశాస్త్రములు. అట్లుగాక బ్రాహ్మణములు కూడ ఋషిప్రోక్తము లగుచో నవియు స్మృతులే యనబడెడివి. తత్ప్రోక్తములైన స్మృతులే 'మంత్ర బ్రాహ్మణములు రెండును వేదము'—అని ముక్తకంఠముగ గర్జించినవి. కాన విమర్శకుల యొక్క పై యూహలు బ్రాహ్మణగత పౌరుషేయత్వ నిర్ణాయకములు గాజాలవు. ప్రత్యక్షప్రమాణముచేగాని, యనుమానప్రమాణముచే గాని తెలియజాలని పురుషార్థోపాయములను—అతీంద్రియార్థములను దెలియజేయజాలినది వేదము (వేదయతీతి) — అనునదియే వేదముయొక్క వేదత్వమును తెలియజేయు లక్షణము. అట్టి లక్షణము మంత్రమునందు వలెనే బ్రాహ్మణమునందు నుండుటచే మంత్రబ్రాహ్మణాత్మక శబ్దరాశికి ఛందస్త్వ మవిరుద్ధము.

ఇంతవరకును 'గాయత్ర్యాదిఛందోబద్ధములు గావందున బ్రాహ్మణములకు ఛందస్త్వము లేదు' - అనెడి శ్రీ నాగేశభట్టు వాదమును, బ్రాహ్మణభాగమునకు వేదసంజ్ఞయే లేదనెడి శ్రీ దయానందాదుల వాదములును బరిశీలింపబడినవి. మంత్రబ్రాహ్మణముల రెండిటికిని వేదత్వము, ఛందస్త్వము గలదని దర్శించితిమి. ఛందఃపద పరిశీలనము వలనను నీ విషయ మింకను స్పష్టము కాగలదు. 'ఛందోబద్ధత్వము ఛందస్త్వ' మనునది యాపాతలక్షణము మాత్రమే యని నిరూపింపబడినందున నిక శ్రుత్యనుగుణముగ ఛందోలక్షణ మేదియో దెలియవలసియున్నది.

శ్రుతులు-ఛందఃపదనిర్వచనములు :-

శ్రుతులే ఛందఃపదము నెట్లు నిర్వచించినవో జూతము.

ఛాదనాత్ ఛందాంసి :-

"దేవా వై మృత్యో ర్బిభ్యత స్త్రయీం విద్యాం ప్రావిశగ్ం స్తే ఛందోభి రాచ్ఛాదయన్ య దేభి రాచ్ఛాదయగ్ం స్త చ్ఛందసాం ఛందస్త్వమ్" — ఛాం.ఉ. 1-4-2.

దేవతలు మృత్యువునకు భయపడిరి. మృత్యువునుండి రక్షింపగల్గినది త్రయీవిద్యయే యని తలచిరి. త్రయీవిద్య నాశ్రయించిరి. తద్విహిత కర్మాచరణమునకు దొడగిరి, ఛందస్సులతో (మంత్రములతో) వివిధజప హోమ కర్మాదుల ననుష్ఠించిరి. ఇట్లు నిరంతరము తమ్ము ఛందస్సులతో నాచ్ఛాదించుకొనిరి గాన నాచ్ఛాదకము లగుటచే ఛందస్సు లని వేదములకు నన్వర్థసంజ్ఞ - అని యర్థము.

యాస్కమహర్షియు 'ఛందాంసి ఛాదనాత్' (నిరు. 7-3-2) అని పై శ్రుత్యుక్త నిర్వచనమునే ప్రదర్శించినాడు. పై శ్రుతివాక్యముల గమనించుచో 'కృత్స్న వేదరాశికిని ఛందస్సు లనెడి వ్యవహారము గలదు; నిరంతరము వేదమంత్రములతో సఖ్యము జేయుచు తద్విహితకర్మాద్యను ష్ఠానతత్పరు లగుటయే ఛందస్సులతో నాచ్ఛాదించుకొనుట; ఆచ్ఛాదకము లగుచు వేదమంత్రములు మృత్యువును దూరము జేసి క్రమముగ నమృతత్వ మును సిద్ధింపజేయును' - అని త్రయీవిద్యారూప ఛందఃస్వభావము దెలియును.

భగవద్గీతయందు సంసారవృక్షముయొక్క పర్ణములుగా ఛందస్సు లకు రూపకల్పన యిట్లు చేయబడినది.

"ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్ ।
ఛందాంసి యస్య పర్ణాని య స్తం వేద స వేదవిత్ ॥"

— భ. గీ. 15-1.

"ఛందాంసి ఛాదనాత్ ఋగ్యజుః సామ లక్షణాని యస్య
సంసారవృక్షస్య పర్ణానీవ పర్ణాని। యథా వృక్షస్య
పరిరక్షణార్థాని పర్ణాని తథా వేదాః సంసార వృక్ష పరిరక్ష
ణార్థాః, ధర్మాధర్మ తద్ధేతు ఫలప్రకాశనార్థత్వాత్ ...."— శం. భా.

ఆచ్ఛాదకములగుటచే ఋగ్యజుః సామలక్షణములగు మంత్రములకు ఛందస్సు లని పేరు పర్ణములు వృక్షమునువలె ఛందస్సులు మాయామయసంసారవృక్ష పరిరక్షణము సేయుచుండును - ధర్మాధర్మములు, వానివలని ఫలములను ప్రకాశింపజేయుట ద్వారా ఛందస్సులు సంసారవృక్షపరిరక్షణార్థమై యవతరించినవి_అని యర్థము. సంసారవృక్షమునకు మూలము బ్రహ్మ. హిరణ్య గర్భాదులగు జీవులు శాఖాస్థానీయులు. ఆ వృక్షము వినశ్వరము (న శ్వోఽపి స్థాతుం యోగ్యం ఇతి అశ్వత్థమ్) ; కాని యిది బీజాంకురరూపమున ప్రవాహ నిత్యము. వేదోక్తములగు కర్మ లనెడి జలములచే తడుపబడి వర్థిల్లు చుండును ; బ్రహ్మజ్ఞానముచే ఛేదింపబడుచుండును. ఇదియే వేదార్థము. ఇట్లు సమూలసంసారవృక్షజ్ఞానము గలవాడే వేదవిదుడు _ అని పై శ్లోక తాత్పర్యము. (చూ. మధుసూదనీ వ్యాఖ్య).

ఇట ఛాదన మనగా 1. తత్త్వవస్తుప్రావరణము, 2. సంసారవృక్ష రక్షణము - అని రెండర్థములు చెప్పబడుచున్నవి. ఫలకాములై కర్మల యందు జరించువారికి తత్త్వము నాచ్ఛాదించి ధర్మనిష్ఠుల గావించి సంసార వృక్షమును రక్షించుచుండును. జ్ఞానులగువారికి ధర్మాధర్మఫలముల యొక్క యనిత్యత్వమును దెలిపి రక్షించుచుండును. కర్మిష్ఠుల నధర్మరూపమృత్యువు నుండియు, జ్ఞానులను సంసారరూపమృత్యువునుండియు నాచ్ఛాదించి రక్షించునవి గాన వేదములు ఛందస్సులు - అను నర్థము పర్యవసిత మగుచున్నది. కాన మృత్యువునుండి భీతులై దేవతలు త్రయీవిద్యను

ప్రవేశించి ఛందస్సులతో దమను ఆచ్ఛాదించుకొని రను పై శ్రుతి తాత్పర్యమే యిట వివరింపబడిన దనుట స్పష్టము. స్మృతులు నీ యర్థము నిట్లు వివరించినవి.

"మృత్యుభీతైః పురా దేవై రాత్మన శ్ఛాదనాయ చ।
ఛందాంసి సంస్కృతా నీహ చ్ఛాదితా పై రతోఽమరాః॥
ఛాదనా చ్ఛంద ఉద్దిష్టం వాససీ కృత్తి రేవ వా।
ఛందోభి రావృతం సర్వం విద్యా త్సర్వత్ర నాఽన్యతః॥"

— బృ-పరా. స్మృతి. 2-41-42.

ఛందస్సులు శర్మ హేతువులు-కృష్ణాజినశిల్పము (చర్మ-శర్మ) :-

యజ్ఞదీక్షితులగు యజమానుల నాచ్ఛాదించి పరిరక్షణము సేయుచు ఛందస్సులు శర్మ (సుఖ) హేతువు లగునను విషయము కృష్ణాజినదీక్షా ధారణ మను వ్యాజమున శ్రుతి చక్కగా నిట్లు వివరించినది.

"అథ కృష్ణాజిన మాదత్తే యజ్ఞస్యైవ సర్వత్వాయ। యజ్ఞో హ దేవేభ్యోఽపచక్రామ, స కృష్ణో భూత్వా చచార। తస్య దేవా అనువిద్య త్వచ మేవావచ్ఛాయాఽఽజహ్రుః॥"

"తస్య యాని శుక్లాని చ కృష్ణాని చ లోమాని-తా న్యృచాం చ సామ్నాం చ రూపం.... యది వేతరథా....యా న్యేవ బభ్రూణీవ హరీణి తాని యజుషాం రూపమ్"

"సైషా త్రయీ విద్యా యజ్ఞః। తస్యా ఏత చ్ఛిల్పమ్-ఏష వర్ణః। తద్యత్ కృష్ణాజినం భవతి। యజ్ఞస్యైవ సర్వత్వాయ। తస్మాత్ కృష్ణాజిన మధిదీక్షన్తే యజ్ఞస్యైవ సర్వత్వాయ...."

''అథ కృష్ణాజిన మాదత్తే - 'శర్మాసి (వా.సం. 1-14)' - ఇతి। చర్మ వా ఏతత్ కృష్ణస్య, తదస్య తన్మానుషం, శర్మ దేవత్రా। తస్మా దాహ-శర్మాసీతి'' — శ.బ్రా. 1-1-4-1 నుండి 4.

''దక్షిణే నాహవనీయం ప్రాచీనగ్రీవే కృష్ణాజినే ఉపస్తృణాతి ....యాని శుక్లాని తానిది వో రూపమ్। యాని కృష్ణాని తా న్యస్మై। య దివేతరథా—యాన్యేవ బభ్రూణీవ హరీణి-తాన్యన్తరిక్షస్య రూపమ్। తదేన మేషు లోకే ష్వదీక్షయతి....॥''

''-తే వా మారభే' (వా.సం. 4-9) ఇతి। గర్భోవా ఏషభవతి -యో దీక్షతే। స ఛందాంసి ప్రవిశతి తస్మాన్న్యక్నాంగులి రివ భవతి। న్యక్నాంగులయ ఇవ హి గర్భాః-''

''అథ దక్షిణేన జానునా ఽఽరోహతి-'శర్మాసి శర్మ మేయచ్ఛ' (వా.సం. 4-9) ఇతి। చర్మ వా ఏతత్ కృష్ణస్య తదస్య తన్మానుషమ్। శర్మ దేవత్రా। తస్మా దాహ-శర్మాసి శర్మ మే యచ్ఛేతి'' —శ.బ్రా. 3-2-1-1 నుండి 8.

''యజ్ఞము దేవతలనుండి తొలగిపోయి కృష్ణమృగరూపమై సంచరింప జొచ్చెను; దేవతలు వెన్నంటిపోయి దాని చర్మమును గ్రహించిరి. కాన యజ్ఞశరీరమే కృష్ణాజినము. దానియందలి శుక్ల-కృష్ణ-బభ్రు వర్ణములు ఋక్-సామ-యజుస్సుల యొక్క రూపములు. కాన నా వర్ణములు ఋగ్యజుః సామశిల్పములు. ఇట్లు కృష్ణాజినము త్రయీవిద్యాస్వరూపము. త్రయీవిహిత కర్మసాధ్య మగుటచే యజ్ఞము కూడ త్రయీస్వరూపము. అట్టి కృష్ణాజినమును గ్రహించుటచేతను, ఆచ్ఛాదించుకొనుట చేతను, యజ్ఞమునకు పూర్ణత సిద్ధించును. అందుచేతనే యజ్ఞదీక్షితుడగు యజమానుడు ఛందస్సుల బ్రవేశించును. (స ఛందాంసి ప్రవిశతి). అని శ్రుతి

చెప్పుచున్నది. లేక – కృష్ణాజినము నందలి శుక్ల–కృష్ణ–బభ్రువర్ణములు లోకత్రయరూపములు; లోకత్రయరూపమగు కృష్ణాజినమును ధరించి యజమానుడు లోకత్రయదీక్షితు డగుచున్నాడు. మానవునకు మొదట గల్గునది మానుషజన్మ. యజ్ఞాచరణముచే పునర్జన్మగలిగి దేవత్వము సిద్ధించును. కావున దీక్షితుడగు యజమానుడు గర్భస్థశిశు తుల్యుడు. గర్భస్థశిశు వేరీతిగ వ్రేళులు ముడిచి గుప్పిలి పట్టి (న్యక్నాంగుళిః ముష్టీన్ కురుతే) మాతృశరీరాచ్ఛాదితుడై యుండునో యజమానుడు నట్లే గుప్పిలి పట్టి త్రయీవిద్యారూప ఛందోమాతృ శరీరాచ్ఛాదితుడై – కృష్ణాజిన (చర్మ) ధారియై యుండవలెను. అందుకే కృష్ణాజినధారణము, కృష్ణాజినము మానుషదృష్టిలో గృష్ణమృగము యొక్క చర్మమే(త దస్య త న్మానుషమ్). కాని దేవతా ప్రీతికర మగుటచే యజ్ఞకర్మమునందీ చర్మము శర్మ (శర్మ దేవత్రా) యగును. కావుననే యజమానుడు – 'నీవు శర్మరూపివి: నాకు శర్మ (సుఖము) నిమ్ము (శర్మాసి శర్మ మే యచ్ఛ)' – అని కృష్ణాజినమును సంబోధించి యధిరోహించుచు బలుకును" – అని యర్థము.

ఇట కృష్ణాజినము త్రయీవిద్యాశిల్పము ; అది మానుషదృష్టిలో చర్మము ; నియమపూర్వక యజ్ఞానుష్ఠానసమయమున దేవతాప్రీతికరమై శర్మరూపము' – అని చెప్పబడినది. అట్లే ఋక్–యజుః–సామలక్షణమగు త్రయీవిద్యయు మానుషదృష్టిలో కేవలము చర్మరూపము. అనగా మనస్సు నాచ్ఛాదించెడి కేవలశబ్దరూపము. కాని వేదార్థకుశలుడై వేద విహిత కర్మాదిపరతంత్రు డగుచు నిరంతరము ఛందస్సులతో నాచ్ఛాదించు కొనుచో నపు డా త్రయీవిద్య కేవలచర్మ (శబ్ద)రూపము గాక దేవతా ప్రీతిహేతు వగుచు శర్మ (సుఖ) రూప మగు నను విషయ మిట సూచితమగుచున్నది. పూర్వము దేవతలు మృత్యువునకు భయపడి త్రయీవిద్యను

ప్రవేశించి ఛందస్సులతో తమ్మాచ్ఛాదించుకొని రనెడి పూర్వోదాహృత శ్రుత్యర్థమే యిట కృష్ణాజినశిల్పము ద్వారా ప్రదర్శింపబడినది.

త్రయీవిద్యారూపము యజ్ఞము ; త్రయీవిద్యాశిల్పము కృష్ణాజినము — కాన నట్టి త్రయీవిద్యాధ్యయనమునందు అధికారము సిద్ధించుటకై చేయబడెడి యుపనయనసంస్కారమునందును గూడ కృష్ణాజినధారణము చేయబడుచుండును. అది మానుషదృష్టిలో 'చర్మ మే' యయ్యును దేవతా ప్రీతికరమై శర్మ (ఆనంద) హేతు వగుచు 'శర్మ' యగునని చెప్పబడినది. త్రయీవిద్యాప్రతిష్ఠితు లయి ఛందస్సులతో తమ్మాచ్ఛాదించుకొనువారు చిత్తశుద్ధిద్వారా క్రమముగ శర్మ(ఆనంద)స్వరూపు లగుదు రని ప్రబోధించుటయే కృష్ణాజినధారణతాత్పర్యము. నేటికిని అభివాదనప్రసంగమున శర్మాంతముగనే (నారాయణశర్మా అహం భోః అభివాదయే - యనుచు) నామోచ్చారణ జేయుట నీ వైదికసంప్రదాయరహస్యద్యోతక మనవచ్చును. ఆనందస్వరూపు డగుటచేతనే పరమేశ్వరునకును శర్మ యని నామము.

''సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః''

— విష్ణుసహస్రనామము.

''పరమానందరూపత్వాత్ శర్మ'' — శం.భా.

శర్మ (ఆనంద) స్వరూపుడగు విష్ణువు యజ్ఞస్వరూపుడు (యజ్ఞో వై విష్ణుః). యజ్ఞము త్రయీవిద్యాశరీరము. అట్లే విష్ణువు త్రయీవిద్యాశరీరుడు.

''యస్య ఛందోమయం బ్రహ్మ దేహ ఆవపనం విభో।
శ్రేయసాం తస్య గురుషు వాసోఽత్యన్తవిడంబనమ్॥''

— భాగ. 10-80-45.

దేవా ! శ్రేయోమూలము, ఛందోమయము నగు బ్రహ్మ (వేదము) నీ మూర్తి. అట్టి నీవు విద్యాభ్యాసమునకై గురుకులవాసము చేయుట లోక

ధర్మానుకరణము మాత్రమే' - అని తన నెచ్చెలియైన శ్రీకృష్ణునితో కుచేలుడు పల్కిన వాక్యము.

కాన, 'కృష్ణమృగచర్మ-శర్మ' - శబ్దములు 'యజ్ఞము యొక్క లేక పరమేశ్వరుని యొక్క దేహ మగు త్రయీవిద్యనే తాము ధరించుట'- యను భావమును ఆరాధకులకు స్ఫురింపజేయునట్టివి. ఇంతేకాదు ; అవి శర్మహేతువులు. ఛందస్సులు శర్మహేతువు లను విషయమును 'సంహితా' పదప్రశస్తి ద్వారా శ్రుతి యిట్లు ప్రతిపాదించుచున్నది.

> "ప్రజాపతిః ప్రజాః సృష్ట్వా వ్యస్రంసత సంవత్సరః, స
> ఛ్ఛందోభి రాత్మానం సమదధా ద్య చ్ఛందోభి రాత్మానం
> సమదధా త్తస్మా త్సంహితా ఇతి" — ఐ.ఆ. 3-2-12.

కాలస్వరూపుడగు పరమేశ్వరుడు దేవ తిర్య ఙ్మనుష్యరూప ప్రజలను సృజించి శ్రాంతుడై ఛందస్సులచే స్వశరీరమును సమాహితము గావించెను. అనగా వేదోక్త మంత్రపాఠసామర్థ్యముచే స్వావయవ పాటవమును సంపాదించెను. ఛందస్సులచే (వేదములచే) స్వశరీరమును సమాహితము గావించుటచే ఛందః పాఠమునకు 'సంహిత'యని యన్వర్థనామము. (యస్మా దయం ఛందోభిః స్వశరీరం సమాహితవాం స్తస్మా త్సమాధానహేతుత్వా చ్ఛందః పాఠః సంహితే త్యుచ్యతే-సా.భా.). సృష్టికార్య పరిశ్రాంతు డగు ప్రజాపతి ఛందఃపాఠముచే సమాహితు డయినట్లు, సంసారభారపరిశ్రాంతు లగువారును ఛందఃపాఠముచే సమాహితు (స్వస్థు) లగుదురు; అట్టివారి స్థూల-సూక్ష్మ శరీరములు సమాహితము (స్వస్థము) లయి, ఆనంద (శర్మ) ప్రాప్తిని గల్గించెడి పాటవము ఛందఃపాఠము (స్వాధ్యాయము)చే సమకూరును: అందుచే - ఎట్లు స్వాస్థ్యమును, పాటవమును గల్గించునది యగుటచే- స్వాధ్యాయము 'సంహిత' యగునని తాత్పర్యము.

కాన 'ఛాదనాత్ ఛందాంసి' - యను నిర్వచనమే యిట చెప్పబడి నట్లగుచున్నది. కాని ఛాదన మనగా నాచ్ఛాదించుట (మృత్యువునుండి యాచ్ఛాదించుట) యను నర్థము పూర్వము చెప్పబడినది. 'స్వాస్థ్యమును జేకూర్చి పాటవమును గల్గించుట' యని యిట జెప్పబడినది. రెండిటి తాత్పర్య మొకటియే. 'ఛాదయతి' - యను క్రియకు సిద్ధాన్తకౌముది యందు నీ యర్థము లిట్లు వివరింపబడినవి.

"స్వార్థే ణిచి తు ఛాదయతి। బలీ భవతి, ప్రాణీ భవతి,
అపవారయతి వేత్యర్థః"

'ఛాదన' మనగా బలవంతు డగుట, ప్రాణశక్తిమంతు డగుట, ఆచ్ఛాదించుట_అని యర్థము. అట్టి ధర్మము గలవి యగుటచే వేదములకు 'ఛందస్సు'లని పేరు. ఛందస్సులతో నాచ్ఛాదించుకొనుటచే ప్రాణులు శక్తిమంతు లగుదు రను విషయము తైత్తిరీయశ్రుతియు నిట్లు వివరించినది.

"ప్రజాపతి రగ్ని మచినుత। స క్షురపవి ర్భూత్వాఽతిష్ఠత్।
తం దేవా బిభ్యతో నోపాఽఽయన్। తే ఛందోభి రాత్మానం
ఛాదయిత్వోపాఽఽయన్। తచ్ఛందసాం ఛంద స్త్వమ్। బ్రహ్మ
వై ఛందాంసి। బ్రహ్మణ ఏత ద్రూపగ్ం యత్ కృష్ణాజినమ్।
కార్ష్ణీ ఉపానహా వుపముంచతే। ఛందోభి రేవాఽఽత్మానం
ఛాదయిత్వాఽగ్ని ముపచరతి॥" —తై. సం. 5-6-6-1.

ప్రజాపతి యగ్నిచయనము జేయ నా యగ్ని తీక్ష్ణవజ్రధారవలె నత్యుగ్ర రూపుడై తేజరిల్లెను. దేవత లా మహాగ్నిని జూచి భయపడి సమీపింప లేకైరి. వా రపుడు ఛందస్సులతో దమ్మాచ్ఛాదించుకొని వానితో నాత్మరక్ష గావించుకొని యగ్నిదరి జేర గల్గిరి. ఇట్లాచ్ఛాదకము లయి, ఆత్మరక్షా

కరము లగుటయే ఛందస్సుల ఛందస్త్వము. వేదమే (బ్రహ్మయే) ఛందస్సులు. కృష్ణాజినము అనునది బ్రహ్మ(వేదము)యొక్క రూపము. కాన యజమానుడు కృష్ణాజిననిర్మితములగు పాదుకల ధరించుచున్నాడు. అనగా ఛందస్సులచే నాచ్ఛాదింపబడి యగ్నిని సమీపించుచున్నాడు—అని యర్థము. ప్రత్యక్షముగ జ్వాలారూపుడై తీక్ష్ణముగ గన్పట్టెడి యగ్ని ఛందస్సులతో నాచ్ఛాదించుకొనెడి యజమానునకు దేవతారూపమున బ్రసన్నుడై ప్రాప్యుడగునని భావము. ఆచ్ఛాదకము లగుచు ఆత్మరక్షాకరములు(ఆత్మచికిత్సకములు) —శర్మహేతువులు—గాన వేదములు ఛందస్సు లగునని శ్రుతితాత్పర్యము.

(2) ఛదయన్తీతి ఛందాంసి :—

ఛాదయన్తీతి ఛందాంసి—యను నిర్వచనమే గాక 'ఛదయంతీతి ఛందాంసి' యను నిర్వచనము గూడ శ్రుతులయందు గలదు.

> 'తా న్యస్మా అచ్ఛదయం స్తాని య దస్మాఽఅచ్ఛదయన్
> తస్మా చ్ఛందాంసి' — శ. బ్రా. 8-5-2-1.

ఇట శ్రుతియందు 'ఛదయన్తీతి ఛందాంసి' యను నిర్వచనము బ్రదర్శింపబడినది. 'ఛదయతి' యను క్రియకు సిద్ధాంతకౌముదియం దర్థ మిట్లు గలదు.

> "ఛదంతం ప్రయుంక్తే ఛదయతి। బలవంతం ప్రాణవంతం వా కరో తీత్యర్థః"

బలవంతుని, లేక ప్రాణవంతుని జేయునది యని యర్థము. కాన నీ నిర్వచనము గూడ పూర్వోక్తమైన 'ఛాదయన్తీతి ఛందాంసి' యను నర్థమునే స్పష్టము జేయుచు వివరించుచున్నది.

ఇంతేగాక ఛందః శబ్దమునకు మఱియొక నిర్వచనము గూడ సంప్రదాయానుగతమై కానవచ్చుచున్నది.

3) చందయతి-ఆహ్లాదయతి :-

'చందయతి ఆహ్లాదయతి, చంద్యతేఽనేనవా - చది ఆహ్లాదనే-
చందే రాదే శ్చ ఛః (ఉణాది.4-218) ఇతి అసున్-చస్య ఛశ్చ'-
— అమరసుధాటీకా ; వాచస్పత్యము.

ఆహ్లాదపరచునవి, లేక దీనిచే నానందింపజేయబడుదురు గాన ఛందస్సులు- అని యర్థము. ఆహ్లాదపఱచునవి యనుటచే లోకోత్తరాహ్లాదముచే జిత్తమును స్వస్థము(సమాహితము) గావించునవి యని సూచిత మగుచున్నది. ఈ లోకోత్తరాహ్లాదమే రమణీయార్థము. అట్టి రమణీయార్థమును బ్రతిపాదించు వేదశబ్దములే ఛందస్సులు. అట్టివి యగుటచేతనే వీనివి కావ్య మనుచు 'కావ్యం ఛందః; త్రయీ వై విద్యా కావ్యం ఛందః' - అని యీ రీతిగ శ్రుతులును బ్రవర్తిల్లినవి. (చూ. కవి కావ్యశబ్దములు).

గాయత్ర్యాదిఛందస్సులు - ఛందస్త్వము :-

'ఛందాంసి ఛాదనాత్' — అను నీ వ్యుత్పత్తి ననుసరించియే గాయత్ర్యాది, ఛందస్సులకును ఛందస్సు లను నామ మన్వర్థమైనది.

"స చ్ఛందోభి శ్ఛన్నో యచ్ఛందోభి శ్ఛన్న స్తస్మా
చ్ఛందాంసీ త్యాచక్షతే ఇతి"

"ఛాదయన్తి హ వా ఏనం ఛందాంసి పాపా త్కర్మణో
యస్యాం కస్యాంచి ద్దిశి కామయతే య ఏవ మేత
చ్ఛందసాం ఛందస్త్వం వేద, ఇతి" — ఐ. ఆ. 2-1-6

ఉష్ణిక్ గాయత్ర్యాది ఛందస్సులు ప్రాణదేవత (హిరణ్యగర్భుని) యవయవములు. కాన ప్రాణదేవత గాయత్ర్యాది ఛందోమయము. ఇట్లు ప్రాణదేవత ఛందోమయి యగుచు గాయత్ర్యాది ఛందస్సులచే నాచ్ఛాదిత మగుటజేసి, ఛాదనహేతువు లగు గాయత్ర్యాదులకును 'ఛందస్సు' లని యన్వర్థనామము గల్గినది. మఱియు నెవ డీ ఛందస్సులు ప్రాణదేవత నాచ్ఛాదించునవి యని తెలిసికొనునో యతడు ఎచట నే పాపము చేయ సంకల్పించినను గాయత్ర్యాది ఛందస్సు లా ప్రాణదేవతోపాసకుని పాపము నుండి యాచ్ఛాదించును ; పాపసంకల్పముల బోనాడి పాపమును స్పృశింప కుండ జేసి యాతని రక్షించును – అని యర్థము.

మంత్రములతో సంబంధము లేక గాయత్ర్యాదిఛందస్సులకు స్వతంత్రమైన యునికి లేదు. ఇట గాయత్ర్యాది ఛందస్సు లాచ్ఛాదించు చున్న వనినచో వేదములు ప్రాణదేవత నాచ్ఛాదించుచున్న వనియే యర్థము. ఐతరేయబ్రాహ్మణము గూడ ఛందస్సులు ప్రజాపతి యంగము లని యిట్లు వర్ణించినది.

"ప్రజాపతే ర్వా ఏతా న్యంగాని య చ్ఛందాంసి" — ఐ.బ్రా. 7-8.

కాన నిట్లు ఛందస్సులు ప్రజాపతి యంగము లనియు, విష్ణువు ఛందోమయ మూర్తి యనియు జెప్పుటచే బరమేశ్వరుడు, లేక హిరణ్యగర్భుడు ఛందః శరీరుడు లేక ఛందోమయుడు అనితెలియును. అనగా 1) పరమేశ్వరుడు ఛందస్సుల (వేదముల)చేతనే తెలియబడును. 2) ఛందస్సులు పరమేశ్వరుని బ్రతిపాదించుటయందే తాత్పర్యము గలవి – యనెడి రెండు విషయములు స్పష్టము లగుచున్నవి. యజ్ఞదీక్షితుడై ఛందోమయుడైన యజమానుడును ప్రజాపతిరూపుడే యగు నని శ్రుతి చెప్పుచున్నది.

'ప్రజాపతి ర్యో యజతే' — ఐ.బ్రా. 7-8.

'దేవాసురా హా వై యత్ర సంయేతిర ఉభయే ప్రాజాపత్యాః'
— ఛాం. ఉ. 1-2-1.

"శాస్త్రీయ ప్రకాశ వృత్త్యభిభవనాయ ప్రవృత్తాః స్వాభావిక్య స్తమోరూపా ఇంద్రియ వృత్తయోఽసురాః। తథా తద్విప రీతాః శాస్త్రార్థ విషయ వివేక జ్యోతి రాత్మానో దేవాః స్వాభావిక తమోరూపాసురాభిభవనాయ ప్రవృత్తా ఇత్యన్యోన్యాభిభవోద్భవరూపః సంగ్రామ ఇవ సర్వ ప్రాణిషు ప్రతిదేహం దేవాసుర సంగ్రామోఽనాదికాల ప్రవృత్త ఇత్యభిప్రాయః। ....అత ఉభయేఽపి దేవా సురాః ప్రజాపతే రపత్యానీతి ప్రాజాపత్యాః। ప్రజాపతిః కర్మజ్ఞానాధికృతః పురుషః। 'పురుష ఏవోక్థమయ మేవ మహాన్ ప్రజాపతిః' ఇతి శ్రుత్యంతరాత్।" — శం. భా.

అనగా కర్మజ్ఞానాధికృతు డగుచు యజమానుడు ఛందోమయుడై వ్యష్టి పరిచ్ఛిన్న భావము వదలి తనను సమష్టిదేవతాస్వరూపు డగు ప్రజాపతిగ భావన జేయవలె ననియు క్రమముగ తద్రూపుడు కావలె ననియు దాత్పర్యము.

గరుడవాహనః - వృషభవాహనః :-

హిరణ్యగర్భునివలెనే సుపర్ణుడును ఛందోమయు డని యిట్లు చెప్పబడుచున్నాడు.

"సుపర్ణోఽసి గరుత్మాం స్త్రివృ త్తే శిరో, గాయత్రం చక్షుః,స్తోమ ఆత్మా, సామ తే తనూ ర్వామదేవ్యం బృహద్రథంతరే పక్షౌ,

యజ్ఞాయజ్ఞియం పుచ్ఛం, ఛందాగ్ం స్యంగాని ధిష్ణియాః శఫా,
యజూగ్ంషి సామ, సుపర్ణో౽సి గరుత్మాన్ దివం గచ్ఛ సువః
పత" — తై.సం. 4-1-10-5; 4-6-5-3; వా.సం. 12-4; శ.బ్రా.
6-7-2-6; ఐ.ఆ. 5-1-5-4.

ఈ శ్రుతివాక్యము లగ్నిని ఛందోమయుడగు సుపర్ణునిగా గీర్తించుచున్నవి. సుపర్ణుడు (గరుత్మంతుడు) ఛందోమయు డగుట శ్రుతితాత్పర్యము. ఛందోమయుడగు గరుడుని చే వహింపబడుచు శ్రీమహావిష్ణువు గజేంద్రుని రక్షించుటకై యేతెంచినట్లు శ్రీమద్భాగవత మిట్లు చెప్పుచున్నది.

"ఛందోమయేన గరుడేన స ఉహ్యమానః చక్రాయుధో౽భ్యగమ
దాశు యతో గజేంద్రః।" — భాగ. 8-3-31.

ఈ గరుడుడు వేదరాశి యని హరివంశము గూడ నిట్లు చెప్పుచున్నది.

"తతః స భగవాం స్తార్క్ష్యో వేదరాశి రితి స్మృతః"
— హరివంశః 76-2.

యజ్ఞము త్రయీవిద్యారూపమై ఛందోమయ మగుటజేసియే 'యజ్ఞాంగః, యజ్ఞవాహనః, వృషరథః' - ఇత్యాది నామములు శ్రుతిస్మృతులయందు బరమేశ్వరునకు జెప్పబడుచున్నవి. 'బ్రహ్మాణం బ్రహ్మవాహసమ్ (ఋ. 6-45-7 మొ.)'; యజ్ఞేభి ర్యజ్ఞవాహసం (ఋ. 8-12-20 మొ.); వృషా త్వా వృషణం వర్ధతు ద్యౌ ర్వృషా....స నో వృషా వృషరథః (ఋ. 5-36-5); యజ్ఞాంగో యజ్ఞవాహనః (విష్ణుసహస్రనామ) - ఇత్యాది శ్రుతి-స్మృతివాక్యములు 'పరమేశ్వరుడు యజ్ఞశరీరుడు, యజ్ఞవాహనుడు, ఛందఃశరీరుడు, ఛందోవాహనుడు, - అను విషయమును దెల్పుచున్నవి. అనగా ఛందస్సుల ద్వారా, యజ్ఞాదికర్మానుష్ఠానముద్వారా, పరమేశ్వరుని దర్శింప శక్య మని తాత్పర్యము. శాస్త్రయోనిత్వాత్ (బ్ర.సూ. 1-1-3),

శబ్ద బ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి' — ఇత్యాది వచనములును పరమేశ్వరుడు వేదైకప్రతిపాద్యు డని చెప్పుచున్నవి. ఈ వైదికసంప్రదాయ రహస్యమును గుర్తింపజేయుటకో యనునట్లు శివాలయములందు ఛందోమయుడు లేక ధర్మస్వరూపు డగు నందీశ్వరుని మొదట దర్శించి పిదప శివుని దర్శించుటయు, విష్ణ్వాలయములందు మొదట ఛందోమయ సుపర్ణుని (గరుత్మంతుని) దర్శించి పిదప విష్ణువును దర్శించుటయు నను నాచారము శిష్టజనసంమతమై నేటికిని వరలుచున్నది. దేవతామూర్తి కెదురుగ గరుడ ధ్వజ వృషభధ్వజముల బ్రతిష్ఠించి బ్రహ్మోత్సవముల నల్పు ఆచారములు నీ యర్థము నుపలక్షింపజేయునట్టివి.

4. ఛందస్సుల ద్వారా మాత్రమే పరమేశ్వరుని దర్శింపశక్య మగుటయు, అట్లు దర్శింపజేయుటయందు ఛందస్సులు స్వచ్ఛందములు — స్వతఃప్రమాణములు — నను విషయము ఛందఃపదము యొక్క మఱి యొక నిర్వచనము ద్వారా గ్రహింపనగును.

"ఛందాసి నామ ద్విపదాం వరిష్ఠ। స్వచ్ఛందయోగేన భవంతి తత్ర। ఛందోవిద స్తేన చ తా నధీత్య। గతా హి వేదస్య న వేద్య మార్యాః॥" —భార. సనత్సుజాతీయ. 2-41.

"హే ద్విపదాం వరిష। ఛందాంసి వేదాః, స్వచ్ఛందయోగేన స్వచ్ఛందతా స్వాధీనతా యథాకామ మిత్యర్థః। తత్రైవ ప్రమాణం భవన్తి। శ్రూయతే చ — సర్వే వేదా యత్పద మామనంతి; వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యః ఇతి। పురుషార్థపర్యవసాయిత్వా ద్వేదస్య తద్వ్యతిరిక్తస్య అనిత్వా శుచి దుఃఖానువిద్ధత్వేన పురుషార్థత్వాభావాత్ తత్స్వరూపతత్వ తతాసాధకత్వ తత్ప్రతిపాదకత్వేన వేదానాం ప్రమాణత్వ మిత్యర్థః।

యస్మా ద్వేదాః స్వచ్ఛందయోగేన తత్రైవ ప్రమాణం భవన్తి।
తేన చ హేతునా తాన్ వేదా నధీత్య అవగమ్య వేదాంత
శ్రవణాదికారణం కృత్వా, గతాః ప్రాప్తాః, వేదస్య సంవి
ద్రూపస్య పరమాత్మనః, రూపం న వేద్యం ప్రపంచం, ఆర్యాః
పండితాః బ్రహ్మవిదః॥" —శం.భా.

'వేదములు పరమేశ్వరపరములు గావు'— అని శంకించెడి ధృత రాష్ట్రుని సందియమును దొలగించుటకై సనత్సుజాతుని సమాధానవచన మిది. 'పురుషశ్రేష్ఠుడా! ఛందస్సులకు బురుషార్థముల దర్శింపజేయుటయందే తాత్పర్యము. పురుషార్థవ్యతిరిక్తము లయినవి అనిత్య—అశుచి—దుఃఖాను గతములు. కాన నవి పురుషార్థములు గావనియు ఛందస్సులు బోధించు చున్నవి. అట్టి ఛందస్సులు పరమేశ్వరస్వరూపములు, తత్సాధకములు, తత్ప్రతిపాదకములును నగును. కాన నవి అన్యనిరపేక్షముగ, అనగా స్వచ్ఛందముగ, పరమాత్మయందు ప్రమాణము లగుటచే వాని నధ్యయనము జేసి బ్రహ్మవిదులగు నార్యులు (పండితులు) వేదముయొక్క (సంవిద్రూపు డగు పరమాత్మయొక్క) స్వరూపమును బొందుదురు. కాని వేద్యమగు ప్రపంచమును బొందరు — అని యర్థము.

ఛందస్సులు స్వచ్ఛందయోగముచే బరమాత్మయందు ప్రమాణము లగు నగుటచే వేదములకు ఛందస్సు లను నామ మన్వర్థమైన దను విషయ మిట సూచిత మగుచున్నది. కాన ఛందస్సు లనగా స్వచ్ఛందముగ బురుషార్థముల బ్రతిపాదించునవి యని భావము.

ఛందస్సులు - నిర్వచనక్రమము :-

ఇంతవరకును ఛందః శబ్దమునకు శ్రుతిస్మృతులు ప్రదర్శించిన వ్యుత్పత్తు లివి.

1. ఛాదయన్తి అచ్ఛాదయన్తి ఇతి.

2. ఛదయన్తి ప్రాణీ భవన్తి, బలీ భవన్తి ఇతి.

3. చందయన్తి ఆహ్లాదయన్తి ఇతి.

4. స్వచ్ఛందయోగేన ప్రమాణం భవన్తి ఇతి — ఛందాంసి.

పైన జూపిన వ్యుత్పత్తులలో నొక్కొక్కదాని యం దొక్కొక్క విశిష్టతయు, దానిని బురస్కరించుకొని యొక క్రమపద్ధతియు నుద్దిష్టమై యున్నటుల గన్పట్టును.

1. మొదటి నిర్వచనమును జూతము. 'ఛాదయన్తి - ఆచ్ఛాదించునవి' యని యర్థము. యజ్ఞదీక్షితుడు భౌతికశరీరాచ్ఛాదితుడయ్యును, ఛందః శరీరుడై మఱియొక శరీరమును దాల్చి దివ్యజన్మ నొందు నవి యీ నిర్వచనము వలన దెలియుచున్నది. కృష్ణాజినధారణశిల్పము వలన నీ విషయము స్పష్టము గావింపబడినది. ఇట యజ్ఞదీక్షితుడు ఛందఃశరీరు డగుట యన నేమో చూతము.

కర్మానుష్ఠానమునకై దీక్షితుడగువాడు భౌతికశరీరముతో నొప్పి యున్నజాలడు. దేవతానుగ్రహపాత్రు డగుటకై వలయు విలక్షణశరీరము నాతనికి ఛందస్సులు ప్రసాదించుచున్నవి. ఆతడు జన్మసిద్ధబ్రాహ్మణత్వముతో నొప్పియున్నను నా బ్రాహ్మణత్వము వేదవిహిత కర్మానుష్ఠాన యోగ్యతాసంపాదకము మాత్రమే. తరువాత దీక్షణీయేష్టి - కృష్ణాజిన ధారణాది దీక్షాసంస్కారములచే సంస్కృతు డగుచు దీక్షితుడై ఛందస్సులతో ననుగ్రహింపబడిన నూతనశరీరముతో విశిష్టబ్రాహ్మణుడై మహావీర్యు డగు నని శ్రుతి చెప్పుచున్నది.

"అథైక ఉద్వదతి-దీక్షితోఽయం బ్రాహ్మణో దీక్షితోఽయం బ్రాహ్మణ ఇతి। నివేదిత మేవైన మేత త్సన్తం దేవేభ్యో నివేదయతి, అయం మహావీర్యో యో యజ్ఞం ప్రాప దితి। అయం యుష్మాకైకో భూత్ । తం గోపాయత ఇత్యేవై తదాహ"

— శ. బ్రా. 3-2-1-39.

"అథ యద్బ్రాహ్మణ ఇత్యాహ - అనద్ధేవ వా అస్యాతః పురాజానం భవతి । ఇదం హ్యాహుః - రక్షాంసి యోషిత మనుసచ న్తే। తదుత రక్షాంస్యేవ రేత ఆదధతీతి। అథాత్రాద్ధా జాయతే । యో బ్రాహ్మణో - యో యజ్ఞాత్ జాయతే । తస్మాదపి రాజన్యం వా వైశ్యం వా బ్రాహ్మణ ఇత్యేవ బ్రూయాత్ । బ్రహ్మణో హి జాయతే । యో యజ్ఞాత్ జాయతే । తస్మా దాహుః - న సవనకృతం హన్యాత్ ఏనస్వీ హైవ సవనకృతేతి"

— శ. బ్రా. 3-2-1-40. (వా. సం. 5-14).

అధ్వర్యు డను ఋత్విజుడు దీక్షాదిసంస్కారములచే దీక్షితుడైన యజమానుని - 'ఇడుగో దీక్షితుడైన యజమానుడు. దీక్షాదిసంస్కారములచే మహావీర్యుడై యజ్ఞకర్మ కేతెంచినాడు; ఇతడు మీలో నొక డగుటచే రక్షింపుడు' - అని దేవతలకు నివేదించును. ఇతడు జన్మసిద్ధబ్రాహ్మణత్వము గలవాడయ్యును నది యభివ్యక్తము గాకయుండును. ఏలయన, గర్భధారణసమయమున స్త్రీలు సామాన్యముగ రక్షస్సమాక్రాంత లగుదు రని చెప్పుదురు; అందుచే జన్మసిద్ధబ్రాహ్మణత్వ మభివ్యక్తము గాదు. తిరిగి యిట బ్రహ్మనుండి - అనగా యజ్ఞమునుండి - పుట్టుటచే బ్రాహ్మణు డగుచున్నాడు. అట్లే రాజన్యుడుగాని, వైశ్యుడుగాని, జన్మసిద్ధ లోక వ్యవహారయోగ్య బ్రాహ్మణత్వము లేకున్నను యజ్ఞాచరణముచే దేవతాను

గ్రహయోగ్య బ్రాహ్మణత్వము నొందును. కావున యజ్ఞశీలుని జంపరాదు. అట్లు చంపువాడు మహాపాపి యగును — అని యర్థము.

పై శ్రుతివాక్యముల గమనించుచో యజ్ఞము నాచరించినవాడు మొదటి ప్రాకృత దేహముతోగాక యప్రాకృత బ్రాహ్మీ తనువుతో విలసిల్లునని తెలియుచున్నది.

"స్వాధ్యాయేన వ్రతైర్హోమైః త్రైవిద్యే నేజ్యయా సుతైః।
మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః॥"

— మను. 2-28.

ఇత్యాది శ్రుతివచనములును పై విషయమునే వివరించుచున్నవి. ఇట్లు కర్మయోగమున బ్రవర్తిల్లువారలకు బ్రాహ్మీతనువును-ఛందఃశరీరమును-అనుగ్రహించునవి ఛందస్సులు. కనుక ఛందస్సులచే నాచ్ఛాదింపబడుట యనగా నాసురీప్రవృత్తిని దొలగించి ఛందస్సులు కర్మణ్యునియందు గ్రమముగా దైవీసంపదను విలసిల్లజేయుట యని గ్రహింపనగును. ఈ విషయమునే 'ఛందాంసి ఛాదనాత్' అను మొదటి నిర్వచనము స్ఫురింపజేయుచున్నది.

(2) 'ఛదయన్తీతి ఛందాంసి' - కర్మాచరణముచే దైవీశక్తి సంపన్నుడై క్రమముగ లౌకికవిషయవాసనాదూరుడై ఛందస్సులతో (వేదములతో) పరమేశ్వరు నుపాసించుకొలది ఇంద్రియజయము ద్వారా సమాహితు డగును. ప్రాణశక్తి యుద్దీపితమై చిత్తము వీర్యవత్తర మగును. చిత్తము వీర్యవత్తర మగుకొలది ఛందస్సులును వీర్యవత్తరము లగుచుండును. అట్లు ఛందఃసమాహితస్థిరచిత్తులే ధీరులు; బలవంతులు. 'అజితేంద్రియులు దుర్బలులు; జితేంద్రియులు బలవంతులు' ననుట శ్రుతిసంప్రదాయము. జితేంద్రియులుగానిచో వారికి గర్మయోగముగాని, భక్తి

యోగముగాని దుస్సాధము. యోగోపయుక్త చిత్తసమాధానము నవగ్రహించి ఛందస్సులా యుపాసకుల శక్తిమంతుల గావించును. క్రమముగ జిజ్ఞాసాపరులగు సాధకులకు తల్లివోలె తత్త్వము నుపదేశించుచు విజ్ఞాన బలమును పెంపొందించును. శ్రుతి యీ రెండవ నిర్వచనము ద్వారా యుద్దేశించిన బలముగాని శక్తిగాని యిట్టి యీ 'ప్రాణశక్తియే: మనఃశక్తియే; విజ్ఞానశక్తియే' - యని గ్రహింపనగును. ఇక మూడవ నిర్వచనమును జూతము.

3) 'చందయన్తి ఆహ్లాదయన్తీతి ఛందాంసి' - ఆహ్లాదపరచునవి యని యర్థము. మొదట కర్మానుష్ఠానాదుల జేసి దైవీసంపదతో విలసిల్లి, క్రమముగ నీశ్వరార్పితచిత్తుడై, శక్తిమంతుడై, విరక్తుడై, గురుశుశ్రూషాదుల ద్వారా వేదాంతశ్రవణమననాదుల జేసెడి యుత్తమాధికారికి-జ్ఞానయోగికి- ఛందస్సులు కాంతవోలె రస (ఆనంద) స్వరూపుడగు బ్రహ్మ (ఆత్మ) యొక్క యపరోక్షసాక్షాత్కారము గలిగించి యాహ్లాదపఱచును. ఇది యలౌకికానందము. శ్రుత్యుద్దిష్టమైన రమణీయార్థము నిదియే. అట్టి రమణీయార్థమును (పరమార్థమును) దర్శింపజేయు ఛందస్సు లలౌకికానందమును గలిగించునవి యని యీ మూడవ నిర్వచనముయొక్క తాత్పర్యము.

అట్టి యలౌకికానందమును గలిగించెడి విశిష్టమైన శక్తి సామగానమునం దుండుటజేసి సామలకు 'ఛందస్సు' లనెడి ప్రత్యేకనామము గలదు. కావుననే సామశాఖీయులకు 'ఛందోగాః' అనియు, తచ్ఛాఖీయోపనిషత్తులలో నొకదానికి 'ఛాందోగ్య' మనియు నామములు ప్రసిద్ధములైనవి. 'వేదానాం సామవేదోఽస్మి; వేదైః సాంగ పద క్రమోపనిషద్భిర్గాయన్తి యం సామగాః' - ఇత్యాది వచనము లిందుకు దార్కాణము. శౌనకమహర్షియు బృహద్దేవతయందు ఋక్-యజుస్-సామల స్వభావము నిట్లు చెప్పినాడు.

"యోగేన దాక్ష్యేణ దమేన బుద్ధ్యా బాహుశ్రుత్యేన తపసా నియోగైః। ఉపాస్యా స్తాః కృత్స్నశో దేవతా యా॥ ఋచో హ యో వేద స వేద వేదాన్॥ యజూంషి యో వేద స వేదయజ్ఞాన్। సామాని యో వేద స వేద తత్త్వమ్।"

—బృహద్దేవత. 8.130.

"యోగము (చిత్తవృత్తి నిరోధము), దాక్ష్యము (దక్షత), దమము, బుద్ధి (వివేకము), పాండిత్యము, తపస్సు, నియోగము (శాస్త్రోక్తవిధి) -వీనితో నొప్పు దేవతలను జక్కగ నుపాసింపవలెను. ఆ యుపాస్య దేవతా స్వరూపమును వివరించునవి ఋక్కులు. ఇట్టి ఋక్కుల నెవడు చక్కగా దెలిసికొనునో యతడే దేవతల దెలిసికొనినవాడు (ఋచో హ యో వేద స వేద దేవాన్). యజుస్సుల నెవడు తెలిసికొనునో యతడే యజ్ఞముల దెలిసినవాడు (యజూంషి యో వేద స వేద యజ్ఞాన్). సామల నెవడు తెలిసికొనునో యతడు తత్త్వము నెఱిగినవాడు(సామాని యో వేద స వేద తత్త్వం) — అని యర్థము.

ఇచట సామవిదుడు తత్త్వవిదు డగునని చెప్పుటచే సామల ప్రాశస్త్యము సూచిత మగుచున్నది. మఱియు నొకవిషయము. ఋక్కులు యజుస్సులు, సామలు మూడింటిచే కలిపి నిర్వర్తింపబడెడి క్రియకు సూలముగ యజ్ఞ మని వ్యవహారము. ఈ మూడింటిచే మూడు విభిన్నక్రియలు నిర్వర్తింపబడుచుండును. సామవిదుడు తత్త్వవిదు డగు నని చెప్పుటచే యజ్ఞమున జేయబడెడి సామగానము జ్ఞానయోగమున కుపలక్షకముగా గ్రహింప నగును. సామలు జ్ఞానయోగప్రేరకము లగుచో మిగిలినవి రెండును యథాయథముగ కర్మ-ఉపాసనా-యోగోపలక్షకములుగ గ్రహింప నగును. కావ శ్రుతివిహితమైన యజ్ఞ మనెడి మహాక్రియ త్రివిధమంత్ర జాతము యొక్క విశిష్టక్రియల ద్వారా కర్మోపాసనాజ్ఞాన-యోగత్రయమార్గ

దర్శియగు ననుట నిట సూచిత మగుచున్నది. యజ్ఞక్రియ యందు సూచనా ప్రాయముగ నుపలక్షితములైన నీ మూడు యోగముల వివరించుటకై కర్మోపాసనాజ్ఞానరూప కాండత్రయాత్మకముగ శ్రుతి ప్రవర్తిల్లినది. ఇట్టి శ్రుతియొక్క పరమలక్ష్యము ఆహ్లాదపరచుటయే — అలౌకికానందమును గల్గించుటయే. ఇది మూడవ నిర్వచనము యొక్క తాత్పర్యము.

4) 'స్వచ్ఛందయోగేన ప్రమాణం భవన్తి'— పైన జెప్పినట్లు ఛందస్సులు అధికారి యోగ్యత ననుసరించి యుపదేశించుచు క్రమముగ వారిని గర్మోపాసనాజ్ఞానయోగమార్గములందు బ్రవర్తిల్లజేసి, ప్రభు—సుహృత్—కాంతాసంమితత్వరూపములతో బొడగట్టుచు, నిట్లు స్వచ్ఛందముగ దత్త్వము నుద్బోధించుట యందు బ్రమాణము లగుచుండు నని యీ నిర్వచన తాత్పర్యము.

ఛందస్సులు - గోవ్రజములు :-

ఛందస్సు లనగా గోస్థానములగు వ్రజము లని శ్రుతి యిట్లు కీర్తించుచున్నది.

> "వ్రజం గచ్ఛ గోస్థాన మిత్యాహ। ఛందాంసి వై వ్రజో గోస్థానః। ఛందాంస్యేవాస్మై వ్రజం గోస్థానం కరోతి॥"
>
> —తై.బ్రా. 3-2-8

> "వ్రజ న్త్యస్మి న్నితి వ్రజః। గోచరాదౌ నిపాత్యతే। గవాం స్థాన మధికరణభూతో వ్రజః। ఛందాంసి శబ్దానాం స్థానాధికరణత్వాత్ తత్సామ్యా దుత్కర్షోఽపి తథోచ్యతే" —భట్ట. భా.

> "గాయత్ర్యాదీని ఛందాంస్యేవ గోశబ్దాభిధేయానాం వాచా మవస్థానయోగ్యో వ్రజశబ్దాభిధేయో దేశవిశేషః" —సా.భా.

మంత్రము లనెడి గోవులకు (వేదవాక్కులకు) నిలయము లగుటచే ఛంద స్సులు (వేదములు) గోస్థానము లగు వ్రజము లని యిట శ్రుతిచే గీర్తింప బడినవి. గోవింద, గోపీజనవల్లభ, గోపాల, గోపుర – ఇత్యాది పదములు నీ విషయమును (మంత్రములు గోవులగుటను) ఉపలక్షింప జేయునట్టివి.

"గో భూమి వేదవిదితో వేదితా గోపీజనావిద్యాకలాప్రేరకః"
— గో.పూ.ఉ.

"గోభూమి వేదై ర్విదితః। విగ్రహస్తు గాం సౌరభేయీం,
గాం భూమిం; గాం వాచం వేదం వా విందతీతి గోవిందః।—
యద్వా గోపీ జన ఏవా౽౽నమన్తా ద్విద్యాకలాజ్ఞానప్రదో
గ్రంథభాగః। 'గోప్యో గావ ఋచః' —ఇతి శ్రుతేః। తాసాం
ప్రేరకః స్వోన్ముఖతాసంపాదకః"
— నారాయణవిరచిత దీపికావ్యాఖ్య.

"నష్టాం వై ధరణీం పూర్వ మవిందం వై గుహాగతామ్।
గోవింద ఇతి తేనాహం దేవై ర్వాగ్భి రభిష్టుతః॥"
ఇతి మోక్షధర్మవచనాత్ (భార. 12_342_70) గోవిందః;

"అహం కిలేంద్రో దేవానాం త్వం గవా మింద్రతాం గతః।
గోవింద ఇతి లోకా స్త్వాం స్తోష్య న్తి భువి శాశ్వతమ్॥" ఇతి।

"గౌ రేషా తు తథా వాణీ తాం చ విందయతే భవాన్।
గోవింద స్తు తతో దేవ మునిభిః కథ్యతే భవాన్॥"
ఇతి చ హరివంశే (3_88_50)। గౌ ర్వాణీ తాం విందతీతి
గోవిందః।.... గోభి ర్వాణీభిః విందతే, వేత్తి వేదా న్తవాక్యై
రితి వా గోవిందః.

"గోభిరేవ యతో వేద్యో గోవిందః సముదాహృతః।"
ఇతి శ్రీవిష్ణుతిలకే — శం.భా. విష్ణుసహస్రనామ.

"స త్వాం కృష్ణాభిషేచ్యామి గవాం వాక్యప్రచోదితః।
ఉపేంద్రత్వే గవా మింద్రో గోవింద స్త్వం భవిష్యసి॥"
— విష్ణు.పు. 5-12-12.

"యుగే యుగే ప్రణష్టాం గాం విష్ణో విందసి త త్త్వతః।
గోవిందేతి తతో నామ్నా ప్రోచ్యసే ఋషిభి స్తథా॥"
— మత్స్య.పు. 246-43.

'గో-భూమి-వేదవాక్కు'లకు గోవు లని పేరు. వీనిచే దెలియబడువాడు, లేక వానిని బొందువాడు లేక పాలించువాడు నగుటచే పరమేశ్వరునకు గోవిందు డని లేక గోపాలు డని యన్వర్థనామములు. "గోప్యో గావః ఋచః" - అను శ్రుతి ననుసరించి ఋక్కులకు-వేదవాక్కులకు-గోపిక లని పేరు. కాన గోపీజన మనగా విద్యాకలాస్వరూపము, జ్ఞానప్రదము నగు వేదరూప గ్రంథభాగము. తత్ప్రేరకుడు, అనగా స్వాభిముఖము గావించుకొనువాడు గాన గోపీజనవల్లభుడు-అని యర్థము. 'మంత్రములు కావ్యములు; అవి శాశ్వతుడగు బ్రహ్మకు సంబంధించినవి; వానిని యజ్ఞేశ్వరుడు నియమముగ స్వాభిముఖములను జేసికొనుచున్నాడు (శశ్వతః శాశ్వతస్య నిత్యస్య, వేధసః విధాతు ర్బ్రహ్మణః సంబంధీని, కావ్యా కావ్యాని మంత్రరూపాణి స్తోత్రాణి అయ మగ్నిః ని కః నియమేన స్వాత్మాభిముఖం కరోతి - సా.భా. ఋ. 1-72-1; తై.సం. 2-2-12-1)-అను విషయము శ్రుతులను బ్రతిపాదించుచున్నవి (చూ. కవి. కావ్యము). ఇట్లు మంత్రములే కాదు, సంస్కృతశబ్దము లన్నియు యోగరూఢిచే గో-అశ్వాది లౌకికార్థముల బోధించునవే యోగశక్తిచే బరమేశ్వరతత్త్వ వ్యాఖ్యారూపములని సూత సంహిత యిట్లు చెప్పుచున్నది.

"వ్యాఖ్యాగానే ష్వశ క్త స్తు శివ ముద్దిశ్య భ క్తితః। లౌకికీ మపి వా గీతిం కుర్యా న్నిత్య మతంద్రితః" — 4-3-113.

"సంస్కృత శబ్దరూపం గద్యపద్యాత్మకం వ్యాఖ్యాగానమ్"

— మాధవీయ తాత్పర్యదీపికావ్యాఖ్య.

కావున గోవింద-గోపీజనవల్లభాది పదములు 'ఛందాంసి వై వ్రజో గోస్థానః' -అనెడి పై శ్రుతియొక్క తాత్పర్యమును వివరించుట స్పష్టము.

"యత్ర గావో భూరి శృంగా అయాసః। అత్రాహ తదురు గాయస్య వృష్ణః పరమం పద మవభాతి భూరి"

— ఋ. 1-154-6; విరు. 2-7.

కొలది మార్పులతో 'విష్ణోః పరమం పదమ్' అనుచు నీ మంత్రము తైత్తిరీయాది సంహితలయందును (తై. సం. 1-3-6-1; వా. సం. 6-3; శ. బ్రా. 3-7-1-15) గలదు. దీ ప్త్యతిశయ సంపన్నములగు గోవులకు నిలయము విష్ణుపదము. అదియే గోవులకు ప్రాప్తవ్యము, ప్రశస్యతమము నగు స్థానము - అని యర్థము. కాన విష్ణుపదమే గోస్థాన మని శ్రుతి తాత్పర్యము. గోకులమునను (వ్రజమునను), బృందావనమునను పరమేశ్వరుడు లీలాగృహీత శరీరముతో[1] శ్రీకృష్ణునిరూపమున గోవ్రజముల మధ్య గోపాలకుడై సంచరించుట భాగవతాదులయందు ప్రసిద్ధము. శ్రీకృష్ణు డట్లు చరించుట 'మంత్రరూపము లగు గోవులకు నిలయము లయిన ఛందస్సు లనెడి వ్రజములలో మంత్రపతి (బ్రహ్మణస్పతి)నై, యెల్లరకు పూజ్యుడనై సంచరించువాడను' - అను తత్త్వమును స్ఫురింపజేయుటకే-యని యిట బొడగట్టక మానదు. ఇంతేకాదు. ఛందస్సులు వ్రజములు. ఛందః సారము ప్రణవము. అది విశ్వరూపము. ('య శ్ఛందసా మృషభో

1. గోపరూపో హరిః సాక్షా న్మాయా విగ్రహధారణః।
దుర్బోధం కుహకం తస్య మాయయా మోహితం జగత్ ॥

— కృష్ణ. ఉ. 10.

విశ్వరూపః' - తై. ఉ.). అంకురగతరసము నానా కాండశాఖల యందు వ్యాప్త మగు నట్లు ప్రణవ ప్రతిపాద్య మగు ఈశ్వరతత్త్వమే ఛందస్సులం దంతట వ్యాప్తమై యున్నది.

"ఏతావాన్ సర్వ వేదార్థః శబ్ద ఆస్థాయ మాం భిదా ।
మాయా మాత్ర మనూద్యాన్తే ప్రతిషిధ్య ప్రసీదతి ॥"
— భాగ. 11-21-44.

"యదా హ్యంకురే యో రసః స ఏవ తద్విస్తార భూత నానా కాండ శాఖాస్వపి । తథైవ ప్రణవస్యైవ యోఽర్థః పరమేశ్వరః స ఏవ తద్విస్తార భూతానాం సర్వ వేద శాఖాకాండానా మపి సంగచ్ఛతే నాన్యః" — నీలకంఠః

"కృత్స్న ఏవ హి వేదోఽయం పరమేశ్వర గోచరః ।
స్వార్థద్వారైవ తాత్పర్యం తస్య స్వర్గాదివ ద్విధా ॥"

"న స న్త్యేవ హి వేదభాగా యత్ర పరమేశ్వరో న గీయతే। తథా హి। స్రష్టృత్వేన పురుష సూక్తేషు, విభూత్యా రుద్రేషు, శబ్ద బ్రహ్మత్వేన మండల బ్రాహ్మణేషు, ప్రపంచం పుర స్కృత్య విశ్వప్రపంచతయోపనిషత్సు, యజ్ఞ పురుషత్వేన మంత్రవిధిషు, దేహవిర్భా వైరుపాఖ్యానేషు, ఉపాస్యత్వేన సర్వత్రేతి ।" — న్యాయకుసుమాంజలి. 5-16.

ఈశ్వర తత్త్వమును ప్రతిపాదింపని వేదభాగమే లేదు. ఏ భాగమున నైనను జగత్స్రష్టృత్వ - శబ్దబ్రహ్మత్వ - యజ్ఞపురుషత్వాది రూపమున ఈశ్వరతత్త్వమే ఉపాస్యమగుట (ఉపాస్యత్వేన సర్వత్ర) శ్రుతి తాత్పర్యము. ఈశ్వరతత్త్వ ప్రతిపాదనమున కయియే మంత్రబ్రాహ్మణాత్మక ఛందోరాశి యవతరించినదని తాత్పర్యము.

కావున ఛందస్సులు స్వచ్ఛందయోగముచే పరమేశ్వరుని యందు ప్రమాణ మగుననువిషయమునే 'ఛందాంసి వై వ్రజో గోస్థానః' - అనుచు

శ్రుతి యిట్లు చమత్కరించినట్లు కానవచ్చును. ఆచ్ఛాదించుట, శక్తిమంతుల నొనర్చుట, ఆహ్లాద పఱచుట, స్వచ్ఛందయోగముచే బరమేశ్వరునందు బ్రమాణ మగుట—యను లక్షణములు బురస్కరించుకొని వేదములకు ఛందస్సు లనెడి యన్వర్థ సంజ్ఞ యొప్పుచున్నటుల శ్రుతి—స్మృతి—నిరుక్తాదుల వలన దెలియును. ఈ లక్షణములు కేవలము మంత్రభాగము నందే గాక బ్రాహ్మణారణ్యకోపనిషద్రూప మగు బ్రాహ్మణభాగము నందును నుండుటచేతను, శ్రుతి — స్మృత్యాది ప్రామాణ్యము చేతను, కృత్స్న వేదరాశికి ఛందస్సు లనెడి వ్యవహారము ప్రసిద్ధ మగుట స్పష్టము. ఇట్లు శబ్దాత్మక వేదరాశియే కాదు; ఆ వేదశబ్దముల (ఛందస్సుల) సాయముతో ప్రజాపతిచే సృజింపబడిన జగత్తంతయు ఛందోరూపము; జగత్తే కాదు; జీవేశ్వరులును ఛందోరూపులు — అని శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

> "మూర్ధా వయః ప్రజాపతి శ్ఛందః క్షత్రం వయో మయందం
> ఛందో విష్టంభో వయోఽధిపతి శ్ఛందో విశ్వకర్మా వయః
> పరమేష్ఠీ ఛందో — — —" —వా. సం. 14-9; 10;

> "మా ఛందః ప్రమాఛందః ప్రతిమాఛందో అస్రీవయ శ్ఛందః
> — — — జగతీ ఛందః — — — పృథివీ ఛందోఽన్తరిక్షం
> ఛందో ద్యౌ శ్ఛందః సమా శ్ఛన్దో నక్షత్రాణిఛందో వా కృన్దో
> మన శ్ఛందః — — —" —వా. సం. 14-18; 19

> "ఏవ శ్ఛందో వరివ శ్ఛందః — — — క్షురో భ్రజ శ్ఛందః।
> అచ్ఛచ్ఛందః ప్రచ్ఛ చ్ఛందః— తంత్రిం ఛందోఽంకాంకం
> ఛందః" —వా.సం. 15-4,5; తై. సం. 4-3-12-2.

అగ్నిచయనమున సర్వము ఛందో రూపమున దర్శించుచు ఇష్టకోపధానము చేయుచు జెప్పెడి మంత్రము లివి. పృథివ్యాది లోకత్రయము, తత్పాలకులు, స్థూల, సూక్ష్మశరీరములు, సర్వదేవాత్మకుడగు ప్రజాపతి, త్రియా

విద్య, గాయత్రీ-ఉష్ణిగాదులు, భోగ్య మైరా దన్నాత్మక మగు జగత్తు, జీవులు -సర్వము ఛందోరూప మని యీ శ్రుతివలన దెలియును. పరమేశ్వర స్వరూపమును నామరూపాత్మక జగత్తుతో నాచ్ఛాదించెడి పారమేశ్వరశక్తి ఛందోరూపిణి. ఈ కారణముచే లోకము గూడ ఛందోరూపము. 'పశవో వై ఛందాంసి' - అను శతపథశ్రుతి ననుసరించి జీవులు ఛందోరూపులు. స్వచ్ఛందయోగమున నామరూపాత్మకజగత్తును బ్రవర్తింపజేయువాడగుటచే పరమేష్ఠి చందోరూపుడు. జీవ-జగత్-ఈశ్వరస్వరూపము నిట్లు ఛందోరూపమున దర్శింపజేయు త్రయీవిద్యా లక్షణ మగు కావ్యము ఛందస్సు (త్రయీ విద్యా కావ్యం ఛందః). పర్ణములు వృక్షమునువలె, ఋగాది రూపము లగు ఛందస్సులు ధర్మముచే సంసారవృక్ష పరిరక్షణము సేయు చుండును. తుదకు ఉత్తమసాధకులకు గుహానిహితమై ప్రచ్ఛన్నమై యున్న రసాత్మక పరతత్త్వమును దర్శింపజేసి లోకోత్తరాహ్లాదము గల్గించుచు (చందయన్తి) ఛందస్సులు - అను అన్వర్థసంజ్ఞతో నొప్పును.

ఇట్లు ఛందఃశరీరిణియై విశ్వాత్మికయై పూజనీయయై విలసిల్లుచు తనను గానముచేయు వారల నెల్ల బ్రోచుచు(గాయంతం త్రాయతే)లోకోత్తరానంద సంధాత్రి యగు నా వేదమాతకు (వరదా వేదమాతా) నమోవాకములు.

ఇదం నమో జగన్మాత్రే కల్యాణానంద మూర్తయే।
భారత్యై హరిసోదర్యై వేదమాత్రే ప్రశాన్మహేః

ఇందుదహరించబడిన గ్రంథములు - వాని సంకేతములు

వేదమాతృస్తవః	(హరిసోదరకృతః)
ఋగ్వేద సంహితా	ఋ.
తైత్తిరీయ సంహితా	తై. సం
వాజసనేయ సంహితా (మాధ్యందిన)	వా. సం
సామవేద సంహితా	సామ. సం
అథర్వవేద సంహితా	అ. వే
కాఠక సంహితా	కా. సం
కాణ్వ సంహితా	కాణ్వ. సం
మైత్రాయిణీ సంహితా	మై. సం
ఐతరేయ బ్రాహ్మణమ్	ఐ. బ్రా
కౌషీతకీ బ్రాహ్మణమ్	కౌ. బ్రా
గోపథబ్రాహ్మణమ్	గో. బ్రా
గోపథబ్రాహ్మణపూర్వభాగః	గో. పూ
,, ఉత్తరభాగః	గో. ఉ
తాండ్య బ్రాహ్మణమ్ (పంచవింశ బ్రాహ్మణమ్)	తాం. బ్రా
షడ్వింశ బ్రాహ్మణమ్	షడ్వింశబ్రా
జైమినీయ బ్రాహ్మణమ్ (తలవకార బ్రాహ్మణమ్)	జై. బ్రా
సంహితోపనిషత్ బ్రాహ్మణమ్	సంహితా. బ్రా
శాట్యాయన బ్రాహ్మణమ్	శాట్యా. బ్రా
శతపథ బ్రాహ్మణమ్ (మాధ్యందిన)	శ. బ్రా
శతపథ బ్రాహ్మణమ్ (కాణ్వశాఖీయ)	శ. బ్రా. కా
తైత్తిరీయ బ్రాహ్మణమ్	తై. బ్రా
ఐతరేయారణ్యకమ్	ఐ. ఆ.
తైత్తిరీయారణ్యకమ్	తై. ఆ.
తైత్తిరీయ నారాయణీయమ్	తై. నా
ఐతరేయోపనిషత్	ఐ. ఉ.
కౌషీతకిబ్రాహ్మణోపనిషత్	కౌ. బ్రా. ఉ
ఛాందోగ్యోపనిషత్	ఛాం. ఉ
జైమినీయోపనిషత్ బ్రాహ్మణమ్ (తలవకారోపనిషద్బ్రాహ్మణమ్)	జై. ఉ
బృహదారణ్యకోపనిషత్	బృ. ఉ
ఈశావాస్యోపనిషత్	ఈశా. ఉ
తైత్తిరీయోపనిషత్	తై. ఉ
అథర్వవేదీయ మహానారాయణోపనిషత్	మహానా. ఉ
కఠోపనిషత్	కఠ. ఉ
కృష్ణోపనిషత్	కృష్ణ. ఉ
కేనోపనిషత్	కేన. ఉ
కైవల్యోపనిషత్	కైవల్య. ఉ
గోపాల పూర్వతాపనీయోపనిషత్	గో. పూ. ఉ
ప్రశ్నోపనిషత్	ప్రశ్న. ఉ
శ్వేతాశ్వతరోపనిషత్	శ్వేత. ఉ
మైత్రాయణీయోపనిషత్	మైత్రా. ఉ
ముండకోపనిషత్	ముండక. ఉ
ప్రాణాగ్న్యుపనిషత్	ప్రాణాగ్ని. ఉ
అమృతబిందూపనిషత్	అమృత. ఉ
అథర్వశిర ఉపనిషత్	అథ. శి. ఉ

పరాశర భట్టవ్యాఖ్యా (విష్ణుసహస్రనామ)
నిర్వచన వ్యాఖ్యా (,,)
నిరుక్తి వ్యాఖ్యా (,,)
సౌభాగ్య భాస్కరరాయ వ్యాఖ్యా (లలితా సహస్రనామ)
వైదిక నిఘంటువ్యాఖ్యా (దేవరాజయజ్వా)
,, (క్షీరస్వామీ)
సాయణాచార్యకృత చతుర్వేద భాష్య భూమికా
ఋగ్వేదాది భాష్యభూమికా (దయానందః)
శివానందలహరి (శంకరాచార్యః)
ఆత్మబోధః (,,)
శతశ్లోకీ (,,)
గంగాలహరీ (జగన్నాథః)
శివమహిమ్నస్తోత్రమ్ (మధుసూదన సరస్వతీ వ్యాఖ్యా)
ఋగ్వేదానుక్రమణికా (మాధవీయ)
కాండానుక్రమణికా
సర్వానుక్రమణికా వృత్తిభూమికా (షడ్గురుశిష్య)
వాచస్పత్యమ్
శబ్దకల్పద్రుమః
న్యాయకోశః
అమరకోశః
అమరసుధా టీకా
మేదినీకోశః
విశ్వకోశః
వైజయన్తీకోశః

వైదికకోశః
అభిధాన చింతామణిః
నానార్థ రత్నమాలా
ఆంధ్ర సంగ్రహ విజ్ఞాన సర్వస్వము
Apte-Sanskrit Dictionary
Vedic Index by A. A. Macdonell & A. B Keith.
భరతనాట్యశాస్త్రమ్
అభినవ భారతీ (అభినవగుప్త నాట్యశాస్త్ర వ్యాఖ్యా)
రసగంగాధరః (జగన్నాథః)
కావ్యప్రకాశః (మమ్మటః)
కావ్యమీమాంసా (రాజశేఖరః)
కావ్యాలంకార సూత్రమ్ (వామనః)
రఘువంశమ్ — రఘు
కుమారసంభవమ్ — కుమా. సం.
కిరాతార్జునీయమ్ — కిరా.
శిశుపాల వధమ్ — శిశు.
ఉత్తరరామ చరితమ్ — ఉ.రా.చ.
భావతల స్పర్శినీ వ్యాఖ్యా (వీరరాఘవాచార్యః) ఘనశ్యామటీకా
నైషధమ్ — నైష.
భట్టికావ్యమ్ — భట్టి కా.
జయమంగళ వ్యాఖ్యా (భట్టి కా.)
సత్యార్థప్రకాశ (దయానంద)
ఐతరేయాలోచనమ్ (సత్యవ్రతసామశ్రమీ)
వైదికకోశ - జైమినీయోపనిషద్బ్రాహ్మణ భూమికా (భగద్దత్త)

History of Sanskrit Poetics [P. V. Kane]
History of Indian Philosophy [S. Radhakrishnan]
History of Sanskrit Literature [A. A. Macdonell]
What India can teach us [Maxmuller]
The Atharva Veda and the Gopatha Brahmana [M. Bloomfield]